**Saheeh Bukhari (Vol-1)**
**(Telugu)**

# సహీహ్ బుఖారీ

## మొదటి సంపుటం

మూలం
**హజ్రత్ అల్లామా వహీదుజ్జమా (రహ్మ)**

అనువాదం
**షేఖ్ హమీదుల్లా షరీఫ్,** బి.ఏ.

TRUST
**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్**
సందేశభవనం, లక్కడ్‌కోట్, ఛత్తాబజార్,
హైదరాబాద్-500 002 ఫోన్: 040-24564583

# Saheeh Bukhari (Vol-1)

**Saheeh Bukhari (Vol-1) (**Telugu**)**

**TIP Series No.** : **279**

Written by : **Hazrat Allama Waheedujjama** (R.H.)

Translated by : **Shaik Hameedullah Sharief** B.A.,

*All Rights Reserved with Publishers*

3rd Edition : September 2018

Copies : 2000

**Price : Rs. 300**

ISBN : 978 - 93 - 81111 - 30 - 7

Published by : **Telugu Islamic Publications Trust (Regd.)**
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 0091 - 040 - 24564583
Fax : 0091- 040 - 24576237
E-mail: geeturaiweekly@gmail.com
website: www.geeturai.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

# ఇమామ్ బుఖారీ (రహ్మతుల్లా అలైహ్)

ఇమామ్ బుఖారీ (ర) అసలుపేరు అబ్దుల్లా ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్ బిన్ ఇబ్రాహీమ్ బిన్ ముగైర బర్దజ్ బజఅఫీ. షవ్వాల్ మాసం 13వ తేదీ శుక్రవారం రోజు నమాజు తర్వాత హి.శ. 194 బుఖారా పట్టణంలో జన్మించారు. యమన్ జఅఫీ ద్వారా ఆయన తాతగారు ఇస్లామ్ స్వీకరించారు. ఆయన గారి తండ్రి ఇస్మాయీల్ బిన్ ఇబ్రాహీమ్ హదీసు విద్యా పారంగతులు. బాల్యంలోనే బుఖారీ తండ్రిని కోల్పోయారు. ఆయన పెంపకమంతా తల్లి ఒడిలోనే కొనసాగింది. తల్లి, సోదరుడు అహ్మద్‌లతో పాటు హజ్ యాత్రకు వెళ్ళారు. తర్వాత మక్కాలోనే ఉండి విద్యాభ్యాసం కొనసాగించారు. సోదరుడు అహ్మద్ వెనుదిరిగి బుఖారా వెళ్ళిపోయారు. అక్కడనే ఆయన మరణించారు. పది సంవత్సరాలు లేదా అంతకన్నా తక్కువ వయసులో బుఖారీ హదీసు విద్య నేర్చుకోవడం ప్రారంభించారు. అప్పటికి ఆయన మదరసా నుంచి ఉత్తీర్ణులై దాఖలీ తదితర ఉలమాల వద్ద విద్యాభ్యాసం చేస్తున్నారు. ఒక రోజు గురువుగారు చెప్పిన ఒక మాటలోని తప్పును ఎత్తి చూపారు. గురువుగారు కాస్త కోపంగా చూస్తే, మీరు మీ పుస్తకంలో చూడండి అని జవాబిచ్చారు. గురువుగారు లోపలికి వెళ్ళి పుస్తకం తిరగేసి బయటకు వచ్చి, నేను చెప్పింది తప్పయితే ఒప్పేమిటో చెప్పు అనడిగారు. బుఖారీ జవాబిస్తూ తప్పును సరి చేశారు. గురువుగారు కలం తీసుకుని, తన పుస్తకంలో ఉన్న తప్పును సరిచేసుకున్నారు. నీవు చెప్పింది నిజమే అని చెప్పారు. అప్పుడాయన వయసు కేవలం పదకొండు సంవత్సరాలు మాత్రమే. పదహారేళ్ళ వయసులోనే ఇబ్నె ముబారక్, వకీహ్‌ల పుస్తకాలు కంఠస్థం చేసారు. ఆ తర్వాత ఆయన తల్లితోను, సోదరుడితోను కలిసి హజ్ యాత్రకు వెళ్ళారు. ఆయన పద్దెనిమిది సంవత్సరాల వయసులోనే ఖజియాయె సహబా ఔర్ తాబియీన్ పుస్తకాన్ని రాశారు. ఆ పిదప మదీనా నగరంలో ప్రవక్త ముహమ్మద్ (స) సమాధి వద్ద వెన్నెల రాత్రుల్లో ఇస్లామీయ చరిత్ర పుస్తకాన్ని రాశారు. బుఖారీ సిరియా, ఈజిప్టు, అల్జీరియాలకు రెండుసార్లు, బస్రాకు నాలుగు సార్లు వెళ్ళినట్లు, హజ్జాజ్‌లో ఆరు సంవత్సరాలు ఉన్నట్లు సహల్ బిన్ అస్రీ తెలిపారు. కూఫాకు ఎన్నిసార్లు వెళ్ళింది లెక్కలేదని చెప్పారు. అలాగే బగ్దాద్‌లో హదీసువేత్తలతో అనేకసార్లు సమావేశమయ్యారు. హాషద్ బిన్ ఇస్మాయీల్ మాట్లాడుతూ బుఖారీ తమతో పాటు బస్రాలోని

పండితుల వద్దకు వచ్చేవారని చెప్పారు. అప్పట్లో ఆయన పిన్నవయస్కుడని, ఆయన ఏదీ రాసేవాడు కాదని, చాలా రోజుల తర్వాత, దాదాపు పదహారు రోజుల తర్వాత తామే ఆయనతో హదీసులు విని రాసుకోవడం లేదెందుకంటూ ప్రశ్నించామని, ఆయన జవాబిస్తూ మీరు రాసిన హదీసులేంటో చూపించండని అడిగారని, తాము రాసిన హదీసులు పదిహేను వేలకన్నా ఎక్కువగానే ఉన్నాయని, వాటన్నింటినీ ఆయన గడగడ తన జ్ఞాపకశక్తితో వల్లెవేసారని, చివరకు తాము రాసుకున్న హదీసుల్లోని తప్పులను ఆయన చెబుతుంటే సరిచేసుకున్నామని ఆయన తెలియజేశారు. అబూబక్ర్ బిన్ అబీ అయాష్ మాట్లాడుతూ బుఖారీ చెప్పిన హదీసులు తాము రాసుకున్నామని, ఆయనకప్పుడు గెడ్డం మీసాలు కూడా లేవని చెప్పారు.

అబూబక్ర్ కలోజనీ ప్రకారం ఆయన ఒక పుస్తకాన్ని చదివితే యధాతథంగా గుర్తుంచుకునేవారు. ఆయన విద్యార్థిగా ఉన్నప్పుడు కూడా పాఠాలను కేవలం వినేవారు, రాసేవారు కాదు.

అహ్మద్ బిన్ మన్సూర్ షీరాజీ ప్రకారం ఇమామ్ బుఖారీ తన స్వస్థలం బుఖారాకు తిరిగి వచ్చినప్పుడు ఆయన్ను స్వాగతించడానికి ప్రజలు పట్టణానికి మూడుమైళ్ళ దూరం వరకు వచ్చి శిబిరాలు వేసుకుని ఎదురు చూశారు. అత్యంత వైభవంగా ఆయనకు స్వాగతం పలికారు. పట్టణంలోని ప్రముఖులందరూ ఆయనకు ఎదురేగి పిలుచుకువచ్చారు. కాని బుఖారాలో కొంతకాలానికే అక్కడి పాలకుడికి కంటగింపయ్యింది. ఇమామ్ బుఖారీ తన రాజ్యం వదిలి వెళ్ళిపోవాలని ఆదేశించాడు. బుఖారీ అక్కడి నుంచి బేకంద్ వైపు వెళ్ళిపోయారు. ఇమామ్ బుఖారీ అక్కడి నుంచి ఒక చిన్న ఊరికి వెళ్ళిపోయారు. అది సమర్ఖండ్‌లో ఉన్న ఊరు. అక్కడ ఆయన బంధువులు ఉండేవారు. ఒక రాత్రి ఆయన దేవుడిని ప్రార్థిస్తూ, ప్రభూ నీ భూమి విశాలమైనది. కాని నాకు ఇరుకైపోయింది. ఇక నన్ను నీ వద్దకు పిలుచుకో అంటూ వేడుకున్నారని అబ్దుల్ జబ్బార్ తెలియజేశారు. ఆ తర్వాత ఒక నెలలోనే ఆయన పరమపదించారు.

# విషయసూచిక

## వహీ ప్రకరణం 47

## విశ్వాస ప్రకరణం


- విశ్వాసం - మహాప్రవక్త (సఅసమ్) సూక్తి 63
- అల్లాహ్ సూక్తి ప్రకారం విశ్వాస కార్యాలు 67
- నిజమైన ముస్లిమ్ 68
- శ్రేష్ఠుడైన ముస్లిమ్ ఎవడు? 68
- అన్నం తినిపించటం ఇస్లామీయ స్వభావం 68
- తన కోసం ఇష్టపడే దాన్నే తన తోటి (ముస్లిమ్) సోదరుని కోసం కూడా ఇష్టపడటం అనేది విశ్వాసంలోని ఒక భాగం 69
- దైవప్రవక్తను ప్రేమించటం కూడా విశ్వాసంలోని ఒక భాగమే 69
- విశ్వాస మాధుర్యం 70
- అన్సారులను ప్రేమించటం కూడా విశ్వాసానికి చిహ్నమే 70
- ఉపద్రవానికి భయపడి దూరంగా పారిపోవటం కూడా ధార్మికతే 71
- అవిశ్వాసం వైపునకు మరలిపోవటాన్ని.... కూడా విశ్వాసానికి సంబంధించిన విషయమే. 72
- విశ్వాసులు తమ ఆచరణల్లో ఒకరిని మరొకరు మించిపోవటం 73
- సిగ్గు విశ్వాసంలోని ఒక భాగం 74
- విశ్వాసం ఒక ఆచరణ అని అనే వ్యక్తికి ఈ ఖుర్ఆను వాక్యం ఒక ప్రమాణం 74
- సలామ్ చేయటం కూడా విశ్వాసంలోని ఒక అంశమే. 76
- భర్తకు కృతఘ్నత చూపటం కూడా ఒక రకమైన అవిశ్వాసమే... 76
- ఒక పాపం ఇంకొక పాపం కంటే చిన్నదిగా ఉంటుంది 78
- కపటి లక్షణాలు 78
- షబేఖదర్ (విలువైన రాత్రి)లో ఆరాధనలు చేయటం... 79
- జిహాద్ చేయటం విశ్వాసానికి చెందిన ఒక భాగం 79

- రమజాను మాసం రాత్రులలో నఫిల్ నమాజులు (తరావీ ప్రార్థనలు) చేయటం కూడా విశ్వాసంలోని ఒక భాగమే 79
- పుణ్యఫలం లభిస్తుందనే ఉద్దేశ్యంతో రమజాను మాసంలో ఉపవాసాలు ఉండటం కూడా విశ్వాసంలోని ఒక భాగమే 80
- ఇస్లాం ధర్మం సరళమైనది... 80
- నమాజు చేయటం ఇస్లామ్‌లోని ఒక భాగమే 80
- ఇస్లామ్ ధర్మాన్ని చిత్తశుద్ధితో స్వీకరించిన వ్యక్తి యొక్క శ్రేష్ఠత గురించి 81
- నాగా లేకుండా ఎల్లప్పుడూ చెయ్యబడే పని అంటే అల్లాహ్‌కు ఎంతో ఇష్టం 82
- విశ్వాసం పెరుగుతుంది మరియు తరుగుతుంది 82
- జకాతు ఇవ్వటం కూడా ఇస్లామ్‌లోని ఒక అంశమే 83
- జనాజా వెంట వెళ్లటం కూడా విశ్వాసంలోని ఒక భాగమే 84
- తాను చేసిన సత్కార్యాలు తనకు తెలియకుండానే రద్దయి పోతాయేమో అని ఒక విశ్వాసి ఎల్లప్పుడూ భయపడుతూ ఉండాలి 84
- హజ్రత్ జిబ్రీల్ (అస్సలామ్) ఈమాన్, ఇస్లామ్, ఎహ్సాన్ అంటే ఏమిటి, ప్రళయం ఎప్పుడొస్తుంది అని మహాప్రవక్త (స)ను అడగటం 85
- తన ధర్మంపై స్థిరంగా ఉండేందుకు, పాపకార్యాలకు, అనుమానం ఉన్న విషయాలకు దూరంగా ఉండే వ్యక్తి యొక్క ఘనత 87
- యుద్ధ ప్రాప్తిలోని 5వ భాగాన్ని అల్లాహ్ మార్గంలో ఇవ్వటం విశ్వాసంలోనిదే 87
- సదుద్దేశ్యము, సద్భావము లేని ఆచరణ నిజమైనది, స్వచ్ఛమైనది కానేరదు 89
- ఆచరణలు ఉద్దేశ్యం వల్లనే సక్రమమైనవి కాగలుగుతాయి 89


## గ్రంథజ్ఞాన ప్రకరణం


- జ్ఞానం యొక్క ఔన్నత్యం. 91
- ఒక వ్యక్తిని జ్ఞానం గురించి ఏదైనా ప్రశ్న అడిగినప్పుడు సమాధానం చెప్పాలి 91
- జ్ఞాన సంబంధమైన విషయాన్ని బిగ్గరగా పలకడం 92
- గురువు తన శిష్యుల జ్ఞానాన్ని పరీక్షించటానికి ఏదైనా ఒక ప్రశ్న అడగటం 92
- ఒక చేతి నుంచి మరొక చేతికి జ్ఞాన గ్రంథాల మార్పిడి వ్యవహారం మత విద్వాంసులు ధర్మజ్ఞానాన్ని వ్రాసి వివిధ దేశాలకు పంపే విషయం 95

- సభలో చివర్న ఉన్న స్థలంలో కూర్చున్న వ్యక్తికి సంబంధించిన ప్రసంగం........ 96
- నేను బోధించే విషయాలను ఇతరుల ద్వారా వినే మనిషి, నేను చెబుతూ ఉండగా ప్రత్యక్షంగా వినే మనిషి కంటే వాటిని ఎక్కువగా జ్ఞాపకం ఉంచుకుంటాడు 97
- ప్రవక్త మహనీయులు (సఅసమ్) సందర్భాన్ని, సమయాన్ని చూసి తమ సహచరులకు జ్ఞాన సంబంధమైన విషయాలను నేర్పేవారు 99
- జ్ఞానం నేర్చుకోదలిచిన వారి కోసం కొన్ని రోజులు కేటాయించే వ్యక్తి 99
- అల్లాహ్ తాను మేలు చెయ్యదలచుకున్న మనిషికి ధర్మానికి సంబంధించిన అవగాహనను ప్రసాదిస్తాడు 100
- ధర్మావగాహనకు వివేకం అవసరం 100
- జ్ఞానాన్ని వివేకాన్ని పొందగోరే విషయంలో అసూయపడటం 100
- దైవప్రవక్త హ|జత్ మూసా (అస్సలామ్) హ|జత్ ఖిజర్‌ను వెతుక్కుంటూ సముద్ర తీరంలో ప్రయాణం చెయ్యటం 101
- ప్రవక్త మహనీయులు హ|జత్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్) కోసం దుఆ చేయటం 102
- ఒక పిల్లవాని హదీసు కథనం ఆమోదయోగ్యం కావటానికి అతనికి కనీస వయస్సు ఎంత ఉండాలి 102
- జ్ఞాన సముపార్జన కోసం ప్రయాణం చెయ్యటం 103
- జ్ఞాని ఔన్నత్యం, జ్ఞాన బోధ చేసేవాని ఔన్నత్యం 104
- ప్రపంచం నుంచి జ్ఞానం మాయమైపోవటం 105
- జ్ఞానం యొక్క ఔన్నత్యం 106
- పశువుపై స్వారీ చేస్తూ ఉన్నప్పుడు గాని లేదా మరేదైనా వస్తువుపై నిలబడి ఉన్నప్పుడు గాని ధార్మిక తీర్పు చెప్పటం 106
- చెయ్యి ఊపిగాని లేదా తల ఊపిగాని ఎవరైనా ధార్మిక తీర్పు చెప్పటం 107
- కారుణ్యమూర్తి ముహమ్మద్(సఅసమ్) అబ్దుల్ ఖైస్ ప్రజలకు చేసిన ఉద్బోధ 109
- ఏదైనా సమస్య ఉత్పన్నమైనప్పుడు, దాని పరిష్కారం కోసం ప్రయాణం చెయ్యటం 110
- జ్ఞాన సముపార్జనకు వంతులు నిర్ణయించటం 110
- హితోపదేశం చేసేటప్పుడు గాని లేదా చదివించేటప్పుడు గాని ఏదైనా అవాంఛనీయమైన విషయం గమనించినప్పుడు కోప్పడటం 111

- ఇమామ్ లేదా హదీసువేత్త ముందు వినయంగా కూర్చోవటం 113
- బాగా అర్థమయ్యేందుకు ఒక విషయాన్ని గురించి మూడేసిసార్లు చెప్పటం 113
- ఒక మనిషి తన మహిళా బానిసకు, తన కుటుంబ సభ్యులకు ధర్మజ్ఞానాన్ని నేర్పటం 114
- ఇమామ్ (నాయకుడు) మహిళలకు హితోపదేశం చెయ్యటం, వారికి ధర్మానికి సంబంధించిన విషయాలు నేర్పటం 115
- హదీసు నేర్చుకోవటానికి ఆతురత, అత్యంత కుతూహలం కలిగి ఉండటం 115
- జ్ఞానం ఎందుకు ఎగిరిపోతుంది? 115
- స్త్రీలకు ధార్మిక విద్యను గరపటానికి ఇమామ్ ప్రత్యేకంగా ఏదైనా ఒక దినాన్ని నిర్ణయించగలడా? 116
- ఎవరైనా ఒక మనిషి ఏదైనా ఒక విషయాన్ని విని అర్థం చేసుకునే ఉద్దేశంతో మళ్ళీ దాన్ని గురించి అడగటం 117
- ఒక మత సంబంధమైన సభలో పాల్గొన్నవారు, తాము నేర్చుకున్న జ్ఞాన విశేషాలను, ఆ సభలో హాజరుకాని వారికి అందజెయ్యాలి 118
- దైవప్రవక్త (సఅసం)ను గురించి అబద్ధం చెప్పినవాడు, ఎంత పాపానికి ఒడిగట్టాడు అనే విషయం 120
- జ్ఞానానికి సంబంధించిన విషయాలను వ్రాయటం 122
- రాత్రి సమయంలో విద్యాబోధనం-హితబోధనం 126
- రాత్రి సమయంలో జ్ఞాన సంబంధమైన విషయాలు చెప్పటం 127
- మత విద్వాంసులు చెప్పే విషయాలు నిశ్శబ్దంగా వినాలి 130
- ఒక పండితుణ్ణి, అందరికంటే గొప్ప పండితుడెవరు అని అడిగినప్పుడు, అతను 'అల్లాహ్‌కు తెలుసు' అని సమాధానం చెప్పాలి 131
- కూర్చొని ఉన్నటువంటి మత విద్వాంసుణ్ణి ఎవరైనా నిలబడి ప్రశ్నలు వేస్తే 135
- మినా దగ్గర రాళ్ళు విసిరేటప్పుడు, ఏదైనా ధార్మిక సమస్యను గురించి అడగటం, దానికి సమాధానం చెప్పటం 136
- అల్లాహ్ ఫర్మానా ప్రకారం, మీకు ప్రసాదించబడిన జ్ఞానం బహు స్వల్పమైనది 136

- అవగాహనా లోపం వల్ల, కొందరు మరిన్ని కష్టాలపాలవుతారేమో అనే భయం వల్ల ధర్మసమ్మతమైన కొన్ని విషయాలను విడిచిపెట్టే వ్యక్తి ప్రస్తావన 137
- జ్ఞాన సంబంధమైన విషయాలను కొంత మందికి నేర్పటం; కొంత మందికి, వారు అర్థం చేసుకోలేరని భావించి నేర్పకపోవటం 138
- ధర్మజ్ఞానం నేర్చుకునే విషయంలో సిగ్గుపడటం 140
- ఏదైనా విషయం గురించి సిగ్గు వల్ల తాను అడగలేకపోతే, ఇతరుల చేత అడిగించటం 141
- మసీదులో ధర్మజ్ఞానానికి సంబంధించిన విషయాలను గురించి మాట్లాడుకోవటం, ధార్మిక తీర్పులు చెప్పటం 142
- అడిగేవాడు అడిగినదాని కన్నా ఎక్కువ జవాబు చెప్పటం 143


## 'వుజూ' ప్రకరణం


- వుజూ లేకుండా నమాజు స్వీకార యోగ్యమైనది కాదు 145
- వుజూ యొక్క ఘనత, శ్రేష్ఠత 145
- అనుమానం వల్ల వుజూ భంగం కాదు... 146
- తేలికపాటి వుజూ చేసుకోవటం 146
- పరిపూర్ణమైన వుజూకు సంబంధించిన ప్రస్తావన 148
- ప్రతి పనినీ ప్రారంభించే ముందు బిస్మిల్లాహ్ అని అనాలి 150
- లెట్రిన్‌లోకి వెళ్లేటప్పుడు ఏమని పఠించాలి 151
- లెట్రిన్ దగ్గర నీళ్లు పెట్టడం 151
- మల మూత్ర విసర్జన సమయంలో ఖిబ్లా వైపునకు ముఖం పెట్టి కూర్చోకూడదు 151
- రెండు ఇటుకల మీద కూర్చొని మల విసర్జన చెయ్యటం 152
- స్త్రీలు బహిర్భూమికి బయటకు పోవటం 152
- ఇళ్లల్లో మరుగుదొడ్లు కట్టుకోవటం, కాలకృత్యాలు తీర్చుకోవటం 153
- మూత్ర విసర్జనం తరువాత నీళ్లతో పరిశుభ్రపరచుకోవటం 153
- కాలకృత్యాలు తీర్చుకోవటం కోసం నీళ్లు తీసుకుపోవటం 154

- కాలకృత్యాలు తీర్చుకోవటానికి వెళ్లేటప్పుడు నీళ్లతో పాటు ఒక బరిశెను కూడా తీసుకుపోవటం 154
- కుడి చేత్తో మర్మాంగాలను కడుక్కోవటం నిషిద్ధం 155
- ఒంటేలు పోసేటప్పుడు మర్మాంగాన్ని కుడి చేత్తో పట్టుకోకూడదు 155
- మట్టిపెళ్లలతో రహస్యాంగాలను పరిశుభ్రపరచుకోవటం 155
- పిడకలతో మర్మాంగాలను పరిశుభ్రపరచుకోకూడదు 156
- వుజూ చేసుకునేటప్పుడు ఒక్కసారి మాత్రమే శరీరావయవాలను కడుక్కోవటం 156
- వుజూ చేసుకునేటప్పుడు శరీర అవయవాలను రెండేసి సార్లు కడుక్కోవటం 156
- వుజూ చేసుకునేటప్పుడు శరీర అవయవాలను మూడేసిసార్లు కడుక్కోవటం 157
- వుజూ చేసుకునేటప్పుడు ముక్కులో నీళ్లు పోసుకుని చీదటం 157
- మర్మాంగాలను బేసి సంఖ్యలో ఉన్న మట్టి పెళ్లలతో పరిశుభ్రపరచుకోవటం 158
- వుజూ చేసుకునేటప్పుడు రెండు కాళ్ళూ పరిశుభ్రంగా కడుక్కోవాలి మసా చెయ్యకూడదు 159
- వుజూ చేసుకుంటున్నప్పుడు నీళ్లతో పుక్కిలించి ఉయ్యటానికి సంబంధించిన ప్రస్తావన 159
- వుజూ చేసుకుంటున్నప్పుడు, మడమల్ని కడుక్కోవటం 160
- చెప్పులు తొడుక్కుని ఉన్నప్పుడు కాళ్ళు కడుక్కోవటం, చెప్పుల మీద మసా చెయ్యకూడదు 160
- వుజూ కాని, గుసుల్ కాని చేసుకునేటప్పుడు శరీరం కుడి వైపు నుంచి దానిని ప్రారంభించాలి 161
- నమాజు సమయం ఆసన్నమైనప్పుడు నీళ్ళ కోసం వెతకటం 162
- మనిషి తల వెంట్రుకలను కడిగిన నీరు పవిత్రమైనదే 163
- వంట పాత్రలలో కుక్క మూతిపెట్టి నాకినప్పుడు 164
- మనిషి యొక్క ముందు, వెనుక మార్గాల నుంచి వెలువడే హదస్ (అశుద్ధత) వల్ల వుజూ అనివార్యమవుతుంది 166
- ఏ వ్యక్తి అయినా తన సహచరుడు వుజూ చేసుకోవటంలో తోడ్పడటం గురించి 171

- వుజూ లేకుండా ఖురాను గ్రంథాన్ని పఠించటం (వ్రాయటం) మొదలైనటు వంటివి సక్రమమైనవే 172
- పూర్తిగా స్పృహ కోల్పోయినప్పుడు వుజూ విరిగిపోతుంది 174
- మొత్తం తల మీద మసా చెయ్యటం 176
- రెండు కాళ్ళను చీల మండలాల వరకు కడుక్కోవటం 177
- వుజూ చేసుకున్న తరువాత మిగిలిపోయిన నీళ్లను వినియోగించటం 178
- ఒకసారి చేతినిండా తీసుకున్న నీళ్ళతో పుక్కిలించి ఊయటం మరియు ముక్కులోకి నీళ్ళు ఎక్కించటం 180
- ఒకే ఒకసారి తల మీద మసా చెయ్యటం 181
- భర్త తన భార్యతోపాటు కలిసి వుజూ చెయ్యటం 182
- ప్రవక్త మహనీయులు (సఅసమ్) వుజూ చేసుకున్న తరువాత మిగిలిపోయిన నీళ్లను స్పృహ కోల్పోయిన వ్యక్తిపై చల్లటం 183
- తొట్టె, గిన్నె, రాగిపాత్ర, చెక్క పళ్ళెంలో నుంచి గుసుల్ మరియు వుజూ చేసుకోవడం 183
- మట్టి పాత్ర (తొట్టి)లో నుంచి నీళ్ళు తీసుకుని వుజూ చేసుకోవటం 185
- ఒక ముద్ (కిలోలో 2/3 వ భాగం) నీళ్లతో వుజూ చేసుకోవటం 187
- మేజోళ్లపై మసా చెయ్యటం 187
- వుజూ స్థితిలోనే మేజోళ్లు తొడుక్కోవాలి 189
- మేక మాంసం మరియు అంబలి ఇంకా నిప్పుల మీద ఉడికిన వస్తువులు తిన్న తరువాత వుజూ చేసుకునే అవసరం లేదు 189
- సత్తు తిన్న తరువాత పుక్కిలించి నమాజు చేయుట... 190
- పాలు త్రాగిన తరువాత పుక్కిలించే అవసరం ఉందా? 191
- వుజూ ఉన్నప్పటికీ, మళ్ళీ వుజూ చేసుకోవటం 192
- మూత్ర విసర్జన అజాగ్రత్తగా చెయ్యటం మహాపాపం 193
- మూత్రాన్ని కడగటం 194
- మసీదులో మూత్రం మీద నీళ్లు పొయ్యటం 196

- పిల్లలు పోసే మూత్రం 197
- నిలబడి, కూర్చొని మూత్ర విసర్జనం చేయుట 198
- మిత్రుడు దగ్గరగా ఉన్నప్పుడు మూత్రం పొయ్యటం... 198
- ఇతరుల పెంటదిబ్బ దగ్గర మూత్ర విసర్జన చెయ్యటం 199
- రక్తాన్ని కడిగెయ్యటం 200
- 'మనీ'ని అంటే వీర్యాన్ని నీళ్లతో కడగటం 201
- వస్త్రాలకు అంటుకున్న వీర్యము మొదలైనవి (బహిష్టు రక్తము) కడిగినా, వాటి ప్రభావం పోకపోతే అనే విషయం గురించి 202
- ఒంటెలు, మేకలు మరియు ఇతర పశువుల మూత్రానికి సంబంధించిన మరియు మేకల దొడ్డికి సంబంధించిన ప్రస్తావన 203
- అశుద్ధ పదార్థం ఏదైనా నేతిలోగాని లేదా నీళ్ళలోగాని పడిపోతే, అప్పుడు దానికి సంబంధించిన ఆజ్ఞ ఏమిటి? 205
- ప్రవహించని నీటిలో మూత్రం పొయ్యటం 207
- నమాజు చేస్తూ ఉన్నటువంటి మనిషి వీపు మీద ఏదైనా అశుద్ధ వస్తువునుగాని వేసినట్లయితే, అప్పుడు అతని నమాజు చెడిపోదు 207
- ఉమ్మి మరియు చీమిడి మొదలైనవి కట్టుబట్టలకు తగిలే విషయం గురించి 210
- మత్తు కలిగించే పానీయమేదైనా సరే ధర్మ నిషిద్ధమైనదే 211
- ఎవరైనా ఒక స్త్రీ తన తండ్రి నోటి నుంచి కారే రక్తాన్ని కడగటం అనే విషయం గురించి 211
- మిస్వాక్ (పళ్ళు తోముకోవటానికి ఉపయోగించే టూత్‌బ్రష్ లాంటి ఒక పుల్ల)తో పళ్ళు తోముకోవటం అనే విషయం గురించి 212
- వయస్సులో పెద్దలైన వారికి మిస్వాక్‌ను మొదట ఇవ్వాలి 213
- వుజూ చేసుకుని నిద్రపోయే దాని శ్రేష్ఠతను గురించి 213


## గుసుల్ ప్రకరణం


- తన భార్యతో కలిసి ఒకే పాత్రలోని నీళ్లతో గుసుల్ చెయ్యటం 217
- ఒక 'సా' లేదా దానితో సరితూగే పాత్రలలోని నీళ్ళతో గుసుల్ చేయటం 217
- తలమీద మూడుసార్లు నీళ్లు పోసుకోవటం 219

- హిలాబ్‌తోగాని లేదా సువాసనతోగాని గుసుల్‌ను ప్రారంభించటం 220
- జనాబత్ స్థితిలో గుసుల్ చేసుకునేటప్పుడు పుక్కిలించటం 222
- గుసుల్ చేసుకునేటప్పుడు మట్టితో చేతులు రుద్దుకోవటం 223
- జనాబత్‌కు సంబంధించిన అశుద్ధతకాక మరొక అశుద్ధత ఏదైనా తగిలి ఉండకుండా ఉంటే, అప్పుడు అది ధర్మసమ్మతం అవునా? కాదా? 223
- గుసుల్ చేసుకునేటప్పుడు కుడిచేత్తో ఎడమ చేతి మీద నీళ్లు పోసుకోవటం 225
- వుజూలోను, గుసుల్‌లోనూ మధ్యలో ఆగిపోవటం 226
- భార్యతో కలిసిన తరువాత గుసుల్ చేసుకోకుండానే మళ్లీ కలవటం - ఇలా చెయ్యవచ్చా? ధర్మసమ్మతమేనా? 227
- 'మజీ'ని కడగటం.... 228
- శరీరానికి సుగంధ ద్రవ్యం రాసుకుని స్నానం చెయ్యటం.... 228
- వెంట్రుకల్లోకి తడిసిన చేతి వ్రేళ్లను దూర్చి గీకటం లేక రుద్దటం 230
- ఇదివరకే వుజూ చేసుకున్న భాగాలను మళ్లీ రెండోసారి కడుక్కోకుండా ఉండటం 230
- ఒక వ్యక్తి ఎవరైనా మసీదుల్లో ఉన్నప్పుడు, తాను గుసుల్ చేసుకోవలసిన అవసరం ఉన్నదనే విషయం 231
- జనాబత్‌కు సంబంధించిన గుసుల్ చేసుకున్న తరువాత రెండు చేతులతో శరీరం మీద ఉన్నటువంటి నీటి చుక్కలను తుడుచుకోవటం 231
- గుసుల్‌ను శిరస్సు యొక్క కుడి భాగం నుంచి ప్రారంభించటం 232
- ఒంటరిగా ఉన్న స్థితిలో దిగంబరులై స్నానం చెయ్యటం ధర్మసమ్మతమే 232
- ప్రజల ముందు స్నానం చెయ్యటం తటస్థపడితే ... 235
- స్త్రీకి వీర్యస్ఖలనం అయితే... 236
- 'జునుబ్' అంటే ..... 236
- జనాబత్‌కు సంబంధించిన గుసుల్ ...... 237
- జనాబత్ స్థితిలో ఉన్నటువంటి ఒక మనిషి (లైంగికపరమైన అశుద్ధత కల వ్యక్తి) ఇంట్లో ఉండగలడు. కాని అతను గుసుల్‌కు ముందు వుజూ చేసుకుని వుండాలి 238

- ఒక జునుబ్ గుసుల్‌కు ముందు నిదురపోవచ్చు 238
- జునుబ్ అయిన ఒక వ్యక్తి వుజూ చేసుకున్న తరువాతనే నిద్రకు ఉపక్రమించాలి 238
- స్త్రీ పురుష మర్మాంగాలు రెండూ ఒక దానిని మరొకటి స్పృశించినప్పుడు లేదా ఒకదానితో ఒకటి కలిసినప్పుడు .... 239
- స్త్రీ మర్మాంగం నుంచి వెలువడే తడి గనక తగిలినట్లయితే... 240


## బహిష్టు ప్రకరణం


- బహిష్టు ఎప్పుడు, ఎలా ప్రారంభమయింది 242
- బహిష్టు అయిన స్త్రీ, ఆ స్థితిలో తన భర్తకు తలంటవచ్చు.... 244
- ఒక పురుషుడు బహిష్టు అయిన స్థితిలో ఉన్నటువంటి తన భార్య ఒడిలో తన శిరస్సు పెట్టి ఖురాను పారాయణం చెయ్యవచ్చు 244
- 'హైజ్' (బహిష్టు)ను నిఫాస్ అని కూడా అనటం 245
- బహిష్టు అయిన స్త్రీతో ముబాషిరత్ చెయ్యటం 245
- బహిష్టు అయిన స్త్రీ ఉపవాసం ఉండకూడదు 247
- బహిష్టు అయిన స్త్రీ హజ్‌కు సంబంధించిన ఆచారాలూ.... 248
- ఇస్తిహాజ (రక్తస్రావం)కు సంబంధించిన విషయం 251
- బహిష్టు రక్తాన్ని కడిగివెయ్యటం 252
- రక్తస్రావం వ్యాధి ఉన్న స్త్రీ మసీదులో ఎతెకాఫ్ ఉండవచ్చు 252
- బహిష్టు అయిన బట్టలతో ఒక స్త్రీ నమాజు చెయ్యగలుగుతుందా? 253
- బహిష్టుకు సంబంధించిన స్నానం (గుసుల్) చేసేటప్పుడు సువాసనగల ఏదైనా పదార్థాన్ని వాడటం 254
- బహిష్టుకు సంబంధించిన స్నానం చేసేటప్పుడు స్త్రీ తన శరీరాన్ని బాగా తోము కోవాలి....అనే విషయం గురించి 255
- బహిష్టుకు సంబంధించిన గుసుల్‌ను గురించి 255
- బహిష్టు ఆగిపోయిన తరువాత గుసుల్ చేసుకునేటప్పుడు తల వెంట్రుకలను దువ్వుకోవటం 256
- బహిష్టుకు సంబంధించిన గుసుల్ చేసేటప్పుడు స్త్రీ తన శిరోజాలను విప్పటం 257

- దివ్యఖురానులో 'హజ్' సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు 258
- బహిష్టు అయిన స్త్రీ హజ్‌కూ లేక ఉమ్రాకూ సంబంధించిన ఇహ్రామ్‌ను ఎలా కట్టుకోవాలి? 259
- బహిష్టు ప్రారంభానికీ, సమాప్తానికీ సంబంధించిన విషయం 260
- బహిష్టు అయిన స్త్రీ గుసుల్ తరువాత 'ఖజా' నమాజు చేసే అవసరం లేదు 261
- బహిష్టు అయిన స్త్రీ తన బహిష్టు బట్టలతో ఉన్న స్థితిలో ఆమెతో కలిసి పడుకోవటం 262
- బహిష్టుకు సంబంధించిన బట్టలను, పరిశుభ్రమైన బట్టలను వేర్వేరుగా ఉంచాలి 263
- బహిష్టు అయిన స్త్రీ రెండు పండుగలలోనూ, ముస్లిములు చేసే దుఆల లోనూ పాల్గొనవచ్చు. ఇంకా ఈద్గాహ్ నుంచి వేరుగా ఉండటం గురించి 263
- ఒకవేళ స్త్రీ ఒకే మాసంలో మూడు సార్లు బహిష్టు అయితే 264
- బహిష్టు దినాలలో కాక వేరే దినాలలో మట్టి రంగుగల, పసుపు రంగుగల రక్తాన్ని చూసినట్లయితే, అప్పుడు ఏమి చెయ్యాలి 266
- ఇస్తిహాజ యొక్క (రక్తస్రావపు) నరం గురించి 267
- ఒకవేళ స్త్రీకి తవాఫె జియారత్ తరువాత బహిష్టు అయితే దానికి సంబంధించిన ఆజ్ఞను గురించి 267
- రక్తస్రావం వ్యాధి ఉన్నటువంటి స్త్రీ (ముస్తహాజ) బహిష్టు నుంచి పరిశుద్ధతను పొందినప్పుడు 268
- ప్రసవ సంబంధమైన రక్తస్రావం గల స్త్రీ యొక్క 'నమాజె జనాజ'ను చెయ్యటం. ఇంకా దాని విధానం 269


## తయమ్ముమ్ ప్రకరణం


- నీళ్లు గానీ, మట్టిగానీ లభించనప్పుడు ఏమి చెయ్యాలి? 273
- 'హజర్'లో అంటే తన ఇంట్లో, తన పట్టణంలో ఉన్నప్పుడు నీళ్లు దొరకని స్థితిలో, నమాజు ఖజా అయిపోతుందనే భయం కలిగినప్పుడు తయమ్ముమ్ చేసుకోవటం 275

- తయమ్మమ్ కోసం రెండు చేతులతో మట్టి మీద కొట్టి తరువాత దుమ్మును (ధూళినీ) తగ్గించే నిమిత్తం చేతుల మీద ఊదటం 276
- తయమ్మమ్‌లో కేవలం ముఖం మీద, రెండు చేతుల మీద మసా చెయ్యటం 277
- ఒక జునుబ్ (గుసుల్ చేసుకునే అవసరం ఉన్న వ్యక్తి)కు వ్యాధి భయంకానీ, మరణ భయంకానీ, దప్పిక భయం కాని ఉన్నప్పుడు అతను తయమ్మమ్ చేసుకోవచ్చు 284
- తయమ్మమ్ చేసుకునేటప్పుడు మట్టి మీద చేతులతో ఒకసారి కొడితే సరిపోతుంది 287


## నమాజు ప్రకరణం


- మేరాజ్ రాత్రి ఏ విధంగా నమాజ్ ఫరజ్ (విధి)గా చెయ్యబడింది 290
- వస్త్రాలు ధరించి నమాజు చెయ్యటం వాజిబ్ (అనివార్యం) 295
- నమాజు చేసేటప్పుడు ఇజారును (ఛాతి క్రింది భాగంలో ధరించే వస్త్రం) మెడ వెనుక భాగానికి కట్టుకోవటం 296
- ఒకే ఒక వస్త్రాన్ని శరీరానికి చుట్టుకుని నమాజు చెయ్యటం 297
- ఒకే వస్త్రాన్ని ధరించి నమాజు చేసినప్పుడు దానిని తన భుజస్కంధాల మీద కూడా వేసుకోవాలి 299
- ఒకవేళ వస్త్రం బిగువుగా, టైటుగా ఉన్నట్లయితే 299
- వస్త్రహీనులుగా నమాజు చేయటం అసహ్యకరమైనది 301
- చొక్కా పైజామాలూ, మోకాళ్ళ వరకు ఉండే నిక్కర్లూ, పొడుగాటి కోటూ ధరించి నమాజు చెయ్యటం 302
- 'ఔరత్' అంటే 'సతర్' సతర్ అంటే తప్పనిసరిగా కప్పి ఉంచవలసిన శరీర రహస్య భాగాలకు సంబంధించిన ప్రస్తావన 303
- దుప్పటి లేకుండా నమాజు చెయ్యటం 305
- మనిషి తొడకు సంబంధించిన అధ్యాయం 305
- ఒక స్త్రీ ఎన్ని బట్టలు ధరించి నమాజు చెయ్యాలి అనే విషయం గురించి 310
- డిజైన్‌లు ఉన్న వస్త్రాన్ని ధరించి నమాజు చెయ్యటం మరియు వాటిని చూడడం అనే విషయాలను గురించి 310

- ఒకవేళ ఎవరైనా శిలువ గుర్తుగానీ లేదా బొమ్మలుగానీ వేసినటువంటి వస్త్రాన్ని ధరించి నమాజు చేసినట్లయితే, ఆ నమాజు రద్దు అవుతుందా? కాదా? దానికి సంబంధించిన నిషేధం గురించి 311
- పట్టు వస్త్రంతో తయారు చేసిన కోటు ధరించి నమాజు చెయ్యటం మరియు దానిని తీసివేయటం 312
- ఎరుపు రంగుగల వస్త్రాన్ని ధరించి నమాజు చెయ్యటం 313
- కప్పు మీదా, మెంబరు మీదా, చెక్క మీదా నమాజు చెయ్యటం గురించి 314
- నమాజు చేసే మనిషి సజ్దా చేసే స్థితిలో ఉన్నప్పుడు, ఒకవేళ అతను ధరించిన దుస్తులు అతని భార్య శరీరానికి తగిలినట్లయితే 316
- చాప మీద నమాజు చెయ్యటం అనే విషయం గురించి 316
- ఖుమ్రా (ఒక చిన్న చాప-ముసల్లా లేక జానిమాజ్) మీద నమాజు చెయ్యటం గురించి 317
- పడక మీద నమాజు చెయ్యటం  అనే విషయం గురించి 318
- తీవ్రమైన ఎండ వేడిలో వస్త్రం మీద సజ్దా చెయ్యటం 319
- పాదరక్షలతో నమాజు చెయ్యటం 320
- చర్మపు మేజోళ్లు తొడుక్కుని నమాజు చెయ్యటం 320
- ఎవరైనా సజ్దా పూర్తిగా చెయ్యకపోతే 321
- సజ్దా చేసేటప్పుడు రెండు బాహువులను వెడల్పుగా, విశాలంగా ఉంచటం 321
- ఖిబ్లా వైపునకు ముఖం పెట్టి నమాజు చెయ్యటం ఎంతో శ్రేష్ఠమైనది, ఎంతో ఉన్నతమైనది 322
- మదీనా ప్రజల,  సిరియా ప్రజల 'ఖిబ్లా'ను  గురించి ఇంకా తూర్పు (పశ్చిమ) దిక్కులను గురించి 323
- ఇబ్రాహీమ్ ఆరాధన కొరకు నిలబడిన ప్రదేశాన్ని శాశ్వతమైన నమాజు స్థలంగా చేసుకోవలసిందిగా మేము ప్రజలను ఆదేశించాము 324
- మనిషి ఎక్కడున్నా సరే, ఏ దేశంలో ఉన్నా, ఏ ప్రదేశంలో ఉన్నా ఖిబ్లా వైపునకు ముఖాన్ని పెట్టి నమాజు చెయ్యాలి 326
- ఖిబ్లాను గురించి మరికొన్ని విషయాలు 329

- మసీదులో ఎక్కడైనా ఉమ్మి తగిలి ఉంటే దానిని చేత్తో గోకి తీసివేయటం 331
- మసీదులోని చీమిడిని గులకరాయితో గీకి తీసిపారెయ్యటం 333
- నమాజు చేసేటప్పుడు మనిషి తన కుడి వైపు భాగంలో ఉమ్మివేయకూడదు 333
- ఎడమ వైపు లేదా ఎడమ కాలు క్రిందా ఉమ్మివేయవచ్చు 334
- మసీదులో ఉమ్మివేసిన దానికి పరిహారం 335
- కాంౡ్రించి ఉమ్మివేసే కళ్లెను మసీదులో పూడ్చిపెట్టుట 335
- ఒకవేళ అకస్మాత్తుగా ఉమ్మివస్తే దానిని ఆపటం కష్టమైతే, నమాజులో ఉన్న వ్యక్తి తాను ధరించిన బట్టలోని చివరి భాగంలో ఉమ్మివెయ్యవచ్చు 336
- నమాజును చక్కగా, షరిఅత్ ప్రకారం చెయ్యమని ఇమామ్ ప్రజలకు హితబోధ చెయ్యటం, ఖిబ్లాకు సంబంధించిన ప్రస్తావన 336
- ఈ మసీదు ఫలానా వారి మసీదు అని అనవచ్చునా? 337
- మసీదులో ధనం పంచిపెట్టటం మరియు మసీదులో ఖర్జూరపు గెలను వ్రేలాడ గట్టటం 338
- భోజనానికి రమ్మని మసీదులో ఆహ్వానించటం; ఆ ఆహ్వానాన్ని అంగీకరించటం 339
- మస్జిద్‌లో తీర్పు చెప్పటం, 'లిఆన్' చేయించటం 340
- ఇతరుల ఇంట్లోకి వెళ్లినప్పుడు తాను కోరిన చోట లేదా ఇంటి యజమాని చూపించిన స్థలంలో నమాజు చేయవచ్చు, ఆ స్థలం గురించి ఆరా తీయకూడదు 340
- గృహాలను మసీదులుగా చేసుకోవటం 341
- మసీదులోకి ప్రవేశించేటప్పుడూ, ఇంకా ఇతర పనులు చేసేటప్పుడూ కుడి వైపు నుంచి ప్రారంభించటం 343
- అజ్ఞాన కాలం నాటి ముష్రిక్కుల సమాధులను త్రవ్వటం, వాటి స్థానంలో మసీదు కట్టటం ధర్మసమ్మతమైన విషయమే 343
- గొర్రెల దొడ్లల్లో నమాజు చెయ్యటం 346
- ఒంటెల దొడ్డిలో నమాజు చెయ్యటం 346
- ..... ముష్రిక్కులు పూజించే ఏదైనా వస్తువు తన ముందు ఉన్న స్థితిలో ఎవరైనా ఒక వ్యక్తి నమాజు చేస్తే ... 347
- గోరీల మధ్య నమాజు చెయ్యటం అసహ్యకరమైన విషయం 348

- ఎక్కడయితే భూమి కృంగిపోయిందో లేదా ఎక్కడయితే ఏదైనా శిక్ష అవతరించిందో అక్కడ నమాజు చెయ్యటం ... 348
- చర్చిలో నమాజు చేసే సమస్యను గురించి 349
- దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) గారి సూక్తి - నా కోసం భూమి అంతా మసీదుగానూ, పరిశుభ్రపరిచే వస్తువుగానూ చెయ్యబడింది 350
- ఒక స్త్రీ మసీదులో పడుకోవటం 351
- పురుషులు మసీదులో పడుకోవటం గురించి 352
- ప్రయాణం చేసి తిరిగి వచ్చినప్పుడు నమాజు చెయ్యటం 354
- ఎవరైనా మసీదులోకి ప్రవేశిస్తే కూర్చోబోయే ముందు రెండు రకాతులు నమాజు చెయ్యాలి 355
- మసీదులో అశుద్ధత కలగటం, అంటే అపాన వాయువు వెలువడటం 355
- మసీదు నిర్మాణం గురించి 356
- మసీదు నిర్మాణంలో ఒకరికొకరు తోడ్పడటం 357
- మసీదు కట్టేటప్పుడూ, మెంబర్‌ను తయారు చేసేటప్పుడూ వడ్రంగినీ, సాంకేతిక నిపుణున్నీ పిలిచి వారి సహాయాన్ని పొందటం 358
- మసీదు నిర్మించేవానికి లభించే పుణ్యఫలం 359
- మసీదు గుండా వెళ్లటం జరిగినప్పుడు బాణపు అలుగులను ఒక చేత్తో పట్టుకోవాలి 360
- బాణాలు మొదలైనవి తీసుకుని మసీదులో నుంచి పోవటం 360
- మసీదులో కవిత్వం చెప్పటం 360
- బల్లెములూ, ఈటెలు ధరించిన వారు మసీదులోకి ప్రవేశించటం 361
- మసీదులోని మెంబరు మీద క్రయవిక్రయాలను గురించి .. 361
- అప్పు చెల్లించమని రుణగ్రస్తుణ్ణి మస్జిద్‌లో అడగటం ... 362
- మసీదును ఊడ్చి పరిశుభ్రపరచటం... 363
- సారాయి వ్యాపారాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ అయింది మసీదులోనే 363
- మసీదుకు సేవకుల్ని నియమించటం 363
- ఖైదీని ఇంకా రుణగ్రస్తుణ్ణి మసీదులోని స్థంభానికి కట్టివెయ్యడం.. 364

- రోగుల కోసం మసీదులో గుడారం వెయ్యటం 365
- అవసరమైనప్పుడు ఒంటెను మసీదులోకి తీసుకుపోవటం 365
- మసీదుకు కిటికీలనూ, తలుపులనూ పెట్టటం 366
- కాబా గృహానికీ, ఇతర మసీదులకూ తలుపులు పెట్టటం... 368
- ముష్రిక్కులు మసీదుల్లోకి ప్రవేశించటం గురించి 369
- మసీదులో బిగ్గరగా మాట్లాడటం ధర్మసమ్మతమేనా? 369
- మసీదులో వృత్తాకారంలో కూర్చొని ధార్మిక సమావేశాలు జరుపుకోవటం ఇంకా ఇట్టే కూర్చోవటం 371
- మసీదులో వెల్లకిలా పడుకోవటం 372
- ఒకవేళ మసీదు రాకపోకల మార్గం మీద కట్టబడి ఉంటే, కాని అది ప్రజలకు నష్టం కలిగించనట్లయితే అప్పుడు అది దోషమేమీ కాదు 373
- మార్కెట్టులో ఉన్నటువంటి మసీదులో నమాజు చెయ్యటం 374
- మసీదులోగానీ, బయటగానీ చేతుల్ని కలిపి వ్రేళ్లను కూర్చుకోవటం 375
- మదీనాకు పోయే మార్గంలో ఉన్నటువంటి మసీదులను గురించి 376
- ఇమామ్‌కు ముందు ఉన్న 'సుత్రా' యే ఆయన వెనుక నిలబడి నమాజు చేసే ముఖ్తదీలకు కూడా సుత్రాగా సరిపోతుంది 377
- నమాజు చేసే వ్యక్తికి, సుత్రాకు మధ్య ఎంత దూరం వుండాలి? అనే విషయం గురించి 379
- బరిసెను భూమిలో పాతి దాని వైపునకు తిరిగి నమాజు చెయ్యటం 379
- 'అన్‌జా' వైపునకు తిరిగి నమాజు చెయ్యటం గురించి 380
- మక్కాలోనూ, ఇతర స్థలాలలోనూ నమాజు కోసం సుత్రాను పాతటం గురించి 380
- స్తంభానికి ఎదురుగా నిలబడి నమాజు చెయ్యటం 381
- నమాజు చేసే వ్యక్తి గనక ఒక్కడే అయితే (లేదా ఒంటరిగా ఉంటే), అతను రెండు స్తంభాల మధ్య నమాజు చెయ్యటం 382
- ఆడ ఒంటె, మగ ఒంటె, వృక్షం, జీనుల వైపునకు ముఖంపెట్టి నమాజు చెయ్యటం గురించి 383

- మంచం మీదగానీ లేదా మంచం వైపునకుగానీ ముఖంపెట నమాజు చెయ్యటం 384
- ఎవరైనా నమాజు చేసే వ్యక్తి ముందు నుంచి దాటిపోదలిస్తే అతన్ని అలా పోకుండా నిరోధించటం 384
- నమాజు చేసే వ్యక్తి ముందు నుంచి దాటిపోయే దాని పాపం 385
- ఒక వ్యక్తి నమాజు చేస్తూ ఉండగా అతని వైపు ముఖం పెట్టి కూర్చోవటం అనే విషయం గురించి 386
- నిద్రపోయే మనిషి వెనుక నమాజు చెయ్యటం గురించి 387
- స్త్రీ నిద్రలో ఉన్నప్పుడు ఆమె వెనుక నిలబడి నఫిల్ నమాజులు చెయ్యటం గురించి 387
- ఏ వస్తువూ నమాజును భంగపరచదు అని చెప్పే వ్యక్తి ఆధారం 387
- నమాజు చేసే సమయంలో చిన్న పాపను తన భుజాలమీద కూర్చో బెట్టుకోవటం 388
- బహిష్టు అయిన స్త్రీ పడుకుని ఉన్నటువంటి పడక వైపునకు తిరిగి నమాజు చెయ్యటం 388
- సజ్దాను సక్రమంగా చేసే ఉద్దేశ్యంతో ఒక పురుషుడు సజ్దా చేసేటప్పుడు తన భార్య శరీరాన్ని తాకపచ్చునా? 389
- ఒకవేళ ఒక స్త్రీ నమాజు చేసే వ్యక్తి శరీరం మీద నుంచి ఏదైనా మాలిన్యాన్ని లేదా నష్టం కలిగించే వస్తువును దేన్నయినా తీసి పారేసినట్లయితే ఆ వ్యక్తి చేసే నమాజు చెడిపోదు 389


## నమాజు వేళల ప్రకరణం


- నమాజు వేళలు మరియు వాటి శ్రేష్ఠత 391
- అల్లాహ్ వైపునకు మరలుతూ; ఆయనకు భయపడండి 392
- నియమబద్ధంగా, చక్కని రీతిలో నమాజు చేస్తామని ప్రమాణం చేసి చెప్పటం 393
- నమాజ్ పాపాలకు పరిహారం 394
- సకాలంలో నమాజు చేసేదాని ఔన్నత్యం 396
- ప్రతిరోజు చేసే ఐదు నమాజులను ఎవరైనా జమాఅత్‌తో గానీ లేదా ఒంటరిగా గానీ సకాలంలో చేసినట్లయితే, అవి పాపాలకు పరిహారమవుతాయి 397
- నమాజును నాశనం చెయ్యటం అంటే సకాలంలో చెయ్యకపోవటం 398

- నమాజు చేసే వ్యక్తి తన ప్రభువుతో రహస్యంగా మాట్లాడతాడు 399
- ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు జొహర్ నమాజును కొంచెం చల్లబడిన తరువాత చెయ్యటం 400
- ప్రయాణంలో ఉన్నప్పుడు జొహర్ నమాజును చల్లబడినప్పుడు చెయ్యటం 401
- జొహర్ నమాజు వేళ ప్రొద్దువ్రాలటం మీద ఆధారపడి ఉంది 402
- అసర్ నమాజు వేళ 404
- అసర్ నమాజును ఖజా చేసిన దానిపాపం 406
- ఏ వ్యక్తి అయితే తన అసర్ నమాజును బుద్ధిపూర్వకంగా విడిచిపెడతాడో, దాని పాపం 406
- అసర్ నమాజు ఘనత 407
- ఏ వ్యక్తి అయితే సూర్యాస్తమయానికి ముందు అసర్ నమాజుకు చెందిన కేవలం ఒక రకాతును మాత్రమే చెయ్యగలిగాడో, దానిని గురించి 408
- మగ్రిబ్ నమాజు వేళను గురించి... 410
- మగ్రిబ్ నమాజును ఇషా నమాజు అని అనటం ధర్మశాస్త్రం ప్రకారం అవాంఛనీయం 411
- 'ఇషా' 'అతమా' - ఈ రెండు పేర్లనూ ఒకే నమాజుగా తీసుకోవడం గురించి 411
- ఇషా నమాజువేళ ప్రజలు గనక వచ్చి ఉన్నట్లయితే, తొందరగా, పెందలకాడనే ఇషా నమాజు జమాఅత్‌తో చెయ్యండి. ప్రజలు గనక ఆలస్యంగా వస్తే ఇషా నమాజును కూడా ఆలస్యంగానే చెయ్యటం 412
- ఇషా నమాజు ఘనత 412
- ఇషా నమాజుకు ముందు నిద్రపోవటం అభిలషణీయం కాదు 413
- ఒకవేళ నిదుర ఎక్కువగా వస్తూ ఉన్నట్లయితే ఇషా నమాజుకు ముందు నిదురపోవచ్చు 413
- ఫజర్ నమాజు ఘనత 415
- ఫజర్ నమాజు వేళ 416
- ఎవరైనా సూర్యోదయానికి ముందు ఫజర్ నమాజులోని ఒక రకాత్‌ను పొందినట్లయితే, అప్పుడు అతని నమాజు పూర్తి అయిపోయింది, ఖజాకాదు 417

- ఎవరైనా ఏదైనా నమాజుకు చెందిన కేవలం ఒక రకాతును పొందినప్పటికీ అతను ఆ నమాజును పూర్తిగా పొందినట్లే 417
- ఫజర్ నమాజు తరువాత సూర్యోదయం వరకు గల వ్యవధిలో చేసే నమాజులను గురించి 418
- అసర్ నమాజు తరువాత సూర్యస్తమయానికి ముందు నమాజు చేసే సంకల్పం చేసుకోకూడదు 419
- అసర్, ఫజర్ నమాజుల తరువాత నమాజు చెయ్యటాన్ని మక్రూహ్ ... 420
- అసర్ నమాజు తరువాత ఖజా నమాజులు .... జనాజా నమాజు మొదలైనటువంటివి చెయ్యటం గురించి 420
- ఆకాశం మేఘావృతమై ఉన్న రోజున నమాజును తొందరగా చెయ్యటం అంటే పెందలకడ చెయ్యటం 422
- సమయం మించిపోయిన తరువాత నమాజు చేసేటప్పుడు అజాన్ ఇవ్వటం 422
- సమయం మించిపోయిన తరువాత ఖజా నమాజును సామూహికంగా అంటే జమాఅత్‌తో చెయ్యటం 423
- ఏదైనా నమాజును చెయ్యటాన్ని మరచిపోతే అది జ్ఞాపకం వచ్చినప్పుడు చేసెయ్యాలి. కేవలం ఆ నమాజును మాత్రమే చెయ్యాలి 423
- ఒకవేళ చాలా నమాజులు ఖజా అయిపోయినట్లయితే, వాటిని తరువాత వరుసగా చదవటం 424
- ఇషా నమాజు తరువాత 'సమర్' అంటే ప్రపంచానికి సంబంధించిన విషయాలు మాట్లాడుకోవడం అవాంఛనీయం 424
- ధార్మిక సమస్యలకూ, తీర్పులకూ సంబంధించిన విషయాలు, మంచి విషయాలు ఇషా నమాజు తరువాత మాట్లాడు కోవటం ధర్మసమ్మతమైనదే 425
- ఒక మనిషి తన భార్యతోగానీ లేదా తన అతిథులతోగానీ రాత్రిపూట ఇషా నమాజు అయిన తరువాత మాట్లాడటం అనే విషయం గురించి 427


## అజాన్ ప్రకరణం


- అజాన్ ఎలా ప్రారంభమయింది అనే విషయం గురించి 430
- అజాన్‌లోని పదాలను రెండేసిసార్లు పలకటం 431

- ‘ఖద్‌ఖామతిస్సలాత్’ తప్ప తక్బీర్‌లోని పదాలను ఒక్కొక్కసారి పలకాలి 432
- అజాన్ ఇచ్చేదాని ఔన్నత్యం 432
- అజాన్ ఇచ్చేటప్పుడు కంఠస్వరాన్ని పెంచటం 433
- అజాన్ పిలుపు వినగానే యుద్ధాన్ని కొంచెం సేపటి వరకు ఆపటం 434
- అజాన్ పిలుపు వినే సమయంలో ఏమని పలకాలి 435
- అజాన్ ఇవ్వటం అయిపోయిన తరువాత ఏమని దుఆ చెయ్యాలి? 435
- అజాన్ ఇచ్చే విషయంలో డ్రా తీసే పద్ధతి (చీటీలు వేయుట) 436
- అజాన్ ఇచ్చేటప్పుడు మాట్లాడటం ధర్మసమ్మతమా? కాదా? 437
- సమయాన్ని తెలియజేసే వ్యక్తి ఎవరైనా ఉంటే అప్పుడు ఒక అంధుడు కూడా అజాను ఇవ్వవచ్చు 438
- ఉదయం వేళ అయిపోయిన తరువాత అజాన్ ఇవ్వటం 438
- ఫజర్ వేళకు ముందు అజాన్ ఇవ్వటం 439
- అజాన్‌కూ, ఇఖామత్‌కూ మధ్య ఎంత వ్యవధి ఉండాలి? అనే విషయం గురించి 440
- అజాన్ పిలుపు విని ఇఖామత్ కోసం ఇంట్లో నిరీక్షించటం 440
- అజాన్‌కూ, ఇఖామత్‌కూ మధ్య ఇష్టపడే వారు రెండు రకాతుల నమాజు చేసుకోవచ్చు 440
- నివాసంలో ఉన్నప్పుడు మాదిరిగానే ప్రయాణంలో ఒకే ఒక మనిషి అజాన్ ఇవ్వాలి 441
- ప్రయాణీకుల సంఖ్య పెద్దదిగా ఉన్నట్లయితే అప్పుడు నమాజు కోసం అజాన్ ఇవ్వాలి 441
- అజాన్ ఇచ్చేటప్పుడు మౌజన్ తన ముఖాన్ని అటూ ఇటూ (కుడి, ఎడమ ప్రక్కలకు) త్రిప్పే అవసరం ఉందా? 444
- ఒక వ్యక్తి ఇలా అనటం గురించి; మేము మా నమాజును పోగొట్టుకున్నాము 445
- ఎంత నమాజైతే దొరుకుతుందో అంత నమాజును చేసుకోండి 446
- ఇఖామత్ అయ్యేటప్పుడు ప్రజలు ఇమామ్‌ను చూసినట్లయితే, వారు నమాజు కోసం ఎప్పుడు లేచి నిలబడాలి? 446
- నమాజు కోసం తొందర తొందరగా లేచి నిలబడకూడదు 447

- అవసరమైనప్పుడు ఒక వ్యక్తి అజాన్ తరువాత గానీ లేదా ఇఖామత్ తరువాత గానీ మసీదులో నుంచి బయటికి వెళ్లవచ్చు 447
- ఒకవేళ ఇమామ్ ముఖ్తదీలతో, నేను తిరిగి వచ్చే వరకు మీరు ఇక్కణ్ణే ఆగి ఉండండి అని చెప్పినట్లయితే ఆయన కోసం నిరీక్షించవలసి ఉంటుంది 448
- ఒక మనిషి ఎవరైనా దైవప్రవక్త ముహమ్మద్ (స) గారితో, మేము నమాజు చెయ్యలేదు అని అంటే, అందులో ఎలాంటి దోషమూ లేదు 448
- ఇఖామత్ చెప్పిన తరువాత ఒకవేళ నమాజు చేయించే ఇమామ్ గారికి ఏదైనా విషయం గురించి అవసరం కలిగితే 449
- ఇఖామత్ చెప్పే సమయంలో ఎవరితోనైనా మాట్లాడటం 449
- జమాఅత్‌తో కలిసి సామూహికంగా నమాజు చెయ్యటం విధి 450
- జమాఅత్‌తో కలిసి సామూహికంగా నమాజు చేసే దాని ఔన్నత్యం 451
- ఫజర్ నమాజును జమాఅత్‌తో కలిసి చేసే దాని ఔన్నత్యం 452
- సత్కార్యం వైపునకు వేసే ప్రతి అడుగుకూ పుణ్యం లభిస్తుంది 454
- ఇషా నమాజును జమాఅత్‌తో కలిసి సామూహికంగా చేసే దాని ఔన్నత్యం 454
- ఇద్దరు లేదా ఇద్దరికంటే ఎక్కువ మంది ఉంటే జమాఅత్‌తో కలిసి సామూహికంగా నమాజు చెయ్యవచ్చు. 455
- నమాజు కోసం నిరీక్షిస్తూ మసీదులో కూర్చుండి పోయే వ్యక్తికి లభించే పుణ్యం మరియు మసీదుల ఔన్నత్యం గురించి 455
- ఉదయం, సాయంత్రం నమాజు కోసం మసీదుకుపోయే దాని ఘనత 456
- ఇఖామత్ చెప్పిన తరువాత ఫరజ్ నమాజు తప్ప మరొక నమాజు ఏదీ చెయ్యకూడదు 456
- వ్యాధిగ్రస్తుడైన వ్యక్తి ఎప్పుడు, ఏ స్థితిలో జమాఅత్‌తో కలిసి సామూహికంగా నమాజు చేసేందుకు మసీదుకు వెళ్ళాలి అనే విషయం గురించి 457
- వర్షం వల్ల గానీ లేదా ఏదైనా మరొక కారణం వల్ల గానీ, ఇంట్లోనే నమాజు చేసుకునే అనుమతి గురించి 459
- వర్షంలోగానీ లేదా ఏదైనా కష్టం వచ్చిపడినప్పుడుగానీ ఎవరైనా మసీదుకు వచ్చినట్లయితే అప్పుడు ఇమామ్ వారితో కలిసి నమాజు చేయవచ్చా? 460

- అన్నం ముందు కూర్చున్నప్పుడు నమాజు కోసం ఇఖామత్ చెప్పబడితే అప్పుడు ఏమి చెయ్యాలి? 461
- ఇమామ్‌ను నమాజు కోసం పిలిచినప్పుడు, ఒకవేళ ఆయన చేతిలో తినే వస్తువు ఏదైనా ఉన్నప్పుడు ఆయన ఏమి చెయ్యాలి? 462
- ఎవరైనా గృహ సంబంధమైన పనుల్లో నిమగ్నమై ఉన్నప్పుడు, ఒకవేళ ఇఖామత్ అయినట్లయితే అతను నమాజు కోసం మసీదుకు వెళ్ళిపోవాలి 463
- దైవప్రవక్త ముహమ్మద్(స) నమాజు చేసే పద్ధతి, విధానం ఎలాంటిదో తెలియజేసే సంకల్పంతో ప్రజల ముందు నమాజు చెయ్యటం. 464
- ఇమామత్ చేసే హక్కు, అందరికంటే ఎక్కువగా ధర్మజ్ఞానం గల పెద్దలకే ఉన్నది. 464
- ఏ వ్యక్తి అయినా ప్రబలమైన కారణం వల్ల నమాజు పంక్తిని వదిలేసి ఇమామ్ ప్రక్కన నిలబడితే అది ధర్మసమ్మతమేనా? 467
- ఒక వ్యక్తి ప్రజలకు నమాజు చేయిస్తున్నాడు. అప్పుడు అసలు ఇమామ్ వచ్చేశాడు... 468
- ఖుర్ఆన్‌ను పారాయణం చెయ్యటంలో వయస్సులో పెద్దవాడైన వ్యక్తి నమాజుకు నాయకత్వం వహించాలి. 470
- ఒకవేళ ఇమామ్ ఎవరినైనా కలుసుకోవటానికి ఎక్కడికైనా వెళ్ళినట్లయితే, ఆ ఇమామ్ అక్కడి ప్రజలకు ఇమామ్ కాగలడు. 470
- ఇమామ్ నియామకం జరిగేది ప్రజలు ఆయన్ని అనుసరించాలని. 471
- ఇమామ్ వెనుక నిలబడి నమాజ్ చేసే ముఖ్తదీలు సజ్దా ఎప్పుడు చెయ్యాలి? 475
- ఎవడైతే ఇమామ్‌కంటే ముందే రుకూలో గానీ, సజ్దాలోగాని తన శిరస్సును ఎత్తుతాడో దాని పాపం 475
- ఒక బానిస నమాజుకు నాయకత్వం వహించటం 475
- ఒకవేళ నమాజు చేయించే ఇమామ్ తన నమాజును పూర్తి చెయ్యలేకపోతే, ఇంకా ముఖ్తదీలు గనుక తమ నమాజును పూర్తిగా చేసుకుంటే... 476
- తిరుగుబాటు చేసిన వ్యక్తి 'బిదతి' ఈ ఇద్దరు వ్యక్తులు ఇమామత్ చేస్తే వారి వెనుక నమాజు చేయవచ్చునా లేదా? 477
- ఒకవేళ నమాజు చేసేవారు ఇద్దరు మాత్రమే ఉంటే అప్పుడు ముఖ్తదీ ఇమామ్‌కు కుడి వైపున అతనితో సమానంగా నిలబడాలి 478

- ఒకవేళ ఎవరైనా ఒక మనిషి ఇమామ్‌కు ఎడమ వైపున నిలబడితే తరువాత ఇమామ్ అతన్ని లాగి తన కుడి వైపున నిలబడేలా చేస్తే, అప్పుడు ఆ ఉభయుల్లో ఎవరి నమాజూ భంగం కాదు 478
- నమాజును ప్రారంభించేటప్పుడు ఇమామత్ చేసే ఉద్దేశ్యం, సంకల్పం లేకపోతే తరువాత కొందరు వచ్చి చేరిపోతే అప్పుడు ఇమామత్ చేస్తే అంటే జమాఅత్‌కు నాయకత్వం వహిస్తే... అనే విషయం గురించి. 479
- ఒకవేళ నమాజు చేయించే ఇమామ్ నమాజులో పొడుగాటి ఖుర్‌ఆన్ సూరాను ప్రారంభించినట్లయితే... 479
- ఇమామ్ ఖియామ్(నిలబడుట)ను సులభతరం చెయ్యాలి. ఇంకా రుకూ సజ్దాలను పూర్తిగా, పరిపూర్ణంగా చెయ్యాలి. 480
- మనిషి ఒంటరిగా నమాజు చేస్తూ ఉన్నప్పుడు తన ఇష్టప్రకారం ఆ నమాజును పొడిగించుకోవచ్చు. 481
- ఇమామ్ నమాజును పొడిగిస్తే అతనికి వ్యతిరేకంగా ఫిర్యాదు చెయ్యటం 481
- పిల్లవాడి ఏడ్పు ధ్వనిని విని నమాజును సంక్షిప్తం చెయ్యటం 482
- ఒక వ్యక్తి నమాజు చేశాడు. తరువాత ఆ వ్యక్తి అదే నమాజును ఇమామ్‌గా ఇతరుల చేత చేయిస్తే, అది ధర్మసమ్మతమేనా అనే విషయం గురించి. 484
- ఇమామ్ పలికే తక్బీర్ (అంటే అల్లాహు అక్బర్)ను ముఖ్తదీలకు వినిపించడం 484
- ఒక వ్యక్తి ఇమామ్‌ను అనుసరిస్తే అతని వెనుక ఉన్నవారు అతన్ని అనుసరిస్తే; అప్పుడు అది ధర్మసమ్మతమేనా? 485
- నమాజు చేయించేటప్పుడు ఇమామ్‌కు ఏదైనా విషయం గురించి సందేహం కలిగినప్పుడు, ముఖ్తదీలు చెప్పినట్లు చెయ్యవచ్చునా? 486
- ఒకవేళ నమాజు చేయిస్తున్నప్పుడు ఇమామ్ ఏడ్చినట్లయితే, దాని కారణంగా నమాజు భంగమవుతుందా? 487
- తక్బీర్ చెప్పేటప్పుడు మరియు తక్బీర్ చెప్పిన తరువాత పంక్తులను వంకర లేకుండా తిన్నగా ఉండేటట్లు చెయ్యటం. 488
- పంక్తులను సరిదిద్దేటప్పుడు ముఖ్తదీల వైపు తన ముఖాన్ని త్రిప్పటం 488

- నమాజులోని మొదటి పంక్తిని గురించి (దానికి లభించే పుణ్యం) 488
- నమాజులో పంక్తుల్ని సరిసమానం చెయ్యటం నమాజుకు పూర్ణత్వాన్ని కలిగించటమే. 489
- నమాజులో పంక్తిని పూర్తి చెయ్యకపోవటం మరియు దాని పాపం 490
- పంక్తిలో భుజానికి భుజం ఆనించి, పాదాన్ని పాదంతో కలిపి నమాజులో నిలబడటం 490
- నమాజులో ఒక వ్యక్తి ఎవరైనా ఇమామ్‌కు ఎడమ వైపున నిలబడితే, అప్పుడు ఇమామ్ గనక అతన్ని తన వెనుక నుంచి త్రిప్పుకుంటూ కుడి వైపునకు తీసుకువచ్చి నిలబెడితే, ఆ ఉభయుల నమాజుకు భంగం వాటిల్లదు 490
- ఒకే ఒక స్త్రీ, తోటి స్త్రీలెవరూ ఆమెతో లేనప్పుడు ఒక పంక్తిగా నిలబడి ఆమె నమాజు చేయవచ్చు 491
- ఒకవేళ ఇమామ్‌కూ, ముఖ్తదీలకూ మధ్య ఒక గోడగానీ లేదా ఒక తెరగానీ అడ్డంగా ఉంటే అది తప్పు కాదు, అందులో దోషం లేదు 491
- రాత్రి నమాజును గురించి 492


## మంచి లక్షణాలు గల నమాజు ప్రకరణం


- (అల్లాహు అక్బర్ అనే) తక్బీరు (అంటే తక్బీరె తహ్‌రీమ) పలకటం వాజిబ్. ఆ తరువాతనే నమాజును ప్రారంభించాలి 493
- నమాజు ప్రారంభంలోనే తక్బీరె తహ్‌రీమ పలకగానే అదే సమయంలో రెండు చేతులు ఎత్తటం 494
- 'తక్బీరె తహ్‌రీమ' పలికేటప్పుడు, రుకూలోకి పోయేటప్పుడు ఇంకా రుకూలో నుంచి శిరస్సును ఎత్తే సమయంలోనూ రెండు చేతులు ఎత్తటం 495
- చేతుల్ని ఎంతవరకు ఎత్తాలి? ... 496
- నమాజు చేసే సమయంలో కుడి చేతిని ఎడమ చేతిపై పెట్టటం 497
- నమాజులో అణుకువ 497
- తక్బీరె తహ్‌రీమ తరువాత ఏమి పలకాలి? (లేదా ఏమని పఠించాలి?) 498
- నమాజులో ఇమామ్ వైపు చూడటం 499

- నమాజు చేసేటప్పుడు ఆకాశం వైపునకు చూడటం 501
- నమాజ్ చేసే సమయంలో అటూ ఇటూ చూడటం ధర్మసమ్మతమేనా? 501
- ఒకవేళ ఏదైనా ప్రమాదం జరిగితే... ఖిబ్లా వైపు ఉన్నటువంటి గోడపై ఉమ్మిని చూస్తే అప్పుడు 'ఇల్తిఫాత్' చేస్తే అది దోషం కాదు 502
- ఖుర్ఆన్ పఠించటం అందరిపై వాజిబ్.. జహ్రీ నమాజు అయినా సరే, సిర్రీ నమాజు అయినా సరే 503
- జొహర్ నమాజులో ఖుర్ఆన్ పఠనం 506
- అసర్ నమాజులో ఖుర్ఆన్ పఠనం గురించి 507
- మగ్రిబ్ నమాజులో ఖుర్ఆన్ పఠనం గురించి 507
- మగ్రిబ్ నమాజులో బిగ్గరగా పఠించడం 507
- ఇషా నమాజులో బిగ్గరగా పఠించడం గురించి 508
- ఇషా నమాజులో సజ్దా ఉన్న సూరాను పారాయణం చేయటం 508
- ఇషా నమాజులో ఖుర్ఆన్ పారాయణం గురించి. 509
- ఇషా నమాజులోని మొదటి రెండు రకాతుల్లో ఖుర్ఆన్ పారాయణాన్ని సుదీర్ఘమైనదిగా చెయ్యటం. ..... 509
- ఉదయం నమాజులో ఖుర్ఆన్ పారాయణం గురించి 509
- ఉదయం నమాజులో బిగ్గరగా ఖురాను పఠించటం గురించి 511
- ఒకే రకాతులో రెండు సూరాలను పఠించటం.... క్రమబద్ధతకు భిన్నంగా సూరాలను పఠించటం... ఇదంతా ధర్మసమ్మతమే 512
- నాలుగు రకాతుల నమాజులోని చివరి రెండు రకాతులలో కేవలం ఫాతిహా సూరాను మాత్రమే చదవటం 514
- జొహర్ మరియు అసర్ నమాజులలో ఖురాను వాక్యాలను మెల్లగా పఠించటం 514
- ఒకవేళ ఇమామ్ సిర్రి నమాజులో ఏదైనా ఖుర్ఆన్ వాక్యాన్ని బిగ్గరగా చదివితే మరియు దానిని ముఖ్తదీలు వింటే అందులో దోషమేమీ లేదు 515
- మొదటి రకాతును పొడిగించి నమాజు చెయ్యటం గురించి 515

- ఇమామ్ గనక (బిగ్గరగా చేసే నమాజులో) 'ఆమీన్' అని బిగ్గరగా అంటే, అది ధర్మసమ్మతమేనా? 515
- 'ఆమీన్' అని పలికే దాని యొక్క ఔన్నత్యం 516
- ముఖ్తదీలు బిగ్గరగా 'ఆమీన్' అని పలకటం గురించి 516
- నమాజు పంక్తిలో కలవక మునుపే రుకూ చెయ్యటం ధర్మసమ్మతమేనా? 516
- రుకూ చేసేటప్పుడు కూడా తక్బీర్ చెప్పటం..... 517
- సజ్దా చేసేటప్పుడు కూడా తక్బీర్ చెప్పటం 517
- సజ్దా చేసి నిలబడినప్పుడు తక్బీర్ (అల్లాహు అక్బర్) అని పలకటం 518
- రుకూ చేసినప్పుడు చేతుల్ని మోకాళ్ళపై పెట్టటం 519
- ఒకవేళ రుకూను సరియైన రీతిలో, తృప్తికరంగా చెయ్యకపోయినట్లయితే.... 519
- రుకూ చేసినప్పుడు వీపును తిన్నగా, వంపు లేకుండా ఉంచాలి 519
- రుకూను పూర్తిగా చేయనటువంటి వ్యక్తిని మళ్ళీ నమాజు చెయ్యమని దైవప్రవక్త (స) ఆజ్ఞాపించటం 520
- రుకూలో ఏ దుఆ చెయ్యాలి? 520
- ఇమామ్ మరియు ముఖ్తదీలు రుకూలో నుంచి శిరస్సు ఎత్తి ఏమి అనాలి? 521
- 'రబ్బనా వలకల్ హమ్ద్' అని పఠించే దాని యొక్క ఔన్నత్యం 521
- రుకూలో నుంచి శిరస్సును పైకి ఎత్తిన తరువాత నెమ్మదిగా, ప్రశాంతంగా, నిటారుగా నిలబడటం; 523
- సజ్దా కోసం 'అల్లాహు అక్బర్' అంటూ నేలమీద వంగాలి 524
- సజ్దా యొక్క ఘనత 526
- సజ్దాలో ఉన్నప్పుడు రెండు బాహువులను విడిగా, దూరంగా ఉంచాలి ఇంకా కడుపును తొడలకు తగలకుండా వేరుగా ఉంచాలి 530
- సజ్దా చేసేటప్పుడు కాలి వ్రేళ్లను ఖిబ్లా వైపునకు పెట్టి ఉంచాలి 530
- ఏడు ఎముకలపై సజ్దా చెయ్యటం 530
- సజ్దాలో ముక్కును కూడా నేలపై ఆనించటం 531
- బురదలో కూడా ముక్కును నేలపై ఆనించటం 531

- నమాజులో ఉన్నప్పుడు బట్టల్ని ముడివేసుకోవడం; సర్దుకోవటం, కప్పుకోవటం అనే విషయాలను గురించి 532
- సజ్దాలో ఉన్నప్పుడు వెంట్రుకలను సరిచేసుకోకూడదు 533
- నమాజ్‌లో ఉన్నప్పుడు బట్టలు సరిచేసుకోకూడదు 533
- సజ్దాలో ఉన్నప్పుడు అల్లాహ్‌ను స్తుతించటం మరియు దుఆ చెయ్యటం- అనే విషయాలను గురించి 533
- రెండు సజ్దాల మధ్య కొంచెం సేపు కూర్చోవటం 533
- సజ్దాలో ఉన్నప్పుడు మీ రెండు మోచేతులను (పశువుల మాదిరిగా) నేలపై పరచుకూడదు 535
- బేసి రకాతుల తరువాత తిన్నగా కూర్చోవటం మరియు లేవటం గురించి 535
- ఒక రకాతు పూర్తిచేసిన తరువాత లేచి నిలబడదలచినపుడు నేలపై ఎలా ఆనుకోవాలి? (నేలను ఎలా ఆధారంగా తీసుకోవాలి) 535
- రెండు రకాతులు చేసిన తరువాత లేచి నిలబడినప్పుడు తక్బీర్ (అల్లాహు అక్బర్) పలకాలి 536
- అత్తహియ్యాత్ కోసం ఎలా కూర్చోవటం సున్నత్ (దైవప్రవక్త(స)గారి సంప్రదాయం). ... 537
- మొదటి ఖాయిదాలో తషహ్హుద్ పఠించడం. 538
- రెండో ఖాయిదాలో తషహ్హుద్ పఠించటం 538
- (తషహ్హుద్ తరువాత) సలామ్‌కు ముందు ఏ దుఆను పఠించాలి? 539
- తషహ్హుద్ తరువాత చేసే దుఆను గురించి మరియు ఈ దుఆను పఠించటం వాజిబ్ కాదు 540
- ఒకవేళ నమాజులో ఉన్నప్పుడు నుదుటికిగానీ లేదా ముక్కుకుగానీ మట్టి తగిలితే, నమాజు పూర్తి చేయనంతవరకు దానిని తుడుచుకోరాదు 541
- 'తస్లీమ్' అంటే ముఖాన్ని కుడివైపునకూ ఆ తరువాత ఎడమ వైపునకూ త్రిప్పుతూ అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహ్ అని అనటం 541
- ఇమామ్ 'తస్లీమ్' సలామ్ చెప్పగానే ముఖ్తదీలు కూడా 'తస్లీమ్' చెప్పాలి 541

- ఇమామ్‌కు సలామ్ చేసే అవసరం లేదు. కేవలం నమాజుకు సంబంధించిన రెండు సలాములే సరిపోతాయి 542
- నమాజు పూర్తి అయిన తరువాత అల్లాహ్ పవిత్ర నామాన్ని స్మరించటం 543
- తస్లీమ్ చేసి నమాజ్‌ను ముగించిన తరువాత, ఇమామ్ తన ముఖాన్ని ముఖ్తదీల వైపునకు తిప్పాలి 544
- సలామ్ చేసిన తరువాత ఇమామ్ అదే స్థలంలో ఆగి నఫిల్ మొదలైన నమాజులను చెయ్యవచ్చు. 545
- ఇమామ్ ప్రజలచేత నమాజు చేయించిన తరువాత ఏదైనా ముఖ్యమైన పని జ్ఞాపకం వచ్చినట్లయితే ... 546
- నమాజు చేసిన తరువాత కుడి వైపునకుగానీ లేదా ఎడమ వైపునకుగానీ తిరిగి కూర్చోవటం.... 547
- వెల్లుల్లి, ఉల్లిపాయల గురించి చెప్పబడిన విషయం .... 547
- బాలురు వుజూ చేసుకోవటం; గుసుల్ చేసుకోవటం మరియు పరిశుభ్రతను పాటించటం వారి విషయంలో ఎప్పుడు వాజిబ్ అవుతాయి? 548
- రాత్రి సమయంలోనూ, చీకటిలోనూ స్త్రీలు మసీదులకు పోవటం 551
- ప్రజలు విద్వాంసుడైన ఇమామ్ నిలబడే వరకు నిరీక్షించటం 551
- మహిళలు పురుషుల వెనుక నిలబడి నమాజు చెయ్యటం 552
- ఉదయం నమాజు చేసిన తరువాత మహిళలు వెంటనే వెళ్ళిపోవాలి మరియు మస్జిద్‌లో కొంచెంసేపు మాత్రమే ఆగాలి 553
- మస్జిద్‌కు వెళ్ళే విషయంలో ఒక స్త్రీ తన భర్త అనుమతిని తప్పనిసరిగా తీసుకోవాలి 553

# భూమిక

'హదీసు'కు సంబంధించిన ముఖ్యమయిన, అవసరమయిన చర్చలన్నీ ఈ క్లుప్తమయిన 'భూమిక'లో చేర్చడం సాధ్యపడదు. వీటిగ్గాను ప్రత్యేకంగా వేరు రచన అవసరం. ప్రస్తుతానికి హదీసు సంకలనం, సంచయనాలకు సంబంధించిన సంక్షిప్త మయిన ఒక స్వరూపాన్ని పఠితల ముందుంచడం జరిగింది. ప్రవక్త ప్రవచనాల అమూల్యమయిన సంపద గత 13 వందల ఏళ్ళుగా ఎన్నెన్ని దశలు దాటుకుంటూ మన వరకు చేరిందో విజ్ఞతకు, వివేచనకు, మార్గదర్శకత్వానికి మూలమయిన ఈ వెలలేని ఖజానా తమ తరువాతి తరాలకు భద్రంగా చేరవెయ్యడానికి ఏయే పవిత్రా త్మలు తమ జీవితాలను అంకితం చేశాయో, అవసరమైతే తమ ప్రాణాలకు సైతం ఎలా తెగించి ఈ కార్యాన్ని నిర్వహించాయో కాస్తయినా బోధపరచడానికి ఇందులో కృషి జరిగింది.

ప్రవక్త ప్రవచనాలు మనకు మూడు విధాలుగా చేరాయి.

1. ముస్లిమ్ సముదాయం నిరంతర ఆచరణ
2. లిఖితపూర్వకంగా భద్రపరిచిన సంకలనాలు, పుస్తకాలు.
3. జ్ఞాపకశక్తి ఆధారంగా ఉల్లేఖన ప్రక్రియ- అంటే పాఠ్య పఠనాల ద్వారా.

ఈ విధంగా సంచయనం, సంకలనం, రచనలు జరిగిన మొత్తం కాలాన్ని నాలుగు దశలుగా విభజించవచ్చు.

1. ప్రవక్త కాలం నుంచి మొదటి శతాబ్ది హిజ్రీ వరకు
2. మొదటి శతాబ్ది మొదలుకుని రెండవ అర్థ శతాబ్ది వరకు
3. రెండవ అర్థ శతాబ్ది మొదలుగా నాల్గవ శతాబ్ది చివరి వరకు.
4. అయిదవ శతాబ్ది మొదలుకుని ఇంకా కొనసాగుతోంది.

## మొదటి దశ

ఈ కాలంలో హదీసు సంచయన కర్తలు, ఆనాటి లిఖిత ప్రతులు, సంచయనాల వివరాలు ఇలా ఉన్నాయి.

## ప్రఖ్యాత హదీసు స్మర్తలు

| సంఖ్య | పేరు | మరణం | వయసు | ఉల్లేఖనాలు |
|---|---|---|---|---|
| 1. | హజ్రత్ అబూహురైరా (అబ్దుర్రహ్మాన్) శిష్యులు 800 | హి.59 | 78 | 5374 |
| 2. | హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ | హి.68 | 71 | 2660 |
| 3. | హజ్రత్ ఆయెషా సిద్దికా | హి.58 | 67 | 2210 |
| 4. | హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ | హి.73 | 84 | 1630 |
| 5. | హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ | హి.78 | 94 | 1560 |
| 6. | హజ్రత్ అనస్ బిన్ మాలిక్ | హి. 93 | 103 | 1286 |
| 7. | హజ్రత్ అబూ సయీద్ ఖుద్రి | హి. 74 | 84 | 1170 |

వెయ్యికన్నా ఎక్కువ హదీసులు జ్ఞాపకమున్న ఘనులయిన ప్రవక్త సహచరులు వీరు. వీరుకాక హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (హి.63), హజ్రత్ అలీ (హి. 40), హజ్రత్ ఉమర్ ఫారూక్ (హి. 23) వీరంతా 500 నుంచి వెయ్యి వరకు హదీసులు ఉల్లేఖించినవారు.

అలాగే హజ్రత్ అబూబక్ర్ (హి. 13), హజ్రత్ ఉస్మాన్ (హి.36), హజ్రత్ ఉమ్మె సల్మా (హి.59), హజ్రత్ అబూ మూసా అష్అరీ (హి.52), హజ్రత్ అబూజర్ గిఫ్ఫారి (హి.32), హజ్రత్ అబూ అయ్యూబ్ అన్సారి(హి. 51), హజ్రత్ ఉబైబిన్ కఅబ్(హి.19), హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (హి.18)- వీరంతా వందకు పైగా 500కు తక్కువగా హదీసులు ఉల్లేఖించారు.

వీరేకాక ఆ కాలంలోని గొప్ప అనుచర గణాన్నీ మరువలేము. వారి అనన్య మయిన పరిశ్రమ వల్లనే ప్రవక్త సంప్రదాయ సంపద అంతా ప్రవక్త అనుచర సముదాయానికి అందగలిగింది. ప్రళయం వరకూ తరగని ఈ సంపద ద్వారా ముస్లిమ్ సముదాయం ప్రయోజనం పొందుతూనే ఉంటుంది.

కొందరు మహనీయుల పరిచయం క్రిందనిస్తున్నాము.

1. **సయీద్ బిన్ ముసయ్యిబ్ :** ఫారూకీ రోజుల్లో రెండవ సంవత్సరం మదీనాలో పుట్టారు. హి. 105లో మరణించారు.
   హజ్రత్ ఉస్మాన్, హజ్రత్ ఆయెషా, హజ్రత్ అబూ హురైరా, హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (ర) ద్వారా హదీసు విద్యనభ్యసించారు.
2. **ఉర్వా బిన్ జుబైర్ :** ఈయన మదీనాకు చెందిన ప్రముఖ పండితుల్లో

పరిగణించబడతారు. హజ్రత్ ఆయెషా అక్క కుమారులు. అధికాంశం తన పిన్ని చెప్పిన హదీసులను ఉల్లేఖించారు. ఇంకా హజ్రత్ అబూ హురైరా, హజ్రత్ జైద్ బిన్ సాబిత్ వద్ద కూడా శిష్యరికం చేసిన ఘనత ఉంది. ఈయన శిష్యుల్లో సాలిహ్ బిన్ కైసాన్, ఇమామ్ జుహ్రి లాంటి పండితులున్నారు. ఈయన హి.94లో పరమపదించారు.

3. **సాలిమ్ బిన్ అబ్దుల్లా బిన్ఉమర్:** మదీనాకు చెందిన 7 గురు షరీఅత్ వేత్తల్లో ఈయన్ని గణిస్తారు. ఈయన తన తండ్రి గారు, ఇతర ప్రవక్త సహచరుల ద్వారా హదీసు పాండిత్యాన్ని గడించారు. నాఫె జుహ్రి తదితర ప్రముఖ అనుచరులు ఈయన శిష్యులు. హి. 106లో మరణించారు.

4. **నాఫె మౌలా అబ్దుల్లా బిన్ ఉమర్:** వీరు హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ శిష్యుల్లో ప్రముఖులు, ఇమామ్ మాలిక్కు గురువు. హదీసువేత్తల దృష్టిలో ఈ ప్రమాణ పరంపర (మాలిక్ నాఫె నుండి, ఆయన అబ్దుల్లా బిన్ ఉమర్ నుండి, ఆయన దైవ సందేశహరుల నుండి) సిల్సిలతుజ్జహబ్ (స్వర్ణ పరంపర)గా పరిగణించ బడుతుంది. ఈయన హి.117లో దివంగతులయ్యారు.

## తొలి దశలోని లిఖిత సంపద

1. **సహీఫా సాదికా:** ఇది హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (హి.13-వయసు 77) సంకలనం చేసింది.

   హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్కు రచన, సంకలనాల అభిరుచి మెండుగా ఉండేది. దైవ సందేశహరులు పలికే ప్రతి మాటను రాసుకునేవారు. ఈ విషయంలో స్వయాన ప్రవక్త మహనీయులు ఆయనకు అనుమతినిచ్చారు. ఈ సంకలనంలో ఒక వెయ్యి హదీసులుండేవి. చాలాకాలం వరకు వారి వంశంలో భద్రంగా ఉండేవి. ఇప్పుడు అది ముస్నద్ ఇమామ్ అహ్మద్లో ఒక భాగమయి పోయింది.

2. **సహీఫా సహీహా:** సంకలన కర్త, హుమామ్ బిన్ మునబ్బిహ్ (హి.101). వీరు హజ్రత్ అబూ హురైరా గారి ప్రముఖ శిష్యుల్లో ఒకరు. ఈయన తన గురువు ఉల్లేఖనాలన్నింటినీ ఒకేచోట గ్రంథస్థం చేసుకున్నారు. దాని రాత ప్రతులు బెర్లిన్, డెమాస్కస్ గ్రంథాలయాల్లో ఉన్నాయి. ఇంకా ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ తన విఖ్యాత ముస్నద్లోనూ 'అబూ హురైరా' అన్న శీర్షికన ఈ మొత్తం పుస్తకాన్ని యధాతథంగా చేర్చారు. (ముస్నద్ అహ్మద్, సంపుటి 2, పుటలు

312- 318) ఈ సంకలనం కొన్నేళ్ళ క్రితం డాక్టర్ హమీదుల్లా (ప్యారిస్) ప్రయత్నాల ఫలితంగా హైదరాబాద్‌లో ప్రచురించడం జరిగింది. ఇందులో 138 ఉల్లేఖనాలున్నాయి.

ఈ సహీఫా, హజ్రత్ అబూ హురైరా ఉల్లేఖనాలన్నింటిలోని ఒక భాగం మాత్రమే. దీని ఉల్లేఖనాలు అనేకం బుఖారి, ముస్లిమ్ గ్రంథాలలోనూ దొరుకుతాయి. పదాలు ఒకేలాగుంటాయి. పెద్ద వ్యత్యాసం కనిపించదు.

3. **బషీర్ బిన్ సహీక్:** హజ్రత్ అబూహురైరా శిష్యుల్లో రెండవ వారు. ఈయన కూడా ఒక సంకలనం తయారు చేశారు. దీన్ని ఈయన హజ్రత్ అబూ హురైరాకు చివరి రోజుల్లో వినిపించి ధృవీకరించుకున్నారు.

4. **ముస్నద్ అబూహురైరా :** దీని ప్రతులు సహచరుల కాలంలోనే గ్రంథస్థమయ్యాయి. దీని ఒక ప్రతి హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ తండ్రి, అబ్దుల్ అజీజ్ బిన్ మర్వాన్ (ఈజిప్ట్ గవర్నర్ హి.86) వద్ద కూడా ఉండేది. అబ్దుల్ అజీజ్ బిన్ మర్వాన్ కసీరా బిన్ ముర్రాకు, 'నీ వద్ద సహచరులు ఉల్లేఖించిన హదీసులుంటే వాటిని వ్రాసి పంపు. హజ్రత్ అబూ హురైరా హదీసులు అక్కరలేదు. అవి నా వద్ద గ్రంథస్థమయి ఉన్నాయి' అని వ్రాశారు. 'ముస్నద్ అబూ హురైరా' గ్రంథ ప్రతి ఒకటి, ఇమామ్ ఇబ్ను తయిమియ్య వ్రాసినది జర్మనీ గ్రంథాలయంలో భద్రంగా ఉంది.

5. **సహీఫా హజ్రత్ అలీ :** ఇమామ్ బుఖారి విశదీకరించిన దాని ప్రకారం, ఇది చాలా ఘనమయిన సంపుటం. ఇందులో జకాత్, మదీనా పవిత్రత, హజ్జతుల్ విదా ప్రసంగం, ఇస్లామీయ రాజ్యాంగ అంశాలు లాంటి విషయాలు అనేకం ప్రస్తావించి వున్నాయి.

6. **ప్రవక్త మహనీయుని ప్రసంగ పాఠం :** మక్కా ప్రవేశం నాడు, అబూ షా యమని కోరిక మేరకు దైవ ప్రవక్త తన ప్రసంగాన్ని సవివరంగా రాయించారు. ఈ ప్రసంగంలో మానవ హక్కులకు సంబంధించిన ముఖ్యమయిన వివరాలున్నాయి.

7. **సహీఫా హజ్రత్ జాబిర్ :** హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా ఉల్లేఖనాలను ఆయన శిష్య గణం, వహబ్ బిన్ మునబ్బ(హి.110), సులైమాన్ బిన్ కైస్ లష్కరి వ్రాత మూలకంగా సంకలనం చేసుకున్నారు. ఈ సంకలనంలో హజ్ విధి నిషేధాలు, వీడ్కోలు హజ్ ప్రసంగం ఉన్నాయి.

8. **హజ్రత్ ఆయిషా(ర) ఉల్లేఖనాలు** : హజ్రత్ ఆయెషా ఉల్లేఖనాలను ఆవిడ శిష్యుడు ఉర్వా బిన్ జుబైర్ వ్రాసి భద్రపరిచారు.
9. **ఇబ్ను అబ్బాస్ ఉల్లేఖనాలు** : హజ్రత్ అబ్దుల్లా ఇబ్ను అబ్బాస్ ఉల్లేఖనాల అనేక సంకలనాలున్నాయి. హజ్రత్ సయీద్ బిన్ జుబైర్ తాబయీ కూడా ఈయన ఉల్లేఖనాలను వ్రాసి సంకలనం చేసుకున్నారు.
10. **అనస్ బిన్ మాలిక్ సహీఫాలు:** సయీద్ బిన్ హిలాల్ ప్రకారం, 'హజ్రత్ అనస్ తాను వ్రాసిపెట్టుకున్న ప్రతుల్ని మాకు చూపి, 'ఈ ఉల్లేఖనాలు నేను స్వయంగా దైవ సందేశహరుని నోట విన్నాను, అప్పుడే రాసుకున్నాను, తరువాత ఆయన (స)కు వినిపించి ధృవీకరించుకున్నాను కూడా' అని అనేవారు.
11. **అమ్ర్ బిన్ హజ్మ్** : ఈయన్ని యమన్ గవర్నరుగా నియమిస్తూ పంపేటప్పుడు ప్రవక్త మహనీయులు రాతమూలకంగా ఒక సూచన పత్రాన్ని ఇచ్చి పంపారు. ఈయన ఆ సూచనాపత్రాన్ని భద్రపరచటమేకాక దైవప్రవక్త ఇచ్చిన ఇంకా 21 ఆదేశ పత్రాలను జతచేసి ఒక పుస్తకాన్నే సంకలనం చేశారు.
12. **సమురః బిన్ జున్దబ్ పుస్తకం:** ఇది ఈయన తనయునికి వారసత్వంలో లభించింది. ఇందులోనూ ఉల్లేఖనాలు పెద్దసంఖ్యలో ఉన్నాయి.
13. **సహీఫా సఅద్ బిన్ ఉబాద:** హజ్రత్ సఅద్ బిన్ ఉబాద ప్రవక్త సహచరులు, అజ్ఞానకాలం నుండే చదవనూ, వ్రాయనూ వచ్చినవారు.
14. **హజ్రత్ నాఫె లేఖలు:** సులైమాన్ బిన్ మూసా ఉల్లేఖనం ప్రకారం, అబ్దుల్లా బిన్ ఉమర్ చెబుతూ ఉంటే నాఫె (ర) వ్రాస్తూ ఉండేవారు.
15. మ'అన్ ఉల్లేఖనం ప్రకారం, 'అబ్దుర్రహ్మాన్ బిన్ అబ్దుల్లా బిన్ మస్ఊద్(ర) నా ఎదుట గ్రంథం తీసి ప్రమాణం చేస్తూ 'ఇది నా తండ్రి అబ్దుల్లా బిన్ మస్ఊద్ చేతులారా వ్రాసిన గ్రంథం' అని అన్నారు.''

పరిశోధనను అన్వేషణను ఇంకా కొనసాగిస్తే ఇవి కాక ఇంకా ఎన్నో ఉదాహరణలు, సంఘటనలు దొరకవచ్చు.

ఈ దశలో మహనీయ సహచరులు, గొప్ప అనుచరులు ఇతోధికంగా తమ వ్యక్తిగత స్మృతిలోని హదీసుల్ని గ్రంథస్థం చెయ్యడం పట్ల శ్రద్ధ చూపారు. కాని రెండవ దశలో సంచయన, సంపాదన కార్యం ఇంకా విస్తృతి పొందింది. హదీసు సంకలనకర్తలు తమకు సొంతంగా తెలిసినవాటితోపాటు తమ నగరం, ప్రాంతంలోని పండితుల్ని కలుసుకుని వారి ఉల్లేఖనాలను సయితం క్రమబద్ధంచేశారు.

## రెండవ దశ

ఈ దశ దాదాపు రెండవ శతాబ్ది (హి|జ్రీ) తొలి యాభయేళ్ళకు ముగుస్తుంది. ఈ దశలో అనుచరుల ఒక పెద్ద వర్గం సిద్ధమయింది. ఈ వర్గంలోనివారు తొలి దశలోని లిఖిత సంపదనంతా విస్తృత సంకలనాలతో క్రోడీకరించారు.

## హదీసు సంకలన కర్తలు

**1. ముహమ్మద్ బిన్ షిహాబ్ జుహ్రీ (మ : హి.124)** : ఈయనను సమకాలీన హదీసువేత్తలలో ముఖ్యులుగా పరిగణించేవారు. ఈయన హదీసు విద్యను దిగువ పేర్కొన్న మహనీయ వ్యక్తుల ద్వారా అభ్యసించారు.

**సహచరుల్లో** : 1. అబ్దుల్లా బిన్ ఉమర్(రజి) 2. అనస్ బిన్ మాలిక్ (ర) 3. సహల్ బిన్ సఅద్(ర).

**అనుచరుల్లో** : సయీద్ బిన్ ముసయ్యిబ్, మహ్మూద్ బిన్ రబీ ప్రభృతులు.

ఈయన గారి శిష్యగణంలో, ఇమామ్ ఔజాయి, ఇమామ్ మాలిక్, సుఫియాన్ బిన్ ఉయియ్యన వంటి హదీసువేత్తలున్నారు. ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ హి.శ. 101లో ఈయనకు హదీసులు సంకలనం చేసే కార్యాన్ని అప్పగించారు. ఈయనతోపాటు మదీనా గవర్నరు అబూబక్ర్ ముహమ్మద్ బిన్ ఉమర్ బిన్ హజ్మ్‌కు ఆదేశాలు పంపి, ఉమ్రా బిన్తు అబ్దుర్రహ్మాన్, కాసిమ్ బిన్ ముహమ్మద్ వద్ద వున్న హదీసు భండారాన్నీ గ్రంథస్థం చెయ్యమని ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ పురమాయించారు.

పైన పేర్కొన్న ఉమ్రా, హజ్రత్ ఆయెషాకు ముఖ్య శిష్యురాలు. కాసిమ్ బిన్ ముహమ్మద్ ఆవిడ సోదరుని కొడుకు. హజ్రత్ ఆయెషా తన సంరక్షణలో వీరికి శిక్షణ, బోధనలు గరిపారు.

ఇంతేకాక హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ ఇస్లామీయ రాజ్యంలో బాధ్యతాయుత స్థానంలో ఉన్న నాయకులందరినీ హదీసుల్ని కూడబెట్టాలని, వాటిని క్రమబద్ధం చేయాలన్న తాకీదుతో ఫర్మానాలు జారీచేశారు. ఫలితంగా హదీసు పెను గ్రంథాలే రాజధాని నగరమయిన డెమాస్కస్ చేరాయి. ఖలీఫా వాటి నకళ్ళను రాజ్యంలో మూల మూలన చేరవేశారు.

ఇమామ్ జుహ్రీ హదీసు సంకలనాన్ని సిద్ధం చేసిన తరువాత ఆ కాలంలోని ఇతర విద్యావంతులు సయితం సంకలనం, సంపాదన కార్యక్రమాలు చేపట్టారు.

2. అబ్దుల్ మలిక్ బిన్ జరీహ్ (హి. 150) మక్కాలో ఈ మహత్కార్యాన్ని చేపట్టారు.

3. ఇమామ్ ఔజాయి (హి. 157) - సిరియాలో

4. ముఅమ్మర్ బిన్ రాషిద్ (హి.153) - యమన్‌లో

5. ఇమామ్ సుఫియాన్ సౌరి (హి. 161)- కూఫాలో

6. ఇమామ్ హమ్మాద్ బిన్ సల్లమ(హి. 167) - బస్రాలో

7. ఇమామ్ అబ్దుల్లా బిన్ ముబారక్ (హి. 181)- ఖురాసాన్‌లో

వీరంతా హదీసుల సంకలనం, వాటి క్రమబద్ధీకరణ కృషిలో ముమ్ముందు ఉండిన మహనీయులు.

8. ఇమామ్ మాలిక్‌బిన్ అనస్(హి.93- 179) : మదీనాలో ఇమామ్ జుహ్రీ తరువాత ప్రవక్త హదీసు సంకలనా శుభకార్యం చేపట్టే ఘనత తనకే దక్కింది. ఈయన నాఫె, జుహ్రీ ఇంకా ఇతర ప్రముఖ పండితుల వద్ద విద్యనభ్యసించారు. ఈయన గురువుల సంఖ్య 900 వరకు ఉందని అంటారు. ఈ విద్యామృత సరోవరం నుండి హిజాజ్, సిరియా, ఇరాక్, పాలస్తీనా, ఈజిప్ట్, ఆఫ్రికా, స్పెయిన్‌కు చెందిన వేలాది ప్రవక్త సంప్రదాయ పిపాసువులు తనివితీరా గ్రోలారు. ఈయన శిష్యుల్లో లైస్ బిన్ సఅద్ (హి.175), ఇబ్ను ముబారక్ (హి. 181), ఇమామ్ షాఫియీ (హి. 204), ఇమామ్ ముహమ్మద్ బిన్ హసనుష్షైబాని (హి.189) లాంటి మహామహులున్నారు.

ఈ దశలో హదీసు సంకలనాలు అనేకం జరిగాయి. వీటిలో ఇమామ్ మాలిక్ సంకలనం చేసిన ముఅత్తాకు ప్రత్యేకస్థానముంది. దీని సంకలనా కాలం హి.130 నుండి 141 మధ్యన ఉంటుంది. మొత్తం ఉల్లేఖనాల సంఖ్య 1700. వీటిలో నుంచి మర్ఫూ 600; ముర్సల్ 228, మౌకూఫ్ 613; అనుచరుల సూక్తులు 285 ఉన్నాయి. ఈ దశలోని కొన్ని ఇతర సంకలనాల పేర్లు : 1. జామె సుఫియాన్ సౌరి (హి.161) 2. జామె ఇబ్ను ముబారక్ (హి.181); 3. జామె ఇమామ్ ఔజాయి (హి.157), 4. జామె ఇబ్ను జరీజ్ (హి.150) 5. కితాబుల్ ఖరాజ్, కాజీ అబూ యూసుఫ్ (హి.183); 6. కితాబుల్ అసార్, ఇమామ్ ముహమ్మద్(హి.189)

ఈ దశలో ప్రవక్త మహనీయుని హదీసులు, సహచరుల అనుచరుల ఫత్వాలు (తీర్పులు)- అన్నింటినీ ఒకేగ్రంథంలో సంచయనం చేసేవారు. అయితే ఫలానా విషయం సహచరుల లేక అనుచరుల సూక్తి అని లేక ప్రవక్త(స) హదీసు అని విశదీకరించడం జరిగేది.

## మూడవ దశ

ఇది దాదాపు హిజ్రీ 150 మొదలు 400 వరకు ఉంటుంది. ఈ దశ ప్రత్యేకతలు ఇవి :

1. ప్రవక్త ప్రవచనాలను (హదీసులను) సహచరుల 'ఆసార్' (ప్రభావకాలు), అనుచరుల సూక్తుల నుండి వేరు చేసి సంకలనం చెయ్యడం జరిగింది.
2. విశ్వసనీయమయిన ఉల్లేఖనాల సంకలనాలు వేరుగా తయారయ్యాయి. ఈ విధంగా, అన్వేషణ, పరిశోధన, అనుశీలనల తరువాత రెండవ దశలోని రచనలు మూడవ దశలో ఘనమయిన పుస్తకాలుగా రూపొందాయి.
3. ఈ దశలో ఉల్లేఖనాలను ప్రోగు చెయ్యడమేకాక హదీసు శాస్త్రాన్ని భద్రపరచడానికి హదీసువేత్తలు వందకు పైగా వివిధ విద్యల్ని ఆవిష్కరించారు. వాటి మీద ఇప్పటివరకు వేలాది పుస్తకాల రచన జరిగింది.

   'వారు చేసిన కృషికి దైవానికి కృతజ్ఞతలు, దైవం వారి ఆ కృషికి గాను ఉత్తమమయిన ప్రతిఫలాన్నివ్వుగాక'

   ఆ విద్యల్లో కొన్నింటి క్లుప్తమయిన పరిచయం

## 1. అస్మాఉర్రిజాల్ విద్య

ఈ విద్యలో ఉల్లేఖకుల జీవిత విశేషాలు, జనన కాలం, వారి గురువులు, శిష్యులు ఇత్యాధి విషయాల వివరాలు; విద్యాప్రాప్తికై చేసిన ప్రయాణాలు, వారి విశ్వసనీయత ప్రామాణాన్ని గురించి హదీసువేత్తల నిర్ణయాలున్నాయి. ఇది చాలా విస్తృతమయిన శాస్త్రం, ఆసక్తికరమయింది కూడా.

కొందరు పక్షపాత బుద్ధి గల ప్రాచ్య విద్యా నిపుణులయిన పాశ్చాత్యులు (Orientalists) కూడా దీని ప్రశస్తతను కొనియాడకుండా ఉండలేకపోయారు. ఈ శాస్త్రం వల్ల అయిదు లక్షల మంది ఉల్లేఖకుల జీవన వృత్తాంతాలు భద్రంగా ఉన్నాయి. ఈ ప్రత్యేకతలో ముస్లిమ్ పండితులకు సరితూగేవారు దొరకడం అసాధ్యం. ఈ శాస్త్రంలో వందలాది పుస్తకాలు రచించారు. కొన్నింటి పేర్లు :

**అ)** **తహ్జీబుల్ కమాల్ - రచయిత :** ఇమామ్ యూసుఫ్ (హి.742). ఈ శాస్త్రంలో ఇది అత్యంత ప్రామాణికమయిన గ్రంథం.

**ఆ)** **తహ్జీబుత్తహ్జీబ్ :** రచయిత - హాఫిజ్ ఇబ్ను హిజ్ర్, బుఖారీ టీకా కర్త, ఈగ్రంథం 12 సంపుటాల్లో ఉంది; హైదరాబాద్ (దాయరతుల్ మఆరిఫ్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రచురించింది)

ఇ) తజ్‌కిరతుల్ హుఫ్ఫాజ్ - రచయిత : అల్లామా జహబి (హి. 748)

## 2. ముస్తలహుల్ హదీస్ విద్య

ఇది హదీసు విద్యకు ప్రాతిపదిక సూత్రావళి. ఈ శాస్త్రం వెలుగులోనే హదీసుల స్థాయి, బలహీనతల నియమాలు తెలుస్తాయి.

ఈ శాస్త్రానికి సంబంధించిన ప్రఖ్యాత పుస్తకం 'ఉలూముల్ హదీసు' దీన్ని 'ముకద్దమ ఇబ్నుస్సలాహ్' అని కూడా అంటారు. రచయిత : అబూ ఉమర్, ఉస్మానిబ్నుస్సలాహ్ (హి. 577)

గత 100 ఏళ్ళల్లో హదీసు సూత్రావళి మీద రెండు గ్రంథాలు వెలువడ్డాయి.

**(అ) తౌజీహున్నజర్ - రచయిత:** అల్లామ తాహిర్ బిన్ సాలిహ్ అల్ జజాయిరీ (హి.1338)

**(ఆ) కవాయిదుత్తహదీసు - రచయిత :** అల్లామ సయ్యద్ జమాలుద్దీన్ కాసిమీ (హి.1332)

మొదటి పుస్తకం విషయ విస్తృతికి, రెండవది సక్రమ సంకలనానికి ఖ్యాతిగడించాయి.

## 3. గరీబుల్ హదీసు విద్య

ఈ శాస్త్రంలో హదీసుల్లోని కఠినపదాల శాబ్దిక అర్థాల పరిశోధన విరివిగా జరిగింది. ఈ శాస్త్రంలో ఇదికాక అల్లామ జమఖ్‌షరీ (హి.538) రచించిన అల్ ఫాయిక్, ఇబ్నుల్ అసీర్ (హి.606) రచించిన నిహాయ ప్రముఖమయినవి.

## 4. తఖ్‌రీజుల్ అహాదీస్ విద్య

ప్రముఖ ఖుర్ఆన్ వ్యాఖ్యాన గ్రంథాలు, ఫికహ్ గ్రంథాలు, సూఫీయిజానికి సంబంధించిన గ్రంథాలు, విశ్వాసాలకు సంబంధించిన గ్రంథాలు- వీటన్నింటిలో ప్రస్తావించిన ఉల్లేఖనాలకు మూల గ్రంథాలేవీ అన్న విషయం తెలుసుకోదలిస్తే ఈ శాస్త్రం ఉపయోగపడుతుంది. ఉదాహరణకు, 'హిదాయ' (బుర్హానుద్దీన్ అలీ బిన్ అబీబక్ర్ అల్ మర్గీనాని (హి. 592). 'ఇహ్‌యాఉల్ ఉలూమ్' (ఇమామ్ గజాలి -హి. 505)లలో అనేక ఉల్లేఖనాలు, ఎలాంటి ప్రామాణికత తెలుపకుండా, మూలాన్ని తెలుపకుండా ప్రస్తావనలోకి వచ్చాయి. ఎవరైనా ఆ ఉల్లేఖనాల ప్రామాణికత ఏ పాటిదని, ఏఏ ప్రముఖ హదీసు పుస్తకాల్లో అవి వచ్చాయని తెలుసుకోగోరితే ఈ శాస్త్రానికి సంబంధించిన పుస్తకాల్లో అవి లభ్యమవుతాయి. మొదట పేర్కొన్న పుస్తకం కోసం హాఫిజ్ జైలయి (హి. 792) రచించిన 'నసబుర్రాయ' అన్న పుస్తకాన్ని, హాఫిజ్ ఇబ్ను హిజ్ర్ అస్‌కలాని (హి.852) వ్రాసిన 'అద్దరాయ' అన్నదాన్నీ చూడవలసి

వుంటుంది. రెండవ పుస్తకంలోని హదీసుల కొరకు హాఫిజ్ జైనుద్దీన్ ఇరాకీ (హి. 808)రచించిన 'అల్ ముగ్నీ అన్ హమలిల్ అస్ఫార్' అనేది ఉచితమయింది.

## 5. అల్ అహదీసుల్ మౌజూఅ విద్య

ఈ శాస్త్రంలో పండితులు ప్రత్యేక పుస్తకాలు రచించారు. 'మౌజూ' (కల్పించిన-అబద్ధపు) ఉల్లేఖనాలను వేరుచేశారు. ఈ విషయంలో కాజీ షౌకాని (హి. 1255) రచించిన 'అల్ఫవాయిదుల్ మజ్మూఅ'తోపాటు హాఫిజ్ జలాలుద్దీన్ సియూతి (హి.911) వ్రాసిన 'అల్ లఆలి అల్ మస్నూఅ' ప్రముఖమయినవి.

## 6. అన్నాసిఖ్వల్ మన్సూఖ్ విద్య

ఈ శాస్త్రంలో ఇమామ్ ముహమ్మద్ బిన్ మూసా హాజమి హి.784- వయసు 35) రచించిన 'కితాబుల్ ఈ'తిబార్' చాలా ప్రామాణికమయింది. ఖ్యాతి గడించింది కూడా.

## 7. అత్ తౌఫీక్ బైనుల్ అహాదిస్- విద్య

ఈ శాస్త్రంలో, స్థూలంగా చూస్తే పరస్పర విరుద్ధంగా కనిపించే ఉల్లేఖనాల మధ్యసమాన అర్థాన్వయం చెయ్యడం జరిగింది. ప్రథమంగా ఇమామ్ షాఫియి (హి. 204) ఈ విషయాన్ని చర్చించారు. ఈయన వ్రాసిన పుస్తకం 'ముఖ్తలిఫుల్ హదీసు' అనే పేరుతో ఖ్యాతిగడించింది. ఇమామ్ తహావి (హి. 321) రచించిన 'ముష్కిలుల్ అసార్' అనే పుస్తకం కూడా ఈ శాస్త్రంలో ఉపయోగకరమయిన పుస్తకం.

## 8. అల్ ముఖ్తలిఫ్ వల్ ముఅత్తలిఫ్ విద్య

ఈ శాస్త్రంలో ముఖ్యంగా ఉల్లేఖన కర్తల పేర్లు, వాళ్ళ సంతానం, తండ్రి పేర్లు, బిరుదులు, తాత ముత్తాతల పేర్లు, లేక గురువుల పేర్లు ఒకేలా కనిపించిన వారి ప్రస్తావన వుంది. ఇలాంటి అనుమానాస్పద స్థితి వల్ల ఎరుగని వ్యక్తి అపార్థానికి గురయ్యే ఆస్కారముంది. ఈ శాస్త్రంలో హాఫిజ్ ఇబ్ను హిజ్ర్ విరచితమయిన 'తాబీర్ అల్ మున్తబహ్' అనే పుస్తకం చాలా సమగ్రమయింది.

## 9. అత్రాఫుల్ హదీస్ విద్య

ఈ శాస్త్రం ద్వారా ఏ ఉల్లేఖనం ఏ పుస్తకంలో ఉందో, దాని ఉల్లేఖనకర్తలెవరో తెలుస్తుంది. ఉదాహరణకు మీకు 'ఇన్నమల్ ఆమాలు బిన్నియాత్' అనే హదీసు

వాక్యం ఒకటి గుర్తుంది. అది ఎక్కడి నుండి లభించిందో, ఉల్లేఖనం పూర్తి పాఠ మేమిటో, ఉల్లేఖన కర్తలెవరో మీరు తెలుసుకోదలిస్తే ఈ శాస్త్రానికి సంబంధించిన పుస్తకాలను చూడవలసి వుంటుంది. ఈ శాస్త్రాన్ని హాఫిజ్ మజి (హి. 742) రచించిన 'తహఫతుల్ అష్రాఫ్' అన్న పుస్తకంలో సవివరంగా చర్చించడం జరిగింది. ఇందులో 'సిహాసిత్తా' (ఆరు అతి సవ్యమయిన హదీసు పుస్తకాలు)లోని ఉల్లేఖనాల పట్టిక మొత్తం వచ్చేసింది. ఈ పుస్తకంలో హాఫిజ్ అబూ యూసుఫ్ మజీ 26 సంవత్సరాలు వెచ్చించారు. ఎంతో కఠిన శ్రమతో దీన్ని పూర్తి చేశారాయన. నేటి ప్రాచ్య శాస్త్రాల పాశ్చాత్య నిపుణులు (Orientalists) ఇలాంటి పుస్తకాలను అనుసరించే కాస్త కొత్తరూపంలో హదీసుల పట్టిక ఒకటి తయారు చేశారు. ఉదాహరణకు 'కునూజుస్సున్నహ్' అనే పుస్తకం ఇంగ్లీషులో ప్రచురించారు. దాని అరబీ అనువాదం క్రీ.శ. 1934లో ఈజిప్ట్ నుండి వెలువడింది. ఇప్పుడొక విస్తృత పట్టిక 'అల్ము'జముల్ ముఫహ్రిస్' అనే పేరుతో సంకలనం చేస్తున్నారు. దీని 20 సంపుటాలు వెలువడ్డాయి.

## 10. ఫిక్హుల్ హదీస్

ఈ శాస్త్రంలో ధార్మిక ఆదేశాలకు సంబంధించిన హదీసుల మర్మ హేతువును, అందులో నిగూఢమయి ఉన్న వివేచనను ఆవిష్కరించడం జరిగింది. ఈ విషయం మీద హాఫిజ్ ఇబ్నుకయ్యిమ్ (హి. 751) రచించిన 'అలాముల్ మౌకియీన్' అన్న పుస్తకంతోపాటు షా వలీయుల్లా 'హుజ్జతుల్లాహుల్ బాలిగ' అనే పుస్తకం ప్రయోజన కరమయినవి. ఇవేకాక జీవితంలోని విభిన్న సమస్యల్ని స్పర్శిస్తూ పండితులు వేర్వేరు పుస్తకాలు రచించారు. ఉదాహరణకు ఆర్థిక విషయాలకు సంబంధించిన పుస్తకం 'కితాబుల్ అమ్వాల్'ని అబూ ఉబైదా కాసిమ్ బిన్ సల్లామ్ (హి.224) వ్రాశారు. అలాగే భూమి, సేద్యపు భూమి, ఉష్ర్ (పంటలో జకాత్) ఖరాజ్ ఇత్యాధి విషయాల మీద కాజీ అబూయూసుఫ్ వ్రాసిన 'కితాబుల్ ఖరాజ్' అత్యుత్తమ రచన. ఇంకా సున్నత్ (ప్రవక్త సంప్రదాయం) షరీఅత్‌కు మూలం అనడానికి, హదీసు తిరస్కారులు వ్యాపింపజేసిన అపార్థాలను తొలగించడానికి దిగువ పేర్కొన్న పుస్తకాలు చూడవచ్చు.

1) కితాబుల్ ఉమ్మ్ 7వ సంపుటం; 2) అల్ రిసాల (ఇమామ్ షాఫియి); 3) అల్ ముఆఫికాత్, నాల్గవ సంపుటం (అబూ ఇస్‌హాక్ షాతిబి (హి.790); 4) సవాఇకు ముర్సల, సం.2 (ఇబ్నుకయ్యిమ్), 5) అల్ అహ్కామ్ (ఇబ్ను హజ్మ్ ఉన్దులుసి హి.456); 6) తర్జుమానుస్సున్న (ఉర్దు, మౌలానా బద్రెఆలమ్, మీరఠీ); 7) ఇస్బాతుల్ ఖబర్

(మా తండ్రి గారు, మౌలానా హాఫిజ్ అబ్దుస్సత్తార్ హసన్, ఉమర్‌పూరి, హి. 1324, వయసు 34; 8) హదీసు, ఖుర్‌ఆన్ (మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది; 9) ఇన్కారె హదీస్ కా మన్జర్ ఔర్ పస్‌మన్జర్ (ఇఫ్తిఖార్ అహ్మద్ బల్ఖి), 10) కొంతకాలం ముందు అల్లామ ముస్తఫా సబాయి, అల్ ముస్లిమూన్ అనే పత్రికలో, హదీసులు తార్కిక నిదర్శనాలన్న విషయం మీద వ్యాసాల పరంపర ప్రారంభించారు. వాటి ఉర్దూ అనువాదం మౌలానా మలిక్ గులామ్ అలీ గారు చేశారు. ఈ పుస్తకం 'నాతె రసూల్' పేరుతో వెలువడింది.

హదీసు విద్యల చరిత్ర, తదితర సంబంధిత చర్చలకుగాను దిగువ ప్రస్తావించిన రచనలు సమగ్రమైనవి, ప్రయోజనకరమయినవి.

1) ముకద్దమ ఫత్‌హుల్ బారి (హాఫిజ్ ఇబ్ను హిజ్ర్); 2) జామె బయానుల్ ఇల్మ్ వ అహ్‌లిహీ, (హాఫిజ్ ఇబ్ను అబ్దుల్ బిర్ ఉందులుసి(హి.463) 3) ముఆరిఫతు ఉలూముల్ హదీస్ (ఇమామ్ హాకిమ్- హి.405); 4) ముకద్దమ తహాఫతుల్ అహూజీ (మౌలానా అబ్దుర్రహ్మాన్ ముబారక్‌పూరి- హి.1353) ఈ పుస్తకం కొత్తగా వచ్చిన పుస్తకాలన్నింటిలో సమగ్రమయింది, ప్రయోజనకరమయిందీను; అలాగే 5) ముకద్దమ ఫత్‌హుల్ ముల్హిమ్ (మౌలనా షబ్బీర్ అహ్మద్ ఉస్మాని); 6) తద్వీనెహదీస్ (ఉర్దూ-మౌలానా మనాజిర్ అహ్సన్ గీలాని)

## మూడవ దశలో హదీసు సంకలన కర్తలు

ఈ దశలోని ప్రముఖ ఖ్యాతిగాంచిన హదీసువేత్తల ప్రామాణిక గ్రంథాలను క్రింద పరిచయం చేస్తున్నాము.

1) ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (హి.164- 241) ఈయనగారి ప్రముఖ సంకలనం 'ముస్నద్ అహ్మద్' పేరుతో ఖ్యాతిగడించింది. ఇందులో 30 వేల ఉల్లేఖనాలున్నాయి. దీని సంపుటాలు 24. చెప్పుకోదగ్గ హదీసులన్నీ ఇందులో ఉన్నాయి. ఇందులో సంకలనా విధానం విషయశీర్షికనుబట్టికాక ఉల్లేఖన కర్త అయిన ప్రవక్త సహచరుని శీర్షికన జరిగింది. దీన్ని అధ్యాయాల రీత్యా అంటే విషయానుక్రమంగా తిరిగి కూర్చే పని హసనుల్ బన్నా షహీద్ తండ్రిగారు అయిన అహ్మద్ అబ్దుర్రహ్మాన్ సాఅతి ప్రారంభించారు. ఇప్పటివరకు 14 సంపుటాలు వెలువడ్డాయి. ఈజిప్ట్‌కే చెందిన ప్రముఖ పండితులు అహ్మద్ షాకిర్ కూడా ఈ సందర్భంలో పని చేస్తున్నారు. ఇప్పటివరకు 15 భాగాలు సంకలనమయ్యాయి.

2. ఇమామ్ ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్ అల్ బుఖారి (హి.194- 256) ఈయన గారి పుట్టుక సంవత్సరం అరబీ సంఖ్యా శాస్త్రం రీత్యా 'సిద్క్' (194) మరణ సంవత్సరం 'నూర్' (256) వస్తాయి. ఇమామ్ బుఖారి రచనల్లో అన్నింటికన్నా ప్రముఖమయింది, ప్రామాణికమయింది 'సహీహ్ బుఖారి' దాని పూర్తి పేరు 'అల్ జామి ఉస్సహీహుల్ ముస్నదుల్ ముఖ్తసర్ మిన్ ఉమూరు రసూలుల్లాహి సల్లల్లాహు అలైహి వ ఆలిహి వసల్లం వ అయ్యాముహ్.'

ఈ గ్రంథ సంకలనంలో 16 ఏళ్ళు పట్టాయి. ఆయన ద్వారా నేరుగా సహీహ్ బుఖారి చదివిన శిష్య గణం సంఖ్య 90వేల వరకు ఉంటుంది. కొన్ని పర్యాయాలు ఒకే సమావేశంలో హాజరైన వారి సంఖ్య 30వేల వరకు చేరేది. ఇలాంటి సమావేశాల్లో ఆయన చెబుతూ ఉండగా తిరిగి చెప్పి వ్రాయించే వారి సంఖ్య 300కు మించి ఉండేది. మొత్తం హదీసుల సంఖ్య 9684. అయితే పునరుక్తమయిన ఉల్లేఖనాలు (ముకర్రర్ రివాయాత్), అప్రామాణిక మయిన ఉల్లేఖనాలు (తాలీకాత్), సహచరుల సాక్ష్యాధారమయిన ఉల్లేఖనాలు (షవాహిద్ (అసార్), ముర్సల్ హదీసులను తీసివేస్తే మర్ఫూ ఉల్లేఖనాలు 623 మిగులుతాయి. ఇతర హదీసువేత్తలను పోల్చి చూస్తే ఉల్లేఖనకర్తలను ఏరివేసే ప్రమాణం ఈయన కాస్త ఉన్నతంగా పెట్టారు.

3. ఇమామ్ ముస్లిమ్ బిన్ హజ్జాజ్ కషీరి (హి.202- 261) ఇమామ్ బుఖారి, ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ ఈయన గురువుల్లోనూ, ఇమామ్ తిర్మిజీ, అబూ హాతిమ్ రాజి, అబూబక్ర్ బిన్ ఖజీమ ప్రభృతులు ఈయన శిష్యగణంలోని వారు. ఈయన సంకలనం 'సహీహ్ ముస్లిమ్' సంకలనాక్రమం రీత్యా ప్రముఖమయిందిగా పరిగణించబడుతుంది.

4. అబూ దావూద్ అష్అస్ బిన్ సులైమాన్ సజిస్తానీ (హి. 202- 275) ఈయన ప్రముఖ సంకలనం 'సునన్ అబూ దావూద్' పేరుతో ప్రఖ్యాతమయింది. ఇందులో అధికాంశం ధర్మశాస్త్ర ఆదేశాలకు సంబంధించిన ఉల్లేఖనాలను సమగ్ర రూపంలో ఒకచోట చేర్చడం జరిగింది. ఫికహ్‌కు సంబంధించిన, శాసనాంగానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఇది అత్యుత్తమ మూల గ్రంథమని చెప్పవచ్చు. ఇందులో 480 హదీసులున్నాయి.

5. ఇమామ్ అబూ ఈసా తిర్మిజి(హి. 209- 279) ఇందులో ఫికహ్‌కు సంబంధించిన విషయాలను, విభిన్న పంథాల వివరాలను విశదపరచడం జరిగింది.

6. ఇమామ్ అహ్మద్ బిన్ షుఅయిబ్ నసాయి (హి. 303) ఈయన సంకలనం పేరు 'అస్సునసుల్ ముజ్తబా'
7. ఇమామ్ ముహమ్మద్ బిన్ యజీద్ బిన్ మాజ కుజ్వయిని (హి. 273) ఈయన పుస్తకం సునన్ ఇబ్ను మాజ పేరుతో ప్రఖ్యాతమయింది.

ముస్నద్ అహ్మద్ తప్ప మిగతా 6గ్రంథాలను హదీసువేత్తల పరిభాషలో 'సిహాహ్ సిత్తా' అంటారు. కొందరు పండితులు ఇబ్ను మాజకు బదులు ముఅత్తా 'ఇమామ్ మాలిక్'ని సిహాహ్ సిత్తాలో ఒకటిగా పరిగణిస్తారు.

ఇవికాక ఆ దశలో ఇంకా అనేక ప్రయోజనకరమయిన, సమగ్రమయిన రచనలు, సంకలనాలు జరిగాయి. వాటిని వివరించడం ఇక్కడ సాధ్యపడదు. బుఖారి, ముస్లిమ్, తిర్మిజీ ఈ మూటిని 'జామె' అని అంటారు. అంటే వీటిలో విశ్వాసాలు, ఆరాధనలు, నైతక నియమాలు, వ్యవహారాలు తదితర సకల విషయాలకు సంబంధించిన హదీసులున్నాయన్నమాట. అబూ దావూద్, నసాయి, ఇబ్నుమాజ- వీటిని సునన్ అని అంటారు. అంటే వీటిలో క్రియాత్మక జీవితానికి సంబంధించిన ఉల్లేఖనాలు మటుకే ఉన్నాయని అర్థం.

## హదీసు గ్రంథాల వర్గీకరణ

హదీసువేత్తలు ఉల్లేఖనాల బలం, సవ్యతల ఆధారంగా హదీసు గ్రంథాలన్నింటినీ నాలుగు వర్గాలుగా విభజించారు.

1. ముఅత్తా ఇమామ్ మాలిక్, సహీహ్‌బుఖారి, సహీహ్ ముస్లిమ్. ఈ మూడు గ్రంథాలు, సవ్యత రీత్యాను, ఉల్లేఖనకర్తల విశ్వసనీయత దృష్ట్యాను అత్యున్నత స్థాయికి చెందినవి.
2. అబూ దావూద్, తిర్మిజి, నసాయి- ఈ గ్రంథాల ఉల్లేఖనకర్తలు కొందరు విశ్వసనీయత రీత్యా మొదటి వర్గానికి కాస్త దిగువన ఉన్నవారు. అయినా ఇవి విశ్వసనీయ గ్రంథాలే. ముస్నద్ అహ్మద్ కూడా వీటితో సమంగా పరిగణించబడుతుంది.
3. దారిమి (హి.225), ఇబ్ను మాజ, బైహాకి, దారుల్‌ఖుతని (హి.385), తబ్రానీ (హి.360) పుస్తకాలు, తహావి (హి.311) రచనలు, ముస్నద్‌షాఫియీ, ముస్తద్‌రక్ హాకిమ్ (హి. 405) - ఈ గ్రంథాలలో సహీహ్ (సవ్యమయినవి), జయీఫ్ (బలహీనమయినవి) అన్ని రకాల ఉల్లేఖనాలున్నాయి. కాని విశ్వసనీయమయిన ఉల్లేఖనాలే అధికంగా ఉన్నాయి.

4. ఇబ్ను జరీర్ తబ్రీ (హి.310) రచనలు, ఖతీబ్ బగ్దాదీ(హి.463) పుస్తకాలు, అబూ నయీమ్ (హి.403), ఇబ్ను అసాకర్ (హి.571), వైలమి, ఫిర్‌దౌస్ కృతికర్త (509), కామిల్ ఇబ్ను అదీ (హి.365), ఇబ్ను మర్దూయ (హి.410) సంకలనాలు, వాకిది(హి.207) ఇంకా ఇలాంటి ఇతర రచయితల పుస్తకాలు ఈ కోవకు చెందినవి. ఈ పుస్తకాలు కలగూర గంప లాంటివి. మౌజూ (కల్పిత) ఉల్లేఖనాలు కూడా వీటిలో అధికంగా చోటుచేసుకున్నాయి. సాధారణ మత బోధకులు, సూఫీ పండితులకు ఆధారాలు ఈ గ్రంథాలే. అయితే కష్టపడి ప్రక్షాళన జరిపితే ఈ సంకలనాల నుండి కూడా మణిమాణిక్యాలు వెదికి తీయవచ్చు.

## నాల్గవ దశ

ఈ దశ దాదాపు అయిదవ శతాబ్ది హిజ్రీ నుండి మొదలయింది. ఇంకా కొనసాగుతోంది. దీనికి పూర్వం మూడవ దశలో జరిగిన సంకలనా విధానం ముగిసింది. ఈ సుదీర్ఘ కాలంలో జరిగిన రచన, పరిశోధనా కార్యకలాపాల వివరాలు ఇవి:

1. ప్రముఖ హదీసు గ్రంథాల టీకా తాత్పర్యాలు, వివరణలు, ఇతర భాషల్లోకి అనువాదాలు జరిగాయి.
2. పైన పేర్కొన్న హదీసు శాస్త్రాల మీద అనేక రచనలు జరిగాయి. వాటి వ్యాఖ్యానాలు, వివరణలు, సంక్షిప్తాలు వ్రాయడం జరిగింది.
3. పండితులు తమ అభిరుచులకనుగుణంగా లేక అవసరాల రీత్యా మూడవ దశలో జరిగిన సంకలనాల నుండి హదీసులను ఎన్నుకుని ప్రయోజనకరమయిన కూర్పులు చేశారు. వాటిలో కొన్ని దిగువన ఇస్తున్నాము.

అ) మిష్కాతుల్ మసాబిహ్ (వలీయుద్దీన్ ఖతీబ్) ఇందులో విశ్వాసాలు, ఆరాధనలు, నైతిక నియమాలు, వ్యవహారాలు, సామాజిక నియమాలు, ప్రళయదిన వివరాలు ఇత్యాది విషయాలకు సంబంధించిన ఉల్లేఖనాలన్నీ సమకూర్చడం జరిగింది.

ఆ) రియాజుస్సాలిహీన్ (ఇమామ్ అబూ జక్రియ్యా యహ్యాబిన్ షరఫ్ నవవి- ఈయన 'ముస్లిమ్' గ్రంథానికి టీకా కూడా వ్రాశారు. హి.676) ఈ గ్రంథం అధికంగా నైతికత, మర్యాదలకు సంబంధించిన హదీసులున్న పుస్తకం. ప్రతి అధ్యాయం ప్రారంభంలో శీర్షికను బట్టి ఖుర్‌ఆన్ వచనాలను కూడా ఉటం

కించడం జరిగింది. ఇది ఈ గ్రంథం ప్రత్యేకత. సహీహ్‌బుఖారి సంకలనా విధానం కూడా ఇదే.

4) మున్తకల్ అఖ్‌బార్ (ముజద్దిదుద్దీన్, అబుల్ బర్కాత్, అబ్దుస్సలామ్ బిన్ తైమియ్య -హి.652) ఈయన ప్రఖ్యాత ఇస్లామీయ తత్వవేత్త షేఖుల్ ఇస్లామ్ తకీఉద్దీన్ అహ్మద్ బిన్ తైమియ్య (హి.728) గారి పితామహులు. కాజి షౌకాని, ఈ గ్రంథానికి నైలల్ ఔతార్ పేరిట ఒక టీకా వ్రాశారు.

5. బులూగుల్ మరామ్ (హాఫిజ్ ఇబ్ను హిజ్ర్, బుఖారి టీకా కర్త (హి.852) ఇందులో అధికంగా ఆరాధనలు, వ్యవహారాలకు సంబంధించిన హదీసులే ఉన్నాయి. ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్ సనాని (హి.1182) 'సుబులుస్సలామ్' పేరిట దీనికి టీకా వ్రాశారు. 'మిస్కుల్ ఖిత్తామ్' పేరిట మరో టీకా ఫార్సీ భాషలో నవాబ్ సిద్దీకుల్ హసన్ ఖాన్ (హి.1307) వ్రాశారు. ఈ గ్రంథాల్లో చాలా వాటికి చాలా కాలం క్రితమే ఉర్దూలోనికి అనువాదం జరిగింది. వాటి ప్రచురణ కూడా జరిగింది.

## భారతదేశంలో

మన దేశంలో మొట్టమొదట షేఖ్ అబ్దుల్ హక్ ముహద్దిస్ దహ్లవీ బిన్ సైఫుద్దీన్ తుర్క్ (హి.1052) హదీసు విద్యాజ్యోతిని ప్రకాశింపజేశారు. ఆయన తరువాత హజ్రత్ షా వలీయుల్లా (హి.1176), ఆయన సంతానం, సేవాపరాయణులు, బోధనాగ్రహకులయిన శిష్యుల అవిరళ పరిశ్రమ వల్ల ఈ భూభాగంలో ప్రవక్త సంప్రదాయ కాంతి నలుమూలలా వ్యాపించింది. 'భూమి దాని ప్రభు జ్యోతితో ప్రకాశమానమయి పోయింది.' (దివ్యఖుర్ఆన్ -అజ్ జుమర్ : 69)

షా వలీయుల్లా తరువాత ఈ దేశంలో అనువాదాలు, టీకాలు, చిన్నచిన్న సంకలనాలు, ప్రచురించే సత్కార్య క్రమం ఇంకా కొనసాగుతూనే ఉంది.

'నేను సత్పురుషుల ప్రేమికుణ్ణే కాని వారిలోని వాణ్ణి కాను.'

దీని ద్వారానయినా బహుశా దైవం నాలో సదాచారాన్ని అనుగ్రహిస్తాడేమో! ప్రవక్త కాలం నుండి నేటివరకు హదీసులు వ్రాసే, వాటిని ఉల్లేఖించే కార్యక్రమం ఎన్నడూ ఎడతెగకుండా సాగుతూనే ఉందని పై వివరాల వల్ల తెలుస్తోంది. ఈ విజ్ఞాన పరిశోధనా పరంపరలో పగలూ దేదీప్యమానమయినదే రేయీ ఉజ్వలమానమయినదే!

**- అబ్దుల్ గఫ్ఫార్ హసన్ ఉమర్‌పూరి**

*మహా కరుణ కలవాడు, అత్యంత దయామయుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.*

# వహీ ప్రకరణం

## అధ్యాయం -1

**1. దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిస్తూ ఉండగా తాను విన్నానని హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజిఅన్) చెప్పారు: "మనిషి చేసే పనులన్నీ వాటి వెనుక వున్న అతని ఉద్దేశ్యం ప్రకారమే సరైనవి, మంచివి అవుతాయి. ప్రతి మనిషీ తాను సంకల్పించుకున్నది మాత్రమే పొందుతాడు. కనుక ఎవరైనా ప్రపంచాన్ని సంపాదించే ఉద్దేశ్యంతోనో లేదా ఒక స్త్రీని వివాహం చేసుకునే సంకల్పంతోనో, తన దేశాన్ని విడిచి వలస పోయినట్లయితే (హిజ్రత్ చేసినట్లయితే), అతని యొక్క వలసపోవటం అనేది ఆ పనుల కోసం మాత్రమే అవుతుంది."**

**వివరణ :** ఒక వ్యక్తి మహానగరం మక్కా నుండి మదీనా నగరానికి వలసపోయిన సందర్భంలో, దైవప్రవక్త మహనీయులు (సఅసమ్) ఈ విషయాన్ని బోధించారు. అతను ఇస్లామ్ ధర్మం కోసం కాక ఒక స్త్రీని వివాహం చేసుకునే ఉద్దేశ్యంతో మదీనాకు వలస పోయాడు. అతను మదీనా పట్టణానికి వలస వస్తేనే తాను అతన్ని పెళ్లి చేసుకుంటానని ఉమ్మె ఖైస్ అనే ఆ స్త్రీ షరతు విధించింది. సందర్భం ఏదైనా, ఇది సాధారణంగా అందరికీ సర్వకాల సర్వావస్థలలో వర్తించే సూత్రం. మనిషి చేసే పనులకు బహుమానం అనేది వాటి వెనుక అంతర్లీనమై ఉన్న సంకల్పం ప్రకారమే లభిస్తుంది గాని, ఆ పనుల వెలుగులో మాత్రం కాదు. ఎందుకంటే ఆ పనులు పైకి ఎంత మంచివిగా, పుణ్యకార్యాలుగా కనిపించినా, అవి దురుద్దేశంతో చేసినవి కూడా కావచ్చు.

**2. హారిస్ బిన్ హిష్షామ్ (రజిఅన్) ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్)ను ఇలా అడిగారని, విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఆయెషా[1] (ర.అన్హా) సెలవిచ్చారు: 'ఓ ప్రవక్తా! దైవవాణి (వహీ) మీకు ఎలా అందుతుంది?' దానికి సమాధానంగా దైవప్రవక్త (సఅసమ్) ఇలా అన్నారు: "ఒక్కొక్కసారి అది[2] ఘంటారావం మాదిరిగా వస్తుంది; ఈ రకమైన ప్రేరణ, అనుభూతి నాకు అత్యంత**

---

2-1. దైవప్రవక్త (సఅసమ్) గారి సతీమణుల్ని దేవుడు విశ్వాసుల తల్లులుగా అభివర్ణించాడు. కనుక విశ్వాసులు వారి పట్ల ఎనలేని గౌరవభావం కలిగి ఉండాలి. ప్రవక్త (సఅసమ్) మహనీయుల మరణానంతరం, ఆయన గారి భార్యలలో ఎవ్వరినీ వివాహం చేసుకునే అనుమతి విశ్వాసులకు లేదు.

2-2. దైవవాణికి సంబంధించిన ఇతర రూపాలు ఇలా ఉన్నాయి: ఒకటి, కలల ద్వారా

బాధాకరంగా ఉంటుంది. దైవదూత చెప్పింది నాకు అర్థమైన తరువాత, ఈ సంకట స్థితి నా నుంచి తొలగిపోతుంది. ఒక్కోసారి దైవదూత మానవ రూపంలో నా దగ్గరకు వస్తాడు, నాతో మాట్లాడుతాడు, అతను చెప్పిన దాన్ని నేను జ్ఞాపకం చేసుకుంటాను." హజ్రత్ ఆయెషా (ర.అన్హా) ఇలా అన్నారు: "ఎముకలు కొరికే చలి రోజుల్లో దైవ ప్రవక్త (సఅసమ్) మీద దైవవాణి అవతరించటాన్నీ, అది ఆగిపోయిన తరువాత, ఆయన గారి (సఅసమ్) నుదుటి నుంచి స్వేద బిందువులు పెల్లుబకటాన్ని నేను కళ్ళారా చూశాను."

**3.** విశ్వాసుల మాతృమూర్తి అయిన హజ్రత్ ఆయెషా (ర.అన్హా) ఇలా సెలవిచ్చారు : దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్)పై అవతరించిన మొదటి దైవవాణి ఒక సుందర స్వప్నంతో ప్రారంభమయింది. నిదురలో ఆయన చూసిన స్వప్నం (పగటి వెలుగు మాదిరిగా)[1] నిజమయ్యేది. తరువాత ఆయన (స)కు ఏకాంతవాసమే మంచిదిగా అనిపించసాగింది. ఆయన (స) హిరా గుహలో ఒంటరిగా[2] ఉంటూ ఎన్నో రాత్రులు[3] ఆరాధనలో గడిపారు. ఇంటికి తిరిగి వెళ్లే కోరిక కలిగే వరకు ఆయన (స) అక్కణ్ణే ఉండిపోయేవారు. గుహకు వెళ్లేటప్పుడు ఆయన (స) తమతో భోజనం కూడా తీసుకుపోయేవారు. అది అయిపోయిన పిదప ఆయన (స) హజ్రత్ ఖదీజా (ర.అన్హా) గారి ఇంటికి తిరిగి వెళ్లేవారు. అంతే భోజనాన్ని

---

తెలియజెయ్యటం. దీనికి సంబంధించిన ప్రస్తావన ముందు హదీసుల్లో వస్తుంది. రెండు, హజ్రత్ జిబ్రీల్ (అస్సలామ్) తమ అసలు రూపంలో అవతరించటం. మూడు, స్వయంగా అల్లాహ్యే తెర వెనుక నుంచి మాట్లాడటం. గంట మ్రోగితే వచ్చే ధ్వని లాంటి శబ్దం ఏ దైవవాణిలో ఉంటుందో, అది ప్రవక్త (స) మహనీయులకు ఎంతో కష్టతరమైనదిగా ఉండేది. ఆయన్ని (స) ఆ విధంగా కష్టపెట్టడంలోని ఉద్దేశ్యం ఆయన అంతస్తును పెంచటమే. ఆరాధనలో ఎంత ఎక్కువగా కష్టం ఉంటే అంతే ఎక్కువ పుణ్యం పరలోకంలో లభిస్తుంది.

3-1 అంటే స్వప్న మర్మం బహిర్గతమయ్యేది. దైవప్రవక్తల స్వప్నాలు దైవవాణులే. అవి నిత్య సత్యాలే అవుతాయి.

3-2. ఏకాంతవాస దీక్ష, మానసిక సంఘర్షణ అనేవి హృదయ పరిశుభ్రతకు ఎంతో అవసరం. ప్రవక్త (స) కూడా ప్రారంభంలో ఇలానే చేశారు. అప్పుడు అనంతమైన అల్లాహ్ అనుగ్రహం ఆయన(స) పై కురిసింది. ప్రవక్తా పదవి అల్లాహ్ ప్రసాదిస్తే లభించే కానుకే గాని, కఠోరమైన సాధన ద్వారా లభించేది ఎంత మాత్రం కాదు.

3-3. ప్రవక్త మహనీయులు (స) ఈ కొండ గుహలో ఒక నెల రోజులు దైవారాధనలో గడిపారని కొందరంటే, కాదు, నలభై రోజులని మరికొందరన్నారు.

**తీసుకుని మళ్లీ గుహకే వెళ్లేవారు. చివరకు ఆయన (స) గుహలో ఉన్నప్పుడే ఆయన (స) మీద దైవవాణి అవతరించింది.**

**హజ్రత్ జిబ్రీల్ (అ) వచ్చి, "చదువు" అని అన్నారు. ఆయన (స) 'నేను చదువుకున్నవాణ్ణి కాను' అని జవాబు పలికారు. అప్పుడు జిబ్రీల్ (అ) నన్ను పట్టుకుని గట్టిగా నొక్కారు; నేను శక్తిహీనుడనైపోయాను[4]. నన్ను వదలిపెట్టి, "చదువు" అని ఆయన (అ) మళ్ళీ పురమాయించారు. నేను, "ఎలా చదవాలో నాకు తెలియదు" అని అన్నాను. ఆయన నన్ను మళ్లీ పట్టుకున్నారు, రెండోసారి కూడా గట్టిగా నొక్కారు; దానికి నేను తట్టుకోలేకపోయాను, అశక్తుడనైపోయాను. తరువాత నన్ను వదలిపెట్టి, "చదువు" అని ఆయన మళ్లీ ఆజ్ఞాపించారు: "ఎలా చదవను. నేను చదువుకున్న వాణ్ణి కాదు కదా!" అని నేను చెప్పాను. ఆయన (అ) (మళ్లీ నన్ను) పట్టుకున్నారు. మూడోసారి కూడ గట్టిగా అదిమి వదలిపెట్టారు. "చదువు, సర్వాన్నీ సృష్టించిన నీ ప్రభువు పేరుతో. ఆయన మానవుణ్ణి పేరుకుపోయిన నెత్తుటి ముద్దతో సృజించాడు. చదువు, నీ ప్రభువు పరమ దయాళువు." ఈ వాక్యాలనే హజ్రత్ జిబ్రీల్ (అ) పఠించగా విని, ఆయన (స) (కొండ గుహ నుంచి) ఇంటికి తిరిగి వచ్చారు. ఆయన (స) గారి హృదయం భయంతో విచలితమైపోయింది. ఖువైలిద్ కుమార్తె అయిన తన భార్య హజ్రత్ ఖదీజా (ర) వద్దకు వెళ్లి, 'నా మీద దుప్పటి కప్పు, నా మీద దుప్పటి కప్పు' అని అన్నారు. అక్కడి వారు ఆయన (స) మీద దుప్పటి కప్పారు. భయ నివృత్తి కలిగిన పిదప, ఆయన తమ భార్య అయిన హజ్రత్ ఖదీజా (ర)కు, జరిగిన వృత్తాంతాన్ని పొల్లుపోకుండా వినిపించారు. "నా ప్రాణం పోతుందేమోనని నేను[5] భయడుపడుతున్నాను" అని ఆమెకు చెప్పారు. దానికి హజ్రత్ ఖదీజా(ర), "అలా ఎన్నటికీ జరగదు; అల్లాహ్ సాక్షిగా చెబుతున్నాను. అల్లాహ్ మిమ్మల్ని ఎన్నటికీ అవమానంపాలు చెయ్యడు. మీరు బంధుత్వ సంబంధాలను కలుపుతారు'. బలహీనుల బరువును మీరు మోస్తారు. వారికి కావలసిన వస్తువులను మీరు తెచ్చి పెడతారు. అతిథుల్ని సత్కరిస్తారు. గొడవలు, కలహాలు**

---

3-4. కొందరు ఇలా అనువాదం చేశారు. "చివరకు దైవదూతకు ఉన్న శక్తి ఉడిగిపోయింది." అంటే హజ్రత్ జిబ్రీల్ (అ) తనకున్న పూర్తి శక్తిని వినియోగించారు. ఎందుకంటే ఆ సమయంలో ఆయన తన అసలు రూపంలో ఉన్నారు. కనుక ఇది సంభవసాధ్యంకాని విషయమేమీ కాదు. అయినా "వల్లాహు ఆలమ్" (అల్లాహ్‌కు మాత్రమే తెలుసు.)

3-5. ప్రవక్త మహనీయులు (స) తమ పరిస్థితిని గమనించి, తమ ప్రాణానికి ముప్పు కలుగుతుందేమోనని భయపడిపోయారు. అంతేకాని ఇది అల్లాహ్ తరపు నుంచి

**జరిగినప్పుడు, న్యాయం ఎవరి వైపున ఉంటే, మీరు వారిని సమర్థిస్తారు"[6] అని ఓదార్చారు. తరువాత హజ్రత్ ఖదీజా (ర) ఆయన్ని (స) తన దాయాది అయిన వరఖా బిన్ నౌఫల్ బిన్ అసద్ బిన్ అబ్దుల్ ఉజ్జా దగ్గరకు తీసుకెళ్ళారు. అలనాటి అజ్ఞానపు యుగంలో అతను విగ్రహారాధనను త్యజించి క్రీస్తు మతాన్ని స్వీకరించాడు. అతను హిబ్రూ భాషను చక్కగా వ్రాస్తాడు. ఇంజీల్ (గాస్పెల్) గ్రంథంలో ఉన్నటు వంటి, అల్లాహ్ వ్రాయించదలచుకున్నటువంటి విషయాలను అతను హిబ్రూ భాషలో వ్రాసేవాడు.[7] అతను వృద్ధాప్యంలో దృష్టిని కోల్పోయాడు. హజ్రత్ ఖదీజా (ర) అతనితో ఇలా అన్నారు, "అన్నయ్యా! మీ సోదర కుమారుని (ముహమ్మద్ (స) మాటలు కొంచెం వినండి." వర్ఖా ఆయన (స) తో ఇలా అన్నారు, "నా భ్రాతృజా! నీవు చూసిందేమిటో చెప్పు బాబు." ఆయన (స) తాను చూసిన దాన్ని పూసగుచ్చి నట్లుగా అతనికి వినిపించారు. అప్పుడు వరఖా ఇలా అన్నారు: "ఇతనైతే దేవుని సన్నిహిత దూతయే. అతన్ని అల్లాహ్ మూసా(అ) వద్దకు పంపాడు.[8] నిన్ను నీ జాతి వారు తమ పట్టణం నుంచి బహిష్కరించే కాలం (నీ ప్రవక్తా పదవీ కాలం) వచ్చే వరకు నేను బ్రతికుంటే ఎంత బాగుండును". దైవప్రవక్త (స), "నిజంగానే వారు నన్ను బహిష్కరిస్తారా?" అని అడిగారు. "అవును. వారు నిన్ను తప్పనిసరిగా బహిష్క రిస్తారు. నీవు చెప్పు మాటలు[9] చెప్పిన ప్రతి వ్యక్తికీ ప్రజలు శత్రువులయ్యారు. ఆ రోజు వచ్చే వరకు నేను గనక బ్రతికి ఉంటే, అప్పుడు నేను నిన్ను గట్టిగా**

---

అవునో కాదో అనే సందేహం మాత్రం ఆయన (స)కు లేదు.

3-6. "వరుస కలపటం" అంటే చుట్టాలు, బంధువుల పట్ల సద్భావంతో మెలగటం, బలహీనులు అంటే అనాథలు, వితంతువుల పోషణా భారాన్ని తనపై వేసుకోవటం. ప్రజల వద్ద లేని వస్తువులను వారికి ఇవ్వటం, ధన సహాయం చెయ్యటం, వివేకంతో కూడుకున్న విషయాలు ప్రజలకు తెలపటం, వివాదాలు, ఘర్షణలు తలెత్తినప్పుడు, న్యాయం ఎవరివైపున ఉంటుందో వారిని సమర్థించటం. ఇటువంటి అపూర్వమైన పనులు ఆయన (స) చేసేవారు. హజ్రత్ ఖదీజా (రజిఅన్) గారి విజ్ఞతావివేకాలు, మేధాసంపత్తి ఎలాంటివో కూడా ఇక్కడ తెలుస్తోంది. ఇంకా ప్రవక్త మహనీయులు(స) ప్రవక్తా పదవిని అలంకరించక పూర్వం కూడా ఎంత నీతిమంతులో, ఎంత గొప్ప సద్గుణ సంపన్నులో ఇక్కడ స్పష్టమవుతోంది.

3-7. ఇంజీల్ గ్రంథం సిర్యానీ భాషలో అవతరించింది. తరువాత హిబ్రూ భాషలో దాని అనువాదం జరిగింది. వర్ఖా బహుశా ఇదే పని చేస్తూ ఉండేవారేమో.

3-8. వాస్తవానికి వరఖా క్రైస్తవ మతస్థుడు అయినప్పటికీ ఆయన హజ్రత్ మూసా ప్రవక్త

**సమర్థిస్తాను." అని వరఖా చెప్పాడు. ఆ తరువాత కొన్ని రోజులకే వరఖా చని పోయారు.[10] దివ్యప్రేరణ రావటం కూడా ఆగిపోయింది.[11]**

**(ఈ హదీసును గురించి చెప్పిన) ఇబ్నె షిహాబ్ ఇలా అన్నారు: అబూ సలమా బిన్ అబ్దుర్రహ్మాన్, జాబిర్ బిన్ అబ్దుల్లా అన్సారీ ద్వారా విని నాకు ఇలా చెప్పారు : ఆయన దివ్యప్రేరణ ఆగిపోవటం గురించి ప్రస్తావించేవారు. మహనీయ ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారని అతను తెలియజేశారు: "ఒకసారి నేను పోతూ ఉండగా, ఆకాశం నుంచి నాకు ఒక వాణి వినిపించింది. నేను తల ఎత్తి ఆకాశం వైపు చూశాను. హిరా గుహలో ఉన్నప్పుడు నా వద్దకు వచ్చిన ఆ దైవదూతయే నాకు కనిపించాడు. అతను భూమ్యాకాశాల మధ్య ఒక కుర్చీపై కూర్చొని ఉన్నాడు. ఈ దృశ్యాన్ని చూసి నేను భయపడ్డాను. ఇంటికి మరలి వచ్చి భార్యతో, "నా మీద కంబళి కప్పు, నా మీద కంబళి కప్పు" అని అన్నాను. అప్పుడు అల్లాహ్ ఈ వాక్యాలను అవత రింపజేశాడు; "కంబళి కప్పుకుని పడుకున్న ఓ మనిషీ! లే! లేచి హెచ్చరిక చెయ్యి. నీ ప్రభువు ఘనతను చాటి చెప్పు. నీ దుస్తులను పరిశుభ్రంగా ఉంచుకో, మాలిన్యానికి దూరంగా ఉండు" (దివ్యఖురాను గ్రంథం - అల్ ముద్దస్సిర్ - 1-5) దీని తరువాత దివ్య ప్రేరణ క్రమం తప్పకుండా ధారావాహికంగా రావటం మొదలయింది.**

---

(అ)పేరును ప్రస్తావించారు. ఎందుకంటే, షరీయత్తుకు సంబంధించిన అదేశాలన్నీ ఆయన గారిపైనే అవతరించాయి. హజ్రత్ ఈసా (అ) కూడా ఈ షరీయత్తునే అవలం బించారు. కాకపోతే ఇంజీల్ గ్రంథంలోని కొన్ని హితవులను ఆయన బోధించారు.

3-9. అంటే దివ్యప్రేరణ, ప్రవక్తాపదవుల ప్రకటన.

3-10. ప్రవక్త (స) మహనీయుని సందేశం ప్రారంభం కాకపూర్వమే వరఖా మరణించారని అంటారు. కాని ఆయన బ్రతికే ఉన్నారనీ, మరణించలేదనీ, సిరియా దేశం నుండి తిరిగి వచ్చేటప్పుడు మార్గమధ్యంలో ఆయన హత్య చెయ్యబడ్డారనీ వాఖయీ అన్నారు. ఒక హదీసు కథనం ఇలా ఉంది: "నేను వరఖాను స్వర్గంలో చూశాను. ఆయన తెల్లని పట్టు వస్త్రాలు ధరించి ఉన్నారు. ఎందుకంటే ఆయన నా మీద విశ్వాసం వ్యక్తం చేశారు." ఇబ్నె మసనద్ ఆయన పేరును సహాబీల (ర) పేర్లలో వ్రాశారు.

3-11. "ఇఖ్రా" సూరాలోని ప్రారంభ వాక్యాలు అవతరించిన పిదప రెండున్నర లేక మూడు సంవత్సరాల వరకు దివ్యప్రేరణ అవతరించటం ఆగిపోయింది. తరువాత "ముద్దస్సిర్" సూరాలోని మొదటి వాక్యాలు అవతరించాయి. ఇక క్రమం తప్పకుండా పుంఖానుపుంఖాలుగా దివ్యప్రేరణల అవతరణ కొనసాగింది.

**4. దివ్యఖురాను గ్రంథంలోని ఈ వాక్యం గురించి, "ఓ ప్రవక్తా! ఈ దివ్య వాణిని త్వరత్వరగా జ్ఞాపకం చేసుకోవటానికి నీ నాలుకను ఆడించకు."**

**హదీసులో ఇలా చెప్పటం జరిగింది: ఇబ్నె అబ్బాస్ (ర) పై ఆయత్‌కు తాత్ప ర్యంగా ఇలా చెప్పారని సయీద్ బిన్ జుబేర్ చెప్పారు: "మహనీయ ముహమ్మద్(స) తమపై ఖురాను వాక్యాలు అవతరించినప్పుడు, ఎంతో ఒత్తిడికి, ఎంతో కష్టానికి గురయ్యేవారు. ఆయన(స) తరచూ తమ పెదాలను కదిపేవారు (జ్ఞాపకం చేసుకోవ టానికి)"[1] ఇబ్నె అబ్బాస్ (ర), సయీద్‌తో ఇంకా ఇలా అన్నారు: "ప్రవక్త మహనీయులు (స) తమ పెదాలను ఎలా కదిపేవారో అలా నేను కూడా నా పెదాలను కదిపి నీకు చూపిస్తాను." సయీద్ బిన్ జుబేర్ (మూసాతో) ఇలా అన్నారు, "ఇబ్నె అబ్బాస్ (ర) తమ పెదాలను కదిపినట్లుగా, నేను కూడా నా పెదాలను కదిపి నీకు చూపిస్తాను." తరువాత సయీద్‌గారు తమ రెండు పెదాలను కదిపి చూపించారు.[2] ఇబ్నె అబ్బాస్ (ర) ఇలా అన్నారు: "అప్పుడు అల్లాహ్ ఈ ఖురాను వాక్యాన్ని అవతరింపజేశాడు: "(దివ్యవాణిని కంఠస్థం చెయ్యటానికి) నీ నాలుకను ఆడించకు. ఖురాను గ్రంథాన్ని జ్ఞాపకం చేయించటం, దానిని చదివించటం మా బాధ్యత." ఇబ్నె అబ్బాస్ (ర) ఇంకా ఇలా అన్నారు:**

**"అంటే నీ హృదయఫలకంపై దానిని స్థాపించటం, నీ చేత దానిని చదివిం చటం" అని అర్థం. ఆ తరువాత అల్లాహ్ ఇలా అన్నాడు, "కనుక మేము దానిని పఠిస్తున్నప్పుడు, నీవు ఆ పఠనాన్ని శ్రద్ధగా విను, దానిని అనుకరించు." దీని భావం, ఇబ్నె అబ్బాస్ (ర) చెప్పినట్లు, ఏమిటంటే, "నీవు దానిని మౌనంగా ఆలకించు." ఇంకా దాని భావం నీకు అర్థమయ్యేలా చెయ్యటం మా బాధ్యత, అంటే "నీ చేత దానిని**

---

4-1. మరచిపోతానేమో అనే భావం ఆయన్ని (స) వెంటాడుతూ ఉండేది. కనుక జిబ్రీల్ దూత (అ) ఆయన ముందు ప్రత్యక్షమై ఖురాను వాక్యాలు పఠించేటప్పుడు, ఆయన (స) కూడా అతనితో పాటు పఠిస్తూపోయేవారు.

4-2. ఇబ్నె అబ్బాస్ (ర) సయీద్ బిన్ జుబేర్‌కు, సయీద్ బిన్ జుబేర్, మూసా ఇబ్నె అబీ ఆయిషాకు తమ తమ పెదాలను ఆడించి ప్రవక్త మహనీయులు(స) తమ పవిత్రమైన పెదాలను ఈ విధంగా కదిపారని చూపించారు. అంతేకాని ఇబ్నె అబ్బాస్ (ర) ప్రవక్త(స) గారు, ఇలా తమ పెదాలను ఆడిస్తూ ఉండగా నేను చూశానని మాత్రం చెప్పలేదు. ఎందుకంటే, ఇబ్నె అబ్బాస్ (ర) చాలా చిన్నవారు. ఈ సంఘటన ప్రవక్తా పదవి ప్రారంభదశలో జరిగింది. అప్పుడు ఆయన పుట్టలేదు కూడా.

**చదివించటం అన్న మాట." తరువాత ఖురాను వాక్యాలు అవతరించే టప్పుడు ఆయన అలానే చేసేవారు. ఆ తరువాత జిబ్రీల్ దూత (అ) ఆయన వద్దకు వచ్చి ఖురాను గ్రంథాన్ని పఠించేటప్పుడు, మహనీయ ముహమ్మద్ (స) ఆ పఠనాన్ని మౌనంగా వినేవారు. ఆ దూత అంతర్ధానమైపోయినప్పుడు, ఆయన (స) జిబ్రీలు పఠించిన విధంగానే ఖురాను వాక్యాలను పఠించేవారు.**

**5. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (ర) ఇలా ఉల్లేఖించారు: "ప్రవక్త మహనీయులు(స) అందరికంటే ఎక్కువగా దానధర్మాలు చేసేవారు. రమజాను మాసంలోనైతే ఆయన (స) ఈ విషయంలో విజృంభించేవారు.[1] ఈ మాసంలో హజ్రత్ జిబ్రీల్(అ) ఆయన్ని (స) కలుస్తూ ఉండేవారు. ప్రతి రాత్రి ఆయన (స)తో కలిసి ఖురాను గ్రంథాన్ని పారాయణం చేసేవారు; ఉభయులూ కలిసి రమజాను మాసంలో మొత్తం ఖురాను గ్రంథాన్ని పఠించేవారు. ప్రజలకు మేలు చెయ్యటంలో ప్రవక్త మహనీయులు (స) బలంగా వీచే గాలికంటే కూడా ఎక్కువ వేగంగా స్పందించేవారు.**

**6. అబూ సుఫ్యాన్ బిన్ హరబ్ తనతో ఇలా అన్నారని హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (ర) సెలవిచ్చారు. "ఖురైషుల ఒక వ్యాపార బృందంతో ప్రయాణం చేస్తూ ఉండగా, నా వద్దకు హెర్క్యూలియస్[1] (రోమన్ దేశపు రాజు) ఒక దూతను పంపాడు. ఖురైషుల ఈ బృందం అప్పుడు సిరియా దేశానికి వ్యాపార నిమిత్తం వచ్చింది. అదే కాలంలో ప్రవక్త మహనీయులు (స) అబూ సుఫ్యాన్‌తోనూ, ఖురైషు తెగకు చెందిన అవిశ్వాసులతోనూ సంధి కుదుర్చుకుని ఒక గడువును నిర్ణయించారు.[2] హెర్క్యూలి**

5-1. రమజాను మాసం ఎనలేని శుభాల మాసం కావటం వలన, ఈ మాసంలో ఆయన (స) అత్యధికంగా దానధర్మాలు చేసేవారు. ఈ అధ్యాయానికీ ఈ హదీసుకూ మధ్య ఉన్నటువంటి సంబంధం ఏమిటంటే, రమజాను మాసంలో హజ్రత్ జిబ్రీల్ (అ) ప్రవక్త మహనీయుని (స)తో కలిసి మొత్తం ఖురాను గ్రంథాన్ని ఒకసారి పఠించేవారు; కనుక దీనిద్వారా తెలిసిందేమిటంటే, ఖురాను అంటే దివ్యవాణి అవతరణకు రమజాను మాసంలో శ్రీకారం చుట్టబడింది.

6-1. ఆ కాలంలో రోమన్ దేశపు రాజును హెర్క్యూలియస్ అని అనేవారు. అతను క్రైస్తవుడు. అతని పరిపాలనా కాలంలోనే ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (స) పరమపదించారు. ఈ హదీసును ఈ అధ్యాయంలో చేర్చటానికి గల కారణం, ఆయన (స) నిజమైన దైవప్రవక్త అనటానికి ఆధారం లభించాలని. ఆయన (స) ప్రవక్తా పదవి నిజమైనదని నిరూపితమైనప్పుడు, మిగతా దైవప్రవక్తల మాదిరిగానే

**యస్, అతని మిత్రులు 'ఏలియా'(జెరూసలేం)లో ఉన్నప్పుడు,[3] ఈ బృంద సభ్యులు అక్కడకు వెళ్లారు. అతను వారిని తన దర్బారుకు పిలిపించాడు. అప్పుడు అతని దర్బారులో రోమను దేశ ప్రముఖులందరూ ఆసీనులై ఉన్నారు. తరువాత అతను ఆ బృంద సభ్యుల్ని తన దగ్గరకు రమ్మన్నాడు, తన అనువాదకుణ్ణి కూడా పిలిచాడు. తరువాత అతను, "నేను దైవ ప్రవక్తనని బహిరంగ ప్రకటన చేసిన ఆ వ్యక్తికి దగ్గరి బంధువులైన వారెవరైనా మీలో ఉన్నారా?" అని అడిగాడు. అబూ సుఫ్యాన్, "నేను అతనికి దగ్గర బంధువును"[4] అని అన్నాడు. అప్పుడు హెర్క్యులియస్, "సరే బాగుంది, అతన్ని నా దగ్గరకు తీసుకురండి, అతని సహచరుల్ని కూడా అతనితోపాటు తీసుకురండి" అని ఆజ్ఞాపించాడు. తరువాత ఆ రాజు తన అనువాదకునితో, "ఇతన్ని (అబూ సుఫ్యాన్‌ను) ఆ వ్యక్తిని గురించి (ప్రవక్తగారు) కొన్ని విషయాలు అడుగుతానని అతని మిత్రులకు చెప్పు. ఒకవేళ ఇతను నాతో అబద్ధం చెప్పినట్లయితే, అప్పుడు నీవు ఇతను అబద్ధం చెబుతున్నాడు అని చెప్పెయ్యాలి. అప్పుడు అబూ సుఫ్యాన్, "దేవుని మీద ఒట్టు! నా ఈ మిత్రుడు గనక నన్ను అబద్ధాలకోరు అని అంటాడనే భయం నాకు లేకపోతే, నేను మీకు అబద్ధమే చెప్పి ఉండేవాణ్ణి"[5] అని అన్నాడు. అతను నన్ను అడిగిన మొదటి విషయం ఇది:**

**"మీలో అతని కుటుంబానికి ఏ పాటి గౌరవం ఉంది?"**

**నేను, "అతని కుటుంబమైతే మా కుటుంబం కంటే గొప్పది,[6] ఉత్తమమైనది" అని చెప్పాను.**

---

ఆయనపై కూడా దివ్యవాణి తప్పనిసరిగా అవతరిస్తుందని, ఈ విధంగా దివ్యవాణికి కూడా ఆధారం లభిస్తుంది.

6-2. అంటే పది సంవత్సరాల గడువు; హుదైబియా సంధి అని భావం. దీనికి సంబంధించిన గాథ ఎంతో ప్రసిద్ధి గాంచింది. ఈ గ్రంథంలో కూడా దాని ప్రస్తావన వస్తుంది.

6-3. బైతుల్ మఖ్‌దిస్‌ను 'ఏలియా' అంటారు.

6-4. బృంద సభ్యులందరికంటే అబూ సుఫ్యాన్ ప్రవక్త మహనీయులకు (స) చాలా దగ్గరి బంధువు. ఎందుకంటే, అతను ప్రవక్త(స) గారి వంశవృక్షంలోని పూర్వీకులలో నాల్గవ తరానికి చెందిన అబ్దె మునాఫ్ సంతానం.

6-5. అంటే, ఆయన (స)కు అబద్ధపు విషయాలను ఆపాదించి ఉండేవాణ్ణి; అప్పుడు హెర్క్యులియస్ ముహమ్మద్ (స) నిజమైన దైవప్రవక్త కారని భావించి ఉండేవాడు.

**తరువాత హెర్క్యులియస్, "సరే, ఇంతకు పూర్వం మీలో ఎవరైనా 'నేను ప్రవక్తను' అనే విషయాన్ని ప్రకటించారా?" అని అడిగాడు.**

**"లేదు" అని నేను సమాధానం చెప్పాను.**

**అతను ఇంకా ఇలా అడిగాడు, "అతని పూర్వీకుల్లో ఎవరైనా రాజుగా దేశాన్ని పాలించారా?"**

**"లేదు" అని నేను బదులు పలికాను.**

**అతను, "అతన్ని అనుసరించేవారు ధనవంతులా లేక నిరుపేదలా?" అని అడిగాడు.**

**"నిరుపేదలు"[7] అని నేను జవాబు పలికాను.**

**అతను ఇలా ప్రశ్నించాడు, "అతని అనుచరుల సంఖ్య రోజుకు రోజు పెరుగుతోందా, తరుగుతోందా?"**

**"వారి సంఖ్య పెరుగుతోంది" అని నేను చెప్పాను.**

**అతను ఇంకా ఇలా ప్రశ్నించాడు, "వారిలో ఎవరైనా అతని ధర్మాన్ని స్వీకరించి ఆ తరువాత దానిని చెడ్డదిగా భావించి మరలిపోయిన వారు ఉన్నారా?"**

**"లేరు" అని నేను సమాధానం పలికాను.**

**అతను ఇంకా ఇలా అడిగాడు, "(నేను దైవప్రవక్తనని) అతను ప్రకటించక పూర్వం, అతను అబద్ధం చెప్పినట్లు మీరెప్పుడైనా విన్నారా?"**

**"లేదు" అని నేను జవాబు చెప్పాను.**

**అతను ఇలా అడిగాడు, "సరే బాగుంది. అతను ఆడిన మాటను తప్పుతాడా?"**

**"లేదు. మాకూ అతనికీ మధ్య ప్రస్తుతం ఒక ఒప్పందం అమలులో ఉంది. ఈ గడువు కాలంలో అతను ఎలా ప్రవర్తిస్తున్నాడో మాకైతే తెలియదు."**

**ఇది తప్ప మరొక విషయం ఏదీ ఇందులో చేర్చే అవకాశం నాకు లభ్యం కాలేదు,[8] అని అబూ సుఫ్యాన్ అన్నాడు.**

---

ఎందుకంటే అప్పటి వరకు అబూ సుఫ్యాన్ ముస్లిమ్ అవలేదు, ప్రవక్త (స)కు, ముస్లిములకు అతను ఆగర్భ శత్రువుగా ఉండేవాడు.

6-6. అంటే, వంశాన్ని బట్టి ఆయన ఉత్తమ కుటుంబానికి చెందినవారు. అరేబియా ప్రజలందరిలోకల్లా ఖురైష్ వంశీయులు చాలా ఉత్తములుగా పరిగణింపబడేవారు.

**హెర్క్యూలియస్ ఇంకా ఇలా అడిగాడు; "సరే, మీరు ఎప్పుడైనా అతనితో యుద్ధం చేశారా?[9]"**

**నేను, "అవును, మేము అతనితో యుద్ధం చేశాము" అని చెప్పాను.**

**అతను ఇలా ప్రశ్నించాడు, "మీకూ అతనికీ మధ్య జరిగిన యుద్ధాల ఫలితం ఎలా ఉండేది?"**

**నేను ఇలా జవాబు చెప్పాను, "కొన్ని సార్లు అతను గెలిస్తే, కొన్ని సార్లు మేము గెలిచాము."[10]**

**ఇంకా అతను ఇలా అడిగాడు, "అతను మిమ్మల్ని ఏం చెయ్యమని ఆజ్ఞాపిస్తాడు?"**

**నేను ఇలా సమాధానం చెప్పాను:"అతను ఒక్క అల్లాహ్‌ను మాత్రమే పూజించమంటాడు; అల్లాహ్‌తోపాటు మరెవ్వరినీ పూజించవద్దంటాడు; మా పూర్వీకులు బోధించిన మాటలను తిరస్కరించమంటాడు; మమ్మల్ని నమాజు చెయ్యమనీ, సత్యం పలుకమనీ, నిషిద్ధ కార్యాలకు దూరంగా ఉండమనీ, బంధువులతో సత్సంబంధాలు కలిగి ఉండమనీ ఆజ్ఞాపిస్తాడు."**

**అప్పుడు హెర్క్యూలియస్ నాకు ఇలా చెప్పమని తన అనువాదకుణ్ణి ఆదేశించాడు: "నేను అతని వంశాన్ని గురించి నిన్ను అడిగితే, అతను ఉన్నత వంశానికి చెందిన వాడని నీవు చెప్పావు. వాస్తవానికి దైవప్రవక్తలు ఎల్లప్పుడూ తమ తమ జాతులలోని ఉన్నత వంశాల నుండే ప్రభవింపజేయబడుతూ వచ్చారు.[11] పూర్వం**

---

ఖురైషులలోని బనీహాషిమ్, అబ్దుల్ ముత్తలిబ్ తెగలలోనైతే ఆయన సర్వశ్రేష్ఠులు.

7. ఆయన అనుచరులు చాలామంది పేదవారు, అయినప్పటికీ, అప్పటి పెద్ద మనుషులు ఎంతో మంది, హ్రజత్ ఉమర్ (ర), హ్రజత్ అమీర్ హమ్జా (ర) లాంటి వారు కూడా ఇస్లామ్‌ను స్వీకరించారు.

8. అంటే, ఈ విషయంలో ఒక వాక్యాన్ని నా తరఫు నుండి చేర్చే అవకాశం నాకు లభించింది. అబూ సుఫ్యాన్ చేర్చిన వాక్యం ఇది: ఇప్పుడు అతను ఏం చేస్తున్నాడో తెలియదు అంటే చేసిన వాగ్దానం ప్రకారం నడుచుకుంటున్నాడా లేక వాగ్దాన భంగం చేస్తున్నాడా అనే విషయం.

9. అంటే, ఎవరు ప్రాబల్యం వహిస్తారు. ఎల్లప్పుడూ అతనే ప్రాబల్యం వహిస్తాడా లేక మీరు ప్రాబల్యం వహిస్తారా లేదా ఒకసారి మీరు ప్రాబల్యం వహిస్తే మరొకసారి ఆయన వహిస్తారా అని.

**మీలో ఎవరైనా ఇటువంటి విషయాన్ని ప్రకటించారా అని నేను అడిగితే నీవు "లేదు" అని సమాధానం చెప్పావు. దీని భావం ఏమిటంటే, ఒకవేళ ఇంతకు పూర్వం మీలో ఎవరైనా ఇటువంటి విషయాన్ని ప్రకటించి ఉంటే, అప్పుడు నేను, "ఈ వ్యక్తి పూర్వపు విషయాలను అనుసరిస్తున్నాడు" అని చెప్పి ఉండేవాణ్ణి. ఇతని పూర్వీకులలో ఎవరైనా రాజుగా దేశాన్ని పాలించారా అని నేను అడిగితే, నీవు "లేదు" అని జవాబు చెప్పావు. నేను చెప్పదలచుకున్నదేమిటంటే, ఒకవేళ ఇతని పూర్వీకులలో ఎవరైనా రాజుగా రాజ్యమేలి ఉన్నట్లయితే, అప్పుడు ఇతను "నేను దైవ ప్రవక్తను" అనే సాకుతో తన పూర్వీకుల రాజ్య వైభవాన్ని తిరిగి చేపట్టాలని ఆశిస్తున్నాడని నేను అనుకునేవాణ్ణి. ఈ ప్రకటన చెయ్యక పూర్వం ఇతను అబద్ధం చెప్పినట్లు నీవేమైనా గమనించావా అని నేనడిగితే, నీవు "లేదు" అని చెప్పావు. కనుక ప్రజలను గురించి అబద్ధం చెప్పని మనిషి, అల్లాహ్‌ను గురించి అబద్ధం చెప్పటం అనేది అసంభవమని నేను భావిస్తు న్నాను. అతని అనుయాయులు ధనవంతులా లేక నిరుపేదలా అని అడిగితే, నిరు పేదలని నీవు సమాధానం చెప్పావు. నిజానికి పేద ప్రజలే[12] దైవ ప్రవక్తలను ఎక్కువగా అనుసరిస్తారు. అతని అనుచరుల సంఖ్య పెరిగిందా లేక తరిగిందా అని అడిగితే, నీవు 'అది పెరిగింది', అని చెప్పావు. విశ్వాసం పరిపూర్ణం అయ్యే వరకు దాని స్థితి ఇలానే ఉంటుంది.[13] అతను తెచ్చిన ధర్మంలోకి ప్రవేశించి ఆ తరువాత దానిని చెడ్డదిగా భావించి దాన్నుండి మరలిపోయిన వారెవరైనా ఉన్నారా అని నేనడిగితే, "లేరు" అని నీవు జవాబు చెప్పావు. విశ్వాసమాధుర్యం హృదయంలోకి దిగిపోయినప్పుడు, దాని స్థితి ఇలానే ఉంటుంది (అంటే అది బయటకు రాదు).**

---

10. అంటే, ఒకప్పుడు ఆయన మా మీద ప్రాబల్యం వహిస్తారు, బద్ర్ సంగ్రామంలో ముస్లిములది పైచేయి అయిన విధంగా. మరొకప్పుడు మేము అతని మీద ప్రాబల్యం వహిస్తాము, ఉహుద్ యుద్ధంలో అబూ సుఫ్యాన్, అతని అనుచరులది పై చేయి అయినట్లుగా.
11. దైవప్రవక్తలందరూ తమ తమ సమాజాలలోని ఉన్నతమైన, ఉత్తమమైన వంశాలకు చెందినవారే. నీచుడు, దుర్వర్తనుడు, అధమ వంశీయుడు అయిన వాడెవడికీ దేవుడు ప్రవక్తా పదవిని ఇవ్వలేదు. ఎందుకంటే అలాంటి వ్యక్తిని ప్రజలు నీచుడుగా, అల్పుడుగా భావిస్తారు. అతని హితబోధ వారిని ప్రభావితం చెయ్యలేదు.
12. ఎందుకంటే నిరుపేదలు నిగర్వులే కాని అహంభావులు కారు. సత్యవాక్కును శ్రద్ధగా వింటారు. సంపన్నులు గర్వం కారణంగా ఒక వ్యక్తికి విధేయత చూపటాన్ని అగౌ రవంగా భావిస్తారు.

**అతను ఆడినమాట తప్పుతాడా అని అడిగితే, నీవు "లేదు" అని సమాధానం పలికావు. దైవ ప్రవక్తలు అలాంటివారే. వారు ఆడిన మాట తప్పరు.[14] అతను మిమ్మల్ని ఏం చెయ్యమని ఆజ్ఞాపిస్తాడు అని నేను నిన్ను అడిగితే, "అల్లాహ్‌ను మాత్రమే పూజించండి, ఆయన దైవత్వంలో భాగస్వాములుగా ఇతరులను కలపకండి అని ఆజ్ఞాపిస్తాడు. విగ్రహారాధనను చెయ్యవద్దంటాడు, నమాజు చెయ్యమంటాడు, సత్యం పలుకమంటాడు, నిషిద్ధ విషయాలకు దూరంగా ఉండమని ఆదేశిస్తాడు" అని నీవు చెప్పావు. నీవు చెప్పేదే గనక నిజమైతే, త్వరలోనే అతను నా పాదాల క్రింద ఉన్న ఈ భూమికి ప్రభువు అవుతాడు (అంటే సిరియా దేశానికి రాజు అవుతాడు). ఈ ప్రవక్త రాబోతున్నాడనే విషయం నాకు తెలుసు. కాని అతను మీలో నుంచి ఉద్భవిస్తాడని మటుకు నాకు తెలియదు.[15] ఒకవేళ నేను అతన్ని చేరగలిగితే,[16] తప్పకుండా అతన్ని కలిసే ప్రయత్నం చేస్తాను. నేను గనక అతనితో (మదీనా పట్టణంలో) ఉండగలిగితే, అతని పాదాలు కడుగుతాను (సేవ చేస్తాను). తరువాత అతను, ప్రవక్త మహనీయులు (స) దిహ్‌యా కల్బీ అనే వ్యక్తి ద్వారా (హిజ్రీ 6వ సంవత్సరంలో) బుస్రా గవర్నరుకు పంపిన లేఖను తెప్పించాడు. ఆ ఉత్తరాన్ని చదవమని బుస్రా గవర్నరు హెర్క్యులియస్‌కు పంపాడు. అతను దానిని చదివాడు. అందులో ఇలా వ్రాసి ఉంది: మహా కరుణ కలవాడు, అత్యంత దయామయుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను. అల్లాహ్ దాసుడు, అల్లాహ్ ప్రవక్త అయిన ముహమ్మద్ (స) తరపు నుండి, రోమను దేశ మహారాజు అయిన**

---

13. అంటే, సత్యధర్మం పరిపూర్ణం కానంత వరకు, అది క్షీణించటం అనేది జరగదు. పరిపూర్ణం అయిన తరువాత క్షీణదశ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఒక హదీసులో ఇలా ఉంది: "ఇజాజా అనస్‌రుల్లాహ్" సూరా అవతరించినప్పుడు, మహనీయ ముహమ్మద్ (స) ఇలా అన్నారు: ఇప్పుడైతే ప్రజలు గుంపులు గుంపులుగా ఇస్లామ్‌లోకి ప్రవేశిస్తున్నారు. రాబోయే కాలంలో ప్రజలు అందులో నుంచి గుంపులు గుంపులుగా నిష్క్రమించవచ్చు.
14. ఆడిన మాట తప్పటం చాలా పెద్ద పాపం. అది విశ్వాస లక్షణం కాదు. దైవ ప్రవక్తలు అలా చెయ్యటం అనేది ఎన్నడూ జరగదు.
15. అంటే, పేద ప్రజల్లోని యూదులు, క్రైస్తవులు కొందరు, చివరి యుగంలో దైవప్రవక్తలు ఇస్రాయీల్ వంశీయుల్లో నుంచే ఉద్భవిస్తారు అని అనుకునేవారు. కాని వారు మూసా ప్రవక్త (అ) చెప్పిన ఈ విషయం గురించి ఆలోచించలేదు; మీ సోదరుల్లో నుంచి నా లాంటి ఒక ప్రవక్త ఉద్భవిస్తాడు. హజ్రత్ అష్‌యా (అ) ఇచ్చిన ఈ

**హెర్క్యులియస్‌కు, రుజుమార్గాన్ని అనుసరించే వానిపై శాంతి వర్షిస్తుందనే విషయాన్ని మీరు తెలుసుకోవాలి. నేను నిన్ను ఇస్లాం వైపునకు ఆహ్వానిస్తున్నాను. ముస్లిముపు అయిపో. అప్పుడు నీవు సురక్షితంగా ఉంటావు.[17] అల్లాహ్ నీకు రెట్టింపు పుణ్యాన్ని ప్రసాదిస్తాడు.[18] ఒకవేళ నీవు ఈ విషయాన్ని స్వీకరించకపోతే నీ ప్రజల పాపాన్ని కూడా నీవే మూట కట్టుకుంటావు.[19] (తరువాత దివ్యఖురానులోని ఈ వాక్యాన్ని వ్రాశారు.) ప్రవక్తా! ఇలా చెప్పు : "గ్రంథ ప్రజలారా! మాకూ, మీకూ మధ్య సమానంగా ఉన్న ఒక విషయం వైపునకు రండి. అది ఏమిటంటే, మనం అల్లాహ్‌కు తప్ప మరెవ్వరికీ దాస్యం చెయ్యరాదు. ఆయనకు భాగస్వాములుగా ఎవరినీ నిలబెట్టరాదు. మనలోని వారెవరూ అల్లాహ్‌ను తప్ప మరెవరినీ తమ ప్రభువుగా చేసుకోరాదు"[20] అనే విషయం. ఈ సందేశాన్ని స్వీకరించటానికి వారు వైముఖ్యం కనబరిస్తే, వారితో స్పష్టంగా ఇలా చెప్పు. "మేము ముస్లిములం (కేవలం అల్లాహ్‌కే దాస్యం చేసేవారు, అల్లాహ్‌కే విధేయత చూపేవారు) అనే విషయానికి మీరు సాక్షులుగా ఉండండి." అబూ సుఫ్యాన్ ఇలా అన్నాడు. "హెర్క్యులియస్ తన ఉపన్యాసాన్ని ముగించిన తరువాత, ఆ ఉత్తరాన్ని చదివిన తరువాత రాజ దర్బారులో ఒక పెద్ద గందరగోళం చెలరేగింది, అరుపులు కేకలు మిన్నుముట్టాయి. మేము దర్బారు నుండి బయటికి గెంటివేయబడ్డాము. అప్పుడు నేను నా సహచరులతో, మనం బయటికి గెంటివేయ బడినపుడు అబూ కబ్‌షా కుమారుని స్థానమైతే చాలా**

---

శుభవార్తను గురించి కూడా వారు ఆలోచించలేదు. మక్కాలోని ఫారాను కొండల మీద దేవుడు ప్రత్యక్షమవుతాడు. హజ్రత్ ఈసా (అ) చెప్పిన ఈ విషయం గురించి కూడా ఆలోచించలేదు. భవన నిర్మాణపు కూలీలు ఏ రాయినైతే మూలలో పడేశారో, చివరకు అదే రాయి సౌధానికి కేంద్ర బిందువైపోయింది.

16. ఒకవేళ అతను ప్రవక్త మహనీయుని వద్దకు వెళ్ళదలిస్తే, అతను అక్కడకు చేరకముందే మార్గమధ్యంలోనే ప్రజలు తనను చంపేస్తారేమోనని హెర్క్యులియస్ భయపడేవాడు.
17. అంటే నీ రాజ్యం, నీ రాజ్యాధికారం కొనసాగుతాయి, సురక్షితంగా ఉంటాయి లేదా పర లోకంలో నీవు ఘోర నరక శిక్ష నుంచి తప్పించుకుంటావు.
18. ఒకటేమో, మీరు మీ ప్రవక్తను విశ్వసించటం, రెండోదేమో, నన్ను విశ్వసించటం అనే విషయం.
19. యరీస్ లేక అరీస్‌ను వ్యవసాయదారుడు అంటారు. అంటే నీవు ఇస్లామ్ ధర్మాన్ని విశ్వసించకపోయినట్లయితే నీవు పాలించే ప్రజలు కూడా ఇస్లామ్ ధర్మాన్ని విశ్వసించరు. వారి పాపాలు కూడా నీ నెత్తినే పడతాయి.
20. దేవుడుగా చెయ్యటం అనే దాని భావం ఏమిటంటే, అతను చెప్పే ప్రతి విషయాన్నీ,

**పెరిగింది.[21] రోమను దేశపు రాజు కూడా అతనికి భయపడుతున్నాడు.[22] ప్రవక్త ముహమ్మద్ (స) తప్పక ప్రాబల్యం వహిస్తారని, విజేత అవుతారని ఆ రోజు నుంచే నాకు నమ్మకం కలిగింది. చివరకు అల్లాహ్ నాకు ఇస్లామ్‌ను స్వీకరించే భాగ్యాన్ని కలుగజేశాడు.**

**ఏలియా (జెరూసలెమ్)కు గవర్నరు, హెర్క్యులియస్‌కు సన్నిహితుడు, సిరియా దేశపు క్రైస్తవులకు ప్రధాన ఫాదిరీ అయినటువంటి ఇబ్నె నాతూర్ ఇలా చెప్పాడు: హెర్క్యులియస్ ఏలియా (జెరూసలేమ్)కు వచ్చినప్పుడు, ఒక రోజు ఉదయాన అతను దీనవదనుడై లేచాడు. అతనికి సన్నిహితులైన కొందరు, "ఇదేమిటి, ఈ రోజు మీరు చాలా విచారంగా కనిపిస్తున్నారు? క్షేమంగా ఉన్నారా? మీ ముఖం పీక్కుపోయిందేమిటి?" అని అడిగారు. ఇబ్నె నాతూర్ ఇలా అన్నాడు, "హెర్క్యులియస్ జోతిష్య శాస్త్రం తెలిసినవాడు. నక్షత్రాలు, గ్రహాలను గురించి బాగా తెలిసిన వాడు." ప్రజలు "నీవు విచారంగా ఉన్నావేమిటి?" అని అడిగినప్పుడు, అతను ఇలా సమాధానం చెప్పాడు: "నేను ఈ రోజు రాత్రి నక్షత్రాలను చూసినప్పుడు,[23] 'ఖత్నా' సంప్రదాయాన్ని పాటించేవారి నాయకుడు ప్రాబల్యం వహించినట్లు నాకు కనిపించింది. ఈ కాలంలో ఖత్నా సంప్రదాయాన్ని ఎవరు పాటిస్తున్నారు?"**

**అతని సన్నిహితులు : "యూదులు తప్ప మరెవ్వరూ ఖత్నా చేయించుకోరు. నీవు వారిని గురించి అంత ఎక్కువగా పట్టించుకోనవసరం లేదు. నీ ప్రాంతంలో ఉన్న పట్టణాల గవర్నర్లకు, అక్కడ ఉన్నటువంటి యూదులందరినీ చంపివేయమని ఆజ్ఞలు జారీ చెయ్యి" అని సలహా ఇచ్చారు.**

---

ఏ ఆధారం లేకపోయినా సరే, ఒప్పుకోవటం – ఒక హదీసులో ఉన్న విధంగా; అదీ బిన్ హాతిమ్ (ర) ఇలా అడిగారు, "ఓ ప్రవక్తా! మేము మా మౌలవీలను, ఫఖీరులను దేవుళ్లుగా చేసుకోలేదు కదా!" అప్పుడు ప్రవక్త మహనీయులు ఇలా సెలవిచ్చారు, "వారు ఏదైనా ఒక వస్తువును హలాల్ అని ప్రవచిస్తే లేదా హరామ్ అని నిర్ణయిస్తే, మీరు దాన్ని శిరసావహించేవారా కాదా?" దానికి అదీ (ర) అవును, నిజమేనని ఒప్పుకున్నారు. అప్పుడు కారుణ్యమూర్తి, "ఇదే ఈ ఖురాను వాక్యం యొక్క భావం" అని వివరించారు.

21. అబూ కబ్‌షా మహనీయ ముహమ్మద్ (స)కు దగ్గరి బంధువు. అప్పటి వరకు అబూ సుఫ్యాన్ అవిశ్వాసిగానే ఉన్నాడు. కనుక అతడు వ్యంగ్యంగా ఎగతాళి చేస్తూ ప్రవక్త (స)ను అబూ కబ్‌షా కుమారుడు అని సంబోధించాడు.

22. శబ్దానువాదం ఇలా ఉంటుంది : గోధుమ వర్ణం గల ప్రజల రాజు అతనికి భయపడుతున్నాడు. కథనం ఇలా ఉంది: రోమను దేశ చక్రవర్తి అయిన రూమ్

**వారు ఈ విషయాలను చర్చిస్తూ ఉండగా గస్సాన్ దేశపు రాజు (హారిస్ బిన్ అబీషమర్) పంపిన దూతను హెర్క్యూలియస్ ముందుకు తీసుకురావటం జరిగింది. అతను మహనీయ ముహమ్మద్ (స) స్థితిగతులను గురించి బాగా తెలిసినవాడు.[24] అతను చెప్పిన విషయాలను విన్న తరువాత, హెర్క్యూలియస్, అతను ఖత్నా చేయిం చుకున్నాడో లేదో చూడమని తన వారిని ఆజ్ఞాపించాడు. వారు అతని దగ్గరకు పోయి పరిశీలించిన తరువాత, అతను ఖత్నా చేయించుకున్నాడని హెర్క్యూలియస్‌కు తెలియ జేశారు. అప్పుడు హెర్క్యూలియస్ అరబ్బులు ఖత్నా చేయించుకుంటారా అని అతనిని అడిగాడు. అతను, చేయించుకుంటారని సమాధానం చెప్పాడు. అప్పుడు హెర్క్యూ లియస్, ప్రాబల్యం వహించిన జాతి ప్రజల పాదుషా ఈ వ్యక్తియే అని అన్నాడు. తరువాత హెర్క్యూలియస్ రోము నగరంలో ఉన్న తన ఒక మిత్రునికి లేఖ వ్రాశాడు. అతను హెర్క్యూలియస్ మాదిరిగానే అపార జ్ఞానం కలవాడు. ఆ తరువాత హెర్క్యూలియస్ హమస్ (సిరియాలోని ఒక పట్టణం) నగరానికి వెళ్ళి పోయాడు. అక్కడ అతను తన మిత్రుని జవాబు అందే వరకు ఉన్నాడు. హెర్క్యూలియస్ మిత్రుడు తన లేఖలో ఒక దైవప్రవక్త ఆవిర్భావం గురించి, ఆ దైవప్రవక్త ముహమ్మద్ (స) అనే విషయం సత్యమని హెర్క్యూలియస్ కలిగి ఉన్న అభిప్రాయంతో ఏకీభ వించాడు.[25] చివరకు హెర్క్యూలియస్ హమస్ నగరంలోని తన భవనంలో ఏర్పాటు చేసిన ఒక సమావేశానికి రోము పుర ప్రముఖులందరినీ ఆహ్వానించాడు. వారు లోనికి వచ్చిన తరువాత, భవన ద్వారాలన్నీ మూసివేయించాడు; పై భాగంలోని అంతస్తు పైకి పోయి ఇలా అన్నాడు: "రోము దేశ ప్రజలారా! మీరు గనక మీ**

---

బిన్ అయ్‌స్ బిన్ ఇస్‌హాఖ్ హబష్ దేశపు రాజు కుమార్తెను వివాహం చేసుకున్నాడు. వారికి గోధుమ వర్ణం గల పిల్లలు పుట్టారు. ఈ కారణంగానే క్రైస్తవులను "బనిల్ అస్ఫర్" అని అంటారు.

23. జంట నక్షత్రాలు ఏక కాలంలో వృశ్చిక రాశిలో ప్రవేశించటాన్ని, కలవటం అనేది ప్రతి 20 సంవత్సరాలకొకసారి జరుగుతుంది. మొదటిసారి ఇలా జరిగినప్పుడు ముహమ్మద్ మహనీయులు(స) జన్మించారు, రెండవసారి ఈ కలయిక సంభవించినప్పుడు ఆయన (స) గారికి ప్రవక్తా పదవి లభించింది, మూడోసారి ఇది జరిగినప్పుడు ఆయన (స) ఖైబర్ కనుమను జయించి వశపరచుకున్నారు, ఆ తరువాత ఇస్లామ్ ప్రాబల్యం పెరగసాగింది. ఈ సమయంలోనే హెర్క్యూలియస్ రాజు నక్షత్రాలను గురించి అధ్యయనం చేశాడు.

24. స్వయంగా ఇతను కూడా అరేబియా దేశవాసుడే. అతను దైవప్రవక్త ముహమ్మద్ (స)ను గురించి చెప్పటానికి గస్సాన్ దేశ రాజు వద్దకు వెళ్లాడు. ఈ రాజు అతన్ని

**సాఫల్యాన్ని కోరుకుంటే, మీ మేలును కాంక్షిస్తే, మీ రాజ్యం మీతో ఉండాలని తలిస్తే, ఆ అరేబియా ప్రవక్తకు విధేయతాపూర్వకంగా వాగ్దానం (బైఅత్) చెయ్యండి. ఇది వినగానే వారు అడవి గాడిదలు మాదిరిగా భవన ద్వారాల వైపునకు పరుగెత్తారు. కాని తలుపులు మూయబడి ఉన్నాయి.[26] విశ్వాసం పట్ల వారికున్న ద్వేషాన్ని గ్రహించి, వారు విశ్వసించరని నిరాశ చెందిన హెర్క్యూలియస్ ఆ సర్దారులను తన వద్దకు మళ్ళీ తీసుకురమ్మని ఆజ్ఞాపించాడు (వారు మళ్ళీ అతని వద్దకు వచ్చారు). అప్పుడు అతను ఇలా అన్నాడు; "ఇప్పుడు నేను మీకు చెప్పిన విషయాలు మిమ్మల్ని పరీక్షిద్దామనే ఉద్దేశ్యంతో చెప్పాను. చూడండి! మీ ధర్మం విషయంలో మీరు ఎంత స్థిరంగా ఉన్నారో (ఎంత పటిష్ఠంగా ఉన్నారో, ఎంత అంకిత భావంతో ఉన్నారో) దానిని నేను గమనించాను. అప్పుడు వారందరూ అతని ముందు సాష్టాంగ పడ్డారు; అతని పట్ల హర్షం వ్యక్తం చేశారు. హెర్క్యూలియస్ గాథ ఈ విధంగా సమాప్తమయింది.**

**ఈ హదీసును సాలెహ్ బిన్ కైసాన్, యూనుస్, మామర్‌లు కూడా జుహ్రీ నుండి ఉటంకించారని ఇమామ్ బుఖారీ తెలిపారు.**

---

హెర్క్యూలియస్ వద్దకు పంపాడు. ఇతను సుంతీ చేయించుకున్నాడు. సుంతీ చేయించుకునే సంప్రదాయం ముహమ్మద్ (స)గారి ప్రవక్తాపదవికి పూర్వం నుంచే కొనసాగుతూ వస్తోంది.

25. ఖుస్తలానీ ఇలా అన్నారు, "హెర్క్యూలియస్, జుగాతిర్ ఉభయులూ ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి ముస్లిములవ్వాలని కోరుకున్నారు. అయితే హెర్క్యూలియస్ తన జాతి ప్రజలకు భయపడి బహిరంగంగా ఇస్లామ్‌ను స్వీకరించి ముస్లిమ్ కాలేకపోయాడు. జుగాతిర్ ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించాడు, రోమను దేశ ప్రజల్ని ఇస్లామ్ వైపునకు రమ్మని, దానిని అవలంబించమని పిలుపునిచ్చాడు; ఈ కారణంగా వారు ఆయన్ని హత్య చేశారు. ఈ హదీసు ద్వారా తేటతెల్లమయ్యే విషయమేమిటంటే, కేవలం మనస్సులో ఇస్లామ్ పట్ల ఇష్టత, ఆమోదం కలిగి ఉన్నంత మాత్రానే ఇస్లామ్‌ను పూర్తిగా స్వీకరించినట్లు కాదు; బహిరంగంగా ఇస్లామ్ మతాన్ని స్వీకరించటం జరగాలి, అవిశ్వాసులకు ఈ విషయం స్పష్టంగా తెలియాలి ఒక హదీసులో ఇలా వచ్చింది. హెర్క్యూలియస్ తబూక్ పట్టణం నుంచి ప్రవక్త మహనీయులకు (స) 'నేను ముస్లిమునైపోయాను' అని తెలియజేస్తూ ఒక ఉత్తరం వ్రాశాడు. ఆ ఉత్తరాన్ని చూసి ఆయన (స) 'కాదు, అతను ముస్లిమ్ కాలేదు. అతను క్రైస్తవుడే' అని అన్నారు.

26. రోమను సర్దారులు అతనిపై దాడి చేసి, అతన్ని చంపేస్తారేమోనని భయపడి హెర్క్యూలియస్ తలుపులన్నీ మూసెయ్యమని ఆజ్ఞాపించాడు.

అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# విశ్వాస ప్రకరణం

## 2 వ అధ్యాయం

## విశ్వాసం - మహాప్రవక్త (సఅసమ్) సూక్తి

**ఇస్లామ్ సౌధం ఐదు విషయాల (పునాదుల) ఆధారంగా కట్టబడింది. విశ్వాసం అంటే చెప్పటం, చెప్పిన దాన్ని ఆచరించటం.[1] అది పెరుగుతుంది, తరుగు తుంది కూడా.[2] అల్లాహ్ దివ్యఖుర్ఆన్‌లో ఇలా అన్నాడు: "తమ విశ్వాసానికి వారు అదనంగా మరింత విశ్వాసాన్ని కలుపుకోవాలని" (48 : 4). మరొక చోట, "మేము వారికి సన్మార్గంపై నడవటంలో అభివృద్ధిని ప్రసాదించాము" (18:13). ఇంకొక చోట, "ఋజువైన మార్గం అవలంబించిన వారికి అల్లాహ్ ఋజుమార్గావలంబనలో వృద్ధిని ప్రసాదిస్తాడు" (19:76). మరొక చోట, "ఇక మార్గం పొందిన వారు; అల్లాహ్ వారికి ఇంకా ఎక్కువగా మార్గం చూపుతాడు, వారికి వారి వంతు భయభక్తులను**

---

1. చెప్పటం అంటే అర్థం, నోటితో ఇలా సాక్ష్యం చెప్పటం: అల్లాహ్ తప్ప నిజదైవం మరొక డెవ్వడూ లేడు, హజ్రత్ ముహమ్మద్ (సఅసమ్) అల్లాహ్ దాసులు మరియు ఆయన ప్రవక్త. ఆచరించటం అంటే అర్థం, మనఃపూర్వకంగా నమ్మటం, శరీర అవయవాలతో ఇస్లామ్ ధర్మసూత్రాలను పాటించటం, నమాజు, ఉపవాసాలు, హజ్ యాత్ర మొదలైనవి. హదీసు శాస్త్రవేత్తల దృష్టిలో ఆచరణలు కూడా విశ్వాసమే; అంటే సదాచరణలు లేని విశ్వాసం పరిపూర్ణం కాదు. విశ్వాసం అంటే అసలైన భావం హృదయపూర్వకంగా సాక్ష్య మివ్వటమే, ధ్రువీకరించటమే. సత్కార్యాలు లేకపోయినా, విశ్వాసమయితే ఉంటుంది; అయితే అది అసంపూర్ణమయినటువంటిది, నిరుపయోగ మైనటువంటిది.
2. హదీసు శాస్త్రవేత్తల దృష్టిలో విశ్వాసం పరిపూర్ణం కావటానికి సత్కార్యాలు, సదాచరణలు చాలా అవసరం. కనుక సత్కార్యాలు ఎంత పెరిగితే, విశ్వాసం కూడా అంతే పెరుగు తుంది. ఇమామ్ బుఖారీ (ర) ఏమన్నారంటే, "ఎన్నో పట్టణాలలో వెయ్యికంటే ఎక్కువ మంది విద్వాంసుల్ని నేను కలుసుకున్నాను. వారందరూ, విశ్వాసం అంటే చెప్పటం, చెప్పిన దాన్ని చెయ్యటం అనీ, అది తరుగుతుంది, పెరుగుతుంది కూడా అని అన్నారు.

**ప్రసాదిస్తాడు"(47 : 17). ఇంకొక చోట, "విశ్వసించే వారి విశ్వాసం ద్విగుణీ కృతమైంది" (74 : 31). ఇంకొక చోట, "మీలో దీని కారణంగా ఎవరి విశ్వాసం పెరిగిందో చెప్పండి? విశ్వసించిన వారి విశ్వాసాన్ని వాస్తవంగానే (అవత రించిన ప్రతి సూరా) పెంచింది" (9 :124). అల్లాహ్ ఇంకా ఇలా అన్నాడు: వారితో ప్రజలు, "మీకు వ్యతిరేకంగా పెద్ద సైన్యాలు మోహరించి ఉన్నాయి. వాటికి భయపడండి" అని అన్నప్పుడు దానిని విని వారి విశ్వాసం మరింత అధికమైంది(3 : 173). అల్లాహ్ ఇలా అన్నాడు. "ఈ సంఘటన వారి విశ్వాసాన్నీ, వారి ఆత్మ సమర్పణనూ మరింత అధికం చేసింది"[3] (33 : 22)**

**(హదీసు ప్రకారం) అల్లాహ్ కోసం ప్రేమించటం, అల్లాహ్ కోసం విరోధిం చటం కూడా విశ్వాసంలోనిదే.[4]**

**ఖలీఫా హ్రజత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ అదీ బిన్ అదీకు ఇలా వ్రాశారు. "విశ్వాసంలో విధులూ ఉన్నయ్, విశ్వాసాలూ ఉన్నయ్[5], నిషిద్ధాలూ ఉన్నయ్, ధర్మ సమ్మతమైన విషయాలూ, అభిలషణీయమైన అంశాలూ ఉన్నయ్. ఎవడయితే ఈ విషయాలన్నింటినీ పాటిస్తాడో అతను తన విశ్వాసాన్ని పరిపూర్ణం చేసుకుంటాడు. ఎవడయితే వాటిని పూర్తిగా పాటించడో, అతను తన విశ్వాసాన్ని పరిపూర్ణం**

---

3. విశ్వాసం పెరుగుతుంది, తరుగుతుంది అనే విషయానికి ఇమామ్ బుఖారీ (ర) ఈ ఖురాను వాక్యాలను ఆధారంగా తీసుకున్నారు.

4. ఈ హదీసు ద్వారా విశదమైన విషయం ఏమిటంటే, సత్కార్యం విశ్వాసంలోని విషయమే; అల్లాహ్ మార్గంలో ప్రేమ లేదా విరోధం కలిగి ఉండటం కూడా హృదయా నికి సంబంధించిన ఒక కార్యమే. ఈ హదీసును అబూ అమామ (ర) ఉల్లేఖించారని అబూ దావూద్ చెప్పారు.

5. నమాజు, ఉపవాసం, జకాతు వంటి విశ్వాస విధులు; దేవుని వ్యక్తిత్వం, ఆయన గుణ విశేషాలు, ఆయన ఏకత్వం; దైవదౌత్యం, ప్రళయం, స్వర్గం, నరకం, శిక్ష, పుణ్యాల మీద నమ్మకం, వ్యభిచారం, దొంగతనం, సారాయి త్రాగటం, వడ్డీ తినటం వంటి నిషిద్ధ విషయాలకు దూరంగా ఉండటం, సున్నత్, ముస్తహబ్‌లకు సంబంధించిన విషయాలు. ఉదాహరణకు, నమాజు ప్రారంభకాలంలోనే నమాజు చెయ్యటం, జమాఅత్‌తో నమాజు చెయ్యటం, అజాన్ ఇవ్వటం, ఖత్నా చేయించు కోవటం – ఈ విషయాలన్నీ ధర్మానికి సంబంధించినవే, విశ్వాసానికి సంబంధించి నవే.

**చేసుకోడు. నేను గనక జీవించి ఉంటే ఆ విషయాలన్నీ ఏవో నేను నీకు వివరిస్తాను. అప్పుడు నీవు వాటిని ఆచరించ గలవు. ఒకవేళ నేను చనిపోతే, నీతో కలిసి ఉండే ఆకాంక్ష నాకు లేదు (నేను నీతో కలిసి ఉండటానికి ఆత్రుత పడటంలేదు). హజ్రత్ ఇబ్రాహీమ్ (అస్సలామ్) వినయంగా ఇలా అన్నారు, నా మనస్సును తృప్తిపరచటం కోసం అడుగుతున్నాను"[6] (2 : 260). హజ్రత్ మాజ్ (తన మిత్రుడైన అస్వద్ బిన్ హిలాల్‌తో) ఇలా అన్నారు, "రండి, కొంచెంసేపు కూర్చుందాము. ఆ సమయాన్ని విశ్వాసానికి సంబంధించిన విషయాలను గురించి మాట్లాడుకోవటానికి వినియోగించుకుందాము."[7] హజ్రత్ ఇబ్నె మసూద్ (రజిఅన్) "గట్టి నమ్మకం (యఖీన్) పూర్ణ విశ్వాసంతో సమానం"[8] అని అన్నారు. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజిఅన్) ఇలా అన్నారు, "తన మనస్సులో గుచ్చుకునే అనుమానాలను దూరం చేసుకోనంత వరకు ఒక దాసుడు భయభక్తుల యొక్క అసలు యదార్థానికి చేరుకోలేడు."[9]**

---

6. సయీద్ బిన్ జుబేర్, ముజాహిద్‌లు ఈ ఖురాను వాక్యానికి చేసిన వ్యాఖ్యానాన్ని ఇక్కడ ఇమామ్ బుఖారీ సూచిస్తున్నారు. అంటే నా విశ్వాసం, నా నమ్మకం పెరిగిపోవాలి.
7. అంటే, దేవుడు, దైవ ప్రవక్తలకు సంబంధించిన ప్రస్తావన చేసుకుందాము. ఇమామ్ అహ్మద్, ఇబ్నె అబీ షేబాలు ఈ విషయాన్ని విశ్వసనీయమైన ఆధారాలతో వివరించారు.
8. సహనం అర్థ విశ్వాసంతో సమానం అని తిబ్రానీ ఉల్లేఖించారు. దీనినిబట్టి, విశ్వాసం తరుగుతుంది, పెరుగుతుంది అనే విషయం స్పష్టంగా తెలిసిపోతుంది. లేకపోతే సహనాన్ని అర్ధ విశ్వాసం అని ఎందుకంటారు? విశ్వాసం అంటే కేవలం ధ్రువీకరించటం అనీ, ఆచరణలతో దానికి సంబంధం లేదనీ అర్థం కాదు. దాని భావం ఏమిటంటే, హృదయ పూర్వకంగా ధ్రువీకరించటం అనేది విశ్వాసం యొక్క మహోన్నతమైన స్థితి.
9. అర్థం ఏమిటంటే, ఒక పని విషయంలో అది ధర్మసమ్మతం అవునో, ధర్మసమ్మతం కాదో అనే సంశయం కలిగినప్పుడు, ఆ పనిని చెయ్యకూడదు, వదిలిపెట్టాలి. అయితే ఈ విషయం గురించి ప్రవక్త (స) సహచరుల సూక్తులు, ఆచరణలకు సంబంధించిన ఉల్లేఖనాల పరంపర పూర్తిగా లభ్యం కాలేదు. అయినప్పటికీ ఇమామ్ ముస్లిమ్ (రహ్మలై) ప్రవక్త మహనీయుని (స) మాటల్ని, ఆయన గారి చేతల్ని దృష్టిలో పెట్టుకుని ఇలా ఉల్లేఖించారు: దోషపూరితమైన పనుల్లో పడిపోతానేమో అనే భయం వలన, దోషరహితమైన పనుల్ని సైతం మానివెయ్యనంత వరకు ఒక మనిషి దైవభీతి పరాయణుడు కాలేడు. దైవభీతి, విశ్వాసం అత్యంత సన్నిహితమైనటువంటివి.

**ముజాహిద్ దివ్యఖుర్ఆన్‌లోని ఈ వాక్యం గురించి వ్యాఖ్యానిస్తూ,(ఆయన (అల్లాహ్) నూహ్ ప్రవక్తకు ఆజ్ఞాపించిన ధర్మాన్నే నీకూ నిర్ణయించాడు.) అంటే "ఓ ముహమ్మద్ (సఅసమ్)! నీకూ నూహ్(అ)కు ఆజ్ఞాపించిన ధర్మం (దీన్) ఒక్కటే" అని అన్నారు.**[10]

**ఈ వాక్యం గురించి వివరిస్తూ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా అన్నారు: "షరీఅత్, షరీఅత్ పరంగా, విధానపరంగా మార్గం మరియు ఇస్లామ్ సంప్రదాయం అని అర్థం.**[11] **దుఆ అంటే విశ్వాసం అని భావం."**[12]

**7. మహాప్రవక్త (స) ఇలా బోధించారని ఇబ్నె ఉమర్ (రజిఅన్) చెప్పారు: ఇస్లామ్ సౌధ నిర్మాణం ఐదు విషయాల ఆధారంగా జరిగింది. 1. అల్లాహ్ తప్ప**

---

కనుక విశదమయ్యే విషయమేమిటంటే, కొందరు విశ్వాసం యొక్క యదార్థాన్ని అవగాహన చేసుకుంటారు, మరికొందరు చేసుకోరు. ఇది విశ్వాసం తరగటం, పెరగటం జరిగినప్పుడే సంభవిస్తుంది.

10. దీన్ని గురించి అబ్ద్ బిన్ హుమైద్ ఇలా వ్యాఖ్యానించారు: ఇతర దైవ ప్రవక్తలు తీసుకువచ్చిన ధర్మానికి, ఇస్లామ్ ధర్మానికి మధ్య అవినాభావ సంబంధం ఉంది. అయితే పూర్వపు ధర్మాలలో లేని విషయాలు ఎన్నో ఇస్లామ్ ధర్మంలో ప్రవచించ బడ్డాయి అనే విషయం సుస్పష్టం. దీనినిబట్టి ధర్మం, అంటే విశ్వాసం తరుగుతుంది పెరుగుతుంది అనే విషయం తెలుస్తోంది.

11. దీన్ని అబ్దుర్రజ్జాఖ్ తన వ్యాఖ్యానంలో ఇలా సిద్ధాంతీకరించారు. ఖురాను వాక్యం ఇలా ఉంది: "మేము మీలోని ప్రతి వారికీ ఒక్కొక్క షరీఅత్‌ను ఒక్కొక్క విధానాన్ని ఇచ్చాము." షరీఅత్‌లకు, విధానాలకు మధ్య విభేదాలు ఉండటం అనేది సహజమైన విషయం. కనుక ధర్మంలో హెచ్చుతగ్గులు జరుగుతూ ఉంటాయి. కొందరు ఏమన్నా రంటే, ముజాహిద్, ఇబ్నె అబ్బాస్ (ర)ల సూక్తులు రెండూ కలిసి పై విషయాన్ని రూఢీపరుస్తున్నాయి. ఎందుకంటే, ఒకటి, బహు షరీఅత్‌లను సూచిస్తే, రెండోది, ఒకే షరీఅత్‌ను సూచిస్తుంది. కొన్ని విషయాలలో ఏకాభిప్రాయం ఉంటే, మరికొన్ని విషయాలలో భిన్నాభిప్రాయం ఉంది. ఇస్లామ్ ధర్మం అన్ని ధర్మాలకంటే ఎక్కువ పరిపూర్ణతను కలిగి ఉంది. కనుక ఎక్కువ తక్కువలు అనేవి నిరూపిత మయ్యాయి.

12. ఇబ్నె జరీర్ ఇలా సిద్ధాంతీకరించారు : దుఆ విశ్వాసం అయినప్పుడు, అది ఒక పని, ఒక ఆచరణ, విశ్వాసానికి చెందిన భాగం అవుతుంది.

**నిజమైన దేవుడు మరెవ్వడూ లేడని, ముహమ్మద్ (సఅసమ్)ను అల్లాహ్ తన ప్రవక్తగా పంపాడని సాక్ష్యమివ్వటం. 2. చక్కగా నమాజు చేయటం. 3. జకాతు ఇవ్వటం. 4. హజ్ యాత్రకు పోవటం. 5. రమజాను మాసం ఉపవాసాలు పాటించటం.[1]**

## 3వ అధ్యాయం

### అల్లాహ్ సూక్తి ప్రకారం విశ్వాస కార్యాలు★

**"సత్కార్యం అంటే మీరు మీ ముఖాలను తూర్పుకో, పడమరకో త్రిప్పటం కాదు. సత్కార్యం అంటే మనిషి అల్లాహ్‌నూ, అంతిమ దినాన్నీ, దూతలనూ, అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్నీ, ఆయన ప్రవక్తలనూ హృదయపూర్వకంగా విశ్వసించటం. ఇంకా, అల్లాహ్ పట్ల ప్రేమతో తాము ఎక్కువగా ఇష్టపడే ధనాన్ని బంధువుల కొరకూ, అనాథుల కొరకూ, నిరుపేదల కొరకూ, బాటసారుల కొరకూ, సహాయం చెయ్యమని అర్థించే వారి కొరకూ. ఖైదీలను విడుదల చెయ్యటానికీ వ్యయపరచటం. ఇంకా నమాజును స్థాపించటం. జకాత్ ఇవ్వటం; వాగ్దానం చేస్తే దానిని పాలించే వారూ, కష్టకాలంలో, లేమిలో, సత్యానికీ, అసత్యానికీ మధ్య జరిగే పోరాటంలో స్థయిర్యం చూపేవారూ సత్పురుషులు. వాస్తవానికి సత్యసంధులు, అల్లాహ్ ఎడల భయభక్తులు కలవారు వారే." (అల్ బఖరా 2: 177)**

**"నిశ్చయంగా విశ్వాసులు సాఫల్యం పొందుతారు." (23 : 1)**

**8. ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హ్రజత్ అబూ హురైరా (రజిఅన్) కథనం. విశ్వాసానికి 60కి పైగానే శాఖలు ఉన్నాయి. వ్రీడ, లజ్జ (సిగ్గు పడటం) కూడా విశ్వాసానికి చెందిన ఒక శాఖయే.[1]**

---

7-1. ఈ హదీసు ద్వారా స్పష్టంగా తెలిసే విషయమేమిటంటే, ఆచరణలు కూడా విశ్వాసంలోని భాగాలే.

★ మొదటి ఖురాను వాక్యం బఖరా సూరాలోని 21వ రుకూలోనిది. రెండోది, మోమినూన్ సూరాలోని 18వ పారాలో ఉంది. ఈ రెండు వాక్యాలలోను విశ్వాసానికి సంబంధించి ఎన్నో ఆచరణల ప్రస్తావన ఉంది. ఉదాహరణకు దానం చెయ్యటం, నమాజు చెయ్యటం, జకాతు ఇవ్వటం, వాగ్దానాన్ని నెరవేర్చటం, జిహాదులో స్థిరత్వం కనబరచటం, మర్మాంగ పవిత్రతను కాపాడుకోవటం, వినయ విధేయతలతో, అణకువతో నమాజు చెయ్యటం.

8-1. కొన్ని ఉల్లేఖనాల్లో 70 కంటే పైగానే శాఖలున్నాయని వచ్చింది. హాఫిజ్ ఇబ్నె హజర్ "ఫతహుల్ బారీ"లో వీటిని గురించి వివరంగా వ్రాశారు.

## 4వ అధ్యాయం

## తోటి ముస్లిములకు తన నోటితోగాని, తన చేతులతోగాని హాని తలపెట్టనివాడే నిజమైన ముస్లిమ్

**9.** మహనీయ ముహమ్మద్ (సఅసమ్) ఇలా బోధించారని అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ చెప్పారు: తోటి ముస్లిములకు తన నోటితో గాని, తన చేతులతోగాని హాని కలిగించని వాడే నిజమైన ముస్లిమ్.[1] అల్లాహ్ నిషేధించిన పనులను విడనాడే వాడే నిజమైన ముహాజిర్ (వలస పోయినవాడు).

## 5వ అధ్యాయం

## శ్రేష్ఠుడైన ముస్లిమ్ ఎవడు?

**10.** అబూ మూసా అష్అరీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త (స) సహచరులు కొందరు "మహాప్రవక్తా! ముస్లిములలో శ్రేష్ఠుడు ఎవడు?" అని అడిగారు. దానికి మహాప్రవక్త (స), "తోటి ముస్లిములకు తన నోటితోగాని, తన చేతులతో గాని నష్టం కలిగించని వాడే శ్రేష్ఠుడైన ముస్లిమ్."[1]

## 6వ అధ్యాయం

## అన్నం తినిపించటం ఇస్లామీయ స్వభావం

**11.** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజిఅన్) ఇలా చెప్పారు: ఒక మనిషి మహాప్రవక్త (స)ను, "ఇస్లామీయ గుణాలలో ఏ గుణం ఉత్తమమైనది?" అని అడిగాడు. దానికి ఆయన (స), "అన్నం తినిపించటం[1] పరిచయం ఉన్నా, లేకపోయినా ప్రతి ముస్లిమ్‌కూ సలామ్ చెయ్యటం"[2] అని సమాధానం చెప్పారు.

---

9-1. ఎవరి నోటి వల్లనైతే, ఎవరి చేతుల ద్వారానైతే తోటి ముస్లిములకు నష్టంగాని, కష్టంగాని కలగదో, అతనే పరిపూర్ణుడైన ముస్లిమ్ అవుతాడు. అతను ఎవరిని గురించీ పరోక్షనిందకు పాల్పడరాదు, ఎవరినీ హింసించరాదు.

10-1. నోటి మీద, చేతుల మీద అదుపు సాధించటం మంచి ప్రవర్తనకు మూలాధారం. ప్రపంచంలో రకరకాల కలహాలకు, కక్షలకు, అసూయాద్వేషాలకు మూలకారణం నోరే.

11-1 అంటే, స్నేహితులకు, అతిథులకు, అగత్యపరులకు అన్నం తినిపించటం విశ్వాసానికి చిహ్నం. ముఖ్యంగా కరవుకాటకాలు వచ్చినప్పుడు లేదా ధరలు ఆకాశానికి ఎగిసినప్పుడు, నిరుపేదలకు అన్నం పెట్టి వారి ప్రాణాలను కాపాడటం అన్ని పనులకంటే ఉత్తమమైనది.

## 7వ అధ్యాయం

### తన కోసం ఇష్టపడే దాన్నే తన తోటి (ముస్లిమ్) సోదరుని కోసం కూడా ఇష్టపడటం అనేది విశ్వాసంలోని ఒక భాగం"[1]

**12.** మహాప్రవక్త (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అనస్ (రజిఅన్) చెప్పారు: "మీలో ఎవరైనాసరే, తన కోసం ఏదైతే కోరుకుంటాడో, దానినే తన తోటి (ముస్లిమ్) సోదరుల కోసం కూడా కోరనంతవరకు విశ్వాసి కాలేదు[1]."

## 8వ అధ్యాయం

### దైవప్రవక్తను ప్రేమించటం కూడా విశ్వాసంలోని ఒక భాగమే

**13.** మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా బోధించారని హజ్రత్ అబూహురైరా (రజిఅన్) కథనం : "నా జీవన్మరణాలు ఏ దేవుని చేతుల్లోనైతే ఉన్నాయో ఆ దేవుని సాక్షిగా చెబుతున్నాను! మీలో ఎవరైనా సరే, తన తండ్రికంటే, తన సంతానం కంటే ఎక్కువగా నన్ను ప్రేమించనంతవరకు విశ్వాసి కాలేడు."

**14.** మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అనస్ (రజిఅన్) చెప్పారు: "మీలోని ఏ మనిషైనా సరే, తన తండ్రి కంటే, తన సంతానం కంటే, ఇతర మానవులందరి కంటే అధికంగా నన్ను ప్రేమించనంతవరకు అతను సంపూర్ణ విశ్వాసి కాలేడు."[1]

---

11-2 కొందరు కేవలం తెలిసినటువంటి, పరిచయమున్నటువంటి ముస్లిములకు మాత్రమే సలాము చేస్తారు. ఇది మంచి అలవాటు కాదు. ముస్లిములందరూ పరస్పరం సోదరులు కనుక ఎవరు తటస్థపడ్డా, వారికి సలాము చెయ్యాలి. మొదట సలాము చేసే వ్యక్తికి ఎక్కువ పుణ్యం లభిస్తుందని ఒక హదీసులో ఉంది.

12-1 ఈ సంప్రదాయం మొత్తం సత్ప్రవర్తనకు మూలం వంటిది. మనిషి సాధారణంగా సర్వమానవులు ముఖ్యంగా తన తోటి ముస్లిం సోదరుల సంక్షేమాన్ని కాంక్షించాలి, వారి శ్రేయోభిలాషిగా ప్రవర్తించాలి. అటువంటి మనిషి యొక్క ప్రపంచం, పరలోకం రెండూ హాయిగా, సుఖంగా గడుస్తాయి.

14-1 ఖస్-తలానీ ఇలా వ్యాఖ్యానించారు: ప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) మీద విశ్వాసంతో కూడుకున్న ప్రేమను కలిగి ఉండాలి, భౌతికపరమైన ప్రేమ కాదు, అంటే ప్రతి విషయంలోనూ ఆయన గారిని అనుసరించాలి. భౌతికపరంగానైతే, అబూ తాలిబ్ ప్రవక్త (స)ను అత్యధికంగా ప్రేమించేవారు; కాని ఆయన విశ్వసించలేదు.

## 9వ అధ్యాయం
## విశ్వాస మాధుర్యం

**15.** మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా బోధించారని హ|జత్ అనస్ (రజిఅన్) చెప్పారు: మూడు విషయాలు ఎవరిలోనైతే ఉంటాయో అతను విశ్వాస రుచిని ఆస్వాదిస్తాడు. ఒకటి; అతను అందరికంటే, అన్నిటికంటే అల్లాహ్‌ను, ఆయన ప్రవక్త (స)ను అధికంగా ప్రేమించటం. రెండు; కేవలం అల్లాహ్ కోసమే ఎవరితోనైనా స్నేహం చెయ్యటం.[1] మూడు; మళ్ళీ అవిశ్వాసం వైపునకు మరలటం అనేది, అగ్నిగుండంలో పడవేయబడటం అతనికి ఎంత అయిష్టమో, అంత అయిష్టంగా ఉండటం.

## 10వ అధ్యాయం
## అన్సారులను ప్రేమించటం కూడా విశ్వాసానికి చిహ్నమే

**16.** మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హ|జత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) చెప్పారు: "అన్సారులను ప్రేమించటం విశ్వాసానికి చిహ్నం. అన్సారులను ద్వేషించటం కాపట్యానికి సంకేతం."[1]

## 11వ అధ్యాయం

**17.** సహచరుల బృందం ఒకటి తనతో ఉండగా మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా బోధించారని హ|జత్ ఉబాదా బిన్ సామిత్ (రజిఅన్) చెప్పారు: హ|జత్ ఉబాదా బదర్ సంగ్రామంలో పాల్గొన్నారు. ఉఖబా ప్రతిజ్ఞ జరిగిన రాత్రి ఈయన నఖీబ్[1] (ఆరుగురు సభ్యులున్న బృందానికి నాయకుడు)గా ఉన్నారు: "ఈ

---

15-1 అంటే కేవలం అల్లాహ్ ప్రసన్నతను పొందే ఉద్దేశ్యంతో చెయ్యటం, ప్రాపంచిక ప్రయోజనం కోసం కాదు. ఉదాహరణకు, ధర్మపరాయణులైన పండితుల్ని షరీయత్ ప్రకారం జీవించే సూఫీలను ప్రేమించటం.

16-1 మదీనా నగరంలోని అన్సారులు మహాప్రవక్త ముహమ్మద్(స)కు ఆశ్రయమిచ్చారు, ఆయన గారితో కలిసి, అవిశ్వాసులతో పోరాడారు. వారి తెగలు రెండు ఉండేవి– ఒకటి, ఔస్, రెండోది, ఖజ్‌రజ్. అప్పుడు ఏ జాతి వారూ ఆయనకు తమ సహాయాన్ని అందించలేదు.

17-1. ఆ రాత్రి జరిగిన గాథ సీరత్ గ్రంథాలలో ప్రస్తావించబడింది. అన్సారులు ఆ రాత్రి ముష్రిక్కుల నుంచి దాక్కుని ప్రవక్త మహనీయునితో బైఅత్ (ప్రమాణం) చేశారు, తమ సహాయసహకారాలు అందిస్తామని నిర్ద్వంద్వంగా వాగ్దానం చేశారు. ఆ

**విషయాలను గురించి మీరు నాతో ప్రమాణం చేయండి[2] అల్లాహ్‌తో పాటు ఇతరులను దేవుళ్లుగా చెయ్యము, దొంగతనం చెయ్యము, వ్యభిచారం చెయ్యము, మా సంతానాన్ని హత్య చెయ్యము,[3] అమాయకులపై అభాండాన్ని మోపము, మంచి పనులు చెయ్యమని ఆజ్ఞాపించినప్పుడు అవిధేయత చూపము." మహాప్రవక్త (సఅసమ్) ఇంకా ఇలా అన్నారు: "ఎవరైతే ఈ ప్రమాణాన్ని పూర్తి చేస్తారో, వారికి అల్లాహ్ బహుమానాన్ని ప్రసాదిస్తాడు. ఎవరైనా ఈ పాపాలలో కొన్నింటిని చేసినట్లయితే, ఒకవేళ వారు ఈ లోకంలోనే వాటికి ప్రాయశ్చిత్తంగా శిక్షకు గురి అయితే అప్పుడు ఆ పాపాలు వారి నుంచి తొలగిపోతాయి.[4] ఎవరైనా ఈ పాపాలలో కొన్నింటిని చేసినట్లయితే; ఒకవేళ అల్లాహ్ వాటిని ఈ లోకంలో కప్పిపుచ్చినట్లయితే ఇక పరలోకంలో వారిని క్షమించటం అనేది లేదా శిక్షించటం అనేది అల్లాహ్ అధీనంలో ఉంటుంది."[5]**

**ఉబాదా బిన్ సామిత్ ఇలా అన్నారు: "అప్పుడు మేము ఈ విషయాలను గురించి మహాప్రవక్త (స)కు ప్రమాణం చేశాము."**

## 12వ అధ్యాయం

### ఉపద్రవానికి భయపడి దూరంగా పారిపోవటం కూడా ధార్మికతే

**18) మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా బోధించారని హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) ఉల్లేఖించారు: "ఆ కాలం దగ్గరలోనే ఉంది, అప్పుడు**

---

విధంగా బైఅత్ చేసిన వారు 37 మంది. మహాప్రవక్త(స) వారిపై నఖీబులు (దైవం వైపున పర్యవేక్షకులు)గా 12 మందిని నియమించారు. ఆ నఖీబులలో హజ్రత్ ఉబాదా కూడా ఒకరు.

17-2. ఈ హదీసు ద్వారా పశ్చాత్తాపంతో కూడుకున్న ప్రమాణం ఉందనే విషయం నిరూపితమవుతోంది. ఈ విషయం మనకు సూఫీల ఆచరణలో కనిపిస్తుంది.

17-3. అంటే కుమార్తెలను హత్య చెయ్యము అని. ఆ కాలంలో ముష్రిక్కులు ఆడ పిల్లలను సజీవంగా పాతిపెట్టేవారు. ఇది వారి సంప్రదాయంగా ఉండేది.

17-4. ఈ హదీసు ద్వారా వ్యక్తమయ్యే విషయమేమిటంటే, షరీయత్ ప్రకారం శిక్షించినప్పుడు, మనిషి చేసిన పాపాలు సమసిపోతాయనే విషయం యదార్థం. కొందరేమన్నారంటే, పశ్చాత్తాపం లేకుండా పాపాలు నశించవు, షరీయత్ ప్రకారం శిక్షించటం అనేది ప్రజలకు గుణపాఠం నేర్పటానికి జరుగుతుంది.

17-5. అంటే ప్రపంచంలో అతన్ని శిక్ష నుంచి కాపాడటం, అతని రహస్యాన్ని బట్ట బయలు చెయ్యకుండా ఉండటం.

గొర్రెలు ఒక ముస్లిమ్ యొక్క విలువైన సంపద అవుతాయి. వాటిని మేపుకుంటూ అతను పర్వత శిఖరాల మీదకు, వర్షాలు బాగా కురిసే ప్రాంతాలకు పోతాడు. అతను తన ధర్మాన్ని ఉపద్రవాల బారి నుండి కాపాడుకునే నిమిత్తం ఇలా పారిపోతాడు."

## 13వ అధ్యాయం

మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారు; "నేను అల్లాహ్‌ను గురించి మీ కంటే బాగా తెలిసివాణ్ణి. వాస్తవిక జ్ఞానం హృదయానికి సంబంధించినది. ఎందుకంటే దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "అయితే హృదయ పూర్వకంగా మీరు చేసే ప్రమాణాలను గురించి ఆయన తప్పకుండా అడుగుతాడు. *(పవిత్ర ఖుర్‌ఆన్ 2 : 225)*

**19.** హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) ఇలా సెలవిచ్చారు: దైవప్రవక్త (సఅసమ్) ఏవైనా ఆచరణలను గురించి ప్రజలను ఆజ్ఞాపించినప్పుడు, వారు సులభంగా చెయ్య గలిగిన ఆచరణలను గురించి మాత్రమే ఆజ్ఞాపించేవారు (కఠినమైన ఆరాధనలు చెయ్యమని బోధించేవారు కాదు). ఒకసారి ప్రవక్త (స) గారి సహచరులు ఆయనతో ఇలా విన్నవించుకున్నారు: "మహాప్రవక్తా! మేము మీ అంతటి వాళ్ళం కాము. నిస్సందేహంగా దేవుడు మీ పూర్వపు దోషాలను, భవిష్యత్తులోని మీ దోషాలను మన్నించాడు. కనుక మేము మీ కంటే ఎక్కువగా ఆరాధనలు చెయ్యవలసి ఉంటుంది." అప్పుడు ప్రవక్త మహనీయులు(స) ఆగ్రహోదగ్రులయ్యారు. ఆయనగారి పవిత్ర ముఖం మీద కోపపు ఛాయలు పొడసూపసాగాయి. తరువాత ఆయన ఇలా సెలవిచ్చారు: "మీ అందరికంటే ఎక్కువగా అల్లాహ్‌కు భయపడేవాణ్ణి అల్లాహ్‌ను ఎరిగిన వాణ్ణి నేను."

## 14వ అధ్యాయం

**అవిశ్వాసం వైపునకు మరలిపోవటాన్ని, అగ్నిలో పడవేయబడే అంత అయిష్టంగా, చెడుగా భావించటం కూడా విశ్వాసానికి సంబంధించిన విషయమే.**

**20.** మహనీయ ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అనస్ (రజిఅన్) ఉల్లేఖించారు : ఎవరిలోనైతే మూడు విషయాలు ఉంటాయో, వారు విశ్వాస మాధుర్యాన్ని చవిచూస్తారు. ఒకటి; అల్లాహ్‌ను, ఆయన ప్రవక్త (స)ను అందరికంటే, అన్నిటికంటే అధికంగా ప్రేమించే వ్యక్తి. రెండు; తోటి మానవుణ్ణి ప్రేమిస్తే, అల్లాహ్ కోసం మాత్రమే అతన్ని ప్రేమించేవాడు. మూడు; దేవుడు కరుణించి అతన్ని అవిశ్వాసంలో నుంచి బయటికి లాగినప్పుడు, మళ్ళీ అవిశ్వాసం వైపునకు పోవటాన్ని అగ్నిలో పడవేయబడినంత అయిష్టంగా, చెడుగా భావించే వ్యక్తి.

# 15వ అధ్యాయం

## విశ్వాసులు తమ ఆచరణల్లో ఒకరిని మరొకరు మించిపోవటం

**21.** ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారని అబూ సయీద్ ఖుద్‌రీ (రజిఅన్) ఉల్లేఖించారు: స్వర్గవాసులు స్వర్గంలోకి, నరకవాసులు నరకంలోకి ప్రవేశించినప్పుడు, దేవుడు తన దూతలతో "ఎవరి హృదయంలోనైనా రవ్వంత విశ్వాసమున్నాసరే అతన్ని నరకం నుంచి బయటకు తీయండి." అప్పుడు నరకవాసులు నరకం నుంచి బయటకు తీయబడతారు; వారు నరకంలో కాలి బాగా నల్లబడిపోయి ఉంటారు. తరువాత వారు జీవితాన్ని ప్రసాదించే కాలువలో వేయబడతారు. ఈ హదీసు ఉల్లేఖకుల్లో ఒకరైన ఇమామ్ మాలిక్ ఇలా అన్నారు: "అప్పుడు వారు పునరుజ్జీవనం పొందుతారు; విత్తనం, పునరుజ్జీవనం పొందటంతో పాటు నీరు ప్రవహించే చోట మొలిచినట్లుగా. (ఓ మనిషీ) ఆ విత్తనం పచ్చగా దాని పేటలు పరస్పరం పెనవేసుకుని బయల్పడటాన్ని నీవు చూడలేదా." వుహైబ్ ఇలా అన్నారు: అమ్ర్[1] మాతో, "నహ్రె హయాత్" అని చెప్పారు. ఆయన ఇంకా, "రవ్వంత విశ్వాసానికి బదులుగా రవ్వంత మేలు" అని అన్నారు.[2]

**22.** మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా చెప్పారని హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) అన్నారు: "ఒకసారి నేను నిదురలో ఉండగా, నాకు ఒక కల వచ్చింది. ఆ స్వప్నంలో కొందరు ప్రజలు నా ముందుకు తీసుకురాబడటాన్ని నేను చూశాను. వారు చొక్కాలు తొడుక్కొని ఉన్నారు; కొందరి చొక్కాలు రొమ్ముల వరకు ఉన్నాయి, మరికొందరివి వాటి కంటే కూడా పొట్టివి. చివరకు హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజిఅన్) నా వద్దకు తీసుకురాబడ్డారు. ఆయన తాను తొడుక్కున్న చొక్కాను సర్దుకుంటున్నారు." అప్పుడు మహాప్రవక్త (సఅసమ్) గారి అనుచరులు దానికి వివరణ చెప్పమని ఆయన్ని కోరారు. ఆయన (స) "ధర్మం" అని సమాధానం చెప్పారు.

---

21–1. రెండు పదాల భావం ఒక్కటే. "నహ్రె హయా" మరియు "నహ్రె హయాత్"ల అర్థం మారిపోతుంది. ఇందుకనే చాలా మంది పండితుల ప్రకారం "నహ్రె హయా" సరయినది కాదు, నిజం కాదు. 'నహ్రె హయాత్' పరలోకంలోని ఒక సెలయేరు పేరు. దాని ప్రత్యేకత ఏమిటంటే, మృతుణ్ణి అందులో పడవేస్తే, మళ్లీ బ్రతుకుతాడు.

## 16వ అధ్యాయం

### సిగ్గు విశ్వాసంలోని ఒక భాగం

**23.** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఒకసారి మహాప్రవక్త (సఅసమ్)కు మార్గమధ్యంలో ఒక అన్సార్ పురుషుడు కనిపించాడు. అతను తన సోదరుణ్ణి, "నీవు ఎందుకు మరీ అంత ఎక్కువగా సిగ్గుపడతావు?" అని మంద లిస్తున్నాడు. అప్పుడు మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) అతనితో, "అతన్ని ఏమీ అనబాకు. ఎందుకంటే వ్రీడ (సిగ్గు) కూడా విశ్వాసంలోని ఒక భాగమే." అన్నారు.

## 17వ అధ్యాయం

(దివ్యఖుర్ఆన్‌లోని ఈ వాక్యానికి వ్యాఖ్యానంగా) "తరువాత ఒకవేళ వారు పశ్చాత్తాప పడితే, నమాజును స్థాపిస్తే, జకాతు ఇస్తే వారిని విడిచిపెట్టండి." **(9:5)**

**24.** మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా బోధించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజిఅన్) చెప్పారు: "ప్రజలు (అవిశ్వాసులు), అల్లాహ్ తప్ప సత్యదైవం మరొకడెవ్వడూ లేడనీ, ముహమ్మద్ (సఅసమ్) ఆయన ప్రవక్త అనీ సాక్ష్యమిచ్చే వరకు, నమాజును చక్కగా నియమబద్ధంగా చేసే వరకు, జకాతు ఇచ్చే వరకు నేను వారితో పోరాడాలని దేవుడు నన్ను ఆజ్ఞాపించాడు. కనుక ఈ విషయాలను పాటించినప్పుడు, వారు తమ ప్రాణాలను, తమ సిరిసంపదలను నా నుంచి కాపాడుకుంటారు, ఇస్లాం చట్టం ప్రకారం తప్ప. అయితే వారి (మనస్సులో ఉన్న విషయాలను) గురించి అల్లాహ్ లెఖ్ఖ తీసుకుంటాడు."

## 18వ అధ్యాయం

### విశ్వాసం ఒక ఆచరణ అని అనే వ్యక్తికి ఈ ఖుర్ఆను వాక్యం ఒక ప్రమాణం

వారితో ఇలా అనబడుతుంది: "ఇక మీరు ఇక్కడ శాశ్వతంగా ఉంటారు. మీరు ప్రపంచంలో చేసిన కర్మల కారణంగా మీరు ఈ స్వర్గానికి వారసులయ్యారు" **(జుఖ్రుఫ్ : 72).** మత విద్వాంసులు చాలా మంది ఈ ఖుర్ఆను వాక్యం "కనుక నీ ప్రభువు సాక్షిగా మేము తప్పకుండా వారందరినీ 'మీరేమి చేస్తూ ఉండే వారు?' అని అడుగుతాము" **(15:92)** గురించి వ్యాఖ్యానిస్తూ, "అంటే, లా ఇలాహ ఇల్లల్లాహ్ (అల్లాహ్ తప్ప మరొక దేవుడు లేడు) అని అని పలికినందుకు." ఇంకా అస్సాఫ్ఫాత్ సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "ఇలాంటి విజయం కోసమే కర్మశీలురు కర్మలు చేయాలి." **(37 : 61)**

**25.** హజ్రత్ అబూ హురైరహ్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్)ను, ప్రజలు, "(మనిషి చేసే పనుల్లో) ఏ పని శ్రేష్ఠమైనది?" అని అడిగారు. దానికి ఆయన, "అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను విశ్వసించటం" అని సెలవిచ్చారు. వారు మళ్ళీ అడిగారు, "ఆ తరువాత ఏ పని శ్రేష్ఠమైనది?" అని. దానికి ఆయన, "అల్లాహ్ మార్గంలో పోరాడటం" అని చెప్పారు. వారు మళ్ళీ, "ఆ తరువాతనో" అని అడిగారు. దానికి ఆయన, "అల్లాహ్ ప్రసన్నత కోసం చేయబడే హజ్ యాత్ర" అని సమాధానం చెప్పారు.

## 19వ అధ్యాయం

ఎవరైనా ఇస్లామ్‌ను చిత్తశుద్ధితో స్వీకరించకుండా, కేవలం బలవంతంగానో లేదా ప్రాణభయం వల్లనో ఇస్లామ్‌ను స్వీకరిస్తే, అతను నిజమైన విశ్వాసి కాలేడు. ఈ విషయాన్ని ఖుర్‌ఆనులోని ఈ వాక్యం ధ్రువీకరిస్తోంది: "ఈ సంచార అరబ్బులు, 'మేము విశ్వసించాము' అని అంటారు. వారితో ఇలా అను; "మీరు విశ్వసించలేదు. మేము లొంగిపొయ్యాము" అని అనండి. **(49 : 14)**

ఒకవేళ వారు నిజంగానే హృదయపూర్వకంగా ఇస్లామ్‌ను స్వీకరిస్తే, వారి ఇస్లామ్ ఖుర్‌ఆనులోని ఈ వాక్యం ప్రకారం ఉంటుంది. "అల్లాహ్ దృష్టిలో అసలు ధర్మం కేవలం ఇస్లామ్ ధర్మం మాత్రమే." **(3 : 19)**

**26.** హజ్రత్ సాద్ బిన్ అబీ వఖాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) కొంత మందికి కొంత సొమ్మును పంచిపెట్టారు. అప్పుడు నేను అక్కణ్ణే కూర్చోని ఉన్నాను. కాని ఆయన (స) ఒక మనిషికి మాత్రం సొమ్ము ఇవ్వలేదు. అతను అక్కడ ఉన్న వారందరి కంటే నాకు చాలా ఇష్టమైన వాడు. అప్పుడు నేను, "దైవప్రవక్తా! మీరు ఫలానా వ్యక్తికి సొమ్ము ఇవ్వలేదు. దేవుని సాక్షిగా! అతను నా దృష్టిలో నమ్మదగిన విశ్వాసి" అని అన్నాను. దానికి ఆయన (స), "లేక కేవలం ముస్లిమ్" అని సెలవిచ్చారు. తరువాత నేను కొంచెంసేపు మౌనంగా ఉండి పోయాను. కాని అతన్ని గురించి నాకు ఏదైతే తెలుసో అది నన్ను ఊరుకోనివ్వలేదు, నన్ను ఉత్తేజపరచింది. ఆ కారణంగా నేను రెండోసారి మహాప్రవక్త (స)కు ఇలా విన్నవించుకున్నాను. "మీరు ఫలానా వ్యక్తిని ఎందుకు వదలిపెట్టారు? దేవుని సాక్షిగా! నా దృష్టిలో అతను ఒక విశ్వాసి" దానికి ఆయన (స), "లేక కేవలం ముస్లిమ్" అని సెలవిచ్చారు. ఆ తరువాత నేను కొంచెంసేపు మౌనంగా ఉండిపోయాను. కాని నాకు అతన్ని గురించి ఏదైతే తెలుసో అది నన్ను ఊరుకోనివ్వలేదు, ఆవేశపరచింది. నేను

మూడోసారి కూడా పై విధంగానే మహాప్రవక్త (స)కు విన్నవించుకున్నాను. ఆయన (స) కూడా తాను పైన చెప్పిన విధంగానే సెలవిచ్చారు. ఆ తరువాత ఆయన (స) ఇలా సెలవిచ్చారు. : "సాద్! నేను ఒక మనిషికి ఇస్తాను, కాని మరొక మనిషిని అతనికంటే మంచివాడుగా భావిస్తాను. ఎందుకంటే అల్లాహ్ అతన్ని (నేను ఇచ్చిన మనిషిని) బోర్లా పడవేసి నరకంలోకి నెట్టేస్తాడేమో అని నేను భయపడుతున్నాను."

## 20వ అధ్యాయం

**సలామ్ చేయటం కూడా విశ్వాసంలోని ఒక అంశమే.** హజ్రత్ అమ్మార్ ఇలా చెప్పారు: "మూడు విషయాలు ఎవరిలోనైతే ఉంటాయో, అతను విశ్వాసాన్ని పొందుతాడు. ఒకటి; అతను తన స్వయానికి న్యాయం చేసుకోవాలి. రెండు; అందరికీ సలాము చేయాలి. మూడు; పేదరికంలో ఉన్నా, అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టాలి."

**27.** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ ఇలా ఉల్లేఖించారు; మహాప్రవక్తను ఒక మనిషి "ఇస్లామ్ ధర్మం ప్రకారం ఏ పనులు ఉత్తమమైనవి?" అని అడిగాడు. దానికి ఆయన (సఅసమ్), "(పేదలకు) అన్నదానం చేయటం, ప్రతి మనిషికి సలాము చేయటం, అతన్ని మీరు ఎరిగినాసరే, ఎరగకపోయినా సరే" అని సమాధానం చెప్పారు.

## 21వ అధ్యాయం

### భర్తకు కృతఘ్నత చూపటం కూడా ఒక రకమైన అవిశ్వాసమే. అవిశ్వాసపు అంతస్తులు భిన్నంగా ఉంటాయి

**28.** మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) చెప్పారు; (ఒక సుదీర్ఘమైన హదీసులో) "నేను నరకాన్ని చూశాను. అక్కడ స్త్రీలు అధిక సంఖ్యలో ఉండటాన్ని గమనించాను. వారు అవిశ్వాసానికి పాల్పడుతున్నారు. ప్రజలు, "వారు అల్లాహ్ పట్ల అవిశ్వాసం చూపుతున్నారా?" అని అడిగారు. దానికి ఆయన (స), "లేదు" భర్త పట్ల అవిశ్వాసం చూపుతున్నారు. అతనికి కృతఘ్నత చూపుతారు. అతను చేసిన మేలును మరచిపోతారు. ఒకవేళ నీవు ఒక స్త్రీకి జీవిత పర్యంతం మేలు చేసినా, ఆ తరువాత నీలో ఆమెకు నచ్చని విషయం ఏదైనా కనిపిస్తే, అప్పుడు ఆమె, "నీవు ఎన్నడూ నాకు ఏ మేలూ చేయలేదు" అని అంటుంది.

## 22వ అధ్యాయం

అజ్ఞానం వల్ల మనిషి పాపాలు చేస్తాడు. పాపాత్ముడు తాను చేసే పాపాల వల్ల అవిశ్వాసి కాడు. అయితే అతను గనక షిర్కు చేస్తే లేదా అవిశ్వాసపు నమ్మకం కలిగి ఉంటే అప్పుడు అవిశ్వాసి అవుతాడు. ఎందుకంటే, మహాప్రవక్త (సఅసమ్) హ్రజత్ అబూజర్ (రజిఅన్)తో "నీలో ఇంకా అజ్ఞాన కాలపు లక్షణాలు ఉన్నాయి." అని అన్నారు. అల్లాహ్ ఖుర్ఆనులో 'నిసా' సూరాలో ఇలా సెలవిచ్చాడు: "అల్లాహ్ క్షమించనటువంటిది కేవలం షిర్కును మాత్రమే. అది తప్ప ఏ పాపాన్నయినా ఆయన తాను ఇష్టపడిన వారి కోసం క్షమిస్తాడు" **(4 : 48)**. "ఒకవేళ విశ్వాసులలోని రెండు వర్గాల వారు పరస్పరం పోట్లాడుకుంటే, వారి మధ్య రాజీ కుదిరించండి." **(49 : 9)** అల్లాహ్, ఆ ఇరు వర్గాల వారు ముస్లిములే అన్నాడు.

**29.** అహ్నాఫ్ బిన్ ఖైస్ ఇలా ఉల్లేఖించారు. నేను ఆ మనిషికి సహాయం చేసే ఉద్దేశ్యంతో బయలుదేరాను. మార్గమధ్యంలో అబూ బక్ర్ (రజిఅన్) నన్ను కలిసి "ఎక్కడికి పోతున్నావు?"అని అడిగారు. దానికి నేను ఆ మనిషికి సహాయం చేద్దామని వెళుతున్నాను అని చెప్పాను. అప్పుడు అబూ బక్ర్ (రజిఅన్) ఇలా అన్నారు: "తిరిగి ఇంటికి వెళ్ళిపో. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిస్తూ ఉండగా నేను విన్నాను : 'ఇద్దరు ముస్లిమ్‌లు తమ తమ కరవాలాలను ఎత్తి పోరాడినప్పుడు, హంతకుడు, హతుడు ఇద్దరూ నరకానికి పోతారు." అప్పుడు నేను "మహనీయ ప్రవక్తా! హంతకుడైతే తప్పకుండా నరకానికే పోతాడు. హతుడు నరకవాసి ఎందుకవుతాడు?" అని అడిగితే దానికి మహాప్రవక్త (సఅసమ్), "ఎందుకంటే అతడు తన సహచరుణ్ణి చంపే ఉద్దేశ్యంతో కరవాలాన్ని ఎత్తాడు" అని సమాధానం చెప్పారు.

**30.** అల్ మారూర్ ఇలా అన్నారు : నేను అబూజర్ (రజిఅన్)ను రబజలో కలిశాను. ఆయన ఒక జత దుస్తులు తొడుక్కుని ఉన్నారు. ఆయన బానిస కూడా అటువంటి జతనే ధరించి ఉన్నాడు. నేను ఆయన్ని, దీనికి కారణమేమిటని అడిగాను. దానికి ఆయన ఇలా సమాధానం చెప్పారు: "నేను అతని తల్లిని దూషిస్తూ అతన్ని తిట్టాను. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) నాతో ఇలా అన్నారు: 'నీవు అతని తల్లిని తిడుతూ అతన్ని దూషించావు. అజ్ఞాన కాలపు లక్షణాలు నీలో ఇంకా ఉన్నాయి. మీ బానిసలు మీకు సోదరులు. అల్లాహ్ వారిని మీ అధీనంలో ఉంచాడు.

కనుక ఎవరు తమ సోదరులను తమ అధీనంలో ఉంచుకుంటారో, వారు తాము తినేదే వారికీ తినిపించాలి. తాము ధరించే బట్టల్నే వారికీ పెట్టాలి. వారు చేయలేని పనిని వారి చేత చేయించరాదు. ఒకవేళ అలా చేయించదలిస్తే, వారికి సహాయపడాలి".

## 23వ అధ్యాయం

### ఒక పాపం ఇంకొక పాపం కంటే చిన్నదిగా ఉంటుంది

**31.** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మసూద్ (రజిఅన్) ఇలా చెప్పారు: "అల్ అన్ఆమ్" సూరాలోని ఈ వాక్యం అవతరించినపుడు; "వాస్తవానికి విశ్వసించిన వారికే, తమ విశ్వాసాన్ని పాపంతో కలుషితం చేయని వారికే శాంతి లభిస్తుంది, వారు మాత్రమే రుజుమార్గంపై ఉన్నారు" (6 : 82). ప్రవక్త (స) సహచరులు ఇలా అడిగారు: "దైవప్రవక్తా! ఇది కష్టసాధ్యమైన విషయం కదా! మాలో పాపం చేయని వాడెవడు?" అప్పుడు అల్లాహ్ "లుఖ్మాన్" సూరాలోని ఈ వాక్యాన్ని అవతరింప జేశాడు: "ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా చేయటం అతి పెద్ద దౌర్జన్యం (జులుం)." (31 : 13)

## 24వ అధ్యాయం

### కపటుడి లక్షణాలు

**32.** మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూ హురైరహ్ (రజిఅన్) చెప్పారు: "కపటుడి లక్షణాలు మూడు: అతడు మాట్లాడితే అబద్ధమే మాట్లాడతాడు; వాగ్దానం చేస్తే భంగపరుస్తాడు, నమ్మకంతో అతని వద్ద ఏదైనా వస్తువు పెడితే దానిని కబళిస్తాడు (అతన్ని నమ్మితే ద్రోహం చేస్తాడు)."

**33.** మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజిఅన్)చెప్పారు: నాలుగు విషయాలు ఎవరిలో నయితే ఉంటాయో, అతను పరమ కపటి. ఈ నాలుగు విషయాలలో ఏదైనా ఒక విషయం ఎవరిలోనైనా ఉంటే, దానిని అతను త్యజించనంత వరకు అతనిలో కపటి లక్షణం ఒకటి ఉంటుంది. 1.అతని వద్ద నమ్మకంతో ఏదైనా ఒక వస్తువు ఉంచితే, అతను దానిని కాజేస్తాడు. ఆ విధంగా నమ్మకద్రోహానికి ఒడిగడతాడు. 2. అతను పలికినప్పుడు అబద్ధమే పలుకుతాడు. 3. అతను వాగ్దానం చేస్తే దానిని భంగపరుస్తాడు. 4. తగాదా పడినపుడు దుర్భాషకు దిగుతాడు.

## 24వ అధ్యాయం

### షబేఖద్ర్ (విలువైన రాత్రి)లో ఆరాధనలు చేయటం కూడా విశ్వాసానికి చెందిన విషయమే

**34.** మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూ హురైరహ్ (రజిఅన్) చెప్పారు. "షబేఖద్ర్ నాడు ఎవరైనా నిష్కల్మషమైన విశ్వాసభావంతో, పుణ్య ఫలం లభిస్తుందనే సంకల్పంతో ఆరాధనలు చేసినట్లయితే, అతను పూర్వం చేసిన పాపాలన్నీ క్షమించబడతాయి."

## 26వ అధ్యాయం

### జిహాద్ (అల్లాహ్ మార్గంలో సమరం) చేయటం విశ్వాసానికి చెందిన ఒక భాగం

**35.** హజ్రత్ అబూ హురైరహ్ (రజిఅన్) కథనం ప్రకారం, మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారు: "(అల్లాహ్ ఇలా అంటున్నాడు) ఎవరైనా నా మార్గంలో పోరాడటం కోసం బయలుదేరితే, అతను అలా బయలుదేరటానికి, నా మీద, నా ప్రవక్తల మీద అతనికి ఉన్నటువంటి విశ్వాసమే కారణమయితే, మరొక విషయం ఏదీ (పేరు ప్రఖ్యాతులు, విజయధనం) ప్రేరణ కాకపోయినట్లయితే, నేను అతనికి జిహాద్ చేసినందుకు పుణ్యఫలాన్నీ, విజయధనాన్నీ ప్రసాదించి అతన్ని సురక్షితంగా తిరిగి స్వగృహానికి పంపిస్తాను. లేదా ఒకవేళ అతను అమరగతిని పొందితే, అతన్ని నేను స్వర్గానికి తీసుకుపోతాను." మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారు. "నా అనుచర సంఘానికి భారం కాకుండా ఉన్నట్లయితే జిహాద్ కోసం వెళ్ళే ప్రతి సైన్యంలో నేనూ పాల్గొని ఉండేవాణ్ణి. అసలు అల్లాహ్ మార్గంలో చంపబడటం మళ్లీ బ్రతకటం మళ్లీ చంపబడటం తరువాత మళ్లీ బ్రతకటం ఆ తరువాత మళ్లీ చంపబడటం" అనేది నా ఆకాంక్ష.

## 27వ అధ్యాయం

### రమజాను మాసం రాత్రులలో నఫిల్ నమాజులు (తరావీహ్ ప్రార్థనలు) చేయటం కూడా విశ్వాసంలోని ఒక భాగమే

**36.** మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూ హురైరహ్ (రజిఅన్) చెప్పారు: "ఎవరైనా రమజాను మాసంలో విశ్వాస భావంతో, పుణ్యఫలాపేక్షతో ఆరాధనలు చేస్తే, అతను పూర్వం చేసిన పాపాలన్నీ క్షమించబడతాయి."

## 28వ అధ్యాయం

**పుణ్యఫలం లభిస్తుందనే ఉద్దేశ్యంతో రమజాను మాసంలో ఉపవాసాలు ఉండటం కూడా విశ్వాసంలోని ఒక భాగమే**

**37.** మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూ హురైరహ్ (రజిఅన్) చెప్పారు; "ఏ వ్యక్తి అయినా రమజాను మాసంలో విశ్వాస భావంతో, పుణ్యం లభిస్తుందనే ఉద్దేశ్యంతో ఉపవాస వ్రతాన్ని పాటించినట్లయితే, అప్పుడు అతను పూర్వం చేసిన పాపాలన్నీ మన్నించబడతాయి."

## 28వ అధ్యాయం

**ఇస్లామ్ ధర్మం సరళమైనది. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారు: సత్యమైన, సరియైన, సులభమైన ధర్మమే అల్లాహ్‌కు ఎంతో ప్రియమైనది.**

**38.** మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అబూ హురైరహ్ (రజిఅన్) చెప్పారు : "ఇస్లాం ధర్మం ఎంతో సులభమైనది. ఇందులో ఏమాత్రం సందేహం లేదు. ఎవరైనా ధర్మం విషయంలో అతిగా వ్యవహరించినట్లయితే అది అతనిపై ప్రాబల్యం వహిస్తుంది. కాబట్టి మధ్యస్థ మార్గాన్ని అవలంబించండి. అత్యుత్తమమైన కార్యం చేయలేకపోయినా, దానికి దగ్గరగా ఉండటానికి ప్రయత్నించండి; పుణ్యఫలం లభిస్తుందనే ఆశతో సంతోషంగా ఉండండి; ఉదయం పూట, సాయంత్రం పూట, రాత్రి చివరి భాగంలోనూ సాధన (ఆరాధన) చేసి సహాయం పొందండి."

## 30వ అధ్యాయం

**నమాజు చేయటం ఇస్లామ్‌లోని ఒక భాగమే. దివ్యఖురానులోని "బఖరా" సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "మీ విశ్వాసాన్ని అల్లాహ్ ఏ మాత్రం వృథా కానివ్వడు" (2-143) . అంటే బైతుల్ మఖ్దిస్ వైపునకు తిరిగి పూర్వం మీరు చేసిన నమాజులను వృథా కానివ్వడు అని భావం.**

**39.** బరా బిన్ ఆజిబ్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) మొదటిసారి మదీనాకు విచ్చేసినప్పుడు, ఆయన అన్సారులైన తన అమ్మమ్మగారింట్లోనో, మామయ్య గారింట్లోనో విడిది చేశారు. అప్పుడు ఆయన పదహారు లేక పదిహేడు మాసాల వరకు బైతుల్ మఖ్దిస్ వైపునకు తిరిగి నమాజు చేశారు. కాని ఆయన (స) తన దిక్కు కాబా అయితే బాగుంటుందని కోరుకునేవారు. కాబా వైపునకు తిరిగి ఆయన (స) చేసిన మొదటి నమాజు అసర్ వేళ చేసే నమాజు. ఆయన (స) గారితో పాటు ఈ నమాజులో ఇతరులు కూడా కొందరు పాల్గొన్నారు.

ఆయన (స)తో పాటు ఈ నమాజులో పాల్గొన్న ఒక వ్యక్తి ఒక మసీదుకు పోవటం జరిగింది. అప్పుడు ఆ మసీదులో నమాజు చేస్తున్న వారు బైతుల్ మఖ్దిస్ వైపునకు తిరిగి వున్నారు, మరియు రుకూలో ఉన్నారు. ఆ వ్యక్తి వారిని ఉద్దేశించి ఇలా అన్నాడు; "నేను అల్లాహ్ మీద ప్రమాణం చేసి సాక్ష్యమిస్తున్నాను; ఇప్పుడిప్పుడే నేను మహాప్రవక్త (స) గారితోపాటు కాబా వైపునకు తిరిగి నమాజు చేశాను." ఈ విషయాన్ని విన్నంతనే, వారందరూ నమాజులోనే కాబా వైపునకు తిరిగారు. మహా ప్రవక్త (స) బైతుల్ మఖ్దిస్ వైపునకు తిరిగి నమాజు చేస్తూ ఉన్నంత కాలం, యూదులు, క్రైస్తవులు సంతోషిస్తూ ఉండేవారు. ఆయన (స) తన ముఖాన్ని కాబా వైపునకు త్రిప్పినప్పుడు, వారు దానికి అసమ్మతిని తెలియజేశారు. ఇంకా బరా ఈ హదీసులోనే ఇలా ఉల్లేఖించారు; దిక్కు మార్పు జరగక పూర్వం కొందరు మరణించారు, మరికొందరు అమరగతులయ్యారు. వారు బైతుల్ మఖ్దిస్ వైపునకు తిరిగి నమాజు చేస్తూ ఉండేవారు. వారిని గురించి అంటే వారి నమాజులను గురించి ఏమి చెప్పాలో మాకు అర్థం కావటంలేదు. అప్పుడు అల్లాహ్ ఈ వాక్యాన్ని అవతరింపజేశాడు; "మీ విశ్వాసాన్ని అల్లాహ్ ఏ మాత్రం వృధా కానివ్వడు." (అంటే మీ నమాజులను అని అర్థం.)

## 31వ అధ్యాయం

### ఇస్లామ్ ధర్మాన్ని చిత్తశుద్ధితో స్వీకరించిన వ్యక్తి యొక్క శ్రేష్ఠత్వం గురించి :

మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిస్తూ ఉండగా తాను విన్నానని అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) చెప్పారు; "ఎవరైనా ఒక మనిషి ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరిస్తే, దాన్ని అతను చిత్తశుద్ధితో స్వీకరించాలి. అప్పుడు అల్లాహ్ అతను పూర్వం చేసిన అన్ని పాపాలను క్షమిస్తాడు. ఆ తరువాతనే లెఖ్ఖ తీసుకోవటం అనేది ప్రారంభమవుతుంది. ఒక పుణ్యానికి బదులుగా అలాంటిదే పది నుంచి ఏడు వందల పుణ్యాలు వ్రాయబడతాయి. ఒక పాపానికి బదులుగా అటువంటి ఒక్క పాపమే వ్రాయబడుతుంది; ఒకవేళ అల్లాహ్ దాన్ని క్షమిస్తే (అది వ్రాయబడదు).

**40.** మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా ప్రవచించారని అబూ హురైరహ్ (రజిఅన్) చెప్పారు: "మీలో ఎవరైనా చిత్తశుద్ధితో ముస్లిమ్‌గా మారితే, ఆ తరువాత అతను చేసిన ప్రతి పుణ్యానికీ ప్రతిఫలంగా పది నుంచి ఏడు వందల వరకు పుణ్యాలు (అతని ఖాతాలో) వ్రాయబడతాయి; అతను చేసిన ఒక పాపానికి బదులుగా అటువంటి ఒక్క పాపమే వ్రాయబడుతుంది."

## 32వ అధ్యాయం

## నాగా లేకుండా ఎల్లప్పుడూ చెయ్యబడే పని అంటే అల్లాహ్‌కు ఎంతో ఇష్టం

**41.** హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) ఇలా సెలవిచ్చారు : ఒకసారి మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) నా వద్దకు వచ్చారు. అప్పుడు నా దగ్గర ఒక స్త్రీ కూర్చొని వున్నది. "ఆ స్త్రీ ఎవరు?" అని మహాప్రవక్త (స) అడిగారు. దానికి నేను, ఆమె "ఫలానా స్త్రీ" అని సమాధానం చెప్పాను. తరువాత నేను ఆ స్త్రీ ఎక్కువగా నమాజులు చేయటం గురించి ఆయన (స)కు చెప్పాను. అప్పుడు మహాప్రవక్త ముహమ్మద్ (స) నన్ను వారిస్తూ ఇలా అన్నారు: "సులభంగా ఎల్లప్పుడూ చెయ్యగలిగే పనుల్నే చేయండి. ఎందుకంటే, దేవుని సాక్షిగా! అల్లాహ్ (పుణ్యాన్ని ప్రసాదిస్తూ) అలసిపోడు; మీరే అలసిపోతారు. నాగా లేకుండా ఎల్లప్పుడూ చేయబడే పని అంటే అల్లాహ్‌కు ఎంతో ఇష్టం."

## 33వ అధ్యాయం

విశ్వాసం పెరుగుతుంది మరియు తరుగుతుంది. కహఫ్ సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు; "మేము వారికి సన్మార్గం మీద నడవటంలో అభివృద్ధిని ప్రసాదించాము" **(18 : 13)**. ముద్దస్సిర్ సూరాలో; "విశ్వసించిన వారి విశ్వాసం అధికం కావాలని" **(74 : 31)**. మాయిద సూరాలో; "ఈనాడు నేను మీ ధర్మాన్ని మీ కొరకు పరిపూర్ణం చేశాను"**(5 : 3)**. (మొత్తంలో నుండి ఎవరైనా కొంత భాగాన్ని వదలి పెట్టినట్లయితే అది అసంపూర్ణంగా ఉండిపోతుంది.)

**42.** మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అనస్ (రజిఅన్) చెప్పారు : "ఎవరైతే లా ఇలాహ ఇల్లల్లాహ్ (అల్లాహ్ తప్ప ఆరాధ్య దైవం మరొకడెవ్వడూ లేడు) అని అంటారో, ఇంకా అతని హృదయంలో కాస్తంత మంచి తనం ఉన్నా, అతను ఏదో ఒక రోజున తప్పకుండా నరకం నుండి బయటకు వస్తాడు. ఎవరైతే లా ఇలాహ ఇల్లల్లాహ్ (అల్లాహ్ తప్ప ఆరాధ్యుడు మరెవ్వడూ లేడు) అని అంటాడో, అతని మనస్సులో గోధుమ గింజంత మంచితనం ఉన్నా, అతను (ఏదో ఒక రోజున) తప్పకుండా నరకం నుండి బయటకు వస్తాడు. ఎవరైతే లా ఇలాహ ఇల్లల్లాహ్ (అల్లాహ్ తప్ప ఆరాధ్యుడెవ్వడూ లేడు) అని పలుకుతారో ఇంకా అతని హృదయంలో రవ్వంత మంచితనం ఉన్నా, అతను ఏదో ఒక రోజున తప్పకుండా నరకం నుండి బయటకు వస్తాడు."

ఇమామ్ బుఖారీ (రహ్మాలై), అబాన్, ఖతాదా, అనస్ గార్ల కథనాలను ఉదహ

రిస్తూ "మన్ ఖైర్" స్థానంలో 'మన్ ఈమాన్' (విశ్వాసం) అని ఉన్నది, అని సెలవిచ్చారు.

**43.** హ్రజత్ ఉమర్ (రజిఅన్) ఇలా సెలవిచ్చారు: ఒకసారి ఒక యూదుడు ఆయన్ని (హ్రజత్ ఉమర్‌ను) ఇలా అడిగాడు; "ఓ అమీరుల్ మోమినీన్! మీ గ్రంథంలో (దివ్యఖురాను) ఒక వాక్యం ఉంది. మీరందరూ దానిని చదువుతూ ఉంటారు. ఆ వాక్యం గనక మాపై అవతరించి ఉన్నట్లయితే అది అవతరించిన దినాన్ని మేము పండుగ దినంగా పరిగణించి ఉండేవాళ్ళము." హ్రజత్ ఉమర్ (రజిఅన్), "అది ఏ వాక్యం?" అని అడిగారు. దానికి ఆ యూదుడు, "ఆ వాక్యం ఇది" అని ఇలా చదివాడు: "ఈనాడు నేను మీ ధర్మాన్ని మీ కోసం పరిపూర్ణం చేశాను. మీపై నా అనుగ్రహాన్ని పూర్తిచేశాను. మీ కోసం ఇస్లామ్‌ను మీ ధర్మంగా అంగీకరించాను" **(5 : 3)**. హ్రజత్ ఉమర్ (రజిఅన్) ఇలా అన్నారు : "ఆ దినం గురించి మాకు తెలుసు. మహాప్రవక్త (స)పై ఆ వాక్యం అవతరించినప్పటి స్థలం ఏదో కూడా మాకు తెలుసు. ఈ వాక్యం ఆయన (స) గారిపై శుక్రవారం రోజున అవతరించింది. అప్పుడు ఆయన (స) అరఫాత్ మైదానంలో నిలబడి ఉన్నారు" (అంటే హజ్ రోజున).

## 34వ అధ్యాయం

జకాతు ఇవ్వటం కూడా ఇస్లామ్‌లోని ఒక అంశమే. అల్లాహ్ 'అల్ బయ్యినహ్' సూరాలో ఇలా సెలవిచ్చాడు: "వారు అల్లాహ్‌కు దాస్యం చెయ్యాలనీ, పూర్తి ఏకాగ్రతతో తమ ధర్మాన్ని ఆయన కొరకే ప్రత్యేకించుకోవాలనీ, నమాజును స్థాపించాలనీ, జకాతును ఇస్తూ ఉండాలని మాత్రమే ఆదేశించటం జరిగింది. ఇదే ఎంతో సరియైన, సవ్యమైన ధర్మం." (దివ్యఖురాన్ **98 : 5**)

**44.** తల్‌హా బిన్ ఉబైదుల్లాహ్ (రజిఅన్) ఇలా సెలవిచ్చారు: నజ్ద్ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి మహాప్రవక్త (సఅసమ్) వద్దకు వచ్చాడు. అతని తల వెంట్రుకలు చిందరవందరగా ఉన్నాయి. అతను బిగ్గరగా మాట్లాడుతున్నాడు. అతను చెప్పేది మాకు అర్థం కావటం లేదు. అతను దగ్గరకు వచ్చిన తరువాతనే అతను ఇస్లామ్‌ను గురించి అడుగుతున్నాడనే విషయం మాకు తెలిసింది. మహాప్రవక్త (సఅసమ్), "ఇస్లామ్ అంటే ప్రతి రోజూ రేయింబవళ్లూ ఐదు పూటలు నమాజు చేయటం" అని అన్నారు. దానికి అతను, "ఇవి తప్ప మరొక నమాజు ఏదీ చేయవలసిన అవసరం లేదు కదా?" అని అడిగాడు. అప్పుడు మహాప్రవక్త (సఅసమ్).

“అవసరం లేదు” అని అన్నారు. కాని నీవు, “నఫిల్ నమాజులు చేయవచ్చు” అని అన్నారు. తరువాత మహాప్రవక్త (సఅసమ్), “రమజాను మాసంలో ఉపవాసాలు పాటించటం” అని సెలవిచ్చారు. దానికి అతను, “ఈ ఉపవాసాలు తప్ప పాటించ వలసిన ఉపవాసాలు ఇంకేమీ లేవు కదా?” అని అడిగాడు. దానికి ఆయన (స), “ఏవీ లేవు. కాని నఫిల్ ఉపవాసాలు పాటించవచ్చు” అని అన్నారు. ఆ తరువాత మహాప్రవక్త (సఅసమ్), “జకాతు ఇవ్వటం” అని సెలవిచ్చారు. అప్పుడు అతను, “జకాతు తప్ప చేయవలసిన మరొక దానం ఏదైనా ఉందా?” అని అడిగాడు. దానికి ఆయన (స), “లేదు, అయితే నఫిల్ దాన ధర్మాలు చేయవచ్చు” అని చెప్పారు. ఆ వ్యక్తి “దేవుని సాక్షిగా! నేను ఇంతే చేస్తాను. దీని కంటే ఎక్కువా చెయ్యను, తక్కువా చెయ్యను.” అంటూ వెళ్లిపోయాడు. మహాప్రవక్త (సఅసమ్), “ఇతను చెప్పేది నిజమే అయితే, తప్పకుండా సాఫల్యం పొందుతాడు” అని సెలవిచ్చారు.

## 35వ అధ్యాయం

### జనాజా వెంట వెళ్లటం కూడా విశ్వాసంలో ఒక భాగమే

**45.** మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూ హురైరా (ర) తెలిపారు: ఎవరైనా విశ్వాస భావంతో, పుణ్యం లభిస్తుందనే సంకల్పంతో, ఒక ముస్లిమ్ జనాజా వెంట వెళితే (అంత్యక్రియల్లో పాల్గొంటే), జనాజా నమాజు అయ్యే వరకు, ఇంకా ఖననం చేసే వరకు దానితో పాటు ఉన్నట్లయితే, అతను రెండు ఖీరాతులంత పుణ్యాన్ని తీసుకొని ఇంటికి మరలు తాడు. ఒక్కొక్క ఖీరాతు ఉహుద్ కొండ అంత పెద్దదిగా ఉంటుంది. ఎవరైనా కేవలం జనాజా నమాజులో పాల్గొని, ఖననానికి ముందే ఇంటికి మరలితే, అతనికి ఒక ఖీరాతు అంత పుణ్యం మాత్రమే లభిస్తుంది.

## 36వ అధ్యాయం

తాను చేసిన సత్కార్యాలు తనకు తెలియకుండానే రద్దయి పోతాయేమో అని ఒక విశ్వాసి ఎల్లప్పుడూ భయపడుతూ ఉండాలి. మత బోధకులైన ఇబ్రాహీమ్ తైమీ ఇలా అన్నారు: “నేను నా మాటల్ని నా చేతలతో పోల్చి చూసినప్పుడు నేను ధర్మ శాస్త్రాన్ని తిరస్కరించే వారిలో కలిసిపోలేదు కదా అని భయపడ్డాను (నా చేతలు నా మాటలతో సరితూగటం లేదు). “ఇంకా ఇబ్నె అబీములైక ఇలా సెలవిచ్చారు: “నేను మహాప్రవక్త (స)గారి 30 మంది సహచరుల్ని కలిశాను. వారిలో ప్రతి ఒక్కరూ (కాపట్యం గురించి) తమ విషయంలో భయపడుతూ ఉండేవారు: వారిలో ఏ ఒక్కరూ

'నా విశ్వాసం జిబ్రీల్ లేదా మేకాయీల్ దూతల విశ్వాసం అంత బలమైన విశ్వాసం' అని అనేవారు కారు." హసన్ బస్రీ (ర.అ) ఇలా అన్నారు: "విశ్వాసం కలవాడు మాత్రమే కాపట్యమంటే భయపడతాడు. కపటి మాత్రమే దాని పట్ల నిర్భయంగా ఉంటాడు. ఈ అధ్యాయంలో పరస్పరం కలహించుకోవటం గురించీ, బాహాటంగా మొండిగా పాప కార్యాలు చేస్తూ పోవటం గురించీ, పశ్చాత్తాపపడక పోవటం గురించీ భయపెట్టటం జరిగింది. ఎందుకంటే అల్లాహ్ దివ్య ఖురానులో ఇలా సెలవిచ్చాడు: "వారు బుద్ధిపూర్వకంగా తాము చేసిన (చెడు) పనుల్ని గురించి మొండిగా వాదించరు." (ఆలి ఇమ్రాన్-135)

**46.** మహనీయ ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అబ్దుల్లాహ్ బిన్ మసూద్ (రజిఅన్) చెప్పారు: "ఒక ముస్లిమ్‌ను తిట్టటం పాపం; అతన్ని చంపటం అవిశ్వాసం."

**47.** ఉబాదా బిన్ సామిత్ (ర) ఇలా ఉల్లేఖించారు: మహాప్రవక్త (స) తమ గదిలో నుంచి బయటకు వచ్చారు, షబేఖదర్ (విలువైన రాత్రి) ఏ రాత్రి (వస్తుందో) అవుతుందో ప్రజలకు తెలుపుదామనుకున్నారు. ఇంతలో ఇద్దరు ముస్లిములు పోట్లాడుకుంటున్నారు. ఆయన ఇలా అన్నారు: "షబేఖదర్‌ను ఎప్పుడో మీకు తెలియజేద్దామనే ఉద్దేశ్యంతో బయటకు వచ్చాను. ఫలానా మనుషులు పరస్పరం పోట్లాడుకోవటాన్ని నేను చూశాను. అప్పుడు దానికి సంబంధించిన జ్ఞానం నా నుంచి లేపుకోబడింది. బహుశా ఇందులోనే మీ మేలు దాగి ఉందేమో. కనుక షబేఖదర్‌ను రమజాను మాసంలోని **27**వ రాత్రిలో, **29**వ రాత్రిలో, **25**వ రాత్రిలో వెతకండి."

## 37వ అధ్యాయం

హజ్రత్ జిబ్రీల్ (అస్సలామ్) ఈమాన్, ఇస్లామ్, ఎహ్‌సాన్ అంటే ఏమిటి, ప్రళయం ఎప్పుడొస్తుంది అని మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్)ను అడగటం; ఆయన వాటికి సవివరంగా సమాధానం చెప్పటం. తరువాత మహాప్రవక్త (సఅసమ్), "ఈయన హజ్రత్ జిబ్రీల్ (అస్సలామ్), మీ ధర్మం గురించి మీకు నేర్పటం కోసం ఆయన వచ్చారు" అని సెలవిచ్చారు. కనుక మహాప్రవక్త (సఅసమ్) ఈ విషయాలన్నింటినీ ధర్మంగా అభివర్ణించారు. అబుల్ ఖైస్ తెగ వారి ప్రతినిధి వర్గానికి ఈమాన్ గురించి మహాప్రవక్త (సఅసమ్) చెప్పిన విషయాలు కూడా ఈ అధ్యాయంలో పొందుపరచబడ్డాయి. అల్లాహ్ ఆలిఇమ్రాన్ సూరాలో **85**వ వాక్యంలో చెప్పిన విషయం కూడా ఇందులో ఉంది: "ఎవడైనా ఈ విధేయతా విధానాన్ని

(ఇస్లామ్) కాక మరొక మార్గాన్ని అవలంబించదలిస్తే, ఆ మార్గం ఎంత మాత్రం ఆమోదింపబడదు."

**48.** హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఇలా చెప్పారు: ఒక రోజున మహాప్రవక్త (సఅసమ్) ప్రజల మధ్య కూర్చొని ఉన్నారు. అంతలోనే ఒక వ్యక్తి వచ్చి, ఈమాన్ అంటే ఏమిటి? అని అడిగాడు. దానికి మహాప్రవక్త (స) "ఈమాన్ అంటే అల్లాహ్‌ను, ఆయన దూతలను, ఆయన్ని కలసుకోవటాన్ని, ఆయన ప్రవక్తలను, మరణానంతరం మళ్లీ బ్రతికిలేవటాన్ని విశ్వసించటం" అని సెలవిచ్చారు. అతను మళ్లీ అడిగాడు, "ఇస్లామ్ అంటే ఏమిటి?" అని. మహాప్రవక్త (సఅసమ్) ఇలా సమాధానం చెప్పారు: "ఇస్లామ్ అంటే అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలి; ఇతరులెవ్వరినీ ఆయనకు సహవర్తిగా ఎంచరాదు. నమాజును నియమం తప్పకుండా సక్రమంగా చెయ్యాలి. విధ్యుక్త ధర్మమైన జకాతును చెల్లించాలి. రమజాను మాసంలో ఉపవాసాలు ఉండాలి." అతను ఇంకా ఇలా అడిగాడు, "ఎహ్సాన్ అంటే ఏమిటి?" అని. "ఎహ్సాన్ అంటే, నీవు అల్లాహ్‌ను చూస్తూ ఉన్నట్లుగా నమాజు చెయ్యటం, ఒకవేళ ఇది సాధ్యపడకపోతే, ఆయన నిన్ను చూస్తున్నాడని భావిస్తూ నమాజు చేయటం" అని దైవప్రవక్త(స) చెప్పారు. అతను, "ప్రళయం ఎప్పుడొస్తుంది" అని కూడా అడిగాడు. దానికి మహాప్రవక్త (సఅసమ్), "ఈ విషయం గురించి అడిగేవానికంటే ఎక్కువగా చెప్పేవానికి తెలియదు. కాని దానికి సంబంధించిన సూచనలను గురించి నేను నీకు చెబుతాను. బానిస స్త్రీ తన యజమానిని కన్నప్పుడు, నల్ల ఒంటెల్ని మేపే వారు ఎత్తయిన భవనాల నిర్మాణంలో ఒకరితో ఒకరు పోటీ పడినప్పుడు. అల్లాహ్‌కు మాత్రమే తెలిసిన అగోచర విషయాలు ఐదు ఉన్నాయి. వాటిలో ప్రళయం కూడా ఒకటి" అన్నారు. ఆ తరువాత మహాప్రవక్త (సఅసమ్) లుఖ్మాన్ సూరాలోని ఈ వాక్యాన్ని పఠించారు: "నిస్సందేహంగా ప్రళయం ఎప్పుడొస్తుందో అల్లాహ్‌కు మాత్రమే తెలుసు"(**34**). అప్పుడు అతను వెళ్లిపోయాడు. మహాప్రవక్త (సఅసమ్) అతన్ని పిలుచుకురమ్మని సహచరులకు చెప్పారు. కాని అతను వారికి కనిపించలేదు. అప్పుడు మహాప్రవక్త (సఅసమ్), "ఆయనే జిబ్రీల్ (అస్సలామ్), ప్రజలకు వారి ధర్మం గురించి చెప్పటానికి వచ్చారు" అని అన్నారు.

పై విషయాలన్నింటినీ మహాప్రవక్త (సఅసమ్) విశ్వాసంలోని విషయాలుగా బోధించారని ఇమామ్ బుఖారీ (ర) అన్నారు.

రోమన్ దేశ రాజు హెర్క్యులియస్ తనతో ఇలా అన్నాడని అబూ సుఫ్యాన్ బిన్ హరబ్ తనకు చెప్పారని అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజిఅన్) సెలవిచ్చారు : "ఈ

ప్రవక్త (స) అనుచరుల సంఖ్య పెరుగుతోందా లేక తరుగుతోందా అని నేను నిన్ను అడిగితే; వారి సంఖ్య పెరుగుతోంది అని నీవు చెప్పావు. పరిపూర్ణ దశకు చేరే వరకు విశ్వాసం స్థితి ఇలాగే ఉంటుంది, అతని మతంలో చేరిన తరువాత, దానిని అసహ్యించుకుని తిరిగిపోయిన వాడెవడైనా ఉన్నాడా అని నేను నిన్ను అడిగితే; లేదు, ఎవరూ అలా తిరిగిపోలేదు. విశ్వాస మాధుర్యం మనస్సులోకి దిగిన తరువాత దాని స్థితి ఇలాగే ఉంటుంది. ఆ తరువాత ఇక అదంటే ఎవరూ అయిష్టపడరు, అసహ్యించుకోవటం జరగదు అని నీవు చెప్పావు.

## 38వ అధ్యాయం

## తన ధర్మంపై స్థిరంగా ఉండేందుకు, పాపకార్యాలకు, అనుమానం ఉన్న విషయాలకు దూరంగా ఉండే వ్యక్తి యొక్క ఘనత

**49.** మహనీయ ముహమ్మద్ (సఅసం) ఇలా సెలవిచ్చారని నూమాన్ బిన్ బషీర్ (రజిఅన్) కథనం: ధర్మసమ్మతమైనవీ (హలాల్), నిషిద్ధమైనవీ (హరామ్) రెండూ స్పష్టంగానే ఉన్నయ్. కాని వాటి మధ్య అనుమానాస్పదమైన విషయాలు కొన్ని ఉన్నయ్. వాటిని గురించి చాలా మందికి తెలియదు. (అవి హలాలైనవా లేక హరామైనవా అనే విషయం) కనుక అనుమానాస్పదమైన విషయాలకు దూరంగా ఉన్నవాడు, తన ధర్మాన్ని, తన గౌరవాన్ని కాపాడుకుంటాడు. కాని ఎవరైతే అనుమానాస్పద విషయాల జోలికి పోతాడో, అతని ఉదాహరణ ఇతరులకు చెందిన పచ్చని బీళ్ల దరిదాపుల్లో తన పశువులను మేపే పశువుల కాపరి మాదిరిగా ఉంది. ఏ క్షణంలోనైనా అతను అందులోకి జొరబడే (తన పశువులను మేపే) అవకాశముంది. ప్రజలారా! వినండి, ప్రతి రాజుకు చెందిన ఒక హిమా (నిషిద్ధ ప్రాంతం) ఉంటుంది. భూమిపై అల్లాహ్‌కు చెందిన హిమా ఆయన నిషేధించిన విషయాలు. వినండి, జాగ్రత్త! మనిషి శరీరంలో ఒక మాంసపు ముక్క ఉంది. అది మంచిదయితే, శరీరమంతా మంచిదవుతుంది. అది చెడిపోతే శరీర మంతా చెడిపోతుంది. అదే మనిషి గుండెకాయ.

## 39వ అధ్యాయం

## యుద్ధ ప్రాప్తిలోని 5వ భాగాన్ని అల్లాహ్ మార్గంలో ఇవ్వటం కూడా విశ్వాసంలోనిదే

**50.** అబూ జమ్రా కథనం ఇలా ఉంది: నేను అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజిఅన్) దగ్గర ఎక్కువగా కూర్చుంటూ ఉండేవాణ్ణి. ఆయన నన్ను ప్రత్యేకంగా తన తఖతుపై కూర్చోబెట్టేవారు. ఒకసారి ఆయన, "నీవు నాతో ఉండిపో, నేను నీకు నా ఆస్తిలో

భాగం ఇస్తాను"అని అన్నారు. అందువల్ల నేను ఆయన వద్ద రెండు మాసాలు ఉండి పోయాను. ఆ తరువాత ఆయన ఒక సందర్భంలో నాకు ఇలా చెప్పారు: అబ్దె ఖైస్ పంపిన ఒక ప్రతినిధి వర్గం మహాప్రవక్త (సఅసం) వద్దకు వచ్చింది. అప్పుడు ఆయన (స), "వీరు ఎవరు? లేదా ఎవరు పంపగా వచ్చారు?" అని అడిగారు. దానికి వారు, "మేము రబీయాకు చెందినవారము" అని జవాబు చెప్పారు. అప్పుడు మహా ప్రవక్త (సఅసమ్), "స్వాగతం! అబుల్ ఖైస్‌కు చెందిన ప్రజలారా! స్వాగతం! మీకు ఎలాంటి అవమానమూ జరగదు. మీరు సిగ్గుపడే అవసరమూ ఉండదు." వారు ఇలా అన్నారు : "ఓ దైవప్రవక్తా! పవిత్ర మాసంలో తప్ప మేము మీ వద్దకు రాలేము. ఎందు కంటే, మాకూ మీకూ మధ్య ముజర్‌కు చెందిన అవిశ్వాసుల తెగ ఒకటి అడ్డంగా ఉంది కదా! కనుక ధర్మానికి చెందిన ఏదైనా విషయం గురించి మాకు క్లుప్తంగా చెప్పండి; దాని ఆచరణ ద్వారా మేము స్వర్గానికి పోగలగాలి. ఇంకా దాన్ని గురించి, మాతోపాటు ఇక్కడకు రాని వారికి మేము వివరంగా చెబుతాము." ఇంకా వారు మహాప్రవక్త(స)ను పానీయాల పాత్రలను (ధర్మ సమ్మతమైనవి, నిషిద్ధమైనవి) గురించి కూడా అడిగారు. అప్పుడు ఆయన (స) నాలుగు విషయాలను గురించి పాటించమని వారిని ఆజ్ఞాపించారు; నాలుగు విషయాలను గురించి చెయ్యవద్దని వారించారు. ఆయన (స) వారిని ఇలా ఆజ్ఞాపించారు : "ఒక్క అల్లాహ్‌ను మాత్రమే విశ్వసించండి." అల్లాహ్‌ను మాత్రమే విశ్వసించటం అంటే ఏమిటో మీకు తెలుసా అని అడిగారు. దానికి వారు, "అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు మాత్రమే దానిని గురించి తెలుసు" అని సమాధానం చెప్పారు. అప్పుడు ఆయన (స) ఇలా సెలవిచ్చారు, "అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడైన వాడెవ్వడూ లేడు అనీ, ముహమ్మద్ (సఅసమ్) అల్లాహ్ ప్రవక్త అనీ సాక్ష్యమివ్వటం; నమాజులను సక్రమముగా చేయటం; జకాతు ఇవ్వటం; రమజాను మాసపు ఉపవాసాలను పాటించటం; యుద్ధ ప్రాప్తిగా వచ్చిన సొమ్ములోని ఐదవ భాగాన్ని అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టటం." ఇంకా నాలుగు పాత్రల వాడకం గురించి ఆయన (స) వారిని వారించారు: హన్‌తమ్, దుబ్బా, నఖీర్, ముజ్జఫత్ లేక ముఖయ్యర్ (ఇవి సారాయి కాసే కుండల పేర్లు). ఆయన (స) ఇంకా ఇలా అన్నారు; "ఈ విషయాలను జ్ఞాపకం పెట్టుకోండి. మీతోపాటు ఇక్కడలేని మీ దేశవాసులకు కూడా వాటిని గురించి చెప్పండి."

## 41వ అధ్యాయం

ఈ అధ్యాయంలో ప్రస్తావించబడిన విషయం ఇలా ఉంది: సదుద్దేశ్యము, సద్భావము లేని ఆచరణ నిజమైనది, స్వచ్ఛమైనది కానేరదు. ప్రతి మనిషికీ తాను సంకల్పించుకున్నది మాత్రమే లభిస్తుంది. కనుక విశ్వాసం, వుజూ, నమాజు, జకాత్, హజ్, ఉపవాసం మొదలైన వ్యవహారాలన్నీ (వివాహం, విడాకులు వగైరా లాంటివి) ఆచరణా పరిధిలోనికి వస్తాయి. దివ్యఖురానులో (బనీ ఇస్రాయీల్ అధ్యాయంలో) అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "ప్రవక్తా! ఇలా అను; ప్రతి వ్యక్తీ తన విధానాన్నే అనుసరిస్తున్నాడు (**17: 83**). కనుక ఒకవేళ మనిషి పుణ్యకాంక్షతో, అల్లాహ్ ఆజ్ఞగా భావించి తన ఇంటి వారి కోసం ధనం ఖర్చు చేస్తే, అతనికి సదఖా చేసిన పుణ్యం లభిస్తుంది. (మక్కాపై విజయం లభించినప్పుడు) మహాప్రవక్త (సఅసమ్), "ఇక హిజ్రత్ చేసే అవసరం లేదు. కాని జిహాద్, సంకల్పం మటుకు మిగిలి ఉంటాయి" అని సెలవిచ్చారు.

**51.** మహనీయ ప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ ఉమర్ (రజిఅన్) చెప్పారు: ఆచరణలు ఉద్దేశ్యం వల్లనే సక్రమమైనవి కాగలుగుతాయి (ఉద్దేశ్యం కారణంగానే పుణ్యం లభిస్తుంది.) ప్రతి మనిషికీ తాను సంకల్పించుకున్నది మాత్రమే లభిస్తుంది. అల్లాహ్ కోసం, ఆయన ప్రవక్త కోసం ఎవడైతే తన దేశాన్ని విడిచిపెడతాడో, అతను అల్లాహ్ కోసం, ఆయన ప్రవక్త కోసం హిజ్రత్ చేశాడు. అయితే ధనాన్ని సంపాదించటం కోసమో లేదా ఒక స్త్రీని వివాహం చేసుకునే ఉద్దేశ్యంతోనో ఎవడైనా తన దేశాన్ని విడిచి వెళ్ళిపోతే, అతను ఆ పనుల కోసమే హిజ్రత్ చేసినట్లు అవుతుంది.

**52.** మహనీయ ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అబూ మసూద్ (రజిఅన్) అన్నారు: "ఏ మనిషైనా పుణ్యం లభిస్తుందనే ఉద్దేశ్యంతో (అల్లాహ్ ఆజ్ఞగా భావించి) తన భార్యాపిల్లల కోసం ధనం ఖర్చు చేస్తే, అతనికి దాన ధర్మాలు చేసిన దానికి లభించే అంత పుణ్యం లభిస్తుంది."

**53.** మహనీయ ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ (రజిఅన్) కథనం: "నీవు ఏది ఖర్చు చేసినా దానిని గనక అల్లాహ్ ప్రసన్నత పొందే ఉద్దేశ్యంతో చేసినట్లయితే, నీకు దాని పుణ్యం తప్పకుండా లభిస్తుంది. చివరకు, నీ భార్య నోటిలో అన్నం ముద్ద పెట్టినా దానికి కూడా పుణ్యం లభిస్తుంది".

## 42వ అధ్యాయం

ధర్మం అంటే ఏమిటో మహనీయ ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారు: "హృదయపూర్వకంగా అల్లాహ్ ఆజ్ఞల్ని తు.చ. తప్పకుండా పాటించటం; ఆయన ప్రవక్త (సఅసమ్) పట్ల, ముస్లిమ్ నాయకుల పట్ల, ముస్లిముల పట్ల శ్రేయోభిలాషా భావం కలిగి ఉండటం. అల్లాహ్ దివ్యఖురానులో తౌబా సూరాలో ఇలా సెలవిచ్చాడు: "వారు అల్లాహ్ మేలును, ఆయన ప్రవక్త మేలును కోరుకునేవారై ఉండాలి."

**(9 : 91)**

**54.** హజ్రత్ జరీర్ బిన్ అబ్దుల్లాహ్ బజలీ (రజిఅన్) ఇలా చెప్పారు: నేను ఈ క్రింది విషయాలను గురించి మహాప్రవక్త (సఅసమ్)కు ప్రమాణం చేశాను: "నియమం తప్పకుండా చక్కగా నమాజు చేస్తాను; జకాతు ఇస్తాను: ప్రతి ముస్లిం పట్ల శ్రేయోభిలాషిగా ఉంటాను."

**55.** జియాద్ బిన్ ఇలాఖా (రజిఅన్) కథనం : కూఫా గవర్నరు అల్ ముగీరా బిన్ షూబా (రజిఅన్) మరణించిన రోజున, జరీర్ బిన్ అబ్దుల్లాహ్ ఇలా అంటూ ఉండగా నేను విన్నాను. ఆయన ఉపన్యాసం చెయ్యటానికి లేచి నిలబడ్డారు; అల్లాహ్‌ను స్తుతించారు, ఆయన గుణ విశేషాలను ప్రస్తుతించారు. ఆ తరువాత ఇలా అన్నారు: "మీరు కేవలం ఒక్క అల్లాహ్‌కు మాత్రమే భయపడాలి. ఆయనకు భాగస్వామి ఎవ్వడూ లేడు. కొత్త గవర్నరు వచ్చే వరకు మీరందరూ ఓపిక పట్టాలి, సహనంతో ఉండాలి. అతను త్వరలోనే వస్తున్నాడు కూడా." ఇంకా ఆయన ఇలా అన్నారు : "మరణించిన మీ గవర్నరును క్షమించమని మీరంతా అల్లాహ్‌ను ప్రార్థించండి. ఎందుకంటే అతను (ముగీరా) కూడా మన్నింపును ఇష్టపడేవాడు. తరువాత ఆయన మళ్లీ ఇలా అన్నారు: "నేను మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) వద్దకు వెళ్ళినప్పుడు ఇస్లామ్‌ను గురించి నేను మీతో బైఅత్ చేస్తున్నాను" అని ఆయనకు చెప్పాను. దానికి ఆయన "ప్రతీ ముస్లిమ్ శ్రేయస్సును కోరాలి" అనే షరతును విధించారు. ఈ షరతుకు అనుగుణంగా నేను ఆయనతో బైఅత్ (ప్రమాణం) చేశాను. ఈ మసీదు ప్రభువు సాక్షిగా చెబుతున్నాను: నేను మీ అందరి మేలును కోరుతున్నాను. నేను మీ శ్రేయోభిలాషిని". తరువాత అల్లాహ్‌ను క్షమించమని వేడుకుంటూ మెంబరు మీద నుంచి క్రిందికి దిగారు.

అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

# జ్ఞాన ప్రకరణం

## 1వ అధ్యాయం

### జ్ఞానం యొక్క ఔన్నత్యం

దివ్యఖురానులోని ముజాదలహ్ సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "మీలో ఎవరైతే విశ్వాసులో, ఎవరికైతే జ్ఞానం ప్రసాదించ బడిందో, అల్లాహ్ వారి స్థానాలను సమున్నతం చేస్తాడు. అల్లాహ్‌కు మీరు చేసే పనుల్ని గురించి తెలుసు." **(58: 11)** 'తాహా' సూరాలో, "ప్రభూ! నాకు మరింత జ్ఞానాన్ని ప్రసాదించు." **(20: 114)** అని సెలవీయబడింది.

## 2వ అధ్యాయం

ఒక వ్యక్తిని జ్ఞానం గురించి ఏదైనా ప్రశ్న అడిగినప్పుడు, ఒకవేళ అతను ఆ సమయంలో మరొకరితో మాట్లాడుతూ ఉన్నట్లయితే, తన సంభాషణను పూర్తి చేసిన తరువాత, ప్రశ్న అడిగిన వానికి సమాధానం చెప్పాలి.

**56.** హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) కథనం: ఒకసారి మహాప్రవక్త (సఅసమ్) ప్రజల మధ్య కూర్చొని, వారితో మాట్లాడుతూ ఉండగా, ఒక బద్దు (పల్లెవాసి) వచ్చి, "ప్రళయం ఎప్పుడొస్తుందో చెప్పండి" అని అడిగాడు. మహా ప్రవక్త (సఅసమ్) తమ సంభాషణలో నిమగ్నమైపోయారు (అతని ప్రశ్నకు సమాధానం ఇవ్వలేదు). అక్కడ సమావేశంలో ఉన్న కొందరు; ఆయన అతని ప్రశ్నను విన్నారు కాని అది ఆయనకు నచ్చలేదు అని అన్నారు. ఇంకా కొందరు, ఆయన అతని ప్రశ్నను అసలు విననే లేదు అని అన్నారు. మహాప్రవక్త (సఅసమ్) తమ సంభాష ణను ముగించిన తరువాత, ప్రళయం గురించి అడిగిన ఆ వ్యక్తి ఎక్కడ? అని అడిగారు. దానికి అతను, "మహాప్రవక్తా! ఇదిగో నేను ఇక్కడే ఉన్నాను" అని అన్నాడు. అప్పుడు ఆయన (స) ఇలా సెలవిచ్చారు; "విశ్వసనీయత అంతమైపోయి నప్పుడు, నీవు ప్రళయం కోసం ఎదురుచూడు. ప్రళయం వస్తుంది". అతను, "విశ్వస నీయత ఎందుకు అంతమవుతుంది?" అని అడిగాడు. దానికి ఆయన (స), "అయోగ్యులైన వారి చేతుల్లోకి అధికారం ఇచ్చినప్పుడు, ప్రళయం కోసం ఎదురు చూడు" అని సమాధానం చెప్పారు.

## 3వ అధ్యాయం

## జ్ఞాన సంబంధమైన విషయాన్ని బిగ్గరగా పలకటం

**57.** అబ్దుల్లా బిన్ అమ్ర్ (ర) ఇలా కథనం చేశారు: మేము ఒకసారి, ప్రయాణంలో ఉన్నప్పుడు మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) వెనుకపడి పోయారు (ఆ ప్రయాణం మక్కా నుండి మదీనాకు చేసినది). అస్ర్ నమాజు సమయం అయి పోయింది. మేము, త్వరత్వరగా వుజూ చేసుకుంటున్నాము. అప్పుడు ఆయన (స) వచ్చి మమ్మల్ని కలుసుకున్నారు. కాళ్ళను (పూర్తిగా, చక్కగా కడిగే బదులు) ఇట్టే అసంపూర్ణంగా కడుక్కున్నాము. (ఈ పరిస్థితిని చూసి) ఆయన (స) మమ్మల్ని బిగ్గరగా పిలిచి రెండుసార్లో, మూడుసార్లో ఇలా అన్నారు: "మీ మడమలకు నరకాగ్ని వినాశం ఉంటుంది."

## 4వ అధ్యాయం

## ఉల్లేఖకులు ఉపయోగించిన విభిన్న పదప్రయోగాలను గురించి.

**58.** అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) కథనం ప్రకారం, ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా సెలవిచ్చారు: "ఆకులు రాలని చెట్టు ఒకటి ఉంది. ఆ చెట్టును ఒక ముస్లిమ్‌తో పోల్చవచ్చు. ఆ చెట్టు పేరేమిటో నాకు చెప్పండి." అప్పుడు అక్కడున్న వారందరూ అడవిలోని చెట్లను గురించి ఆలోచించసాగారు. అబ్దుల్లా బిన్ ఉమర్, "అది ఖర్జూరపు చెట్టు అని నేను మనసులో అనుకున్నాను. (కాని అక్కడ పెద్దలు ఉండటం వల్ల) సిగ్గుపడటం వలన ఆ విషయం నేను చెప్పలేకపోయాను" అని చెప్పారు. ప్రవక్త (సఅసమ్)గారి సహచరులు, "మహాప్రవక్తా! అది ఏ చెట్టో దయచేసి మీరే చెప్పండి" అని అడిగారు. దానికి ఆయన, "అది ఖర్జూరపు చెట్టు" అని సెలవిచ్చారు.

## 5వ అధ్యాయం

## గురువు తన శిష్యుల జ్ఞానాన్ని పరీక్షించటానికి ఏదైనా ఒక ప్రశ్న అడగటం

**59.** హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) కథనం: "చెట్లల్లో ఆకులు రాలని చెట్టు ఒకటి ఉంది. ఒక ముస్లిమ్ కూడా దానిలాంటి వాడే. ఆ చెట్టు పేరేమిటో చెప్పండి" అని ప్రవక్త మహనీయులు (సఅసమ్) అడిగారు. ఇది విన్న అక్కడి వారు అడవిలోని వృక్షాలను గురించి ఆలోచించసాగారు. హజ్రత్ అబ్దుల్లా (రజిఅన్) ఇలా అన్నారు: "అది ఖర్జూరపు చెట్టు అని నా మనస్సుకు తట్టింది. (కాని పెద్దలు ఉండటం వల్ల) నేను చెప్పటానికి మొహమాటపడ్డాను)" చివరకు ప్రవక్త మహనీయుని

సహచరులు, "మహాప్రవక్తా! మీరే సెలవీయండి" అని అడిగారు. అప్పుడు ఆయన (స), "అది ఖర్జూరపు చెట్టు" అని సెలవిచ్చారు.

## 6వ అధ్యాయం

జ్ఞానం గురించి ఏమని చెప్పబడింది; అల్లాహ్ సూక్తి ఇలా ఉంది; "ఓ ప్రభూ! నాకు మరింత జ్ఞానాన్ని ప్రసాదించు".

## 7వ అధ్యాయం

హదీసు శాస్త్రానికి సంబంధించిన కొన్ని నియమాలకు చెందిన వివరణలు ఇక్కడ అనువాదం చెయ్యబడలేదు. ఒక సగటు పాఠకునికి ఇవి అంతగా ఉపయోగ పడే విషయాలు కావు.

ఈ అధ్యాయాలు మరియు 60, 61 నెంబర్లు గల హదీసులకు పైన పేర్కొనబడిన హదీసుల్లోని విషయాలే వర్తిస్తాయి.

**62.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా కథనం చేశారు: ఒకసారి మేము మసీదులో మహాప్రవక్త (సఅసమ్) గారితో కూర్చోని ఉన్నాము. ఇంతలో ఒంటెపై ఆసీనుడై ఉన్న వ్యక్తి ఒకడు మా దగ్గరకు వచ్చాడు. అతను తన ఒంటెను మసీదు (ప్రాంగణం)లో కూర్చోబెట్టి కట్టేశాడు. తరువాత, 'ముహమ్మద్ (స) ఎవరు?' అని అడిగాడు. అప్పుడు ప్రవక్త మహనీయులు (సఅసమ్) మా మధ్యన మోచేతి మీద ఆనుకుని కూర్చోని ఉన్నారు. మోచేతి మీద ఆనుకుని కూర్చున్న ఈ స్వచ్ఛమైన తెల్లవర్ణం గల మనిషే ముహమ్మద్ (స) అని మేము చెప్పాము. అప్పుడు ఆ మనిషి మహాప్రవక్త (స)ను ఉద్దేశించి, "ఓ అబ్దుల్ ముత్తలిబ్ కుమారుడా!" అని సంబోధించాడు. మహాప్రవక్త (స), "చెప్పు, నేను వింటున్నాను" అని అన్నారు. అతను ఇలా అన్నాడు, "నేను మిమ్మల్ని కొన్ని విషయాలు అడుగుతాను. కఠినంగా అడుగుతాను. అన్యథా భావించకండి." దానికి మహనీయులు (స), "నీకు ఇష్టమైన దాన్ని స్వేచ్ఛగా మొహమాటం లేకుండా అడుగు. నేనేమీ బాధపడను" అని సెలవిచ్చారు. అప్పుడు అతను ఇలా అన్నాడు, "మీ ప్రభువు మీద, పూర్వపు ప్రజల ప్రభువు మీద ప్రమాణం చేసి మిమ్మల్ని అడుగుతున్నాను; మిమ్మల్ని అల్లాహ్ ప్రపంచ మానవులందరికీ ప్రవక్తగా చేసి పంపాడా?" దానికి ఆయన (స) "అవును. (లేదా) అల్లాహ్ సాక్షిగా చెబుతున్నాను" అని అన్నారు. అప్పుడు అతను ఇలా అన్నాడు, "అల్లాహ్ మీద ప్రమాణం చేసి అడుగుతున్నాను; ప్రతిరోజూ రేయింబవళ్ళలో ఐదుసార్లు నమాజు చెయ్యమని అల్లాహ్ మిమ్మల్ని ఆజ్ఞాపించాడా?" దానికి ఆయన (స),

"అవును. అల్లాహ్ మీద ప్రమాణం చేసి చెబుతున్నాను" అని సమాధానం చెప్పారు. ఆ మనిషి ఇంకా ఇలా అడిగాడు, "అల్లాహ్ మీద ఒట్టువేసి అడుగుతున్నాను; ఏడాది లోని ఈ మాసం (రమజాను మాసం) అంతా ఉపవాసాలు ఉండాలని అల్లాహ్ మిమ్మల్ని ఆజ్ఞాపించాడా?" దానికి జవాబుగా, మహాప్రవక్త (స) "అవును. అల్లాహ్ తోడు" అని అన్నారు. తరువాత అతను మళ్లీ ఇలా అడిగాడు; "నేను అల్లాహ్ సాక్షిగా మిమ్మల్ని అడుగుతున్నాను; మాలో ధనవంతులైన వారి వద్ద నుండి 'జకాతు' ధనం వసూలు చేసి మాలో నిస్సహాయులైన పేదవారికి పంచిపెట్టమని అల్లాహ్ మిమ్మల్ని ఆదేశించాడా?" మహనీయులు (స), "అవును. అల్లాహ్ సాక్షిగా" అని చెప్పారు. ఆ తరువాత అతను ఇంకా ఇలా అన్నాడు; "మీరు అల్లాహ్ నుంచి తీసుకొచ్చిన ఈ ఆజ్ఞలను నేను విశ్వసిస్తున్నాను; ఇక్కడికి రాలేకపోయిన నా జాతి ప్రజలు పంపగా ఇక్కడకు వచ్చిన వాడను; నా పేరు జిమామ్ బిన్ సాలబా; బనీసాద్ బిన్ బకర్ వంశానికి చెందిన వాడను."

**63.** హజ్రత్ అనస్ (రజిఅన్) ఇలా చెప్పారు: మహాప్రవక్త (స)ను ప్రశ్నలు అడగొద్దని దివ్యఖురాను మమ్మల్నయితే నిషేధించింది. కనుక గ్రామీణ ప్రాంతం నుంచి ఒక వ్యక్తి ఎవరైనా వచ్చి (ఈ నిషేధాజ్ఞను గురించి తెలియని వాడు) ఆయన్ని (స) ప్రశ్నలు అడిగితే, వాటిని వినే భాగ్యం మాకు కలిగితే ఎంత బాగుంటుంది అని చాలా కుతూహలపడుతూ ఉండేవాళ్లం. ఇంతలోనే ఒక పల్లెటూరు మనిషి (బద్దు) రానే వచ్చాడు. అతను ప్రవక్త (స)నుద్దేశించి ఇలా అన్నాడు; "మీరు పంపిన దూత మా వద్దకు వచ్చాడు. అతను, మిమ్మల్ని అల్లాహ్ పంపాడని మీరు ప్రకటిస్తున్నారని చెప్పాడు." ప్రవక్త ముహమ్మద్ (స), "అతను చెప్పింది నిజమే" అని ధ్రువీకరించారు. అప్పుడు ఆ పల్లెటూరు మనిషి, "అయితే, ఆకాశాన్ని ఎవరు సృష్టించారు?" అని అడిగాడు. దానికి ఆయన (స), "ఆకాశాన్ని అల్లాహ్ సృష్టించాడు" అని సమాధానం చెప్పారు. ఇంకా అతను, "భూమిని ఎవరు పుట్టించారు; పర్వతాలను ఎవరు సృష్టించారు?" అని అడిగాడు. జవాబుగా ఆయన (స). "అల్లాహ్ సృష్టించాడు" అని పలికారు. తరువాత అతను, "పర్వతాలలోని ప్రయోజనకరమైన వస్తువులను ఎవరు సృష్టించారు?" అని ప్రశ్నించాడు. ఈ ప్రశ్నకు కూడా సమాధానంగా మహాప్రవక్త (స) అల్లాహ్‌యే సృష్టించాడు అని చెప్పారు. అప్పుడు అతను ఇలా అడిగాడు, "ఆకాశాలను, భూమిని సృష్టించినవాడు, పర్వతాలను నిలబెట్టినవాడు, వాటిలో ప్రజలకు ఉపయోగపడే వస్తువులను పెట్టినవాడు అయిన అల్లాహ్ సాక్షిగా అడుగు

తున్నాను; మిమ్మల్ని అల్లాహ్‌యే ప్రవక్తగా నియమించి పంపాడా?" మహాప్రవక్త (స), "అవును నన్ను అల్లాహ్‌యే పంపాడు" అని చెప్పారు. ఆ తరువాత అతను ఇలా అడిగాడు, "మేము ఐదు పూటలు విధిగా నమాజు చెయ్యాలనీ, మా సిరిసంపదలకు జకాతు ఇవ్వాలనీ మీ దూత చెప్పాడు, ఇది నిజమేనా?" దానికి ఆయన(స) "అవును, అతను నిజం చెప్పాడు" అని సెలవిచ్చారు. అతను అప్పుడు ఇలా అడిగాడు, తమర్ని ప్రవక్తగా పంపిన దేవునిపై ప్రమాణం చేసి అడుగుతున్నాను; ఈ విషయాలను గురించి అల్లాహ్ మిమ్మల్ని ఆజ్ఞాపించాడా?" ఆయన (స) "అవును అల్లాహ్ ఆజ్ఞాపించాడు." అని సెలవిచ్చారు. అతను ఇంకా ఇలా అడిగాడు, "సంవత్సరంలో ఒక మాసం రోజులు మేము విధిగా ఉపవాసం ఉండాలని మీ దూత అంటున్నాడు. నిజమేనా?" దానికి మహనీయ ముహమ్మద్ (స) "అతను నిజమే చెప్పాడు" అని అన్నారు. అప్పుడు అతను ఇలా అన్నాడు, "మిమ్మల్ని ప్రవక్తగా చేసి పంపిన దేవుని సాక్షిగా అడుగుతున్నాను; ఇలా విధిగా చెయ్యమని అల్లాహ్ తమర్ని ఆజ్ఞాపించాడా?" ఆయన(స), "అవును. ఆజ్ఞాపించాడు" అని సెలవిచ్చారు. తరువాత అతను ఇలా అడిగాడు; "మీ దూత ఇంకా ఇలా చెప్పాడు; మేము విధిగా హజ్ యాత్రకు పోవాలని; అంటే అక్కడకు చేరుకోగల ఆర్థిక స్థోమత కలవారు." ఆయన (స) దానికి, "అవును. అతను యదార్థం చెప్పాడు." అని సమాధానం చెప్పారు. అప్పుడు అతను ఇలా అడిగాడు; "ప్రవక్తగా నియమించి మిమ్మల్ని పంపిన దేవుని సాక్షిగా అడుగుతున్నాను; అల్లాహ్ తమరిని ఈ విధంగా ఆజ్ఞాపించాడా? "అవును ఆజ్ఞాపించాడు" అని ఆయన (స) సమాధానం చెప్పారు. చివరకు అతను ఇలా అన్నాడు; "మీకు సత్యాన్ని ప్రసాదించి పంపిన అల్లాహ్‌పై ప్రమాణం చేసి చెబుతున్నాను: ఈ విషయాలను పెంచను, కుదించను." ఇది విని ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు: "ఇతను గనక నిజమే చెబుతున్నట్లయితే, తప్పకుండా స్వర్గానికి పోతాడు."

## 8వ అధ్యాయం

## ఒక చేతి నుంచి మరొక చేతికి జ్ఞాన గ్రంథాల మార్పిడి వ్యవహారం. మత విద్వాంసులు ధర్మజ్ఞానాన్ని వ్రాసి వివిధ దేశాలకు పంపే విషయం

హజ్రత్ అనస్ (ర) ఇలా అన్నారు: హజ్రత్ ఉస్మాన్ (ర) దివ్యఖురాను గ్రంథాన్ని వ్రాయించి, దానికి సంబంధించిన కొన్ని ప్రతుల్ని దూర ప్రదేశాలకు పంపించారు. అబ్దుల్లా బిన్ ఉమర్ (ర), యహ్యా బిన్ సయీద్ అన్సారీ(ర) మరియు ఇమామ్ మాలిక్ ఈ పద్ధతిని ధర్మసమ్మతమైనదిగా నిర్ణయించారు. హిజాజ్‌కు చెందిన కొందరు విద్వాంసులు ఈ అభిప్రాయాన్ని సమర్థించారు. దీనికి

ఆధారంగా వారు మహాప్రవక్త(స) గారి ఈ హదీసును ఉటంకించారు. ప్రవక్త మహనీయులు (స) ఒక సైన్యాధికారికి ఒక ఉత్తరం వ్రాశారు. అతనితో, "ఫలానా ప్రదేశానికి చేరుకోనంత వరకు, నీవు ఈ ఉత్తరాన్ని విప్పి చూడకూడదు" అని ఆయన (స) పురమాయించారు. ఆ ప్రదేశాన్ని చేరుకున్న తరువాత అతను ఆ ఉత్తరాన్ని తెరచి ప్రజలకు దానిని చదివి వినిపించాడు, మహాప్రవక్త (స) గారి ఆదేశాన్ని వారికి తెలియజేశాడు.

**64.** హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (ర) ఇలా అన్నారు: ప్రవక్త మహనీయులు (స) ఒక ఉత్తరం వ్రాసి ఒక మనిషికి (అబ్దుల్లా బిన్ హుజాఫాకు) ఇచ్చారు. ఆ ఉత్తరాన్ని బహ్‌రైన్ నగర గవర్నర్‌కు అందించమని ఆయన (స) అతనికి చెప్పారు. బహ్‌రైన్ గవర్నరు (మన్‌జర్ బిన్ సావీ) ఆ ఉత్తరాన్ని కిస్రా (ఈరాన్ చక్రవర్తి పర్వేజ్)కి పంపించాడు. అతను ఆ ఉత్తరాన్ని చదివి ముక్కలు ముక్కలుగా చింపిపారేశాడు. ఇబ్నె ముసయ్యబ్ ఇలా అన్నారని నేను అనుకుంటున్నాను అని ఇబ్నె షిహాబ్ చెప్పారు: "ఇదే విధంగా అల్లాహ్ ఈరాన్ వారిని కూడా ముక్కలు ముక్కలుగా చించిపారవేయుగాక!" అని మహాప్రవక్త (స) శపించారు.

**65.** అనస్ బిన్ మాలిక్ (ర) ఇలా చెప్పారు: ఒకసారి ప్రవక్త మహనీయులు (స) బహుశా ఒక ఉత్తరం వ్రాశారు. లేదా వ్రాద్దామని సంకల్పించుకున్నారు. వారు (అజమ్ లేక రోమన్ రాజులు) ముద్ర ఉన్న ఉత్తరాలను మాత్రమే చదువుతారని ప్రవక్త (స) సహచరులు ఆయనకు చెప్పారు. అప్పుడు ఆయన (స) ఒక వెండి ఉంగరాన్ని తయారు చేయించారు. దాని మీద 'ముహమ్మదుర్రసూలుల్లాహ్' అనే పదాలు చెక్కబడి ఉన్నాయి. అనస్ (ర), "నేను ఆ ఉంగరం తెల్లని మెరుపును మహాప్రవక్త (స)గారి చేతిలో చూశాను" అని అన్నారు. షోబా (ర), "దాని మీద దైవప్రవక్త ముహమ్మద్ (స) అనే అక్షరాలు చెక్కబడి ఉన్నాయని ఎవరు చెప్పారు అని నేను ఖతాదాను అడిగాను" అని చెప్పారు. దానికి ఆయన, "అనస్ (ర)" అని సమాధానం చెప్పారు.

## 9వ అధ్యాయం

## సభలో చివర్న ఉన్న స్థలంలో కూర్చున్న వ్యక్తికి సంబంధించిన, సభలో మధ్యన స్థలం ఉండటాన్ని చూసి అక్కడకు పోయి కూర్చున్న వ్యక్తికి సంబంధించిన ప్రసంగం

**66.** అబూ వాఖిద్ లైసీ ఇలా ఉల్లేఖించారు: ఒకసారి మహాప్రవక్త (సఅసమ్) మసీదులో కూర్చొని ఉన్నారు. ఆయన (స)తో పాటు ఇంకా కొందరు కూడా అక్కడ కూర్చొని ఉన్నారు. ఇంతలో ముగ్గురు మనుషులు అక్కడకు వచ్చారు. వారిలో

ఇద్దరయితే ఆయన (స) దగ్గరకు ప్రసంగం వినేందుకు వచ్చారు. మూడో మనిషి అక్కణ్ణుంచి వెళ్లిపొయ్యాడు. అబూ వాఖిద్ (రజిఅన్) ఇలా అన్నారు: ఆ ఉభయులూ మహాప్రవక్త (స) ముందుకు వచ్చి నిలబడ్డారు. వారిలో ఒకడు సభలో మధ్యన ఒకచోట కొంచెం ఖాళీ స్థలం ఉండటాన్ని గమనించి అక్కడకు పోయి కూర్చున్నాడు. రెండో అతను సభలో జనం వెనుక భాగంలో కూర్చున్నాడు. మూడో అతను వెనుతిరిగి వెళ్లిపోయాడు. తమ ప్రసంగాన్ని ముగించిన మహాప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: “నేను ఆ ముగ్గురు మనుషుల పరిస్థితి గురించి తెలుపనా? వారిలో ఒకతను అల్లాహ్ శరణు కోరుకున్నాడు; అల్లాహ్ అతన్ని కరుణించి అతనికి స్థలాన్ని ప్రసాదించాడు. రెండో అతను సభ లోపలకు చొచ్చుకుపోయి కూర్చోటానికి సిగ్గు పడ్డాడు. అల్లాహ్ కూడా అతన్ని చూసి సిగ్గుపడ్డాడు, అతనిపై కృప చూపాడు. మూడో అతను ముఖం తిప్పుకున్నాడు; అల్లాహ్ కూడా అతన్నుంచి ముఖం తిప్పుకున్నాడు.

## 10వ అధ్యాయం

**నేను బోధించే విషయాలను ఇతరుల ద్వారా వినే మనిషి, నేను చెబుతూ ఉండగా ప్రత్యక్షంగా వినే మనిషి కంటే వాటిని ఎక్కువగా జ్ఞాపకం ఉంచుకుంటాడు అని మహాప్రవక్త ముహమ్మద్ (స) తరచూ చెప్పేవారు.**

**67.** అబూ అబ్దుర్రహ్మాన్ బిన్ అబూబకర్‌రా (రజిఅన్) ఇలా కథనం చేశారు : ఒకసారి మహాప్రవక్త (సఅసమ్) ఒక ఒంటెపై ప్రయాణం చేస్తున్నారు. (అది జిల్‌హజ్జా మాసం పదవ తారీఖు) ఒక వ్యక్తి ఆ ఒంటె కళ్లాన్ని పట్టుకుని నడుస్తున్నాడు. మహనీయ ప్రవక్త(స) “ఈ రోజు ఏమి రోజు”? అని అడిగారు. ఆ రోజేమి రోజో మాకు తెలిసినా, ఆయన (స) దానికి మరొక పేరేదైనా పెడతారేమో అని భావించి మౌనంగా ఉండిపోయాము. తరువాత, ఆయనే స్వయంగా, ఈ రోజు ‘యౌమున్న హర్’ కాదా (ఖుర్బానీ జంతువులను బలి ఇచ్చే రోజు) అని అడిగారు. దానికి మేము, నిస్సందేహంగా ఇది ‘యౌమున్నహరే’ అని విన్నవించుకున్నాము. మళ్లీ ఆయన (స), “ఈ మాసం ఏ మాసం?” అని అడిగారు. ఆ మాసం పేరేమిటో మాకు తెలిసినా, దానికి ఆయన (స) మరొక పేరేదైనా పెడతారేమో అని భావించి, మౌన ముద్ర పాటించాము. ఆయనే (స) స్వయంగా, “ఇది జిల్‌హజ్జా మాసం కాదా” అని అడిగారు. దానికి మేము, “నిస్సందేహంగా ఈ మాసం జిల్ హజ్జా మాసమే” అని విన్నవించుకున్నాము. అప్పుడు ఆయన (స) ఇలా సెలవిచ్చారు: “ఈ మాసంలో, ఈ నగరంలో మీ ఈ రోజు ఎంత పవిత్రమైనదో, అదేవిధంగా మీ రక్తం (ప్రాణం)

మీ ధనం, మీ మానమర్యాదలు కూడా ఒకరివి మరొకరికి అంతే పవిత్రమైనవి. ఇక్కడున్నవారు లేని వారికి ఈ విషయం గురించి చెప్పండి. ఎందుకంటే, ఇక్కడలేని వారు ఇక్కడున్న వారికంటే బహుశా ఎక్కువగా ఈ విషయాలను జ్ఞాపకం ఉంచుకో వచ్చు."

## 11వ అధ్యాయం

చెప్పటం, చెయ్యటం (వాక్కు, ఆచరణల) కంటే ముందు జ్ఞానం అవసరం. ఎందుకంటే అల్లాహ్ ఖురాను గ్రంథంలో ముహమ్మద్ సూరాలో ఇలా సెలవిచ్చాడు: "కనుక ప్రవక్తా! బాగా తెలుసుకో, అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడైన వాడెవ్వడూ లేడు" అని **(47 : 19)**. అల్లాహ్ మొట్టమొదట జ్ఞానం గురించి చెప్పాడు. కనుక మనిషి ముందు జ్ఞానాన్ని సముపార్జించుకోవాలి. ధర్మజ్ఞానులు మాత్రమే దైవప్రవక్తలకు వారసులు కాగలుగుతారని ఒక హదీసులో వచ్చింది. దైవ ప్రవక్తలు జ్ఞానానికి సంబంధించిన వారసత్వాన్ని విడిచి వెళ్ళారు. ఎవరైతే జ్ఞానాన్ని సముపార్జించుకుంటారో, వారు ఆ వారసత్వపు మొత్తం భాగాన్ని పొందుతారు. ఎవరైతే జ్ఞాన సముపార్జన కోసం ప్రయాణం చేస్తారో, వారి కోసం అల్లాహ్ స్వర్గానికి పోయే మార్గాన్ని సులభతరం చేస్తాడు. ఖురాను గ్రంథంలో ఫాతిర్ సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : "యదార్థమేమిటంటే, అల్లాహ్ దాసులలో జ్ఞానులు మాత్రమే ఆయనకు భయపడతారు." **(35 : 28)** ఇంకా అన్ కబూత్ సూరాలో అల్లాహ్ ఇలా అన్నాడు; "కాని జ్ఞాన సంపన్నులే వాటిని అర్థం చేసుకుంటారు." **(29 : 43)**. ముల్క్ పేరు గల సూరాలో కూడా అల్లాహ్ ఇలా అన్నాడు, "ఆ నరకవాసులు ఇలా అంటారు : "అయ్యో! మేము గనక ఆనాడు దైవప్రవక్తల మాట విని ఉంటే లేదా గ్రహించి ఉంటే, ఈనాడు ఇలా మండే నరకాగ్ని శిక్షకు గురి అయిన వారిలో చేరి ఉండేవారము కాదు కదా!" **(69 :10)**. ఇంకా జుమర్ సూరాలో ఆయన ఇలా సెలవిచ్చాడు. "ప్రవక్తా! వీరిని అడుగు, తెలిసిన వారూ, తెలియని వారూ ఇద్దరూ ఎప్పుడైనా సమానులు కాగలరా?" **(39 - 9)**

మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా సెలవిచ్చారు : "అల్లాహ్ ఎవరికైనా మేలు చేయదలిస్తే, అతనికి ధర్మాన్ని అవగాహన చేసుకునే భాగ్యాన్ని కలుగజేస్తాడు. జ్ఞానమైతే నేర్చుకుంటేనే లభిస్తుంది కదా"! అబూజర్ (రజిఅన్) ఇలా అన్నారు; "ఒకవేళ మీరు ఇక్కడ, నా మెడ మీద కరవాలాన్ని పెడితే, అప్పుడు కూడా (అంటే నా మెడ తెగక ముందు) మహాప్రవక్త (స) నుంచి నేను నేర్చుకున్న కనీసం ఒక్క విషయాన్నయినా నేను చెప్పగలుగుతాను అని అనుకుంటే, తప్పకుండా దాన్ని వినిపిస్తాను" (అంటే తాను నేర్చుకున్న దాన్ని తప్పనిసరిగా ఇతరులక్కూడా నేర్పాలి, చెప్పాలి అని భావం)

మహాప్రవక్త(స) ఈ విధంగా కూడా చెప్పారు : "ఇక్కడ ఉన్నవారు ఇక్కడలేని వారికి (నా ప్రవచనం) అందజేయాలి."

ఇబ్నె అబ్బాస్ ఇలా సెలవిచ్చారు: "మీరు విశ్వాసపాత్రులైన దైవభక్తులు అయి పోండి." (అంటే సహనశీలత కలవారుగా, క్షమించేవారుగా, జ్ఞానులుగా, వివేకవంతులుగా, అవగాహన గలవారుగా రూపొందండి అని భావం.) కొందరేమన్నారంటే, నిజమైన దైవభక్తులెవరంటే, ప్రజలకు పెద్ద పెద్ద విషయాలను గురించి చెప్పే ముందు చిన్న చిన్న ధార్మిక విషయాలను వారికి నేర్పి శిక్షణ గరిపేవారు.

## 12వ అధ్యాయం

**ప్రవక్త మహనీయులు (సఅసమ్) సందర్భాన్ని, సమయాన్ని చూసి తమ సహచరులకు జ్ఞాన సంబంధమైన విషయాలను నేర్పేవారు, వారు విసుక్కోకూడదని, వారిలో అయిష్టత చోటుచేసుకోకూడదని ఆయన అలా చేసేవారు.**

**68.** ఇబ్నె మసూద్ (రజిఅన్) ఇలా సెలవిచ్చారు: "ప్రవక్త మహనీయులు (సఅసమ్) మాకు హితోపదేశం చెయ్యటానికి సమయ సందర్భాలను పాటించేవారు. మేము విసుక్కోవటాన్ని ఆయన (స) ఇష్టపడేవారు కాదు."

**69.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) గారి కథనం ప్రకారం, మహనీయ ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారు: సౌలభ్యం సమకూర్చండి, కఠినంగా వ్యవహరించకండి. వారికి శుభవార్తలు వినిపించండి; వారు ద్వేషించేలా చెయ్యకండి.

## 13వ అధ్యాయం

**జ్ఞానం నేర్చుకోదలచిన వారి కోసం కొన్ని రోజులు కేటాయించే వ్యక్తి**

**70.** హజ్రత్ అబూ వాయిల్ (రజిఅన్) గారు ఇలా సెలవిచ్చారు: హజ్రత్ అబ్దుల్లా బిన్ మసూద్ (రజిఅన్) గారు ప్రతి గురువారం ప్రజలకు ధర్మబోధ చేసేవారు. ఒకసారి ఒక మనిషి ఆయనగారితో "అబా అబ్దుర్రహ్మాన్ గారూ! మీరు ప్రతి రోజు మమ్మల్ని ఉద్దేశించి ధర్మోపన్యాసం చేస్తే బాగుంటుందని అనుకుంటున్నాను". దానికి ఆయన గారు, (అది పెద్ద కష్టమైన విషయమేమీ కాదు) కాని మిమ్మల్ని విసిగించటం నాకు ఇష్టంలేదు. కాబట్టి నేను అలా చెయ్యటం లేదు. మీరు సంతోషంగా ఉన్నప్పుడే, సందర్భాన్ని బట్టే నేను మీకు హితోపదేశం చేస్తాను. ప్రవక్త (స) మహనీయులు కూడా సమయాన్ని, సందర్భాన్ని చూసే మాకు హితబోధ చేసేవారు. మేము విసుక్కుంటామేమో అని ఆయన (స) భయపడేవారు" అని చెప్పారు.

## 14వ అధ్యాయం

### అల్లాహ్ తాను మేలు చెయ్యదలచుకున్న మనిషికి ధర్మానికి సంబంధించిన అవగాహనను ప్రసాదిస్తాడు

**71.** హ్రజత్ ముఆవియా (రజిఅన్) ఇలా కథనం చేశారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా బోధిస్తూ ఉండగా నేను విన్నాను: "అల్లాహ్ తాను ఎవరికైనా మేలు చెయ్యదలిస్తే, ఆయన అతనికి ధర్మానికి సంబంధించిన అవగాహనను ప్రసాదిస్తాడు. నేనైతే కేవలం పంచి పెట్టేవాణ్ణి మాత్రమే.[1] ఇచ్చేవాడు, ప్రసాదించే వాడు అల్లాహ్యే. ఈ (ఇస్లామీ) జమాఅత్ మటుకు కలకాలం అల్లాహ్ ఆజ్ఞలపై స్థిరంగా ఉంటుంది. శత్రువుల వల్ల దానికి ఏ మాత్రం నష్టం కలగదు. ఇది అల్లాహ్ ఆజ్ఞ (ప్రళయం) వచ్చే వరకు జరగదు."

## 15వ అధ్యాయం

### ధర్మావగాహనకు వివేకం అవసరం

**72.** హ్రజత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా కథనం చేశారు : ఒకసారి మేము ప్రవక్త మహనీయుని (స) దగ్గర కూర్చొని ఉన్నాము. ఇంతలో ఎవరో ఆయన (స) వద్దకు ఖర్జూరపు చెట్టు లేత రెమ్మను తీసుకువచ్చారు. అప్పుడు ప్రవక్త మహనీయులు (స) "చెట్లల్లో ముస్లిమ్ను పోలిన చెట్టు ఒకటి ఉంది" అని సెలవిచ్చారు. అప్పుడు అది ఖర్జూరపు చెట్టు అని నా మనస్సుకు తట్టింది, అదే విషయాన్ని చెప్పెయ్యాలని కూడా అనిపించింది. కాని అక్కడున్న వారిలో నేనే చిన్న వాణ్ణి అని గమనించాను. (మహామహుల్ని చూసి చెప్పలేకపోయాను) మౌనంగా ఉండిపోయాను. చివరకు ప్రవక్త మహనీయులే (స) స్వయంగా, "అది ఖర్జూరపు చెట్టు" అని చెప్పేశారు.

## 16వ అధ్యాయం

### జ్ఞానాన్ని వివేకాన్ని పొందగోరే విషయంలో అసూయపడటం

హ్రజత్ ఉమర్ (రజిఅన్) ఇలా అన్నారు: "మీరు పెద్దలు, నాయకులు అవటానికి పూర్వమే మంచి ధర్మజ్ఞానాన్ని నేర్చుకోండి." ఇమామ్ బుఖారీ, "పెద్దవారు అయిన తరువాత కూడా జ్ఞానాన్ని నేర్చుకోండి. ప్రవక్త (సఅసమ్) గారి ప్రియ సహచరులు వృద్ధాప్యంలో కూడా ధర్మజ్ఞానాన్ని నేర్చుకున్నారు" అని చెప్పారు.

---

71-1. అంటే, నేనైతే అల్లాహ్ ఆజ్ఞల్ని, ఆయన మార్గదర్శక సూత్రాలను ప్రజలందరికీ వినిపిస్తాను. కాని మార్గం చూపటమనేది అల్లాహ్ అధీనంలో ఉంది.

**73.** హజ్రత్ అబ్దుల్లా బిన్ మసూద్ (రజిఅన్) కథనం ప్రకారం, మహనీయ ప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా బోధించారు: ఇద్దరు మనుషులను గురించి అసూయపడవచ్చు - మొదటి మనిషి, దేవుడు ఐశ్వర్యాన్ని ప్రసాదించినవాడు. అతను ఆ సంపదను పుణ్యకార్యాల కోసం ఖర్చు పెడతాడు. రెండో మనిషి, దేవుడు (ఖురాను, హదీసు గ్రంథాల) జ్ఞానాన్ని ప్రసాదించినవాడు. అతను ఆ జ్ఞానం ప్రకారం నిర్ణయాలు చేస్తాడు, తీర్పులు చెబుతాడు. ఇంకా అతను ఆ జ్ఞానాన్ని ప్రజలకు నేర్పుతాడు.

## 17వ అధ్యాయం

**దైవప్రవక్త హజ్రత్ మూసా (అస్సలామ్) హజ్రత్ ఖిజర్‌ను వెతుక్కుంటూ సముద్ర తీరంలో ప్రయాణం చెయ్యటం. ఖురాను గ్రంథంలోని అల్ కహ్ఫ్ సూరాలో మూసా ప్రవక్త (అస్సలామ్) ఇలా అనటం: "మీరు నేర్చుకున్న వివేకాన్ని మీరు నాకు కూడా నేర్పేందుకు, నేను మీ వెంట ఉండవచ్చా?"**

**74.** హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజిఅన్), "హజ్రత్ మూసా ప్రవక్త (అస్సలామ్) ఎవరి వద్దకు వెళ్లారు అనే విషయంలో, తనకు, హుర్రు బిన్ ఖైస్ ఇబ్నె హిస్న్‌కు మధ్య భేదాభిప్రాయం తలెత్తిందని, ఆయన ఖిజర్ వద్దకు వెళ్లారని తాను చెప్పానని" అన్నారు. ఇంతలో ఉబై బిన్ కాబ్ వారి ముందునుంచి ఎక్కడికో వెళుతూ కనిపించారు. ఇబ్నె అబ్బాస్ ఆయన్ని పిలిచి "మూసా ప్రవక్త ఎవరి వద్దకు వెళ్లారు, ఎవరిని కలుసుకోవాలని చిరునామా అడిగారు అనే విషయం గురించి నాకూ, నా స్నేహితునికీ మధ్య వివాదం తలెత్తింది. ఈ విషయం గురించి మహాప్రవక్త (స) నుంచి మీరేమైనా విన్నారా?" అని అడిగారు. అప్పుడు ఆయన, అవును, విన్నాను అని చెబుతూ, ప్రవక్త మహనీయులు (స)ఇలా సెలవిచ్చారు అని చెప్పారు: "ఒకసారి మూసా (అ) ప్రవక్త ఇస్రాయీలు ప్రజల మధ్య కూర్చొని ఉన్నారు. అప్పుడు అక్కడకు ఒక మనిషి వచ్చి, మీకంటే ఎక్కువ జ్ఞానం కల వ్యక్తిని ఎవరినైనా మీరు చూశారా? అని అడిగాడు. మూసా ప్రవక్త సమాధానంగా, నాకైతే తెలియదు అని చెప్పారు. అప్పుడు అల్లాహ్ దైవవాణి ద్వారా, ఖిజర్ అనే నా దాసుడు ఒకడు ఉన్నాడు. అతను నీ కంటే ఎక్కువ జ్ఞానం కలవాడు అని తెలియజేశాడు. మూసా ప్రవక్త, నేను అతన్ని ఎలా కలుసు కోవాలి, ఎక్కడకు పోవాలి అని అల్లాహ్‌ను అడిగారు. అల్లాహ్ ఒక చేపను సూచనగా నిర్ణయించి, ఆ చేప ఎక్కడైతే తప్పించుపోతుందో, అక్కడకు మళ్లీ

తిరిగి రావాలి, అప్పుడు ఆ స్థలంలో నీవు అతన్ని కలుసుకోవచ్చు అని చెప్పాడు. అప్పుడు మూసా ప్రవక్త ఆ చేపను వెతుక్కుంటూ సముద్ర తీరాన ప్రయాణం చేస్తూ పోతున్నారు. ఒక చోట ఆయన వెంట వస్తున్న సేవకుడు (యోషే) ఇలా అన్నాడు: “ఇందాక మనం ‘సఖ్‌రా’ (చట్టుబండ) వద్ద ఆగినప్పుడు, నేను మీకు చేప సంగతి చెప్పటం మరచిపోయాను. దాన్ని గురించిన ప్రస్తావన మీముందు చెయ్యకుండా షైతానే నన్ను మరిపింపజేశాడు.” మూసా ప్రవక్త, దానికి “అరె! ఆ స్థలాన్ని గురించే కదా మనం ఇంతవరకు వెతుక్కుంటూ వచ్చాము” అని అన్నారు. వారు ఉభయులూ తాము వచ్చిన అడుగుజాడల్ని అనుసరిస్తూ అన్వేషిస్తూ ఆ స్థలం వద్దకు చేరుకున్నారు. అక్కడ వారు హజ్రత్ ఖిజర్‌ను కలుసుకున్నారు. ఆ తరువాత జరిగిన విషయాన్ని గురించి స్వయంగా అల్లాహ్‌యే ఖురాను గ్రంథంలో (18: 60–82) ప్రస్తావించాడు.

## 18వ అధ్యాయం

**ప్రవక్త మహనీయులు (స) హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) కోసం “ఓ అల్లాహ్! ఇతనికి గ్రంథజ్ఞానాన్ని ప్రసాదించు” అని దుఆ చేయటం**

**75.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు (స) ఒకసారి నన్ను (తన హృదయానికి) హత్తుకుని ఇలా దుఆ చేశారు: “ఓ అల్లాహ్! ఇతనికి గ్రంథజ్ఞానాన్ని ప్రసాదించు.”

## 19వ అధ్యాయం

**ఒక పిల్లవాని హదీసు కథనం ఆమోదయోగ్యం కావటానికి అతనికి కనీస వయస్సు ఎంత ఉండాలి.**

**76.** హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజిఅన్) గారి కథనం ఇలా ఉంది: ఒకసారి నేను ఒక ఆడ గాడిద మీద స్వారీ అయి వచ్చాను. అప్పుడు నేను యౌవనానికి దగ్గరలో ఉన్నాను (కాని యువకుణ్ణి కాలేదు). ప్రవక్త (స) మహనీయులు మినాలో నమాజు చేస్తున్నారు. ఆయన గారి ముందు అడ్డు అనేది ఏదీ లేదు. నమాజీల పంక్తికి కొంచెం ముందు నుంచి నేను నడుస్తూ వెళ్ళిపోయాను. గాడిదను విడిచి పెట్టాను, అది మేస్తూ ఉండిపోయింది. తరువాత నేను నమాజీల పంక్తిలో కలిసి పోయాను. నన్ను ఎవరూ ఆక్షేపించలేదు.

**77.** మహ్మూద్ బిన్ రబీ ఇలా చెప్పారు: ప్రవక్త మహనీయులు (స) పుక్కిలించి నా ముఖం మీద ఊసిన సంఘటన నాకు ఇప్పటికీ జ్ఞాపకం ఉంది. ఆయన (స)

ఆ నీటిని ఒక బక్కెట్టులో నుంచి తీసుకుని నోట్లో పోసుకున్నారు. అప్పుడు నా వయస్సు **5** సంవత్సరాలు ఉంటుంది.[1]

## 20వ అధ్యాయం

**జ్ఞాన సముపార్జన కోసం ప్రయాణం చెయ్యటం. జాబిర్ బిన్ అబ్దుల్లా గారు ఒకే ఒక హదీసును గురించి సమాచారం సేకరించే నిమిత్తం, అబ్దుల్లా బిన్ ఉనైస్‌ను కలుసుకోవటానికి ఒక నెల రోజులపాటు ప్రయాణం చేయటం.**

**78.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్), మూసా ప్రవక్త (అస్సలామ్) సహచరుడు ఎవరు అనే విషయం గురించి, తాను హుర్రబిన్ ఖైస్ బిన్ హిస్న్ అల్ ఫజారీతో విభేదించానని చెప్పారు. ఇంతలోనే ఉబై బిన్ కాబ్ వారికి కనిపించారు. ఇబ్నె అబ్బాస్ ఆయన్ని పిలిచి ఇలా అడిగారు, "మూసా ప్రవక్త (అస్సలామ్) కలుసుకోదలచిన మరియు మూసా (అ) సహచరుడు అయిన వ్యక్తి ఎవరు అనే విషయంలో నాకూ, నా మిత్రునికీ మధ్య వివాదం తలెత్తింది. ఈ విషయం గురించి ప్రవక్త (స) మహనీయులు చెప్పగా మీరేమైనా విన్నారా?" ఉబై బిన్ కాబ్ ఇలా అన్నారు, "అవును, ప్రవక్త మహనీయులు (స) ఈ వృత్తాంతం గురించి ప్రవచించగా నేను విన్నాను. ఆయన ఇలా సెలవిచ్చారు; ఒకసారి మూసా ప్రవక్త (అ) ఇస్రాయీలు ప్రజలు కొందరితో కూర్చొని ఉన్నారు. అప్పుడు ఒక వ్యక్తి అక్కడకు వచ్చి, మీకంటే ఎక్కువ జ్ఞానం నేర్చుకున్న వ్యక్తి మరొకరు ఎవరైనా ఉన్నారనే విషయం మీకు తెలుసా అని ప్రశ్నించాడు. సమాధానంగా మూసా ప్రవక్త (అ) "నాకైతే తెలియదు" అని చెప్పారు. అల్లాహ్ వహీ (దైవవాణి) ద్వారా, ఖిజర్ అనే నా దాసుడు ఒకడు ఉన్నాడు, అతను నీకంటే ఎక్కువ జ్ఞానం కలవాడు అని తెలియజేశాడు. అప్పుడు మూసా ప్రవక్త (అ) నేను అతన్ని ఎలా కలుసుకోవాలి, అతనెక్కడున్నాడు అని అల్లాహ్‌ను అడిగారు. అల్లాహ్, ఒక చేపను గుర్తుగా నిర్ణయించి, ఆ చేప ఎక్కడైతే తప్పిపోతుందో అక్కడకు మళ్లీ తిరిగి రావాలి. ఆ స్థలంలో నీవు అతన్ని కలుసుకుంటావు అని ఆజ్ఞాపించాడు. తరువాత మూసా ప్రవక్త (అ) ఆ చేపను అన్వేషిస్తూ సముద్ర తీరాన ప్రయాణం చేస్తూ

---

77–1. మహ్మూద్ బిన్ రబీ అప్పుడు చాలా చిన్నవారు. కాని ఆయనకు అవగాహనా శక్తి ఉండేది; కనుక ఈ సంఘటన జ్ఞాపకం ఉండింది. కనుక ఆయన కథనం, ఆయన ఉల్లేఖనం నమ్మదగినదిగా నిలబడింది. ప్రవక్త మహనీయులు (స) ప్రేమ పురస్సరంగా, శుభాలు కలగటానికి అతని ముఖం మీద పుక్కిలించి ఊశారు అని చెప్పుకుంటారు.

**పోతున్నారు. ఒకచోట ఆయన వెంట ఉన్న సేవకుడు (యోషే) ఇలా అన్నాడు, "ఇంతకు ముందు మనం 'సఖ్‌రా' (శిల) వద్ద ఆగినప్పుడు నేను మీకు చేప విషయం చెప్పటం మరచిపోయాను. దాన్ని గురించిన ప్రస్తావన మీతో చెయ్యకుండా షైతానే నన్ను ఏమరుపాటులో పడవేశాడు." అప్పుడు మూసా ప్రవక్త (అ) ఆ స్థలాన్ని గురించే కదా మనం ఇంతవరకు అన్వేషిస్తూ వచ్చాము అని అన్నారు. వారు ఉభయులూ తమ అడుగుజాడల్ని అనుసరిస్తూ అన్వేషిస్తూ ఆ స్థలం వద్దకు చేరుకున్నారు. అక్కడ వారు హజ్రత్ ఖిజర్‌ను కలుసుకున్నారు. ఆ తరువాత జరిగిన గాథను గురించి అల్లాహ్‌యే స్వయంగా ఖురాను గ్రంథంలో (18: 60-82) ప్రస్తావించాడు.**

## 21వ అధ్యాయం

### జ్ఞాని ఔన్నత్యం, జ్ఞాన బోధ చేసేవాని ఔన్నత్యం

**79.** ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూ మూసా **(రజిఅన్) ఉల్లేఖించారు: ఏ మార్గదర్శకత్వాన్నయితే, ఏ జ్ఞాన విశేషాలనైతే, దేవుడు నాకు ప్రసాదించి ఈ ప్రపంచానికి నన్ను పంపించాడో, అవి నేలమీద ధారాపాతంగా కురిసే వర్షపు నీరు వంటివి. సారవంతమైన కొన్ని భూములు ఆ వర్షపు నీటిని పీల్చుకున్నాయి; తరువాత పచ్చని గడ్డి, కూరగాయలు, చెట్లూ చేమలూ పుష్కలంగా పండాయి. కొన్ని భూములు (రాతి నేలలు) గట్టిగా ఉన్నయ్; అవి వర్షపు నీటిని ఇంకిపోకుండా నిలిపి ఉంచాయి. దేవుడు ఆ నీటి ద్వారా ప్రజలకు లాభం చేకూర్చాడు. వారు దాన్ని త్రాగారు, తమ పశువులకు తాపారు, తమ పొలాలను దున్నుకుని సాగు చేసుకున్నారు. ఈ జడివాన కురిసిన కొన్ని భూములు (బంజరు భూములు), అవి నీటిని ఆపి ఉంచనూ లేకపోయాయి, పచ్చికను మొలకెత్తించనూ లేకపోయాయి (నీరు వాటి మీదుగా ప్రవహిస్తూ వృధా అయిపోయింది. ఆ భూములు ప్రజలకు ఉపయోగపడలేదు). మొదటి ఉపమానం, దైవ ధర్మాన్ని అవగాహన చేసుకున్న వ్యక్తిది, ఏ జ్ఞానాన్నయితే అల్లాహ్ నాకు ఇచ్చి ప్రవక్తగా నన్ను పంపాడో, ఆ జ్ఞానం వల్ల అతనికి లాభం కలిగింది. అతను స్వయంగానూ దాన్ని నేర్చుకున్నాడు, ఇతరులకూ నేర్పాడు. చివరి ఉపమానం, ఆ జ్ఞానాన్ని లెక్క చెయ్యకుండా నిర్లక్ష్య వైఖరిని అవలంబించిన వ్యక్తిది. అతను నా ద్వారా అల్లాహ్ పంపిన మార్గదర్శకత్వాన్ని స్వీకరించలేదు.[1] (కనుక అతను బంజరు భూమి లాంటివాడు).**

---

79-1. ధర్మం, ధర్మశాస్త్రం కుండపోతగా కురిసే వర్షం లాంటివి. ఈ వర్షం వల్ల మృతభూమి బ్రతుకుతుంది. అదేవిధంగా ధర్మం వల్ల మృత హృదయాలు ప్రాణం పోసుకుంటాయి. ధర్మాన్ని స్వీకరించి, దాన్ని నేర్చుకుని ఇతరులకు నేర్పిన వ్యక్తి నల్లని

## 22వ అధ్యాయం

**ప్రపంచం నుంచి జ్ఞానం లేపుకోబడడం, అజ్ఞానం వ్యాపించటం అనే విషయానికి సంబంధించిన ప్రస్తావన. హజ్రత్ రబియా ఇలా అన్నారు, "ధర్మజ్ఞానం కొంచెం తెలిసిన వాడైనాసరే, అతను దాన్ని వృధా చెయ్యకూడదు, ఇతరులకు బోధించాలి.[1]**

**80.** ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అనస్ (రజిఅన్) ఉల్లేఖించారు: ప్రళయం రాబోతోందని చెప్పటానికి ఇవి కూడా సూచనలే: ధర్మజ్ఞానం క్షీణిస్తుంది. అజ్ఞానం ప్రబలిపోతుంది. ఎక్కువ మంది ప్రజలు సారాయి త్రాగుతారు, వ్యభిచారం బహిరంగంగా జరుగుతుంది.

**81.** హజ్రత్ అనస్ (రజిఅన్) ఇలా ప్రకటించారు: నేను మీకు ఒక హదీసును వినిపిస్తాను. ఇక నా తరువాత ఆ హదీసును మరెవ్వరూ మీకు వినిపించరు.[1] నేను ప్రవక్త మహనీయులు (స) చెబుతూ ఉండగా విన్నాను. ఆయన (స) ఇలా సెల విచ్చారు: ఈ విషయాలు ప్రళయాన్ని సూచిస్తాయి: ధర్మజ్ఞానం తగ్గిపోతుంది; అజ్ఞానం ప్రబలిపోతుంది; వ్యభిచారం బహిరంగంగా జరుగుతుంది. మహిళల సంఖ్య పెరుగు

---

రేగడ నేల లాంటివాడు. స్వయంగా అదీ తడుస్తుంది, ఇతరుల కోసం ధాన్యం, గడ్డీ, పండ్లూ ఫలాలు ఇస్తుంది. కొందరు ధర్మజ్ఞానాన్నయితే నేర్చుకున్నారు. కాని వారు పూర్తిగా దాని ప్రకారం జీవించరు; అయితే ఇతరులకు దాన్ని నేర్పుతారు. వారు గట్టి మెట్టభూమి లాంటి వారు. అందులో ఏదీ పండలేదు; అయినా అది పోగుజేసిన, అందులో నిలిచిపోయిన నీటి వల్ల చాలామంది దైవదాసులకు ప్రయోజనం కలిగింది. వారు ఆ నీటిని త్రాగారు, త్రాపించారు, తమ పొలాలను తడుపుకున్నారు. ధర్మజ్ఞానాన్ని నేర్చుకొన్న వాడు, ఇతరులకు నేర్పని వాడు బంజరుభూమి లాంటివాడు. దాని మీద వర్షమైతే కురిసింది, కాని దాని మీద అది ఆగకుండా ప్రవహిస్తూ పారుతూ వృధా అయిపోయింది. ఆ భూమిలో ఏమీ పండలేదు, నీరు నిలువలేదు; ఇతరులెవరికీ దానివల్ల లాభం కలగలేదు.

22-1. అతను స్వయంగా తన కోసమయినా ఆ జ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి లేదా ఇతరులకయినా దాన్ని బోధించాలి. పండితుడనేవాడు ఏమీ చెయ్యకుండా సోమరిపోతుగా ఉండటం, నోరు మూసుకుని కూర్చోవటం, కలం పట్టకుండా నిర్లిప్తంగా ఉండటం మన్నింపరాని విషయం.

81-1. అంటే ప్రవక్త మహనీయులు (స) చెబుతూ ఉండగా స్వయంగా విని వినిపించే

**తుంది, పురుషుల సంఖ్య తరుగుతుంది. చివరకు ఒక పురుషుడు 50 మంది స్త్రీలకు దిక్కుగా ఉండవలసిన పరిస్థితి ఏర్పడుతుంది.[2]**

## 23వ అధ్యాయం
## జ్ఞానం యొక్క ఔన్నత్యం

**82. ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) గారి కథనం: ఒకసారి నేను నిద్రలో ఉండగా, నా దగ్గరకు పాలతో నిండి ఉన్న గిన్నె ఒకటి తీసుకురాబడింది. దాన్ని నేను కడుపు నిండా తాగేశాను. (దాన్ని నేను ఎంతగా నాకుతూ త్రాగానంటే) నా చేతి గోళ్ల మీద దాని తాజాదనం (తడి) కనిపించసాగింది. తరువాత మిగిలిపోయిన పాలను నేను హజ్రత్ ఉమర్ (రజిఅన్)కు ఇచ్చాను. ప్రవక్త (స) గారి సహచరులు, దైవప్రవక్తా (స)! దీని మర్మం ఏమిటి? అని అడిగారు. దానికి ఆయన (స) 'జ్ఞానం' అని సెలవిచ్చారు.[1]**

## 24వ అధ్యాయం
## పశువుపై స్వారీ చేస్తూ ఉన్నప్పుడు గాని లేదా మరేదైనా వస్తువుపై నిలబడి ఉన్నప్పుడు గాని ధార్మిక తీర్పు చెప్పటం

**83. హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజిఅన్) ఇలా కథనం చేశారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) తమ చివరి హజ్ యాత్ర సమయంలో**

---

వ్యక్తి ఉండడు అని భావం. ప్రవక్త (స)గారి సహచరులందరూ మరణించారనే విషయం, కొన్ని రోజుల్లో మహాప్రవక్త (స)ను చూసే వారెవ్వరూ ప్రపంచంలో మిగిలి ఉండరనే విషయం హజ్రత్ అనస్ (ర)కు తెలిసిపోయింది.

81–2. ప్రళయం దగ్గర్లో ఉన్నప్పుడు యుద్ధాలు ఎక్కువగా జరుగుతాయి, మొత్తం ప్రపంచంలో జరుగుతాయి, ఒక దేశం మరొక దేశం మీద దాడి చేస్తుంది; ఈ యుద్ధాలలో పురుషులు అధిక సంఖ్యలో చంపబడతారు. అప్పుడు స్త్రీలు చాలా మంది ఉండిపోతారు, పురుషుల కంటే ఎక్కువ సంఖ్యలో ఉంటారు. కొందరు అవిశ్వాసుల మహిళలు చాలా మంది ఖైదీలుగా వస్తారని అంటారు. మరికొందరు, ఆ కాలంలో ప్రజలు ధర్మశాస్త్రం ప్రకారం నడుచుకోరని, ఒక్కొక్క పురుషుడు 50య్యేసి మంది స్త్రీలను చేసుకుంటాడని అంటారు. ఏమవుతుందో ఏమో, అల్లాహ్‌కే బాగా తెలుసు, అల్లాహ్ శరణు!

82–1. ఇక్కడ పాలు అంటే జ్ఞానం అని భావం. ఒకవేళ మనిషి తాను, కలలో పాలు తాగుతూ ఉన్నట్లు చూసినట్లయితే, దాని భావం అతను జ్ఞానాన్ని పొందాడు అని.

మినాలో ప్రజల కోసం కొంచెంసేపు ఆగారు. ప్రజలు ఆయన్ని (స) ఎన్నో ప్రశ్నలు అడిగారు. వారిలో ఒక మనిషి ఆయన(స)గారి వద్దకు వచ్చి ఇలా అడిగాడు: దైవప్రవక్తా! నాకు జ్ఞాపకం లేదు. ఖుర్బానీ చెయ్యకుండానే, నేను నా తల వెంట్రుకలు తీయించుకున్నాను. దానికి మహనీయులు (స), "పర్వాలేదు, ఇప్పుడు ఖుర్బానీ ఇవ్వండి. అందులో దోషం లేదు" అని సమాధానం చెప్పారు. తరువాత మరొక మనిషి వచ్చి "దైవప్రవక్తా! నాకు జ్ఞాపకం ఉండలేదు. కంకర రాళ్ల విసరక ముందే నేను ఖుర్బానీ ఇచ్చాను అని ప్రశ్నించాడు. దానికి ఆయన (సఅసమ్) "పర్వాలేదు ఇప్పుడు రాళ్లు విసరండి. అది దోషమేమీ కాదు" అని సమాధానంగా సెలవిచ్చారు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా అన్నారు: (హజ్ సంప్రదాయాలను గురించి) దైవప్రవక్త (స)ను ప్రజలు అడిగిన ప్రశ్నలలో, ఒకరేమో ఒక విషయాన్ని గురించి ముందు ప్రస్తావిస్తే, మరొకరు దాన్ని గురించి తరువాత ప్రస్తావించారు. అప్పుడు ఆయన (స) "పర్వాలేదు. ఇప్పుడు కానివ్వండి. అందులో తప్పేమీ లేదు" అని మాత్రమే సమాధానమిచ్చారు.

## 26వ అధ్యాయం

### చెయ్యి ఊపిగాని లేదా తల ఊపిగాని ఎవరైనా ధార్మిక తీర్పు చెప్పటం

**84.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా కథనం చేశారు: హజ్ సమయంలో దైవ ప్రవక్త ముహమ్మద్ (స)ను ఒక మనిషి ఇలా అడిగాడు: ప్రవక్తా (స)! రాళ్లు విసరకుండానే నేను జిబహ్ చేశాను. దానికి ఆయన (స) చెయ్యి ఊపి, అది దోషం కాదు అని ప్రవచించారు. మరొక వ్యక్తి ఇలా ప్రశ్నించాడు; నేను ఖుర్బానీ ఇవ్వకుండానే తల వెంట్రుకలు తీయించుకున్నాను. అప్పుడు ప్రవక్త (స) మహనీయులు, చెయ్యి ఊపుతూ, ఏం పర్వాలేదు. అది తప్పు కాదు అని సూచించారు.

**85.** ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా సెలవిచ్చారని, హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు: ధర్మజ్ఞానం లేపుకోబడుతుంది, అజ్ఞానం ప్రబలిపోతుంది. రకరకాల కల్లోలాలు, కలహాలు వ్యాపిస్తాయి; 'హరజ్' ఉధృతమవుతుంది. ప్రజలు, ఓ ప్రవక్తా! (స) హరజ్ అంటే ఏమిటి అని అడిగారు. ఆయన తమ చేతిని ఊపుతూ, అది "పరస్పరం చంపుకోవటం" అనే భావాన్ని సూచిస్తూ తెలియజేశారు.[1]

---

85-1. హబ్షీ నిఘంటువులో "హరజ్" అంటే 'హత్య', లేక చంపటం అనే అర్థాలు ఉన్నయ్; ఇమామ్ బుఖారీ (రహ్మాలై) 'కితాబుల్ ఫితన్'లో చెప్పిన విధంగా.

**86.** అస్మా బిన్‌తె అబూ బకర్(రజిఅన్‌హా) ఇలా కథనం చేశారు : ఒకసారి నేను హ|జ్రత్ ఆయెషా(రజిఅన్) ఇంటికి వెళ్ళాను. అప్పుడు ఆమె నమాజు చేస్తూ ఉన్నారు. ఆమెతో నేను, ప్రజలకేమయింది, (వారు ఆందోళన పడుతున్నారు) అని అన్నాను. ఆమె సైగ చేసి ఆకాశాన్ని చూడమన్నారు. నేను చూశాను, ప్రజలు నిలబడి ఉన్నారు. అప్పుడు హ|జ్రత్ ఆయెషా(రజిఅన్), సుబ్‌హానల్లాహ్ అని అన్నారు. నేను, ఇదేమైనా (దైవశిక్షకు, ప్రళయానికి) సంకేతమా, అని అడిగాను. ఆమెగారు, అవును, అని తలూపుతూ చెప్పారు. అప్పుడు నేను కూడా (నమాజు చెయ్యటం కోసం) నిలబడిపోయాను; చివరకు నేను స్పృహ కోల్పోతూ ఉన్నట్లు గమనించాను. తరువాత నా తల మీద నేనే నీళ్ళు పోసుకున్నాను. నమాజు అయి పోయిన తరువాత, దైవప్రవక్త అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన్ని స్తుతించారు. ఇలా అన్నారు: ఇప్పుడిప్పుడే నేను పూర్వం చూడని విషయాలను చూశాను, స్వర్గ నరకాలను కూడా చూశాను. మీరు మీ సమాధుల్లో పరీక్షలకు గురి చెయ్యబడతారనే విషయం నాకు దైవవాణి ద్వారా తెలియజెయ్యబడింది. ఈ బాధలు, ఈ పరీక్షలు మసీహ్ దజ్జాల్‌ల పరీక్షల లాంటివిగానో లేదా వాటికి దగ్గరలో ఉన్నటువంటివిగానో ఉంటాయి. (ఇక్కడ హ|జ్రత్ అస్మా(రజిఅన్) ఏ పదాన్ని ప్రయోగించారో ఫాతిమాకు జ్ఞాపకం లేదు). ఈ మనిషిని (ప్రవక్త ముహమ్మద్ (స) గురించి మీకేమి తెలుసు అని మీరు అడగబడతారు. అప్పుడు విశ్వాసి మరియు నమ్మకం గలవాడు (హ|జ్రత్ అస్మా(ర) ఇక్కడ ఏ పదాన్ని వాడారో తెలియదు) ఇలా సమాధానం చెబుతాడు : "ఆయన ముహమ్మద్(స), ఆయన్ని అల్లాహ్ ప్రవక్తగా పంపాడు. ఆయన(సఅసమ్) మా వద్దకు స్పష్టమైన సూచనలకు, మార్గదర్శకత్వానికి సంబంధించిన విషయాలను తీసుకుని వచ్చారు. మేము ఆయన(సఅసమ్) బోధించిన విషయాలను విశ్వసించాము. ఆయన గారి అడుగుజాడల్లో నడిచాము. ఆయన ముహమ్మద్(స). అతను(సఅసమ్) దాన్ని మూడుసార్లు ప్రకటిస్తాడు. అప్పుడు దైవదూతలు అతనితో ఇలా అంటారు: నీవు హాయిగా, ప్రశాంతంగా నిదురపో. నీవు ఆయన్ని(స) హృదయ పూర్వకంగా విశ్వసిం చావని మాకు తెలిసిపోయింది. మరొక వైపు, ఒక కపటి లేదా అనుమానించేవాడు (ఈ రెండు పదాల్లో ఏ పదాన్ని హ|జ్రత్ అస్మా(రజిఅన్‌హా) వాడారో తెలియదు) ఇలా అంటాడు: "నాకు అసలేమీ తెలియదు (నేనైతే ప్రపంచంలో అసలు దాన్ని గురించి ఆలోచించనే లేదు). ప్రజలు పరస్పరం చర్చించుకుంటూ ఉండగా నేను విన్నాను. దాన్నే నేనూ అనటం ప్రారంభించాను".

## 27వ అధ్యాయం

కారుణ్యమూర్తి ముహమ్మద్(సఅసమ్) అబ్దుల్ ఖైస్‌కి చెందిన ప్రజల నుద్దేశించి, "విశ్వాసానికి, జ్ఞానానికి సంబంధించిన విషయాలను కంఠస్థం చేసుకో మని, వారితోపాటు రానటువంటి తమ దేశ ప్రజలకు వాటిని గురించి చెప్పమని" ఉద్బోధించారు.

మాలిక్ బిన్ హువైరిత్, మాకు ప్రవక్త మహనీయులు (సఅసమ్), "మీరు మీ కుటుంబీకుల వద్దకు వెళ్ళండి, వారికి ధార్మిక విషయాలను గురించి బోధించండి" అని సెలవిచ్చారని తెలియజేశారు.

**87.** హజ్రత్ అబూ జమ్‌రా (రజిఅన్) ఇలా అన్నారు: నేను అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజిఅన్)కు మరియు బస్రా నుంచి వచ్చిన ప్రజలకూ మధ్య అనువాదకునిగా వ్యవహరించాను. అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజిఅన్) ఇలా చెప్పారు: అబ్దుల్ ఖైస్ తెగ ప్రజల ప్రతినిధి వర్గం ఒకటి మహాప్రవక్త (సఅసం) వద్దకు వచ్చింది. ఆయన (స), "ఈ ప్రజలు ఎవరు పంపగా వచ్చారు? లేదా ఈ ప్రతినిధి వర్గ సభ్యులు ఎవరు?" అని అడిగారు. వారు, "మేము రబీయా తెగకు చెందినవారము" అని సమాధానం చెప్పారు. అప్పుడు కారుణ్యమూర్తి (సఅసమ్) ఇలా సెలవిచ్చారు: "ఈ ప్రజలకు, ఈ ప్రతినిధి వర్గానికి స్వాగతం! మీ ఆత్మగౌరవానికి భంగం వాటిల్లదు. మీరు బాధ పడే, విచారించే అవసరమూ రాదు." వారు ఇలా అన్నారు: "మేము చాలా దూర ప్రాంతం నుంచి మీ దగ్గరకు వచ్చాము. మాకూ మీకూ మధ్య ముజర్‌కు చెందిన అవిశ్వాసుల వర్గం ప్రతిబంధకంగా ఉంది. కనుక మేము ఎప్పుడు పడితే అప్పుడు మీ వద్దకు రాలేము, ఒక్క పవిత్ర మాసంలో తప్ప. దయచేసి మీరు ఏవైనా మంచి విషయాలు మాకు బోధించండి, వాటిని గురించి మేము ఇక్కడకు రానటువంటి మా తెగ ప్రజలకు తెలియజేస్తాము, వాటి ప్రకారం జీవించి మేము (దేవుడు మేలు చేస్తే) స్వర్గంలో ప్రవేశించగలుగుతాము." మహాప్రవక్త (సఅసమ్) వారికి నాలుగు విషయా లను గురించి ఆజ్ఞాపించారు, మరొక నాలుగు విషయాలను వారికి నిషేధించారు. ఆయన (స) ఏకైక దేవుడైన అల్లాహ్‌ను మాత్రమే విశ్వసించాలని వారికి ఆదేశించారు. ఏకైక దేవుడైన అల్లాహ్‌ను విశ్వసించటం అంటే ఏమిటో మీకు తెలుసా? అని ప్రశ్నిం చారు. దానికి వారు, అల్లాహ్‌కు ఆయన ప్రవక్త (స)కే బాగా తెలుసు అని జవాబు చెప్పారు. అప్పుడు ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు: అల్లాహ్ తప్ప నిజమైన ఆరాధ్యుడు ఎవ్వడూ లేడు, ముహమ్మద్ (సఅసమ్) ఆయన పంపగా

వచ్చిన ప్రవక్త అని సాక్ష్యమివ్వటం. ఇంకా చక్కగా నమాజులు చెయ్యటం, జకాతు ఇవ్వటం, రమజాను మాసం ఉపవాసాలు పాటించటం, విజయప్రాప్తిలోని ఐదవ భాగాన్ని అల్లాహ్ మార్గంలో ఇవ్వటం. ఆ తరువాత ఆయన (సఅసమ్) నాలుగు విషయాలను నిషిద్ధమైనవిగా ప్రకటించారు: అద్ దుబ్బా, హన్‌తమ్, ముజఫ్ఫత్, అన్ నఖీర్ లేక ముఖయ్యర్ (ఇవి సారాయి వంటి మత్తు పానీయాలు తయారుచేసే కుండల పేర్లు) మహాప్రవక్త (సఅసమ్) ఇంకా ఇలా అన్నారు: వాటిని కంఠస్థం చేసుకోండి, జ్ఞాపకముంచుకోండి. ఇక్కడకు మీతోపాటు రానటువంటి ప్రజలకు, మీ వెనుక ఉండిపోయిన వారికి ఈ విషయాలు చెప్పండి.

## 28వ అధ్యాయం

### ఏదైనా సమస్య ఉత్పన్నమైనప్పుడు, దాని పరిష్కారం కోసం ప్రయాణం చెయ్యటం

**88.** అబ్దుల్లా బిన్ అబీ ములైకా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఉఖబా బిన్ హారిస్, తాను అబూ ఇహాబ్ బిన్ అజీజ్ కుమార్తె గనియ్యాను వివాహం చేసుకున్నానని చెప్పారు. తరువాత ఒక స్త్రీ అతని వద్దకు వచ్చి (ఆమె పేరు తెలియదు), నేను నీకు, నీ భార్య అయిన గనియ్యాకు పాలు త్రాపాను అని అనసాగింది. అప్పుడు ఉఖబా, నీవు నాకు పాలు త్రాపావని నేను అనుకోవటం లేదు; ఈ విషయం గురించి నీవు నాకు ఎప్పుడూ చెప్పనూలేదు కదా! అని అన్నారు. ఆ తరువాత ఉఖబా తమ దేశం నుంచి బయలుదేరి మదీనా నగరంలో ఉన్న ప్రవక్త మహనీయుని (స) కలుసుకునేందుకు ప్రయాణం చేసి వెళ్లారు; ఆయన్ని (స) ఈ విషయం గురించి అడిగారు. అప్పుడు ఆయన (స), అలాంటి విషయం నీకు చెప్పబడినప్పుడు (ఆమె నీ చెల్లెలని తెలిసినప్పుడు) నీవు ఆ స్త్రీతో ఎలా కాపురం చెయ్యగలుగుతావు? అని అన్నారు. తరువాత ఉఖబా ఆమెకు విడాకులిచ్చేసి మరొకామెను వివాహం చేసుకున్నారు.

## 29వ అధ్యాయం

### జ్ఞానసముపార్జనకు వంతులు నిర్ణయించటం.

**89.** హజ్రత్ ఉమర్ (రజిఅన్) ఇలా కథనం చేశారు: నేను మరియు పొరుగున నివసిస్తున్న నా అన్సారీ మిత్రుడు ఉభయులం బనూ ఉమయ్యా బిన్ జైద్‌కు చెందిన గ్రామం - అది మదీనా పట్టణానికి తూరుపు దిశలో ఉన్న వాడల్లోని పెద్ద వాడ - లో నివసిస్తూ ఉండేవారం. మేము ఇద్దరం మదీనాలో ఉన్న మహా ప్రవక్త(స) వద్దకు వంతులవారీగా వెళ్ళి వస్తూ ఉండేవారం. ఒకరోజు ఆయన వెళ్ళేవారు,

ఇంకొక రోజు నేను వెళ్ళేవాణ్ణి. నేను వెళ్ళిన రోజున ప్రవక్త(స)పై అవతరించిన దైవవాణి వగైరాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని నేను అతనికి తెలిపేవాణ్ణి. అతను వెళ్ళిన రోజున, అతను కూడా అలానే చేసేవాడు. ఒక రోజున ఏం జరిగిందంటే, నా పొరుగు అన్సారీ స్నేహితుడు, తనవంతు రోజు వచ్చినప్పుడు అక్కడకు వెళ్ళాడు. అక్కణ్ణుంచి తిరిగి వచ్చిన అతను, నా ఇంటి తలుపును గట్టిగా తట్టి, ఉమర్ ఉన్నాడా? అని అరిచాడు. నేను భయపడి బయటకు వచ్చాను. అతను, ఈ రోజైతే ఒక పెద్ద విషాదమే జరిగిపోయింది (ప్రవక్త మహనీయులు(స) తమ భార్యలకు ఈ రోజు విడాకులిచ్చేశారు) అని ఆక్రోశించాడు. ఈ విషయం విన్న తరువాత నేను, నా కూతురు హఫ్సా వద్దకు వెళ్ళాను. ఆమె బాగా ఏడుస్తోంది. నేను, 'ప్రవక్త మహ నీయులు నీకు విడాకులిచ్చారా?'అని అడిగాను. అప్పుడు ఆమె, 'నాకు తెలియదు' అని సమాధానం పలికింది. ఆ తరువాత నేను దైవప్రవక్త(స) వద్దకు వెళ్ళాను. నిలబడి ఉండే ఇలా అడిగాను, "దైవప్రవక్తా! మీరు మీ భార్యలకు విడాకులిచ్చేశారా?" దానికి ఆయన(స) 'లేదు' అని జవాబు పలికారు. అప్పుడు నేను 'అల్లాహు అక్బర్' (అల్లాహ్ మాత్రమే గొప్పవాడు) అని అన్నాను.

## 30వ అధ్యాయం

### హితోపదేశం చేసేటప్పుడు గాని లేదా చదివించేటప్పుడు గాని ఏదైనా అవాంఛనీయమైన విషయం, గమనించినప్పుడు కోప్పడటం.

**90.** అబూ మసూద్ అన్సారీ (రజిఅన్) కథనం ప్రకారం, ఒకసారి ఒక వ్యక్తి (ఖుర్రమ్ బిన్ అబీ కఅబ్ రజిఅన్) దైవప్రవక్త (సఅసమ్)కు ఇలా విన్నవించు కున్నాడు: దైవప్రవక్తా(స)! నాకు (జమాఅత్‌తో) నమాజు చెయ్యటం కష్టతరమై పోయింది. ఎందుకంటే, ఫలానా మనిషి (మఆజ్ బిన్ జబల్) సుదీర్ఘమైన నమాజు చేస్తారు. అబూ మసూద్ (రజిఅన్) ఇలా అన్నారు; మహనీయ ప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) హితోపదేశం చేసేటప్పుడు ఆ రోజు ఆగ్రహపడినంతగా ఆగ్రహపడటాన్ని నేను ఎన్నడూ చూసి ఉండలేదు. ఆయన (సఅసమ్), "ప్రజలారా! మీలో కొందరు సత్కార్యాల (నమాజుల) పట్ల ప్రజల్లో అయిష్టత కలిగిస్తున్నారు.[1] కనుక ఎవరైనా

---

90–1. ఆగ్రహానికి కారణం ఆయన (స) అలా చెయ్యవద్దని చాలా సార్లు నివారించి ఉంటారు, అయినా ప్రజలు అలానే చేసి ఉంటారు. అలా చెయ్యటం వల్ల ప్రజలకు ధర్మం పట్ల అయిష్టత, ఏహ్యాభావం కలిగే అవకాశం ఉంది.

సమాజుల్లో ప్రజలకు నాయకత్వం వహిస్తున్నప్పుడు, తేలికైన చిన్న పాటి నమాజు చేయించాలి. ఎందుకంటే వారిలో కొందరు వ్యాధిగ్రస్తులై ఉంటారు, కొందరు బలహీనులై ఉంటారు, మరికొందరు పనులకు వెళ్ళవలసిన వారు ఉంటారు" అని చెప్పారు.

**91.** జైద్ బిన్ ఖాలిద్ జుహన్నీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఒక మనిషి (అమీర్ లేదా బిలాల్ లేదా జారూద్) మహాప్రవక్త(సఅసమ్)ను, ఇతరులు పోగొట్టు కున్న వస్తువును తీసుకోవటం గురించి ప్రశ్నించాడు. దానికి సమాధానంగా దైవ ప్రవక్త (సఅసమ్) ఇలా సెలవిచ్చారు: "ఆ వస్తువుకు వెయ్యబడిన ముడి యొక్క దారాన్ని, అది ఉన్నటువంటి సంచినీ గుర్తించి జ్ఞాపకం పెట్టుకో. దానిని గురించి ఒక సంవత్సర కాలం వరకు బహిరంగ ప్రకటన చేయిస్తూ ఉండు; తరువాత దానిని నీవు వినియోగించుకో. ఒకవేళ దాని యజమాని వచ్చినట్లయితే, దానిని అతనికి ఇచ్చెయ్యి." ఆ మనిషే తప్పిపోయిన ఒంటెను గురించి అడిగాడు. దానికి దైవప్రవక్తకు కోపం వచ్చింది; ఆయనగారి రెండు చంపలు ఎర్రబడ్డాయి లేదా ఆయన గారి ముఖ వర్చస్సు ఎర్రగా మారిపోయింది. ఆయన(స) ఇలా బోధించారు; "అటువంటి ఒంటెతో నీకు ఏమాత్రం సంబంధం లేదు. దానికి నీళ్ళ సంచి ఉంది, దానికి కాళ్ళు ఉన్నయ్, అది నీరు ఉన్న స్థలానికి వెళ్ళగలదు. తన యజమాని వచ్చేవరకు అది చెట్ల ఆకులు మెయ్యగలదు." తరువాత ఆ మనిషి, తప్పిపోయిన మేకను గురించి అడిగాడు. దానికి ఆయన(స), అది నీకో లేదా నీ సోదరుడికో పనికొస్తుంది లేదా తోడేలు బారిన పడుతుంది అని సమాధానం చెప్పారు.

**92.** అబూ మూసా అష్అరీ (రజిఅన్) ఉల్లేఖనం ఇలా ఉంది: దైవప్రవక్త (సఅసమ్)కు నచ్చని విషయాలను గురించి ప్రజలు ప్రశ్నలు వేశారు. మాటిమాటికి అటువంటి ప్రశ్నల్నే వేయటం వలన, సమాధానం చెప్పమని హటం చేయటం వలన ఆయన (స) గారికి కోపం వచ్చింది. అప్పుడు ఆయన (స) ప్రజల్ని ఉద్దేశించి, "ఇక మీకు ఇష్టమైన ప్రశ్నల్ని అడగండి" అని అన్నారు. ఒక వ్యక్తి 'నా తండ్రి ఎవరు?' అని అడిగాడు. దానికి దైవ ప్రవక్త (సఅసమ్), "నీ తండ్రి హుజాఫా", అని సెలవిచ్చారు. అక్కడ నిలబడి ఉన్న రెండో వ్యక్తి, దైవప్రవక్తా! (స) నా తండ్రి ఎవరు, అని అడిగాడు. దానికి జవాబుగా ఆయన (స), "నీ తండ్రి పేరు సాలిమ్. అతను షేబా బానిస" అని పలికారు. దైవప్రవక్త (స) పవిత్ర ముఖారవిందంలో కోపాన్ని

గమనించిన హజ్రత్ ఉమర్ (రజిఅన్), "దైవప్రవక్తా(స)! మేము మిమ్మల్ని బాధ పెట్టినందుకు అల్లాహ్ దర్బారులో పశ్చాత్తాపపడుతున్నాము" అని నివేదించుకున్నారు.

## 30వ అధ్యాయం

## ఇమామ్ లేదా హదీసువేత్త ముందు వినయంగా కూర్చోవటం

**93.** అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) కథనం ప్రకారం: ఒక రోజున ప్రవక్త మహనీయులు (స)(ఇంట్లో నుంచి) బయటకు (ప్రజల్లోకి) వచ్చారు. అబ్దుల్లా బిన్ హుజాఫా నిలబడి నా తండ్రి ఎవరు అని అడిగారు. సమాధానంగా దైవప్రవక్త (స) నీ తండ్రి హుజాఫా అని చెప్పారు.[1] తరువాత ఆయన (స), అడగండి, మీకు ఇష్టమైనదాన్ని గురించి యధేచ్ఛగా అడగండి అని పదే పదే అన్నారు. ఈ పరిస్థితిని గమనించిన హజ్రత్ ఉమర్ (రజిఅన్) మహాప్రవక్త (స) ముందు మోకరిల్లారు, మూడు సార్లు ఇలా అన్నారు: 'మేము అల్లాహ్‌ను మా ప్రభువుగాను, ఇస్లామ్‌ను మా ధర్మంగాను, ముహమ్మద్ (సఅసమ్)ను దైవప్రవక్త (స)గాను అంగీకరించాము, దానికి సంబరపడుతున్నాము'. ఆ తరువాత మహనీయ ముహమ్మద్ (సఅసమ్) శాంతించారు.[2]

## 31వ అధ్యాయం

**బాగా అర్థమయ్యేందుకు ఒక విషయాన్ని గురించి మూడేసిసార్లు చెప్పటం - ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఒక హదీసులో, వినండి, 'అబద్ధం చెప్పటం... అని సెలవిచ్చారు. అదే విషయాన్ని ఆయన (స) పలుమార్లు చెప్పారు. ఇబ్నె ఉమర్ (రజిఅన్) ఒక ఉల్లేఖనంలో ఇలా అన్నారు: దైవప్రవక్త మహనీయులు (సఅసమ్), "నేను మీకు అల్లాహ్ సందేశాన్ని అందజేశానా లేదా?" అని మూడుసార్లు అడిగారు.**

**94.** హజ్రత్ అనస్ (రజిఅన్) కథనం ప్రకారం, దైవప్రవక్త (స) మహనీయులు ఏదైనా విషయం గురించి చెప్పినప్పుడు, దాన్ని మూడేసిసార్లు చెబుతారు.

---

93-1. ప్రజలు అబ్దుల్లాహ్‌ను హుజాఫా కుమారుడు కాదని, మరెవరి కుమారుడో అని అనుకునేవారు. అతనిక్కూడా ఈ విషయం గురించి అనుమానం తలెత్తింది. కనుక అతను మహాప్రవక్త (స)ను ఈ విషయం గురించి అడిగి సందేహాన్ని నివృత్తి చేసుకున్నారు, తృప్తి పొందారు.

93-2. అంటే ఆయన (స) గారి ఆగ్రహం మటుమాయమై పోయింది; మరొక హదీసులో, "ఫసకన గజబుహూ" (ఆయన కోపావేశం శాంతించింది) అని ప్రస్తావించబడింది.

ప్రజలు దాన్ని గురించి క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలని ఆయన (స) అలా చెబుతారు. ఏదైనా జాతి ప్రజల దగ్గరకు ఆయన (స) వెళ్లినప్పుడు, వారికి సలాము చేస్తారు, ఆ విధంగా మూడుసార్లు సలాము చేస్తారు.

**95.** అబ్దుల్లా బిన్ అమ్ర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఒకసారి మేము ప్రయాణం చేస్తున్నప్పుడు, ప్రవక్త మహనీయులు (స) వెనుక ఉండిపోయారు. తరువాత ఆయన (స) అసర్ నమాజు సమయం ఆసన్నమైనప్పుడు లేదా కొద్దిపాటి సమయం మాత్రమే అసర్‌కు మిగిలి ఉన్నప్పుడు వచ్చి మమ్మల్ని కలిశారు. అప్పుడు మేము వుజూ చేసుకుంటున్నాము; తడి చేతులతో మా కాళ్లకు మసా చేస్తున్నాము. (అంటే కాళ్లను పూర్తిగా కడగలేదు). ఆయన (స) కంఠాన్ని పెంచి బిగ్గరగా, "మీ మడమలకు నరకం వల్ల ముప్పు వాటిల్లుతుంది" అని అన్నారు. రెండుసార్లో మూడు సార్లో ఆయన (స) ఆ విధంగా అన్నారు.

## 32వ అధ్యాయం

### ఒక మనిషి తన మహిళా బానిసకు, తన కుటుంబ సభ్యులకు ధర్మజ్ఞానాన్ని నేర్పటం

**96.** అబూ బుర్దా తండ్రిగారైన అబూ మూసా అష్అరీ (రజిఅన్), ప్రవక్త మహనీయులు (సఅసం) ఇలా సెలవిచ్చారని ఉల్లేఖించారు: ముగ్గురు వ్యక్తులకు రెట్టింపు ప్రతిఫలం లభిస్తుంది; మొదటి వ్యక్తి, గ్రంథ ప్రజలలోనివాడు (యూదులు, క్రైస్తవులు). అతను తమ ప్రవక్తను విశ్వసించాడు, తరువాత ప్రవక్త ముహమ్మద్ (స)ను కూడా విశ్వసించాడు (అంటే ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించాడు). రెండో వ్యక్తి బానిస వ్యక్తి, అతను అల్లాహ్ హక్కుల్నీ నెరవేర్చాడు, తరువాత తన యజమానుల హక్కుల్నీ నెరవేర్చాడు. మూడో వ్యక్తి, ఒక స్త్రీ బానిసకు యజమాని అయినవాడు. అతను ఆమెను ప్రేమతో, అనురాగంతో చూస్తాడు, తరువాత ఆమెకు మంచీ, మర్యాద, సభ్యతా, సంస్కారం నేర్పుతాడు, ఆ తరువాత ఆమెకు మంచి విద్యాబుద్ధులు నేర్పి, బానిసత్వం నుంచి విముక్తురాలుగా చేసి, తరువాత ఆమెను వివాహం చేసుకుంటాడు. అప్పుడు అతనికి రెట్టింపు పుణ్యం లభిస్తుంది.[1] ఆమిర్ షాబీగారు సాలిహ్ బిన్ హయ్యాన్‌తో ఇలా అన్నారు: మేము ఈ హదీసును మీకు ఉచితంగా, ఏమీ తీసుకోకుండా వినిపించాము. ఒకానొకప్పుడు దీనికంటే తక్కువస్థాయి హదీసు కోసం

96-1. ఒక పుణ్యం ఆమెను బానిసత్వం నుంచి విముక్తురాలుగా చేసి స్వేచ్ఛను ప్రసాదించినందుకు. మరొకటి ఆమెను వివాహం చేసుకున్నందుకు. మంచీ మర్యాదలు, విద్యాబుద్ధులు నేర్పినందుకు వేరే పుణ్యం లభిస్తుంది. అది ఎలాగైనా లభిస్తుంది; తన బానిసకు విద్య గరిపినా లేదా మరొకరెవరికి విద్య గరిపినా.

కూడా ప్రజలు మదీనా పట్టణం దాకా వెళ్లివచ్చేవారు.[2]

## 33వ అధ్యాయం

## ఇమామ్ (నాయకుడు) మహిళలకు హితోపదేశం చెయ్యటం, వారికి ధర్మానికి సంబంధించిన విషయాలు నేర్పటం

**97.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఉల్లేఖనం ప్రకారం : ఒకసారి ప్రవక్త మహనీయులు (సఅసమ్) పురుషుల పంక్తిలో నుంచి బయటకు వచ్చారు. అప్పుడు ఆయన (స)గారి వెంట హజ్రత్ బిలాల్ (రజిఅన్) ఉన్నారు. తన ఉపన్యాసం స్త్రీలకు వినిపించలేదేమో అనే ఆలోచన రావటం వల్ల, ఆయన (స) స్త్రీల వద్దకు వెళ్లి హిత బోధ చేశారు; దానధర్మాలు చెయ్యమని వారిని ఆజ్ఞాపించారు. ప్రవక్త (స) ఆజ్ఞను విని స్త్రీలు దానం చెయ్యటం ప్రారంభించారు. కొందరు మహిళలు తమ చెవి రింగు లిస్తే, మరికొందరు తమ ఉంగరాలను దానం చేశారు. హజ్రత్ బిలాల్ (రజిఅన్) తమ వస్త్రం యొక్క చివరి భాగాన్ని పట్టుకుని ఆ దానాన్ని స్వీకరించారు.

## 34వ అధ్యాయం

## హదీసు నేర్చుకోవటానికి ఆతురత, అత్యంత కుతూహలం కలిగి ఉండటం.

**98.** హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖనం: నేను అడిగాను, మహా ప్రవక్తా(స)! ప్రళయంనాడు మీ (స) సిఫారసుకు అందరికంటే ఎక్కువగా తగినవాడు ఎవడై వుంటాడు? (ఈ మహా అదృష్టానికి ఎవడు నోచుకుంటాడు) అని. ఆయన (స) ఇలా సెలవిచ్చారు: అబూ హురైరా! నీ కంటే ముందు నన్ను ఈ ప్రశ్న ఎవరూ అడగరనే విషయం నాకు తెలుసు. ఎందుకంటే, హదీసును గురించి నేర్చుకో వాలనే ఆకాంక్ష, ఆతురత నీలో ఎంత ఉందో నేను గమనిస్తున్నాను. ఇక విను, "నా సిఫారసు అదృష్టం, లా ఇలాహ ఇల్లల్లాహ్ (అల్లాహ్ తప్ప ఆరాధ్య దైవం మరొక డెవ్వడూ లేడు) అని హృదయపూర్వకంగా, చిత్తశుద్ధితో ప్రకటించే వ్యక్తిని వరిస్తుంది."

## 35వ అధ్యాయం

## జ్ఞానం ఎందుకు ఎగిరిపోతుంది?

ఖలీఫా ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ మదీనా నగర ఖాజీ అయిన అబూ బకర్ బిన్ హజ్మ్‌కు ఇలా వ్రాశారు: మహనీయ ప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) గారి సూక్తులు గనక మీకు లభ్యమైతే, దయచేసి వాటిని వ్రాసుకోండి, ఎందుకంటే ధర్మ జ్ఞానం నశించిపోతుందేమోనని, మత విద్వాంసులు పైలోకాలకు వెళ్లిపోతారేమోనని నేను భయపడుతున్నాను. దైవప్రవక్త (స) సూక్తిని మాత్రమే హదీసుగా ఒప్పుకోవాలి

---

96-2. అంటే కూఫా పట్టణం నుంచి మదీనా నగరం వరకు ప్రయాణం చేసేవారు.

(ఇతరుల సూక్తుల్ని ఎంతమాత్రం పరిగణనలోకి తీసుకోకూడదు). ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. పండితులు, విద్వాంసులు అయిన వారు జ్ఞానాన్ని వ్యాపింపజెయ్యాలి; ఒకచోట కూర్చొని జ్ఞానం తెలియని వారికి జ్ఞానాన్ని నేర్పాలి. ఎందుకంటే గుప్తంగా ఉన్నటువంటి జ్ఞానం నశిస్తుంది, మటుమాయమైపోతుంది.

**99.** ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ కథనాన్నే – "మత విద్వాంసులు పైలోకాలకు వెళ్ళిపోతారేమోనని" – వరకు అబ్దుల్లాహ్ బిన్ దీనార్ కూడా పైవిధంగా ఉల్లేఖించారు.

**100.** అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: కారుణ్య మూర్తి ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిస్తూ ఉండగా నేను విన్నాను – "దేవుడు ధర్మజ్ఞానాన్ని దాసుల నుంచి లాక్కుని పైకి తీసుకుపోడు. కాని పండితుల్ని (మరణం ద్వారా)పైకి పిలుచుకుని జ్ఞానాన్ని(పైకి) లేపుకుంటాడు. ఇక పండితులెవ్వరూ మిగిలి ఉండనప్పుడు, ప్రజలు అజ్ఞానులైన వారిని తమ నాయకులుగా, పేష్వాలుగా చేసుకుంటారు, వారిని తమ సమస్యల్ని గురించి సంప్రదిస్తారు. వారు జ్ఞానం లేకుండానే తీర్పులు చెబుతారు. ఆ విధంగా వారూ మార్గభ్రష్టులవుతారు, ప్రజల్ని కూడా మార్గ భ్రష్టులుగా చేస్తారు".

## 36వ అధ్యాయం

## స్త్రీలకు ధార్మిక విద్యను గరపటానికి ఇమామ్ ప్రత్యేకంగా ఏదైనా ఒక దినాన్ని నిర్ణయించగలడా?

**101.** అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) ఉల్లేఖనం ప్రకారం: కొందరు మహిళలు దైవప్రవక్త (సఅసమ్) వద్దకు వచ్చి, పురుషులే తమరి (స) సమయాన్ని ఎక్కువగా వినియోగించుకుంటున్నారని, ఈ విషయంలో తమ మీద వారికే ఆధిక్యత ఉందని,[1] కనుక తమ కోసం ప్రత్యేకంగా ఒక రోజును నిర్ణయించమని విన్నవించుకున్నారు. ప్రవక్త మహనీయులు (స) మహిళల్ని ప్రత్యేకంగా ఒక రోజున వారితో సమావేశమవుతాననీ, వారికి మత సంబంధమైన పాఠాలు, ధార్మిక ఆదేశాలను గురించి హితవు గరుపుతానని వాగ్దానం చేశారు. అటువంటి ఒక సమావేశంలో దైవప్రవక్త (స) ఇలా బోధించారు: ఎవరైనా ఒక స్త్రీ తన ముగ్గురు పిల్లల్ని కోల్పోయినట్లయితే, ఆ పిల్లలు ఆమెకూ, నరక జ్వాలలకూ మధ్య అడ్డంగా నిలుచుంటారు.

101–1. అంటే, పురుషులే మీ సమయాన్నంతా తీసేసుకుంటున్నారాయె; మీ వద్దకు రావటానికీ, ధర్మం గురించి మిమ్మల్ని సందేహాలు అడగటానికీ మాకు బొత్తిగా అవకాశమే లభించటం లేదు కదా!

**తమ తల్లిని కాపాడుకుంటారు. అప్పుడు ఒక స్త్రీ, ఒకవేళ ఇద్దరు పిల్లలే మరణిస్తేనో అని అడిగారు. దానికి మహాప్రవక్త (స), ఇద్దరు మరణించినా, ఆమెను వారు నరకం నుంచి కాపాడుతారు.[2] అని అన్నారు.**

**102. అబూ సయీద్ అల్ ఖుద్రీ (రజిఅన్)పై హదీసులో ఉన్న విధంగానే ఉల్లేఖించారు. ఈ హదీసులో ప్రస్తావించబడిన ముగ్గురు పిల్లలు యుక్త వయస్సుకు చేరలేదని,[1] పాపకార్యాలు చేసే వయస్సుకు చేరుకోలేదని హజ్రత్ అబూ హురైరా[2] (రజిఅన్) స్పష్టంగా చెప్పారు.**

## 37వ అధ్యాయం

## ఎవరైనా ఒక మనిషి ఏదైనా ఒక విషయాన్ని విని, అర్థం చేసుకునే ఉద్దేశ్యంతో మళ్ళీ దాన్ని గురించి అడగటం.

**103. ఇబ్నె అబీ ములైక గారి కథనం ఇలా ఉంది: హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) (ప్రవక్త మహనీయుని (స) ప్రియ సతీమణి) గారి సంప్రదాయం ఏమిటంటే, ఆమె (ర) గారు ఏదైనా విషయాన్ని గురించి విన్నప్పుడు, ఒకవేళ అది ఆమె గారికి (ర) అర్థం కాకపోతే, దాన్ని పూర్తిగా, బాగా అర్థం చేసుకునేంత వరకు, మళ్ళీ మళ్ళీ**

---

101–2. అర్థం ఏమిటంటే, ఒక స్త్రీ తన ముగ్గురు పిల్లల్ని కోల్పోయినట్లయితే అంటే మరణించినట్లయితే, దానికి ఆమె ఓర్మి వహించినట్లయితే, ఆ విషాదానికి తట్టుకుని సహనంగా ఉన్నట్లయితే, ప్రళయం నాడు ఆమెను ఆ పిల్లలు నరకం నుండి కాపాడుకుంటారు. ఈ విషయం గురించి మహాప్రవక్త (స)ను అడిగిన స్త్రీ పేరు ఉమ్మె సలీమ్. మరొక ఉల్లేఖనంలో, ఒకవేళ ఒక్క పిల్లవాడు మరణించినా సరే, అతను తన తల్లిని నరకం నుంచి రక్షిస్తాడు అని మహాప్రవక్త (స) సెలవిచ్చారు; ఆ పిల్లవాడు అప్పుడే పుట్టిన వాడైనాసరే.

102–1. అమాయకులైన చిన్న పిల్లల మరణం తల్లికి ఎనలేని దుఃఖాన్ని, బాధను కలిగిస్తుంది. యుక్త వయస్సుకు చేరిన పెద్ద పిల్లలు తల్లిదండ్రుల మాటల్ని వినరు, వారి పట్ల తరచూ అవిధేయత చూపుతారు. అయితే చిన్న చిన్న పిల్లల మీద తల్లికి ఎక్కువ మమకారం ఉంటుంది.

102–2. ఇమామ్ బుఖారీ (రహమ్ అలై) ఈ ధ్రువీకరణను ఇక్కడ ప్రస్తావించటానికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి, ఇబ్నె ఇస్‌బహానీ పేరు అందరికీ తెలియాలని. రెండు, అబూ హురైరా (రజిఅన్) పద్ధతి, ఆయన విధానం ఏమిటో అందరికీ సుస్పష్టం కావాలని.

అడుగుతారు. ఒకసారి ఏం జరిగిందంటే; ప్రవక్త మహనీయులు (సఅసమ్) ప్రళయం నాడు ఏ వ్యక్తి నుంచి అయినా లెక్క తీసుకోవటం అనేది జరిగితే, ఇక అతను శిక్షకు గురి అయినట్లే అని సెలవిచ్చారు. అప్పుడు హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఎదురు అడిగారు: (ఖురాను గ్రంథంలో ఇన్షిఖాక్ సూరాలో) "కర్మల పత్రం కుడి చేతికి ఇవ్వబడిన వ్యక్తి నుంచి తేలికపాటి లెఖ్ఖ తీసుకోవటం జరుగుతుంది" అని అల్లాహ్ అన్నాడు కదా! దైవ ప్రవక్త (స) దానికి సమాధానంగా ఇలా సెలవిచ్చారు: (అది లెక్క తీసుకోవటం కాదు) దాని భావం అతని కర్మలను గురించి తెలియజెయ్యటమే.[1] కాని ఎవరినైనా పట్టి పట్టి అడగటం, వాదించటం అనేది గనక జరిగితే, ఇక అతను సర్వనాశనమయ్యాడన్న మాటే.[2]

## 38వ అధ్యాయం

**ఒక మత సంబంధమైన సభలో పాల్గొన్నవారు, తాము నేర్చుకున్న జ్ఞాన విశేషాలను, ఆ సభలో హాజరుకాని వారికి అందజెయ్యాలి. దీన్ని వారు విధిగా చెయ్యాలి. కారుణ్యమూర్తి ముహమ్మద్ (సఅసమ్) పై విధంగా సెలవిచ్చారని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) పేర్కొన్నారు.**

**104.** ప్రవక్త(సఅసమ్) గారి ఈ హదీసును సయీద్ ఇబ్నె అబూ సయీద్ (రజిఅన్) ఉల్లేఖించారు. అబూ షురైహ్ (ఒక సహాబీ) అమ్ర్ బిన్ సయీద్‌తో ఇలా అన్నారు; (అప్పుడితను యజీద్ తరఫున మదీనాకు గవర్నరుగా పనిచేస్తున్నారు)

---

103-1. అంటే ప్రభువు అయిన దేవుడు తాను కరుణించదలచిన, మన్నించదలచిన విశ్వాసికి అతను చేసిన దుష్కర్మలను మాత్రమే తెలియజేస్తాడు; ఫలానా అప్పుడు నీవు ఈ పాపానికి ఒడిగట్టావు, ఫలానా సమయంలో నీవు ఈ దుష్కార్యా నికి పాల్పడ్డావు అని చెబుతాడు. అంతే, అతనికి ఇలా తెలియజేయటమే అతన్ని లెక్క అడగటం. ఖురాను వాక్యంలోని తేలికపాటి లెక్క అంటే అర్థం ఇదే.

103-2. ఈ హదీసు ద్వారా తెలిసొచ్చిందేమిటంటే, హజ్రత్ ఆయెషా (రజిఅన్) చాలా తెలివిగల, బుద్ధివివేకాలు గల అగ్రశ్రేణికి చెందిన మహిళ. ప్రతి విషయాన్నీ క్షుణ్ణంగా అర్థం చేసుకోవటం, ఒకసారి అర్థం కాకపోతే మరొకసారి అడగటం - ఇవి ఆమె వివేచనా శక్తికి నిదర్శనాలు. ఒక హదీసులో అధికంగా ప్రశ్నించటాన్ని మాటిమాటికి, గుచ్చిగుచ్చి అడగటాన్ని నిషేధించటం జరిగింది. దాని అర్థం ఏమిటంటే, అనవసరంగా, వృధాగా అడగటం, పిడివాదానికి దిగటం అని.

**అప్పుడు అతను మక్కా నగరం మీదకు సైన్యాన్ని పంపే ఏర్పాట్లు చేస్తున్నాడు.[1] 'ఓ గవర్నర్! ఒక హదీసును నీకు వినిపించే అనుమతిని నాకు ఇవ్వు. ప్రవక్త(స) మహనీయులు ఈ హదీసును మక్కాను జయించిన రెండో రోజు సెలవిచ్చారు. నా రెండు చెవులూ దాన్ని విన్నాయి. నా మనస్సు దాన్ని జ్ఞాపకం ఉంచుకున్నది. ఆయన(స) ఈ హదీసును సెలవిస్తూ ఉన్నప్పుడు నా రెండు కళ్ళూ ఆయన్ని చూశాయి. ఆయన(స) అల్లాహ్‌ను స్తుతించారు; ఆయన సుగుణాలను శ్లాఘించారు. తరువాత ఇలా అన్నారు; మక్కా నగరాన్ని పుణ్యస్థలంగా (పవిత్ర స్థలంగా, నిషిద్ధ స్థలంగా) చేసింది అల్లాహ్‌యే గాని ప్రజలు కాదు. (దీన్ని గౌరవ భావంతో చూడమని అల్లాహ్‌యే ఆజ్ఞాపించాడు) కనుక అల్లాహ్ మీద, అంతిమ దినం మీద విశ్వాసం కలవాడు అక్కడ రక్తాన్ని చిందిం చకూడదు. అక్కడి వృక్షాలను నరకకూడదు. ఒకవేళ నా తరువాత ఎవరైనా అలా చెయ్యటానికి, దైవప్రవక్త(సఅసమ్) అక్కడ యుద్ధం చేశారు కదా అని వాదించి నప్పుడు, మీరు ఇలా అనండి; "అల్లాహ్ అయితే, మక్కా విజయం నాడు తన ప్రవక్త(స)కు ప్రత్యేకమైన అనుమతిని ప్రసాదించాడు. మీకు ఆయన అటువంటి అనుమతిని ఇవ్వలేదు. నాకు సైతం ఆ రోజున కొన్ని గంటల వరకు మాత్రమే అనుమతిని ఇచ్చాడు. ఆ నగర పవిత్రత ఈనాడు కూడా పూర్వం మాదిరిగానే స్థిరంగా ఉంది. ఇప్పుడు ఇక్కడ హాజరైన వారు ఈ విషయానికి సంబంధించిన సమాచారాన్ని హాజరు అవని ప్రజలకు అందజెయ్యాలి." తరువాత ప్రజలు అబూ షురైహ్‌ను, దానికి అమ్ర్ బిన్ సయీద్ ఏమని సమాధానం చెప్పారు, అని అడిగారు. అతను ఇలా సమాధానం చెప్పాడని అబూ షురైహ్ చెప్పారు: నేను నీకంటే ఎక్కువ ధర్మజ్ఞానం కలవాణ్ణి. మక్కా నగరం పాపాత్ములకు ఆశ్రయం ఇవ్వదు. హంతకులకు, దొంగల క్కూడా అది రక్షణ ఇవ్వదు.[2]**

---

104–1. మక్కా ప్రజలు అబ్దుల్లా బిన్ జుబేర్ (రజిఅన్) మీద ప్రమాణం (బైఅత్) చేశారు. అమ్ర్ బిన్ సయీద్, యజీద్ తరఫున మదీనాకు గవర్నరుగా ఉన్నాడు. అతడు యజీద్ ఆజ్ఞ ప్రకారం మక్కా నగరం మీద దండయాత్రకు సన్నాహాలు చేస్తున్నాడు. అప్పుడు అబూ షురైహ్ అతనికి ఈ హదీసును వినిపించారు. కాని ఆ దుర్మార్గుడు ఈ హదీసును పట్టించుకోలేదు. అతని నెత్తిమీద షైతాన్ కూర్చున్నాడు. అల్లామా ఇబ్నె హజర్ ఇలా అన్నారు : మేము అమ్ర్ బిన్ సయీద్‌ను, అతను ప్రవక్త(స) సహచరుల్ని చూసి ఉన్నప్పటికీ కూడా ఒక అధమ శ్రేణి అనుచరునిగా కూడా పరిగణించం. ఎందుకంటే అతను దురాచారుడు, దుష్కర్మలు చేసేవాడు.

**105.** దైవప్రవక్త (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అబూ బక్రా (రజిఅన్) ఉల్లేఖించారు: మీ రక్తం, మీ ఆస్తిపాస్తులు– ("మీ మానమర్యాదలు" అని కూడా అన్నారని నేను భావిస్తున్నాను అని ఉపఉల్లేఖకులు ఇబ్నె సీరీన్ చెప్పారు)– ఒకరికొకరికి పవిత్రమైనవి;[1] ఈ మాసంలో ఈ రోజు అంటే యౌమున్నహర్ (ఖుర్బానీ రోజు) ఎలా, ఎంతగా పవిత్రమైనదో, అంతగానూ. వినండి! ఇక్కడ ఉన్నవారు, ఇక్కడ లేని వారికి ఈ విషయాన్ని తెలియజెయ్యండి. దైవప్రవక్త (సఅసమ్) సత్యం పలికారని ఇబ్నె సీరీన్ అన్నారు. (అప్పుడు అక్కడ హాజరైనవారు, హాజరు కాని వారికి ఈ హదీసును గురించి తెలియజేశారు) దైవప్రవక్త(స), "నేను ఈ ఆజ్ఞను మీకు తెలియజేశాను" అని సెలవిచ్చారు. ఈ విషయాన్ని ఆయన(స) రెండుసార్లు సెలవిచ్చారు.

## 39వ అధ్యాయం

### దైవప్రవక్త (సఅసం)కు అబద్ధం ఆపాదించినవాడు ఎంతటి పాపానికి ఒడిగట్టాడు అనే విషయం.

**106.** మహనీయ ప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హ్రజత్ అలీ (రజిఅన్) ఉల్లేఖించారు: "(చూడండి!) నాకు అబద్ధాన్ని ఆపాదించకండి. ఎందుకంటే, నాకు అబద్ధాన్ని ఆపాదించేవాడు నరకానికి పోతాడు."[1]

---

104–2. ఓరీ దుర్మార్గుడా! అల్లాహ్‌కు భయపడు. అబ్దుల్లా బిన్ జుబేర్ (రజిఅన్) ఎవరినీ చంపలేదు; ఏ దొంగతనమూ చేయలేదు. ఆయన(ర) యజీద్ కంటే నూరు రెట్లు మంచివారు, శ్రేష్ఠులు. ఆయన ప్రవక్త(స) గారి సోదరుని కుమారులు, సహచరులు, హ్రజత్ అబూబకర్ సిద్దీఖ్(రజిఅన్) మనుమడు, ధర్మజ్ఞానం తెలిసినవారు, దైవభక్తి పరాయణులు. కాని నీవు ప్రాపంచిక ప్రయోజనం కోసం యజీద్‌కు తోడ్పడ్డావు. పైగా ప్రవక్త(స) గారి ప్రామాణిక సూక్తిని విన్న తరువాత కూడా ఇటువంటి సాకులు వెతుకుతున్నావు.

105–1. ఒక ముస్లిమ్ మరొక ముస్లిమ్‌ను అగౌరవపరచటం, లేదా అతన్ని చంపటం, లేదా అతని సంపదను కొల్లగొట్టటం నిషిద్ధం.

106–1. ఇందులో అన్ని రకాల అబద్ధాలు చేరి ఉన్నాయి. కొందరు అజ్ఞానులు, ప్రజల్ని ఆకర్షించటానికి లేదా వారిని భయపెట్టేందుకు అబద్ధపు హదీసులను అల్లుకుంటారు. దైవప్రవక్త (స)కు అబద్ధాన్ని ఆపాదించటమంటే అల్లాహ్‌కు అబద్ధాన్ని ఆపాదించటమే అనే విషయాన్ని వారు అర్థం చేసుకోవటం లేదు. విశ్వప్రభువైన అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "అల్లాహ్‌కు అబద్ధం ఆపాదించేవాడికంటే పరమ దుర్మార్గుడెవడు."

**107.** **అబ్దుల్లా బిన్ జుబైర్ (రజిఅన్) ఇలా అన్నారు: నేను నా తండ్రి గారిని, ఫలానా వ్యక్తులు మాదిరిగా మీరు దైవప్రవక్త (స)గారి హదీసుల్ని వినిపిం చటం లేదేమిటి అని అడిగాను. దానికి సమాధానంగా ఆయన ఇలా అన్నారు: నేను ఎల్లప్పుడూ ఆయన (స)గారితోనే ఉండేవాణ్ణి, దూరంగా, వేరుగా ఉండేవాణ్ణి కాను.[1] ఆయన గారి సూక్తుల్ని విన్నాను. కాని ఆయన(స) ఇలా సెలవిస్తూ ఉండగా నేను విన్నాను. "నాకు అబద్ధాన్ని ఆపాదించేవాడు, నరకలోకంలో తన నివాసాన్ని ఏర్పాటు చేసుకోవాలి."**

**108.** **హజ్రత్ అనస్ (రజిఅన్) ఇలా అన్నారు: "నేను చాలా హదీసుల్ని గురించి మీకు చెప్పను. దానికి ప్రధాన కారణం ప్రవక్త (స) మహనీయులు ఇలా సెలవీయటమే, "ఎవరైనా బుద్ధిపూర్వకంగా[1] నాకు అబద్ధాన్ని ఆపాదించినట్లయితే, అతను తన నివాసాన్ని నరకంలో నిర్మించుకుంటాడు."**

**109.** **మహనీయ ప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్**

---

హదీసువేత్తలు చాలామంది ఈ హదీసును పటిష్ఠమైన ఉల్లేఖనాల పరంపర గల హదీసుగా అభివర్ణిస్తారు. హదీసు శాస్త్రం తెలిసిన పండితులకు దేవుడు మంచి ప్రతిఫలాన్ని ప్రసాదించుగాక. ఎందుకంటే వారు కష్టపడి ఎన్నో శ్రమలకోర్చి ప్రమాణబద్ధమైన హదీసులను బలహీనమైన హదీసుల నుండి వేరు చేశారు, ప్రళయం వచ్చేవరకు ముస్లిములకు సౌలభ్యాలు కలుగజేశారు. ఇక ఆచరించదలచు కున్నవారికి ఏ ఆటంకమూ లేదు.

107–1. అంటే, నేను తక్కువగా హదీసుల్ని ఉల్లేఖించటం అనే విషయం, నాకు ప్రవక్త (స) సహచర్యం లభించలేదు అనేది, కారణం కాదు. దానికి కారణం ఏమిటంటే, నేను హదీసుల్ని చెప్పటానికి భయపడతాను, ఏ విషయంలోనైనా హెచ్చుతగ్గులు దొర్లుతాయేమోనని. ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారు కదా! "నాకు అబద్ధాన్ని ఆపాదించేవాడు తన నివాసాన్ని నరకంలో నిర్మించుకుంటాడు." దీనివల్ల హదీసు చెప్పటానికి సందేహిస్తూ ఉంటాను, భయపడుతూ ఉంటాను.

108–1. తెలిసిన విషయం ఏమిటంటే, తెలియకపోవటం వల్ల, యాదృచ్ఛికంగా ఒకవేళ అలా జరిగితే, అతను పాపాత్ముడు కాడు. జువయ్నీ ఇలా అన్నారు: "బుద్ధి పూర్వకంగా ఎవడైనా మహాప్రవక్త(స)కు అబద్ధాన్ని ఆపాదించినట్లయితే అతను కాఫిర్ (అవిశ్వాసి) అయిపోతాడు." ఇతర విద్వాంసులు, కాఫిరైతే కాడు, కాని పెద్ద పాపం చేసినవాడవుతాడు అని అన్నారు.

**సలమా బిన్ అక్వ (రజిఅన్) ఉల్లేఖించారు : 'నేను చెప్పని విషయాన్ని నాకు అంట గట్టేవాడు నరకంలో తన నివాస స్థలాన్ని ఏర్పాటు చేసుకోవాలి."**

**110.** ప్రవక్త మహనీయులు **ముహమ్మద్(సఅసమ్) ఇలా సెలవిచ్చారని హ్రజత్ అబూహురైరా(రజిఅన్)గారి ఉల్లేఖనం : "మీరు నా పేరును పెట్టుకోండి. (ముహమ్మద్(స); అహ్మద్ అనే పేర్లను పెట్టుకోండి); కాని నా కుటుంబాన్ని, నా వంశాన్ని సూచించే పేరును (అబుల్ ఖాసిమ్) పెట్టుకోకండి. ఎవరైనా నన్ను కలలో చూసినట్లయితే, అతను నిస్సందేహంగా నన్నే చూశాడు. ఎందుకంటే షైతాన్ నా రూపాన్ని ధరించలేడు (నా అవతారం ఎత్తలేడు). బుద్ధిపూర్వకంగా ఎవడు నాకు అబద్ధాన్ని ఆపాదిస్తాడో, అతను తన నివాసాన్ని నరకంలో నిర్మించుకోవాలి".**

## 40వ అధ్యాయం

### జ్ఞానానికి సంబంధించిన విషయాలను వ్రాయటం

**111. అబూ జుహైఫా ఇలా అన్నారని షాబీ ఉల్లేఖించారు : నేను, హ్రజత్ అలీ(రజిఅన్)ని, మీ దగ్గర (ఖుర్ఆన్ గ్రంథంకాక) మరొక గ్రంథమేదైనా ఉందా?[1] అని అడిగాను. దానికి సమాధానంగా ఆయన ఇలా చెప్పారు: 'లేదు, దైవగ్రంథమైన ఖురానే షరీఫ్ తప్ప మరొక గ్రంథమేదీ నా దగ్గర లేదు; దేవుడు ప్రసాదించిన అవగాహనా సామర్థ్యం[2] తప్ప మరేదీ నా వద్ద లేదు; ఇంకా ఈ కాగితం మీద వ్రాయ బడి ఉన్నది తప్ప మరొకటేదీ నా వద్ద లేదు. అప్పుడు జుహైఫా, "నేను హ్రజత్ అలీని (రజిఅన్) ఆ కాగితంలో ఏ విషయాలు వ్రాయబడి ఉన్నాయి" అని అడిగాను హ్రజత్**

---

111-1.కొందరు షియా తెగకు చెందిన పెద్దలు 'దైవప్రవక్త(సఅసమ్) హ్రజత్ అలీ (రజిఅన్)కి కొన్ని ప్రత్యేకమైన విషయాలు వ్రాయించి ఇచ్చారు, వాటిని ఆయన(స) మరెవరికీ తెలియజేయలేదు" అని ఊహాగానాలు చేస్తారు. ఈ కారణంగా అబూ జుహైఫా, హ్రజత్ అలీ (రజిఅన్)ని పైవిధంగా ప్రశ్నించారు.

111-2. అంటే, ఒక దైవ విశ్వాసి తనకు దేవుడు ప్రసాదించినటువంటి అవగాహనా సామర్థ్యాన్ని ఉపయోగించుకుని, ఖుర్ఆన్, హదీసు గ్రంథాలను గురించి లోతుగా ఆలోచించి వాటిలో స్పష్టంగా లేనటువంటి ఎన్నో విషయాలను గురించి తెలుసుకుంటాడు. ప్రవక్త(స) గారి ఈ సూక్తి ప్రకారం, ఏదైనా సమస్యను గురించి ఖుర్ఆన్, హదీసు గ్రంథాల్లో స్పష్టమైన ఆదేశంగాని, పరిష్కార మార్గంగాని లభించకపోతే, మనిషి తన వివేకాన్ని, జ్ఞానాన్ని ఉపయోగించి ఒక నిర్ణయానికి రాగలుగుతాడు. దీన్నే షరీఅత్ పరిభాషలో 'ఖియాస్' అంటారు.

**అలీ (రజిఅన్) జవాబుగా ఇలా చెప్పారు: "ఈ కాగితంలో 'దియత్' (రక్తశుల్కం)కు సంబంధించిన విషయం గురించి, హంతకుడు హతుని బంధువులకు చెల్లించే పరిహారం (రక్తధనం); ఖైదీలను శత్రువుల బారి నుంచి విడిపించే విషయం గురించి; ఒక ముస్లిమ్‌ను ఒక అవిశ్వాసికి బదులుగా చంపకూడదనే విషయం[3] గురించి వ్రాయబడి ఉంది."**

**112. హజ్రత్ అబూహురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: తమ తెగకు చెందిన ఒక వ్యక్తిని హత్యచేసిన దానికి ప్రతీకారంగా, ఖుజాఅ తెగకు చెందిన వారు, బనీలైస్ తెగకు చెందిన ఒక వ్యక్తిని హత్యచేశారు.[1] ఇది మక్కా నగరంపై విజయం సాధించిన సంవత్సరంలో జరిగింది. ఈ సంఘటనకు సంబంధించిన సమాచారం ప్రవక్త మహనీయులకు (సఅసమ్) తెలియజేయటం జరిగింది. అప్పుడు ఆయన గారు (స) తమ ఒంటె మీదకు ఎక్కి ప్రసంగించారు. తరువాత ఇలా సెలవిచ్చారు: అల్లాహ్ మక్కాలో హత్యచెయ్యటాన్ని లేదా ఏనుగులను నిషేధించాడు. ఇమామ్ బుఖారీ (ర.అలై), ఈ పదాన్ని సంశయాత్మకమైనదిగానే ఉంచండి అని అన్నారు. అబూ నుఅయిమ్ గారు ఆ విధంగానే హత్య లేక ఏనుగులు అని అన్నారు.[2] అబూ నుఅయిమ్ మినహా ఇతరులు ఏనుగులు అనే అన్నారు, సంశయంలో పడలేదు. అల్లాహ్ ప్రవక్త మరియు ముస్లిములు మక్కానగర అవిశ్వాసులపై ప్రాబల్యం**

---

111–3. ఒక ముస్లిమ్ గనక ఒక సత్య తిరస్కారిని హత్య చేసినట్లయితే, దానికి బదులుగా ఆ ముస్లిమ్‌ను ఖిసాస్ చట్టం ప్రకారం చంపకూడదు అనే విషయాన్ని అహ్‌లే హదీసు, షాఫయీ, మాలికీ, అహ్మదీ శాస్త్రాలకు చెందిన పెద్దలు, ఎక్కువ మంది విద్వాంసులు అంగీకరిస్తారు. అంటే ఈ హదీసు ప్రకారం నిర్ణయాలు చేస్తారు. అయితే ఇమామ్ అబూ హనీఫా గారు జిమ్మీ కాఫిర్‌ను హత్య చేసిన ఒక ముస్లిమ్‌ను చంపటం ధర్మసమ్మతమే అంటారు.

112–1. అంటే, బనీలైస్ తెగకు చెందిన వారు అజ్ఞాన కాలంలో ఖుజాఅ తెగకు చెందిన ఒక వ్యక్తిని హత్యచేశారు. మక్కా నగరం జయించబడిన సంవత్సరంలో, ఖుజాఅ తెగకు చెందిన వారు బనీలైస్ తెగకు చెందిన ఒక వ్యక్తిని హత్యచేసి ప్రతీకారం చేశారు.

112–2. ఇక్కడ 'హత్య' అనే పదం ఉపయోగించబడింది అనుకుంటే, దాని భావం ఇలా ఉంటుంది: అల్లాహ్, మక్కా ప్రజల్ని హత్యచెయ్యబడటం నుంచి కాపాడాడు లేదా మక్కా నగరంలో యుద్ధం చెయ్యటాన్ని నిషేధించాడు. ఒకవేళ "ఏనుగులు" అనే పదం వాడబడింది అనుకుంటే, దాని అర్థం ఇలా ఉంటుంది. అది ఖురాను గ్రంథంలో 'ఫీల్'

**వహించేలా చేయబడ్డారు. వినండి! నాకు తప్ప పూర్వం మక్కా నగరం మరెవరికీ ధర్మసమ్మతం చెయ్యబడలేదు.[3] నా తరువాత కూడా మరెవరికీ అది ధర్మసమ్మతం చెయ్యబడదు. వినండి! నా కోసం కూడా అది కొన్ని గంటల కాలం వరకే ధర్మ సమ్మతం చెయ్యబడింది. వినండి! ఇప్పుడు, ఈ సమయంలో మక్కా నగరం నిషిద్ధం. అక్కడి ముళ్ల పొదల్ని పెకలించకూడదు, అక్కడి వృక్షాలను నరకకూడదు, అక్కడ జారి పడిపోయివున్న వస్తువులను ఎత్తుకోకూడదు. అయితే వాటిని వాటి యజ మానులకు చేరవేయదలచుకున్నవాడు ఎత్తుకోవచ్చు. ఎవరైనా హత్య చేయబడి నప్పుడు, అతని దగ్గర బంధువు ఎవరైనా ఈ రెండు మార్గాలలో ఏదైనా ఒక మార్గాన్ని ఎన్నుకోవచ్చు - రక్తధనం (దియత్) లేదా హంతకుణ్ణి చంపటం (ఖిసాస్)[4] (హంతకుణ్ణి హతుని వారసులకు అప్పగించాలి). ఇంతలోనే యమన్ నుంచి ఒక వ్యక్తి వచ్చి, ఇలా విన్నవించుకున్నాడు: "దైవప్రవక్తా(స)! మీరు ఇప్పుడు సెలవిచ్చిన విషయాలను వ్రాయించి నాకు ఇప్పించండి."[5] అప్పుడు ఆయన (స) తమ సహచరు లతో, ఈ విషయాలను వ్రాసి అతనికి ఇవ్వండి, అని అన్నారు. ఖురేష్ తెగకు చెందిన ఒక వ్యక్తి (హజ్రత్ అబ్బాస్– రజిఅన్) ఇలా విన్నవించుకున్నారు: "దైవప్రవక్తా (స)!**

---

సూరాలో ప్రస్తావించబడిన గాథను సూచిస్తుంది. అంటే, దైవప్రవక్త (స) పుట్టిన సంవత్సరంలో, అబీసీనియాకు చెందిన ప్రజలు ఎన్నో ఏనుగుల్ని తీసుకుని కాబా గృహాన్ని పడగొట్టాలనే దురుద్దేశ్యంతో మక్కా మీదకు దండెత్తి వచ్చారు. అల్లాహ్ వారి మీదకు శిక్షను పంపాడు; పక్షులు గుంపులు గుంపులుగా వారి మీదకు వచ్చిపడ్డాయి, కంకర రాళ్లతో వారిని, వారు తెచ్చిన ఏనుగుల్ని కొట్టి నాశనం చేశాయి. ఈ గాథ ఎంతో ప్రసిద్ధి చెందింది.

112-3. అంటే అక్కడ యుద్ధం చెయ్యటం, రక్తాన్ని చిందించటం అని భావం.

112-4. అంటే హత్య చేసిన హంతకుణ్ణి మాత్రమే హతుని వారసులకు అప్పగించటం, అతన్ని చంపటం (ఖిసాస్) అనేది జరగాలి. అంతేకాని అజ్ఞానపు కాలంలో మాదిరిగా, ఇతరులెవరినో చంపటం, ఆ తరువాత అతని తెగకు చెందినవారు, అతన్ని చంపిన వారి తెగకు చెందిన మరొకణ్ణి చంపటం అనేది జరక్కూడదు. ఇలా హత్యాకాండ జరుగుతూ పోయినట్లయితే దైవసృష్టి అంతా సర్వనాశనమైపోతుంది.

112-5. ఇక్కణ్ణుంచే జ్ఞాన విషయాలను వ్రాయటం అనేది ప్రారంభమయింది. ఎందుకంటే మహాప్రవక్త (సఅసమ్) జ్ఞానానికి సంబంధించిన విషయాలను వ్రాయమని ఆజ్ఞాపించారు.

**ఇజ్ఖర్ గడ్డిని కోసుకునే అనుమతిని మాకు ప్రసాదించండి (మంచి పరిమళాన్ని వెదజల్లే ఒక విధమైన గడ్డి). దాన్ని మేము మా గృహాల కోసం, మా సమాధుల కోసం ఉపయోగించుకుంటాము."[6] మహనీయ ప్రవక్త (స) "సరే, ఇజ్ఖర్‌ను మినహాయిస్తు న్నాను. మీరు దాన్ని కోసుకోవచ్చు" అని సెలవిచ్చారు.**

**113. హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారి సహచరుల్లో నాకంటే ఎక్కువ హదీసుల్ని ఉల్లేఖించిన వారు మరొకరెవ్వరూ లేరు. అయితే అబ్దుల్లా బిన్ అమ్ర్ (రజిఅన్) చాలా హదీసుల్ని ఉల్లేఖించారు.[1] ఎందుకంటే ఆయన హదీసుల్ని వ్రాసుకునే వారు, నేను వ్రాసుకునే వాణ్ణి కాను.**

**114. హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ప్రవక్త ముహమ్మద్(స) ఒకసారి వ్యాధిగ్రస్తులయ్యారు. అప్పుడు ఆయన (స) వ్యాధి తీవ్రతలో ఉండి కూడా ఇలా సెలవిచ్చారు; వ్రాత సామగ్రిని తీసుకురండి. నేను మీ కోసం ఒక పుస్తకాన్ని వ్రాయిస్తాను. ఆ తరువాత మీరు మార్గభ్రష్టులు కారు. ఆ సమయంలో అక్కణ్ణే ఉన్న హజ్రత్ ఉమర్(ర): 'ప్రవక్త మహనీయులు(స) వ్యాధి తీవ్రతలో ఉన్నారు. మన దగ్గర అల్లాహ్ గ్రంథం ఉన్నది కదా! అది మనకు సరిపోతుంది[1] అని అన్నారు. ప్రజలు దీనికి అభ్యంతరం వ్యక్తం చేశారు. వాదనలు చెలరేగాయి. అప్పుడు దైవప్రవక్త ముహమ్మద్(స), "ఇదేమిటి! మీరు నా సమక్షంలోనే ఘర్షణ పడుతున్నారు? ఇక్కణ్ణుంచి వెళ్ళిపోండి" అని అన్నారు. హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) (హదీసును ఉల్లేఖించినప్పుడు) "అయ్యో! ఎంత పెద్ద ఆపద వచ్చిపడింది. దైవప్రవక్త(స)ను**

---

112-6. 'ఇజ్ఖర్' సుగంధ పరిమళాలను వెదజల్లే ఒక రకమైన గడ్డి. ఇది మక్కా నగరంలో పెరుగుతుంది. అక్కడి ప్రజలు ఆ గడ్డిని మట్టితో కలిపి తమ గృహాలను అలుకుతారు, సమాధుల్లో పరుస్తారు.

113-1. అబూహురైరా (రజిఅన్) ఉల్లేఖకులుగా ఉన్న హదీసుల సంఖ్య 5300. ఇమామ్ బుఖారీ (రె.అలై) ఏమన్నారంటే, 800 మంది తాబయీన్‌లు అబూహురైరా (రజిఅన్) నుంచి హదీసులు విన్నారు. ఈ గౌరవం, ఈ ఔన్నత్యం ప్రవక్త (స) గారి ప్రత్యక్ష సహచరుల్లో ఎవరికీ లభించలేదు. దైవప్రవక్త (సఅసమ్) అబూహురైరా (ర) కోసం, చేసిన దుఆ భాగ్యం కారణంగానే ఈ విశిష్టత ఆయనకు కలిగింది. ఆయన (రజిఅన్) ఏ విషయాన్నీ మరచిపోయేవారు కాదు. రజియల్లాహుతాలా అన్‌హు.

**పుస్తకం వ్రాయించకుండా ఆయన(ర) ఎందుకు అడ్డుకున్నారు” అని అంటూ నిష్క్రమించారు.**

## 41వ అధ్యాయం
## రాత్రి సమయంలో విద్యాబోధనం-హితబోధనం

**115. బీబీ ఉమ్మె సలమా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు : ఒకసారి మహనీయ ప్రవక్త ముహమ్మద్(సఅసమ్) రాత్రి సమయంలో నిద్ర నుంచి మేల్కొన్నారు. “అల్లాహ్ పరిశుద్ధుడు, ఈ రోజు రాత్రి ఆకాశం నుంచి భూమిపైకి ఎన్నో ఉపద్రవాలు విరుచుకు పడ్డాయి. ఎన్నో కారుణ్య నిధులు తెరుచుకున్నాయి. (ప్రజలారా!) ఈ గదులలో నిదురపోతున్న స్త్రీలను ఆరాధనలు చెయ్యటం కోసం లేపండి; ప్రపంచంలో వస్త్రాలు ధరించే చాలా మంది స్త్రీలు పరలోకంలో నగ్నంగా ఉంటారు[1] అని సెలవిచ్చారు.**

---

114-1. 1. దైవప్రవక్త(స) ఆజ్ఞను ఉల్లంఘించటం అనేది హజ్రత్ ఉమర్(రజిఅన్) గారి భావం ఎంత మాత్రం కాదు. అల్లాహ్ కాపాడుగాక! జీవితాంతం ఆయన(స) గారి ఆజ్ఞలను హజ్రత్ ఉమర్(ర) శిరసావహించారు. వాటి కోసం తమ జీవితాన్ని, తమ సంపదను ధారపోశారు. తమ ప్రాణం కంటే, తమ సంతానం కంటే ఆయన్నే (స) అధికంగా ప్రేమించారు. అటువంటి మనిషి ప్రవక్త(స) గారిని అందునా మరణ సమయంలో ఎలా వ్యతిరేకించగలరు? ఒక మామూలు ముస్లిమ్ కూడా అలా చేయలేడు కదా! ప్రేమానురాగాల కారణంగా, ప్రవక్త(స) గారి మీద వ్యాధి తీవ్రత అధికమైనప్పుడు, ఇటువంటి కష్టకాలంలో, కఠిన సమయంలో ప్రవక్త(స) గారికి పుస్తకం వ్రాయించే శ్రమను ఎందుకివ్వాలి? అనే అభిప్రాయాన్ని హజ్రత్ ఉమర్(ర) వ్యక్తం చేశారు. అల్లాహ్ గ్రంథం మనకు సరిపోతుంది అని హజ్రత్ ఉమర్(ర) అన్నప్పుడు మహాప్రవక్త(స) మౌనం వహించారు కూడా. ఒకవేళ ప్రవక్త మహనీయులు (స) పుస్తకం వ్రాయించేందుకు వ్రాసే వస్తువులను తీసుకురండి అని మళ్ళీ ఆజ్ఞాపించి ఉన్నట్లయితే ఆయన(స) ఆజ్ఞను ఉల్లంఘించే ధైర్యం ఎవరికి ఉండేది? ఆ తరువాత మహనీయ ప్రవక్త(స) నాలుగు రోజుల వరకు సజీవంగానే ఉన్నారు. అయినా ఏ పుస్తకాన్నీ ఆయన(స) వ్రాయించలేదు. హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్(ర) నమాజులకు ఇమామత్ వహించారు. దీని ద్వారా తెలిసే విషయం ఏమిటంటే, ఆయన(ర) కూడా ఇదే అభిప్రాయాన్ని కలిగి ఉన్నారు. అంటే పుస్తకం వ్రాయించటం అనేది అంత అవసరమైన విషయం కాదు అని తలపోశారు.

## 42వ అధ్యాయం
## రాత్రి సమయంలో జ్ఞాన సంబంధమైన విషయాలు చెప్పటం

**116.** హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా కథనం చేశారు : ప్రవక్త మహనీయులు (సఅసమ్) తమ జీవిత కాలపు చివరి రోజుల్లో ఇషా నమాజుకు ఇమామత్ వహించారు. సలాము చేసిన తరువాత, నిలబడి ఇలా సెలవిచ్చారు; మీరు ఈ రాత్రిని చూశారు కదా! దాన్ని (దాని ప్రాముఖ్యాన్ని) జ్ఞాపకం పెట్టుకోండి. ఇప్పటి నుంచి నూరు సంవత్సరాలు పూర్తి అయిన తరువాత, ఇప్పుడు ప్రస్తుతం నేల మీద ఎంత మంది జనం ఉన్నారో, వారిలో ఎవ్వరూ బ్రతికి ఉండరు.[1]

**117.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: "నేను ఒక రాత్రి నా పినతల్లి అయిన మయ్మూనా బిన్తె హారిస్ ఇంట్లో పండుకున్నాను. ఆమె మహా ప్రవక్త ముహమ్మద్(సఅసమ్)గారి సతీమణి. ఆ రాత్రి ప్రవక్త మహనీయులు (స) కూడా ఆమె వద్దనే ఉన్నారు (ఆ రాత్రి ఆమె వంతు అన్నమాట). ప్రియప్రవక్త(స) ఇషా ప్రార్థనలు చేశారు; తరువాత మసీదు నుంచి ఇంటికి వచ్చేశారు; ఇంట్లో నాలుగు రకాతులు నమాజు చేసి నిదురపోయారు. ఆ తరువాత మేల్కొని పిల్లవాడు నిదుర పోతున్నాడా అనో లేదా ఇటువంటి విషయాన్ని దేన్నో అన్నారు.[1] తరువాత నమాజు చెయ్యటం కోసం నిలబడ్డారు. నేను కూడా మేల్కొని ఆయన (స) ఎడమ వైపునకు వెళ్ళి నిలబడ్డాను. కాని ఆయన(స)నన్ను తమ కుడివైపునకు లాక్కున్నారు. ఐదు

---

115–1. అంటే, వారి వద్ద పుణ్యకార్యాలు ఉండవు. గదులలోని స్త్రీలు అంటే ప్రియ ప్రవక్త(స) గారి సతీమణులు అని అర్థం.

116–1. ఈ హదీసులో నుంచి ఇమామ్ బుఖారీ (రహ్మాలై) ఒక సాక్ష్యాన్ని, ఒక ఆధారాన్ని తీసుకున్నారు. అది ఏమిటంటే, ఖిజర్ (అస్సలామ్) బ్రతికి లేరు, ఆయన మరణించారు అనేది. ఖిజర్ ఇప్పటి వరకు ఇంకా బ్రతికే ఉన్నారు అని చెప్పేవారు మాత్రం భూమి అంటే అరేబియా భూమి (అని భావం) అంటారు లేదా ఖిజర్ దీని నుంచి మినహాయించబడ్డారు, ఇది ఆయనకు అన్వయించదు అని అంటారు. ఈ హదీసు ప్రకారం, అప్పుడు 100 సంవత్సరాల తరువాత ప్రవక్త ముహమ్మద్(స)ను చూసిన వారు ఒక్కరు కూడా బ్రతికిలేరు. అందరికంటే చివర్లో అబూ తుఫైల్ ఆమిర్ వాసిలా అనే సహాబీ హిజ్రీ 110వ సంవత్సరంలో మరణించారు.

117–1. అధ్యాయం యొక్క అసలు విషయం ఇందులో నుంచే ఉద్భవిస్తుంది అని కొందరు అంటారు. ఎందుకంటే దైవప్రవక్త(స) ఈ విషయాన్ని రాత్రి సమయంలో చెప్పారు

**రకాతులు నమాజు చేశారు.[2] తరువాత రెండు రకాతులు (ఉదయపు సున్నత్) చేశారు. ఆ తరువాత పండుకుని బాగా నిదురపోయారు; ఆయన(స) పెట్టిన గురకల ధ్వనిని కూడా నేను విన్నాను. మళ్ళీ మేల్కొని ఉదయపు నమాజు కోసం (మసీదుకు) వచ్చేశారు.[3]**

## 43వ అధ్యాయం

## విద్యను జ్ఞాపకముంచుకోవటం

**118. హ్‌జ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; అబూ హురైరా (రజి) చాలా హదీసుల్ని ఉల్లేఖించారని ప్రజలు చెబుతారు. అసలు విషయం ఏమి టంటే, దైవగ్రంథంలో ఈ రెండు వాక్యాలు[1] గనక లేకుండా ఉన్నట్లయితే నేను**

---

కాబట్టి. కాని యదార్థం ఏమిటంటే, ఇది రాత్రి సమయంలో జ్ఞాన సంబంధమైన విషయాలు చెప్పటం కాదు కదా! ఇమామ్ బుఖారి(రహ్మలై) ఈ హదీసును ఇక్కడ ప్రస్తావించి, దాని యొక్క ఇతర కోణాన్ని, రెండో దిశను కూడా సూచించారు. స్వయంగా ఆయనే ఈ విషయాన్ని 'కితాబుత్తఫ్సీర్'లో ప్రస్తావించారు. అందులో ఏముందంటే, దైవప్రవక్త(స) కొంచెం సేపు తమ భార్యతో మాట్లాడారు, ఆ తరువాత నిదురపోయారు. ఇమామ్ బుఖారీగారి సంప్రదాయం ఏమిటంటే; ఆయన ఒక హదీసును ప్రస్తావించి, దాని రెండో కోణం ప్రకారం విశ్లేషిస్తారు. ఇలా ఎందుకు చేస్తారంటే, హదీసు విద్యార్థులకు దాని కోణాలు అన్నీ సంపూర్ణంగా, స్పష్టంగా తెలియాలని.

117–2. మొదట నాలుగు రకాతులు చేశారు, తరువాత ఐదు రకాతులు; మొత్తం తొమ్మిది రకాతులు చేశారు. వాటిలో ఎనిమిది తహజ్జుద్ నమాజుకు చెందిన రకాతులు, మిగిలిన ఒకటి వితర్ నమాజుకు సంబంధించింది.

117–3. ఇది ప్రవక్త(స) మహనీయుని ప్రత్యేకతల్లోని ఒక ప్రత్యేకత; నిద్రపోవటం వలన ఆయన(స) గారి వుజూ చెడిపోదు. మరొక హదీసులో ఏముందంటే, "నా కళ్ళు నిద్రపోతాయి, హృదయం మాత్రం నిద్రపోదు."

118–1. ఒక వాక్యమయితే పైన హదీసులో పేర్కొనబడింది (2: 159). రెండో వాక్యం కూడా 'బఖరా' సూరాలోనిదే. "వాస్తవమేమిటంటే, అల్లాహ్ తన గ్రంథంలో ప్రవచించిన ఆజ్ఞలను దాచేవారూ, వాటిని స్వల్పమైన, ప్రాపంచిక ప్రయోజనాల కోసం విక్రయించేవారూ నిశ్చయంగా తమ ఉదరాలను అగ్నితో నింపుకుంటున్నారు. ప్రళయదినం నాడు అల్లాహ్ వారిని ఏమాత్రం పలకరించడు, పవిత్రులుగా పరిగణించడు. వారికి వ్యధాభరితమైన శిక్షపడుతుంది" (2: 174). హ్‌జ్రత్ అబూ హురైరా(ర) గారి భావం ఏమిటంటే, "ఈ ఖురాను వాక్యాలలో, జ్ఞాన సంబంధమైన

**హదీసుల్ని ఉల్లేఖించి ఉండేవాణ్ణి కాను. తరువాత ఆయన(ర) బఖరా సూరాలోని ఈ వాక్యాలను పఠించారు; "మేము అవతరింపజేసిన స్పష్టమైన జ్ఞానబోధలు, ధర్మోపదేశాలు వాస్తవానికి మానవులందరి మార్గదర్శకత్వం కోసం అని మేము మా గ్రంథంలో స్పష్టం చేసిన తరువాత కూడా వాటిని దాచేవారిని" చివరి వరకు అంటే "వ అనత్తవ్వా బుర్రహీమ్" వరకు (2: 159, 160). మన సోదరులైన ముహాజిర్లయితే (కాందిశీకులు) బజారుల్లో క్రయవిక్రయాలు చెయ్యటంలో మునిగిపోయి ఉంటారు. మన సోదరులైన అన్సారీలైతే పొలాలు దున్నటంలో, పంటలు పండించటంలో నిమగ్నమై ఉంటారు. అబూ హురైరా (ర) రసూలుల్లాహ్ (స) వద్దనే ఉండేవారు (ఆయనకు బతుకుదెరువుకన్నా ప్రవక్త (స) సాన్నిహిత్యమే ముఖ్యంగా ఉండేది.) ఇతరులెవరూ ప్రవక్త (స) సమావేశాల్లో హాజరు కాలేకపోయినా ఆయన హాజరై వుండేవాడు.[2] ఇతరులు తెలుసుకోవడం సాధ్యంకాని ప్రవచనాలు కూడా విని జ్ఞాపకముంచు కునేవాడు.**

**119. హజ్రత్ అబూహురైరా(ర) గారి ఒక ఉల్లేఖనం ప్రకారం, ఆయన(ర) ఒకసారి మహాప్రవక్త(స)కు ఇలా విన్నవించుకున్నారు : "దైవప్రవక్తా! మీరు చెప్పే ఎన్నో విషయాలను నేను వింటాను. కాని వాటిని మరచిపోతాను." అప్పుడు ప్రవక్త మహనీయులు(స) 'నీ దుప్పటిని పరచుకో' అని ఆజ్ఞాపించారు. నేను నా దుప్పటిని పరిచాను. అప్పుడు ఆయన(స) రెండు చేతులతో ఒక దోసెడు[1] తీసుకుని నా దుప్పట్లో పడవేశారు. తరువాత, 'దానిని తీసుకుని నీ హృదయానికి హత్తుకో' అని ఆయన(స) సెలవిచ్చారు. అప్పుడు నేను దానిని నా హృదయానికి హత్తుకున్నాను. ఆ తరువాత నేను ఏ విషయాన్నీ మరచిపోలేదు.**

---

విషయాలను దాచేవారికి వ్యధాభరితమైన శిక్ష విధిస్తానని అల్లాహ్ వాగ్దానం చేశాడు. మరియు వారిని శపించాడు. ఈ కారణం వల్లనే నేను నాకు తెలిసిన హదీసులను బాహాటంగా చెబుతూ ఉంటాను."

118-2. హజ్రత్ అబూ హురైరా (ర) ఆకలి తీర్చుకోడానికి ఏది దొరికితే దానితోనే తృప్తిపడి ఎల్లప్పుడు ప్రవక్త (స) వద్ద ఉండేవారు. వ్యవసాయం, వ్యాపారం చేసి సంపాదించడం కన్నా ప్రవక్త (స) సాన్నిహిత్యమే మేలనుకున్నారు. అందువల్లనే హదీసు జ్ఞానం అపారంగా పొందారు.

119-1. ఈ దోసిలి ప్రవక్త(స) గారి శుభాల దోసిలి, కారుణ్యాల దోసిలి, దాని ప్రభావం వల్ల అబూ హురైరా(ర) గారి మరపు మటుమాయమై పోయింది. ఇక తాను విన్న ఏ విషయాన్నీ ఆయన(ర) ఎన్నడూ మరచిపోలేదు.

**120.** ఇబ్రాహీమ్ బిన్ అల్ మున్జిర్ ఇలా ఉల్లేఖించారు : ఇబ్నె అబీ పుదైక్ ఈ హదీసునే (119వ హదీసును) వివరించారు. ఆయన గారి ఉల్లేఖనంలో ఇలా ఉంది : "తమ చేతులతో ఒక దోసెడు ఏదో తీసుకుని అందులో పడేశారు."

**121.** హజ్రత్ అబూహురైరా(రజిఅన్) ఇలా వివరించారు: నేను ప్రవక్త మహనీయులు ముహమ్మద్(స) నుంచి రెండు రకాల జ్ఞానాన్ని నేర్చుకున్నాను. ఒక దాన్ని నేను ప్రచారం చేశాను, ప్రజల్లో వ్యాపింపజేశాను. ఇక రెండోది. దాన్ని గనక నేను ప్రచారం చేస్తే, బహిర్గతం చేస్తే నా అన్న వాహికను (బుల్ఊమ్) ఖండించటం జరుగుతుంది.[1] ఇమామ్ బుఖారీ (రహ్మాలై), 'అన్న వాహిక నుంచి అన్నం కడుపులోకి దిగుతుంది' అని చెప్పారు.[2]

## 44వ అధ్యాయం

### మత విద్వాంసులు చెప్పే విషయాలు నిశ్శబ్దంగా వినాలి.

**122.** ప్రవక్త మహనీయులు(స) చివరి హజ్ యాత్ర సమయంలో తనతో ఇలా సెలవిచ్చారని హజ్రత్ జరీర్(రజిఅన్) చెప్పారు. "ప్రజల్ని నిశ్శబ్దంగా ఉండమని, నేను చెప్పేది వినమని చెప్పు." (జరీర్(ర) ప్రజల్ని మౌనంగా ఉండమని చెప్పారు) అప్పుడు వారిని ఉద్దేశించి ఆయన(స) ఇలా సెలవిచ్చారు : ప్రజలారా! నా తరువాత మీరు పరస్పరం గొంతులు కోసుకుని అవిశ్వాసులుగా మారిపోకండి (ఒకరినొకరు చంపుకోకండి).[1]

---

121-1. రెండో రకం జ్ఞానం అంటే, దైవప్రవక్త(స) అబూహురైరా(ర)కు తెలిపిన విషయాలు అని అర్థం. అవి ఏమిటో ఆయన(స) ఇలా చెప్పారు : "నా తరువాత దుర్మార్గులైన రాజులు వస్తారు, వారు అక్రమాలకు, అన్యాయాలకు పాల్పడతారు." అబూహురైరా(ర) వాటిని గురించి సూచనప్రాయంగా ఇలా ప్రస్తావించారు: నేను హిజ్రీ శకం 60వ సంవత్సరం నుంచి శరణు కోరుకుంటున్నాను, యువకుల పాలన నుండి శరణు కోరుకుంటున్నాను. ఆ సంవత్సరంలోనే దుర్మార్గుడైన యజీద్‌కు రాజుగా పట్టాభిషేకం జరిగింది.

121-2. ధర్మవేత్తల దృష్టిలో బుల్ఊమ్ (వాయునాళం) అంటే, శ్వాస వచ్చిపోయే వాయు నాళం అని భావం. మరీ (అన్న వాహిక) అంటే ఆహారం కడుపులోకి దిగే, ఆహార వాహిక అని భావం. విద్వాంసులైన జుహ్రీ, ఇబ్నె కసీర్‌లు, బుల్ఊమ్ అంటే ఆహారం కడుపులోకి దిగే అన్న వాహిక అని అన్నారు. ఇమామ్ బుఖారీ (రహ్మా) కూడా ఇదే విషయం చెప్పారు.

122-1. ఈ ఉల్లేఖనంలో హజ్రత్ జరీర్(ర) హజ్జతుల్ విదా (చివరి హజ్) తరువాత ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి ముస్లిమ్ అయ్యారా అనే సందేహం కలుగుతుంది. కాని

## 45వ అధ్యాయం

**ఒక పండితుణ్ణి, అందరికంటే గొప్ప పండితుడెవరు అని అడిగినప్పుడు, అతను 'అల్లాహ్‌కు తెలుసు' అని సమాధానం చెప్పాలి.**

**123.** సయీద్ ఇబ్నె జుబేర్ ఇలా ఉల్లేఖించారు: "ఖిజర్ వద్దకు వెళ్ళిన మూసా బనీ ఇస్రాయీల్‌కు చెందిన మూసా కాదు; అతను మరొక జాతికి చెందిన మూసా అని నౌఫ్ బకాలీ[1] అంటున్నాడు అని నేను ఇబ్నె అబ్బాస్(రజిఅన్)కు చెప్పాను." అప్పుడు ఆయన(ర) 'అతడు అల్లాహ్‌కు శత్రువు, అబద్ధం చెబుతున్నాడు' అని అన్నారు.

**124.** ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారని హజ్రత్ ఉబై బిన్ కాబ్ (రజిఅన్) ఉల్లేఖించారు; హజ్రత్ మూసా(అ) ఇస్రాయీల్ సంతతి వారిని ఉద్దేశించి ప్రసంగించేందుకు వారి ముందు నిలబడ్డారు. అప్పుడు ప్రజలు ఆయన్ని(అ), 'జనులలో అందరి కంటే గొప్ప పండితుడెవరు' అని అడిగారు. దానికి సమాధానంగా ఆయన(అ), నేనే అందరికంటే గొప్ప పండితుణ్ణి అని అన్నారు. దానిపై అల్లాహ్, ఆయన(అ) పట్ల అయిష్టతను వ్యక్తం చేశాడు. ఎందుకంటే, ఆ విషయం గురించి 'అల్లాహ్‌కు మాత్రమే తెలుసు' అని మూసా(అ) అనలేదు కదా! తరువాత అల్లాహ్ మూసా(అ)కు ఇలా తెలియజేస్తూ దైవవాణి (వహీ)ని పంపాడు. "నా దాసుడొక డున్నాడు,[1] అతను నీకు రెండు సముద్రాల సంగమం దగ్గర దొరుకుతాడు. అతను నీకంటే ఎక్కువ పాండిత్యం కలవాడు". అప్పుడు మూసా(అ), 'ప్రభూ! నేను అతన్ని

---

అసలు విషయం ఏమిటంటే, ఆయన(ర) హిజ్రీ శకం 10వ సంవత్సరంలో హజ్జతుల్ విదాకు పూర్వమే ముస్లిమ్ అయ్యారు. దీనిని ఇమామ్ బగ్‌వీ మరియు ఇబ్నె హిబ్బాన్ ధ్రువీకరించారు. అవిశ్వాసులు అయిపోవటం అంటే అవిశ్వాసులు చేసేటటువంటి పనులు చేయటం అని అర్థం. ఎందుకంటే, ఒక ముస్లిమ్ మరొక ముస్లిమ్‌ను చంపినంత మాత్రాన అవిశ్వాసి (కాఫిర్) అయిపోడు. ఇది ఇస్లామ్ మత విద్వాంసుల ఏకాభిప్రాయం.

123–1. ఈయన తాబయీన్‌లోనివారు, ఇంకా ఇతను కాబ్ అహ్‌బార్ భార్య కుమారుడు, బనీ ఇస్రాయీల్‌కు చెందిన సంప్రదాయాలు, గ్రంథాలకు సంబంధించిన విషయాలు బాగా తెలిసిన పండితుడు. ఇతను చెప్పిన విషయం హదీసుకు వ్యతిరేకంగా ఉన్నందువల్ల, ఇబ్నె అబ్బాస్(రజిఅన్)కు కోపం వచ్చింది. ఆ స్థితిలో ఆయన(ర), 'అతడు అల్లాహ్ శత్రువు' అని అన్నారు. ఎవరైనా హదీసుకు వ్యతిరేకంగా చెబితే లేదా హదీసుకు వ్యతిరేకంగా ఉన్నటువంటి అభిప్రాయాన్ని లేదా విధానాన్ని అవలంబిస్తే, అప్పుడు వారు కూడా అల్లాహ్‌కు శత్రువులే. ఎందుకంటే, వారు దైవప్రవక్త ముహమ్మద్ (స)కు ప్రతికూలంగా ఉన్నారు.

ఎలా కలుసుకోవాలి?' అని అడిగారు. దానికి అల్లాహ్, "ఒక చేపను గంపలో పెట్టుకో, ఆ చేప ఎక్కడయితే మాయమై పోతుందో అక్కడే నీకు అతను కనిపిస్తాడు" అని మూసా(అ)కు ఆజ్ఞాపించాడు. తరువాత హ్రజత్ మూసా(అ) బయలుదేరారు, అతనితో అతని సేవకుడు యోషే బిన్ నూన్ కూడా ఉన్నాడు. వారు ఉభయులూ ఒక చేపను గంపలో తీసుకుని ప్రయాణిస్తూ ఒక చట్టుబండ[2] దగ్గరకు వచ్చారు. తమ శిరస్సుల్ని నేలపై పెట్టి అక్కడే నిదురపోయారు. అప్పుడు చేప గంపలో నుంచి బయటపడి సముద్రంలోకి దూసుకు పోయింది. ఈ విషయం మూసా(అ)ను, అతని సేవకుణ్ణి ఆశ్చర్యంలో ముంచి వేసింది. వారిద్దరూ మిగతా రాత్రి, తరువాతి రోజు అంతా ప్రయాణం చేశారు. తెల్లవారినప్పుడు, మూసా(అ) తన సేవకునితో, 'మా ఉదయం భోజనం తీసుకురా; మేము ఈ ప్రయాణం వల్ల అలసిపోయాము' అని అన్నారు. ఏ స్థలం వరకైతే వెళ్ళ వలసిందిగా ఆజ్ఞాపించటం జరిగిందో, ఆ స్థలాన్ని దాటి ముందుకు సాగిపోయిన తరువాత మూసా(అ)కు ప్రయాణ బడలిక కలిగింది[3]. అంతవరకు అలసట అనేది మూసా(అ)ను ముట్టుకోను కూడా లేదు. అప్పుడు ఆయన గారి సేవకుడు, 'మీరు గమనించలేదా, మనం చట్టుబండ వద్దకు చేరుకున్నప్పుడు, గంపలోని చేప బయట పడి పారిపోయింది. నేను దాన్ని గురించి ప్రస్తావించటం మరచిపోయాను' అని అన్నాడు. దానికి మూసా(అ) 'మనం దాని కోసమే కదా వెతుకుతున్నాము' అని అన్నారు. తరువాత వారు ఉభయులూ అన్వేషించుకుంటూ తమ అడుగుజాడల్ని అనుసరిస్తూ వెనక్కు తిరిగి వచ్చారు. వారు ఆ రాతిబండ దగ్గరకు చేరుకున్నప్పుడు అక్కడ ఒక మనిషి నిదురపోతూ కనిపించాడు. అతను తన మీద ఒక వస్త్రాన్ని కప్పుకుని నిదురపోతున్నాడు. మూసా(అ)[4] అతనికి సలాము చేశారు. అప్పుడు ఖిజర్ నిద్ర నుంచి మేల్కొని, నీ దేశంలో సలాము సంప్రదాయం ఎక్కడి నుంచి వచ్చింది అని అడిగారు. అప్పుడు మూసా(అ) 'నా పేరు మూసా(అ)' అని అన్నారు. దానికి ఖిజర్(అ) ఇస్రాయీల్ సంతతికి చెందిన మూసా(అ)వా అని అడిగారు. అవును, నేను ఇస్రాయీల్ సంతతికి చెందిన మూసా(అ)నే అని మూసా(అ) జవాబు పలికారు. తరువాత మూసా(అ), కొంతకాలం పాటు మీతో ఉండనిస్తారా? అయితే మీకు నేర్పబడిన జ్ఞాన సంబంధమైన విషయాలు నాకు నేర్పాలి అని అభ్యర్థించగా, అప్పుడు ఖిజర్(అ), 'మీరు నా వెంట ఉండి సహనం వహించలేరు' అని అన్నారు.

'మూసా! విషయం ఏమిటంటే, దేవుడు ఒక రకమైన జ్ఞానాన్ని నాకు ప్రసాదించాడు. అది మీకు తెలియదు. మరొక రకమైన జ్ఞానాన్ని ఆయన మీకు ప్రసాదించాడు.

కాని అది నాకు తెలియదు.[5] అన్నారు ఖిజర్. దానికి మూసా(అ) ఇలా అన్నారు, "దైవ సంకల్పమైతే, మీరు నన్ను తప్పకుండా సహనశీలునిగా పొందుతారు. ఏ విషయంలో కూడా నేను మీకు అవిధేయత చూపను." చివరకు వారు ఇద్దరూ సముద్ర తీరం వెంబడి నడుస్తూ పోసాగారు. ఎందుకంటే, సముద్రాన్ని దాటడానికి వారి వద్ద పడవ లేదు. అంతలో ఒక పడవ వారి వైపు నుంచి పోతూ కనిపించింది. వారు తమను కూడా ఎక్కించుకోమని ఆ పడవ వారికి విజ్ఞప్తి చేశారు. ఆ పడవవాళ్ళు ఖిజర్(అ)ను గుర్తుపట్టారు. ఖిజర్(అ)ను, మూసా(అ)ను వారు తమ పడవలోకి ఎక్కించుకున్నారు. ఛార్జీలు కూడా తీసుకోలేదు. ఇంతలోనే ఒక పిచ్చుక అక్కడకు ఎగురుకుంటూ వచ్చింది. పడవ అంచు మీద కూర్చుని తన ముక్కును ఒకసారో, రెండుసార్లో సముద్రంలో ముంచింది. అప్పుడు ఖిజర్(అ) ఇలా అన్నారు: "మూసా! మీ వద్ద ఉన్న జ్ఞానం, నా వద్ద ఉన్న జ్ఞానం (ఈ రెండు జ్ఞానాలు) కలిసి అల్లాహ్ వద్ద ఉన్న జ్ఞానంలో నుంచి, ఆ పిచ్చుక తన ముక్కును సముద్రంలో ముంచి ఎంత నీరు తీసుకుందో[6], అంత జ్ఞానం మాత్రమే తీసుకున్నాయి". తరువాత ఖిజర్(అ) పడవ బల్లల్లోని ఒక బల్ల వైపునకు వెళ్ళి, దాన్ని పీకివేశారు. అప్పుడు మూసా (అ) "ఈ పడవ వాళ్ళు ఛార్జీలు లేకుండానే మనల్ని పడవలోకి ఎక్కనిచ్చారు. కాని మీరో, వారి పడవకు రంధ్రం చేశారు. వారిని ముంచెయ్యదలిచారు అని అన్నారు. ఖిజర్(అ) ఇలా అన్నారు : "మీరు నా పట్ల సహనం వహించలేరని నేను చెప్పలేదా!" మూసా (అ), "మరిచిపోయి అలా అన్నాను. దానికి నన్ను నిలదీయకండి, నా పనిని కష్టతరం చెయ్యకండి" అని ప్రాధేయపడ్డారు. ప్రవక్త మహనీయులు(స) ఇలా సెలవిచ్చారు. "మూసా (అ) మొదటి అభ్యంతరం మరుపు వల్లనే", తరువాత వారు తమ ప్రయాణాన్ని కొనసాగించారు. ఒకచోట ఒక బాలుడు ఇతర బాలురతో ఆడుకుంటు న్నాడు. ఖిజర్(అ) ఏం చేశారంటే, ఆ పిల్లవాడి శిరస్సును పైనుంచి పట్టుకుని తమ చేతులతో దాన్ని పెరికివేశారు (అంటే చంపేశారు). అప్పుడు మూసా (అ), "మీరు అమాయకుడైన ఒక బాలుణ్ణి అన్యాయంగా చంపేశారు" అని అన్నారు. అప్పుడు ఖిజర్(అ), 'నేను మీకు చెప్పాను కదా, మీరు నా పట్ల సహనం వహించలేరని' అని అన్నారు. ఇబ్నె ఉయైనా ఇలా అన్నారు, 'ఇది ఆయన మొదట చెప్పిన దానికంటే ఎంతో తీవ్రమైనది.' ఆ తరువాత వారిద్దరూ ముందుకు సాగిపోయారు. ఒక గ్రామానికి చేరుకున్నారు. ఆ గ్రామస్థుల్ని అన్నం పెట్టమని అడిగారు, కాని వారు ఆతిథ్యం ఇవ్వ టానికి తిరస్కరించారు. వారు ఉభయులూ ఆ గ్రామంలో,

**పడిపోవటానికి సిద్ధంగా ఉన్న ఒక గోడను చూశారు. హ(జత్ ఖిజర్(అ) తమ చేతులతో ఆ గోడకు మరమ్మతులు చేసి నిలబెట్టారు[7]. మూసా(అ) ఇలా అన్నారు: "మీరు కోరితే, దానికి గాను గ్రామస్థుల నుంచి వేతనం అడిగి తీసుకునే వారే." దానికి ఖిజర్(అ) సమాధానంగా, "సరే, ఇక నేనూ, మీరూ వేరైపోయే ఘడియ వచ్చేసింది" అని అన్నారు. ప్రవక్త మహనీయులు(స) ఇలా సెలవిచ్చారు. "అల్లాహ్, మూసా(అ) మీద కరుణ జూపుగాక! అయ్యో! మూసా(అ)గారు గనక సహనం చూపి ఉన్నట్లయితే, ఖిజర్(అ)కు సంబంధించిన మరెన్నో విషయాలు మనకు తెలిసి ఉండేవే."**

## 124వ హదీసుకు సంబంధించిన వివరణ

1. హ(జత్ ఖిజర్ (అ) దైవప్రవక్త అయినా లేదా దైవానికి సన్నిహితుడైనా, వలీ అయినా ఏమైనాసరే, ఆయన మటుకు మూసా(అ) కంటే శ్రేష్ఠులు కాలేరు. కాని హ(జత్ మూసా (అ), "నేను అందరికంటే ఎక్కువ జ్ఞానం కలవాణ్ణి" అని అనటం అల్లాహ్‌కు నచ్చలేదు. కనుక హ(జత్ మూసా (అ) కంటే ఎన్నో రెట్లు తక్కువవాడైన ఒక దాసునితో ఆయన్ని (అ) పోటీగా నిలబెట్టటం జరిగింది; అతనితో పోల్చి చూపటం జరిగింది; ఆయన (అ) సిగ్గుపడాలని ఇక ముందు ఇటువంటి సవాళ్ళు విసరకుండా ఉండాలని.
2. సఖ్‌రా అంటే గుట్ట లేక పెద్ద రాయి అని అర్థం. దాని క్రింద మాయె హయాత్ (జీవ జలం) ఉంది. ఆ నీరు గంపలో ఉన్న చేపమీద పడటం వల్ల, అది బ్రతికి దైవశక్తి వల్ల సముద్రంలోకి వెళ్ళిపోయింది. కాని హ(జత్ యోషే దాన్ని గురించి మూసా (అ)కు చెప్పటం మరచిపోయారు. హ(జత్ మూసా (అ) నిద్ర నుంచి మేల్కొన్న తరువాత, కొంచెం దూరం ప్రయాణం చేసిన పిదప ఉదయం భోజనం తీసుకురమ్మని అడిగారు. అప్పుడు హ(జత్ యోషేకు చేప సంగతి గుర్తుకొచ్చింది.
3. ఇది కేవలం అల్లాహ్ మహత్యం వల్లనే జరిగింది: హ(జత్ మూసా (అ)కు ఏ స్థలం వద్దకయితే వెళ్ళమని ఆజ్ఞాపించటం జరిగిందో, ఆ స్థలం దాటి ముందుకుపోయిన తరువాతనే ఆయన (అ) అలసిపోయారు.
4. హ(జత్ ఖిజర్ (అ) ఉన్నటువంటి దేశం అవిశ్వాసుల దేశం. హ(జత్ మూసా (అ) ఖిజర్ (అ)ను ఉద్దేశించి సలాము చేసినప్పుడు ఆయన (అ) ఈ సలాము చెయ్యటం మూసా (అ) ఎక్కడ నుంచి నేర్చుకున్నాడు అని ఆశ్చర్యపడ్డారు. దీని ద్వారా తెలిసే విషయం ఏమిటంటే, ఖిజర్(అ)కు కూడా అగోచర జ్ఞానం తెలియదు. ఒకవేళ ఈ జ్ఞానం ఉన్నట్లయితే ఆయన మొదట్లోనే మూసా (అ)ను గుర్తుపట్టేవారు.
5. హ(జత్ మూసా (అ)కు ఉన్న జ్ఞానం పైకి స్పష్టంగా కనిపించే షరీఅత్ జ్ఞానం అయితే, హ(జత్ ఖిజర్ (అ) ప్రత్యేకమైన ఆజ్ఞల కోసం నియమించబడ్డారు. అవి పైకి షరీఅత్‌కు

వ్యతిరేకంగా కనిపిస్తాయి. కాని వాస్తవానికి కావు. ఎందుకంటే అవి అల్లాహ్ ఆజ్ఞలు కాబట్టి.

6. శబ్దానువాదం ఇలా వుంది; ఒక పిచ్చుక తన ముక్కును సముద్రంలో ముంచి ఎంత నీటిని తగ్గించిందో అంతే అల్లాహ్ జ్ఞానాన్ని నీకూ, నాకూ ఉన్న జ్ఞానం తగ్గించింది. కాని పైకి వ్యక్తమయ్యే ఈ భావం సరియైనది కాదు. ఎందుకంటే అల్లాహ్ జ్ఞానం ఇంత కూడా తరగదు. కనుక మేము అనువాదంలో పేర్కొన్న అర్థమే యదార్థమైనది.

7. బహుశా అటువంటి హత్య ఆనాటి ధర్మశాస్త్రం ప్రకారం ధర్మసమ్మతమైనదిగా ఉండేదేమో. ఇక పడవకు కన్నం పెట్టటం గురించి; అది గనక ఒక దుర్మార్గుని దుర్మార్గం నుంచి కాపాడటానికి చేస్తే ధర్మసమ్మతంకాని విషయం మాత్రం కాదు. ముస్లిం ఉల్లేఖనంలో ఇలా ఉంది. పన్ను వసూలు చేసే వారు ఆ పడవను విడిచిపెట్టి నప్పుడు, హజ్రత్ ఖిజర్ (అ) మళ్ళీ ఆ రంధ్రాన్ని మూసివేశారు. ఇక పడిపోవటానికి సిద్ధంగా ఉన్న గోడ మరమ్మత్తు విషయానికి వస్తే, అది నూటికి నూరుపాళ్ళు ఉపకారమే. ఈ వృత్తాంతాన్ని గురించి తెలుసుకుని, అల్లాహ్‌కు సన్నిహితులు, అల్లాహ్‌కు స్నేహితులు అయినవారు షరీఅత్ ఆజ్ఞలకు అతీతులని అనుకోకూడదు. ఇటువంటి ఆలోచన, ఇటువంటి భావన అధర్మమయినది, నాస్తికమయినది.

## 46వ అధ్యాయం

## కూర్చొని ఉన్నటువంటి మత విద్వాంసుణ్ణి ఎవరైనా నిలబడి ప్రశ్నలు వేస్తే

**125. అబూ మూసా (ర.జి) ఇలా ఉల్లేఖించారు: ఒక వ్యక్తి ప్రవక్త మహనీయుని (స) వద్దకు వచ్చి, "ఓ దైవ ప్రవక్తా! ఎటువంటి పోరాటాన్ని అల్లాహ్ కోసం చేసే పోరాటమంటారు? ఎందుకంటే మాలో కొందరు కోపం వచ్చినందు వల్ల పోరాడతారు, మరికొందరు (వ్యక్తిగత, జాతీయ, దేశ) అభిమానం వల్ల పోరాడతారు" అని అడిగాడు. అప్పుడు కారుణ్యమూర్తి (సఅసమ్) తల ఎత్తి అతని వైపు చూశారు, ఎందుకంటే ఆయన (స) కూర్చొని ఉన్నారు. అతను నిలబడి ఉన్నాడు.[1] ఆయన(స) ఇలా సెలవిచ్చారు. "అల్లాహ్ వచనం ఎల్లప్పుడూ ఘనమైనదిగా, ఉన్నతమైనదిగా ఉండాలనే ఉద్దేశ్యంతో ఎవరైనా పోరాడితే, ఆ పోరాటం అల్లాహ్ కోసం చేసే పోరాటం అనిపించుకుంటుంది."**

---

125–1. ఇక్కణ్ణుంచే అధ్యాయంలో ప్రస్తావించబడిన ప్రధానాంశం ప్రారంభమవుతుంది. ఎందుకంటే, ప్రవక్త మహనీయులు (స) కూర్చొని ఉన్నారు, ప్రశ్నించే వ్యక్తి నిలబడి ఉన్నాడు. ఆగ్రహం వల్లగాని, అభిమానం వల్లగాని, ఎవరైనా పోరాడితే, ఒకవేళ

## 47వ అధ్యాయం

**మినా దగ్గర రాళ్ళు రువ్వేటప్పుడు, ఏదైనా ధార్మిక సమస్యను గురించి అడగటం, దానికి సమాధానం చెప్పటం.**

**126.** అబ్దుల్లా బిన్ అమ్ర్ (రజిఅన్) ఉల్లేఖనం: నేను దైవప్రవక్త (సఅసమ్)ను జమ్‌రా అఖబా వద్ద చూశాను. ఆయన (స) గారిని ప్రజలు ధర్మ సందేహాలను గురించి అడుగుతున్నారు. ఒక మనిషి, "ఓ దైవ ప్రవక్తా!(స) నేను రాళ్ళు రువ్వ కుండానే, మరచిపోయి ఖుర్బానీ ఇచ్చాను" అని విన్నవించుకున్నాడు. దానికి మహనీయ ప్రవక్త ముహమ్మద్ (సఅసమ్), "ఫర్వాలేదు, నీవు ఇప్పుడు రాళ్ళు రువ్వు అది దోషమేమీ కాదు" అని సెలవిచ్చారు. మరొకతను ఇలా అన్నాడు, "దైవప్రవక్తా! నేను ఖుర్బానీ ఇవ్వకుండానే, పొరపాటు వల్ల తల వెంట్రుకలు తీయించుకున్నాను". సమాధానంగా ప్రవక్త (స), "ఫర్వాలేదు, ఇప్పుడు ఖుర్బానీ ఇవ్వు. అది దోషం కాదు" అని సెలవిచ్చారు. తరువాత ఆ రోజున సకాలంలో చెయ్యబడని హజ్ క్రియలను గురించి దైవప్రవక్త (స)ను ఎన్ని విషయాలైతే అడగటం జరిగిందో, వాటన్నింటికీ ఆయన(స) ఒకే ఒక సమాధానం ఇచ్చారు అది, "ఫర్వా లేదు, ఇప్పుడు చెయ్యండి. అది దోషం కాదు" అని.

## 48వ అధ్యాయం

**అల్లాహ్ సెలవిచ్చినట్లు, మీకు ప్రసాదించబడిన జ్ఞానం బహు స్వల్పమైనది.**

**127.** అబ్దుల్లా బిన్ మసూద్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : ఒకసారి నేను మహాప్రవక్త (సఅసమ్)తోపాటు మదీనా నగర శిథిలాలలో (లేదా పొలాలలో) నడుస్తూ పోతున్నాను, ఆయన తమ వద్ద ఉన్న ఖర్జూరపు బెత్తం సహాయంతో నడుస్తూ

---

ఈ ఆగ్రహం, ఈ అభిమానం ఏదైనా ప్రాపంచిక ప్రయోజనం పొందటం కోసమైతే, అది అల్లాహ్ కోసం చేసే పోరాటం (జిహాద్) కానేరదు. ఒకవేళ ఈ కోపం ధర్మం కోసమైతే, ఈ అభిమానం ధర్మం కోసమైతే, అది అల్లాహ్ మార్గంలో చేసే పోరాటం అనిపించుకుంటుంది. అందుకనే దైవప్రవక్త (స) ఎవ్వరూ ఇవ్వలేనంతటి మంచి సమాధానాన్ని, చక్కని జవాబును ఇచ్చారు. అంటే దైవధర్మం సమున్నతం కావాలి. సముజ్వలం కావాలి, అవిశ్వాసం, షిర్కుల బలం భగ్నం కావాలి అనేది పోరాటం ఉద్దేశ్యమైతే, అది జిహాద్ (పోరాటం) అనిపించుకుంటుంది. ఒకవేళ ఈ పోరాటం, ఈ లక్ష్యం ప్రాపంచిక సంపదను పొందటం కోసమయితే, రాజ్య విస్తరణ కాంక్షతో అయితే, అది జిహాద్ కాదు, కాబోదు.

ముందుకు సాగిపోతున్నారు. మార్గమధ్యంలో కొందరు యూదులు తటస్థపడ్డారు. వారు పరస్పరం, ఆయన్ని, ఆత్మను గురించి అడుగుదామని అనుకున్నారు. కాని కొందరు అడగొద్దు. ఎందుకంటే ఆయన చెప్పే విషయం మీకు అప్రియంగా ఉండవచ్చు" అని అన్నారు. కొందరు, "మేమైతే ఆయన్ని తప్పకుండా అడుగుతాం" అని అన్నారు. చివరకు వారిలోని ఒక వ్యక్తి ఇలా అడగసాగాడు; "ఓ అబుల్ ఖాసిమ్! ఆత్మ అంటే ఏమిటి?" ఇది విని ప్రవక్త మహనీయులు (స) మౌనం వహించారు. అప్పుడు, నేను ఆయన మీద దైవవాణి అవతరిస్తూ ఉన్నదేమో అని అనుకున్నాను, కనుక వెంటనే లేచి నిలబడ్డాను. దైవవాణి అవతరణాస్థితి తొలగిపోయినప్పుడు, ఆయన (స) బనీ ఇస్రాయీల్ సూరాలోని ఈ వాక్యాన్ని పఠించారు."ఓ ప్రవక్తా! ఈ ప్రజలు నిన్ను ఆత్మను గురించి అడుగుతున్నారు. ఇలా చెప్పు : ఆత్మ నా ప్రభువు యొక్క ఆజ్ఞ. కాని మీకు లభించిన జ్ఞానం బహుస్వల్పమైనది."[1] **(17: 85)**

## 49వ అధ్యాయం

## అవగాహనా లోపం వల్ల, కొందరు మరిన్ని కష్టాలపాలవుతారేమో అనే భయం వల్ల ధర్మసమ్మతమైన కొన్ని విషయాలను విడిచిపెట్టే వ్యక్తి ప్రస్తావన.

**128.** అస్వద్ ఇలా ఉల్లేఖించారు: అబ్దుల్లా బిన్ జుబైర్ (రజిఅన్) నన్ను ఇలా అడిగారు: "హజ్రత్ ఆయెషా (రజిఅన్) మీకు రహస్యంగా ఎన్నో విషయాలు

---

127-1. అంటే, దేవుడు బహుస్వల్పమైన జ్ఞానాన్ని మాత్రమే మీకు ప్రసాదించాడు. వేలాది వస్తువుల యదార్థం ఏమిటో మీకు తెలియనే తెలియదు. ఆత్మ అయితే స్పృశింప శక్యంకాని వస్తువు. స్పర్శకు అందుబాటులో ఉన్న వస్తువుల వాస్తవం కూడా మనకు తెలియదు కదా! ఒక వస్తువుకు సంబంధించిన అన్ని కార్యకలాపాలు, దాని ప్రత్యేక తలు, దాని ప్రభావాలు కూడా మనకు పూర్తిగా తెలియవు. దిక్సూచి ముల్లు కేవలం ఉత్తర దిశనే ఎందుకు సూచిస్తుందో మరొక దిక్కు వైపునకు ఎందుకు మళ్ళదో ఇంతవరకు ఏ శాస్త్రజ్ఞుడికీ తెలియదు. జంతువులు ప్రకృతి సహజమైన అలవాట్ల విషయంలో ఎవరూ నేర్పకుండానే ఎలా నేర్చుకుంటాయో, ఏ శాస్త్రవేత్తకూ ఇంత వరకూ తెలియదు. ఉదాహరణకు, నదీప్రవాహాన్ని ఎన్నడూ చూడని కుక్క నీళ్ళల్లో పడగానే ఈదటం ప్రారంభిస్తుంది . పశువుల్లో కల్లా తెలివైన పశువుగా పరిగణింపబడే మనిషి సైతం నేర్చుకోకుండా ఒక్క గజం దూరం కూడా ఈదలేడు, నీళ్ళల్లో పడగానే మునకలేస్తూ మునిగిపోతాడు. కోడి పిల్ల పుట్టంగానే నోటితో ఆహారం తింటుంది. కాని మనిషికి పుట్టే బిడ్డ చాలా కాలం వరకు అన్నం తినే సామర్థ్యం కలిగి ఉండదు.

**చెప్పేవారు కదా! కాబా గృహం గురించి కూడా ఆమె మీకేమైనా చెప్పారా?" నేను ఇలా చెప్పాను: తనతో ప్రవక్త మహనీయులు(స) ఇలా సెలవిచ్చారని హజ్రత్ ఆయెషా (ర.అ) నాకు చెప్పారు. "ఆయెషా! నీ జాతి వారు అంటే ఖురైష్ తెగవారు కొత్త ముస్లిములు కాకుండా ఉన్నట్లయితే, ఇబ్నె జుబేర్ (రజిఅన్) ప్రకారం అవిశ్వాసపు యుగం ఇప్పుడిప్పుడే అంతమవకుండా ఉన్నట్లయితే, నేను కాబాను పడగొట్టి అందులో రెండు ద్వారాలను ఏర్పాటు చేసి ఉండేవాణ్ణి; ఒక ద్వారం గుండా జనులు లోనికి ప్రవేశించటానికి, మరొకటి బయటకు పోవటానికి." తరువాత ఇబ్నె జుబైర్ (రజిఅన్) తన ప్రభుత్వ హయాంలో అలానే చేశారు.[1]**

## 50వ అధ్యాయం

## జ్ఞాన సంబంధమైన విషయాలను కొంత మందికి నేర్పటం; కొంత మందికి, వారు అర్థం చేసుకోలేరని భావించి నేర్పకపోవటం.

**హజ్రత్ అలీ (రజిఅన్) ఇలా అన్నారు: "ప్రజలకు, వారు అర్థం చేసుకోగల ధార్మిక విషయాలను మాత్రమే బోధించండి. లేకపోతే, వారు అల్లాహ్‌ను గురించి, ఆయన ప్రవక్త (స)ను గురించి కూడని విషయాలను ప్రజలకు తెలియజేసే అవకాశం ఉంది."**

**129. హజ్రత్ అలీ (రజిఅన్) గారికి చెందిన పై సూక్తిని మాకు అబ్దుల్లా బిన్ మూసా తెలియజేశారు; ఆయనకు మారూఫ్ తెలియజేశారు. ఆయనకు అబూ తుఫైల్ తెలియజేశారు.**

**130. అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : ఒకసారి హజ్రత్ మాజ్ (రజిఅన్) ప్రవక్తశ్రీ ముహమ్మద్ (సఅసమ్)తో ఒంటె మీద వెనుక కూర్చొని ప్రయాణం చేస్తున్నారు. అప్పుడు దైవప్రవక్త (స) ఆయన్ని (ర) ఉద్దేశించి, 'మాజ్!**

---

128-1. ఆయన తన పరిపాలనా కాలంలో కాబా గృహంలో రెండు ద్వారాలను ప్రతిష్ఠింపజేశారు, ఒకటి, తూర్పు దిక్కున, మరొకటి పడమర దిశలో. అనాది నుంచి ఒకే ఒక ద్వారం తూర్పు దిక్కున ఉండేది. దౌర్జన్యపరుడైన హజ్జాజ్ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజిఅన్) పట్ల ఉన్నటువంటి వైషమ్యం కారణంగా, కాబా గృహాన్ని అజ్ఞానపు కాలంలో ఉన్న విధంగానే మళ్ళీ మార్చివేశాడు, మహనీయ ప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) గారి ఫర్మానాను లెక్కచెయ్యలేదు. దురభిమానం అనేది ఒక పెద్ద ఆపద- ఇతరుల అంధ విశ్వాసాల కోసం మనం మన ఆత్మ గౌరవాన్ని మంటగలుపుకున్నట్లు.

**అని పిలిచారు. దానికి మాజ్, "దైవప్రవక్తా! (స) నేను వింటున్నాను, చెప్పండి" అని అన్నారు. ప్రవక్త మహనీయులు (స) మళ్లీ, 'మాజ్!' అని పిలిచారు. సమాధానంగా ఆయన, 'దైవప్రవక్తా! (స) నేను వింటున్నాను, సెలవియ్యండి' అని విన్నవించు కున్నారు. ఈ విధంగా ఆయన (స), మాజ్‌ని(ర) మూడు సార్లు పిలిచారు, తరువాత ఇలా సెలవిచ్చారు; "ఎవరైనా చిత్తశుద్ధితో, హృదయపూర్వకంగా, అల్లాహ్ తప్ప సత్య దైవం మరొకడెవ్వడూ లేడు, ముహమ్మద్ (సఅసమ్) ఆయన పంపిన ప్రవక్త (స) అని సాక్ష్యమిస్తే, అల్లాహ్ అతని కొరకు నరకాగ్నిని నిషేధిస్తాడు."[1] మాజ్ (ర) ఇలా విజ్ఞప్తి చేశారు: "దైవప్రవక్తా! నన్ను ఈ విషయం గురించి ప్రజలకు చెప్పమంటారా; వారు ఆనందభరితులవుతారు." దానికి ఆయన ఇలా సెలవిచ్చారు: "ఒకవేళ నీవు దీన్ని గురించి వారికి చెబితే, వారు పూర్తిగా దాని మీదనే ఆధారపడతారు[2]" తరువాత హజ్రత్ మాజ్ (రజి), మరణ సమయం ఆసన్నమైనప్పుడు, తాను పాపినైపోతానేమో అని భయపడి, ఈ విషయం గురించి ప్రజలకు తెలియజేశారు.[3]**

---

130-1. అంటే నరకాగ్నిలో శాశ్వతంగా ఉండిపోవటాన్ని అతని పక్షంలో అల్లాహ్ నిషేధిస్తాడు; ఒక ముస్లిమ్ ఎంతటి పాపాత్ముడైనా, ఎప్పుడో ఒకప్పుడు నరకం నుంచి బయటకు తీయబడతాడు. కాని దీని అర్థం ఒక ముస్లిం నరకానికి అసలు పోడు అని ఎంత మాత్రం కాదు. ఎందుకంటే అహ్‌లె సున్నత్ వర్గీయుల్లో ఈ విషయం గురించి ఏకాభిప్రాయం ఉంది: ముస్లిముల వర్గం ఒకటి నరకానికి పోతుంది కాని ఆ తరువాత ప్రవక్త మహనీయుని (స) సిఫారసు కారణంగా, ఆ వర్గం బయటి కొచ్చేస్తుంది. కొంత మంది ఏమన్నారంటే, ఈ హదీసులో ప్రస్తావించబడిన ముస్లిములు సత్కార్యాలు చెయ్యటంతో పాటు ఇటువంటి సాక్ష్యం ఇచ్చినవారు లేదా పాపాలు చేసి పశ్చాత్తాపపడి మరణించినవారు. ఈ హదీసు ఆధారంగా ఇమామ్ బుఖారీ (ర.అలై) గారు ఒక నిర్ణయం చేశారు. అదేమిటంటే, ధర్మానికి సంబంధించిన కొన్ని విషయాలను ప్రజలకు చెప్పకూడదు. దైవప్రవక్త (స) హజ్రత్ మాజ్ (ర)ను, ఈ హదీసును గురించి ప్రజలందరికీ చెప్పవద్దని వారించారు కదా!

130-2. వారు సత్కార్యాలు చెయ్యటం మానేస్తారు, కేవలం సత్యవచనానికి సాక్ష్యమివ్వటం తోనే సరిపెట్టుకుంటారు, తృప్తి చెందుతారు. ముస్లిములకు చెందిన మర్‌హబా ఫిర్ఖా వారు ఇలానే చేశారు. వారేమంటారంటే, విశ్వాసం అనేది మనిషిలో ఉంటే, ఎటువంటి పాపాలైనా అతనికి నష్టాన్ని కలిగించలేవు, ముస్లిం అయినవాడు ఎన్నటికీ నరకంలోకి పోడు.

130-3. జ్ఞానాన్ని దాచిపెట్టడం పాపమనీ, నేను పాపాత్ముడనైపోతానేమో అని హజ్రత్ మాజ్ (ర) భయపడ్డారు. అయితే ఈ దాచిపెట్టడం అనేది దైవప్రవక్త (స) ఆదేశాను

**131.** దైవప్రవక్త (సఅసమ్) మహనీయులు హ్రజత్ మాజ్ (రజిఅన్)కు ఇలా బోధించారని హ్రజత్ అనస్ (ర) ఉల్లేఖించారు: "(ప్రాపంచిక జీవితంలో) అల్లాహ్‌కు సహవర్తుల్ని కల్పించని[1] వ్యక్తి తాను అల్లాహ్‌ను కలుసుకున్నప్పుడు, స్వర్గంలో ప్రవేశి స్తాడు." హ్రజత్ మాజ్ (ర), 'ఈ శుభవార్తను నేను ప్రజలకు చెప్పవచ్చునా' అని దైవప్రవక్త(స)ను అడిగారు. దానికి ఆయన(స), "వద్దు. వారికి చెప్పవద్దు. వారు దాని మీదనే పూర్తిగా ఆధారపడతారేమో అని నా భయం" అని సెలవిచ్చారు.

## 51వ అధ్యాయం
## ధర్మజ్ఞానం నేర్చుకునే విషయంలో సిగ్గుపడటం.[1]

**ముజాహిద్ ఇలా అన్నారు: "సిగ్గుపడే వ్యక్తికి, గర్విష్టి అయిన మనిషికి ధర్మజ్ఞానం అబ్బదు."**

**హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) ఇలా అన్నారు: "అన్సారీ స్త్రీలు ఎంత మంచివారు. ధర్మజ్ఞానం నేర్చుకునే విషయంలో సిగ్గు వారికి అడ్డుగోడగా నిలవలేదు."[2]**

**132.** ఉమ్మె సలమా (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు: ఉమ్మె సులైమ్ (హ్రజత్ అనస్ గారి తల్లి) దైవప్రవక్త (సఅసమ్) వద్దకు వచ్చి "ఓ ప్రవక్తా! సత్యం గురించి చెప్పే విషయంలో అల్లాహ్ సిగ్గుపడడు కదా! వీర్యస్ఖలనం జరిగినప్పుడు స్త్రీ తలంటి స్నానం చెయ్యవలసిందేనా?" అని అడిగారు. దానికి సమాధానంగా, ప్రవక్త (స) మహనీయులు ఇలా సెలవిచ్చారు: "అవును. ఆమె గనక, మేల్కొన్న తరువాత, వీర్యాన్ని చూసినట్లయితే, తలంటి స్నానం తప్పనిసరిగా చెయ్యాలి." ఇది విని ఉమ్మె సలమా (ర.అ) సిగ్గుతో తమ ముఖాన్ని దాచుకున్నారు. ఆమె ఇంకా ఇలా అడిగారు: "ఓ ప్రవక్తా (సఅసమ్) స్త్రీకి కూడా వీర్యస్ఖలనం అవుతుందా?" దానికి ఆయన, "అవును, అవుతుంది. నీ చేతులకు మన్ను తగల! లేకపోతే, శిశువుకు తల్లి పోలికలు ఎలా వస్తాయనుకున్నావ్?" అని సెలవిచ్చారు.[1]

---

సారమే జరిగింది కదా అనే సందేహం కలుగుతుంది. దానికి సమాధానం ఇది: ప్రవక్త మహనీయులైతే, సత్యవచనానికి సాక్ష్యమివ్వటమనే విషయం మీదనే పూర్తిగా ఆధార పడేవారికి మాత్రమే ఈ హదీసును గురించి చెప్పవద్దని వారించారేగాని, అలా చెయ్యని వారికి చెప్పవద్దని కాదు. మరణ సమయంలో ఇటువంటి వారికే బహుశా హ్రజత్ మాజ్ (రజి) ఈ హదీసును గురించి చెప్పి ఉంటారు.

131–1. అంటే ఒకే దైవాన్ని విశ్వసించేవాడై ఉండాలి, అల్లాహ్ ఆజ్ఞలన్నింటినీ నమ్మేవాడై ఉండాలి.

51–1. ధార్మిక విషయాలు నేర్చుకునే విషయంలో సిగ్గుపడటం మంచి లక్షణం కాదు. అది మనస్సు యొక్క బలహీనతకు, పిరికితనానికి నిదర్శనం తప్ప మరేమీ కాదు.

**133.** అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సఅసమ్) మహనీయులు ఇలా సెలవిచ్చారు: "వృక్షాలలో ఒక వృక్షం ఉంది. దాని ఆకులు రాలవు. అది ఒక ముస్లిమ్ లక్షణాలు కల వృక్షం. అది ఏ వృక్షమో నాకు చెప్పండి". ఇది విన్న తరువాత ప్రజల ఆలోచనలు అడవి వృక్షాల వైపునకు పరుగెత్తాయి. "అది ఖర్జూరపు వృక్షం అయి ఉండాలి అనే ఆలోచన నా మనస్సులో మెదిలింది. కాని నేను సిగ్గుపడి ఆ విషయాన్ని చెప్పలేకపోయాను" అని అబ్దుల్లా అన్నారు. చివరకు ప్రజలు, "ఓ ప్రవక్తా! అది ఏ వృక్షమో మీరే చెప్పండి" అని అడిగారు. ప్రవక్త మహనీయులు(స), "అది ఖర్జూరపు వృక్షం" అని సెలవిచ్చారు. అప్పుడు అబ్దుల్లాహ్, "నా మనస్సులో వచ్చిన ఆలోచనను గురించి నేను నా తండ్రి హజ్రత్ ఉమర్ (రజి అన్)కు చెప్పాను" అని అన్నారు. దానికి హజ్రత్ ఉమర్, "నీవు గనక అప్పుడే ఆ విషయాన్ని గురించి చెప్పి ఉన్నట్లయితే, గొప్ప సంపద దొరికితే లభించే ఆనందం కంటే ఎక్కువ ఆనందాన్ని అనుభవించి ఉండేవాణ్ణి" అని అన్నారు.

## 52వ అధ్యాయం

### ఏదైనా విషయం గురించి సిగ్గు వల్ల తాను అడగలేకపోతే, ఇతరుల చేత అడిగించటం.

**134.** హజ్రత్ అలీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: నాకు మజీ[1] ఎక్కువగా వస్తూ ఉంటుంది. నేను మిఖ్దాద్‌ను ఈ సమస్యను[2] గురించి ప్రవక్త (స) మహనీయుని అడగమని కోరాను. ఆయన దైవప్రవక్తను ఈ విషయం గురించి అడిగారు. అప్పుడు ఆయన (సఅసమ్), "మజీ[3] వెలువడినప్పుడు వుజూ తప్పనిసరిగా చేసుకోవాలి" అని అన్నారు.

---

51–2. వారు ప్రపంచ మహిళలకు చేసిన మహోపకారం ప్రళయం వచ్చే వరకు ఉంటుంది. ఎందుకంటే వారి వల్లనే ఇతర స్త్రీలు ఎన్నో ధార్మిక విషయాలను గురించి తెలుసుకున్నారు.

132–1. నీ చేతులకు మన్ను తగల! అంటే నీవు నిస్సహాయురాలైపోవుగాక అని అర్థం. ఇది శాపనార్థం (బద్దుఆ) కాదు. కోపం వచ్చినప్పుడుగాని, విచారాన్ని వ్యక్తం చేయవలసి వచ్చినప్పుడు గాని అరబ్బులు వాడే పదప్రయోగం. ప్రవక్త (స)గారి భావం ఏమిటంటే, స్త్రీలలో కూడా వీర్యం ఉంటుంది, పిల్లవాడి శారీరక నిర్మాణంలో అది కూడా భాగం పంచుకుంటుంది. లేకపోతే బిడ్డ ముఖం ఎల్లప్పుడూ తండ్రి ముఖాన్నే పోలి ఉంటుంది, తల్లి పోలికలు దానికి ఉండవు. కాకపోతే ఎవరి వీర్యం ప్రాబల్యం వహిస్తుందో, వారి పోలికలు ఎక్కువగా ఉంటాయి.

134–1. మజీ అంటే కామవాంఛ రగిలినప్పుడు పురుషాంగం నుంచి వెలువడే ఒక ద్రవ పదార్థం. దాని స్ఖలనం వల్ల కామవాంఛ తీవ్రత పెరుగుతుంది.

## 53వ అధ్యాయం

## మసీదులో ధర్మజ్ఞానానికి సంబంధించిన విషయాలను గురించి మాట్లాడు కోవటం, ధార్మిక తీర్పులు చెప్పటం.[1]

**135.** అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా చెప్పారని ఆయన గారి బానిస అయిన నాఫే ఉల్లేఖించారు: ఒక వ్యక్తి మస్జిదె నబవీ (ప్రవక్త (స) మసీదు)లో నిలబడి, ఇలా అడిగాడు: "ఓ దైవప్రవక్తా (సఅసమ్)! మేము హజ్‌కు సంబంధించిన ఇహ్‌రామ్‌ను ఎక్కణ్ణుంచి కట్టుకోవాలి, ఈ విషయంలో మీ ఆజ్ఞ ఏమిటి?" దానికి సమాధానంగా ఆయన (స) ఇలా సెలవిచ్చారు : "మదీనా నుంచి హజ్‌కు వెళ్ళే ప్రజలు జుల్‌హులైఫా నుంచి[1] ఇహ్రామ్ కట్టుకోవాలి, సిరియా నుంచి హజ్‌కు వెళ్ళేవారు జుహ్‌ఫా నుంచి ఇహ్రామ్ కట్టుకోవాలి; నజ్ద్ నుంచి హజ్‌కు వెళ్ళేవారు ఖర్న్ నుంచి ఇహ్రామ్ కట్టుకోవాలి." ఇబ్నె ఉమర్ (రజిఅన్) ఇంకా ఇలా అన్నారు: "దైవప్రవక్త (సఅసమ్) ఇలా కూడా సెలవిచ్చారని ప్రజలు అన్నారు. యమన్ నివాసులు యలమ్‌లమ్ నుంచి ఇహ్రామ్ కట్టుకోవాలి."[2] ఇబ్నె ఉమర్ (రజిఅన్) ఇలా

---

134-2. మరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది: స్వయంగా నేనే, దైవప్రవక్త (స)ను ఈ సమస్యను గురించి అడగటానికి సిగ్గుపడ్డాను. ఎందుకంటే, ఆయన (స) గారి కుమార్తె (ర) నా భార్య కదా! ఇలా సిగ్గుపడటం అనేది దోషం కాదు. ఎందుకంటే, సమస్యను గురించి అడగటం ముఖ్యం, అవసరం. కాకపోతే ఈ ఉద్దేశం ఇతరులచే అడిగించటం ద్వారా తీరిపోయింది.

134-3. అంటే, మజీ వెలువడటం వల్ల, వుజూ తప్పనిసరిగా చేసుకోవాలి; గుసుల్ అవసరం లేదు.

53-1. అంటే మసీదులో ధర్మజ్ఞానం నేర్చుకోవటం, నేర్పటం ధర్మసమ్మతమైన విషయమే. ఇదే విధంగా ధార్మిక తీర్పులు చెప్పటం, షరీఅత్ వెలుగులో కేసులు పరిష్కారం చెయ్యటం కూడా ధర్మసమ్మతమే, కంఠస్వరాన్ని పెంచి బిగ్గరగా మాట్లాడినా సరే. ఎందుకంటే ఈ పనులన్నీ ఆరాధన కిందకే వస్తాయి. ఇదేవిధంగా మసీదులో ధార్మిక చర్చలు జరపటం కూడా ధర్మసమ్మతమే.

135-1. జుల్ హులైఫా ఒక స్థలం పేరు. ఈ హదీసు ప్రస్తావన, ఇన్షాఅల్లాహ్, 'కితాబుల్ హజ్'లో వస్తుంది. ఇమామ్ బుఖారీ గారు ఈ విషయాన్ని ఈ అధ్యాయంలో ఎందుకు తీసుకువచ్చారంటే, ఆ వ్యక్తి ధార్మిక విషయం గురించి దైవప్రవక్తను మసీదులో అడిగాడు. ఆయన (స) దానికి సమాధానం మసీదులోనే ఇచ్చారు. అతని పేరేమిటో తెలియదు.

**అంటూ వుండేవారు: "యమన్ నివాసులు యలమ్‌లమ్ నుంచి ఇహ్రామ్ కట్టుకోవాలి" అని ప్రవక్త మహనీయులు (స) అన్నట్టు నేను స్పష్టంగా వినలేదు.**[3]

## 54వ అధ్యాయం

## అడిగేవాడు అడిగినదాని కన్నా ఎక్కువ జవాబు చెప్పటం.

**136. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: "ఒక మనిషి దైవ ప్రవక్త(స)ను, ఇహ్రామ్ కట్టుకునే వ్యక్తి ఎలాంటి వస్త్రాన్ని ధరించాలి" అని అడిగాడు. దానికి సమాధానంగా ఆయన (స) ఇలా సెలవిచ్చారు: "అతను చొక్కా తొడుక్కో కూడదు. తలపాగ కట్టుకోకూడదు, పైజామా తొడుక్కోకూడదు[1] టోపీ పెట్టుకో కూడదు. జాఫ్రాని లేక పరిమళ ద్రవ్యాలు రాసిన వస్త్రాన్ని ధరించకూడదు, ఒకవేళ తొడుక్కోవటానికి చెప్పులు లేకపోతే, తోలుతో చేసిన మేజోళ్ల తొడుక్కోవచ్చు. అయితే చీల మండలు కనిపిస్తూ ఉండాలి, మేజోళ్లను వాటి కింది వరకు కత్తిరించుకోవాలి."**[2]

---

135–2. అల్‌జుహ్‌ఫా, ఖర్న్, యలమ్‌లమ్– ఇవన్నీ స్థలాల పేర్లు. ఇండియా నుంచి హజ్‌కు వెళ్లేవారి మీఖాత్ (ఇహ్రామ్ కట్టుకునే స్థలం) కూడా యలమ్‌లమే. కనుక వారు అక్కణ్ణుంచే ఇహ్‌రామ్ కట్టుకోవాలి. ఈ హదీసుకు సంబంధించిన మిగతా చర్చ ఇన్షాఅల్లాహ్ కితాబుల్ హజ్‌లో వస్తుంది.

135–3. ఒక హదీసును ఉల్లేఖించటంలో హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఎంత జాగ్రత్త తీసుకునేవారో, ఎంత బాధ్యతతో వ్యవహరించేవారో దీని ద్వారా నిరూపిత మవుతోంది. ఏ పదమైతే బాగా జ్ఞాపకముండదో, దాన్ని ఆయన ఉల్లేఖించేవారు కారు.

136–1. బుర్నస్ (టోపీ) అంటే పూర్వకాలంలో ప్రజలు ధరించే పొడుగాటి టోపి అని కొందరు విశ్లేషించారు. మరికొందరు అది బారాన్‌కోట్ (రైన్‌కోటు) అని అనువాదం చేశారు. అసలు విషయమేమిటంటే, ముహ్రిమ్, కుట్టిన వస్త్రాన్ని ధరించకూడదు, ఇంకా శిరస్సును, పాదాలను దాచకూడదు.

136–2. అడిగేవాడు, ముహ్రిమ్ (ఇహ్రామ్ కట్టుకున్న వ్యక్తి) ఎటువంటి దుస్తులు ధరించాలి అని అడిగాడు. దానికి ప్రవక్త మహనీయులు (స) ఫలానా దుస్తులు ధరించకూడదు అని సమాధానం చెప్పారు. దీని ద్వారా స్పష్టమైన విషయమేమిటంటే, మిగతా వస్త్రాలు ధరించవచ్చు అని. కనుక ఇక్కడ సమాధానం ప్రశ్నకంటే ఎక్కువగా ఉంది. ఎందుకంటే ముహ్రిమ్ ఏం ధరించకూడదు అనే విషయం ప్రశ్నలో లేదు.

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

# 'వుజూ' ప్రకరణం★

## 1వ అధ్యాయం

**ఖురాను గ్రంథంలోని అల్ మాఇదా సూరాలో కరుణామయుడైన అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "విశ్వసించిన ప్రజలారా! మీరు నమాజు చెయ్యటానికి నిలబడి నప్పుడు, మీ ముఖాలను, మోచేతుల సమేతంగా మీ చేతులను పరిశుభ్రంగా కడు క్కోండి, మీ తలలను చేతులతో మసా చేసుకోండి, మీ కాళ్ళను చీలమండలాల వరకు కడుక్కోండి." ప్రవక్త మహనీయులు(స) కూడా ఒక హదీసులో ఇలా సెలవిచ్చారు: వుజూ చేసుకునేటప్పుడు నిర్ణీత శరీర భాగాలను కనీసం ఒకసారైనా కడగటం విధి (ఫర్జ్).[1] ప్రవక్తశ్రీ (స) వుజూ చేసుకునేటప్పుడు తమ శరీర భాగాలను రెండేసిసార్లు పరిశుభ్రం చేసుకున్నారు.[2] మూడేసి సార్లు కూడా ఆయన (స) తమ శరీర భాగాలను కడుక్కున్నారు. మూడు సార్లు[3] కంటే అధికంగా మటుకు ఆయన (స) పరిశుభ్రపరచు కోలేదు. వుజూ చేసుకునేటప్పుడు నీళ్లను వృథా చెయ్యటాన్ని, ప్రవక్త శ్రీ(స) ఎంత చేశారో అంతకంటే ఎక్కువ చెయ్యటాన్ని మత విద్వాంసులు అప్రియమైనదిగా భావించారు.**

---

★ విశ్వాసం, జ్ఞానాలకు సంబంధించిన విషయాలను నేర్చుకున్న తరువాత, వుజూ, తహారత్‌లకు సంబంధించిన విషయాలు వస్తున్నాయి. ఎందుకంటే, విశ్వాసం తరువాత అన్ని విధులకంటే, నమాజు అత్యంత ప్రధానమైనది, అత్యంత ప్రముఖ మైనది. తహారత్‌లేని నమాజు స్వీకారయోగ్యమైన, నిజమైన నమాజు కాదు.

1-1. ఈ హదీసును స్వయంగా ఇమామ్ బుఖారీ (ర.అ) గారే తరువాత ప్రస్తావిస్తారు, హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) గారి ఉల్లేఖనం ప్రకారం .

1-2. ఈ హదీసు కూడా ముందు రాబోతోంది.

1-3. అబూ దావూద్ గారి ఉల్లేఖనం ప్రకారం, ప్రవక్త మహనీయులు (స) వుజూ చేశారు,

## 2వ అధ్యాయం

### వుజూ లేకుండా నమాజు స్వీకార యోగ్యమైనది కాదు;[1]

**137.** హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) గారు, దైవప్రవక్త మహనీయులు(స) ఇలా సెలవిచ్చారని ఉల్లేఖించారు: "ఎవరయితే హదస్ (అపాన వాయువు వెలువడడం లాంటి అశుద్ధత)కు లోనవుతారో వారి నమాజు స్వీకరించబడదు. వారు వుజూ చేసుకోవాలి;[1] అప్పుడే వారి నమాజుకు దైవామోదం లభిస్తుంది. హజర్‌మౌత్ నివాసి అయిన ఒక వ్యక్తి, "ఓ అబూ హురైరా! హదస్ అంటే ఏమిటి?" అని అడిగాడు. దానికి ఆయన సమాధానంగా, హదస్ అంటే అపాన వాయువు[2] వెలువడటం అని చెప్పారు.

## 3వ అధ్యాయం

### వుజూ యొక్క ఘనత, శ్రేష్ఠత. ప్రళయం నాడు వుజూ గుర్తుల కారణంగా ముస్లిముల నుదుర్లు, చేతులు, కాళ్లు తెల్లగా మెరుస్తూ ఉంటాయి.

**138.** నుఅయిమ్ బిన్ అబ్దుల్లా ముజ్‌మిర్ ఇలా ఉల్లేఖించారు : నేను అబూ హురైరా (రజిఅన్)తో కలిసి ప్రవక్త (స) గారి మసీదు కప్పు మీదకు ఎక్కాను. ఆయన (ర) వుజూ చేసుకున్నారు. ఇలా అన్నారు. ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిస్తూ ఉండగా నేను విన్నాను, "నా సంఘ ప్రజలు ప్రళయ దినం నాడు పిలవబడతారు.

---

శరీర భాగాలన్నింటినీ మూడేసి సార్లు పరిశుభ్రపరచుకున్నారు. తరువాత ఆయన (స) ఇలా సెలవిచ్చారు: "ఎవరైనా ఇంతకంటే ఎక్కువగా చేస్తే లేదా తక్కువగా చేస్తే, వారు తప్పు చేశారు, అన్యాయం చేశారు." ఇబ్నె ఖుజైమా ఉల్లేఖనంలో "ఎక్కువగా చేస్తే" అని మాత్రమే ఉంది. ఇదే సరైనది, సహేతుకమైనది. ఎందుకంటే, మూడుసార్లకంటే తక్కువగా పరిశుభ్రపరచుకోవటం పండితుల ఏకాభిప్రాయం ప్రకారం దోషం కాదు.

2-1. ఈ అధ్యాయంలోని విషయం ఒక హదీసులో కూడా వచ్చింది. దానిని తిర్మిజీ మొదలైన వారు ఇబ్నె ఉమర్ (రజిఅన్)గారి ఉల్లేఖనం ప్రకారం ఉటంకించారు. అదేమిటంటే, తహారత్ లేని నమాజు స్వీకారయోగ్యమైనది కాదు; దొంగ సొమ్ములో నుంచి దానం చేస్తే అది స్వీకరించబడదు. అయితే ఇమామ్ బుఖారీ గారు, ఈ హదీసు తన షరతులకు అనుగుణంగా లేదని భావించి ఇక్కడ పేర్కొనలేదు.

137-1. అంటే వుజూ చేసుకోవాలి, ఆ తరువాతే నమాజు చెయ్యాలి. హదస్ (తేలికపాటి అశుద్ధ) స్థితిలో నమాజు చెయ్యటం సరైనది కాదు, సక్రమమైనది కాదు.

137-2. హదస్ అంటే రెండు మార్గాల ద్వారా అంటే వెనుక నుంచీ, ముందు నుంచీ వెలువడేది అని భావం. వీటినే అరబ్బీ భాషలో సబీలైన్ అంటారు. కనుక ఇతర విషయాల కారణంగా వుజూ భంగం కాదు. ఈ ఉల్లేఖనం ద్వారా ప్రజలు పైవిధంగా అర్థం చేసుకున్నారు.

**వుజూ గుర్తుల వల్ల వారి నుదుర్లు, చేతులు, కాళ్లు తెల్లగా ప్రకాశిస్తూ ఉంటాయి. ఇక మీలో ఎవరైనా (తెల్లగా మెరిసే) తమ వెలుగును పెంచుకోదలిస్తే, మరింత పెంచుకోవచ్చు."[1]**

## 4వ అధ్యాయం

## అనుమానం వల్ల వుజూ భంగం కాదు; అపాన వాయువు వెలువడిందనే గట్టి నమ్మకం కలిగితే తప్ప.

**139. అబ్బాద్ బిన్ తమీమ్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: మా బాబాయి అబ్దుల్లా బిన్ జైద్ (రజిఅన్), నమాజులో ఉన్నప్పుడు అపాన వాయువు వెలువడు తుందనే అనుమానం కలిగిన ఒక వ్యక్తిని గురించి దైవప్రవక్తను (సఅసం) అడిగారు. దానికి సమాధానంగా ఆయన (స) ఇలా సెలవిచ్చారు: "అతను నమాజులో నుంచి అర్థాంతరంగా లేచి పోకూడదు; అపాన వాయువు శబ్దాన్ని వింటే తప్ప లేదా దుర్వా సన అనుభూతి కలిగితే తప్ప".[1]**

## 5వ అధ్యాయం

## తేలికపాటి వుజూ చేసుకోవటం.[1]

**140. అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజిఅన్) ఇలా చెప్పారని కురైబ్ బిన్ అబీ ముస్లిమ్ ఉల్లేఖించారు: దైవప్రవక్త మహనీయులు (సఅసం) నిద్రపోయారు; గురకలు**

---

138–1. చేతుల్ని మోచేతుల వరకు కడుక్కోవాలి. కాళ్లను చీల మండలాల వరకు కడుక్కో వాలి. ఈ హదీసు ద్వారా తెలిసే మరొక విషయమేమిటంటే, మసీదు కప్పు పైకి ఎక్కటం తప్పు కాదు. కాని మసీదుకు నష్టం, తోటి ముస్లిమ్ సోదరులకు కష్టం కలక్కూడదు.

139–1. అంటే అపాన వాయువును గురించి గట్టి నమ్మకం ఏర్పడనంత వరకు, నమాజును విడిచి పెట్టకూడదు, వుజూ చేసుకోవటానికి వెళ్లకూడదు. ఇది సాధారణ ఆదేశం, ఇది నమాజు స్థితిలో ఉన్నప్పుడు కూడా వర్తిస్తుంది, నమాజులో కూడా వర్తిస్తుంది. కొంతమంది నమాజుకే పరిమితం చేశారు. ఇమామ్ నవవీ ఈ హదీసు ద్వారా ఒక సూత్రం ఉద్భవిస్తుంది అని అన్నారు. అదేమంటే, తప్పకుండా జరుగు తుందనే నమ్మకం ఉన్న పని అనుమానం వల్ల వృధా అయిపోదు. ఉదాహ రణకు, ప్రతి భూమీ, ప్రతి స్థలం పరిశుభ్రమైనదే. ఇక ఒకవేళ అది పరిశుభ్రంగా లేదు అనే అనుమానం కలిగినా, దానిని పరిశుభ్రమైనదిగానే భావించవలసి ఉంటుంది.

5–1. తేలికపాటి వుజూ అంటే అర్థం, శరీర అవయవాల మీద నీళ్ళను కేవలం ప్రవహింప జేయటం, ఇంకా వాటిని తోముకోకూడదు లేదా అవయవాలను కేవలం ఒక్కసారి

పెట్టే అంత గాఢంగా నిద్రపోయారు. తరువాత ఆయన (స) నమాజు చేశారు. సుఫ్యాన్ ఇలా ఉల్లేఖించారు : ఆయన (స) పక్కకు తిరిగి పడుకున్నారు. గురకలు పెట్టసాగారు. తరువాత నమాజు చేశారు. అలీ ఇలా చెప్పారు : ఆ తరువాత సుఫ్యాన్ ఒకప్పుడు పొడగాటి పెద్ద హదీసును వినిపించారు. మరొకప్పుడు చిన్న, సంక్షిప్తమైన హదీసును వినిపించారు. ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా అన్నారు : ఒక రాత్రి నేను మా పిన్నమ్మ, విశ్వాసుల తల్లి అయిన మైమూన (రజిఅన్) ఇంట్లో ఉన్నాను. ప్రవక్త మహనీయులు (సఅసం) మేల్కొన్నారు (లేదా నిద్ర పోతున్నారు). అప్పుడు కాస్త రాత్రి మాత్రమే మిగిలి ఉంది. ఆయన నిలబడి, వ్రేళ్లాడుతున్న ఒక పాత నీళ్ల సంచిలో నుంచి నీళ్లు తీసుకుని తేలికపాటి వుజూ చేసుకున్నారు. అమ్ర్ బిన్ దీనార్ ఈ వుజూ యొక్క తేలికపాటితనాన్ని దాని కొద్దిపాటితనాన్ని గురించి అభివర్ణిస్తూ ఉండేవారు.[1] తరువాత ఆయన (సఅసమ్) నిలబడి నమాజు చెయ్యసాగారు. నేను కూడా ఆయన (స) గారి మాదిరిగానే వుజూ చేసుకున్నాను, తరువాత ఆయన గారి ఎడమ ప్రక్కన నమాజు కోసం నిలుచున్నాను. కాని ఆయన (స) నన్ను లాగి తమ కుడి ప్రక్కన నిలబెట్టుకున్నారు. తరువాత అల్లాహ్ అనుజ్ఞ ప్రకారం నమాజు చేశారు. దాని తరువాత ఒక ప్రక్కకు తిరిగి పడుకున్నారు, ఎంత గాఢంగా నిద్రపోయారంటే, గురకలు పెట్టసాగారు. ఆ తరువాత మౌజను వచ్చి, నమాజు కోసం ఆయన (స) గారిని లేపాడు; అప్పుడు ఆయన (స) అతనితో నమాజు కోసం వెళ్లిపోయారు. నమాజు చేశారు, కాని వుజూ చేసుకోలేదు.[2] సుఫ్యాన్ ఇలా అన్నారు: "నేను అమ్ర్‌తో ఇలా అన్నాను: దైవప్రవక్త(స)గారి కళ్లు నిదురపోతాయి కాని ఆయన గారి హృదయం మటుకు నిద్రపోదు అని కొందరు అంటారు. అమ్ర్ ఇలా అన్నారు. నేను ఉబైద్ బిన్ ఉమైర్[3] ఇలా చెప్పగా విన్నాను. ఆయన ఏమని చెప్పేవారంటే, దైవప్రవక్తల

---

మాత్రమే కడుక్కోవటం లేదా నీరు ఎక్కువగా ప్రవహించకుండా కడుక్కోవటం, ఒకటి రెండు చుక్కలు ప్రతి అవయవం మీద ప్రవహించటం.

140–1. తేలికపాటితనం అంటే బాగా తోమి కడుక్కోలేదు, నీళ్లను ఎక్కువగా ప్రవహింప జేయలేదు అని భావం. కొద్దిపాటితనం అంటే అవయవాలను ఒకేసారి కడుక్కున్నారు.

140–2. దీని ద్వారా తెలిసే విషయమేమిటంటే, నిద్రపోవటం హదస్ కాదు. కాని ఇందులో అజాగ్రత్తకు, అశ్రద్ధకు అవకాశం ఉంది. కాబట్టి హదస్‌కు సంబంధించిన అనుమానం కలుగుతుంది. ఈ కారణంగా నిద్రపోవటాన్ని హదస్‌గా భావించటం జరిగింది. ప్రవక్త మహనీయుల (స) విషయంలో ఆయన గారు నిద్రపోతే అశ్రద్ధ

**కలలు వహీ (దైవవాణి) అవుతాయి. తరువాత సాఫ్ఫాత్ సూరాలోని ఈ వాక్యం చదివారు.[4] “కుమారా! నేను నిన్ను బలి ఇస్తున్నట్లు కలలో చూశాను.”**

## 6వ అధ్యాయం

**పరిపూర్ణమైన వుజూకు సంబంధించిన ప్రస్తావన. ఇబ్నె ఉమర్ (రజిఅన్), వుజూను, పరిపూర్ణంగా చేసుకోవటం అంటే శరీర అవయవాలను పూర్తిగా పరిశుభ్రంగా కడుక్కోవటం అని చెప్పారు.[1]**

**141. ఉసామా బిన్ జైద్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : దైవప్రవక్త మహనీయులు (సఅసం) అరఫాత్ నుంచి తిరుగు ప్రయాణం కట్టారు. పర్వత మార్గం దగ్గరకు వచ్చి (ఈ మార్గం నుంచి హాజీలు వెళతారు) తమ ఒంటె మీద నుంచి కిందికి దిగారు, ఒంటేలుకు వెళ్లారు(మూత్ర విసర్జనం చేశారు). తరువాత వుజూ చేసుకున్నారు, కాని పూర్తి వుజూ చేసుకోలేదు.[1] దైవప్రవక్తా! నమాజు చేసుకోండి అని నేను అన్నాను. దానికి ఆయన (స) కొంచెం ముందుకు పోయిన తరువాత నమాజు**

---

అనేది జరగదు. ఇందుకని ఆయన (స) గారి విషయంలో నిద్ర పోవటం హదస్ కానేకాదు.

140–3. ఈయనగారు తాబయీన్‌లలో పెద్దవారు.

140–4. ఇది హజ్రత్ ఇబ్రాహీమ్ (అస్సలామ్) తమ కుమారుడు హజ్రత్ ఇస్మాయీల్ (అస్సలామ్)తో అన్న విషయం. దాన్నే అల్లాహ్ ఇక్కడ ప్రస్తావించాడు. ఈ విషయానికి సంబంధించిన గాధ సుప్రసిద్ధమైనది. హజ్రత్ ఉబైద్‌గారు ఈ గాధను గురించి విశ్లేషించారు: హజ్రత్ ఇబ్రాహీమ్ (అస్సలామ్) స్వప్నాన్ని చూశారు, కాని ఆయన దాన్ని దైవాజ్ఞగా భావించారు. దాని ప్రకారం ఆయన హజ్రత్ ఇస్మాయీల్ (అస్సలామ్)ను బలి ఇవ్వటానికి సంసిద్ధులయ్యారు, కనుక విశదయయ్యే విషయమేమిటంటే, దైవప్రవక్తల స్వప్నాలు వహీ (దైవవాణి) అవుతాయి. దీని ద్వారా తెలిసిన విషయమేమిటంటే, దైవప్రవక్తలు నిద్రపోతారు, కాని అజాగ్రత్తగా, అశ్రద్ధగా ఉండరు. వారి హృదయాలు మేల్కొని ఉంటాయి. కనుక మహనీయ ప్రవక్త ముహమ్మద్ (స) గారి కళ్లు నిద్రపోతాయి, హృదయం నిద్రపోదు.

6–1. అంటే తోముకోవటం, రుద్దుకోవటం, పరిశుభ్రంగా కడిగి మట్టీ మురికి లేకుండా చెయ్యటం. ఒక ఉల్లేఖనంలో ఇలా ఉంది: అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) తమ కాళ్లను ఏడేసి సార్లు కడుక్కునేవారు. ఎందుకంటే కాళ్లల్లో మట్టీ మురికి ఎక్కువగా పేరుకుంటుంది.

**చేసుకుందాం[2] అని సమాధానం చెప్పారు. ఆ పైన ఆయన (స) తమ ఒంటె మీద కూర్చున్నారు. ముజ్దలిఫాకు చేరుకున్నప్పుడు, వాహనం మీద నుంచి కిందకు దిగారు. వుజూ చేసుకున్నారు, పూర్తి వుజూ చేసుకున్నారు.[3] తరువాత నమాజు పిలుపు వినగానే, మగ్రిబ్ నమాజు చేశారు. ఆ తరువాత ప్రతి వ్యక్తి తన ఒంటెను, అది ఆగి ఉన్న స్థలంలోనే, మోకాళ్ల మీద కూర్చునేలా చేశాడు. అప్పుడు ఇషా నమాజుకు పిలుపు ఇవ్వబడింది. ప్రవక్త మహనీయులు(స) ఇషా నమాజుకు నాయకత్వం వహించారు. ఈ రెండు నమాజుల మధ్య కాలంలో మరొక నమాజు ఏదీ ఆయన (స) చెయ్యలేదు.[4]**

**142. అతా ఇబ్నె యసార్ ఉల్లేఖనం ఇలా ఉంది: ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) వుజూ చేసుకున్నారు, తమ ముఖాన్ని కడుక్కున్నారు; ఎలా అంటే, ఒక చేతినిండా నీళ్లు తీసుకున్నారు, ఆ నీటితో పుక్కిలించి ఊశారు, ముక్కులోకి ఎక్కించి పరిశుభ్రపరచుకున్నారు.[1] తరువాత మరొకసారి చేతినిండా నీళ్లు తీసుకుని, దాన్ని కిందికి వంచి రెండో చేతిలో నీళ్లు పోసుకున్నారు, ఆ తరువాత రెండు చేతులతో తమ ముఖాన్ని[2] కడుక్కున్నారు. మళ్లీ ఒక చేతి నిండా నీళ్లు తీసుకున్నారు, ఆ నీళ్లతో తమ కుడి చేతిని కడుక్కున్నారు. మళ్లీ ఒక చేతినిండా నీళ్లు తీసుకున్నారు, ఆ నీళ్లతో తమ ఎడమ చేతిని కడుక్కున్నారు. తరువాత తమ తల మీద మసా చేశారు. మరొకసారి**

---

141-1. ఎందుకంటే, ఆయన (స) పొయ్యే తొందరలో ఉన్నారు. కొందరు వ్యాఖ్యాతలు ఏమన్నారంటే,ఇక్కడ వుజూ అంటే కేవలం చేతులు కడుక్కోవటం అని అర్థం.

141-2. అంటే, ముజ్దలిఫా చేరుకున్న తరువాత అని భావం. ఎందుకంటే, ఈ సంఘటన హజ్‌కు సంబంధించినది. అక్కడ మగ్రిబ్ నమాజును మార్గమధ్యంలో చెయ్యరు. అయితే మగ్రిబ్, ఇషా నమాజులు రెంటినీ కలిపి ముజ్దలిఫాలో చేస్తారు.

141-3. దీని ద్వారా తెలిసే విషయమేమిటంటే, రెండోసారి చేసుకున్న తాజా వుజూ శ్రేష్ఠమైనది. మొదటిసారి చేసుకున్న వుజూ తరువాత నమాజు చేయకపోయినా పర్వాలేదు. అహ్‌లె హదీస్ మస్లక్ వారు ఈ పద్ధతినే అవలంబిస్తున్నారు. కొందరు ఏమన్నారంటే, మొదటి వుజూ తరువాత, ఫరజ్ నమాజుగాని నఫిల్ నమాజుగాని చెయ్యనంతవరకు, రెండోసారి వుజూ చేసుకోవటం అభిలషణీయమైన విషయం కాదు. షాఫయీ మస్లక్ వారు ఈ విధానాన్నే అవలంబిస్తున్నారు.

141-4. అంటే మగ్రిబ్, ఇషా, ఫరజ్ నమాజుల మధ్యకాలంలో సున్నత్ నమాజు కాని, నఫిల్ నమాజు కాని చెయ్యలేదు.

142-1. ప్రవక్త (స)గారి సంప్రదాయం (సున్నత్) ఇలానే ఉండింది. ఒక చేతి నిండా నీళ్లు తీసుకుని, సగం నీళ్లతో ముక్కు కడుక్కున్నారు. అహ్‌లె హదీసు మస్లక్ వారు దీన్నే

**చేతినిండా నీళ్లు తీసుకున్నారు, ఆ నీళ్లను కుడి కాలు మీద పోసుకున్నారు. దాన్ని పరిశుభ్రంగా కడుక్కున్నారు. మళ్లీ ఒక చేతినిండా నీళ్లు తీసుకున్నారు, ఆ నీళ్లతో ఎడమ కాలు పరిశుభ్రంగా కడుక్కున్నారు. తరువాత "ప్రవక్త మహనీయులు (స) ఈ విధంగానే వుజూ చేసుకుంటూ ఉండగా నేను చూశాను" అని ఆయన అన్నారు.[4]**

## 8వ అధ్యాయం

### ప్రతి పనినీ ప్రారంభించే ముందు బిస్మిల్లాహ్ (అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను) అని అనాలి. భార్యతో సంభోగించేటప్పుడు కూడా ఇలా అనాలి.[1]

**143.** **ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : ప్రవక్త మహనీయులు (సఅసం) ఇలా సెలవిచ్చారు: మీలో ఎవరైనా తన భార్యతో సంభోగించదలిస్తే, "బిస్మిల్లాహ్" అని పఠించాలి. లేదా ఇలా అనాలి : "అల్లాహుమ్మ. జన్నిబ్‌నష్షయితాన, వ జన్నిబిష్షయితాన, మా రజఖ్‌తనా, ఫఖుజియ బైనహుమా వలదున్ లమ్**

---

ఎన్నుకున్నారు. హనఫీ మస్లక్‌వారు ఏమంటారంటే, రెండుసార్లు వేర్వేరుగా చేతినిండా నీళ్లు తీసుకుని పుక్కిలించటం, ముక్కు ప్రక్షాళనం చెయ్యటం శ్రేష్ఠమైనది.

142-2. ఒకే చేత్తో చేతినిండా నీళ్లు తీసుకున్నారు, కాని ముఖం కడుక్కునేటప్పుడు రెండు చేతులతో ముఖం కడుక్కున్నారు.

142-3. ఇందులో మసా చెయ్యటం కోసం కొత్త నీళ్లు తీసుకునే ప్రస్తావన లేనేలేదు. ఒకసారి వాడిన నీరు పరిశుభ్రపరచటానికి పనికొస్తుందనటానికి ఇది నిదర్శనమని హాఫిజ్ ఇబ్నెహజర్ అన్నారు. కాని అబూదావూద్ ఉల్లేఖనం ప్రకారం, ఒక చేతినిండా నీళ్లు తీసుకుని, చేతిని అటూ ఇటూ ఝాడించారు, తరువాత తమ తల మీద మసా చేశారు.

142-4. అధ్యాయంలో ప్రస్తావించబడిన విషయం ఇక్కణ్ణుంచే ఉద్భవిస్తుంది. ఎందుకంటే, దైవప్రవక్త (స) ఇలా వుజూ చేస్తూ ఉండగా నేను చూశాను, ఆయన (స) ఒక చేతి నిండా నీళ్లు తీసుకుని రెండు చేతులతో ముఖం కడుక్కున్నారు అని ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) పేర్కొన్నారు.

8-1. వుజూను ప్రారంభించే ముందు "బిస్మిల్లాహ్" అని విధిగా, అంటే తప్పనిసరిగా అనాలి. ఇది అహ్లె హదీస్ వారి అభిప్రాయం. ఇమామ్ బుఖారీ (ర.అ) అధ్యాయం లోని హదీసు ద్వారా నిరూపించిన విషయం ఏమిటంటే, సంభోగ ప్రారంభంలో "బిస్మిల్లాహ్" అని అనటం ధర్మబద్ధమైనప్పుడు, వుజూ విషయంలో ఎందుకు ధర్మబద్ధం కాదు; అదైతే ఒక ఆరాధన కదా! ఎవరైతే బిస్మిల్లాహ్ అని పఠించరో వారి వుజూ ధర్మసమ్మతం కాదు అనే విషయం ఉన్నటువంటి హదీసును ఇమామ్ బుఖారి (రె.అ) పరిగణనలోకి తీసుకోలేదు, ఎందుకంటే అది ఆయన గారి షరతులకు లోబడిలేదు.

యజుర్రుహు. (ఓ అల్లాహ్! మమ్మల్ని షైతాను బారి నుంచి కాపాడు. మాకు ప్రసాదించే సంతానానికి సైతానును దూరంగా ఉంచు. తరువాత సంతానం కలిగినప్పుడు, షైతాను వారికి నష్టం కలిగించకుండా చెయ్యి)

## 9వ అధ్యాయం

### లెట్రిన్‌లోకి వెళ్ళేటప్పుడు ఏమని పఠించాలి.

**144.** హ్రజత్ అనస్ (రజిఅన్) కథనం ఇలా ఉంది: కాలకృత్యాలు తీర్చుకోవటానికి లెట్రిన్‌లోకి వెళ్లేముందు, దైవప్రవక్త (సఅసమ్) ఇలా అనేవారు: "అల్లాహుమ్మ ఇన్ని అఊజుబిక మినల్‌ఖుబుసి వల్ ఖబాఇస్" (ఓ అల్లాహ్! మగ భూతాల, ఆడ భూతాల బారి నుంచి నేను నీ శరణు వేడుకుంటున్నాను).

## 10వ అధ్యాయం

### లెట్రిన్ దగ్గర నీళ్లు పెట్టడం (కాలకృత్యాలు తీర్చుకున్న తరువాత మర్మస్థానాలను పరిశుభ్రపరచుకునేందుకు)

**145.** హ్రజత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఉల్లేఖనం ఇలా ఉంది: దైవప్రవక్త మహనీయులు(స) లెట్రిన్‌లోకి వెళ్లారు. నేను ఆయన (స) గారి కోసం లెట్రిన్ బయట వుజూ కోసం నీళ్లు పెట్టాను. ఆయన (స) బయటికి వచ్చిన తరువాత, "ఈ నీళ్లను ఇక్కడ ఎవరు పెట్టారు" అని అడిగారు. అక్కడ ఉన్నవారు, ఇబ్నె అబ్బాస్(ర) పెట్టాడు అని సమాధానం చెప్పారు. అప్పుడు ఆయన (స) "ఓ అల్లాహ్! అతనికి ధర్మజ్ఞానాన్ని అవగాహన[1] చేసుకునే శక్తిని ప్రసాదించు" అని ప్రార్థించారు.

## 11వ అధ్యాయం

### మల మూత్ర విసర్జన సమయంలో ఖిబ్లా వైపునకు ముఖం పెట్టి కూర్చోకూడదు. అయితే, ఇల్లుగాని, గోడగాని అడ్డంగా ఉన్నప్పుడు అటువైపు కూర్చుంటే పర్వాలేదు.

---

145-1. ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) తెలివిగల పని చేశారు, వివేకంతో వ్యవహరించారు. ప్రవక్త మహనీయులు (స), "దేవుడు అతనికి (ర) ధర్మావగాహనను ప్రసాదించుగాక!" అని ప్రార్థించారు. ప్రవక్త (స) గారి దుఆకు దైవామోదం లభించింది. ఈ కారణం గానే ఇబ్నె అబ్బాస్ (ర) ముస్లిమ్ మిల్లత్ యొక్క గొప్ప విద్వాంసుడుగా వినుతికెక్కారు. ఖురాను, హదీసు గురించి ఆయనకు (ర) బాగా తెలుసు, వయస్సులో ఆయన (ర) కంటే పెద్దవారైన సహాబీలు కూడా ధర్మానికి సంబంధించిన విషయాలను గురించి ఆయన్ని సంప్రదించేవారు.

**146.** ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూ అయ్యూబ్ అన్సారీ (రజిఅన్) ఉల్లేఖించారు: మీలో ఎవరైనా లెట్రిన్‌లోకి వెళ్లినప్పుడు ఖిబ్లా వైపునకు ముఖం పెట్టి కూర్చోబాకండి, ఇంకా వీపు పెట్టి కూడా కూర్చోబాకండి. తూర్పు దిక్కుకైనా ముఖం పెట్టి కూర్చోవాలి లేదా పశ్చిమ దిశకైనా తిరిగి కూర్చోవాలి.[1]

## 12వ అధ్యాయం

## రెండు ఇటుకల మీద కూర్చొని మల విసర్జన చెయ్యుటం.

**147.** హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : ప్రజలు కొందరు ఇలా అంటారు: "కాలకృత్యాలు తీర్చుకోవటానికి కూర్చున్నప్పుడు, మీరు ఖిబ్లా వైపునకు గాని లేదా బైతుల్ మఖ్దిస్ వైపునకు గాని ముఖం పెట్టి కూర్చోకూడదు." నేను వారికి ఇలా చెప్పాను: "నేను ఒకసారి మా ఇంటి కప్పు మీదకు ఎక్కాను. అప్పుడు దైవప్రవక్త (సఅసమ్) రెండు ఇటుకల మీద కూర్చోని బైతుల్ మఖ్దిస్ వైపునకు తిరిగి కాలకృత్యాలు తీర్చుకుంటూ ఉండగా నేను చూశాను. కాని ఒక తెర ఆయన (స) గారికి అడ్డంగా ఉంది." ఇబ్నె ఉమర్(రజి) వాసెతో ఇలా అన్నారు : "నీవు బహుశా పిరుదులపై కూర్చుని నమాజ్ చేసేవారిలో ఒకడివిలా ఉన్నావు." 'దైవసాక్షి! నాకు తెలియదు' (అని వాసె చెప్పారు. వాసె గారు ఇబ్నె ఉమర్ గారి శిష్యులు అని గమనించాలి).

## 13వ అధ్యాయం

## కాలకృత్యాలు తీర్చుకోవటానికి స్త్రీలు బయటకు పోవటం, బహిర్భూమికి పోవటం.

**148.** హజ్రత్ ఆయెషా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త (స) గారి భార్యలు కాలకృత్యాలు తీర్చుకోవటానికి రాత్రి సమయంలో అల్-మనాసి అని పిలువ బడే ఒక విశాలమైన మైదానంలోకి వెళ్లేవారు. హజ్రత్ ఉమర్ (రజిఅన్) దైవ ప్రవక్త (స)ను ఉద్దేశించి, "మీ భార్యలకు బురఖా తొడుక్కోమని చెప్పండి" అని అంటూ ఉండేవారు. కాని దైవప్రవక్త (స) అలా చెయ్యలేదు. ఒక రాత్రి ఇషా సమయంలో ప్రవక్త (స) గారి భార్య సౌదా బిన్త్ జమా కాలకృత్యాలు తీర్చుకోవటానికి బయటకు వెళ్లారు. ఆమె పొడుగ్గా ఉంటారు. ఆమె గారిని ఉద్దేశించి హజ్రత్ ఉమర్ (రజిఅన్), "సౌదా! నేను మిమ్మల్ని గుర్తు పట్టాను" అని అన్నారు. పరదాకు సంబంధించిన వాక్యాలు త్వరగా అవతరించాలనే ఉద్దేశ్యంతో ఆయన (ర) అలా అన్నారు.

---

146. ఈ సంబోధన మదీనా వాసులకు వర్తిస్తుంది. ఎందుకంటే వాళ్ళ ఖిబ్లా దక్షిణం వైపున ఉంది. భారతీయులైతే ఉత్తర దక్షిణ దిక్కుల వైపునకు ముఖం పెట్టి కూర్చోవాలి.

**149.** హ(జత్ ఆయెషా (రజిఅన్) ఉల్లేఖనం ప్రకారం : ప్రవక్త మహనీయులు (సఅసమ్) తమ భార్యలను ఉద్దేశించి ఇలా అన్నారు: "కాలకృత్యాలు తీర్చుకునే నిమిత్తం, మీరు బయటకుపోవచ్చు." ఇక్కడ కాలకృత్యాలు తీర్చుకోవటమంటే మల విసర్జన అని హిషామ్ అన్నారు.

## 14వ అధ్యాయం

## ఇళ్లల్లో మరుగుదొడ్లు కట్టుకోవటం, కాలకృత్యాలు తీర్చుకోవటం.

**150.** అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: నేను ఒకసారి విశ్వాసుల తల్లి అయిన హఫ్సా (ర.అన్హా) ఇంటి కప్పు మీదకు ఏదో పని మీద ఎక్కాను. అప్పుడు నేను దైవప్రవక్త (సఅసమ్)ను చూశాను; ఆయన (స) ఖిబ్లా వైపునకు తన వీపును పెట్టి, సిరియా వైపునకు తన ముఖాన్ని పెట్టి కూర్చోని తన అవసరాన్ని తీర్చుకుంటున్నారు.

**151.** అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఒక రోజున నేను మా ఇంటి కప్పు మీదకు ఎక్కాను. అప్పుడు నేను ప్రవక్త మహనీయులను (స) చూశాను; ఆయన రెండు పచ్చి ఇటుకల మీద కూర్చోని, తన ముఖాన్ని బైతుల్ మఖ్దిస్ (జెరూసలమ్) వైపునకు పెట్టి, తమ అవసరాన్ని తీర్చుకుంటున్నారు.[1]

## 15వ అధ్యాయం

## మూత్ర విసర్జనం తరువాత నీళ్లతో పరిశుభ్రపరచుకోవటం.[1]

**152.** అనస్ బిన్ మాలిక్ ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) కాలకృత్యాలు తీర్చుకోవటానికి బయటికి వెళ్లినప్పుడల్లా, నేను, ఒక బాలుడు[1] మేమిద్దరం మాతోపాటు ఒక చెంబు నిండా నీళ్లు తీసుకెళ్లేవారము. ఆయన (స) ఈ నీళ్లతో (తమ రహస్య భాగాలను) పరిశుభ్రపరచుకునేవారు.

---

151–1. పై ఉల్లేఖనంలో సిరియా ప్రస్తావన వచ్చింది. బైతుల్ మఖ్దిస్ సిరియా దేశం లోనే ఉండేది. (అప్పుడు సిరియా, జోర్డాన్, పాలస్తీనా, లెబనాన్ – ఇవన్నీ ఒకే దేశంగా పరిగణింపబడేవి.) కాని ఈ ఉల్లేఖనంలో కాబా వైపునకు వీపు పెట్టి అనే ప్రస్తావన లేదు. అయితే, మదీనా పట్టణంలోని మనిషి ఎవరైనా బైతుల్ మఖ్దిస్ వైపునకు తన ముఖాన్ని పెడితే, అప్పుడు అతని వీపు కాబా మందిరం వైపునకే ఉంటుంది.

15–1. ఒంటేలుకు పోయి నీళ్లతో పరిశుభ్రపరచుకోవటాన్ని కొందరు "మక్రూ" గా భావించారు. కాని ఇమామ్ బుఖారీ (రె.అ) దీన్ని కొట్టిపారేశారు. యదార్థం ఏమిటంటే, రెంటికి పోయిన తరువాత, పెళ్లలతో పరిశుభ్రపరచుకోవటంగాని లేదా నీళ్లతో పరిశుభ్రం చేసుకోవటంగాని లేదా ఈ రెండింటితో పరిశుభ్రపరచుకోవటంగాని, నిజమైన హదీసు ద్వారా రుజువు కాలేదు. అయితే కొందరు సహాబాలు, కొందరు

## 16వ అధ్యాయం

## కాలకృత్యాలు తీర్చుకోవటం కోసం నీళ్లు తీసుకుపోవటం.

**అబూదర్దా (రజిఅన్) ఇరాఖ్ ప్రజల నుద్దేశించి ఇలా అన్నారు: (దైవప్రవక్త (సఅసం) గారి) చెప్పుల్ని, వుజూ చేసుకోవటానికి నీళ్లను, దిండును తనతో మోసుకుపోయే వ్యక్తి మీలో లేడా?[1]**

**153. హజ్రత్ అనస్ (రజిఅన్) ఇలా కథనం చేశారు: ప్రవక్త (స) మహ నీయులు కాలకృత్యాలు తీర్చుకోవటానికి (అడవి లోకి) వెళ్లినప్పుడల్లా, నేను, ఒక బాలుడు, మేమిద్దరం కలిసి, ఒక చెంబు నిండా నీళ్లు తీసుకుని ఆయన (స) వెంట వెళ్లేవారము.**

## 17వ అధ్యాయం

## కాలకృత్యాలు తీర్చుకోవటానికి వెళ్లేటప్పుడు నీళ్లతో పాటు ఒక బరిశెను కూడా తీసుకుపోవటం.

**154. అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త (సఅసమ్) కాలకృత్యాలు తీర్చుకోవటానికి వెళ్లినప్పుడు, నేను, నాతోపాటు ఒక బాలుడు మేము ఉభయులం కలిసి ఒక చెంబెడు నీళ్లు, ఒక బరిశెను[1] (బల్లెము, ఈటె) మాతో తీసుకువెళ్లేవారము. ఆయన (స)నీళ్లతో కాలకృత్యాలు తీర్చుకునేవారు.**

---

పెద్దలు ఇది ఉత్తమ మైనది అని అన్నారు. ఒంటేలు పోసుకున్న తరువాత పెళ్లను వాడటం అనేది ఏ హదీసు ద్వారాను రుజువు కాలేదు. కేవలం నీళ్లతో పరిశుభ్రపరచు కుంటే సరిపోతుంది. అయితే హజ్రత్ ఉమర్ (రజిఅన్) గారి సంప్రదాయం ఒకటి ఇలా ఉంది: ఆయన మూత్ర విసర్జన తరువాత తన మర్మాంగాన్ని గోడకు పెట్టి రుద్దారు. ఈ విషయాన్ని ఇబ్నె అబీషైబా ముసన్నఫ్‌లో వెలికితీశారు.

152–1. ఈ బాలుడెవరో తెలియదు. కొందరు ఈ బాలుడు అబూ హురైరా (రజిఅన్) అనీ, ఇబ్నె మసూద్ (రజిఅన్) అనీ భావించారు. కాని ఈ ఊహ నిజమైనదికాదు. ఎందుకంటే, అబూహురైరా (ర), ఇబ్నె మసూద్(ర) అప్పుడు బాలురు కారు. మరికొందరు, ఈ బాలుడు జాబిర్ (ర) అన్నారు.

16–1. అల్‌ఖమా బిన్ ఖైస్ అనే ఇరాఖ్ ప్రజల్లోని ఒక వ్యక్తి, అబూదర్దా (రజిఅన్)ను కొన్ని సమస్యలను గురించి అడిగారు. అప్పుడు ఆయన(ర) ఇలా సమాధానం చెప్పారు: ఆ వ్యక్తి అబ్దుల్లా బిన్ మసూద్ (రజిఅన్). ఆయన కూఫాకు వెళ్ళి అక్కణ్ణే స్థిర నివాసం ఏర్పరచుకున్నారు, అక్కణ్ణే మరణించారు.

154–1. బరిశెను తీసుకువెళ్లటానికి కారణం బహుశా ఇదే ఉండవచ్చు : ఒకవేళ చాటు అవసరమైతే బరిశెను భూమిలో పాతి, దాని మీద బట్టగాని, మరొక వస్తువేదైనా గాని

## 18వ అధ్యాయం

### కుడి చేత్తో మర్మాంగాలను కడుక్కోవటం నిషిద్ధం.

**155.** దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అబూ ఖతాద (రజిఅన్) ఉల్లేఖించారు: మీలో ఎవరైనా (పాలుగాని, మంచినీళ్లుగాని, షర్బత్‌గాని) త్రాగినట్లయితే, త్రాగిన గిన్నెలో శ్వాసను విడువరాదు. మీలో ఎవరైనా లెట్రిన్‌లోకి వెళ్లినట్లయితే, వారు తమ మర్మాంగాన్ని కుడిచేత్తో ముట్టుకోరాదు, ఇంకా కుడి చేత్తో మర్మాంగాలను పరిశుభ్రపరచుకోరాదు.[1]

## 19వ అధ్యాయం

### ఒంటేలు పోసేటప్పుడు మర్మాంగాన్ని కుడి చేత్తో పట్టుకోకూడదు.

**156.** దైవప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అబూ ఖతాదా (రజిఅన్) కథనం చేశారు: మీలో ఎవరైనా మూత్రం పోస్తే, వారు తమ మర్మాంగాన్ని కుడి చేత్తో పట్టుకోరాదు; ఇంకా కుడి చేత్తో మర్మాంగాన్ని పరిశుభ్రపరచుకోరాదు. ఇంకా త్రాగేటప్పుడు గిన్నె (కప్పు)లోకి శ్వాసను విడువకూడదు.

## 20వ అధ్యాయం

### మట్టిపెళ్లలతో రహస్యాంగాలను పరిశుభ్రపరచుకోవటం.

**157.** అబూ హురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) కాలకృత్యాలు తీర్చుకోవటానికి బయలుదేరారు. నేను కూడా ఆయన్ని(స) అనుసరించాను. ఆయన (స) గారు నడిచేటప్పుడు వెనక్కి తిరిగి చూడరు. నేను ఆయన దగ్గరకు వెళ్లినప్పుడు ఆయన (స) ఇలా సెలవిచ్చారు: నా కోసం కొన్ని మట్టి పెళ్లలు వెతికి తీసుకురా; నేను వాటితో నా రహస్య శరీర భాగాలను పరి శుభ్రపరచుకుంటాను; లేదా ఇటువంటి అర్థం స్ఫురించే మరొక పదాన్ని ఆయన (స) వాడారు.[1] చూడు, ఎముకగాని, పెంటికగాని తీసుకురావద్దు.[2] అప్పుడు నేను నా వస్త్రం యొక్క చివరి భాగంలో, అంచులో కొన్ని రాళ్లను తీసుకుని వెళ్లి, ఆయన గారి (స) ప్రక్కన పెట్టి, తరువాత అక్కణ్ణుంచి దూరంగా వెళ్లిపోయాను. కాలకృత్యాలు తీర్చుకున్న

---

వెయ్య వచ్చు, అది అడ్డంగా ఉంటుంది. లేదా దానితో అంటే బరిశెతో గట్టిగా ఉన్న నేలను త్రవ్వి, దానిమీద మూత్ర విసర్జనం చెయ్యవచ్చు. అప్పుడు మూత్రం చింది, దాని తుంపరలు మీద పడవు.

155–1. గిన్నెలోకి శ్వాస విడిచినట్లయితే, ఎప్పుడైనా నోట్లో నుంచి ఏదైనా పదార్థం వచ్చి గిన్నెలో పడే అవకాశం ఉంది. అప్పుడు రెండో మనిషి దాన్ని త్రాగటానికి అసహ్యించుకుంటాడు.

**తరువాత ఆయన (స) ఆ రాళ్లతో పరిశుభ్రపరచుకున్నారు.**

## 21వ అధ్యాయం

### పిడకల(పెంటికల)తో మర్మాంగాలను పరిశుభ్రపరచుకోకూడదు.

**158. అబ్దుల్లా బిన్ మసూద్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త (సఅసమ్) కాలకృత్యాలు తీర్చుకునే నిమిత్తం అడవిలోకి వెళ్లారు. పోతూపోతూ ముందు మట్టి పెళ్లలు తీసుకురమ్మని నాకు పురమాయించారు. నాకు రెండు మట్టి పెళ్లలు మాత్రమే దొరికాయి. మూడోది ఎంత వెతికినా దొరకలేదు. అప్పుడు నేను ఒక పిడకను తీసుకున్నాను. ప్రవక్త మహనీయులు (సఅసమ్) రెండు మట్టిపెళ్లలనైతే తీసుకున్నారు, కాని పిడకను కిందికి విసిరివేశారు. అది అశుద్ధమైనది అని సెలవిచ్చారు ఆయన (సఅసమ్).**

## 22వ అధ్యాయం

### వుజూ చేసుకునేటప్పుడు ఒక్కసారి మాత్రమే శరీరావయవాలను కడుక్కోవటం.

**159. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహనీయులు (సఅసమ్) వుజూ చేసుకునేటప్పుడు తమ శరీర అవయవాలను ఒక్కసారి మాత్రమే కడుక్కున్నారు.[1]**

## 23వ అధ్యాయం

### వుజూ చేసుకునేటప్పుడు శరీర అవయవాలను రెండేసి సార్లు కడుక్కోవటం.

**160. హజ్రత్ అబ్దుల్లా బిన్ జైద్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహనీయులు (సఅసమ్) వుజూ చేసుకునేటప్పుడు తమ శరీర అవయవాలను రెండేసి సార్లు కడుక్కున్నారు.**

---

157-1. అంటే నేను వాటితో నా రహస్యాంగాలను పరిశుభ్రపరచుకుంటాను అని భావం.

157-2. అహ్లె హదీస్, షాఫయీ, ఇత్రత్ వర్గాల వారు ఏమంటారంటే, ఎముకలతో, పిడకలతో మర్మాంగాలను పరిశుభ్రం చేసుకోవటం శాస్త్రసమ్మతం కాదు, సక్రమమైనది కాదు. ఇమామ్ అబూ హనీఫా (రె.అలై) ఏమన్నారంటే, సక్రమమైనదే కాని అసహ్యకరమైనది, జుగుప్సాకరమైనది. ఇవి నిషేధించబడటానికి కారణాలు ఇతర హదీసుల్లో వచ్చాయి; అవేమిటంటే, ఎముకలు జిన్నాతుల ఆహారం; పేడ, పిడకలు వారి పశువుల ఆహారం.

159-1. తెలిసిందేమిటంటే, వుజూలో నిర్ణీత శరీర అవయవాలను ఒక్కసారి కడుక్కున్నా ఫర్జ్ (అంటే విధి) తీరిపోతుంది.

## 24వ అధ్యాయం

### వుజూ చేసుకునేటప్పుడు శరీర అవయవాలను మూడేసిసార్లు కడుక్కోవటం.

**161.** హజ్రత్ ఉస్మాన్ (రజిఅన్) గారి బానిస అయిన హుమ్రాన్ ఇలా ఉల్లేఖించారు: నేను చూశాను, హజ్రత్ ఉస్మాన్ (రజిఅన్) ఒక చెంబెడు నిండా నీళ్లు తెప్పించారు, తరువాత ఆయన ఆ నీళ్లను తన చేతుల మీద మూడు సార్లు పోసి వాటిని కడుక్కున్నారు, ఆ తరువాత తన కుడి చేతిని చెంబులోపెట్టి నీళ్లు తీసుకుని మూడు సార్లు పుక్కిలించి ఊశారు, తరువాత నీళ్లను ముక్కులోకి ఎక్కించి, చీది దాన్ని పరి శుభ్రంగా కడుక్కున్నారు. ఆ తరువాత తన ముఖాన్ని మూడుసార్లు కడుక్కున్నారు, తన రెండు చేతుల్ని మోచేతుల వరకు మూడుసార్లు కడుక్కున్నారు, తరువాత తల మీద ఒకేసారి మసా చేశారు, ఆ తరువాత తన రెండు కాళ్లను చీల మండలాల వరకు మూడుసార్లు కడుక్కున్నారు. అప్పుడు ఆయన (రజిఅన్) మహనీయ ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని ఉల్లేఖించారు: ఎవరైనా నేను చేసిన ఈ వుజూ ప్రకారం వుజూ చేస్తే, తరువాత రెండు రకాతులు తహియతుల్ వుజూ నమాజు చేస్తే, మనస్సులోకి ప్రాపంచిక విషయాలకు సంబంధించిన ఏ ఆలోచనా రాకుండా ఉంటే,[1] అప్పుడు అతను పూర్వం చేసిన పాపాలన్నీ క్షమించబడతాయి. హజ్రత్ ఉస్మాన్ (రజిఅన్) వుజూ చేసుకున్న తరువాత, ఇలా అన్నారు: నేను మీకు ఒక హదీసును వినిపిస్తాను. ఖురాను గ్రంథంలో గనక ఒక వాక్యం లేకుండా ఉన్నట్లయితే, నేను ఈ హదీసును వినిపించి ఉండేవాణ్ణి కాను. ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా సెలవిస్తూ ఉండగా నేను విన్నాను: ఏ వ్యక్తి అయినా చక్కగా, సక్రమంగా వుజూ చేసుకుంటే, ఆ తరువాత ఏదైనా ఫరజ్ నమాజు చేస్తే ఈ నమాజు తరువాత మరొక నమాజు చేసే వరకు గల మధ్యకాలంలో అతను చేసిన పాపాలన్నీ మన్నించబడ తాయి. ఖురానులో ఆ వాక్యం ఇది అని ఉర్వా అన్నారు: "మేము అవతరింపజేసిన స్పష్టమైన జ్ఞాన బోధలు, ధర్మోపదేశాలు వాస్తవానికి మానవులందరి మార్గదర్శకత్వం కోసం అని మేము మా గ్రంథంలో విశదం చేసిన తరువాత కూడా, వాటిని దాచే వారిని అల్లాహ్ తప్పకుండా శపిస్తాడు. ఇంకా శపించేవారందరూ వారిని శపిస్తారు." **(బఖరా : 159)**[2]

## 25వ అధ్యాయం

వుజూ చేసుకునేటప్పుడు ముక్కులో నీళ్లు పోసుకుని చీదటం. ఈ విషయాన్ని

---

161-1. శబ్దానువాదం ఇలా ఉంది: నమాజు స్థితిలో మనస్సుల్లో ఇతర విషయాలను గురించి ఆలోచించరాదు, ఇతర విషయాలను మనస్సుల్లోకి రానీయరాదు.

**ప్రవక్త మహనీయులు (సఅసమ్) సెలవిచ్చారని హజ్రత్ ఉస్మాన్ (రజిఅన్), హజ్రత్ అబ్దుల్లా బిన్ జైద్ (రజిఅన్), హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్)లు ఉల్లేఖించారు.**

**162. దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా ప్రవచించారని అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు: ఎవరైనా, వుజూ చేసుకున్నప్పుడు, అతను తన ముక్కులో నీళ్ళు పోసుకుని చీది, దాన్ని పరిశుభ్రపరచుకోవాలి. ఎవరైనా కాలకృత్యాలు తీర్చుకున్న తరువాత, తమ మర్మాంగాలను మట్టి పెళ్లలతో పరిశుభ్రపరచుకుంటే, ఆ మట్టిపెళ్లలు బేసి సంఖ్యలో ఉండాలి.[1]**

## 26వ అధ్యాయం

## మర్మాంగాలను బేసి సంఖ్యలో ఉన్న మట్టి పెళ్లలతో పరిశుభ్రపరచుకోవటం.

**163. ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అబూ హురైరా(ర) ఉల్లేఖించారు: మీలో ఎవరైనా వుజూ చేసుకుంటే, అతను తన ముక్కులో నీళ్లు పోసుకొని ఆ తరువాత ముక్కును చీదాలి. మీలో ఎవరైనా తమ మర్మాంగాలను మట్టి పెళ్లలతో పరిశుభ్రపరచుకుంటే, ఆ పెళ్లల సంఖ్య బేసిగా ఉండాలి. మీలో ఎవరైనా నిదురపోయి మేల్కొన్నప్పుడు, చేతుల్ని పరిశుభ్రంగా కడుక్కున్న తరువాతనే వుజూ చేసుకునే నీళ్లలో చేతులు పెట్టాలి. నిదురలో ఉన్నప్పుడు అతని చేతులు ఎక్కడెక్కడ పడ్డాయో తెలియదు కదా!**

---

161-2. అసలు ఈ ఖురాను వాక్యం యూదు విద్వాంసులను గురించి అవతరించింది. వారు దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఆగమనానికి సంబంధించిన శుభవార్తలను బుద్ధిపూర్వకంగా దాచి పెట్టేవారు. హజ్రత్ ఉస్మాన్ (రజిఅన్) అభిప్రాయం ఏమిటంటే, ఈ ఖురాను వాక్యం ప్రకారం, నేను కూడా ధర్మజ్ఞానాన్ని దాచి పెట్టేవాళ్లల్లో చేరిపోతానేమో అనే భయం నాకు కలక్కుండా ఉన్నట్లయితే, నేను ఈ హదీసును గురించి మీకు చెప్పి ఉండేవాణ్ణి కాను. హజ్రత్ ఉస్మాన్ (రజిఅన్) గారి ఈ భాష్యం మూలంగా ఒక విషయం స్పష్టమవుతుంది; అదేమిటంటే, "ఆమ్" అంటే "సాధారణ, సర్వత్రా" అనే పదప్రయోగం జరిగినప్పుడు, అది సర్వులకూ, అందరికీ వర్తిస్తుంది; ఖురాను వాక్యం ఒక ప్రత్యేక వ్యక్తిని దృష్టిలో ఉంచుకుని అవతరించినప్పటికీ.

162-1. అహ్లె హదీస్, ఇమామ్ అహ్మద్ మరియు ఇస్హాఖ్‌లు ఈ హదీసును పునాదిగా తీసుకుని ఏమంటారంటే, వుజూ చేసుకున్నప్పుడు ముక్కులో నీళ్లు పోసుకోవటం, తరువాత ఆ నీళ్లను చీదటం "విధి" అంటే "ఫర్జ్" అంటారు. మిగతా విద్వాంసులందరూ దాన్ని 'సున్నత్' అంటారు. బేసి సంఖ్యలో ఉండాలి అంటే, మూడు మట్టి పెళ్లలు లేదా ఐదు మట్టి పెళ్లలు అని భావం.

## 27వ అధ్యాయం

**వుజూ చేసుకునేటప్పుడు రెండు కాళ్ళూ పరిశుభ్రంగా కడుక్కోవాలి; మసా చెయ్యకూడదు.**[1]

**164.** అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : ఒకసారి మేము ప్రయాణంలో ఉన్నప్పుడు ప్రవక్త మహనీయులు (సఅసమ్) వెనుక ఉండి పోయారు[1]. తరువాత ఆయన (స) అసర్ నమాజుకు చాలా తక్కువ సమయం ఉన్న ప్పుడు వచ్చి మాతో కలిశారు.[2] మేము తొందర వల్ల కాళ్ల మీద మసా చేసుకుంటు న్నాము. ఆయన (స) బిగ్గరగా ఎలుగెత్తి, "వినండి, మీ మడమల్ని నరకాగ్ని నుంచి కాపాడుకోండి" అని సెలవిచ్చారు. ఇలా రెండుసార్లో మూడు సార్లో అన్నారు.[3]

## 28వ అధ్యాయం

**వుజూ చేసుకుంటున్నప్పుడు నీళ్లతో పుక్కిలించి ఉయ్యటానికి సంబంధించిన ప్రస్తావన. దీన్ని ఇబ్నె అబ్బాస్ (రజిఅన్), అబ్దుల్లా బిన్ జైద్ (రజిఅన్) దైవప్రవక్త (సఅసమ్) చేస్తూ ఉండగా చూసి నకలు చేశారు.**

**165.** హజ్రత్ ఉస్మాన్ (రజిఅన్) బానిస అయినటువంటి హుమ్రాన్ ఇలా ఉల్లేఖించారు: నేను ఈ దృశ్యాన్ని చూశాను: హజ్రత్ ఉస్మాన్ (రజిఅన్) వుజూ చేసుకో వటానికి నీళ్లను తెప్పించారు, చెంబులోని నీళ్లను తమ రెండు చేతుల మీద పోసు

---

27–1. అంటే కాళ్ళల్లో చెప్పులుగాని, సాక్సులుగాని లేనప్పుడు, కాళ్లు పరిశుభ్రంగా కడుక్కో వటం చాలా అవసరం, వాటి మీద మసా చెయ్యటం సరిపోదు. ఎక్కువ మంది విద్వాంసులు ఈ అభిప్రాయాన్నే వ్యక్తం చేశారు. కాని కొందరు తల మీద మసా చేసిన విధంగా కాళ్ల మీద మసా చేస్తే సరిపోతుంది, వుజూ పూర్తి అవుతుంది అన్నారు. ఇమామ్ బుఖారీ (ర.అలై) ఈ అధ్యాయాన్ని చేర్చి దాన్ని రద్దు చేశారు.

164–1. ఈ హదీసు ఇదివరకు వచ్చింది.

164–2. బహుశా ప్రవక్త (స) గారి సహచరులు ఆయన (స) గారి రాక కోసం నిరీక్షిస్తూ నమాజు చెయ్యకుండా ఆలస్యం చేసి ఉండవచ్చు. కొందరు "అసర్ నమాజు సమయం ఆసన్నమైనప్పుడు" అని అనువాదం చేశారు.

164–3. ఈ ప్రయాణం హజ్జతుల్ విదా నుంచి తిరిగి వచ్చేటప్పటి ప్రయాణమన్న మాట. మక్కా నుంచి మదీనా వరకు జరిగిన ప్రయాణంలో అబ్దుల్లా బిన్ అమ్ర్ (రజిఅన్) దైవప్రవక్త (సఅసమ్)తో ప్రయాణం చేశారు. కనుక ఈ సంఘటన ప్రవక్త (సఅసమ్) గారి చివరి కాలానికి సంబంధించిన సంఘటనేకాని ప్రారంభ కాలానికి చెందినది కాదు.

కున్నారు, వాటిని మూడుసార్లు కడుక్కున్నారు. తరువాత ఆయన తన కుడి చేతిని చెంబులో పెట్టారు. ఆ తరువాత పుక్కిలించి ఊశారు, ముక్కులోకి నీరు పోసి చీదారు, తరువాత మూడుసార్లు ముఖం కడుక్కున్నారు, రెండు చేతుల్ని మోచేతుల వరకు మూడుసార్లు కడిగారు, ఆ తరువాత తల మీద మసా చేశారు (ఒకేసారి), రెండు కాళ్లను మూడేసిసార్లు కడిగారు. ఆ తరువాత ఇలా అన్నారు: నేను వుజూ చేసిన విధం గానే ప్రవక్త మహనీయులు (సఅసమ్) కూడా వుజూ చేస్తూ ఉండగా చూశాను. ఆయన (స) ఇలా సెలవిచ్చారు: ఎవరైనా నేను చేసినట్లుగా వుజూ చేసుకుంటే, తరువాత రెండు రకాతులు నమాజు (తహియతుల్ వుజూ) చేస్తే, మనస్సులో ఇతర విషయాలను (నమాజుకు సంబంధించని) గురించి ఆలోచించకుండా ఉంటే, అతను పూర్వం చేసిన పాపాలను అల్లాహ్ క్షమిస్తాడు.

## 29వ అధ్యాయం

**వుజూ చేసుకుంటున్నప్పుడు, మడమల్ని కడుక్కోవటం. ముహమ్మద్ బిన్ సీరీన్ వుజూ చేసుకున్నప్పుడల్లా, ఉంగరం ఉన్న స్థలాన్ని తప్పనిసరిగా కడిగేవారు.[1]**

**166.** ముహమ్మద్ బిన్ జియాద్ ఇలా ఉల్లేఖించారు: నేను అబూ హురైరా (రజిఅన్) చెబుతూ ఉండగా విన్నాను, ఆయన మా ముందు నుంచి పోతూ ఉండే వారు; ప్రజలు చెంబులతో వుజూ చేసుకుంటూ ఉండేవారు. ఆయన (ర) ఇలా హితవు గరిపేవారు. వుజూను పూర్తిగాను, సక్రమంగాను చేసుకోండి. ఎందుకంటే, దైవప్రవక్త (స) అబుల్ ఖాసిమ్, "మీ మడమలకు నరక జ్వాలల వల్ల ముప్పు ఉంది" అని సెలవిచ్చారు.

## 30వ అధ్యాయం

**చెప్పులు తొడుక్కుని ఉన్నప్పుడు కాళ్ళు కడుక్కోవటం. చెప్పుల మీద మసా చెయ్యకూడదు (చెప్పులు తీసేసి కాళ్ళు కడుక్కోవాలి).**

**167.** ఉబైద్ బిన్ జురైజ్ ఇలా ఉల్లేఖించారు: నేను అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అన్)ను అడిగాను, "ఓ అబూ అబ్దుర్రహ్మాన్! మీరు నాలుగు పనులు చేస్తూ ఉండగా నేను చూశాను. కాని మీ సహచరులెవ్వరూ (సహాబా) వాటిని చేస్తూ ఉండగా నేను చూడలేదు." అప్పుడు అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా అడిగారు.[1] "ఓ ఇబ్నె

---

29–1. మరొక ఉల్లేఖనంలో, ఉంగరాన్ని అటూఇటూ కదిలిస్తారు అని ఉంది. ఈ విషయాన్ని ఇబ్నె అబీషైబా ఉటంకించారు. ఈ ఉల్లేఖనాన్ని ఇమామ్ బుఖారీ (ర.అలై) ధృవీకృతమైన ఉల్లేఖనంగా తీసుకున్నారు. ఏమైనా, ఒకవేళ ఉంగరం బిగుతుగా ఉంటే, దాన్ని అటూ ఇటూ కదిలించి దాని క్రింది స్థలాన్ని నీళ్లతో కడగటం అవసరం.

జురైజ్! ఆ పనులేమిటో చెప్పండి." దానికి సమాధానంగా ఇబ్నె జురైజ్ ఇలా అన్నారు: తవాఫ్ చేసేటప్పుడు మీరు కాబా గృహం యొక్క ఏ మూల మీదా చెయ్యి పెట్టరు. కాని రుకునె యమానీని, హజ్రె అస్వద్‌ను ముట్టుకుంటారు.[2] మీరు, వెంట్రుకలు లేని తోలు చెప్పులు తొడుక్కుంటారు.[3] మీరు హెన్నాతో తల వెంట్రుకలకు రంగు వేసుకుంటారు. హజ్ దినాలలో మీరు మక్కాలో ఉన్నప్పుడు, ప్రజలైతే జిల్‌హజ్జా నెలవంకను చూడగానే ఇహ్రామ్ కట్టుకుంటారు. కాని మీరు జిల్‌హజ్జా ఎనిమిదవ తేదీ వరకు ఇహ్రామ్ కట్టుకోరు. సమాధానంగా అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా అన్నారు. "కాబా గృహం యొక్క మూలలను తాకే విషయం గురించి, తవాఫ్ సమయంలో ప్రవక్త మహనీయులు (సఅసమ్) కాబా గృహం యొక్క ఏ మూలనూ తాకినట్లు నేను చూడలేదు, హజ్రె అస్వద్ రుకునె యమానీలను తప్ప. వెంట్రుకలు లేని తోలు చెప్పులంటారా, ప్రవక్త మహనీయులు (సఅసమ్) వాటిని ధరించి ఉండగా నేను చూశాను, ఆయన (స) వాటితో వుజూ కూడా చేసుకున్నారు. నేను కూడా అటువంటి చెప్పుల్ని తొడుక్కోవటం ఇష్టపడుతాను. ఇక హెన్నా రంగు గురించి, ప్రవక్త మహనీయులు (సఅసమ్) తమ వెంట్రుకలకు, బట్టలకు హెన్నా రంగు వేసుకునేవారు. కాబట్టి నేను కూడా జాఫరాన్ రంగు అంటే ఇష్టపడతాను.[4] ఇహ్రామ్ కట్టుకోవటం గురించి, తమ ఒంటె తమను ఎక్కించుకుని లేచి (హజ్ కోసం) ప్రయాణం కట్టనంత వరకు ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇహ్రామ్ కట్టుకోవదాన్ని నేను చూడలేదు.[5]

## 31వ అధ్యాయం

## వుజూ కాని, గుసుల్ కాని చేసుకునేటప్పుడు శరీరం కుడి వైపు నుంచి దానిని ప్రారంభించాలి.[1]

**168.** ఉమ్మె అతియ (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు. దైవప్రవక్త (సఅసమ్) గారి కూతురు హజ్రత్ జైనబ్ (రజిఅన్)కు గుసుల్ ఇచ్చే స్త్రీలకు ఆయన (స) ఇలా బోధించారు, "కుడివైపు నుంచి, వుజూకు అర్హమైన శరీర భాగాల నుంచి ఆమె గుసుల్‌ను ప్రారంభించండి."[1]

---

167-1. లేదా తాము ధరించే వస్త్రాలకు రంగు వేసుకుంటారు.

167-2. కాబా గృహానికి నాలుగు మూలలు ఉన్నయ్. రెండు మూలలైతే ఈ హదీసులో ప్రస్తావించబడ్డాయి. మిగతా రెండు మూలల్లో రుకునే షామీ ఒకటైతే, రుకునే ఇరాఖీ రెండవది. ప్రవక్త మహనీయులు (సఅసమ్) తవాఫ్ చేసేటప్పుడు వీటిని తాకేవారు కాదు.

**169.** హ్రజత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) ప్రతి పనిని కుడి వైపు నుంచి మొదలుపెట్టేవారు. అలా చెయ్యటం వారికి బాగా అనిపించేది. చెప్పులు తొడుక్కోవటం, తల దువ్వుకోవటం, పరిశుద్ధత నొందటం లాంటి విషయాలు.[1]

## 32వ అధ్యాయం

**నమాజు సమయం ఆసన్నమైనప్పుడు నీళ్ళ కోసం వెతకటం.**

**హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా అన్నారు, ఉదయం నమాజు వేళ అయింది, నీళ్ల కోసం వెతికాను, కాని దొరకలేదు. చివరకు తయమ్ముమ్‌కు సంబంధించిన ఆయతు అవతరించింది.[1]**

**170.** హ్రజత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: నేను దైవప్రవక్త (సఅసమ్)ను చూశాను, అప్పుడు అస్ర్ నమాజుకు వేళ అయింది, ప్రజలు

167–3. అధ్యాయంలో ప్రస్తావించబడిన ప్రధాన విషయం ఇక్కణ్ణే ప్రారంభమవుతుంది. అయితే హదీసులో ప్రవక్త మహనీయులు (సఅసమ్) తమ పాదాలను కడుక్కునేవారనీ, తమ చెప్పుల మీద మసా చేసేవారు కారనీ స్పష్టంగా, విశదంగా తెలియటం లేదు. కాబట్టి ఇమామ్ బుఖారీ (రె.అలై) గారి వాదన, తర్కం సంపూర్ణంగా లేదు, సంతృప్తి కరంగా లేదు.

167–4. సునన్ అబూ దావూద్‌లో ఇలా ఉంది. ఆయన (సఅసమ్) తమ వస్త్రాలకు వుర్స్ మరియు జాఫ్రాన్ రంగులు వేసేవారు; తాము ధరించే తలపాగాకు కూడా వేసేవారు.

167–5. ఇది జిల్‌హజ్జా 8వ తేదీ. ఈ రోజునే హాజీలు మక్కా నుంచి మినాకు ప్రయాణం చేస్తారు.

31–1. ఇదంతా పండితుల దృష్టిలో 'సున్నత్' అంటే ప్రవక్త (స)గారి సంప్రదాయం. కాని షియా తెగకు చెందినవారు దీనిని వాజిబ్‌గా భావిస్తారు.

168–1. ఇక్కణ్ణుంచే అధ్యాయంలో ప్రస్తావించబడిన విషయం వ్యక్తమవుతుంది. ఎందుకంటే గుసుల్ చేసుకునేటప్పుడు కుడి వైపు నుంచి దానిని ప్రారంభించాలి అనే ఆదేశం ఇవ్వబడినప్పుడు, వుజూలో కూడా అదే వర్తిస్తుంది.

169–1. ఇబ్నె దఖీఖుల్ అయ్‌ద్ ఇలా అన్నారు: లెట్రిన్‌లోకి వెళ్ళటం, మసీదు నుంచి బయటకు రావటం ఈ రెండు విషయాలకు మినహాయింపు ఉంది. ఈ విషయాలను ఎడమ వైపు నుంచి తప్పనిసరిగా ప్రారంభించాలి. ఇవి ముస్తహబే కాని వాజిబు మటుకు కాదు. ఒకసారి ఒక వ్యక్తి హ్రజత్ అలీ (రజిఅన్)ను ఇలా అడిగాడు:

**నీళ్ళ కోసం వెతుకుతున్నారు. కాని నీళ్ళు దొరకలేదు. చివరకు ప్రవక్త మహనీయుని (స) వద్దకు వుజూ కోసం కాసిని నీళ్ళు తీసుకువచ్చారు.[1] ఆయన (స) ఆ నీటిపాత్రలో తమ చేతిని పెట్టి, ఆ పాత్రలోని నీటితో వుజూ ప్రారంభించమని ప్రజలకు చెప్పారు. అనస్ (ర) ఇలా అన్నారు, "ప్రవక్త (స) గారి చేతి వ్రేళ్ళ కింద నుంచి నీరు ప్రవహించటాన్ని నేను చూశాను." అందరూ ఆ నీటితో వుజూ చేసు కున్నారు. చిట్టచివరి మనిషి కూడా వుజూ చేసుకున్నాడు.[2]**

## 33వ అధ్యాయం

**మనిషి తల వెంట్రుకలను కడిగిన నీరు పరిశుభ్రమైనదే. మనిషి తల వెంట్రుకలతో దారాలు, త్రాళ్లు పేనటం 'అతా' గారి దృష్టిలో తప్పు కాదు.[1] ఈ అధ్యాయంలో కుక్కల ఎంగిలికి, మసీదులోకి అవి రావటానికీ, పోవటానికీ సంబంధించిన ప్రస్తావన ఉంది.[2] 'జుహ్రీ' ఇలా అన్నారు. ఒకవేళ కుక్క నీటి పాత్రలో మూతి పెట్టి నాకినట్లయితే, ఆ పాత్రలోని నీరు తప్ప వేరే నీరు లేకపోయినట్లయితే, ఆ నీటితో వుజూ చేసుకోవచ్చు. (సుఫ్యాన్) 'సౌరీ ఇలా అన్నారు: ఖురానులో కూడా ఈ విషయమే ఉంది. ఎందుకంటే, ఒకవేళ నీరు లభ్యం కాకపోతే, తయమ్ముమ్ చేసుకోండి అని అల్లాహ్ సెలవిస్తున్నాడు. కుక్క మూతిపెట్టిన, తాగిన నీరు ఎంగిలి నీరే, కాని దాన్ని గురించి, అది బహుశా అశుద్ధమైనది అనే అనుమానం మనసులో కలిగితే వుజూ, తయమ్ముమ్ రెండూ చేసుకోవచ్చు.[3]**

---

వుజూను కుడి వైపు నుంచి ప్రారంభించాలా లేదా ఎడమ వైపు నుంచా? దానికి సమాధానంగా ఆయన నీళ్ళు తెప్పించి మొదట ఎడమ చేయిని కడిగారు; ఆ తర్వాత కుడి చేయిని కడిగారు. అంటే ఈ విషయం 'వాజిబ్' ఎంత మాత్రం కాదు అని విశదం చేయదలిచారు.

32–1. హజ్రత్ ఆయెషా (ర) గారి ఈ సూక్తిని, ఇమామ్ బుఖారీ (ర.అలై) గారు తయమ్ముమ్ గ్రంథంలో ధ్రువీకరణతో ప్రస్తావించారు.

170–1. ఈ పాత్రలోని నీరు ఒక మనిషి వుజూ చేసుకోవటానికి సరిపోతుంది అని కొందరు అన్నారు. ఈ హదీసులో ప్రవక్త మహనీయుని (స) ఒక పెద్ద మహత్యం ప్రస్తావించబడింది.

170–2. ఈ హదీసుకు సంబంధించిన పూర్తి వివరాలు, ఇన్షా అల్లాహ్ "అలామాతె నుబువ్వత్"లో వస్తాయి.

**171.** ఇబ్నె సీరీన్ ఉల్లేఖనం ఇలా ఉంది: నేను అబీదాతో ఇలా అన్నాను, "ప్రవక్త మహనీయుల (స) తల వెంట్రుకలు కొన్ని మా వద్ద ఉన్నయ్. అవి అనస్ గారి ద్వారానో, లేదా ఆయన కుటుంబ సభ్యుల ద్వారానో మా వద్దకు వచ్చాయి." దానికి సమాధానంగా అబీదా ఇలా అన్నారు, "ఆ వెంట్రుకల్లోని ఒక్క వెంట్రుక అయినా నా వద్ద ఉండి ఉన్నట్లయితే, అది మొత్తం ప్రపంచం కంటే, ప్రపంచంలో ఉన్న వాటికంటే, అది నాకు అత్యంత ఇష్టమైనదిగా ఉండేది."

**172.** హజ్రత్ అనస్ (రజిఅన్) గారి కథనం ఇలా ఉంది: దైవప్రవక్త మహనీయులు (సఅసమ్) హజ్ యాత్రలో ఉన్నప్పుడు శిరోముండనం చేయించుకున్నారు. అప్పుడు అందరికంటే ముందు అబూతల్హ (రజిఅన్) ఆయన (స) గారి తల వెంట్రుకలను తీసుకున్నారు.

## 34వ అధ్యాయం

### వంట పాత్రలలో కుక్క మూతిపెట్టి నాకినప్పుడు.[1]

**173.** దైవప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు: ఒకవేళ కుక్క మీ వంట పాత్రలలోని ఏ పాత్రలో నైనా మూతి పెట్టి నాకితే, అప్పుడు ఆ పాత్రను ఏడుసార్లు కడిగి పరిశుభ్రపరచుకోండి.[1]

**174.** ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు: ఒక వ్యక్తి ఒక కుక్కను చూశాడు. దప్పిక తీవ్రత

---

33–1. దీని ద్వారా తెలిసిన విషయమేమిటంటే, మనుషుల తల వెంట్రుకలు పరిశుభ్రమైనవే. ఇదే విధంగా హలాల్ (ధర్మ సమ్మతమైన) పశువు వెంట్రుకలు కూడా పరిశుభ్రమైనవే. హలాల్ కాని పశువు, జిబహ్ చెయ్యబడని పశువుల వెంట్రుకల విషయంలో అభిప్రాయభేదం ఉంది. అయితే ఎక్కువ మంది విద్వాంసుల దృష్టిలో అవి కూడా పరిశుభ్రమైనవే.

33–2. ఇమామ్ బుఖారీ (ర.అలై) దృష్టిలో కుక్క ఎంగిలి పరిశుభ్ర మైనదే. కాని ఎక్కువ మంది విద్వాంసుల దృష్టిలో అది అశుద్ధమైనది అని ఇమామ్ షౌకానీ అన్నారు. ఇదే విధంగా కుక్కల చొంగ, ఇక్రిమా, మాలిక్ (ర.అలై)ల దగ్గర పరిశుభ్రమైనదే.

33–3. దీనికంటే శ్రేష్ఠమైన పద్ధతి ఏమిటంటే, ఆ నీటిని పార బొయ్యటం, అప్పుడు అందరి దృష్టిలో తయమ్ముమ్ చేసుకోవటం సరైనదిగా, సక్రమమైనదిగా అయిపోతుంది. పంది విషయంలో కూడా ఈ ఆజ్ఞయే వర్తిస్తుంది. ఇమామ్ మాలిక్ (ర.అలై) పంది ఎంగిలి కూడా పరిశుభ్రమైనది అన్నారు. ఇతర విద్వాంసుల దృష్టిలో అది 'నజస్' అంటే అశుద్ధమైనది.

**వల్ల అది తడిసిన మట్టిని నాకుతోంది. అతను తన మేజోడును తీసి దాన్ని నీళ్లతో నింపి ఆ కుక్కకు నీళ్ళు తాపాడు. చివరకు దాని కడుపు నిండిపోయింది, దాని దప్పిక తీరిపోయింది. అల్లాహ్ అతను చేసిన ఈ పుణ్యకార్యాన్ని మెచ్చుకున్నాడు, తరువాత అతనికి స్వర్గాన్ని ప్రసాదించాడు.[1]**

**తన తండ్రిగారైన అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా చెప్పారని హమ్‌జా బిన్ అబ్దుల్లా అన్నారు : దైవప్రవక్త (సఅసమ్) గారి శుభప్రదమైన కాలంలో కుక్కలు మసీదులోకి వస్తూ పోతూ ఉండేవి (మస్జిదే నబవీలోకి). ఎందుకంటే దానికి తలుపులు ఉండేవి కావు. అయినప్పటికీ కుక్కలు మూత్రం పోసిన ఏ స్థలంలోనూ నీళ్లు చల్లేవారు కాదు.[2]**

---

34–1. ఇమామ్ బుఖారీ (ర.అలై) ఏమంటారంటే, ఈ అధ్యాయానికి సంబంధించిన హదీసు ప్రకారం కుక్క ఎంగిలి వల్ల ఏర్పడే అశుద్ధత దూరం కాదు. ఒకవేళ ఏడు సార్లు పాత్రను కడగటం అనేది అశుద్ధతను దూరం చేయటానికే అయితే, కుక్క కంటే పంది చాలా అశుద్ధమైనది. పంది ఎంగిలి చేసిన పాత్రను ఏడుసార్ల కంటే కూడా ఎక్కువసార్లు కడిగే ఆజ్ఞను ప్రవక్త (స) ఇచ్చి ఉండేవారు. ఈ ఆజ్ఞ కేవలం ముందు జాగ్రత్త కోసమే. ఎందుకంటే కొన్ని కుక్కల ఎంగిలి విషపూరితమైనదిగా ఉంటుంది.

173–1. ఈ హదీసును గురించి ఇమామ్ బుఖారీ (ర.అలై) గారు ఒక వివరణ ఇచ్చారు, అదేమిటంటే, కుక్క ఎంగిలి చేసిన పాత్రను ఏడుసార్లు కడిగి పరిశుభ్రపరచుకోమనే ఆజ్ఞ అశుద్ధత కారణంగా ఇవ్వబడినటువంటి ఆజ్ఞ కాదు. ఎందుకంటే, పంది దీనికన్నా అశుద్ధమైనది. కాని దాని ఎంగిలి పాత్రను మూడుసార్లు కడిగితే సరిపోతుంది.

174–1. కుక్క ఎంగిలి పరిశుభ్రమైనదనే విషయాన్ని ఇమామ్ బుఖారీ(ర.అలై) ఈ హదీసు ద్వారా నిరూపించారు. ఎందుకంటే కుక్క ఆ వ్యక్తి మేజోడులోని నీళ్ళను త్రాగింది. వాస్తవానికి హదీసులో అతను తన మేజోడును కడిగినట్లుగాని, పరిశుభ్రపరచుకున్నట్లుగాని ప్రస్తావించబడలేదు. వ్యతిరేకులు ఏమంటారంటే, హదీసులో ప్రస్తావన లేకపోయినంత మాత్రాన, అతను తన మేజోడును కడగలేదని గట్టిగా, నిష్కర్షగా చెప్పలేము. రెండో విషయం, అతను తన మేజోడును నీళ్లతో నింపి ఎక్కడైనా వేరే చోట ఆ నీళ్లను పోసి ఉండవచ్చు. కుక్క ఆ నీళ్లను త్రాగి ఉండవచ్చు అనే విషయమూ సంభవమే. మూడో విషయం, ఇక్కడ పూర్వకాలపు ముస్లిం

**175.** అదీ బిన్ హాతిమ్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: నేను దైవప్రవక్త (సఅసమ్)ను వేట కుక్కలను గురించి అడిగాను. ఆయన (స) ఇలా సెలవిచ్చారు: "నీవు శిక్షణ (తర్ఫీదు) ఇచ్చిన నీ పెంపుడు కుక్కను వేట కోసం వదిలిపెట్టినప్పుడు, అది గనక ఏదైనా జంతువును వేటాడితే, నీవు దానిని తిను. అది గనక ఆ జంతువు యొక్క కొంత మాంసాన్ని తిన్నట్లయితే అప్పుడు నీవు దానిని తినకూడదు. ఎందు కంటే, అది ఆ జంతువును తన కోసం వేటాడింది." నేను మళ్ళీ ఇలా అడిగాను: "ఎప్పుడైనా నేను నా కుక్కను షికారు కోసం వదిలినప్పుడు, అక్కడ నా కుక్కతోపాటు మరొక కుక్క కూడా ఉంటుంది." దానికి సమాధానంగా ఆయన (స) ఇలా సెలవిచ్చారు: "అప్పుడు ఆ కుక్కలు వేటాడిన జంతువును నీవు తినకూడదు. ఎందుకంటే నీవు నీ కుక్క మీదనే 'బిస్మిల్లాహ్' పఠించావు. రెండో కుక్క మీద కాదు కదా!"[1]

## 35వ అధ్యాయం

**మనిషి యొక్క ముందు, వెనుక మార్గాల నుంచి వెలువడే హదస్ (అశుద్ధత) వల్ల వుజూ అనివార్యమవుతుంది. ఎందుకంటే ఖురాను గ్రంథంలోని మాయిదా (5 :6)**

---

సమాజాలను గురించి ప్రస్తావించటం జరిగింది. వాటి షరీయత్తులో బహుశా కుక్క ఎంగిలి అశుద్ధమైనది కాకపోవచ్చు.

174–2. ఈ విషయం గురించి ఒక హదీసులో ఏమని వచ్చిందంటే, కుక్కలు మసీదులో మూత్రం పోసేవి కూడా. ఒకవేళ కుక్క నజస్ (అశుద్ధమైనది) అయితే రేయింబవళ్ళు మసీదును పరిశుభ్రపరచవలసి వచ్చేది. ముఖాలిఫీన్ ఏమంటారంటే; ఆ కాలంలో మసీదు నేల తడిగా ఉండేది. కనుక కుక్కల రాక పోకల వల్ల అది అశుద్ధం కాదు. ఎందుకంటే నేల ఎండి పోయినప్పుడు దానంతట అదే పరిశుభ్రమైపోతుంది.

175–1. కుక్క ఎంగిలి పరిశుభ్రమైనది అనే విషయానికి ఆధారంగా ఇమామ్ బుఖారీ (ర.అలై) గారు ఈ హదీసును తీసుకున్నారు. ఎందుకంటే, కుక్క ఏదైనా జంతువును వేటాడినప్పుడు, అది దానిని తన నోటితో పట్టుకుంటుంది; ఇంకా ప్రవక్త మహ నీయులు (స) ఆ జంతువును కడగమని, పరిశుభ్రపరచుకోమని అదీ (ర.అలై)ను ఆజ్ఞాపించలేదు. ముఖాలిఫీన్ ఏమంటారంటే, ఈ హదీసులో దీని ప్రస్తావన లేకపోయినంత మాత్రాన కడిగే అవసరం లేదు అని ఖచ్చితంగా చెప్పలేము. అదీ (రజిఅన్)కు, కుక్క ఎంగిలి చేసినదాన్ని కడగటం అవసరం అనే విషయం తెలుసు అని అనుకుని ప్రవక్త మహనీయులు (స) దాన్ని గురించి ప్రస్తావించలేదు.

**సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు, "మీలో ఎవరైనా కాలకృత్యాలు తీర్చుకొని వస్తే"[1] 'అతా' అలా అన్నారు: "మనిషి యొక్క వెనుక మార్గం (మల విసర్జన మార్గం) నుంచి ఏదైనా పురుగు వెలువడినట్లయితే లేదా మనిషి యొక్క ముందు మార్గం (మూత్ర విసర్జన మార్గం)నుంచి పేనులాంటిది ఏదైనా క్రిమి బయటికి వచ్చినట్లయితే, అప్పుడు మళ్ళీ తప్పనిసరిగా వుజూ చేసుకోవాలి.[2] హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజిఅన్) ఇలా అన్నారు: "నమాజు స్థితిలో ఉన్నప్పుడు ఎవరైనా బిగ్గరగా నవ్వితే, అప్పుడు అతను ఆ నమాజును మళ్ళీ చెయ్యాలి. కాని వుజూ మళ్ళీ చేసుకునే అవసరం లేదు."[3] ఇమామ్ హసన్ బసరీ (ర.అలై) ఇలా సెలవిచ్చారు: ఎవరైనా శిరోముండనం చేయించుకుంటే, గోళ్ళను కత్తిరించుకుంటే, మేజోళ్ళను కాళ్ళల్లో నుంచి తీసి వేస్తే అప్పుడు కూడా మళ్ళీ వుజూ చేసు కునే అవసరం లేదు.[4] హజ్రత్ అబూ హురైరా (రజిఅన్), హదస్ వల్లనే వుజూ చేసు కోవడం అనివార్యమవుతుంది అని అన్నారు.[5] హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఒకసారి 'జాతుర్రిఖా'[6] యుద్ధంలో**

---

35–1. ఈ వాక్యం ఖుర్ఆన్‌లోని మాయిదా సూరాలో ఉంది. ఇందులో అల్లాహ్ రెండు రకాల హదస్‌ను గురించి చెప్పాడు. ఒక హదస్ వల్ల వుజూ విరిగిపోతుంది. అంటే అది హదసె అస్గర్ అన్నమాట – (చిన్న అశుద్ధత). రెండో హదస్ వల్ల గుసుల్ (తలంటి స్నానం) అనివార్యమైపోతుంది. అంటే అది హదసె అక్బర్ (పెద్ద అశుద్ధత) అన్నమాట. కనుక 'గాయత్' అంటే హదసె అస్గర్ అని భావం. 'తామస్ తమున్నిసా' అంటే హదసె అక్బర్ (పెద్ద అశుద్ధత) అని భావం. అసలు గాయత్ అంటే అశుద్ధత వెలువడే స్థలాన్ని లేక స్థానాన్ని అంటారు. కాని భావపరంగా 'సబీలైన్' ద్వారా అంటే ముందు, వెనుక మార్గాల ద్వారా వెలువడే దాన్ని 'గాయిత్' అంటారు. కనుక అల్లాహ్ దానినే హదస్‌గా నిర్ణయించాడు. 'ముఖాలిఫీన్' ఏమంటారంటే, అసలు ఇక్కడ పట్టుకోవటం పరిష్వంగంలోకి తీసుకోవటం అనేది లేనేలేదు. అదీగాక 'లామస్‌తమ్' అంటే స్త్రీని ముట్టుకోవటం, తాకటం అని అర్థం. కనుక హదసె అస్గర్ కిందికే వస్తుంది. దీని కారణంగా వుజూ విరిగిపోతుంది. షాఫయీ మస్లక్ వారు, కొందరు అహ్లె హదీస్ మస్లక్ వారు కూడా ఈ అభిప్రాయాన్నే సమర్థించారు.

35–2. అహ్లె హదీస్, షాఫయీ మస్లక్, అహ్మద్ మరియు జమ్‌హూర్ విద్వాంసులందరూ ఈ అభిప్రాయాన్నే సమర్థిస్తున్నారు. కాని ఇమామ్ మాలిక్ (ర.అలై) ఏమంటారంటే, ఎప్పుడైనా మామూలుకు భిన్నంగా ఏదైనా వస్తువు గనక ముందు, వెనుక మార్గాల ద్వారా వెలువడినట్లయితే దానివల్ల వుజూ విరిగిపోదు.

35–3. దీనిద్వారా విశదమైన విషయం ఏమిటంటే, నమాజు స్థితిలో ఉన్నప్పుడు బిగ్గరగా

**పాల్గొన్నప్పుడు ఒక వ్యక్తికి నమాజు స్థితిలో ఉన్నప్పుడు ఒక బాణం వచ్చి తగిలింది. ఆ గాయం నుంచి చాలా రక్తం కారింది. కాని అతను రుకూ చేశాడు. సజ్దా చేశాడు, నమాజు పూర్తి చేసుకుని వెళ్ళిపోయాడు. ఇమామ్ హసన్ బసరీ (ర.అలై), ముస్లిములు గాయాలై నప్పటికీ నమాజు చేసేవారు అని అన్నారు.[7] తావుస్, ఇమామ్ ముహమ్మద్ బాఖర్ (రజి అన్), అతా మరియు హిజాజ్ ప్రాంతవాసులు ఇలా అన్నారు; రక్తం కారినంత మాత్రాన వుజూ విరిగిపోదు. అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఒకసారి తమ శరీరం మీద ఉన్న మొటిమను గట్టిగా నొక్కారు. దానిలో నుంచి రక్తం కారింది. అయినప్పటికీ ఆయన మళ్ళీ వుజూ చేసుకోలేదు. ఒకసారి ఇబ్నె అబీ ఔఫా (రజిఅన్) రక్తాన్ని ఉమ్మివేశారు. అయినా నమాజు చేశారు. హజ్రత్ ఇబ్ను ఉమర్ (రజిఅన్), హజ్రత్ హసన్ బసరీ (ర.అలై) ఇలా అన్నారు: (రక్తశుద్ధి కోసం చికిత్సగా చేయించుకునే) హిజామా వల్ల వుజూ భంగం కాదు. కేవలం హిజామా చేయించుకున్న చోట కడుక్కుంటే సరిపోతుంది.[8]**

---

నవ్వటం హదస్ కానేకాదు. అహ్లె హదీస్ పండితులు, జమ్‌హూర్ విద్వాంసులు ఈ అభిప్రాయాన్నే కలిగి వున్నారు. కాని హనఫీ మస్లక్ పండితుల దృష్టిలో నమాజులో బిగ్గరగా నవ్వటం వల్ల వుజూ భంగమవుతుంది.

35-4. అంటే అతను వుజూ చేసుకునేటప్పుడు తల వెంట్రుకల మీద కాలి మేజోళ్ళ మీద మసా చేశాడు. కాని ఇప్పుడు తలమీద వెంట్రుకలూ లేవు, కాళ్ళకు మేజోళ్ళూ లేవు.

35-5. హజ్రత్ అబూ హురైరా (రజిఅన్), అపాన వాయువు శబ్దంగా వచ్చినా, నిశ్శబ్దంగా వచ్చినా అది హదస్ కిందికే వస్తుంది అని అన్నారు. ఈ విషయం పైన ప్రస్తావించబడింది.

35-6. 'జాతుర్రిఖా' ఒక యుద్ధం పేరు. ఆ యుద్ధంలో ప్రవక్త (స) గారి అనుచరులు అంటే సహాబాలు తమ జెండాల మీద అతుకులు వేశారు. కొందరు 'జాతుర్రిఖా' ఆ ప్రాంతంలోని ఒక వృక్షం పేరు అని అంటారు.

35-7. రక్తం కారటాన్ని వారు లెక్క చెయ్యలేదు. ఇంకా రక్తం కారటాన్ని వారు హదస్‌గా భావించనూ లేదు.

35-8. హనఫీ మస్లక్ వారు, ఇమామ్ అహ్మద్ (ర.అలై) ఇస్‌హాఖ్‌ల దృష్టిలో ప్రవహించే రక్తం వెలువడటం వల్ల వుజూ విరిగిపోతుంది. ఇమామ్ మాలిక్, ఇమామ్ షాఫయి, అనేకమంది అహ్లె హదీస్ విద్వాంసుల ప్రకారం రక్తం వెలువడటం వల్ల వుజూ విరిగిపోదు. అది ప్రవహించే రక్తమైనా సరే, మేము 'తస్‌హీలుల్ ఖారీ'లో ఇమామ్ అబూ హనీఫా (ర.అలై), ఇమామ్ ముహమ్మద్ (ర.అలై)ల యొక్క సాక్ష్యాలనూ, ఆధారాలనూ గురించి చర్చించాము. చివర్లో మేము ఇలా వ్రాశాము: ఈ

**176.** ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు; "దాసుడు నమాజులోనే ఉంటాడు (నమాజు పుణ్యం అతనికి లభిస్తూనే ఉంటుంది)– అతను మసీదులో నమాజు కోసం నిరీక్షించే అంతవరకు. అయితే అతనికి హదస్ కాకూడదు. ఒక పరాయి దేశవాసి (అరబ్బేతర వ్యక్తి)[1] "ఓ అబూ హురైరా! హదస్ అంటే ఏమిటి?" అని అడిగాడు. దానికి ఆయన, హదస్ అంటే శబ్దం అంటే అపాన వాయువు అని చెప్పారు.

**177.** మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని, మా బాబాయి అబ్దుల్లా బిన్ జైద్ (రజిఅన్) చెప్పగా, తాను విన్నానని అబ్బాద్ బిన్ తమీమ్ ఉల్లేఖించారు: హదస్‌కు సంబంధించిన శబ్దాన్ని వినే అంతవరకు లేదా దుర్వాసన వచ్చే అంతవరకు నమాజును వదిలిపెట్టి వెళ్ళిపోకూడదు.[1]

**178.** హజ్రత్ అలీ (రజిఅన్) ఇలా అన్నారు: నాకు చాలా ఎక్కువగా మజీ వెలువడుతూ ఉంటుంది.[1] నేను ఆ సమస్యను గురించి ప్రవక్త మహనీయులను (సఅసమ్) అడగటానికి సిగ్గుపడ్డాను.[2] అప్పుడు నేను ఈ విషయం గురించి ఆయన

---

అధ్యాయంలో 'మర్ఫూస్సహీ' హదీసు (ఉల్లేఖకుల పరంపర దైవ ప్రవక్త (సఅసమ్) వద్దకు చేరిన హదీసును సహీ హదీసు అంటారు). ఎవరి తరఫు నుంచి ప్రస్తావించబడలేదు. కావున ఎవరైనా రక్తం కారటం వల్ల ముందు జాగ్రత్తగా ఒకవేళ వుజూ చేసుకుంటే అది వేరే విషయం. ఎవరైనా వుజూ చేసుకోకపోతే ఫర్వాలేదు. అంటే వుజూ తప్పనిసరి కాదు అని భావం.

176–1. బహుశా ఈ వ్యక్తి హజర్‌మౌత్ నివాసి అయి ఉండవచ్చు. అతని ప్రస్తావన కితాబుల్ వుజూ ప్రారంభంలో వచ్చింది.

177–1. అంటే హదస్ అయిందో, కాలేదో అని నమాజులో ఉన్న నమాజీకి సందేహం కలిగితే, అప్పుడు హదస్‌ను గురించి గట్టి నమ్మకం ఏర్పడే అంతవరకు నమాజు చేస్తూ ఉండాలి. ఉదాహరణకు, హదస్‌కు సంబంధించిన శబ్దం వినటం లేదా దుర్వాసన రావటం. దానికి కారణం పైన ప్రస్తావించబడింది. అంటే గట్టి నమ్మకం ఉన్న విషయం అనుమానం వల్లగాని, సందేహం వల్లగాని వృధా కాదు. మలమూత్రాలను విసర్జించటం గట్టి నమ్మకానికి సంబంధించిన విషయం. కాని హదస్ తాత్కాలికమైనది.

178–1. 'మజీ' అంటే మర్మాంగం నుంచి వెలువడే ఒక ద్రవ పదార్థం. అది సంభోగ

**(స) గారిని అడగమని మిఖ్‌దాద్ బిన్ అస్వద్‌కు చెప్పాను. అతను ప్రవక్త (స) గారిని అడగ్గా ఆయన (స), "అప్పుడు మళ్లీ వుజూ చేసుకోవాలి" అని సెలవిచ్చారు. ఈ హదీసును జరీర్ మాదిరిగా షూబ గారు కూడా, ఆమష్ నుంచి తీసుకున్నారు.**

**179. హజ్రత్ జైద్ బిన్ ఖాలిద్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: నేను హజ్రత్ ఉస్మాన్ (రజిఅన్)ను ఇలా అడిగాను, ఒక వ్యక్తి సంభోగించాడు, కాని వీర్యస్ఖలనం జరగలేదు. అప్పుడు అతను గుసుల్ (తలంటిస్నానం) చెయ్యవలసిన అవసరం ఉందా? లేదా? దానికి సమాధానంగా ఆయన (ర) ఇలా అన్నారు, "అలాంటి పరిస్థితి లో అతను నమాజు కోసం చేసుకునే వుజూ లాంటి వుజూను చేసుకోవాలి. ఇంకా తన మర్మాంగాన్ని కడుక్కోవాలి." హజ్రత్ ఉస్మాన్ (ర) ఇంకా ఇలా అన్నారు; నేను దైవప్రవక్త (సఅసమ్) ఇలా చెప్పగా విన్నాను. (ఒకవేళ పురుషుడి మర్మాంగం స్త్రీ మర్మాంగంలోకి ప్రవేశించిన తరువాత కూడా వీర్యస్ఖలనం జరగకపోతే అప్పుడు గుసుల్ అవసరం లేదు, వుజూ సరిపోతుంది) ఆ తరువాత నేను ఇదే సమస్యను గురించి హజ్రత్ అలీ (ర), హజ్రత్ జుబైర్ (ర), హజ్రత్ తల్హా (ర), ఉబై బిన్ కాబ్ (ర) గార్లను అడిగాను. వారు కూడా ఈ ఆదేశాన్నే ఇచ్చారు.[1]**

---

ప్రారంభానికి ముందు ముద్దు పెట్టుకునేటప్పుడు, ఆలింగనం చేసుకునేటప్పుడు వెలువడుతుంది. 'మనీ' అంటే మర్మాంగం నుంచి దూకుడుగా ఎక్కువ పరిమాణంలో వెలువడే ఒక ద్రవ పదార్థం. అది తీవ్రమైన కామవాంఛతో దుముకుతూ వెలువడు తుంది. దాని స్ఖలనం తరువాత కామవాంఛ తగ్గిపోతుంది. 'వదీ' అంటే మూత్ర విసర్జనం తరువాత మర్మాంగం నుంచి వెలువడే ఒక ద్రవ పదార్థం.

178-2. మరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది : హజ్రత్ అలీ (ర) సిగ్గుపడటానికి కారణం, ప్రవక్త (స) గారి కుమార్తె హజ్రత్ ఫాతిమా (ర) తన భార్య కావటమే.

179-1. ఎంతో మంది సహాబా మరియు అహెలె జాహిర్ ఈ అభిప్రాయాన్నే కలిగి ఉన్నారు. అంటే కేవలం అంగ ప్రవేశం జరిగి వీర్యస్ఖలనం జరగకపోతే గుసుల్ వాజిబ్ కాదు. హదీసులో కూడా ఈ విషయమే ఉంది "ఇన్నమల్ మాఉ మినల్ మా." కాని చాలా మంది విద్వాంసులు, నలుగురు ఇమాముల అభిప్రాయం ఏమిటంటే, వీర్యస్ఖలనం జరిగినా, జరక్కపోయినా పురుషాంగం లోపలకు ప్రవేశిస్తే చాలు, గుసుల్ వాజిబ్ అంటే అనివార్యమయిపోతుంది. వారు 'ఇన్నమల్ మాఉ మినల్ మావు' హదీసు రద్దయిపోయింది అంటారు. అయితే ఇమామ్ బుఖారీ (ర.అలై) గారి దృష్టిలో ఈ హదీసు రద్దు కాలేదు. ఆయన ఏమంటారంటే, ఒకవేళ గుసుల్ చేసుకుంటే

**180. అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఒకసారి దైవప్రవక్త మహనీయులు (సఅసమ్) ఒక అన్సారీ వ్యక్తిని పిలిపించారు. అతను తన తల నుంచి నీటి బిందువులు రాలుతూ ఉన్న స్థితిలో వచ్చాడు. అప్పుడు ప్రవక్త (స) అతనితో ఇలా అన్నారు: "బహుశా మేము నిన్ను తొందరపెట్టామను కుంటాము."[1] అతను, 'అవును' అని అన్నాడు. అప్పుడు ఆయన (స) ఇలా సెలవిచ్చారు: "నీవు గనక తొందరపాటులో ఉంటే లేదా నీకు వీర్యస్ఖలనం కాకపోతే అప్పుడు నీవు వుజూ చేసుకో (గుసుల్ చేసుకునే అవసరం లేదు)." ఈ హదీసును షూబా ఉల్లేఖించారని నజర్‌తో పాటు వహబ్ కూడా చెప్పారు. ఇమామ్ బుఖారీ (ర.అలై) ఏమన్నారంటే, గుందర్ మరియు యహ్‌యా గార్లు షూబా నుంచి తీసుకున్న ఈ హదీసులో వుజూను గురించి ప్రస్తావించలేదు.[2]**

## 36వ అధ్యాయం

### ఏ వ్యక్తి అయినా తన సహచరుడు వుజూ చేసుకోవటంలో తోడ్పడం గురించి...

**181. ఉసామా బిన్ జైద్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) అరఫాత్ నుంచి తిరిగివచ్చినప్పుడు ఆయన (స) ఒక పర్వత మార్గం వైపునకు మళ్ళారు (అసలు మార్గాన్ని వదలిపెట్టి వెళ్ళారు). అక్కడ ఆయన (స) కాలకృత్యాలు తీర్చుకున్నారు. ఉసామా (ర) ఇలా అన్నారు; "నేను నీళ్ళు పోస్తూ ఉంటే ఆయన (స) వుజూ చేసుకోసాగారు. తరువాత నేను, "దైవప్రవక్తా! మీరు నమాజు చేసుకుంటారా?" అని అడిగాను. దానికి సమాధానంగా ఆయన (స),**

---

ఎక్కువ జాగ్రత్త తీసుకున్నట్లవుతుంది. కాని వుజూ కూడా సరిపోతుంది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇన్షాఅల్లాహ్, 'కితాబుల్ గుసుల్'లో వస్తాయి.

180–1. అంటే వీర్యస్ఖలనం జరక్కముందే వచ్చేశాడన్నమాట. అదీగాక ప్రవక్త మహనీయులు (స) పిలుస్తున్నారని గాభరా పడుతూ సంభోగ చర్యను విడనాడి తొందర తొందరగా గుసుల్ చేసుకుని వెంటనే వచ్చేశాడు.

180–2. గుందర్, యహ్‌యాల ఉల్లేఖనాలను ఇమామ్ అహ్‌మద్ (ర) 'ముస్‌నద్' (ఇతరుల ధృవీకరణలు) ద్వారా తీసుకున్నారు. యహ్‌యా గారి ఉల్లేఖనంలో ఇలా వుంది: "నీవు గుసుల్ చేసే అవసరం లేదు." గుందర్‌గారి ఉల్లేఖనంలో ఇలా ఉంది: "నీవు గుసుల్ చేసే అవసరం లేదు, వుజూ చేసుకో." బహుశా ఇమామ్ బుఖారి (ర.అలై) గారి 'షేఖ్' ఉటంకించిన 'గుందర్' గారి ఉల్లేఖనంలో వుజూ ప్రస్తావన లేకపోవచ్చు.

**"కొంచెం ముందుకు పోయిన తరువాత నమాజు చేసుకుందాము" అని సెలవిచ్చారు.[1]**

**182. ముగీరా బిన్ షూబా (రజిఅన్) గారి ఉల్లేఖనం ఇలా ఉంది: దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్)తో ముగీరా బిన్ షూబా (రజిఅన్) ఒకసారి ప్రయాణం చేశారు. ఆ ప్రయాణంలో ప్రవక్త మహనీయులు (స) కాలకృత్యాలు తీర్చుకోవటానికి వెళ్లారు. తిరిగి వచ్చిన తరువాత, ముగీరా (రజిఅన్) ఆయన (స)కు నీళ్లు పోస్తూ పోయారు, ఆయన (స) వుజూ చేసుకున్నారు, ఆయన (స) తమ ముఖాన్ని కడుక్కున్నారు, రెండు చేతుల్నీ కడుక్కున్నారు. తలపై మసా చేశారు, రెండు మేజోళ్ల మీద కూడా మసా చేశారు.**

## 37వ అధ్యాయం

**వుజూ లేకుండా ఖురాను గ్రంథాన్ని పఠించటం (వ్రాయటం) మొదలైనటువంటివి సక్రమమైనవే.[1] ఇబ్రాహీమ్ నఖయీ ఇలా చెప్పారని మన్సూర్ ఉదహరించారు. బాత్‌రూమ్ (స్నానాల గది)లో ఖురాను చదవటం దోషం కాదు.[2] ఉత్తరం మొదలైనటువంటివి వుజూ లేకుండా వ్రాయవచ్చు.[3] హమ్మాద్ బిన్ అబూ సులైమాన్ ఇబ్రాహీమ్ ఇలా అన్నారని ఉదాహరించాడు. బాత్ రూమ్‌లో స్నానం చేసే వాళ్లు లుంగీ కట్టుకుని స్నానం చేస్తూ ఉన్నట్లయితే, వారికి సలాము చెయ్యవచ్చు, లేకపోతే లేదు.[4]**

---

181-1. అంటే ముజ్‌దలిఫాకు వెళ్ళిన తరువాత. ఈ హదీసు ఇదివరకే వచ్చింది. దీని ద్వారా విశదమైన విషయం ఏమిటంటే, వుజూ చేసుకునేటప్పుడు ఇతరుల సహాయం పొందటం దోషమేమీ కాదు, ధర్మసమ్మతమైన విషయమే. ఇంకా ఇది దైవప్రవక్త (స) సంప్రదాయానికి విరుద్ధమైనది కూడా కాదు. ప్రవక్త మహనీయుని (స) ఆచరణ శ్రేష్ఠమైనదే, ఉత్కృష్టమైనదే.

37-1. కొందరు ఇలా అనువాదం చేశారు; ఖురాను గ్రంథం మొదలైనవి చదవటం, పవిత్ర దైవనామాన్ని స్మరించటం, దుఆలు చేయటం మొదలైనవి వుజూ లేకుండా చేసుకోవచ్చు. అందులో దోషం లేదు. అదీ సక్రమమైనదే.

37-2. బాత్‌రూమ్‌లో మనిషి సాధారణంగా వుజూ లేకుండా ఉంటాడు. కొందరు దీన్ని మక్రూహ్‌గా భావించారు. అంటే అవాంఛనీయమైనదిగా భావించారు.

37-3. ఉత్తరం ప్రారంభం చేసేటప్పుడు ఒక్కోసారి 'బిస్మిల్లాహ్' అని (అల్లాహ్ పేరుతో) అని వ్రాస్తారు. మరొకప్పుడు ఏదైనా ఖురాను వాక్యాన్ని లేదా హదీసు సూక్తిని వ్రాస్తారు.

**183.** **హ్జ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఆయన ఒకనాటి రాత్రి విశ్వాసుల తల్లి అయిన మైమూన (రజిఅన్) ఇంట్లో విశ్రాంతి తీసుకున్నారు. ఆమెగారు ఆయనకు పిన్ని, ప్రవక్త (స) గారికి భార్య అవుతారు. ఇబ్నె అబ్బాస్ ఇలా అన్నారు : నేను పడక మీద అడ్డంగా పడుకున్నాను. ప్రవక్త మహనీయులు (స) మరియు ఆయన భార్య నిలువుగా పడుకున్నారు. తరువాత ఆయన (స) నిద్ర పోయారు. అర్థ రాత్రి అయినప్పుడు లేదా దానికంటే కొంచెం ముందు లేదా దానికి కొంచెం తరువాత ఆయన (స) నిద్ర నుంచి మేల్కొన్నారు, కూర్చొని తమ కళ్ళను చేత్తో రుద్దుకున్నారు. ఆ తరువాత ఆలి ఇమ్రాన్ సూరాలోని చివరి పది వాక్యాలను పఠించారు (ఇన్న ఫీ ఖల్ఖిస్సమావాతి నుంచి చివరి వరకు)[1]. ఆ పిదప వ్రేలాడుతూ ఉన్న ఒక పాత నీళ్ళ తోలు సంచి వద్దకు వెళ్ళారు. ఆ సంచిలోని నీళ్ళతో హాయిగా, తృప్తికరంగా వుజూ చేసుకున్నారు. తరువాత నిలబడి నమాజు చెయ్య సాగారు. ఇబ్నె అబ్బాస్ ఇంకా ఇలా అన్నారు; నేను కూడా నిలబడ్డాను, ప్రవక్త (స) ఎలా చేశారో నేనూ అలానే చేశాను. తరువాత నేను ఆయన (స) గారి ప్రక్కన నిల్చున్నాను. అప్పుడు ఆయన (స) ప్రేమతో తమ కుడి చేతిని నా శిరస్సు మీద పెట్టారు. నా**

---

37-4. ఎందుకంటే బాత్రూమ్లో నగ్నంగా స్నానం చెయ్యటం. సతర్ ఆచ్ఛాదనం విప్పటం నిషిద్ధం, ధర్మశాస్త్రంలో లేని కొత్త విషయం. కనుక నిషిద్ధ స్థితిలో లేదా విచిత్రమైన శాస్త్రబద్ధం కానటువంటి స్థితిలో ఉన్న వారికి సలాము చెయ్యకూడదు. వారికి సలాము చేసినప్పుడు వారు నగ్నంగా ఉన్నట్లయితే వారు నగ్న స్థితిలో సలాముకు సమాధానం చెబుతారు. అటువంటి స్థితిలో అల్లాహ్ పవిత్ర నామాన్ని స్మరించటం మక్రూహ్ అంటే అసహ్యకరమైనది మరుగుదొడ్డిలో మాదిరిగానే.

183-1. పైన అధ్యాయంలో వచ్చిన ప్రధాన విషయం ఇక్కడ ప్రస్తావించబడింది. ఎందుకంటే ప్రవక్త మహనీయులు (సఅసమ్) వుజూ లేకుండానే ఖురాను వాక్యాలు చదివారు. దీనిపై కొందరు ఒక అభ్యంతరం లేవనెత్తారు; అదేమిటంటే, నిద్రపోవటం వల్ల దైవప్రవక్త (స) గారి వుజూ భంగమయ్యేది కాదు. కనుక ఆయన (స) గారి వుజూ విరిగి పోవటం, వుజూ లేకుండా ఉండటం అనేది సమస్యే కాదు. దానికి సమాధానం ఏమిటంటే; ఆయన గారు వుజూ చేసుకున్నారు గనక ఆయన గారి వుజూ విరిగిపోయింది అనే విషయం స్పష్టమవుతోంది. రెండవ విషయమేమిటంటే, ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఆ రాత్రి తమ భార్యతో పడుకున్నారు; స్త్రీని ముట్టుకోవటం

**కుడి చెవిని పట్టుకుని దానిని మెలిక తిప్పసాగారు. దాని తరువాత ఆయన (స) తహజ్జుద్ నమాజు రెండు రకాతులు చేశారు, తరువాత రెండు రకాతులు చేశారు. మళ్ళీ రెండు రకాతులు చేశారు, తరువాత కూడా రెండు రకాతులు చేశారు. ఆ తరువాత రెండు రకాతులు చేశారు, చివర్లో రెండు రకాతులు, అన్నీ కలిపి పన్నెండు రకాతులు నమాజు చేశారు. ఆ తరువాత వితర్ నమాజు చేశారు, తరువాత మౌజన్ వచ్చే వరకు విశ్రాంతి తీసుకున్నారు. మౌజన్ వచ్చిన తరువాత ఆయన (స) తెలికపాటి రెండు రకాతుల నమాజు చేశారు (అంటే ఉదయపు రెండు రకాతుల సున్నత్ నమాజు). ఆ తరువాత బయటకు వచ్చి మసీదుకు పోయి ఉదయపు (ఫరజ్) నమాజుకు సారథ్యం వహించారు.**

## 38వ అధ్యాయం

### పూర్తిగా స్పృహ కోల్పోయినప్పుడు వుజూ విరిగిపోతుంది.[1]

**184. అస్మా బిన్త్ అబీ బకర్ (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు: ఒకసారి సూర్యుడికి గ్రహణం పట్టినప్పుడు నేను విశ్వాసుల తల్లి, దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) గారి భార్య అయిన హజ్రత్ ఆయెషా (రజిఅన్) గారి ఇంటికి వెళ్లాను. అక్కడ ప్రజలు నిలబడి నమాజు చేస్తున్నారు. ఆయెషా (రజిఅన్) గారు కూడా నమాజులో నిలబడ్డారు. నేను ఆమెగారిని (రజిఅన్‌హా) (నమాజు స్థితిలో ఉన్నప్పుడే), ప్రజలకేమయింది, నమాజు చేస్తున్నారు అని అడిగాను. ఆమెగారు ఆకాశం వైపు చేత్తో సైగ చేస్తూ 'సుబ్‌హానల్లాహ్" (అల్లాహ్ పరిశుద్ధుడు) అని అన్నారు. అప్పుడు నేను, "అది రాబోయే దైవశిక్షకేమైనా సంకేతమా" అని అడిగాను. ఆమెగారు సంజ్ఞ చేస్తూ,**

---

వలన వుజూ లోపభూయిష్టమైనదిగా అయిపోతుంది. కొందరు ఏమన్నారంటే, ఈ హదీసులో ఇబ్నె అబ్బాస్ (రజిఅన్), దైవప్రవక్త (సఅసమ్) ఎలా చేశారో, నేను కూడా అలానే చేశాను అని ఉల్లేఖించారు. ఇమామ్ బుఖారీ (ర.అలై) దీన్ని ఆధారంగా తీసుకున్నారు, ఎందుకంటే, ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఆ సమయంలో వుజూలో లేరు, ఆయన కూడా ఈ ఖురాను వాక్యాలనే పఠించారు, మహాప్రవక్త (సఅసమ్) ఆయన్ని వారించలేదు.

38–1. అర్థం ఏమిటంటే, స్వల్పంగా స్పృహ కోల్పోయిన కారణంగా వుజూ విరిగిపోదు. దాన్ని అరబ్బీ భాషలో అగ్మా అంటారు. ఎందుకంటే, ఈ స్థితిలో స్పృహ, స్పర్శ శక్తి మిగిలి ఉంటాయి, పూర్తిగా పోవు. అది కేవలం కొద్దిసేపటి అజాగ్రదావస్థ మాత్రమే.

**'అవును' అని సమాధానం చెప్పారు. తరువాత నేను నిలబడ్డాను.[1] కొంత సేపైన తరువాత, నేను స్పృహ కోల్పోయాను. ఆపైన నేను నా తల మీద నీళ్లను కుమ్మరించు కున్నాను. ప్రవక్త మహనీయులు (సఅసమ్) నమాజు చెయ్యడం పూర్తి చేసుకున్న పిదప, అల్లాహ్‌ను స్తుతించి, ఆయన గుణవిశేషాలను ప్రకటించి ఇలా అన్నారు: "ఏ వస్తువునైతే నేను ఇంత వరకు చూడలేదో, ఆ వస్తువును నేను ఈనాడు ఈ స్థలంలో చూశాను. స్వర్గాన్ని, నరకాన్ని కూడా నేను చూశాను. నాకు వహీ (దైవ వాణి) ద్వారా ఇలా తెలియజెయ్యటం జరిగింది: సమాధుల్లో మిమ్మల్ని పరీక్షించటం జరుగుతుంది. దజ్జాల్ రాకకు ముందు ఎంత పరీక్షకు గురిచెయ్యటం జరుగుతుందో, అంతే పరీక్షకు లేదా దానికి దగ్గరగా ఉన్నంత పరీక్షకు మిమ్మల్ని గురి చెయ్యటం జరుగుతుంది. అస్మాగారు (రజిఅన్‌హా) ఏ పదాన్ని ప్రయోగించారో నాకైతే తెలియదు అని ఫాతిమా అన్నారు. మీలోని ప్రతి వ్యక్తి వద్దకూ (సమాధులలో) దైవదూతలు వస్తారు; ఇలా అడుగుతారు; "ఈ వ్యక్తి మీద నీకున్న విశ్వాసం ఎలాంటిది?" ఒక విశ్వాసి లేదా దృఢమైన నమ్మకం గలవాడు ఇలా అంటాడు: ఆయన (స) అల్లాహ్ ప్రవక్త, ముహమ్మద్ (సఅసమ్). మా వద్దకు ఆయన (స) నిదర్శనాలు, మార్గదర్శకత్వానికి సంబంధించిన విషయాలు తీసుకునివచ్చారు. మేము ఆయన (స) గారి ఉపదేశాలను అంగీకరించాము. మేము ఆయన్ని (స) విశ్వసించాము, ఆయన్ని అనుసరించాము. అప్పుడు వారితో ఇలా అనటం జరుగుతుంది: "నీవు సుఖంగా నిద్రపో. నీవు విశ్వాసివేనని మాకు తెలుసు." ఎవడైతే వంచకుడో లేదా శంకితుడో – అస్మా (రజిఅన్) ఏ మాటను వాడారో నాకు తెలియదు– వాడు ఇలా అంటాడు : నేను ఎరుగను. ప్రజలు చెప్పుకుంటూ ఉంటే విన్నాను.[2] దాన్నే నేను కూడా చెప్పాను.**

---

184–1. అంటే నమాజులో అని అర్థం. అధ్యాయంలోని ప్రధాన విషయం ఇక్కణ్ణే ప్రస్తావించబడింది. ఎందుకంటే అస్మా (ర) గారు స్పృహ కోల్పోయారు. కాని ఆమె తాజాగా వుజూ చేసుకోలేదు.

184–2. కొందరు ఆయన్ని కవి అన్నారు, మరి కొందరు మాంత్రికుడు అన్నారు. ఇంకా కొందరు జ్యోతిష్కుడు అన్నారు. నేను కూడా ఆయన్ని (స) గురించి అలానే చెప్పాను. నాకు ఏ విషయం మీదా నమ్మకం లేదు, నేను స్వయంగా వాటిని గురించి ఆలోచించనూ లేదు. గుడ్డిగా అనుకరించటం అవాంఛనీయమనే విషయం ఈ హదీసు ద్వారా నిరూపితమయింది.

## 39వ అధ్యాయం

**మొత్తం తల మీద మసా చెయ్యాలి; ఎందుకంటే ఖురాను గ్రంథంలో మాయిద సూరాలో, అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "తల మీద చేతులతో రాయండి"[1], సయీద్ బిన్ ముసయ్యబ్, "స్త్రీ కూడా పురుషుడు మాదిరిగానే తన మొత్తం తల మీద మసా చెయ్యాలి" అని అన్నారు. ఇమామ్ మాలిక్ (ర.అ) గారిని, "తలలో కొంత భాగాన్ని మసా చేస్తే సరిపోతుందా?" అని అడిగినప్పుడు, ఆయన అబ్దుల్లా బిన్ జైద్ (రజిఅన్) గారి హదీసును ప్రమాణంగా తీసుకున్నారు.[2]**

**185.** యహ్యా అల్ మాజిన్నీ ఇలా ఉల్లేఖించారు : అమ్ర్ బిన్ యహ్యా గారి తాతగారైన అబ్దుల్లా బిన్ జైద్ (రజిఅన్) గారిని ఒక వ్యక్తి, "దైవప్రవక్త మహనీయులు (సఅసమ్) వుజూ ఎలా చేసేవారో నాకు వివరించగలరా?" అని అడిగాడు. దానికి సమాధానంగా అబ్దుల్లా బిన్ జైద్ (రజిఅన్), "అవును చెప్పగలను" అని అన్నారు. తరువాత ఆయన నీళ్లు తెప్పించుకున్నారు, తన రెండు చేతుల్లో పోసు కుని వాటిని రెండు సార్లు కడుక్కున్నారు. ఆ తరువాత మూడుసార్లు పుక్కిలించి ఊశారు. ముక్కును కూడా మూడుసార్లు నీళ్లతో పరిశుభ్రపరచుకున్నారు. తరువాత

---

39–1. ఇక్కడ మసా విషయంలో ఒక హద్దుగాని, ఒక పరిమితిగాని విధించటం అనేది జరగలేదు. అంటే సగం తల మీద లేదా తల నాలుగో భాగం వరకు మసా చెయ్యాలి అనే నిబంధన లేదు; వుజూలో మాదిరిగా చేతుల విషయంలో మోచేతుల వరకు కాళ్ల విషయంలో చీలమండల వరకు పరిశుభ్రపరచుకోవాలి అనే షరతులు మసా విషయంలో లేవు. కావున తల మీద తలపాగా లేనప్పుడు, మొత్తం తలమీద విధిగా మసాను చెయ్యాలి. ఒకవేళ తలమీద తలపాగా ఉంటే నుదుటి నుంచి మసా ప్రారంభించి తలపాగా మీద చేతులను రాయాలి; ఇది సరిపోతుంది. తలపాగా తీసివేసే అవసరం లేదు. అహ్లె హదీసు వారు కూడా ఇదే అభిప్రాయాన్ని కలిగి ఉన్నారు. ఎవరైతే తల నాలుగో భాగాన్ని మసా చేస్తే సరిపోతుంది, మొత్తం తల మీద చేసే అవసరం లేదు, లేదా కేవలం ఒకే వెంట్రుక మీద మసా చేసినా సరిపోతుంది అనే అభిప్రాయం కలిగి ఉన్నారో, దానికి ధర్మబద్ధమైన గట్టి ఆధారం లేదు.

39–2. ఇమామ్ బుఖారీ (ర.అలై) చెప్పిన దాని ప్రకారం ప్రశ్న అడిగిన వ్యక్తి పేరు ఇస్హాఖ్ బిన్ ఈసా: ఇమామ్ మాలిక్ (ర.అలై) తెలిపిన విషయం ఏమిటంటే, అబ్దుల్లా బిన్ జైద్ హదీసు ప్రకారం, మొత్తం తల మీద మసా చెయ్యాలి. కనుక మొత్తం తల మీద మసా చెయ్యటం విధి అన్నమాట.

**ఆయన తమ ముఖాన్ని మూడుసార్లు కడిగారు. ఈ తరువాత తమ చేతుల్ని రెండేసి సార్లు మోచేతుల వరకు కడుక్కున్నారు. ఆ పైన రెండు చేతులతో తన తల మీద మసా చేశారు. చేతుల్ని తల ముందు భాగం నుంచి వెనుక్కు తీసుకునిపోయారు. మళ్ళీ తల వెనుక భాగం నుంచి వాటిని ముందుకు తీసుకువచ్చారు. అంటే మొదట తల యొక్క ముందు భాగం నుంచి ప్రారంభించారు మరియు రెండు చేతుల్ని మెడ యొక్క వెనుక భాగం అంటే వగాపు వరకు తీసుకెళ్ళారు; తరువాత ఎక్కడ నుంచైతే ప్రారంభించారో, అక్కడి వరకు చేతుల్ని తీసుకువచ్చారు. ఆ తరువాత రెండు కాళ్ళను కడుక్కున్నారు.**

## 40వ అధ్యాయం

### రెండు కాళ్ళను చీల మండలాల వరకు కడుక్కోవటం.

**186.** **అమ్ర్ బిన్ యహ్యా ఇలా ఉల్లేఖించారు: మా నాన్నగారు ఇలా చెప్పారు; "అప్పుడు నేను (మా బాబాయి) అమ్ర్ బిన్ అబీ హసన్ వద్ద ఉన్నాను. ఆయన అబ్దుల్లా బిన్ జయ్‌ద్ (రజిఅన్)ను, 'ప్రవక్త మహనీయులు (సఅసమ్) వుజూ ఎలా చేసుకునేవారో చెప్పండి' అని అడిగారు. అప్పుడు ఆయన ఒక నీటి పాత్రను తెప్పించి దైవప్రవక్త (స) వుజూ ఎలా చేసేవారో అలా వుజూ చేసి ప్రజలకు చూపించారు. మొదట ఆ పాత్రలోని నీళ్లను తమ రెండు చేతుల్లో పోసుకొని వాటిని మూడు సార్లు కడుక్కున్నారు. తరువాత ఆ పాత్రలో చెయ్యిపెట్టి నీళ్లు తీసుకుని పుక్కిలించి ఊశారు, ఆ తరువాత నీళ్లను ముక్కులోకి ఎక్కించి ప్రక్షాళనం చేశారు. అలా మూడు సార్లు చేతుల్లో నీళ్లు తీసుకొని పరిశుభ్రపరచుకున్నారు.[1] తరువాత ఆ పాత్రలో చెయ్యిపెట్టి నీళ్లు తీసుకొని తమ ముఖాన్ని మూడుసార్లు కడుక్కున్నారు. ఆ తరువాత మళ్ళీ ఆ పాత్రలో చెయ్యిపెట్టి నీళ్లు తీసుకుని తమ రెండు చేతుల్ని మోచేతుల వరకు పరిశుభ్రపరచుకున్నారు. మళ్ళీ తమ చేతిని ఆ పాత్రలో పెట్టి నీళ్లు తీసుకుని తల మీద మసా చేసుకున్నారు, తల ముందు భాగం మీదుగా చేతుల్ని వెనక్కి తీసుకు**

---

186-1. అంటే ఒకసారి చేతిలో నీళ్లు తీసుకుని సగం నీళ్లతో పుక్కిలించి ఊశారు. మిగతా సగం నీళ్లను ముక్కులోకి ఎక్కించి కడుక్కున్నారు. తరువాత రెండోసారి చేత్తో నీళ్ళు తీసుకుని పై విధంగానే చేశారు. మళ్లీ మూడోసారి చేతినిండా నీళ్లు తీసుకొని అలానే చేశారు.

**పోయారు, వెనక భాగం నుంచి వాటిని తీసుకువచ్చారు, ఆ విధంగా ఆయన ఒకసారి మాత్రమే చేశారు. ఆ పైన తమ కాళ్లను చీల మండలాల వరకు కడుక్కున్నారు.**

## 41వ అధ్యాయం

**వుజూ చేసుకున్న తరువాత మిగిలిపోయిన నీళ్లను వినియోగించటం[1] అనే సమస్యను గురించి. జరీర్ బిన్ అబ్దుల్లా తన ఇంటి వారికి, తాను మిస్వాక్ చేసుకున్న తరువాత మిగిలిపోయిన నీటితో వుజూ చేసుకోమని చెప్పారు.[2]**

**187. అబూ జుహైఫా (రజిఅన్) ఇలా కథనం చేశారు: ఒకసారి దైవప్రవక్త మహనీయులు (సఅసమ్) మధ్యాహ్న సమయంలో మా వద్దకు విచ్చేశారు. వుజూ కోసం ఆయన (స) గారికి నీళ్ళు ఇవ్వటం జరిగింది. తరువాత ఆయన (స) గారు వుజూ చేసుకున్నారు. ఆ తరువాత ప్రజలు, మిగిలిపోయిన ఆయన (స) గారి వుజూ నీళ్లను తీసుకుని తమ శరీరాలకు పూసుకోవటం ప్రారంభించారు. ఆ తరువాత ఆయన (స) జుహర్ నమాజు రెండు రకాతులు చేశారు. అసర్ నమాజు రెండు రకాతులు కూడా చేశారు (ఎందుకంటే ఆయన (స) ప్రయాణంలో ఉన్నారు). ఆయన (స) గారి ముందు ఒక బరిసె కూడా పాతిపెట్టబడి ఉన్నది. అబూ మూసా అష్అరీ**

---

41-1. ఇక్కడ మిగిలిపోయిన నీరు అంటే వుజూ చేసుకున్న పాత్రలో మిగిలిపోయిన నీరు అని భావం లేదా వుజూ చేసుకునేవారి అవయవాల నుండి కిందికి జారిపడే నీరు, అంటే ఒకసారి ఉపయోగించిన నీరు అని అర్థం. కొంతమంది ఈ నీళ్లను నజస్ (అశుద్ధమైనది)గా భావించారు. ఈ అభిప్రాయాన్నే అబూ యూసుఫ్ (ర.అలై) సమర్థించారు. ఇమామ్ అబూ హనీఫా (ర.అలై) గారి ఉల్లేఖనంలో కూడా ఇటువంటి అభిప్రాయమే ఉంది. ఇమామ్ బుఖారీ (ర.అలై) గారు ఈ అధ్యాయాన్ని తీసుకువచ్చి ఈ అభిప్రాయాన్ని ఖండించారు.

41-2. ఈ రకం హదీసును (ప్రవక్త (స) గారి సంప్రదాయాన్ని) ఇబ్నె అబీషైబా మరియు దారెఖుత్నీ ఉటంకించారు. ఇందులో ఒక పద్ధతి ఇలా ఉంది: జరీర్ (ర) మిస్వాక్ చేసుకుని దాని తల భాగాన్ని నీళ్లల్లో ముంచేసేవారు. అలా చెయ్యటం వల్ల ఆ నీరు వాడిన నీరుగా అయిపోయింది. ఆయన తన ఇంటి వారికి వుజూ చేసుకోమని ఆజ్ఞాపించినప్పుడు, ఆ నీరు పరిశుభ్రమైన నీరుగానే వున్నట్లు లెఖ్క. ఇంకా అది పరిశుభ్రపరిచే నీరుగానే ఉన్నట్లు లెఖ్క. ఇదే సక్రమమైనది కూడా. చాలా మంది అహ్లె హదీసు విద్వాంసుల అభిప్రాయం కూడా ఇదే. అంటే వుజూ చేసుకునే వారి అవయవాల నుంచి జారిపడే నీరు పరిశుభ్రమైనది. ఇబ్నె మంజర్ దీని విషయంలో పండితుల మధ్య ఏకాభిప్రాయం ఉందని చెప్పారు.

**(రజిఅన్) ఏమన్నారంటే, మహాప్రవక్త (స)[1] నీళ్ళతో నిండి ఉన్న ఒక పాత్రను తెప్పించారు. తమ ముఖాన్ని, తమ చేతుల్ని అందులో పరిశుభ్రపరచుకున్నారు. తరువాత అందులో పుక్కిలించి ఊశారు. బిలాల్ (రజిఅన్), అబూ మూసాలను ఉద్దేశించి ఇలా సెలవిచ్చారు: మీరిద్దరూ ఇందులో నుంచి నీళ్ళు త్రాగండి. ఆ నీళ్ళను ముఖం మీద, వక్షస్థలాల మీద పోసుకోండి.[2]**

**188. హజ్రత్ ఇబ్నె షిహాబ్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: మహ్మూద్ బిన్ రబీ (రజిఅన్) నాతో అన్నారు. ఈ మహ్మూద్ బిన్ రబీ ఎవరంటే, ఈయన బాల్యదశలో ఉన్నప్పుడు ప్రవక్త మహనీయులు (సఅసమ్) అతని ముఖం మీద పుక్కిలించి ఊశారు. అతని ఇంట్లోని బావి నీళ్లతోనే పుక్కిలించి ఊశారు. అల్ మిస్వర్ బిన్ మఖ్రమ మొదలైన వారి ప్రామాణికత ఆధారంగా ఉర్వా ఉల్లేఖిం చారు. వీరందరూ తమ సహచరులు సత్యం పలికారని పరస్పరం ధ్రువీకరించు కున్నారు (ఉర్వా బిన్ మసూద్ మక్కా నగరంలోని ముష్రిక్కులతో ఇలా అన్నారని) పై వారందరూ ఉల్లేఖించారు. దైవప్రవక్త (సఅసమ్) ఎప్పుడు వుజూ చేసినా, ఆయన (స) గారి వుజూ తరువాత మిగిలిపోయిన నీళ్ల కోసం ప్రజలు విరుచుకుపడేవారు, దీనికోసం ఘర్షణకు కూడా సిద్ధమయ్యేవారు.[1]**

---

187-1. ఈ హదీసును స్వయంగా ఇమామ్ బుఖారీ (ర.అలై) గారు 'మగాజీ'లో ధ్రువీకరణతో ప్రస్తావించారు.

187-2. తెలిసిందేమిటంటే, ఒకసారి వాడిన నీరు పరిశుభ్రమయినదే అని. ఇబ్నె బతాల్ ఇలా అన్నారు : ఈ హదీసు ద్వారా విశదమయిన మరొక విషయం ఏమిటంటే, మనిషి ఉమ్మి 'నజస్' అంటే అశుద్ధమైనది కాదు అని.

188-1. ఇది ఒక సుదీర్ఘమైన హదీసులోని చిన్న భాగం. ఇమామ్ బుఖారీ (ర.అలై) 'కితాబుష్షరూత్' అనే గ్రంథం నుంచి తీసుకున్నారు. ఈ సంఘటన హుదైబియా సంధి కాలం నాటిది. అప్పుడు బహుదైవారాధకుల తరఫు నుంచి సంప్రదింపులు జరపటానికి ఉర్వా బిన్ మసూద్ సఖఫీ అనే అతను దైవప్రవక్త(స) వద్దకు వచ్చాడు. అతను తన వారి వద్దకు తిరిగి వెళ్ళి వారితో ఇలా చెప్పాడు: దైవప్రవక్త (స) గారి సహచరులు ఆయనంటే (స) ప్రాణమిచ్చేవారు, ఆయన(స) పట్ల ఎంత విధేయత చూపేవారంటే ఆయన (స) వుజూ చేసుకున్న తరువాత మిగిలిపోయిన నీళ్లను తీసుకోవడం కోసం విరుచుకు పడేవారు. వారిని చూస్తే ఈ నీళ్ళ కోసం

## 42వ అధ్యాయం

**189.** **హ(జ్రత్ సాయిబ్ బిన్ యజీద్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు. ఒకసారి మా పినతల్లిగారు[1] నన్ను ప్రవక్త మహనీయులు (సఅసమ్) వద్దకు తీసుకువెళ్ళారు. ఆమె ఆయన (స) కు ఇలా విన్నవించుకున్నారు : దైవప్రవక్తా (స)! ఇతను నా చెల్లెలి కొడుకు. వ్యాధితో (కాళ్ల నొప్పులతో) బాధపడుతున్నాడు. అప్పుడు ఆయన (స) తమ చేతితో నా తల మీద నిమిరారు. అల్లాహ్ శుభాలు నా మీద అవతరించాలని ప్రార్థించారు. తరువాత ఆయన (స) వుజూ చేసుకున్నారు. ఆయన (స) గారు వుజూ చేసుకున్న తరువాత మిగిలిపోయిన నీళ్లను నేను త్రాగేశాను. ఆ తరువాత నేను ఆయన (స) వీపు వెనుకకు పోయి నిల్చున్నాను. నేను ఆయన (స) వీపు మీద 'ప్రవక్తా పదవి' ముద్రను చూశాను. అది ఆయన (స) గారి రెండు భుజాల మధ్య స్థలంలో ఉన్నది. ఇంకా అది పందిరి మంచం[2] గుండి మాదిరిగా ఉన్నది.**

## 43వ అధ్యాయం

**ఒకసారి చేతినిండా తీసుకున్న నీళ్ళతో పుక్కిలించి ఊయటం మరియు ముక్కు లోకి నీళ్ళు ఎక్కించటం.[1]**

---

పరస్పరం పోట్లాడుకుని చచ్చిపోతారేమోనని అనిపించేది. సుబ్‌హానల్లాహ్! (అల్లాహ్ పరిశుద్ధుడు) దైవప్రవక్త (స) అన్నా, ఆయన (స) గారి ఉపదేశాలన్నా ఇంత ప్రేమ, ఇంత గౌరవం లేకపోతే, ఇక విశ్వాసం (ఈమాన్) అన్నదానికి అర్థమేముంటుంది.

189-1. ఆమెగారి పేరు ఏమిటో తెలియరాలేదు.

189-2. ఒక ఉల్లేఖనంలో 'పావురం గ్రుడ్డు' మాదిరిగా అని ఉంది. మరొక ఉల్లేఖనంలో 'యాపిల్ పండు' మాదిరిగా అని ఉంది. ఆ ముద్ర ప్రవక్త(స) గారి పుట్టుక నుంచే ఆయన (స) శరీరం మీద ఉంది. లేదా ఆయన (స) పుట్టిన తరువాతనే అది వచ్చింది. – ఈ విషయాలను గురించి భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. అబూ నుఅయిమ్ గారు ఎన్నో సాక్ష్యాలు, ఆధారాలు ఇచ్చారు. వాటిలోని ఒక ఆధారం పైన పేర్కొన బడిన రెండో విషయాన్ని బలపరుస్తుంది.

43-1. ఈ అధ్యాయం ద్వారా ఇమామ్ బుఖారీ (ర.అలై) గారు, చేతినిండా ఒకసారి తీసుకున్న నీళ్ళతో పుక్కిలించటం, ముక్కులోకి ఎక్కించటానికి మరొకసారి చేతినిండా నీళ్ళు తీసుకోవటం – ఇది ప్రవక్త (స) గారి సంప్రదాయం అని చెప్పిన వారిని ఖండించారు. వారు దీనికి ఆధారంగా తల్‌హ బిన్ మస్‌రఫ్ గారి హదీసును తీసుకుంటారు. కాని ఈ హదీసు విషయంలో భేదాభిప్రాయం ఉన్నది. నవవీ గారు ఇలా అన్నారు; నిర్ధారితమైన, నిజమైన హదీసుల ద్వారా తెలిసే విషయం ఏమిటంటే, మూడుసార్లు చేతినిండా నీళ్లు తీసుకున్నారు. ప్రతిసారి సగం నీళ్లతో పుక్కిలించి ఊశారు. మిగతా సగం నీళ్లను ముక్కులోకి ఎక్కించారు.

**190.** అమ్‌రూ బిన్ యహ్యా తమ తండ్రిగారైన యహ్యా బిన్ అమ్మారా చెప్పిన దాని ప్రామాణికత ఆధారంగా ఇలా ఉల్లేఖించారు: అబ్దుల్లా బిన్ జైద్ (రజిఅన్) మొదట నీటి పాత్రలో నుంచి నీళ్లు తీసుకుని తమ రెండు చేతులపై పోసుకున్నారు, చేతుల్ని కడుక్కున్నారు తరువాత ముఖం కడుక్కున్నారు. లేదా పుక్కిలించి ఊశారని చెప్పారు. ముక్కులోకి నీరు ఎక్కించారు. ఒకేసారి చేతినిండా తీసుకున్న నీళ్ళతో మూడు సార్లు అలా చేశారు.[1] ఆ తరువాత తమ రెండు చేతుల్ని మోచేతుల వరకు రెండుసార్లు[2] కడిగారు. ఇంకా తల మీద ముందూ వెనుకా రెండు వైపులా మసా చేశారు. రెండు కాళ్లను చీలమండలాల వరకు కడిగారు. తరువాత ఇలా అన్నారు: దైవప్రవక్త మహా నీయులు (సఅసమ్) ఈ విధంగానే వుజూ చేసుకునేవారు.

## 44వ అధ్యాయం

### ఒకే ఒకసారి తల మీద మసా చెయ్యటం.[1]

**191.** అమ్‌రూ బిన్ యహ్‌యా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: మా నాన్న గారు ఇలా అన్నారు: నేను ఒకసారి (మా బాబాయి గారైన) అమ్‌రూ బిన్ అబీ హసన్ వద్ద ఉన్నాను. ఆయన అబ్దుల్లా బిన్ జైద్ (రజిఅన్)ను, దైవప్రవక్త మహా నీయులు (సఅసమ్) వుజూ ఎలా చేసేవారో చెప్పమని అడిగారు. అప్పుడు అబ్దుల్లా బిన్ జైద్ (ర) ఒక నీటి పాత్రను తెప్పించారు. వారి సమక్షంలో ఇలా వుజూ చేశారు; మొదట ఆయన తన రెండు చేతుల మీద నీళ్లు పోశారు, మూడుసార్లు వాటిని కడుక్కు న్నారు. తరువాత పాత్రలో చెయ్యిపెట్టి మూడుసార్లు చేతినిండా నీళ్ళు తీసుకుని మూడుసార్లు పుక్కిలించి ఊశారు. ఇంకా ముక్కులోకి నీళ్లు ఎక్కించారు. ఆ తరువాత తన చేతిని పాత్రలో పెట్టి నీళ్లు తీసుకుని మూడుసార్లు తన ముఖాన్ని కడుక్కున్నారు.

---

190–1. ఈ అనుమానం ఇమామ్ బుఖారీ (ర.అలై) గారి గురువులైన షేఖ్ మస్‌రద్ గారికి కలిగింది. ముస్లిమ్ గారి ఉల్లేఖనంలో ఈ సందేహం లేదు. స్పష్టంగా ఎలా ఉందంటే తమ చేతుల్ని నీటి పాత్రలో పెట్టారు. తరువాత దాన్ని బయటకు తీసి నోట్లో నీళ్ళు పోసుకుని పుక్కిలించి ఊశారు.

190–2. తెలిసిన విషయం ఏమిటంటే, వుజూలో ఒక శరీర భాగాన్ని మూడుసార్లు, మరొక భాగాన్ని రెండుసార్లు కడుక్కో వచ్చు. ఇది ధర్మసమ్మతమైన విషయమే.

44–1. తల మీద మసా రెండుసార్లు గాని, మూడుసార్లు గాని చేయటం తప్పనిసరి కాదు. అది ముస్‌తహబ్ (ఇష్టమైనది) మాత్రమే.

**మళ్లీ పాత్రలో చెయ్యిపెట్టి నీళ్లు తీసుకుని రెండు చేతుల్ని మోచేతుల వరకు రెండేసి సార్లు కడుక్కున్నారు. మళ్లీ పాత్రలో చెయ్యిపెట్టారు. తరువాత తల మీద ముందు వెనుక రెండు వైపులా మసా చేశారు. మళ్లీ పాత్రలో చేతిని ముంచి నీళ్ళు తీసుకుని తమ కాళ్లను కడుక్కున్నారు.**

**192. ఈ హదీసునే తమకు హజ్రత్ వుహైబ్ (రజిఅన్) ఉల్లేఖించారని మాకు మూసా చెప్పారు. అందులో ఇలా ఉంది. తలమీద ఒకసారి మాత్రమే మసా చేశారు.**

## 45వ అధ్యాయం

**భర్త తన భార్యతోపాటు కలిసి వుజూ చెయ్యటం. ఒక స్త్రీ వుజూ చేసుకున్న తరువాత మిగిలిపోయిన నీటిని ఉపయోగించడం. హజ్రత్ ఉమర్ (రజిఅన్) వేడి నీళ్ళతో వుజూ చేసుకున్నారు. ఒక క్రైస్తవ స్త్రీ ఇంటి నుంచి కూడా నీళ్లు తెప్పించి వుజూ చేసుకున్నారు.[1]**

---

45-1. ఇవి రెండూ వేర్వేరు సంఘటనలు. మొదటి హదీసును సయీద్ బిన్ మన్సూర్ మరియు అబ్దుర్రజ్జాఖ్ గార్లు, రెండో హదీసును షాఫయి మరియు అబ్దుర్రజ్జాఖ్ గార్లు ఉల్లేఖించారు. ఈ రెండు హదీసులకు ఈ అధ్యాయంతో ఉన్నటువంటి సంబంధాన్ని గురించి వ్యాఖ్యానించటానికి పండితులు జంకుతున్నారు. కొందరు ఇలా వ్యాఖ్యానించారు; నీళ్లను ఇంట్లో కాగబెట్టినప్పుడు స్త్రీలు కూడా ఆ నీళ్లను ఉపయోగించేవారేమో. ఇదే విధంగా ఈ క్రైస్తవ మహిళ ఒక ముస్లిమ్ పురుషుణ్ణి వివాహం చేసుకుందేమో, ఆమె బహిష్టుకాలం పూర్తి అయిన తరువాత తలంటి స్నానం చేసి నీళ్లను మిగిల్చి ఉంచిందేమో, హజ్రత్ ఉమర్ (రజిఅన్) ఆ నీళ్లతో వుజూ చేసుకున్నారేమో. కాని ఇటువంటి అస్పష్టమైన సందేహాలను బుద్ధి, వివేకం ఉన్న మనిషి ఎవ్వడూ ఆధారాలుగా, సాక్ష్యాలుగా తీసుకోలేడు. ముఖ్యంగా ఇమామ్ బుఖారీ (ర.అలై) లాంటి గొప్ప విద్వాంసుడు అసలే తీసుకోరు. కనుక అసలు విషయం ఏమిటంటే, ఈ హదీసుల్ని ఇమామ్ బుఖారీ (ర.అలై) గారు కేవలం ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని ఇక్కడ ఉటంకించారు. దీని ఉద్దేశ్యం ఏమిటంటే, కొందరు, స్త్రీ వుజూ చేసిన తరువాత మిగిలిపోయిన నీళ్లతో మూత్ర విసర్జనం తరువాత పరిశుభ్ర పరచుకోవటం నిషిద్ధం అని భావిస్తారు. అదే విధంగా వేడి నీళ్లతో, అవిశ్వాసుల ఇళ్లల్లోని నీళ్లతో కూడా వుజూ చేసుకోవడం నిషిద్ధం అని భావిస్తారు. కనుక ఇటువంటి నీళ్లు నిషిద్ధం కావని, వాటితో తహారత్‌కు పోవటం, వుజూ చేసుకోవడం ధర్మ సమ్మతమేనని చెప్పటం జరిగింది.

## 46వ అధ్యాయం

**ప్రవక్త మహనీయులు (సఅసమ్) వుజూ చేసుకున్న తరువాత మిగిలిపోయిన నీళ్లను స్పృహ కోల్పోయిన వ్యక్తిపై చల్లటం.**

**193.** హజ్రత్ జాబిర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: వ్యాధితో బాధపడుతున్న నన్ను పరామర్శించటానికి ప్రవక్త మహనీయులు (స) నా వద్దకు వచ్చారు. అప్పుడు నేను అపస్మారక స్థితిలో పడి ఉన్నాను. ఆయన (స) వుజూ చేసుకున్నారు. వుజూ చేసుకునే నీళ్ళనో లేదా వుజూ చేసుకోగా మిగిలిపోయిన నీళ్లనో ఆయన (స) నా మీద చల్లారు. వెంటనే నాకు స్పృహ వచ్చింది. నేను ప్రవక్త (స) గారికి ఇలా విన్నవించుకున్నాను: "ఓ దైవప్రవక్తా(స)! నేను కలాలా[1]ను. నాకు వారసులెవ రౌతారు?" అప్పుడు వారసత్వానికి (ఫరాయజ్‌కు) సంబంధించిన ఆయత్ అవతరించింది. (అది 'నిసా' సూరా చివరిలో ఉంది).[2]

## 47వ అధ్యాయం

**తొట్టె, గిన్నె, రాగిపాత్ర, చెక్క పళ్ళెంలో నుంచి గుసుల్ మరియు వుజూ చేసు కోవడం.**

**194.** హజ్రత్ అనస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: అసర్ నమాజుకు వేళ అయింది. ఎవరి ఇళ్ళు దగ్గరగా ఉన్నాయో, వారైతే వుజూ కోసం తమ తమ ఇళ్ళకు వెళ్లిపోయారు. ఎవరి ఇళ్ళు దూరంగా ఉన్నాయో, ఎవరికైతే వుజూ లేదో వారు మటుకు ఉండిపోయారు. తరువాత ప్రవక్త మహనీయులు (స) వద్దకు నీళ్ళు ఉన్న ఒక రాతి పాత్రను తీసుకువచ్చారు. అది ఎంత చిన్నదంటే ఆయన (స) తన చేతిని అందులో పెట్టి అటూ ఇటూ తిప్పి నీళ్ళు తీసుకోవటం కూడా సాధ్యపడే విషయం కాదు. అయినప్పటికీ అక్కడున్న వారందరూ అందులో నుంచి నీళ్ళు తీసుకొని వుజూ చేసుకున్నారు. హుమైద్ (ఉప ఉల్లేఖకుడు) ఇలా అన్నారు; నేను అనస్ (ర)ను, "ఆ సమయంలో అక్కడ మీరు ఎంత మంది ఉన్నారు?" అని అడిగాను. దానికి

---

193-1. తండ్రీ, తాతలు గాని, సంతానంగాని లేని మనిషిని కలాలా అంటారు. అధ్యాయంలోని విషయం ఈ ఆయత్‌తో సంబంధం కలిగి ఉన్నది; ప్రవక్త మహనీయులు (స) తాము వుజూ చేసుకోగా మిగిలిపోయిన నీళ్లను హజ్రత్ జాబిర్ (ర)పై చల్లారు. ఈ నీళ్లు గనక అపరిశుభ్రమైనవైతే ప్రవక్త (స) గారు అతని మీద ఎందుకు చల్లుతారు?

193-2. నిసా సూరాలోని ఆ వాక్యం ఇది. "యస్‌తఫ్‌తూనక, ఖులిల్లాహు యుఫ్‌తీకుమ్ ఫిల్ కలాలహ్" నుంచి చివరి వరకు. దీనికి సంబంధించిన ప్రస్తావన ఇన్షాఅల్లాహ్ 'కితాబుత్తఫ్‌సీర్'లో వస్తుంది.

**సమాధానంగా అతను ఎనభై[1] కంటే ఎక్కువ మందే అక్కడ ఉన్నారు అని చెప్పారు.**

**195. అబూ మూసా (రజిఅన్) తమ ఉల్లేఖనంలో ఇలా కథనం చేశారు; ప్రవక్త మహనీయులు (సఅసమ్) నీటి పాత్రను తెప్పించారు, అందులో నుంచి నీళ్ళు తీసుకుని చేతులు, ముఖం కడుక్కున్నారు. ఇంకా పుక్కిలించి అందులోకి ఊశారు.[1]**

**196. అబ్దుల్లా బిన్ జైద్ (రజిఅన్) ఒక ఉల్లేఖనంలో ఇలా వివరించారు; మహనీయ ప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఒకసారి మా వద్దకు వచ్చారు. ఆయన (స) గారి కోసం మేము ఒక ఇత్తడి పాత్రలో నీళ్ళు పోసి ఉంచాము. ఆయన (స) ఇలా వుజూ చేసుకున్నారు: మూడుసార్లు ఆయన (స) తమ ముఖాన్ని కడుక్కున్నారు, రెండు చేతుల్ని మోచేతుల వరకు రెండేసిసార్లు కడుక్కున్నారు, తల మీద మసా చేశారు, ముందు నుంచి వెనుకకు, వెనుక నుంచి ముందుకు (రెండు చేతులతో మసా చేశారు). తరువాత రెండు కాళ్ళను కడుక్కున్నారు.**

**197. హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహనీయులు (సఅసమ్) వ్యాధిగ్రస్తులయ్యారు. ఆయన (స) గారి వ్యాధి తీవ్రరూపం దాల్చింది. అప్పుడు ఆయన (స), చికిత్సా, పరిచర్యల కోసం నా ఇంట్లో ఉండేందుకు గాను తన ఇతర భార్యలను అనుమతి కోరారు. వారందరూ అనుమతి ఇచ్చారు. తరువాత ఆయన (స) ఇద్దరు వ్యక్తుల మధ్య నిలబడి వారి భుజాల మీద చేతులు మోపి కాళ్లు ఈడ్చుకుంటూ నా ఇంటికి వచ్చారు. వచ్చేటప్పుడు నేల మీద ఆయన(స) గారి పాదాల గీతలు పడ్డాయి.[1] ఆ ఇద్దరు వ్యక్తుల్లో ఒకరేమో అబ్బాస్ (రజిఅన్), రెండో వారు ఇంకొక వ్యక్తి. ఉబేదుల్లా (రజిఅన్) ఏమన్నారంటే, నేను ఈ హదీసును గురించి అబ్దుల్లా బిన్ అబ్బాస్ (ర)కు వివరించాను. ఆయన నాతో ఇలా అన్నారు:**

---

194. 1. ఈ హదీసు ఇదివరకే ప్రస్తావించబడింది. ఇందులో ప్రవక్త మహనీయుని (స) మహిమ ఒకటి చెప్పబడింది. అనస్ (ర) ఏమన్నారంటే; దైవప్రవక్త (స) గారి చేతి వ్రేళ్ళ మధ్య నుంచి నీరు పాత్రలో పడటాన్ని నేను కళ్ళారా చూశాను.

195–1. ఈ హదీసులో ప్రవక్త మహనీయులు (స) వుజూ చేసుకున్నట్లుగా ప్రస్తావన లేదు. కాని చేతులు కడుక్కోవటం, ముఖాన్ని పరిశుభ్రపరచుకోవటం అనేవి వుజూకు సంబంధించిన ఆచరణలు. అందుకని ఆయన (స) వుజూను పూర్తిగా చేసుకుని ఉండవచ్చు. కాని ఉల్లేఖకుడు దాన్ని గురించి ప్రస్తావించలేదేమో అనేటటు వంటి అనుమానం కలుగుతుంది. అసలు విషయం ఇదే గనక అయినట్లయితే అధ్యాయంలోని ఉద్దేశ్యం నెరవేరుతుంది.

**ఆ రెండో మనిషి ఎవరో మీకు తెలుసా? నాకు తెలియదు అని నేను ఆయనకు చెప్పాను. ఆయన అలీ బిన్ అబీతాలిబ్[2] అని అబ్దుల్లా బిన్ అబ్బాస్ (ర) చెప్పారు. హజ్రత్ ఆయెషా (ర) ఇంకా ఇలా వివరించారు; ప్రవక్త మహనీయులు(స) తమ ఇంటికి (అంటే నా గదికి) వచ్చారు. తన(స)లోని వ్యాధి తీవ్రతరమైనప్పుడు ఆయన (స) ఇలా సెలవిచ్చారు: మూతలు ఇంకా తెరువబడనటువంటి ఏడు తోలు సంచుల నీళ్లను నా మీద కుమ్మరించండి; బహుశా నేను ప్రజలకు హితోపదేశం చెయ్య గలనేమో. తరువాత ఆయన్ని విశ్వాసుల తల్లి అయిన హఫ్సా (రజిఅన్హా)కు చెందిన ఒక ఇత్తడి తొట్టెలో కూర్చుండబెట్టారు. మేము తోలు సంచుల్లో ఉన్న నీళ్లను ఆయన (స) మీద ఒలక బొయ్యసాగాము. చివరకు ఆయన (స), "చాలు, చాలు ఆపండి, మీరు మీ పని పూర్తి చేశారు"అని సైగచేసి చెప్పారు. తరువాత ఆయన(స)[3] ప్రజల ముందుకు వచ్చారు.**

## 48వ అధ్యాయం

## మట్టి పాత్ర (తొట్టి)లో నుంచి నీళ్ళు తీసుకుని వుజూ చేసుకోవటం.

**198. తన తండ్రిగారైన యహ్యా బిన్ అమ్మార (రజిఅన్) ఇలా చెప్పారని అమ్రూ బిన్ యహ్యా ఉల్లేఖించారు: మా బాబాయి అయిన అమ్రూ బిన్ అబీ హసన్ వుజూ చేసుకునేటప్పుడు అమితంగా నీళ్ళు వాడేవారు.[1] ఆయన (అమ్రూ బిన్**

---

197–1. వృద్ధాప్యం, బలహీనతల కారణంగా ప్రవక్త మహనీయులు (సఅసమ్) తమ పాదాలను ఎత్తి నడువలేకపోయేవారు. ఇందువల్ల ఆయన (స)గారి పాదాలు నేలను రాసుకుంటూ పోయేవి. నేల మీద గీతలు పడుతూ ఉండేవి.

197–2. మానవ సహజమైన కొన్ని బలహీనతల కారణంగా హజ్రత్ అలీ (రజిఅన్), హజ్రత్ ఆయెషా (రజిఅన్)ల మధ్య మనస్పర్థలు చెలరేగాయి. ఈ కారణం వల్ల హజ్రత్ ఆయెషా (ర) ఇక్కడ హజ్రత్ అలీ (ర) గారి పేరును పేర్కొనలేదు.

197–3. కొందరు చెప్పిన ప్రకారం విషయం ఏమిటంటే: ప్రవక్త మహనీయులు (సఅసమ్) నమాజు చేశారు, ప్రజల్ని ఉద్దేశించి ప్రసంగం చేశారు కూడా. కాని అయ్యో! దురదృష్టవశాత్తు ఇది ఆయన (స) గారి చివరి ప్రసంగం. కలానికి ఉన్నటు వంటి వ్రాసే శక్తి కరిగిపోయింది, అది ఇక వ్రాయలేదు. హృదయం వణుకుతోంది. కళ్ళ నుంచి భాష్పాలు రాలుతున్నాయి. జ్వరంలో ఉన్నప్పుడు చన్నీళ్ళ స్నానం చెయ్యటం మనిషి ఆరోగ్యానికి ఎంతో మంచిది, ముఖ్యంగా పైత్య జ్వరంలో ఉన్నప్పుడు ఇది మనిషికి ఎంతో మేలు చేస్తుంది. ఏ డాక్టరైతే దీనిని ఒప్పుకోడో, అతడు అజ్ఞాని, అనుభవశూన్యుడు.

**అబీ హసన్) అబ్దుల్లా బిన్ జైద్ (రజిఅన్)ను, ప్రవక్త మహనీయులు (సఅసమ్) వుజూ ఎలా చేసేవారో నాకు చూపించండి అని అడిగారు. అప్పుడు అబ్దుల్లా బిన్ జైద్ (ర) నీటితో నిండి ఉన్న ఒక మట్టి పాత్రను తెప్పించారు, మొదట దానిని తన చేతుల మీదకు వంచుకున్నారు, ఆ నీళ్లతో వాటిని మూడు సార్లు కడుక్కున్నారు; తరువాత తన చేతిని ఆ పాత్రలో పెట్టి నీళ్లు తీసుకుని ఆ నీళ్లతో పుక్కిలించి ఊశారు. చేతినిండా నీళ్లు తీసుకుని మూడుసార్లు ముక్కును పరిశుభ్రపరచుకున్నారు. తరువాత రెండు చేతులనూ పాత్రలో పెట్టి చేతినిండా నీళ్లు తీసుకుని మూడుసార్లు తమ ముఖాన్ని కడుక్కున్నారు. ఆ తరువాత రెండేసిసార్లు తమ చేతుల్ని మోచేతుల వరకు కడుక్కున్నారు. తరువాత రెండు చేతులతో నీళ్లు తీసుకుని తల మీద మసా చేశారు– చేతుల్ని తల మీదుగా వెనక్కు తీసుకుపోయి వాటిని ముందుకు తీసుకువచ్చారు. ఆ తరువాత రెండు కాళ్లు కడుక్కుని, ప్రవక్త మహనీయులు (స)ను ఇలాగే వుజూ చేస్తూ ఉండగా నేను చూశాను అని అన్నారు.**

**199. హజ్రత్ అనస్ (రజిఅన్) ఇలా చెప్పారని సాబిత్ ఉల్లేఖించారు: "ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఒక నీటి పాత్రను తెప్పించారు; అప్పుడు, మూత లేని, అంతగా లోతులేని వెడల్పాటి ఒక పాత్రను తెచ్చి ఆయన (స)కు ఇవ్వటం జరిగింది. ఆ పాత్రలో కాస్తంత నీరు మాత్రమే ఉండినది. ఆయన (స) తమ చేతి వ్రేళ్లను ఆ పాత్రలో పెట్టారు. హజ్రత్ అనస్ (ర) ఏమన్నారంటే, నేను ఆ పాత్రలోని నీళ్లు చూశాను. అవి ఆయన (స) గారి పవిత్రమైన వ్రేళ్ళ మధ్య నుంచి ఊరుతున్నాయి. అనస్ (ర) ఇంకా ఇలా అన్నారు; నేను అంచనా వేశాను. డెబ్భై నుంచి ఎనభై మంది వరకు మనుషులు ఆ పాత్రలోని నీళ్లతో వుజూ చేసుకున్నారు.**[1]

---

198–1. కొందరు ఇలా అనువాదం చేశారు : "చాలా ఎక్కువగా వుజూ చేసేవారు."

199–1. ఇంతకు ముందు ఒక ఉల్లేఖనంలో, ఎనభై కంటే ఎక్కువ మంది మనుషులే ఆ పాత్రలోని నీళ్లతో వుజూ చేసుకున్నారు అని వచ్చింది. హజ్రత్ జాబిర్ (రజిఅన్) పదిహేను వందల (1500) మంది వుజూ చేసుకున్నారు అని చెప్పారు. మరొక ఉల్లేఖనంలో మూడు వందల (300) మంది వుజూ చేసుకున్నారు అని చెప్ప బడింది. ఈ భిన్నాభిప్రాయాలు అసలు విషయానికి నష్టం కలిగించలేవు. ఎందుకంటే ఇటువంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి.

## 49వ అధ్యాయం

### ఒక ముద్ (కిలోలో 2/3 వ భాగం) నీళ్లతో వుజూ చేసుకోవటం.

**200. హజ్రత్ అనస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఒక 'సా' (అంటే 234 తులాల బరువు) నీళ్లు మొదలుకుని ఐదు 'ముద్'ల నీళ్ల వరకు తీసుకుని గుసుల్ (తలంటి స్నానం) చేసుకునేవారు. లేదా తమ శరీరాన్ని కడుక్కునేవారు. ఒక ముద్ నీళ్లతో వుజూ చేసుకునేవారు.[1]**

## 50వ అధ్యాయం

### మేజోళ్ళపై మసా చెయ్యటం.

**201. సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ (రజిఅన్) ఇలా చెప్పారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజిఅన్) ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) తమ మేజోళ్ళ (తోలు బూట్లు) పై మసా చేశారు.[1] అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఈ సమస్యను (మోజాలపై మసా చెయ్యటం) గురించి హజ్రత్ ఉమర్ (ర) ను అడిగారు. ఆయన ఇలా అన్నారు: "అవును, ప్రవక్త మహనీయులు (స) మోజాలపై మసా చేశారు. సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ (ర) ప్రవక్త (స) గారికి సంబంధించిన ఏదైనా హదీసును నీకు**

---

200–1. ఇది తక్కువ పరిమాణం అంటే ప్రవక్త (సఅసమ్)గారి సంప్రదాయం ఇలా ఉండేది; వుజూ చేసుకోవటానికి కనీసం ఒక 'ముద్' నీళ్లయినా కావాలి. అంతకు తక్కువగా ఉండరాదు. గుసుల్ (తలంటి స్నానం) కోసం కనీసం ఒక 'సా' నీళ్లయినా కావాలి. అంతకు తక్కువ నీళ్లతో గుసుల్ చేసుకోరాదు. నాలుగు 'ముద్'లు అయితే ఒక 'సా' అవుతుంది. ఒక 'ముద్' రెండు 'రతల్'ల బరువుకు సమానం. ఒక 'రతల్' అర్ధసేరు బరువుతో సమానం. మరొక హదీసులో ప్రవక్త మహనీయులు ఇలా సెలవిచ్చారు; వుజూ కోసం 'రెండు రతల్'ల నీళ్లు సరిపోతుంది. వాస్తవం ఏమిటంటే, పరిమాణం రకరకాలుగా భిన్నమైనదిగా ఉంటుంది, అది కూడా వ్యక్తుల్నిబట్టి, పరిస్థితుల్నిబట్టి ఉంటుంది. పరిస్థితి ఎటువంటిదైనా నీళ్లు మటుకు అవసరానికి మించి వాడరాదు. వృధా చెయ్యరాదు. అనవసరంగా నీళ్ళను ప్రవహింపజేయటం నిషిద్ధం.

201–1. మోజాల మీద మసా చెయ్యటం అనే విషయాన్ని డెబ్బై మంది సహాబాలు (ప్రవక్త (స)గారి ప్రత్యక్ష అనుచరులు) ధ్రువీకరిస్తూ ఉల్లేఖించారు. ఖుర్ఆను గ్రంథంలోని మాయిదా సూరాలోని ఒక వాక్యం దీన్ని రద్దు చేసిందనే అభిప్రాయం నిజమైనది కాదు. ఎందుకంటే, హజ్రత్ ముగీరా (రజిఅన్) దీన్ని తబూక్ యుద్ధ సమయంలో ఉదాహరించారు. కాని మాయిద సూరా దానికి ముందే అవతరించింది. జరీర్ బిన్ అబ్దుల్లా అనే సహాబీ కూడా దాన్ని నఖలు చేశారు. అయితే ఆయన మాయిదా సూరా అవతరించిన తరువాత ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు. ఏది ఏమైనా సహాబా

**వినిపిస్తే, నీవు దాన్ని గురించి మళ్ళీ ఎవరినీ అడుగబాకు.[2]" మూసా బిన్ ఉఖబ తమ ఉల్లేఖనంలో ఇలా అన్నారు: అబూ సలమా తనకు ఇలా చెప్పారని అబున్‌నజర్ నాకు చెప్పారు: "సాద్ (ర) అతనికి ఈ హదీసును గురించి చెప్పినప్పుడు హజ్రత్ ఉమర్ (ర) అబ్దుల్లా బిన్ ఉమర్‌కు పై విధంగానే చెప్పారు."**

**202. అల్ ముగీరా బిన్ షూబా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఒకసారి కాలకృత్యాలు తీర్చుకోవటానికి బయలుదేరారు. ముగీరా (ర) ఒక పాత్రలో నీళ్లు తీసుకుని ఆయన (స) గారి వెంట వెళ్లారు. ఆయన (స) తమ అవసరాన్ని తీర్చుకున్న తరువాత ముగీరా (ర) ఆయన (స)కు నీళ్లు పోయసాగారు, ఆయన (స) వుజూ చేసుకున్నారు. మోజాలపై మసా చేశారు.**

**203. మా తండ్రిగారు ఇలా చెబుతూ ఉండగా నేను విన్నాను అని జాఫర్ బిన్ అమ్ర్ బిన్ ఉమయ్యా జమ్‌రీ ఉల్లేఖించారు: తమ మోజాల మీద ప్రవక్త మహనీయులు (సఅసమ్) మసా చేస్తూ ఉండగా నేను చూశాను. ఈ హదీసును షీబాన్‌తోపాటు హరబ్, అబాన్‌లు కూడా యహ్‌యా వివరించారని ఉల్లేఖించారు.**

**204. తన తండ్రి గారు ఇలా చెప్పినట్లు జాఫర్ బిన్ అమ్ర్ బిన్ ఉమయ్యా జమ్‌రీ ఉల్లేఖించారు: "ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) తమ తలపాగా మీద మరియు మోజాల మీద మసా చేస్తూ ఉండగా నేను చూశాను."[1]**

---

అందరూ మేజోళ్ళ మీద మసా చెయ్యటం అనే సమస్య విషయంలో ఏకాభిప్రాయం కలిగి ఉన్నారు. ఎవరైనా దీన్ని తిరస్కరించినట్లయితే వారు ఖార్‌జీ, లేదా షియా, అహెలె సున్నత్ వర్గాల నుంచి బహిష్కృతులవుతారు.

201–2. ఎందుకంటే సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ (రజిఅన్) విశ్వసనీయులు, నమ్మదగినవారు మరియు అష్‌రయె ముబష్షిరాలోని వారు (స్వర్గం లభిస్తుందనే శుభవార్త తమ జీవిత కాలంలోనే ఇవ్వబడిన పది మంది సహాబీలు). వార్త తెచ్చేవాడు మంచివాడు, నమ్మదగిన వాడు అయినట్లయితే, ఏకైక వార్తనే నమ్మాలి, దాన్ని అమలుపరచాలి.

204–1. తలపాగా మీద మసా చెయ్యటం అనే విషయాన్ని ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (ర.అలై) గారు మరియు చాలా మంది అహ్లె హదీసు విద్వాంసులు ధర్మసమ్మతమైనదే అని సమర్థించారు. ఇంకా వారు వుజూలో ఉన్నప్పుడు మాత్రమే తలపాగా ధరించాలి అనే నియమాన్ని కూడా విధించలేదు. కాని హనఫీ, ఇమామ్ షాఫయీ వర్గీయులు మాత్రం దీన్ని ధర్మ సమ్మతమైనదిగా భావించరు. కొందరు, "తల మీద మసా

**ఈ హదీసును అవ్‌జాయిూతోపాటు హజ్రత్ మామర్‌తో కూడా హజ్రత్ యహ్‌యా చెప్పారని ఉల్లేఖించారు. ఆయన అబూ సలమా నుంచి, ఆయన అమ్ర్ నుంచి, ఆయన దైవప్రవక్త (స) నుంచి ఉల్లేఖించారు.**

## 51వ అధ్యాయం

## వుజూ స్థితిలోనే మోజాలు తొడుక్కోవాలి.[1]

**205. తన తండ్రి ఇలా చెప్పారని ఉర్వా బిన్ అల్ ముగీరా ఉల్లేఖించారు: "నేను ఒకసారి ప్రవక్త మహనీయులు (స)తో ప్రయాణం చేశాను (తబూక్ యుద్ధం జరిగినప్పుడు). ఆయన (స) వుజూ చేసుకుంటున్నారు; ఆయన (స) గారి పాదాలలో ఉన్న మోజాలను తీయటానికి కిందకు వంగాను, అప్పుడు దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: "వాటిని ఉండనివ్వు, నేను వుజూ చేసుకున్న తరువాతనే వాటిని తొడుక్కున్నాను." తరువాత ఆయన (స) వాటి మీద మసా చేశారు.**

## 52వ అధ్యాయం

## మేక మాంసం మరియు అంబలి, ఇంకా నిప్పుల మీద ఉడికిన వస్తువులు తిన్న తరువాత వుజూ చేసుకునే అవసరం లేదు. అబూబకర్ (రజిఅన్), ఉమర్ (రజిఅన్), ఉస్మాన్ (రజిఅన్) మాంసం తిన్నారు, తరువాత (నమాజు చేశారు) వుజూ చేసుకోలేదు.

**206. హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఒకసారి మేక యొక్క మూపు దగ్గరి మాంసం తిన్నారు. తరువాత నమాజు చేశారు; వుజూ చేసుకోలేదు.**[1]

---

ప్రారంభించి మిగతాది తలపాగా మీద పూర్తి చేశారు" అని వాఖ్యానించారు. మేము చెప్పేది ఏమిటంటే, ఇటువంటి వ్యాఖ్యానం చేయవలసిన అవసరం ఎంత మాత్రం లేదు.

51-1. అంటే మోజాలు తొడుక్కున్నప్పుడు మనిషి వుజూ చేసుకుని ఉండాలి. ఇది అత్యంతావశ్యకం. అప్పుడే మోజాల మీద మసా చెయ్యటం ధర్మసమ్మతమవుతుంది. ఒకవేళ హదస్ (అశుద్ధ స్థితి)లో ఉన్నప్పుడు మోజాలు తొడుక్కుని ఉన్నట్లయితే వాటిని తీసివేసి కాళ్ళు కడుక్కోవాలి. ఇమామ్ అహ్మద్ (ర.అలై), షాఫయి (ర.అలై), ఇస్‌హాఖ్ (ర.అలై), మాలిక్ (ర.అలై), అబూ హనీఫా (ర.అలై) మరియు సౌరి (ర.అలై) వీరందరూ ఈ అభిప్రాయాన్నే కలిగి ఉన్నారు.

206-1. ఇస్లామ్ ప్రారంభ దశలో నిప్పుల మీద వండిన ఆహార పదార్థాలు తింటే వుజూ

**207.** నా తండ్రి ఇలా అన్నాడని జాఫర్ బిన్ అమ్ర్ బిన్ ఉమయ్యా ఉల్లేఖించారు : "ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) మేక భుజం దగ్గరి మాంసం కోసి తింటూ ఉండగా నేను చూశాను. ఇంతలో నమాజు కోసం పిలుపు వచ్చింది. అప్పుడు ఆయన (స) కత్తిని పక్కన పెట్టి నమాజు చేయించారు, కాని వుజూ చేసుకోలేదు".[1]

## 53వ అధ్యాయం

## సత్తు (వేపబడిన ధాన్యపు పిండి) తిన్న తరువాత పుక్కిలించి నమాజు చేయుట, మరియు మళ్ళీ వుజూ చేయకుండా నమాజు చేయుట.[1]

**208.** సువైద్ బిన్ నూమాన్ (రజిఅన్)ఇలా ఉల్లేఖించారు: నేను ఒకసారి ఖైబర్‌పై విజయం లభించిన సంవత్సరంలో ప్రవక్త మహనీయులు (సఅసమ్)తో ప్రయాణం చేశాను. మేము సహ్బా అనే ప్రాంతానికి చేరుకున్నాము. అది ఖైబర్‌కు దిగువ భాగంలో మదీనా వైపున ఉన్నది. అక్కడ దైవప్రవక్త (సఅసమ్) అసర్ నమాజు చేశారు. తరువాత భోజనం తీసుకురమ్మన్నారు. అప్పుడు కేవలం సత్తు పిండి మాత్రమే తీసుకురాబడింది. (అది తప్ప తినటానికి మరొక ఆహార పదార్థమేదీ లేదు). ఆయన (స) గారి ఆదేశం ప్రకారం దాన్ని నీళ్లలో కలపటం జరిగింది. ఆ తరువాత ఆయన (స) గారు దాన్ని ఆరగించారు. ఆయన (స)తోపాటు మేము కూడా

---

విరిగిపోతుంది అనేటటువంటి ఆజ్ఞ ఉండేది. తరువాత ఈ ఆజ్ఞ రద్దుచేయబడింది. కాని ఒంటె మాంసం తినటం వల్ల మాత్రం వుజూ భంగమవుతుంది. ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (ర.అలై), అహ్లెహదీస్ పరిశోధకులు ఈ అభిప్రాయాన్నే సమర్థించారు.

207-1. ఈ హదీసు ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే, మాంసాన్ని కత్తితో కోసి తినటం ప్రవక్త (స) గారి సంప్రదాయానికి విరుద్ధమైన విషయం కాదు.

53-1. సత్తు కూడా నిప్పుతోనే వండబడుతుంది. పైన వచ్చిన 52వ అధ్యాయంలో ఇమామ్ బుఖారి (ర.అలై) గారు సత్తును గురించి ప్రస్తావించారు. కాని అక్కడ ఆయన పేర్కొన్న హదీసులో కేవలం మాంసం గురించి ప్రస్తావించారేగాని సత్తును గురించిన ప్రస్తావనను తీసుకురాలేదు. దానికి సమాధానం ఏమిటంటే, మాంసం తినటం వల్ల వుజూ విరిగిపోనప్పుడు, సత్తు తినటం వల్ల కూడా వుజూ విరిగిపోదు. లేదా ఈ అధ్యాయంలోని హదీసు పైన వచ్చిన అధ్యాయంలోని విషయాన్ని ధ్రువీకరిస్తుంది. దీనితోనే ఆయన తృప్తి చెందారు.

**తిన్నాము. దాని తరువాత మగ్రిబ్ నమాజు కోసం నిలబడ్డారు. దైవప్రవక్త (స) నీళ్లు తీసుకుని కేవలం పుక్కిలించారు, మేము కూడా పుక్కిలించాము. తరువాత ఆయన (స) మళ్ళీ వుజూ చేసుకోకుండానే నమాజు చేయించారు.**[1]

**209. విశ్వాసుల తల్లి అయిన హజ్రత్ మైమూనా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) తమ ఇంట్లో ఉన్నప్పుడు మేక ముంగాలి మాంసాన్ని తిన్నారు. తరువాత మళ్లీ వుజూ చేసుకోకుండానే నమాజు చేశారు.**

## 54వ అధ్యాయం

## పాలు త్రాగిన తరువాత పుక్కిలించే అవసరం ఉందా?

**210. హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) పాలు త్రాగారు. తరువాత పుక్కిలించారు మరియు ఇలా అన్నారు; పాలల్లో కొవ్వు పదార్థం ఉంటుంది.**[1] **అఖీల్‌తోపాటు ఈ హదీసును యూనుస్, సాలెహ్ బిన్ కైసాన్‌లు కూడా ఇబ్నె షిహాబ్ నుంచి ఉల్లేఖించారు.**

## 55వ అధ్యాయం

## నిద్ర మూలంగా వుజూ చేసుకోవటం. ఒకట్రెండు సార్లు కునుకు పట్టడం వల్ల మళ్ళీ వుజూ చేయటం అనివార్యం కాదు.

**211. ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా సెలవిచ్చారని ఆయెషా (ర) ఉల్లేఖించారు: నమాజులో ఉన్నప్పుడు మీలో ఎవరికైనా కునికిపాటు వస్తే, అతను నిద్రమత్తు పూర్తిగా వదిలేవరకు నిద్రపోవాలి. ఎందుకంటే నిద్రలో ఉన్నప్పుడు నమాజు**

---

208-1. సత్తులో కొవ్వు ఉండని మాట వాస్తవమే. కాని అది పళ్ళల్లో ఇరుక్కుపోతుంది. నోటి చుట్టూ అతుక్కుపోతుంది. ఈ కారణం వల్లనే ప్రవక్త మహనీయులు (సఅసమ్) పుక్కిలించి నోటిని పరిశుభ్రపరచుకున్నారు. ఈ హదీసు ద్వారా స్పష్టంగా తెలిసిన మరొక విషయం ఏమిటంటే, ప్రయాణంలో ఉన్నప్పుడు తమ వెంట భోజనం తీసుకుపోవడం 'అల్లాహ్ మీద నమ్మకం'అనే విషయానికి వ్యతిరేకమేమీ కాదు. అందరి టిఫిన్లను ఒకే చోట పెట్టి కలిసి అన్నం తినమని ఇమామ్ చెబితే అది ధర్మ సమ్మతమైన విషయమే. ఎవరైనా ఒకవేళ తమతో భోజనం తీసుకురానట్లయితే వారు కూడా అన్నం తినవచ్చు; ఎవరూ ఆకలితో ఉండే అవసరం ఉండదు.

210-1. పుక్కిలించటం వల్ల కొవ్వు పదార్థం నోటిలో ఉండదు. నోరు పరిశుభ్రమవు తుంది. తెలిసిన మరొక విషయం ఏమిటంటే, కొవ్వు ఉన్న ప్రతి వస్తువును తిన్న తరువాత పుక్కిలించి ఊయటం ముస్తహబ్ (ధర్మం ప్రకారం మంచిదే).

**చేస్తే అతను నోటితో పలికేదేమిటో అతనికే తెలియదు. అతను క్షమాభిక్ష పెట్టమని అల్లాహ్‌ను కోరుతున్నాడో లేదా తన కోసం ఏదైనా కీడు జరగాలని కోరుతున్నాడో అతనికే తెలియదు కదా!**

**212.** ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హ్రజత్ అనస్ (రజిఅన్) ఉల్లేఖించారు: **"మీలో ఎవరికైనా నమాజులో ఉన్నప్పుడు కునికిపాటు వస్తే అప్పుడు అతను నిద్రపోవాలి; తాను నమాజులో పఠించేది అర్థ మయ్యే వరకు అతను నిద్రపోవాలి.**[1]

## 56వ అధ్యాయం

## అశుద్ధత కలగకపోయినా, వుజూ ఉన్నప్పటికీ, మళ్ళీ వుజూ చేసుకోవటం.[1]

**213.** హ్రజత్ అనస్ (రజిఅన్) ఇలా చెప్పారని అమ్రూ బిన్ ఆమిర్ ఉల్లేఖిం చారు: **ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ప్రతి నమాజుకు ముందు వుజూ చేసుకునేవారు.**[1] అమ్రూ బిన్ ఆమిర్, "మీరు ఏమి చేసేవారు" అని హ్రజత్ అనస్(ర)ను అడిగారు. ఆయన దానికి సమాధానంగా ఇలా అన్నారు: **"అశుద్ధత కలగనంత వరకు మాకు ఒకే ఒక్క వుజూ సరిపోయేది. ఆ వుజూతోనే మేము నమాజు చేసేవారం."**

**214.** హ్రజత్ సువైద్ బిన్ నూమాన్ ఇలా ఉల్లేఖించారు: **"ఖైబర్‌ను జయించి వశపరచుకున్న సంవత్సరం, మేము ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్)**

---

212-1. అంటే నిద్ర ప్రభావం తొలగిపోవాలి. గ్రహించే శక్తి ఉండాలి, విషయం అవగాహనలోకి రావాలి.

56-1. ఇమామ్ బుఖారీ (ర.అలై) ఈ అధ్యాయంలో రెండు హదీసులు పేర్కొన్నారు. మొదటి హదీసు ద్వారా ప్రస్ఫుటమయ్యే విషయం ఏమిటంటే, ప్రతి నమాజుకు ముందు తాజాగా వుజూ చేసుకోవటం 'ముస్తహబ్' (అభిలషణీయం). అంటే అంతకు ముందు నమాజు కోసం చేసుకున్న వుజూ విరిగిపోకుండా ఉన్నప్పటికీ అని భావం. రెండో హదీసు ద్వారా స్పష్టమైన విషయమేమిటంటే, ఇంతకు ముందు చేసుకున్న వుజూ ఉన్నప్పటికీ మళ్ళీ తాజాగా వుజూ చేసుకోవటం 'వాజిబ్' (తప్పనిసరి) ఏమీ కాదు. ఎందుకంటే ప్రవక్త మహనీయులు ఒకే వుజూతో రెండు నమాజులు చేశారు.

213-1. శ్రేష్ఠత దృష్ట్యా బహుశా ప్రవక్త (స) గారికి ఇది 'వాజిబ్'గా (తప్పని సరిగా) చెయ్యబడిందేమో, ఆ తరువాత దాన్ని రద్దు చెయ్యటం జరిగిందేమో. బరీదా (ర) గారి హదీసు ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే, మక్కా నగర విజయం నాడు ప్రవక్త మహనీయులు(స) ఒకే వుజూతో ఐదు పూటల నమాజులు చేశారు.

**గారితో బయలుదేరాము. సహ్బా అనే ప్రాంతానికి చేరుకున్న తరువాత[1] ప్రవక్త మహనీయులు (స) మాకు అస్ర్ నమాజు చేయించారు. నమాజు ముగిసిన తరువాత భోజనం తెప్పించారు. కాని సత్తు తప్ప తినటానికి మరొక వస్తువు ఏదీ లేదు. మేము దానినే తిన్నాము, త్రాగాము.[2] ఆ తరువాత ఆయన (స) మగ్రిబ్ నమాజు చేయించటానికి నిలబడ్డారు. పుక్కిలించి ఊశారు. దాని తరువాత మళ్ళీ వుజూ చేసుకోకుండానే మగ్రిబ్ నమాజ్ చేయించారు.**

## 57వ అధ్యాయం

## మూత్ర విసర్జన అజాగ్రత్తగా చెయ్యటం మహాపాపం.[1]

**215. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఒకసారి మదీనా పట్టణంలోనో లేదా మక్కా నగరంలోనో ఒక తోట మీదుగా ప్రయాణం చేస్తూ వెళ్ళారు (మరొక ఉల్లేఖనంలో సందేహానికి చోటు లేకుండా మదీనా పట్టణంలోని ఒక తోట అని చెప్పబడింది). అక్కడ ఆయన (స) ఇద్దరు వ్యక్తుల అరుపులు విన్నారు. వారు సమాధిలో శిక్షను అనుభవిస్తున్నారు. అప్పుడు ఆయన(స) ఇలా అన్నారు : 'వారిద్దరూ శిక్ష అనుభవిస్తున్నారు. ఇంతకీ ఈ శిక్షకు కారణం ఏదో పెద్ద పాపం చేయటం కాదు'. మళ్ళీ ఆయన, "అయితే అది పెద్ద పాపమే" అని సెలవిచ్చారు.[1] వారిలో ఒకడు తన మూత్రం విషయంలో జాగ్రత్తపడేవాడు కాదు. రెండో మనిషి చాడీలు చెబుతూ తిరిగేవాడు.[2] ఆ తరువాత**

---

214-1. ఖైబర్ మార్గంలో లోతట్టు ప్రాంతంలోని ఒక ప్రదేశాన్ని 'సహ్బా' అని అంటారు. దాని ప్రస్తావన ఇంతకు క్రితమే వచ్చింది.

214-2. అంటే, మంచి నీళ్ళు త్రాగారు లేదా సత్తును నీళ్ళల్లో కలిపి త్రాగేశారు.

57-1. కొన్ని హదీసుల్లో, 'లాయస్తతిర్' అని వచ్చింది; మరికొన్ని హదీసుల్లో 'లాయస్ తబ్రీ' అని ఉంది; ఇంకా కొన్ని హదీసుల్లో 'లాయస్తన్జిహు' అని వ్రాయబడి ఉంది. అన్ని పదాల అర్థం దాదాపు ఒక్కటే. అంటే మూత్రం తన మీద పడకుండా జాగ్రత్తపడడు; అజాగ్రత్తగా వ్యవహరించి తన శరీరాన్ని లేదా తన దుస్తుల్ని మూత్రం ద్వారా మలిన పరుస్తాడు లేదా అశుద్ధపరుస్తాడు. కొందరు పండితులు 'లాయస్తతిర్' అనే అరబ్బీ పదానికి ఈ అర్థం చెప్పారు; 'మూత్ర విసర్జన చేసే విషయంలో పరదా పద్ధతులను పాటించడు. ప్రజల కంటపడకుండా జాగ్రత్తలు తీసుకోడు.' అంటే శరీరంలోని సిగ్గుపడవలసిన మర్మభాగాలను బహిరంగపరుస్తాడు. కాని ఈ సూక్తి బలహీనమైనది.

ఆయన (స) ఒక పచ్చని ఖర్జూరపు కొమ్మను తెప్పించారు. దానిని రెండు ముక్కలుగా చేశారు. వారి సమాధులపై వాటిని పాతిపెట్టారు. ప్రజలు, "ఓ ప్రవక్తా! మీరు అలా ఎందుకు చేశారు?" అని అడిగారు. దానికి సమాధానంగా ఆయన (సఅసమ్) "బహుశా అవి ఎండి పోనంత వరకు వారి శిక్ష తేలికగా ఉంటుంది[3]" అని అన్నారు.

## 58వ అధ్యాయం

**మూత్రాన్ని కడగటం. ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఒక సమాధిలోని వ్యక్తిని గురించి (అతని ప్రస్తావన పైన వచ్చింది) ఇలా సెలవిచ్చారు; అతను తన మూత్రం నుంచి తనను కాపాడుకునేవాడు కాడు. కనుక ఆయన (స) మనిషి మూత్రాన్ని గురించే ప్రస్తావించారు.[1]**

**216. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) కాలకృత్యాలు తీర్చుకోవటానికి వెళ్ళినప్పుడల్లా నేను నీళ్ళు తీసుకుని వెళ్ళేవాణ్ణి. ఆయన(స) ఆ నీళ్ళతో (తమ మర్మాంగాన్ని) పరిశుభ్ర పరచుకునేవారు.[1]**

---

215-1. అధ్యాయంలో పేర్కొనబడిన ప్రధానాంశం ఇదే. ఎందుకంటే ప్రవక్త మహనీయులు (సఅసమ్) మూత్రం గురించి జాగ్రత్తగా ఉండకపోవడాన్ని పెద్ద పాపంగా అభివర్ణించారు. మొదట అది పెద్ద పాపాలలోనిది కాదు అని ఆయన (స) సెలవిచ్చారు. అప్పటి వరకు ఆయన (స) గారికి బహుశా ఇది పెద్ద పాపమని తెలిసి ఉండకపోవచ్చు; తరువాత ఇది పెద్ద పాపమేనని ఆయన(స)గారిపై దైవవాణి అవతరించి ఉండవచ్చు.

215-2. ముస్లిములకు సమాధి శిక్ష పడుతుందనే విషయాన్ని ఈ హదీసు చాలా స్పష్టంగా రుజువు చేస్తోంది. ఎందుకంటే, ఈ రెండు సమాధుల్లోని వ్యక్తులు ముస్లిములు. ఒకవేళ వారు అవిశ్వాసులే అయినట్లయితే ఆయన(స), వారి అవిశ్వాసం వల్ల వారికి శిక్ష పడుతోంది అని సెలవిచ్చి ఉండేవారే. ఈ వ్యక్తుల పేర్లు ఏమిటో తెలియదు. 'సునన్ ఇబ్నెమాజా'లో ఆ సమాధులు కొత్తవి అని చెప్పబడింది.

215-3. కొందరు ఏమంటారంటే, ప్రవక్త మహనీయులు(సఅసమ్) చేసిన ప్రార్థన వల్ల శిక్ష తగ్గుతుంది. ఆ కొమ్మల ప్రభావం ఏమీ ఉండదు. మరికొందరు ఏమంటారంటే, పచ్చని కొమ్మ అల్లాహ్ పవిత్ర నామాన్ని జపిస్తుంది, ఈ కారణంగా శిక్ష తగ్గి ఉండవచ్చు. పరిస్థితి గనక ఇదే అయితే శుభప్రదమైన ప్రతి విషయం ప్రభావం ఇలానే ఉంటుంది; ఉదాహరణకు, అల్లాహ్ పవిత్ర నామ సంస్మరణ ఖురాను గ్రంథ

**217.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) రెండు సమాధులు మీదుగా వెళ్ళారు. ఆ సమాధుల్లోని ఉభయులూ శిక్షను అనుభవిస్తున్నారు. (ఇంతకీ ఆ శిక్ష) ఏదో మహాపాపం చేసినందు వల్ల కాదు. వారిలో ఒకడు మూత్రం విషయంలో జాగ్రత్తగా ఉండేవాడు కాదు. రెండో వాడు చాడీలు చెబుతూ తిరుగుతూ ఉండేవాడు. తరువాత ఆయన(స) పచ్చని ఖర్జూరపు కొమ్మను తీసుకున్నారు, దానిని రెండుగా చీల్చివేశారు. ప్రతి సమాధి మీద ఒక్కొక్కటి నాటారు. ప్రజలు ఇంకా విన్నవించుకున్నారు; 'ఓ ప్రవక్తా! మీరు అలా ఎందుకు చేశారు?' దానికి సమాధానంగా ఆయన (స) ఇలా సెలవిచ్చారు; బహుశా ఈ కొమ్మలు ఎండిపోనంతవరకు వారి శిక్ష కఠినంగా ఉండదు, తేలికగా ఉంటుంది.

## 59వ అధ్యాయం

### ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) మరియు ఆయన (స) గారి అనుచరులు మసీదులో మూత్రం పోస్తూ ఉన్నటువంటి పల్లెటూరు మనిషిని, అతను పూర్తిగా మూత్రం పోసే వరకు ఏమీ అనకుండా వదలిపెట్టారు.

**218.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఒక పల్లెటూరు మనిషి[1]ని మసీదులో మూత్రం పోస్తూ ఉండగా చూశారు (ప్రజలు అతని మీద ఆగ్రహం వ్యక్తం చేశారు). ఆయన(స) ప్రజల్ని ఉద్దేశించి, అతన్ని ఏమీ అనబాకండి అని సెలవిచ్చారు. అతను మూత్ర విసర్జనం పూర్తి చేసిన తరువాత దైవప్రవక్త (స) నీళ్లు తెప్పించి దాని మీద పోసారు.

---

పారాయణం మొదలైనవి. బరీదా (రజిఅన్), తనను సమాధిలో పాతిపెట్టిన తరువాత తన గోరీ మీద పచ్చని రెండు కొమ్మలు నాటమని వీలునామా వ్రాశారు.

58–1. ఇతర మూత్రాలను గురించి కాదు. ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారి భావం ఏమిటంటే, హదీసులో మూత్రం అంటే మనిషి మూత్రం అని భావం. ప్రతీ మూత్రం అని అర్థం కాదు. ఎందుకంటే, హలాల్ పశువుల మూత్రం పరిశుభ్రమైనదని ఇతర హదీసుల ద్వారా తెలుస్తోంది.

216–1. కాలకృత్యాలు తీర్చుకోవటం అంటే మలమూత్ర విసర్జనాలు రెండూ అని భావం. కనుక మూత్ర విసర్జనం తరువాత మర్మాంగాన్ని కడుక్కోవటం నిరూపితమైపోయింది. పై అధ్యాయంలో వచ్చిన విషయం కూడా ఇదే.

218–1. ఇక్కడ ప్రస్తావించబడిన పల్లెటూరి మనిషి అఖ్రా బిన్ జాబిస్ లేదా ఉయైనా

## 60వ అధ్యాయం
## మసీదులో మూత్రం మీద నీళ్లు పొయ్యటం.

**219. హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఒక అనాగరిక పల్లెవాసి నిలబడి మసీదులో మూత్ర విసర్జనం చెయ్యసాగాడు. అప్పుడు ప్రజలు అతన్ని కోపంతో కేకలు వేశారు. అయితే ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) అతన్ని వదిలిపెట్టండి, ఏమీ అనబాకండి. అతను మూత్రం పోసిన స్థలంలో ఒక బకెట్టు నిండా నీళ్ళు తెచ్చి ప్రవహింపజెయ్యండి.[1] ఎందుకంటే మీరు ప్రజలకు సౌలభ్యం కలుగజెయ్యటానికి పంపబడ్డారు, కష్టం కలిగించటానికి కాదు.[2] అని సెలవిచ్చారు.**

**220. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్), ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని ఉల్లేఖించారు: పై హదీసులోని విషయమే.**

---

బిన్ హసన్ లేదా జుల్ ఖువైసరా ఎమానీలలో ఎవరైనా కావచ్చు. అహ్లె హదీస్ వారు ఈ హదీసు ప్రకారమే నడుస్తున్నారు. కొందరు ఏమన్నారంటే, గట్టి నేల నీళ్ళుపోయటం వల్ల పరిశుభ్రమైపోతుంది. కాని మెత్తని నేల విషయంలో మటుకు, మూత్రం యొక్క తడి ఎంత వరకైతే ఉంటుందో అంతవరకు ఆ నేలను త్రవ్వి మట్టిని దూరంగా పారబొయ్యాలి. ప్రవక్త మహనీయులు (సఅసమ్), మూత్రం పోసే ఆ మనిషిని ఏమీ అనబాకండి అని చెప్పటంలో ఎంతో వివేకం ఉంది. ఎందుకంటే, ఆ మనిషి మూత్రం పొయ్యటం ప్రారంభించాడు, నేల తడిసి అశుద్ధమైపోయింది. ఇప్పుడు అతన్ని కొట్టడం, కేకలు వెయ్యటం వల్ల కలిగే ఫలితం ఏమిటంటే ఆ అనాగరిక పల్లెవాసి అటూ ఇటూ పరుగుత్తుతూ మసీదు మొత్తాన్ని అశుద్ధమయం చేస్తాడు. బహుశా అతనికి మూత్రం పోసే విషయంలో ధర్మశాస్త్రం ఏమి చెబుతుందో తెలియకపోవచ్చు. ఇంకా అతను ఇస్లామ్ ధర్మాన్ని త్యజించి పారిపోనూ వచ్చు. మరొక హదీసులో ఎలా ఉందంటే, ఆ పల్లెటూరు మనిషి మూత్ర విసర్జనం తృప్తిగా పూర్తి చేసిన తరువాత దైవప్రవక్త (స) అతన్ని పిలిచారు, మృదువుగా, మెత్తగా, సహృదయంతో "మసీదులు అల్లాహ్‌ను స్మరించటానికీ, నమాజులు చెయ్యటానికీ నిర్మించబడ్డాయి. కనుక మసీదుల్లో మూత్రవిసర్జనం చెయ్యటం కానీ, ఏదైనా అశుద్ధ పదార్థం వెయ్యటం కానీ చెయ్యకూడదు" అని చెప్పారు. సుబ్‌హానల్లాహ్ (అల్లాహ్ మాత్రమే పరిశుద్ధుడు) ఇటువంటి సత్ప్రవర్తన, ఇటువంటి నేర్పు ఒక్క ప్రవక్తకే సాధ్యమయ్యే విషయం. ఇతరులకు సాధ్యం కాని విషయం, కష్టతరమైన విషయం.

219-1. ఇక్కడ ఉల్లేఖకునికి, ప్రవక్త మహనీయులు (సఅసమ్) 'సజ్ల' అనే పదం

**221.** హ్రజత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఒక అనాగరిక పల్లెవాసి మసీదులోకి ప్రవేశించి ఒక మూలకుపోయి అక్కడ మూత్రం పోయసాగాడు. అప్పుడు ప్రజలు అతన్ని ఆగ్రహంతో కేకలేశారు. కాని ప్రవక్త మహనీయులు (సఅసమ్) వారిని కేకలేయకుండా వారించారు. ఆ పల్లెటూరి వ్యక్తి మూత్ర విసర్జనం పూర్తి చేసిన తరువాత దైవ ప్రవక్త (సఅసమ్), అతను మూత్ర విసర్జనం చేసిన స్థలంలో ఒక బక్కెట్టు నీళ్ళు ప్రవహింపజెయ్యమని ప్రజల్ని ఆదేశించారు. వారు అలానే చేశారు.

## 61వ అధ్యాయం
## పిల్లలు పోసే మూత్రం

**222.** హ్రజత్ ఆయెషా (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు: ఒకసారి ఒక పిల్లవాడిని ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) వద్దకు తీసుకురావటం జరిగింది.[1] ఆ పిల్లవాడు ఆయన (స) గారి వస్త్రం మీద మూత్రం పోశాడు. అప్పుడు ఆయన (స) నీళ్ళు తెప్పించి దాని మీద పోశారు.[2]

**223.** ఉమ్మె ఖైస్ బిన్‌తె ముహ్‌సిన్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఒకసారి ఆమె తన చిన్న కొడుకును ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) దగ్గరకు తీసుకువెళ్ళారు. ఆ పిల్లవాడు ఇంకా అన్నం తినటం ప్రారంభించనే లేదు (అంటే పాలు త్రాగుతున్నాడు). ఆయన(స) గారు ఆ పిల్లవాణ్ణి తమ ఒడిలో కూర్చోబెట్టుకున్నారు. తరువాత ఆ పిల్లవాడు ఆయన(స) గారి వస్త్రం మీద మూత్రం పోశాడు.

---

వాడారా? లేక 'జనూబ' అనే పదం వాడారా? అనే అనుమానం కలిగింది. అయితే ఈ రెండు పదాల అర్థం ఒక్కటే, "నీళ్లతో నిండిన బకెట్టు."

219-2. పంపబడింది ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గాని, సహాబీలు(ర) కాదు. కాని సహాబీలు ప్రవక్త మహనీయుని (స) తరఫున ధార్మిక విద్యను బోధించటానికి పంపబడుతూ ఉండేవారు.

222-1. ఈ పిల్లవాడు ఉమ్మె ఖైస్ కుమారుడు అని పెద్దలు అంటారు. ఇంకా ఇమామ్ హుస్సేన్(ర) లేదా ఇమామ్ హసన్ (ర) అయినా కావచ్చు అనే అనుమానం ఉంది అని కూడా పెద్దలు అంటారు.

222-2. అంటే ఎక్కడెక్కడైతే వస్త్రానికి మూత్రం తగిలిందో అక్కడక్కడ దాని మీద నీళ్ళు

**అప్పుడు ఆయన (స) నీళ్ళు తెప్పించి దాని మీద నీళ్ళు చల్లారు. దానిని కడుగలేదు.**

## 62వ అధ్యాయం

## నిలబడి, కూర్చొని మూత్ర విసర్జనం చేయుట[1]

**224. హుజైఫా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) పోతూ పోతూ మార్గమధ్యంలో ఒక జాతి వారి పెంటదిబ్బ వద్దకు వెళ్ళి అక్కడ నిలబడి మూత్ర విసర్జనం చేశారు. తరువాత నీళ్ళు తీసుకురమ్మని అడిగారు. అప్పుడు నేను నీళ్లు తీసుకువచ్చాను. ఆయన గారు (స) వుజూ చేసు కున్నారు.[1]**

## 63వ అధ్యాయం

## మిత్రుడు దగ్గరగా ఉన్నప్పుడు మూత్రం పొయ్యటం, గోడను చాటుగా చేసుకొని మూత్రం పొయ్యటం.

**225. హజ్రత్ హుజైఫా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు**

---

చిలకరించారు. ఎలా అంటే, నీరు ప్రవహించలేదు కాని అది మూత్రంతో పాటు వస్త్రంలో ఇంకిపోయింది. 'తహావీ'గారి ఉల్లేఖనంలో "కడగలేదు", "ఉతకలేదు" అనే విషయం అదనంగా ఉంది. ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (ర.అలై) మరియు అహెలె హదీస్ విద్వాంసులు కూడా ఈ అభిప్రాయాన్నే సమర్థిస్తున్నారు. పిల్లవాడు పోసిన మూత్రం మీద కేవలం నీళ్ళు చల్లితే సరిపోతుంది. ఆడపిల్ల మూత్రాన్ని మాత్రం కడగాలి.

62-1. నిలబడి, కూర్చొని రెండు విధాలుగానూ మూత్ర విసర్జనం చెయ్యటం ధర్మసమ్మత మైన విషయమే. కాని ఎక్కడైతే మూత్రం చిలికిపడే (ఎగిరిపడే) అవకాశం వుందో, అక్కడ నిలబడి మూత్రం పొయ్యటం మక్రూహ్. అంటే అసహ్యకరమైనది; కొంత మంది దృష్టిలోనయితే అది పూర్తిగా, ఖచ్చితంగా అసహ్యకరమైనదే. ఇమామ్ బుఖారీ (రెహ్మలై), అహ్లె హదీసు విద్వాంసులు మరియు ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రెహ్మలై) గార్ల దృష్టిలో పై రెండు విధాలుగా మూత్ర విసర్జనం చెయ్యటం ధర్మసమ్మతమైన విషయమే. ఈ వైఖరే ధర్మశాస్త్రబద్ధమైనది, సరియైనది.

224-1. కొందరు ఏమన్నారంటే, ఆయన (స) గారికి కూర్చుని మూత్రం పొయ్యటానికి స్థలం కనిపించలేదు. కింద నేల అంతా అశుద్ధ పదార్థాలతో నిండి ఉన్నది: మరి కొందరు ఏమంటారంటే, ఆయన (స) గారు మోకాళ్ల నొప్పితో బాధపడుతున్నారు. కాని ఈ సాకులన్నీ ఆమోదయోగ్యమైనవి కావు. హాఫిజ్ ఇబ్నె హజర్ (రజిఅన్) ఇలా

**ముహమ్మద్ (సఅసమ్), నేను (ఇద్దరం కలిసి) నడుస్తూ పోతున్నాము. దైవప్రవక్త(స) ఒక జాతి వారి పెంటదిబ్బ వద్దకు వెళ్ళారు. అక్కడ ఉన్నటువంటి ఒక గోడ వెనుకకు పోయి, మీరు ఇక్కడ నిలబడి ఉన్న మాదిరిగానే ఆయన (స) కూడా నిలబడ్డారు. తరువాత ఆయన (స) మూత్రం పొయ్యసాగారు. అప్పుడు నేను పక్కకు తప్పు కున్నాను. కాని ఆయన (స) నన్ను సైగచేసి[1] రమ్మని పిలిచారు. నేను వెనుదిరిగి వచ్చాను. ఆయన (స) గారి మడమల దగ్గర నిలబడ్డాను. ఆయన (స) పూర్తిగా మూత్ర విసర్జన చేసే వరకు అలానే నిలబడి ఉన్నాను.**

## 64వ అధ్యాయం

### ఇతరుల పెంటదిబ్బ దగ్గర మూత్ర విసర్జనం చెయ్యటం.

**226. అబూ వాయిల్ ఇలా ఉల్లేఖించారు: అబూ మూసా అష్అరీ (రజిఅన్) మూత్రం పోసే విషయంలో కఠినంగా వ్యవహరించేవారు.[1] మరియు ఇలా చెబుతూ ఉండేవారు; "ఇస్రాయీల్ సంతతికి చెందిన ఏ వ్యక్తి వస్త్రం మీదనైనా మూత్రం పడినట్లయితే అప్పుడు అతను ఆ వస్త్రాన్ని అంతవరకు కత్తిరించిపారేస్తాడు." దానికి హజ్రత్ హుజైఫా (రజిఅన్), అబూమూసా(ర) ఇంత కఠినంగా వ్యవహరించకుండా ఉంటే బాగుండేది. ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఒక జాతి వారి పెంటకుప్ప దగ్గరకు పోయి అక్కడ నిలబడి మూత్ర విసర్జనం చేశారు" అని అన్నారు.**

---

అన్నారు. నిలబడి మూత్ర విసర్జనం చెయ్యటాన్ని నిషేధించే హదీసు ఏదీ ప్రామాణికతతో రుజువు కాలేదు. హజ్రత్ ఉమర్ (రజిఅన్) ఇలా సెలవిచ్చారు. అల్ బోల్ ఖాయిమన్ అహ్సనుల్ దుబుర్ (అరబ్బులు వీపులో నొప్పికి నిలబడి మూత్రం పొయ్యటాన్ని లాభకరమయినదిగా భావించారు).

225–1. హుజైఫా (రజిఅన్)ను తమ వద్దకు రమ్మని పిలవటంలోగల ఉద్దేశ్యం ఏమిటంటే, అతను ఆయన (స) గారికి చాటుగా నిలబడాలని, ముందు భాగంలోనయితే గోడ ఆసరాగా ఉండనే ఉన్నది కదా! ఈ సంఘటన ప్రవక్త మహనీయులు (స) ఒకచోట ఆగి ఉన్నప్పుడు జరిగిందేకాని ప్రయాణంలో జరిగింది కాదు. దీని ద్వారా ఆయన (స) గారి సిగ్గు పూర్ణత్వం, బిడియం యొక్క ఔన్నత్యం మనకు అర్థమవుతాయి.

226–1. ఆ కాఠిన్యం ఏమిటంటే, ఆయన (ర), నిలబడి మూత్రం పొయ్యవద్దని ప్రజల్ని ఆపేవారు. ఒక వ్యక్తి నిలబడి మూత్రం పోస్తూ ఉండగా చూసి ఆయన (ర) నీవు చేస్తున్న పనిని చూసి నేను బాధపడుతున్నాను. నీవు కూర్చొని మూత్రం ఎందుకు పొయ్యవు? అని అన్నారు. ఆ తరువాత ఇస్రాయీల్ సంతతి వారికి చెందిన గాధను వినిపించారు.

## 65వ అధ్యాయం

## రక్తాన్ని కడిగెయ్యటం.[1]

**227.** అస్మా (రజిఅన్‌హా) ఇలా కథనం చేశారు: ఒక స్త్రీ ప్రవక్త మహనీయుని (సఅసమ్) వద్దకు వచ్చారు. (స్వయంగా ఆమె అస్మాయే) ఆమె ప్రవక్త (స)ను ఇలా అడిగారు; "మాలో ఏ స్త్రీ అయినా బహిష్టు అయినప్పుడు, దాని రక్తం వస్త్రానికి[1] తగిలితే ఆమె ఏమి చెయ్యాలి?" ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు : "దానిని గీకివేయాలి, తరువాత నీళ్ళు పోసి మళ్ళీ రుద్దాలి, ఆ తరువాత మళ్లీ నీళ్లు పోసి బాగా కడగాలి.[2] ఆ వస్త్రం ధరించి నమాజు చెయ్యవచ్చు."

**228.** హజ్రత్ ఆయెషా (రజిఅన్)ఇలా ఉల్లేఖించారు: ఫాతిమా అబూ హుబైష్ గారి కూతురు ఒకసారి ప్రవక్త మహనీయుని (స) వద్దకు వచ్చారు. ఆమె ఇలా అన్నారు; ఓ దైవప్రవక్తా! నేను 'ఇస్తెహాజా'[1] అనే వ్యాధితో బాధపడే స్త్రీని. నేను పరిశుభ్రంగా ఉండటం అనేది జరగటం లేదు. కాబట్టి నన్ను నమాజు చెయ్యటం మానెయ్యమంటారా? ఆయన (స) ఇలా సెలవిచ్చారు; నమాజును మానెయ్యొబాకు. ఇది ఒక రక్తనాళంలో నుంచి ప్రవహించే రక్తమే కాని బహిష్టువల్ల వచ్చే రక్తం కానేకాదు. తరువాత నీ మామూలు ప్రకారం బహిష్టు దినాలు వచ్చినప్పుడు నమాజు చెయ్యొబాకు. ఆ దినాలు గడిచిపోయిన తరువాత నీ శరీరాన్ని నీ వస్త్రాలను[2] కడిగి పరిశుభ్రం చేసుకో. ఆ తరువాత నమాజు చెయ్యి. హిషామ్ ఏమన్నారంటే, నా తండ్రి గారైన ఉర్వా ఇలా అన్నారు; ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు: "తరువాత ప్రతి నమాజుకు ముందు వుజూ చేసుకుంటూ ఉండు. మళ్లీ బహిష్టు దినాలు వచ్చే వరకు."[3]

---

65–1. అంటే బహిష్టు రక్తం అని అర్థం. ఎందుకంటే ఇతర రక్తాల అశుద్ధత విషయంలో అభిప్రాయ భేదం ఉంది. వాటి అశుద్ధతను గురించి బలమైన ఆధారం ఏదీ ఇంత వరకు స్థాపించబడలేదు.

227–1. అంటే వస్త్రానికి బహిష్టు రక్తం తగిలితే దాన్ని ఎలా పరిశుభ్రం చెయ్యాలి.

227–2. తెలిసిన విషయం ఏమిటంటే, అశుద్ధతను దూరం చెయ్యటానికి నీళ్లు చాలా అవసరం మరియు ఇతర వస్తువులతో కడగటం సరియైన పద్ధతి కాదు. చాలా మంది విద్వాంసులు ఈ అభిప్రాయాన్నే సమర్థిస్తున్నారు. హనఫీ శాస్త్రవేత్తలు మటుకు, పరిశుభ్రమైన ప్రతి ద్రవపదార్థంతో అశుద్ధతను కడిగెయ్యవచ్చు అని అంటారు.

228–1. 'ఇస్తెహాజా' అనేది ఒక విధమైన వ్యాధి. ఆ వ్యాధితో బాధపడే స్త్రీకి రక్తస్రావం జరుగుతూనే ఉంటుంది, అది ఆగిపోదు.

## 66వ అధ్యాయం

**'మనీ'ని అంటే వీర్యస్ఖలనం కంటే ముందు వెలువడే జిగట ద్రవ పదార్థాన్ని నీళ్లతో కడగటం మరియు దాన్ని రుద్ది, గీకి పరిశుభ్రం చెయ్యటం. స్త్రీ మర్మాంగంలోని తడి తగిలితే దాన్ని కడగటం, పరిశుభ్రపరచటం.[1]**

**229.** హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: నేను ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారి వస్త్రాలకు తగిలినటువంటి వీర్యాన్ని కడిగి పరిశుభ్రం చేసేదాన్ని, తరువాత ఆయన (స) నమాజుకు వెళ్ళేవారు, ఆయన (స) గారు ధరించిన వస్త్రాల మీద నీటి మరకలు కనిపించేవి.[1]

**230.** హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) గారి బట్టలకు తగిలిన రేతస్సును (వీర్యమును) నేను కడిగేదాన్ని, తరువాత ఆయన నమాజుకు వెళ్ళేవారు. ఆయన (స) గారి బట్టల మీద నీటి మరకలు స్పష్టంగా కనిపించేవి.

---

228–2. ఇక్కణ్ణుంచే అధ్యాయంలోని ప్రధాన విషయం ఉద్భవిస్తుంది. ఎందుకంటే, ప్రవక్త మహనీయులు (స) బహిష్టు రక్తాన్ని కడిగెయ్యమని ఆజ్ఞాపించారు.

228–3. ఆ దినాలలో అంటే బహిష్టు అయిన దినాలలో నమాజు చెయ్యటం వదిలెయ్యి. ఈ దినాలు గడిచిపోయినప్పుడు మళ్లీ గుసుల్ (తలంటి స్నానం) చేసి నమాజును ప్రారంభించు. ప్రతి నమాజుకు ముందు వుజూ చేసుకుంటూ ఉండు. ఈ హదీసు ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే, ఏదైనా అశుద్ధత, అపాన వాయువు, మూత్రం వంటివి ఎల్లప్పుడు మనిషిని అంటిపెట్టుకుని ఉంటే అప్పుడు నమాజును వదలి పెట్టకూడదు. కాని ప్రతి నమాజుకు ముందు తాజాగా వుజూ చేసుకుంటూ ఉండాలి. మరొక నమాజు సమయం రానంతవరకు అదే వుజూతో ఫర్జ్, నఫిల్ నమాజులు చేస్తూ ఉండవచ్చు. అశుద్ధతను పట్టించుకోకూడదు.

66–1. అహ్లె హదీస్‌లో వారు, షాఫయి (ర.అలై) గారు, అహ్మద్ (రె.అలై) అనుచరుల దృష్టిలో శుక్లము (మనీ) పరిశుభ్రమైనది. దాన్ని కడిగి పరిశుభ్రం చెయ్యాలనే ఆజ్ఞ, అభిలషణీయమైనది అనే విషయాన్ని సూచిస్తుందే కాని, అలా విధిగా చెయ్యాలనే విషయాన్ని మాత్రము సూచించదు. అయితే హనఫీ మస్లక్ వారి, మాలికీ మస్లక్ వారి దృష్టిలో మాత్రం అది అశుద్ధమైనది, కనుక ఇక్కడ కడిగి పరిశుభ్రం చెయ్యాలి అనే ఆజ్ఞ, అలా విధిగా చెయ్యాలి అనే విషయాన్ని సూచిస్తుంది.

229–1. ఈ అధ్యాయంలో ఇమామ్ బుఖారీ (రెహ్మాలై) గారు ఏ హదీసులనైతే ప్రస్తావిం

**231. సులైమాన్ బిన్ యసార్ ఇలా ఉల్లేఖించారు: నేను ఒకసారి హజ్రత్ ఆయెషా (రజిఅన్హా)ను, దుస్తులకు వీర్యము తగిలినప్పుడు ఏమి చెయ్యాలి? అని అడిగాను. దానికి సమాధానంగా ఆమె (ర) ఇలా అన్నారు, ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారి దుస్తులకు అంటుకున్న వీర్యాన్ని నేను కడిగేదాన్ని. తరువాత ఆయన (స) ఆ దుస్తులు ధరించి నమాజు కోసం వెళ్ళిపోయేవారు. ఆ దుస్తుల మీద గుర్తులు అంటే నీటి మరకలు స్పష్టంగా కనిపించేవి.**

## 67వ అధ్యాయం

**వస్త్రాలకు అంటుకున్న వీర్యము మొదలైనవి (బహిష్టు రక్తము) కడిగినా, వాటి ప్రభావం పోకపోతే అనే విషయం గురించి.[1]**

**232. అమ్రు బిన్ మైమూన్ ఇలా ఉల్లేఖించారు: సులైమాన్ బిన్ యసార్ ఇలా అంటూ ఉండగా నేను విన్నాను; వస్త్రాలకు వీర్యం తగిలినపుడు, ఈ విషయం గురించి హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా సెలవిచ్చారు. ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారి వస్త్రాలకు తగిలిన వీర్యాన్ని నేను కడిగి వేసేదాన్ని.**

---

చారో ఆ హదీసుల్లో స్త్రీ మర్మాంగంలోని తడికి సంబంధించిన ప్రస్తావన లేనేలేదు. ఈ విషయానికి సంబంధించిన ఒక స్పష్టమైన హదీసు "గుసుల్ గ్రంథం" లోని చివరి భాగంలో ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారు వివరించారు. హజ్రత్ ఉస్మాన్ గారి ద్వారా, ఈ విషయానికి సంబంధించిన హదీసుల ద్వారా ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారు స్త్రీ మర్మాంగపు తడిని గురించి ఎలా విశ్లేషించారంటే, బట్టలకు అంటుకునే శుక్లంలో బహుశా స్త్రీ మర్మాంగపు తడి కూడా ఉంటుంది. షేఖ్ మౌఫిఖ్ గారు ఏమన్నారంటే, స్త్రీ మర్మాంగపు తడి కూడా పరిశుభ్రమైనదే.

67–1. అంటే రంగు లేక వాసన ఇంకా మిగిలి ఉండటం లేక పూర్తిగా పోకపోవటం. ఖస్తలాని గారు ఇలా అన్నారు: ఒకవేళ దానికి సంబంధించిన గుర్తులు కడిగి చెరిపి వేయటం సులభమైనప్పుడు ఆ పనైనా చెయ్యకుండా ఉంటే అప్పుడు ఆ వస్త్రం పరిశుభ్రమైన వస్త్రం కాదు. ఒకవేళ అది కష్టతరమైతే, అంటే కడిగినప్పటికీ పోకపోతే ఆ వస్త్రం పరిశుభ్రమైన వస్త్రమైపోతుంది. ఒకవేళ రంగు, వాసన రెండూ మిగిలి ఉంటే అప్పుడు కూడా వస్త్రం పరిశుభ్రమైనది కాబోదు...అనే విషయం సుస్పష్టం. ఇమామ్ బుఖారి (రెహ్మాలై) ఈ అధ్యాయంలో ఒక్క వీర్యాన్ని గురించి తప్ప ఇతర అశుద్ధ వస్తువులు వేటిని గురించీ ప్రస్తావించనేలేదు. బహుశా ఆయన గారు వీర్యం ఆధారంగా మిగతా అశుద్ధ వస్తువు లను గురించి ఊహించి ఉంటారు. అంటే వీర్యం

**తరువాత ఆయన నమాజు కోసం బయలుదేరేవారు. వస్త్రాల మీద కడిగిన గుర్తులు, నీటి మరకలు కనిపించేవి.**

**233. హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: "ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) గారి బట్టల మీద ఉన్న వీర్యాన్ని నేను కడిగే దాన్ని. తరువాత దానికి సంబంధించిన ఒకటి లేక అనేక మరకలు ఆ బట్టల మీద కనిపించేవి.[1]**

## 68వ అధ్యాయం

### ఒంటెలు, మేకలు మరియు ఇతర పశువుల మూత్రానికి సంబంధించిన మరియు మేకల దొడ్డికి సంబంధించిన ప్రస్తావన.

**అబూ మూసా అష్అరీ (రజిఅన్) పశువుల పేడ ఉన్నటువంటి దారుల్ బరీద్‌లో నమాజు చేశారు. వాస్తవానికి పరిశుభ్రమైన చదునైన మైదానం ఆయనకు దగ్గరలోనే ఉన్నది. ఆయన ఈ రెండు స్థలాలు సమానమైనవే అని చెప్పారు.[1]**

**234. హజ్రత్ అనస్ (రజిఅన్) ఇలా చెప్పారని అబూ ఖిలాబ ఉల్లేఖించారు: "ఉకల్, ఉరయ్‌నా తెగలకు[1] చెందిన కొందరు ప్రజలు మదీనా పట్టణానికి వచ్చారు. కాని అక్కడి వాతావరణం వారికి సరిపడలేదు. అప్పుడు ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (స) వారిని పాలిచ్చే ఒక ఒంటెల మంద వద్దకు పొమ్మని ఆజ్ఞాపించారు.[2]**

---

గురించి ఆలోచిస్తే సరిపోతుంది. మిగతా విషయాలు తేలికగా అర్థమైపోతాయి. దీనిద్వారా తెలిసిన విషయం ఏమిటంటే, ఇమామ్ బుఖారి (రెహ్మాలై) గారి దృష్టిలో కూడా వీర్యము అశుద్ధమైన వస్తువే.

223-1. ప్రవక్త (స) గారి బట్టల మీద కనిపించిన మరకలు ఒకటా లేక ఇంకా ఎక్కువా అనే సందేహం బహుశా ఉల్లేఖించిన వ్యక్తికి కలిగి ఉండవచ్చు. కొందరేమన్నారంటే, హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) స్వయంగా అలా అన్నారు. అధ్యాయంలోని అసలు విషయం ఇక్కడే ఉంది.

70-1. అంటే గుర్రం, గాడిద, ఏనుగు మొదలైన జంతువుల మలము మరియు పేడ అశుద్ధమైనవి కావు. కనుక ఈ స్థలమూ, అడవిలోని చదునైన మైదానమూ రెండూ సమానమైనటువంటివే. ఇమామ్ బుఖారి (రహ్మాలై) గారి అభిప్రాయం ఏమిటంటే, ధర్మసమ్మతమైన జంతువుల మలము, మూత్రము రెండూ పరిశుభ్రమైనటువంటివే. ఇమామ్ అహ్మద్ (రహ్మాలై), ఇమామ్ మాలిక్ (రహ్మాలై)ల అభిప్రాయం కూడా ఇదే. ఈ హదీసును అబూ నయీమ్, ఇబ్నె అబీ షీబాలు వరుసగా, క్రమం తప్పకుండా ఉల్లేఖించారు. దారుల్ బరీద్ కూఫా పట్టణంలోని ఒక ఇల్లు. ఖలీఫా ప్రతినిధి

**ఇంకా ఒంటెల మూత్రాన్ని, పాలను తాగమని కూడా ఆదేశించారు. తరువాత వారు అక్కడకు వెళ్ళిపోయారు. ఆరోగ్యవంతులైన తరువాత వారు ప్రవక్త (స) గారి ఒంటెల కాపరిని హత్యచేశారు. ఒంటెలను బలవంతంగా తోలుకుపోయారు. రెండో రోజు తెల్లవారగానే ఈ వార్త మదీనా పట్టణంలో వ్యాపించింది. అప్పుడు ప్రవక్త మహనీయులు (స) వారిని వెంటాడమని తన మనుషుల్ని పంపారు. చివరకు వారిని పట్టుకుని బందీలుగా మధ్యాహ్నానికి ప్రవక్త (స) మనుషులు తీసుకువచ్చారు. ప్రవక్త (స) గారి ఆజ్ఞ ప్రకారం వారి చేతులు, వారి కాళ్లు నరకబడ్డాయి. కాల్చిన ఇనుప కడ్డీలతో వారి కళ్ళల్లో పొడిచారు.[3] మదీనా పట్టణంలోని రాళ్ళతో నిండి వున్న నేల మీద పడవెయ్యబడ్డారు. వారు త్రాగటానికి నీళ్లు అడిగేవారు కాని వారికి ఎవరూ నీళ్లు ఇచ్చేవారు కారు. అబూ ఖిలాబ ఇలా అన్నారు; (వారికి ఇంత కఠినమైన శిక్ష ఎందుకు విధించటం జరిగిందంటే) వారు దొంగతనం చేశారు, హత్య చేశారు, విశ్వసించిన తరువాత అవిశ్వాసులుగా మారిపోయారు. ఇంకా అల్లాహ్‌తోనూ, ఆయన ప్రవక్తతోనూ పోరాడారు.**

**235. హ్రజత్ అనస్ (రజిఅన్) గారు ఇలా ఉల్లేఖించారు: మస్జిద్ నిర్మాణం కాక మునుపు, ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) మేకల దొడ్లలో నమాజు చేస్తూ ఉండేవారు.[1]**

---

ఎవరైనా కూఫా గవర్నరు వద్దకు వచ్చినప్పుడు ఆ గృహంలో విడిది చేసేవారు. హ్రజత్ ఉమర్ (ర), హ్రజత్ ఉస్మాన్‌గార్ల పరిపాలనలో అబూ మూసా కూఫాకు గవర్నరుగా ఉండేవారు.

234-1. వారు మొత్తం ఎనిమిది మంది. నలుగురు ఉరయ్‌నా తెగకు చెందినవారు, ముగ్గురు ఉకల్ తెగకు చెందినవారు, ఒక మనిషి మరొక తెగకు చెందినవాడు.

234-2. ఇవి మొత్తం పదిహేను ఒంటెలు, మదీనా పట్టణానికి ఆరు మైళ్ళ దూరంలో జుల్‌జదర్ అనే ప్రాంతంలో మేత మేస్తూ ఉండేవి. ప్రవక్త (స) వారిని అక్కడకు పోయి కొంతకాలం ఉండమని ఆజ్ఞాపించారు.

234-3. ఎందుకంటే వారు కూడా ఒంటెల కాపరి కళ్ళల్లో ఇనుపకడ్డీలతో పొడిచారు. ఇదేవిధంగా నిర్దాక్షిణ్యంగా అతన్ని హత్య చేశారు. ఉపకారానికి బదులుగా ఒంటెల్ని దోచుకుపోయారు. ఏ కంచంలోనైతే అన్నం తిన్నారో, ఆ కంచానికే చిల్లు పెట్టారు. అటువంటి దుర్మార్గులకు కఠినశిక్ష విధించటమే వివేకవంతమైన పని, తగినశాస్తి, దైవదాసుల మీద ఇది కరుణ చూపటం కూడా అవుతుంది.

## 69వ అధ్యాయం

**అశుద్ధ పదార్థం ఏదైనా నేతిలోగాని లేదా నీళ్ళలోగాని పడిపోతే, అప్పుడు దానికి సంబంధించిన ఆజ్ఞ ఏమిటి? జుహ్‌రీ గారు ఇలా అన్నారు: రంగు, రుచి, వాసన మారనంత వరకు నీరు పరిశుభ్రంగానే ఉంటుంది.[1] హమ్మాద్ బిన్ అబీ సులైమాన్ గారు ఇలా అన్నారు: మృత పక్షుల రెక్కలూ, వెంట్రుకలూ పరిశుభ్రమైనవే.[2] జుహ్‌రీ గారు ఇలా అన్నారు: మృత జంతువుల ఎముకలను గురించి అంటే ఏనుగు (దంతాలు) మొదలయినవి, "నేను ఇది వరకు చాలా మంది పండితులు వాటిని దువ్వెనలుగా ఉపయోగించి తల దువ్వుకోవటాన్నీ, ఇంకా వాటిలో నూనెపోసి భద్రంగా ఉంచటాన్ని చూశాను."[3] వారు వాటిని పరిశుభ్రమైనవిగా భావించేవారు. ముహమ్మద్ బిన్ సీరీన్[4] గారు మరియు ఇబ్రాహీమ్ నఖయీ గారు ఏనుగు దంతాల వ్యాపారం చెయ్యటం సరియైనదే అని చెప్పారు.**

**236. విశ్వాసుల తల్లి అయిన హజ్రత్ మైమూనా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్)ను, ఎలుక నేతిలో పడితే ఏమి చెయ్యాలి? అని అడిగారు. దానికి సమాధానంగా ఆయన (స) ఇలా సెలవిచ్చారు:**

---

235–1. మేకలు కంచెలలో, మేకల దొడ్లల్లో మలమూత్ర విసర్జన చేస్తూ ఉంటాయి అనే విషయం అందరికీ విదితమే. కనుక తెలిసిన విషయం ఏమిటంటే, వాటి మల మూత్రాలు రెండూ పరిశుభ్రమైనవే. అధ్యాయం ఉద్దేశ్యం కూడా ఇదే. కాని 'ముఖాలిఫీన్' ఏమంటారంటే, బహుశా ఆ ప్రదేశాలలో నేల మీద ఏదైనా పరచి నమాజు చేసేవారేమో. ఇది సరయిన విషయం కాదు. ఎందుకంటే ఆ కాలంలో నేల మీద ఏదైనా పరచి నమాజు చేసే సంప్రదాయం లేదు.

69–1. తక్కువ నీరైనా సరే, ఎక్కువ నీరైనా సరే. అహ్లె హదీస్ వారు, ఇమామ్ మాలిక్ (రహ్మలై) గారు ఈ అభిప్రాయాన్నే సమర్థించారు. ఎవరైతే 'ఖలతైన్' (రెండు వస్తువులు కలిసిపోవటం) లేక పెద్ద పాత్ర లాంటి షరతులను విధించారో, వారు ఉటంకించిన ఆధారాలు అంత బలమైనవి కావు. తెలిసిన విషయం ఏమిటంటే ఇమామ్ బుఖారీ (రహ్మలై) గారు కూడా ఈ విషయంలో ఇమామ్ మాలిక్ (రహ్మలై) గారితో ఏకీభవించారు. ఈ అధ్యాయంలో "నీరు పరిశుభ్రమైనది. దానిని ఏదీ మలినపరచదు' అనే ప్రామాణిక హదీసు ఉంది.

69–2. అది హలాల్ పశువైనా సరే లేదా హరామ్ పశువైనా సరే. కనుక దాని వెంట్రుకలు నీటిలో పడిపోతే ఆ నీరు అశుద్ధం కాదు. జుహ్‌రీ గారి హదీసును ఇబ్నె వహబ్‌గారు

**ఎలుకను బయటికి తీసిపారెయ్యండి. ఇంకా దాని చుట్టూ ఉన్న నెయ్యిని కూడా తీసి పారెయ్యండి. మిగతా నెయ్యిని మీరు తినండి.**[1]

**237. విశ్వాసుల తల్లి అయిన హ(జ్రత్ మైమూనా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖిం చారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్)ను, నేతిలో గనక ఎలుక పడిపోతే, ఏమి చెయ్యాలి? అని అడగటం జరిగింది. దానికి జవాబుగా ఆయన (స) ఇలా సెలవిచ్చారు. "ఎలుకను బయటికి తీయండి. ఇంకా దాని చుట్టూ ఉన్నటువంటి నెయ్యిని కూడా తీయండి. ఆ రెంటిని పారెయ్యండి." 'మఆన్' ఇలా అన్నారు: మాలిక్ (రెహ్మాలై) ఈ హదీసును మాకు ఎన్నోసార్లు వినిపించారు. ఆయన ఇలా అనేవారు: మేము ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) నుంచి ఆయన హ(జ్రత్ మైమూన (రజిఅన్హా) నుంచి.**[1]

**238. ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు: అల్లాహ్ మార్గంలో ఒక ముస్లిమ్‌కు దెబ్బ తగిలినందువల్ల అయ్యే గాయం, ప్రళయదినం నాడు కూడా అదే విధంగా తాజాగా దెబ్బ తగిలినప్పుడు ఉన్న విధంగానే ఉంటుంది. ఆ గాయంలో నుంచి రక్తం కారుతూ ఉంటుంది; దాని రంగు రక్తం రంగు మాదిరిగానే ఉంటుంది. కాని వాసన మటుకు 'ముష్క్' అంటే కస్తూరి పరిమళం మాదిరిగా ఉంటుంది.**[1]

---

'జామిఅ'లోనూ హమాద్‌గారి హదీసును అబ్దుర్రజాఖ్‌గారు 'ముసన్నఫ'లోనూ ఉల్లేఖించారు.

69–3. ఈ హదీసును ఎవరు ఉల్లేఖించారో తెలియదు.

69–4. ఇబ్నె సీరీన్ హదీసును అబ్దుర్రజాఖ్ ఉల్లేఖించారు. కాని ఇబ్రాహీమ్ నఖయీ హదీసును ఉల్లేఖించిన వారెవరో తెలియదు. 'సర్ఖసీ' గారి ఉల్లేఖనంలో ఇబ్రాహీమ్ చెప్పిన విషయం గురించి ప్రస్తావించబడలేదు.

236–1. నెయ్యి గట్టిగా ఉన్నా లేదా పలుచగా ఉన్నా ఇమామ్ ఇబ్నె తైమియగారు ఇటు వంటి తీర్పునే ఇచ్చారు. కాని మిగతా విద్వాంసులు ఏమన్నారంటే, నెయ్యి గనక పలుచగా ఉంటే ఆ స్థితిలో అందులో ఎలుక పడినట్లయితే అప్పుడు నెయ్యి అంతా అశుద్ధమైపోతుంది. ఇక దానిని అమ్మటం, కాల్చటం సరైనది అవునో కాదో అనే విషయం గురించి అభిప్రాయబేధం ఉంది.

237–1. ఈ రెండవ ధ్రువీకరణను ఇమామ్ బుఖారి (రహ్మాలై) ఎందుకు ప్రస్తావించారంటే, ఇబ్నె అబ్బాస్ (రజిఅన్హు) తరువాత మైమూన (రజిఅన్హా) ప్రస్తావన నిజమైనది, సరైనది. కొంతమంది మాత్రం మైమూన (రజిఅన్హా) గారిని ప్రస్తావించలేదు.

## 70వ అధ్యాయం
## ప్రవహించని నీటిలో మూత్రం పొయ్యటం.

**239.** ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అబూ హురైరహ్ (రజిఅన్) ఉల్లేఖించారు: "మనం ప్రపంచంలో అందరికంటే వెనుక వచ్చినవారము.[1] కాని పరలోకంలో అందరికంటే ముందు ఉంటాము." ఈ ఉల్లేఖకుడే ప్రవక్త మహనీయులు(స) ఇంకా ఇలా సెలవిచ్చారని కూడా చెప్పాడు; "మీలో ఎవరూ ఆగి ఉన్న నీటిలో, ప్రవహించని నీటిలో మూత్రం పొయ్యకూడదు. తరువాత అందులో స్నానం చెయ్యవచ్చు."[2]

## 71వ అధ్యాయం

**నమాజు చేస్తూ ఉన్నటువంటి మనిషి వీపు మీద ఏదైనా అశుద్ధ వస్తువునుగాని లేదా ఏదైనా మృత జంతువును గాని వేసినట్లయితే, అప్పుడు అతని నమాజు చెడి పోదు.[1] అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) నమాజులో ఉన్నప్పుడు తన దుస్తుల మీద రక్తపు మరకల్ని చూశారు. వెంటనే ఆయన ఆ దుస్తుల్ని మార్చుకున్నారు. మళ్ళీ నమాజు చేస్తూపోయారు. అంటే నమాజులో నిమగ్నమైపోయారు. సయీద్**

---

238-1. ఈ హదీసుకు అధ్యాయంతో ఉన్నటువంటి సంబంధాన్ని గురించి చెప్పే విషయంలో చాలా మంది పండితులు శ్రమపడాల్సి వచ్చింది. వారు విభిన్నమైన వ్యాఖ్యానాలు ఎన్నో చేశారు. వాటిలో ఉత్తమంగా ఉన్న వివరణ ఇది: 'ముష్క్' అంటే (కస్తూరి) కూడా ఒక రక్తమే కాని ఎప్పుడయితే అందులో నుంచి పరిమళం ఉద్భవించిందో అప్పుడు దానికి రక్తానికున్న ఆజ్ఞలు, నిబంధనలు వర్తించవు. ఇంకా అది పవిత్రమైనదిగా, పరిశుభ్రమైనదిగా పరిగణించబడుతుంది. అదేవిధంగా నీటికి ఉన్నటువంటి గుణం ఏదైనా మారిపోయినట్లయితే అప్పుడు అది తన అసలు స్థితిని, ప్రకృతి సిద్ధమైన స్థితిని అంటే పరిశుద్ధతను కోల్పోతుంది. ఇంకా ఆ నీరు అపవిత్రమై పోతుంది, అశుద్ధమైపోతుంది.

239-1. అంటే అన్ని సంఘాలకంటే చివర్లో వచ్చాము. ఈ విషయానికి అధ్యాయంతో ఎటువంటి సంబంధమూ లేదు. కాని ఇమామ్ బుఖారీ (రహ్మలై) ఈ ఉల్లేఖనాన్ని తరువాత వచ్చిన ఉల్లేఖనాన్ని రెంటినీ ఒకే ఉల్లేఖనకర్త ద్వారా విన్నారు. కావున ఆ రెండింటినీ కలిపి ఇక్కడ చేర్చటం జరిగింది.

239-2. దీని అర్థం ఆ నీరు అశుద్ధమైపోతుంది అని ఎంతమాత్రం కాదు. ఎందుకంటే పైన హజ్రత్ జుహ్రి గారి సూక్తి ఒకటి ఉటంకించబడింది. అందులో ఆయన, నీరు

**బిన్ ముసయ్యిబ్, ఆమిర్ షాబీ ఇలా అన్నారు: ఏ వ్యక్తి అయినా నమాజు పూర్తి చేసిన తరువాత ఒకవేళ అతను ధరించిన వస్త్రాలకు రక్తం తగిలి ఉన్నా లేదా వీర్యం తగిలి ఉన్నా లేదా ఖిబ్లా వైపునకు కాక మరొక దిక్కున తిరిగి నమాజు చేసి ఉన్నా లేదా 'తయమ్ముమ్' చేసుకుని నమాజు చేసిన తరువాత ఆ నమాజు వ్యవధి అయిపోక ముందే ఒకవేళ నీరు లభ్యమయినా అప్పుడు కూడా చేసిన నమాజును మళ్ళీ చేసే అవసరం ఎంతమాత్రం లేదు.**

**240.** అబ్దుల్లా బిన్ మసూద్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఒకసారి ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) కాబా గృహం వద్ద నమాజు చేస్తూ సజ్దాలో ఉన్నారు. (క్రింది హదీసు (241)లోని విషయాలే ఈ హదీసులో కూడా వచ్చాయి)

**241.** అబ్దుల్లా బిన్ మసూద్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఒకసారి పవిత్ర కాబా గృహం వద్ద నమాజు చేస్తున్నారు. అబూ జహల్, అతని సహచరులు[1] కొందరు అక్కడ కూర్చొని ఉన్నారు. వారు పరస్పరం ఇలా చెప్పుకోసాగారు: ఫలానా వారి వద్దకు పోయి, కోయబడిన ఒంటె పొట్టను (కసువు, ప్రేగులతో సహా) తీసుకువచ్చి దాన్ని ముహమ్మద్ (స) సజ్దాలో ఉన్నప్పుడు ఆయన (స) వీపు మీద ఎవరు వెయ్యగలరు? ఇది విని

---

తనలోని ఏదైనా ఒక గుణం మారిపోనంత వరకు అశుద్ధం కానే కాదు అని స్పష్టంగా చెప్పారు. ప్రవహించని నీటిలో మూత్రం పొయ్యకూడదు అనే నిషేధం వెనుక ఉన్నటు వంటి ఉద్దేశ్యం మర్యాదగా, నాగరికంగా ప్రవర్తించమని, పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకోమని చెప్పటానికే. ఎందుకంటే ఆగివున్న నీళ్ళల్లో మూత్రం పొయ్యటం వల్ల, తరువాత ఆ నీళ్ళల్లోనే స్నానం చెయ్యటం వల్ల మనిషికి రోత పుడుతుంది. ఇంకా అతనిలో తీవ్రమైన అసహ్యతా భావం చెలరేగుతుంది. ఆగి ఉన్న నీటిలో మూత్రం పోసే అనుమతిని గనక ఇచ్చినట్లయితే ప్రజలు అందులో ఎంత ఎక్కువగా మూత్రం పోస్తారంటే చివరకు ఆ నీటి గుణం పూర్తిగా మారిపోతుంది. ఇంకా ఆ నీరు అశుద్ధమైపోతుంది.

71-1. ఇమామ్ బుఖారీ (రహ్మాలై) వారి అభిప్రాయం కూడా ఇదే. అంటే మనిషి నమాజులో ఉన్నప్పుడు అతనికి ఏదైనా అశుద్ధత తగిలినట్లయితే దాని కారణంగా నమాజుకు భంగం కలగదు. అయితే నమాజును ప్రారంభించటానికి ముందు పరిశుభ్రంగా ఉండటం చాలా అవసరం.

241-1. వారెవరో స్వయంగా ఈ హదీసులోనే ముందు ప్రస్తావించటం జరిగింది.

**వారిలోని అత్యంత దౌర్భాగ్యుడైన వాడొకడు (ఉఖబా బిన్ అబీ ముయీత్) లేచాడు. వెళ్ళి దానిని తీసుకొచ్చాడు. దైవప్రవక్త (స) సజ్దాలోకి వెళ్ళినప్పుడు, అతడు దాన్ని ఆయన (స) గారి రెండు భుజాల మధ్య వీపు మీద వేశాడు.[2] అబ్దుల్లా బిన్ మసూద్ (రజిఅన్) ఇలా అన్నారు: "నేను ఆ దృశ్యాన్ని చూశాను. కాని ఏమీ చెయ్యలేక పోయాను. అయ్యో! నాకే గనక శక్తి ఉన్నట్లయితే, దాన్ని ప్రదర్శించి ఉండేవాణ్ణి[3]." ఆ దుర్మార్గులు నవ్వుతున్నారు, (ఆనందంతో పొంగిపోతున్నారు) ఒకరి మీద ఒకరు పడిపోతున్నారు. ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (స) సజ్దాలోనే నిమగ్నులై ఉన్నారు. తమ శిరస్సును ఎత్తలేదు. చివరకు హజ్రత్ ఫాతిమా (రజిఅన్హా) వచ్చి[4], ఆయన (స)గారి, వీపు మీద ఉన్నదాన్ని తీసి దూరంగా పారేశారు. అప్పుడు ప్రవక్త (స) తమ శిరస్సును పైకి ఎత్తారు. మరియు ఇలా ప్రార్థించారు: "ఓ అల్లాహ్! ఖురైషు ప్రజల సంగతి చూసుకో". ఇలా మూడుసార్లు ప్రార్థించారు. దైవప్రవక్త (స) వారిని శపిస్తూ ప్రార్థించినప్పుడు, వారు తీవ్రమైన మనస్తాపానికి గురిఅయ్యారు. అబ్దుల్లా బిన్ మసూద్ (ర) ఇలా అన్నారు : "ఈ నగరంలో చేసిన ప్రార్థనకు దైవస్వీకారం లభిస్తుందని వారు నమ్మేవారు. (అంటే దాని ప్రభావం తమ మీద పడుతుందేమో అని)". తరువాత ప్రవక్త(స) పేరు పెట్టి ఇలా శపించారు: "ఓ అల్లాహ్! అబూజహల్‌ను శిక్షించు, ఉతబా బిన్ రబీఆను, షీబా బిన్ రబీఆను, వలీద్ బిన్**

---

241-2. ఇక్కడ నుంచే అధ్యాయం ఉద్దేశ్యం బయల్పడుతుంది. అదేమిటంటే నమాజు చేస్తూ ఉన్నప్పుడు ప్రవక్త మహనీయుల (స) శరీరానికి అశుద్ధత తగిలింది. కాని ఆయన (స) గారు నమాజును భంగపరచలేదు.

241-3. అబ్దుల్లా బిన్ మసూద్ (రజిఅన్) హుజల్ తెగకు చెందినవారు. ఆ తెగకు చెందిన వారెవరూ ఇంకా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించలేదు, అప్పటికి అవిశ్వాసులుగానే ఉన్నారు. మక్కా నగరంలో ఆయనకు స్నేహితులుగాని, సహాయకులుగాని ఎవరూ లేరు. అందుకని ఆయన ఆ సంకట పరిస్థితిలో ఏమీ చేయలేకపోయారు.

241-4. ఎవరో పోయి హజ్రత్ ఫాతిమా (రజిఅన్హ)కు ఈ విషయాన్ని తెలియజేశారు. అప్పుడు ఆమె(ర)గారు పరుగెత్తుకుంటూ వచ్చారు. ప్రవక్త మహనీయుని (స) వీపు మీద ఉన్నటువంటి అశుద్ధ వస్తువును పూర్తిగా తీసేసి దూరంగా పారేశారు. అవిశ్వాసులకు శాపనార్థాలు పెట్టసాగారు. పొట్ట హలాల్ (ధర్మసమ్మతమైన) జంతువుదే. ఇందులో సందేహం లేదు. అయితే ఆ జంతువును ఒక బహుదైవారాధకుడు కోశాడు. అదీగాక అందులో రక్తం కూడా కలిసి ఉంది. ఈ కారణంవల్ల అది అశుద్ధమైపోయింది.

ఉతబాను, ఉమయ్యా బిన్ ఖలఫ్‌ను, ఉఖ్బా బిన్ అబీ ముఅయ్‌త్‌ను శిక్షించు." అమ్ర్ బిన్ మైమూన్ ఏడుగురు వ్యక్తుల పేర్లు కూడా చెప్పారు. (అమ్మార బిన్ వలీద్ పేరు) మాకు జ్ఞాపకం లేదు. ఇబ్నె మసూద్ (రజిఅన్) ఇలా అన్నారు: ఎవని చేతుల్లోనైతే నా ప్రాణం ఉందో అతని మీద ప్రమాణం చేసి చెబుతున్నాను. ప్రవక్త మహనీయులు (స) శపించినవారి[5] మృత దేహాలు బద్ర్ సంగ్రామ సందర్భంగా ఒక బావిలో పడి ఉండటాన్ని నేను కళ్ళారా చూశాను.

## 72వ అధ్యాయం

### ఉమ్మి మరియు చీమిడి మొదలైనవి కట్టుబట్టలకు తగిలే విషయం గురించి.

ఉర్వా ఇబ్నె జుబైర్ (ర) గారు, మిస్వర్ బిన్ మఖ్రమ (ర), మర్వాన్ బిన్ హకమ్‌ల ద్వారా తెలుసుకుని ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఉమ్మి వేసినప్పుడు ప్రజల్లో నుంచి ఒక వ్యక్తి ఆ ఉమ్మిని తన చేతిలోకి అందుకున్నాడు. తరువాత దానిని తన ముఖానికి, తన శరీరానికి రాసుకున్నాడు.[1]

**242.** హజ్రత్ అనస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) నమాజులో ఉన్నప్పుడు ఒకసారి తాము కట్టుకున్న వస్త్రం మీద ఉమ్మి వేశారు.

## 73వ అధ్యాయం

'నబీజ్'[1]తోనూ, మత్తు కలిగించే మద్యంతోనూ వుజూ చేసుకోవటం శాస్త్ర సమ్మతమైన విషయం కాదు. హసన్ మరియు అబుల్ ఆలియ గార్లు 'నబీజ్'తో వుజూ చేసుకోవడాన్ని చెడ్డ విషయంగా, అయిష్టమైనదిగా భావించారు. 'అతా' గారు ఏమన్నా

---

241–5. అంటే వారిలోని చాలా మంది చంపబడిన తరువాత బదర్‌లోని బావిలో వెయ్యబడ్డారు. ఎందుకంటే, శాపగ్రస్తుడైన ఉఖబా బిన్ అబీ ముఅయ్‌త్ బదర్‌కు కొంచెం దూరంలో చంపబడ్డాడు. అమ్మార బిన్ వలీద్ హబష్ దేశంలో చంపబడ్డాడు. మిగతా వారందరూ బదర్ యుద్ధం రోజున చంపబడ్డారు. వారి శవా లను ఒక చీకటి బావిలో విసరివేయటం జరిగింది. దుర్మార్గులు ఇహపరలోకాలు రెండింటిలోనూ నష్టపోయారు.

72–1. అంటే ప్రవక్త (స) గారి ఉమ్మిని శుభప్రదమైనదనే నమ్మకంతో దానిని ముఖం మీద, శరీరం మీద రాసుకున్నాడు. ఈ హదీసు ద్వారా తేటతెల్లమయ్యే ఒక విషయం ఏమిటంటే, మనిషి ఉమ్మి పరిశుభ్రమైనదే; కాని నోటిలో అశుద్ధత అనేది ఏదీ ఉండకూడదు. ఈ అధ్యాయం యొక్క ఉద్దేశ్యం కూడా ఇదే. ఈ హదీసును స్వయంగా ఇమామ్ బుఖారీ (రహ్మలై) గారే "కితాబుష్షురూత్"లో ఉల్లేఖించారు.

**రంటే; పాలతోనూ, నబీజ్‌తోనూ వుజూ చేసుకోవడం కంటే నా దృష్టిలో తయమ్ముమ్ చేసుకోవటం ఉత్తమమైనది.**

**243.** ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని **హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హ) ఉల్లేఖించారు: మత్తు కలిగించే పానీయం ఏదైనాసరే నిషిద్ధమైనదే[1].**

## 74వ అధ్యాయం

**ఎవరైనా ఒక స్త్రీ తన తండ్రి నోటి నుంచి కారే రక్తాన్ని కడగటం అనే విషయం గురించి[1] అబుల్ ఆలియ ఇలా అన్నారు; (అప్పుడు ఆయనగారి ఒక కాలికి ఒక వ్యాధి పట్టుకుంది) "నా కాలి మీద మసా చెయ్యండి, దానికి ఒక వ్యాధి తగిలింది."**

**244. అబూహాజిమ్ ఇలా ఉల్లేఖించారు: సహ్లె బిన్ సాద్ అస్సాయిదీ (ర) గారిని ప్రజలు ఇలా అడిగారు; ఆ సమయంలో నాకూ, వారికీ మధ్య ఎవరూ లేరు[1]. "ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారికి ఉహుద్ సంగ్రామంలో తగిలిన గాయానికి ఏ మందు రాశారు" అప్పుడు దానికి సమాధానంగా సహ్లె బిన్ సాద్ (ర)**

---

73-1. ఖర్జూరపు పండ్ల పానకాన్ని 'నబీజ్' అంటారు. అది తియ్యగానూ, మధురంగానూ ఉంటుంది. ఇంకా అందులోకి మత్తు ప్రవేశించలేదు. అంటే అది ఇంకే మత్తును కలిగించే స్థాయికి చేరుకోలేదన్న మాట. ఇమామ్ అబూ హనీఫా (రెహ్మాలై) గారు, నీళ్ళు దొరకని పక్షంలో దీనితో వుజూ చేసుకోవడం ధర్మసమ్మతమే అని తీర్పు చెప్పారు. కాని షాఫయీ మస్లక్ వారు, అహ్మద్ మస్లక్ వారు, అహ్లె హదీస్ మస్లక్ వారు దీనిని ధర్మసమ్మత మైనదిగా భావించరు. ఇమామ్ బుఖారీ (రెహ్మాలై) గారి అభిప్రాయం కూడా ఇదే. దీనికి సంబంధించిన హదీసును ఇబ్నె అబీ షైబాగారు, అబుల్ ఆలియాకు సంబంధించిన హదీసును దారెఖుతనీ గారు, అతాకు సంబంధించిన హదీసును అబూ దావూద్‌గారు ఉల్లేఖించారు.

243-1. అది ధర్మనిషిద్ధమైనప్పుడు, దానితో వుజూ చేసుకోవడం ధర్మసమ్మతమైనది ఎంత మాత్రం కాబోదు. ఎందుకంటే, వుజూ చేసుకోవడం అనేది ఒక ఆరాధన. ఆరాధన కోసం ఒక నిషిద్ధ వస్తువును ఉపయోగించటం ధర్మసమ్మతం ఎలా కాగలుగుతుంది.

74-1. దీని ఉద్దేశ్యం ఏమిటంటే, అశుద్ధతను దూరం చేసే విషయంలో ఇతరుల సహాయాన్ని పొందటం దోషం కాదు, సరియైన విషయమే. అబుల్ ఆలియగారి హదీసు ద్వారా స్పష్టమైన విషయం ఏమిటంటే, వుజూ చేసుకునేటప్పుడు ఇతరుల సహాయాన్ని పొందటం అనేది సక్రమమైనదే. దీన్ని అబ్దుర్రజాఖ్ ఉల్లేఖించారు.

**ఇలా అన్నారు; "దాన్ని గురించి తెలిసినవారు ఇప్పుడు ఎవరూ మిగిలి లేరు[2]". హజ్రత్ అలీ(రజిఅన్) తన ఢాలును నీళ్ళతో నింపి తీసుకువచ్చేవారు. హజ్రత్ ఫాతిమ (ర) ప్రవక్త (స) గారి నోటి నుంచి కారే రక్తాన్ని కడిగేవారు. (అయినా రక్తం కారటం ఆగిపోయేది కాదు, చివరకు ఒక చాపను (బోరియ) కాల్చి దాని బూడిదను ఆ గాయంలో పోసి దాన్ని పూడ్చారు.[3]"**

## 75వ అధ్యాయం

**మిస్వాక్ (పళ్ళు తోముకోవటానికి ఉపయోగించే టూత్‌బ్రష్ లాంటి ఒక పుల్ల)తో పళ్ళు తోముకోవటం అనే విషయం గురించి ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా అన్నారు; నేను ఒకసారి ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్)తో ఒకరాత్రి గడిపాను. ఆయన (స) గారు మిస్వాక్‌తో తమ పళ్ళను తోముకున్నారు.[1]**

**245.** నా తండ్రి గారైన అబూ మూసా అష్‌అరీ (రజి) ఇలా వివరించారని అబూ బుర్దా ఉల్లేఖించారు: "నేను ఒకసారి ప్రవక్త(స) మహనీయుని వద్దకు వెళ్ళాను. అప్పుడు ప్రవక్త(స) గారి చేతిలో మిస్వాక్‌ను చూశాను. ఆయన (స) దానితో పళ్ళు తోముకుంటున్నారు. 'ఉ', 'ఉ' అనే శబ్దాలు ఆయన గారి నోటి నుంచి వెలువడటాన్ని నేను విన్నాను. అప్పుడు ఆయన(స)గారి నోటిలో మిస్వాక్ ఉంది. అంటే ఆయన(స) డోకుకుంటున్నట్లనిపించింది."[1]

**246.** హజ్రత్ హుజైఫా(రజిఅన్)కథనం: ప్రవక్త మహనీయులు ముహమ్మద్(స) రాత్రి సమయంలో నిద్ర నుంచి మేల్కొనప్పుడు మిస్వాక్‌తో తమ పళ్ళను తోముకునేవారు.[1]

---

244–1. అంటే నేను వారు చెప్పింది స్పష్టంగా, చక్కగా విన్నాను.

244–2. ఎందుకంటే సహ్ల్ బిన్ సాద్ (రజిఅన్) సహాబాలు (ప్రవక్త మహనీయుని ప్రత్యక్ష అనుచరులు) అందరి తరూత చివర్లో మదీనా పట్టణంలో మరణించారు.

244–3. తెలిసిన విషయం ఏమిటంటే చాప యొక్క బూడిద గాయానికి రాస్తే రక్తం కారటం ఆగిపోతుంది. ఈ హదీసు ద్వారా మందు వాడటం, వైద్యం చేయించటం అనే విషయాలకు అనుమతి ఉన్నదని నిరూపితమయింది. ఇంకా మందు వాడటం అనేది అల్లాహ్ పట్ల నమ్మకం కలిగి ఉంటం (తవక్కుల్) అనే విషయానికి ఎంత మాత్రం వ్యతిరేకం కాదని కూడా తెలిసింది.

75–1. ఇది ఒక సుదీర్ఘమైన హదీసులోని భాగం. ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారు దానిని ఇక్కడ సందర్భాన్ని బట్టి అవసరం నిమిత్తం ఉదహరించారు.

## 76వ అద్యాయం

## వయస్సులో పెద్దలైన వారికి మిస్వాక్‌ను మొదట ఇవ్వాలి అనే విషయం గురించి[1]

**ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజిఅన్) ఉల్లేఖించారు: "కలలో నేనేమి చూశానంటే; మిస్వాక్‌తో నేను పళ్లు తోముకుంటున్నాను. ఇంతలో ఇద్దరు వ్యక్తులు నా వద్దకు వచ్చారు. వారిలో ఒకరు, మరొకరి కంటే వయస్సులో పెద్దవారు. నేను మొదట వయస్సులో చిన్న వాడైన వ్యక్తికి మిస్వాక్‌ను ఇచ్చాను. అప్పుడు వయస్సులో పెద్దవాడైన వ్యక్తికి మొదట మిస్వాక్‌ను ఇవ్వు అని నాకు చెప్పటం జరిగింది. తరువాత నేను పెద్దవానికి మిస్వాక్‌ను ఇచ్చాను"[1].**

## 77వ అధ్యాయం

## వుజూ చేసుకుని నిద్రపోయే దాని శ్రేష్ఠతను గురించి

**247. బరా బిన్ ఆజిబ్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ప్రవక్త మహనీయులు**

---

245–1. ఈ విధంగా నోరు కడుక్కోవటం వల్ల, మిస్వాక్‌తో పళ్ళు తోముకోవటం వల్ల జీర్ణాశయంలో నుంచి అదనపు ద్రవ పదార్థాలు ఇంకా కళ్ళె మొదలైనటువంటి వ్యర్థ పదార్థాలు బయటికొచ్చేస్తాయి. అప్పుడు నోటి నుంచి దుర్వాసన రాదు. పళ్ళ చిగుళ్ళకు కూడా మిస్వాక్ మేలు చేస్తుంది.

246–1. నిద్ర నుంచి లేచిన తరువాత మిస్వాక్‌తో పళ్ళు తోముకోవటం అభిలషణీయమైన విషయం అని తెలిసింది. ఇదేవిధంగా ఖుర్‌ఆన్ గ్రంథాన్ని పారాయణం చేసేటప్పుడు, వుజూ చేసుకునేటప్పుడు, నమాజ్ చేసేటప్పుడు, ఇంకా నోటి నుంచి దుర్వాసన వస్తున్నప్పుడు మిస్వాక్‌తో పళ్ళు తోముకోవటం మంచిది అయితే ఉపవాసంతో ఉన్నవారు పొద్దువాలిన తరువాత మిస్వాక్ చేసుకోవటం కొందరు విద్వాంసుల దృష్టిలో అభిలషణీయమైనది కాదు.

76–1. తెలిసిన విషయం ఏమిటంటే మిస్వాక్ ఇచ్చే విషయంలో వయస్సులో పెద్దవారైన వారికి ప్రాధాన్యం ఇవ్వాలి. వారికి ఎక్కువ గౌరవం ఇవ్వాలి. ఇదే విధంగా తినే త్రాగే విషయంలోనూ, నడిచేటప్పుడూ, మాట్లాడేటప్పుడూ వారికి ప్రాముఖ్యం ఇవ్వాలి. క్రమబద్ధంగా కూర్చోనప్పుడు పెద్దలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఒకవేళ వరుసగా కూర్చుంటే, అప్పుడు కుడివైపు కూర్చున్న వారికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ హదీసు ద్వారా తెలిసే మరొక విషయం ఏమిటంటే, ఇతరుల మిస్వాక్‌ను ఉపయోగించటం అవాంఛనీయమైన విషయమేమీ కాదు. అయితే దాన్ని కడిగి పరిశుభ్రం చేసి మరీ ఉపయోగించాలి. ఇది అభిలషణీయమైనది.

**ముహమ్మద్(స) నాతో ఇలా సెలవిచ్చారు; "నీవు నిద్రపోవటానికి నీ పండుకునే స్థలం వద్దకు వెళ్ళినప్పుడు, నమాజు కోసం చేసుకునేటటువంటి వుజూనే చేసుకో. తరువాత కుడిపక్కకు తిరిగి[1] ఇలా ప్రార్థించు : 'ఓ అల్లాహ్! నీవు ప్రసాదించే పుణ్యాన్ని పొందే ఉత్సాహంతో, ఆశతో, నీవు విధించే శిక్షకు భయపడి, నన్ను నేను పూర్తిగా నీకు సమర్పించుకుంటున్నాను. ఇంకా నా సమస్త వ్యవహారాలను నీకే అప్పగిస్తున్నాను. ఇంకా నేను నా వీపును నీకు ఆనిస్తున్నాను. (అంటే నిన్నే నమ్ముకుంటున్నాను). నీ నుంచి పారిపోతే, ఎక్కడా శరణు గాని, ముక్తి స్థానం గాని లభించవు; అవి నీ వద్దనే లభిస్తాయి. ఓ అల్లాహ్! నీవు అవతరింపజేసిన ఖుర్ఆన్ గ్రంథాన్ని నేను విశ్వసించాను. నీవు పంపిన ప్రవక్తను కూడా నేను విశ్వసించాను). ఇప్పుడు నీవు గనక అదే రాత్రి మరణించినట్లయితే, అప్పుడు నీవు ఇస్లాం ధర్మం మీద ఉంటావు. ఈ ప్రార్థనను నిద్రపోయే ముందు నీవు చివరి మాటలుగా, చేయాలి".[2] హజ్రత్ బరా బిన్ ఆజిబ్(ర) ఇంకా ఇలా అన్నారు; నేను ఈ విధులను ప్రవక్త మహనీయుల(స) ముందు జ్ఞాపకం ఉంచుకునే ఉద్దేశ్యంతో చదివాను. నేను, 'ఆమన్తు బికితాబికల్లజీ-అన్‌జల్‌త' వరకు చదివి దాని తరువాత 'వ రసూలిక' అని చదివాను. కాని ప్రవక్త మహనీయులు(స) అలా కాదు. 'వనబియ్యి కల్లజీ అర్‌సల్‌త'[3] అని చదువు అని సెలవిచ్చారు.**

---

247-1. కుడివైపునకు తిరిగి పండుకోవడం వల్ల అజాగ్రత్త, అశ్రద్ధ అనేవి దరికిరావు. రాత్రి సమయంలో చేసే తహజ్జుద్ నమాజు కోసం కళ్ళు వాటంతటవే తెరుచు కుంటాయి.

247-2. ఇక దాని తరువాత నిదురపో. ప్రపంచానికి సంబంధించిన ఏ విషయాన్ని గురించీ మాట్లాడకు. అయితే ఇతర దుఆలు కాని, ఖుర్ఆన్ వాక్యాలను గాని చదివితే అది దోషం కాదు.

247-3. తెలిసిన విషయం ఏమిటంటే, ప్రవక్త మహనీయులు(స) చేసినట్లు నిరూపితమైన ప్రార్థనలు, సంస్మరణలలోని ప్రవక్త(స) గారి మాటలను మార్చటం గాని లేదా తమ తరఫు నుంచి ఏవైనా మాటలను చేర్చటం గాని మంచిది కాదు. ఇమామ్ బుఖారీ (రహ్మ) గారు, ఈ హదీసును వుజూ ప్రకరణం చివర్లో పెట్టటంలో ఒక సూచన ఉంది, అదేమిటంటే, ఈ వుజూను మనిషి నిద్రపోక ముందు, మేల్కొని ఉన్నప్పుడు, చివర్లో చేసుకుంటాడు. ఇదే విధంగా ఈ హదీసు వుజూ ప్రకరణాన్ని పరిసమాప్తం చేస్తుంది.

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

# గుసుల్ ప్రకరణం

అల్లాహ్ (అల్ మాయిదా సూరాలో) ఇలా సెలవిచ్చాడు : మీరు గనక అస్వస్థులైతే లేక ప్రయాణస్థితిలో ఉంటే లేక మీలో ఎవరైనా కాలకృత్యాలు తీర్చుకుని వస్తే లేక స్త్రీలను ముట్టుకుంటే, అప్పుడు నీరు లభించని పక్షంలో పరిశుభ్రమైన మట్టితో విధిని నిర్వహించండి; దానిపై చేతులతో కొట్టి మీ ముఖాలపై చేతులపై రాయండి. మీకు జీవితాన్ని కష్టతరం చేయటం అల్లాహ్ అభిమతం కాదు. కాని ఆయన మిమ్మల్ని పరిశుద్ధం చేయగోరుతున్నాడు, మీపై తన అనుగ్రహాన్ని పూర్తి చేయగోరుతున్నాడు, మీరు కృతజ్ఞులవుతారేమో అని. (5: 6)

ఖుర్‌ఆను గ్రంథంలో కరుణామయుడైన అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "విశ్వసించిన ఓ ప్రజలారా! మీరు నిషా స్థితిలో ఉన్నప్పుడు నమాజు దరిదాపులకు కూడా వెళ్లకండి. మీరు చదివేదేమిటో మీకు తెలిసినప్పుడే నమాజు చెయ్యండి. ఇదే విధంగా అపరిశుద్ధావస్థలో కూడా, స్నానం చెయ్యనంతవరకు నమాజు దగ్గరకు పోబాకండి. మార్గంలో ప్రయాణం చేస్తూ ఉన్నప్పుడు తప్ప. మీరు ఎప్పుడైనా అస్వస్థులైతే లేదా ప్రయాణంలో ఉంటే లేదా మీలో ఎవరైనా మలమూత్ర విసర్జనం చేసి ఉంటే లేదా మీరు మీ స్త్రీలను తాకి ఉంటే, ఒకవేళ మీకు నీరు లభించని పక్షంలో, పరిశుభ్రమైన మట్టిని ఉపయోగించండి; ఆ మట్టితో మీ ముఖాలను, మీ చేతులను రుద్దుకోండి. నిస్సందేహంగా అల్లాహ్ ఉదార స్వభావుడు, క్షమాగుణం కలవాడూను."[1]

## 1వ అధ్యాయం

### గుసుల్‌కు ముందు వుజూ చేయటం

ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసం) గారి భార్య హజ్రత్ ఆయెషా

1-1. ఈ రెండు ఖుర్‌ఆను వాక్యాల ద్వారా ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారు తేల్చి చెప్పిన విషయం ఏమిటంటే, గుసుల్ (తలంటి స్నానం) చేసుకోవటం విధి, తప్పనిసరి అనే విషయం ఖుర్‌ఆను ద్వారా కూడా నిరూపితమైంది.

**(రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త (స) జనాబత్ స్థితిలో (స్త్రీని కలిసిన స్థితిలో) గుసుల్ (తలంటి స్నానం) చేయదలచినప్పుడు, (పాత్రలో చేతులు పెట్టే ముందు) మొదట్లో తమ రెండు చేతుల్ని కడిగి పరిశుభ్రపరుచుకుంటారు. తరువాత నమాజు కోసం చేసుకునే వుజూ మాదిరిగా వుజూ చేసుకుంటారు. ఆ తరువాత తమ చేతి వ్రేళ్లను నీళ్లల్లో ముంచి ఆ వ్రేళ్లను తల వెంట్రుకలలోకి దూర్చి అటూ ఇటూ తిప్పుతారు[1]. తరువాత రెండు చేతుల్లోకి నీళ్లు తీసుకుని మూడుసార్లు తమ శిరస్సు మీద పోసుకుంటారు. ఆ తరువాత తమ మొత్తం శరీరం మీద నీళ్లు పోసుకుంటారు[2].**

**249.** ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారి భార్య అయిన **హజ్రత్ మైమూనా (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త (స) (జనాబత్‌కు సంబంధించిన గుసుల్ విషయంలో) నమాజు కోసం చేసుకునే వుజూలాంటి వుజూనే చేసుకున్నారు. అయితే ఆయన (స) తన కాళ్లను మటుకు కడుక్కోలేదు. ఇంకా తన మర్మాంగాన్ని కడుక్కున్నారు. ఇంకా శరీరానికి తగిలిన ఇతర మాలిన్యాన్ని కూడా కడిగేశారు. ఆ తరువాత తమ శరీరం మీద నీళ్లు పోసుకున్నారు. ఆ పైన కొంచెం పక్కకు పోయి తన రెండు కాళ్లను కడుక్కున్నారు.[2] ప్రవక్త (స) గారి జనాబత్‌కు సంబంధించిన గుసుల్ చేసుకునే విధానం ఇదే[3] అని హజ్రత్ సాలిమ్ గారు అన్నారు.**

---

1-1. ఎందుకంటే తల వెంట్రుకల వేళ్లల్లోకి నీళ్లు బాగా పోవాలని మరియు ఏ ఒక్క వెంట్రుక కూడా పొడిగా ఉండకూడదని అలా చేసేవారు. హాఫిజ్ ఇబ్నె హజర్ (రహ్మాలై) ఇలా సెలవిచ్చారు; ఈ విధంగా చెయ్యటం వాజిబ్ కాదు అనే విషయంలో పండితులు, విద్వాంసుల మధ్య ఏకాభిప్రాయం ఉన్నది. కాని ఒకవేళ వెంట్రుకలు చిక్కుబడిపోయినప్పుడు, వాటి వ్రేళ్ల వరకు నీళ్లు చేరలేని స్థితిలో ఇది వాజిబ్ అవుతుంది.

1-2. దైవ ప్రవక్త (స) సంప్రదాయం ప్రకారం గుసుల్ చేసుకునే పద్ధతి ఇదే. మనిషి గనక అనవసరంగా, అతిగా నీళ్లు వాడి వృధా చెయ్యకపోతే అప్పుడు ఒక 'సా' (నాలుగు సేర్లకు సమానమైన నీరు) నీరు చక్కగా, సరిపోతుంది.

249-1. ఈ ఉల్లేఖనంలో ముందు రావలసిన విషయం తరువాత వచ్చిందని, మర్మ స్థానాలను కడగటమయినా, శరీరానికి అంటుకున్న మలినాన్ని కడగటమయినా 'వుజూ చేయకముందే చేయాలని హాఫిజ్ ఇబ్నె హజర్ అస్ఖలానీ(రహ్మా) వ్యాఖ్యానించారు.

249-2. అంటే స్నానం చేసిన స్థలం నుంచి జరిగి కాళ్లు కడుకున్నాడు.

249-3. ఈ స్నానంలో వుజూ ప్రక్రియ కూడా ఉంది గనక, స్నానం చేశాక నమాజు చేయవచ్చు. మళ్లీ వుజూ చేసుకోవలసిన అవసరం లేదు.

## 2వ అధ్యాయం

## ఒక పురుషుడు తన భార్యతో కలిసి ఒకే పాత్రలోని నీళ్లతో గుసుల్ (తలంటి స్నానం) చెయ్యటం

**250.** హ్జ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు; నేనూ, ప్రవక్త మహనీయులూ (సఅసం), ఉభయులమూ కలిసి ఒకే పాత్రలోని నీళ్లతో గుసుల్ (తలంటిస్నానం) చేసేవారము. ఇంతకీ ఆ పాత్ర ఒక మట్టి కుండ. దానిని 'ఫరఖ్' అంటారు.[1]

## 3వ అధ్యాయం

## ఒక 'సా' లేదా దానితో సరితూగే పాత్రలలోని నీళ్ళతో గుసుల్ చేయటం.

**251.** అబూ సలమా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; నేనూ, హ్జ్రత్ ఆయెషా (రజిఅన్హా) గారి (పాల వరుస) సోదరుడు (అబ్దుల్లా బిన్ యజీద్) ఒకసారి ఆమె వద్దకు వెళ్ళాము. ఆమె (ర)గారి సోదరుడు ఆమె(ర)ను ఇలా అడిగాడు; 'ప్రవక్త మహనీయులు(స) జనాబత్ గుసుల్ను (భార్యతో సంభోగించినప్పుడు చేసే తలంటి స్నానం) ఎలా చేసేవారు?" అప్పుడు ఆమె(ర) గారు ఒక పాత్రను తెప్పించారు. అందులో ఒక 'సా'కు సమానమైనంత నీరు ఉండినది. తరువాత ఆమె(ర) గారు గుసుల్ చేసుకున్నారు. ఇంకా తన తల మీద నీళ్ళు పోసుకున్నారు. మాకూ, ఆమె(ర) గారికి మధ్య ఒక పరదా అడ్డంగా ఉండినది.[1]

**252.** హ్జ్రత్ అబూ జాఫర్ (ఇమామ్ ముహమ్మద్ బాఖర్) (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : ఒకసారి తనూ, తన తండ్రి గారైన ఇమామ్ జైనుల్ ఆబిదీన్(రజిఅన్),

---

250–1. మనదేశంలోని లెక్క ప్రకారం 'ఫరఖ్' అంటే దాదాపు ఏడు సేర్ల నీళ్లు పట్టే పాత్ర. ఈ హదీసు ద్వారా తెలిసిన ఒక విషయం ఏమిటంటే ఒక స్త్రీ తన భర్త మర్మాంగాన్నీ, ఒక పురుషుడు తన భార్య మర్మాంగాన్నీ చూడవచ్చు.

251–1. అబూ సలమా (రజిఅన్) హ్జ్రత్ ఆయెషా(ర)కు రజాయీ (ఒకే తల్లిపాలు తాగిన) అక్కయ్య కొడుకు; కొందరు హ్జ్రత్ ఆయెషా(ర)కు సోదరుడు అన్నారు. అంటే కసీర్ బిన్ అబ్దుల్లా కూఫీ అని భావం. ఆ ఉభయుల్లో ఎవరైనా హ్జ్రత్ ఆయెషా(ర)కు మహ్రమ్ (నికాహ్ నిషిద్ధమైన సమీప బంధువు) అవుతారు. కనుకనే ఆమె(ర) గారు వారి ముందు పరదాను అడ్డంగా పెట్టుకుని గుసుల్ చేశారు. ఇంకా వారు హ్జ్రత్ ఆయెషా(ర) గారి శిరస్సునూ, పై శరీర భాగాన్ని చూశారు. ఆ రెండు శరీర భాగాలను మహ్రమ్ బంధువులకు చూడటం శాస్త్ర సమ్మతమే.

**హ్రజత్ జాబిర్(రజిఅన్) వద్ద కూర్చొని ఉన్నారు. ఇతరులు కూడా కొందరు అక్కడ కూర్చొని ఉన్నారు. వారు హ్రజత్ జాబిర్ (ర)ను గుసుల్‌ను గురించి అడిగారు. దానికి సమాధానంగా ఆయన, మీకు ఒక 'సా' నీరు సరిపోతుంది అని అన్నారు. వారిలో నుంచి ఒక మనిషి (హసన్ బిన్ ముహమ్మద్ బిన్ అలీ రజిఅన్) "నాకైతే ఆ నీరు సరిపోదు" అని అన్నాడు. అప్పుడు హ్రజత్ జాబిర్ (ర) ఇలా అన్నారు : ఆయన గారికైతే సరిపోయేది; ఆయన గారి తల మీద నీకంటే ఎక్కువ వెంట్రుకలు ఉండేవి; ఆయన గారు నీకంటే ఉత్తములు. (అంటే ప్రవక్త మహనీయులు(స)) తరువాత హ్రజత్ జాబిర్ (ర) ఒకే వస్త్రాన్ని ధరించి నమాజుకు నాయకత్వం వహించారు.[1]**

**253. హ్రజత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసం) మరియు విశ్వాసుల తల్లి అయిన మైమూనా (రజిఅన్‌హా) ఉభయులూ (కలిసి) ఒకే పాత్రలోని నీళ్లతో గుసుల్ చేసేవారు.[1] ఇమామ్ బుఖారీ (రహ్మాలై) ఇలా అన్నారు : సుఫ్యాన్ బిన్ ఉయయ్‌నా తమ జీవిత కాలపు**

---

251–2. హ్రజత్ ఆయెషా(ర) స్వయంగా తలంటి స్నానం చేసి వారికి గుసుల్ ఎలా చెయ్యాలో బోధించారు. క్రియాత్మకంగా చూపించటం అనేది ఒక చక్కని బోధనా పద్ధతి.

252–1. స్పష్టంగా తెలిసిన విషయం ఏమిటంటే, ఒక హదీసుకు వ్యతిరేకంగా ఎవరైనా వాదిస్తే, ఘర్షణ పడితే, అతని పట్ల కఠినంగా వ్యవహరించాలి. అతనికి అర్థమయ్యేలా చెప్పాలి. హ్రజత్ జాబిర్(రజిఅన్) హసన్ బిన్ ముహమ్మద్ బిన్ హనఫియాను మందలించారు. అతని పట్ల కఠినంగా వ్యవహరించారు. ఒకే వస్త్రాన్ని ధరించి నమాజుకు నాయకత్వం వహించారు అంటే అర్థం కేవలం తహ్‌బంద్ (లుంగీ)ని ధరించి నమాజు చేయించారు. వాస్తవానికి ఆయన దగ్గర చాలా వస్త్రాలు ఉన్నాయి. దీనికి సంబంధించిన మరిన్ని విషయాలు, దేవుడు మేలు చేస్తే, మున్ముందు "కితాబుస్సలాత్"లో (నమాజు ప్రకరణంలో) వస్తాయి.

253–1. పాత్ర అంటే పైన వచ్చిన ఒక హదీసులో ప్రస్తావించబడిన 'ఫరఖ్' అనే పాత్ర అని భావం. లేదా ఆ కాలంలో 'బర్తన్' (పాత్ర) అనే పదం అందరికీ బాగా తెలిసిన, ప్రసిద్ధిగాంచిన పదమైనా అయి ఉండవచ్చు. ఆ పాత్రలో ఏడు సేర్ల పరిమాణంగల నీరు పట్టవచ్చు. ఈ విధంగా ఈ హదీసు ఔచిత్యం, అధ్యాయం యొక్క ఉద్దేశ్యం ప్రకారమే ఉన్నది.

**చివరి దశలో ఈ హదీసును గురించి ఇలా ఉల్లేఖించేవారు: "ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ద్వారా, ఆయన మైమూనా[2] (రజిఅన్‌హా) ద్వారా." అబూనుఅయిమ్ గారి ఉల్లేఖనమే నిజమైంది.**

## 4వ అధ్యాయం

## తలమీద మూడుసార్లు నీళ్లు పోసుకోవటం

**254.** జుబైర్ బిన్ ముత్‌యిమ్ (రజిఅన్) కథనం ప్రకారం, ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారు: "నేనైతే (గుసుల్ చేసుకునేటప్పుడు) నా తల మీద ఇటువంటి మూడు దోసెళ్ల నీళ్లను పోసుకుంటాను"[1]. తరువాత ఆయన (స) గారు తమ రెండు చేతులతో చేసి చూపించారు.

**255.** హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా అన్సారీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) (జనాబత్‌కు సంబంధించిన గుసుల్ చేసుకునేటప్పుడు) తమ తలమీద మూడుసార్లు నీళ్లు పోసుకునేవారు.

**256.** హజ్రత్ అబూ జాఫర్ (ఇమామ్ ముహమ్మద్ బాఖర్) (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: జాబిర్ బిన్ అబ్దుల్లా నాతో ఇలా అన్నారు; మీ బాబాయి కొడుకు (హసన్ బిన్ ముహమ్మద్ బిన్ హనఫియా) ఒకసారి నా వద్దకు వచ్చారు; నన్ను ఇలా అడిగారు; "జనాబత్‌కు సంబంధించిన గుసుల్‌ను ఎలా చేసుకోవాలి?" అప్పుడు నేను ఇలా చెప్పాను. "ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) మూడు దోసెళ్ల నీళ్లను తీసుకుని తమ తలమీద ప్రవహింపజేసేవారు. తరువాత తమ మొత్తం శరీరం మీద

---

253-2. ఈ హదీసును హజ్రత్ మైమూనా ధ్రువీకరించినట్లు, ఉల్లేఖించినట్లు తేలుతుందే కాని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ ఉల్లేఖించినట్లుగా కాదు. కాని ప్రారంభంలో సుఫ్యాన్ (రజిఅన్) ఈ హదీసును హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (ర) గారి ఉల్లేఖనమని వివరించారు. ఈ విషయాన్నే అబూ నుఅయిమ్ గారు కూడా ఉల్లేఖించారు. దారెఖుతనీ కూడా ఇదే నిజమని చెప్పారు.

254-1. అబూ నుఅయిమ్ గారు శబ్ద వ్యుత్పత్తి అర్థాన్ని ఇలా విశదీకరించారు:ప్రజలు ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (స) ముందు జనాబత్‌కు సంబంధించిన గుసుల్‌ను గురించి ప్రస్తావించారు. 'సహీ ముస్లిమ్' గ్రంథంలో, 'వారు ఘర్షణపడ్డారు.' అని అన్నది, అప్పుడు దైవప్రవక్త (స) హదీసును సెలవిచ్చారు: నేనైతే ఈ విధంగా చేస్తాను, అంటే రెండు చేతులతో మూడుసార్లు నీళ్లు తీసుకుని తలమీద ప్రవహింపజేస్తాను.

**నీళ్లను ప్రవహింపజేసేవారు." అప్పుడు హసన్ బిన్ ముహమ్మద్ (ర), "నేనైతే చాలా వెంట్రుకలు గల మనిషిని" అని అన్నారు. దానికి నేను, "ప్రవక్త మహనీయులు (స) మీ కంటె ఎక్కువ వెంట్రుకలు కలిగి ఉండేవారు" అని చెప్పాను.[1]**

## 5వ అధ్యాయం

## ఒక్కసారి మాత్రమే స్నానం చెయ్యటం.[1]

**257.** విశ్వాసుల తల్లి అయిన హజ్రత్ మైమూన (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) స్నానం చెయ్యటానికి నేను నీళ్లు తోడిపెట్టాను. ఆయన (స) మొదట తమ రెండు చేతుల్ని రెండుసార్లో లేక మూడు సార్లో కడుక్కున్నారు. తరువాత తమ ఎడమ చేత్తో నీళ్లు తీసుకుని తమ మర్మాంగాలను పరిశుభ్రపరచుకున్నారు. ఆ తరువాత తమ చేతిని నేల మీద పెట్టి రుద్దారు. ఆపైన పుక్కిలించి ఊశారు. ఇంకా ముక్కులోకి నీళ్లు ఎక్కించారు. తరువాత ముఖాన్నీ, రెండు చేతులనూ మోచేతుల వరకు కడుక్కున్నారు. ఆ తరువాత మొత్తం శరీరం మీద నీళ్లను ప్రవహింపజేశారు. ఆ తరువాత స్నానం చేసే స్థలం నుంచి కొంచెం దూరం జరిగి తమ రెండు పాదాలను కడుక్కున్నారు.

## 6వ అధ్యాయం

## హిలాబ్‌తోగాని లేదా సువాసనతో గాని గుసుల్‌ను (తలంటి స్నానం) ప్రారంభించటం.[1]

---

256-1. దైవ ప్రవక్త (స) గారికి మూడుసార్లు తలమీద నీళ్లు పోసుకోవటం సరిపోయేది, మీకు ఎందుకు సరిపోదు అని భావం.

5-1. అంటే గుసుల్ చేసుకునేటప్పుడు ఒకేసారి మొత్తం శరీరం మీద నీళ్లు పోసుకోవటం సరిపోతుంది. ఈ అధ్యాయంలో ఉన్న హదీసులో 'ఒక్కసారి మాత్రమే' అనే దానికి వివరణ లేదు. కాని కేవలం నీళ్లను ప్రవహింపజేయుటం అనే విషయమే ప్రస్తావించబడింది. అంటే అది ఒక్కసారి మాత్రమే అనే అర్థం కూడా వస్తుంది, దీనితో అధ్యాయం యొక్క లక్ష్యం నెరవేరుతుంది.

6-1. చాలామంది ఏమన్నారంటే: విద్వాంసుడు ఎంత గొప్పవాడైనాసరే తప్పులు చెయ్యటం అనేది సహజం; అతను తప్పులకు, పొరపాట్లకు అతీతుడేమీ కాదు. ఇక్కడ ఇమామ్ బుఖారీ (రహ్మాలై) కూడా తప్పు చెయ్యటం జరిగింది. ఆయన ఇక్కడి హదీసులో వచ్చిన హిలాబ్ అనే పదాన్ని శరీరానికి రాసే ఏదో వస్తువుగా అర్థం చేసు కున్నారు. వాస్తవానికి 'హిలాబ్' అనే పదం ఒక పాత్రను సూచిస్తుంది. అంటే ఒక పాత్రను

**258. హజ్రత్ ఆయెషా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) జనాబత్‌కు సంబంధించిన గుసుల్ చేసుకున్నప్పుడల్లా హిలాబ్‌కు సమానంగా ఉండే ఏదైనా పాత్రను తెప్పించుకునేవారు.[1] తరువాత చేతి నిండా నీళ్ళు తీసుకుని తమ శిరస్సు కుడి భాగం మీద పోసుకునేవారు. ఆ తరువాత మళ్ళీ చేతినిండా నీళ్ళు తీసుకుని శిరస్సు ఎడమ భాగం మీద పోసుకునేవారు. ఆ తరువాత మళ్ళీ చేతినిండా నీళ్ళు తీసుకుని తమ శిరస్సు అగ్రభాగం మీద (నడినెత్తి మీద) పోసుకునేవారు.**

---

హిలాబ్ అని అంటారు. అరేబియా ప్రాంతపు ప్రజలు ఈ పాత్రలో పాలు పితుకుతారు. ఇమామ్ ముస్లిమ్ (రహ్మాలై) హిలాబ్ అనే పదం యొక్క అర్థాన్ని సరిగ్గా అర్థం చేసుకున్నారు. ఆయన ఈ హదీసును 'ఫరఖ్' మరియు 'సా'తో గుసుల్ చేసుకునే విషయానికి సంబంధించిన హదీసులతోపాటు ఉల్లేఖించారు. కొందరు ఏమన్నారంటే; ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారు తప్పు చెయ్యలేదు; హిలాబ్ అర్థాన్ని ఒక పాత్రగానే తీసుకున్నారు. అధ్యాయంలో ఉన్న విషయం యొక్క భావం ఏమిటంటే; గుసుల్‌ను మొదట హిలాబ్ లాంటి పాత్రలో ఉన్నటువంటి నీళ్లతో ప్రారంభించి, గుసుల్ తరువాత సువాసన పూసుకోవటం లేదా సువాసనను మొదట రాసుకుని ఆ తరువాత స్నానం చెయ్యటం. అధ్యాయంలోని హదీసు ద్వారా ఆయన పై రెండు అర్థాల్లోని మొదటి అర్థాన్ని నిరూపించారు. రెండో అర్థం గురించి ముమ్మందు ఏడు అధ్యాయాల తరువాత రాబోయే హదీసును సూచించారు. ప్రవక్త మహనీయులు (స) సువాసన రాసుకున్న తరువాతనే తమ భార్యలతో కలిసేవారు (అంటే సంభోగించేవారు). ఇంకా కలిశాకనే కదా గుసుల్ చేసుకునేది! కనుక మొదట సెంటు రాసుకోవటం అనేది నిరూపితమై పోయింది.

258-1. షా వలీవుల్లా (రహ్మా.లై) ఇలా వివరించారు: హిలాబ్ అంటే అరేబియా దేశంలో పండే కొన్ని విత్తుల నుంచి తీసే రసం అని భావం. అరేబియావాసులు దానిని గుసుల్‌కు ముందు శరీరానికి పూసుకునేవారు. అనువాదకుని అభిప్రాయం ప్రకారం భారత దేశంలో సబ్బుతో శరీరాన్ని కడుక్కుంటారు. (అంటే సబ్బు రాసిన తరువాత నీళ్ళు పోసుకుంటారు.) ఇంకా నూనెతో కలిపిన పిండిని శరీరానికి పులుముకుని తరువాత స్నానం చేస్తారు. అరేబియావాసులు స్నానానికి సంబంధించి అవలంబించిన ప్రక్రియ కూడా ఇటువంటిదే. కాని షా వలీవుల్లా (రహ్మా.లై) గారు హిలాబ్ పదానికి చెప్పిన భాష్యం, ఇచ్చిన అర్థం నాకు అరబ్బీ భాషకు చెందిన నిఘంటువులో ఎక్కడా దొరకలేదు. కొందరు 'హిలాబ్' పదాన్ని పొరపాటుగా 'జిలాబ్' అని చదివారు.

## 7వ అధ్యాయం

### జనాబత్ స్థితిలో గుసుల్ చేసుకునేటప్పుడు పుక్కిలించటం, ఇంకా ముక్కులోకి నీళ్లు ఎక్కించటం.[1]

**259.** హజ్రత్ మైమూన (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గుసుల్ చేసుకోవటానికి నేను ఒక పెద్ద పాత్రలో నీళ్లు తోడాను. ఆయన (స) మొదట కుడిచేత్తో నీళ్ళు తీసుకుని ఎడమ చేతిలో పోసు కున్నారు. తరువాత రెండు చేతులూ కడుక్కున్నారు. ఆ తరువాత తమ మర్మాంగాన్ని పరిశుభ్రపరుచుకున్నారు. ఆ పైన తమ చేతులను నేలమీద కొట్టారు. ఇంకా మట్టితో చేతిని రుద్దుకున్నారు. తరువాత నీళ్లతో చేతిని కడుక్కున్నారు. ఆ తరువాత పుక్కిలించి ఊశారు, ముక్కులోకి నీళ్ళు ఎక్కించారు. ఆ పైన తమ ముఖాన్ని కడుక్కున్నారు. ఇంకా తమ శిరస్సుమీద నీళ్లను ప్రవహింపజేశారు. తరువాత అక్కడ నుంచి కొంచెం దూరం జరిగి తమ పాదాలను కడుక్కున్నారు. ఆ తరువాత ఒక తువాలు ఆయన (స) గారికి ఇవ్వబడింది. కాని ఆయన (స) ఆ తువాలుతో తమ శరీరాన్ని తుడుచుకోలేదు.[1]

---

7-1. ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారి భావం ఏమిటంటే గుసుల్ చేసుకునేటప్పుడు పుక్కిలించి ఊయటం మరియు ముక్కులోకి నీళ్లు ఎక్కించటం వాజిబ్ కాదు. ఎందుకంటే జనాబత్ స్థితిలో గుసుల్ చేసుకునేటప్పుడు వుజూ చేసుకోవడం వాజిబ్ కాదు. ప్రవక్త మహనీయులు (స) వుజూను పూర్తి చెయ్యటానికే, పరిపూర్ణం చెయ్య టానికే పుక్కిలించి ఊశారు. ముక్కులోకి నీళ్ళు ఎక్కించారు. అహ్లెహదీస్ వర్గంవారు మరియు ఇమామ్ అహ్మద్ బిన్ హమ్బల్ (రహ్మాలై) ఏమన్నారంటే; వుజూ చేసుకునే టప్పుడూ, గుసుల్ చేసుకునేటప్పుడూ ఈ రెండు స్థితులలో పుక్కిలించి ఊయటం, ముక్కులోకి నీళ్లు ఎక్కించటం వాజిబ్ అవుతుంది. ఇంకా హనఫీ వర్గం వారి దృష్టిలో వుజూలో అలా చెయ్యటం సున్నత్; గుసుల్‌లో 'ఫర్జ్'.

259-1. ఇమామ్ ఇబ్నె ఖయ్యిమ్ (రహ్మా.లై) ఇలా సెలవిచ్చారు: వుజూ చేసుకున్న తరువాత శరీర అవయవాలను తువాలుతో తుడుచుకునే విషయం గురించి నిజమైన హదీసు ఏదీ లేదు. అయితే గుసుల్ చేసుకున్న తరువాత తుడుచుకోవటం అనే విషయం గురించి ప్రామాణిక హదీసుల ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే; ప్రవక్త (స) గారికి తువాలు ఇవ్వబడింది. కాని ఆయన (స) దానిని త్రిప్పి పంపారు. తమ అవయవాలను దానితో తుడుచుకోలేదు. నవవీ (రహ్మా.లై) ఇలా సెలవిచ్చారు: ఈ విషయం గురించి అభిప్రాయభేదాలు చాలా ఉన్నాయి. వుజూ తరువాతగానీ, గుసుల్ తరువాత గానీ శరీర అవయవాలను తుడుచుకోవటం మక్రూహ్ (అసహ్యకరమైనది) అని కొందరు

## 8వ అధ్యాయం

**గుసుల్ చేసుకునేటప్పుడు బాగా, పూర్తిగా పరిశుభ్రపరచుకోవటానికి, మట్టితో చేతులు రుద్దుకోవటం.**

**260. విశ్వాసుల తల్లి అయినటువంటి హజ్రత్ మైమూన (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) జనాబత్‌కు సంబంధించిన గుసుల్ చేసుకోవటం ప్రారంభించారు: మొదట తమ ఎడమ చేత్తో మర్మాంగాన్ని పరిశుభ్రపరచుకున్నారు; తరువాత ఆ చేతిని గోడమీద పెట్టి రుద్దారు.[1] ఆ తరువాత ఆ చేతిని నీళ్లతో కడుక్కున్నారు. ఆపైన నమాజు కోసం చేసుకునే వుజూలాంటి వుజూనే చేసుకున్నారు. గుసుల్‌ను పూర్తి చేసుకున్న తరువాత ఆయన (స) తమ రెండు పాదాలను నీళ్లతో కడుక్కున్నారు.**

## 9వ అధ్యాయం

**ఒకవేళ ఎవరికైనా తలంటి స్నానం చేసే అవసరం కలిగినప్పుడు, అతను తన చేతిని కడగకుండానే నీళ్ల కుండలో పెడితే, ఇంకా దాని మీద జనాబత్‌కు సంబంధించిన అశుద్ధతకాక మరొక అశుద్ధత ఏదైనా తగిలి ఉండకుండా ఉంటే, అప్పుడు అది ధర్మసమ్మతం అవునా? కాదా?[1] హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (ర), బరా బిన్ ఆజిబ్ (ర)లు ఉభయులూ తమ చేతుల్ని కడగకుండానే నీళ్లలో పెట్టారు. ఆ తరువాత**

---

అన్నారు. మరి కొందరు ఏమన్నారంటే; వుజూ తరువాత గుసుల్ తరువాత రెండు సందర్భాలలోనూ తుడుచుకోవటం, తుడుచుకోకపోవటం రెండూ ఒకటే. మా దృష్టిలో ఇదే సమంజసమైనది.

260–1. ఇక్కణ్ణుంచే అధ్యాయంలోని ప్రధాన విషయం ఉద్భవిస్తుంది. పైన వచ్చిన హదీసు ఈ హదీసుకంటె చాలా స్పష్టంగా, విశదంగా ఉంది. ఆ హదీసులో ఏమని చెప్పబడిందంటే; తమ చేతిని నేలకేసి కొట్టారు. ఇంకా మట్టితో రుద్దారు. ఈ హదీసుపైన వచ్చిన హదీసే కాని ధృవీకరణలో భేదం ఉంది. ఇమామ్ బుఖారీ (రహ్మలై) గారి అలవాటు ఏమిటంటే; ఒకే హదీసును భిన్నమైన ఎన్నో సమస్యలను పరిష్కరించటానికి, ఎన్నోసార్లు వివరిస్తూ ఉంటారు. కాని ధృవీకరణలు, ఉల్లేఖనాలు వేర్వేరుగా ఉంటాయి. ఎందుకంటే చెప్పిందే తిరిగి చెప్పటం అనేది అనవసరమైనదిగా ఉండకూడదని, లాభదాయకం కాకుండా ఉండకూడదని అలా చేస్తారు.

9–1. ఇమామ్ బుఖారీ (రహ్మలై) గారి భావం ఏమిటంటే, ఒకవేళ సంభోగం తరువాత ఇంకా గుసుల్ చెయ్యని వ్యక్తి చేతుల మీద మరొక అశుద్ధత ఏదీ లేనప్పుడు అతను

**వుజూ చేసుకున్నారు.[2] ఇంకా ఇబ్నె ఉమర్ (ర), ఇబ్నె అబ్బాస్ (ర) ఉభయులూ జనాబత్‌కు సంబంధించిన గుసుల్ చేసుకునేటప్పుడు ఎగిరిపడే నీటి చుక్కలు పడితే, అందులో ఎలాంటి దోషమూ లేదు అని అన్నారు.[3]**

**261. హ(జ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు: నేను మరియు ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్)ఉభయులమూ కలిసి ఒకే నీటి పాత్రలో నుంచి గుసుల్ చేసుకునేవారము. మా ఇద్దరి చేతులు ఒకదాని తరువాత ఒకటి ఆ నీటి పాత్రలో పడుతూ ఉండేవి.[1]**

**262. హ(జ్రత్ ఆయెషా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) జనాబత్‌కు సంబంధించిన గుసుల్ చేసుకునే ముందు తమ చేతులను కడుక్కునేవారు.[1]**

---

తన చేతుల్ని కడుగక ముందే వాటిని నీటిపాత్రలో పెట్టినట్లయితే ఆ పాత్రలోని నీరు అశుద్ధం కాదు. ఎందుకంటే జనాబత్ నజాసతె హుక్మీయేగాని (అగోచరమైన అశుద్ధత), నజాసతె హఖీఖీ (గోచరించే అశుద్ధత) కాదు.

9-2. ఇబ్నె ఉమర్ (ర) గారి అసర్‌ను (హదీసును) సయీద్ బిన్ మన్‌సూర్ వెలికి తీశారు. ఇంకా బరా బిన్ ఆజిబ్ (ర) గారి అసర్‌ను (హదీసును) ఇబ్నె అబీ షైబా వెలికి తీశారు. అయితే ఈ రెండింటిలోనూ జునుబ్ (సంభోగం తరువాత ఇంకా స్నానం చేయని వ్యక్తి)కు సంబంధించిన ప్రస్తావన లేనేలేదు. కాని ఇమామ్ బుఖారీ (రహ్మ.లై) గారు జనాబత్ (సంభోగం తరువాత గుసుల్ చెయ్యని స్థితి)ని హదస్ (వుజూ భంగం కావటం)గా ఊహించారు. ఎందుకంటే రెండు స్థితులూ హుక్మీ నజాసత్‌కు సంబంధించినవే (అగోచరమైన అశుద్ధతలు). ఇబ్నె అబీ షైబా, షూబీ నుంచి తీసుకుని ఇలా వివరించారు. ప్రవక్త (స) గారి ప్రత్యక్ష అనుచరులు తమ చేతుల్ని కడగకుండానే నీళ్లల్లో ముంచేవారు. వాస్తవానికి వారు జునుబులే (గుసుల్ ఇంకా చెయ్యని వారే).

9-3. ఇంకా నీటి పాత్రలో పడితే, ఒకవేళ జునుబ్ (ఇంకా గుసుల్ చెయ్యని వ్యక్తి) యొక్క శరీరం అశుద్ధమైనదైతే ఏ నీటి పాత్రలోనయితే అతని గుసుల్ నీటి చుక్కలు పడతాయో, ఆ పాత్ర కూడా అశుద్ధమైపోతుంది.

261-1. అంటే ఒకప్పుడు నా చెయ్యి, మరొకప్పుడు ఆయన (స) గారి చెయ్యి నీళ్లు తీసుకోవటానికి నీటి పాత్రలో పడుతూ ఉండేవి. మరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది; ఒక్కొక్కప్పుడు నా చెయ్యీ, ఆయన (స) గారి చెయ్యీ రెండూ కలిసిపోయేవి.

262-1. పై హదీసులో విషయం ఇలా వచ్చింది; ప్రవక్త (స) గారి చెయ్యీ, హ(జ్రత్

**263.** **హజ్రత్ ఆయెషా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: నేనూ, ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఉభయులమూ కలిసి జనాబత్ స్థితిలో ఒకే నీటి పాత్రలో నుంచి నీళ్లు తీసుకుని స్నానం చేసేవారము.**

**264.** **హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా సెలవిచ్చారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) మరియు ఆయన (స) గారి భార్య ఒకామె, ఉభయులూ కలసి ఒకే కుండలోని నీళ్లతో గుసుల్ చేసుకునేవారు. షూబాగారు హజ్రత్ అనస్ గారి ఉల్లేఖనానికి 'జనాబత్' అనే పదాన్ని అదనంగా చేర్చారు.**

## 10వ అధ్యాయం

## గుసుల్ చేసుకునేటప్పుడు కుడిచేత్తో ఎడమ చేతి మీద నీళ్లు పోసుకోవటం.

**265.** **హజ్రత్ మైమూన బిన్తె హారిస్ (ర) ఇలా ఉల్లేఖించారు: నేను ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) కొరకు నీళ్లు తోడాను. ఇంకా ఒక వస్త్రాన్ని**

---

ఆయెషా (ర)గారి చెయ్యీ ఉభయుల చేతులూ నీటిపాత్రలో పడుతూ ఉండేవి. వాస్తవానికి వారు ఆ సమయంలో జునుబులే. కనుక తెలిసిన విషయం ఏమిటంటే, జునుబ్ అయిన వ్యక్తి నీటి పాత్రలో చెయ్యిపెట్టటం ధర్మసమ్మతమైన విషయమే. ఇంకా ఈ హదీసును ఇక్కడ పెట్టటంలోని ఉద్దేశ్యం ఏమిటంటే; చేతి మీద అశుద్ధత ఉన్నదనే అనుమానం కలిగినప్పుడు చేతిని పరిశుభ్రంగా కడిగి నీటిపాత్రలో పెట్టాలి. లేదా చేతిని కడిగి నీటిపాత్రలో పెట్టటం అభిలషణీయమైన విషయమే. ఇంకా చేతిని కడగకుండా నీటి పాత్రలో పెట్టడం కూడా ధర్మసమ్మతమైన విషయమే.

10–1. అంటే వుజూను కొనసాగించకుండా ఆగిపోవటం. ఇమామ్ అబూ హనీఫా (రహ్మాలై), ఇమామ్ షాఫయి (రహ్మాలై)ల దృష్టిలో వుజూను కొనసాగించటం లేదా ఎడతెగకుండా చేసుకోవటం వాజిబ్ ఏమీ కాదు. ఇమామ్ బుఖారి (రహ్మాలై) గారి అభిప్రాయం కూడా ఇదే. ఇంకా ఇమామ్ అహ్మద్ (రహ్మాలై), ఇమామ్ మాలిక్ (రహ్మాలై) గార్ల దృష్టిలో వుజూను మధ్యలో ఆపకుండా కొనసాగించటం 'వాజిబ్'.

10–2. ఈ హదీసును (అసర్‌ను) ఇమామ్ షాఫయి (రహ్మాలై) గారు 'కితాబుల్ ఇల్మ్'లో నుంచి తీశారు. అందులో ఇలా ఉంది; అబ్దుల్లా బిన్ ఉమర్ (ర) బజారులో వుజూ చేసుకున్నారు; ముఖం కడుక్కున్నారు, చేతులు కడుక్కున్నారు, తల మీద మసా చేశారు, తరువాత 'జనాజా' నమాజు కోసం ఆయన్ని పిలవటం జరిగింది. అప్పుడు ఆయన మసీదులోకి ప్రవేశించారు. ఆ తరువాత నమాజు చెయ్యటం కోసం ఆయన తమ మేజోళ్ల మీద మసా చేసుకున్నారు. ఆ పైన జనాజా నమాజును చేశారు. హాఫీజ్ గారు, ఈ సంఘటనకు సంబంధించిన ధృవీకరణలు యదార్థమైనవే అని సెలవిచ్చారు.

ఆయన (స) గారికి అడ్డంగా కట్టాను. ఆయన(స) గారు మొదట తమ చేతుల మీద నీళ్లు పోసుకుని వాటిని ఒకసారో లేక రెండుసార్లో కడుక్కున్నారు. ఆమిష్ ఇలా అన్నారు; ఆమె (ర) 'మూడుసార్లు' అని అన్నారో లేదో నాకు జ్ఞాపకం లేదు. తరువాత కుడి చేత్తో ఎడమ చేతిలోకి నీళ్లు పోసుకున్నారు. ఇంకా తమ మర్మాంగాన్ని కడుక్కున్నారు. ఆ తరువాత తమ చేతిని నేలమీదనో లేక గోడమీదనో పెట్టి రుద్దారు. ఆ పైన పుక్కిలించి ఊశారు. ఇంకా ముక్కులోకి నీళ్ళు ఎక్కించారు. తరువాత ముఖాన్ని కడుక్కున్నారు. తరువాత రెండు చేతుల్నీ కడుక్కున్నారు. తమ తలను కూడా కడుక్కున్నారు. తరువాత మొత్తం శరీరం మీద నీళ్లు పోసుకున్నారు. ఆ తరువాత ఒక వైపునకు జరిగి తమ రెండు పాదాలను కడుక్కున్నారు. నేను ఆయన (స) గారికి తుడుచుకోవటానికి ఒక వస్త్రాన్ని ఇచ్చాను. ఆయన (స) తమ చేత్తో సైగ చేస్తూ అవసరం లేదు అని ఆ వస్త్రాన్ని తీసుకోలేదు.

## 11వ అధ్యాయం

**వుజూలోను, గుసుల్‌లోనూ మధ్యలో ఆగిపోవటం.[1] హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) శరీరంలోని ఇతర భాగాలకు చేసుకున్న వుజూ గుర్తులు ఆరిపోయిన తరువాత తమ కాళ్లను కడుక్కున్నారు.[2]**

**266.** విశ్వాసుల తల్లి అయిన హజ్రత్ మైమూనా (రజిఅన్‌హా) తమ ఒక కథనంలో ఇలా ఉల్లేఖించారు: నేను ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) కోసం స్నానం చేయటానికి నీళ్లు తోడాను. ఆయన (స) గారు మొదట తమ రెండు చేతుల్లోకి నీళ్లు తీసుకుని వాటిని రెండుసార్లో లేక మూడుసార్లో కడుక్కున్నారు. తరువాత కుడి చేత్తో నీళ్లు తీసుకుని ఎడమ చేతిలో పోసుకున్నారు. ఇంకా తమ ఎడమ చేత్తో మర్మాంగాలను కడుక్కున్నారు. తరువాత తమ చేతిని నేలమీద పెట్టి రుద్దారు. ఆ తరువాత పుక్కిలించి ఊశారు. ఇంకా ముక్కులోకి నీళ్లు ఎక్కించారు. ఆ తరువాత ముఖాన్ని నీళ్లతో కడుక్కున్నారు. ఇంకా రెండు చేతుల్ని కడుక్కున్నారు. ఆ తరువాత తమ తలను కడుక్కున్నారు. ఆపైన తమ మొత్తం శరీరం మీద నీళ్లు పోసుకున్నారు. ఆ తరువాత ఆ స్థలం నుంచి కొంచెం దూరం జరిగి రెండు కాళ్లు కడుక్కున్నారు.[1]

---

265–1. ఇక్కణ్ణుంచే ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారు ఎడతెగకుండా వుజూ చేసుకోవటం 'వాజిబ్' కాదు అనే విషయాన్ని తీసుకున్నారు. ఎందుకంటే ప్రవక్త మహనీయులు (స) పూర్తి వుజూను చేసుకున్నారు. కాని తమ పాదాలను కడుక్కోలేదు. చివరకు గుసుల్ కూడా చేసుకున్నారు. ఆ తరువాతనే ఆయన (స) తమ పాదాలను కడుక్కున్నారు.

## 12వ అధ్యాయం

## భార్యతో కలిసిన తరువాత గుసుల్ చేసుకోకుండానే మళ్లీ కలవటం - ఇలా చెయ్యవచ్చా? ఇంకా ఎవరైనా తన భార్యలందరి వద్దకూ పోయి వారిని కలిసి ఒకే గుసుల్ చేసుకుంటే; అలా చెయ్యటం ధర్మసమ్మతమేనా?[1]

**267.** తమ తండ్రిగారు ఇలా చెప్పారని ముహమ్మద్ బిన్ ముంతషిర్ ఉల్లేఖించారు: ఆయన, నేను అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) గారు ఉల్లేఖించిన హదీసును గురించి (అది ముందు రాబోతోంది) హజ్రత్ ఆయెషా (రజిఅన్హ) గారిని అడిగాను అని చెప్పారు. దానికి సమాధానంగా ఆమె (ర) గారు ఇలా సెలవిచ్చారు: దేవుడు అబూ అబ్దుర్రహ్మాన్ మీద కరుణజూపుగాక![1] నేనైతే ప్రవక్త మహనీయులకు (స) సువాసన రాసేదాన్ని. తరువాత ఆయన (స) గారు తమ భార్యలందరి వద్దకూ పోయి వచ్చేవారు. ఆ తరువాత రెండో రోజు ఉదయం పూట ఇహ్రామ్ ధరించేవారు. అయినప్పటికీ ఆయన (స)గారి పవిత్ర శరీరం సెంటు పరిమళాన్ని వెదజల్లుతూ ఉండేది.[2]

**268.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా సెలవిచ్చారని ఖతాద ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) తమ భార్యలందరి

---

12-1. ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారు ఈ అధ్యాయంలో చేర్చిన హదీసులో ఒక వివరణ చాలా స్పష్టంగా ఉంది. అదేమిటంటే, ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) తమ భార్యలందరితోనూ సంభోగించి ఒకే గుసుల్ చేసుకునేవారు. సంభోగించిన ప్రతిసారి, అంటే ప్రతి సంభోగానికీ వేర్వేరుగా గుసుల్ చేసుకోవటం వాజిబ్ కాదు అనే విషయంలోనైతే ఏకాభిప్రాయం ఉంది. కాని కొందరు అది ముస్తహబ్ (అభిలషణీయమైనది) అని అన్నారు. ఇంకా కొందరు ఏమన్నారంటే; ప్రతి సంభోగం తరువాత వుజూ చేసుకోవాలి. జాహిరియ, ప్రతి సంభోగం తరువాత వుజూ చేసుకోవటం వాజిబ్ అని అన్నారు.

267-1. అబూ అబ్దుర్రహ్మాన్, అబ్దుల్లా బిన్ ఉమర్ (ర) గారి మారుపేరు. ఆయన (ర) గారి సూక్తి మున్ముందు రాబోయే హదీసుల్లో ప్రస్తావించబడింది, అదేమిటంటే, ఇహ్రామ్ స్థితిలో ఉన్నప్పుడు నా శరీరం నుంచి సువాసన వెలువడటాన్ని ఇష్టపడను.

267-2. కొందరు ఇందులో నుంచే అధ్యాయంలోని ప్రధాన విషయాన్ని సంగ్రహించారు. ఎందుకంటే ప్రవక్త మహనీయులు (స) గనక ప్రతి భార్య వద్దకు పోయినప్పుడు గుసుల్ చేసుకుని ఉంటే, ఆయన (స) గారి పవిత్ర శరీరం మీద సుగంధ ద్రవ్యాల చిహ్నాలు మిగిలి ఉండేవి కావు.

**వద్దకూ ఒక రాత్రి ఒక పగలు కాలంలో, ఒకే సమయంలో వెళ్లి వచ్చేవారు. (అందరితో సంభోగించేవారు).[1] ఆయన గారికి పదకొండు మంది భార్యలు ఉండే వారు. నేను అనస్ (ర)ను ఇలా అడిగాను అని ఖతాద అన్నారు: "ఆయన (స) గారిలో ఇంత శక్తి ఉండేదా?" దానికి సమాధానంగా హజ్రత్ అనస్ (ర) ఇలా అన్నారు: మేము పరస్పరం, ప్రవక్త మహనీయులకు (స) ముప్ఫై మంది పురుషులకు ఉండే శక్తి ఇవ్వబడింది అని చెప్పుకునేవాళ్ళం. అనస్ (రజి) పదకొండు మంది భార్యల బదులు తొమ్మండుగురు భార్యలు అన్నారని సయీద్ బిన్ అబీ ఉరూబా గారు ఖతాదా నుండి ఉటంకించారు.**

## 13వ అధ్యాయం

### 'మజీ'ని కడగటం.[1] ఇంకా మజీ వల్ల వుజూ తప్పనిసరిగా చేసుకోవటం.

**269. హజ్రత్ అలీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: నాకు చాలా ఎక్కువగా మజీ స్ఖలనమవుతూ ఉంటుంది. ప్రవక్త మహనీయుల్ని (స) దీనిని గురించి అడగమని నేను ఒక వ్యక్తికి (మిఖ్దాద్ బిన్ అస్వద్) చెప్పాను. ఎందుకంటే ఆయన (స) గారి కుమార్తె[1] నా భార్య కాబట్టి. ఆ వ్యక్తి ప్రవక్త (స) గారిని ఈ విషయం గురించి అడిగినప్పుడు ఆయన(స) ఇలా సెలవిచ్చారు: (మజీ వెలువడితే) వుజూ చేసుకో. నీ పురుషాంగాన్ని కూడా పరిశుభ్రంగా కడుక్కో.**

## 14వ అధ్యాయం

### శరీరానికి సుగంధ ద్రవ్యం రాసుకుని స్నానం చెయ్యటం, ఆ తరువాత కూడా సెంటు ప్రభావం శరీరం మీద ఉండిపోవడం.

**270. తమ తండ్రి ఇలా చెప్పారని ముహమ్మద్ బిన్ మున్తషిర్ ఉల్లేఖించారు: నేను హజ్రత్ ఆయెషా (రజిఅన్హ) గారిని అడిగాను : ఇంకా అబ్దుల్లా బిన్ ఉమర్**

---

268-1. అధ్యాయంలోని ప్రధాన విషయం ఇదే. ఎందుకంటే ఒకవేళ ప్రవక్త మహనీయులు (స) ప్రతి భార్య వద్దకు పోయి ఆమెతో కలయిక తరువాత గుసుల్ చేసుకుంటే చాలా సమయం అవసరమవుతుంది. కనుక ఒకే రౌండులో అందరి వద్దకు పోవటం సాధ్యమయ్యే విషయం కాదు.

13-1. మజీకి సంబంధించిన వివరాలు ఇదివరకే వచ్చాయి.

269-1. అంటే హజ్రత్ ఫాతిమా (రజిఅన్హ), అల్లుడు గారు ఇటువంటి విషయాలను గురించి మామగారిని అడగటానికి సాధారణంగా సిగ్గుపడతారు. ఈ హదీసు ఇదివరకు ఒకసారి వచ్చింది.

**(రజిఅన్) గారు చెప్పిన ఈ విషయాన్ని ఆమెగారి ముందు ప్రస్తావించాను; ఉదయం పూట ఇహ్రామ్ ధరించిన తరువాత కూడా సెంటు పరిమళం నా శరీరం నుంచి వెలువ డటాన్ని నేను ఇష్టపడను.[1] అప్పుడు హజ్రత్ ఆయెషా (రజిఅన్హ) ఇలా అన్నారు; "నేను ప్రవక్త మహనీయులకు (స)సెంటు రాశాను. తరువాత ఆయన (స) గారు తమ భార్యలందరి వద్దకూ వెళ్లి వచ్చారు. ఆ తరువాత ఉదయం సమయంలో ఇహ్రామ్ ధరించారు.[2]"**

**271. హజ్రత్ ఆయెషా (రజిఅన్హ) ఇలా ఉల్లేఖించారు: నేను ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారి పాపటలో సుగంధం మెరుస్తూ ఉండటాన్ని చూశాను. అప్పుడు ఆయన (స) ఇహ్రామ్ ధరించి ఉన్నారు.[1]**

---

270-1. ఒక మనిషి ఇహ్రామ్ ధారణకు ముందు తన శరీరానికి రాసుకున్న సెంటు వాసన ప్రభావం ఇహ్రామ్ ధరించిన తరువాత కూడా మిగిలి ఉండటాన్ని అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) బహుశా అవాంఛనీయమైనదిగా భావించి ఉండవచ్చు.

270-2. అధ్యాయంలోని భావం ఈ హదీసు ద్వారా ఈ విధంగా వ్యక్తమవుతుంది: ప్రవక్త మహనీయులు (స) తమ భార్యలందరి వద్దకు పోయి వారితో సంభోగించి వచ్చిన తరువాత, ఆయన (స) గారు తప్పకుండా గుసుల్ చేసుకుని ఉంటారు. కనుక సుగంధ ద్రవ్యం రాసిన తరువాతనే గుసుల్ చేసుకున్నారు. ఇంకా ఆ వాసన ప్రభావం ఆయన (స) గారి శరీరం మీద మిగిలి ఉన్నదన్న విషయం స్పష్టంగా ఉంది. లేకపోతే ఇబ్నె ఉమర్ (ర) గారి వివరణ ఎందుకు రద్దు అవుతుంది. ఇదే అధ్యాయం యొక్క ప్రధానోద్దేశ్యం. హాఫిజ్ ఇబ్నె హజర్ గారు ఏమన్నారంటే; హదీసు ద్వారా తేటతెల్లమయ్యే విషయం ఏమిటంటే, స్త్రీ, పురుషులు ఉభయులూ సంభోగానికి ముందు, ఇహ్రామ్ ధారణకు ముందు సెంటు రాసుకోవచ్చు. ఇది పూర్తిగా దైవప్రవక్త (స) గారి సంప్రదాయానికి అనుగుణంగా ఉన్న విషయమే.

271-1. హాఫిజ్ ఇలా అన్నారు; అధ్యాయం యొక్క భావం ఈ హదీసు ద్వారా ఇలా స్పష్టమవుతుంది: పైన వచ్చిన హదీసు మాదిరిగానే ఈ హదీసు కూడా ఎంతో సమగ్ర మైనది. రెంటిలోని విషయం కూడా ఒకటే. ఈ రెండు హదీసులలోని భావం అధ్యా యంలో ఉన్న విషయాన్ని సమర్థిస్తోంది. లేదా ఈ విధంగా వ్యక్తమవుతుంది: ప్రవక్త మహనీయులు (స) ఇహ్రామ్‌కు సంబంధించిన గుసుల్‌ను తప్పకుండా చేసుకుని ఉంటారు. కనుక సెంటు రాసుకున్న తరువాత గుసుల్ చేసుకోవటం అనే విషయం నిరూపితమైపోయింది.

## 15వ అధ్యాయం

**వెంట్రుకల్లోకి తడిసిన చేతి వ్రేళ్లను దూర్చి గీకటం లేక రుద్దటం.[1] వెంట్రుకల్లోపల ఉన్నటువంటి శరీరం తడిసిందనే నమ్మకం కుదిరిన తరువాత వాటిమీద నీళ్లను పోసుకోవటం.**

**272.** తన తండ్రిగారు ఇలా చెప్పారని హిషామ్ బిన్ ఉర్వా ఉల్లేఖించారు: హజ్రత్ ఆయెషా (రజిఅన్హ) ఇలా సెలవిచ్చారు: "ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) జనాబత్‌కు సంబంధించిన గుసుల్ చేసుకునేటప్పుడు, ముందుగా తమ చేతుల్ని శుభ్రంగా కడుక్కునేవారు. తరువాత నమాజ్ కొరకు వుజూ చేసుకున్నట్లే వుజూ చేసేవారు. తరువాత గుసుల్ చేసుకోవటాన్ని ప్రారంభించినప్పుడు తమ చేతులను వెంట్రుకల్లోనికి దూర్చి గీకుతారు. లేదా రుద్దుతారు (ఆయన (స) గారి తల వెంట్రుకలు చాలా ఒత్తుగా ఉండేవి) వెంట్రుకల్లోపలి శరీర భాగం తడిసిపోయిందనే నమ్మకం కుదిరినప్పుడు మూడుసార్లు వెంట్రుకల మీద నీళ్లు పోసుకునేవారు. తరువాత మిగిలిపోయిన తమ మొత్తం శరీర భాగాన్ని నీళ్లతో కడుక్కుంటారు. హజ్రత్ ఆయెషా (ర) ఇంకా ఇలా అన్నారు; "నేనూ మరియు ప్రవక్త మహనీయులు (స) ఉభయులము కలిసి ఒకే నీటి పాత్రలో నుంచి స్నానం చేసేవారము. ఆ పాత్రలో నుంచే ఇద్దరమూ దోసిళ్లతో నీళ్లు తీసుకునే వారము."

## 16వ అధ్యాయం

**జనాబత్ స్థితిలో వుజూ చేసుకున్న తరువాత, మిగిలిన శరీరాన్ని కడుక్కున్న తరువాత, ఇదివరకే వుజూ చేసుకున్న భాగాలను మళ్లీ రెండోసారి కడుక్కోకుండా ఉండటం.**

**273.** హజ్రత్ మైమూన (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్)గారి స్నానం కోసం నీళ్లు తోడినప్పుడు, ఆయన (స) మొదట తమ కుడి చేత్తో తమ ఎడమ చేతి మీద రెండుసార్లో లేక మూడుసార్లో నీళ్ళు పోసుకున్నారు. తరువాత ఆయన (స) తమ మర్మాంగాన్ని కడిగి శుభ్రపరచు

---

15-1. అంటే జనాబత్‌కు సంబంధించిన గుసుల్ చేసుకునేటప్పుడు చేతి వ్రేళ్లను నీటిలో తడిపి వెంట్రుకల్లోపలకు దూర్చి గీకాలి. లేక రుద్దాలి. తల లేదా గడ్డంలోపల ఉన్నటువంటి చర్మం తడిసిందనే భావన కలిగిన తరువాతనే వెంట్రుకల మీద నీళ్లను ప్రవహింప జేయాలి. గీకటం అనే ఈ ప్రక్రియ ఇమామ్ మాలిక్ (రహ్మలై) దృష్టిలో ధర్మశాస్త్రం ప్రకారం 'వాజిబ్', ఇతరుల దృష్టిలో 'సున్నత్'.

కున్నారు. ఆ తరువాత తమ చేతిని నేల మీద పెట్టి లేదా గోడ మీద పెట్టి రెండు పర్యాయాలో లేక మూడు పర్యాయాలో రుద్దారు. ఆపైన పుక్కిలించి ఊశారు. ఇంకా ముక్కులోకి నీళ్ళు ఎక్కించారు. ఇంకా ముఖాన్ని కడుక్కున్నారు. తరువాత తమ రెండు చేతుల్ని కడుక్కున్నారు. ఆ తరువాత తమ తల మీద నీళ్లు ప్రవహింపజేశారు. ఆ పైన తమ శరీరాన్ని కడుక్కున్నారు. తరువాత ఒక వైపునకు జరిగి తమ రెండు పాదాలను నీళ్లతో కడుక్కున్నారు. విశ్వాసుల తల్లి అయిన మైమూన (రజిఅన్హా) ఇలా అన్నారు: ఆ తరువాత నేను ఒక వస్త్రాన్ని తీసుకువచ్చాను. ఆయన (స) గారు ఆ వస్త్రాన్ని తీసుకోవటానికి ఇష్టపడలేదు. తమ చేతులతో, తమ శరీరం మీద ఉన్నటువంటి నీటి చుక్కలను తుడుచుకున్నారు.

## 17వ అధ్యాయం

**ఒక వ్యక్తి ఎవరైనా మసీదుల్లో ఉన్నప్పుడు, తాను గుసుల్ చేసుకో వలసిన అవసరం ఉన్నదనే విషయం అతనికి జ్ఞాపకం వచ్చినట్లయితే అప్పుడు అతను మసీదులో నుంచి అదే స్థితిలో వెంటనే వెళ్లిపోవాలి; తయమ్ముమ్ చేసుకోకూడదు.**

**274.** అబూ హురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఒకసారి నమాజుకు సంబంధించిన తక్బీర్ (అల్లాహు అక్బర్) అయిపోయింది, నమాజీల శ్రేణులు సమానంగా క్రమబద్ధం చేయబడ్డాయి, ప్రజలు నిలబడ్డారు. ఇంతలోనే ప్రవక్త మహనీయులు (సఅసమ్) తమ గదిలో నుంచి విచ్చేశారు. నమాజు చేయించే స్థలంలో నిలబడినప్పుడు తాను గుసుల్ చేసుకొనే అవసరం ఉన్నదనే విషయం ఆయన (స) గారికి జ్ఞాపకం వచ్చింది. అప్పుడు ఆయన (స) మాతో, "మీరు ఇక్కణ్ణే ఆగి ఉండండి" అని చెప్పి వెళ్ళిపోయారు. గుసుల్ చేసుకున్న తరువాత మళ్లీ ఆయన మా వద్దకు వచ్చారు. అప్పుడు ఆయన (స) తలలో నుంచి నీటి చుక్కలు రాలుతున్నాయి. ఆయన (స) గారు "అల్లాహు అక్బర్" అని పలికి నమాజును ప్రారంభించారు. మేము కూడా ఆయన (స) గారితోపాటు నమాజు చేశాము.

## 18వ అధ్యాయం

**జనాబత్‌కు సంబంధించిన గుసుల్ చేసుకున్న తరువాత రెండు చేతులతో శరీరం మీద ఉన్నటువంటి నీటి చుక్కలను తుడుచుకోవటం.**

**275.** హజ్రత్ మైమూన (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: నేను ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారు గుసుల్ చేసుకోవటానికి నీళ్లు తోడిపెట్టాను. ఒక వస్త్రాన్ని ఆయన (స) గారికి అడ్డంగా తెరమాదిరిగా కట్టాను.

ఆయన(స) గారు తమ రెండు చేతుల మీద నీళ్లు పోసుకుని వాటిని పరిశుభ్రపరచుకున్నారు. తరువాత తమ కుడిచేత్తో ఎడమచేతి మీద నీళ్లు పోసుకున్నారు. తమ మర్మాంగాన్ని కడిగి పరిశుభ్రపరచుకున్నారు. తరువాత తమ చేతిని నేలమీద పెట్టి రుద్దారు. ఆ తరువాత దానిని కడిగారు, పుక్కిలించి ఊశారు. ఇంకా ముక్కులోకి నీళ్లు ఎక్కించారు. తరువాత తమ ముఖాన్ని నీళ్ళతో కడుక్కున్నారు. ఇంకా మోచేతుల వరకు తమ రెండు చేతుల్ని కడుక్కున్నారు. తరువాత తమ శిరస్సుమీద నీళ్లు పోసుకున్నారు. ఆ తరువాత తమ శరీరం మీద నీళ్లు ప్రవహింపజేశారు. ఆపైన ఒక వైపునకు జరిగి తమ రెండు పాదాలను కడుక్కున్నారు. శరీరాన్ని తుడుచుకోవటానికి ఆయన(స) గారికి నేను ఒక వస్త్రాన్ని ఇవ్వబోయాను. కాని ఆయన (స) దానిని తీసుకోలేదు. ఆయన (స) గారు (తమ శరీరాన్ని) రెండు చేతులతో తుడుచుకుంటూ వెళ్లిపోయారు.

## 19వ అధ్యాయం

### గుసుల్‌ను శిరస్సు యొక్క కుడి భాగం నుంచి ప్రారంభించటం.

**276.** హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు: మాలో ఎవరికైనా గుసుల్ చేసుకునే అవసరం కలిగినప్పుడు మొదట రెండు చేతులతో మూడు దోసిళ్ళ నీళ్లు తీసుకుని శిరస్సుమీద పోసుకుంటాము. తరువాత చేత్తో నీళ్ళు తీసుకుని శరీరం యొక్క కుడి భాగం మీద పోసుకుంటాము. ఇంకా రెండో చేత్తో నీళ్లు తీసుకుని శరీరం యొక్క ఎడమ భాగం మీద పోసుకుంటాము.

## 20వ అధ్యాయం

**ఒంటరిగా ఉన్న స్థితిలో దిగంబరులై స్నానం చెయ్యటం ధర్మసమ్మతమే. కాని ఎవరైనా ఆచ్ఛాదనం చేసుకుని అంటే వస్త్రాన్ని కట్టుకుని స్నానం చేస్తే అది ఉత్తమమైనది.[1] బహ్‌జు బిన్ హకీమ్ తన తండ్రిగారు చెప్పారనీ, ఆయన ముఆవియా బిన్ హైదా (రజిఅన్) చెప్పారనీ, ఆయన ప్రవక్త మహనీయులు ఇలా సెలవిచ్చారని ఉల్లేఖించారు: సిగ్గుపడటానికి ప్రజలకంటే అల్లాహ్ ఎక్కువ హక్కుదారుడు.[2]**

---

20-1. ఒంటరిగా ఉన్న స్థితిలో కూడా నగ్నంగా స్నానం చెయ్యటం ధర్మసమ్మతమైన విషయం కాదు అని ఇబ్నె అబీ లయ్‌లా విశ్లేషించారు. ఇమామ్ బుఖారీ (రహ్మాలై) దానిని కొట్టిపారేశారు; వస్త్రం కట్టుకొని స్నానం చెయ్యటం అభిలషణీయమైన, శ్రేష్ఠమైన విషయం అనే దానిలో ఏ మాత్రం సందేహం లేదు.

**277.** **ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అబూహురైరా (రజిఅన్) ఉల్లేఖించారు: ఇస్రాయీల్ సంతతికి చెందిన ప్రజలు దిగంబరులై స్నానం చేసేవారు. ఆ స్థితిలో ఒకరినొకరు చూసుకుంటూ ఉండేవారు.[1] కాని ప్రవక్త మూసా (అ) గారు ఒంటరిగా ఇతరుల నుంచి వేరై (నగ్నంగా) స్నానం చేసేవారు[2] (అది ఆయనగారి అలవాటు). ఇస్రాయీల్ సంతతి ప్రజలు ఇలా అనసాగారు; అల్లాహ్ సాక్షిగా! మూసా(అ) మాతో కలిసి స్నానం చెయ్యకపోవటానికి కారణం ఏమిటంటే; అతని వృషణాలు పెద్దవై పోయాయి.[3] ఒకసారి ఏమి జరిగిందంటే; మూసా (అ) తన బట్టలను ఒక రాయి మీద పెట్టి స్నానం చేస్తున్నారు. అల్లాహ్ ఆజ్ఞ ప్రకారం ఆ రాయి అతని వస్త్రాలు తీసుకుని పారిపోయింది.**

**అప్పుడు మూసా (అ) "ఓ రాయీ! నా వస్త్రాలు నాకు ఇవ్వు" "ఓ రాయీ! నా బట్టలు నాకు ఇవ్వు'[4] అంటూ దానివెంట పరుగెత్తసాగారు; చివరకు ఇస్రాయీల్**

---

20–2. దీనిని ఇమామ్ అహ్మద్ మొదలైన 'అస్హాబె 'సునన్' ప్రముఖులు విశ్లేషించారు; ఇది చాలా మంచి విషయం అని తిర్మిజీ (రహ్మాలై) గారు అన్నారు; ఇంకా హాకిమ్ గారు, 'ఇది వాస్తవం' అని అన్నారు. మొత్తం హదీసు ఇలా ఉంది; నేను ఇలా విన్నవించుకున్నాను; "ఓ దైవప్రవక్తా! మేము ఏ మర్మాంగాలను వినియోగించుకోవచ్చు? వేటిని విడిచిపెట్టాలి?" అప్పుడు ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు: "మీ భార్యలూ, మీ బానిస స్త్రీలూ తప్ప ఇతర స్త్రీల నుంచి మీరు మీ మర్మాంగాలను కాపాడుకోండి." నేను దైవప్రవక్త (స)ను ఇంకా ఇలా అడిగాను; 'ఓ ప్రవక్తా! మేము ఎవరిమైనా ఏకాంతంగా ఉన్నప్పుడో?' దానికి సమాధానంగా దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: "ప్రజలకంటే అల్లాహ్ సిగ్గుపడటానికి ఎక్కువ హక్కుదారుడు".

277–1. బహుశా ఇది వారి షరీయతులో ధర్మసమ్మతమై ఉండి ఉంటుంది. లేకపోతే ప్రవక్త మూసా (అ) తప్పకుండా వారిని అలా చెయ్యవద్దని ఆపి ఉండేవారు. కాని కొందరు ఏమన్నారంటే అది ధర్మసమ్మతమైన విషయం కానేకాదు. ప్రవక్త మూసా (అ) అలా చెయ్యవద్దని వారిని వారిస్తూ ఉండేవారు. కాని వారు మాత్రం వినేవారు కాదు.

277–2. ఇక్కణ్ణుంచే అధ్యాయం యొక్క ఉద్దేశ్యం ప్రస్ఫుటమవుతుంది. ఎందుకంటే దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్), హ్జ్రత్ మూసా (అ), హ్జ్రత్ అయ్యూబ్ (అ) గార్ల ఆచరణనే అనుసరించారు. కనుకనే ఆయన (స) ఈ ప్రక్రియ పట్ల అభ్యంతరాన్ని వ్యక్తం చెయ్యలేదు.

277–3. తనలో ఉన్నటువంటి లోపం బహిర్గతమవుతుందేమో అనే సిగ్గు వల్ల, భయం వల్లనే ఆయన మాతోపాటు స్నానం చేయటం లేదేమో!

**సంతతి ప్రజలు హజ్రత్ మూసా (అ) ప్రవక్తను నగ్న స్థితిలో చూశారు. ఇంకా ఇలా అనసాగారు; (మేము అపార్థం చేసుకున్నాము) దేవుని సాక్షిగా! మూసా (అ) కు ఏ వ్యాధీ లేదు[5] (రాయి ఆగిపోయింది). అప్పుడు మూసా (అ) తన వస్త్రాలను తీసుకుని, ఆ రాయిని కొట్టసాగారు. అబూ హురైరా (ర) ఇలా వివరించారు; దేవుని సాక్షిగా! ప్రవక్త మూసా (అ) కొట్టిన దెబ్బలకు ఆ రాతి మీద ఆరో లేక ఏడో గుర్తులు పడ్డాయి.[6] ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారని అబూ హురైరా (ర) ఉల్లేఖించారు: ఒకసారి ప్రవక్త అయ్యూబ్ (అ) దిగంబరులై స్నానం చేస్తున్నారు.[7] అప్పుడు బంగారు మిడుతలు ఆయన (అ) మీద వాలసాగాయి. ఆయన(అ) వాటిని పట్టుకుని తన వస్త్రంలో మూటకట్టుకోసాగారు. అప్పుడు ఆయన(అ) ప్రభువు అల్లాహ్, ఆయన్ని ఉద్దేశించి ఇలా అన్నాడు;[8] నీవు చూసే ఈ స్వర్ణ శలభాల అవసరం నీకు లేకుండా నేను చెయ్యలేదా?[9] అప్పుడు ప్రవక్త అయ్యూబ్ (అ) ఇలా అన్నారు; నిస్సందేహంగా నీ గౌరవం సాక్షిగా! నీవు నాకు చాలా ఇచ్చావు. అయితే నేను నీ కారుణ్యాన్ని ఎలా ఉపేక్షించగలను?[10]**

---

277-4. బుద్ధిమంతులూ, తెలివిగలవారూ ఎలా పనిచేస్తారో ఆ రాయి కూడా అలానే చేసింది. అప్పుడు హజ్రత్ మూసా (అ) కూడా బుద్ధిమంతుల్ని ఎలా పిలుస్తారో అలా కేకవేసి పిలిచారు.

277-5. బహుశా మూసా (అ) గారి షరీయతులో (ధర్మ శాస్త్రంలో) శరీరంలోని రహస్య భాగాల మీద అంటే మర్మాంగాల మీద ఆచ్ఛాదనం వాజిబ్ కాదేమో. ఇది ఒక ప్రత్యేకమైన పరిస్థితి; అత్యవసరమైన పరిస్థితి ఉత్పన్నమైనప్పుడు లేక ఒక అపనిందను ఖండించటానికి మర్మాంగాల మీద ఉన్న ఆచ్ఛాదనం తొలగించటం సక్రమమైన విషయమే.

277-6. ఇది ప్రవక్త మూసా(అ) గారి రెండో మహిమ; రాయి ఆయన గారి వస్త్రాలను తీసుకుని పరుగెత్తటం మొదటి మహిమ.

277-7. ఇదే అధ్యాయం యొక్క ముఖ్యాంశం, దాని శీర్షిక.

277-8. తెలిసిన విషయం ఏమిటంటే, అల్లాహ్ శబ్దం లేక పిలవటం అనేది ఉన్నది. ఎన్నో ఖురాను వాక్యాల ద్వారా, ఎన్నో హదీసుల ద్వారా ఈ విషయం నిరూపితమైంది.

277-9. అంటే నేను నీకు ఎంతో సంపదను, ఎన్నో సిరులను ఇచ్చాను గదా! అయినా నీకు ఈ బంగారు మిడతలు ఎందుకు అవసరమయ్యాయి? అన్నది ఈ పలుకులోని ఉద్దేశం.

# 21వ అధ్యాయం

## ప్రజల ముందు స్నానం చెయ్యటం తటస్థపడితే (సతర్ భాగాన్ని ఒక వస్త్రంతో కప్పి స్నానం చెయ్యాలి)

**278. ఉమ్మె హాని బిన్తె అబీ తాలిబ్ (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: నేను ఒకసారి ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) గారి వద్దకు వెళ్లాను. ఆ సంవత్సరం మక్కాను జయించటం జరిగింది. నేను ఆయన (స) గారు స్నానం చేస్తూ ఉన్నట్లుగా గమనించాను. హజ్రత్ ఫాతిమా (ర) దైవప్రవక్తకు అడ్డంగా ఒక తెరను పట్టుకుని నిలబడి ఉన్నారు. ఆ స్త్రీ ఎవరు? అని దైవప్రవక్త ప్రశ్నించారు. అప్పుడు 'నేను ఉమ్మెహాని'ని అని సమాధానం పలికాను.[1]**

**279. విశ్వాసుల తల్లి అయిన మైమూన (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: నేను ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్)కు అడ్డంగా ఒక తెర కట్టాను; అప్పుడు ఆయన జనాబత్కు సంబంధించిన స్నానం చేస్తూ ఉన్నారు. మొదట ఆయన (స) నీళ్ళు తీసుకుని తన ఎడమ చేతిలో పోసుకున్నారు, తన మర్మాంగాన్ని పరిశుభ్ర పరచుకున్నారు. ఇంకా ఏదైతే తగిలిందో దానిని కడిగి పారేశారు. తరువాత తన చేతిని గోడమీద పెట్టి రుద్దారు. లేదా నేల మీద పెట్టి రుద్దారు. ఆ తరువాత నమాజు కోసం చేసుకునే వుజూ లాంటి వుజూనే చేసుకున్నారు. కేవలం తన కాళ్లను మాత్రమే ఆయన (స) కడుక్కోలేదు. ఆ తరువాత మొత్తం శరీరం మీద నీళ్ళు పోసుకున్నారు. ఆ పైన ఒక వైపునకు జరిగిన తన రెండు కాళ్ళను కడుక్కున్నారు.**

---

277-10. సుబ్హానల్లాహ్! (అల్లాహ్ ఎంతో పరిశుద్ధుడు) ఎంత చక్కని, ఎంత సముచితమైన సమాధానం! అంటే భక్తుడు, దాసుడు ఎంత పెద్ద ఐశ్వర్యవంతుడైనా తన ప్రభువు అవసరం లేకుండా ఉండగలడా? తన ప్రభువు దయాదాక్షిణ్యాలు లేకుండా మనగలడా? అసంభవం. ఉండలేడు. అక్కరలేనితనం, అన్నింటికి అతీతమైన గుణం, లెక్కచెయ్యకపోవటం - ఇవన్నీ ప్రభువు వైభవానికీ, ఆయన గొప్పతనానికీ చెందిన విషయాలు. కాని మనమందరమూ ఆయన ఆధారం లేకుండా ఉండలేము. ఆయనే మన దిక్కు.

278-1. బహుశా అడ్డంగా కట్టిన తెర మందంగా ఉండి ఉంటుంది. అందులో నుంచి బయట ఉన్న వారి ముఖం స్పష్టంగా కనిపించి ఉండకపోవచ్చు. లేకపోతే ప్రవక్త మహనీయులు (స) ఉమ్మెహానీని తప్పకుండా గుర్తుపట్టి ఉండేవారు. కాని వచ్చింది మాత్రం ఒక స్త్రీయే అనే విషయం ఆయన (స) గారికి తెలిసిపోయింది. ఎందుకంటే పురుషుడు అనుమతి లేకుండా ఇంట్లోకి ప్రవేశించలేడు కదా!

## 22వ అధ్యాయం
## స్త్రీకి వీర్యస్ఖలనం అయితే...

**280.** విశ్వాసుల తల్లి ఉమ్మె సలమా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: అబూ తల్హా అన్సారీ(ర)గారి భార్య, అనస్ (ర)గారి తల్లి అయినటువంటి ఉమ్మె సులైమ్ (ర.అన్హా) ఒకసారి ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) వద్దకు వచ్చారు. ఆయన్ని(స) ఉద్దేశించి ఇలా అన్నారు; "ఓ దైవప్రవక్తా! సత్య విషయాన్ని తెలియజేసే విషయంలో అల్లాహ్ సిగ్గుపడడు. ఒకవేళ స్త్రీకి వీర్యస్ఖలనం జరిగితే అప్పుడు ఆమె తప్పనిసరిగా గుసుల్ చెయ్యవలసిందేనా?" ఆయన (స) ఇలా సెలవిచ్చారు: 'అవును, గుసుల్ చేసుకోవాలి. ఆమె మేల్కొన్న తరువాత వీర్యాన్ని చూస్తే;[1] (అప్పుడు ఆమె తప్పనిసరిగా గుసుల్ చేసుకోవాలి).

## 23వ అధ్యాయం
## 'జునుబ్' అంటే గుసుల్ చెయ్యవలసిన అవసరం ఉన్న వ్యక్తి. అతనికి పట్టే చెమటను గురించి, ఇంకా ఒక ముస్లిమ్ అశుద్ధుడు కాడు అనే విషయం గురించి.

**281.** అబూహురైరా (రజిఅన్) ఇలా కథనం చేశారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) మదీనా పట్టణంలోని ఒక వీధిలో ఒకసారి నన్ను కలవటం జరిగింది. అప్పుడు నాకు గుసుల్ చేసుకునే అవసరం ఉంది. కనుక నేను ఆయన (స) వెనుక నుంచి వాపసు వెళ్లిపోయాను. గుసుల్ చేసుకున్న తరువాత మళ్లీ వచ్చి ఆయన్ని (స) కలుసుకున్నాను. అప్పుడు ఆయన (స) ఇలా సెలవిచ్చారు; అబూ హురైరా (ర) నీవు ఎక్కడికెళ్లావు? అప్పుడు నేను ఇలా విన్నవించుకున్నాను; "నాకు స్నానం చేసే అవసరం ఉండినది. కనుక స్నానం చెయ్యకుండా, పరిశుద్ధుడను కాకుండా మీతో కూర్చోవటానికి నేను ఇష్టపడలేదు." ఆయన (స) ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ ఇలా సెలవిచ్చారు; "సుబ్హానల్లాహ్! (అల్లాహ్ పరిశుద్ధుడు) విశ్వాసి కూడా ఎప్పుడైనా అశుద్ధుడు అవుతాడా?"

---

280-1. ఈ హదీసు ద్వారా తెలిసే విషయమేమిటంటే, స్త్రీకి కూడా వీర్యస్ఖలనం అవుతుంది. కొంతమంది, స్త్రీలందరికీ వీర్యస్ఖలనం జరగదు కాని కొంతమందికి మాత్రమే అలా అవుతుంది అని అన్నారు. అసలు విషయం ఏమిటంటే, వీర్యస్ఖలనం విషయంలో పురుషుడికి ఉన్నటువంటి నిబంధనలే, ఆజ్ఞలే స్త్రీకి కూడా ఉన్నాయి. ఒకవేళ స్త్రీ మేల్కొన్న తరువాత వీర్యానికి సంబంధించిన తడిని శరీరం మీదకాని, వస్త్రాల మీద కాని చూసినట్లయితే అప్పుడు ఆమె తప్పనిసరిగా గుసుల్ చేయాలి. లేకపోతే గుసుల్ చేసుకునే అవసరం లేదు.

## 24వ అధ్యాయం

**జనాబత్‌కు సంబంధించిన గుసుల్ చేసుకోవలసి ఉన్న వ్యక్తి (జునుబ్) ఇంటి నుంచి బయటకు వెళ్ళగలడు. వీధులలోనూ, రోడ్ల మీదా తిరుగగలడు. అతా ఇలా అన్నారు; అశుద్ధావస్థలో ఉన్న వ్యక్తి 'హిజామా' చేయించుకోగలడు. తన గోళ్లను కత్తిరించుకోగలడు, శిరోముండనం చేయించుకోగలడు - ఇవన్నీ వుజూ లేకుండానే చెయ్యగలడు.**

**282.** హ్రజత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) గారి కథనం ఇలా ఉంది: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) తమ భార్యలందరి వద్దకు ఒకే రాత్రి వెళ్లి వచ్చేవారు. (ఆయన (స) వారందరితోనూ సంభోగించేవారు) అప్పుడు ఆయన (స) గారికి తొమ్మిది మంది భార్యలు ఉండేవారు.[1]

**283.** హ్రజత్ అబూహురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఒకసారి నన్ను మార్గంలో కలిశారు. అప్పుడు నేను ఇంకా గుసుల్ చేసుకోలేదు. ఆయన (స) నా చెయ్యి పట్టుకున్నారు; నేను ఆయన (స) వెంట నడవసాగాను. ఆయన (స) ఒకచోట కూర్చున్నారు. అప్పుడు నేను మెల్లగా అక్కడ నుంచి జారుకున్నాను. తరువాత ఇంటికి పోయి గుసుల్ చేసుకుని తిరిగి వచ్చాను. ఆయన (స) గారు ఇంకా అక్కడనే కూర్చుని ఉన్నారు. నన్ను చూసి ఆయన (స) ఇలా సెలవిచ్చారు. "ఓ అబూ హురైరా (ర)! నువ్వు ఇంతసేపు ఎక్కడున్నావు?" నేను ఆయన (స)కు వివరించాను.[1] ఆయన (స) ఇలా సెలవిచ్చారు. సుబ్‌హానల్లాహ్! (అల్లాహ్ అత్యంత పరిశుద్ధుడు) విశ్వాసి ఎప్పుడైనా అశుద్ధుడు కాగలడా?

---

282. 1. కనుక ఒక జునుబ్ (గుసుల్ అవసరం ఉన్న వ్యక్తి) తన ఇంటి నుంచి బయటకు వెళ్లగలడు అనే విషయం ఈ హదీసు ద్వారా నిరూపితమైంది. ఎందుకంటే ప్రవక్త మహనీయులు (స) ఒక భార్యతో సంభోగించిన తరువాత రెండో భార్య వద్దకు వెళ్ళేవారు. అధ్యాయంలోని ముఖ్యాంశం కూడా ఇదే.

283-1. అంటే నేను ఆయన (స) గారికి ఈ విషయాలను తెలిపాను; అప్పుడు నేను ఇంకా గుసుల్ చేసుకోని స్థితిలో ఉన్నాను, గుసుల్ కోసం వెళ్ళాను. ఇప్పుడు గుసుల్ చేసుకొని తిరిగి వచ్చాను.

## 25వ అధ్యాయం

**జనాబత్ స్థితిలో ఉన్నటువంటి ఒక మనిషి (లైంగికపరమైన అశుద్ధత కల వ్యక్తి) ఇంట్లో ఉండగలడు. కాని అతను గుసుల్‌కు ముందు వుజూ చేసుకుని వుండాలి.[1]**

**284.** అబూ సలమా (రజిఅన్)గారి ఉల్లేఖనం ఇలా ఉంది : నేను హజ్రత్ ఆయెషా (రజిఅన్)ను, ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) జనాబత్ స్థితిలో ఉన్నప్పుడు నిద్రపోయేవారా? అని అడిగాను. దానికి సమాధానంగా ఆమె (ర) గారు, "అవును, నిద్రపోయేవారు. కాని వుజూ చేసుకునేవారు" అని అన్నారు.

## 26వ అధ్యాయం

**ఒక జునుబ్ గుసుల్‌కు ముందు నిదురపోవచ్చు.**

**285.** హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: నేను ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్)ను ఇలా అడిగాను, జనాబత్ స్థితిలో ఉన్నటువంటి మాలోని వ్యక్తి ఎవరైనా నిదురపోవచ్చా? ఆయన (స) గారు దానికి సమాధానంగా "అవును, వుజూ చేసుకుంటే, జనాబత్ స్థితిలో ఉన్నటువంటి ఒక మనిషి నిదురపోవచ్చు."[1] అని సెలవిచ్చారు.

## 27వ అధ్యాయం

**జునుబ్ అయిన ఒక వ్యక్తి వుజూ చేసుకున్న తరువాతనే నిద్రకు ఉపక్రమించాలి.**

**286.** హజ్రత్ ఆయెషా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) జనాబత్ స్థితిలో ఉండి నిదురపోదలచుకున్నప్పుడు తన

---

25-1. ఒక హదీసులో ఇలా ఉంది; ఏ ఇంట్లోనయినా ఒక కుక్క గానీ, ఒక విగ్రహంగానీ లేదా ఒక 'జునుబ్'గానీ ఉన్నట్లయితే, ఆ ఇంట్లో దైవదూతలు అవతరించరు. ఇమామ్ బుఖారీ (ర.హ్మలై) గారు ఈ అధ్యాయాన్ని తీసుకువచ్చి తెలియజేసిన విషయం ఏమిటంటే; ఈ హదీసు బలహీనమైన హదీసు, లేదా ఈ హదీసులో జునుబ్ అంటే భావం వుజూ కూడా చెయ్యనటువంటి లైంగిక అశుద్ధుడు, ఇంకా జనాబత్ విషయంలో అశ్రద్ధ వహించేవాడు. ఇంకా ఇంట్లో ఊరికే పనీ పాటా లేకుండా పడి ఉండేవాడు.

285-1. వుజూ చేసుకోవడం అనేది చాలామంది విద్వాంసుల దృష్టిలో ముస్తహబైన (అభిలషణీయమైన) విషయం; కొందరి దృష్టిలో అది వాజిబైన విషయం; మరికొందరు ఇక్కడ వుజూ అంటే మర్మాంగాన్ని పరిశుభ్రపరచుకోవటం, చేతిని కూడా కడుక్కోవటం అని భావం అని విశ్లేషించారు. కాని ముస్లిమ్ గారి ఉల్లేఖనంలో ఈ విశ్లేషణ లేదు. రద్దు చేయబడింది. ఇందులో నమాజు కోసం చేసుకునే వుజూ లాంటి వుజూను చేసుకోవాలి అని స్పష్టంగా ఉంది.

**మర్మాంగాన్ని నీళ్లతో పరిశుభ్రంగా కడుక్కునేవారు. ఇంకా నమాజు కోసం చేసుకునే వుజూ లాంటి వుజూనే చేసుకునేవారు.[1]**

**287. అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) గారి ఉల్లేఖనం ఇలా ఉంది: దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్)ను హజ్రత్ ఉమర్ (రజిఅన్) ఇలా అడిగారు; "ఓ ప్రవక్తా (స)! మాలో ఎవరైనా జనాబత్ స్థితిలో ఉన్నప్పుడు నిదురపోవచ్చా?" దానికి సమాధానంగా ఆయన(స) ఇలా సెలవిచ్చారు: "వుజూ చేసుకుని నిదుర పోవచ్చు."**

**288. అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహనీయులను (స) హజ్రత్ ఉమర్ (ర) ఇలా అడిగారు; నాకు రాత్రి పూట జనాబత్ స్థితి కలుగుతుంది; (ఆ సమయంలో నేను గుసుల్ చేసుకోలేను. అప్పుడు నేనేమి చెయ్యాలి?) దానికి సమాధానంగా ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు: "అప్పుడు నీవు వుజూ చేసుకో. ఇంకా నీ మర్మాంగాన్ని నీళ్లతో పరిశుభ్రపరచుకో. తరువాత నిదురపో."[1]**

## 28వ అధ్యాయం

### స్త్రీ పురుష మర్మాంగాలు రెండూ ఒక దానిని మరొకటి స్పృశించినప్పుడు లేదా ఒకదానితో ఒకటి కలిసినప్పుడు[1] (గుసుల్ అనివార్యమైపోతుంది).

**289. హిషామ్ ఈ క్రింది హదీసులో ఉన్న విషయాన్నే ఉల్లేఖించారు.**

**290. ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అబూహురైరా (రజిఅన్) ఉల్లేఖించారు: "పురుషుడు గనక స్త్రీ యొక్క నాలుగు మూలల మధ్య కూర్చుండి[1] ఆ తరువాత ఆమెతో సంభోగించినట్లయితే అప్పుడు గుసుల్ వాజిబైపోతుంది.**

---

286–1. ఈ వుజూతో ఆయన (స) గారు నమాజు చేస్తారని దీని భావం ఎంత మాత్రం కాదు. ఎందుకంటే జనాబత్ స్థితిలో ఉన్నప్పుడు గుసుల్ చేసుకోకుండా నమాజు చెయ్యకూడదు.

288–1. అంటే మొదట మర్మాంగాన్ని నీళ్లతో పరిశుభ్రంగా కడుక్కో, తరువాత వుజూ చేసుకో. ఈ విషయం ఇబ్నె నూహ్ గారి ఉల్లేఖనంలో ఉన్నది.

28–1. అంటే పురుషాంగం స్త్రీ అంగంలోనికి ప్రవేశించినపుడు. భావం ఏమిటంటే, అంగప్రవేశం జరిగినప్పుడు. చాలా మంది ఇస్లామ్ ధర్మశాస్త్రవేత్తలు ఏమన్నారంటే అంగప్రవేశం జరిగినప్పుడు వెంటనే 'గుసుల్' వాజిబైపోతుంది; వీర్యస్ఖలనం జరిగినా, జరగకపోయినా."

## 29వ అధ్యాయం

## స్త్రీ మర్మాంగం నుంచి వెలువడే తడి గనక తగిలినట్లయితే, దానిని కడిగి వెయ్యటం.[1]

**291.** జైద్ బిన్ ఖాలిద్ జుహన్నీ గారి ఉల్లేఖనం ఇలా ఉంది: ఈయన హజ్రత్ ఉస్మాన్ (రజిఅన్)ను ఇలా అడిగారు. "ఒక పురుషుడు తన భార్యతో సంభోగించి నప్పుడు, వీర్యస్ఖలనం జరగని పక్షంలో, గుసుల్ తప్పనిసరి అవుతుందా? లేదా? దయచేసి చెప్పండి." హజ్రత్ ఉస్మాన్(రజిఅన్) ఇలా సమాధానం పలికారు: "నమాజు కోసం చేసుకునే వుజూ లాంటి వుజూనే చేసుకో. ఇంకా నీ మర్మాంగాన్ని పరిశుభ్రపరచుకో[1] (గుసుల్ చేసుకునే అవసరం లేదు)". హజ్రత్ ఉస్మాన్ (ర) ఇంకా ఇలా అన్నారు: "నేను ఈ విషయాన్ని ప్రవక్త మహనీయులు (సఅసమ్) ప్రవచిస్తూ ఉండగా విన్నాను." జైద్ బిన్ ఖాలిద్ జుహన్నీ ఇంకా ఇలా ఉల్లేఖించారు: "తరువాత ఈ సమస్యను గురించి నేను హజ్రత్ అలీ (ర)నీ, హజ్రత్ జుబైర్ (ర)నీ, హజ్రత్ తల్హా (ర)నూ, ఇంకా ఉబై బిన్ కాబ్ (ర)నూ అడిగాను. వారందరూ పై ఆజ్ఞనే సమాధానంగా పేర్కొన్నారు.[2] యహ్యా బిన్ అబీ కసీర్ ఇలా అన్నారు; ఈ విషయం గురించి నాకు అబూ సలమా చెప్పారు; అతనికి ఉర్వా బిన్ జుబేర్ చెప్పారు; అతనికి అబూ అయ్యూబ్ అన్సారి చెప్పారు; ఆయన ప్రవక్త మహ నీయులు ముహమ్మద్ (స) ఇలా చెబుతూ ఉండగా విన్నారు. (హజ్రత్ ఉస్మాన్ (ర) చెప్పిన విధంగా.)

---

290–1. అంటే స్త్రీ మర్మాంగం యొక్క నాలుగు మూలలు అని భావం. లేదా స్త్రీ యొక్క రెండు కాళ్లు మరియు రెండు చేతులు అని అర్థం. లేదా రెండు కాళ్లు, రెండు తొడలు అని అర్థం.

29–1. ఈ అధ్యాయంలో ఇమామ్ బుఖారీ (రహ్మాలై)గారు కేవలం అంగప్రవేశం జరిగిన కారణంగానే గుసుల్ వాజిబ్ కాదు అనే విషయాన్ని విశదపరిచే హదీసులను వివరించారు. అంటే వీర్యస్ఖలనం జరిగితేనే గుసుల్ వాజిబ్ అవుతుంది అని భావం.

291–1. ఇక్కణ్ణుంచే అధ్యాయంలోని ప్రధానాంశం ఉద్భవిస్తుంది. ఎందుకంటే అంగప్రవేశం వల్ల పురుషుని మర్మాంగానికి స్త్రీ మర్మాంగంలోని తడి తగిలినట్లయితే దాన్ని కడిగి వెయ్యాలనే ఆజ్ఞ ఇవ్వబడింది.

291–2. అంటే పురుషుడు తన మర్మాంగాన్ని నీళ్లతో పరిశుభ్రపరచుకోవాలి; వుజూ చేసుకోవాలి; గుసుల్ తప్పనిసరిగా చేసుకునే అవసరం లేదు.

**292.** ఉబై బిన్ కాబ్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఆయన ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్)ను ఇలా అడిగారు: 'ఓ దైవప్రవక్తా! ఏ పురుషుడైనా తన భార్యతో సంభోగించినప్పుడు, అతనికి ఒకవేళ వీర్యస్ఖలనం జరగకపోతే; (అప్పుడు అతను ఏమి చెయ్యాలి?)' దానికి సమాధానంగా ఆయన (స) ఇలా సెలవిచ్చారు: "స్త్రీ శరీరం నుంచి తగిలిన (అంటుకున్న) పదార్థాన్ని కడిగివెయ్యాలి; తరువాత వుజూ చేసుకుని నమాజు చెయ్యాలి." ఇమామ్ బుఖారీ (ర.హ్మలై) ఇలా వివరించారు; గుసుల్ చేసుకోవడం చాలా మంచిది, అత్యంత సురక్షితమైనది. మేము మొదటి హదీసును ఇక్కడ ఎందుకు చేర్చామంటే దైవప్రవక్త (స)గారి ప్రత్యక్ష అనుచరులలో ఈ సమస్యలను గురించి అభిప్రాయభేదం ఉంది. ఇకపోతే నీరు; అది అశుద్ధతను బాగా కడిగి వేస్తుంది.[1]

---

292–1. అంటే గుసుల్ చేసుకోవటం ఉత్తమమయిన విషయం; ఒకవేళ అది వాజిబ్ కాకపోయినా శరీరం పరిశుభ్రమైపోతుంది. ఈ లాభం తక్కువేమీ కాదు కదా!

*అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో*

# బహిష్టు ప్రకరణం

## 1వ అధ్యాయం

**కరుణామయుడైన అల్లాహ్ ఖురాను గ్రంథంలోని 'బఖరా' సూరాలో ఇలా సెలవిచ్చాడు: ఓ ప్రవక్తా! రుతుస్రావానికి సంబంధించిన ఆజ్ఞ ఏమిటి? అని ప్రజలు నిన్ను అడుగుతారు. నీవు వారికి ఇలా సమాధానం చెప్పు; అది ఒక అపరిశుద్ధావస్థ కనుక రుతుకాలంలో భార్యల నుంచి వేరుగా ఉండండి. వారు పరిశుద్ధలు కానంత వరకు[1] వారి వద్దకు వెళ్లకండి. వారు పరిశుద్ధలు అయిన తరువాత అల్లాహ్ ఆదేశించిన విధంగా మీరు వారివద్దకు పోవచ్చు. నిస్సందేహంగా అల్లాహ్ చెడుకు దూరంగా ఉండేవారినీ, పరిశుద్ధతను పాటించేవారినీ ప్రేమిస్తాడు. *(దివ్యఖుర్ఆన్-2 : 222)***

## 2వ అధ్యాయం

**బహిష్టు ఎప్పుడు, ఎలా ప్రారంభమయింది. ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) తమ ఒక సూక్తిలో ఇలా సెలవిచ్చారు: "రుతుస్రావాన్ని (బహిష్టును) అల్లాహ్ ఆదమ్ కుమార్తెల జాతకంలో వ్రాసిపెట్టాడు." కొందరు ఏమన్నారంటే (ఇబ్నె మసూద్ (రజిఅన్), హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) అసలు మొట్టమొదట ఇస్రాయీల్ వంశపు స్త్రీల మీదకు రుతుస్రావం పంపబడింది. ఇమామ్ బుఖారీ (ర.హ్మలై)**

---

1-1. అంటే గుసుల్ (తలంటి స్నానం) చేసుకోనంత వరకు. చాలా మంది విద్వాంసులు ఈ విషయాన్నే సమర్ధిస్తారు. కాని ఇమామ్ అబూ హనీఫా (ర.హ్మలై)గారు ఏమంటారంటే, ఒకవేళ స్త్రీ పది రోజులలో బహిష్టు స్థితి నుంచి పరిశుద్ధ అయితే, గుసుల్‌కు ముందు కూడా ఆమెతో సంభోగించటం సరియైనదే. పది రోజులకు తక్కువ దినాలలో ఆమె పరిశుద్ధ అయితే, అప్పుడు ఆయన (ర.హ్మలై) గారి దృష్టిలో కూడా గుసుల్ లేకుండా సంభోగించటం సరియైనది కాదు.

**ఏమన్నారంటే దైవప్రవక్త (సఅసమ్) గారి హదీసు ప్రకారం స్త్రీలందరికీ రుతుస్రావం వర్తిస్తుంది.[1]**

**293. హజ్రత్ ఆయెషా (రజిఅన్) ఇలా చెప్పగా నేను విన్నానని ఖాసిమ్ బిన్ ముహమ్మద్ బిన్ అబీబకర్ ఉల్లేఖించారు: "మేము కేవలం హజ్ యాత్ర చేసే సంకల్పంతోనే బయలుదేరాం.[1] మేము 'సరిఫ్'[2] అనే ప్రదేశానికి చేరుకున్నప్పుడు అకస్మాత్తుగా నేను బహిష్టు అయ్యాను. అప్పుడు ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) నా వద్దకు వచ్చారు. నేను అదేపనిగా ఏడుస్తున్నాను. ఆయన (స) గారు ఇలా అన్నారు; "ఏమిటి? ఎందుకు ఏడుస్తున్నావు? నీవు బహిష్టు అయ్యావా?" నేను, "అవును ప్రవక్తా! నేను బహిష్టు అయ్యాను" అని విన్నవించుకున్నాను. ఆయన (స) గారు ఇలా సెలవిచ్చారు: "ఇదైతే ఆదమ్ కుమార్తెల కోసం అల్లాహ్ వ్రాసిపెట్టిన విషయమే. కనుక హాజీలు చేసే పనులన్నింటినీ నీవు కూడా చెయ్యి.[3] అయితే కాబా గృహ ప్రదక్షిణం మటుకు చెయ్యకు- బహిష్టు నుంచి పరిశుద్ధవు అయ్యే వరకు". హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా అన్నారు; "ప్రవక్త మహనీయులు (స) తమ భార్యల తరపున ఒక గోవును ఖుర్బానీ ఇచ్చారు.[4]**

---

2–1. అంటే హదీసులో ఆదమ్ కుమార్తెలందరికీ రుతుస్రావం కలుగుతుంది అనే విషయం ప్రస్తావించబడింది. ఇంకా ఇది యదార్థం కూడా. కనుక ఇమామ్ బుఖారీ (ర) గారు ఇబ్నె మసూద్ (రజిఅన్), హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) గార్ల ఈ ప్రకటనను ఖండించారు. వారు ఉభయులూ ఈ గాథను బహుశా ఇస్రాయీల్ వంశం వారి నుంచి విని చెప్పారేమో అనేది అతిశయోక్తి కాదు. ఖురాను గ్రంథంలో ప్రవక్త ఇబ్రాహీమ్ (అస్సలామ్) గారి భార్య బీబీ సారాను గురించి చెబుతూ ఒకచోట అల్లాహ్ "ఫజహకత్" అంటే ఆమెకు రుతుస్రావం కలిగింది అని సెలవిచ్చాడు. హజ్రత్ సారా (అలైహస్సలాం) ఇస్రాయీల్ సంతతికి ముందు తరానికి చెందిన వారు అనే విషయం చారిత్రక సత్యం.

293–1. ఎందుకంటే హజ్ దినాలలో ఉమ్రా చెయ్యటాన్ని మక్రూహ్‌గా (అసహ్యకరమైనదిగా) భావించేవారు.

293–2. 'సరిఫ్' ఒక స్థలం పేరు. అక్కణ్ణుంచి మక్కా పట్టణం ఆరు లేక ఏడు మైళ్ల దూరంలో ఉంటుంది.

293–3. అంటే అరఫాత్‌లో ఆగటం, ముజ్దలిఫాలోకి ప్రవేశించటం, కంకరరాళ్లు రువ్వటం మొదలైనటువంటివి.

## 3వ అధ్యాయం

**బహిష్టు అయిన స్త్రీ, ఆ స్థితిలో తన భర్తకు తలంటవచ్చు. అతని తలను దువ్వవచ్చు.**

**294.** హ[జత్ ఆయెషా (రజిఅన్) గారు ఇలా ఉల్లేఖించారు: "నేను బహిష్టు అయిన స్థితిలో ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారి శిరస్సును దువ్వేదాన్ని."

**295.** ఉర్వా బిన్ జుబైర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఒక మనిషి ఆయన్ని ఇలా అడిగాడు; బహిష్టు అయిన స్త్రీ నాకు పరిచర్యలు చెయ్యగలుగుతుందా? ఇంకా తలంటి స్నానం చెయ్యవలసిన అవసరం ఉన్నటువంటి స్త్రీ నాకు దగ్గరగా రాగలుగు తుందా? దానికి సమాధానంగా ఉర్వా (ర) ఇలా అన్నారు; ఈ రెండు విషయాలూ నాకు చాలా సులభమైనవి. పై ఇద్దరు స్త్రీలలో ప్రతి ఒక్కరూ నాకు తమ సేవలు అందించవచ్చు. ఎవరైనా అలా చేస్తే అది దోషం ఎంత మాత్రం కాదు.[1] హ[జత్ ఆయెషా (రజిఅన్‌హ) నాకు ఇలా వివరించారు; ఆమె గారు బహిష్టు అయిన స్థితిలో ఉండి కూడా దైవప్రవక్త (స) గారి తలను దువ్వేవారు. ఇంకా అప్పుడు ఆయన (స) మసీదులో ఏతెకాఫ్‌లో ఉండేవారు. ఆ స్థితిలో ఆయన (స) మసీదులో నుంచే తమ పవిత్రమైన శిరస్సును ఆమె(ర)గారి దగ్గరకు జరిపేవారు. ఆమె (ర) గారు అప్పుడు తమ గదిలోనే ఉండేవారు. ఇంకా బహిష్టు అయిన స్థితిలోనే ప్రవక్త (స)గారి తలను దువ్వేవారు.

## 4వ అధ్యాయం

**ఒక పురుషుడు బహిష్టు అయిన స్థితిలో ఉన్నటువంటి తన భార్య ఒడిలో తన శిరస్సు పెట్టి ఖురాను గ్రంథాన్ని పారాయణం చెయ్యవచ్చు. అబూ వాయిల్ (షఫీఖ్ బిన్ సలమా) బహిష్టు అయినటువంటి తన బానిస స్త్రీని అబూ రజీన్ (మసూద్ బిన్ మాలిక్) వద్దకు పంపేవారు. ఆమె అక్కడకు పోయి ఖురాను గ్రంథాన్ని అది ఉన్నటు వంటి పెట్టెమీద కొక్కాన్ని పట్టుకుని తీసుకువచ్చేది.**

**296.** హ[జత్ ఆయెషా (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు; ప్రవక్త మహ నీయులు ముహమ్మద్ (సఅసమ్) గారు నా ఒడిని తలగడగా చేసుకుని పడుకుని

---

293–4. అప్పుడు దైవప్రవక్త (స)కు తొమ్మిది మంది భార్యలు ఉండేవారు. కనుక తొమ్మిది మంది భార్యల తరఫున ఒకే గోవును ఖుర్బానీ ఇచ్చారు. దీని ప్రస్తావన, అల్లాహ్ సంకల్పిస్తే హజ్ ప్రకరణంలో వస్తుంది.

295–1. అంటే బహిష్టు అయిన స్త్రీ చేత లేదా తలంటి స్నానం చెయ్యవలసి ఉన్న అవసరం గల స్త్రీ (జునుబ్) చేత పరిచర్యలు చేయించుకోవచ్చు.

**ఖురాను గ్రంథాన్ని పారాయణం చేసేవారు. అప్పుడు నేను బహిష్టు అయిన స్థితిలో ఉండేదాన్ని.[1]**

## 5వ అధ్యాయం

### హైజ్ (బహిష్టు)ను నిఫాస్ అని కూడా అనటం.[1]

**297. హ్రజత్ ఉమ్మె సలమా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: ఒకసారి నేను ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారితోపాటు ఒకే కంబళిలో పడుకున్నాను. ఇంతలో నాకు బహిష్టు వచ్చింది. అప్పుడు నేను మెల్లగా అక్కడ నుంచి జారుకున్నాను. ఇంకా బహిష్టు వస్త్రాన్ని కట్టుకున్నాను. ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు: నీవు నిఫాస్[1] (బహిష్టు) అయ్యావా? దానికి సమాధానంగా నేను, 'అవును' అని అన్నాను. తరువాత ఆయన (స) గారు నన్ను తమ వద్దకు పిలుచుకున్నారు. అప్పుడు నేను ఆయన (స) దగ్గరకు పోయి అదే కంబళిలో ఆయన(స)తో పాటు పడుకున్నాను.**

## 6వ అధ్యాయం

### బహిష్టు అయిన స్త్రీతో ముబాషిరత్ చెయ్యటం.[1]

**298. హ్రజత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: నేను, మహనీయ ప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఉభయులమూ కలిసి ఒకే పాత్రలోని నీళ్లతో గుసుల్ చేసుకునేవారము. ఇంకా అప్పుడు మేము ఇద్దరమూ జునుబులమే (లైంగిక అశుద్ధత**

---

296-1. ఈ హదీసు ద్వారా స్పష్టమైన విషయం ఏమిటంటే అశుద్ధత, సమీపంలో ఉన్నప్పుడు ఖురాను గ్రంథం పఠించటం నిషిద్ధం కాదు.

5-1. నిఫాస్ అంటే అందరూ ఎరిగిన, లోక ప్రసిద్ధమైన అర్థం ఏమిటంటే, స్త్రీ ప్రసవించిన తరువాత వెలువడే రక్తము. అంటే ప్రసవ రక్తస్రావం. కాని అప్పుడప్పుడు బహిష్టు (హైజ్) ను కూడా నిఫాస్ అనీ, నిఫాస్‌ను బహిష్టు అనీ అంటారు. ఎందుకంటే ఆ రెండింటికీ సంబంధించిన షరీఅత్ ఆజ్ఞ ఒక్కటే కావటం.

297-1. ఇదే అధ్యాయం యొక్క ప్రధానాంశం. ఇక్కడ నుంచే అది ఉద్భవిస్తుంది. ఎందుకంటే దైవప్రవక్త (స) ఇక్కడ బహిష్టును నిఫాస్ అని అభివర్ణించారు.

6-1. ముబాషిరత్ అంటే ముద్దుపెట్టుకోవటం, ఆలింగనం చేసుకోవటం, శరీరాన్ని శరీరంతో తాకటం.

**ఉన్నవారమే). ఇంకా నేను బహిష్టు స్థితిలో ఉన్నప్పుడు ఆయన (స) గారు ఇజారు (లో ఉడుపు) కట్టుకోమని ఆజ్ఞాపించేవారు; నేను ఇజారు కట్టుకునేదాన్ని. ఆ తరువాత ఆయన నా శరీరానికి తన శరీరాన్ని ఆనించేవారు. (అంటే ముబాషిరత్ చేసేవారు). ఇంకా ఆయన (స) ఏతెకాఫ్‌లో ఉన్న స్థితిలో తన శిరస్సును నా వైపునకు జరిపేవారు. అప్పుడు నేను (ఆయన తలను) నీళ్లతో కడిగేదాన్ని. ఇంకా నేను అప్పుడు బహిష్టు స్థితిలో ఉండేదాన్ని.**

**299. హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా)ఇలా అన్నారని తన తండ్రి అయిన అస్వద్ బిన్ యజీద్ చెప్పారని అబ్దుర్రహ్మాన్ బిన్ అస్వద్ ఉల్లేఖించారు: మాలో ఎవరికైనా బహిష్టు వచ్చినప్పుడు ఒకవేళ ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఆమెతో ముబాషిరత్ (శరీరాన్ని ఆనించటం) చెయ్యదలిస్తే అప్పుడు ఆయన (స) ఇజారు కట్టుకోమని ఆమెను ఆజ్ఞాపించేవారు.[1] ఆ సమయంలో బహిష్టు అత్యంత తీవ్రమైన స్థితిలో ఉండేది;[2] తరువాత ఆయన ఆమెతో ముబాషిరత్ చేసేవారు. హజ్రత్ ఆయెషా(ర) ఇలా చెప్పారు; కామవాంఛ మీద దైవప్రవక్త (స)కు ఉన్నంత నిగ్రహశక్తి మీలో ఎవరికుంది?[3]**

**300. విశ్వాసుల తల్లి అయిన హజ్రత్ మైమూన (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఎప్పుడైనా బహిష్టు స్థితిలో**

---

299–1. ఇజారు కట్టుకున్నప్పుడు, ఇక ముబాషిరత్ అనేది స్త్రీ యొక్క నాభికి పైన ఉన్న శరీరంతోనే జరగాలి. చాలా మంది విద్వాంసులు బహిష్టు అయిన స్త్రీ యొక్క నాభి క్రింద ఉన్న శరీరంతో ముబాషిరత్ చెయ్యటాన్ని ధర్మవిరుద్ధమైనదిగా అభివర్ణించారు. కొందరు విద్వాంసులు ఏమన్నారంటే; బహిష్టు అయిన స్త్రీతో కేవలం సంభోగించటమే నిషిద్ధం. మిగతా మొత్తం శరీరంతో ముబాషిరత్ చెయ్యటం ధర్మసమ్మతమే. ఇమామ్ అహ్మద్, అహ్లెహదీస్ ప్రముఖులు ఈ విధానాన్నే అవలంబిస్తున్నారు.

299–2. అంటే బహిష్టు ప్రారంభ దశలో ఉంటుంది అన్నమాట. ఇంకా బహిష్టు తీవ్రమైన స్థితిలో ఉంటుంది. అర్థం ఏమిటంటే, ఆయన(స) అటువంటి క్లిష్టసమయంలో కూడా బహిష్టు అయిన తన భార్యతో ముబాషిరత్ చేసేవారు. బహిష్టు సమాప్త దశకు దగ్గర్లో ఉన్నప్పటి సమయంలోనే ముబాషిరత్ చేస్తారనీ, ప్రారంభ దశలో చెయ్యరు అని దీని భావం కాదు.

299–3. అర్థం ఏమిటంటే, ఎవరికయితే తమ కామవాంఛ మీద నిగ్రహశక్తి లేదో వారు

**ఉన్నటువంటి తమ ఏ భార్యతోనైనా ముబాషిరత్ చెయ్యదలిచినప్పుడు ఇజారు (లో ఉడుపు) కట్టుకోమని ఆమెను ఆజ్ఞాపించేవారు. అప్పుడు ఆమె ఇజారును ధరించేది.**

## 7వ అధ్యాయం

## బహిష్టు అయిన స్త్రీ ఉపవాసం ఉండకూడదు

**301. అబూ సయీద్ ఖుద్‌రీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) బక్రీదు లేక రమజాను పండుగ సమయంలో ఈద్‌గాహ్‌కు వెళ్లేందుకు బయలుదేరారు. మార్గమధ్యంలో కొందరు స్త్రీలు ఆయన (స) గారిని కలిశారు. ఆయన వారిని ఉద్దేశించి ఇలా అన్నారు: ఓ మహిళలారా! దానధర్మాలు చెయ్యండి. ఎందుకంటే నరకంలో పురుషులకంటే స్త్రీలే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. ఈ విషయం నాకు చూపించబడింది.[1] అప్పుడు ఆ స్త్రీలు; ఓ దైవప్రవక్తా! దీనికి కారణం ఏమిటి? అని అడిగారు. దానికి సమాధానంగా దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: మీరు ఎక్కువగా శాపనార్థాలు పెడుతూ ఉంటారు. (బద్ దుఆలు చేస్తూ ఉంటారు) ఇంకా మీరు మీ భర్తలకు కృతఘ్నత చూపుతారు.[2] మీ అంత తక్కువ తెలివికలవారినీ, మీ అంత అసంపూర్ణమైన ధర్మజ్ఞానం కలవారినీ నేను ఎవరినీ చూడలేదు. అయినప్పటికీ మీరు వివేకవంతుడూ, అనుభవశాలీ అయిన ఒక వ్యక్తిని వెర్రివాడుగా, మార్గభ్రష్టుడుగా చెయ్యగల సామర్థ్యం కలిగి ఉన్నారు. ఆ స్త్రీలు ఇలా అడిగారు: ఓ దైవప్రవక్తా! మా ధర్మంలో మా తెలివితేటల్లో ఉన్నటువంటి కొరత, లోపం ఏమిటి? అప్పుడు ఆయన(స) ఇలా సెలవిచ్చారు: చూడండి! ఒక స్త్రీ చెప్పే**

---

ముబాషిరత్ చెయ్యకూడదు. దానికి దూరంగా ఉండాలి. ఎందుకంటే దాని వల్ల మనిషి సంభోగానికి పాల్పడి నిషిద్ధ కార్యంలో చిక్కుకుపోతాడు.

301-1. అంటే మేరాజ్ సంఘటన జరిగిన రాత్రి లేదా సూర్యుడికి గ్రహణం పట్టిన రోజున.

301-2. ఖస్తలానీ ఇలా అన్నారు; ఎవరి మరణం గురించి అయితే విపులంగా తెలియదో, అంటే అతను విశ్వాసిగా మరణించాడా లేక అవిశ్వాసిగా మరణించాడా అనే విషయం తెలియకపోతే, అతనిని శపించటం ధర్మసమ్మతమైన విషయం కాదు. అబూ జహల్ మొదలైన వారిని శపించటం ధర్మసమ్మతమైన విషయమే. ఎందుకంటే అతని చావు అవిశ్వాసపూరితమైన చావు అని నిరూపితమైపోయింది. ఇదేవిధంగా పేరు పెట్టి కాకుండా, ప్రత్యేకంగా ప్రస్తావించకుండా, దుర్మార్గులందరినీ, అవిశ్వాసులందరినీ శపించవచ్చు.

**సాక్ష్యం అర్ధపురుషుడి సాక్ష్యంతో సమానం. అవునా? కాదా? ఆ స్త్రీలు, అవును ఇందులో సందేహంలేదు అని అన్నారు. అప్పుడు ఆయన (స) ఇదే ఆమె వివేకంలోని లోపం, కొరత.[3] ఇంకా చూడండి! స్త్రీ బహిష్టు అయినప్పుడు నమాజు చెయ్యదు, ఇంకా ఉపవాసం ఉండదు అని అన్నారు. ఆ స్త్రీలు, అవును ఇది కూడా నిజమే అని అన్నారు. తరువాత ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు; కనుక ఇదే మీ ధర్మంలోని అసంపూర్ణత్వం, కొరత.**

## 8వ అధ్యాయం

**బహిష్టు అయిన స్త్రీ హజ్‌కు సంబంధించిన ఆచారాలూ, ప్రక్రియలూ అన్నీ నిర్వహించవచ్చు; కేవలం కాబా గృహ ప్రదక్షిణం చెయ్యకూడదు. ఇబ్రాహీమ్ నఖ్‌యీ ఇలా అన్నారు;[1] బహిష్టు అయిన స్త్రీ ఖురాను గ్రంథంలోని ఒక వాక్యాన్ని పారాయణం చేస్తే అది దోషం ఎంతమాత్రం కాదు.[2] హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (ర) ఇలా అన్నారు;**

---

301–3. ఇద్దరు స్త్రీల సాక్ష్యం, ఒక పురుషుని సాక్ష్యంతో సమానమని స్వయంగా అల్లాహ్‌యే నిర్ణయించినప్పుడు, ఇక కొందరు స్త్రీలు, పురుషుల కంటే ఎక్కువ వివేకం, తెలివితేటలు కలిగి ఉంటారు– అనే అభ్యంతరం లేవనెత్తటానికి ఆస్కారమే లేదు. ఎందుకంటే ఈ ఆజ్ఞ మెజారిటీ స్త్రీలకు వర్తిస్తుంది. సామాన్యంగా స్త్రీలు మానసికంగా, శారీరకంగా పురుషులకంటే బలహీనంగా ఉంటారు. అంటే వారు జన్మతః బలహీనులన్నమాట.

8–1. దీనిని 'దారిమీ' జత చేశారు. అంటే కలిపారు అని అర్థం.

8–2. మాలికీయ వర్గం వారి అభిప్రాయం ప్రకారం, బహిష్టు అయిన స్త్రీ ఆ స్థితిలో ఖురాను గ్రంథాన్ని పఠించవచ్చు; కాని జునుబ్ (లైంగిక అశుద్ధావస్థలో ఉన్న వ్యక్తి) ఖురాను గ్రంథాన్ని పఠించకూడదు. షాఫయీ వర్గం వారూ, హంబలీ వర్గం వారూ, చాలా మంది విద్వాంసుల అభిప్రాయం ఏమిటంటే; జనుబ్ మరియు బహిష్టు అయిన స్త్రీ ఉభయులూ ఖురాను గ్రంథాన్ని పఠించటం అనేది సరియైన విషయం కాదు. ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారి అభిప్రాయం ప్రకారం, జునుబ్ మరియు బహిష్టు అయిన స్త్రీ ఇద్దరూ ఖురాను గ్రంథాన్ని పఠించవచ్చు. అది సరియైన విషయమే. ఎందుకంటే ప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) హజ్‌కు సంబంధించిన క్రియలన్నీ బహిష్టు అయిన ఒక స్త్రీ చెయ్యవచ్చు అని అనుమతి ఇచ్చారు. ఈ క్రియలలో దుఆ (ప్రార్థన) కూడా ఉన్నది, లబ్బైక్ కూడా ఉన్నది. కనుక ఒక బహిష్టు అయిన మహిళ ఖురాను గ్రంథాన్ని పఠించటం అనేది ధర్మశాస్త్రం ప్రకారం సరియైనది, సక్రమమైనది

**గుసుల్ చెయ్యవలసి ఉన్నటువంటి ఒక జునుబ్ ఒకవేళ ఖురాను పఠిస్తే అది తప్పు కాదు.[3] ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (స) అల్లాహ్‌ను అన్ని వేళల్లో స్మరిస్తూ ఉండేవారు. జ్ఞాపకం చేస్తూ ఉండేవారు.[4] ఇంకా ఉమ్మె అతియ ఇలా అన్నారు;[5] దైవప్రవక్త (స) గారి కాలంలో బహిష్టు అయిన స్త్రీలను మాతోపాటు ఈద్‌గాహ్‌కు తీసుకువెళ్ళమని మమ్మల్ని ఆజ్ఞాపించేవారు; వారు ప్రజలతోపాటు తక్బీర్‌లోనూ (అల్లాహు అక్బర్ అని పలకటం), దుఆలలోనూ పాల్గొనాలని ఆదేశించేవారు. ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా అన్నారు; అబూ సుఫ్యాన్ నాకు ఇలా వివరించారు; రోమన్ దేశపు రాజైన హెర్క్యూలియస్ దైవప్రవక్త (స) తనకు వ్రాసిన ఒక ఉత్తరాన్ని తెప్పించి దానిని చదివారు. అందులో ఇలా వ్రాయబడి ఉన్నది; మహాకరుణగలవాడు, అత్యంత దయామయుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను. తరువాత ఈ ఖురాను వాక్యం వ్రాయబడి ఉంది; "ఓ గ్రంథప్రజలారా! మాకూ మీకూ మధ్య సమానమైన ఒక విషయం వైపునకు రండి. (అది ఏమిటంటే) మనం అల్లాహ్‌కు తప్ప మరెవరికీ దాస్యం చెయ్యరాదు. ఆయనకు భాగస్వాములుగా ఎవరినీ నిలబెట్టరాదు"..... చివరి వరకు[6]. జాబిర్ (ర) ఇలా అన్నారని అతా ఉల్లేఖించారు; ఒకసారి హజ్రత్ ఆయెషా బహిష్టు అయ్యారు; ఆమె గారు హజ్‌కు సంబంధించిన అన్ని పనులూ చేశారు; ఒక్క కాబా గృహప్రదక్షిణం తప్ప. ఇంకా ఆమెగారు నమాజు చెయ్యలేదు.[7] హకమ్ బిన్ ఉతబా ఇలా అన్నారు; నేను జనాబత్ స్థితిలో కూడా పశువులను జిబహ్ చేస్తాను[8]. వాస్తవానికి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు; "అల్లాహ్ పేరుతో జిబహ్ చెయ్యబడని పశువు మాంసం తినకండి, అలా చెయ్యటం పాపం."[9]**

---

అయినప్పుడు, అది ఒక జునుబ్ కోసం మొదట్లోనే, ముందుగానే ధర్మ సమ్మతమైనది అవుతుంది. ఎందుకంటే, బహిష్టు అయిన స్త్రీ యొక్క అశుద్ధత జునుబ్ అయిన వ్యక్తి యొక్క అశుద్ధత కంటే ఎంతో తీవ్రమైనది.

8-3. ఇబ్నె అబ్బాస్ ఇలా పేర్కొన్నారని ఇబ్నె మున్‌జర్ ఉల్లేఖించారు; ఆయన జనాబత్ స్థితిలో (గుసుల్ అవసరమైన స్థితిలో) ఉండి కూడా ఖురాను పఠిస్తూ ఉండేవారు; ప్రజలు అభ్యంతరం తెలుపగా, ఆయన వారికి ఇలా సమాధానం చెప్పారు; నా కడుపులో దీనికంటే ఎక్కువే ఉంది; అంటే ఖురాను గ్రంథం అంతా నా కడుపులో ఉంది అన్నమాట. లేదా నా కడుపులో జనాబత్ యొక్క అశుద్ధత కంటే ఎక్కువ అశుద్ధతే నిండి ఉంది.

8-4. ఈ తాలీఖ్‌ని ఇమామ్ ముస్లిమ్ (రహ్మలై) హజ్రత్ ఆయెషా (ర)తో కలిపారు, జోడించారు.

8-5. దైవప్రవక్త (స) గారి ఈ సూక్తిని (హదీసును) ఇమామ్ బుఖారీ (రహ్మలై) పండుగలకు సంబంధించిన అధ్యాయాలలో ఉటంకించారు. తక్బీర్, దుఆలు బహిష్టు అయిన ఒక స్త్రీకి ధర్మసమ్మతమైనపుడు ఖురాను గ్రంథ పారాయణం కూడా ఆమెకు ధర్మసమ్మతమే అవ్వాలి. మాలికీయ వర్గంవారు ఏమంటారంటే; బహిష్టు గడువు కాలం సుదీర్ఘమైనది. ఒకవేళ ఖురాను గ్రంథ పారాయణం బహిష్టు అయిన ఒక మహిళకు ధర్మసమ్మతం కాకపోతే ఆమె ఖురాను గ్రంథాన్ని మరచిపోయే అవకాశం ఉంటుంది.

8-6. ఈ ఖురాను వాక్యం 'ఆలి ఇమ్రాన్' సూరాలో నుంచి తీసుకోబడింది. ఇమామ్ బుఖారీ (రహ్మలై) గారు దీనిద్వారా ఒక ఆధారాన్ని, ఒక ప్రమాణాన్ని తీసుకున్నారు. అదేమిటంటే; జునుబ్ అయిన ఒక వ్యక్తి ఖురాను గ్రంథాన్ని పారాయణం చెయ్యటం ధర్మసమ్మతమైన విషయమే. ఎందుకంటే; ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) హెర్క్యూలియస్‌కు పంపిన ఒక ఉత్తరంలో ఈ ఖురాను వాక్యాలు వ్రాశారు. అతను వాటిని చదవాలనే వ్రాశారు. అతడు అవిశ్వాసి; స్త్రీతో సంభోగించిన తరువాత గుసుల్ చేసేవాడు కాదు.

8-7. ఈ తాలీఖ్‌ని స్వయంగా ఇమామ్ బుఖారీ (రహ్మలై) గారే 'కితాబుల్ అహ్‌కామ్' అనే గ్రంథంలో జత చేశారు, కలిపారు.

8-8. ఈ విషయాన్ని బగ్‌వీ గారు 'జఆదియ్యాత్' అనే గ్రంథంలో కలిపారు.

8-9. కనుక హకమ్ బిన్ ఉతబా పశువును జిబహ్ చేసేటప్పుడు అల్లాహ్ పవిత్ర నామాన్ని తప్పక ఉచ్చరించే ఉంటారు. దీని ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే, జనాబత్ స్థితిలో ఉన్నప్పుడు అల్లాహ్ పవిత్రనామాన్ని స్మరించటం అనేది ధర్మసమ్మతమైన విషయమే. 'తస్‌హీలుల్ ఖారి' అనే గ్రంథంలో ఇలా వ్రాయబడి ఉంది; ఈ విషయంలో ఇమామ్ బుఖారీ (ర.హ్మలై) గారి అభిప్రాయం, కొందరు అనుమానించినట్లు, బలహీనమైనది కాదు. పైగా ఆయనగారు చూపిన ఆధారాలు, సాక్ష్యాలు బలమైనవి, దృఢమైనవి. ఇంకా ఇమామ్ దావూద్ జాహిరీ గారు, తబరీ గారు, ఇబ్నె మున్‌జర్ గారు లాంటి వారందరూ ఇమామ్ బుఖారీ (రహ్మలై) గారిని సమర్ధి స్తున్నారు; జనాబత్ స్థితిలో ఉన్న వ్యక్తీ, బహిష్టు స్థితిలో ఉన్న స్త్రీ ఉభయులూ ఖురాను గ్రంథాన్ని పఠించటం ధర్మసమ్మతమైన విషయమే అని తీర్మానించారు.

**302.** హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) గారి కథనం ఇలా ఉన్నది; మేము ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారితో కలిసి మదీనా పట్టణం నుంచి బయలు దేరాము. మార్గమధ్యంలో మేము హజ్ యాత్రను గురించే ప్రస్తావించు కున్నాము (అంటే హజ్ చేసే సంకల్పంతో బయలుదేరాము). మేము సరిఫ్ అనే ప్రదేశానికి చేరుకున్నప్పుడు, నేను బహిష్టు అయ్యాను. ప్రవక్త మహనీయులు (స) నా దగ్గరకు వచ్చారు. నేను ఏడుస్తున్నాను. "నీవు ఎందుకు ఏడుస్తున్నావు?" అని దైవప్రవక్త (స) అడిగారు. సమాధానంగా నేను "అయ్యో! ఈ సంవత్సరం నేను హజ్ కోసం రాకుండా ఉంటే ఎంత బాగుండేది! అని చెప్పాను; ఆయన (స) గారు ఇలా సెలవిచ్చారు; "బహుశా నీవు బహిష్టు అయి ఉంటావు." "అవును ప్రవక్తా!(స)!" అని నేను జవాబు పలికాను. అప్పుడు ఆయన (స) ఇలా సెలవిచ్చారు: "ఈ విషయాన్నయితే అల్లాహ్ ఆదమ్ కూతుళ్ళు అందరి కోసం వ్రాసి పెట్టాడు. ఇక నీవు హాజీలు చేసే పనులన్నీ చెయ్యి. కేవలం పవిత్ర కాబా మందిర ప్రదక్షిణం మాత్రం చెయ్యకు; నీవు పరిశుభ్రతను పొందేవరకు."

## 9వ అధ్యాయం

## ఇస్తిహాజా[1] (రక్తస్రావం)కు సంబంధించిన విషయం

**303.** హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: అబూ హుబైష్ కూతురు అయిన ఫాతిమా మహాప్రవక్త (స)కు ఇలా విన్నవించుకున్నారు; "ఓ దైవ ప్రవక్తా (స)! నాకు పరిశుభ్రత కలగటం లేదు (అంటే రక్తస్రావం ఆగటం లేదు). నేను నమాజును విడిచిపెట్టేదా?" ప్రవక్త మహనీయులు (స) దానికి సమాధానంగా ఇలా సెలవిచ్చారు; "ఇది ఒక నరంలో నుంచి స్రవించే రక్తం. రుతుస్రావం మటుకు కాదు. కనుక బహిష్టు రక్తం[1] వచ్చినప్పుడు నమాజును విడిచిపెట్టు. తరువాత దాని గడువు ముగిసిందని భావించినప్పుడు నీ శరీరం మీద ఉన్నటువంటి రక్తాన్ని కడిగెయ్యి. ఇంకా నమాజు చెయ్యి."[2]

9–1. ఇస్తిహాజా అంటే బహిష్టు సమయంలో కాక ఇతర సమయాలలో కూడా వెలువడే రక్తం అని భావం. ఇది ఒక రకమైన వ్యాధి; కొందరు స్త్రీలకు ఇది వస్తుంది.

303–1. దాని రంగును, ఇతర విషయాలను చూసి స్త్రీలు అది ఎటువంటి రక్తమో గ్రహించగలుగుతారు.

303–2. అంటే గుసుల్ చేసుకుని నమాజు చెయ్యి; ఇతర ఉల్లేఖనాలలో ఉన్న విధంగా. ఒక ఉల్లేఖనంలో, "ప్రతి నమాజు కోసం వుజూ చేస్తూ ఉండు" అనే పదాలు

## 10వ అధ్యాయం
## బహిష్టు రక్తాన్ని కడిగివెయ్యటం

**304.** అస్మా బిన్తె అబీబకర్ సిద్దీఖ్ (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: ఒక స్త్రీ (అస్మా) ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్)ను ఇలా అడిగింది; "ఓ దైవప్రవక్తా! ఒకవేళ మాలో ఎవరి బట్టలకైనా బహిష్టు రక్తం తగిలినట్లయితే, అప్పుడు ఆమె ఏమి చెయ్యాలి? చెప్పండి ప్రవక్తా!" దైవప్రవక్త మహనీయులు సమాధానంగా ఇలా సెలవిచ్చారు; "మీలో ఎవరి వస్త్రాలకైనా బహిష్టు రక్తం తగిలినట్లయితే, దానిని గీకి పారెయ్యండి.[1] తరువాత నీళ్లతో కడుగండి. ఆ తరువాత ఆ వస్త్రంతోనే నమాజు చెయ్యండి."

**305.** హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) గారి ఉల్లేఖనం ఇలా ఉంది; మాలో ఏ స్త్రీ అయినా బహిష్టు అయితే తరువాత ఆమె పరిశుద్ధురాలైనట్లయితే అప్పుడు ఆమె తన బట్టలకు అంటిన రక్తాన్ని గీకివేస్తుంది. ఆ తరువాత ఆ బట్టలను నీళ్లతో కడుగుతుంది. ఇంకా మొత్తం బట్టల మీద నీళ్లు చల్లుతుంది.[1] ఆ తరువాత ఆ బట్టలతోనే నమాజు చేస్తుంది.

## 11వ అధ్యాయం
## ఇస్తెహాజా (రక్తస్రావం వ్యాధి) ఉన్న స్త్రీ మసీదులో ఏతెకాఫ్ ఉండవచ్చు

**306.** హజ్రత్ ఆయెషా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారి భార్య ఒకామె సౌదా (ర) లేదా ఉమ్మె హబీబా (ర)

---

అధికంగా ఉన్నాయి. షాఫయి మస్లక్ వారు, హనఫీ మస్లక్ వారు ఈ అభిప్రాయానికే కట్టుబడి ఉన్నారు. మాలికీ మస్లక్ వారు ఏమంటారంటే, రక్తస్రావానికి సంబంధించిన రక్తం వల్ల వుజూ విరిగిపోదు. మొలల వ్యాధి వల్ల స్రవించే రక్తం మాదిరిగా. అయితే ప్రతి నమాజు కోసం వుజూ చేసుకోవటం అభిలషణీయమైనదే. కాని తప్పనిసరి ఏమీ కాదు, మరొక అశుద్ధత ఏదైనా కలిగే వరకు.

304–1. అంటే వ్రేలుతోగాని లేదా గోరుతోగాని గీకి పారెయ్యటం అని భావం.

305–1. అనుమానాలను నివృత్తి చెయ్యటానికి మొత్తం వస్త్రంమీద నీళ్లు చల్లుతుంది. హాఫిజ్ (రహ్మాలై) ఏమన్నారంటే; ఈ హదీసు ద్వారా కొత్తగా తెలిసే విషయం ఏమిటంటే, ఒకవేళ వస్త్రాన్ని పరిశుభ్రం చేసే అవసరం లేనట్లయితే దానిని అశుద్ధమైన వస్త్రంగానే ఉండనివ్వటం సరియైనది. ఎందుకంటే హజ్రత్ ఆయెషా (ర) గారు ఇలా అన్నారు; బహిష్టు నుంచి పరిశుభ్రతను పొందిన తరువాత నేను అలాగే చేస్తాను.

**ఒకసారి ఆయన (స) గారితో మసీదులో ఏతెకాఫ్ కూర్చున్నారు. ఆమె గారికి రక్త స్రావం వ్యాధి ఉండేది. ఆమె గారు తరచు రక్తాన్ని (తమ రహస్య భాగం నుంచి వెలువడే రక్తాన్ని) చూస్తూ ఉండేవారు. అప్పుడప్పుడు ఆమెగారు రక్తం వెలువడుతూ ఉండటం వల్ల తన క్రింద ఒక పళ్ళాన్ని పెట్టుకునేవారు. ఇక్రిమా ఇలా అన్నారు; ఒకసారి హజ్రత్ ఆయెషా (ర) కుంకుమ పువ్వు (రంగు) నీళ్లను చూసి ఇలా సెలవిచ్చారు; 'దైవప్రవక్త (స) గారి ఫలానా భార్య (రక్తస్రావం స్థితిలో) చూస్తూ ఉండే రక్తం లాంటిదే ఇది కూడా'.[1]**

**307. హజ్రత్ ఆయెషా (ర) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారి భార్యలలోని ఒకామె ఒకసారి ఆయన (స) గారితో ఏతెకాఫ్‌లో కూర్చున్నారు. అప్పుడు ఆమె (తన రహస్య భాగాలలో నుంచి) రక్తమూ, పసుపు పచ్చని ద్రవమూ వెలువడటాన్ని గమనిస్తూ ఉండేవారు. ఇంకా ఒక పళ్ళెము ఆమె క్రింద ఉండేది, ఆమె నమాజు చేస్తూ ఉండేవారు.[1]**

**308. హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) గారి ఒక ఉల్లేఖనం ఇలా ఉంది: మహనీయ ప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) గారి భార్యలలోని ఒకామె రక్తస్రావం వ్యాధి ఉన్నటువంటి స్థితిలో కూడా ఏతెకాఫ్ కూర్చున్నారు.**

## 12వ అధ్యాయం

### బహిష్టు అయిన బట్టలతో ఒక స్త్రీ నమాజు చెయ్యగలుగుతుందా? అనే విషయం గురించి.

---

306–1. అంటే దీని రంగు, దాని రంగు కలుస్తున్నాయి, ఒకే మాదిరిగా ఉన్నాయి. ఫలానా భార్య అంటే రక్తస్రావం వ్యాధి ఉన్న భార్య అని భావం. అంటే సౌదా (ర) లేదా ఉమ్మె హబీబా (ర) లేదా ఉమ్మె సలమా (ర) గార్లు. సయీద్ బిన్ మన్సూర్ తన 'సునన్'లో ఇలా ఉల్లేఖించారు; ఉమ్మె సలమా (ర) రక్తస్రావం స్థితిలో ఎతెకాఫ్ కూర్చు న్నారు. ఆమె (ర) గారు అప్పుడప్పుడు తన క్రింద ఒక పళ్ళాన్ని పెట్టుకునేవారు.

307–1. హాఫిజ్ ఇబ్నె హజర్ (ర.హ్మాలై) ఇలా అన్నారు; ఈ హదీసు ద్వారా తేటతెల్లమైన విషయం ఏమిటంటే; రక్తస్రావం వ్యాధి ఉన్నటువంటి స్త్రీ మసీదులో ఉండగలదు, ఆమె పాటించే ఏతెకాఫ్, ఆమె చేసే నమాజులు ధర్మసమ్మతమైనవే. ఇంకా అశుద్ధత ఉన్నప్పటికీ మసీదులో ఉండవచ్చు. ఇది దోషం కాదు. సక్రమమైన విషయమే. కాని మసీదు పరిశుభ్రతకు ముప్పు వాటిల్లకూడదు. రక్తస్రావం వ్యాధిగల స్త్రీకి సంబంధించిన ఆజ్ఞ పరిధిలోకి నిత్యం అశుద్ధంగా ఉండే వ్యక్తి కూడా వస్తాడు. ఇంకా రక్తం కారే గాయాలు ఉన్నటువంటి వ్యక్తి కూడా దీని పరిధిలోకి వస్తాడు.

**309.** హజ్రత్ ఆయెషా (రజిఅన్హ) గారి ఒక కథనం ఇలా ఉంది: (మహనీయ ప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) గారి హయాములో) మాలో ఎవరి వద్దనైనా సరే ఒకే ఒక వస్త్రం ఉండేది. బహిష్టు అయినప్పుడు కూడా ఆమె ఆ వస్త్రాన్నే ధరించి ఉండేది. ఆ వస్త్రానికి ఎప్పుడైనా రక్తం తగిలినప్పుడు దానికి ఉమ్మిరాసి గోళ్లతో గీకి పారేసేవారము.

## 13వ అధ్యాయం

## బహిష్టుకు సంబంధించిన స్నానం (గుసుల్) చేసేటప్పుడు సువాసనగల ఏదైనా పదార్థాన్ని వాడటం.[1]

**310.** ఉమ్మె అతియ (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: ఎవరైనా మరణిస్తే, వారి విషయంలో మూడు దినాల కంటే ఎక్కువ సంతాపాన్ని, శోకాన్ని పాటించడాన్ని స్త్రీలమైన మాకు నిషేధించబడింది. కాని భర్త గనక మరణిస్తే, ఆయన విషయంలో నాలుగు నెలల పది దినాలు సంతాపాన్ని పాటించాలని మాకు ఆజ్ఞాపించటం జరిగింది. ఆజ్ఞలోని షరతులు ఏమిటంటే, సంతాప దినాలలో మేము కళ్లకు సుర్మా పెట్టుకోరాదు, పరిమళ ద్రవ్యాలను ఉపయోగించరాదు, రంగురంగుల వస్త్రాలు ధరించరాదు; తయారీకి ముందే రంగు వేయబడిన దారాలు ఉన్నటువంటి వస్త్రం తప్ప. ఇంకా బహిష్టు నుంచి పరిశుభ్రతను పొందే సమయంలో, బహిష్టుకు సంబంధించిన స్నానం చేసేటప్పుడు 'కుస్తె అజ్ఫార్' (సువాసనగల ఒక పదార్థం)ను కొంచెం రాసుకునే అనుమతి ఇవ్వబడింది.[1] ఇంకా స్త్రీలకు జనాజాతోపాటు వెళ్లటం కూడా నిషేధించబడింది.[2] ఈ హదీసును హిషామ్ బిన్ హస్సాన్ కూడా హజ్రత్ హఫ్సా (రజిఅన్హా)గారి నుంచి గ్రహించి ఉల్లేఖించారు. ఆమెగారు ఉమ్మె అతియ నుంచి, ఆమెగారు దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) నుంచి సంగ్రహించారు.[3]

---

13-1. ఒక స్త్రీ బహిష్టుకు సంబంధించిన స్నానం చేసేటప్పుడు తన శరీరంలోని ప్రత్యేక స్థలం మీద ఉన్నటువంటి దుర్వాసనను దూరం చెయ్యటానికి ఏదైనా సువాసన గల పదార్థాన్ని దాని మీద రాయాలి. ఈ విషయంలో దైవప్రవక్త ముహమ్మద్(స) సంతాప దినాలు పాటించే, శోకంలో ఉన్న స్త్రీకి కూడా సువాసనను వాడే అనుమతిని ఇచ్చారు. అంటే దీనికి సంబంధించిన తాకీదు అంత ముఖ్యమైనది, విస్తృతమైనది అన్నమాట. ఖస్తలానీ ఏమన్నారంటే, అయితే ఆ స్త్రీ ఇహ్రామ్ కట్టుకున్న స్థితిలో ఉండకూడదు.

310-1. అంటే కుస్త్ లేదా అజ్ఫార్ అని భావం. కుస్త్ అంటే సాంబ్రాణి అని అర్థం.

## 14వ అధ్యాయం

**బహిష్టుకు సంబంధించిన స్నానం చేసేటప్పుడు స్త్రీ తన శరీరాన్ని బాగా తోము కోవాలి. ఇంకా గుసుల్ ఎలా చెయ్యాలి అనే విషయం గురించి; ఇంకా ముష్క్ (కస్తూరి) రాసిన దూది కొంచెం తీసుకుని రక్తం తగిలిన శరీర భాగం మీద రుద్దాలి.**

**311.** హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) కథనం ఒకటి ఇలా ఉంది : ఒకసారి ఒక స్త్రీ (అస్మా బిన్తె షకల్) ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసం)గారిని, "ఓ ప్రవక్తా! బహిష్టుకు సంబంధించిన స్నానం ఎలా చెయ్యాలి?" అని అడిగింది. దానికి సమాధానంగా ఆయన (స)గారు గుసుల్ ఎలా చెయ్యాలో తెలియజేశారు. ఇంకా ఆయన (స) ఇలా సెలవిచ్చారు; "గుసుల్ చేసిన తరువాత ముష్క్ రాసి ఉన్నటువంటి కొంచెం దూదిని తీసుకుని దానితో పరిశుభ్రపరచుకో." అప్పుడు ఆ స్త్రీ "ఎలా పరిశుభ్ర పరచుకోవాలి?" అని అడిగింది. దానికి జవాబుగా దైవప్రవక్త (స) "దానితో పరిశుభ్ర పరచుకో" అని మళ్ళీ సెలవిచ్చారు. ఆ స్త్రీ మళ్ళీ "ఎలా పరిశుభ్రపరచు కోవాలి?" అని అడిగింది. ఆయన (స)గారు ఆశ్చర్యపోతూ 'సుబ్హానల్లాహ్' (అల్లాహ్ పరిశుద్ధుడు) దానితో పరిశుభ్రపరచుకో అన్నారు. హజ్రత్ ఆయెషా (రజి అన్హా) ఇలా అన్నారు; అప్పుడు నేను ఆ స్త్రీని నా వైపునకు లాక్కున్నాను. ఇంకా రక్తం తగిలిన భాగం మీద (అంటే మర్మాంగం మీద) ఆ దూదిని రాయి అని విడమరిచి చెప్పాను.

## 15వ అధ్యాయం

**బహిష్టుకు సంబంధించిన గుసుల్‌ను గురించి.**

**312.** హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: ఒకసారి అన్సార్ తెగకు చెందిన ఒక మహిళ ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) దగ్గరకు వచ్చి, "ఓ ప్రవక్తా! బహిష్టు ఆగిపోయిన తరువాత చేసే స్నానం ఎలా చెయ్యాలి?"

---

అజ్ఫార్ కూడా ఒక రకమైన పరిమళ ద్రవ్యమే. కొందరు, 'అజ్ఫార్' కూడా సాంబ్రాణియే అని అన్నారు. అజ్ఫార్ ఒక పట్టణం పేరు కూడా. అది యమన్ దేశంలోని పేరు ప్రఖ్యాతులుగాంచిన ఒక ఓడరేవు కూడా. అక్కడ నుంచే భారతదేశానికి, ఇతర అరేబియా దేశాలకు సాంబ్రాణి ఎగుమతి అవుతుంది.

310–2. ఎందుకంటే, స్త్రీలు విపరీతంగా ఏడుస్తారు. కనుక వారు జనాజా వెంట వెళ్ళటం నిషిద్ధం.

310–3. హిషామ్‌గారి ఉల్లేఖానాన్ని స్వయంగా ఇమామ్ బుఖారీ (రహ్మలై) తలాఖ్ ప్రకరణంలో పొందుపరిచారు.

**అని అడిగింది. ఆయన (స) గారు ఇలా సెలవిచ్చారు; (ఈ విధంగా చెయ్యి అని వివరించి ఇలా సెలవిచ్చారు) కస్తూరి రాయబడి ఉన్నటువంటి కొంచెం దూదిని తీసుకో. దానితో మూడుసార్లు పరిశుభ్రపరచుకో. ఆ తరువాత ప్రవక్త మహనీయులు (స) సిగ్గుపడ్డారు; ఆ స్త్రీ నుంచి ఆయన (స) తన ముఖాన్ని త్రిప్పుకున్నారు. ఆయన (స)గారు మళ్లీ 'దానితో పరిశుభ్రపరచుకో' అని సెలవిచ్చారు. హ్రజత్ ఆయెషా (ర) ఇలా అన్నారు; నేను ఆ స్త్రీని నా వైపునకు లాక్కున్నాను. ఇంకా దైవప్రవక్త గారు చెప్పదలచినది ఆమెకు వివరించాను.[1]**

## 16వ అధ్యాయం

## బహిష్టు ఆగిపోయిన తరువాత గుసుల్ చేసుకునేటప్పుడు తల వెంట్రుకలను దువ్వుకోవటం.

**313. హ్రజత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారి అంతిమ హజ్ యాత్రలో ఆయన (స) గారితోపాటు నేను కూడా ఇహ్రామ్ ధరించాను. నేను 'తమత్తు' సంకల్పం చేసుకున్న వారిలో ఉన్నాను.[1] ఇంకా నేను నాతోపాటు ఖుర్బానీ పశువును తీసుకువెళ్ళలేదు. హ్రజత్ ఆయెషా (ర), (అకస్మాత్తుగా) తాను బహిష్టు అయ్యాననీ జిల్హజ్జ మాసం తొమ్మిదవ తేదీ రాత్రి వరకు బహిష్టు నుంచి పరిశుభ్రతను పొందలేకపోయానని చెప్పారు. అప్పుడు ఆమె ప్రవక్త (స)తో ఇలా అన్నారు : "ఓ ప్రవక్తా (స)! అరఫా రాత్రి అయితే వచ్చేసింది కదా! (ఉదయమైతే అరఫా దినం) నేను ఉమ్రా సంకల్పానికి సంబంధించిన ఇహ్రామ్‌ను ధరించాను. కనుక ఇప్పుడు నేనేమి చెయ్యాలి? [2]**

---

312-1. హాఫిజ్ ఇబ్నె హజర్ గారు ఇలా విశ్లేషించారు; ఈ హదీసు ద్వారా ఎన్నో పరమార్థాలు వెలికివచ్చాయి. ఆశ్చర్యం కలిగినప్పుడు సుబ్హానల్లాహ్ అని అనటం; మహిళలకు సిగ్గుపడే విషయం చెప్పేటప్పుడు సంజ్ఞలూ, సైగలూ చేసి చెప్పటం; ఒక స్త్రీ పురుషుణ్ణి ప్రశ్నలు అడగటం; ధర్మానికి సంబంధించిన అత్యవసర విషయాలను అర్థమయ్యేలా చెప్పటానికి చెప్పిన విషయాన్నే మళ్లీ చెప్పటం; ఒక విద్వాంసుడు చెప్పిన విషయాన్ని అతని ముందే వివరించటం, ఇతరులకు బోధించటం.

313-1. 'తమత్తు'కు సంబంధించిన విషయం 'కితాబుల్ హజ్' (హజ్ ప్రకరణం)లో ముందు రాబోతోంది, ఇన్షా అల్లాహ్. 'తమత్తు' అంటే; ఒక మనిషి మీఖాత్‌కు చేరుకున్న తరువాత ఉమ్రాకు సంబంధించిన ఇహ్రామ్‌ను ధరించటం. ఆ తరువాత మక్కాకు చేరుకున్న తరువాత ఉమ్రా చేసి ఇహ్రామ్‌ను విప్పివెయ్యటం. దాని తరువాత

**దైవప్రవక్త (స) ఆమెతో ఇలా అన్నారు: "ఇలా చెయ్యి; నీ శిరోజాలను విప్పి తల దువ్వుకో.[3] ఇంకా నీవు చెయ్యదలచుకున్న ఉమ్రాను వాయిదా వెయ్యి." అప్పుడు నేను అలానే చేశాను.[4] నేను హజ్‌ను పూర్తి చేశాను. అప్పుడు ముహ్‌సబ్[5] రాత్రి సమయంలో మహనీయ ప్రవక్త (స) నా సోదరుడైన అబ్దుర్రహ్మాన్‌కు, నేను మొదట ఇహ్రామ్ ధరించిన ఉమ్రాకు బదులుగా, నన్ను తన్‌యీమ్[6]కు తీసుకుపోయి అక్కడ నుంచి రెండో ఉమ్రాను చేయించుకురా అని ఆజ్ఞాపించారు.**

## 17వ అధ్యాయం

### బహిష్టుకు సంబంధించిన గుసుల్ చేసేటప్పుడు స్త్రీ తన శిరోజాలను విప్పటం.

**314. హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హ) ఇలా ఉల్లేఖించారు: మేము జిల్‌హజ్జా మాసం నెలవంక సమీపిస్తూ ఉండగా మదీనాపురం నుంచి బయలుదేరాము.[1] ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారు: ఎవరైనా ఉమ్రాకు**

---

ఎనిమిదవ తేదీన మక్కాలో హజ్‌కు సంబంధించిన ఇహ్రామ్‌ను ధరించటం. ఇందులో ఎంతో సౌలభ్యం ఉంది కనుకనే చాలా మంది హాజీలు అలా చేస్తారు.

313-2. ఇప్పుడైతే నా హజ్ నెరవేరలేదు. ఎందుకంటే ఇంకా ఉమ్రాయే కాలేదు కదా! మరొకవైపు హజ్ సమయం రానే వచ్చింది.

313-3. ఇక్కణ్ణుంచే అధ్యాయంలోని ప్రధాన విషయం ప్రస్తావనకు వస్తుంది. ఎందుకంటే; ఇహ్రామ్‌కు సంబంధించిన స్నానం (గుసుల్) కోసం తలదువ్వుకోవటం ధర్మశాస్త్రబద్ధమైనప్పుడు, బహిష్టు ఆగిపోయిన తరువాత చేసే స్నానానికి తలదువ్వుకోవటం అనేది అత్యంత శ్రేష్ఠమైన విధానమే అవుతుంది.

313-4. అంటే, ఉమ్రాను విడిచిపెట్టి హజ్‌కు సంబంధించిన ఇహ్రామ్‌ను ధరించాను.

313-5. అంటే, ఏ రాత్రి అయితే మినా నుంచి తిరిగి వచ్చి హజ్ పూర్తి చేసి 'ముహ్‌సబ్'లోకి ప్రవేశించి అక్కడ ఆగిపోతారో, అది జిల్‌హజ్జా నెల యొక్క 13వ రాత్రియో లేక 14వ రాత్రియో అవుతుంది.

313-6. తన్‌యీమ్ ఒక స్థలం పేరు. అది కాబా గృహానికి అత్యంత సమీపంలో ఉన్నటువంటి సరిహద్దు. మక్కా నుంచి మూడు మైళ్ల దూరంలో ఉంది. ఇప్పుడు చాలా మంది ప్రజలు ఉమ్రాకు సంబంధించిన ఇహ్రామ్‌ను అక్కడి నుంచే కట్టుకుంటారు. అక్కడ ఒక మసీదు కూడా వుంది. దానిని 'మస్జిదె ఆయెషా' అని పిలుస్తారు.

**సంబంధిం చిన ఇహ్రామ్‌ను ధరించదలిస్తే అతను ఉమ్రాకు సంబంధించిన ఇహ్రామ్‌నే ధరించాలి. నేను గనక ఖుర్బానీ పశువును నాతోపాటు తీసుకురాకుండా ఉన్నట్లయితే, అప్పుడు నేను కూడా ఉమ్రాకు సంబంధించిన ఇహ్రామ్‌నే ధరించి ఉండేవాణ్ణి. ఆ తరువాత కొందరు ఉమ్రాకు సంబంధించిన ఇహ్రామ్‌ను కట్టుకున్నారు. మరికొందరు హజ్‌కు సంబంధించిన ఇహ్రామ్‌ను కట్టుకున్నారు. నేను ఉమ్రాకు సంబంధించిన ఇహ్రామ్‌ను కట్టుకున్నవారిలో ఉన్నాను. (అకస్మాత్తుగా) అరఫా దినం రానే వచ్చింది. నేను బహిష్టు అయి ఉన్నాను. నేను దానిని గురించి మహాప్రవక్త (స)కు విన్నవించు కున్నాను. దానికి సమాధానంగా ఆయన (స) గారు ఇలా సెలవిచ్చారు: నీ ఉమ్రాను వాయిదా వెయ్యి. నీ తల వెంట్రుకలను విప్పుకో, తల దువ్వుకో.[2] ఇంకా హజ్‌కు సంబంధించిన ఇహ్రామ్‌ను కట్టుకో. నేను అలానే చేశాను. (హజ్ ముగిసిన తరువాత) ముహ్‌సబ్ రాత్రి వచ్చినప్పుడు ఆయన (స) నా సోదరుడైన అబ్దుర్రహ్మాన్‌ను నాతోపాటు పంపారు. నేను తన్‌యీమ్ వరకు వెళ్లాను. అక్కడ ఇదివరకటి ఉమ్రాకు బదులుగా మరొక ఉమ్రాకు సంబంధించిన ఇహ్రామ్‌ను కట్టుకున్నాను. హిషామ్ ఇలా అన్నారు. ఈ అన్ని విషయాలలో ఖుర్బానీ తప్పనిసరిగా ఇవ్వాలని గానీ, ఉపవాసాన్ని విధిగా పాటించాలని గానీ, దానధర్మాలు తప్పకుండా చేయాలని గానీ చెప్పబడలేదు.**

## 18వ అధ్యాయం

**దివ్యఖురానులోని 'హజ్జ్' సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "రూపం కలదిగానూ, రూపంలేనిదిగాను ఉన్న స్థితిలో నుండి మేము మిమ్మల్ని పుట్టించాము."**

---

314-1. ఇది హజ్జతుల్ విదా. (ప్రవక్త (స) గారి అంతిమ వీడ్కోలు హజ్ యాత్రకు సంబంధించిన ప్రస్తావన. ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (స) జీఖఅద మాసం 25వ తేదీ శనివారం నాడు ప్రజలతో మదీనాపురం నుంచి బయల్దేరారు.

314-2. ఈ హదీసు ద్వారా స్పష్టంగా తెలిసే విషయం ఏమిటంటే, బహిష్టుకు సంబంధించిన గుసుల్ చేసుకునేటప్పుడు శిరోజాలను విప్పి విరబోసుకోవటం, జడను విప్పటం అనేవి వాజిబ్ అవుతాయి. ఇదే అభిప్రాయాన్ని హసన్ మరియు తావుస్ వ్యక్తం చేశారు. కొందరు ఏమన్నారంటే; బహిష్టు, జనాబత్‌లకు సంబంధించిన స్నానాలలో కూడా ఇలా చెయ్యటం అభిలషణీయమైనదే. మరికొందరు ఏమన్నారంటే; బహిష్టుకు సంబంధించిన గుసుల్ చేసుకునేటప్పుడు స్త్రీ తప్పనిసరిగా శిరోజాలను విరబోసుకోవాలి; కాని జనాబత్‌కు సంబంధించిన గుసుల్ చేసేటప్పుడు అలా చెయ్యటం తప్పనిసరి ఏమీ కాదు. ఇమామ్ అహ్‌మద్ బిన్ హమ్‌బల్ (రెహ్మాలై) కూడా ఈ అభిప్రాయాన్నే సమర్థించారు.

**315.** ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హ్జ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఉల్లేఖించారు: మహోన్నతుడైన అల్లాహ్ ప్రతి స్త్రీ యొక్క గర్భాశయం మీద ఒక దైవదూతను నియమిస్తాడు. ఆ దూత ఇలా విన్నవించుకుంటాడు : "ఓ ప్రభూ! ఇప్పుడు వీర్యబిందువు (గర్భంలో) పడింది; ఓ ప్రభూ! ఇప్పుడు అది రక్తంగా మారిపోయింది; ఓ ప్రభూ! ఇప్పుడు అది మాంసపు కండగా అయి పోయింది. తరువాత అల్లాహ్ తన సృష్టిని పూర్తి జెయ్యదలిచినప్పుడు; దైవదూత ఇలా అడుగుతాడు; ఓ ప్రభూ! పురుషుడా లేక స్త్రీయా? దౌర్భాగ్యుడా? లేక సౌభాగ్యవంతుడా? అతనికి లభించనున్న ఉపాధి ఎంత? అతను ఎంతకాలం జీవిస్తాడు?" ఆ తరువాత మాతృ గర్భంలోనే ఇదంతా వ్రాయబడుతుంది.[1]

## 19వ అధ్యాయం

### బహిష్టు అయిన స్త్రీ హజ్‌కూ లేక ఉమ్రాకూ సంబంధించిన ఇహ్రామ్‌ను ఎలా కట్టుకోవాలి?

**316.** హ్జ్రత్ ఆయెషా (రజిఅన్‌హ) ఇలా అన్నారని ఉర్వా ఉల్లేఖించారు: మేము ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారితో ఆయన గారి అంతిమ హజ్ యాత్ర కోసం మదీనా నుంచి బయలుదేరాము. మాలో కొందరు ఉమ్రాకు సంబంధించిన ఇహ్రామ్‌ను కట్టుకున్నారు. మరికొందరు హజ్‌కు సంబంధించిన ఇహ్రామ్‌ను ధరించారు. మేము మక్కా నగరానికి చేరుకున్నప్పుడు మహనీయ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: చూడండి! ఎవరైతే ఉమ్రాకు సంబంధించిన ఇహ్రామ్‌ను ధరించారో, వారు తమతో ఖుర్బానీ పశువును తీసుకురానట్లయితే అప్పుడు వారు తమ ఇహ్రామ్‌ను విప్పేసెయ్యాలి. ఇంకా ఎవరైతే ఉమ్రాకు సంబంధించిన ఇహ్రామ్‌ను ధరించారో, తమతోపాటు ఖుర్బానీ పశువును తీసుకువచ్చారో వారు ఖుర్బానీ పశువును జిబహ్ చెయ్యనంతవరకు ఇహ్రామ్‌ను తీసివెయ్యకూడదు. ఎవరైతే హజ్ యాత్రకు సంబంధించిన ఇహ్రామ్‌ను ధరించారో వారు తమ హజ్ యాత్రను పూర్తి చేసుకోవాలి. అప్పుడు హ్జ్రత్ ఆయెషా (ర) ఇలా అన్నారు : నేను బహిష్టు అయ్యాను, అరఫా దినం వరకు బహిష్టు స్థితిలో ఉన్నాను. నేను ఉమ్రాకు సంబంధించిన

---

315-1. అంటే ఉపాధీ, ఆహారమూ, జీవిత కాలమూ, సౌభాగ్యమూ, దౌర్భాగ్యమూ ఇవన్నీ తల్లి గర్భంలో ఉన్నప్పుడే వ్రాయబడతాయి. వాటికి వ్యతిరేకంగా ఏదీ, ఎంత మాత్రమూ జరుగదు.

ఇహ్రామ్‌నే కట్టుకున్నాను. చివరకు మహాప్రవక్త ముహమ్మద్(స) నన్ను ఇలా ఆజ్ఞాపించారు; “నీ శిరోజాలను విప్పేసెయ్యి, నీ శిరోజాలను దువ్వెనతో దువ్వుకో. ఇంకా హజ్‌కు సంబంధించిన కొత్త ఇహ్రామ్‌ను కట్టుకో; ఉమ్రాను వాయిదా వెయ్యి. నేను అలానే చేశాను. చివరకు నా హజ్‌ను పూర్తిచేసుకున్నాను. అప్పుడు ఆయన (స) గారు అబ్దుర్రహ్మాన్ బిన్ అబీ బకర్ (ర)ను నాతోపాటు పంపుతూ ఇలా ఆజ్ఞాపించారు; “తన్‌యీమ్ నుంచి తప్పిపోయిన నా ఉమ్రాకు బదులుగా నేను మరొక ఉమ్రాకు సంబంధించిన ఇహ్రామ్‌ను ధరించాలని.”

## 20వ అధ్యాయం

బహిష్టు ప్రారంభానికీ, సమాప్తానికీ సంబంధించిన విషయం. స్త్రీలు హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) వద్దకు బరణి (డబ్బీ) పంపేవారు.[1] అందులో దూది ఉండేది. దాని మీద పసుపు పచ్చనిరంగు గుర్తులు ఉండేవి. అప్పుడు హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) ఇలా సెలవిచ్చేవారు; “తొందరపడబాకండి; సున్నం మాదిరిగా రంగు తెల్లగా మారే వరకు; అంటే బహిష్టు నుంచి పూర్తిగా పరిశుద్ధతను పొందేవరకు నిరీక్షించండి”.[2] జైద్ బిన్ సాబిత్ గారి కూతురు (ఉమ్మెకుల్సూమ్ గారి)కి, కొందరు స్త్రీలు అర్ధరాత్రి సమయంలో దీపాలు తెప్పించుకుని తాము పరిశుద్ధులమయ్యామో లేదో తెలుసుకోవటానికి దీపం వెలుగులో చూసేవారు అనే విషయం తెలిసింది. అప్పుడు ఆమె ఇలా అన్నారు; మహాప్రవక్త (స) గారి కాలంలోనైతే స్త్రీలు ఇలా చేసేవారు కాదు. ఆమె వారిని అలా చేసినందుకు తప్పు పట్టారు.[3]

---

20–1. ‘దరజ’ అనే అరబ్బీ పదాన్ని మేము డబ్బీగానూ, బరణీ గాను అనువాదం చేశాము. ఈ బరణిలో బహిష్టుకు సంబంధించిన దూదిని పెట్టేవారు. కొందరు ‘దరజ’ పదానికి గుడ్డ సంచి అని కూడా అనువాదం చేశారు.

20–2. అంటే, దూది పెట్టి చూసినప్పుడు అది పూర్తిగా తెల్లగా కనిపించాలి.దాని మీద ఎటువంటి మచ్చ కనిపించకూడదు. లేదా బహిష్టు ముగింపు సమయంలో వెలువడే శ్వేత వర్ణ ద్రవం కనిపించనంత వరకు.

20–3. ఎందుకంటే ఇస్లామ్ ధర్మశాస్త్రంలో సౌలభ్యం ఉన్నది; అర్ధరాత్రి సమయంలో దీపాన్ని తెప్పించటం, మాటిమాటికీ చూడటం ఎంతో కష్టంతో కూడుకున్న పని. కొందరు ఏమన్నారంటే; రాత్రి సమయంలో దీపాలు పెట్టి స్త్రీలు అలా ఎందుకు చూసేవారంటే, రాత్రి చీకటిలో స్వచ్ఛమైన తెల్లదనం స్పష్టంగా కనిపించదు, స్పష్టంగా

**317.** **హజ్రత్ ఆయెషా (రజిఅన్హ) గారి ఉల్లేఖనం ఒకటి ఇలా ఉంది : ఫాతిమా బిన్తె అబీ హుబైష్‌కు 'ఇస్తిహాజా' (రక్తస్రావం) అవుతూ ఉండేది. ఆమెగారు మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్)ను ఈ విషయమై అడిగారు. దానికి సమాధానంగా దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; ఇది ఒక నరం నుంచి స్రవించే రక్తమేగాని బహిష్టు రక్తం మటుకు కాదు. బహిష్టుకు సంబంధించిన రక్తం స్రవించినప్పుడు మాత్రం నమాజు చెయ్యకు, నమాజును విడిచిపెట్టు. బహిష్టు గడువు పూర్తి అయిన తరువాత తలంటి స్నానం (గుసుల్) చెయ్యి. ఆ తరువాత నమాజు చెయ్యి.**[1]

## 21వ అధ్యాయం

**బహిష్టు అయిన స్త్రీ గుసుల్ తరువాత 'ఖజా' నమాజు చేసే అవసరం లేదు.[1] ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ జాబిర్ (రజిఅన్), హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్)లు వేర్వేరుగా ఉల్లేఖించారు; "బహిష్టు దినాలలో స్త్రీ నమాజును విడిచిపెట్టాలి."[2]**

---

తెలియదు కాబట్టి. కనుక ఆ స్త్రీలు తాము పరిశుద్ధలమైపోయామని మోసపోయే అవకాశం ఉంది. ఇంకా ఈ కారణం వల్ల వారు నమాజు కూడా చేసే అవకాశం ఉంది. వాస్తవానికి వారు ఇంకా పరిశుద్ధలయి ఉండకపోవచ్చు. కనుక వారు పుణ్యానికి అర్హులయ్యే బదులుగా పాపంలో చిక్కుకుపోయే ప్రమాదానికి గురి కావచ్చు.

317-1. ఇస్లామ్ ధర్మశాస్త్రవేత్తలు 'ఇస్తిహాజా' (రక్తస్రావం)కు సంబంధించిన సమస్యలను గురించి సుదీర్ఘమైన వ్యాఖ్యానాలు చేశారు. వాటి వల్ల పెద్ద చిక్కులే ఏర్పడ్డాయి. అహ్లె హదీస్ విద్వాంసుల అభిప్రాయం ఏమిటంటే; మొట్టమొదట స్త్రీ రక్తం యొక్క రంగును నిశితంగా చూడాలి; బహిష్టు రక్తం నల్లగా ఉంటుంది; దానిని తేలికగా గుర్తించవచ్చు. స్త్రీలు తమ అలవాటు ప్రకారం బహిష్టు దినాలను అంచనా వేసుకోవాలి. ఒకవేళ రంగు ద్వారా గానీ, అలవాటు ప్రకారంగానీ గుర్తుపట్టటం సాధ్యం కాకపోతే ఆరు లేక ఏడు దినాలను బహిష్టు దినాలుగా నిర్ణయించుకోవాలి. ఎందుకంటే చాలా మంది స్త్రీలకు బహిష్టు ఆరు లేక ఏడు దినాల వరకే ఉంటుంది.

21-1. ఈ విషయం గురించి విద్వాంసుల మధ్య ఏకాభిప్రాయం ఉన్నది. కాని 'ఖవారిజ్' వర్గానికి చెందిన కొందరు ఏమంటారంటే; బహిష్టు అయిన స్త్రీ బహిష్టు నుంచి పరిశుభ్రత పొందిన తరువాత అంటే గుసుల్ చేసుకున్న తరువాత, బహిష్టు దినాలలో చెయ్యనటువంటి నమాజులను (అంటే ఖజా నమాజులను) తప్పనిసరిగా చెయ్యాలి.

21-2. 'విడిచిపెట్టటం' అంటే ఆ నమాజులను తప్పనిసరిగా చెయ్యవలసిన అవసరం

**318.** ఒక స్త్రీ హజ్రత్ ఆయెషా (రజిఅన్హా)ను ఇలా అడిగిందని ముఆజ బిన్తె అబ్దుల్లాహ్ ఉల్లేఖించారు; "మాలోని ఏ స్త్రీ అయినా బహిష్టు నుంచి పరిశుద్ధతను పొందిన తరువాత, బహిష్టు కాలంలో విడిచిపెట్టిన నమాజులను తప్పనిసరిగా చెయ్యాలా? (అంటే ఖజా నమాజులను చెయ్యవలసిన అవసరం ఉందా?)" దానికి సమాధానంగా హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా అన్నారు : నీవు హరూరీ (ఖారిజ)కి చెందిన మహిళవా? మహాప్రవక్త (స) గారి కాలంలో మేము బహిష్టు అయినప్పుడు, ఆ తరువాత 'ఖజా' నమాజులు చెయ్యమని ఆయన(స) గారు మమ్మల్ని ఆజ్ఞాపించేవారు కాదు. లేదా ముఆజ బిన్తె అబ్దుల్లాహ్ ఇలా ఉల్లేఖించారు; మేము 'ఖజా' నమాజులు చేసేవారము కాము.[1]

## 22వ అధ్యాయం

### బహిష్టు అయిన స్త్రీ తన బహిష్టు బట్టలతో ఉన్న స్థితిలో ఆమెతో కలిసి పడుకోవటం.

**319.** విశ్వాసుల తల్లి అయిన ఉమ్మె సలమా (రజిఅన్హా) ఇలా అన్నారని జైనబ్ బిన్తె అబీ సలమా ఉల్లేఖించారు: ఒకసారి నేను ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారితో కలిసి ఉన్ని శాలువా కప్పుకుని పడుకున్నాను. ఇంతలోనే నాకు బహిష్టు వచ్చింది. అప్పుడు నేను మెల్లగా అక్కడ నుంచి జారుకున్నాను. తరువాత నా బహిష్టు బట్టలను తీసుకుని వాటిని కట్టుకున్నాను. ప్రవక్త

---

లేదు అనే భావమే వస్తుంది. ఈ రెండు హదీసులను ఇమామ్ బుఖారీ గారు ఆధారంగా తీసుకున్నారు. అబూ సయీద్(ర) గారి హదీసు పైన వచ్చేసింది; హజ్రత్ జాబిర్ (ర) గారి హదీసు ఇన్షాఅల్లాహ్ కితాబుల్ అహెకామ్‌లో రాబోతోంది.

318–1. ఆమె హరూరా అనే పట్టణానికి చెందిన మహిళ. అది కూఫా నగరానికి రెండు మైళ్ల దూరంలో ఉన్నటువంటి ఒక ప్రాంతం. శాపగ్రస్తులైన 'ఖవారిజ్' వర్గం వారు ఆ ప్రాంతంలోనే గుమిగూడారు. హజ్రత్ అలీ (రజిఅన్) వారిని పట్టుకుని కొట్టారు, కొందరిని చంపారు. ఏ మనిషైతే దివ్య ఖురాను గ్రంథాన్ని విశ్వసించి హదీసులను విశ్వసించడో అతను కూడా శాపగ్రస్తుడైన ఖారిజాయే అవుతాడు. హదీసులు ఖురాను గ్రంథానికి తాత్పర్యాలు. హదీసులను అధ్యయనం చెయ్యకుండా, అర్థం చేసుకోకుండా, వాటిని విశ్వసించకుండా ఏ మనిషైనా ఖురాను గ్రంథం ప్రకారం అమలుపరచలేడు. హదీసుల ప్రకారం నడవమని ఖురాను గ్రంథం ఆజ్ఞాపిస్తోంది.

**మహనీయులు (స), "నీవు బహిష్టు అయ్యావా?" అని అడిగారు. దానికి సమాధానంగా నేను, 'అవును ప్రవక్తా!' అని చెప్పాను. ఆ తరువాత ఆయన (స) గారు నన్ను పిలిచారు. మరియు దుప్పట్లోకి తీసుకున్నారు. ఉమ్మె సలమా (ర) ఇంకా ఇలా చెప్పారని జైనబ్ ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు(స) ఉపవాస స్థితిలో కూడా నన్ను ముద్దు పెట్టుకునేవారు. ఇంకా నేనూ ఆయన (స) గారూ ఉభయులమూ కలిసి ఒకే పాత్ర లోని నీళ్లతో జనాబత్‌కు సంబంధించిన గుసుల్ చేసుకునేవారము.**

## 23వ అధ్యాయం

**బహిష్టుకు సంబంధించిన బట్టలను పరిశుభ్రమైన బట్టలను వేర్వేరుగా ఉంచాలి.**

**320. హజ్రత్ ఉమ్మె సలమా (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి నేను ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅనమ్)తో కలిసి ఒక ఉన్ని శాలువాలో పడుకున్నాను. ఇంతలోనే నేను బహిష్టు అయ్యాను. అప్పుడు నేను అక్కడ నుంచి బయటికి వెళ్ళిపోయాను. తరువాత నా బహిష్టు వస్త్రాలను కట్టుకున్నాను.[1] ప్రవక్త మహనీయులు (స), "నీవు బహిష్టు అయ్యావా?" అని అడిగారు. నేను, "అవును ప్రవక్తా!" అని జవాబు పలికాను. తరువాత ఆయన (స) గారు నన్ను పిలిచారు. నేను ఆయన (స) గారితో కలిసి ఉన్ని శాలువాలో పడుకున్నాను.**

## 24వ అధ్యాయం

**బహిష్టు అయిన స్త్రీ రెండు పండుగలలోనూ, ముస్లిములు చేసే దుఆలలోనూ పాల్గొనవచ్చు. ఇంకా ఈద్గాహ్ నుంచి వేరుగా ఉండటం[1] గురించి.**

---

320–1. 'మా వద్ద ఆ కాలంలో ఒకే ఒక వస్త్రం ఉండేది, అనే విషయం ఏ హదీసులో నయితే ప్రస్తావించబడిందో, ఆ హదీసుకు ఈ హదీసు వ్యతిరేకమేమీ కాదు. ఎందుకంటే ఇక్కడే భిన్నమైన పరిస్థితుల్ని గురించీ, భిన్నమైన కాలాలను గురించీ ప్రస్తావించడం జరిగింది; కష్టకాలంలో ఒకే ఒక వస్త్రం ఉన్నదేమో తరువాత అల్లాహ్ ఆర్థిక స్థోమతను పెంచాడేమో, ఈ కారణంగా ఎన్నో వస్త్రాలు ఉండేవేమో.

24–1. భావం ఏమిటంటే, బహిష్టు అయిన స్త్రీలు పండుగ రోజున బయటికి వెళ్లవచ్చు. ముస్లిమ్ ప్రజలు సమావేశమయ్యేటటువంటి ఈద్గాహ్‌కు కూడా వారు పోవచ్చు; కాని నమాజు చేసే స్థలానికి దూరంగా ఉండాలి, అంటే ఈద్గాహ్‌కు బయట ఉండాలి. ఎందుకంటే వారు నమాజు చెయ్యటానికి వీలులేదు కదా! కనుక వారు ఈద్గాహ్

**321.** ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిస్తూ ఉండగా నేను విన్నానని ఉమ్మె అతియా(రజిఅన్హా) ఉల్లేఖించారు : "అవివాహితలైన యువతులూ, పరదాను పాటించే స్త్రీలూ ఇంకా బహిష్టు అయిన మహిళలూ, వీరందరూ పండగ దినం నాడు బయటికి వెళ్ళవచ్చు; పుణ్యకార్యాలు చెయ్యటంలో, ముస్లిములు చేసే దుఆలలో పాల్గొనవచ్చు. అయితే బహిష్టు అయిన స్త్రీలు నమాజు చేసే స్థలానికి దూరంగా ఉండాలి." హఫ్సా (రజిఅన్హా) ఉమ్మె అతియాను, "ఏమిటి బహిష్టు అయిన స్త్రీలు కూడా బయటికి వెళ్ళవచ్చా?" అని అడిగారు. దానికి సమాధానంగా ఆమె ఇలా అన్నారు: బహిష్టు అయిన మహిళలు అరఫాత్‌కూ, ఫలానా ఫలానా ప్రాంతాలకూ వెళ్లటం లేదా?[1] (అంటే వారికి ఈ పవిత్ర స్థలాలకు వెళ్లే అనుమతి ఉన్నప్పుడు ఈద్గాహ్‌కు ఎందుకు వెళ్ళకూడదు)."

## 25వ అధ్యాయం

ఒకవేళ స్త్రీ ఒకే మాసంలో మూడు సార్లు బహిష్టు అయితే–దానికి సంబంధిం చిన ఆదేశాలు. బహిష్టు, గర్భధారణ విషయంలో సాధ్యమైనంతవరకు[1] స్త్రీల మాటలు నిజమని నమ్మాలి. ఎందుకంటే కరుణామయుడైన అల్లాహ్ ఖురాను గ్రంథంలో బఖరా సూరాలో ఇలా సెలవిచ్చాడు : "విడాకులివ్వబడిన స్త్రీలు మూడు రుతువుల కాలం పూర్తయ్యేవరకు విధిగా వేచి ఉండాలి. వారి గర్భాశయాలలో అల్లాహ్ సృష్టిం చిన దానిని దాచటం వారికి ధర్మంకాదు."[2] హజ్రత్ అలీ (రజిఅన్) మరియు ఖాజీ షురైహ్ ఇలా సెలవిచ్చారు;[3] ఒకవేళ స్త్రీ, ధార్మికత, విశ్వసనీయతగల ఆంతరంగి కులైన తన సమీప బంధువులను సాక్షులుగా తీసుకువస్తే, ఇంకా ఆమె ఒకే నెలలో

---

లోపలకు పోయే అవసరం లేదు. ఖస్తలాని ఏమన్నారంటే; బహిష్టు అయిన స్త్రీలు ఈద్గాహ్ లోపలకు పోవటం మక్రూహ్ అంటే అవాంఛనీయం. కాని నిషిద్ధం మాత్రం కాదు. ఎందుకంటే మసీదుకు సంబంధించిన ఆజ్ఞ ఈద్గాహ్‌కు అన్వయించదు.

321–1. బహిష్టు అయిన స్త్రీలు అపరిశుద్ధావస్థలో ఉంటారు. కాబట్టి వారు ఆరాధనా స్థలాలకు వెళ్లటం ధర్మసమ్మతం ఎలా అవుతుంది? అని హఫ్సా (ర) ఆశ్చర్యపడుతూ అడిగిన ప్రశ్నకు ఉమ్మె అతియా (ర) ఇలా జవాబు పలికారు; బహిష్టు అయిన స్త్రీలు హజ్ యాత్ర దినాలలో అరఫాత్‌లో ఆగుతారు, ముజ్దలిఫాలో ఉంటారు, మినాలో కంకరరాళ్ళు విసురుతారు – ఇవన్నీ ఆరాధనా స్థలాలే కదా! అదే విధంగా ఈద్గాహ్ లోకి కూడా వారు ప్రవేశించవచ్చు.

**మూడు సార్లు బహిష్టు అయిందని సాక్ష్యమిస్తే అప్పుడు ఆమె మాట నిజమని నమ్మవలసి ఉంటుంది.[4] 'అతా'గారు ఇలా అన్నారు; 'ఇద్దత్' (గడువు)కు పూర్వం ఆ స్త్రీ యొక్క బహిష్టు దినాలు ఎన్ని అయితే ఉన్నాయో వాటిని మాత్రమే పరిగణనలోనికి తీసుకోవాలి. ఇబ్రాహీమ్ నఖయీ గారి అభిప్రాయం కూడా ఇదే. ఇంకా అతా గారు ఇలా అన్నారు; బహిష్టు అనేది కనీసం ఒక రోజు నుంచి పదిహేను రోజుల వరకు ఉంటుంది.[5] తన తండ్రిగారు ఇలా చెప్పారని 'ముఅతమిర్' ఉల్లేఖించారు;[6] "నేను ముహమ్మద్ బిన్ సీరీన్‌ను ఇలా అడిగాను; ఒకవేళ స్త్రీ బహిష్టు నుంచి పరిశుద్ధతను పొందిన ఐదు రోజుల తరువాత మళ్లీ రక్తాన్ని చూసినట్లయితే?" దానికి సమాధానంగా ఆయన ఇలా అన్నారు; "ఈ విషయాలు స్త్రీలకే బాగా తెలుస్తాయి."[7]**

---

25-1. ఒకవేళ స్త్రీలు సంభవసాధ్యంకాని విషయాన్ని చెప్పినట్లయితే, అప్పుడు వారు చెప్పిన విషయాన్ని నమ్మకూడదు.

2. జుహ్రీ, ముజాహిద్ మొదలైన వారు ఈ ఖురాను వాక్యాన్ని గురించి వ్యాఖ్యానిస్తూ ఇలా అన్నారు; స్త్రీలు తమ బహిష్టును గాని, తమ గర్భాన్ని గాని దాచటం ధర్మ సమ్మతం కాదు; అంటే దాచటం ధర్మసమ్మతం కానప్పుడు, దానిని తప్పకుండా బహిర్గతం చెయ్యాలనే ఆజ్ఞ ఉందనే విషయం సుస్పష్టం. ఒకవేళ వారు చెప్పేది నమ్మదగిందిగా లేనప్పుడు బహిర్గతం చెయ్యటం వల్ల ప్రయోజనమేమిటి? ఈ విధంగా ఇమామ్ బుఖారీ (రహ్మలై) ఈ ఖురాను వాక్యం ద్వారా అధ్యాయంలోని భావాన్ని ప్రస్ఫుటం చేశారు.

3. నిజమైన ధ్రువీకరణతో దీనిని దారమీ గారు 'వసల్' చేశారు; షురైహ్‌గారు ఇలా తీర్పు చేశారు; హజ్రత్ అలీ (ర) గారు వారిని ఉద్దేశించి, "మీరు చక్కని తీర్పు చేశారు" అని సెలవిచ్చారు.

4. అసలు ఏమి జరిగిందంటే; షురైహ్ గారి ముందుకు ఒక వ్యాజ్యం వచ్చింది. ఒక స్త్రీ, ఆమె భర్త ఉభయుల మధ్య విడాకులను గురించి ఒక వివాదం తలెత్తింది. విడాకులిచ్చి ఒక మాసం గడువు తీరిపోయిన తరువాత ఆ స్త్రీ యొక్క భర్త ఆమెను తిరిగి దాంపత్య బంధంలోనికి తీసుకోదలిచాడు. కాని ఆ స్త్రీ ఇలా పలికింది; నా ఇద్దత్ గడువు తీరిపోయింది. ఒకే మాసంలో నేను మూడుసార్లు బహిష్టు అయ్యాను. అప్పుడు షురైహ్ గారు ఈ తీర్పును హజ్రత్ అలీ (ర) వద్దకు తీసుకుపోయారు.

5. దీనిని కూడా దారమీ గారే వసల్ చేశారు. అంటే జత కలిపారు, జోడించారు.

**322. ఫాతిమా బిన్తె అబీ హుబైష్ (ర) గారు మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్)ను ఇలా అడిగారని హజ్రత్ ఆయెషా (ర) ఉల్లేఖించారు; "ఓ దైవప్రవక్తా! నాకు ఎల్లప్పుడూ రక్తస్రావం అవుతూ ఉంటుంది. నాకు పరిశుద్ధత రానేరాదు. నేను నమాజును విడిచిపెట్టేదా?" దానికి సమాధానంగా ఆయన (స) గారు ఇలా సెలవిచ్చారు; "వద్దు, నమాజును విడిచిపెట్టవద్దు. ఇది ఒక నరం నుంచి స్రవించే రక్తం మాత్రమే. కనుక ఇలా చెయ్యి; ఈ వ్యాధి రాకపూర్వం నీవు ఎన్ని రోజులైతే బహిష్టు స్థితిలో ఉండే దానివో అన్ని రోజులు నమాజు చెయ్యకు. దానిని విడిచిపెట్టు. ఆ తరువాత గుసుల్ చేసుకో, నమాజు చేస్తూ ఉండు."**

## 26వ అధ్యాయం

### బహిష్టు దినాలలో కాక వేరే దినాలలో మట్టి రంగుగల, పసుపు రంగుగల రక్తాన్ని చూసినట్లయితే, అప్పుడు ఏమి చెయ్యాలి.[1]

**323. హజ్రత్ ఉమ్మె అతియ (రజిఅన్హ) ఇలా ఉల్లేఖించారు; "మేము మట్టి రంగు గల, పసుపు రంగుగల రక్తాన్ని అంత ప్రాముఖ్యంగల విషయంగా భావించే వారము కాము."**

---

ఇమామ్ షాఫయి (రహ్మాలై) గారి అభిప్రాయం కూడా ఇదే. ఇమామ్ అబూ హనీఫా (రహ్మాలై) గారి ప్రకారం బహిష్టు యొక్క కనీస గడువు మూడు రోజులు మాత్రమే. ఇంకా గరిష్ట గడువు పది రోజులు మాత్రమే. ఈ విషయానికి సంబంధించి హనఫి మస్లక్ వారు ఏ హదీసులనైతే ఉల్లేఖిస్తున్నారో అవి అన్నీ ప్రామాణికతలేని హదీసులు. అహ్లె హదీస్ మస్లక్ వారి అభిప్రాయం నిజమైనది. అదేమిటంటే; బహిష్టుకు సంబంధించిన గడువును ఖచ్చితంగా నిర్ణయించటం సాధ్యంకాని విషయం. అది స్త్రీ యొక్క అలవాటు మీద ఆధార పడి ఉంటుంది. ఒకవేళ గడువును నిర్ణయించినప్పటికీ అది ఆరు లేక ఏడు దినాల వరకే ఉంటుంది.

6. దీనిని కూడా దారమీ గారే వసల్ చేశారు.

7. ఒకవేళ ఆ స్త్రీ అలవాటు అటువంటిదే అయితే అంటే ఐదు రోజుల తరువాత ఆమె బహిష్టు అవుతూ ఉన్నట్లయితే అప్పుడు అది బహిష్టుగానే పరిగణించబడుతుంది.

26-1. ఒకవేళ బహిష్టు దినాలలో మట్టి రంగు గల లేదా పసుపురంగు గల రక్తం స్రవించినట్లయితే అప్పుడు అది బహిష్టుగానే పరిగణించబడుతుంది. అలాకాక ఇతర దినాలలో అది గనక స్రవించినట్లయితే అది బహిష్టు రక్తం కాదు. మన ఇమాములైన అహ్మద్ బిన్ హమ్బల్ (రహ్మాలై) గారు, షాఫయి (రహ్మాలై) గారు, అబూ హనీఫ (రహ్మాలై)గారు ఈ అభిప్రాయాన్నే సమర్థించారు.

## 27వ అధ్యాయం

### ఇస్తిహాజ యొక్క (రక్తస్రావపు) నరం గురించి.[1]

**324.** ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారి భార్య హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) గారు ఇలా ఉల్లేఖించారు; ఉమ్మె హబీబా (రజిఅన్హా) గారికి ఏడు సంవత్సరాల వరకు ఇస్తిహాజ (రక్త స్రావం) అవుతూ ఉండేది. ఆమె గారు ఈ సమస్యను గురించి దైవప్రవక్త (సఅసమ్)ను అడిగారు; దానికి సమాధానంగా ఆయన (స) గారు ఇలా సెలవిచ్చారు; "బహిష్టు దినాలు పూర్తి అయిన తరువాత గుసుల్ చేసుకో." తరువాత ఆయన (స) ఇలా సెలవిచ్చారు; "అది ఒక నరం(లో నుంచి స్రవించే రక్తము)." ఆ తరువాత ఉమ్మె హబీబా (రజిఅన్హా) గారు ప్రతి నమాజు కోసం గుసుల్ చేసుకునేవారు.[1]

## 28వ అధ్యాయం

### ఒకవేళ స్త్రీకి తవాఫె జియారత్ తరువాత బహిష్టు అయితే దానికి సంబంధించిన ఆజ్ఞను గురించి.[1]

**325.** దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) గారి భార్య, విశ్వాసుల తల్లి అయిన హజ్రత్ ఆయెషా (రజిఅన్హ) ఇలా ఉల్లేఖించారు; ఆమె గారు(ర) దైవప్రవక్త(స)కు ఇలా విన్నవించుకున్నారు; ఓ దైవప్రవక్తా! సఫియ బిన్తె హుయ్ (రజిఅన్హా) (దైవప్రవక్త (స) గారి సతీమణి) బహిష్టు అయ్యారు. దానికి సమాధానంగా ఆయన (స) ఇలా సెలవిచ్చారు; "బహుశా ఆమె వల్ల మన ప్రయాణం (మదీనాకు పోయే ప్రయాణం) ఆలస్యం కావచ్చు. ఇంకా ఆమె మీతోపాటు తవాఫ్ (ఇఫాజ) చెయ్య లేదా?" ఆమె (ర) దానికి సమాధానంగా, "అవును ఆమె తవాఫ్ చేశారు" అని అన్నారు. అప్పుడు దైవప్రవక్త (స), "అలాగైతే ఇక బయల్దేరండి వెళ్లిపోదాము"[1] అని సెలవిచ్చారు.

---

27–1. ఇస్తిహాజ యొక్క (రక్తస్రావానికి) సంబంధించిన రక్తం ఒక నరంలో నుంచి స్రవిస్తుంది. దానిని అరబ్బీ బాషలో ఆజిల్ అని అంటారు.

28–1. దీనినే తవాఫుల్ ఇఫాజ అని కూడా అంటారు. అంటే అది జిల్‌హజ్జ మాసం పదవ తేదీన చెయ్యబడుతుంది. ఈ తవాఫ్ (ప్రదక్షిణ)ను విధిగా చెయ్యాలి. ఇంకా అది హజ్ క్రియలకు సంబంధించిన ఒక మౌలిక విషయం. కాని కాబా నుంచి సెలవు తీసుకుని వెళ్లే సమయంలో హాజీలు చేసే ప్రదక్షిణ అంటే తవాఫుల్ విదాను విధిగా చెయ్యవలసిన అవసరం లేదు.

**326. హ(జత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఎవరైనా ఒక స్త్రీ బహిష్టు అయినప్పుడు, ఆమె తన పట్టణానికి తిరిగి వెళ్ళిపోవచ్చు. ఆమె తవాఫుల్ విదా చెయ్యకుండానే ఇంటికి వెళ్ళిపోవచ్చు. ఈ విషయంలో ఆమెకు అనుమతి ఇవ్వబడింది. కాని హ(జత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజిఅన్) మొదట్లో ఏమన్నారంటే; ఆమె తవాఫుల్ విదా చెయ్యనంతవరకు తన ఇంటికి తిరిగి వెళ్ళరాదు. తరువాత తావుస్ ఇలా అన్నారు; నేను, అతను ఇలా చెప్పగా విన్నాను. ఆమె ఇంటికి వెళ్ళిపోవచ్చు. ఎందుకంటే దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఈ విషయంలో స్త్రీలకు అనుమతి ఇచ్చారు[1].**

## 29వ అధ్యాయం

**రక్తస్రావం వ్యాధి ఉన్నటువంటి స్త్రీ (ముస్తహాజ) బహిష్టు నుంచి పరిశుద్ధతను పొందినప్పుడు;[1] హ(జత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా అన్నారు;[2] అప్పుడు ఆమె గుసుల్ చేసుకోవాలి, ఆ తరువాత నమాజు చెయ్యాలి, దినం పూర్తి కావటానికి ఇంకా ఒక గంటకాలం మిగిలి ఉన్నా సరే. ఆమె నమాజ్ చేయసాగినప్పుడు ఆమె భర్త ఆమెతో సంభోగించవచ్చు. నమాజు అయితే అన్ని విషయాల కంటే గొప్పది, ముఖ్య మైనది.[3]**

---

325–1. తవాఫుల్ విదాను బహిష్టు అయిన స్త్రీ చెయ్యవలసిన అవసరం లేదు. దాని నుంచి ఆమెకు మినహాయింపు ఉన్నది. ఆమె తప్పనిసరిగా విధిగా దానిని పాటించాలనే నియమమేదీ లేదు.

326–1. అంటే, మహనీయ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) గారికి హదీసు చేరగానే ఆయన తన అభిప్రాయాన్ని, ధార్మిక తీర్పును ఉపసంహరించుకున్నారు. ధర్మవేత్తల, ఇమాములందరి పద్ధతి కూడా ఇదే. సత్యం ప్రస్ఫుటమవగానే దానివైపునకు మరలేవారు. తమ మాటపై హఠం చేసేవారు కాదు. ఆ కాలపు మహనీయుల విధానమది. కాని నేడు చాలామంది ప్రామాణిక హదీసును చూసిన మీదట కూడా తమ స్వంత అభిప్రాయాన్ని మార్చుకోవటానికి సిద్ధంగా లేరు. పైగా హదీసును అనుసరించేవారి పట్ల వైర వైఖరిని అవలంబిస్తున్నారు.

29–1. రక్తస్రావానికి సంబంధించిన రక్తం స్రవిస్తూ ఉన్నప్పటికీ. ఇంకా రంగు మొదలైన విషయాల ద్వారా స్త్రీలు ఆ రక్తాన్ని తేలికగా గుర్తించగలుగుతారు.

29–2. ఈ తాలీఖ్‌ని ఇబ్నె అబీ షీబా, దారమీ గార్లు వసల్ చేశారు.

**327.** **దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఉల్లేఖించారు; బహిష్టుకు సంబంధించిన రక్తం వెలువడటాన్ని చూసినప్పుడు, నమాజును విడిచిపెట్టు. బహిష్టు రక్తం ఆగిపోయి నప్పుడు నీ శరీరం మీద ఉన్నటువంటి రక్తాన్ని కడిగెయ్యి. తరువాత నమాజు చెయ్యి.**[1]

## 30వ అధ్యాయం

**ప్రసవ సంబంధమైన రక్తస్రావం గల స్త్రీ యొక్క 'నమాజె జనాజ' ను చెయ్యటం. ఇంకా దాని విధానం.**[1]

---

29-3. అంటే రక్తస్రావపు వ్యాధి ఉన్నటువంటి స్త్రీ గుసుల్ చేసుకుని నమాజు చెయ్యటం అనేది సరియైనదీ, సక్రమమైనదీ అయినప్పుడు, భర్త ఆమెతో సంభోగించటం ఉత్తమ మైన రీతిలో ధర్మసమ్మతం అవుతుంది. అబ్దుర్రజ్జాఖ్ గారు ఈ నిర్ణయం చేశారు.

327-1. ఈ హదీసు ఆధారంగా ఇమామ్ బుఖారీ (ర.హ్మాలై) గారు విశ్లేషించిన విషయం ఏమిటంటే; రక్తస్రావపు వ్యాధి ఉన్నటువంటి స్త్రీతో సంభోగించటం ధర్మసమ్మతమైన విషయమే. ఎందుకంటే, నమాజు చెయ్యటం ఆమెకు ధర్మసమ్మతమైనప్పుడు, ఆమెతో సంభోగించటం అనేది అంత ప్రాముఖ్యత ఉన్న విషయం కాదు. కొందరు రక్తస్రావపు వ్యాధి ఉన్న స్త్రీతో సంభోగించటం ధర్మసమ్మతమైన విషయం కాదు అని వ్యాఖ్యా నించారు. ఎందుకంటే అది అశుద్ధమైనది. అత్యధికమంది (జమ్హూర్) ఏమం టారంటే; ప్రతి అశుద్ధావస్థలో సంభోగం నిషిద్ధం కాబోదు. బహిష్టు స్థితిలో సంభోగం నిషిద్ధం అనే విషయం ఖురాను గ్రంథంలో ఉంది. అబూ దావూద్ 'ఇక్రిమా' నుంచి ఈ విషయాన్ని తీసుకున్నారు; 'హమ్నా'కు రక్తస్రావపు వ్యాధి ఉండేది; ఆమె భర్త ఆమెతో సంభోగించేవారు. ఇదేవిధంగా ఉమ్మె హాబీబా (రజిఅన్హా) గారికి కూడా రక్తస్రావపు వ్యాధి ఉండేది. ఆమె గారి భర్త కూడా ఆమెతో సంభోగించేవారు. హమ్నా (రజిఅన్హా) గారి భర్త తల్హా (ర) గారు; ఉమ్మె హబీబా (ర) గారి భర్త అబ్దు ర్రహ్మాన్ బిన్ ఔఫ్ (ర) గారు; ఈ ఉభయులూ అగ్రశ్రేణికి చెందిన దైవప్రవక్త ముహమ్మద్ (స) గారి సహచరులు.

30-1. అంటే ఎవరైనా ఒక స్త్రీ ప్రసవించిన తరువాత మరణిస్తే, ఇంకా ఆమెకు కాన్పుకు సంబంధించిన రక్తం స్రవిస్తూ ఉన్నట్లయితే – ఈ సందర్భంలో ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారు తేల్చి చెప్పిన విషయం ఏమిటంటే; కాన్పుకు సంబంధించిన రక్త స్రావం గల స్త్రీకి పరిశుద్ధత గల స్త్రీలకు సంబంధించిన ఆజ్ఞలే వర్తిస్తాయి. ఎందుకంటే దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఆమె యొక్క 'నమాజె జనాజా'ను చేశారు. దీని

**328.** **సమురహ బిన్ జున్‌దుబ్ (రజిఅన్)ఇలా ఉల్లేఖించారు; ఒక స్త్రీ (ఉమ్మె కాబ్) కాన్పు కారణంగా మరణించింది. అప్పుడు దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఆమె 'నమాజె జనాజ'ను చేశారు. ఆయన (స) ఆ స్త్రీ నడుముకు ఎదురుగా నిలబడి నమాజు చేశారు.**

**329.** **కారుణ్యమూర్తి దైవప్రవక్త ముహమ్మద్(సఅసమ్) గారి సతీమణి, విశ్వాసుల తల్లీ అయిన హజ్రత్ మైమూన(రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు; "ఆమెగారు బహిష్టు అయినప్పుడు నమాజ్ చేసేవారు కాదు. అయినప్పటికీ మహ నీయ ప్రవక్త(స) గారు నమాజు చేసే స్థలంలో ఆమె పడుకుని విశ్రాంతి తీసుకునే వారు. ఆయన(స) గారు తమ 'సజ్‌దాగాహ్' మీద నమాజు చేసే వారు. ఆయన(స) గారు సజ్‌దా చేసేటప్పుడు ఆయన (స) గారు ధరించిన వస్త్రపు భాగం కొంత ఆమె (ర)గారికి తగిలేది.**[1]

కారణంగా మరణం వల్ల మనిషి అశుద్ధుడైపోతాడనే విషయం రద్దు అవుతుంది.

329-1. సజ్‌దాగాహ్ అంటే ఒక చిన్న చాప అని అర్థం. సజ్‌దా చేసేటప్పుడు దాని మీద ముఖాన్నీ, అరచేతుల్నీ పెట్టటం జరుగుతుంది. ఆ చాప ద్వారా వేడినీ, చలినీ తట్టుకోవటం సాధ్యపడుతుంది.

*అనంత కరుణామయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో*

# తయమ్ముమ్ ప్రకరణం★

## 1వ అధ్యాయం

**ఖురాను గ్రంథంలోని మాయిదా సూరాలోని 6వ వాక్యంలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు; "అప్పుడు మీకు నీరు లభించని పక్షంలో, పరిశుభ్రమైన మట్టితో విధిని నిర్వహించండి; దాని మీద చేతులతో కొట్టి మీ ముఖాల మీదా, చేతుల మీదా రుద్దుకోండి."**

**330.** ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారి భార్య అయిన హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు; "ఒకసారి మేము ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారితో ఒక ప్రయాణంలో బయల్దేరాము." (గజ్వయె బనీ ముస్తలఖ్‌లో, హిజ్రీ 6వ సంవత్సరంలో). మేము బయ్‌దా లేక జాతుల్ జైష్[1] ప్రాంతానికి చేరుకున్నప్పుడు నా మెడలోని (కంఠ) హారం తెగి క్రింద పడిపోయింది. (ఆ హారం అస్మాది, ఆమెను అడిగి నేను దానిని తీసుకున్నాను). దైవప్రవక్త (స) ఆ హారాన్ని వెతుకుతూ అక్కడ ఆగిపోయారు (ఎందుకంటే అది ఇతరుల వస్తువు కాబట్టి). ఆయన (స) గారి సహచరులు కూడా ఆయన (స) గారితో అక్కణ్ణే ఆగి పోయారు. అక్కడ ఆ ప్రదేశంలో వారికి నీళ్లు లభించలేదు. చివరకు అందరూ కలసి హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజిఅన్) వద్దకు వెళ్లి ఇలా అన్నారు;

---

★ నిఘంటువులో తయమ్ముమ్ అంటే సంకల్పం చేసుకోవటం అనే అర్థం ఉంది. షరీయత్ ప్రకారం తయమ్ముమ్ అంటే, అశుద్ధతనూ, జనాబత్‌నూ దూరం చేసే సంకల్పంతో పరిశుభ్రమైన మట్టితో ముఖాన్నీ, చేతుల్నీ 'మసా' చెయ్యటం (రుద్దుకోవటం).

330-1. ఇవి మక్కా, మదీనా పట్టణాల మధ్య ఉన్నటువంటి రెండు ప్రాంతాల పేర్లు.

ఆయెషా (ర) ఏం చేశారో మీరు చూశారా? దైవప్రవక్త(స)నూ, ఆయన (స) గారి అనుచరులనూ ఒక ఎడారి ప్రాంతంలో అటకాయించారు. ఇక్కడ అసలు నీళ్లు లేనేలేవు. ప్రజల వద్ద కూడా నీళ్లు లేవు. ఈ విషయాన్ని తెలుసుకున్న అబూబకర్ (ర) నా వద్దకు వచ్చారు. అప్పుడు దైవప్రవక్త (స) నా తొడ మీద తమ శిరస్సును పెట్టి నిదురపోతున్నారు. అబూబకర్ (ర) ఇలా అన్నారు; నీవు దైవప్రవక్త(స)నూ, ప్రజలందరినీ ఇక్కడ అటకాయించావు. ఈ ప్రదేశంలో నీళ్లు కూడా లేవు. ప్రజల వద్ద కూడా నీళ్ళు లేవు. హ(జత్ ఆయెషా (ర) ఇలా అన్నారు; అబూబకర్ (ర) నన్ను చాలా కోపగించు కున్నారు. అల్లాహ్ కోరిన విధంగా ఆయన (ర) నన్ను నిందించారు (చీవాట్లు పెట్టారు). ఇంకా ఆయన (ర) తన చేతితో నా పార్శ్వం మీద కొట్టసాగారు. ఆ దెబ్బల వల్ల నేను తీవ్రమైన నొప్పికి గురి అయ్యాను. అయినా చలనరహితంగా ఉండి పోయాను. ఎందుకంటే దైవప్రవక్త (స) గారి పవిత్రమైన శిరస్సు నా తొడ మీద ఉన్నది. తెల్లవారుఝామున ప్రవక్త మహనీయులు (స) మేల్కొన్నారు. కాని అక్కడ నీళ్లు లేవు. అప్పుడు కరుణామయుడైన అల్లాహ్ తయమ్ముమ్‌కు సంబంధించిన వాక్యాన్ని అవతరింపజేశాడు. తరువాత ప్రజలందరూ తయమ్ముమ్ చేసుకున్నారు." ఆ సమయంలో అన్సారీ సహాబీ ఒకాయన ఉసైద్ బిన్ హుజైర్ (రజిఅన్) ఇలా అన్నారు; "ఓ అబూబకర్ కుటుంబ సభ్యులారా! ఇది మీ కుటుంబం వల్ల కలిగిన ప్రథమ శుభమేమీ కాదు."[2] హ(జత్ ఆయెషా (ర) ఇలా అన్నారు; "తరువాత నేను ప్రయాణం చేసిన ఒంటెను మేము లేపాము. అప్పుడు దాని క్రింద నేను పోగొట్టుకున్న కంఠహారం కూడా దొరికిపోయింది."[3]

**331.** ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హ(జత్ జాబిర్ బిన్ అబ్దుల్లా అన్సారీ (రజిఅన్) తెలిపారు. నాకు పూర్వం వచ్చిన ప్రవక్తలలో ఏ ప్రవక్తకూ ఇవ్వబడనటువంటి ఐదు విషయాలు నాకు ఇవ్వబడ్డాయి.

---

330–2. ఇంతకుపూర్వం కూడా మీ కుటుంబం వల్ల ముస్లిమ్‌లకు అసంఖ్యాకమైన ప్రయోజనాలు కలిగాయి.

330–3. అసలు జరిగిన విషయం ఏమిటంటే; హ(జత్ ఆయెషా (ర) గారి కంఠహారం తెగి క్రింద పడిపోయింది; దాని మీద ఒంటె కూర్చుండిపోయింది; దాని కోసం అక్కడ ఉన్నవారు వెతుకుతూ అటూ ఇటూ తిరిగారు; అది ఎలా దొరుకుతుంది; ఇదంతా అల్లాహ్ యుక్తి. దీని భావం ఏమిటంటే, ముస్లిమ్ సమాజానికి తయమ్ముమ్‌కు సంబంధించిన సమస్య తెలిసిపోవాలి; చాలా సందర్భాలలో నీళ్లు దొరకవు. కనుక తయమ్ముమ్ విషయం ప్రజలకు తెలిసిపోయింది, కంఠహారం కూడా దొరికిపోయింది.

**ఒక విషయమేమిటంటే; ఒక మాసం కాలం పట్టేటటువంటి ప్రయాణం (దూరం)లో శత్రువుల మీద నా భయం యొక్క ప్రభావం పడుతుంది. రెండో విషయమేమిటంటే; భూమి మొత్తం నా కోసం నమాజు చేసే స్థలంగానూ, పరిశుభ్రపరిచే వస్తువుగానూ చెయ్యబడింది.[1] కనుక నా ఉమ్మత్ (సంఘం)కు చెందిన ప్రతి మనిషీ నమాజుకు వేళ అయినప్పుడు ఎక్కడైనా సరే నేల మీద నమాజు చేసుకోవచ్చు. మూడో విషయం ఏమిటంటే; యుద్ధ సమయంలో లభించిన సొమ్ము నా కోసం ధర్మ సమ్మతం చెయ్యబడింది; నాకు పూర్వం వచ్చిన ఏ ప్రవక్తకూ అది ధర్మ సమ్మతం చెయ్యబడలేదు. నాలుగో విషయం ఏమిటంటే; నాకు సిఫారసు చేసే అనుమతి ఇవ్వబడింది.[2] ఐదో విషయం ఏమిటంటే; పూర్వకాలంలో ప్రతి దైవప్రవక్త ప్రత్యేకంగా తన జాతి వైపునకే పంపబడుతూ ఉండేవాడు. కాని నేను మటుకు సమస్త మానవ జాతి వైపునకు ప్రవక్తగా చేసి పంపబడ్డాను.**

## 2వ అధ్యాయం

### నీళ్లు గానీ, మట్టిగానీ లభించనప్పుడు ఏమి చెయ్యాలి?[1]

**332. హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా సెలవిచ్చారని ఉర్వాగారి**

---

331–1. అధ్యాయంలోని ప్రధానమైన విషయం ఇక్కడ ప్రస్తావించబడింది. దీని ఆధారంగానే మట్టి, రాయి, ఇటుక మొదలైన నేలకు సంబంధించినటువంటి ప్రతి వస్తువుతో తయమ్ముమ్ చేసుకోవటం ధర్మసమ్మతమే అని ఇమామ్ మాలిక్ (రహ్మాలై) గారూ, ఇమామ్ అబూ హనీఫా (రెహ్మాలై) గారూ మరియు అవ్జాయీ మొదలైనవారు విశ్లేషించారు. కాని ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రెహ్మాలై) గారూ, దావూద్ జాహెరి (రెహ్మాలై) గారూ, ఇమామ్ షాఫయి (రెహ్మాలై) గారూ ఏమంటారంటే, తయమ్ముమ్ కోసం మట్టి విధిగా ఉండాలి. అంటే మట్టి లేకుండా తయమ్ముమ్ పూర్తి కాదు. ఎందు కంటే ఖురాను గ్రంథంలో 'సయీద్' అనే పదం ఉపయోగించబడింది; 'సయీద్' అంటే మట్టి అని అర్థం. ఇదే హదీసు ముస్లిమ్ గారి ఉల్లేఖనంలో ఇలా ఉంది; దాని మట్టి పరిశుద్ధపరిచే వస్తువుగా చెయ్యబడింది.

331–2. అంటే 'షిఫా అతె అజ్మా' అని భావం. అత్యంత భయంకరమైన స్థితి నెలకొన్న సమ యంలో ఇతర దైవప్రవక్తలు కూడా భయకంపితులైనప్పుడు లేదా తన హృదయంలో రవ్వంత విశ్వాసమైనా కలిగి ఉన్న ప్రతి ఏక దైవోపాసకుడు నరకం నుంచి బయటికి రావటం.

2–1. నీళ్లుగానీ, మట్టిగానీ లభించని వ్యక్తిని 'ఫాఖిదత్తహూరైన్' అని అంటారు. అంటే

**తండ్రిగారు ఉల్లేఖించారు; ఆమె గారు తన అక్క అస్మాగారిని అడిగి ఆమె కంఠహారాన్ని తీసుకున్నారు. అది తెగి ఎక్కడో పడిపోయింది. ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) దానిని వెతకటానికి ఒక మనిషి (ఉసైద్ బిన్ హుజైర్)ని పంపారు.[1] అతనికి ఆ కంఠహారం దొరికిపోయింది. అప్పుడు (అతనూ, అతని సహచరులూ పోతూ ఉండగా మార్గమధ్యంలో) నమాజు చేసే సమయం అయింది. వారందరూ వుజూ లేకుండానే నమాజు చేశారు.[2] తరువాత వారు ఈ విషయాన్ని గురించి ప్రవక్త మహనీయులకు (స) తెలియజేశారు. అప్పుడు కరుణామయుడైన అల్లాహ్ తయమ్ముమ్‌కు సంబంధించిన ఖురాను వాక్యాన్ని అవతరింపజేశాడు. ఉసైద్ బిన్ హుజైర్ (రజిఅన్) హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా)తో ఇలా అన్నారు; అమ్మా ఆయెషా! అల్లాహ్ మీకు మంచి ప్రతిఫలాన్ని ప్రసాదించుగాక! అల్లాహ్ సాక్షిగా! మీకు ఇష్టంకాని విషయం మీ మీదకు వచ్చిపడినప్పుడల్లా, అల్లాహ్ మీకూ, ముస్లిమ్ లందరికీ దాని ద్వారా మేలే చేశాడు.**

---

వుజూ చేసుకోవటానికి అవసరమైన వస్తువులు (నీళ్ళుగానీ, మట్టిగానీ) లభించనివాడు. ఇంకా రెండు రకాల పరిశుభ్రతలను కోల్పోయినవాడు. ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మలై) గారూ, ఇమామ్ షాఫయి (రహ్మలై) గారూ ఇంకా అహ్లెహదీస్ మస్లక్ వారూ ఏమంటారంటే; అటువంటి వ్యక్తి తాను ఉన్న స్థితిలోనే నమాజు చేసుకోవచ్చు. తరువాత నీళ్ళుగానీ, మట్టిగానీ లభించినప్పుడు మళ్ళీ ఆ నమాజునే తిరిగి చెయ్యటం 'వాజిబ్' ఏమీ కాదు. కాని ఇమామ్ అబూహనీఫా (ర.హ్మలై) గారి అభిప్రాయం ఏమిటంటే; అటువంటి వ్యక్తి నమాజు చెయ్యటానికి వీలులేదు, అతని మీద ఆ నమాజును 'ఖజా' చెయ్యటం 'వాజిబ్' అవుతుంది. అంటే నీళ్ళుగానీ, మట్టిగానీ లభించినప్పుడు వుజూగానీ, తయమ్ముమ్ గానీ చేసుకుని విడిచిపెట్టిన ఆ నమాజును తప్పనిసరిగా చెయ్యాలి.

332-1. ఇది ఇంతకు ముందు వచ్చినటువంటి ఉల్లేఖనానికి విరుద్ధం ఏమీ కాదు. భావం ఏమిటంటే, చివర్లో ఆ కంఠహారం ఉసైద్‌కు దొరికింది. అంటే ఆయన తిరిగి వచ్చినప్పుడు, తిరుగు ప్రయాణానికి సన్నాహాలు పూర్తి అయ్యాయి. కూర్చుని ఉన్న ఒంటెను లేపటం జరిగింది. దాని కింద కంఠహారం కనిపించింది.

332-2. అధ్యాయంలో ప్రస్తావించబడిన ప్రధాన విషయం ఇదే. ఎందుకంటే, అప్పటి వరకు తయమ్ముమ్ అనేది ఇంకా ధర్మసమ్మతం చెయ్యబడలేదు. వుజూ చేసుకోవటానికి నీళ్ళు లేవు, ఈ కారణంగా ఉసైద్ గారు (ర) వుజూ లేకుండానే నమాజు

## 3వ అధ్యాయం

**'హజర్'లో (అంటే తన ఇంట్లో, తన పట్టణంలో ఉన్నప్పుడు) నీళ్లు దొరకని స్థితిలో, నమాజు ఖజా అయిపోతుందనే భయం కలిగినప్పుడు తయమ్ముమ్ చేసుకోవటం; అతా బిన్ అబీ రబాహ్ గారు చెప్పింది ఇదే.[1] ఇమామ్ హసన్ బస్రీ (ర.హ్మాలై) గారు ఇలా సెలవిచ్చారు; ఒకవేళ ఎవరైనా వ్యాధిగ్రస్తులైతే, నీళ్లు అతని వద్ద ఉన్నప్పటికీ, ఆ నీళ్లను తెచ్చి ఇచ్చేవారెవరూ లేని పక్షంలో, స్వయంగా అతను కూడా లేచి నీళ్లను తెచ్చుకునే స్థితిలో లేనప్పుడు, తయమ్ముమ్ చేసుకోవచ్చు.[2] అబ్దుల్లా బిన్ ఉమర్(ర) 'జురుఫ్' వద్ద ఉన్నటువంటి తన భూమికి వెళ్లి తిరిగి వస్తున్నారు. మార్గమధ్యంలో 'మర్‌బదిన్నామ్' వద్దకు వచ్చినప్పుడు, అసర్ నమాజు వేళ అయింది. అప్పుడు ఆయన తయమ్ముమ్ చేసుకుని నమాజు చేశారు. ఆ తరువాత ఆయన మదీనాలోకి ప్రవేశించినప్పుడు సూర్యుడు ఆకాశంలో ఇంకా పైననే ఉన్నాడు, క్రిందికి దిగలేదు. అయినప్పటికీ అబ్దుల్లా బిన్ ఉమర్ (ర) అస్ర్ నమాజును తిరిగి చెయ్యలేదు.[3]**

---

చెయ్యటం, దానికి ప్రవక్త మహనీయులు (స) అభ్యంతరం చెప్పకపోవటం – ఇవన్నీ, ఏ మనిషికైనా నీళ్లుగానీ, మట్టిగానీ దొరకని స్థితిలో అతను వుజూ లేకుండా నమాజు చేసుకోవచ్చు అనే విషయాన్ని ధ్రువీకరిస్తున్నాయి; ఉసైద్ (ర), అతని తోటి ప్రయాణీకులు వుజూ లేకుండానే నమాజు చేసిన విధంగా, నీళ్లుగానీ, మట్టిగానీ లభ్యంకాని పక్షంలో ఎవరైనా వుజూ లేకుండానే నమాజు చేసుకోవచ్చు.

3–1. ఈ విషయాన్ని ఇబ్నె అబీ షైబాగారు తన గ్రంథమైన 'ముసన్నఫ్'లో ప్రస్తావించారు. కనుక నీళ్లు లభ్యమైనప్పుడు నమాజును మళ్లీ తిరిగి చేసే అవసరం లేదు. కాని ఆ నమాజును నీళ్లు లభించిన తరువాత తిరిగి మళ్లీ చెయ్యాలి అని కొందరు అన్నారు.

3–2. ఈ విషయాన్ని ఖాజీ ఇస్మాయీల్ గారు 'అహ్‌కామ్' అనే గ్రంథంలో నిజమైన ధ్రువీకరణలతో ప్రస్తావించారు.

3–3. ఈ విషయాన్ని ఇమామ్ మాలిక్ (ర.హ్మాలై) గారు 'ముఅత్తా' అనే గ్రంథంలోనూ, ఇమామ్ షాఫయి (రహ్మాలై) తన గ్రంథం 'మస్‌నద్'లోనూ ప్రస్తావించారు. 'జురుఫ్' మదీనా పట్టణం నుంచి మూడు మైళ్ల దూరంలో ఉన్నటువంటి ఒక ప్రాంతం. 'మర్‌బదిన్నామ్' మదీనా పట్టణం నుంచి ఒక మైలు దూరంలో ఉన్నటువంటి ఒక ప్రదేశం. మూడు మైళ్ల దూరం పోవటాన్ని అసలు ప్రయాణమే అనరు. కనుక హజర్‌లో అంటే తన ఇంట్లో, తన గ్రామంలో, తన పట్టణంలో ఉన్నప్పుడు

**333.** హజ్రత్ అబూ జుహైమ్ బిన్ హారిస్ అన్సారీ (రజిఅన్) గారు (ఒక సహాబి) ఇలా ఉల్లేఖించారు: ఒకసారి ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారు బీర్ జమల్ వైపు నుంచి వస్తూ ఉన్నారు.[1] మార్గమధ్యంలో ఒక వ్యక్తి (స్వయంగా అబూ జుహైమే) ఆయన (స) గారిని కలిసి సలాము చేశాడు. కాని దైవప్రవక్త (సఅసమ్) ఆ సలాముకు జవాబు పలకలేదు. చివరకు ఆయన (స) గారు ఒక గోడ వద్దకు వెళ్ళారు, దాని మీద రెండు చేతులతో కొట్టారు. తరువాత ఆ చేతులతోనే తమ ముఖం మీద, తమ చేతుల మీద (మోచేతుల వరకు) 'మసా' చేశారు. ఆ తరువాతనే సలాము చేసిన వ్యక్తికి ప్రతి సలాము చేశారు.[2]

## 4వ అధ్యాయం

### తయమ్ముమ్ కోసం రెండు చేతులతో మట్టి మీద కొట్టి తరువాత దుమ్మును (ధూళినీ) తగ్గించే నిమిత్తం చేతుల మీద ఊదటం.

**334.** తమ తండ్రిగారు ఇలా చెప్పారని సయీద్ బిన్ అబ్దుర్రహ్మాన్ బిన్ అబ్జ ఉల్లేఖించారు; ఒక మనిషి హజ్రత్ ఉమర్ (రజిఅన్) గారి వద్దకు వచ్చి ఇలా అడిగాడు; "ఒకవేళ నాకు జనాబత్ స్థితి కలిగితే (భార్యాభర్తల కలయిక వల్లగానీ లేదా వీర్యస్ఖలనం జరగటం వల్ల గానీ ఏర్పడే లైంగిక అశుద్ధత), అప్పుడు నీళ్లు దొరకని స్థితి ఏర్పడితే నేను ఏమి చెయ్యాలి?"[1] అప్పుడు అమ్మార్ బిన్ యాసిర్

---

తయమ్ముమ్ చేసుకుని నమాజు చెయ్యవచ్చు అనే విషయం నిరూపితమైపోయింది. అధ్యాయంలోని ప్రధాన విషయం కూడా ఇదే.

333-1. 'బీర్ జమల్' మదీనా పట్టణానికి సమీపంలో ఉన్నటువంటి ఒక ప్రాంతం.

333-2. ఈ హదీసు ద్వారానే ఇంట్లోనూ, సొంత ఊరులోనూ తయమ్ముమ్ యొక్క శాస్త్రీయత, ఔచిత్యాలు నిరూపించబడ్డాయి. సలాము చేసిన వారికి జవాబుగా సలాము చెయ్య టానికి తయమ్ముమ్ చేసుకోవటం శాస్త్రపరంగా సబబు అయినప్పుడు, నమాజు కోసం తయమ్ముమ్ హాయిగా, బ్రహ్మాండంగా ధర్మసమ్మతం అవుతుంది. దైవప్రవక్త (స) గోడ మీద చేతులతో కొట్టి తయమ్ముమ్ చేసుకున్నారంటే అది మట్టి గోడ అయినా అయి ఉండాలి. లేదా ఆయన (స) ఆ గోడ మీద గీకి అయినా ఉండాలి- షాఫయి గారి ఉల్లేఖనంలో ఉన్నట్లుగా.

334-1. ముస్లిమ్ రివాయతులో ఈ విషయం మటుకు అదనంగా ఉంది; హజ్రత్ ఉమర్ (ర) గారు ఇలా అన్నారు; 'నమాజు చెయ్యబాకు'. మరొక రివాయతులో ఈ విషయం కూడా అదనంగా చేర్చబడింది; 'నీళ్లు లభించనంత వరకు.'

**(రజిఅన్) గారు హజ్రత్ ఉమర్ (రజిఅన్) గారిని ఉద్దేశించి ఇలా అన్నారు; "మీకు జ్ఞాపకం లేదా? మీరు నేనూ ఉభయులమూ ఒకసారి ప్రయాణంలో ఉన్నప్పుడు మన ఇద్దరికీ జనాబత్ స్థితి ఏర్పడింది. మీరైతే నమాజు చెయ్యలేదు. కాని నేను నేలమీద పడి అటూ ఇటూ దొర్లాను,[2] ఆ తరువాతనే నమాజు చేశాను." తరువాత నేను ఈ విషయాన్ని గురించి ప్రవక్త మహనీయులకు (సఅసమ్) చెప్పాను. దానికి ఆయన (స) ఇలా స్పందించారు; "నీవు ఇలా చేస్తే సరిపోయేది; ఆయన (స)గారు తమ రెండు అరచేతులను నేలమీద కొట్టారు. ఆ పిదప వాటి మీద ఊదారు.[3] ఆ పైన తమ ముఖం మీదా, తమ చేతుల మీదా మోచేతుల వరకు మసా చేసుకున్నారు."**

## 5వ అధ్యాయం

## తయమ్ముమ్‌లో కేవలం ముఖం మీద, రెండు చేతుల మీద మసా చెయ్యటం[1].

**335. తన తండ్రి ఇలా చెప్పారని సయీద్ బిన్ అబ్దుర్రహ్మాన్ బిన్ అబ్‌జ (రజిఅన్) గారు ఉల్లేఖించారు; మరొకసారి అమ్మార్ (రజిఅన్) గారు పైన చెప్పిన విషయాన్నే ఇక్కడ కూడా చెప్పారు. షూబా ఈ విషయాన్ని ఇలా తెలియజేశారు. తన రెండు చేతులను నేల మీద కొట్టారు; తరువాత వాటిని తన నోటి వద్దకు తీసుకువెళ్లారు, వాటి మీద ఊదారు, ఆ తరువాత తన ముఖం మీదా, తన రెండు చేతుల మీదా మసా చేశారు.[1] హజ్రత్ అమ్మార్ ఇలా అన్నారు; నీళ్లు లభించని స్థితిలో ఒక ముస్లిమ్ కొరకు 'తయమ్ముమ్' సరిపోతుంది.**

---

334-2. గుసుల్‌కు బదులుగా చేసుకునే తయమ్ముమ్‌లో మొత్తం శరీరానికి మట్టి తగలడం అవసరమేమోనని అమ్మార్ (రజిఅన్)గారు అనుకున్నారు.

334-3. అధ్యాయంలోని ప్రధాన విషయం ఇక్కణ్ణే లభిస్తుంది.

335-1. ఇమామ్ అహ్మద్ బిన్ హమ్‌బల్ (రహ్మాలై) ఇంకా అహ్లెహదీస్ వారి అభిప్రాయం ఏమిటంటే; తయమ్ముమ్‌లో ఒకసారి మట్టి మీద చేతులతో కొట్టటం సరిపోతుంది. తరువాత ముఖం మీద, రెండు చేతుల మీద ఒకసారి మసా చెయ్యటం సరిపోతుంది. కాని హనఫీ శాస్త్రవేత్తల ప్రకారం, రెండుసార్లు చేతులతో కొట్టి, మొదటిసారి ముఖం మీద మసా చెయ్యాలి. రెండోసారి రెండు చేతుల మీద మోచేతుల వరకు మసా చెయ్యాలి. అయితే వారు పేర్కొనే ప్రమాణాలు బలహీనమైనవి. సహీహ్ హదీసుల్లోనయితే ఇమామ్ హమ్‌బల్ (రెహ్మాలై) గారి అభిప్రాయానికే సమర్ధన, ఆధారం లభిస్తాయి.

**336.** అబ్దుర్రహ్మాన్ బిన్ అబ్జా ఇలా ఉల్లేఖించారు; అప్పుడు అతను హజ్రత్ ఉమర్ (రజిఅన్) వద్ద ఉన్నారు; అమ్మార్ (రజిఅన్) హజ్రత్ ఉమర్ (రజిఅన్)తో ఇలా అన్నారు; మనం ఉభయులమూ ఒక సైన్యంలో ఉన్నప్పుడు జనాబత్ స్థితికి గురి అయ్యాము. అప్పుడు నేను నా చేతులకు తగిలిన దుమ్మును ఊదేశాను. ఈ ఉల్లేఖనంలో 'నఫఖ్'కు బదులుగా 'తఫల్' అనే పదం ప్రయోగించబడింది.[1]

**337.** అబ్దుర్రహ్మాన్ బిన్ అబ్జా ఇలా ఉల్లేఖించారు; అమ్మార్ (రజిఅన్) హజ్రత్ ఉమర్ (రజిఅన్)తో ఇలా అన్నారు; నేను నేల మీద మట్టిలో అటూ ఇటూ దొర్లాను. ఆ తరువాత నేను ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) వద్దకు వెళ్లాను. ఆయన (స) గారు నీవు ముఖం మీదా, రెండు చేతుల వెనుక భాగం మీదా మసా చేసి ఉంటే సరిపోయేది.

**338.** అబ్దుర్రహ్మాన్ ఇలా ఉల్లేఖించారు; అమ్మార్ హజ్రత్ ఉమర్ (రజిఅన్)తో ఇలా అన్నప్పుడు నేను అక్కడే ఉన్నాను. ఆయన ఈ విషయమే చెప్పారు.

**339.** హజ్రత్ అమ్మార్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; "తరువాత దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) తమ చేతులను నేల మీద కొట్టారు. ఆ తరువాత ఆయన (స) తమ ముఖం మీదా, తమ రెండు చేతుల వెనుక భాగాల మీదా మసా చేశారు." (తయమ్ముమ్ ఎలా చెయ్యాలో ఆచరణ రూపంలో ఆయన ప్రదర్శించారు.)

## 6వ అధ్యాయం

**పరిశుభ్రమైన మట్టి ముస్లిం యొక్క వుజూ నీరుకు బదులు (ప్రత్యామ్నాయంగా) అది అతనికి సరిపోతుంది.[1] అతను తేలికపాటి అశుద్ధతకు (హదస్)కు లోనవనంతవరకూ అతనికి 'తయుమ్ముమ్' సరిపోతుందని ఇమామ్ హసన్ బస్రీ (రహ్మాలై) చెప్పారు.[2] అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) తయుమ్ముమ్‌తో నమాజ్‌కు సారధ్యం వహించారు.[3] ఉప్పు నేలలో నమాజ్ చేయటం, ఆ మట్టితో తయమ్ముమ్ చేయటం సమంజసమేనని యహ్యా బిన్ సయీద్ అన్సారీ (రజి) అన్నారు.**

---

5-1 ఇదొక హదీసు అని, దీనిని బజ్జార్ వెలికి తీశారని హాఫిజ్ ఇబ్నె హజర్ (రహ్మా) తెలిపారు. ఇమామ్ అహ్మద్ అస్‌హాబె సునన్‌లో పొందుపరిచిన ఉల్లేఖనం ప్రకారం పదేండ్ల వరకు నీరు లభించకపోయినా సరే (తయమ్ముమ్ సరిపోతుంది).

6-2 అంటే, ప్రతి నమాజ్ కొరకు 'తయమ్ముమ్' చేసుకోవలసిన అవసరం లేదు. 'తయమ్ముమ్' వుజూకు ప్రత్యామ్నాయం. వేటి ద్వారానయితే వుజూ భంగమవుతుందో, వాటి వల్లనే తయమ్ముమ్ కూడా భంగమవుతుంది. దీనిని ఇబ్నె అబీ షైబా, బైహఖీలు

**340.** ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి మేము ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారితో ప్రయాణం చేస్తూ ఉన్నాము. రాత్రి అంతా ప్రయాణం చేశాము; కాని రాత్రి చివరి ఘడియల్లో ఒక చోట కొంచెం సేపు విశ్రమించాము. ఒక బాటసారికి రాత్రి చివరి సమయంలో పట్టే నిద్ర కంటే ఎక్కువ సుఖవంతమైన నిద్ర ఉండదు.[1] తరువాత సూర్యుడి వేడి కిరణాలు తగిలిన తరువాతనే మా కళ్లు తెరుచుకున్నాయి. అప్పుడు అందరికంటే ముందు ఫలానా వ్యక్తి (అబూబకర్ –ర) మేల్కొన్నారు; ఆ తరువాత ఫలానా మనిషి లేచాడు; ఆపైన ఫలానా వ్యక్తి మేల్కొన్నాడు – అబూ రజా వారిని పేర్లతో సహా ప్రస్తావించారు, కాని ఔఫ్ మరచిపోయారు. ఆపైన హజ్రత్ ఉమర్ (రజిఅన్) మేల్కొన్నారు. (మా సంప్రదాయం ఏమిటంటే) ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారు నిదురపోయేటప్పుడు మేము ఎవరమూ ఆయన (స) గారిని లేపేవారము కాము. చివరకు స్వయంగా ఆయన(స) గారే లేచేవారు. ఎందుకంటే; నిద్రావస్థలో ఏదైనా కలపడి, అందులో ఆయన (స) గారి మీద ఏదైనా తాజా వహీ (దైవవాణి) అవతరిస్తుందేమో అనే విషయం మాకు తెలియదు కదా![2] హజ్రత్ ఉమర్ (రజిఅన్) మేల్కొన్నప్పుడు, ప్రజల మీదకు వచ్చిపడిన విపత్తును ఆయన (ర) గమనించారు.[3] ఆయన (ర) గుండె ధైర్యంగల మనిషి.[4] ఆయన(ర) ఎలుగెత్తి తక్బీర్ అనటం

---

సంగ్రహించారు. అంటే ముఖ్తదీలు వుజూతో ఉండగా.

6–3. అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) గారు 'తయమ్ముమ్'తోనే ఇమామత్ చేశారు. అత్యధిక మంది విద్వాంసుల విధానం కూడా ఇదే. కాని ఔజాయి మాత్రం దీంతో విభేదించారు. 'తయమ్ముమ్' చేసిన వ్యక్తి వెనుక 'వుజూ' చేసుకున్నవారు నమాజ్ చేయటం సమంజసం కాదంటారీయన.

336–1. 'తఫల' అంటే కూడా ఊదటమే అని భావం. కాని 'నఫఖ' కంటే కొంచెం ఎక్కువగా, గట్టిగా ఊదటం అని అర్థం. అంటే గట్టిగా ఊదేటప్పుడు కొంచెం ఉమ్మి కూడా తుంపరుల రూపంలో వెలువడుతుంది.

340–1. ఎందుకంటే ప్రాతఃకాలంలో సూర్యోదయానికి కొంచెం ముందు అలసిపోయిన మనిషి పడుకుంటే గాఢంగా, కమ్మగా నిదురపోతాడు. పైగా ప్రాతఃకాలపు పిల్ల వాయువులు చల్లగా వీస్తూ ఉంటాయి. ఆ వాతావరణంలో మనిషి ఏమరుపాటుకూ అశ్రద్ధకూ గురి అవుతాడు.

340–2. దైవప్రవక్త (స) గారి సహచరులు ఆయన గారిని (స) నిద్ర నుంచి మేల్కొలిపే విషయంలో భయపడుతూ ఉండేవారు. ఒకవేళ ఆయన (స) గారిపై దైవవాణి అవతరిస్తూ ఉన్నట్లయితే అప్పుడు ఆయన (స) గారిని లేపటం వల్ల దైవవాణి అవతరణకు భంగం కలిగే అవకాశం ఉందని.

**ప్రారంభించారు. అల్లాహు అక్బర్ (అల్లాహ్ మాత్రమే గొప్పవాడు), అల్లాహు అక్బర్ అని పెద్దగా కంఠాన్ని పెంచి అన్నారు. చివరకు ఆయన (ర) పిలుపునకు దైవప్రవక్త (సఅసమ్) నిద్ర నుంచి మేల్కొన్నారు.[5] ఆయన (స) గారు లేచిన తరువాత ప్రజలు ఈ ఆపదను గురించి ఫిర్యాదు చేశారు. ఆయన (స) గారు ఇలా సెలవిచ్చారు; ఏమీ పర్వాలేదు. దీనివల్ల నష్టం ఎంత మాత్రం జరగదు. పదండి, ముందుకు పదండి. కొంత దూరం ప్రయాణం చేసిన తరువాత ఆయన (స) గారు ఒంటె మీద నుంచి కిందికి దిగారు, వుజూ కోసం నీళ్లు తెప్పించుకున్నారు. తరువాత వుజూ చేసు కున్నారు. నమాజు కోసం అజాన్ (పిలుపు) ఇవ్వబడింది. దైవప్రవక్త (స) ప్రజల చేత నమాజు చేయించారు. నమాజు పూర్తి చేసిన తరువాత ఆయన (స) గారు ఒక వ్యక్తిని చూశారు.[6] అతను దూరంగా కూర్చొని ఉన్నాడు. అతను అందరితోపాటు నమాజు చెయ్యలేదు. దైవప్రవక్త (సఅసమ్) ఆ వ్యక్తిని ఉద్దేశించి ఇలా అన్నారు; "ఓ మనిషీ! నీకేమయింది, నీవు అందరితోపాటు నమాజు ఎందుకు చేయలేదు?" దానికి సమాధానంగా అతను ఇలా అన్నాడు; "నాకు స్నానం చెయ్యవలసిన అవసరం ఉంది. స్నానం కోసం నీళ్లు లేవు." ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు; "మట్టి తీసుకో. అది నీకు సరిపోతుంది."[7] తరువాత ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ముందుకు సాగిపోయారు. ప్రజలు, దప్పిక అవుతోందని, త్రాగటానికి నీళ్లు లేవనీ ఆయన (స)కు ఫిర్యాదు చేశారు. అప్పుడు ఆయన (స) ఆగిపోయారు, ఒక వ్యక్తిని పిలిచారు (ఇమ్రాన్ బిన్ హుసైన్‌ను). అబూరజా ఆ వ్యక్తి పేరును చెప్పారు. కాని**

---

340–3. ఆ విపత్తు ఏమిటంటే, నమాజు సమయం దాటిపోతోంది; వుజూ చేసుకోవటానికి ఒక్క నీటి చుక్క కూడా లేదు.

340–4. స్వతఃసిద్ధంగా ఆయన ధైర్యసాహసాలు కలవారు. హృదయంలో గట్టిదనం, స్థిరత్వం గలవాడు (రజీఅన్).

340–5. ఇది హజ్రత్ ఉమర్ (ర) గారి బుద్ధి కుశలతకు దర్పణం; ఒకవైపు ఆయన దైవప్రవక్త (స)నూ లేపలేదు; మరొక వైపు లక్ష్యం కూడా నెరవేరింది. అల్లాహు అక్బర్ అనే తక్బీరు వల్ల కలిగిన ప్రయోజనం ఏమిటంటే; శాపగ్రస్తుడైన షైతాను పలాయనం చిత్తగించాడు. వాడు ప్రజలు నమాజు చేయకుండా వారిని అశ్రద్ధకూ, నిర్లక్ష్యానికీ గురిచేశాడు. ఇది మరొక హదీసులో ఉన్నటువంటి, 'నా హృదయం నిదురపోదు' అనే విషయానికి వ్యతిరేకమేమీ కాదు. ఎందుకంటే, ఇదే హదీసులో ఇలా ప్రస్తావించబడింది; నా కళ్లు నిదురపోతాయి. కాని ఆయన (స) హృదయం అల్లాహ్ వైపునకు శ్రద్ధాభక్తులతో మరలి వుంటుంది. కనుక బాహ్య అశ్రద్ధ కళ్లకు సంబంధించిన అశ్రద్ధయే. అంటే బాహ్య ఇంద్రియాలకు సంబంధించినది. అది దీనికి ప్రతికూలమైన విషయమేమీ కాదు.

**ఔఫ్ మరచిపోయారు. ఇంకా హ్రజత్ అలీ (రజిఅన్)ను కూడా పిలిచారు. వారిద్దరినీ ఉద్దేశించి ఆయన (స) ఇలా అన్నారు; "వెళ్లండి, నీళ్ల కోసం వెతకండి." వారు ఉభయులూ వెళ్లిపోయారు. వారికి మార్గమధ్యంలో ఒక స్త్రీ కనిపించింది. ఆమె ఒక ఒంటె మీద రెండు పెద్ద నీటి సంచుల మధ్య కూర్చొని ప్రయాణం చేస్తోంది. వారు ఆమెను, "నీళ్లు ఎక్కడ దొరుకుతాయి?" అని అడిగారు. ఆమె దానికి సమాధానంగా ఇలా అన్నది; "నిన్నటి రోజున నీళ్లు ఈ సమయంలోనే నాకు దొరికాయి."[8] మా జాతికి చెందిన పురుషులు కొందరు నా వెనుక వస్తున్నారు. వారు ఆమెతో ఇలా అన్నారు; సరే ఇప్పుడు నీవు మాతో పాటే పద అని అన్నారు. అప్పుడు ఆమె, ఎక్కడికి వెళ్లాలి అని వారిని అడిగింది. వారు, దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) దగ్గరకు వెళ్లాలి అని చెప్పారు. ఆమె, ప్రజలు 'సాబీ'[9] అని పిలిచే మనిషి దగ్గరకా? అని అడిగింది. వారు, అవును[10], ఆయన వద్దకే వెళ్లాలి. పద, మాతో వచ్చెయ్యి అని అన్నారు. చివరకు వారు ఉభయులు ఆమెను ప్రవక్త మహనీయుని (స) వద్దకు తీసుకువెళ్ళారు, ఆయన (స) గారికి మొత్తం వృత్తాంతాన్ని వివరించారు.**

**హ్రజత్ ఇమ్రాన్ (రజిఅన్) గారు ఇలా వివరించారు; ఆ తరువాత అక్కడ ఉన్నవారు ఆ స్త్రీని ఆమె ఒంటె మీద నుంచి క్రిందికి దించారు. దైవప్రవక్త మహ నీయులు ముహమ్మద్ (సఅసమ్) ఒక కుండను తెప్పించారు, ఆ స్త్రీకి చెందిన రెండు తోలు సంచుల మూతులను తెరిచి వాటిలోని నీటితో ఆ కుండను నింపసాగారు.**

---

340–6. ఆ వ్యక్తి పేరు తెలియదు. కాని కొందరు, అతను ఖాలిద్ బిన్ రాఫె అన్సారీ అని అన్నారు. అయితే ఖాలిద్ బిన్ రాఫె బద్ర్ సంగ్రామంలో అమరగతి నొందారు. పైగా ఈ సంఘటన బద్ర్ సంగ్రామం తరువాతనే జరిగింది.

340–7. అధ్యాయంలోని ప్రధాన విషయం ఇక్కణ్ణే లభిస్తుంది.

340–8. అంటే నీళ్లు ఇక్కణ్ణుంచి ఎంత దూరంలో ఉన్నాయంటే; నిన్న నేను అక్కణ్ణుంచి ఇదే సమయంలో నీళ్లను తీసుకుని బయలుదేరాను. ఈ రోజు ఇక్కడకు ఇప్పుడు వచ్చాను.

340–9. అసలు ఎవడైతే తన ధర్మాన్ని త్యజించి కొత్త ధర్మాన్ని స్వీకరిస్తాడో అతడినే 'సాబీ' అని అంటారు. అరేబియా ముష్రిక్కులు ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్)ను 'సాబీ' అని పిలిచేవారు. ఎందుకంటే; ఆయన (స) గారు తన తాత ముత్తాతల ధర్మాన్ని వదలిపెట్టి, 'తౌహీద్' (దేవుడు ఒక్కడే అనే సిద్ధాంతం) అనే ధర్మాన్ని విశ్వసించారు.

340–10. 'అవునూ' అనలేదు, 'కాదూ' అనలేదు. ఎందుకంటే ఒకవేళ 'అవును' అంటే ఆయనగారు (స) 'సాబీ' అని (అల్లాహ్ రక్షించుగాక) ఒప్పుకున్నట్లు అవుతుంది.

**ఆ విధంగా కొంత నీరు నింపిన తరువాత, ఆ తోలు సంచులపై మూతులను మూసి క్రింది మూతులను తెరిచారు.[11] "నీళ్లు త్రాగండి, త్రాపించండి" అని ఒక ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజెయ్యటం జరిగింది. ఇష్టమైన వారు తమ పశువులకు నీళ్లు త్రాపించారు; దప్పికగొన్న వారు నీళ్లు త్రాగి దాహం తీర్చుకున్నారు (అందరూ కడుపు నిండా నీళ్లు త్రాగారు). చివర్లో ప్రవక్త మహనీయులు (స), స్నానం చెయ్యవలసిన అవసరం ఉన్నటువంటి వ్యక్తిని పిలిచి, అతనిక్కూడా ఒక కుండ నిండా నీరు ఇచ్చి, 'వెళ్లు నీ శరీరం మీద నీళ్లు పోసుకో' అని పురమాయించారు. ఆ స్త్రీ అక్కడ నిలబడి తాను తెచ్చుకున్న నీటితో జరిగిన పనులన్నింటినీ నివ్వెరపోతూ తిలకించింది. అల్లాహ్ మీద ప్రమాణం చేసి చెబుతున్నాము! నీరు తీసుకోవటం పూర్తి అయిన తరువాత మాకు ఎలా అనిపించిందంటే; ఇప్పుడు ఆ నీటి సంచుల్లో ఇది వరకటి కంటే అధికంగా నీరు ఉన్నది. ఇంకా ఆ సంచులు నీటితో పూర్తిగా నిండి ఉన్నాయి. ఆ తరువాత దైవప్రవక్త (సఅసమ్) ఇలా సెలవిచ్చారు; 'ఆ స్త్రీ కోసం ఏమైనా సేకరించండి'. ప్రజలు ఖర్జూరపు పండ్లూ, పిండీ, సత్తూ మొదలైన వాటిని పోగు చేశారు. చివరకు చాలా ఆహార పదార్థాలు ఆమె కోసం సేకరించబడ్డాయి. ఆ**

---

'కాదు' అని అంటే అబద్ధం చెప్పినట్లు అవుతుంది. ఎందుకంటే; స్వయంగా ఆయనే (స) మరొక ధర్మాన్ని స్వీకరించి దాని మీద నడవటం ఇష్టపడ్డారు.

340–11. అంటే, కొంత నీరును తోలు సంచుల పైభాగంలో ఉన్నటువంటి మూతులలో నుంచి తీసుకున్నారు; తరువాత పై మూతులను మూసేశారు. ఇంకా ఆ సంచుల కింది భాగంలోని మూతులను తెరిచారు. తిబ్రానీ, బైహఖీ గార్ల ఉల్లేఖనంలో ఇలా ఉంది; ఆయన (స) మొదట తీసుకున్న నీళ్ళతో పుక్కిలించి మళ్లీ ఆ పుక్కిలించిన నీటిని ఆ సంచులలోకి పై మూతులలో నుంచి పోశారు. నీరు సమృద్ధి కావటం, దాని పరిమాణం పెరగటం, అందరికీ పుష్కలంగా లభించటం అనేది ఆయన (స) పుక్కి లించి ఊసిన నీళ్ళ కారణంగానే జరిగింది. ఈ స్త్రీ అవిశ్వాసురాలు; ఆమె సొమ్ము తీసుకోవటం సరియైన విషయమే. రెండో విషయం, దాహార్తి తీవ్రంగా ఉన్నప్పుడు ఒక ముస్లిమ్‌కు చెందిన నీటిని అతని అనుమతి లేకుండా త్రాగటం, ప్రాణాన్ని రక్షించుకోవటం ధర్మసమ్మతమైన విషయమే. మూడో విషయం, ఆ స్త్రీకి ఏ మాత్రం నష్టం కలగదనే విషయమూ, పైగా ఆమెకు లాభమే కలుగబోతోందనే విషయమూ ప్రవక్త మహనీయుల (స)కు ముందే తెలుసు. నాలుగో విషయం, ఈ కార్యక్రమ మంతా అల్లాహ్ ఆజ్ఞ ప్రకారమే జరిగింది. అలా చెయ్యటం వల్ల చాలా మందికి ఇస్లామ్ ధర్మ స్వీకారభాగ్యం కలుగజెయ్యటం కూడా దైవ సంకల్పమే. ఈ స్త్రీ కారణంగా, ఇంకా ఆమె ఈ మహిమను చూసినందువల్లా చివరకు ఆమె జాతి ప్రజలు ముస్లిములైపోయారు.

**ఆహారం మొత్తాన్ని ఒక వస్త్రంలో పెట్టి, ఆమెను ఒంటె మీదకు ఎక్కించి ఆ మూటను ఆమె ముందు ఉంచారు. అప్పుడు దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఆ మహిళతో ఇలా అన్నారు; నీవు తెచ్చిన నీటిని కాస్తంత కూడా మేము తగ్గించలేదు.[12] ఈ విషయం నీకు తెలుసు. అల్లాహ్‌యే మాకు నీళ్లు త్రాపించాడు తరువాత ఆ స్త్రీ తన ఇంటివారి వద్దకు వెళ్లిపోయింది. మార్గమధ్యంలో ఆమె నిలువరింపబడటం వల్ల, ఆమె ఇంటి వారు ఆమెను, ఓ ఫలానా స్త్రీ! నీవు ఆలస్యంగా ఎందుకు వచ్చావు? అని అడిగారు. దానికి సమాధానంగా ఆమె ఇలా చెప్పింది; మార్గంలో ఒక అద్భుత మైన విషయం జరిగింది. ఇద్దరు మనుషులు నన్ను కలిశారు. నన్ను వారు ప్రజలు 'సాబీ' అని పిలిచే వ్యక్తి వద్దకు తీసుకువెళ్ళారు. ఆ వ్యక్తి ఫలానా పనులు చేశాడు.[13] కనుక అల్లాహ్ సాక్షిగా చెబుతున్నాను. ఎంతమంది మానవులైతే దానికీ, దీనికీ మధ్య ఉన్నారో; ఆమె తన చేతి మధ్య వ్రేలునూ, తన చూపుడు (కలిమా) వ్రేలునూ పైకి లేపి ఆకాశం వైపూ, నేలవైపూ సైగ చేసింది; వారందరిలోనూ అతను ఒక మహా మాంత్రికుడు అయినా అయి వుండాలి లేదా నిజంగానే అల్లాహ్ పంపిన ప్రవక్త అయి వుండాలి.[14] ఆ తరువాత ముస్లిములు ఆ స్త్రీకి చుట్టు పక్కల్లో ఉండేటటువంటి ముష్రిక్కుల మీద దాడి చేసి వారిని దోచుకునేవారు. ఆ స్త్రీ నివాసం ఉండే గ్రామంలోని ప్రజలకు మాత్రం ఏ అపకారం చెయ్యకుండా వదిలిపెట్టేసేవారు.[15] ఒక రోజున ఆ**

---

340-12. అంటే, నీవు తీసుకువచ్చిన నీరు మొదట్లో ఎంత ఉందో, ఇప్పుడు కూడా అంతే ఉంది. అంతేకాదు, దానికంటే ఎక్కువే ఉంది. కనుక మేము నీకు ఏ మాత్రం నష్టం కలిగించలేదు. కాబట్టి ఏ నీరునయితే ముస్లిములు తీసుకుని వాడుకున్నారో, ఆ నీరు ఆ స్త్రీకి చెందిన నీరు కానేకాదు; అది అల్లాహ్ ప్రసాదించిన నీరు. ఈ పరిస్థితిని బట్టి ఇతరుల నీళ్లను వారి అనుమతి లేకుండా ఎలా తీసుకున్నారు అనే అభ్యంతరానికి ఆస్కారమే ఉండదు.

340-13. అంటే ఈ విధంగా ఆయన నీళ్లు తీసుకున్నారు. తరువాత అక్కడ ఉన్న మనుష లందరికీ త్రాపించారు. కాని నీరు ఏ మాత్రమూ తగ్గలేదు. స్థూలంగా ఆ స్త్రీ జరిగిన వృత్తాంతాన్ని పూర్తిగా వివరించింది.

340-14. ఈ మహిమను చూసిన ఆమె మొదట్లో శంకలో పడిపోయింది. తరువాత ధర్మాన్ని స్వీకరించింది. దీనికి సంబంధించిన ప్రస్తావన ముందు రాబోతోంది.

340-15. ఆ స్త్రీ మరియు ఆమె ఉండే పట్టణవాసులు బహుశా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి ముస్లిములుగా మారిపోతారేమో అనే నమ్మకంతో లేదా ఆ స్త్రీ చేసిన మహోపకారాన్ని జ్ఞాపకం తెచ్చుకుని ఆమెను వదలిపెట్టేవారేమో!

**స్త్రీ తన ప్రజలతో ఇలా అన్నది; ముస్లిములు ఉద్దేశపూర్వకంగానే మిమ్మల్ని విడిచి పెట్టేస్తున్నారని నేను అనుకుంటున్నాను. అలాంటప్పుడు మీరు ముస్లిములుగా మారిపోవాలని అనుకోవటం లేదా? వారందరూ ఆమె చెప్పినట్లు విన్నారు, ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి ముస్లిమ్‌లుగా మారిపోయారు.**

**ఇమామ్ బుఖారీ (ర.హ్మాలై) ఏమన్నారంటే; సాబీ అనే పదం 'సబా' అనే పదం నుంచి తీసుకోబడింది. 'సబా' అంటే తన ధర్మాన్ని త్యజించి మరొక ధర్మాన్ని స్వీకరించిన వ్యక్తి అని అర్థం. అబుల్ ఆలియ ఏమన్నారంటే;[16] సాబియీలు అంటే గ్రంథ ప్రజలకు చెందిన ఒక వర్గంవారు; వారు జబూర్ గ్రంథాన్ని చదివేవారు. ఖురాను గ్రంథంలోని యూసుఫ్ సూరాలో 'అసబ్' అనే పదం వచ్చింది. దానికి, నేను లొంగిపోతాను, వినమ్రుడనవుతాను అనే అర్థాలు ఉన్నాయి.**

## 7వ అధ్యాయం

**ఒక జునుబ్ (గుసుల్ చేసుకునే అవసరం ఉన్న వ్యక్తి)కు వ్యాధి భయంకానీ, మరణ భయంకానీ, దప్పిక భయం కాని ఉన్నప్పుడు (ఉదాహరణకు కొంత నీరు మాత్రమే ఉన్నప్పుడు), అతను తయమ్ముమ్ చేసుకోవచ్చు. అమ్ర్ బిన్ ఆస్ (రజిఅన్) గారిని గురించి ఒక విషయం ప్రచారంలో ఉంది;[1] ఒక శీతాకాలం రాత్రి ఆయన గారికి స్నానం చేసే అవసరం కలిగింది. అప్పుడు ఆయన గారు తయమ్ముమ్ చేసుకున్నారు, మరియు ఈ ఖురాను వాక్యాన్ని పఠించారు; (అన్ నిసా 'సూరా 29వ వాక్యం) "... మిమ్మల్ని మీరు చంపుకోకండి. అల్లాహ్‌కు మీరు అంటే ఎంతో దయ అని నమ్మండి." ఆ తరువాత ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) వారి ముందు ఈ విషయం ప్రస్తావనకు వచ్చింది. అప్పుడు ఆయన (స) అమ్ర్ బిన్ ఆస్‌ను తప్పు పట్టలేదు.**

---

340-16. దీనిని ఇబ్నె అబీ హాతిమ్ గారు 'వసల్' చేశారు. ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారు ఈ సూక్తిని ఇక్కడ ఎందుకు ప్రస్తావించారంటే; ఖురానె షరీఫ్‌లో వచ్చినటువంటి 'సాబియీన్' అనే పదం ఇక్కడ ఈ వర్గాన్నే సూచిస్తుంది. ఈ హదీసులో ఆ అర్థమే వర్తిస్తుంది.

7-1. ఈ హదీసును అబూదావూద్ మరియు హాకిమ్ గార్లు వెలికితీశారు. అమ్ర్ బిన్ ఆస్ (రజిఅన్) గారికి శీతాకాలం రాత్రి అతి చలిగా ఉన్న సమయంలో గుసుల్ చేసే అవసరం కలిగింది. అప్పుడు ఆయన తయమ్ముమ్ చేసుకున్నారు. తరువాత ఉదయం నమాజుకు నాయకత్వం వహించారు. దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఆయన్ని ఈ విషయం గురించి అడిగితే, ఖురానులోని ఈ వాక్యాన్ని పఠించారు. దైవప్రవక్త (స) నవ్వేశారు. ఆయన్ని నిందించలేదు.

**341. హ్రజత్ అబూ వాయెల్ ఇలా ఉల్లేఖించారు; అబూ మూసా అష్అరీ (రజిఅన్) అబ్దుల్లాహ్ బిన్ మసూద్ (రజిఅన్)తో ఇలా అన్నారు; నీళ్లు లభ్యం కానప్పుడు (గుసుల్ చేసుకునే అవసరం కలిగినప్పుడు) నమాజు చెయ్యకూడదా? అబ్దుల్లా బిన్ మసూద్ (ర) దానికి సమాధానంగా ఇలా అన్నారు; నేను గనక ప్రజలకు అటువంటి అనుమతిని ఇచ్చినట్లయితే, ఎవరికైనా జలుబు చేసినప్పుడు వారు ఇలానే చేస్తారు. అంటే తయమ్ముమ్ చేసుకుని నమాజు చేస్తారు.[1] అప్పుడు అబూ మూసా (రజిఅన్) ఇలా అన్నారు; అయితే అమ్మార్ (రజిఅన్), హ్రజత్ ఉమర్ (రజిఅన్) గారికి వివరించిన ఉల్లేఖనం సంగతి ఏమిటి? అది ఏమైపోయినట్లు?[2] అబ్దుల్లా (రజిఅన్) ఇలా సమాధానం చెప్పారు; హ్రజత్ ఉమర్ (రజిఅన్), అమ్మార్ (రజిఅన్) వివరించిన విషయం పట్ల తృప్తి చెందారని నేను భావించటంలేదు.**

**342. షఖీఖ్ బిన్ సలమా ఇలా ఉల్లేఖించారు: అప్పుడు నేను, అబ్దుల్లా బిన్ మసూద్ (రజిఅన్), అబూ మూసా అష్అరీ (రజిఅన్) గార్ల వద్ద ఉన్నాను. ఇంతలోనే అబూ మూసా (ర)గారు, ఇబ్నె మసూద్ (ర) గారితో ఇలా అన్నారు: ఓ అబూ అబ్దుర్రహ్మాన్! ఎవరైనా ఒక మనిషి జునుబ్ (గుసుల్ అవసరం ఉన్న వ్యక్తి) అయిపోతే, నీళ్లు లభించని పక్షంలో అప్పుడు అతను ఏమి చెయ్యాలో చెప్పండి. ఆయన సమాధానంగా ఇలా అన్నారు; "నీళ్లు లభించనంత వరకు అతను నమాజు చెయ్యకూడదు." అప్పుడు అబూ మూసా (రజిఅన్) ఇలా అడిగారు; "మీరు హ్రజత్**

---

341-1. గుసుల్ చెయ్యకుండా నమాజు చేస్తారు. దైవప్రవక్త (స) గారి ప్రత్యక్ష అనుచరుల్లో (సహాబా) హ్రజత్ ఉమర్ (ర) గారూ, అబ్దుల్లా బిన్ మస్ఊద్ (ర) గారు ఏమంటున్నా రంటే, గుసుల్ చెయ్యవలసిన అవసరం ఉన్నటువంటి వ్యక్తి (జునుబ్) తయమ్ముమ్ చెయ్యకూడదు. అది ధర్మశాస్త్రం రీత్యా సరియైన విషయం కాదు. అతను సాధ్య మైనంత వరకు, ఎలా వీలైతే అలా తప్పనిసరిగా గుసుల్ చేసుకోవాలి. ఒకవేళ నీరు దొరక్కపోతే, అతను నమాజు చెయ్యకూడదు. కాని దైవప్రవక్త (స) గారి సహచరులు చాలా మంది ఈ విషయాన్ని వ్యతిరేకించారు. వారు ఏమన్నారంటే; ఒక జునుబ్ తయమ్ముమ్ చేసుకోవచ్చు. అది ధర్మసమ్మతమైన విషయమే. అబూ మూసా (ర)కూడా ఈ విషయంతో ఏకీభవించారు. ఆయన (ర) కూ అబ్దుల్లా బిన్ మసూద్ (ర)కూ మధ్య ఈ విషయమై పెద్ద వాగ్వివాదమే జరిగింది.

341-2. హ్రజత్ ఉమర్ (రజిఅన్) గారికి ఈ విషయం జ్ఞాపకం రాలేదు. వాస్తవానికి ఆయన కూడా ఆ ప్రయాణంలో అందరితోపాటు ఒక బాటసారిగా ఉన్నారు.

**అమ్మార్ (ర)గారి ఉల్లేఖనం గురించి ఏమంటారు? ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఆయన గారితో, "నీవు ఇలా చేస్తే సరిపోయేది (అంటే ముఖం మీదా, చేతుల మీదా మసా చెయ్యటం అని భావం) అని అన్నారు కదా!" తరువాత ఇబ్నె మసూద్ (రజిఅన్) ఇలా అన్నారు; "హ్రజత్ ఉమర్ (రజిఅన్) గారు అమ్మార్ (రజిఅన్) చెప్పిన విషయం గురించి తృప్తిచెందలేదు అని నీవు గమనించటం లేదా?"అప్పుడు అబూ మూసా (రజిఅన్) ఇలా అన్నారు, "సరే, మంచిది. అమ్మార్ (ర) గారు చెప్పిన దానిని వదిలెయ్యండి. మీరు ఖురానులోని ఈ వాక్యాన్ని ఎలా విశ్లేషిస్తారు?"[1] అబ్దుల్లా బిన్ మసూద్ (ర) గారు దానికి ఎటువంటి సమాధానమూ చెప్పలేకపోయారు. ఆయన ఇలా అనసాగారు; ఒకవేళ మనము ప్రజలకు జనాబత్ స్థితిలో తయమ్ముమ్ చేసుకునే అనుమతి ఇచ్చినట్లయితే సమీప భవిష్యత్తులోనే, ఎవరికైనా నీరు చల్లగా ఉన్నట్లు అనిపిస్తే అప్పుడు వారు గుసుల్‌ను విడిచిపెట్టి తయమ్ముమ్ చేసుకుంటారు. నేను షఖీఖ్‌తో ఇలా అన్నాను అని ఆమష్ చెప్పారు; "కనుక అబ్దుల్లా బిన్ మసూద్ (ర) గారు, ఒక జునుబ్ తయమ్ముమ్ చేసుకోవటాన్ని ఈ వివేకంతోనే ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొనే చెడుగా భావించారు. అవునా? దానికి సమాధానంగా షఖీఖ్ గారు 'అవును' అని సమాధానమిచ్చారు.[2]**

---

ఆయనకు సందేహం కలిగింది. కాని అమ్మార్ (రజిఅన్) నిజాయితీపరుడైన వ్యక్తి. ఆయన గారి ఉల్లేఖనం ఆధారంగా మత విద్వాంసులందరూ ఇలా తీర్పు చెప్పారు; ఒక జునుబ్ (గుసుల్ అవసరం ఉన్న వ్యక్తి) తయమ్ముమ్ చేసుకోవటం ధర్మసమ్మత మైన విషయమే. ఇంకా వారు హ్రజత్ ఉమర్ (ర), హ్రజత్ ఇబ్నె మసూద్ (ర) గార్ల వ్యతిరేకతను ఏ మాత్రం పట్టించుకోలేదు. ఖలీఫా అయినటువంటి హ్రజత్ ఉమర్ (ర) గారి సూక్తినే హదీసుకు వ్యతిరేకంగా తీసుకోనప్పుడు ఏ ఇమామ్ చెప్పిన దాన్నయినా, ఏ ధర్మశాస్త్రవేత్త ఇచ్చిన తీర్పునైనా హదీసుకు వ్యతిరేకంగా ప్రాధాన్యం కలదిగా తీసుకోవటం ఎలా స్వీకారయోగ్యం?

342-1. ఈ వాక్యం ఖుర్‌ఆను గ్రంథంలోని అల్ మాయిద సూరాలో ఉన్నది; "అవ్‌లా మస్‌తుమున్ నిసాఅ" "విశ్వసించిన ఓ ప్రజలారా! మీరు గనక స్త్రీలను ముట్టుకుంటే అప్పుడు నీరు లభించని పక్షంలో, పరిశుభ్రమైన మట్టితో విధిని నిర్వహించండి." కనుక ఈ వాక్యం ప్రకారం, ఒక జునుబ్ (గుసుల్ అవసరమైన వ్యక్తి) కోసం తయమ్ముమ్ చేసుకోవటానికి ఔచిత్యం, శాస్త్రీయత ఉన్నాయనే విషయం స్పష్టమవుతోంది. ఎందుకంటే, 'లమస్' అనే ఈ వ్యాసంలోని అరబ్బీ పదానికి

## 8వ అధ్యాయం

**తయమ్ముమ్ చేసుకునేటప్పుడు మట్టి మీద చేతులతో ఒకసారి కొడితే సరి పోతుంది.**

**343.** షఖీఖ్ గారు ఇలా అన్నారని ఆమష్ గారు ఉల్లేఖించారు; ఒకసారి నేను, అబ్దుల్లా బిన్ మసూద్ (రజిఅన్), అబూ మూసా అషారీ (రజిఅన్) గార్ల దగ్గర కూర్చొని ఉన్నాను. అబూ మూసా (ర) గారు, అబ్దుల్లా బిన్ మసూద్ (ర) గారిని ఇలా అడిగారు, "ఒకవేళ ఒక వ్యక్తి జనాబత్‌కు గురైతే (గుసుల్ చేసుకునే అవసరం కలిగితే) వరుసగా ఒక మాసం వరకు నీరు దొరకని పక్షంలో అతను తయమ్ముమ్‌తో నమాజు చెయ్యవచ్చా?" అబ్దుల్లా బిన్ మసూద్ (ర), దానికి సమాధానంగా ఇలా అన్నారు; "అతను తయమ్ముమ్ చేసుకోకూడదు, నమాజు చెయ్యకూడదు; ఒక నెల రోజుల వరకు నీరు దొరకకపోయినా సరే", అప్పుడు అబూ మూసా (ర) ఇలా అన్నారు; అయితే ఖురాను గ్రంథంలో మాయిదా సూరాలోని వాక్యం; "అప్పుడు నీరు లభించని పక్షంలో పరిశుభ్రమైన మట్టితో విధిని నిర్వహించండి; దానిపై చేతులతో కొట్టి మీ ముఖాల మీదా, చేతుల మీదా రాయండి" గురించి మీరు ఏమంటారు? అబ్దుల్లా బిన్ మసూద్ (ర) ఇలా సమాధానం చెప్పారు; "ఒకవేళ వారికి జనాబత్ స్థితిలో తయమ్ముమ్ చేసుకునే అనుమతిని ఇచ్చినట్లయితే, సమీప భవిష్యత్తులో నీరు చల్లగా ఉన్నట్లు అనిపిస్తే వారు మట్టితో తయమ్ముమ్ చేసుకునే

---

రమించుట, సంభోగించుట అనే అర్థాలు ఉన్నాయి. హజ్రత్ అబ్దుల్లా బిన్ మసూద్ (ర)కు దానికి ఏ సమాధానం చెప్పాలో తోచలేదు. ఏమీ పాలుపోక ఆయన వివేకం, దూరదృష్టి అనే విషయాలను ప్రస్తావించారు. అబ్దుల్లా ఇబ్నె మసూద్ (ర) తమకు ఇబ్నె అబీ షైబాగారు ఉల్లేఖించినటువంటి 'ఫత్వా' (తీర్పు)ను ఆశ్రయించారు అని చాలా మంది అంటారు. ఇమామ్ నవవీ (రహ్మాలై) ఏమన్నారంటే; హజ్రత్ ఉమర్ (రహ్మాలై) కూడా తాను ఇది వరకు చెప్పిన విషయాన్నే ఆశ్రయించారు.

342-2. కాని వివేకం, దూరదృష్టి కారణంగా షరీయత్ ఆజ్ఞలు మారవు. నవవీ రహ్మాలై ఇలా అన్నారు; ఒక జునుబ్ (గుసుల్ అవసరమైన వ్యక్తి), బహిష్టు అయిన స్త్రీ, ప్రసవానంతర రక్తస్రావంగల స్త్రీ, వీరందరికీ నీళ్లు లభించని సందర్భంలో తయమ్ముమ్ ధర్మసమ్మతమైనదే. ఈ విషయం గురించి ముస్లిమ్ సమాజంలో విద్వాంసుల మధ్య ఏకాభిప్రాయం ఉన్నది.

అవకాశముంది." ఆమష్‌గారు ఇలా అన్నారు; నేను షఖీఖ్ గారిని "ఈ కారణం వల్లనే ఒక జునుబ్ తయమ్ముమ్ చేసుకోవటం మంచిది కాదు అని భావించారా?" అని అడిగాను. దానికి ఆయన "అవును" అని సమాధానం పలికారు. ఆ తరువాత అబూ మూసా (ర)గారు, ఇబ్నె మసూద్ (ర) గారితో ఇలా అన్నారు; "అయితే మీరు అమ్మార్ (ర) గారు హ|జత్ ఉమర్ (ర) గారికి చెప్పిన ఈ విషయాన్ని వినలేదా?" ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారు ఒక పని కోసం నన్ను ఒక చోటకు పంపారు. మార్గమధ్యంలో నాకు గుసుల్ చేసుకునే అవసరం కలిగింది. కాని నీరు దొరకలేదు. అప్పుడు నేను ఒక పశువు మాదిరిగా మట్టి మీద అటూ ఇటూ దొర్లాను. దాని తరువాత ప్రవక్త మహనీయుల(స) ముందు ఈ విషయాన్ని గురించి ప్రస్తావించాను. అప్పుడు ఆయన (స) ఇలా సెలవిచ్చారు; "నీవు ఇలా చేస్తే సరి పోయేది అంటూ, ఆయన (స) గారు తమ చేతులను నేలమీద కొట్టారు. తరువాత వాటి మీద ఊదారు. ఆ తరువాత ఎడమ చేత్తో కుడి చేతి మీద మసా చేశారు. లేదా కుడి చేత్తో ఎడమ చెయ్యి వెనుక భాగం మీద మసా చేశారు.[1] ఆపైన తమ రెండు చేతులను తమ ముఖం మీద త్రిప్పారు." అప్పుడు అబ్దుల్లా గారు ఇలా అన్నారు; హ|జత్ ఉమర్ (ర) గారు అమ్మార్ (ర) గారు చెప్పిన విషయం గురించి తృప్తిచెందలేదని నీవు గమనించలేదా?

షఖీఖ్ ఇలా ఉల్లేఖించారు; నేను అప్పుడు అబ్దుల్లా బిన్ మసూద్ (ర), అబూ మూసా(ర) గార్ల వద్ద ఉన్నాను. అబూ మూసా (ర) అబ్దుల్లా బిన్ మసూద్‌తో ఇలా అన్నారు. మీరు అమ్మార్ (ర)గారు హ|జత్ ఉమర్ (ర) గారితో చెప్పిన ఈ విషయాన్ని వినలేదా? "దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారు మిమ్మల్నీ మరియు నన్నూ ఒక సైనిక బృందంతో పంపారు. నాకు మార్గమధ్యంలో గుసుల్ చేసుకునే అవసరం కలిగింది. అప్పుడు నేను మట్టి మీద పడి అటూఇటూ దొర్లాను. తరువాత మనం దైవప్రవక్త (స) వారి వద్దకు వచ్చాము. ఆయన (స) గారికి ఈ

343-1. ఈ విషయం గురించి ఉల్లేఖకునికి సంశయం కలిగింది. అబూ దావూద్ గారి ఒక ఉల్లేఖనంలో, సంశయం లేకుండా ఇలా ప్రస్తావించబడింది; తరువాత ఎడమ చేత్తో కుడి చేతి మీద కొట్టారు. మరియు కుడి చేత్తో ఎడమ చేతి మీద కొట్టారు. రెండు మోచేతుల మీద మసా చేసి ఆ తరువాత ముఖం మీద మసా చేసుకున్నారు. అంతే.

**విషయాన్ని గురించి విన్నవించాము. అప్పుడు ఆయన (స) గారు ఇలా సెలవిచ్చారు; "నీవు ఇలా చేస్తే సరిపోయేది" తరువాత ఆయన (స) గారు తమ ముఖం మీదా, రెండు చేతుల వెనుక భాగాల మీద మసా చేశారు."**

**344. ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహ నీయులు (సఅసమ్) దూరంగా ఒక ప్రక్కన కూర్చొని ఉన్నటువంటి ఒక వ్యక్తిని చూశారు. అతను ప్రజలందరితో కలిసి నమాజు చెయ్యలేదు. ఆయన (స) గారు, ఓ ఫలానా వ్యక్తీ! నీకేమయింది, నీవు అందిరితోపాటు నమాజు ఎందుకు చెయ్యలేదు? అని అడిగారు. అతను ఇలా సమాధానం పలికాడు; ఓ దైవప్రవక్తా! నాకు గుసుల్ చేసుకునే అవసరం కలిగింది. కాని స్నానం చెయ్యటానికి నీళ్ళు లేవు. అప్పుడు ఆయన (స) ఇలా సెలవిచ్చారు; "పరిశుభ్రమైన మట్టితో తయమ్ముమ్ చేసుకో, అది నీకు సరిపోతుంది."**

తయమ్ముమ్ అంటే ఇదే. ఈ ఉల్లేఖనమే ఉత్తమమైనది. అహ్లె హదీస్ పండితులూ, ఇతర మత విద్వాంసులూ దీనినే అవలంబించారు. రెండుసార్లు మసా చెయ్యాలి అనే విషయం ఉన్నటువంటి ఉల్లేఖనాలన్నీ బలహీనమైనవే.

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

# నమాజు ప్రకరణం

## 1వ అధ్యాయం

### మేరాజ్ రాత్రి ఏ విధంగా నమాజ్ ఫరజ్ (విధి)గా చెయ్యబడింది.[1]

ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా అన్నారు; హెరిక్లస్ గాధను నాకు వినిపిస్తూ అబూ సుఫ్యాన్ ఇలా అన్నారు; "ఆయన అంటే ప్రవక్త (సఅసమ్) గారు మమ్మల్ని నమాజు చెయ్యమనీ, సత్యం పలకమనీ, హరామ్ (నిషిద్ధం) విషయాలకు దూరంగా ఉండమనీ ఆజ్ఞాపించారు".[2]

**345.** దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అబూజర్ (రజిఅన్) గారు ఉల్లేఖించారు: "నేను మక్కా నగరంలో ఉన్నప్పుడు ఒక రాత్రి నేను నివసించే ఇంటి కప్పు తెరువబడింది. అందులో నుంచి హజ్రత్ జిబ్రీల్ (అస్సలామ్) కిందికి దిగారు. తరువాత ఆయన నా రొమ్మును చీల్చారు.[1] ఆ తరువాత దానిని జమ్‌జమ్ జలధారలతో కడిగారు. ఆ తరువాత ఒక బంగారు పళ్ళాన్ని తీసుకువచ్చారు. ఆ పళ్ళెం విశ్వాసంతో, వివేకంతో నిండి ఉన్నది.[2] ఆయన వాటిని నా గుండెలోకి కుమ్మరించారు. తరువాత రొమ్మును కలిపేశారు. ఆ తరువాత ఆయన నా చేతిని పట్టుకుని నాతోపాటు ఆకాశం వైపునకు పయనించసాగారు. నేను మొదటి ఆకాశం మీదకు చేరుకున్నప్పుడు అది మూయబడి ఉన్నది. జిబ్రీల్(అ) ఆకాశ ద్వారపాలకునితో 'తలుపులు తెరువు' అని అన్నారు. అతను 'మీరు ఎవరు?' అని

---

1-1. మేరాజ్ మరియు దానికి సంబంధించిన వివరాలు ముందు రాబోతున్నాయి. మేరాజ్ సంఘటన ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారు మేల్కొని ఉన్న స్థితిలో జరిగింది. శరీరమూ, ఆత్మా రెండింటితో జరిగింది అనే విషయంతో అహ్లెహదీస్ విద్వాంసులు కూడా ఏకీభవించారు.

1-2. ఈ హదీసు ఇది వరకే ఒకసారి వచ్చింది.

**అడిగాడు. 'నేను జిబ్రీల్'ను అని సమాధానం వచ్చింది. అతను, 'మీతోపాటు మరెవరైనా ఉన్నారా?' అని అడిగాడు. అప్పుడు జిబ్రీల్ 'అవును, నాతో ముహమ్మద్ (స) ఉన్నారు' అని జవాబు పలికారు. దానికి అతను, 'ఆయన పిలువబడ్డారా' అని అడిగాడు. జిబ్రీల్ (అ) 'అవును, ఆయన పిలువబడ్డారు' అని సమాధానం చెప్పారు. అతను ద్వారాలు తెరువగానే మేము మొదటి ఆకాశం మీదకు ఎక్కాము. అక్కడ ఒక వ్యక్తి కూర్చోని ఉన్నాడు. అతని కుడివైపునా ప్రజలు గుంపులు గుంపులుగా గుమిగూడి ఉన్నారు. ఎడమ వైపునా ప్రజలు గుంపులు గుంపులుగా గుమిగూడి ఉన్నారు. అతను కుడివైపుగ చూసినప్పుడు హాయిగా నవ్వుతాడు. ఎడమ వైపు చూసినప్పుడు బాధగా ఏడుస్తాడు. నన్ను చూసి ఆ వ్యక్తి 'స్వాగతం! పవిత్రుడువైన ఓ ప్రవక్తా! సజ్జనుడవైన ఓ కుమారా! స్వాగతం!' అన్నాడు. నేను జిబ్రీల్ (అ)ను, 'ఈయన ఎవరు?' అని అడిగాను. దానికి జవాబుగా ఆయన, 'ఈయన ఆది మానవుడైన ఆదమ్ (అ). అతనికి కుడివైపునా, ఎడమ వైపునా నీవు చూస్తూ ఉన్నటువంటి ప్రజలు ఈయన గారి సంతానానికి చెందిన ఆత్మలు. కనుక అతని కుడివైపున ఉన్న వారు స్వర్గవాసులు.[3] అతని ఎడమ వైపున ఉన్న వారు నరకవాసులు. అతను తన కుడివైపు చూసినప్పుడు సంతోషంగా నవ్వుతాడు. ఎడమ వైపు చూసినప్పుడు బాధ పడుతూ ఏడుస్తాడు' అన్నారు. తరువాత జిబ్రీల్ దూత నన్ను తీసుకుని రెండో ఆకాశం**

---

345-1. ఇది దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) గారి రొమ్మును రెండోసారి చీల్చిన సంఘటనకు సంబంధించిన విషయం. ఇదివరకు ఒకసారి పాలుత్రాగే వయస్సులో ఉన్నప్పుడు ఆయన (స) గారి రొమ్మును చీల్చటం జరిగింది.

345-2. వివేకం అంటే, అల్లాహ్‌కు సంబంధించిన జ్ఞానం, షరీయత్‌కు సంబంధించిన జ్ఞానం, నైతిక సంస్కరణకు సంబంధించిన జ్ఞానం అని భావం.

345-3. పైకి కనిపించే విషయం ఏమిటంటే, మంచి ఆత్మలూ, చెడ్డ ఆత్మలూ అన్నీ ఆకాశంలో ఉన్నాయి. వాస్తవానికి ఇతర హదీసుల ద్వారా స్పష్టంగా తెలిసే విషయం ఏమిటంటే, అవిశ్వాసుల ఆత్మలు ఏడో భూమి క్రింద అగాధంలో ఉన్నటువంటి 'సిజ్జీన్' అనే స్థలంలో ఉంటాయి. బహుశా అప్పుడప్పుడు ఈ ఆత్మలన్నీ హజ్రత్ ఆదమ్ (అ) దగ్గరకు తీసుకురాబడతాయేమో అనే విషయం అసాధ్యమయినదేమీ కాదు. యాదృచ్ఛికంగా ఆ సమయంలోనే మన ప్రవక్త మహనీయులు(స) అక్కడకు వెళ్ళటం జరిగిందేమో. లేదా ఇంకా ప్రపంచంలోకి రానటువంటి ఆత్మలేమో అని కూడా భావం కావచ్చు. (వల్లాహు ఆలమ్)

**మీదకు ఎక్కారు. అక్కడి ద్వార పాలకుణ్ణి ఉద్దేశించి 'తలుపులు తెరువు' అని అన్నారు. అతను కూడా మొదటి ద్వారపాలకుడు మాదిరిగానే ప్రశ్నలు వేశాడు. చివరకు ద్వారాలు తెరిచాడు. అబూజర్ గిఫ్ఫారీ (రజిఅన్) ఇలా చెప్పారని అనస్ (రజిఅన్) తెలిపారు; ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఆకాశాలలో ఉన్నటువంటి ప్రవక్త ఆదమ్ (అ)నూ, ప్రవక్త ఇద్రీస్(అ)నూ, ప్రవక్త మూసా (అ)నూ, ప్రవక్త ఈసా (అ)నూ, ప్రవక్త ఇబ్రాహీమ్ (అ)నూ చూశారు. కాని వారి నివాస స్థలం ఎక్కడో తెలియజెయ్యలేదు.[4] ఈ విషయం మాత్రం చెప్పారు; ఆయన (స) గారు మొదటి ఆకాశం మీద హజ్రత్ ఆదమ్ (అ)ను చూశారు. ఇంకా ఆరవ ఆకాశం మీద ప్రవక్త ఇబ్రాహీమ్ (అ)ను చూశారు.**

**హజ్రత్ అనస్ (రజిఅన్) ఇలా అన్నారు; హజ్రత్ జిబ్రీల్ (అ) మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్)ను తీసుకునిపోతూ ఉండగా మార్గమధ్యంలో ప్రవక్త ఇద్రీస్ (అ) కనిపించారు. అప్పుడు ప్రవక్త ఇద్రీస్ (అ) ఇలా అన్నారు: "స్వాగతం! పుణ్య పురుషుడవైన ఓ ప్రవక్తా! నీకు స్వాగతం! సజ్జనుడవైన ఓ సోదరా! స్వాగతం!" నేను, 'ఈయన ఎవరు?' అని హజ్రత్ జిబ్రీల్ (అ)ను అడిగాను. ఆయన 'ఈయన ఇద్రీస్' అని సమాధానమిచ్చారు. తరువాత నేను, హజ్రత్ మూసా (అ)ను కలుసుకోవటం జరిగింది.[5] ప్రవక్త మూసా(అ) ఇలా అన్నారు; "రండి! పుణ్యపురుషుడవైన ఓ ప్రవక్తా! మీకు స్వాగతం! సజ్జనుడవైన ఓ సోదరా! సుస్వాగతం!" నేను 'ఈయన ఎవరు?' అని హజ్రత్ జిబ్రీల్ (అ)ను అడిగాను. ఈయన ప్రవక్త మూసా(అ) అని చెప్పారు.**

---

345–4. ఇతర ఉల్లేఖనాలలో ఈ స్థలాలు ఈ విధంగా ప్రస్తావించబడ్డాయి: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) మొదటి ఆకాశం మీద హజ్రత్ ఆదమ్ (అ)ను కలుసుకున్నారు; రెండో ఆకాశం మీద హజ్రత్ యహ్యా (అ)ను మరియు హజ్రత్ ఈసా (అ)ను కలుసుకున్నారు; మూడో ఆకాశం మీద హజ్రత్ యూసుఫ్ (అ)ను కలుసుకున్నారు; నాలుగో ఆకాశం మీద హజ్రత్ ఇద్రీస్ (అ)ను కలుసుకున్నారు; ఐదో ఆకాశం మీద హజ్రత్ హారూన్ (అ)ను కలుసుకున్నారు; ఆరో ఆకాశం మీద హజ్రత్ మూసా (అ)ను కలుసుకున్నారు; ఇంకా ఏడో ఆకాశం మీద హజ్రత్ ఇబ్రాహీమ్ (అ)ను కలుసుకున్నారు.

345–5. ఇతర హదీసులలో మొదట, దైవప్రవక్త ముహమ్మద్ (స) హజ్రత్ ఈసా (అ)ను కలుసుకున్నట్లు ప్రస్తావించటం జరిగింది; ఆ తరువాతనే హజ్రత్ మూసా (అ)ను కలిసినట్లు చెప్పటం జరిగింది.

**ఆ తరువాత నేను ప్రవక్త ఈసా (అ)ను కలవటం తటస్థపడింది. ఆయన ఇలా అన్నారు; "రండి! పుణ్యపురుషుడవైన ఓ ప్రవక్తా! రండి! సజ్జనుడవైన ఓ సోదరా! నీకు స్వాగతం!" నేను 'ఈయన ఎవరు?' అని జిబ్రీల్ (అ)ను అడిగాను. ఆయన 'ఈయన ప్రవక్త ఈసా(అ)' అని జవాబు పలికారు. ఆపైన నేను ప్రవక్త ఇబ్రాహీమ్ (అ)ను కలిశాను. ఆయన ఇలా అన్నారు; స్వాగతం! పుణ్యపురుషుడవైన ఓ ప్రవక్తా! సజ్జనుడవైన నా కుమారా!![6] సుస్వాగతం! నేను హజ్రత్ జిబ్రీల్ (అ)ను 'ఈయన ఎవరు?' అని అడిగాను, ఆయన సమాధానంగా, ఈయన 'ప్రవక్త ఇబ్రాహీమ్ (అ)' అని చెప్పారు.**

**మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని, అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజిఅన్), అబూ హబ ఆమిర్ బిన్ అమ్ర్ (రజిఅన్) ఉభయులూ ఉల్లేఖించారు; "తరువాత హజ్రత్ జిబ్రీల్(అ) నన్ను తీసుకుని పైకి ఎక్కారు. చివరకు నేను ఒక ఎత్తయిన మైదాన భూమికి చేరుకున్నాను. అక్కడ నేను దైవదూతలు వ్రాసే కలముల ధ్వనిని విన్నాను.[7]"**

**ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని ఇబ్నె హజమ్ (ర), అనస్ బిన్ మాలిక్ (ర) ఉల్లేఖించారు; "ఆ తరువాత అల్లాహ్ నా అను చర సంఘానికి యాభై నమాజులు తప్పనిసరిగా చెయ్యమని విధించాడు (ప్రతి రోజూ రేయింబవళ్ళు). నేను ఈ దైవాజ్ఞను తీసుకుని తిరుగు ప్రయాణం పట్టాను. ప్రవక్త మూసా (అ)ను కలిసినప్పుడు ఆయన "మీ ఉమ్మత్‌కు ఏ పని విధిగా చెయ్యమని అల్లాహ్ ఆజ్ఞాపించాడు?" అని అడిగారు. దానికి సమాధానంగా నేను, యాభై నమాజులను తప్పనిసరిగా చెయ్యాలని అల్లాహ్ విధించాడు అని చెప్పాను. ప్రవక్త మూసా(అ) ఇలా అన్నారు; మీ ప్రభువు వద్దకు తిరిగి వెళ్ళండి. ఎందుకంటే యాభై నమాజులు చేసే శక్తి మీ సంఘానికి లేదు.[8] నేను తిరిగి అల్లాహ్ వద్దకు వెళ్లి ఈ**

---

345-6. మహాప్రవక్త ముహమ్మద్ (స) హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) గారి సంతతికి చెందినవారు. ఈ కారణంగానే ఆయన గారు ముహమ్మద్(స)ను 'సజ్జనుడవైన ఓ ప్రవక్తా!', 'సజ్జనుడవైన ఓ కుమారా!' అని సంబోధించారు.

345-7. వ్రాయటానికి నియుక్తులై ఉన్న దైవదూతల కలాల చప్పుళ్లను ఆయన (స) విన్నారు.

345-8. అంటే ప్రతి రోజూ రాత్రి పగలు యాభై నమాజులు చెయ్యాలి అని అర్థం. ఐదు నమాజులనే ప్రజలు చెయ్యటం లేదు; వేలాదిమంది ముస్లిమ్ ప్రజలు ఈ విషయంలో

**విషయాన్ని విన్నవించుకున్నాను. అప్పుడు అల్లాహ్ కొన్ని నమాజులను మన్నించాడు.[9] మళ్ళీ నేను మూసా (అ) వద్దకు వచ్చాను, కొన్ని నమాజులను అల్లాహ్ క్షమించాడని చెప్పాను. అప్పుడు ప్రవక్త మూసా (అ) మళ్ళీ ఇలా అన్నారు; మీ ప్రభువు వద్దకు వెళ్ళండి. మీ సంఘానికి ఇన్ని నమాజులు చేసే శక్తి లేదు. నేను అల్లాహ్ వద్దకు మళ్ళీ వెళ్లాను. అల్లాహ్ మరికొన్ని నమాజులను క్షమించివేశాడు. తరువాత నేను మూసా వద్దకు వచ్చాను. ఆయన మళ్ళీ ఇలా అన్నారు. మీ ప్రభువు వద్దకు తిరిగి వెళ్ళండి. మీ సంఘానికి ఇంతటి శక్తి లేదు. ఆ తరువాత నేను అల్లాహ్ వద్దకు వెళ్లాను (ఇలా ఎన్నోసార్లు జరిగింది). చివరకు అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు; అవి ఐదు నమాజులు.[10] వాస్తవానికి పుణ్యం రీత్యా అవి యాభై నమాజులు అవుతాయి.[11] నా మాటలో ఇక మార్పు ఉండదు. ఆ పైన నేను మూసా(అ) వద్దకు వచ్చాను. అప్పుడు ఆయన ఇలా అన్నారు; "మీ ప్రభువు వద్దకు తిరిగిపొండి." అప్పుడు నేను ఇలా అన్నాను; ఇక నేను వెళ్లను. నా ప్రభువు వద్దకు వెళ్ళటానికి నాకు సిగ్గేస్తోంది. ఆ తరువాత హజ్రత్ జిబ్రీల్ (అ) నన్ను తీసుకుని బయలుదేరారు. చివరకు నన్ను 'సిద్ర తుల్ మున్తహా' (రేగి చెట్టు) దగ్గర వదలిపెట్టారు.[12] ఆ చెట్టును రకరకాల రంగులు**

---

నష్టానికి గురి అవుతున్నారు. ఒకవేళ యాభై నమాజులు తప్పకుండా చెయ్యాలి అనే ఆజ్ఞ అవతరించినట్లయితే, చాలా కొద్దిమంది ప్రజలు మాత్రమే ఆ నమాజులను చెయ్యగలిగేవారు.

345-9. యాభై నమాజులకు బదులుగా నలభై అయిదు నమాజులు ఉండిపోయాయి. ఇదే విధంగా ప్రతిసారీ ఐదు నమాజుల చొప్పున క్షమించబడుతూపోయాయి. ప్రవక్త మహనీయులు(స) నమాజుల సంఖ్యను తగ్గించటానికి తొమ్మిది సార్లు అల్లాహ్ దర్బారుకు వెళ్ళారు. చివరకు ఐదు నమాజులు మిగిలిపోయాయి.

345-10. ఇక్కణ్ణుంచే అధ్యాయంలోని కీలక విషయం ప్రారంభమవుతుంది; అంటే నమాజు మేరాజ్ సంఘటన జరిగిన రాత్రి విధిగా చెయ్యబడింది అనేది.

345-11. ప్రతి సత్కార్యానికి పది రెట్లు పుణ్యం ఎక్కువగా లభిస్తుంది కనుక ఐదు నమాజులు, ఒక్కొక్క దానికి పది పుణ్యాల చొప్పున, యాభై నమాజులకు సరిసమానమై పోతాయి.

345-12. సిద్రతుల్ మున్తహా అనేది ఒక రేగి వృక్షం. అది ఏడో ఆకాశం మీద ఉన్నది. దాని వ్రేళ్లు ఆరో ఆకాశం వరకు వ్యాపించి ఉన్నాయి. మున్తహా అంటే; దైవదూతలు సయితం ఆ వృక్షం వరకు మాత్రమే వెళ్లగలుగుతారు. వారి జ్ఞానం కూడా అక్కడితోనే సమాప్తమవుతుంది. హజ్రత్ అబ్దుల్లా బిన్ మసూద్ (ర) ఇలా అన్నారు; 'మున్తహా'

**అలుముకుని ఉన్నాయి. ఆ రంగులు ఏమిటో నేను వర్ణించలేను, అవి నాకు తెలియవు.[13] తరువాత నన్ను స్వర్గంలోకి తీసుకుపోయారు. అక్కడ నేను ముత్యాల హారాలను చూశాను. అక్కడి మట్టి కస్తూరి వాసనను వెదజల్లుతోంది.[15]**

**346. విశ్వాసుల తల్లి అయిన హజ్రత్ ఆయిషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: అల్లాహ్ మేరాజ్ జరిగిన రాత్రిలో నమాజును విధిగా చెయ్యాలని ఆజ్ఞాపించాడు. అప్పుడు ప్రతి నమాజులోనూ రెండేసి రకాతులు మాత్రమే చెయ్యాలని విధించాడు; ప్రయాణావస్థలో ఉన్నప్పుడు కూడా, నివాస స్థలంలో ఆగి ఉన్నప్పుడు కూడా. ఆ తరువాత ప్రయాణంలోని నమాజైతే రెండు రకాతుల నమాజుగానే తన పూర్వపు స్థితిలో మాదిరిగానే ఉండిపోయింది. కాని నివాస స్థలంలో ఉన్నప్పుడు చెయ్యవలసిన నమాజు మటుకు పెంచబడింది.**

## 2వ అధ్యాయం

### వస్త్రాలు ధరించి నమాజు చెయ్యటం వాజిబ్ (అనివార్యం)

**అల్లాహ్ ఖురాను గ్రంథంలో ఆరాఫ్ సూరాలో ఇలా సెలవిచ్చాడు; "ఓ ఆదమ్ సంతానమా! ప్రతి నమాజు సమయంలోనూ మీరు మీ వస్త్రాలను ధరించి ఉండండి." (ఆరాఫ్- 31) ఎవరైతే ఒకే వస్త్రంతో తన శరీరాన్ని కప్పుకుని నమాజు చేశాడో అతను తన విధిని నిర్వహించాడు. ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని సలమా బిన్ అక్వా ఉల్లేఖించారు; ఒకవేళ ఒకే వస్త్రాన్ని కట్టుకుని నమాజ్ చేసినట్లయితే, అప్పుడు ఆ వస్త్రాన్ని కుట్టుకోవాలి, కనీసం ఒక ముల్లుతోనైనా వస్త్రం యొక్క అంచులను కలుపుతూ గుచ్చి ఉంచాలి. ఎవరైనా సంభోగ సమయంలో తాను ఏ దుస్తులనయితే కట్టుకున్నాడో, ఆ దుస్తులతోనే నమాజు చేస్తే, ఆ నమాజు ధర్మసమ్మతమైన నమాజే అవుతుంది. అది దోషమేమీ కాదు. అయితే ఆ దుస్తుల మీద మాలిన్యం, అశుద్ధత[1] అనేది ఉండకూడదు. ఇంకా మహాప్రవక్త ముహమ్మద్**

---

అని దానిని ఎందుకంటారంటే, పై నుంచి వచ్చే ఏ ఆదేశమైనా అది అక్కడ దాకా వచ్చి ఆగిపోతుంది. ఇంకా కింది నుంచి పైకి ఏది వచ్చినా అది కూడా అక్కడి వరకు వచ్చి స్తంభించిపోతుంది.

345–13. అంటే ఆ రంగుల యదార్థాన్ని నేను ఎరుగను. అవి బహుశా అల్లాహ్‌కు చెందిన వెలుగులేమో.

345–14. ఇమామ్ బుఖారీ (ర) గారి మరొక హదీసులో ముస్లిమ్ గారి హదీసులో ఇలా ఉంది. అంటే అవి ముత్యాల గుమ్మటాలు లేక బురుజులు.

345–15. అంటే కస్తూరి మాదిరిగా పరిమళాన్ని, సువాసనను వెదజల్లేది.

**(స) ఇలా ఆజ్ఞాపించారు, "ఎవరైనా నగ్నంగా అల్లాహ్ గృహమైన కాబా ప్రదక్షిణం చెయ్యకూడదు.**[2]

**347.** **ఉమ్మె అతియా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: రెండు పండుగ సమయాలలోనూ బహిష్టు అయిన మా స్త్రీలను, పరదాను పాటించే మా స్త్రీలను బయటికి తీసుకురమ్మని మమ్మల్ని ఆజ్ఞాపించటం జరిగింది.**[1] **వారు ముస్లిముల ధార్మిక సమావేశాలలోనూ, వారు చేసే దుఆలలోనూ పాల్గొనవచ్చునే అనుమతి కూడా ఇవ్వబడింది. అయితే బహిష్టు అయిన స్త్రీలు నమాజు చేసే స్థలాలకు దూరంగా ఉండాలి. అప్పుడు ఒక మహిళ మహాప్రవక్త (స)ను ఉద్దేశించి ఇలా అడిగారు; ఓ దైవ ప్రవక్తా! కొందరు స్త్రీల వద్ద దుప్పట్లు లేవు, వారు బయటికి ఎలా రాగలరు? దానికి సమాధానంగా మహాప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు. ఆమెతోపాటు ఉన్నటువంటి స్త్రీ తన దుప్పటిని ఆమెకు కూడా కప్పాలి.**

## 3వ అధ్యాయం

**నమాజు చేసేటప్పుడు ఇజారును (ఛాతి క్రింది భాగంలో ధరించే వస్త్రం) మెడ వెనుక భాగానికి కట్టుకోవటం. సహల్ బిన్ సాద్ ఇలా అన్నారు; కొందరు తమ ఇజారు లను మెడలకు కట్టుకుని మహాప్రవక్త (స) గారితో నమాజు చేశారు.**

**348.** **ముహమ్మద్ బిన్ మున్కదిర్ ఇలా ఉల్లేఖించారు; ఒకసారి హజ్రత్ జాబిర్ (రజిఅన్) ఒకే ఇజారుతో నమాజు చేశారు. ఆ ఇజారును ఆయన తన మెడ వెనుక భాగానికి కట్టుకున్నారు. ఇంకా ఆయన ధరించే దుస్తులు ఒక కొయ్యకు తగిలించి ఉన్నాయి. ఒక మనిషి (అబాద బిన్ వలీద్) ఆయన గారిని ఇలా అడిగాడు; మీరు ఒకే ఇజారుతో నమాజు చేశారేమిటి? దుస్తులు ఉన్నాయి కదా! అప్పుడు హజ్రత్ జాబిర్ (ర) అతనితో ఇలా అన్నారు : నీలాంటి మూర్ఖుడు నన్ను చూడాలని నేను అలా చేశాను. మహాప్రవక్త (స) గారి జీవిత కాలంలో మాలో రెండు వస్త్రాలు ఎవరికి ఎవరికి ఉండేవనీ?**[1]

---

2-1. ఈ విషయం ఒక హదీసులో ప్రస్తావించబడింది. ఆ హదీసును అబూదావూద్, నసాయీలు ఆవిష్కరించారు. అందులో ఇలా ఉంది; ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) తాము సంభోగ సమయంలో ధరించిన వస్త్రాలతోనే నమాజు కూడా చేసేవారు. కాని ఆ వస్త్రాల మీద ఏ విధమైనటువంటి అశుద్ధత ఉండేది కాదు.

2-2. ఈ హదీస్‌ను ఇమామ్ అహ్మద్ గారు ఆవిష్కరించారు. నగ్నంగా కాబా గృహ ప్రదక్షిణమే నిషిద్ధమైనప్పుడు అశుద్ధావస్థలో నమాజు చెయ్యటం అనేది అత్యంత నిషిద్ధమైనది.

**349.** **ముహమ్మద్ బిన్ మున్కదిర్ ఇలా ఉల్లేఖించారు: హజ్రత్ జాబిర్ (రజిఅన్) ఒకే వస్త్రాన్ని ధరించి నమాజు చేస్తూ ఉండగా నేను చూశాను. ఇంకా హజ్రత్ జాబిర్ (ర) ఇలా అన్నారు : ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఒకే వస్త్రాన్ని కట్టుకుని నమాజు చేస్తూ ఉండగా నేను చూశాను.**[1]

## 4వ అధ్యాయం
## ఒకే ఒక వస్త్రాన్ని శరీరానికి చుట్టుకుని నమాజు చెయ్యటం.

**ఉమ్మె హానీ బిన్తె అబీ తాలిబ్ (ర) ఇలా అన్నారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఒకే వస్త్రాన్ని తన శరీరానికి చుట్టుకున్నారు. ఆ వస్త్రం యొక్క రెండు అంచులను తన రెండు భుజాల మీద తిరగేసి వేసుకున్నారు.**

**350.** **ఉమర్ బిన్ అబీ సలమా (ర) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహ నీయులు ముహమ్మద్ (స) ఒకే ఒక వస్త్రంతో నమాజు చేశారు. ఆ వస్త్రం యొక్క రెండు అంచులను తిరగేసి వేసుకున్నారు.**

**351.** **ఉమర్ బిన్ అబీ సలమా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహ నీయులు ముహమ్మద్ (సఅసమ్) విశ్వాసుల తల్లి అయిన ఉమ్మె సలమా (ర) ఇంట్లో ఒకే ఒక వస్త్రంతో నమాజు చేస్తూ ఉండగా నేను చూశాను. ఆ వస్త్రం యొక్క రెండు అంచులను ఆయన (స) తన రెండు భుజాల మీద వేసుకున్నారు.**

---

347–1. అంటే ఈద్గాహ్‌లలోకి తీసుకురమ్మని ఆజ్ఞాపించటం జరిగింది.

348–1. అంటే మహాప్రవక్త (స) గారి జీవిత కాలంలో చాలా మంది ప్రజల వద్ద ఒకే ఒక వస్త్రం ఉండేది, వారు దానితోనే నమాజు చేసేవారు కనుక బట్టలు ఉన్నప్పటికీ జాబిర్ (ర) ఇలా ఎందుకు చేశారంటే ఒకే వస్త్రంతో కూడా నమాజు చెయ్యవచ్చనీ, అది ధర్మసమ్మతమేననీ ప్రజలు తెలుసుకోవాలని. రెండు వస్త్రాలతో నమాజు చెయ్యటం శ్రేష్ఠమైనది. అబ్దుల్లా బిన్ మసూద్ (ర) ఒకే వస్త్రంతో నమాజు చెయ్యటాన్ని వారించేవారు.

349–1. ఈ హదీసుకు ఈ అధ్యాయంతో ఎలాంటి సంబంధమూ ఉన్నట్లు పైకి కనిపించదు. అయినా ఇమామ్ బుఖారీ (రహ్మాలై) దానిని ఇక్కడ ఎందుకు పెట్టారంటే, ఇదివరకు వచ్చిన ఉల్లేఖనంలో ప్రవక్త మహనీయులు (స) ఒకే వస్త్రాన్ని ధరించి నమాజు చేసినట్లు ప్రస్తావించబడలేదు. కాని ఈ హదీసులో ఒకే వస్త్రాన్ని ధరించి నమాజు చేశారనే ప్రస్తావన విస్పష్టంగా వచ్చింది.

**352.** ఉమర్ బిన్ అబీ సలమా (ర) ఇలా ఉల్లేఖించారు: నేను ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (స)ను చూశాను. ఆయన(స) గారు ఒకే ఒక వస్త్రంతో, దానిని తన శరీరానికి చుట్టుకుని విశ్వాసుల తల్లి అయిన ఉమ్మె సలమా(ర) గారి ఇంట్లో నమాజు చేస్తూ ఉన్నారు. ఆ వస్త్రం యొక్క రెండు అంచులను తన భుజాల మీద వేసుకున్నారు.

**353.** అబీ తాలిబ్ గారి కూతురైన ఉమ్మె హానీ (ర) ఇలా చెప్పారని, ఆమె గారి స్వతంత్ర బానిస అయిన అబూ ముర్రా ఉల్లేఖించారు; "నేను ఒకసారి ప్రవక్త మహనీయుని(స) వద్దకు వెళ్ళాను. ఆ సంవత్సరమే మక్కా జయించబడింది. నేను చూశాను. ఆయన (స) గారు స్నానం చేస్తున్నారు; ఆయన (స)గారి కూతురైన హ(జత్ ఫాతిమా (ర) ఆయన (స)కు అడ్డంగా ఒక తెరగా నిలబడి వున్నారు. నేను ఆయన (స) గారికి సలాం చేశాను. అప్పుడు దైవప్రవక్త (స) 'ఎవరు?' అని అడిగారు. నేను దానికి సమాధానంగా, 'ఉమ్మె హానీని, అబూతాలిబ్ కుమార్తెను' అని చెప్పాను. అప్పుడు ఆయన (స) గారు ఇలా సెలవిచ్చారు; "మంచిది ఉమ్మె హానీ, లోపలికి రా." తన స్నానాన్ని పూర్తి చేసుకున్న తరువాత ఆయన (స)గారు నమాజు కోసం నిలబడ్డారు. ఎనిమిది రకాతులు చేశారు; ఒకే వస్త్రంతో చేశారు; దానిని తన శరీరానికి చుట్టుకుని చేశారు. నమాజు చెయ్యటం పూర్తి అయిన తరువాత నేను ఆయన (స) గారిని ఇలా అడిగాను; "ఓ దైవప్రవక్తా (స)! నా తల్లి కుమారుడు (అంటే హ(జత్ అలీ (ర) హుబైరహ్ (నా భర్త యొక్క) ఫలానా కుమారుణ్ణి హతమారుస్తానని అంటున్నారు. నేను అతనికి ఆశ్రయమిచ్చాను." అప్పుడు ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు; "ఓ ఉమ్మె హానీ, నీవు ఎవరికయితే ఆశ్రయమిచ్చావో మేము కూడా అతనికి ఆశ్రయమిస్తున్నాము." ఉమ్మె హానీ, "అది చాష్త్ నమాజు చేసే సమయం అని అన్నారు."

**354.** హ(జత్ అబూ హురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారిని ఒక వ్యక్తి ఇలా ప్రశ్నించాడు; (ఆ వ్యక్తి ఎవరో తెలియదు), "ఓ దైవప్రవక్తా (స) !, ఒకే వస్త్రాన్ని శరీరానికి చుట్టుకుని నమాజు చేయటం మంచిదేనా?" దానికి సమాధానంగా మహాప్రవక్త ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారు; "(చెడ్డదేమీ కాదు) అయితే మీలోని ప్రతి మనిషి దగ్గర రెండేసి వస్త్రాలు ఉన్నాయా?"

## 5వ అధ్యాయం

### ఒకే వస్త్రాన్ని ధరించి నమాజు చేసినప్పుడు దానిని తన భుజస్కంధాల మీద కూడా వేసుకోవాలి.[1]

**355.** ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు; మీలో ఎవరూ భుజస్కంధాలను కప్పటానికి కూడా సరిపోనటువంటి ఒకే వస్త్రాన్ని కప్పుకుని నమాజు చెయ్యకూడదు.

**356.** హజ్రత్ అబూ హురైరహ్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా చెబుతూ ఉండగా నేను విన్నాను అని సాక్ష్యమిస్తున్నాను. ఆయన ఇలా సెలవిచ్చారు; ఎవరైనా ఒకే వస్త్రాన్ని కప్పుకుని నమాజు చేసినట్లయితే వారు ఆ వస్త్రం యొక్క రెండు అంచులను తిరగవెయ్యాలి.

## 6వ అధ్యాయం

### ఒకవేళ వస్త్రం బిగువుగా, టైటుగా ఉన్నట్లయితే.

**357.** సయీద్ బిన్ హారిస్ ఇలా ఉల్లేఖించారు; ఒకే వస్త్రాన్ని కప్పుకుని నమాజు చేసే విషయాన్ని గురించి నేను జాబిర్ బిన్ అబ్దుల్లా (రజిఅన్)ను అడిగాను. దానికి సమాధానంగా ఆయన ఇలా అన్నారు; ఒకసారి నేను ఒక ప్రయాణంలో దైవప్రవక్త (స) గారితో బయలుదేరాను. రాత్రి సమయంలో నేను ఒక పని కోసం దైవప్రవక్త వద్దకు వచ్చాను. అప్పుడు ఆయన (స) గారు నమాజు చేస్తూ ఉన్నారు. ఆ సమయంలో నా ఒంటి మీద కేవలం ఒకే ఒక వస్త్రం ఉన్నది. నేను దానిని నా శరీరానికి చుట్టుకున్నాను. ఇంకా ఆయన (స) గారి ప్రక్కన నిలబడి నమాజు చెయ్యసాగాను. ఆయన (స) గారు తన నమాజును పూర్తి చేసుకున్న తరువాత ఇలా

---

5-1. ఇమామ్ అహ్మద్ గారి ఒక ఉల్లేఖనం ప్రకారం, ఒకవేళ శక్తి ఉన్నప్పటికీ రెండు భుజస్కంధాలను వస్త్రం కప్పకుండా నగ్నంగా వదిలేస్తే అప్పుడు నమాజు ధర్మ సమ్మతం కాదు. మరొక ఉల్లేఖనంలో నమాజు ధర్మసమ్మతం అయిపోతుంది అని ఉంది. కాని మనిషి పాపాత్ముడు అవుతాడు. అయితే ఒకవేళ వస్త్రం చిన్నదయిన పక్షంలో దానిని భుజస్కంధాల మీద కూడా కప్పితే, ఆచ్ఛాదన (సతర్) తొలిగిపోయి నట్లయితే, ఇంకా అతని వద్ద మరొక వస్త్రం లేనట్లయితే, అప్పుడు ఆచ్ఛాదనను కాపాడుకోవాలి, భుజస్కంధాలను నగ్నంగా ఉండనియ్యాలి; అటువంటి పరిస్థితిలో నమాజు ధర్మసమ్మతం అయిపోతుంది.

**సెలవిచ్చారు; ఓ జాబిర్! నీవు రాత్రి సమయంలో ఇక్కడికెందుకొచ్చావు? అప్పుడు నేను నా రాక ఉద్దేశ్యాన్ని గురించి ఆయన (స) గారికి వివరించాను. నా వివరణ తరువాత, దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు; "ఈ వస్త్రాన్ని నీ శరీరానికి ఎలా చుట్టుకున్నావు? నీవు ఇలా ఎందుకు చేశావు?" అప్పుడు నేను ఇలా అన్నాను; "ఒకే ఒక వస్త్రం ఉన్నది. (నేనేమి చెయ్యాలి?)" ప్రవక్త మహనీయులు (స)ఇలా సెల విచ్చారు; "ఆ వస్త్రం గనక పెద్దదైతే (విశాలంగా ఉంటే) దానిని మొత్తం శరీరానికి చుట్టుకో (భుజస్కంధాలను కూడా కప్పుకో). ఇంకా అది గనక బిగువుగా ఉంటే దానిని కేవలం ఇజారుగా కట్టుకో."**

**358. సహెల్ బిన్ సాద్ సాయిది (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; చాలా మంది ప్రజలు దైవప్రవక్త (స) గారితో కలిసి, పిల్లలు మాదిరిగా తమ ఇజారులను తమ మెడల చుట్టూ కట్టుకుని నమాజు చేసేవారు. దైవప్రవక్త (స) గారి కాలంలో స్త్రీలతో ఇలా అనటం జరిగేది; పురుషులు తిన్నగా కూర్చోనంతవరకు, స్త్రీలు (నమాజులో) తమ శిరస్సులను సజ్దాలో నుంచి లేపకూడదు.[1]**

## 7వ అధ్యాయం

**సిరియా దేశంలో నేయబడిన వస్త్రాన్ని (జుబ్బా) కట్టుకుని నమాజు చెయ్యడం. ఇమామ్ హసన్ బసరీ (రహ్మాలై) ఏమన్నారంటే; పారశీక ప్రజలు నేసే బట్టలలో ఏ విధమైన దోషం లేదు. ముఅమర్ బిన్ రాషిద్ ఇలా అన్నారు; నేను ఇబ్నె షిహాబ్ జహెరీ గారిని చూశాను; ఆయన యమన్‌లో తయారుచేయబడిన వస్త్రాలను ధరించేవారు. ఆ వస్త్రాలు మూత్రంతో రంగు వేయబడేవి. హజ్రత్ అలీ (రజిఅన్) అవిశ్వాసులు నేసిన ఉతకబడని, ఒక కొత్త వస్త్రం ధరించి నమాజు చేసేవారు.**

**359. హజ్రత్ ముగైరా బిన్ షూబా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఒకసారి నేను ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారితో ప్రయాణం చేస్తూ ఉన్నాను. ఆయన (స) గారు నన్ను ఉద్దేశించి ఇలా సెలవిచ్చారు; ఓ ముగీరా! ఈ**

---

358-1. ఎందుకంటే పురుషులు కూర్చోవటానికి ముందే స్త్రీలు గనక తమ శిరస్సులు ఎత్తినట్లయితే, స్త్రీల దృష్టి పురుషుల ఆచ్ఛాదన మీద పడే అవకాశం ఉంది. ఎందు వల్లనంటే ఇజారు కింది భాగం నుంచి తెరుచుకుని ఉంటుంది. ఈ హదీసు ద్వారా మరొక విషయం కూడా స్పష్టమవుతుంది, అదేమిటంటే, కింది భాగం నుంచి సతర్‌ను కప్పటం విధి ఏమీ కాదు.

**నీటి పాత్రను తీసుకో. నేను ఆ నీటి పాత్రను తీసుకున్నాను. ఆ తరువాత ప్రవక్త మహనీయులు (స) అడవి ప్రాంతంలోకి వెళ్ళిపోయారు. చివరకు ఆయన (స) గారు నా దృష్టి నుంచి కనుమరుగైపోయారు. ఆయన(స) గారు తన అవసరాన్ని తీర్చుకుని తిరిగి వచ్చేశారు. ఆ సమయంలో ఆయన(స) గారు సిరియాలో నేయబడిన జుబ్బాను (వస్త్రం) ధరించి ఉన్నారు.[1] ఆయన (స) గారు ఆ వస్త్రం యొక్క చేయి నుంచి తన చేతులను తీయటానికి ప్రయత్నించారు. కాని అది ఇరుకుగా, బిగువుగా ఉండటం వల్ల తీయలేకపోయారు. చివరకు ఆయన (స) గారు ఆ వస్త్రం యొక్క కింది భాగం నుంచి తన చేతులను తీసుకున్నారు. అప్పుడు నేను ఆయన (స) గారి మీద నీళ్ళు పోశాను. ఆ నీళ్ళతో ఆయన (స) నమాజు కోసం చేసుకునే వుజూ లాంటి వుజూ చేసుకున్నారు. తరువాత తన మేజోళ్ళ మీద మసా చేశారు. ఆ తరువాత నమాజు చేశారు.**

## 8వ అధ్యాయం

### (అకారణంగా) వస్త్రహీనులుగా నమాజు చేయటం అసహ్యాకరమైనది.

**360. హ్రజత్ జాబిర్ బిన్ అబ్దుల్లా అన్సారీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) (ప్రవక్తా పదవికి పూర్వం, అజ్ఞానపు కాలంలో) పవిత్ర కాబా గృహ నిర్మాణం జరిగేటప్పుడు ప్రజలందరితో పాటు రాళ్ళు మోసేవారు. అప్పుడు ఆయన (స) ఇజారును కట్టుకుని ఉన్నారు. ఆయన (స) గారి బాబాయి అయిన హ్రజత్ అబ్బాస్ (రజిఅన్) ఆయన (స)తో ఇలా అన్నారు; ఓ నా సోదర కుమారా! నీవు గనక నీవు కట్టుకున్న ఇజారును తీసివేసి దానిని నీ భుజ స్కంధాలపై రాళ్ళక్రింద పెట్టినట్లయితే (అప్పుడు రాళ్లు మొయ్యటం నీకు తేలికగా ఉంటుంది). హ్రజత్ జాబిర్ (ర) ఇలా అన్నారు; ఆయన (స) గారు తన ఇజారును తీసివేసి దానిని తన భుజాల మీద వేసుకున్నారు. వెంటనే, అప్పుడే ఆయన గారు**

---

359–1. హాఫిజ్ గారు ఇలా అన్నారు; అప్పుడు సిరియా దేశం అవిశ్వాసుల పరిపాలనలో ఉన్నది. ఇమామ్ అబూ హనీఫా(రహ్మలై) గారు, అవిశ్వాసులు నేసిన వస్త్రాన్ని ఉతక కుండా ధరించి నమాజు చెయ్యటాన్ని అవాంఛనీయమైనదిగా భావించేవారు. ఇమామ్ మాలిక్ (రహ్మలై) గారు ఏమన్నారంటే; ఎవరైనా అటువంటి వస్త్రాన్ని ధరించి నమాజు చేసినట్లయితే, వారు ఆ నమాజును మళ్ళీ చెయ్యటం వాజిబ్ అవుతుంది. హ్రజత్ మౌలానా ఫజులుర్రహ్మాన్ గారు, ఇంగ్లీషువారు నేసినటువంటి వస్త్రాన్ని కుట్టించి నప్పుడు, దానిని ఉతికిన తరువాతనే ధరించేవారు.

**స్పృహ తప్పి కింద పడిపోయారు.[1] ఆ తరువాత ఆయన గారిని నగ్నంగా చూడటం అనేది సంభవించలేదు.**

## 9వ అధ్యాయం

### చొక్కా పైజామాలూ, మోకాళ్ళ వరకు ఉండే నిక్కర్లూ, పొడుగాటి కోటూ ధరించి నమాజు చెయ్యటం.[1]

**361.** **హ్జ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒక మనిషి[1] ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (స)గారి వద్దకు వచ్చి నిలబడి ఆయన (స) గారిని, "ఒకే వస్త్రాన్ని ధరించి నమాజు చేయటం గురించి చెప్పండి" అని అడిగాడు. దానికి సమాధానంగా దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు; "అయితే మీలోని ప్రతి మనిషికీ రెండేసి వస్త్రాలు ఉన్నాయా?" మరొక మనిషి[2] ఇదే సమస్యను గురించి హ్జ్రత్ ఉమర్ (రజిఅన్)ను అడిగాడు.[3] దానికి జవాబు చెబుతూ హ్జ్రత్ ఉమర్ (ర) ఇలా అన్నారు; అల్లాహ్ మీకు విస్తారంగా సంపదను ప్రసాదించినప్పుడు మీరు కూడా విశాలమైన హృదయంతో ప్రవర్తించండి. ఇంకా మనిషి నమాజు చేసేటప్పుడు సరియైన, సక్రమమైన, సంపూర్ణమైన వస్త్రాలను ధరించాలి. ఇజారునూ, దుప్పటినీ ధరించి నమాజు చెయ్యవచ్చు; ఇంకా ఇజారునూ, చొక్కానూ ధరించి నమాజు చెయ్య వచ్చు; ఇంకా ఇజారునూ, ఖమీజునూ ధరించి నమాజు చెయ్యవచ్చు; ఇంకా ఇజారునూ, ముందు భాగం తెరువబడి ఉన్నటువంటి పొడుగాటి కోటునూ ధరించి**

---

360-1. మరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది; ఒక దైవదూత ఆకాశం నుంచి క్రిందికి దిగాడు. ఆ దూత ఆయన (స) గారి ఇజారును మళ్లీ ఆయన గారి నడుముకు కట్టి వేశాడు. ఈ హదీసు ద్వారా స్పష్టంగా తెలిసే విషయం ఏమిటంటే, కరుణామయుడైన అల్లాహ్, బాల్యం నుంచే ఆయన (స) గారిని చెడు విషయాలకూ, సిగ్గుమాలిన, అశ్లీల మైన విషయాలకూ దూరంగా ఉంచాడు. ఆయన(స) గారి నైజంలో, స్వభావంలో సిగ్గుపడే గుణం అధికంగా ఉండేది. కన్నెపిల్లకు ఉండే సిగ్గూ, లజ్జలకంటే అధికంగా సిగ్గూ లజ్జా లక్షణాలు ఉండేవి.

9-1. భావం ఏమిటంటే, మనిషి చేసే నమాజు ధర్మసమ్మతమూ, స్వీకారయోగ్యమూ అవటానికి ఏదో ఒక ప్రత్యేకమైన వస్త్రధారణ అవసరం ఎంత మాత్రం లేదు. అన్ని రకాల వస్త్ర ధారణలలో మనిషి నమాజు చేయవచ్చు, కాని ధరించే వస్త్రాలు 'సతర్'ను కప్పాలి, గుప్తంగా ఉంచాలి.

**నమాజు చెయ్యవచ్చు; ఇంకా పైజామానూ, దుప్పటిని కూడా ధరించి నమాజు చెయ్యవచ్చు; ఇంకా పైజామానూ, కమీజునూ ధరించి కూడా నమాజు చెయ్యవచ్చు; ఇంకా పైజామానూ, పొడుగాటి కోటునూ ధరించి కూడా నమాజు చెయ్యవచ్చు. ఇంకా నిక్కర్లను, కోటును ధరించి కూడా నమాజు చెయ్యవచ్చు; ఇంకా నిక్కరునూ, కమీజునూ ధరించి కూడా నమాజు చెయ్యవచ్చు. హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఇలా అన్నారు; "నిక్కరునూ, దుప్పటినీ ధరించి కూడా నమాజు చేయవచ్చు అని కూడా చెప్పి ఉంటారు అని నేను భావిస్తున్నాను".**

**362. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా సెలవిచ్చారు; ఒక వ్యక్తి-(అతని పేరు ఏమిటో తెలియదు). ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారిని ఇలా అడిగాడు; "ఓ ప్రవక్తా! ఇహ్రామ్‌ను ధరించిన వ్యక్తి ఎటువంటి వస్త్రాలను కట్టుకోవాలి." దానికి సమాధానంగా మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెల విచ్చారు; "అతను కమీజును, పైజామాను ధరించకూడదు. రైన్ కోటును కూడా ధరించకూడదు; పసుపు పచ్చనిరంగు గల, వర్స్ అనే సుగంధం రాయబడిన వస్త్రా లను కూడా ధరించకూడదు. ఇంకా ఏ వ్యక్తి వద్దనయితే కాళ్లు బయటకు కనిపించే చెప్పులు లేవో అతను బూట్లను కోసి తొడుక్కోవాలి. అవి కాలి చీలమండలకు కిందగా ఉండాలి."**

## 10వ అధ్యాయం

## 'ఔరత్' (అంటే 'సతర్') అంటే తప్పనిసరిగా కప్పి ఉంచవలసిన శరీర రహస్య భాగాలకు సంబంధించిన ప్రస్తావన.

**363. అబూ సయీద్ ఖుద్‌రీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; మహనీయ**

---

361-1. ఆ వ్యక్తి పేరు తెలియలేదు.

361-2. ఈ వ్యక్తి పేరు ఉబై అని అంటారు లేదా ఇబ్నె మసూద్ (రజిఅన్) అని కూడా అంటారు. వారు ఉభయులలో అభిప్రాయభేదం ఉంది. ఉబై ఏమనేవారంటే; ఒకే వస్త్రాన్ని ధరించి నమాజు చెయ్యటం మక్రూహ్ (అసహ్యకరమైనది) కానేకాదు. ఇబ్నె మసూద్ (రజిఅన్) ఇలా అనేవారు; వస్త్రాల కొరత అధికంగా ఉన్నప్పుడు ఒకే వస్త్రాన్ని ధరించి నమాజు చెయ్యటం ధర్మసమ్మతమైనదే.

361-3. ఈ విషయాన్ని అబ్దుర్రజాక్ వెలికితీశారు; హజ్రత్ ఉమర్ (రజిఅన్) మెంబర్ మీద నిలబడి ఇలా సెలవిచ్చారు; ఉబై చెప్పేది నిజమే. కాని ఇబ్నె మసూద్ (రజిఅన్) కూడా తక్కువ ఏమీ చెయ్యలేదు.

**ప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) రెండు విషయాల నుండి వారించారు. ఒకటి, ఇష్తిమాలిస్సమ్మా.[1] రెండు, అల్ ఎహ్‌తిబా.[2]**

**364. హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; గౌరవనీయులైన దైవప్రవక్త ముహమ్మద్ (స) రెండు రకాల క్రయవిక్రయాల నుండి వారించారు. ఒకటి, చేతితో తాకటం వల్ల జరిగేది. రెండు, వస్తువును విసరివేయటం వల్ల[1] జరిగేది. ఇంకా ఆయన (స) ఒకే వస్త్రంలో ఇష్తిమాలిస్సమ్మా చెయ్యటాన్ని, ఎహ్‌తిబా చెయ్యటాన్ని కూడా నిషేధించారు. (ఈ రెండు విషయాలకు సంబంధించిన ప్రస్తావన పై హదీసులో వచ్చింది.)**

**365. హజ్రత్ అబూ హురైరా (రజిఅన్)గారి ఒక ఉల్లేఖనం ఇలా ఉంది; హజ్జతుల్ విదా (దైవప్రవక్త ముహమ్మద్ (స) గారి చివరి హజ్ యాత్ర)కు ముందు జరిగినటువంటి హజ్ యాత్రలో, ప్రకటన చేసే వారితోపాటు పాల్గొనమని జిల్ హజ్జ మాసం పదవ తేదీన– ఆ హజ్ యాత్రకు నాయకత్వం వహించినటువంటి హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజిఅన్) నన్ను పంపారు. మేము మినాకు వెళ్లి ఇలా బహిరంగ ప్రకటన చేయాలని ఆయన(ర) ఆదేశించారు; "వచ్చే సంవత్సరం నుంచి ముష్రిక్కులు అంటే బహుదైవారాధకులెవ్వరూ హజ్ యాత్ర చెయ్యడానికి రాకూడదు. హజ్ యాత్ర వారి కోసం నిషేధించబడింది. ఇంకా ఎవరైనా సరే దిగంబరులై కాబా గృహ**

---

363–1. 'ఇష్తిమాలిస్సమ్మా'కు సంబంధించిన ప్రస్తావన ఇంతకు పూర్వమే వచ్చింది. అంటే ఒకే వస్త్రాన్ని మొత్తం శరీరం మీద చుట్టుకోవటం, కప్పుకోవటం; చేతులు మొదలైన శరీర అవయవాలన్నీ మూసుకుపోయినట్లుగా. కొంతమంది ఏమన్నారంటే; 'ఇష్తిమాలిస్సమ్మా' అంటే వస్త్రాన్ని శరీరం మొత్తానికి చుట్టుకుని ఒక వైపు నుంచి దానిని ఎత్తి భుజస్కంధం మీద వేసుకోవటం. ఈ విధంగా వస్త్రాన్ని ధరించటం వల్ల మర్మాంగం బహిర్గతమవుతుంది. ఈ కారణం వల్ల ఇది నిషేధించబడింది.

363–2. అల్ ఎహ్‌తిబా అంటే మనిషి తన రెండు పిరుదులను అంటే తన తొంటిని నేలకు ఆనించి, మోకాళ్లను పొత్తికడుపుకు దగ్గరగా తీసుకుని చేతులతో వాటిని చుట్టి పట్టుకుని ఒకే వస్త్రంలో కూర్చోవటం. ఈ విధంగా కూర్చోవటం వల్ల కూడా 'సతర్' అంటే రహస్య భాగాలు బహిర్గతమవుతాయి.

364–1. చేత్తో తాకటం వల్ల జరిగే అమ్మకం ఏమిటంటే; వస్తువు కొనేవాడు తాను కొనుక్కునే వస్తువును తన చేత్తో తాకినట్లయితే అప్పుడు వస్తువు అమ్మకం వ్యవహారం పూర్తి అయినట్లే. వస్తువును విసరివేయటం వల్ల జరిగే అమ్మకం ఏమిటంటే; వస్తువును విక్రయించేవాడు తన వస్త్రాన్ని గాని లేదా ఏదైనా వస్తువునుగాని విసరివేసినట్లయితే

ప్రదక్షిణం చెయ్యకూడదు. ఇది కూడా నిషేధించబడింది[1]." హుమైద్ బిన్ అబ్దుర్రహ్మాన్ గారు ఇలా అన్నారు; "ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) హజ్రత్ అబూ బకర్ (రజిఅన్)ను పంపిన తరువాత ఆయన వెనుకనే హజ్రత్ అలీ (రజిఅన్)ను కూడా పంపారు. ఖురాను గ్రంథంలోని బరాత్ (తౌబా) సూరాను పఠించి వినిపించమని ఆయన(స) వారిని ఆజ్ఞాపించారు." అబూ హురైరా (రజిఅన్) ఇలా అన్నారు; కనుక మాతోపాటు జిల్‌హజ్జ పదవ తేదీన మినాలో హజ్రత్ అలీ (రజిఅన్) కూడా ఇలా బహిరంగ ప్రకటన చేశారు; "ఈ సంవత్సరం తరువాత ముష్రిక్కులెవ్వరూ హజ్ యాత్రకు రాకూడదు. ఇది వారి కోసం నిషేధించబడింది. ఇంకా ఎవరైనాసరే నగ్నంగా కాబా గృహ ప్రదక్షిణం కూడా చెయ్యరాదు. ఇది కూడా నిషేధించబడింది[2]."

## 11వ అధ్యాయం

## దుప్పటి లేకుండా నమాజు చెయ్యటం.

**366.** ముహమ్మద్ బిన్ మున్‌కదిర్ ఇలా ఉల్లేఖించారు; "ఒకసారి నేను జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ అన్సారి (రజిఅన్) వద్దకు వెళ్లాను. అప్పుడు ఆయన ఒకే వస్త్రాన్ని తన శరీరానికి చుట్టుకుని నమాజు చేస్తున్నారు. వాస్తవానికి ఆయన గారి దుప్పటి ఆయన ప్రక్కనే పడి ఉంది. తన నమాజును పూర్తి చేసుకున్న తరువాత, ఆయన్ని మేము ఇలా అడిగాము; "ఓ అబూ అబ్దుల్లాహ్! (అబ్దుల్లాహ్ పితాశ్రీ) ఇదేమిటి? దుప్పటి ఉన్నప్పటికీ మీరు అది లేకుండా నమాజు చేస్తున్నారు?" దానికి సమాధానంగా ఆయన ఇలా అన్నారు; అవును, నీలాంటి అజ్ఞానులు నన్ను చూడాలనే నేను అలా చేశాను.[1] దైవప్రవక్త మహనీయులు (స) ఇదే విధంగా ఒకే వస్త్రంలో నమాజు చేస్తూ ఉండగా నేను చూశాను."

## 12వ అధ్యాయం

మనిషి తొడకు సంబంధించిన అధ్యాయంలో ప్రస్తావించబడిన ఉల్లేఖనాలను[1] గురించి ఇమామ్ బుఖారి (రహ్మాలై) ఏమన్నారంటే; మనిషి తొడ సతర్[2] కిందకు

---

అప్పుడు అమ్మకం వ్యవహారం పూర్తి అయిపోయినట్టే, కొనే వ్యక్తి వస్తువును తప్పనిసరిగా కొనవలసిందే, వ్యవహారాన్ని రద్దు చేసే అధికారం అతనికి ఉండదు.

365–1. నగ్నంగా కాబా గృహ ప్రదక్షిణ చెయ్యటాన్ని వారించినప్పుడు శరీరంలోని 'సతర్' భాగంపై ఆచ్ఛాదన ఉండటం నమాజ్‌కు తప్పనిసరి అయినట్లే.

365–2 సూరయె బరాత్ (తౌబా) అవతరించగానే అవిశ్వాసులతో తెగత్రెంపులు ప్రకటన చేయించే నిమిత్తం మొదట హజ్రత్ అబూబక్ర్ (రజి)ని హజ్జ్ సందర్భంగా పంపించటం జరిగింది. ఆ తరువాత దైవప్రవక్త ముహమ్మద్(స)కు ఆలోచన వచ్చింది:

**వస్తుంది అని దైవప్రవక్త మహనీయులు (సఅసమ్) సెలవిచ్చారని ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) గారూ, జర్‌హద్ గారూ, ముహమ్మద్ బిన్ జహష్ గారూ ఉల్లేఖించారు. ఇంకా హజ్రత్ అనస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త (స) ఖైబర్ యుద్ధం జరిగిన సమయంలో తమ తొడ మీద ఉన్న వస్త్రాన్ని తొలగించారు.[3] ఇమామ్ బుఖారి (రెహ్మాలై) ఏమన్నారంటే; హజ్రత్ అనస్(ర) గారి హదీసు ప్రామాణికత రీత్యా బలమైనది. జర్‌హద్ గారి హదీసులో ముందుజాగ్రత్త, దూరదృష్టి ఉన్నాయి; అభిప్రాయభేదంలో పడకుండా తెలివిగా దాటిపోయారు.[4] ఇంకా అబూ మూసా అష్‌అరీ (ర) ఇలా అన్నారు; ఒకసారి మహాప్రవక్త (స) తమ మోకాళ్ళ మీద ఉన్న వస్త్రాన్ని తొలగించి కూర్చుని ఉన్నారు. ఇంతలోనే హజ్రత్ ఉస్మాన్ (ర) అక్కడకు వచ్చారు. అప్పుడు దైవప్రవక్త (స) తమ మోకాళ్ళను వస్త్రంతో కప్పుకున్నారు. హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (ర) ఇలా అన్నారు; అల్లాహ్ తన ప్రవక్తపై దైవవాణిని (ఖురాన్) అవతరింపజేశాడు. అప్పుడు ఆయన (స)గారి తొడ నా తొడమీద ఉన్నది. ప్రవక్త(స) గారి తొడ ఎంత బరువైనదిగా, భారమైనదిగా ఉందంటే, ఆ బరువు వల్ల నా తొడ విరిగిపోతుందేమో అని నేను భయపడ్డాను.**

---

ఒడంబడికను రద్దు చేసే అధికారం ఒడంబడిక చేసుకున్నవానికే ఉంటుంది. లేదా అతని సమీప బంధువుకు ఆ అధికారం ఉంటుంది. ఇది అరబ్బుల ఆనవాయితీ. అందుచేత ప్రవక్త(స) 'ఆ మేరకు ప్రకటన గావించండి" అంటూ తన కుటుంబీకులైన హజ్రత్ అలీ(రజి)ని కూడా పంపించారు.

366–1. ప్రజలు నన్ను చూసి ధర్మశాస్త్రం ఈ విషయంలో ఏమి చెబుతుందో తెలుసుకోవాలని నేను ఒకే వస్త్రాన్ని ధరించి నమాజు చేశాను.

12–1. ఇమామ్ అబూ హనీఫా (రహ్మాలై), ఇమామ్ షాఫయి (రహ్మాలై) ఇంకా ఇమామ్ అహ్మద్ (రహ్మాలై) గార్ల దృష్టిలో ఒక ఉల్లేఖనం ప్రకారం, మనిషి తొడ సతర్ కిందికి వస్తుంది. ఇంకా ఇబ్నె అబీ జైబ్, దావూద్ జాహెరీ, ఇమామ్ అహ్‌మద్ (ర), ఇమామ్ మాలిక్ (ర) గార్ల దృష్టిలో మనిషి తొడ సతర్ కిందికి రాదు. మన విద్వాంసులలో నుంచి ఇమామ్ ఇబ్నె హజమ్, ఇస్‌తఖ్‌రీ గార్లు కూడా ఇదే అభిప్రాయాన్ని కలిగి ఉన్నారు. వారు ఏమంటారంటే, మనిషి ముందు, వెనుక భాగాలు మాత్రమే సతర్ కిందకు వస్తాయి. మఖ్‌అద్, ఇమామ్ బుఖారీ(ర) గార్ల అభిప్రాయం కూడా ఇదే అనిపిస్తోంది. 'మహల్లా'లో ఇమామ్ ఇబ్నె హజమ్ ఇలా అన్నారు; ఒకవేళ మనిషి తొడ సతర్ పరిధిలోనిదే అయినట్లయితే, పరిశుద్ధులూ, అమాయకులూ అయినటు వంటి తన ప్రవక్త తొడను వస్త్రం లేనిదిగా ఉండనివ్వడు; దానిని ఎవరూ చూడరు కూడా.

12–2. ఇబ్నె అబ్బాస్(ర) గారి హదీసును తిర్మిజీ, అహ్‌మద్ గార్లు ఇంకా జర్‌హద్ గారి హదీసును ఇమామ్ మాలిక్ (ర) ముఅత్తాలో, ఇంకా ముహమ్మద్ బిన్ జహష్ గారి

**367.** **అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా వివరించారని అబ్దుల్ అజీజ్ బిన్ సుహైబ్ ఉల్లేఖించారు : ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఖైబర్ నగరం మీదకు దండెత్తిపోయారు. మేము ఖైబర్‌కు సమీపంలో ఉన్నటువంటి ఒక స్థలంలో ఇంకా చీకటిగానే ఉన్నప్పుడు ఉదయం నమాజును చేశాము. తరువాత దైవప్రవక్త (స) తమ వాహనం మీదకు ఎక్కి బయలుదేరారు. ఆ తరువాత ఒకే వాహనం మీద నేను అబూ తల్‌హ (ర) వెనుక కూర్చున్నాను. దైవప్రవక్త మహనీయులు (స) ఖైబర్ వీధులలో తమ జంతువును పరుగెత్తించారు; ఆ పరుగెత్తటంలో నా మోకాలు దైవ ప్రవక్త (స) గారి తొడను తాకుతూ ఉండేది. ఆ తరువాత ఆయన (స) గారు తమ తొడ మీద నుంచి వస్త్రాన్ని తొలగించారు. చివరకు నేను ఆయన (స) గారి తొడ యొక్క తెల్లదనాన్ని (మెరుస్తూ ఉండగా) చూశాను.[1] దైవప్రవక్త (స) ఖైబర్ నగరంలో ప్రవేశించిన తరువాత ఎలుగెత్తి ఇలా అన్నారు; 'అల్లాహు అక్బర్!' ఖైబర్ నగరం నాశనమైపోయింది.[2] ఆయన (స) మూడుసార్లు ఇలా అన్నారు. మేము ఏ దేశ ప్రాంగణంలోకి అడుగు పెట్టినా, హెచ్చరిక చేయబడిన ప్రజల రాబోయే ఉదయం కీడునే, చెరుపునే తెస్తుంది.[3] హజ్రత్ అనస్ (ర) ఇంకా ఇలా అన్నారు: ఆ సమయంలో**

---

హదీసును హాకిమ్ గారు ముస్‌తద్‌రక్‌లోనూ, ఇమామ్ బుఖారీ (ర) గారు దానిని తారీఖ్‌లోనూ ఉల్లేఖించారు. కాని వారందరి ప్రమాణాలను గురించి చర్చకు తావు ఏర్పడింది.

12-3. ఈ విషయాన్ని స్వయంగా ఇమామ్ బుఖారీ (ర)యే ముందు రాబోయే హదీసులలో ఉదహరించారు.

12-4. ఎందుకంటే, ఒకవేళ మనిషి తొడ గనక సతర్ పరిధిలోకి రానట్లయితే, అప్పుడు కూడా దానిని కప్పి ఉంచటం వల్లగానీ, దానిని దాచి ఉంచటం వల్లగానీ ఏ నష్టమూ కలగదు. దీనిని స్వయంగా ఇమామ్ బుఖారీ(ర)యే 'మనాఖిబ్' ప్రకరణంలో వెలికితీశారు. కాని ఈ హదీసు కారణంగా మోకాళ్లుగాని లేక తొడగాని సతర్ కిందికి వస్తాయి అనే విషయం మటుకు తేటతెల్లం కాదు. ఎందుకంటే, దైవప్రవక్త(స) హజ్రత్ ఉస్మాన్ (ర) గారి మొహమాటాన్నీ, సిగ్గుపడేతత్వాన్నీ దృష్టిలో పెట్టుకుని వస్త్రాన్ని తమ తొడ మీద కప్పుకున్నారు – ఎవరైనా పెద్ద మనిషి వచ్చినప్పుడు మంచి బట్టలు ధరించి ఆయన్ని కలిసినట్లుగా, ఒకవేళ మోకాళ్లే గనక సతర్ పరిధిలోకి వచ్చినట్లయితే దైవప్రవక్త (స) వాటిని ఇతరుల ముందు కూడా దాచి ఉంచేవారు.

367-1. అధ్యాయంలో ప్రస్తావించబడిన ప్రధాన విషయం ఇక్కణ్ణుంచే ఉద్భవిస్తుంది. ఎందుకంటే, ఒకవేళ మనిషి తొడ సతర్ పరిధిలోకి వచ్చినట్లయితే దైవప్రవక్త (స) తన తొడను ఎందుకు తెరచి ఉంచుతారు.

**యూదులు తమ తమ కార్యకలాపాలలో నిమగ్నమైపోవటానికి బయలుదేరారు.[4] దైవ ప్రవక్త (స)ను చూడగానే 'వారు ముహమ్మద్ (స) వచ్చేశారు' అని అనసాగారు. ఉల్లేఖ కుడైన అబ్దుల్ అజీజ్ ఇలా అన్నారు : 'మా సహచరులు కొందరు అదనంగా ఇలా అన్నారు:[5] 'సైన్యం వచ్చేసింది. హజ్రత్ అనస్ (ర) ఇంకా ఇలా అన్నారు: 'కనుక మేము ఖైబర్ (కోటలను) ముట్టడించి జయించాము. తరువాత యుద్ధ ఖైదీలను పట్టు కున్నాము.' అప్పుడు దిహ్యా కల్‌బీ అనే వ్యక్తి వచ్చి మహాప్రవక్త (స)ను ఉద్దేశించి ఇలా అన్నాడు: "ఓ దైవప్రవక్తా! ఈ ఖైదీలలో నుంచి ఒక బానిస యువతిని నాకు కూడా ఇప్పించండి." దానికి సమాధానంగా ఆయన(స) గారు అతనితో ఇలా అన్నారు: "వెళ్లు, ఒక బానిస యువతిని తీసుకో." అప్పుడు అతను వెళ్లి సఫియా బిన్తె హుయ్‌ను తన స్వాధీనంలోకి తీసుకున్నాడు.[6] ఆ తరువాత ఒక వ్యక్తి దైవప్రవక్త (స) వద్దకు వచ్చి[7] ఇలా అనసాగాడు; 'ఓ దైవప్రవక్తా(స)! హుయై కూతురూ, ఖురైజా, నజీర్ తెగలకు దొరసానీ[8] అయినటువంటి సఫియాను మీరు దిహ్యాకు ధారాదత్తం చేశారు. కాని ఆమె అయితే మీకు మాత్రమే తగినది.' దైవప్రవక్త(స) ఇలా సెలవి చ్చారు: "సరే, మంచిది. సఫియాను తనతో తీసుకుని నా వద్దకు రమ్మని దిహ్యాకు చెప్పండి." అతను ఆమెను తీసుకుని దైవప్రవక్త (స) వద్దకు వచ్చాడు. అప్పుడు**

---

367–2. ఇది దైవప్రవక్త (స) చెప్పినటువంటి భవిష్యత్తులో జరుగబోయే విషయం లేదా ఆయన (స) దీనిని ఒక శుభశకునంగా పేర్కొన్నారు. ఎందుకంటే, ఖైబర్ నగరానికి చెందిన యూదులు ఆ సమయంలో గడ్డపారలూ, గంపలూ మొదలైన వాటిని తీసుకుని బయలుదేరారు. అవి కూల్చటానికి పనికొచ్చే పనిముట్లు.

367–3. ఇది ఖురాను గ్రంథంలోని సాఫ్ఫాత్ సూరాలోని 177వ వాక్యానికి సారాంశము.

367–4. దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (స) తమ సైన్యాన్ని తీసుకుని హఠాత్తుగా వారి మీద దండయాత్ర చేశారు.

367–5. అంటే అబ్దుల్ అజీజ్ గారు తాను స్వయంగా అనస్ (ర) నుంచి ఏ ఉల్లేఖనా న్నయితే విన్నారో అందులోనయితే ఈ విషయం మాత్రమే ఉన్నది; యూదులు ముహమ్మద్ (స) అని మాత్రమే అన్నారు. కాని అనస్ (ర) గారి శిష్యులు కొందరు; సాబిత్, ఇబ్నె సీరీన్ లాంటి వారు ఈ విషయాన్ని కూడా అదనంగా చేర్చారు; 'సైన్యాన్ని తీసుకుని ముహమ్మద్ (స) వచ్చేశారు'.

367–6. ఈమె గారు గౌరవప్రదమైన యూదులకు చెందిన ఒక ఉన్నత సంపన్న కుటుం బానికి చెందిన స్త్రీ. ఇంకా ఆమె హజ్రత్ హారూన్ (అ) సంతానంలోని వారు.

367–7. ఈ వ్యక్తి పేరు ఏమిటో తెలియరాలేదు.

**దైవప్రవక్త(స) సఫియాను చూశారు. తరువాత దిహ్‌యాతో ఇలా అన్నారు; "నీవు ఖైదీలలో నుంచి మరొక యువతిని ఎవరినైనా ఎన్నుకో." హజ్రత్ అనస్ (ర) ఇలా అన్నారు; తరువాత దైవప్రవక్త మహనీయులు (స) సఫియాకు విముక్తి కలిగించి ఆమెను ఒక స్వతంత్ర స్త్రీగా చేశారు. ఆ తరువాత ఆమెను వివాహం చేసుకున్నారు.[9] సాబిత్ హజ్రత్ అనస్ (ర)తో ఇలా అన్నారు: "అబూ హమ్‌జా! దైవప్రవక్త (స) ఆమెకు ఎంత మహర్‌ను చెల్లించారు?" ఆయన ఇలా సమాధానం చెప్పారు; 'స్వయంగా ఆమెయే ఆమెకు మహర్." ఎందుకంటే ఆయన(స) గారు ఆమెకు బానిసత్వం నుంచి విముక్తి కలిగించారు. ఆమెను ఒక స్వతంత్ర స్త్రీగా చేశారు. ఆ తరువాతనే ఆయన (స) ఆమెను వివాహం చేసుకున్నారు. దైవప్రవక్త (స) ఖైబర్ నగరం నుంచి తిరిగి వచ్చేటప్పుడు మార్గమధ్యంలోనే ఉమ్మె సులైమ్, సఫియాను అందంగా అలంకరించారు. ఆ రాత్రే ఆమెను ఆయన(స) వద్దకు పంపేశారు. రెండో రోజు ఉదయం ఆయన(స) వరుడుగా ఇలా సెలవిచ్చారు; తినటానికి ఎవరి వద్ద ఏమున్నా సరే వారు దానిని తీసుకుని నా వద్దకు రావాలి. అప్పుడు అక్కడ ఒక దస్తర్‌ఖాన్ పరచబడింది. ఒకరు ఖర్జూరపు పండ్లు తీసుకువస్తే మరొకరు నెయ్యిని తీసుకువచ్చారు. అబ్దుల్ అజీజ్ ఇలా అన్నారు; 'కొందరు సత్తూ (అంటే వేపబడిన ధాన్యపు గింజల పిండి. అందులో తీపి పదార్థాన్ని లేదా ఉప్పును కలిపి తింటారు) కూడా తీసుకుని వచ్చారు' అని హజ్రత్ అనస్(ర) అన్నారని నేను అనుకుంటున్నాను. హజ్రత్ అనస్ ఇలా అన్నారు : 'వాటన్నింటిని కలిపి మలీదా (అంటే రొట్టెను చిన్న చిన్న ముక్కలుగా చేసి అందులో పంచదారను, నెయ్యిని కలిపి మిశ్రమం చేస్తారు)గా చేశారు. 'మహాప్రవక్త (స) గారి వలీమా విందు అదే!'**

---

367-8. బనీ ఖురైజా, బనీ నజీర్ అనేవి ఖైబర్ నగరంలోని యూదులకు చెందిన రెండు పెద్ద తెగలు.

367-9. కనుక స్వేచ్ఛనూ, బానిసత్వం నుంచి విముక్తినీ 'మహర్'గా నిర్ణయించారు. ఇది ధర్మసమ్మతమైన విషయమే. ఇమామ్ అహ్‌మద్, హసన్, ఇబ్నె ముసయ్యబ్, అహ్లె హదీస్‌కు చెందిన పరిశోధకులు, ఇంకా ఇతర ధర్మశాస్త్రవేత్తలు ఇలా చెప్పారు; ఇది మహాప్రవక్త (స)గారి సంప్రదాయం, ఆయన (స) గారికే ప్రత్యేకం, పరిమితం. ఇతరు లెవ్వరూ అలా చెయ్యలేరు.

367-10. వలీమా జరపటం సున్నత్ (దైవ ప్రవక్త గారి సంప్రదాయం). దీనికి సంబంధించిన వివరాలు ఇన్షా అల్లాహ్ 'నికాహ్ ప్రకరణం'లో రాబోతున్నాయి.

## 13వ అధ్యాయం

**ఒక స్త్రీ ఎన్ని బట్టలు ధరించి నమాజు చెయ్యాలి అనే విషయం గురించి.**

**ఇక్రిమా గారు, ఇలా అన్నారు;[1] ఒకవేళ స్త్రీ తన మొత్తం శరీరాన్ని ఒకే వస్త్రం తో కప్పుకుని దాచుకోగలిగితే, ఆ స్థితిలో కూడా ఆమె చేసే నమాజు ధర్మసమ్మతమైనదే అవుతుంది.**

**368. హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు : దైవప్రవక్త మహ నీయులు (స) ఫజర్ నమాజును చేసేటప్పుడు చాలామంది ముస్లిమ్ మహిళలు ఆ నమాజులో ఆయన (స)తో పాటు పాల్గొనేవారు. వారు తమ శరీరాలను దుప్పట్లతో కప్పుకుని ఉండేవారు. నమాజు పూర్తి అయిన తరువాత వారు తమ తమ గృహాలకు తిరిగి వెళ్లిపోయేవారు. చీకటి వల్ల వారిని ఎవరూ గుర్తించేవారు కారు.[1]**

## 14వ అధ్యాయం

**డిజైన్‌లు ఉన్న వస్త్రాన్ని ధరించి నమాజు చెయ్యటం మరియు వాటిని చూడడం అనే విషయాలను గురించి.**

**369, 370. హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు: ఒకసారి దైవప్రవక్త మహనీయులు (సఅసమ్) ఒక వులెన్ దుప్పటిని ధరించి నమాజు చేశారు. దాని మీద డిజైన్‌లు వేసి ఉన్నాయి. ఆయన (స) ఆ డిజైన్ల మీదకు తన దృష్టిని సారిం చారు. నమాజు పూర్తి అయిన తరువాత ఆయన(స) ఇలా సెలవిచ్చారు: ఈ దుప్పటిని**

---

13–1. ఈ హదీసును అబ్దుర్రజాఖ్ గారు జత చేశారు.

368–1. ఈ హదీసు ప్రకారం, అధ్యాయం సారాంశం ఇలా ఉంది; చూడటానికి ఆ స్త్రీలు ఒకే వస్త్రాన్ని తమ తమ శరీరాలకు కప్పుకుని వచ్చేవారు. మరియు నమాజు చేసేవారు. ఒకవేళ వారు లోపల మరొక వస్త్రాన్ని దేన్నయినా ధరించినా ధరించి ఉండవచ్చు. కాని అది కనిపించినప్పుడు ఉన్నా ఒకటే. లేకపోయినా ఒకటే. కనుక స్పష్టంగా తెలిసిన విషయం ఏమిటంటే, ఒకవేళ ఒక స్త్రీ ఒకే వస్త్రంతో తన మొత్తం శరీరాన్ని కప్పుకుని దాచుకోగలిగితే, అప్పుడు ఆమె చేసే నమాజు పూర్తిగా ధర్మ సమ్మతమైనదే అవుతుంది. ఒకవేళ ధర్మసమ్మతంకాని పక్షంలో, దైవప్రవక్త (స) ఆ స్త్రీలను తప్పకుండా అడిగి ఉండేవారు. ఇంకా, మరొక వస్త్రాన్ని కూడా ధరించమని తెలియజేసి ఉండేవారు.

369,370–1. అబూజహమ్ డిజైన్లు వేసిన ఈ వులెన్ దుప్పటిని దైవప్రవక్త (స) గారికి కానుకగా పంపారు. కాని మహనీయ ప్రవక్త (స) దానిని అతనికే తిరిగి పంపివేశారు.

**తీసుకుపోయి అబూ జహమ్ (ఆమిర్ బిన్ హుజైఫా)కు ఇచ్చేసెయ్యండి. అతని వద్ద ఉన్నటువంటి సాదా దుప్పటిని తీసుకురండి. డిజైన్లు ఉన్న ఈ దుప్పటి నమాజులో నన్ను ఏమరుపాటుకు గురిచేసింది.[1] తన తండ్రి ఉర్వా ఇలా చెప్పారని హిషామ్ బిన్ ఉర్వా ఉల్లేఖించారు: హజ్రత్ ఆయెషా (ర) ఇలా అన్నారని ఉర్వా ఉల్లేఖించారు: దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు; నేను నమాజు చేసే సమయంలో ఈ డిజైన్లను చూశాను. అవి నమాజులోని నిశ్చలతను చెడగొడ తాయేమో అని నేను భయపడు తున్నాను.[2]**

## 15వ అధ్యాయం

**ఒకవేళ ఎవరైనా శిలువ గుర్తుగానీ లేదా బొమ్మలుగానీ వేసినటువంటి వస్త్రాన్ని ధరించి నమాజు చేసినట్లయితే, ఆ నమాజు రద్దు అవుతుందా? కాదా? దానికి సంబంధించిన నిషేధం గురించి.**

**371. హజ్రత్ అనస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; హజ్రత్ ఆయెషా (రజి అన్హా) వద్ద ఒక పరదా ఉండేది; ఆమె గారు (ర) దానిని తన ఇంటికి ఒక వైపున వ్రేలాడగట్టారు. దైవప్రవక్త మహనీయులు(స) ఆ పరదాను చూసి ఇలా సెలవిచ్చారు; ఆయెషా(ర)! ఆ పరదాను అక్కణ్ణుంచి తొలగించు. దీని మీద ఉన్న బొమ్మలు నమాజులో నా ముందు తిరుగుతూ ఉంటాయి.[1]**

---

ఇంకా అతని వద్ద ఉన్నటువంటి సాదా ఉలెన్ దుప్పటిని తెప్పించుకున్నారు. దైవప్రవక్త (స) ఇలా ఎందుకు చేశారంటే, తాను ఎంతో ప్రేమతో పంపినటువంటి కానుకను దైవప్రవక్త (స) తిరస్కరించారని అతను బాధపడకూడదని. ఇక్కడ స్పష్టంగా తెలిసిన విషయం ఏమిటంటే, నమాజు చేసేటప్పుడు మనిషికి చిత్తశుద్ధి, అంటే మనస్సును నమాజులో లగ్నం చెయ్యటం, ఏకాగ్రతను పాటించటం, మనః పూర్వకత్వాన్ని కలిగి ఉండటం చాలా అవసరం. ఏ వస్తువులైతే చిత్తశుద్ధిని కలుషితం చేస్తాయో – డిజైన్ల వంటివి– వాటి నుంచి నమాజు చేసే మనిషి దూరంగా ఉండాలి, వాటిని దరిచేరనీయకూడదు.

369,370–2. దీనిని అహ్మద్, ఇబ్నె అబీ షైబా, ముస్లిమ్, అబూదావూద్ గార్లు సంగ్రహించారు.

371–1. ఈ హదీసులో శిలువకు సంబంధించిన ప్రస్తావన లేకపోయినప్పటికీ బొమ్మలకూ, ప్రతిమలకూ, చిత్రాలకూ ఏ ఆజ్ఞ అయితే వర్తిస్తుందో, ఆ ఆజ్ఞయే శిలువకు కూడా వర్తిస్తుంది. ఇంటికి వ్రేలాడగట్టటాన్నే ఆయన (స) గారు నిషేధించి

## 16వ అధ్యాయం

## పట్టు వస్త్రంతో తయారు చేసిన కోటు ధరించి నమాజు చెయ్యటం మరియు దానిని తీసివేయటం.

**372. ఉఖబా బిన్ ఆమిర్(ర) ఇలా ఉల్లేఖించారు : దైవప్రవక్త(స) మహనీయులకు ఎవరో పట్టువస్త్రంతో తయారు చేసిన కోటును కానుకగా పంపారు. ఆయన (స) గారు దానిని ధరించి నమాజు చేశారు. నమాజు పూర్తి చేసిన తరువాత ఆయన (స) గారు దానిని కోపంగా, వేగంగా అసహ్యపడుతూ తీసిపారేశారు. ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు; ఇది భయభక్తులు కలవారికి తగినది కాదు.**

---

నప్పుడు ఆ గుర్తు ఉన్నటువంటి వస్త్రాలు ధరించటం అసలే నిషిద్ధమవుతుంది. బహుశా ఇమామ్ బుఖారీ (రహ్మాలై) 'కితాబుల్ లిబాస్'లో ఉన్నటువంటి హదీసును ఇక్కడ సూచించారు. దైవప్రవక్త మహనీయులు(స) తన గృహంలో శిలువ గుర్తు ఉన్నటువంటి ఏ వస్తువునూ వదలిపెట్టేవారు కారు. అంటే దానిని పగలగొట్టేవారు. అధ్యాయంలోని హదీసు ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే, అటువంటి వస్త్రాన్ని కట్టుకోవటం లేదా దానిని ఇంట్లో వ్రేలాడగట్టటం అవాంఛనీయమైన విషయం. అయితే నమాజు మటుకు చెడిపోదు, రద్దు కాదు. ఎందుకంటే దైవప్రవక్త (స) నమాజును మధ్యలో భంగపరచనూ లేదు, తిరిగి దానిని చెయ్యనూ లేదు.

372-1. ముస్లిమ్ గారి ఉల్లేఖనంలో ఈ విషయం అదనంగా ఉంది; హజ్రత్ జిబ్రీల్ (అస్సలామ్) ఈ కోటును ధరించవద్దని నన్ను వారించారు. పురుషులు పట్టు వస్త్రాలు ధరించకూడదు, అవి వారికి నిషిద్ధం అనే ఆజ్ఞ అవతరించకపూర్వం దైవప్రవక్త (స) బహుశా ఆ కోటును ధరించి ఉండవచ్చు. ఈ హదీసు ద్వారా తేటతెల్లమైన విషయం ఏమిటంటే, పురుషులు పట్టువస్త్రాలు ధరించటం నిషిద్ధమే, వాటిని ధరించేవాడు పాపాత్ముడే; కాని వాటిని ధరించి నమాజు చేస్తే, నమాజు ధర్మసమ్మతమైనదే అవుతుంది. చాలామంది విద్వాంసులు ఈ అభిప్రాయాన్నే వ్యక్తం చేశారు. ఇమామ్ మాలిక్ (రహ్మాలై) ఇలా సెలవిచ్చారు; "సమయం మిగిలి ఉంటే, నమాజును మళ్లీ చేసుకుంటే మంచిది." ఇంకా షౌకానీ (రహ్మాలై) గారూ, చాలామంది ఇస్లామ్ ధర్మశాస్త్రవేత్తలూ ఏమన్నారంటే, పట్టు వస్త్రాలు ధరించి చేసే నమాజు అయిష్టకరమైనది.

# 17వ అధ్యాయం

## ఎరుపు రంగుగల వస్త్రాన్ని ధరించి నమాజు చెయ్యటం.

**373. అబూ జుహైఫా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : నేను మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్)ను ఎరుపు రంగుగల చర్మంతో తయారుచేయబడిన ఒక గుడారంలో ఉండగా చూశాను. ఇంకా నేను ఏమి చూశానంటే; హజ్రత్ బిలాల్ (రజి అన్) దైవప్రవక్త (సఅసమ్) గారు వుజూ చేసుకునే నీళ్లను తీసుకున్నారు. ప్రజలు ఆ నీళ్లను అందుకోవటానికి విరుచుకుపడ్డారు. ఎవరికి ఎంత నీరైతే లభించిందో వారు అంత నీరునూ తమ శరీరానికి పూసుకున్నారు. ఎవరికైతే అసలు నీరే దొరక లేదో వారు ఇతరుల చేతుల నుంచి కొంత తడిని మాత్రమే తీసుకున్నారు. ఆ తరువాత నేను ఇంకా ఏమి చూశానంటే; హజ్రత్ బిలాల్ (రజిఅన్) దైవప్రవక్త (సఅసమ్) గారి ఈటె(బల్లెం)ను తీసుకుని దానిని నేలమీద పాతారు. అప్పుడు ప్రవక్త మహనీయులు (సఅసమ్) గుడారంలో నుంచి బయటికి విచ్చేశారు. ఆయన (సఅసమ్) ఎరుపు రంగు బట్టలను ధరించి ఉన్నారు.[1] ఇంకా తన లుంగీని పైకి ఎత్తి పట్టుకుని ఉన్నారు.[2] దైవప్రవక్త (సఅసమ్) పాతి ఉన్నటువంటి బరిసె వైపునకు తిరిగి ప్రజలతో పాటు రెండు రకాతులు నమాజు చేశారు. ఇంకా నేను బరిసెకు అవతలి వైపు నుంచి మనుషులూ, పశువులూ సాగిపోతూ ఉండటాన్ని గమనించాను.**

---

373–1. అధ్యాయంలోని ముఖ్య విషయం ఇక్కణ్ణుంచే ఉద్భవిస్తుంది. మన విద్వాంసులలో అగ్రశ్రేణికి చెందిన షేఖ్ ఇబ్నె ఖయ్యిమ్ గారు ఇలా సెలవిచ్చారు : దైవప్రవక్త (స) ధరించిన ఈ దుస్తులు పూర్తిగా ఎరుపు రంగుగల దుస్తులు కావు. కాని అందులో ఎర్రని, నల్లని రంగుల చారలు కూడా ఉన్నాయి. ఇంకా ఎరుపు రంగు విషయంలో చాలా అభిప్రాయభేదాలు ఉన్నాయి. హాఫిజ్ గారు ఈ విషయం గురించి ఏడు పంథాలను వ్యక్తం చేశారు. ఆ తరువాత ఆయన ఇలా అన్నారు; యదార్థం ఏమిటంటే, అవిశ్వాసులను పోలి ఉండే ఉద్దేశ్యంతోగానీ, స్త్రీలను పోలి ఉండే ఉద్దేశ్యంతోగానీ లేదా పేరుప్రతిష్ఠలు పొందే సంకల్పంతోగానీ ఎవరైనా ఎరుపు రంగుగల దుస్తులు ధరించటం ధర్మసమ్మతమైన విషయం కానేకాదు. ఈ ఉద్దేశ్యం గనక లేకుండా వాటిని ధరిస్తే అది దోషం కాదు. అయితే కాషాయ రంగుగల దుస్తులు ధరించటం పురుషులకు సమంజసమైన విషయం కాదు. ఇందులో పండితుల మధ్య భిన్నాభిప్రాయాలు లేవు.

373–2. దైవప్రవక్త (సఅసమ్) గారి పిక్కలు బయటికి కనిపిస్తున్నాయి. వాటి మీద వస్త్రం కప్పబడి లేదు. ముస్లిమ్ గారి ఉల్లేఖనంలో ఇలా ఉంది; "నేను దైవప్రవక్త (సఅసమ్) గారి పిక్కల మీద ఉన్నటువంటి శ్వేత వర్ణాన్ని కళ్లారా చూశాను."

# 18వ అధ్యాయం

## కప్పు మీద, మెంబరు మీద, చెక్క మీద నమాజు చెయ్యటం గురించి.

ఇమామ్ హసన్ బస్రీ (రహ్మలై) ఇలా అన్నారని ఇమామ్ బుఖారీ (రహ్మలై) చెప్పారు; పేరుకుపోయిన నీళ్లపై అంటే మంచుగడ్డ మీదా, వంతెనల మీదా నమాజు చెయ్యవచ్చు. ఇందులో అభ్యంతరకరమైన విషయమేదీ లేదు, వాటి క్రింద మూత్రం ప్రవహిస్తున్నాసరే. లేదా వాటి పైభాగంలోగానీ లేదా వాటి ముందు భాగంలోగానీ మూత్రం ప్రవహిస్తున్నా సరే. అయితే నమాజు చేసే మనిషికీ, వాటికీ మధ్య ఏదైనా వస్తువు అడ్డుగా తప్పనిసరిగా ఉండాలి. హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) మసీదు కప్పు మీద నమాజు చేశారు. ఇమామ్ వెనుక నిలబడి నమాజు చేసే సంకల్పం చేసు కుని. వాస్తవానికి ఆ ఇమామ్ మసీదు క్రింద అంతస్తులో ఉన్నారు. ఇంకా ఇబ్నె ఉమర్ (రజిఅన్) మంచుగడ్డ మీద నమాజు చేశారు.

**374.** ప్రజలు సహల్ బిన్ సాద్ సాయిదీ (రజిఅన్)ని, "దైవప్రవక్త (స) గారి మెంబర్ ఏ వస్తువుతో చేయబడింది?" అని అడిగారు. దానికి సమాధానంగా సహల్ (ర) ఇలా అన్నారు; "ఇప్పుడు దానిని గురించి నేను తప్ప ఎక్కువగా తెలిసినవాడు మరొక డెవ్వడూ లేడు. పోతే, అది 'గాబ' అనే గ్రామంలోని ప్రసిద్ధిగాంచిన ఒక వృక్షపు కర్రతో చేయబడింది.[1] దానిని ఫలానా స్త్రీకి చెందిన ఫలానా బానిస మహనీయ ప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) కొరకు తయారు చేశాడు. అది తయారైన తరువాత మసీదులో పెట్టబడింది. అప్పుడు దైవప్రవక్త (స) దానిపైకి ఎక్కి నిలబడ్డారు, తన ముఖాన్ని ఖిబ్లా వైపునకు త్రిప్పి 'అల్లాహు అక్బర్' అనే తక్బీరు పలికారు. ప్రజలు ఆయన (స) గారి వెనుక నిలబడ్డారు. తరువాత ఆయన (స) ఖుర్ఆన్ పారాయణం చేశారు; రుకూ చేశారు. ప్రజలు కూడా ఆయన (స) వెనుక రుకూ చేశారు. ఆ తరువాత ఆయన (స) తన శిరస్సును పైకి లేపారు. మరియు వెనక్కి జరిగారు.[2] ఆ పిదప నేల మీద సజ్దా చేశారు. తరువాత రెండు సజ్దాలు చేసిన పిదప మెంబరు పైకి వెళ్లారు. ఆ తరువాత ఖురాను పారాయణం చేశారు. మళ్లీ రుకూ చేశారు;

---

374–1. 'గాబ' మదీనా పట్టణానికి సమీపంలో ఉన్నటువంటి ఒక గ్రామం పేరు. 'ఝూవ్' ప్రసిద్ధిగాంచిన ఒక వృక్షం పేరు. ఆ చెట్టు కర్ర చాలా మంచిది, గట్టిదీను. ప్రజలు దాని కర్రతో చక్కని పాత్రలు తయారు చేస్తారు. ఆ చెట్టు ఆకులతో చాకలి వారు బట్టలు ఉతుకుతారు.

374–2. ఎందుకంటే తన ముఖం ఖిబ్లా దిక్కు నుంచి తొలగకుండా ఉండాలని.

**రుకూలో నుంచి శిరస్సును పైకి ఎత్తారు. మళ్ళీ వెనక్కి జరిగారు, భూమిపై సజ్దా చేశారు. మెంబర్‌కు సంబంధించిన గాథ ఇది[3] ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మాలై) ఏమన్నారంటే; దైవప్రవక్త(స) నిలబడి నమాజు చేయించారు కాబట్టి ఈ హదీసు ప్రకారం, సామూహిక నమాజుకు నాయకత్వం వహించే ఇమామ్ గనక అతని వెనుక నిలబడి నమాజు చేసే ప్రజలకంటే ఎత్తయిన స్థలంలో నిలబడి నమాజు చేయిస్తే అందులో ఎలాంటి దోషం లేదు.**

**375. అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఒకసారి గుర్రం మీద స్వారీ చేస్తూ క్రిందపడిపోయారు. అప్పుడు ఆయన (స) గారి పిక్కకో లేక భుజానికో గాయం అయింది. దైవప్రవక్త (స) ఒక మాసం వరకు తన భార్యల వద్దకు వెళ్ళనని ఒట్టేసుకున్నారు. తరువాత ఆయన (స) గారు మిద్దెపైనే మకాం వేశారు. దానికి వేయబడిన మెట్లు ఖర్జూరపు చెట్టు కర్రతో తయారు చేయబడినటువంటివి. ఆ సమయంలో ఆయన (స) గారిని పరామర్శించటానికి ఆయన (స)గారి సహచరులు వచ్చారు. దైవప్రవక్త (స) కూర్చొని నమాజు చేయించారు. అనుచరులు మాత్రం నిలబడి నమాజు చేశారు. నమాజు పూర్తి అయిన తరువాత ఆయన (స) గారు ఇలా బోధించారు: “ఒక మనిషిని**

---

374–3. ఈ హదీసు ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే, నమాజుకు నాయకత్వం వహించే ఇమామ్, ముఖ్తదీలు నిలబడి ఉండే స్థలంకంటే ఎత్తయిన స్థలంలో నిలబడి నమాజు చేయించగలడు. ఇంకా తేటతెల్లమయ్యే మరొక విషయమేమిటంటే, ఇంత వెనక్కి జరగటం లేదా ముందుకుపోవటం అనే విషయం నమాజును భంగపరచదు. ఖత్తాబి ఏమన్నారంటే, దైవప్రవక్త (స) గారి మెంబర్‌కు మూడు మెట్లు ఉండేవి. ఆయన (స) గారు గనక రెండో మెట్టు మీద నిలబడితే అప్పుడు క్రిందికి దిగటానికీ, పైకి ఎక్కటానికీ రెండడుగుల దూరం అవుతుంది.

375–1. దీని భావం ఏమిటంటే, ఒకవేళ ఇమామ్ కూర్చొని నమాజు చేస్తే అప్పుడు మీరందరూ కూర్చొనే నమాజు చెయ్యండి. ఈ సమస్యకు సంబంధించిన ప్రస్తావన, దేవుడు సంకల్పిస్తే మున్ముందు వస్తుంది. అధ్యాయానికి ఈ హదీసుతో ఉన్నటువంటి సంబంధం ఏమిటంటే; మిద్దె మీద నమాజు చెయ్యటం అంటే ఇంటి కప్పు మీద నమాజు చెయ్యటం సరైనదే అనే విషయం దీని ద్వారా నిరూపితమయింది. కొంత మంది ఏమన్నారంటే, మెట్లు కర్రతో చెయ్యబడ్డాయి. కాబట్టి కర్ర మీద లేక చెక్క మీద నమాజు చెయ్యటం సరైనదే అనే విషయం తేలింది.

**ఇమామ్‌గా నిర్ణయించిన తరువాత ప్రజలు ఆయన్ని అనుసరించాలి. అతను తక్బీర్ చెప్పినప్పుడు మీరు కూడా తక్బీర్ చెప్పాలి. అతను రుకూ చేస్తే మీరు కూడా రుకూ చెయ్యాలి. ఇంకా అతను సజ్‌దా చేసినప్పుడు మీరు కూడా సజ్‌దా చెయ్యాలి. ఇంకా అతను గనక నిలబడి నమాజు చేస్తే మీరు కూడా నిలబడే నమాజు చెయ్యాలి."[1] దైవప్రవక్త (స) ఇరవై తొమ్మిది రోజుల తరువాత మిద్దె మీద నుంచి కిందికి వచ్చేశారు (ఆయన(స) తన భార్యల వద్దకు వెళ్లారు). ప్రజలు ప్రవక్త (స)ను ఇలా ప్రశ్నించారు; 'ఓ దైవప్రవక్తా (స), మీరయితే ఒక నెల రోజుల వరకు మీ భార్యల వద్దకు వెళ్లనని శపథం చేశారు కదా!' దానికి సమాధానంగా దైవప్రవక్త (స) "ఇరవై తొమ్మిది రోజుల మాసం కూడా ఉంటుంది" అన్నారు.**

## 19వ అధ్యాయం

### నమాజు చేసే మనిషి సజ్‌దా చేసే స్థితిలో ఉన్నప్పుడు, ఒకవేళ అతను ధరించిన దుస్తులు అతని భార్య శరీరానికి తగిలినట్లయితే అప్పుడు అతని నమాజు చట్టం ప్రకారం బలం లేకుండా పోతుందా?

**376.** హజ్రత్ మైమూన (రజిఅన్‌హా) ఇలా చెప్పారని అబ్దుల్లా బిన్ షద్దాద్ ఉల్లేఖించారు : మహనీయ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) నమాజు చేస్తూ ఉన్నప్పుడు నేను ఆయన (స) గారి ప్రక్కన కూర్చొని ఉండేదాన్ని. ఇంకా నేను అప్పుడు బహిష్టు స్థితిలో ఉండేదాన్ని. అప్పుడప్పుడు ఆయన (స) గారు ధరించిన దుస్తులు సజ్‌దా చేసేటప్పుడు నా శరీరానికి తాకుతూ ఉండేవి.[1] ఇంకా ఆయన (స) గారు ఖుమ్‌రా మీద నమాజు చేసేవారు.[2]

## 20వ అధ్యాయం

### చాప మీద నమాజు చెయ్యటం అనే విషయం గురించి.

జాబిర్ బిన్ అబ్దుల్లా అన్సారీ (రజిఅన్), అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) వీరు ఉభయులూ పడవలో నిలబడి నమాజు చేశారు.[1] ఇంకా ఇమామ్ హసన్ బస్రీ (రెహ్మాలై) ఇలా సెలవిచ్చారు;[2] పడవలో నిలబడి నమాజు చెయ్యి. కాని దానివల్ల

---

376–1. ఈ హదీసు ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే; బహిష్టు అయిన స్త్రీ యొక్క శరీరం అశుద్ధమయినది కాదు.

376–2. ఖుమ్‌రా అంటే ఒక చిన్న చాప. అది సజ్‌దా చేసేటప్పుడు ముఖం చేతులు పెట్టటానికి మాత్రమే సరిపోతుంది.

20–1. ఈ విషయాన్ని ఇబ్నె అబీ షైబా సంగ్రహించారు. ఇందులో ఉన్నటువంటి విషయం

**నీ సహచరులకు ఇబ్బంది కలగకూడదు. పడవతో పాటు నీవు కూడా తిరుగుతూ ఉండు. లేకపోతే కూర్చొని నమాజు చెయ్యి.**

**377. అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా అన్నారని ఇస్హాఖ్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ అబీ తల్హా (ర) ఉల్లేఖించారు : మా అమ్మమ్మ గారైనటువంటి ములైక[1] ఒకసారి దైవప్రవక్త ముహమ్మద్(స)ను తన ఇంటికి భోజనానికి రమ్మని ఆహ్వానించారు. ఆ భోజనాన్ని స్వయంగా ఆమెగారే తయారు చేశారు. అన్నం తిన్న తరువాత దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు : "రండి, నిలబడండి, మీకు నేను నమాజు చేయిస్తాను." అనస్ (ర) ఇలా అన్నారు : అప్పుడు నేను ఒక చాప వైపునకు వెళ్ళాను. చాలా కాలం నుంచి వాడకంలో ఉన్న కారణంగా అది నల్లబడిపోయింది. నేను దాని మీద నీళ్లుపోసి కడిగాను. దైవప్రవక్త (స) ఆ చాప మీదనే నిలబడ్డారు. నేను మరియు అనాథ బాలుడైన జమీరా ఆయన (స) గారి వెనుక పంక్తిలో నిలబడ్డాము. ముసలమ్మ (అమ్మమ్మ) మా వెనుక నిలబడ్డారు. తరువాత దైవప్రవక్త (స) మాకు రెండు రకాతులు నమాజు చేయించారు. ఆ తరువాత సలాము చేశారు.**

## 21వ అధ్యాయం

**ఖుమ్రా (ఒక చిన్న చాప-ముసల్లా లేక జానిమాజ్) మీద నమాజు చెయ్యటం గురించి.**

**378. విశ్వాసుల తల్లి అయినటువంటి హజ్రత్ మైమూన (రజిఅన్హా) ఇలా**

---

ఏమిటంటే, పడవ ప్రయాణం చేస్తూ ముందుకు సాగిపోతూ ఉంటుంది. మనం నమాజు చేస్తూ పోతాము. వాస్తవానికి మనం గనక కోరితే పడవకు లంగరు వేసి ఆపగలము.

20-2. ఈ విషయాన్ని ఇబ్నె అబీ షైబా, బుఖారీలు సంగ్రహించారు. 'పడవతోపాటు నీవు కూడా తిరుగుతూ ఉండు' అనే దాని భావం ఏమిటంటే; నమాజును ప్రారంభించే టప్పుడు ఖిబ్లా వైపునకు నీ ముఖాన్ని త్రిప్పు. తరువాత పడవ ఏ వైపునకు తిరిగితే ఆ వైపునకు ముఖాన్ని పెట్టు. ఖిబ్లా వైపునకు నీ ముఖం తిరిగి ఉన్నా, లేకపోయినా పర్వాలేదు. కాని నమాజు చేస్తూ పో. ఇమామ్ బుఖారీ (రహ్మాలై) ఈ హదీసును ఇక్కడ ప్రస్తావించటానికి కారణం ఏమిటంటే, పడవ కూడా చాప మాదిరిగానే భూమి కాదు. అయినా దానిపై నమాజు చెయ్యటం సక్రమమయిన విషయమే.

377-1. కొందరు ఇలా అనువాదం చేశారు. ఈ ఇస్హాఖ్ గారి నాయనమ్మ అయినటువంటి ములైక.

**ఉల్లేఖించారు : దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) సజ్దగాహ్ (చిన్న జానిమాజు) మీద నమాజు చేసేవారు.[1]**

## 22వ అధ్యాయం

## పడక మీద నమాజు చెయ్యటం[1] అనే విషయం గురించి.

**హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) తన పడక మీద నమాజు చేశారు.[2] హజ్రత్ అనస్ (రజిఅన్) ఇలా సెలవిచ్చారు : మేము దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) గారితోపాటు నమాజు చేసేవారము. మాలోని కొందరు తమ వస్త్రాల మీద[3] సజ్దా చేసేవారు.**

**379. దైవప్రవక్త మహనీయ ముహమ్మద్ (సఅసమ్) గారి భార్య అయినటువంటి హజ్రత్ ఆయెషా (ర) ఇలా ఉల్లేఖించారు: నేను దైవప్రవక్త (స) గారి సమక్షంలో పడుకునేదాన్ని.[1] నా పాదాలు ఆయన (స) గారి ముఖం వైపునకు తిరిగి ఉండేవి. ఆయన (స) గారు సజ్దా చేసినప్పుడు నన్ను తాకేవారు; నేను నా కాళ్లను ముడుచుకునే దాన్ని. ఆయన (స) గారు లేచి నిలబడినప్పుడు నేను నా కాళ్లను మళ్లీ చాపేదాన్ని. ఆ రోజుల్లో ఇళ్ళల్లో దీపాలు కూడా ఉండేవి కావు.**

---

378–1. సజ్దగాహ్ (ఖుమ్రా) అంటే ఒక చిన్న జానిమాజ్ లేక ముసల్లా అని అర్థం. దాని మీద నమాజు చేసే వ్యక్తి కేవలం తన ముఖాన్నీ, తన రెండు చేతులను మాత్రమే పెట్టగలడు.

22–1. ఈ అధ్యాయాన్ని ప్రవేశపెట్టి ఇమామ్ బుఖారీ (రహ్మా) గారు, మట్టి మీద తప్ప మిగతా ఏ వస్తువుల మీదనైనా సరే సజ్దా చెయ్యటం ధర్మసమ్మతమైన విషయం కాదు అనే అభిప్రాయం కలిగి ఉన్నటువంటి వారిని ఖండించారు.

22–2. ఈ విషయాన్ని ఇబ్నె అబీ షైబా గారు, సయీద్ బిన్ మన్సూర్ గారు వసల్ చేశారు.

22–3. దీనిని అబీ షైబా గారు 'అస్వద్' నుంచి వెలికి తీశారు. ఆయన దుప్పటి మీదా, వెంట్రుకలుగల చర్మంతో తయారు చేసిన కోటు మీదా, కంబలి మీదా నమాజు చెయ్యటాన్ని సహించేవారు కారు, దానిని చెడుగా భావించేవారు. ఇమామ్ మాలిక్ (రహ్మాలై) గారు ఏమన్నారంటే; నమాజు చేసే వ్యక్తి ఈ వస్తువుల మీద నిలబడి నమాజు చేస్తే అది తప్పేమీ కాదు; కాని అతని నుదురు, అతని రెండు చేతులు సజ్దాలో ఉన్నప్పుడు నేల మీద ఉండాలి.

379–1. అంటే పడక మీద నమాజు చెయ్యటం అని భావం; ముందు రాబోయే హదీసులో

**380.** **హజ్రత్ ఆయెషా(ర) ఇలా ఉల్లేఖించారు : దైవప్రవక్త మహనీయులు (స) తమ ఇంట్లోని పడక మీద నమాజు చేసేవారు. తానేమో ఆయన(స)కూ ఖిబ్లా దిక్కుకూ  మధ్య ఒక జనాజా మాదిరిగా అడ్డంగా పడి ఉండేవారు.**

**381.** **ఉర్వా బిన్ జుబైర్ (ర) ఇలా ఉల్లేఖించారు : దైవప్రవక్త మహనీయులు (సఅసమ్) తమ ఇంట్లో పడక మీద నమాజు చేసేవారు.  అప్పుడు ఆయన (స)కూ, ఖిబ్లా దిక్కుకూ మధ్య హజ్రత్ ఆయెషా (ర) ఆ పడక మీద అడ్డంగా పడుకుని ఉండే వారు.[1] ఆ పడక మీదనే వారు ఉభయులు పడుకునేవారు.**

## 23వ అధ్యాయం

### తీవ్రమైన ఎండ వేడిలో వస్త్రం మీద సజ్దా చెయ్యటం[1].

**ఇమామ్ హసన్ బస్రీ (రహ్మాలై) ఇలా అన్నారు: సహాబా (ర) (దైవప్రవక్త సహ చరులు) తలపాగా మీదా, టోపీ మీదా సజ్దా చేసేవారు; వారి చేతులు చొక్కా చేతుల్లో ఉండేవి.[1]**

**382.** **అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : మేము ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారితో పాటు నమాజు చేసేవారము; మాలోని కొందరు తీవ్రమైన ఎండతాపం వల్ల తమ వస్త్రాల చివర్లను సజ్దా చేసే స్థలం మీద పరిచేవారు.[1]**

---

వివరించబడిన విధంగా. కనుక అధ్యాయంలోని ప్రధాన విషయం స్పష్టమైపోయింది.

381-1. ఈ హదీసుల ద్వారా పడక మీద నమాజు చెయ్యటం ధర్మసమ్మతమైనదే అనే విషయం నిరూపితమయింది. ఇంకా పడుకుని నిద్రపోయే మనిషి వైపునకు తిరిగి నమాజు చెయ్యటం అసహ్యకరమైన విషయమేమీ కాదు అని కూడా తెలిసిపోయింది. ఇంకా స్త్రీ వైపునకు తిరిగి నమాజు చెయ్యటం వల్లా లేదా ఒక స్త్రీ  నమాజు  చేసేవాని ముందు నుంచి దాటిపోవటం వల్లా నమాజు భంగం కాదు.  విద్వాంసులలో చాలా మంది ఈ అభిప్రాయంతో ఏకీభవించారు.

23-1. ఈ హదీసును ఇబ్నె అబీ షైబా, అబ్దుర్రజాఖ్‌లు సంగ్రహించారు. ఇమామ్ అబూ హనీఫా (రహ్మాలై) గారి దృష్టిలో అమామ (తలపాగ) యొక్క మధ్యభాగం మీద సజ్దా చెయ్యటం జాయజ్ (ధర్మసమ్మతమైనదే). కాని ఇమామ్ మాలిక్ (రహ్మాలై) దానిని మక్రూహ్ (అవాంఛనీయమైనది)గానూ, ఇమామ్ షాఫయి (రహ్మాలై) దానిని నాజాయజ్ (ధర్మ విరుద్ధమైనది) గానూ పరిగణించారు.

382-1. ఇమామ్ అబూ హనీఫా (రహ్మాలై) గారూ, ఇమామ్ మాలిక్ (రహ్మాలై) గారూ,

## 24వ అధ్యాయం
## పాదరక్షలతో నమాజు చెయ్యటం.

**383. అబూ మస్‌లమా సయీద్ బిన్ యజీద్ అల్ యజ్‌ది ఇలా ఉల్లేఖించారు: నేను అనస్ బిన్ మాలిక్ (రజిఅన్)ను, "దైవప్రవక్త మహనీయులు (సఅసమ్) పాద రక్షలు తొడుక్కుని నమాజు చేసేవారా?" అని అడిగాను. దానికి సమాధానంగా ఆయన 'అవును' అని పలికారు.[1]**

## 25వ అధ్యాయం
## చర్మపు మేజోళ్లు తొడుక్కుని నమాజు చెయ్యటం.

**384. హమ్మామ్ బిన్ హారిస్ ఇలా అన్నారని ఇబ్రాహీమ్ నఖయీ ఉల్లేఖించారు: 'నేను జరీర్ బిన్ అబ్దుల్లాను చూశాను; అప్పుడు ఆయన మూత్ర విసర్జన చేస్తున్నారు. ఆ తరువాత ఆయన వుజూ చేసుకున్నారు, ఇంకా మేజోళ్ల మీద మసా చేశారు. తరువాత నిలబడి నమాజు చేశారు (మేజోళ్లతో సహా). ఒక వ్యక్తి ఆయన్ని ప్రశ్నించగా ఆయన ఇలా అన్నారు: 'నేను దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్**

---

ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మాలై) గారూ, ఇంకా చాలా మంది విద్వాంసుల అభిప్రాయం ఏమిటంటే; తీవ్రమైన ఎండతాపం ఉన్న స్థితిలో లేదా తీవ్రమైన చలి ఉన్న స్థితిలో నమాజు చేసే వ్యక్తి తన వస్త్రాన్ని నేల మీద పరచి దాని మీద సజ్దా చెయ్యవచ్చు, అందులో దోషం లేదు. దాని వల్ల నమాజు చెడిపోదు.

383–1. ఇబ్నె బత్తాల్ ఇలా అన్నారు; పాదరక్షలు పరిశుభ్రంగా ఉన్నట్లయితే, వాటిని తొడిగి నమాజు చెయ్యటం ధర్మసమ్మతమైనదే. నేను అలా చెయ్యటాన్ని ముస్తహబ్ (ఇష్టకరమైనది) అని అంటాను. ఎందుకంటే, అబూదావూద్, హాకిమ్ గార్ల హదీసుల్లో ఇలా ఉంది; యూదులకు వ్యతిరేకంగా చెయ్యండి. వారు చెప్పులు తొడుక్కునీ, మేజోళ్లు ధరించీ నమాజు చెయ్యరు. హజ్రత్ ఉమర్(ర) నమాజు చేసేటప్పుడు చెప్పులు వదిలేయటాన్ని అవాంఛనీయమైన కార్యంగా భావించేవారు. ఇంకా అబూ అమ్ర్ షైబానీ గారయితే, నమాజు చేసేటప్పుడు, ఎవరైనా పాదరక్షలు విడిస్తే వారిని కొట్టేవారు. ఇమామ్ అబూ హనీఫా గారి గురువుగారి గురువైన ఇబ్రాహీమ్ నఖయీగారు కూడా ఇదే అభిప్రాయాన్ని కలిగి ఉన్నారు. షౌకానీ గారు ఇలా అన్నారు; అసలైన, నిజమైన అభిప్రాయం ఏమిటంటే, పాదరక్షలు ధరించి నమాజు చెయ్యటం ముస్తహబ్ (అభిలషణీయమైనది). ఒకవేళ పాదరక్షలకు అశుద్ధత ఏదైనా అంటుకుంటే వాటిని నేల మీద రుద్దటం వల్ల అవి పరిశుభ్రమైపోతాయి. అది ఎటువంటి అశుద్ధత అయినాసరే, తడిదైనాసరే, పొడిదైనాసరే.

**(స)ను ఇలానే చేస్తూ ఉండగా చూశాను'. ఇబ్రాహీమ్ నఖయీ ఏమన్నారంటే, జరీర్ బిన్ అబ్దుల్లాగారి ఈ హదీసు ప్రజలకు చాలా నచ్చింది. ఎందుకంటే ఆయన చివర్లో చాలా ఆలస్యంగా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు.[1]**

**385. ముగైరా బిన్ షూబా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) వుజూ చేసుకునేటప్పుడు నేను ఒకసారి ఆయన (స) గారికి సహాయపడ్డాను. ఆయన (స) తన మేజోళ్ల మీద మసా చేశారు. ఆ తరువాత నమాజు చేశారు.**

## 26వ అధ్యాయం

## ఎవరైనా సజ్దా పూర్తిగా చెయ్యకపోతే.

**హుజైఫా (ర) ఇలా ఉల్లేఖించారు: ఆయన ఒక వ్యక్తిని చూశారు; అతను నమాజు చేసేటప్పుడు రుకూను పూర్తిగా చెయ్యడు. సజ్దాను పూర్తిగా చెయ్యడు. అతను తన నమాజును పూర్తిచేసిన తరువాత, అతనితో హుజైఫా (ర) ఇలా అన్నారు; 'నీవు అసలు నమాజే చెయ్యలేదు.' అబూ వాయల్ ఏమన్నారంటే; హుజైఫా ఇలా కూడా అని ఉంటారని నేను అనుకుంటున్నాను; 'నీవు మరణించినప్పుడు దైవప్రవక్త (స) గారి సున్నత్ (సంప్రదాయం) మీద మరణించవు.'[1]**

## 27వ అధ్యాయం

## సజ్దా చేసేటప్పుడు రెండు బాహువులను వెడల్పుగా, విశాలంగా ఉంచటం. ఇంకా వాటిని ప్రక్కటెముకల నుంచి వేరుగా, దూరంగా ఉంచటం.

**అబ్దుల్లా బిన్ మాలిక్ ఇబ్నె బుహైనా ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (స) నమాజు చేసినప్పుడల్లా తమ రెండు చేతులను ఎంత**

---

384–1. అంటే ఖురాను గ్రంథంలోని మాయిదా సూరాలో వుజూ చేసుకునే ప్రక్రియలో కాళ్లు పరిశుభ్రంగా కడుక్కోవాలనే ఆజ్ఞ కూడా ఉంది. కనుక ఈ సూరా అవతరించిన తరువాత, జరీర్ బిన్ అబ్దుల్లాహ్ గారి హదీసు వల్ల దైవప్రవక్త ముహమ్మద్ (స) తమ మేజోళ్ల మీద మసా చేసిన సంఘటన మాయిదా సూరాలోని ఈ వాక్యం అవతరణకు పూర్వం జరిగి ఉండవచ్చు అనే సందేహం ఉత్పన్నం కాదు.

26–1. అంటే నీ అంతం చెడ్డది అవుతుంది. ఎందుకంటే, నీవు దైవప్రవక్త (స) ను అనుసరించాలనే విషయం పట్ల అశ్రద్ధ కనబరిచావు. ఇంకా రాజాధిరాజు అయినటువంటి దేవుని పట్ల చూపవలసిన మర్యాదను చూపలేదు. అజాగ్రత్తగా, అశ్రద్ధగా ఆయన్ని ఆరాధించావు.

**విశాలంగా, వెడల్పుగా (శరీరానికి దూరంగా) పెట్టేవారంటే, ఆయన (స) గారి చంకల్లోని తెలుపు స్పష్టంగా కనిపించేది.**

## 28వ అధ్యాయం

### ఖిబ్లా వైపునకు ముఖం పెట్టి నమాజు చెయ్యటం ఎంతో శ్రేష్ఠమైనది, ఎంతో ఉన్నత మైనది.

దైవప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అబూ హుమైద్ (రజిఅన్) ఉల్లేఖించారు; **నమాజు చేసే వ్యక్తి తన కాలి వ్రేళ్లను కూడా ఖిబ్లా వైపునకు పెట్టి ఉంచాలి.**

**386.** ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఉల్లేఖించారు: **ఎవరైనా మేము చేసే నమాజు మాదిరిగా నమాజు చేస్తే, ఇంకా నమాజు చేసేటప్పుడు మా ఖిబ్లా వైపునకు ముఖాన్ని త్రిప్పి నమాజు చేస్తే[1], ఇంకా మేము కోసిన పశువు మాంసాన్ని తింటే[2] అప్పుడు అతను అల్లాహ్ యొక్క, ప్రవక్త యొక్క ఆశ్రయంలో, రక్షణలో ఉంటాడు. కనుక అల్లాహ్ యొక్క ఆశ్రయం విషయంలో ద్రోహానికి పాల్పడకండి.[3]**

---

386–1. ఇందులో నుంచే అధ్యాయంలో ప్రస్తావించబడిన విషయం ఉద్భవిస్తుంది. తెలిసిన విషయం ఏమిటంటే, నమాజు చేసేటప్పుడు ఖిబ్లా వైపునకు ముఖాన్ని త్రిప్పటం తప్పనిసరి. ఇలా చెయ్యకుంటే నమాజు నిజమైన, సరియైన నమాజు కాదు. ఈ విషయంతో అందరూ ఏకీభవిస్తారు. కాని షరీయత్ పరమైన కారణం వల్లగానీ లేదా భయం వల్లగానీ దాని అనివార్యత లేదా ఆవశ్యకత రద్దు అయిపోతుంది.

386–2. ఈ మూడు విషయాలను ఆయన (స) ముస్లిముల గుర్తులుగా పేర్కొన్నారు. ఎందుకంటే, ఆ కాలంలో యూదులు, క్రైస్తవులు, ముష్రిక్కులు ఈ అన్ని విషయాలను పాటించేవారు కారు. ముష్రిక్కులయితే అసలు నమాజే చెయ్యరు; యూదులు ముస్లిములు కోసిన మాంసాన్ని తినరు, ముస్లిముల ఖిబ్లా వైపునకు తిరిగి నమాజు కూడా చెయ్యరు. ఇంకా క్రైస్తవులయితే ముస్లిములు కోసిన పశువుల మాంసాన్ని తింటారు. కాని ముస్లిముల ఖిబ్లా వైపునకు తిరిగి నమాజు చెయ్యరు.

386–3. అంటే షరీయత్ పరమయిన కారణం ఏదీ లేకుండా అతని ఆశ్రయాన్ని, అతని వాగ్దానాన్ని భంగపరచకండి. ఏ వ్యక్తి అయితే ఈ మూడు పనులనూ చేస్తాడో ఆ వ్యక్తి ప్రాణం మీదా, సంపద మీదా దౌర్జన్యం చెయ్యకండి. అతన్ని ముస్లిమ్‌గా భావించండి. ఇక్కడ తెలిసిన విషయం ఏమిటంటే, నమాజును త్యజించిన వ్యక్తిని హతమార్చటం,

**387.** దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఉల్లేఖించారు: ప్రజలు "లా ఇలాహ ఇల్లల్లాహ్" (అల్లాహ్ తప్ప మరొక దేవుడు లేనే లేడు) అని పలికే వరకు నేను వారితో పోరాడుతూ ఉండాలని నన్ను ఆజ్ఞాపించటం జరిగింది. వారు గనక అలా పలికితే, తరువాత మేము నమాజు చేసిన విధంగా వారు కూడా నమాజు చెయ్యటం ప్రారంభిస్తే, ఇంకా మా ఖిబ్లా వైపునకు ముఖం పెట్టి నమాజు చేస్తే, ఇంకా మా పద్ధతి ప్రకారం పశువులను జిబహ్ చేస్తే, అప్పుడు వారి ప్రాణాలూ, వారి సంపదలూ మనకు నిషిద్ధమైపోతాయి; ఒక్క చట్ట ప్రకారంగా తప్ప మేము వారి విషయంలో జోక్యం చేసుకోము.[1] వారిని గురించి అల్లాహ్‌యే లెక్క తీసుకుంటాడు.[2] మైమూన్ బిన్ సియాహ్, అనస్ బిన్ మాలిక్ (ర)ను ఇలా అడిగారు: "ఓ అబూహమ్‌జా! (ఇది హజ్రత్ అనస్ (ర) గారి కునియత్) ఒక మనిషి ప్రాణం, అతని సంపదా ఎప్పుడు నిషిద్ధమవుతాయి?" దానికి సమాధానంగా ఆయన ఇలా అన్నారు: ఎవరైనా "అల్లాహ్ తప్ప నిజమైన ఆరాధ్య దైవం మరొకడెవ్వడూ లేడు," అని సాక్ష్యమిస్తే: ఇంకా మేము తిరిగి నమాజు చేసే ఖిబ్లా వైపునకు ముఖం పెట్టి నమాజు చేస్తే, మేము చేసే నమాజులాంటి నమాజునే చేస్తే, ఇంకా మేము కోసిన పశువు మాంసాన్ని తింటే, అప్పుడు అతను ముస్లిమ్ అవుతాడు; ఒక ముస్లిమ్‌కు సంక్రమించే హక్కులన్నీ అతనికి కూడా సంక్రమిస్తాయి, ఒక ముస్లిమ్‌పై ఉండే విధ్యుక్త ధర్మాలన్నీ అతని మీద కూడా ఉంటాయి.

## 29వ అధ్యాయం

### మదీనా ప్రజల, సిరియా ప్రజల 'ఖిబ్లా'ను గురించి ఇంకా తూర్పు (పశ్చిమ) దిక్కులను గురించి.

**తూర్పు పశ్చిమ దిశలలో మదీనా ప్రజల, సిరియా ప్రజల ఖిబ్లా లేనే లేదు.**

---

అతని సంపదను కొల్లగొట్టటం ధర్మసమ్మతమైనదే. ఇంకా అతను ముస్లిమ్ కాడు. అతను అల్లాహ్ యొక్క ప్రవక్త యొక్క రక్షణలో కూడా ఉండడు.

387–1. వారు గనక ఎవరినైనా హత్య చేస్తే వారికి ప్రతీకారం చెయ్యబడుతుంది; అది వేరే విషయం.

387–2. అంటే, ఒకవేళ వారి హృదయాలలో అవిశ్వాసం ఉంటే, తీర్పుదినాన అల్లాహ్ దానిని గురించి ప్రశ్నిస్తాడు. వారు ఈ మూడు విషయాలను క్రియాశీలకంగా ఒప్పుకున్నట్లయితే అప్పుడు ఈ ప్రపంచంలో ఇస్లామ్ ధర్మం ఆజ్ఞలన్నీ వారికి వర్తిస్తాయి.

ఎందుకంటే ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) మదీనా ప్రజలతో ఇలా సెలవిచ్చారు: "మలమూత్ర విసర్జనం చేసేటప్పుడు ఖిబ్లా వైపునకు ముఖాన్ని త్రిప్ప కండి. కాని తూర్పు దిశకు లేదా పశ్చిమ దిశకు ముఖాన్ని పెట్టవచ్చు."[1]

**388.** అబూ అయ్యూబ్ అన్సారీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : ప్రవక్త మహ నీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారు; మీరు మరుగుదొడ్డిలోకి వెళ్లి నప్పుడు ఖిబ్లా వైపునకు ముఖం కానీ, వీపుకానీ పెట్టకండి. అయితే తూర్పు వైపునకు లేదా పడమర వైపునకు ముఖాన్ని పెట్టవచ్చు. ఇంకా అబూ అయ్యూబ్ అన్సారీ (ర) ఇలా అన్నారు; "తరువాత మేము సిరియా దేశంలోకి ప్రవేశించాము. అక్కడ మరుగు దొడ్ల ముఖాలు ఖిబ్లాకు అభిముఖంగా కట్టబడి ఉండటాన్ని చూశాము. కనుక వాటిని ఉపయోగించేటప్పుడు మరొక ప్రక్కకు తిరిగి కూర్చునేవారము. ఇంకా క్షమించమని అల్లాహ్‌ను వేడుకునేవారం."

## 30వ అధ్యాయం

**ఖురాను గ్రంథంలోని 'బఖర' సూరాలోని అల్లాహ్ సూక్తి : "ఇబ్రాహీమ్ ఆరాధన కొరకు నిలబడిన ప్రదేశాన్ని శాశ్వతమైన నమాజు స్థలంగా చేసుకోవలసిందిగా మేము ప్రజలను ఆదేశించాము."**

**389.** అమ్రూ బిన్ దీనార్ ఇలా ఉల్లేఖించారు : మేము అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్)ను ఇలా అడిగాము; "ఒక వ్యక్తి ఉమ్రా కోసం కాబా మందిర ప్రదక్షిణం చేశాడు. కాని సఫా మర్వాల మధ్య 'సయీ' (పరుగెత్తటం) చెయ్యలేదు. అలాంటి వ్యక్తి తన భార్యతో సంభోగించగలడా?[1]" ఆయన దానికి సమాధానంగా ఇలా అన్నారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) మక్కా నగరానికి వచ్చి నప్పుడు ఆయన (స) ఏడుసార్లు కాబా మందిర ప్రదక్షిణం చేశారు. ఇబ్రాహీమ్ ప్రవక్త

---

29–1. మదీనా పట్టణానికీ, సిరియా దేశానికీ పవిత్ర మక్కా నగరం దక్షిణ దిశలో ఉన్నది. కనుక మదీనా పట్టణవాసులకూ, సిరియా దేశ ప్రజలకూ మలమూత్ర విసర్జనం చేసేటప్పుడు తూర్పు పడమర దిక్కుల వైపునకు తమ ముఖాన్ని త్రిప్పి ఉంచాలనే ఆజ్ఞ ఇవ్వబడింది. కాని ఎవరైతే పవిత్ర మక్కా నగరానికి తూర్పు లేక పడమర దిక్కులో ఉన్నారో వారు దక్షిణ దిక్కుకో లేక ఉత్తర దిశకో తమ ముఖాన్ని త్రిప్పాలని ఆజ్ఞా పించబడింది.

389–1. అంటే అతని ఉమ్రా పూర్తి అయిపోయింది. ఇక అతను ఇహ్రామ్ స్థితి నుంచి బయటికి రాగలడా? లేదా?

స్థలానికి (మఖామె ఇబ్రాహీమ్‌కి) వెనుక భాగంలో రెండు రకాతులు నమాజు చేశారు. ఆ తరువాత సఫా మర్వాల ప్రదక్షిణం చేశారు. మీకు దైవప్రవక్త (స)లో అత్యుత్తమ ఆదర్శం ఉంది.[2] అమ్రూ బిన్ దీనార్ ఇలా అన్నారు : మేము ఇదే విషయాన్ని గురించి జాబిర్ బిన్ అబ్దుల్లాను కూడా అడిగాము. ఆయన ఇలా అన్నారు; "ఆ వ్యక్తి సఫా మర్వాల ప్రదక్షిణం చెయ్యనంత వరకు తన భార్యతో సంభోగించకూడదు".

**390.** ముజాహిద్ ఇలా ఉల్లేఖించారు : ఇబ్నె ఉమర్ (రజిఅన్)గారి వద్దకు ఎవరో ఒక వ్యక్తి[1] వచ్చి ఇలా అన్నాడు; "ఇదిగో, ఇప్పుడే మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) విచ్చేశారు, కాబా గృహం లోపలకు వెళ్లారు." ఇబ్నె ఉమర్ (ర) ఇలా అన్నారు ; ఈ విషయం తెలుసుకుని నేను కూడా అక్కడకు వెళ్లాను. కాని అప్పటికే దైవప్రవక్త మహనీయులు (స) కాబాగృహం నుంచి వెళ్ళిపోయారని తెలిసింది. ఇంకా, బిలాల్ (ర)ను కాబా గృహం రెండు తలుపుల మధ్య నిలబడి ఉండటాన్ని నేను చూశాను. అప్పుడు నేను బిలాల్‌ను, "దైవప్రవక్త (స) కాబా గృహం లోపల నమాజు చేశారా?" అని అడిగాను. ఆయన సమాధానంగా ఇలా అన్నారు; "అవును, దైవప్రవక్త (స) కాబా గృహంలో మీకు ఎడమ భాగంలో ఉన్నటువంటి రెండు స్తంభాల మధ్య నిలబడి రెండు రకాతులు నమాజు చేశారు. ఆ తరువాత బయటికి వచ్చారు. కాబా ముందు భాగంలో మళ్లీ రెండు రకాతులు నమాజు చేశారు".[2]

**391.** అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) కాబా గృహంలోకి ప్రవేశించినప్పుడు దాని యొక్క

---

389–2. అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇక్కడ ఒక ముఖ్యమైన సూచన చేశారు. అదేమిటంటే, దైవప్రవక్తను అనుసరించటం అత్యంతావశ్యకం. అంటే ధార్మిక పరిభాషలో 'వాజిబ్' అన్నమాట. ముఖ్యంగా హజ్‌కూ, ఉమ్రాకూ సంబంధించిన క్రియల విషయంలో ఇది చాలా అవసరం. ఎందుకంటే, ఈ విషయాలలో మన విచక్షణకూ, మన మేధకూ అసలు ప్రమేయమే ఉండదు. ఇంకా ఆయన (స) సఫా మర్వాల ప్రదక్షిణం చెయ్యటం వాజిబ్ అని కూడా తెలియజేశారు. ఈ ధర్మకార్యం పూర్తికానంత వరకు ఉమ్రాకు సంబంధించిన ఇహ్రామ్ నుంచి విముక్తి లభించదు.

390–1. ఈ వ్యక్తి ఎవరో తెలియదు.

390–2. అంటే, ఇబ్రాహీమ్ ప్రవక్త స్థలం వద్ద. అంటే దైవప్రవక్త (స) ఇబ్రాహీమ్ ప్రవక్త స్థలం వైపునకు తన ముఖాన్ని త్రిప్పి నమాజు చెయ్యలేదు. కాబా వైపునకు ముఖాన్ని పెట్టి నమాజు చేశారు.

**నాలుగు మూలలకు పోయి అల్లాహ్‌ను వేడుకున్నారు. కాబా నుంచి బయటికి వచ్చే వరకు నమాజు చెయ్యలేదు. బయటికి వచ్చిన తరువాత కాబా గృహం ముందు నిలబడి రెండు రకాతులు నమాజు చేశారు. మరియు 'ఇదే మన ఖిబ్లా' అని సెలవిచ్చారు.[1]**

## 31వ అధ్యాయం

**మనిషి ఎక్కడున్నా సరే, ఏ దేశంలో ఉన్నా, ఏ ప్రదేశంలో ఉన్నా ఖిబ్లా వైపునకు ముఖాన్ని పెట్టి నమాజు చెయ్యాలి.**

**అబూ హురైరా (రజిఅన్) ఇలా అన్నారు; దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారు; కాబా గృహం వైపునకు ముఖాన్ని త్రిప్పు మరియు 'అల్లాహు అక్బర్' (అల్లాహ్ మాత్రమే గొప్పవాడు)అని అను.[1]**

**392. బరా బిన్ ఆజిబ్ (రజిఅన్ ) ఇలా ఉల్లేఖించారు; ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) బైతుల్ మఖ్‌దిస్ వైపునకు తిరిగి పదహారు సంవత్సరాల వరకో లేదా పదిహేడు సంవత్సరాల వరకో నమాజు చేశారు. దైవప్రవక్త (స) గారు, కాబా గృహం వైపునకు ముఖం పెట్టి నమాజు చెయ్యమనే ఆజ్ఞ అల్లాహ్ దగ్గర నుంచి తనకు ఎప్పుడొస్తుందా? అని (హృదయపూర్వకంగా) కోరుకునేవారు. చివరకు అల్లాహ్ 'బఖరా' సూరాలోని ఈ వాక్యాన్ని అవతరింపజేశాడు. "ఓ ప్రవక్తా! నీవు మాటిమాటికీ నీ ముఖాన్ని ఆకాశం వైపునకు ఎత్తటాన్ని మేము గమనిస్తూనే ఉన్నాము. ఇదిగో నీకు అత్యంత ప్రీతికరమైన ఖిబ్లా వైపునకే ఇప్పుడు మేము**

---

391-1. అది ఎన్నటికీ రద్దుకాదు. ఇబ్రాహీమ్ ప్రవక్త గారి స్థలం వద్ద ఉన్నది. ఈ విధంగా ఈ హదీసు అధ్యాయానికి అనుగుణంగా ఉన్నది. ఒక మనిషి కాబా గృహం వైపునకు తన ముఖాన్ని పెట్టి ప్రపంచంలో ఎక్కడనుంచైనా నమాజు చెయ్యవచ్చు; ఇబ్రాహీమ్ ప్రవక్త స్థలంలోనైనా లేదా మరొక స్థలంలోనైనా. ఈ ఉల్లేఖనంలో కాబా గృహంలో నమాజు చెయ్యటం గురించి ప్రస్తావించబడలేదు. ముందు రాబోయే ఉల్లేఖనంలో నమాజుకు సంబంధించిన ప్రస్తావన వచ్చింది. ముందు రాబోయే ఉల్లేఖనం ఎక్కువ నమ్మదగినది అని ప్రజలు అభిప్రాయపడ్డారు. కొంతమంది ఏమన్నారంటే; దైవప్రవక్త (స) ఎన్నోసార్లు కాబా గృహంలోకి వెళ్లారు. ఒకప్పుడు నమాజు చేశారు. మరొకప్పుడు కేవలం దుఆ చేశారు.

31-1. మన ఇమాములైన (ధార్మిక నాయకులు) ఇమామ్ అహ్‌మద్ బిన్ హంబల్ (రెహ్మలై), ఇమామ్ మాలిక్ (రెహ్మలై), ఇమామ్ అబూ హనీఫ (రెహ్మలై) గార్ల

**నిన్ను త్రిప్పుతున్నాము. కాబట్టి నీవు ముఖాన్ని మస్జిదె హరామ్ వైపునకు త్రిప్పు, ఇకపై మీరెక్కడున్నా సరే, మీ ముఖాన్ని ఆ వైపునకు పెట్టి నమాజు చెయ్యండి."**

**(దివ్యఖుర్ఆన్ : 2-144)**

**కనుక అప్పుడు దైవప్రవక్త (స) కాబా గృహం వైపునకు ముఖం పెట్టి నమాజు చెయ్యసాగారు. బుద్ధిహీనులైన యూదులు ఇలా అనసాగారు; "వారిని తమ పూర్వపు ఖిబ్లా నుంచి ఎవరు మరల్చారు?" "ఓ ప్రవక్తా! వారితో ఇలా అను; తూర్పు, పశ్చిమ దిక్కులు రెండూ అల్లాహ్‌కే చెందుతాయి. అల్లాహ్ తాను కోరిన వారికి రుజుమార్గాన్ని చూపుతాడు. "ఒక వ్యక్తి[1] (ఖిబ్లా మార్పు జరిగినప్పుడు) దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) గారితో కలిసి నమాజు చేశాడు. నమాజు చేసిన తరువాత అతను కొంత మంది అన్సారుల వద్దకు వెళ్ళాడు. అప్పుడు వారు తమ ముఖాలను బైతుల్ మఖ్‌దిస్ వైపునకు త్రిప్పి నమాజు చేస్తున్నారు. ఆ వ్యక్తి వారిని ఉద్దేశించి ఇలా ప్రకటించాడు: "నేను సాక్ష్యమిస్తున్నాను; దైవప్రవక్త (స) గారితో కలిసి నేను ఇప్పుడే నమాజు చేసి వస్తున్నాను. ఆయన (స) గారు కాబా గృహం వైపునకు తన ముఖాన్ని త్రిప్పి మరీ నమాజు చేశారు." ఈ విషయాన్ని విని వారందరు నమాజు స్థితిలోనే కాబా గృహం వైపునకు తిరిగి నమాజు చెయ్యసాగారు.[2]**

**393. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) తన ఒంటె మీద కూర్చొని స్వారీ చేస్తూ నఫిల్ నమాజులు (అదనపు ప్రార్థనలు) చేస్తూ ఉండేవారు. అది ఏ దిక్కు వైపునకు తన ముఖాన్ని త్రిప్పితే ఆ దిక్కు వైపునకు ఆయన (స) గారిని తీసుకుపోయేది.**

---

అభిప్రాయం ఏమిటంటే, కాబా గృహం వైపునకు ముఖం పెట్టటం సరిపోతుంది. ఎందుకంటే, ఖచ్చితంగా కాబా గృహం ఉన్న స్థలం ఉన్న దిక్కుకు తిరిగి, ముఖంపెట్టటం అనేది ఇతర దేశాల ప్రజలకు చాలా కష్టమైన పని. కాని ఎవరికయితే కాబా గృహం కనిపిస్తుందో వారు మాత్రం ఖచ్చితంగా కాబా గృహం ఉన్న దిక్కు వైపునకు ముఖాన్ని పెట్టటం చాలా అవసరం.

392-1. అతని పేరు అబాద్ బిన్ బషర్ లేదా అబాద్ బిన్ నుహైక్.

392-2. వారు బనీ హారిస్ మసీదుకు చెందిన ప్రజలు. ఖుబాకు చెందిన ప్రజలకు ఈ విషయం రెండో రోజున తెలిసింది. వారు ఉదయం నమాజులో తమ ముఖాలను కాబా గృహం వైపునకు పెట్టి నమాజు చేశారు.

**దైవప్రవక్త(స) ఫర్జ్ నమాజును చెయ్యదలచినప్పుడు ఒంటెపై నుంచి కిందికి దిగి ఖిబ్లా వైపునకు తన ముఖాన్ని పెట్టి నమాజు చేసేవారు.[1]**

**394. హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) నమాజు చేయించారు. ఇబ్రాహీమ్ ఇలా అన్నారు: ఆయన (స) గారు ఆ నమాజులో ఏమన్నా పెంచారో లేక తగ్గించారో నాకైతే తెలియదు.[1] నమాజును పూర్తి చేసి సలామ్ చేసిన తరువాత ప్రజలు ఆయన(స)తో ఇలా విన్నవించుకున్నారు: "ఓ ప్రవక్తా! నమాజుకు సంబంధించి కొత్త ఆదేశం ఏదైనా వచ్చిందా?" ఆయన (స) గారు ఇలా సెలవిచ్చారు: "అదేమిటి? మీరు అలా మాట్లాడుతున్నారు." ప్రజలు ఇలా అన్నారు : "మీరు ఈ నమాజులో ఇన్ని రకాతులు చేశారు. ఇది విని దైవప్రవక్త (స) తన కాళ్లను ముడుచుకున్నారు. తరువాత ఖిబ్లా వైపునకు తన ముఖాన్ని త్రిప్పారు. ఆ తరువాత 'సహూ'కు సంబంధించిన రెండు సజ్దాలు చేశారు. ఆ తరువాత సలామ్ చేశారు. అప్పుడు మా వైపునకు తిరిగి ఇలా సెలవిచ్చారు: "ఒకవేళ నమాజును గురించి ఏదైనా కొత్త ఆజ్ఞ వస్తే నేను మీకు తప్పకుండా తెలియజేస్తాను. విషయం ఏమిటంటే, నేను కూడా మీలాంటి ఒక మనిషినే. మీరు ఎలాగయితే మరచిపోతారో నేను కూడా అలాగే మరచిపోతాను.[2] నేను గనక ఏదైనా విషయాన్ని మరచినట్లయితే అప్పుడు నాకు దానిని గురించి జ్ఞాపకం చేస్తూ ఉండండి. మీలో ఎవరైనా తమ నమాజును గురించి సంశయానికి గురి అయితే, అప్పుడు తాము నిజమని భావించిన దానిని అనుసరించాలి.[3] ఇంకా దాని ప్రకారం తమ నమాజును పూర్తి చెయ్యాలి. తరువాత సలాము చెయ్యాలి. ఇంకా 'సహూ' కు సంబంధించిన రెండు సజ్దాలు చెయ్యాలి."**

---

393-1. వితర్ మొదలైనటువంటి నఫిల్ నమాజులు వాహనం మీద కూర్చొని చెయ్యటం సరియైనదే; రుకూ, సజ్దాలను కూడా సైగల ద్వారా చేస్తే సరిపోతుంది. ఇమామ్ అబూ హనీఫా (రహ్మాలై) గారి అభిప్రాయం ప్రకారం, వితర్ నమాజును వాహనంపై చెయ్యటం సరియైనది కాదు. ఎందుకంటే, అది ఆయనగారి దృష్టిలో వాజిబ్. ఒక ఉల్లేఖనంలో ఏమని ఉందంటే, ఒంటె మీద కూర్చొని నమాజు ప్రారంభించే సమయంలో దైవప్రవక్త (స) తన ముఖాన్ని ఖిబ్లా వైపునకు పెట్టి తక్బీర్ (అంటే అల్లాహు అక్బర్) పలికేవారు.

394-1. మరొక ఉల్లేఖనంలో దైవప్రవక్త(స) మరచిపోవటం వల్ల జుహ్ర్ నమాజులో ఐదు రకాతులు చేశారు. ఈ నమాజు జుహ్ర్ నమాజు. తబ్రానీ ఉల్లేఖనంలో ఇది అస్ర్ నమాజు అని ఉంది.

## 32వ అధ్యాయం
## ఖిబ్లాను గురించి మరికొన్ని విషయాలు

**ఒకవేళ ఎవరైనా మరపు వల్ల ఖిబ్లా వైపునకు కాకుండా మరొక దిక్కునకు తిరిగి నమాజు చేసినట్లయితే అతను ఆ నమాజును తిరిగి చెయ్యవలసిన అవసరం లేదు; అంటే అది అతనిపై 'వాజిబ్' కాదు.[1] దీనికి ప్రమాణం ఏమిటంటే; దైవప్రవక్త మహనీయులు (సఅసమ్) జుహ్ర్ నమాజును రెండు రకాతులు చేసి సలాము చేశారు. తరువాత ఆయన (స) గారు తన ముఖాన్ని ప్రజల వైపునకు పెట్టి కూర్చున్నారు. ఆ తరువాత ప్రజలు నమాజులో జరిగిన పొరపాటును ఎత్తిచూపినప్పుడు లేదా జ్ఞాపకం చేసినప్పుడు ఆయన మిగతా నమాజును పూర్తి చేశారు.**

**395. హజ్రత్ ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: నేను మూడు విషయాలు చెప్పాను. నా ప్రభువు వాటి ప్రకారమే ఆజ్ఞాపించాడు. నేను దైవప్రవక్త (స)తో ఇలా అన్నాను; ఓ దైవప్రవక్తా! మనం గనక ప్రవక్త ఇబ్రాహీమ్ స్థలాన్ని నమాజు స్థలంగా చేసుకుంటే చాలా బాగుంటుంది. అప్పుడు బఖరా సూరాలోని ఈ వాక్యం అవతరించింది; "ఇబ్రాహీమ్ ఆరాధన కొరకు నిలబడిన ప్రదేశాన్ని శాశ్వతమైన నమాజు స్థలంగా చేసుకోవలసిందని ప్రజలను మేము ఆదేశించాము." ఇంకా పరదాకు సంబంధించిన వాక్యం కూడా అవతరించింది. నేను పై విధంగానే దైవప్రవక్త (స)తో**

---

394-2. దైవప్రవక్త (స)గారి స్థానం సకల మానవుల కంటే, సకల దైవదూతల కంటే కూడా పెద్దది, గొప్పది. కాని మరచిపోవటం అనేది మానవ సహజమైన గుణం. అది మనిషిని అంటిపెట్టుకుని ఉంటుంది. అతని నుంచి దూరమైపోదు.

394-3. అంటే నమ్మదగిన విషయాన్ని అవలంబించాలి. ఉదాహరణకు, నాలుగు రకాతులను గురించి సంశయం కలిగితే మూడు రకాతులను అవలంబించాలి; రెండూ లేక మూడు రకాతుల విషయంలో సందేహం కలిగినప్పుడు రెండు రకాతులను తీసుకోవాలి. ఈ హదీసు ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే; దైవప్రవక్త (స) కూడా 'సహూ'ను తప్పించుకోలేరు; ఇంకా తెలిసిన మరొక విషయం ఏమిటంటే; నమాజు పూర్తి అయిపోయింది (పూర్తి కాకపోయినా) అనే సందేహం ఒకవేళ కలిగితే అప్పుడు నమాజును తిరిగి చేసే అవసరం ఎంతమాత్రం లేదు; అది 'వాజిబ్' కూడా కాదు. ఎందుకంటే దైవప్రవక్త మహనీయులు(స) స్వయంగా తిరిగి నమాజు చెయ్యలేదు, చెయ్యమని ప్రజల్ని ఆజ్ఞాపించనూ లేదు.

32-1. ఇమామ్ అబూ హనీఫా (రహ్మలై), అహ్లె హదీస్ వారు ఈ అభిప్రాయాన్నే సమర్థిస్తారు. షాఫయి మస్లక్ వారు నమాజును తిరిగి చెయ్యటం వాజిబ్ అంటారు.

**అన్నాను; “ఓ దైవప్రవక్తా! మీరు మీ భార్యలకు పరదా చెయ్యమని ఆజ్ఞాపిస్తే ఎంతో బాగుంటుంది. ఎందుకంటే మంచివాళ్లూ, చెడ్డవాళ్లూ అందరూ వారితో మాట్లాడుతూ ఉంటారు. అప్పుడు పరదాకు సంబంధించిన వాక్యం అవతరించింది. ఒకసారి ఏమి జరిగిందంటే; దైవప్రవక్త (స) గారి భార్యలు పరస్పరం ఈర్ష్యపడటం వల్లా, మనస్పర్థల వల్లా ఆయన (స)కు వ్యతిరేకంగా ముఠా కట్టారు. (అప్పుడు) నేను వారితో అన్నాను; (బాగా తెలుసుకోండి!) ఒకవేళ దైవప్రవక్త (స) మీకు విడాకులిస్తే, ఆయన (స)కు ఆయన ప్రభువు మీకంటే ఉత్తములైన భార్యలను ప్రసాదించటం విచిత్రమైన విషయమేమీ కాదు. తరువాత నేను చెప్పిన విధంగానే ఈ భావాన్ని సూచించే వాక్యం అవతరించింది.**

**396. హజ్రత్ అనస్ (రజిఅన్) పైహదీసులో (395) ఉన్నటువంటి విషయాలనే ఉల్లేఖించారని హుమైద్ తెలిపారు.**

**397. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : ఒకసారి ఏమి జరిగిందంటే; ప్రజలు ఖుబా మసీదులో ఫజర్ నమాజును చేస్తూ ఉన్నారు. ఇంత లోనే ఒక వ్యక్తి (అబాద్ బిన్ బషర్) వచ్చాడు. అతను ఇలా అన్నాడు: “దైవప్రవక్త(స)పై గత రాత్రి ఒక ఖురాను వాక్యం అవతరించింది. అందులో కాబా వైపునకు ముఖంపెట్టి నమాజు చెయ్యమని ఆయన(స) గారిని ఆజ్ఞాపించటం జరిగింది.“ ఇది విని ప్రజలు నమాజులోనే తమ ముఖాలను కాబా వైపునకు త్రిప్పుకున్నారు. వారి ముఖాలు సిరియా వైపునకు తిరిగి ఉన్నాయి. తరువాత అవి కాబా వైపునకు తిరిగాయి.**[1]

---

మాలికీ మస్లక్ వారు, సమయం మిగిలి ఉంటే నమాజు తిరిగి చెయ్యటం వాజిబ్, లేకపోతే లేదు అని అంటారు.

397–1. ఇబ్నె అబీ హాతిమ్ గారి ఉల్లేఖనంలో ఇలా ఉంది; మహిళలు పురుషులు నిలబడి ఉన్న స్థలానికి వచ్చారు, పురుషులు స్త్రీలు నిలబడి ఉన్న స్థలానికి వెళ్లారు. హాఫిజ్ గారు ఇలా అన్నారు: ఈ వ్యవహారం ఎలా జరిగిదంటే; నమాజును చేయించే ఇమామ్ తాను నిలబడి ఉన్నటువంటి మసీదు ముందు భాగంలో నుంచి తిరిగి మసీదు వెనుక భాగంలోకి వచ్చేశాడు. ఎందుకంటే, ఎవరైనా మదీనా పట్టణంలో ఉండి కాబా వైపు నకు ముఖాన్ని పెట్టినట్లయితే అప్పుడు అతని వీపు బైతుల్ మఖ్దిస్ వైపునకు తిరిగి ఉంటుంది. ఇంకా ఒకవేళ ఇమామ్ తాను నిలబడి ఉన్న స్థలంలోనే ఉండి తిరిగి నట్లయితే అప్పుడు అతని వెనుక భాగంలో నమాజు శ్రేణులకు స్థలం ఉండదు కదా!

**398. హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) మరపు వల్ల (పొరపాటువల్ల) జుహ్ర్ నమాజులో ఐదు రకాతులు చేశారు. అప్పుడు ప్రజలు; "ఓ ప్రవక్తా! నమాజు రకాతులు పెంచబడ్డాయా?" అని అడిగారు. దానికి సమాధానంగా ఆయన (స) 'ఏమిటి మీరు చెప్తున్నది?' అని అడిగారు. వారు, 'మీరు నమాజులో ఐదు రకాతులు చేశారు' అని చెప్పారు. ఈ విషయాన్ని విని ఆయన (స) గారు తన కాళ్లను త్రిప్పు కున్నారు. మరియు 'సహూ'కు సంబంధించిన రెండు సజ్దాలను చేశారు.[1]**

## 33వ అధ్యాయం

## మసీదులో ఎక్కడైనా ఉమ్మి తగిలి ఉంటే దానిని చేత్తో రుద్ది తీసివేయటం.

**399. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (స) ఖిబ్లా వైపు ఉన్నటువంటి మసీదులోని గోడ మీద ఉమ్మివేసి ఉండటాన్ని చూశారు. ఆయన (స) గారికి ఇది అసహ్యకరమైనదిగా తోచింది. చివరకు ఆయన(స) గారి ముఖం మీద అసహనం, ఆగ్రహం కనిపించాయి.[1] తరువాత ఆయన(స) గారు నిలబడి తన చేత్తో దానిని రుద్ది తీసిపారేశారు. ఆ తరువాత ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు : "మీలో ఎవరైనా నమాజు కోసం**

---

ఇమామ్ మసీదు వెనుక భాగంలోకి తిరిగి వెళ్లినప్పుడు పురుషులు కూడా అతనితోపాటు తిరిగి వెళ్ళారు. స్త్రీలు కూడా తిరిగి వెళ్ళారు. చివరకు వారు పురుషుల వెనుకకు చేరి పోయారు. ఇది ఏకాగ్రతను చెడగొట్టే పెద్ద పనే. కాని బహుశా ఆ కాలంలో ఇది నమాజులో నిషేధించబడలేదేమో! లేదా అవసరం కారణంగా క్షమార్హమైన చర్య ఏమో! తేలునూ, పామునూ నమాజులో ఉండి కూడా చంపటం క్షమార్హమైన విధంగానే.

398-1. ఇంతకు ముందు వచ్చిన హదీసు ద్వారా తేటతెల్లమైన విషయం ఏమిటంటే, సహాబా (ర) నమాజులోని కొంత భాగాన్ని కాబా వైపునకు వీపు పెట్టి చేశారు; అయినా దానిని వారు మళ్లీ తిరిగి చెయ్యలేదు. ఇప్పుడు ఈ హదీసు ద్వారా విశదమైన విషయం ఏమిటంటే; దైవప్రవక్త (స) మరచిపోయిన కారణంగా ప్రజల వైపునకు ముఖాన్ని త్రిప్పారు. మరియు కాబా వైపునకు వీపును పెట్టారు. కాని నమాజును తిరిగి చెయ్యలేదు. అధ్యాయంలోని ప్రధాన విషయం ఇదే.

399-1. నిసాయి ఉల్లేఖనంలో ఆయన (స) గారి ముఖారవిందం కోపంతో కందిపోయింది.

**నిలబడినప్పుడు అతను తన ప్రభువును రహస్యంగా వేడుకుంటాడు.” లేదా ఆయన(స) ఇలా అన్నారు : అతని ప్రభువు[2] అతనికీ, ఖిబ్లాకూ మధ్య ఉంటాడు. కనుక మీలో ఎవరైనా (నమాజులో) తమ ఖిబ్లా వైపునకు ఉమ్మి వేయకూడదు. అయితే ఎడమ వైపునకూ లేదా తన కాలి క్రింద ఉమ్మివేయవచ్చు. తరువాత ఆయన(స) తమ దుప్పటి చివరిభాగంలో ఉమ్మివేశారు. తరువాత దానిని పైకీ, కిందికీ మడిచారు. 'ఇలా చెయ్యండి'[3] అని సెలవిచ్చారు.**

**400. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) మసీదులోని ఖిబ్లా వైపునకు ఉన్నటువంటి ఒక గోడ మీద ఎవరో ఉమ్మివేసి ఉండటాన్ని గమనించారు. ఆయన (స) దానిని గోకి తీసి పారేశారు. తరువాత ప్రజల వైపునకు తిరిగి వారిని ఉద్దేశించి ఇలా అన్నారు: “మీలో ఎవరైనా నమాజు చేస్తూ ఉన్నప్పుడు తన ముఖానికి ముందు భాగంలో ఉమ్మి వేయరాదు. ఎందుకంటే, నమాజులో ముఖానికి ఎదురుగా మహోన్నతుడూ, అత్యంత గౌరవప్రదుడు అయిన అల్లాహ్ ఉంటాడు.”[1]**

---

399-2. ఇది ఉల్లేఖకునికి కలిగిన అనుమానం. ఈ హదీసును జహ్మియా వర్గం వారు కొందరు, 'అల్లాహ్ ప్రతి చోటా ప్రతి ఇంట్లో ఉన్నాడు' (అల్లాహ్ శరణు) అనే విషయానికి ఆధారంగా తీసుకున్నారు. కాని స్వయంగా ఈ హదీసే వారి ఈ వివరణ తప్పు అని కొట్టి పారేస్తుంది. ఎందుకంటే, ఒకవేళ అల్లాహ్ ప్రతిచోటా, ప్రతి గృహంలో ఉంటే, ఎడమవైపునా, కాళ్ల క్రిందా ఉమ్మి వేయటం కూడా నిషేధించబడి ఉండేది. అహ్లె హదీస్ వారూ, ఇమాములు అందరూ, అహ్లె సున్నత్ వర్గం వారూ, అందరూ ఏకాభిప్రాయం కలిగి ఉన్న విషయం ఏమిటంటే; కరుణామయుడు, అత్యంత పరిశుద్ధుడు అయినటువంటి అల్లాహ్ మహోన్నతమైన ఆకాశంలో పీఠం మీద (సింహాసనంపై) కూర్చొని ఉన్నాడు; ఆయనకు సంబంధించిన జ్ఞానం, ఆయన శక్తీ, ఆయన జ్ఞానం ప్రతీచోట గోచరిస్తాయి. ఇంకా ఈ హదీసుకు సంబంధించిన వ్యాఖ్యానం మరొక హదీసు ద్వారా మనకు లభిస్తుంది. ఆ హదీసును అహ్మద్, తిర్మిజీ లాంటి మహానుభావులు వెలికితీశారు. అందులో ఏమని ఉందంటే; అల్లాహ్ కారుణ్యం నమాజు చేసే వానికి తోడుగా ఉంటుంది.

399-3. అంటే దుప్పటి మీద ఉమ్మివేసి దానిని పైకీ, కిందకూ మడిచి ఉమ్మిని తుడిచి పారేశారు. ఆయన (స) గారు ఇలా చేసి క్రియాత్మకంగా విషయాన్ని బోధించారు. ఎందుకంటే పనిచేసి ప్రదర్శించటం వల్ల విషయం చక్కగా అర్థమవుతుంది.

400-1. నమాజులో దాసుడు రాజాధిరాజు అయిన తన ప్రభువు ముందు నిలబడి

**401.** విశ్వాసుల తల్లి అయినటువంటి హ॥జ్రత్ ఆయెషా సిద్దీఖా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు : దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) మసీదులోని ఖిబ్లా వైపున ఉన్నటువంటి ఒక గోడ మీద చీమిడినీ లేదా ఉమ్మినీ లేదా కఫమునూ (కళ్లెనూ) ఉన్నట్లు గమనించారు. తరువాత దానిని గోకి తీసిపారేశారు.

## 34వ అధ్యాయం

**మసీదులోని చీమిడిని గులకరాయితో గీకి తీసిపారెయ్యటం. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : "ఒకవేళ నీవు తడిగా ఉన్నటువంటి అశుద్ధత మీద నడిస్తే దానిని కడిగిపారెయ్యి; పొడిగా ఉన్నటువంటి అశుద్ధత మీద నడిస్తే దానిని కడిగేసే అవసరం లేదు."**

**402.** అబూ హురైరా (రజిఅన్), అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) ఉభయులూ ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఒకసారి మసీదు గోడపై మనిషి ఊసిన కళ్లె (కఫము)ను చూశారు. అప్పుడు ఆయన (స) గారు ఒక కంకరరాయిని తీసుకుని ఆ కళ్లెను గీకి పారేశారు. ఆ తరువాత ఆయన (స)గారు ఇలా సెలవిచ్చారు: "మీలో ఎవరైనా కాండ్రించి కళ్లెను తీసి నప్పుడు అతను తన ముఖానికి ముందు భాగంలో ఆ కళ్లెను ఉయ్యకూడదు. ఇంకా దానిని తన కుడి వైపు కూడా ఊయకూడదు. కాని అతను తన ఎడమ వైపు భాగంలో గానీ లేదా తన ఎడమ పాదం క్రిందగానీ ఊయవచ్చు."[1]

## 35వ అధ్యాయం

**నమాజు చేసేటప్పుడు మనిషి తన కుడి వైపు భాగంలో ఉమ్మివేయకూడదు.**

**403.** అబూ హురైరా (రజిఅన్), అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్)

---

ఉంటాడు; వెక్కి వెక్కి ఏడుస్తూ ఉంటాడు. వినయ వినమ్రతలతో వేడుకుంటూ ఉంటాడు. అలాంటి స్థితిలో ముందు భాగంలో ఉమ్మివేయటం ఎంతో అమర్యాద కరమైన చర్య. మహోన్నతుడైన అల్లాహ్ పైఆకాశంలో సింహాసనం మీద ఆసీనుడై ఉండి కూడా నమాజు చేసే తన దాసుని ముందు ఉంటాడు. ఎందుకంటే, ఆకాశమూ, భూమీ, విశ్వం మొత్తమూ ఆయన ఔన్నత్యం, ఆయన దర్పం ముందు ఒక చిన్న బంతి కంటే కూడా అల్పమైనవే, అధమమైనవే.

402-1. వాస్తవానికి అధ్యాయంలో చీమిడిని గురించి ప్రస్తావించటం జరిగింది. కాని హదీసులో కళ్లెను గురించి ప్రస్తావించటం జరిగింది. అయితే ఈ రెండూ మనిషి శరీరం నుంచి విసర్జింపబడిన అశుద్ధ, వ్యర్థ పదార్థాలే. కనుక రెండింటికీ ఒకే ఆజ్ఞ వర్తిస్తుంది.

**ఉభయులూ ఇలా వివరించారు : దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఒకసారి మసీదు గోడపై మనిషి ఊసిన కళ్ళెను (కఫమును) చూశారు. అప్పుడు ఆయన(స) ఒక కంకర రాయిని తీసుకుని ఆ కళ్ళెను గీకి పారేశారు. ఆ తరువాత ఆయన(స) ఇలా సెలవిచ్చారు; మీలో ఎవరైనా కాం(డ్రించి కళ్లెను తీసినప్పుడు అతను తన ముఖానికి ముందు భాగంలో ఆ కళ్లెను ఉయ్యకూడదు. ఇంకా దానిని తన కుడివైపు కూడా ఊయకూడదు. అయితే అతను తన ఎడమవైపు భాగంలో గానీ లేదా తన ఎడమ పాదం క్రింద గానీ ఊయవచ్చు.**[1]

**404. దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అనస్ (రజిఅన్) ఉల్లేఖించారు: మీలో ఎవరైనా సరే తమ ముందు భాగంలో ఉమ్మి వేయకూడదు. ఇంకా తమ కుడి వైపు భాగంలో కూడా ఉమ్మివేయకూడదు. అయితే ఎడమ వైపు భాగంలో గానీ లేదా ఎడమ కాలు క్రిందగానీ ఉమ్మివేయవచ్చు.**

## 36వ అధ్యాయం

## ఎడమ వైపు లేదా ఎడమ కాలు క్రిందా ఉమ్మివేయవచ్చు.

**405. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఉల్లేఖించారు: ఒక ముస్లిమ్ నమాజులో ఉన్నప్పుడు తన ప్రభువుతో మెల్లగా విన్నపాలు చేసుకుంటాడు. కనుక అతను తన ముందు భాగంలోగానీ, తన కుడి వైపున గానీ ఉమ్మివేయకూడదు. అయితే అతను తన ఎడమ వైపు గానీ, తన ఎడమ కాలు క్రిందగానీ ఉమ్మి వేయవచ్చు.**

---

403-1. ఈ అధ్యాయంలో ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారు ప్రతిపాదించిన హదీసులో నమాజు షరతు ప్రస్తావించబడలేదు. కాని ముందు రాబోయే అధ్యాయంలో ఆదమ్ బిన్ అబీ అయాస్ గారి ఉల్లేఖనంతో తీసుకువచ్చిన ఈ హదీసులోనే నమాజుకు సంబంధించిన షరతు ఉంది. ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారి సంప్రదాయం ఏమిటంటే, ఆయన ఒక హదీసును ఉదాహరిస్తారు. కాని దానిని మరొక పద్ధతిలో తన వాదనకు, తన తర్కానికి ప్రమాణంగా చూపిస్తారు. ఇక్కడ బహుశా ఆయన గారి ఉద్దేశ్యం ఇది కావచ్చు; ఈ నిషేధం నమాజుకే ప్రత్యేకమైనది, పరిమితమైనది. నవవీ (రహ్మాలై) గారు ఏమన్నారంటే; ఈ నిషేధం ఎలాంటి మినహాయింపు లేనటువంటిది, తిరుగులేనిది. నమాజులో ఉన్నా లేకపోయినా, మసీదులో ఉన్నా లేకపోయినా, ఇది అన్ని సందర్భాలకు వర్తిస్తుంది.

**406.** అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఒకసారి మసీదులోని ఖిబ్లా దిక్కులో ఉన్నటువంటి గోడ మీద ఎవరో ఉమ్మివేసిన కళ్లె ఉండటాన్ని గమనించారు. అప్పుడు ఆయన (స) గారు ఒక కంకర రాయిని తీసుకుని ఆ కళ్లెను గీకిపారేశారు. ఆ తరు వాత ముందు భాగంలోగానీ, కుడి వైపున గానీ ఉమ్మి వేయవద్దని బోధించారు. అయితే ఎడమ వైపున గానీ లేదా ఎడమ కాలు క్రిందగానీ ఉమ్మివేసే అనుమతిని ఇచ్చారు.

## 37వ అధ్యాయం

## మసీదులో ఉమ్మివేసిన దానికి పరిహారం.

**407.** దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఉల్లేఖించారు: "మసీదులో ఉమ్మివేయటం పాపం. దానికి పరిహారం ఆ ఉమ్మిని భూమిలో పూడ్చిపెట్టటమే."[1]

## 38వ అధ్యాయం

## కాండ్రించి ఉమ్మివేసే కళ్లెను మసీదులో పూడ్చిపెట్టుట.

**408.** దైవప్రవక్త మహనీయులు ఇలా సెలవిచ్చారని అబూహురైరా (రజిఅన్) ఉల్లేఖించారు: మీలో ఎవరైనా నమాజు కోసం నిలబడినప్పుడు అతను తన ముందు భాగంలో ఉమ్మి వెయ్యకూడదు. ఎందుకంటే అతను తాను నమాజు చేసే స్థలంలో ఉన్నంత వరకు అల్లాహ్‌తో రహస్యంగా ఊసులాడతాడు.[1] ఇంకా అతను తన కుడి వైపు ఉన్నటువంటి స్థలంలో కూడా ఉమ్మివెయ్యకూడదు. ఎందుకంటే, అతని కుడి

---

407-1. ఒకవేళ మసీదు ఆవరణం మట్టిదై ఉంటే, అందులో మట్టిగానీ లేదా చిన్న చిన్న కంకర రాళ్లు ఉన్నట్లయితే అప్పుడు ఉమ్మిని వాటి క్రింద పూడ్చవచ్చు. ఒకవేళ మసీదు ప్రాంగణం గట్టిగా ఉన్నట్లయితే లేదా నాపరాళ్లు పేర్చబడి ఉన్నట్లయితే అప్పుడు గుడ్డతో గాని, ఒక రాయితో గాని ఆ ఉమ్మిని తుడిచి బయట పారెయ్యాలి. ఈ హదీసు ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే, మసీదును పరిశుభ్రంగా ఉంచటం చాలా అవసరం.

408-1. ఈ హదీసు ద్వారా స్పష్టమయ్యే విషయం ఏమిటంటే; నమాజు చేసే స్థితిలో ఉన్నప్పుడు అలా చెయ్యటం నిషిద్ధం. కాని ఇమామ్ అహ్మద్ (రహ్మలై) గారు సాద్ బిన్ అబీ వఖాస్ (ర) నుంచి ఒక విషయాన్ని తీసుకున్నారు. అదేమిటంటే; ఏ మనిషికైనా మసీదులో ఉన్నప్పుడు కళ్లె లేక కఫము వస్తే అతను దానిని భూమిలో పూడ్చిపెట్టాలి. ఎందుకంటే, అది ఏ ముస్లిమ్ భక్తుని శరీరానికైనా లేదా అతని

వైపున దైవదూత ఉంటాడు. అయితే అతను తనకు ఎడమవైపున ఉన్నటువంటి స్థలంలోగానీ లేదా తన పాదాల క్రిందగానీ ఉమ్మి వెయ్యవచ్చు. తరువాత ఆ ఉమ్మిని అదిమి పారెయ్యాలి.[2]

## 39వ అధ్యాయం

**ఒకవేళ అకస్మాత్తుగా ఉమ్మివస్తే దానిని ఆపటం కష్టమైతే, నమాజులో ఉన్న వ్యక్తి తాను ధరించిన వస్త్రంలోని చివరి భాగంలో ఉమ్మివెయ్యవచ్చు.**

**409.** హజ్రత్ అనస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) మసీదులో ఖిబ్లా దిక్కులో ఉన్నటువంటి గోడ మీద ఊయబడి ఉన్న కళ్లెను చూశారు. తరువాత ఆయన(స) గారు తన చేత్తో దానిని గీకి తీసిపారేశారు. ఇంకా ఆ విధంగా ఉమ్మి వేయటాన్ని దైవప్రవక్త(స) అసహ్యించు కున్నారు, అయిష్టతను వ్యక్తం చేశారు. ఆయన(స) గారి ముఖం మీద ఆగ్రహ సూచనలను ప్రజలు చూశారు. ఇంకా ఆయన(స) దానిని చాలా చెడ్డ విషయంగా భావించారు. దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: మీలో ఎవరైనా నమాజు చేస్తూ ఉన్నారు అంటే అతను తన ప్రభువుతో రహస్యంగా మాట్లాడుతున్నాడన్నమాట. లేదా అతని ప్రభువు అతనికీ, ఖిబ్లా దిక్కుకూ మధ్య ఉన్నాడన్న మాట. కనుక తన ముందు భాగంలో ఖిబ్లా వైపు ఉమ్మివేయరాదు. అయితే ఎడమ వైపు స్థలంలోనైనా లేదా తన పాదాల క్రిందనైనా ఊయవచ్చు." తరువాత ఆయన (స) గారు తన దుప్పటి చివరి భాగాన్ని తీసుకుని అందులో ఉమ్మివేశారు. దానిని పైకీ కిందికీ నలిపారు; "మీరు కూడా ఇలా చెయ్యండి" అని సెలవిచ్చారు.

## 40వ అధ్యాయం

**నమాజును చక్కగా, షరీఅత్ ప్రకారం చెయ్యమని ఇమామ్ ప్రజలకు హితబోధ చెయ్యటం, ఖిబ్లాకు సంబంధించిన ప్రస్తావన.**

**410.** దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు: "నా ముఖం ఖిబ్లా వైపునకు ఉందనీ, నేను మిమ్మల్ని చూడటం లేదనీ మీరు అనుకుంటున్నారా? అల్లాహ్‌పై ప్రమాణం చేసి చెబుతున్నాను; వినండి. మీరు చేసే సజ్‌దాగానీ, మీరు చేసే రుకూగానీ నాకు

---

బట్టలకైనా తగిలి అతనికి కష్టం కలగకూడదని. దీని ద్వారా తెలిసిందేమిటంటే, ఏ స్థితిలోనైనా అలా చెయ్యటం నిషిద్ధమే.

408-2. అంటే భూమిలో పూడ్చిపెట్టటం.

**కనిపించకుండా ఏమీ లేవు. నేను నా వీపు వెనుక భాగం నుంచి మిమ్మల్ని చూస్తూనే ఉన్నాను."[1]**

**411. అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : "ఒకసారి దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) మా చేత ఒక నమాజును చేయించారు (అంటే నమాజుకు నాయకత్వం వహించారు). తరువాత ఆయన(స) బల్లపైకి ఎక్కారు. ఆ తరువాత నమాజును గురించీ, రుకూను గురించీ ఇలా సెలవిచ్చారు; నేను మిమ్మల్ని ముందు నుంచి ఎలా చూస్తానో, వెనుక నుంచి కూడా అలానే చూస్తాను."**

## 41వ అధ్యాయం

## ఈ మసీదు ఫలానా వారి మసీదు అని అనవచ్చునా?[1]

**412. అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఉల్లేఖించారు : దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) పందెం కోసం శిక్షణ ఇవ్వబడినటువంటి గుర్రాల పందెపు పరుగును 'అల్ హఫ్యా' నుంచి చివరి స్థలమైన 'సనియ్యతుల్**

---

410-1. ఈ విషయంలో పండితుల మధ్య భేదాభిప్రాయం ఉంది. కొందరు ఏమన్నారంటే, చూడటం అంటే జ్ఞానం అని భావం; దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (స) గారికి వహీ (దైవవాణి) ద్వారా గానీ లేదా ఇల్హామ్ (దైవప్రేరణ) ద్వారాగానీ, ప్రజల స్థితిగతులు తెలిసిపోతాయి. ఇంకా కొందరు పండితులు ఏమన్నారంటే; ఇది ఆయన (స) గారికి అల్లాహ్ ప్రసాదించిన మహిమ. దాని కారణంగా ఆయన (స) గారికి తన వీపు వెనుక జరిగే విషయాలన్నీ తన ముందు జరుగుతూ ఉన్నట్లుగా కనిపిస్తాయి. ఇమామ్ బుఖారీ (రహ్మాలై), ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మాలై) గార్ల అభిప్రాయం కూడా ఇదే. 'ముచాహిబె లుద్నియా'లో ఇలా ఉంది; దైవప్రవక్త (స) గారి రెండు భుజాల మధ్య భాగంలో సూది రంధ్రంలాంటి రెండు కళ్ళు ఉన్నాయి, వాటి ద్వారా ఆయన (స) గారు తన వీపు వెనుక భాగంలోని విషయాలను చూస్తారు; వల్లాహు ఆలమ్ (అల్లాహ్‌కు మాత్రమే తెలుసు).

411-1. ఇబ్నె అబీ షైబా గారు ఇబ్రాహీమ్ నఖ్యీ గారి నుంచి ఈ విషయాన్ని తీసుకున్నారు; ఆయన గారు, ఇది ఫలానా వ్యక్తికి చెందిన మసీదు అని చెప్పటాన్ని అయుక్తమైనదిగా, చెడ్డదిగా భావించేవారు. ఎందుకంటే, మసీదులన్నీ అల్లాహ్‌కే చెందుతాయి. ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారు ఈ అధ్యాయంలో ఉదాహరించిన హదీసు ద్వారా ఫలానా వారి మసీదు అని అనటంలో తప్పులేదు అని నిరూపించారు.

వదా' వరకు గల దూరాన్ని నిర్ణయించారు.[1] పందెం కోసం తయారు చేయబడనటు వంటి గుర్రాల పందెపు పరుగును 'సనియ్యతుల్ వదా' నుంచి 'బనీ జురైఖ్' మసీదు వరకు గల దూరాన్ని నిర్ణయించారు.[2] అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఈ గుర్రపు పందాలలో పాల్గొన్న వారిలో ఉన్నారు.

## 42వ అధ్యాయం

### మసీదులో ధనం పంచిపెట్టటం మరియు మసీదులో ఖర్జూరపు గెలను వ్రేలాడ గట్టటం.

**413.** హజ్రత్ అనస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: బహ్రైన్ పట్టణం నుంచి దైవప్రవక్త (సఅసమ్) గారి వద్దకు ధనం వచ్చింది. ఆయన (స) గారు ఆ ధనాన్ని మసీదులోనే ఉంచవలసిందిగా ఆజ్ఞాపించారు. దైవప్రవక్త (స) గారి వద్దకు ఇంత వరకు వచ్చిన ధనం కంటే ఈ ధనం చాలా ఎక్కువ. తరువాత ఆయన (స) గారు నమాజు కోసం వెళ్ళిపోయారు; ఆ ధనాన్ని ఆయన (స) కన్నెత్తి కూడా చూడలేదు. నమాజును ముగించుకుని ఆయన(స) తిరిగి వచ్చి ఆ ధనరాశి వద్ద ఆసీనులయ్యారు. తనకు కనిపించిన ప్రతి మనిషికీ ఆయన(స) ఆ ధనాన్ని పంచిపెట్టసాగారు. ఇంతలోనే హజ్రత్ అబ్బాస్ (ర) అక్కడకు వచ్చి, "ఓ దైవప్రవక్తా! నాకూ ఆ ధనం ఇవ్వండి" అని అడిగారు. నేను బదర్ సంగ్రామంలో నా కోసం, అఖీల్ కోసం 'ఫిదియా' (విమోచన పరిహారం)ను ఇచ్చాను. దానికి దైవప్రవక్త (స), 'తీసుకోండి' అని సెలవిచ్చారు. అప్పుడు ఆయన తన చేతుల్లో పట్టినంత ధనాన్ని తీసుకొని ఎన్నో సార్లు తన వస్త్రంలో పోసుకున్నారు. తరువాత ఆ వస్త్రాన్ని ఎత్తుకోవటానికి ప్రయత్నించారు. కాని ఎత్తుకోలేకపోయారు. ఆయన దైవప్రవక్త (స)ను ఉద్దేశించి ఇలా అన్నారు: 'ఓ దైవప్రవక్తా! ఈ మూటను ఎత్తి నా శిరస్సు మీద పెట్టమని ఎవరినైనా ఆజ్ఞాపించండి.' దానికి సమాధానంగా దైవప్రవక్త(స) 'లేదు ఇది సాధ్యపడదు' అని

---

ఎందుకంటే, ఇది ఫలానా వారి మసీదు అని అంటే అది అతని ఆస్తి అని అర్థం కాదు. అది కేవలం గుర్తింపుకు మాత్రమే వర్తిస్తుంది. ఉపయోగపడుతుంది.

412-1. అల్ హఫ్యా, సన్నియ్యతుల్ వదా – ఈ రెండూ స్థలాల పేర్లు. వాటి మధ్య ఐదు లేక ఆరు లేక ఏడు మైళ్ల దూరం ఉంటుంది.

412-2. అధ్యాయంలోని ప్రధానమైన విషయం మనకు ఇక్కడ్డే లభిస్తుంది. ఎందుకంటే, ఈ మసీదును 'బనీ జురైఖ్ మసీదు' అని అనటం జరిగింది.

సెలవిచ్చారు. అప్పుడు హజ్రత్ అబ్బాస్(ర), "అలాగయితే స్వయంగా మీరే దీన్ని ఎత్తి నా మీద పెట్టండి" అని అడిగారు. దైవప్రవక్త (స) 'లేదు' 'ఇది కూడా సాధ్యం కాని విషయమే' అని అన్నారు. చివరకు హజ్రత్ అబ్బాస్ (ర) ఆ మూటలో నుంచి కొంత ధనాన్ని తీసివేశారు. తరువాత ఆ మూటను ఎత్తుకోవటానికి ప్రయత్నించారు. కాని దానిని లేపుకోలేకపోయారు. మళ్లీ ఇలా అనసాగారు : 'ఓ దైవప్రవక్తా! నాకు సహాయపడమని ఎవరినైనా ఆదేశించండి.' దానికి జవాబుగా ఆయన (స), 'ఇది సాధ్యం కాదు' అని అన్నారు. అప్పుడు హజ్రత్ అబ్బాస్ (ర)[1] ఇలా అన్నారు; 'అయితే మీరే స్వయంగా ఈ మూటను ఎత్తటంలో నాకు సహాయ పడండి.' దైవప్రవక్త (స), 'లేదు, ఇది సాధ్యం కాని విషయం' అని అన్నారు. చివరకు ఆయన (ర) మరికొంత ధనాన్ని ఆ మూటలో నుంచి తీసివేశారు. తరువాత ఆ మూటను ఎత్తకుని తన భుజాలపై పెట్టుకుని వెళ్ళిపోయారు. దైవప్రవక్త(స) హజ్రత్ అబ్బాస్ (ర) కనుమరుగైపోయేవరకు ఆయన్ని చూస్తూనే ఉండిపోయారు. ఇంకా ఆయన(స) హజ్రత్ అబ్బాస్(ర) గారి అత్యాశ చూసి ఆశ్చర్యచకితులయ్యారు. చివరి రూపాయిని సయితం పంచిపెట్టే వరకు ఆయన (స) అక్కణ్ణుంచి లేవలేదు.

## 43వ అధ్యాయం

### భోజనానికి రమ్మని మసీదులో ఆహ్వానించటం; ఆ ఆహ్వానాన్ని అంగీకరించటం.

**414.** హజ్రత్ అనస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: నేను దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్)ను మసీదులో చూశాను. ఆయన (స) అక్కడ కూర్చొని ఉన్నారు. ఆయన (స) దగ్గర కొంతమంది ప్రజలు కూడా కూర్చొని ఉన్నారు. ఈ పరిస్థితిని గమనించి నేను లేచి నిలబడ్డాను.[1] దైవప్రవక్త (స) నన్ను చూసి, 'నిన్ను అబూతల్హా ఇక్కడకు పంపారా?' అని అడిగారు. దానికి సమాధానంగా నేను, 'అవును దైవప్రవక్తా!' అని చెప్పాను. ఆయన (స) గారు, 'భోజనానికి రమ్మని అతను పిలిచారా?' అని అడిగారు. నేను, 'అవును, దైవప్రవక్తా!' అని చెప్పాను. అప్పుడు ఆయన (స) గారు తన చుట్టూ కూర్చొని ఉన్న ప్రజలను ఉద్దేశించి 'లేవండి' అని అన్నారు. తరువాత ఆయన (స) గారు బయలుదేరారు. నేను, వారందరికీ ముందు నడిచాను.[2]

---

414–1. అంతమంది ప్రజల సమక్షంలో దైవప్రవక్త (స) గారికి భోజనానికి రమ్మని ఎలా ఆహ్వానించాలి? అని హజ్రత్ అనస్(ర) మధనపడ్డారు. ఇంకా దైవప్రవక్త (స) తనతోపాటు అక్కడ ఉన్న వారందరినీ పిలుచుకువస్తారేమో, అన్నం సరిపోదేమో, తక్కువ పడుతుందేమో అని భయపడ్డారు.

## 44వ అధ్యాయం

## మస్జిద్‌లో తీర్పు చెప్పడం. 'లిఆన్' చేయించడం

**415. సహల్ బిన్ సాద్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఒక వ్యక్తి దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్)ను ఇలా అడిగాడు:"ఓ దైవప్రవక్తా! ఏ వ్యక్తి అయినా తన భార్యతో పరాయి పురుషుడు వ్యభిచారం చేస్తూ ఉండగా చూసినట్లయితే అతను ఏమి చెయ్యాలో చెప్పండి. అతను ఆ పరాయి పురుషుణ్ణి హతమార్చవచ్చునా?" చివరకు అతన్ని, అతని భార్యనూ మసీదులో 'లిఆన్' (శాప ప్రమాణం) చేస్తూ ఉండగా నేను చూశాను.**[1]

## 45వ అధ్యాయం

## ఇతరుల ఇంట్లోకి వెళ్లినప్పుడు తాను కోరిన చోట లేదా ఇంటి యజమాని

---

414-2. ఇక్కడ ఇమామ్ బుఖారీ (రహ్మలై) ఈ హదీసును సంక్షిప్తం చేశారు. పూర్తి హదీసు ఇన్షాఅల్లాహ్ ముందు రాబోయే అధ్యాయాల్లో వస్తుంది. హజ్రత్ అనస్ (ర) ముందే పరుగెత్తుకుంటూ ఎందుకు పోయారంటే, దైవప్రవక్త(స) ఇంత మంది మనుషుల్ని తీసుకుని వస్తున్నారని అబూ తల్హాకు చెబుదామని. హజ్రత్ అనస్ (ర) మసీదులో భోజనానికి రమ్మని దైవప్రవక్త(స)ను ఆహ్వానించారు. ఆయన (స) గారు మసీదులోనే ఆ ఆహ్వానాన్ని అంగీకరించారు. అధ్యాయంలోని ప్రధానమైన విషయం ఇదే.

415-1. ఈ హదీసుకు సంబంధించిన పూర్తి వాదనలు ఇన్షాఅల్లాహ్ 'లిఆన్ గ్రంథం'లో వస్తాయి. లిఆన్ అంటే ఏమిటంటే, ఒక భర్త తన భార్య మీద వ్యభిచార నేరాన్ని మోపినప్పుడు, దానికి సాక్షులు ఎవరూ లేని పక్షంలో మొదట భర్త చేత నాలుగుసార్లు ప్రమాణం చేయిస్తారు. తరువాత అతని భార్యతో కూడా నాలుగు సార్లు ప్రమాణం చేయిస్తారు. మసీదులో తీర్పులు చెప్పటం ధర్మసమ్మతమైన విషయమే. ఇంకా ఇదే సరియైన పద్ధతి అని ఈ అధ్యాయం ద్వారా స్పష్టమైపోయింది.

45-1. అంటే నేను ఎక్కడ నమాజు చెయ్యాలి? ఈ స్థలం పరిశుభ్రమైనదేనా? లేక అపరిశుభ్ర మైనదా? అనే విషయాలన్నీ హదీసుకు వ్యతిరేకమైనవి. ప్రతి స్థలమూ, ప్రతి వస్తువూ పరిశుభ్రమైనవే; అవి అశుద్ధమైనవని నమ్మకం కలిగే వరకు అవి పరిశుభ్రమైనవే. అధ్యాయంలోని భావం హదీసు ద్వారా ఎలా స్పష్టమవుతుందంటే, దైవప్రవక్త (స) ఇత్‌బాన్ బిన్ మాలిక్‌తో ఇలా అన్నారు; 'నీవు ఎక్కడ నమాజు చెయ్యమంటే నేను అక్కడ చేస్తాను'. ఆయన (స) గారు ఇత్‌బాన్ బిన్ మాలిక్‌ను ఇలా అడగటానికి కారణం ఏమిటంటే, అతను దైవప్రవక్త (స) గారిని తన గృహంలోని ఒక ప్రత్యేక స్థలంలో నమాజు చెయ్యమని పిలిచారు.

**చూపించిన స్థలంలో నమాజు చేయవచ్చు?. ఆ స్థలం గురించి ఆరా తీయకూడదు.**[1]

**416.** ఇత్‌బాన్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: (అతను గ్రుడ్డి వారు). దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఒకసారి ఇత్‌బాన్ బిన్ మాలిక్ (ర) ఇంటికి వచ్చారు. అతనితో ఇలా అన్నారు: "నీవు నన్ను ఎక్కడ నమాజు చెయ్యమంటావు?" అప్పుడు అతను దైవప్రవక్త (స)కు ఫలానా స్థలంలో నమాజు చెయ్యమని చూపించారు. దైవప్రవక్త 'అల్లాహు అక్బర్' అని నమాజులో నిలబడ్డారు. మేము కూడా ఆయన (స) గారి వెనుక వరుస కట్టి నమాజులో నిలబడ్డాము. ఆయన (స) రెండు రకాతుల నఫిల్ నమాజును చేశారు.[1]

## 46వ అధ్యాయం

**గృహాలను మసీదులుగా చేసుకోవటం; బరా బిన్ ఆజిబ్ (రజిఅన్) తన గృహంలోని మసీదులో జమాఅత్ (సామూహికంగా)తో నమాజు చేశారు.**[1]

**417.** ఇత్‌బాన్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఆయన దైవప్రవక్త (స) గారి ప్రత్యక్ష సహచరులలో ఒకరు. ఇంకా ఆయన బదర్ సంగ్రామంలో పాల్గొన్నటువంటి అన్సారీ యోధులలో ఒకరు. ఆయన ఒకసారి మహనీయ ప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) వద్దకు వచ్చి ఇలా విన్నవించుకున్నారు: 'ఓ దైవప్రవక్తా! నా కంటి చూపు తగ్గిపోయినట్లు అనిపిస్తోంది.[1] నేను నా జాతి ప్రజలకు నమాజులో నాయకత్వం వహిస్తూ ఉంటాను. వర్షం కురిసినపుడు వారికీ, నాకూ మధ్య ఉన్నటువంటి కాలువ ప్రవహిస్తూ ఉంటుంది. అప్పుడు నేను ఆ కాలువ దాటి వారి మసీదుకు వెళ్లి వారికి నమాజు చేయించలేను. కనుక ఓ దైవప్రవక్తా! మీరు నా గృహానికి రావాలనీ, నా గృహంలో మీరు నమాజు చెయ్యాలనీ, మీరు నమాజు చేసిన స్థలాన్ని నమాజు చేసే ప్రార్థనా స్థలంగా తీర్చిదిద్దుకోవాలని ప్రగాఢంగా కోరుకుంటున్నాను.' ఉల్లేఖకుడు ఏమన్నారంటే; దైవప్రవక్త మహనీయులు (స), 'ఇత్‌బాన్ (ర)తో, "మంచిది, ఇన్షాఅల్లాహ్ అలాగే నీ ఇంటికి నేను వస్తాను" అని సెలవిచ్చారు. ఇత్‌బాన్ (ర) ఇలా అన్నారు; తరువాత రెండో రోజున ఉదయం పూట మహాప్రవక్త (స), హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (ర) ఉభయులూ కలసి కొంచెం పొద్దెక్కిన

416–1. నఫిల్ నమాజులను సామూహికంగా (జమాఅత్‌తో) చెయ్యవచ్చు అనే విషయం ఈ హదీసు ద్వారా తెలిసింది. ఈ హదీసుకు సంబంధించిన పూర్తి వివరాలు ముందు రాబోయే అధ్యాయాలలో వస్తాయి.

46–1. దీనిని ఇబ్నె అబీ షైబా గారు పరిగ్రహించారు.

**తరువాత నా ఇంటికి వచ్చారు. మహాప్రవక్త (స) ఇంట్లోకి ప్రవేశించటానికి అనుమతి అడిగారు. నేను ఆయన (స) గారికి అనుమతి ఇచ్చాను. అప్పుడు ఆయన (స) ఇంట్లోకి ప్రవేశించారు. ఇంకా కూర్చోనే లేదు, ఆయన (స) ఇలా అడిగారు: "నీ ఇంట్లో ఏ స్థలంలో నేను నమాజు చెయ్యటం నీకు ఇష్టం?" అప్పుడు నేను ఆయన(స) గారికి మా ఇంట్లోని ఒక మూలను చూపించాను. ఆయన (స) ఆ స్థలంలో నిలబడి 'అల్లాహు అక్బర్' అని రకాతు కట్టారు. మేము కూడా ఆయన (స) గారితో పాటు నిలబడి వరుస కట్టాము. ఆయన (స) రెండు రకాతుల నఫిల్ నమాజు చేసి సలాము చేశారు. మేము 'హలీమ్'ను తయారు చేసి మహాప్రవక్త (స)ను భోజనం చేసి వెళ్లమని ఆపాము.[2] తరువాత మా వీధిలోని చాలా మంది ప్రజలు కూడా మా ఇంట్లోకి వచ్చి సమావేశమయ్యారు. వారిలోని ఒక వ్యక్తి (అతని పేరు ఏమిటో తెలియదు); 'మాలిక్ బిన్ దుఖైషిన్ లేక ఇబ్నె దుఖ్షన్ ఎక్కడున్నాడు?' అని అడిగాడు. ఎవరో ఇలా అన్నారు; 'అతనయితే కపటి కదా! అల్లాహ్ మీద, ఆయన ప్రవక్త మీద అతనికి ప్రేమ లేదు'. దైవప్రవక్త మహనీయులు (స) ఇది విని ఇలా అన్నారు: 'అలా అనబాకు. అతను కేవలం అల్లాహ్ కోసమే, అల్లాహ్ సంతోషం పొందటం కోసమే, లా ఇలాహ ఇల్లల్లాహ్ (అల్లాహ్ తప్ప మరొక దేవుడు లేనేలేడు) అని అనటాన్ని నీవు గమనించ లేదా?' అప్పుడు ఆ వ్యక్తి ఇలా అన్నాడు: 'అల్లాహ్‌కే, ఆయన ప్రవక్తకే బాగా తెలుసు. అసలు విషయం ఏమిటంటే; పైకయితే అతను కపటుల పట్లనే ఎక్కువ శ్రద్ధ కలిగి ఉండటాన్నీ, వారితోనే ఎక్కువగా స్నేహంతో ఉండటాన్నీ మేము చూస్తున్నాము'. అప్పుడు దైవప్రవక్త మహాశయులు (స) ఇలా సెలవిచ్చారు; 'ఏ వ్యక్తి అయితే కేవలం అల్లాహ్ ప్రసన్నతను పొందే ఉద్దేశ్యంతో, లా ఇలాహ ఇల్లల్లాహ్ (అల్లాహ్ తప్ప మరొక దేవుడు లేడు) అని అంటాడో, అతనిపై మహోన్నతుడైన అల్లాహ్ నరకాగ్ని జ్వాలలను నిషేధించాడు.'**

---

417-1. బుఖారీ గారి ఒక ఉల్లేఖనంలో ఆయన అంధుడు అని వచ్చింది. అంటే బహుశా ఆయన తరువాత అంధుడైపోయివుండవచ్చు.

417-2. అంటే 'హలీమ్'ను తిని మరీ వెళ్లాలని ఆయన (స) గారిని ఆపి ఉంచాము, తిరిగి వెళ్ళనివ్వలేదు. 'ఖజీరా' అనే అరబ్బీ పదానికి 'హలీమ్' అనే పదం అనువాదం. ఖజీరా ఎలా తయారవుతుందంటే, మాంసాన్ని చిన్న చిన్న ముక్కలుగా చేస్తారు. తరువాత అందులో ఎక్కువ పరిమాణంలో నీళ్లు పోస్తారు. ఆ తరువాత దానిని పొయ్యి మీద పెడతారు. బాగా ఉడికిన తరువాత దానిపై పిండిని చల్లుతారు. ఒకవేళ మాంసం లేకుండా కేవలం పిండి మాత్రమే ఉన్నట్లయితే అప్పుడు దానిని 'అసీదా' అంటే 'హరీరా' అని అంటారు.

## 47వ అధ్యాయం

**మసీదులోకి ప్రవేశించేటప్పుడూ, ఇంకా ఇతర పనులు చేసేటప్పుడూ కుడి వైపు నుంచి ప్రారంభించటం. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (ర), మసీదులో ప్రవేశించేటప్పుడు మొదట తన కుడి పాదాన్ని పెట్టేవారు. మసీదులో నుంచి బయటికి వచ్చేటప్పుడు ఆయన మొదట తన ఎడమ కాలును పెట్టేవారు.**

**418.** హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ప్రతి పనినీ సాధ్యమైనంత వరకు కుడి వైపు నుంచే ప్రారంభించటాన్ని ఇష్టపడేవారు. ఉదాహరణకు, వుజూ చేసుకునేటప్పుడూ, తల దువ్వుకునేటప్పుడూ, చెప్పులు తొడుక్కునేటప్పుడూను.

## 48వ అధ్యాయం

అజ్ఞాన కాలం నాటి ముష్రిక్కుల సమాధులను త్రవ్వటం, వాటి స్థానంలో మసీదు కట్టటం ధర్మసమ్మతమైన విషయమే.[1] ఎందుకంటే, దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారు: అల్లాహ్ యూదులను శపించాడు; వారు తమ ప్రవక్తల సమాధులను మసీదులుగా చేసుకున్నారు.[2] సమాధుల వద్ద నమాజు చెయ్యటం అవాంఛనీయం అనే విషయం గురించిన ప్రస్తావన. ఒకసారి హజ్రత్ ఉమర్ (రజిఅన్) గారు హజ్రత్ అనస్ (రజిఅన్) గారిని ఒక సమాధి వద్ద నమాజు చేస్తూ ఉండగా చూసి, 'సమాధి' 'సమాధి'[3] అని గట్టిగా కేకవేశారు. కాని తిరిగి నమాజు చెయ్యమని ఆజ్ఞాపించలేదు.[4]

---

48–1. హాఫిజ్ గారు ఇలా అన్నారు; ఇది ముష్రిక్కుల సమాధులకే పరిమితం, ప్రత్యేకం. కాని దైవప్రవక్తల మరియు వారి విధేయుల సమాధులను త్రవ్వటం సరియైన విషయం కాదు. ఎందుకంటే, అలా చెయ్యటం వల్ల వారిని అవమానించినట్లు అవుతుంది.

48–2. ఈ హదీసును స్వయంగా ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారే 'బాబుల్ వఫాత్'లో ఉదాహరించారు. దైవప్రవక్తల సమాధులను మసీదుగా చేసుకున్న ప్రజలపై దైవశాపం విరుచుకుపడినప్పుడు – వాస్తవానికి మసీదులో అల్లాహ్‌ను ఆరాధించటం జరుగుతుంది – స్వయంగా దైవప్రవక్తల సమాధులను పూజించటం లేదా 'ఔలియాఅల్లాహ్'ల సమాధులను పూజించటం అనేది ఎంత ఎక్కువగా శాపనార్థాలకు తగినదై ఉండాలి! అల్లాహ్ మనల్ని దీని నుంచి కాపాడుగాక! ఈ కాలంలో ఈ

**419. హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: ఉమ్మె హబీబా (రజిఅన్హా), ఉమ్మె సలమా (రజిఅన్హా) గార్లు ఉభయులూ తాము అబిసీనియా దేశంలో చూసినటువంటి ఒక చర్చిని గురించి ప్రస్తావించారు. ఆ చర్చిలో విగ్రహాలు ప్రతిష్ఠిం పబడి ఉండటాన్ని కూడా వారు గమనించారు. ఈ విషయాన్నే వారు దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) గారికి చెప్పారు. దానికి సమాధానంగా ఆయన (స) గారు ఇలా సెలవిచ్చారు: ఆ దేశ ప్రజల్లో ఒక సంప్రదాయం ఉంది. దాని ప్రకారం, వారిలోని ఒక మంచి మనిషి ఎవరైనా మరణిస్తే అతని సమాధి మీద ఒక మసీదును నిర్మిస్తారు. ఇంకా అందులో ఈ విగ్రహాలను ప్రతిష్ఠిస్తారు. ప్రళయ దినం నాడు వారు అల్లాహ్ దర్బారులో అన్ని సృష్టితాలకంటే నికృష్టులుగా పరిగణింపబడుతారు.**[1]

---

ఉపద్రవం సర్వసామాన్యమై పోయింది. ప్రజలు సమాధుల వద్దకు పోయి సజ్దాలు చేస్తున్నారు. వాటి చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఇది ఖచ్చితంగా షిర్కే.

48-3. ఈ హదీసును అబూ నుఅయిమ్ గారు సంగ్రహించారు.

48-4. దీని ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే, సమాధుల వద్ద చేసే నమాజు సరియైనదే అవుతుంది. కాని అది అసహ్యాకరమైనది, అవాంఛనీయమైనది. ఇమామ్ అబూ హనీఫా (రహ్మాలై) గారు కూడా ఈ అభిప్రాయాన్నే సమర్థించారు. ఖస్తలానీ గారు ఏమన్నారంటే; సమాధి వైపు తిరిగి చేసే నమాజు గానీ లేదా సమాధి మీద చేసే నమాజు గానీ లేదా సమాధుల మధ్య చేసే నమాజుగానీ అవాంఛనీయమైనదే.

419-1. దీని ద్వారా స్పష్టంగా తెలిసిన విషయం ఏమిటంటే; పెద్దల సమాధుల మీద మసీదులు కట్టటం అనేది యూదు మతస్తుల, క్రైస్తవ మతస్తుల సంప్రదాయం. ప్రపంచంలో విగ్రహారాధనకు అంకురార్పణ ఇలాగే జరిగింది. హజ్రత్ ఆదమ్ (అలైహిస్సలామ్) గారి తరువాత ప్రజలు కొందరు ఏమి చేశారంటే; తాము ఆరాధన చేసుకునే స్థలంలో తమ పెద్దల విగ్రహాలను నిలబెట్టసాగారు. ఆ విగ్రహాలను చూసి తమలో కూడా దైవారాధనా భావం అధికంగా కలుగుతుందని వారు తలపోశారు. కాని వారు మటుకు దేవుణ్ణి మాత్రమే ఆరాధించేవారు. తరువాత వారి మరణానంతరం షైతాను వారి సంతానాన్ని పెడద్రోవ పట్టించాడు. వాడు వారికి ఇలా దుర్బోధ చేశాడు; "మీ పెద్దలు ఈ విగ్రహాలను ఎంతో గౌరవ భావంతో చూసే వారు. కనుక మీరు కూడా ఆ విగ్రహాలను గౌరవించండి." చివరకు క్రమేణా వారు ఆ విగ్రహాలను పూజించసాగారు. మన ప్రవక్త గారైతే విగ్రహారాధన మూలాలనే తెంచి పారేశారు. విగ్రహాలను చెయ్యటాన్నీ, వాటిని ప్రతిష్ఠించటాన్నీ ఆయన (స) పూర్తిగా నిషేధించారు.

**420.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) మక్కా నగరం నుంచి మదీనా పట్టణానికి విచ్చేసినప్పుడు మదీనా పట్టణంలో ఎత్తయిన ప్రదేశంలో ఉన్నటువంటి బనూ అమ్ర్ బిన్ ఔఫ్ తెగ వారి వద్ద దిగారు. అక్కడ ఆయన (స) గారు ఇరవై నాలుగు రాత్రులు బస చేశారు. తరువాత ఆయన(స) గారు బనీ నజ్జార్‌కు చెందిన ప్రజలను తన వద్దకు రమ్మని కబురు పెట్టారు.[1] వారు తమ కరవాలాలను ధరించి ఆయన (స)గారి ముందు హాజరయ్యారు. హజ్రత్ అనస్ (ర) ఇలా అన్నారు; మహాప్రవక్త (స) తమ ఒంటె మీద కూర్చొని ఉన్నారు; అబూ బకర్ (ర) దైవప్రవక్త (స) గారి వెనుక కూర్చొని ఉన్నారు. ఇంకా బనీ నజ్జార్‌కు చెందిన ప్రజలు దైవప్రవక్త(స) గారి చుట్టూతా ఉన్నారు. చివరకు ఆయన (స) గారు అబూ అయ్యూబ్ (ర) గారి ఇంటి ప్రాంగణంలో దిగిపోయారు. ఎక్కడయితే నమాజు వేళ అవుతుందో అక్కడ నమాజు చేసుకోవటం దైవప్రవక్త(స) గారికి ఎంతో ప్రియమైన విషయం. ప్రారంభంలో ఆయన(స) గారు గొర్రెల దొడ్డిలో కూడా నమాజు చేస్తూ ఉండేవారు. తరువాత ఆయన(స) గారు ఒక మసీదును నిర్మించమని ఆజ్ఞాపించారు. దీనికోసం "బనీ నజ్జార్‌కు చెందిన ప్రజలను పిలిపించారు. వారితో ఇలా అన్నారు: బనీ నజ్జార్‌కు చెందిన ప్రజలారా! మీరు ఈ తోటను మూల్యం కట్టి నాకు ఇచ్చెయ్యండి." అప్పుడు వారు ఇలా అన్నారు: లేదు, "మేము అలా చెయ్యము. అల్లాహ్ సాక్షిగా చెబుతున్నాము. మేము ఈ తోట మూల్యాన్ని అల్లాహ్ నుంచే తీసుకుంటాము." హజ్రత్ అనస్ (ర) ఇలా అన్నారు: "నేను మీకు ఒక విషయం చెప్పేదా? ఈ తోటలో ఏముంది! ముష్రిక్కుల సమాధులూ, శిథిలమైన భూమీ, కొన్ని ఖర్జూరపు చెట్లూ తప్ప." దైవప్రవక్త (స) గారి ఆజ్ఞానుసారం ముష్రిక్కుల సమాధులు త్రవ్వి పారెయ్యబడ్డాయి[2]

---

420–1. దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) గారికి బనీ నజ్జార్ తెగకు చెందిన ప్రజలతో బంధుత్వపు సంబంధాలు ఉండేవి. ఆయన (స) గారి తాతయ్య అబ్దుల్ ముత్తలిబ్ గారి మాతామహులు వారి వంశానికి చెందిన వారే. ఆ ప్రజలు కరవాలాలను ధరించి ఎందుకు వచ్చారంటే, తాము సకల విధాలా దైవప్రవక్త (స) గారికి సహాయ సహకారాలు అందించటానికి సంసిద్ధులమై ఉన్నామనీ, ఆయన (స) గారితో కలిసి శత్రువులతో పోరాడడానికీ, అవసరమయితే మరణించటానికి తయారుగా ఉన్నామనీ ఆయన (స)కు తెలిసిపోవాలని.

420–2. అధ్యాయానికి చెందిన ప్రధానాంశం ఇక్కణ్ణే ప్రస్తావించబడింది. ఇక్కడ విశదమైనటువంటి విషయం ఏమిటంటే; సమాధులను త్రవ్వి వాటిలో నుంచి

**(సమాధులలోని శవాల ఎముకలు దూరంగా పారెయ్యబడ్డాయి). ఆ తరువాత మెరక పల్లాలు ఉన్నటువంటి భూమి చదునుగా చెయ్యబడింది. ఖర్జూరపు చెట్లు నరికివేయ బడ్డాయి. వాటి మొద్దులను ఖిబ్లా దిక్కులో పేర్చటం జరిగింది. దానికి రెండువైపులా రాళ్లు అడ్డంగా పెట్టబడ్డాయి. దైవప్రవక్త(స) గారి సహచరులు కవిత్వం చదువుతూ రాళ్లను మోయసాగారు. దైవప్రవక్త(స) కూడా వారితోపాటు కవిత్వం చదువుతూ పోయారు.[3] ఆయన (స) ఇలా సెలవిస్తూ ఉండేవారు: "ఓ అల్లాహ్! ఓ మా ప్రభూ! అసలు జీవితమైతే పరలోక జీవితమే. కనుక నీవు అన్సారులనూ, విదేశీయులనూ[4] క్షమించు."**

## 49వ అధ్యాయం
## గొర్రెల దొడ్లల్లో నమాజు చెయ్యటం

**421 హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా అన్నారని అబూ తయ్యాహ్ ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గొర్రెల దొడ్లల్లో నమాజు చేసేవారు.[1] ఆ తరువాత కూడా హజ్రత్ అనస్ (ర) ఇలా అంటూ ఉండగా నేను విన్నాను. "మసీదు నిర్మాణం జరగక ముందు దైవప్రవక్త (స) గారు గొర్రెల దొడ్లల్లో నమాజు చేసేవారు."**

## 50వ అధ్యాయం
## ఒంటెల దొడ్డిలో నమాజు చెయ్యటం[1]

**422. నాఫె ఇలా ఉల్లేఖించారు: "అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) తన ఒంటె వైపునకు తిరిగి నమాజు చేస్తూ ఉండగా నేను చూశాను." అబ్దుల్లా బిన్ ఉమర్ (ర) ఏమన్నారంటే: "దైవప్రవక్త మహనీయులు (స) ఇలా చేస్తూ ఉండగా నేను చూశాను."**

---

మృతుల అస్తిపంజరాలను బయటికి తీసి ఆ ఎముకలను తీసి పారేసినప్పుడు అక్కడ ఆ స్థితిలో నమాజు చెయ్యటం సరియైనదే. ధర్మసమ్మతమైనదే.

420-3. దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారికి కవిత్వం వ్రాయటం రాదు. కాని ఆయన (స) కవిత్వాన్ని చదవగలరు.

420-4. ఇక్కడ విదేశీయులు అంటే ముహాజిర్లు అని అర్థం. వారు మక్కాకు చెందిన ప్రజలు, తమ దేశాన్ని విడిచిపెట్టి మదీనా పట్టణానికి వలస వచ్చారు.

421-1. షాఫయీ మస్లక్ వారు ఏమంటారంటే, గొర్రెల మల మూత్రాలు అశుద్ధమైనవి. గొర్రెల దొడ్లు వాటి మలమూత్రాలతో కలుషితమై ఉంటాయి. కనుక ఆ స్థలాలలో నమాజు చెయ్యకూడదు. కాని ఈ హదీసు ఈ వాదనను ఖండిస్తుంది.

50-1. ఇమామ్ మాలిక్ (రహ్మాలై) గారూ, ఇమామ్ షాఫయి (రహ్మాలై)గారూ ఒంటెల

## 51వ అధ్యాయం

**పొయ్యిగానీ లేదా అగ్ని గుండంగానీ ఇంకా ముష్రిక్కులు పూజించే ఏదైనా వస్తువుగానీ తన ముందు ఉన్న స్థితిలో ఎవరైనా ఒక వ్యక్తి నమాజు చేస్తే; కాని అతని సంకల్పం కేవలం అల్లాహ్‌ను మాత్రమే పూజించటం అయితే; (అప్పుడు అతను చేసే నమాజు సరియైనదే). జుహ్రీ ఏమన్నారంటే; దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని నాకు అనస్ బిన్ మాలిక్(ర) చెప్పారు: "నేను నమాజు చేస్తూ ఉన్నప్పుడు నా ముందుకు నరకాగ్ని తీసుకురాబడింది."[1]**

**423. హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: (ఆ రోజున) సూర్యుడికి గ్రహణం పట్టింది. దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) కుసూఫ్ నమాజ్ చేశారు. మరియు ఇలా సెలవిచ్చారు: "నమాజు చేసేటప్పుడు నాకు నరకాగ్ని[1] చూపించబడింది. ఈ రోజు చూసినంత భయంకరమైన వస్తువును నేను నా జీవితంలో ఎన్నడూ చూడలేదు."**

---

దొడ్డిలో నమాజు చెయ్యటాన్ని మక్రూహ్ అంటే అవాంఛనీయమైనది అని అన్నారు. కాని ఇమామ్ బుఖారీ (రహ్మలై) గారు వారి తీర్పును ఖండించారు. వాస్తవం ఏమిటంటే; ఒంటెల దొడ్లల్లో నమాజు చెయ్యటం నిషిద్ధం (హరామ్). ఎవరైతే అక్కడ నమాజు చేస్తారో వారు విధిగా ఆ నమాజును తిరిగి చెయ్యవలసి ఉంటుంది. ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మలై), అహ్లె హదీస్ విద్వాంసులు ఈ అభిప్రాయాన్నే బలపరుస్తున్నారు. ఇబ్నె హజమ్ గారు ఏమన్నారంటే, ఒంటెల దొడ్డిలో నమాజు చెయ్యటాన్ని నిషేధించే హదీసులు ఎక్కువగానే ఉన్నాయి; అవి కూడా ఈ అభిప్రాయాన్ని ధ్రువీకరిస్తున్నాయి, దృఢపరుస్తున్నాయి.

51–1. ఇది ఒక హదీసులోని భాగం. దానిని స్వయంగా ఇమామ్ బుఖారీ(ర) గారే ప్రస్తావించారు. ఈ హదీసు ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే; ఒకవేళ నమాజు చేసే వ్యక్తి ముందు ఈ వస్తువులు గనక ఉన్నట్లయితే అతని నమాజు ధర్మ సమ్మతమైనదే అవుతుంది. అందులో అసహ్యాత అనేది ఉండదు. కాని హనఫీ మస్లక్ విద్వాంసుల దృష్టిలో ఇది అవాంఛనీయమైనది.

423–1. ఇమామ్ బుఖారీ (రహ్మలై) గారు అధ్యాయంలోని అర్థాన్ని ఈ హదీసు ద్వారా బలపరిచారు. అంటే నమాజు చేసేటప్పుడు అగ్నిజ్వాలలు ముందు ఉండటం వల్ల నమాజు నిశ్చలతకు ఎలాంటి భంగమూ వాటిల్లదు.

## 52వ అధ్యాయం

### గోరీల మధ్యన నమాజు చెయ్యటం అసహ్యాకరమైన విషయం.[1]

**424.** దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఉల్లేఖించారు: "మీరు మీ గృహాలలో కూడా నమాజులు (నఫిల్) చేస్తూ ఉండండి. వాటిని సమాధులుగా చెయ్యకండి."[1]

## 53వ అధ్యాయం

ఎక్కడయితే భూమి కృంగిపోయిందో లేదా ఎక్కడయితే ఏదైనా శిక్ష అవతరించిందో అక్కడ నమాజు చెయ్యటం ధర్మసమ్మతమైన విషయమేనా? హజ్రత్ అలీ (రజిఅన్) బాబిలోనియాలోని భూమిపై నమాజు చెయ్యటాన్ని అసహ్యాకరమైన విషయంగా భావించారు. ఎందుకంటే అక్కడి భూమి కృంగిపోయింది.[1]

**425.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఉల్లేఖించారు: దైవశిక్షకు గురయిన ప్రజల స్థలాలలోకి ప్రవేశించకండి. ఒకవేళ ఆ ప్రదేశాల మీదుగా సాగిపోవలసి వస్తే విలపిస్తూ, అల్లాహ్‌కు భయపడుతూ వెళ్ళాలి. ఒకవేళ మీరు విలపిస్తూ వెళ్లలేకపోతే అసలు

---

52–1. ఈ అధ్యాయంలో స్పష్టమైన ఒక హదీసు ఉన్నది. అందులో ఇలా ఉంది; "నా కోసం భూమి అంతా మసీదుగా చేయబడింది, "సమాధి, స్నానాల గది" తప్ప. కాని ఈ హదీసు ఇమామ్ బుఖారి (రహ్మాలై) గారి షరతులను పూర్తి చెయ్యకపోవటం వల్ల ఆయన గారు దానిని ఇక్కడ ప్రస్తావించలేదు. ఇమామ్ అహ్మద్ బిన్ హమ్బల్ (రహ్మాలై) గారు ఏమన్నారంటే, సమాధులలో నమాజు చెయ్యటం నిషిద్ధం; అవి విశ్వాసుల సమాధులైనా, అవిశ్వాసుల సమాధులైనా. ఇమామ్ అబూ హనీఫా (రహ్మాలై), సూరీ, అవ్‌జాయీ గార్లు సమాధులలో నమాజు చెయ్యటాన్ని అసహ్యాకరమైన విషయంగా అభివర్ణించారు. కాని ఇమామ్ మాలిక్ (రహ్మాలై) గారు దానిని ధర్మసమ్మతమైన విషయంగా అభిప్రాయపడ్డారు.

424–1. అంటే సమాధులలోని శవాలు నమాజు చెయ్యవు; ఇంకా సమాధుల మధ్య నమాజులు చేయబడవు. అదే విధంగా మీ గృహాలను సమాధులుగా మార్చకండి. వాటిలో నమాజులు చెయ్యండి; నఫిల్ నమాజులుగానీ, ఇతర ఏ నమాజులైనా గానీ.

53–1. బాబిలోనియా (కూఫా పట్టణం)లోనూ, దానికి చుట్టుపక్కల్లో ఉన్నటువంటి భూమిపైనా శాపగ్రస్తుడైన నమ్రూద్ రాజు ఒక పెద్ద భవనాన్ని నిర్మించాడు. అల్లాహ్ దానిని భూమి లోపలకు కూరుకుపోయేలా చేశాడు.

**ఆ ప్రదేశాలకు వెళ్ళకండి. ఎందుకంటే వారి పైకి వచ్చినటువంటి శిక్షే మీ పైకి కూడా రావచ్చు.[1]**

## 54వ అధ్యాయం

**చర్చిలో నమాజు చేసే విషయం గురించి హజ్రత్ ఉమర్ (రజిఅన్) ఇలా అన్నారు: "ఓ క్రైస్తవులారా! మేము మీ చర్చిలలోకి ప్రవేశించము. ఎందుకంటే, వాటిలో విగ్రహాలు, చిత్రాలు ఉంటాయి".[1] హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజిఅన్) చర్చిలో నమాజు చేసేవారు. కాని విగ్రహాలు ఉన్న చర్చిలో మాత్రం కాదు.[2]**

**426. హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు: ఒకసారి హజ్రత్ బీబీ ఉమ్మె సలమా (రజిఅన్‌హా) గారు దైవప్రవక్త మహాశయులకు(స) ఒక చర్చిని గురించి చెప్పారు. ఆమె గారు దానిని ఇథియోపియా దేశంలో చూశారు. ఆ చర్చి మారియా అనే పేరుతో ప్రసిద్ధిగాంచింది. అందులో ఆమె గారు చూసినటువంటి విగ్రహాలను, చిత్రాలను గురించి ప్రస్తావించారు. అప్పుడు దైవప్రవక్త (సఅసమ్)ఇలా సెలవిచ్చారు: "వారిలోని సత్పురుషుడెవరైనా మరణిస్తే, అతని సమాధి వద్ద వారు ఒక మసీదును (ప్రార్థనాలయాన్ని) నిర్మిస్తారు. అందులో ఈ చిత్రాలను గీయిస్తారు. విగ్రహాలను ప్రతిష్ఠిస్తారు. అల్లాహ్ దృష్టిలో ఈ ప్రజలు సృష్టితాలన్నింటికంటే అధములు, నికృష్టులు".**

**427. హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా), హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజిఅన్) ఉభయులూ ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారికి చివరి ఘడియలు సమీపించినప్పుడు ఆయన (స) గారు ఒక దుప్పటిని తన ముఖం మీద కప్పుకోసాగారు. భయం కలిగినప్పుడు ఆయన (స) ఆ దుప్పటిని తన ముఖం మీద నుంచి తొలగించేవారు. ఈ స్థితిలోనే ఆయన (స) గారు ఇలా సెలవిచ్చారు: "యూదుల మీదా, క్రైస్తవుల మీదా అల్లాహ్ శాపం విరుచుకుపడుగాక! వారు తమ ప్రవక్తల సమాధులను మసీదులుగా చేసుకున్నారు." ఇంకా ఆయన (స) ఇలా సెలవిచ్చి, తన ఉమ్మత్‌ను (సంఘాన్ని) అలాంటి పనులు చెయ్యవద్దని భయపెట్టారు.[1]**

---

425-1. ఈ విషయాన్ని దైవప్రవక్త మహాశయులు తబూక్ ప్రయాణ సందర్భంగా– హిజ్ర్ ప్రదేశం మీదుగా వెళ్ళేటప్పుడు సెలవిచ్చారు. అక్కడ సమూద్ జాతి ప్రజలు నివసిస్తూ ఉండేవారు. దైవశిక్ష విరుచుకుపడిన కారణంగా ప్రజలందరూ సర్వనాశనమై పోయారు.

54-1. ఈ హదీసును అబ్దుర్రజ్జాఖ్ గారు సంగ్రహించారు.

**428.** మహాప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూహురైరా (రజిఅన్) ఉల్లేఖించారు: అల్లాహ్ యూదులను నాశనం చేయుగాక! ఎందుకంటే, వారు తమ ప్రవక్తల సమాధులను మసీదులుగా చేసుకున్నారు.[1]

## 56వ అధ్యాయం

**దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారి సూక్తి - నా కోసం భూమి అంతా మసీదుగానూ, పరిశుభ్రపరిచే వస్తువుగానూ చెయ్యబడింది.[1]**

**429.** దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని, జాబిర్ బిన్ అబ్దుల్లా అన్సారీ (రజిఅన్) ఉల్లేఖించారు: "నాకు పూర్వం వచ్చిన ఏ ప్రవక్తకూ ఇవ్వబడని ఐదు విషయాలు నాకు ఇవ్వబడ్డాయి. ఒకటి; ఒక మాసం

---

54-2. ఈ హదీసును బగ్వీ గారు జాదియాత్‌లో ఆవిష్కరించారు.

427-1. వారు కూడా తన సమాధిని మసీదుగా చేసుకోకూడదని, ఇంకా దానిని పూజించటం ప్రారంభించకూడదని. మరొక హదీసులో ఇలా ఉన్నది; నా సమాధిని మాటిమాటికీ వచ్చే పండుగగా చేసుకోరాదని. ఇంకొక హదీసులో ఇలా ఉన్నది; "ఓ అల్లాహ్! నా సమాధిని ఒక విగ్రహంగా చెయ్యబాకు. ఇంకా దానిని ప్రజలు పూజించకూడదు." సుబ్‌హానల్లాహ్ (అల్లాహ్ అత్యంత పరిశుద్ధుడు) ! దైవప్రవక్త మహనీయులు (స) సత్య సందేశహరులని నిరూపించటానికి ఈ సూచన సరిపోతుంది. ఆయన (స) గారు తనను ఎల్లప్పుడూ ఒక దైవ దాసునిగానే భావించారు; అలానే ప్రకటించారు. మరణ సమయంలో కూడా ఆయన (స) తనను దాస్యపు స్థాయి నుంచి దైవత్వపు స్థాయి వరకు తీసుకుపోకూడదని తన సంఘాన్ని హెచ్చరించారు.

428-1. ఈ హదీసులో కేవలం యూదులకు సంబంధించిన ప్రస్తావన మాత్రమే వచ్చింది. ఇంతకు ముందు వచ్చిన హదీసులోనయితే యూదులూ, క్రైస్తవులూ ఉభయులకూ సంబంధించిన ప్రస్తావన వచ్చింది. యూదులలోనైతే దైవప్రవక్తలు చాలామంది వచ్చారు. వారందరినీ క్రైస్తవులు విశ్వసిస్తారు. కనుక వారు క్రైస్తవుల ప్రవక్తలు కూడా అయ్యారు. కొంతమంది ఏమన్నారంటే, క్రైస్తవులు హవారీలను కూడా దైవప్రవక్తలుగా పరిగణిస్తారు.

56-1. అంటే భూమిలోని ప్రతి భాగం మీదా నమాజు చెయ్యటం, తయమ్ముమ్ చేసుకోవటం ధర్మసమ్మతమే. కాని ఆ భూభాగం అశుద్ధమయినదనే స్పష్టమైన నిదర్శనం ఉన్నట్లయితే, అప్పుడు ఆ స్థలంలో నమాజు చెయ్యటం అసహ్యాకరమైనది అవుతుంది.

కాలం పట్టేటటువంటి ప్రయాణ దూరంలో (శత్రువుల మీద) నా భయం ప్రభావం పడుతుంది. ఆ విధంగా నాకు సహాయం చేయబడింది. రెండు; భూమి అంతా నా కోసం నమాజు చేసే స్థలంగానూ (మసీదు గానూ), పరిశుభ్రపరచే వస్తువుగానూ చెయ్యబడింది. కనుక నా సంఘ సభ్యుడెవరైనా సరే నమాజుకు వేళ అయినప్పుడు ఎక్కడైనా సరే నేల మీద నమాజు చేసుకోవచ్చు. మూడో విషయం; యుద్ధ సమయంలో లభించే సంపద నా కోసం ధర్మసమ్మతం చెయ్యబడింది. నాకు పూర్వం వచ్చిన ఏ ప్రవక్తకూ అది ధర్మసమ్మతం చెయ్యబడలేదు. నాలుగో విషయం; నాకు సిఫారసు చేసే అనుమతి ఇవ్వబడింది. ఐదో విషయం; పూర్వ కాలంలో ప్రతి దైవప్రవక్త ప్రత్యేకంగా కేవలం తన జాతి ప్రజల వైపునకే పంపబడుతూ ఉండేవాడు. కాని నేను మటుకు సమస్త మానవ జాతి కోసం దైవప్రవక్తగా చేసి పంపబడ్డాను.

## 57వ అధ్యాయం

## ఒక స్త్రీ మసీదులో పడుకోవటం.

**430.** హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: అరేబియాలోని ఒక తెగకు చెందిన ప్రజల వద్ద ఒక నల్లని బానిస స్త్రీ ఉండేది. వారు ఆమెకు బానిసత్వపు శృంఖలాల నుంచి విముక్తి కలిగించి స్వేచ్ఛను ప్రసాదించారు. అయినప్పటికీ ఆమె వారితోపాటే నివసిస్తూ ఉండేది. ఒకసారి ఏమి జరిగిందంటే; ఆ తెగకు చెందిన ఒక పెళ్ళికూతురు స్నానం చెయ్యటానికి బయటికి వచ్చింది. ఆమె రత్నాలతో అలంకరించబడిన ఎర్రని చర్మపు పట్టాను తన నడుముకు ధరించి ఉంది. ఆమె ఆ పట్టాను తీసి ఎక్కడైనా పెట్టిందో లేదా అదే ఆమె శరీరం నుంచి జారి కింద పడిందో (తెలియదు కాని) ఎర్రగా మెరుస్తూ ఉన్న దానిని మాంసంగా భావించి ఒక గద్ద తన్నుకుపోయింది. ఆ తెగకు చెందిన ప్రజలు ఆ నడుము పట్టా కోసం చాలా సేపు వెతికారు. కాని అది ఎక్కడా దొరకలేదు. అప్పుడు వారు ఆ బానిస స్త్రీ మీద దొంగ తనపు నిందను మోపారు. ఆమె శరీరం మొత్తాన్ని వెతికారు. చివరకు ఆమె మర్మాం గాలను సయితం గాలించారు. ఆ బానిస స్త్రీ ఇలా అన్నది, "అల్లాహ్ సాక్షిగా చెబు తున్నాను! నేను మౌనంగా ఓరిమి వహిస్తూ వారితోపాటు నిలబడి ఉన్నాను. ఇంత లోనే ఆ గద్ద మళ్ళీ వచ్చింది. పెళ్ళికూతురు నడుము పట్టాను వారి మధ్య పడవేసింది." అప్పుడు నేను ఆ తెగవారితో ఇలా అన్నాను; "ఈ గద్ద చేసిన దొంగతనాన్ని మీరు నా మీద మోపారు. కాని నేను అమాయకురాలను. ఇదిగో తీసుకోండి మీ పట్టాను. నన్ను వెంటాడటం మానెయ్యండి." హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా అన్నారు; తరువాత ఆ బానిస స్త్రీ ప్రవక్త మహాశయుని వద్దకు

**వచ్చింది. ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి ముస్లిమ్ వనితగా మారిపోయింది. ఆమె నివాసం ఉండే గుడారం లేక గుడిసె మసీదు (ప్రాంగణం)లో ఉండేది. హజ్రత్ ఆయెషా (ర) ఇంకా ఇలా అన్నారు; అప్పుడప్పుడు ఆమె నా వద్దకు వస్తూ ఉండేది; నాతో మాట్లాడుతూ ఉండేది. కాని ఆమె నా వద్దకు వచ్చినప్పుడల్లా ఈ కవిత్వాన్ని ఆలాపిస్తూ ఉండేది; "నడుము పట్టా దినం దేవుని మహిమల్లోనిది. ఆయనే విడిపించాడు నన్ను అవిశ్వాసపు సీమ నుంచి." నేను ఆమెను అడిగాను; "నీవు నా దగ్గరకు వచ్చినప్పుడల్లా ఈ కవిత్వాన్నే ఆలాపిస్తావు ఎందుకని?" అని. అప్పుడు ఆమె ఈ మొత్తం వృత్తాంతాన్ని నాకు వినిపించింది.**

## 58వ అధ్యాయం

## పురుషులు మస్జిదులో పడుకోవటం గురించి.[1]

**అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఉకల్ తెగకు చెందిన కొందరు ప్రజలు దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారి వద్దకు వచ్చారు. వారు మసీదు పందిరి కింద ఉండేవారు.[2] ఇంకా అబ్దుర్రహ్మాన్ బిన్ అబీ బకర్ (రజిఅన్) ఏమన్నారంటే; మసీదు పందిరి కింద ఉండేవారందరూ నిరుపేదలే.[3]**

**431. అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా అన్నారని నాఫె ఉల్లేఖించారు: నేను దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) గారి మసీదులో పడుకుని నిదురపోతూ ఉండేవాడిని. అప్పుడు నేను నిండు యవ్వనంలో ఉండినాను. ఇంకా నాకు వివాహం కూడా కాలేదు.**

---

58-1. చాలా మంది మత విద్వాంసుల దృష్టిలో ఇది ధర్మసమ్మతమైన విషయమే. కాని ఇబ్నె అబ్బాస్ (రజిఅన్), ఇబ్నె మసూద్ (రజిఅన్) గార్ల దృష్టిలో ఇది అవాంఛ నీయమైనది.

58-2. ఈ హదీసును స్వయంగా ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారే ఇదే పేరుతో బాబుల్ మహారిబైన్‌లో ప్రస్తావించారు.

58-3. ఈ ఉల్లేఖనాన్ని స్వయంగా ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారే 'అలామాతున్ నబువ్వ'లో ఆవిష్కరించారు. వీరు సాయెబానె సుఫాలో ఉండేవారు. వారికి ఇల్లూ లేదు, వాకిలీ లేదు. భార్యా లేదు పిల్లలూ లేరు. ఎల్లప్పుడూ మసీదులోనే పడి ఉండే వారు. వారు 70 మంది వరకూ ఉండేవారు అని ప్రజలు అనుకునేవారు. వారిని అస్‌హాబె సుఫా అని అంటూ ఉండేవారు. కొంతమంది ఏమన్నారంటే; 'సూఫి' అనే పదాన్ని అసలు 'సఫి' అనేవారు. కాని ఎక్కువగా మాటిమాటికి వాడటం వల్ల 'సఫి' కాస్తా, సూఫి అయిపోయింది. ఫకీరులకూ, సన్యాసులకూ జనకుల్లాంటి వారు వీరే.

**432.** **సహల్ బిన్ సాద్ (రజిఅన్) ఉల్లేఖించారు: దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఒకసారి హజ్రత్ ఫాతిమా జహెర (రజిఅన్‌హా) (దైవప్రవక్త (స) గారి కూతురు) గారి ఇంటికి వెళ్లారు. కాని ఇంట్లో హజ్రత్ అలి (రజిఅన్)గారు కనిపించలేదు. 'నీ దాయాది (నీ బాబాయి కుమారుడు) ఏరి? ఎక్కడున్నారు?' అని ఆయన (స) ఫాతిమా (ర) ను అడిగారు.[1] అప్పుడు ఆమె (రజి) ఇలా అన్నారు: "నాకూ ఆయనకూ మధ్య ఒక చిన్న వివాదం తలెత్తింది. కోపంతో ఆయన ఎక్కడికో వెళ్లి పోయారు. ఇక్కడ పడుకోలేదు." మహాప్రవక్త (స) హజ్రత్ అలీ(ర) ఎక్కడికెళ్ళారో చూడమని ఒక మనిషిని పురమాయించారు. ఆ మనిషి కనుక్కోవటానికి వెళ్లాడు. తిరిగి వచ్చి ఇలా అన్నాడు; "ఓ దైవప్రవక్తా! హజ్రత్ అలీ (ర) మసీదులో నిద్రపోతు న్నారు." ఈ విషయాన్ని తెలుసుకున్న దైవప్రవక్త (స) మసీదుకు వెళ్లారు. హజ్రత్ అలీ (ర) అక్కడ పడుకుని ఉన్నారు. ఒక వైపు నుంచి ఆయన కప్పుకున్న దుప్పటి దూరంగా జరిగిపోయింది. ఆయన గారి శరీరానికి మట్టి తగిలింది. మహాప్రవక్త(స) స్వయంగా తన చేతులతో హజ్రత్ అలీ (ర) గారి శరీరానికి తగిలి ఉన్న మట్టిని తుడవసాగారు. ఇంకా, "ఓ అబూతురాబ్! లే. ఓ అబూతురాబ్! లే"[2] అని అన్నారు.**

**433.** **హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: నేను 70 మంది సుఫా[1] వారిని చూశాను. వారి వద్ద కనీసం ఒక్క దుప్పటి అయినా లేదు. కేవలం ఒక లుంగీని మాత్రమే వారు కలిగి ఉన్నారు. లేదా వారి వద్ద కేవలం ఒక కంబళి**

---

432–1. వాస్తవానికి హజ్రత్ అలీ (ర) మహాప్రవక్త (స) గారి బాబాయి కుమారుడు. కాని అరబ్బుల ఒక జాతీయం ప్రకారం, తండ్రి బంధువులను కూడా దాయాదులే అంటారు. దైవప్రవక్త మహనీయులు (స) హజ్రత్ ఫాతిమా (ర)తో నీ భర్త ఎక్కడి కెళ్ళారు? అని అడగలేదు. కాని వారి మధ్య ఉన్నటువంటి సన్నిహిత బంధుత్వాన్ని ప్రస్తావించారు. ఎందుకంటే, హజ్రత్ ఫాతిమా (ర) గారి హృదయంలో హజ్రత్ అలి (ర) గారి పట్ల ప్రేమానురాగాలు వెల్లువెత్తాలని.

432–2. అరబ్బీ భాషలో 'తురాబ్' అనే పదానికి 'మట్టి' అనే అర్థం ఉంది. దైవప్రవక్త మహాశయులు హజ్రత్ అలీ(ర) గార్కి 'అబూ తురాబ్' అని ఆప్యాయతతో పెట్టిన పేరది. హజ్రత్ అలీ (ర) గారిని ఎవరైనా ఈ పేరుతో పిలిస్తే, ఆయన (ర) మహదానంద భరితులయ్యేవారు. ఇంకా మస్జిదుల్లో పడుకోవచ్చునీ, నిద్రపోవచ్చునీ ఈ హదీసు ద్వారా నిర్ద్వంద్వంగా నిరూపితమయింది. ఇంకా హజ్రత్ అలి (ర) గారి ఔన్నత్యం, గౌరవప్రదమైన ఆయన స్థానం ఈ హదీసు ద్వారా ప్రస్ఫుటమయ్యాయి.

**మాత్రమే ఉండేది. దానిని వారు తమ మెడలకు కట్టుకున్నారు. వారు ధరించిన ఈ కంబళ్లు కొందరికి పిక్కల దాకా ఉంటే మరికొందరికి మడమల వరకు ఉన్నాయి. వారు వాటిని తమ చేతులతో సర్దుకుంటూ కనిపించారు– తమ మర్మాంగాలేమైనా బహిర్గతమవుతాయేమోనని భయపడుతూ.**

## 59వ అధ్యాయం

## ప్రయాణం చేసి తిరిగి వచ్చినప్పుడు నమాజు చెయ్యటం.[1]

**కాబ్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా సెలవిచ్చారు: దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ప్రయాణం నుంచి తిరిగి వచ్చినపుడు (మదీనాలో) మొదట మసీదులోకి వెళ్లి అక్కడ నమాజు చేస్తారు.[2]**

**434.** **హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా అన్సారీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: నేను ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారి వద్దకు వెళ్లాను. అప్పుడు ఆయన (స) గారు మసీదులో ఆసీనులై ఉన్నారు. మిసార్ ఏమన్నారంటే; “మధ్యాహ్నానికి ముందు సమయం” అని జాబిర్ అన్నారని నేను అనుకుంటున్నాను. “దైవప్రవక్త (స), రెండు రకాతులు నమాజు చెయ్యి” అని నాతో సెలవిచ్చారు. ఇంకా**

---

433–1. మసీదు పందిరిని సుఫా అని అంటారు. సుఫా వారికి సంబంధించిన ప్రస్తావన ఇప్పుడే ఇంతకు ముందే వచ్చింది. ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారు ఈ హదీసు ద్వారా వెలుగులోకి తీసుకువచ్చిన విషయం ఏమిటంటే; మసీదులో పడుకుని నిద్రపోవటం, అందులో ఉండటం ధర్మసమ్మతమైన విషయాలే. ఎందుకంటే, ఈ సుఫా వారు నిర్వాసితులు. ఇల్లూ వాకిలీ లేనివారు. రేయింబవళ్ళు వారు మసీదులోనే నివాసం ఉండేవారు.

59–1. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) గారి సంప్రదాయం ఏమిటంటే; ప్రయాణం చేసి తన ఇంటికి తిరిగి వచ్చినప్పుడు, ఇంట్లోకి ప్రవేశించే ముందు మసీదుకు పోయి అక్కడ రెండు రకాతులు నఫిల్ నమాజు చేసి ఆ తరువాత ఇంట్లోకి ప్రవేశించేవారు. అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకోవటం ఇందులో ఉన్న అంతరార్థం. ఆయన మనిషిని ప్రయాణం తరువాత క్షేమంగా సురక్షితంగా తిరిగి తన ఇంటికి తీసుకువచ్చాడు.

59–2. స్వయంగా ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారే ఈ హదీసును ‘మగాజీ’లో (యుద్ధ ప్రకరణంలో) సంగ్రహించారు.

మహాప్రవక్త(స) గారు నాకు ఇవ్వవలసిన కొంత అప్పును తీర్చేశారు. నాకు ఇవ్వవలసిన దానికంటే కొంచెం ఎక్కువే ఆయన (స) ఇచ్చారు.[1]

## 60వ అధ్యాయం

### ఎవరైనా మసీదులోకి ప్రవేశిస్తే కూర్చోబోయే ముందు రెండు రకాతులు నమాజు చెయ్యాలి.

**435.** హజ్రత్ అబూ ఖతాద సలమీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారు: "మీలో ఎవరైనా మసీదు లోకి ప్రవేశిస్తే అప్పుడు కూర్చోబోయే ముందు రెండు రకాతులు నమాజు చెయ్యండి."

## 61వ అధ్యాయం

### మసీదులో అశుద్ధత కలగటం. అంటే అపాన వాయువు వెలువడటం.[1]

**436.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూ హురైరా(రజిఅన్) ఉల్లేఖించారు: ఏ మనిషయితే తాను మసీదులో, ఏ స్థలంలోనయితే నమాజు చేశాడో ఆ స్థలంలో అతను కూర్చొని వున్నంతవరకు దైవదూతలు అతనికి క్షమాభిక్ష పెట్టమని అల్లాహ్‌ను ప్రార్థిస్తూ ఉంటారు. ఈ ప్రార్థ నను వారు అతనికి అశుద్ధత కలిగే అంతవరకు చేస్తూనే ఉంటారు.దైవదూతలు ఇలా అంటారు: "ఓ అల్లాహ్! అతనికి క్షమాభిక్ష పెట్టు, ఓ అల్లాహ్ అతనిపై కరుణజూపు.[1]

---

434-1. ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారు ఈ హదీసును 20 చోట్ల ఉల్లేఖించారు; కొన్ని చోట్ల సుదీర్ఘంగానూ, మరికొన్ని చోట్ల క్లుప్తంగాను. ఈ సంఘటన హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా(ర) ప్రయాణం నుంచి తిరిగి వచ్చినప్పుడు జరిగింది. ఇతర ఉల్లేఖనాలు కూడా దీనిని ధ్రువీకరిస్తున్నాయి. కనుక ఈ హదీసు అధ్యాయంలోని ప్రధానమైన అంశానికి అనుగుణంగానే ఉన్నట్లు స్పష్టమవుతోంది. కొందరేమన్నారంటే, ఈ హదీసు అధ్యాయంలోని అర్థాన్ని సమర్థించదు. కాని ఈ అభ్యంతరం వాదనకూ, తర్కానికీ నిలబడే బలాన్ని కలిగిలేదు.

61-1. ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారు ఈ అధ్యాయాన్ని ఏ ఉద్దేశ్యంతో ప్రవేశపెట్టారంటే, ఒక మనిషి వుజూ లేకుండానే మసీదులోకి ప్రవేశించగలడు, ఇంకా అక్కడ కూర్చోగలడు అనే విషయాన్ని తెలియజెయ్యటం కోసం.

436-1. తెలిసిన విషయం ఏమిటంటే, అశుద్ధత కలగటం వల్ల, అంటే అపాన వాయువు వెలువడటం వల్ల దైవదూతలు చేసే ప్రార్థన ఆగిపోతుంది. ఎందుకంటే, ఆ అశుద్ధతలోని దుర్వాసన కారణంగా దైవదూతలకు బాధ కలుగుతుంది.

## 62వ అధ్యాయం
## మసీదు నిర్మాణం గురించి.

**అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) ఇలా అన్నారు : "మస్జిదె నబవీ యొక్క కప్పు ఖర్జూరపు మండలతో తయారు చెయ్యబడింది. హజ్రత్ ఉమర్ (రజిఅన్) దానిని పునర్నిర్మించమని ఆజ్ఞాపించారు. ఆయన (ర) ఇంకా ఇలా అన్నారు; నేను ప్రజల్ని వర్షం నుంచి రక్షించదలిచాను. ఎర్ర రంగులు, పసుపుపచ్చ రంగులూ మసీదులకు వెయ్యబాకండి. అవి ప్రజల్ని ఆపదకూ, పరీక్షకూ లోనుచేస్తాయి."[1] హజ్రత్ అనస్(ర) ఇలా అన్నారు : ప్రజలు మసీదులను చూసి గర్వపడటం ప్రారంభిస్తారు. కాని మసీదులకు పోయి నమాజులు చేసే విషయాన్ని గురించి అంతగా పట్టించుకోరు.[2] హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజిఅన్) ఇలా అన్నారు: యూదులూ, క్రైస్తవులూ తమ చర్చీలకు రంగులు వేసి అలంకరించినట్లుగా మీరు కూడా మసీదులను అలంకరిస్తారు.**

---

62–1. మసీదులకు వేసిన ఆకర్షణీయమైన రంగులను చూసీ, అందమైన పుష్పాల డిజైనులను చూసీ నమాజులో ఉన్నటువంటి వారి ఆలోచనలు చెదిరిపోతాయి. వారి మనస్సు నిలువదు. ఈ హదీసును స్వయంగా ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారే 'మస్జిదె నబవీ'కి సంబంధించిన అధ్యాయంలో ఆవిష్కరించారు. ఇంకా ఇబ్నెమాజ, హజ్రత్ ఉమర్ (రజిఅన్)కు ప్రాధాన్యతను ఇస్తూ ఇలా ఉల్లేఖించారు; ఏ జాతి అయినా సరే, అది తన మసీదులను అలంకరణలతో నింపనంత వరకు చెడిపోలేదు, భ్రష్టుపట్టలేదు. మత విద్వాంసులు చాలామంది మసీదులను అతిగా అలంకరించటాన్ని అవాంఛనీయమైన చర్యగా అభివర్ణించారు. ఎందుకంటే, అలా చెయ్యటం వల్ల నమాజు చేసేటప్పుడు నమాజీల ఆలోచనలు చెదిరిపోతాయి; రెండో కారణం ఏమిటంటే, ధనం అనవసరంగా వ్యర్థమైపోతుంది. మసీదులలో పుష్పాల డిజైనులు వెయ్యటం నిష్ప్రయోజనమైనప్పుడు, నిషిద్ధమైనప్పుడు, వివాహాది శుభకార్యాలలో, సంతాప సమయాలలో డబ్బు వెదజల్లటం, అనవసరమైన సంప్రదాయాలనూ, ఆచారాలనూ పాటించటం ధర్మసమ్మతం ఎలా అవుతుంది? ముస్లిమ్‌లు కళ్లు తెరవాలి, యదార్థాలను గ్రహించాలి. దేవుడు వారికి ప్రసాదించిన ధనాన్ని పుణ్యకార్యాలలో, ఇస్లామ్ ధర్మపురోగతికీ వ్యయపరచాలి; ఉదాహరణకు, ధర్మ గ్రంథాలను ప్రచురించటం, పేద విద్యార్థులకు ధన సహాయం చెయ్యటం, ధార్మిక పాఠశాలలు నడపటం, ధర్మసత్రాలను కట్టించటం, నిరుపేదలకు, అగత్యపరులకు అన్నదానం చెయ్యటం, కట్టుబట్టలు లేని వారికి బట్టలు కుట్టించటం, అనాథ బాలబాలికలను, వితంతువులను పోషించటం మొదలైనవి.

**437. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారి శుభప్రదమైన జీవిత కాలంలో మస్జిదె నబవీ పచ్చి ఇటుకలతో కట్టబడింది. దాని కప్పు మీద ఖర్జూరపు మండలు ఉండేవి. ఇంకా దాని స్తంభాలు ఖర్జూరపు కలపతో తయారుచెయ్యబడ్డాయి. తరువాత హజ్రత్ అబూబకర్ (రజిఅన్) తన ఖిలాఫత్ కాలంలో అందులో ఎలాంటి మార్పు చెయ్య లేదు. కాని హజ్రత్ ఉమర్ (ర) ఆ మసీదును విస్తరించారు. అయితే కట్టడాన్ని మాత్రం ఆయన మార్చలేదు. మహాప్రవక్త (స) గారి కాలంలో ఎలా ఉందో అలానే ఉంచారు. అంటే పచ్చి ఇటుకలు, ఖర్జూరపు కొమ్మలు, ఖర్జూరపు కలపనే ఉపయో గించారు. ఆ తరువాత హజ్రత్ ఉస్మాన్ (ర) దానిని పూర్తిగా మార్చివేశారు, విస్తరింపజేశారు. దాని గోడలను అచ్చువేసిన (చెక్కిన) రాళ్ళతో, సున్నంతో కట్టిం చారు. ఇంకా దాని స్తంభాలను కూడా చెక్కిన రాళ్లతో, దాని కప్పును టేకు కలపతో కట్టించారు.**

## 63వ అధ్యాయం

## మసీదు నిర్మాణంలో ఒకరికొకరు తోడ్పడటం[1].

**దివ్యఖురానులో అత్‌తౌబా సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "ముష్రి క్కులు అల్లాహ్ మసీదులలో సంరక్షులుగానూ, సేవకులుగానూ ఉండటానికి పనికి రారు. ఎందుకంటే వారే స్వయంగా తాము అవిశ్వాసులమని తమకు వ్యతిరేకంగా**

---

62–2. జమాఅత్‌తో నమాజు చెయ్యటం వల్ల, అల్లాహ్ పవిత్ర నామాన్ని స్మరించటంవల్ల మసీదు 'ఆబాద్' అవుతుంది (అంటే మసీదు నమాజీలతో నిండిపోతుంది). ముస్లిమ్ సోదరులు ఈ విషయం మీద దృష్టిసారించరు. కాని ఒకరిని మించి ఒకరు గర్వ పడుతూ ఉంటారు, పోటీపడుతూ ఉంటారు; ఒకతను నేను కట్టించిన మసీదు బ్రహ్మాండంగా ఉన్నది అని అంటే, మరొకతను నా మసీదు చాలా అందంగా, శోభాయమానంగా ఉన్నది అని అంటాడు. ఈ కాలంలోనైతే పూర్తిగా ఇలాంటి స్థితియే నెలకొని ఉన్నది. ముస్లిములు మసీదు కట్టడానికయితే ఆర్భాటం చూపు తున్నారు. కాని మసీదుకు వెళ్లి అక్కడ నమాజు చెయ్యరు. శుక్రవారంనాడూ, పండుగ దినాలనాడు కూడా మసీదులకు పోయి నమాజు చెయ్యరు. ఒక చిన్న అధికార పదవి వారికి లభిస్తే వారి పాదాలు నేల మీద ఉండవు. వారితో ఇలా అనండి; మీరెంత? మీ పదవెంత? రాజాధిరాజైన అల్లాహ్ దర్బారుకు మీరు వెళ్లరు. ఆయన ముందు పెద్దపెద్ద మహారాజులు కూడా ఒక చిన్న దోమకంటే కూడా అల్పమైనవారే, అనామకులే.

సాక్ష్యమిస్తున్నారు. వారి కర్మలైతే అన్నీ వ్యర్థమైపోయాయి. నరకంలో వారు కలకాలం ఉంటారు" (9:17). అల్లాహ్‌నూ, అంతిమ దినాన్నీ విశ్వసించి నమాజును స్థాపించే వారూ, జకాత్ ఇచ్చే వారూ, అల్లాహ్‌కు తప్ప మరెవరికీ భయపడని వారు మాత్రమే అల్లాహ్ మసీదులకు సంరక్షకులు, సేవకులు కాగలుగుతారు. వారే సరియైన మార్గంలో నడుస్తారని ఆశించవచ్చు"[1] (9 : 18).

**438.** హజ్రత్ ఇక్రిమా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) నాతోనూ, తన కుమారుడైన అలీతోనూ ఇలా అన్నాడు: "మీరు ఉభయులూ కలసి అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) వద్దకు వెళ్లండి; ఆయన గారు ఉల్లేఖించే హదీసులను వినండి". అప్పుడు మేము ఆయన వద్దకు వెళ్లాము. ఆయన తన తోటలో పని చేస్తూ మాకు కనిపించారు. మా రాకను గమనించిన ఆయన తన దుప్పటిని తీసుకున్నారు; దానిని ధరించి కూర్చున్నారు. తరువాత హదీసును వివరించటం ప్రారంభించారు. మస్జిదె నబవీ నిర్మాణ విషయం ప్రస్తావనకు వచ్చింది. ఆయన ఇలా చెప్పారు; మసీదు నిర్మాణం జరిగేటప్పుడు మేము ఒక్కొక్క ఇటుకను ఎత్తుతూ ఉండేవారము. అమ్మార్ అయితే రెండేసి ఇటుకలను ఎత్తుకుంటూ ఉండేవారు. దైవప్రవక్త మహాశయులు (స) అమ్మార్‌ను చూసి ఆయన (ర) శరీరానికీ, శిరస్సుకూ తగిలిన మట్టిని తుడవటం ప్రారంభించారు. ఇంకా ఇలా అన్నారు: "అమ్మార్‌ను అల్లాహ్ కరుణించుగాక! అయ్యో! ఎంత దారుణం! తిరుగుబాటు దారులు అమ్మార్‌ను చంపేస్తారు. ఇతనయితే వారిని స్వర్గం వైపునకు పిలుస్తూ ఉంటాడు. వారయితే ఇతన్ని నరకం వైపునకు పిలుస్తారు. "నేను ఉపద్రవాల నుంచి అల్లాహ్ శరణు వేడుకుంటాను." అని అమ్మార్ (రజి) అంటూ ఉండేవారని అబూ సయీద్ ఖుద్రీ తెలిపారు.

## 64వ అధ్యాయం

### మసీదు కట్టేటప్పుడూ, మెంబర్‌ను తయారు చేసేటప్పుడూ వడ్రంగినీ, సాంకేతిక నిపుణున్నీ పిలిచి వారి సహాయాన్ని పొందటం.

---

63–1. బదర్ యుద్ధంనాడు ముస్లిమ్‌లు హజ్రత్ అబ్బాస్ (ర)ను షిర్క్ (బహుదైవారాధన), కుఫ్ర్ (అవిశ్వాసం)ల కారణంగా నిందించారు. అప్పుడు ఆయన ఇలా అన్నాడు; "మీరు మా మంచితనాన్ని గురించి అసలు ప్రస్తావించరు. మేము మస్జిదె హరామ్‌ను ఆబాద్ చేస్తాము, హాజీలకు మంచి నీళ్లు త్రాపుతాము." అప్పుడు ఈ వాక్యాలు అవతరించాయి. అంటే షిర్క్‌నూ, అవిశ్వాసాన్నీ ఆచరిస్తూ ఈ సత్కార్యాలు చెయ్యటం వల్ల ఏ ప్రయోజనమూ లభించదు.

**439.** **సహల్ బిన్ సాద్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఒక స్త్రీ వద్దకు ఒక సందేశాన్ని ఇలా పంపారు; "నీ బానిస అయినటువంటి వడ్రంగిని నా కోసం ఒక మెంబర్‌ను చెక్కతో తయారు చెయ్యమని ఆజ్ఞాపించు; దాని మీద నేను కూర్చుంటాను."**

**440.** **హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా అన్సారీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఒకసారి ఒక స్త్రీ దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్)ను సంబోధిస్తూ ఇలా అన్నది; "ఓ దైవప్రవక్తా (స)! నా వద్ద వడ్రంగం పని బాగా తెలిసిన ఒక బానిస ఉన్నాడు. ఖుత్బా ఇచ్చేటప్పుడు మీరు కూర్చోవటానికి ఒక వస్తువును తయారు చేయించమంటారా?" దానికి సమాధానంగా, ఆయన (స) గారు, "సరే, మంచిది, నీ ఇష్ట ప్రకారమే కానివ్వు" అని సెలవిచ్చారు. తరువాత ఒక మెంబర్‌ను ఆయన(స) గారి కోసం ఆమె చేయించారు.**

## 65వ అధ్యాయం

## మసీదు నిర్మించేవానికి లభించే పుణ్యఫలం.

**441.** **హజ్రత్ ఉస్మాన్ (రజిఅన్) ఇలా అంటూ ఉండగా నేను విన్నాను అని ఉబైదుల్లా బిన్ అస్వద్ ఖౌలానీ ఉల్లేఖించారు: "నేను మస్జిదె నబవీని (దైవప్రవక్త గారి మసీదు) అచ్చు వేసిన (చెక్కిన) రాళ్లతో మరియు సున్నంతో పునర్నిర్మించినపుడు, ప్రజలు ఈ విషయం గురించి ఎన్నో విషయాలు అడిగారు[1], ఎన్నో వాదనలు చేశారు. వాస్తవానికి నేను దైవప్రవక్త మహాశయులు (స) ఇలా సెలవిస్తూ ఉండగా విన్నాను: "ఏ వ్యక్తి అయితే అల్లాహ్ ప్రసన్నతను పొందే సంకల్పంతో మసీదును కట్టిస్తాడో అల్లాహ్ కూడా అలాంటి గృహాన్నే అతని కోసం స్వర్గంలో నిర్మిస్తాడు[2]."**

---

441-1. ప్రజలు ఇలా అనసాగారు; మహాప్రవక్త ముహమ్మద్ (స) గారి కాలంలో లేని విషయాలను ఇపుడు హజ్రత్ ఉస్మాన్ (ర) గారు చెబుతున్నారు. ఇంకా వారు ఆయన్ని (ర) ఎత్తిపొడవసాగారు. వాటి భావం ఏమిటంటే; మహాప్రవక్త (స) గారి కాలంలో మసీదు ఎలా ఉండేదో, అంటే ఇటుకలతో, ఖర్జూరపు కొమ్మలతో నిర్మించబడినటు వంటిది – అలానే ఉండనివ్వాలని, దాని రూపాన్ని మార్చకూడదని. హజ్రత్ అబూ బకర్ సిద్దీఖ్ (ర) గారూ, హజ్రత్ ఉమర్ (ర) గారూ దానిని అలాగే ఉండనిచ్చారు.

441-2. హిజ్రీ 30వ సంవత్సరంలో హజ్రత్ ఉస్మాన్ (ర) గారు ఈ మసీదు పునర్నిర్మా ణాన్ని చేపట్టారు. అప్పుడు, కాబ్ గారు ఇలా అన్నారు, అయ్యో! హజ్రత్ ఉస్మాన్(ర) గారు ఈ మసీదును కట్టించకుండా ఉంటే ఎంత బాగుండేది! ఎందుకంటే, ఈ

## 66వ అధ్యాయం

**మసీదు గుండా వెళ్లటం జరిగినప్పుడు బాణపు అలుగులను ఒక చేత్తో పట్టుకోవాలి.**

**442.** జాబిర్ బిన్ అబ్దుల్లా ఇలా అంటూ ఉండగా నేను విన్నాను అని అమ్ర్ ఉల్లేఖించారు; "ఒక వ్యక్తి బాణాలు తీసుకుని మస్జిదె నబవీలోకి ప్రవేశించాడు. అప్పుడు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) అతనితో ఇలా అన్నారు; "బాణాల మొనలను గట్టిగా, జాగ్రత్తగా పట్టుకో."

## 67వ అధ్యాయం

**బాణాలు మొదలైనవి తీసుకుని మసీదులో నుంచి పోవటం.**

**443.** తనకు తన తండ్రి చెప్పారని అబూ బుర్దా బిన్ అబ్దుల్లా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారు: "ఎవరైనా మన మసీదులలో నుంచిగానీ లేదా వీధులలో నుంచిగానీ బాణాలు తీసుకుని వెళ్లటం జరిగితే, వారు ఆ బాణాల మొనలను గట్టిగా, జాగ్రత్తగా పట్టుకుని మరీ వెళ్ళాలి. ఎందుకంటే, ఆ బాణాల మొనలు ఏ ముస్లిమ్‌కైనా తగిలి అతను గాయపడే అవకాశం ఉంది."

## 68వ అధ్యాయం

**మసీదులో కవిత్వం చెప్పటం.**

**444.** హస్సాన్ బిన్ సాబిత్ అల్ అన్సారీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: నేను హజ్రత్ అబూ హురైరా (రజిఅన్)ను ఇలా అడిగాను; "ఓ అబూ హురైరా(ర)! అల్లాహ్ సాక్షిగా నిజం చెప్పు! దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) నాతో ఓ హస్సాన్! దైవప్రవక్త (సఅసమ్) తరపున నీవు సమాధానం చెప్పు. ఓ అల్లాహ్! పరిశుద్ధాత్మ ద్వారా అతనికి సహాయపడు అంటూ ఉండగా నీవు విన్నావా? లేదా" అప్పుడు అబూ హురైరా (ర), "అవును నేను విన్నాను" అని జవాబు పలికారు.

---

మసీదు నిర్మాణం పూర్తి అయిన తరువాత ఆయన హతమార్చబడతారు. అలాగే జరిగింది. ఇబ్నె జౌజి ఇలా అన్నారు; ఏ వ్యక్తి అయితే తన పేరు మసీదు మీద చెక్కిస్తాడో అతను చిత్తశుద్ధి కలవాడు కాడు. సత్సంకల్పం కలవాడు కాడు.

444–1. అవును. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిస్తూ ఉండగా నేను విన్నాను. అసలేమి జరిగిందంటే; హస్సాన్(ర) మస్జిదె నబవీలో కూర్చొని కవిత్వాన్ని పఠిస్తున్నారు. హజ్రత్ ఉమర్(ర) కవిత్వాన్ని పఠించవద్దని ఆయన్ని వారించారు. అప్పుడు హస్సాన్ (ర) అబూ హురైరా(ర)ను సాక్షిగా చూపుతూ ఈ హదీసును

## 69వ అధ్యాయం

### బల్లెములూ, ఈటెలు ధరించిన వారు మసీదులోకి ప్రవేశించటం.[1]

**445.** హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు; ఒకనాడు నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) నా ఇంటి ద్వారం వద్ద నిలబడి ఉండగా నేను చూశాను. హబషి (ఇథియోపియా) ప్రజలు కొందరు మసీదులో విన్యాసాలు చేస్తున్నారు. తమ ఈటెలతో, బల్లాలతో సాధన చేస్తున్నారు. మహాప్రవక్త(స) తన దుప్పటిని నా మీద కప్పారు. నేను వారి విన్యాసాన్ని చూడసాగాను.

## 70వ అధ్యాయం

### మసీదులోని మెంబరు మీద క్రయవిక్రయాలను గురించి ప్రస్తావించటం.[1]

**446.** హజ్రత్ ఆయెషా(రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: బానిసరాలు అయినటువంటి బరీరా ఒకసారి నా దగ్గరకు వచ్చింది; తన విమోచన ధనం

---

వివరించారు, మరియు ఇలా అన్నారు; "నేనైతే మసీదులో మీ కంటే ఉత్తములైన దైవప్రవక్త (స) గారి ముందు కవిత్వం చదివేవాణ్ణి". హస్సాన్(ర) అవిశ్వాసులు చేసేటటువంటి అపహాస్యముతో కూడిన దూషణలకు దీటైన జవాబు చెప్పేవారు. ఇంకా దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారిని సమర్థించేవారు, ఆయన (స)కు మద్దతు తెలిపేవారు. తెలిసిన విషయం ఏమిటంటే; మంచి కవిత్వాన్ని, అల్లాహ్ స్తోత్రంతో, దైవప్రవక్త (స) మీద ప్రశంసలతో నిండి ఉన్న కవిత్వాన్ని, ఇంకా దైవధర్మాన్ని ప్రోత్సహించే కవిత్వాన్ని మసీదులో చదవటం ధర్మసమ్మతమైన విషయమే. మరొక హదీసులో దైవప్రవక్త మహాశయులు(స), మసీదులో చదవకూడదని నిషేధించిన కవిత్వం ఏ కవిత్వమంటే; ప్రేమ కలాపాలు ఉన్న కవిత్వం, అజ్ఞాన కాలపు కవిత్వం, వ్యర్థ విషయాలు ఉన్న కవిత్వం.

69-1. ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారు ఇక్కడ ఈ అధ్యాయాన్ని తీసుకురావటంలోగల ఉద్దేశ్యమేమిటంటే; ఏ వస్తువువల్లనైతే ప్రజలకు హానిగాని, ఆపదగాని కలిగే భయం ఉండదో – ఈటె, బరిసె లాంటి వస్తువులు – ఆ వస్తువును తీసుకుని మసీదులోకి వెళ్లటం ధర్మ సమ్మతమైన విషయమే. ఈ హదీసు ద్వారా స్పష్టంగా తెలిసిన విషయం ఏమిటంటే; మసీదు ఆవరణలో మంచి ఆటలు ఆడటమూ, వాటిని చూడటమూ రెండూ ధర్మసమ్మతమైన విషయాలే. ఎటువంటి హానిగాని, ఎలాంటి ఆపదగాని కలిగే భయం లేనప్పుడు ఒక స్త్రీ పరాయి పురుషుణ్ణి చూడవచ్చు.

70-1. అంటే, క్రయవిక్రయాలకు సంబంధించిన వ్యవహారాన్ని ప్రస్తావించటం. ఇంకా మసీదులో మెంబరు మీద క్రయవిక్రయాలు చేసుకోవటం ధర్మసమ్మతమని దీని అర్థం

విషయంలో ఆర్థికంగా సహాయపడమని నన్ను అర్థించింది. నేను ఆమెకు ఇలా చెప్పాను. "నీకు ఇష్టమయితే నీ విమోచన ధనాన్ని నీ యజమానులకు నేను చెల్లిస్తాను. కాని నీ 'తరకా' (వారసత్వపు సొత్తు)ను నేను తీసుకుంటాను." అయితే ఆమె యజమానులు ఇలా అన్నారు: "మీరు గనక ఇష్టపడితే బానిస బరీరా చెల్లించవలసి ఉన్నటువంటి విమోచన ధనాన్ని మీరు చెల్లించవచ్చు." (ఉప ఉల్లేఖకుడైన సుఫియాన్ ఇలా అన్నారు) "మీరు గనక ఇష్టపడితే డబ్బు చెల్లించి ఆమెను స్వతంత్రురాలిగా చెయ్యండి. అయితే ఆమె తరకాను మేమే తీసుకుంటాము." దైవప్రవక్త మహాశయులు వచ్చిన తరువాత ఆయన (స) ఇలా సెలవిచ్చారు: "నీవు నిస్సంకోచంగా బరీరాను కొనెయ్యి. ఇంకా ఆమెను స్వతంత్రురాలిగా చేసెయ్యి. ఎవరైతే విముక్తి కలిగిస్తారో, వారికే తరకా చెందుతుంది." తరువాత దైప్రవక్త (స) బయటికి వెళ్ళిపోయారు. (మసీదులో దైవప్రవక్త (స) మెంబర్ మీదకు ఎక్కారు అని సుఫియాన్ అన్నారు) ఆయన (స) ఇలా సెలవిచ్చారు: "ప్రజలకేమైంది? అల్లాహ్ గ్రంథంలో లేనటువంటి షరతుల్ని వారు లావాదేవీల విషయంలో విధిస్తున్నారు. అటువంటి షరతుల్ని వారు నూరుసార్లు విధించినా ఏమీ కాదు. వారికి లభించేది శూన్యం మాత్రమే."

## 71వ అధ్యాయం

### అప్పు చెల్లించమని రుణగ్రస్తుణ్ణి మస్జిదులో అడగటం.

**447.** హజ్రత్ కఅబ్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: నేను ఇబ్నె అబీ హద్రద్ (ర)ను మసీదులో నాకు ఇవ్వవలసిన అప్పును చెల్లించమని అడిగాను. మా కంఠస్వరాలు పెరిగాయి. చివరకు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) తన గదిలో నుంచే మా కంఠ ధ్వనులను విన్నారు. ఆయన (స) తన ఇంట్లో నుంచి బయటికి వచ్చారు. తన ఇంటి తలుపుల్ని తెరిచి ఎలుగెత్తి "ఓ కాబ్!" అన్నారు; "ఓ దైవప్రవక్తా! చెప్పండి. మీరు చెప్పేది నేను వింటున్నాను" అని కాబ్ అన్నారు. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు. "నీవు ఇలా చెయ్యి; అతను ఇవ్వవలసి ఉన్న అప్పును సగానికి తగ్గించు (అంటే క్షమించు)." ఈ విషయాన్ని ఆయన (స)

---

ఎంత మాత్రం కాదు. అదైతే మరొక హదీసు ప్రకారం నిషిద్ధమైన విషయమే. ఇప్పుడు అభిప్రాయ భేదం ఉన్న విషయమేమిటంటే, ఎవరైనా మసీదులోనే క్రయవిక్రయాలకు సంబంధించిన ఒప్పందం కుదుర్చుకుంటే, అది ధర్మసమ్మతం అవుతుందా కాదా అనేది.

గారు సైగచేసి సూచించారు. కాబ్ ఇలా అన్నారు; "ఓ దైవప్రవక్తా! మీ ఆజ్ఞాబద్ధుడను. మీ ఆజ్ఞ ప్రకారమే సగం అప్పును క్షమించివేశాను." అప్పుడు దైవప్రవక్త (స) ఇబ్నె అబీ హద్‌రద్‌ను ఉద్దేశించి ఇలా అన్నారు; "ఇక లే. వెళ్ళి అతని అప్పును చెల్లించు."

## 72వ అధ్యాయం

**మసీదును ఊడ్చి పరిశుభ్రపరచటం. అందులో నుంచి గుడ్డ పేలికల్నీ, చెత్తా చెదారాన్నీ ఏరిపారెయ్యటం.**

**448.** అబూ హురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: మస్జిదె నబవీని ఊడ్చి పరిశుభ్రపరిచే ఒక నల్లవాడు మరణించాడు. లేదా ఒక నల్ల స్త్రీ మరణించింది. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) అతనిని లేక ఆమెను చూడలేదు. ఆయన (స) గారు అతనిని గురించి ప్రజల్ని అడిగారు. వారు అతను చనిపోయాడు లేక ఆమె చనిపోయింది అని సమాధానం చెప్పారు. ఆయన (స), "మీరు నాకు ఈ విషయం గురించి ఎందుకు తెలియజెయ్యలేదు? పదండి, అతని సమాధి ఎక్కడుందో నాకు చూపించండి" అని సెలవిచ్చారు. దైవప్రవక్త (స) అతని లేక ఆమె సమాధి వద్దకు వెళ్లారు. ఆ సమాధి దగ్గర నమాజు చేశారు.[1]

## 73వ అధ్యాయం

**సారాయి వ్యాపారాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ అయింది మసీదులోనే.**

**449.** హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు; వడ్డీని నిషేధిస్తూ బఖరా సూరాలోని వాక్యాలు అవతరించినప్పుడు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) మసీదుకు వెళ్ళి ఆ వాక్యాలను ప్రజలకు చదివి వినిపించారు. ఆ తరువాత సారాయి వ్యాపారం చెయ్యకూడదు, దానిని దేవుడు నిషేధించాడు అని కూడా సెలవిచ్చారు.

## 74వ అధ్యాయం

**మసీదుకు సేవకుల్ని నియమించటం.**

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజిఅన్) ఆలి ఇమ్రాన్ సూరాలోని మూడవ వాక్యాన్ని ఉదహరించారు: "ప్రభూ! నా గర్భంలో ఉన్న శిశువును నేను నీకు సమర్పించుకుంటున్నాను. అది నీ సేవకు అంకితం. నా ఈ కానుకను స్వీకరించు. నీవు అన్నీ వినేవాడవు, అన్నీ తెలిసినవాడవూను."[1]

---

448–1. అంటే జనాజా నమాజు చేశారు. బైహఖీ ఉల్లేఖనంలో ఇలా ఉంది; ఆమె ఒక స్త్రీ. ఆమె పేరు ఉమ్మె మహ్‌జన్.

**450.** **హజ్రత్ అబూ హురైరా(రజిఅన్) ఇలా అన్నారని అబూ రాఫె (రజిఅన్) ఉల్లేఖించారు: ఒక స్త్రీ మస్జిదె నబవీని ఊడ్చి పరిశుభ్రపరుస్తూ ఉండేది. ఒక పురుషుడు మస్జిదె నబవీని ఊడ్చి పరిశుభ్రంగా ఉంచుతూ ఉండేవాడు. అబూ రాఫె (ర) ఏమన్నారంటే; ఆమె ఒక స్త్రీ అని నేను గట్టిగా అనుకుంటున్నాను. తరువాత పైన వచ్చిన హదీసునే ఆయన (ర) ఇక్కడ కూడా వివరించారు. అంటే దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) అతని లేక ఆమె సమాధి వద్దకు వెళ్లి జనాజా నమాజును చేశారు.**

## 76వ అధ్యాయం

## ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించే సమయంలో గుసుల్ చేసుకోవటం. ఇంకా ఖైదీని మసీదులో కట్టి ఉంచటం. ఇంకా రుణగ్రస్తుణ్ణి మసీదులోని స్తంభానికి కట్టివెయ్యమని షురైహ్ బిన్ హారిస్ ఆజ్ఞాపించేవారు.

**451.** **అబూహురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) అశ్వారూఢులైన సిపాయీలను (30 మందిని) నజద్ వైపునకు పంపారు. వారు అక్కడి నుంచి బనీ హనీఫా తెగకు చెందిన ఒక వ్యక్తిని పట్టుకువచ్చారు.[1] అతని పేరు సుమామా బిన్ ఉసాల్. తరువాత వారు అతనిని మసీదులోని ఒక స్తంభానికి కట్టివేశారు. ఆ తరువాత అక్కడకు దైవప్రవక్త (స) విచ్చేశారు. మూడో రోజున ఆయన(స), "సుమామాను విడిచిపెట్టండి" అని ఆజ్ఞాపించారు. అప్పుడు విడుదల పొందిన సుమామా మసీదుకు దగ్గర్లో ఉన్నటువంటి ఖర్జూరపు చెట్ల వద్దకు వెళ్ళి అక్కడ తలంటి స్నానం (గుసుల్) చేశారు. తరువాత మసీదులోకి వచ్చి ఇలా అనసాగారు: "అల్లాహ్ తప్ప నిజమైన ఆరాధ్య దైవం ఎవ్వడూ లేడనీ, మరియు ముహమ్మద్ (సఅసమ్) అల్లాహ్ ప్రవక్త అనీ నేను సాక్ష్యమిస్తున్నాను."[2]**

---

74–1. ఇది ఇమ్రాన్ భార్య అన్న విషయం. దానిని అల్లాహ్ ఖురాను గ్రంథంలో ఉదహరించాడు. ఆమెగారు తనకు కుమారుడు జన్మిస్తాడనే నమ్మకంతో ఆ కుమారుణ్ణి మస్జిదె అఖ్సా సేవకు అంకితం చేశారు. కాని కుమారునికి బదులుగా కుమార్తె జన్మించింది. అంటే హజ్రత్ మర్యమ్ (అలైహస్సలామ్) పుట్టారు. ఆమెగారి గాధ అందరికీ తెలిసినదే.

451–1. బనీ హనీఫా ఒక తెగ పేరు.

451–2. దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) సుమామాను ఎందుకు వదలిపెట్టారంటే, అతను ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించనున్నాడనే విషయం బహుశ ఆయన (స) గారికి

## 77వ అధ్యాయం
## రోగుల కోసం మసీదులో గుడారం వెయ్యటం.

**452.** హజ్రత్ ఆయెషా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: కందక యుద్ధం జరిగిన రోజున సాద్ బిన్ మాజ్ (రజిఅన్) గారికి బాహువులోని మధ్య నరానికి బాణం దెబ్బ తగిలి గాయం అయింది. అప్పుడు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) మసీదులో ఒక గుడారాన్ని ఏర్పాటు చేశారు. సాద్ బిన్ మాజ్ (ర)ను చికిత్స నిమిత్తం ఆ గుడారంలో ఉంచారు. ఆయన్ని(ర) గురించి తరచూ అడిగి తెలుసుకోవటానికి వీలుపడుతుందని అలా చేశారు. తరువాత మసీదులోనే ఉన్నటువంటి బనీ గిఫార్‌కు చెందిన గుడారం వైపునకు రక్తం ప్రవహిస్తూ వస్తూ ఉండటాన్ని ప్రజలు చూసి భయపడిపోయారు. వారు ఎలుగెత్తి ఇలా అన్నారు: గుడారంలో ఉన్న ప్రజలారా! ఇదేమిటి మీ గుడారం నుంచి మా వైపునకు రక్తం ఇలా ప్రవహిస్తోంది? పరిశీలిస్తే తెలిసిన విషయం ఏమిటంటే, సాద్ బిన్ మాజ్ (ర)కు అయినటువంటి గాయంలో నుంచే ఈ రక్తం ప్రవహిస్తూ వస్తోంది. చివరకు సాద్ (ర) తీవ్ర రక్తస్రావం కారణంగా మరణించారు.

## 78వ అధ్యాయం
## అవసరమైనప్పుడు ఒంటెను మసీదులోకి తీసుకుపోవటం.[1]

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజిఅన్) ఏమన్నారంటే; దైవప్రవక్త మహా శయులు ముహమ్మద్ (సఅసమ్) ఒంటెపై ఎక్కి కాబా గృహ ప్రదక్షిణం చేశారు.[2]

**453.** విశ్వాసుల తల్లి అయినటువంటి ఉమ్మె సలమా (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖిం చారు: “నాకు ఒంట్లో బాగాలేదు. కనుక నేను కాలినడకన కాబా గృహ ప్రదక్షిణం చెయ్యలేను” అని దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్)గారికి విన్నవించుకున్నాను. దానికి ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు: “ప్రజలకు వెనుకగా ఉండు, ఒంటె మీద స్వారీ చేస్తూ కాబా గృహ ప్రదక్షిణం చెయ్యి.” అప్పుడు

---

తెలిసిపోయి ఉండవచ్చు. ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించే సమయంలో ఒక మనిషి గుసుల్ చేసుకోవాలి అనే విషయం ఈ హదీసు ద్వారా నిరూపితమైపోయింది. ఇమామ్ అహ్మద్ (రహ్మాలై) గారి దృష్టిలో ఈ గుసుల్ చేసుకోవటం వాజిబ్.

78–1. అవసరం అంటే ఇక్కడ అనారోగ్యం అని భావం. కొందరేమన్నారంటే, ఏదైనా అవసరం కలిగినప్పుడు.

78–2. ఈ ఉల్లేఖనాన్ని స్వయంగా ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారే ‘హజ్’ ప్రకరణంలో ప్రస్తావించారు.

**నేను ఒంటె మీద స్వారీ అయి కాబా గృహ ప్రదక్షిణం చేశాను. మహాప్రవక్త (సఅసమ్) ఆ సమయంలో కాబా గృహంలో ఒక వైపున నమాజులో నిమగ్నమై ఉన్నారు. ఇంకా ఆయన (స) నమాజులో ఖురాను గ్రంథంలోని 'అత్ తూర్' సూరాను పారాయణం చేస్తున్నారు.[1]**

## 79వ అధ్యాయం

**454.** **హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారి సహచరుల్లోని ఇద్దరు వ్యక్తులు ఒక చీకటి రాత్రిన తమ ఇళ్లకు పోయేందుకు ఆయన (స) గారి నుంచి సెలవుతీసుకుని బయలుదేరారు. వారికి ముందు భాగంలో రెండు దీపాలు వెలుగును విరజిమ్ముతూ మార్గం చూపుతూ ప్రయాణం చేస్తున్నాయి. వారు ఉభయులూ ఒకరి నుంచి ఒకరు విడిపోయినప్పుడు ప్రతి వ్యక్తికి తోడుగా ఒక్కొక్క దీపం ఉండిపోయింది. ఆ దీపాలు, వారు తమ ఇళ్లకు చేరుకునే వరకు వారికి తోడుగా ఉండిపోయాయి.[1]**

## 80వ అధ్యాయం

### మసీదుకు కిటికీలనూ, తలుపులనూ పెట్టటం.

**455.** **హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఒక రోజున ఖుత్బా (ఉపన్యాసం) ఇస్తూ ఇలా సెలవిచ్చారు: "పరిశుద్ధుడైన అల్లాహ్ తన ఒక దాసునికి ఈ అనుమతిని ప్రసా**

---

453–1. ఇబ్నె బతాల్ ఇలా అన్నారు; ఈ హదీసు ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే, హలాల్ పశువులను మసీదులోకి తీసుకువెళ్ళటం ధర్మసమ్మతమైన విషయమే. ఇంకా హాఫిజ్ ఇబ్నెహజర్ గారు ఏమన్నారంటే; మసీదు అశుద్ధమవుతుందని భయపడితే అప్పుడు జంతువులను మసీదులోకి తీసుకుపోరాదు.

454–1. ఇది దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారి మహిమల్లోని ఒక మహిమ. ఆయన (స) గారికి వారి మీద ఉన్నటువంటి ప్రేమ వల్ల కలిగే శుభాల వర్షం. పరలోకంలో లభించబోయే వెలుగు యొక్క ఒక భాగం వారికి ప్రపంచంలోనే చూపించబడింది. ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారు ఈ హదీసును ఈ అధ్యాయంలో పెట్టటానికి కారణం ఏమిటంటే; మహాప్రవక్త (స) గారి ఈ సహచరులిద్దరూ అంత రాత్రి పోయిన తరువాత ఆయన (స) గారి వద్ద నుంచి తమ ఇళ్లకు బయలుదేరి పోయారంటే, దాని అర్థం, వారు దైవప్రవక్త (స) గారితో ఏవో సమాలోచనలు తప్ప కుండా జరిపి ఉంటారు. కనుక మసీదులో సమాలోచనలు జరపటం, ముఖ్యమైన విషయాలను గురించి మాట్లాడుకోవటం ధర్మసమ్మతమైన విషయమే అని తేలి పోయింది.

దించాడు; అతను తాను ఇష్టపడితే ఈ ప్రపంచాన్నయినా కోరుకోవచ్చు. లేదా పరలోకంలో అల్లాహ్ వద్ద ఉన్నదాన్నయినా ఎన్నుకోవచ్చు. అయితే ఆ దాసుడు పరలోకంలో అల్లాహ్ వద్ద ఉన్న దానినే వరించాడు." ఇది విని హజ్రత్ అబూ బకర్ (ర) విలపించ సాగారు. అప్పుడు నేను నా మనస్సులో ఇలా అనుకున్నాను; ఈ ముసలాయన ఎందుకు ఏడుస్తున్నాడు?[1] అల్లాహ్‌యేమో తన ఒక దాసునికి ఇహపరలోకాలు రెండింటిలో నుంచి తనకు ఇష్టమైన దానిని ఎన్నుకోమని అధికారం ఇచ్చాడు. ఆ దాసుడు పరలోకాన్ని ఇష్టపడి ఎంపిక చేసుకున్నాడు. దానితో ఈ ముసలయానకేమి సంబంధం? అతను ఎందుకు ఏడవాలి? తరువాత నాకు తెలిసిందేమిటంటే; ఆ దాసుడు స్వయంగా మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) అని. ఇంకా మా అందరిలోకెల్లా హజ్రత్ అబూ బకర్ (ర) ఎక్కువ జ్ఞానసంపన్నులని. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారు: "ఓ అబూ బకర్! ఏడ్వబాకు. సహవాసం ద్వారా, సంపద ద్వారా అందరికంటే అధికంగా నాకు ఉపకారం చేసినవాడవు నీవే. ఒకవేళ నేను నా సంఘంలోని వారిలో ఎవరినైనా ప్రాణ స్నేహితుడిగా చేసుకుంటే అబూ బకర్‌నే ప్రాణమిత్రుడుగా చేసుకుంటాను.[2] (ప్రాణస్నేహమయితే అల్లాహ్‌తో తప్ప మరెవరితోనూ సాధ్యపడని విషయం) కాని ఇస్లామీయ సోదర బంధం, స్నేహ బంధం సరిపోతాయి. మసీదు తలుపులన్నీ మూసివెయ్యండి. ఒక్క అబూబకర్ ద్వారాన్ని తప్ప."

**456.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) తన మరణానికి కారణమైన వ్యాధి తీవ్రమైనప్పటి స్థితిలో ఒక గుడ్డను తన శిరస్సుకు చుట్టుకుని బయటికి వచ్చారు. తరువాత మెంబర్ మీద ఆసీనులయ్యారు; అల్లాహ్ స్తోత్రం చేశారు. ఆయన పవిత్ర నామాన్ని కొనియాడారు. ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. తరువాత ఇలా సెలవిచ్చారు: "సహవాసం ద్వారా, సంపద ద్వారా నాకు ఎక్కువగా ఉపకారం

455-1. దాసుడు అంటే ఎవరో అనే విషయం అబూ సయీద్ ఖుద్రి (ర) గారికి మొదట్లో అర్థం కాలేదు. కనుక ఆయన (ర) హజ్రత్ అబూ బకర్ (ర) ఏడ్చినప్పుడు ఆశ్చర్య పోయారు.

455-2. భావం ఏమిటంటే, దైవప్రవక్తకు కేవలం ఒక్క దేవుడు మాత్రమే ప్రాణ స్నేహితుడు కాగలుగుతాడు. ఒక్క అల్లాహ్‌తో తప్ప మరెవరితోనూ దైవప్రవక్త ప్రాణ స్నేహితం చెయ్యలేదు.

**చేసినవారు అబూ బకర్ తప్ప మరెవ్వరూ లేరు. నేను గనక ఎవరినైనా ప్రాణ స్నేహితుడుగా చేసుకోదలిస్తే, అబూ బకర్ (ర)ను తప్పకుండా నా ప్రాణస్నేహితుడుగా చేసుకుని ఉండేవాడిని. కాని ఇస్లామీయ సహవాసాన్ని మించినది లేదు. చూడండి! ఈ మసీదుకు ఎన్ని కిటికీలు ఉన్నాయో వాటన్నింటినీ మూసి వేయండి. కాని అబూ బకర్ కిటికీని తెరచి ఉంచండి. దానిని మూయబాకండి."**

## 81వ అధ్యాయం

### కాబా గృహానికీ, ఇతర మసీదులకూ తలుపులు పెట్టటం, తాళాలు వెయ్యటం.

**"ఇబ్నె అబీములైకా తనతో ఇలా అన్నారని ఇబ్నె జురైజ్ ఉల్లేఖించారు: "ఓ అబ్దుల్ మలిక్! నీవు గనక ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) గారి మసీదులనూ, వాటికి ఉన్నటువంటి తలుపులనూ చూస్తే ఆశ్చర్యపోతావు."[1]**

**457.** అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా సెలవిచ్చారని నాఫె ఉల్లేఖించారు: **దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) (మక్కా నగరం జయింప బడిన సంవత్సరంలో) మక్కా నగరానికి విచ్చేశారు, తరువాత ఉస్మాన్ బిన్ తల్‌హా (ర)ను పిలిపించారు (ఆయన కాబా గృహానికి ధర్మకర్తగా ఉండేవారు. దాని తాళపు చేతులు ఆయన వద్ద ఉండేవి). ఆయన (ర) వచ్చి కాబా గృహ తలుపులను తెరిచారు. ఆ తరువాత దైవప్రవక్త మహాశయులూ, హజ్రత్ బిలాల్ (ర), ఉసామా బిన్ జైద్ (ర) మరియు ఉస్మాన్ బిన్ తల్‌హా (ర) గార్లందరూ కలసి లోపలకు వెళ్లారు. తరువాత లోపల్నుంచి తలుపులు మూసేశారు.[1] వారు లోపల కొంచెం సేపు ఉన్నారు. మళ్లీ అందరూ బయటికి వచ్చేశారు. ఇబ్నె ఉమర్ (ర) ఇలా అన్నారు; "ఈ విషయాన్ని తెలుసుకుని నేను హజ్రత్ బిలాల్ (ర) వద్దకు పరుగెత్తుకుంటూ వెళ్లి ఇలా అడిగాను; 'దైవప్రవక్త (స) గారు కాబా గృహంలో ఉన్నప్పుడు ఏం చేశారు?'**

---

81–1. వాటి తలుపులు ఎంతో పటిష్ఠంగానూ, ఎంతో గట్టిగానూ ఉండేవి. మసీదులు ఎంతో పరిశుభ్రంగా ఉండేవి.

457–1. ఎందుకంటే, మరింత మంది ప్రజలు లోపలకు చొరబడకుండా ఉండాలని. ఇంకా ఎక్కువ మంది ప్రజలు గుమిగూడకుండా ఉండాలని. దీని ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే; పవిత్ర కాబా గృహానికి తలుపులు ఉండేవని, వాటికి తాళాలు కూడా వేసేవారని. అధ్యాయంలోని ముఖ్యాంశం కూడా ఇదే; మసీదుల్ని కూడా కాబా గృహం మాదిరిగానే చూసుకోవాలి; వాటికి తలుపులు పెట్టుకోవాలి, తాళాలు వెయ్యాలి.

**దానికి సమాధానంగా ఆయన (ర), 'నమాజు చేశారు' అని చెప్పారు. 'నమాజు ఎక్కడ చేశారు?' అని నేను మళ్ళీ అడిగాను. దానికి జవాబుగా ఆయన (ర), 'దైవప్రవక్త (స) రెండు స్తంభాల మధ్య నమాజు చేశారు' అని చెప్పారు. ఇబ్నె ఉమర్ (ర) చివర్లో ఇలా అన్నారు; 'దైవప్రవక్త (స) అక్కడ ఎన్ని రకాతుల నమాజు చేశారు?' అని అడగటం నేను మరచిపోయాను."**

## 82వ అధ్యాయం

## ముష్రిక్కులు మసీదుల్లోకి ప్రవేశించటం గురించి.[1]

**458. అబూ హురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) అశ్వారూఢులైన సిపాయిలను నజద్ వైపునకు పంపారు. వారు బనీ హనీఫా తెగకు చెందినటువంటి ఒక వ్యక్తిని పట్టుకుని వచ్చారు. అతని పేరు సుమామ బిన్ ఉసాల్. అతనిని వారు మస్జిదె నబవీలోని ఒక స్తంభానికి కట్టేశారు.[1]**

## 83వ అధ్యాయం

## మసీదులో బిగ్గరగా మాట్లాడటం ధర్మసమ్మతమేనా?[1]

**459. సాయబ్ బిన్ యజీద్ ఇలా ఉల్లేఖించారు: నేను మసీదులో నిలబడి ఉన్నాను. ఇంతలోనే ఎవరో ఒక వ్యక్తి నా మీదకు ఒక కంకర రాయిని విసిరాడు.**

---

82-1. పండితుల మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నాయి. ఇమామ్ అబూ హనీఫా (రహ్మాలై) గారి దృష్టిలో ఇది దోషం కాదు. ధర్మసమ్మతమైన విషయమే. ఇమామ్ బుఖారీ (ర) గారి అభిప్రాయం కూడా ఇదే. షౌకాని గారు ఏమన్నారంటే; ఈ అధ్యాయంలోనే మరొక హదీసు కూడా ఉంది. దాని ప్రకారం, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) సఖీఫ్ తెగకు చెందిన దూతలకు మసీదులోనే బస ఏర్పాటు చేశారు. వాస్తవానికి వారు ముష్రిక్కులు. ఇమామ్ మాలిక్ (ర) గారి అభిప్రాయం ప్రకారం, ముష్రిక్కులను మసీదుల్లోకి రానివ్వకూడదు. అది ధర్మసమ్మతం కాదు. ఇమామ్ షాఫయి (ర) గారు ఏమంటారంటే; ముష్రిక్కులను పవిత్ర కాబా గృహంలోకి మాత్రం రానివ్వకూడదు. ఇతర మసీదుల్లోకి వారు ప్రవేశించవచ్చు. కొందరు ఏమన్నారంటే; గ్రంథప్రజలను ముస్లిముల అనుమతిని తీసుకుని మసీదు ల్లోకి రానివ్వవచ్చు. ఇది ధర్మసమ్మతమైన విషయమే.

458-1. అధ్యాయంలో ప్రస్తావించబడిన ముఖ్యాంశం ఇదే. ఎందుకంటే సుమామ బిన్ ఉసాల్ అప్పటి వరకు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించనే లేదు. అతను ముష్రిక్కుగానే ఉన్నాడు. అతనిని మస్జిదె నబవీలో ఖైదీగా ఒక స్తంభానికి కట్టివేశారు.

**చూస్తే తెలిసిందేమిటంటే, ఆ వ్యక్తి ఎవరో కాదు, హజ్రత్ ఉమర్ (రజిఅన్) గారే. ఆయన (ర) నాతో ఇలా అన్నారు; "వెళ్లు, అక్కడ నిలబడి ఉన్న ఆ ఇద్దరు వ్యక్తులను నా దగ్గరకు పిలుచుకురా." ఆయన చెప్పిన విధంగానే ఆ వ్యక్తులను నేను పిలుచుకు వచ్చాను. అప్పుడు హజ్రత్ ఉమర్ (ర) వారిని, 'ఎవరు మీరు?' అని అడిగారు. లేదా వారితో ఇలా అన్నారు; 'మీరు ఎక్కడ నుంచి వచ్చారు?' వారు, 'మేము తాయఫ్ పట్టణానికి చెందిన వాస్తవ్యులం'[1] అని చెప్పారు. అప్పుడు హజ్రత్ ఉమర్ (ర) ఇలా సెలవిచ్చారు; 'ఒకవేళ మీరు ఈ నగరానికి (మదీనా నగరం) చెందిన పౌరులై ఉంటే, నేను మిమ్మల్ని తప్పకుండా శిక్షించి ఉండేవాడిని. మీరు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారి మసీదులో నిలబడి బిగ్గరగా మాట్లాడుతున్నారు.'[2]**

**460.** **కాబ్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారి జీవిత కాలంలో ఒకసారి మస్జిదె నబవీలో నాకు**

---

83–1. ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారు ఈ అధ్యాయంలో రెండు హదీసులను ఉదాహరించారు. ఒక హదీసులోనయితే మసీదులో బిగ్గరగా మాట్లాడటం నిషేధించబడింది. రెండో హదీసులో మాత్రం అది తప్పు కాదు, ధర్మసమ్మతమే అని చెప్పబడింది. అర్థం ఏమిటంటే; అనవసరంగా మసీదులో బిగ్గరగా మాట్లాడటం ధర్మసమ్మతం కాదు. కాని అవసరమైనప్పుడు మాత్రం బిగ్గరగా మాట్లాడటం ధర్మసమ్మతమే. ఉదాహరణకు, ధర్మజ్ఞాన బోధనం కోసం బిగ్గరగా మాట్లాడటం ధర్మశాస్త్రయుక్తమే. ఇమామ్ అబూ హనీఫా (ర) గారి అభిప్రాయం కూడా ఇదే. కాని ఇమామ్ మాలిక్ (ర) గారి దృష్టిలో మసీదులో బిగ్గరగా మాట్లాడటం పూర్తిగా నిషిద్ధం. కొందరి అభిప్రాయం ప్రకారం, మస్జిదె నబవీలో బిగ్గరగా మాట్లాడటం పూర్తిగా నిషిద్ధం. కాని ఇతర మసీదులలో ఏదైనా ధార్మిక అవసరం రీత్యా ఉదాహరణకు, ధర్మజ్ఞాన బోధన నిమిత్తంగానీ లేదా ఏదైనా వ్యాజ్యాన్ని పరిష్కరించేందుకుగానీ మసీదులో బిగ్గరగా మాట్లాడటం ధర్మ సమ్మతమైన విషయమే.

459–1. 'తాయఫ్' పేరు ప్రఖ్యాతులు గాంచిన ఒక పట్టణం. మక్కా నగరం నుంచి తాయఫ్‌కు వెళ్ళటానికి ఆ రోజులలో రెండు రోజులు పట్టేది.

459–2. అంటే మీరు గనక విదేశీయులు కాకుండా ఉంటే మీకు తప్పకుండా శిక్షపడి ఉండేది. ఇక్కడ విదేశీయులకు మినహాయింపు ఇవ్వటం జరిగింది. ఎందుకంటే, వారికి ఈ విషయం గురించి తెలియదు.

బాకీ ఉన్న అప్పును చెల్లించమని నేను అబ్దుల్లా బిన్ అబీ హద్రద్‌ను గట్టిగా అడిగాను. మాటామాటా పెరిగి మా ఇద్దరి కంఠస్వరాలు పెద్దవయ్యాయి. చివరకు దైవప్రవక్త (స) మేము గొడవపడటాన్ని ఇంట్లో నుంచే విన్నారు. తరువాత ఆయన(స) గారు బయటకు వచ్చేశారు. ఇంకా తన ఇంటి ద్వారానికున్న తెరను తొలగించి కాబ్ (ర)ను పిలిచారు. హజ్రత్ కాబ్; 'ఓ దైవప్రవక్తా (స)! నేను మీ ముందరే ఉన్నాను ఆజ్ఞాపించండి' అని అన్నారు. అప్పుడు ఆయన (స) చేత్తో సైగ చేస్తూ సగం అప్పును మాఫీ చెయ్యమని సూచించారు. హజ్రత్ కాబ్ (ర) ఇలా అన్నారు; "ఓ దైవ ప్రవక్తా (స)! మీ ఆజ్ఞానుసారం నేను సగం రుణాన్ని మాఫీ చేశాను." అప్పుడు ఆయన (స) ఇబ్నె అబీ హద్రద్‌తో ఇలా అన్నారు; "ఓ అబీ హద్రద్! ఇక లే, వెళ్లు. డబ్బు తీసుకువచ్చి రుణాన్ని చెల్లించు."

## 84వ అధ్యాయం

### మసీదులో వృత్తాకారంలో కూర్చొని ధార్మిక సమావేశాలు జరుపుకోవటం. ఇంకా ఇట్టే కూర్చోవటం.

**461.** ఇబ్నె ఉమర్ (రజిఅన్) ఇలా సెలవిచ్చారని నాఫె ఉల్లేఖించారు: ఒక వ్యక్తి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారిని ఇలా అడిగాడు; అప్పుడు దైవప్రవక్త (స) మెంబర్ మీద ఉన్నారు. "ఓ దైవప్రవక్తా! రాత్రి నమాజు (తహజ్జుద్ నమాజు) ఎలా చెయ్యాలో దయచేసి చెప్పండి." అప్పుడు ఆయన (స) గారు ఇలా సెలవిచ్చారు; "రెండేసి రకాతుల చొప్పున నమాజు చెయ్యి. తరువాత మీలో ఎవరికైనా తెల్లవారబోతోందనే (ఉదయం) భయం కలిగితే అప్పుడు ఒకే ఒక రకాతు నమాజు చెయ్యాలి. ఆ నమాజు ఇంతవరకు చేసిన నమాజులన్నింటినీ బేసి నమాజులుగా చేసేస్తుంది." హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (ర) దైవప్రవక్త మహాశయులు (స) ఇలా ఆజ్ఞాపించారని చెప్పారు; రాత్రి పూట చేసే నమాజు చివర్లో వితర్ నమాజును చెయ్యండి.

**462.** అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఒక వ్యక్తి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) వద్దకు వచ్చాడు. అప్పుడు ఆయన (స) గారు మసీదులో ఉపన్యసిస్తున్నారు. అతను ఆయన (స) గారిని, రాత్రి నమాజులు ఎలా చెయ్యాలో వివరించమని అడిగాడు. దానికి సమాధానంగా ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు; రెండేసి రకాతుల చొప్పున నమాజు చెయ్యి. తరువాత తెల్లవారు తుందేమో అనే భయం కలిగితే అప్పుడు ఒక రకాతు వితర్ నమాజు చెయ్యి. అది

ఇంతవరకు చేసిన మొత్తం నమాజులను బేసి నమాజులుగా చేస్తుంది." ఉబైదుల్లా బిన్ అబ్దుల్లా ఉమర్ (ర) ఇలా ఉల్లేఖించారు: ఒక వ్యక్తి దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (స) దగ్గరకు వచ్చాడు. అప్పుడు ఆయన (స) గారు మసీదులో ఉన్నారు.

**463.** అబూ వాఖిద్ లైసీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) మసీదులో ఆసీనులై ఉన్నారు.[1] అంతలోనే ముగ్గురు వ్యక్తులు వచ్చారు. వారిలోని ఇద్దరైతే దైవప్రవక్త (స) గారి వద్దకు మసీదు లోకి వచ్చేశారు. ఒక వ్యక్తి అక్కడ నుంచే వెళ్లిపోయాడు. ముందు వచ్చిన ఉభయు ల్లోని ఒకడు సభలో ఒక చోట ఖాళీ స్థలం ఉండటాన్ని గమనించి, అక్క డకు వెళ్లి కూర్చున్నాడు. రెండో అతనికి కూర్చోవటానికి స్థలం దొరకలేదు. కనుక అతడు సభలోని వారి వెనుక స్థలంలో కూర్చున్నాడు. మూడో వ్యక్తి అయితే బయటి నుంచే వెనుదిరిగిపోయాడు. దైవప్రవక్త(స) హితబోధను ముగించిన తరువాత ఇలా సెలవిచ్చారు; "ప్రజలారా! నేను ఆ ముగ్గురు వ్యక్తుల వృత్తాంతాన్ని గురించి మీకు చెబుతాను వినండి. వారిలోని ఒకడు అల్లాహ్‌ను ఆశ్రయించాడు. అల్లాహ్ అతనికి ఆశ్రయమిచ్చాడు. రెండో వ్యక్తి సభికులలోకి చొరబడటానికి సిగ్గుపడ్డాడు. అల్లాహ్ కూడా అతని పట్ల సిగ్గుపడ్డాడు. మూడో వ్యక్తి అల్లాహ్ వైపు నుంచి ముఖం తిప్పు కున్నాడు. కనుక అల్లాహ్ కూడా అతని పట్ల వైముఖ్యం చూపాడు."

## 85వ అధ్యాయం

## మసీదులో వెల్లకిలా పడుకోవటం

**464.** తన బాబాయి అబ్దుల్లా బిన్ జైద్ (ర) ఇలా అన్నారని అబ్బాద్ బిన్ తమీమ్ ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) మసీదులో వెల్లకిలా పడుకుని ఉండటాన్ని నేను చూశాను. ఇంకా అప్పుడు ఆయన (స) తన ఒక కాలును మరొక కాలు మీద పెట్టుకుని ఉన్నారు. సయీద్ బిన్ ముసయ్యబ్ ఇలా ఉల్లేఖించారు: హజ్రత్ ఉమర్ (ర), హజ్రత్ ఉస్మాన్ (ర) గార్లు కూడా ఇలానే చేసేవారు.[1]

---

463-1. దైవప్రవక్త (స) ప్రజలకు ధర్మానికి సంబంధించిన విషయాలను బోధిస్తున్నారు. ప్రజలు ఆయన (స) చుట్టూ చిన్న చిన్న బృందాలుగా ఏర్పడి వృత్తాకారంలో కూర్చు న్నారు. ఈ హదీసు ద్వారా మసీదులో చిన్న చిన్న సమావేశాలు ఏర్పాటు చేసుకునే అనుమతి లభిస్తుంది. విద్యా బోధన కోసం, పవిత్ర అల్లాహ్ నామాన్ని స్మరించటం కోసం గ్రూపులుగా మసీదులో కూర్చోవచ్చు.

## 86వ అధ్యాయం

**ఒకవేళ మసీదు రాకపోకల మార్గం మీద కట్టబడి ఉంటే, కాని అది ప్రజలకు నష్టం కలిగించ నట్లయితే అప్పుడు అది దోషమేమీ కాదు. ఇమామ్ హసన్ బస్రీ (రహ్మాలై) గారూ, అయ్యూబ్ (రహ్మాలై) గారూ, ఇమామ్ మాలిక్ (రహ్మాలై) గారూ ఈ అభిప్రాయంతో ఏకీభవించారు.[1]**

**465.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారి ధర్మపత్ని హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు; నాకు తెలివి వచ్చినప్పటినుంచీ నేను నా తల్లిదండ్రుల్ని ముస్లిములుగానే చూశాను. ఇంకా దైవప్రవక్త (సఅసమ్) గారు మా దగ్గరకు రాని రోజు అంటూ ఏదీ గడిచేది కాదు. ఉదయం సాయంత్రం రెండు పూటలూ ఆయన (స) మా వద్దకు వస్తూ ఉండేవారు. తరువాత తన ఇంటి ప్రాంగణంలో ఒక మసీదును కట్టాలనే ఆలోచన నా తండ్రిగారైన హజ్రత్ అబూబకర్ (రజిఅన్) మనస్సుకు తట్టింది. ఆ ఆలోచన ప్రకారమే ఆయన(స) తన ఇంటి ముంగిట్లో ఒక మసీదును కట్టుకున్నారు. అక్కడ ఆయన (స) గారు నమాజూ చేసే వారు, ఖురాను పారాయణమూ చేసేవారు. ముష్రిక్కుల స్త్రీలు అక్కడ నిలబడి వినేవారు. వారి పిల్లలు కూడా వినేవారు. వారందరూ ఆశ్చర్య చకితులై ఆయన్ని (ర) చూస్తూ ఉండేవారు. హజ్రత్ అబూబకర్ (ర) ఎంతో మృదు స్వభావులు. ఆయన (ర) ఖురాను చదివినప్పుడు కళ్ల వెంట ధారాపాతంగా నీళ్లు కారేవి. వాటిని ఆపుకోవటం ఆయన (ర)కు కష్టతరమయ్యేది. ఈ స్థితిని చూసి ఖురైష్ తెగకు చెందిన ముష్రిక్ పెద్దలు భయపడిపోయారు.[1]

---

464–1. అంటే మసీదులో వెల్లకిలా పడుకునేవారు. ఒక కాలును మరొక కాలు మీద పెట్టి. ఒక హదీసులో మాత్రం ఇలా పడుకోవటం నిషేధించబడింది. దాని అర్థం ఏమిటంటే, శరీరం మీద నుంచి సతర్ (ఆచ్ఛాదన) తొలగిపోయే భయం ఉన్నప్పుడు. కనుక ఈ రెండు హదీసుల మధ్య వైరుధ్యం అనేది లేనేలేదు. కొందరేమన్నారంటే, నిషేధం ఉన్నటువంటి హదీసు రద్దు అయిపోయింది.

86–1. తన ఆస్తిలోగానీ, తనకు చెందిన స్థలంలోగానీ మసీదును కట్టటం ధర్మసమ్మతమైన విషయమే. కాని ఇతరులకు చెందిన స్థలంలో మసీదును కట్టటం నిషిద్ధం. మార్గ మధ్యంలో మసీదును కట్టటం ధర్మసమ్మతమే. కాని దాని వల్ల ఆ మార్గం మీద నడిచే బాటసారులకు ఎలాంటి ఇబ్బందీ కలగకూడదు. కొందరు ఏమన్నారంటే; మార్గంలో మసీదును నిర్మించటం అసలు ధర్మసమ్మతం కానేకాదు. కాని ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారు ఈ అభిప్రాయాన్ని త్రోసిపుచ్చారు.

465–1. ఖురాను గ్రంథ పారాయణాన్ని విని తమ స్త్రీలూ, తమ పిల్లలూ ముస్లిమ్‌లు

## 87వ అధ్యాయం

## మార్కెట్టులో ఉన్నటువంటి మసీదులో నమాజు చెయ్యటం

**అబ్దుల్లా బిన్ ఔన్ ఒక ఇంట్లో ఉన్నటువంటి మసీదులో నమాజు చేశారు. వారు ఆ మసీదు లోపల ఉన్నప్పుడు దాని తలుపులు మూసేసేవారు.[1]**

**466. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు: జమాఅత్‌తో కలిసి నమాజు చెయ్యటం, ఇంట్లోనూ, మార్కెట్టులోనూ నమాజు చెయ్యటం కంటే 25 రెట్లు ఎక్కువ ఔన్నత్యాన్ని, పుణ్యాన్ని కలిగి ఉంటుంది. ఎందుకంటే, మీలో ఎవరైనా చక్కగా వుజూ చేసుకుని నమాజు చేసే సంకల్పంతో మసీదులోకి ప్రవేశిస్తే, మసీదులోకి ప్రవేశించే వరకు అతను వేసే ప్రతి అడుగుకు అల్లాహ్ అతని స్థానాన్ని ఒక రెట్టు పెంచుతూ ఉంటాడు. ఇంకా అతను చేసిన ఒక పాపాన్ని రద్దు చేస్తాడు. అతను మసీదులోకి ప్రవేశించిన తరువాత నమాజు కోసం ఆగి ఉన్నంతవరకు అతనికి నమాజుకు లభించే పుణ్యం లభిస్తూ ఉంటుంది. ఇంకా అతను నమాజు చేసే స్థలంలో కూర్చొని ఉన్నంత వరకు, దైవదూతలు అతని కోసం ఇలా ప్రార్థిస్తూ ఉంటారు; "ఓ అల్లాహ్! ఇతనిని క్షమించు. ఓ అల్లాహ్! ఇతనిని కరుణించు. అతను అపాన వాయువు విడిచి దైవదూతలకు కష్టం కలిగించనంతవరకు. (ప్రార్థిస్తూనే ఉంటారు)"**

---

అయిపోతారేమో అని వారు భయపడ్డారు. ఈ హదీసు అధ్యాయంలోని ప్రధానాంశంతో ఎలా పొసగుతుందంటే; హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (ర) తన ఇంటి ప్రాంగణంలో నుంచి పోయే ఒక బాట మీద మసీదును నిర్మించారు. దైవప్రవక్త మహాశయులు (స) ప్రతిరోజు ఆయన (ర) వద్దకు వస్తూ పోతూ ఉండేవారు కాబట్టి ఆ మసీదును చూశారు, అయినా ఏమీ చెప్పకుండా ఆయన (స) మౌనంగా ఉండిపోయారు. దీని ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే, రోడ్డు ప్రక్కన మసీదు కట్టటం ధర్మసమ్మతమైన విషయమే.

87-1. వారు ఆ మసీదులోనే ఉండేవారు. నమాజు కూడా చేస్తూ ఉండేవారు. కిర్మాని గారు ఇలా అన్నారని ఇబ్నె హజర్ (రహ్మాలై) చెప్పారు; ఇమామ్ బుఖారి (రహ్మాలై) గారు హనఫీ వర్గం వారి ఖండనతో ఏకీభవించారు. వారు ఏమన్నారంటే; ప్రజలు ఇళ్లల్లోనికి తమ ఇష్టానుసారంగా రావటానికీ పోవటానికీ అనుమతి ఉండదు కాబట్టి ఇళ్ళల్లో మసీదులు కట్టటం ధర్మసమ్మతం కాదు. హనఫీ వర్గం వారి గ్రంథాలలో దానిని మక్రూహ్ (అసహ్యాకరమైనది) అనటం జరిగింది కాని హరామ్ (నిషిద్ధం) అని అనబడలేదు.

## 88వ అధ్యాయం

## మసీదులోగానీ, మసీదు బయటగానీ చేతుల్ని కలిపి వ్రేళ్లను కూర్చుకోవటం.[1]

**467.** అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) లేదా అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) తమ రెండు చేతులను కలిపి వ్రేళ్లను కూర్చుకొన్నారు. దైవప్రవక్త మహాశయులు ఇలా సెలవిచ్చారని అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (ర) ఉల్లేఖించారు: "ఓ అబ్దుల్లా! భ్రష్టుపట్టిన (చెడిపోయిన) ప్రజల మధ్య ఉండిపోయినప్పుడు నీ పరిస్థితి ఎలా ఉంటుంది?"

**468.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అబూ మూసా అష్అరీ (రజిఅన్) ఉల్లేఖించారు : ఒక ముస్లిమ్ మరొక ముస్లిమ్‌కు ఒక భవనం లాంటివాడు. దాని యొక్క ఒక భాగం మరొక భాగాన్ని ఆదుకుంటుంది. అలా అంటూ ఆయన (స) తన చేతుల వ్రేళ్లను కూర్చుకున్నారు.

**469.** అబూ హురైరా (రజిఅన్) ఇలా చెప్పారని ముహమ్మద్ బిన్ సీరీన్ ఉల్లేఖించారు: "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) సాయంత్రపు రెండు నమాజుల్లోని ఒక నమాజుకు నాయకత్వం వహించారు." (జొహర్ నమాజు లేదా అసర్ నమాజు)– ఆ నమాజు ఏ నమాజో నేను మరచిపోయాను అని అబూ హురైరా (ర) చెప్పారని ముహమ్మద్ బిన్ సీరీన్ అన్నారు– సరే ఆయన(స) గారు మాకు రెండు రకాతుల నమాజు చేయించి సలామ్ చేశారు. తరువాత మసీదులో పాతి ఉన్న ఒక కర్ర వద్దకు వెళ్ళి దానికి ఆనుకుని నిల్చున్నారు. అప్పుడు ఆయన (స) గారు కోపంతో ఉన్నారనిపించింది. ఇంకా ఆయన (స) తన కుడి చేతిని ఎడమ చేతి మీద పెట్టి చేతుల వ్రేళ్లను కూర్చుకున్నారు. ఇంకా తన కుడి దవడను ఎడమ అరచేయి వెనుక భాగం మీద పెట్టారు. తొందరపడే ప్రజలు మాత్రం మసీదులో నుంచి బయటకు వెళ్లిపోయారు. ప్రజలు పరస్పరం ఇలా అనుకోసాగారు; "నమాజులోని రకాతులేమైనా తగ్గించబడ్డాయా?" ఆ సమయంలో హజ్రత్ అబూబకర్ (ర), హజ్రత్

---

88–1. తష్బీక్ అంటే చేతుల వ్రేళ్లను కూర్చుకోవటాన్ని కొన్ని హదీసులు నిషేధిస్తున్నాయి. కాని ఇమామ్ బుఖారీ (రహ్మాలై) ఈ అధ్యాయాన్ని ఆవిష్కరించి ఆ హదీసులు నిజమైనవి కావని నిరూపించారు. కొందరు ఏమన్నారంటే, నమాజు స్థితిలో ఉన్నప్పుడుగానీ, లేదా నమాజుకోసం నిరీక్షించే స్థితిలో ఉన్నప్పుడుగానీ అలా చేతుల వ్రేళ్లను కూర్చుకోరాదు.

ఉమర్ (ర) కూడా ప్రజల మధ్య ఉన్నారు. వారు మహాప్రవక్త (స)ను ఈ విషయం గురించి అడిగేందుకు భయపడ్డారు. ఇంకా ప్రజల్లో పొడుగాటి చేతులుగల వ్యక్తి కూడా ఒకడు ఉన్నాడు. అందువల్ల జనులు అతన్ని జుల్ యదయ్‌న్ అని పిలిచేవారు. అతను ఇలా అడిగాడు, "ఓ దైవప్రవక్తా(స)! మీరు మరచిపోయారా? లేక అల్లాహ్ తరఫు నుంచి నమాజు రకాతులేమైనా తగ్గించబడ్డాయా?" దానికి సమాధానంగా మహాప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు; "నేను మరచిపోనూ లేదు. నమాజు రకాతులు తగ్గించబడనూ లేదు". తరువాత ఆయన (స) ప్రజల వైపునకు తిరిగి సంబోధిస్తూ, ఇలా అడిగారు; "జుల్ యదయ్‌న్ నిజమే చెబుతున్నాడా?" దానికి జవాబుగా ప్రజలు, 'అవును దైవప్రవక్తా (స)' అని విన్నవించుకున్నారు. ఇది విని ఆయన (స) గారు ముందుకు వెళ్లారు. విడిచిపెట్టిన నమాజును పూర్తి చేశారు. తరువాత 'సలామ్' చేశారు. ఆ తరువాత 'అల్లాహు అక్బర్' అని అన్నారు. ఇంకా 'సహూ'కు సంబంధించిన సజ్‌దా చేశారు. అది మామూలుగా చేసే సజ్‌దా లాంటిదే. లేదా దానికంటే కొంచెం పొడుగైనది. తరువాత సజ్‌దాలో నుంచి శిరస్సును పైకి లేపారు; అల్లాహు అక్బర్ అని అన్నారు. మళ్లీ 'అల్లాహు అక్బర్' అని రెండోసారి సజ్‌దా చేశారు. అది మామూలుగా చేసే సజ్‌దా వంటిదే. లేదా దానికంటే కొంచెం పెద్దది, పొడుగైనది. ఆ తరువాత తన శిరస్సును లేపారు. ఇంకా 'అల్లాహు అక్బర్' అని పలికారు. ప్రజలు సీరీన్‌ను చాలా సార్లు ఇలా అడిగారు; "ఆయన (స) మళ్లీ సలామ్ చేశారా?" దానికి అతను, 'ఆయన (స) మళ్లీ సలామ్ చేశారు అని ఇమ్రాన్ బిన్ హుసైన్ చెప్పారు' అని జవాబు పలికారు.

## 89వ అధ్యాయం

**మదీనా పట్టణానికి పోయే మార్గంలో ఉన్నటువంటి మసీదులను గురించి. ఇంకా దైవప్రవక్త ముహమ్మద్ (స) గారు నమాజు చేసిన స్థలాల గురించి.**

**470.** మూసా బిన్ ఉఖబా ఇలా చెప్పారని ఫుజైల్ బిన్ సులైమాన్ (రజిఅన్) ఉల్లేఖించారు: నేను సాలిమ్ బిన్ అబ్దుల్లాను చూశాను; ఆయన మక్కా, మదీనా పట్టణాలకు మధ్య ఉన్నటువంటి మార్గంలో ఎన్నో స్థలాలను వెతికి వాటిలో నమాజు చేసేవారు. అక్కడ ఆ స్థలాలలో తన తండ్రి అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) నమాజు చేసేవారని ఆయన చెప్పేవారు. ఆ స్థలాలలో దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) నమాజు చేస్తూ ఉండగా తాను చూశానని అబ్దుల్లా బిన్ ఉమర్ (ర) చెప్పారు.

**ఇబ్నె ఉమర్ (ర) ఇలా చెప్పారని నాఫె ఉల్లేఖించారు: 'నేను ఆ స్థలాలలో నమాజు చేసేవాణ్ణి.' ఉల్లేఖకుడైన మూసా ఇంకా ఇలా అన్నారు; ఈ విషయం గురించి నేను సాలిమ్‌ను అడిగాను. దానికి సమాధానంగా ఆయన ఇలా చెప్పారు: ఆ స్థలాలకు సంబంధించినంత వరకు నేను నాఫెతో ఏకీభవిస్తాను. ఒక్క షరఫ్ అర్‌రౌహా[1] వద్ద ఉన్నటువంటి మసీదు విషయంలో తప్ప."**

**471. ఈ హదీసులో మక్కా–మదీనా పట్టణాల మధ్య ఉన్నటువంటి మార్గం లోని, దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ప్రయాణం చేస్తూ ఆగి నమాజు చేసినటువంటి విభిన్న స్థలాల పేర్లూ, అవి ఉన్నటువంటి ప్రాంతాల పేర్లూ వివరించబడ్డాయి. వాటిని తెలుగు భాషలోకి అనువాదం చెయ్యటం కష్టతర మైన విషయమని భావించి వదిలిపెట్టేస్తున్నాము. ఇంగ్లీషు భాషలో అనువాదం చేసిన తోటి అనువాదకులు కూడా ఈ పద్ధతినే అవలంబించారు.**

## 90వ అధ్యాయం

### నమాజుకు నాయకత్వం వహించే ఇమామ్‌కు ముందు ఉన్న 'సుత్రా' (ఒక కర్ర లేక ఒక స్తంభం లాంటి వస్తువు) యే ఆయన వెనుక నిలబడి నమాజు చేసే ముఖ్తదీలకు కూడా సుత్రాగా సరిపోతుంది.[1]

470–1. షరఫ్ అర్‌రౌహా మదీనా పట్టణానికి 36 మైళ్ల దూరంలో ఉన్నటువంటి ఒక ప్రాంతం. ఆ స్థలం గురించి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారు; ఇది స్వర్గంలోని ఒక లోయ. నాకు ముందు 70 మంది దైవప్రవక్తలు అక్కడ నమాజు చేశారు. హజ్రత్ మూసా (అ) కూడా హజ్‌కూ లేదా ఉమ్రాకూ సంబం ధించిన ఇహ్రామ్‌ను కట్టుకున్న స్థితిలో ఆ ప్రదేశం నుంచే సాగిపోయారు. హాఫిజ్ గారు ఇలా అన్నారు; అబ్దుల్లా బిన్ ఉమర్ (ర) ఆ స్థలాలను శుభాల కోసం, దైవాను గ్రహాలను పొందటం కోసం వెతికేవారు. ఆ స్థలాలలో నమాజులు చేసేవారు. దైవప్రవక్త (స) గారి సంప్రదాయాలను ఖచ్చితంగా పాటించటంలో ఆయన ఖ్యాతి వహించారు. హజ్రత్ ఉమర్ (ర) అటువంటి స్థలాలను వెతకటాన్ని వారించారు. ఎందుకంటే, రాబోయే తరాల వారు అలా చెయ్యటం అత్యవసరమని భావిస్తారని ఆయన అలా చెయ్యవద్దన్నారు. ఉత్‌బాన్ గారి హదీసు ద్వారా కూడా తెలిసే విషయం ఏమిటంటే, దైవభక్తులు, సౌశీల్యవంతులు అయిన మహానుభావులు విడిచిపోయిన అవశేషాల ద్వారా శుభాలు పొందటం తప్పు కాదు. అది ధర్మసమ్మతమైన విషయమే. ఈ హదీసు ఇది వరకు కూడా వచ్చింది.

**472.** హ(జత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: "ఒకసారి నేను ఆడ గాడిద మీద స్వారీ చేస్తూ వచ్చాను. ఆ రోజుల్లో నేను యవ్వన దశకు చేరుకున్నాను. అప్పుడు దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) మినా మైదానంలో నమాజుకు నాయకత్వం వహించి నమాజు చేయిస్తున్నారు. కాని ఆయన (స) గారి ముందుభాగంలో ఎలాంటి గోడా లేదు. నేను నమాజుకు నిలబడిన వారి ముందు నుంచి సాగిపోయాను. తరువాత గాడిద మీద నుంచి దిగి గడ్డి మేసేందుకు దానిని వదలివేశాను. ఆ తరువాత నేను నమాజు పంక్తిలో కలిసి పోయాను. నమాజు అయిపోయిన తరువాత ఎవరూ నా పట్ల అభ్యంతరాన్ని వ్యక్తం చెయ్యలేదు.[1]

**473.** హ(జత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) పండుగ దినాన నమాజు కోసం బయలుదేరినప్పుడు, బరిసె తెమ్మని తన సేవకుణ్ణి ఆజ్ఞాపించేవారు. అప్పుడు అది ఆయన (స) గారి ముందు పాతిపెట్టబడేది. ఆయన గారు దానికి ఎదురుగా తన ముఖాన్ని పెట్టి నమాజు చేసేవారు. ప్రజలు దైవప్రవక్త (స) గారి వెనుక నిలబడి నమాజు చేసేవారు. ప్రయాణంలో ఉన్నప్పుడు కూడా ఆయన (స) అలానే చేసేవారు. ముస్లిమ్‌ల నాయకులు ఈ కారణంగానే బరిసెను తమతోనే ఉంచుకునే సంప్రదాయాన్ని అలవరచుకున్నారు.

**474.** హ(జత్ అబూ జుహైఫా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) 'బత్‌హా' లోయలో ఒకసారి ప్రజలకు నమాజు చేయించారు. ఆయన (స) గారి ముందు ఒక కర్ర పాతిపెట్టబడింది.

---

90–1. అంటే ముఖ్తదీలకు ప్రత్యేకంగా మరొక సుత్రాను భూమిలో పాతే అవసరం లేదు అని భావం.

472–1. పైకి అయితే అధ్యాయంలోని భావం ప్రస్ఫుటం కాదు. కాని దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారి అలవాటు మరియు సంప్రదాయం ఏమిటంటే; మైదానంలో సుత్రా లేకుండా ఆయన (స) గారు నమాజు చేసేవారు కాదు. ఈ విషయం ముందు రాబోయే హదీసుల ద్వారా స్పష్టమవుతుంది. ఆయన (స) గారి ముందు బరిసె పాతి ఉంటుంది. కనుక ఆ సమయంలో కూడా ఆయన (స) గారి ముందు స్థలంలో సుత్రా తప్పకుండా ఉండి ఉంటుందని అనుమానించవచ్చు. కాబట్టి ఇమామ్ గారి సుత్రా ముఖ్తదీలకు కూడా సరిపోతుంది అనే అధ్యాయంలోని విషయం నిరూపితమైపోయింది.

**ఆయన (స) గారు ప్రయాణం కారణంగా రెండు రకాతుల జొహర్ నమాజు చేశారు. అదేవిధంగా రెండు రకాతుల అసర్ నమాజు కూడా చేశారు. ఆయన (స) గారి ముందు నుంచి స్త్రీలు కూడా నడుస్తూపోయేవారు. గాడిదలు కూడా పోయేవి.**

## 91వ అధ్యాయం

**నమాజు చేసే వ్యక్తికి, సుత్రాకు మధ్య ఎంత దూరం వుండాలి? అనే విషయం గురించి.**

**475.** సహల్ బిన్ సాద్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: **దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) నమాజు చేసే స్థలంలో, ఆయన (స) గారికి, ఆయన (స) గారి ముందువున్న గోడకూ మధ్య ఒక గొర్రె దాటిపోయే అంత దూరం ఉండేది.**

**476.** సలమా బిన్ అక్వా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: **మస్జిదె నబవీ యొక్క గోడకూ, అందులో వున్నటువంటి మెంబరుకూ మధ్య ఒక గొర్రె దాటిపోయే అంత అంతరం ఉంది.**[1]

## 92వ అధ్యాయం

**బరిసెను భూమిలో పాతి దాని వైపునకు తిరిగి నమాజు చెయ్యటం.**

**477.** అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: **దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారి కోసం ఒక బరిసె భూమిలో పాతబడేది; ఆయన (స) గారు దాని వైపునకు తిరిగి నమాజు చేసేవారు.**

---

476-1. మస్జిదె నబవీలోనయితే అసలు మెహ్రాబ్ (కమాను) ఉండేదే కాదు. దైవప్రవక్త (స) మెంబరుకు ప్రక్కగా, దానితో సరిసమానంగా నమాజు కోసం నిలబడేవారు. ఆయన (స)కూ, గోడకూ మధ్య ఒక గొర్రె దాటిపోయే అంత దూరపు స్థలం ఉండేది. అధ్యాయం యొక్క అర్థం కూడా ఇదే. హజ్రత్ బిలాల్ (రజిఅన్) గారి ఒక హదీసులో ఇలా ఉంది; దైవప్రవక్త (స) ఒకసారి కాబా గృహంలో నమాజు చేయించారు. ఆయన (స) గారికీ, కాబా గోడకూ మధ్య మూడు మూరల అంతరం ఉంది. మత విద్వాంసులు ఏమన్నారంటే; "నమాజు చేసే వ్యక్తి సాధ్యమైనంత వరకు సుత్రాకు దగ్గరగా ఉండాలి." హదీసు ద్వారా తెలిసిన మరొక విషయం ఏమిటంటే; మసీదులో మిహ్రాబ్ గానీ, మెంబర్‌గానీ కట్టటం సున్నత్ (సంప్రదాయం) కాదు. మిహ్రాబ్ అయితే మసీదులో అసలే ఉండకూడదు. మెంబరు మాత్రం చెక్కతో చేయించి వేరుగా ఒకచోట ఉంచాలి. ఈ కాలంలోనైతే ప్రతి మసీదులోనూ మిహ్రాబ్‌నూ, మెంబర్‌నూ ఇటుకలతో సిమెంటుతో కట్టిస్తున్నారు. ఇది సర్వసామాన్యమైపోయింది.

## 93వ అధ్యాయం

### అన్‌జా (బరిసె ఉన్నటువంటి కర్ర) వైపునకు తిరిగి నమాజు చెయ్యటం గురించి.

**478.** తన తండ్రిగారైన అబూ జుహైఫా వహబ్ బిన్ అబ్దుల్లా ఇలా చెబుతుండగా తాను విన్నానని ఔన్ బిన్ అబూ జుహైఫా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) మధ్యాహ్న సమయంలో మా వద్దకు విచ్చేశారు. తరువాత ఆయన (స)గారు వుజూ చేసుకోవటం కోసం నీళ్లు తీసుకు రావటం జరిగింది. ఆయన (స) గారు వుజూ చేసుకుని జొహర్, అసర్ నమాజులు రెండూ మాకు చేయించారు. అప్పుడు ఆయన (స) గారి ముందు భాగంలో ఒక బరిసె అమర్చబడి ఉన్న కర్ర పాతిపెట్టబడి ఉంది. స్త్రీలూ, గాడిదలూ దాని మీదుగా నడుస్తూ పోసాగారు.

**479.** అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) కాలకృత్యాలు తీర్చుకోవటానికి బయటికి వెళ్లినప్పుడల్లా నేనూ, మరొక బాలుడూ ఉభయులమూ కలసి ఆయన (స) గారి వెనుక వెళ్లేవారము. అప్పుడు మా వద్ద ఒక కర్రగానీ లేదా ఒక లాఠీగానీ లేదా ఒక బరిసె గానీ ఉండేవి. ఇంకా నీళ్ళ చెంబు కూడా ఉండేది. ఆయన (స) గారు కాలకృత్యాలు తీర్చుకున్న తరువాత మేము ఆయన (స) గారికి నీళ్ల చెంబును ఇచ్చేవారము.

## 94వ అధ్యాయం

### మక్కాలోనూ, ఇతర స్థలాలలోనూ నమాజు కోసం సుత్రాను పాతటం గురించి.[1]

**480.** అబూ జుహైఫా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఒకసారి మధ్యాహ్న సమయంలో మా వద్దకు విచ్చేశారు. ఇంకా బత్‌హా[1] వద్ద జొహర్, అసర్ నమాజులను, ఒక్కొక్కటి రెండు రకాతుల చొప్పున మా చేత చేయించారు. ఆయన (స) గారి ముందు ఒక బరిసె

---

94-1. అధ్యాయంలోని విషయం గురించి ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారి ఉద్దేశ్యం ఏమిటంటే; ప్రతి స్థలంలోనూ సుత్రాను విధిగా, తప్పనిసరిగా పాతాలి; మక్కా నగరంలో కూడా సుత్రాను విధిగా పాతాలి. హంబలీ మస్లక్‌కు చెందినవారు కొందరు ఏమంటారంటే; మక్కా నగరంలో నమాజు చేసే వ్యక్తి ముందు నుంచి పోవటం ధర్మసమ్మతమైన విషయమే. కాని షాఫయీ మస్లక్ వారి దృష్టిలో, హనఫీ మస్లక్ వారి దృష్టిలో అలా చెయ్యటం నిషిద్ధం. ఇమామ్ బుఖారీ(ర) గారి అభిప్రాయం కూడా ఇదే. అబ్దుర్రజాఖ్ గారు ఒక హదీసును వెలికి తీశారు. దాని ప్రకారం దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) మస్జిదె హరామ్‌లో సుత్రా లేకుండానే నమాజు

**నిలబెట్టబడింది. తరువాత ఆయన (స) గారు వుజూ చేసుకున్నారు. అప్పుడు ప్రజలు ఆయన (స) గారు వుజూ చేసుకున్న నీళ్లను శుభప్రదమైనవిగా భావించి తమ శరీరాలకు పూసుకున్నారు.**

## 95వ అధ్యాయం

## స్తంభానికి ఎదురుగా నిలబడి నమాజు చెయ్యటం

**హ(జత్ ఉమర్ (రజిఅన్) ఇలా అన్నారు:[1] పరస్పరం మాట్లాడుకునే వారికంటే, నమాజు చేసే ప్రజలే స్తంభాల మీద ఎక్కువ హక్కు కలిగి ఉన్నారు. ఒకసారి హ(జత్ ఉమర్ (రజిఅన్) ఒక వ్యక్తిని మసీదులో రెండు స్తంభాల మధ్య నిలబడి నమాజు చేస్తూ ఉండగా చూసి అతన్ని పట్టుకుని ఒక స్తంభం దగ్గరకు తీసుకు వచ్చి నిలబెట్టారు; అతనితో, "నువ్వు ఇక్కడ నమాజు చెయ్యి" అని ఆజ్ఞాపించారు.**

**481. యజీద్ బిన్ అబీ ఉబైద్ ఇలా ఉల్లేఖించారు: నేను సలమా బిన్ అక్వయి (రజిఅన్) (ఒక సహాబి)తో కలిసి మస్జిదె నబవీకి వెళుతూ ఉండేవాణ్ణి. ఆయన (ర) ఖురాను గ్రంథం[1] ఉన్నటువంటి స్తంభం దగ్గర నిలబడి నమాజు చేసేవారు. ఒకసారి నేను ఆయన్ని ఇలా అడిగాను: "ఓ అబూ ముస్లిమ్! నేను చూస్తున్నాను, నీవు కావాలని ఈ స్తంభం దగ్గర నిలబడి నమాజు చేస్తావు. దీనికి కారణమేమిటో చెప్పు." దానికి సమాధానంగా ఆయన (ర) ఇలా సెలవిచ్చారు: "దైవప్రవక్త మహాశయులు(సఅసమ్) ఉద్దేశ్యపూర్వకంగా ఈ స్తంభం ముందు నిలబడి నమాజు చెయ్యటాన్ని నేను చూశాను."**

---

చేసేవారు. కాని ఇమామ్ బుఖారీ(ర) గారు ఈ హదీసు బలహీనమైనదని త్రోసి పుచ్చారు.

480-1. బత్హా మక్కాలోని ఒక రాతి ప్రదేశం కనుక ఈ హదీసు ద్వారా నిరూపితమైన విషయం ఏమిటంటే; మక్కాలో కూడా విధిగా సుత్రాను భూమిలో పాతాలి. కాబా ముందు నమాజు చేసినట్లయితే ఏ వస్తువునూ సుత్రాగా చేసుకోకూడదు అని ఎవరైతే వాదిస్తారో వారి వాదన దీనిద్వారా వీగిపోతుంది.

95-1. ఈ హదీసును ఇబ్నె అబీ షైబా (రజిఅన్) గారు ఆవిష్కరించారు. భావం ఏమిటంటే; ఊరకే మాట్లాడుకునే వారు కూడా ఆనుకుని కూర్చోవటానికి స్తంభాలను కోరుకుంటారు. నమాజు చేసేవారు కూడా స్తంభాలను కోరుకుంటారు. కాని నమాజు చేసేవారు స్తంభాల మీద ఎక్కువ హక్కును కలిగి ఉంటారు. ఎందుకంటే, నమాజు చేసేవారు దైవారాధన చెయ్యటానికి స్తంభాలను కోరుకుంటారు. కాని ఊరకే మాట్లాడుకునే వారు వ్యర్థ ప్రసంగాలు చేస్తారు.

**482.** **హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారి పెద్ద పెద్ద సహచరులు సయితం మగ్రిబ్ నమాజుకు అజాన్ ఇవ్వబడే సమయంలో స్తంభాల వైపునకు ఎగబడుతూ పోవటాన్ని[1] నేను గమనించాను. ఆయన(స) తన గది నుంచి నమాజు కోసం మసీదులోకి వచ్చే వరకు (వారు ఇలా ఎగబడుతూనే ఉండేవారు).**

## 96వ అధ్యాయం

### నమాజు చేసే వ్యక్తి గనక ఒక్కడే అయితే (లేదా ఒంటరిగా ఉంటే), అతను రెండు స్తంభాల మధ్య నమాజు చెయ్యటం.[1]

**483.** **హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) కాబా గృహంలోకి ప్రవేశించారు. ఆయన (స) గారితోపాటు ఉస్మాన్ బిన్ జైద్ (రజిఅన్), ఉస్మాన్ బిన్ తల్హా(రజిఅన్), హజ్రత్ బిలాల్ (రజిఅన్)లు కూడా కాబా గృహంలోకి ప్రవేశించారు. దైవప్రవక్త (సఅసమ్) చాలాసేపటి వరకు కాబా గృహంలోనే ఉండిపోయారు. తరువాత వారందరూ బయటికి వచ్చేశారు. నేను, "దైవప్రవక్త (స) కాబా గృహం లోపల ఉన్నప్పుడు నమాజు ఎక్కడ చేశారని" హజ్రత్ బిలాల్ (ర)ను అడిగాను. దానికి సమాధానంగా హజ్రత్ బిలాల్ (ర), "దైవప్రవక్త (స) ముందు భాగంలో వున్న రెండు స్తంభాల మధ్య ఉన్న స్థలంలో నమాజ్ చేశారు" అని చెప్పారు.**

**484.** **హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా చెప్పారని నాఫె**

---

481-1. హజ్రత్ ఉస్మాన్ (రజిఅన్) గారి కాలంలో ఖురాను గ్రంథాన్ని ఒక పెట్టెలో పెట్టి దానిని మస్జిదె నబవీలోని ఒక స్తంభం దగ్గర ఉంచేవారు. ఆ స్తంభమే ఇది.

482-1. ఎందుకంటే స్తంభాలను సుత్రాగా చేసుకుని మగ్రిబ్‌కు సంబంధించిన సున్నత్ నమాజులు చేసుకోవటానికి.

96-1. ఎందుకంటే, జమాఅత్‌తో నమాజు చేసేటప్పుడు స్తంభాల మధ్య నిలబడటం వల్ల వరుస లేక పంక్తిలోని క్రమం తారుమారవుతుంది. కొందరేమన్నారంటే, ఎట్టి పరిస్థితుల్లోనూ రెండు స్తంభాల మధ్య నమాజు చెయ్యటం అవాంఛనీయమైనదే. కారణం ఏమిటంటే, హాకిమ్ గారు పరిగణనలోకి తీసుకున్నటువంటి అనస్ గారి హదీసులోని నిషేధం దీనికి వర్తిస్తుంది. ఇమామ్ బుఖారి (రహ్మాలై) గారు ఈ విషయాన్ని తీసుకువచ్చి చేసిన సూచన ఏమిటంటే, ఆ నిషేధం జమాఅత్‌తో సామూహికంగా నమాజు చేస్తూ ఉన్నప్పుడే వర్తిస్తుంది.

ఉల్లేఖించారు: దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) కాబా గృహంలోకి వెళ్లారు. అప్పుడు ఆయన (స) గారితోపాటు ఉసామా బిన్ జైద్, బిలాల్ మరియు ఉస్మాన్ ఇబ్నె తల్హా అల్ హజబ్బీ గార్లు కూడా ఉన్నారు. ఉస్మాన్ గారు చివర్లో కాబా గృహ ద్వారాన్ని మూసివేశారు. దైవప్రవక్త (స) కాబా గృహంలో కొంతసేపు ఆగారు. ఆయన (స) గారు కాబా నుంచి బయటికి వచ్చినప్పుడు నేను బిలాల్ (ర)ను ఇలా అడిగాను: "దైవప్రవక్త (స) కాబా లోపల ఉన్నప్పుడు ఏమి చేశారు?" దానికి సమాధానంగా బిలాల్ ఇలా అన్నారు: "కాబా గృహంలో ఉన్నప్పుడు దైవప్రవక్త (స) నమాజు చేశారు. ఆ సమయంలో ఒక స్తంభం ఆయన (స) గారి కుడి వైపున ఉన్నది. ఇంకా ఆయన (స) గారి వెనుక మూడు స్తంభాలు ఉన్నాయి." ఆ రోజుల్లో కాబా లోపల ఆరు స్తంభాలు ఉండేవి. మహాప్రవక్త (స) గారి కుడి వైపున రెండు స్తంభాలున్నాయని ఇమామ్ మాలిక్ (ర) అనటం గమనార్హం.

## 97వ అధ్యాయం

నాఫె ఇలా ఉల్లేఖించారు: అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) కాబా గృహంలోకి వెళ్లినప్పుడల్లా నేరుగా ముఖానికి ఎదురుగా వెళ్లిపోతారు. అలా ముందుకు వెళ్లేటప్పుడు కాబా గృహ ద్వారం తన వీపుకు వెనుకగా ఉండేలా చూసుకుంటూ ముందుకు సాగిపోతారు. చివరకు ఆయన ముఖానికి ఎదురుగ్గా ఉన్నటువంటి గోడ మూడు మూరల దూరంలో ఉన్నప్పుడు ఆగిపోతారు. అక్కడ ఆయన నమాజు చేస్తారు. బిలాల్ (ర), దైవప్రవక్త (స) నమాజు చేశారని ఆయనకు చూపించిన స్థలంలో బుద్ధిపూర్వకంగా ఆయన నమాజు చేస్తారు. అబ్దుల్లా బిన్ ఉమర్ (ర) ఏమన్నారంటే, మాలో ఎవరైనా కాబా గృహం లోపల తాము కోరిన ఏ మూలలో నమాజు చేసినా అది దోషం కాదు.[1]

## 98వ అధ్యాయం

**ఆడ ఒంటె, మగ ఒంటె, వృక్షం, జీనుల వైపునకు ముఖంపెట్టి నమాజు చెయ్యటం గురించి.**

**485.** హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) తన ఆడ ఒంటెను అడ్డంగా కూర్చోబెట్టేవారు, తరువాత దాని వైపునకు తిరిగి నమాజు చేసేవారు. "ఒంటెలు మేత మెయ్యటానికి వెళ్ళిపోయినప్పుడు ఆయన (స) ఏమి చేసేవారు?" అని అబ్దుల్లా నాఫెను ప్రశ్నిం

---

97-1. కాని ముఖం మటుకు కాబా గోడ వైపునకు తప్పనిసరిగా ఉండాలి. ఈ కారణం వల్లనే ఆయన కాబా గృహంలోకి ప్రవేశించేటప్పుడే తలుపులు మూయించారు.

చగా ఆయన (ర) ఇలా జవాబు చెప్పారు: "అప్పుడు ఆయన (స) ఒంటె మీద ఉన్నటువంటి జీనును తన ముందు భాగంలో పెట్టేవారు. ఇంకా దాని చివరి భాగం వైపునకుగానీ లేదా దాని వెనుక భాగం వైపునకుగానీ తన ముఖాన్ని త్రిప్పి నమాజు చేసేవారు." అబ్దుల్లా బిన్ ఉమర్ (ర) కూడా అలానే చేసేవారు.[1]

## 99వ అధ్యాయం

**మంచం మీదగానీ లేదా మంచం వైపునకుగానీ ముఖంపెట్టి నమాజు చెయ్యటం.**

**486.** హజ్రత్ ఆయెషా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: "మీరు మమ్మల్ని కుక్కలతో, గాడిదలతో సమానంగా చూస్తున్నారు. నేను మంచం మీద పడుకుని ఉండేదాన్ని. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇంట్లోకి వచ్చేవారు. నా మంచం మీద మధ్య భాగంలోకి వచ్చి చేరేవారు. లేదా నా మంచాన్ని తనకూ, ఖిబ్లా దిక్కుకూ మధ్య ఉండేలా లాక్కునేవారు. తరువాత నమాజు చేసేవారు. ఆయన (స) గారి ముందు మంచం మీద పడుకొని ఉండటం నాకు అయిష్టంగా ఉండేది. ఈ కారణంగా నేను బొంతలో నుంచి బయటపడి మంచం అడుగు భాగం వైపు నుంచి మెల్లగా జారుకునేదాన్ని."

## 100వ అధ్యాయం

**ఎవరైనా నమాజు చేసే వ్యక్తి ముందు నుంచి దాటిపోదలిస్తే అతన్ని అలా పోకుండా నిరోధించటం (మనిషిగాని లేదా పశువు గాని).**

**అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) గారు నమాజు మధ్యలో 'అత్తహియ్యాత్' చదివేటప్పుడు ఒక మనిషిని ఆపారు. ఇంకా ఆయన (ర) కాబా గృహంలో కూడా ఇలానే చేశారు. ఆయన (ర) ఇంకా ఇలా అన్నారు; అతను గనక వినకపోతే అతనితో పోట్లాడాలి.**

**487.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) ఉల్లేఖించారు. (దైవప్రవక్త (స) గారు సెలవిచ్చిన విషయం ఏమిటో అది 490వ హదీసులో వస్తుంది).

---

ఒకవేళ ద్వారం గనక తెరచుకుని ఉంటే, ఎవరైనా ద్వారం వైపునకు ముఖం పెట్టి నమాజు చేస్తే అప్పుడు ఆ నమాజు ధర్మసమ్మతమైనది కాబోదు.

485-1. ఇమామ్ బుఖారీ (రహ్మలై) గారు మగ ఒంటెను ఆడ ఒంటెగా ఊహించారు. వృక్షాన్ని ఒంటె వీపు మీద ఉండే జీనుగా ఊహించారు. ఎందుకంటే జీను తయారు చెయ్యబడిన కఱ్ఱ ఒక వృక్షానికి చెందిన భాగమే కదా!

**488.** అబూ సాలెహ్ సమ్మాన్ ఇలా ఉల్లేఖించారు: శుభప్రదమైన ఒక జుమ్మా రోజున (శుక్రవారం నాడు) అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) గారు ఒక వస్తువును ప్రజల నుంచి సుత్రాగా చేసుకుని నమాజు చేస్తున్నారు. అబూ ముయీత్ కుమారుల్లోని ఒక యువకుడు ఆయన(ర) ముందు నుంచి దాటి పోవటానికి ప్రయత్నించాడు. అప్పుడు హజ్రత్ అబూ సయీద్ అతని రొమ్ము మీద చెయ్యిపెట్టి అతన్ని వెనక్కి నెట్టివేశారు. ఆ యువకుడు నలువైపులా దృష్టిని సారించాడు. కాని అబూ సయీద్ గారి ముందు నుంచి దాటిపోయే మార్గం తప్ప మరొక మార్గమేదీ అతనికి కనిపించలేదు. తరువాత అతను అటు వైపు నుంచి దాటి పోయేందుకు వెనక్కి మరలాడు. అప్పుడు హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) మొదటిసారి కంటే ఎక్కువ బలంగా అతన్ని వెనక్కి నెట్టిపారేశారు. అప్పుడు ఆ యువకుడు హజ్రత్ అబూ సయీద్‌ను దూషించాడు. తరువాత అతను హజ్రత్ మర్వాన్ (రజిఅన్) వద్దకు పోయి అబూ సయీద్‌తో జరిగిన సంఘటనను గురించి ఫిర్యాదు చేశాడు. హజ్రత్ అబూ సయీద్ కూడా అతని వెనుక మర్వాన్(ర) దగ్గరకు వెళ్లారు. మర్వాన్ (ర)ఇలా అన్నారు: "ఓ అబూ సయీద్ ఖుద్రీ! నీకూ, నీ సోదర కుమారునికీ మధ్య జరిగిన వ్యవహారం గురించి నీ అభిప్రాయమేమిటి?" దానికి సమాధానంగా హజ్రత్ అబూ సయీద్ ఇలా సెలవిచ్చారు: "దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిస్తూ ఉండగా నేను విన్నాను: మీలో ఎవరైనా ఏదైనా వస్తువును ప్రజలకు అడ్డంగా, సుత్రాగా చేసుకుని నమాజు చేస్తూ ఉంటే, తరువాత ఎవరైనా దాని ముందు నుంచి దాటి పోవటానికి ప్రయత్నిస్తే, అతన్ని అలా దాటి పోకుండా నిరోధించాలి. ఒకవేళ అతను ఆగకపోతే, అప్పుడు అతనితో పోట్లాడాలి. ఎందుకంటే అతను ఒక షైతాను."

## 101వ అధ్యాయం

## నమాజు చేసే వ్యక్తి ముందు నుంచి దాటిపోయే దాని పాపం

**489.** బుసర్ బిన్ సయీద్ ఇలా ఉల్లేఖించారు: "జైద్ బిన్ ఖాలిద్ (రజిఅన్) నన్ను అబూ జుహైమ్ అబ్దుల్లా అన్సారీ (రజిఅన్) వద్దకు పంపారు; నమాజు చేసే వ్యక్తి ముందు నుంచి దాటిపోయే మనిషిని గురించి, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఏమన్నారో, ఆయన ఏమి విన్నారో కనుక్కోని రమ్మని నన్ను పంపారు. దైవప్రవక్త మహాశయులు (స) ఇలా సెలవిచ్చారని అబూ జుహైమ్ (ర) చెప్పారు: "నమాజు చేసే వ్యక్తి ముందు నుంచి దాటిపోయే మనిషికి, దాని కారణంగా

**తనకు ఎంత పెద్ద శిక్ష పడుతుందో తెలిస్తే, అతను నలభై (40) (రోజులు, మాసాలు, సంవత్సరాల) వరకు నిలబడి ఆగి ఉండటాన్ని, నమాజీ ముందు నుంచి దాటిపోవటం కంటే ఉత్తమమైనదిగా భావిస్తాడు." బుసర్ బిన్ సయీద్ (ర) నలభై రోజులు అన్నారో, నలభై మాసాలు అన్నారో, నలభై సంవత్సరాలు అన్నారో నాకైతే జ్ఞాపకం లేదు అని అబూ నజర్ చెప్పారు.[1]**

## 102వ అధ్యాయం

**ఒక వ్యక్తి నమాజు చేస్తూ ఉండగా అతని వైపు ముఖం పెట్టి కూర్చోవటం గురించి.**

**నమాజీ ముందు అతనికి ఎదురుగా ముఖం పెట్టి కూర్చోవటం అవాంఛనీయమైనది అని హజ్రత్ ఉస్మాన్ (ర) సెలవిచ్చారు. ఇమామ్ బుఖారి (ర) ఏమన్నారంటే; ఈ అవాంఛనీయం (మక్రూహ్) అనేది నమాజు చేసే వ్యక్తి ధ్యానం భగ్నమైనప్పుడే ఉద్భవిస్తుంది. ఒకవేళ నమాజీ ధ్యానం గనక భంగం కానప్పుడు జైద్ బిన్ సాబిత్ గారు చెప్పిన విషయం ఉత్పన్నమవుతుంది. ఆయన ఏమన్నారంటే; "దానివల్ల నా ధ్యానానికి ఎటువంటి కలతా కలుగదు. ఎందుకంటే పురుషుడు చేసే నమాజు పురుషుని వల్ల భగ్నం కాదు."**

**490. హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: ఆమె గారి ముందు నమాజును భంగపరచే విషయాలను గురించి ప్రస్తావించటం జరిగింది. ప్రజలు ఆమె (ర)గారితో ఇలా అన్నారు: "కుక్కలూ, గాడిదలూ, స్త్రీలూ ముందుకు రావడం వల్ల నమాజు భగ్నమవుతుంది." అప్పుడు హజ్రత్ ఆయెషా (ర) ఇలా అన్నారు: "మీరు మమ్మల్ని కుక్కలుగా చేసివేశారు. మహాప్రవక్త (స) గారు, నేను మంచం మీద పడుకుని ఉండగా నమాజు చేసేవారు. ఆ మంచం ఆయన (స) గారికీ, ఖిబ్లా దిక్కుకూ మధ్య ఉండేది. తరువాత ఏదైనా పని అవసరం నాకు కలిగినప్పుడు, నేను ఆయన (స) గారి ముఖం వైపునకు నా ముఖం పెట్టటాన్ని ఇష్టపడేదాన్ని కాదు. కనుక మంచం కింది భాగం నుంచి మెల్లగా జారుకునిపోయేదాన్ని."**

---

489-1. ఇబ్నె హిబ్బాన్, ఇబ్నె మాజా గార్ల ఉల్లేఖనంలో నూరు సంవత్సరాలు అని ఉన్నది. బజార్ గారి ఉల్లేఖనంలో నలభై ఖరీఫు సీజన్లు అని ఉన్నది. నమాజీ ముందు నుంచి దాటిపోవటం హరామ్ (నిషిద్ధం). కొందరు దానిని గునాహె కబీరా (మహా పాపం) అని కూడా అన్నారు. కాని నమాజీ ముందు ఉండే హద్దును గురించి మాత్రం అభిప్రాయభేదం ఉంది. కొందరేమన్నారంటే, మూడు బారెళ్ల హద్దు. మరికొందరేమన్నారంటే, ఒక మనిషి రాయిని విసిరినంత దూరం. ఇంకా కొందరేమన్నారంటే, సజ్దా చేసే స్థలం వరకు.

## 103వ అధ్యాయం

### నిద్రపోయే మనిషి వెనుక నమాజు చెయ్యటం గురించి.

**491.** హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) నమాజు చేస్తూ ఉండేవారు. నేను ఆయన (స) గారి ముందు పడక మీద అడ్డంగా పడుకుని ఉండేదాన్ని. ఆయన (స) వితర్ నమాజు చేసేటప్పుడు నన్ను మేల్కొలిపేవారు. అప్పుడు నేను వితర్ నమాజు చేసుకునేదాన్ని.

## 104వ అధ్యాయం

### స్త్రీ నిద్రలో ఉన్నప్పుడు ఆమె వెనుక నిలబడి నఫిల్ నమాజులు చెయ్యటం గురించి.

**492.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారి భార్య అయినటువంటి హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: నేను మహాప్రవక్త (సఅసమ్) గారి ముందు నిదురపోయేదాన్ని. అప్పుడు నా పాదాలు ఆయన (స) గారి ఖిబ్లా వైపునకు ఉండేవి. ఆయన (స) గారు సజ్దా చేసినప్పుడు తన చేత్తో నన్ను తాకేవారు. అప్పుడు నేను నా కాళ్లను వెనక్కు ముడుచుకునేదాన్ని. ఆ తరువాత ఆయన (స) గారు నమాజు చేస్తూ నిలబడినప్పుడు నేను మళ్లీ నా కాళ్లను చాపుకునే దాన్ని. ఆ రోజుల్లో ఇళ్లల్లో దీపాలు కూడా ఉండేవి కావు.

## 105వ అధ్యాయం

### ఏ వస్తువూ నమాజును భంగపరచదు అని చెప్పే వ్యక్తి ఆధారం.[1]

**493.** హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు; ఆమె గారి ముందు, కుక్కలుగానీ, గాడిదలుగానీ లేదా స్త్రీలుగానీ ఒక నమాజీ ముందు నుంచి దాటి పోవడం వల్ల, నమాజు చెడిపోతుంది అనే విషయం ప్రస్తావనకు వచ్చినప్పుడు ఆమెగారు ఇలా అన్నారు: "మీరు మమ్మల్ని (అంటే స్త్రీలను) గాడిదలు మాదిరిగా, కుక్కలు మాదిరిగా భావిస్తున్నారు. దేవుని మీద ప్రమాణం చేసి చెబుతున్నాను!

---

105-1. అంటే ఏదైనా వస్తువు నమాజు చేసే వ్యక్తి ముందు నుంచి దాటిపోయినప్పుడు, ఉదాహరణకు, స్త్రీగానీ లేదా గాడిదగానీ లేదా కుక్కగానీ, చాలామంది విద్వాంసుల అభిప్రాయం ప్రకారం నమాజు భంగం కాదు. కాని ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మాలై) గారు ఏమన్నారంటే, ఒక నల్లకుక్క నమాజీ ముందు నుంచి దాటి పోయినట్లయితే, అప్పుడు ఆ నమాజీ యొక్క నమాజు చెడిపోతుంది, భగ్నమైపోతుంది. ఇతర వస్తువులు దాటి పోవటం వల్ల నమాజు భంగపడదు.

మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) నమాజు చేస్తూ ఉన్నప్పుడు నేను మంచం మీద పడుకుని ఉండేదాన్ని. ఆ మంచం ఆయనగారికీ, ఖిబ్లా దిక్కుకూ మధ్య ఉండేది. తరువాత నాకేదైనా పని అవసరం కలిగినప్పుడు నేను ఆయన (స) గారి ముందు కూర్చొని ఆయన (స) గారిని ఇబ్బందిపెట్టటం ఇష్టపడేదాన్ని కాదు. కనుక మంచం కింది భాగం నుంచి మెల్లగా జారుకుని వెళ్ళిపోయేదాన్ని.

**494.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారి భార్య హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా సెలవిచ్చారు: దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) రాత్రి సమయంలో నిద్ర నుంచి మేల్కొని తహజ్జుద్ ప్రార్థనలు చేసేవారు. నేను ఆయన (స) గారికీ, ఖిబ్లా దిక్కుకూ మధ్య మా ఇంట్లోని పాన్పు మీద అడ్డంగా పడుకుని ఉండే దాన్ని.

## 106వ అధ్యాయం

### నమాజు చేసే సమయంలో చిన్న పాపను తన భుజాల మీద కూర్చోబెట్టుకోవటం.

**495.** హజ్రత్ అబూ ఖతాదా అన్సారీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) తన మనవరాలైన ఉమామాను తన భుజాల మీద కూర్చుండ బెట్టుకొని నమాజు చేసేవారు. ఆమె దైవప్రవక్త (స) గారి కూతురైన హజ్రత్ జైనబ్ (రజిఅన్హా), అబుల్ ఆస్ బిన్ రబీఅ బిన్ అబ్దుష్షమ్స్ గార్ల కూతురు. దైవప్రవక్త (స) సజ్దాలోకి వెళ్ళినప్పుడు ఆమెను కూర్చుండబెట్టేవారు, నిలబడి ఉన్నప్పుడు ఆమెను మెడ మీద కూర్చుండబెట్టుకునేవారు.[1]

## 107వ అధ్యాయం

### బహిష్టు అయిన స్త్రీ పడుకుని ఉన్నటువంటి పడక వైపునకు తిరిగి నమాజు చెయ్యటం.

**496.** మైమూన బిన్తె హారిస్ (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: నేను పడుకునే పడక దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారు నమాజు చేసే స్థలానికి

---

495-1. ఈ హదీసు ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే, నమాజు చేసేటప్పుడు చిన్నపాపను ఎత్తుకోవడం వల్ల నమాజు చెడిపోదు. పాపను ఎత్తుకోవడం, కూర్చో బెట్టటం అనే పనులు నమాజును చెడగొట్టవు. అబూదావూద్ గారి రివాయతులో ఇలా ఉంది; దైవప్రవక్త (సఅసమ్) జొహర్, అసర్ నమాజుల్లో ఇలా చేసేవారు. మనవరాలైన ఉమామాను తన మెడ మీద కూర్చుండబెట్టుకుని మాకు నమాజు చేయించేవారు.

ప్రక్కగా ఉండేది. అప్పుడప్పుడు ఏమి జరిగేదంటే, ఆయన (స) గారి వస్త్రం నమాజులో ఉన్నప్పుడే నా శరీరం మీద పడుతూ ఉండేది. అప్పుడు నేను నా పాన్పు మీదనే ఉండేదాన్ని.[1]

**497.** విశ్వాసుల తల్లి అయినటువంటి హజ్రత్ మైమూన (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) నమాజు చేస్తూ ఉండేవారు. నేను ఆయన(స) గారి ప్రక్కన పడుకుని నిద్రపోతూ ఉండేదాన్ని. దైవప్రవక్త (స) సజ్దా చేసినప్పుడు ఆయన (స) గారి వస్త్రం నన్ను తాకుతూ ఉండేది. అప్పుడు నేను బహిష్టు స్థితిలో ఉండేదాన్ని.

## 108వ అధ్యాయం

**సజ్దాను సక్రమంగా చేసే ఉద్దేశ్యంతో ఒక పురుషుడు సజ్దా చేసేటప్పుడు తన భార్య శరీరాన్ని తాకవచ్చునా?**

**498.** హజ్రత్ ఆయెషా (రజిఅన్హా)గారు ప్రజల్ని ఉద్దేశించి ఇలా అన్నారు; మీరు మమ్మల్ని (అంటే స్త్రీలను) కుక్కలతో, గాడిదలతో సమానంగా చూసి చాలా పెద్ద తప్పే చేశారు. స్వయంగా నేనైతే దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారికీ; ఖిబ్లా దిక్కుకూ మధ్య పడుకుని ఉండేదాన్ని. ఆయన (స) గారు నమాజు చేస్తూ పోయేవారు. ఆయన (స) గారు సజ్దా చేసేటప్పుడు నా కాళ్లను తాకేవారు. అప్పుడు నేను నా కాళ్లను ముడుచుకునేదాన్ని.[1]

## 109వ అధ్యాయం

**ఒకవేళ ఒక స్త్రీ నమాజు చేసే వ్యక్తి శరీరం మీద నుంచి ఏదైనా మాలిన్యాన్ని లేదా నష్టం కలిగించే వస్తువును దేన్నయినా తీసి పారేసినట్లయితే ఆ వ్యక్తి చేసే నమాజు చెడిపోదు.**

**499.** అబ్దుల్లా బిన్ మసూద్ (రజిఅన్) ఇలా చెప్పారని అమ్ర్ బిన్ మైమూన్ ఉల్లేఖించారు: ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) కాబా గృహం వద్ద నిలబడి నమాజు చేస్తున్నారు. ఖురైష్ తెగకు చెందిన అవిశ్వాసులు

---

496–1. అంటే అప్పుడు నేను బహిష్టు స్థితిలో ఉండేదాన్ని.

498–1. ఈ హదీసు ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే; ఒకవేళ నమాజు చేసే వ్యక్తి శరీర భాగం ఏదైనా తన భార్యకు తగిలినట్లయితే నమాజు చెడిపోదు. ఈ హదీసు ఇంతకు ముందు కూడా వచ్చింది.

కొందరు అక్కడ గుమిగూడి ఉన్నారు. ఇంతలోనే వారిలోని అవిశ్వాసి ఒకడు (శాపగ్రస్తుడైన అబూ జహల్) ఇలా అన్నాడు; ప్రదర్శనా బుద్ధితో పనులు చేసే ఈ వ్యక్తిని మీరు గమనించటం లేదా? ఒంటెను కోసిన ఫలానా వారి వద్దకు పోయి, ఆ ఒంటె పేడనూ, రక్తాన్నీ, గర్భసంచినీ తీసుకువచ్చి, నమాజు చేసే ఈ వ్యక్తి సజ్దాలోకి పోయినప్పుడు ఇతని భుజాల మీద పెట్టేవాడెవడైనా మీలో ఉన్నాడా? ఇది విని పరమ దురదృష్ట వంతుడైన వారిలోని ఒకడు (శాపగ్రస్తుడైన ఉఖబా బిన్ అబీ ముయీత్) నిలబడ్డాడు. ఒంటెలోని ఈ మలిన వస్తువులన్నింటినీ తీసుకు వచ్చాడు. దైవప్రవక్త (స) సజ్దా చేసినప్పుడు వాటన్నింటినీ (అశుద్ధ వస్తువులు) ఆయన (స) గారి పవిత్ర భుజాల మధ్య పెట్టేశాడు. ఆయన(స) గారైతే సజ్దాలోనే నిమగ్నమైపోయారు. తన శిరస్సును పైకి ఎత్తలేదు. ఆ దుర్మార్గులు నవ్వుకుంటూ పరిహాసాలాడుకున్నారు. పగలబడి నవ్వుకుంటూ ఒకరి మీదకు ఒకరు ఒరిగిపోసాగారు. దారినపోయే ఒక మనిషి ఈ దృశ్యాన్ని చూసి ఫాతిమా (రజిఅన్హా) వద్దకు వెళ్ళాడు. ఆమె ఇంకా బాల్యదశలోనే ఉన్నారు. ఈ విషయాన్ని విని ఆమె కాబా వద్దకు పరుగెత్తుకుంటూ పోయారు. అప్పటి వరకూ దైవప్రవక్త (స) సజ్దాలోనే నిమగ్నులై ఉన్నారు. హజ్రత్ ఫాతిమా (ర) ఆయన (స) గారి వీపు మీద ఉన్నటువంటి అశుద్ధ వస్తువులనన్నింటినీ తీసిపారేశారు. ఆ తరువాత అవిశ్వాసుల వైపునకు తిరిగి వారికి శాపనార్థాలు పెట్టారు, వారిని దూషించారు. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) నమాజును పూర్తి చేసుకున్న తరువాత ఇలా ప్రార్థించసాగారు: "ఓ అల్లాహ్! ఖురైష్ ప్రజలకు ప్రతీకారం చెయ్యి! ఓ అల్లాహ్! ఖురైష్ ప్రజల సంగతి చూసుకో!" "ఓ అల్లాహ్! ఖురైష్ జనులను శిక్షించు!" తరువాత ఆయన (స) గారు పేరు పెట్టి ఇలా ప్రార్థించారు: ఓ అల్లాహ్! అమర్ బిన్ హిషామ్‌ను శిక్షించు. అబూజహల్‌ను శిక్షించు. ఉత్బా బిన్ రబీఅను శిక్షించు. షైబా బిన్ రబీఅను శిక్షించు. వలిద్ బిన్ ఉతబాను శిక్షించు. ఉమయ్యా బిన్ ఖలఫ్‌ను శిక్షించు. ఉఖబా బిన్ అబీ ముయీత్‌ను శిక్షించు. ఉమారా బిన్ వలిద్‌ను శిక్షించు." అబ్దుల్లా బిన్ మసూద్ (ర) ఇలా అన్నారు; దేవుని మీద ప్రమాణం చేసి చెబుతున్నాను: బదర్ యుద్ధంనాడు వీరందరూ చచ్చి పడి ఉండటాన్ని నేను కళ్ళారా చూశాను. వారి శవాలను కుక్కల మాదిరిగా ఈడ్చుకు పోయి బావిలో పడవేయటాన్ని కూడా నేను చూశాను. ఆ తరువాత దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు; 'ఆ బావిలోని వారి మీద అల్లాహ్ శాపం కూడా అవతరించింది.'

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

# నమాజు వేళల ప్రకరణం★

## 1వ అధ్యాయం

**నమాజు వేళలు మరియు వాటి శ్రేష్ఠతను గురించి ఖురాను గ్రంథంలో నిసా సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు; "వాస్తవానికి నమాజు నిర్ణీత సమయాలలో విశ్వాసులు విధిగా పాటించవలసిన ధర్మం."[1] (4 : 103)**

**500. ఇబ్నె షిహాబ్ ఇలా ఉల్లేఖించారు; ఒక రోజున ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ గారు అసర్ నమాజ్ చేసే విషయంలో ఆలస్యం చేశారు. అప్పుడు ఉర్వా బిన్ జుబైర్ ఆయన వద్దకు వెళ్ళి ఆయనతో ఇలా అన్నారు, "ఒకసారి ఇరాఖ్ దేశంలో ముగీరా బిన్ షూబా నమాజు విషయంలో ఆలస్యం చేశారు. అప్పుడు అబూ మసూద్ అన్సారీ మరియు ఉఖ్బా బిన్ అమ్ర్ ఆయన వద్దకు వెళ్ళి ఇలా అన్నారు; ఓ ముగీరా! ఇదేమిటి? నువ్వు ఇలా చేశావు? మేరాజ్ సంఘటన జరిగినప్పుడు ఉదయం పూట హజ్రత్ జిబ్రీల్ (అ) నమాజును గురించి నేర్పటానికి ఆకాశం నుంచి కిందికి దిగిన విషయం నీకు తెలియదా? జిబ్రీల్ (అ) నమాజు చేశారు. దైవప్రవక్త ముహమ్మద్ (స) కూడా నమాజు చేశారు. తరువాత జిబ్రీల్ (అ) నమాజు చేశారు. దైవప్రవక్త ముహమ్మద్ (స) కూడా నమాజు చేశారు. ఆ తరువాత జిబ్రీల్ (అ) మళ్ళీ నమాజు చేశారు. దైవప్రవక్త ముహమ్మద్ (స) కూడా మళ్ళీ నమాజు చేశారు. ఆపైన జిబ్రీల్ (అ) నమాజు చేశారు. దైవప్రవక్త ముహమ్మద్ (స) కూడా నమాజు చేశారు. తరువాత**

---

★ ప్రకరణంలో ఉన్న విషయానికి, అధ్యాయంలో ఉన్న విషయానికి మధ్య వ్యత్యాసం ఉంది. అదేమిటంటే, ప్రకరణంలో కేవలం వేళలు మాత్రమే ప్రస్తావించబడ్డాయి; అవి ఉన్నత స్థితికి చెందినవైనా లేదా అధమ స్థితికి చెందినవైనా. అధ్యాయంలో నమాజు చెయ్యటానికి శ్రేష్ఠమైన వేళలను గురించి ప్రస్తావించటం జరిగింది.

1-1. కనుక వేళ తప్పించి నమాజు చెయ్యటం ఎట్టి పరిస్థితుల్లోనూ ధర్మసమ్మతం కాదు.

**జిబ్రీల్ (అ) మరొకసారి నమాజు చేశారు. దైవప్రవక్త ముహమ్మద్ (స) కూడా నమాజు చేశారు. తరువాత జిబ్రీల్ (అ) ఇలా సెలవిచ్చారు; ఇలాగే చెయ్యమని నన్ను ఆజ్ఞాపించటం జరిగింది (అంటే ఆ వేళల్లో నమాజు చెయ్యమని ఆజ్ఞాపించటం జరిగింది). ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్, ఉర్వాతో ఇలా అన్నారు; ఓ ఉర్వా! కొంచెం ఆలోచించి మాట్లాడు. నీవు ఏ హదీసును గురించి అయితే మాట్లాడుతున్నావో, దాని ప్రకారం హజ్రత్ జిబ్రీల్ (అ) దైవప్రవక్త ముహమ్మద్ (స) కోసం నమాజు వేళలను నిర్ణయించారా? దానికి సమాధానంగా ఉర్వా ఇలా అన్నారు: తన తండ్రి ఇలానే ఉల్లేఖించినట్లు బషీర్ బిన్ అబీ మసూద్ చెప్పారు. మళ్లీ ఉర్వా ఇలా నమాజును చేసేవారు. ఉర్వా ఇంకా ఇలా అన్నారు : హజ్రత్ ఆయిషా(ర.అ) నాతో చెప్పిన దాని ప్రకారం, దైవప్రవక్త(స) అస్ర్ నమాజు చేసినప్పుడు ఎండ ఆమె కుటీరంలోనే ఉండేది.**

## 2వ అధ్యాయం

**ఖుర్ఆన్ గ్రంథంలోని రూమ్ సూరాలో 31వ వాక్యంలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "అల్లాహ్ వైపునకు మరలుతూ; ఆయనకు భయపడండి, నమాజును స్థాపించండి; తమ తమ ధర్మాన్ని వేర్వేరుగా రూపొందించుకున్న మరియు వర్గాలుగా చీలిపోయిన ముష్రిక్కులలో కలిసిపోకండి."[1]**

---

ఇమామ్ షాఫయి (రహ్మాలై) గారి దృష్టిలో, చేతిలోని కరవాలం విన్యాసాలు చేస్తూ ఉన్నా, కొంచెం సేపు ఆగే వ్యవధి కూడా లేకపోయినా అప్పుడు కూడా నమాజును సకాలంలోనే చెయ్యాలి. ఇమామ్ హుస్సేన్ అటువంటి క్లిష్ట సమయంలో కూడా నమాజును వాయిదా వెయ్యలేదు. ఆయన గారి పవిత్రమైన శిరస్సు సజ్దాలో ఉన్నప్పుడు కోయబడింది. ఇమామ్ మాలిక్ (రహ్మాలై) గారి అభిప్రాయం ప్రకారం, అటువంటి కఠినమైన, అత్యంత సున్నితమైన సమయాలలో నమాజును ఆలస్యంగానే చెయ్యాలి. ఆయనగారు ఖందఖ్‌కు సంబంధించిన హదీసును దృష్టాంతంగా చూపారు. అక్కడ దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) ఎన్నో నమాజులను ఆలస్యంగా చేశారు.

2-1. ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారు ఈ ఖురాను వాక్యాన్ని ఇక్కడ ఏ ఉద్దేశ్యంతో ఉదహరించారంటే; నమాజును విడిచిపెట్టటం వల్ల, త్యజించటం వల్ల ఒక మనిషి విశ్వాసం లోపభూయిష్టమైనదిగానూ, దేనికీ పనికిరానిదిగానూ అయిపోతుంది అని తెలియజెయ్యటానికి; ఇంకా అతను ఒక ముష్రిక్కుగా పరిగణింపబడతాడని స్పష్టం చెయ్యటానికి; యదార్థానికి అతను ముష్రిక్కు కాకపోయినా సరే. ఇంకా ఆయనగారు హదీసు ద్వారా కూడా ఈ విషయాన్ని నిరూపించారు; నమాజు విశ్వాసంలోని ఒక

**501.** అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి అబ్దుల్ ఖైస్ తెగకు చెందిన ప్రజలు కొందరు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(సఅసమ్) వద్దకు వచ్చారు. వారు దైవప్రవక్త (స)ను ఉద్దేశించి ఇలా అన్నారు; "ఓ దైవప్రవక్తా! మేము రబీఅ అనే తెగకు చెందిన ఒక శాఖవారము. మేము మీ వద్దకు కేవలం పవిత్ర మాసం (రజబ్)లో మాత్రమే రాగలుగుతాము. కనుక మీరు ఏదైనా మంచి విషయం చెయ్యమని మమ్మల్ని ఆజ్ఞాపించండి. మా వెనుక మా దేశంలో ఉండిపోయిన ప్రజలకు కూడా మేము ఈ విషయాన్ని ఆచరించమని చెబుతాము. అప్పుడు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారు; నేను నాలుగు విషయాలు చెయ్యమని మిమ్మల్ని ఆజ్ఞాపిస్తున్నాను. నాలుగు విషయాలు చెయ్యవద్దని నేను మిమ్మల్ని వారిస్తున్నాను. చెయ్యమని నేను మిమ్మల్ని ఆజ్ఞాపించే నాలుగు మంచి విషయాలు ఏమిటంటే; అల్లాహ్‌ను విశ్వసించటం. తరువాత ఆయన (స) దానినీ వారికి ఇలా వివరించారు; అంటే అల్లాహ్ తప్ప నిజమైన ఆరాధ్య దైవం మరొక డెవ్వడూ లేడనీ, నేను అల్లాహ్ ప్రవక్తను అనీ సాక్ష్యమివ్వటం, ఇంకా చక్కగా, సక్రమమైన, సంపూర్ణమైన రీతిలో నమాజు చెయ్యటం. ఇంకా జకాత్ ఇవ్వటం. అవిశ్వాసుల వద్ద కొల్లగొట్టి సంపాదించిన దానిలో నుంచి ఐదవ భాగాన్ని నా వద్ద జమ చెయ్యటం. ఇంకా నేను మిమ్మల్ని వారించే నాలుగు విషయాలు ఏమిటంటే; **1** దుబ్బా, **2.** హంతమ్, **3.** ముఖయ్యర్, **4.** నఖీర్. ఇవన్నీ సారాయి తయారు చెయ్యటానికి ఉపయోగించే పాత్రలు.

## 3వ అధ్యాయం

## నియమబద్ధంగా, చక్కని రీతిలో నమాజు చేస్తామని ప్రమాణం చేసి చెప్పటం

**502.** జరీర్ బిన్ అబ్దుల్లా బజ్‌లీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్)తో ఇలా ప్రమాణం చేసి వాగ్దానం చేశాను; "నేను నియమం తప్పకుండా చక్కని రీతిలో నమాజు చేస్తాను; నేను తప్పని సరిగా విధిగా జకాతు ఇస్తాను; నేను ప్రతి ముస్లిమ్ పట్ల శ్రేయోభిలాషిగా ఉంటాను."[1]

---

భాగమే అని. తౌహీద్ (ఏకేశ్వరవాదం) తరువాత ధర్మంలోని అన్ని విషయాలకంటే నమాజు అత్యంత ముఖ్యమైనది అని. నమాజును త్యజించినవారు కాఫిర్లు అయి పోతారని ధార్మిక తీర్పు చెప్పిన వారు కూడా ఈ ఖుర్ఆన్ వాక్యాన్ని ఆధారంగా తీసుకున్నారు.

# 4వ అధ్యాయం

## నమాజ్ పాపాలకు పరిహారం

**503.** హుజైఫా బిన్ యమాన్ (రజిఅన్) ఇలా అంటూ ఉండగా తాను విన్నానని షఖీఖ్ బిన్ సలమా ఉల్లేఖించారు: హుజైఫా ఇలా అన్నారు; "మేము ఒకసారి హజ్రత్ ఉమర్ (రజిఅన్)గారి వద్ద కూర్చొని ఉన్నాము. ఆయన ప్రజల్ని ఉద్దేశించి ఇలా అడిగారు; "దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఉపద్రవాలను గురించి ఏమన్నారో మీలో ఎవరికైనా జ్ఞాపకం ఉందా?" అప్పుడు నేను ఇలా అన్నాను: "దైవప్రవక్త (స) ఏదైతే చెప్పారో అదే నాకు జ్ఞాపకం ఉన్నది." దానికి సమాధానంగా, హజ్రత్ ఉమర్ (రజిఅన్) ఇలా అన్నారు; "నీవైతే దైవప్రవక్త (స) గారు సెలవిచ్చిన దానిని గురించి చెప్పే విషయంలో ధైర్యవంతుడవే". అప్పుడు నేను ఇలా అన్నాను; విషయం ఏమిటంటే, మనిషికి తన భార్య వల్లగానీ లేదా తన సంపద వల్లగానీ లేదా తన సంతానం వల్లగానీ లేదా తన పొరుగు వారివల్లగానీ ఏ ఆపదలైతే కలుగుతాయో[1] అవి నమాజ్, ఉపవాసాలు, దానధర్మాలు, మంచి వైపునకు పిలవటం, చెడు నుంచి ఆపటంల ద్వారా తీరిపోతాయి[2], పరిహరింపబడతాయి." హజ్రత్ ఉమర్(ర) ఇలా అన్నారు: "నేను అలాంటి ఉపద్రవాలను గురించి అడగటం లేదు. నేనైతే సముద్రపు అల మాదిరిగా ఉవ్వెత్తున లేచే ఉపద్రవాన్ని గురించి అడుగుతున్నాను[3]." అప్పుడు నేను ఇలా అన్నాను; "ఓ అమీరుల్ మోమినీన్! (ఓ విశ్వాసుల అధినేతా!) మీరెందుకు దానికి భయపడతారు? మీకూ, ఆ విపత్తుకూ మధ్యనైతే

---

502-1. దైవప్రవక్త మహాశయులు (స) తౌహీద్ తరువాత నమాజును గురించి ప్రమాణం తీసుకునేవారు. ఎందుకంటే, శరీరంతో చేసే ఆరాధనలన్నిటికంటే నమాజు అత్యంత ముఖ్యమైనది. ఇంకా సంపదతో చేసే ఆరాధనలన్నిటికంటే జకాతు అత్యంత ప్రధానమైన ఆరాధన. ఆ తరువాత ప్రతి మనిషికీ అతని మనస్తత్వాన్నిబట్టి, అతని ధార్మిక స్థితినిబట్టి, అతని వృత్తినిబట్టి సలహా ఇచ్చేవారు. ఇక్కడ జరీర్ తన జాతికి సర్దారు. కాబట్టి తన జాతి ప్రజలందరి పట్ల శ్రేయోభిలాషిగా వ్యవహరించమని హితబోధ చేశారు. అబ్దుల్ ఖైస్ తెగకు చెందిన ప్రజలు సైన్యంలో చేరి యుద్ధం చేసేవారు. ఈ వృత్తిని బట్టి ఆయన వారికి యుద్ధ సంపదలోని 5వ భాగాన్ని జమ చెయ్యమని ఉపదేశించారు.

503-1. వారి ప్రేమలో పడి దేవుణ్ణి మరచిపోతాడు. దైవారాధన పట్ల అశ్రద్ధ చూపుతాడు.

503-2. అధ్యాయం యొక్క ప్రధానాంశం ఇక్కడే లభిస్తుంది. అదేమిటంటే; నమాజు పాపాలకు పరిహారం అనే విషయం.

**తలుపులు మూసేసిన ఒక ద్వారం ఉంది కదా!” అప్పుడు హ|జ్రత్ ఉమర్ (ర) ఇలా అడిగారు: చెప్పు! ఆ ద్వారం తలుపులు పగులగొట్టబడతాయో లేక తెరువబడ తాయో చెప్పు.” దానికి సమాధానంగా నేను, ‘అది పగులగొట్టబడుతుంది’ అని చెప్పాను. అప్పుడు ఆయన ఇలా అన్నారు; “అయితే ఆ తరువాత ఇక అది మూసుకోవటం అనేది జరగదన్నమాట.” షఖీఖ్ ఇలా అన్నారు; మేము హుజైఫాను ఇలా అడిగాము; “ఓ హుజైఫా! హ|జ్రత్ ఉమర్ (ర)గారు ఆ ద్వారాన్ని గుర్తించారా?” దానికి ఆయన, “నిస్సందేహంగా ఆయన దానిని గుర్తించారు; ఈనాటి రాత్రి రేపటి పగలుకు సమీపంలోనే ఉన్నదని ఒక మనిషి ఎంత గట్టిగా నమ్ముతాడో అంత గట్టిగా ఆయన దానిని గుర్తించారు.” నేను వారికి ఒక హదీసును వినిపించాను. అందులో మిథ్యా కథనం అనేది ఎంతమాత్రం లేదు. షఖీఖ్ ఇలా అన్నారు; మేము ద్వారం అంటే భావం ఏమిటో హుజైఫాను అడిగేందుకు భయపడ్డాము. మేము ఇదే విషయం గురించి మస్రూఖ్‌ను అడిగాము. అప్పుడు అతను హుజైఫాను అడిగారు. దానికి సమాధానంగా హుజైఫా ఇలా అన్నారు; “స్వయంగా హ|జ్రత్ ఉమరే(ర) ఆ ద్వారం.”[4]**

---

503–3. వేలాది మంది ప్రజలు ఈ ఉపద్రవానికి, ఈ విపత్తుకు గురి అవుతారు. అంటే అది విశ్వవ్యాప్తమైన ఉపద్రవం అన్నమాట.

503–4. హ|జ్రత్ ఉమర్ (ర) గారికి ఈ విషయం బాగా తెలుసు. కాని భయం వల్ల హుజైఫాను కూడా ఆయన అడిగారు. ద్వారం తలుపులు బ్రద్దలు కావటం అంటే హుజైఫాగారి దృష్టిలో హ|జ్రత్ ఉమర్ (ర) అమరగతి నొందుతారన్నమాట; ఆయన హత్య చెయ్యబడతారన్నమాట. ఆయనగారి అమరగతి కారణంగా ఇంతవరకు మూసుకుని ఉన్న ఆపదల ద్వారం తలుపులు తెరచుకుంటాయి. సుబ్‌హానల్లాహ్! (అల్లాహ్ అత్యంత పవిత్రుడు) హ|జ్రత్ ఉమర్ (ర) గారి వ్యక్తిత్వం ఎంత గొప్పది, ఆయన ఎంత గొప్పవారు! ఆయనగారు బ్రతికి ఉన్నంతకాలం అసంతుష్టి కారణంగా గొణిగే ధైర్యం కూడా, నోరు విప్పి మాట్లాడే ధైర్యం కూడా ఎవరికీ ఉండేది కాదు. వారు అనుకూలురైనా సరే, వ్యతిరేకులైనా సరే. అందరూ భయంతో వణికిపోయే వారు. హ|జ్రత్ ఉమర్ (ర) గారంటే ప్రజలు ఎంతగా భయపడేవారో, హ|జ్రత్ ఉస్మాన్ (ర) అంటే అంతగా భయపడేవారు కాదు. హ|జ్రత్ ఉమర్ (ర) గారి రువాబు అంత ప్రభావవంతమైనది అన్నమాట. హ|జ్రత్ ఉస్మాన్ (ర)గారి ఖిలాఫత్ కాలంలో ప్రజల మీద అంత అదుపు లేకుండాపోయింది. వారు తిరుగుబాటు చేశారు. ఇంకా రకరకాల కల్లోలాలు చెలరేగాయి. ఈనాడు కూడా ఈ కల్లోలాలు, ఈ కలహాలు రగులుతూనే పోతున్నాయి. ఇస్లామ్‌ను బలపరిచే, ముస్లిములను రక్షించే హ|జ్రత్ ఉమర్(ర) లాంటి

**504.** హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఒక వ్యక్తి ఒక అన్సారీ మహిళను ముద్దు పెట్టుకున్నాడు (సంభోగించలేదు). తరువాత అతను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) వద్దకు వెళ్లి ఆయన (స) గారికి తాను చేసిన తప్పును గురించి చెప్పుకున్నాడు (పశ్చాత్తాపపడ్డాడు). అప్పుడు కరుణామయుడైన అల్లాహ్ హూద్ సూరాలోని ఈ వాక్యాన్ని అవతరింపజేశాడు; "ఓ ప్రవక్తా! నమాజును స్థాపించు. పగలు యొక్క రెండు సరిహద్దు సమయాల లోనూ, కొంత రాత్రి గడచిపోయిన తరువాతనూ. వాస్తవానికి సత్కార్యాలు దుష్కార్యా లను రూపుమాపుతాయి." ఆ వ్యక్తి ఇలా అడిగాడు; "ఓ ప్రవక్తా(స)! ఈ ఆజ్ఞ కేవలం నా కొరకేనా అవతరించింది?" దానికి సమాధానంగా దైవప్రవక్త (స) ఇలా సమాధాన మిచ్చారు; "కాదు. ఇది నా అనుచర సంఘం మొత్తానికి వర్తిస్తుంది."[1]

## 5వ అధ్యాయం

### సకాలంలో నమాజు చేసేదాని ఔన్నత్యం.

**505.** హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఒకసారి నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారిని ఇలా అడిగాను; "ఓ దైవప్రవక్తా (స)! ఏ పని అల్లాహ్‌కు ఎక్కువ ఇష్టమైనది?" దానికి సమాధానంగా ఆయన (స)గారు, "సకాలంలో నమాజు చెయ్యటం అల్లాహ్‌కు ఎక్కువ ప్రీతికర మైనది" అని సెలవిచ్చారు. "తరువాత ఏ పని అల్లాహ్‌కు ఎక్కువ ఇష్టమైనది?" అని ఆయన (స) గారిని నేను అడిగాను. దానికి జవాబుగా ఆయన (స), "తరువాత తల్లిదండ్రుల పట్ల సుహృద్భావంతో వ్యవహరించటం అల్లాహ్‌కు ఎక్కువ ఇష్టమైనది' అని సెలవిచ్చారు. "ఆ తరువాత ఏ పని అల్లాహ్‌కు అత్యంత ప్రీతికరమైనది?"

---

మహానుభావుణ్ణి ద్వేషించే రాఫిజీలకు అల్లాహ్ మార్గదర్శకత్వాన్ని ప్రసాదించుగాక! ఎందుకంటే ఆయన (రజి) లాంటి వారి మూలంగానే ఇంతవరకు ఇస్లామ్ పేరు స్థిరంగా ఉండిపోయింది.

504-1. అధ్యాయం యొక్క ముఖ్యాంశం ఇక్కణ్ణుంచే ప్రారంభమవుతుంది. నమాజు చెయ్యటం వల్ల పాపాలకు క్షమాపణ లభిస్తుంది. ఖస్తలాని ఇలా అన్నారు; ఈ వాక్యంలో పాపాలు అంటే పెద్ద పెద్ద పాపాలు, మహా పాపాలు అని భావం. ఒక హదీసులో ఇలా వచ్చింది; ఒక నమాజు మరొక నమాజు వచ్చేవరకు చేసిన పాపా లకు పరిహారంగా ఉంటుంది. కాని మనిషి పెద్ద పెద్ద పాపాలకు దూరంగా ఉండాలి.

**అని నేను ఆయన (స) గారిని అడిగాను. దానికి ఆయన (స)గారు, "అల్లాహ్ మార్గంలో జిహాద్ చెయ్యటం అల్లాహ్‌కు అత్యంత ప్రీతికరమైనది" అని సెలవిచ్చారు. హజ్రత్ ఇబ్నె మస్ఊద్ (రజిఅన్) ఇలా అన్నారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారిని ఈ విషయాలను గురించి మాత్రమే నేను అడిగాను. మరిన్ని విషయాలను గురించి నేను అడిగి ఉంటే ఆయన (స) వాటిని గురించి కూడా నాకు చెప్పి ఉండేవారు.[1]**

## 6వ అధ్యాయం

**ప్రతి రోజు చేసే ఐదు నమాజులను ఎవరైనా జమాఅత్‌తో గానీ లేదా ఒంటరిగా గానీ సకాలంలో చేసినట్లయితే అవి పాపాలకు పరిహారమవుతాయి.**

**506. హజ్రత్ అబూ హురైరా(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిస్తూ ఉండగా నేను విన్నాను; "మీలో ఎవరి వాకిలి ముందు అయినా నీటి కాలువ ప్రవహిస్తూ ఉన్నట్లయితే, అతను గనక ప్రతి రోజూ ఐదు సార్లు ఆ కాలువలో స్నానం చేస్తూ ఉన్నట్లయితే, ఇలా ఐదు సార్లు ప్రతిరోజూ స్నానం చెయ్యటం అనేది అతని ఒంటిమీద ఏదైనా మట్టినిగాని, మాలిన్యాన్నిగానీ మిగిలి ఉండేలా చేస్తుందా?" అని ఆయన (స) ప్రజల్ని అడిగారు. దానికి సమాధానంగా వారు, "లేదు, కాస్తంత మాలిన్యం కూడా అతని శరీరంపై మిగిలి ఉండదు." అప్పుడు ఆయన (స) ఇలా సెలవిచ్చారు; "ఐదు పూటల నమాజు చేసే విషయం కూడా ఇంతే. అల్లాహ్ ఆ నమాజుల వల్ల మనిషి చేసిన పాపాలను చెరిపివేస్తాడు."**

---

505-1. ఇతర హదీసుల్లో ఏ ఏ పనులైతే ఉన్నతమైనవిగానూ, శ్రేష్ఠమైనవిగానూ చూప బడ్డాయో అవి ఏవీ ఇక్కడ పేర్కొనబడిన పనులకు వ్యతిరేకమైనవి ఏమీ కావు. ప్రతి మనిషి యొక్క స్థితిగతులనుబట్టి, అతని సామర్థ్యాన్నిబట్టి, అతని వివేకాన్ని బట్టి అతనికి ఏ పనులైతే అన్నిటికంటే శ్రేష్ఠమైనవో వాటిని దైవప్రవక్త (స) అతనికి తెలియ జేశారు. సమయాన్ని, సందర్భాన్ని కూడా ఆయన (స)గారు దృష్టిలో పెట్టుకునే వారు. ఉదాహరణకు; అవిశ్వాసులు ప్రాబల్యం వహించినప్పుడు జిహాద్ (ధర్మ పోరాటం) అన్ని పనులకంటే ఉన్నతమైనదిగా పరిగణింపబడుతుంది. కరవు కాటకాలు వచ్చినప్పుడు, ధరలు విపరీతంగా పెరిగిపోయినప్పుడు ఆహార పదార్థాల అవసరం అధికమవుతుంది. ఆ పరిస్థితుల్లో ఆకలిగొన్న వారికి అన్నం పెట్టటం అన్నిటికంటే ఉన్నతమైన, శ్రేష్ఠమైన కార్యంగా రూపొందుతుంది.

## 7వ అధ్యాయం

## నమాజును నాశనం చెయ్యటం. అంటే సకాలంలో చెయ్యకపోవటం.

**507. హ్రజత్ అనస్ (రజిఅన్) ఇలా అన్నారని గైలాన్ ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారి కాలంలోని ఏ విషయాన్నీ నేను ఇప్పుడు చూడటం లేదు. "ఆ కాలంలోని నమాజైతే ఇప్పుడు ఉన్నది కదా!" అని ప్రజలు అన్నారు. దానికి సమాధానంగా హ్రజత్ అనస్ (ర) ఇలా అన్నారు; "మీరు నమాజులో కూడా ఏదైతే చెయ్యదలచుకున్నారో అది చేసేశారు."[1] అజ్జుహ్రీ గారు ఇలా ఉల్లేఖించారు; నేను డెమాస్కస్ నగరానికి వెళ్లి అక్కడ హ్రజత్ అనస్ బిన్ మాలిక్ (ర)ను కలుసుకున్నాను. ఆయన (స) గారు ఏడుస్తున్నారు. 'మీరెందుకు ఏడుస్తున్నారు?' అని నేను ఆయన్ని అడగ్గా, ఆయన ఇలా సమాధానం చెప్పారు; మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) గారి కాలంలో నేను ఏ విషయాలనైతే చూశానో,**

507-1. దుర్మార్గుడైన హజ్జాజ్ నమాజు చేసే విషయంలో ఆలస్యం చేసేవాడు. అందుకని హ్రజత్ అనస్ (ర) ఇలా అన్నారు; మీరు నమాజును కూడా సకాలంలో చెయ్యటం మానేశారు. అలాంటప్పుడు నమాజెక్కడ మిగిలి ఉంది? అనస్ (ర) గారి కాలంలో నైతే పాదుషావారు, అమీరు నమాజు చేసేవారు. కాని ఆలస్యంగా చేసేవారు, సకాలంలో చేసేవారు కాదు. నెలకు వందో రెండొందలో సంపాదించే ఒక ముస్లిమ్ కూడా ఈ కాలంలో తనను తాను ఫిరౌను చక్రవర్తిగా భావిస్తూ మసీదుకు పోవటాన్నే దోషంగా భావిస్తున్నాడు.

507-2. అంటే ప్రజలు వేళ దాటిపోయిన తరువాత, నమాజు చేస్తున్నారు. దుర్మార్గుడూ, ఇరాఖ్‌కు గవర్నరైన హజ్జాజ్‌కు వ్యతిరేకంగా ఫిర్యాదు చెయ్యటానికి హ్రజత్ అనస్ ఆనాటి ఖలీఫా అయినటువంటి వలీద్ బిన్ అబ్దుల్ మలిక్ ఇబ్నె మర్వాన్ వద్దకు వెళ్లారు. అల్లాహు అక్బర్! హ్రజత్ అనస్ (ర)గారి కాలంలోనే పరిస్థితి ఇలా ఉంటే, ఈ కాలం పరిస్థితి ఎంత ఘోరంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. అయ్యో! ఈ కాలంలోనైతే తౌహీద్ (విశ్వాసం) నుంచి ఆరాధనల వరకుగల ఇస్లామ్ సూత్రాలలో ప్రజలు ఎన్నో కొత్త విషయాలను, కొత్త పోకడలను సృష్టించారు. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారి కాలంలో ఈ విషయాలు కనీసం ప్రస్తావన క్కూడా నోచుకోలేదు. ఏ మనిషైనా మహాప్రవక్త (స) గారి సంప్రదాయాల ప్రకారంగానీ, ఆయన (స) గారి ప్రత్యక్ష అనుచరుల పద్ధతుల ప్రకారంగానీ నడిస్తే ఆ మనిషి మీద రకరకాల నిందలు మోపుతున్నారు. ఇంకా అతన్ని ఒక విగ్రహమనీ, అతను, అసలు ఇస్లామ్ మీద నడవటమే లేదని ఎగతాళి చేస్తున్నారు. "ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్".

వాటిలోని ఒక్క విషయం కూడా ఇప్పుడు ఈ కాలంలో నాకు కనిపించటం లేదు. ప్రజలు నమాజునైతే చేస్తున్నారు. అయితే ఆ నమాజు కూడా నాశనమై పోయింది.[2] ఈ హదీసును బకర్ బిన్ ఖలఫ్ కూడా ఉల్లేఖించారు.

## 8వ అధ్యాయం

### నమాజు చేసే వ్యక్తి తన ప్రభువుతో రహస్యంగా మాట్లాడతాడు

**508.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అనస్ (రజిఅన్) ఉల్లేఖించారు: సజ్దాను చక్కగా, సక్రమంగా చెయ్యండి. మీలో ఎవరూ తమ బాహువులను ఒక కుక్క మాదిరిగా నేలపై పరచరాదు. ఉమ్మి వేసే అవసరం కలిగినప్పుడు తమ ముందుగానీ, తమ కుడి వైపుగానీ ఉమ్మి వేయకూడదు. ఎందుకంటే అతను నమాజు చేసేటప్పుడు తమ ప్రభువుతో రహస్యంగా మాట్లాడతాడు. అయితే వారు ఎడమ వైపుగానీ లేదా కాళ్ల క్రిందగానీ ఉమ్మి వేయవచ్చు. ఇంకా వారు ఖిబ్లా వైపు ఉమ్మి వెయ్యకూడదు; తమ కుడి వైపు కూడా ఉమ్మి వెయ్యకూడదు. అయితే ఎడమ వైపుగానీ, కాళ్ల క్రిందగానీ ఉమ్మి వేయవచ్చు.

**509.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అనస్ (రజిఅన్) ఉల్లేఖించారు: "సజ్దాను చక్కగానూ, సక్రమమైన రీతిలోనూ చెయ్యండి. మీలోనివారెవరైనా సరే అతను ఒక కుక్క మాదిరిగా తన బాహువులను నేల మీద పరచరాదు. ఉమ్మివేసే అవసరం కలిగినప్పుడు అతను తన ముందు భాగంలోగానీ, తన కుడి వైపుగానీ ఉమ్మి వేయకూడదు. ఎందుకంటే అతను నమాజు చేసేటప్పుడు తన ప్రభువుతో రహస్యంగా మాట్లాడుతున్నాడు." ఖతాదగారి ఉల్లేఖనంలో ఇలా ఉంది; "తన ముందుగానీ లేదా తన ముందు భాగంలో ఉన్న స్థలంలోగానీ ఉమ్మి వెయ్యకూడదు. అయితే ఎడమ వైపుగానీ లేదా పాదాల కింద గానీ ఉమ్మి వెయ్యవచ్చు." షూబాగారు తన ఉల్లేఖనంలో ఇలా అన్నారు; "తన ముందు ఉమ్మి వెయ్యకూడదు. తన కుడి వైపు కూడా ఉమ్మి వెయ్యకూడదు. అయితే ఎడమ వైపుగానీ లేదా పాదాల క్రిందగానీ ఉమ్మి వెయ్యవచ్చు."

## 9వ అధ్యాయం

### ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు జొహర్ నమాజును కొంచెం చల్లబడిన తరువాత చెయ్యటం.[1]

**510.** హజ్రత్ అబూహురైరా (రజిఅన్) మరియు హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్

**(సఅసమ్) ఇలా సెలవిచ్చారు; ఎండ అతి తీవ్రంగా ఉన్నప్పుడు, చల్లబడిన తరువాత నమాజు చెయ్యండి. ఎందుకంటే ఎండ తీవ్రత నరకతాపం వల్ల పెరుగుతుంది.[1]**

**511. అబూజర్ గిఫ్ఫారీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారి ముఅజ్జిన్ (హజ్రత్ బిలాల్ –ర) జొహర్ నమాజు కోసం అజాన్ ఇవ్వసాగారు. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు; 'కొంచెం చల్లబడనీ' లేదా ఇలా అన్నారు; 'ఆగు! ఆగు!' ఇంకా ఇలా అన్నారు; "ఎండ తీవ్రత, నరకతాపం వల్ల పెరుగుతుంది. ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు చల్లబడిన తరువాత నమాజు చెయ్యండి.' చివరకు నగరం బయట ఉన్న కొండ గుట్టల ఛాయలు మాకు కనిపించాయి.**

**512. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూహురైరా (రజిఅన్) ఉల్లేఖించారు; ఎండ అత్యంత తీవ్రంగా ఉన్నప్పుడు చల్లబడిన తరువాత నమాజు చెయ్యండి. ఎందుకంటే ఎండ తీవ్రత నరకతాపం వల్ల పెరుగుతుంది. ఇంతకీ ఏమి జరిగిందంటే, నరకం తన ప్రభువుకు ఫిర్యాదు చేసింది.[1] అది ఇలా అనసాగింది; "ఓ ప్రభూ! నేను ఎంత తీవ్రమైన వేడిలో ఉన్నానంటే నన్ను నేనే మింగేస్తున్నాను." అప్పుడు అల్లాహ్ దానికి సంవత్సరంలో రెండుసార్లు శ్వాస తీసుకునే అనుమతిని ప్రసాదించాడు. ఒకసారి చలికాలంలో, మరొకసారి ఎండా కాలంలో. ఈ కారణం వల్లనే ఎండాకాలంలో ఎండ తీవ్రంగా ఉండటాన్ని మీరు చూస్తారు. చలికాలంలో మీరు ఎక్కువ చలిని చవి చూస్తారు.[2]**

---

9–1. చల్లబడిన తరువాత అంటే అర్థం, పొద్దువాలిన తరువాత అని. 'ఒక మిసల్ సాయ' (ఒక కర్ర పొడవుతో సమానమైన దాని నీడ) గడచిన తరువాత కాదు. ఎందుకంటే ఒక మిసల్ సాయ గడచిన తరువాతనైతే అసర్ వేళ వచ్చేస్తుంది. చాలామంది పండితులు ఈ అభిప్రాయాన్నే సమర్థిస్తారు. జొహర్ నమాజు వేళ రెండు మిసళ్ల నీడ వరకు ఉంటుంది అనే ఇమామ్ అబూహనీఫా (రహ్మాలై) గారి అభిప్రాయాన్ని ఎవరూ ఒప్పుకోలేదు. చివరకు మక్కా నగరంలో కూడా హనఫీ జమాత్‌వారు రెండు మిసళ్ల నీడ రాకముందే అసర్ నమాజును చేసుకుంటారు.

510–1. చాలా మంది విద్వాంసుల దృష్టిలో ఈ ఆజ్ఞ అభిలషణీయమైనది, వాంఛనీయ మైనది అనే భావాన్ని స్ఫురింపజేస్తుంది. కొంతమంది ఏమన్నారంటే, "ఈ ఆజ్ఞ ప్రత్యేకమైనది." జమాఅత్‌తోనూ, ఒంటరిగానూ ఒక మనిషి నమాజు వేళ ప్రారంభ సమయంలోనే నమాజు చెయ్యటం శ్రేష్ఠమైనది. ఇంకా కొంతమంది ఏమన్నారంటే,

**513.** **దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) ఉల్లేఖించారు: జొహర్ నమాజును చల్లబడిన తరువాత చెయ్యండి. ఎందుకంటే, నరకం యొక్క ఆవిరి వల్ల ఎండ తీవ్రంగా ఉంటుంది.**

## 10వ అధ్యాయం

## ప్రయాణంలో ఉన్నప్పుడు జొహర్ నమాజును చల్లబడినప్పుడు చెయ్యటం

**514.** **అబూజర్ గిఫ్ఫారీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఒకసారి మేము దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారితో కలిసి ప్రయాణం చేస్తూ ఉన్నాము. అప్పుడు ముఅజ్జిన్ జొహర్ నమాజు కోసం అజాన్ ఇవ్వదలిచాడు. దైవప్రవక్త మహాశయులు (స) ఇలా సెలవిచ్చారు; "కాస్త చల్లబడిన తరువాత అజాన్ ఇవ్వు." కొంచెంసేపైన తరువాత అతను మళ్ళీ అజాన్ ఇవ్వటానికి సిద్ధమయ్యాడు. దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు; "కొంచెం చల్లబడనీ". చివరకు మేము చిన్న కొండల ఛాయలను చూశాము. తరువాత దైవప్రవక్త మహాశయులు (స) ఇలా సెలవిచ్చారు; "నరకం యొక్క ఆవిరి కారణంగా ఎండ తీవ్రతరమవుతుంది. కనుక ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు చల్లబడిన తరువాత నమాజును చెయ్యండి."**

---

ఎట్టి పరిస్థితుల్లోనైనాసరే ప్రారంభ సమయంలోనే నమాజు చెయ్యటం ఉత్తమమైనది. ఈ హదీసు భావం ఏమిటంటే, 'నమాజు చేసి చల్లబరచండి.' ఎందుకంటే, దైవ కారుణ్యానికి మూలం నమాజే. నరక తాపం ప్రభువైన దేవుని ఆగ్రహాన్ని సూచిస్తుంది.

512-1. నరకం నిజంగానే ఫిర్యాదు చేసింది, అది మాట్లాడగలదు. ఖురాను గ్రంథంలో ఇలా ఉంది; మేము నరకాన్ని, "నీవు నిండి పోయావా?" అని అడుగుతాము. దానికి అది, 'ఎందుకు ఇంకేమయినా మిగిలి ఉందా?' అని అంటుంది. హదీసులో ఇలా వ్రాయబడి ఉంది; చివరకు ప్రభువు తన పాదాన్ని అందులో పెడతాడు. అప్పుడు అది, 'చాలు చాలు. ఇప్పుడు నేను నిండిపోయాను' అని అంటుంది.

512-2. ఎండాకాలంలో శ్వాస విడుస్తుంది. అంటే నరకం యొక్క ఆవిరి పైకి వచ్చేస్తుంది. అది భూమిపై ఉండేవారికి తగులుతుంది. అప్పుడు వారికి తీవ్రమైన వేడి కలుగుతుంది. చలికాలంలో లోపలకు ఊపిరి పీలుస్తుంది. అప్పుడు భూమిపై ఉన్నవారికి వేడి అనిపించదు. కాని భూమి యొక్క చలి ప్రాబల్యం వహించటం వల్ల భూమిపై ఉండేవారికి చలి అనిపిస్తుంది. ఇందులో బుద్ధికి అందని విషయం లేనేలేదు. హదీసును గురించి సంశయంలో పడే అవసరం కూడా లేదు. భూమి లోపల నరకం ఉన్నది. భూగర్భ శాస్త్రవేత్తలు ఇలా వ్రాశారు. భూమిలోకి కొంచెం లోపలికి పోయిన

# 11వ అధ్యాయం

## జుహ్ర్ నమాజు వేళ ప్రొద్దు వ్రాలటం మీద ఆధారపడి ఉంది

**515. హజ్రత్ అనస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ప్రొద్దువ్రాలిన తరువాత తన గదిలో నుంచి బయటికి విచ్చేశారు[1]. జుహ్ర్ నమాజు చేసిన తరువాత ఆయన (స) మెంబర్ మీద నిలబడ్డారు. ప్రళయం గురించి మాట్లాడుతూ ఆయన (స) ఇలా సెలవిచ్చారు: "ఇది వచ్చినప్పుడు పెద్దపెద్ద సంఘటనలు ఎన్నో జరుగుతాయి"[2]. తరువాత ఆయన (స) గారు ఇలా అన్నారు; 'ఎవరైనా ఏమైనా అడగదలిస్తే నన్ను అడగండి. నేను ఈ స్థానంలో ఉన్నంతవరకు నన్ను ఏ విషయం అడిగినా నేను దానిని గురించి సమాధానం చెబుతాను.' అప్పుడు ప్రజలు చాలామంది విలపించసాగారు. కాని ఆయన(స) (మాటిమాటికి) నన్ను అడగండి అని అంటూనే పోయారు. అప్పుడు అబ్దుల్లా బిన్ హుజాఫ అస్సహమీ (ర) నిలబడి 'నా తండ్రి ఎవరో చెప్పండి' అని అడిగారు. దైవ ప్రవక్త (స) నీ తండ్రి 'హుజాఫ' అని సెలవిచ్చారు; తరువాత ఆయన (స) గారు ఇంకా అడగండి అని అన్నారు. చివరకు హజ్రత్ ఉమర్ (రజిఅన్) మర్యాదపూర్వకంగా మోకరిల్లి ఇలా విన్నవించుకోసాగారు; "మేము అల్లాహ్‌ను మా ప్రభువుగా స్వీకరించాము. ఇస్లామ్‌ను మా ధర్మంగా విశ్వసించాము. హజ్రత్ ముహమ్మద్ (స)ను మా ప్రవక్తగా అంగీకరించాము. దానికి మేము ఆనందిస్తు న్నాము." దీనిపై ఆయన (స) గారు మౌనంగా ఉండిపోయారు. తరువాత ఇలా సెలవిచ్చారు; "ఇప్పుడిప్పుడే ఈ గోడ మూల మీద స్వర్గాన్నీ, నరకాన్నీ నా ముందు ప్రదర్శించటం జరిగింది. నేను ఇంతవరకు స్వర్గంలాంటి మంచి వస్తువును దేనినీ చూడలేదు, నరకంలాంటి చెడ్డ వస్తువును దేనినీ చూడలేదు."**

---

తరువాత అక్కడ విపరీతమైన వేడి ఉంటుంది. ఈ కారణం వల్ల మూల పదార్థాలన్నీ నీళ్ల మాదిరిగా కరిగిపోతాయి. అక్కడ ఇనుము ఉన్నా తక్షణం అది కరిగి నీరై పోతుంది.

515-1. ఈ హదీసు ఇంతకు పూర్వం 'జ్ఞాన ప్రకరణం'లో సంక్షిప్తంగా వచ్చింది. ఈ పదం ద్వారానే అధ్యాయం యొక్క ముఖ్యాంశం స్ఫురిస్తుంది; అదేమిటంటే, జుహ్ర్ నమాజు వేళ పొద్దువ్రాలిన తరువాత ప్రారంభమవుతుంది అనే విషయం. కాని పూర్వకాలంలో ఈ విషయం గురించి అభిప్రాయభేదం ఉండేది. తరువాత ఏకాభిప్రాయం కుదిరింది. అదేమిటంటే, ప్రొద్దువాలకముందు జుహ్ర్ నమాజు చెయ్యటం ధర్మసమ్మతమైన విషయం కాదు. కాని ఇమామ్ అహ్మద్, ఇస్‌హాఖ్‌గార్ల

## 12వ అధ్యాయం

**516. హజ్రత్ అబూ బర్‌జా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఫజర్ నమాజును మాలోని వ్యక్తి ఎవరైనా (తన నమాజును పూర్తి చేసిన తరువాత) తనకు దగ్గర్లో ఉన్నటువంటి మరొక వ్యక్తిని గుర్తించేటప్పటి సమయంలో చేసేవారు. ఆయన (స) గారు ఈ నమాజులో అరవై వాక్యాల నుంచి నూరు వాక్యాల వరకు ఖురాను గ్రంథాన్ని పారాయణం చేసేవారు. జుహ్ర్ నమాజును ప్రొద్దువాలినప్పుడు చేసేవారు. ఇంకా ఆయన (స) గారు అస్ర్ నమాజును ఏ సమయంలో చేసేవారంటే, దాని తరువాత మాలోని ఒకరు ఎవరైనా మదీనాపురానికి చివర్లో ఉన్నటువంటి స్థలంలో ఉన్న తన గృహానికి తిరిగి వెళ్ళి పోతాడు. కాని సూర్యుని వేడి ఇంకా తీవ్రంగానే ఉంటుంది. హజ్రత్ అబూ బర్‌జా(ర) గారు మగ్రిబ్ నమాజును గురించి చెప్పినదానిని ఉల్లేఖకుడు మరచిపోయారు. దైవప్రవక్త మహాశయులు (సఅసమ్) ఇషా నమాజును రాత్రి మూడవ భాగం వరకు గానీ లేదా అర్ధరాత్రి వరకుగానీ ఆలస్యం చేసే విషయాన్ని అభ్యంతరకరమైన విషయంగా భావించేవారుకారు. తరువాత అబూ బర్‌జా (ర) గారు మరొకసారి కూడా, అర్ధ రాత్రి దాటిన పిదప ఆయన (స) నమాజు చేసేవారు అని అన్నారు.**

---

దృష్టిలో జుమా నమాజు అంటే శుక్రవారం నమాజు ప్రొద్దువాలకముందు చేసుకోవటం ధర్మసమ్మతమైనదే. ఇంకా ఎండాకాలంలో శుక్రవారం నమాజు పెందలకాడ చేసుకోవటం వల్ల ప్రజలకు సుఖంగా ఉంటుంది.

515-2. మునాఫిఖ్‌లు (వంచకులు) పరీక్షించే నిమిత్తం దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారిని కొన్ని ప్రశ్నలు అడగదలచుకున్నారనే విషయం గురించి ఆయన (స) గారికి తెలిసిపోయింది. ఈ కారణం వల్ల మహాప్రవక్త (స) గారికి కోపం వచ్చింది. అప్పుడు ఆయన (స), "మీరు కోరిన దాన్ని గురించి నన్ను అడగండి" అని అన్నారు. అబ్దుల్లా బిన్ హుజాఫ గారిని ప్రజలు ఫలానా వ్యక్తి కొడుకు అని (కాకపోయినా) అనేవారు. ఈ కారణంగా అతను దైవప్రవక్త (స) గారిని, "అసలు నా తండ్రి ఎవరు?" అని అడిగారు. ప్రజలు భయకంపితులై ఏడ్వసాగారు. దైవశిక్ష వచ్చిపడుతుందని శంకించారు. లేదా ప్రళయ భయం వల్ల వణికిపోసాగారు. అప్పుడు స్వర్గనరకాలు రెండూ చిన్నవిగా చేయబడి ముందుకు తీసుకురాబడ్డాయి. లేదా వాటి నమూనా ప్రదర్శింపబడింది. లేదా ఆ స్థలం నుంచి స్వర్గనరకాలు ఉన్నటువంటి స్థలం వరకు గల మార్గం తెరువబడింది. హజ్రత్ ఉమర్ (రజిఅన్) గారు దైవప్రవక్త (స) గారికి ఆగ్రహం కలిగిందని గ్రహించారు. అప్పుడు ఆయన (ర)

**517.** హ|జ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: మేము దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్)గారి వెనుక నిలబడి మధ్యాహ్న సమ యంలో జుహ్ర్ నమాజు చేసేటప్పుడు ఎండ వేడి నుంచి కాపాడుకునేందుకు మా బట్టల మీద సజ్దా చేసేవారము.

**518.** హ|జ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్)మదీనాపురంలో ఉన్నప్పుడు (అంటే ప్రయాణం కాదు) మగ్రిబ్, ఇషాల నమాజులను ఏడు రకాతులతోనూ; జొహర్, అసర్ నమాజు లను కలిపి ఎనిమిది రకాతులతోనూ చేశారు. అయ్యూబ్ సఖ్తియాని గారు జాబిర్ బిన్ జైద్ గారితో ఏమన్నారంటే; "బహుశ రాత్రి సమయంలో వర్షం కురిసినప్పుడు అలా చేసి ఉంటారు." దానికి సమాధానంగా ఆయన (ర), "బహుశ కావచ్చు" అని అన్నారు.

## 13వ అధ్యాయం
## అస్ర్ నమాజు వేళ

**519.** హ|జ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహా నీయులు ముహమ్మద్ (సఅసమ్) అస్ర్ నమాజును తన గదిలో ఎండ ఇంకా ఉన్న ప్పుడే చేసేవారు.

**520.** హ|జ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) అస్ర్ నమాజును తన గదిలో ఎండ ఇంకా ఉన్నప్పుడే చేశారు; అప్పుడు అక్కడిదాకా నీడ ఇంకా వ్యాపించలేదు.

**521.** హ|జ్రత్ ఆయేషా (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహా శయులు ముహమ్మద్ (సఅసమ్) నాతో ఉన్నప్పుడు నా గది లోపల ఎండ ఇంకా ఉన్నప్పుడే అసర్ నమాజు చేసేవారు. అప్పుడు నా గదిలోకి నీడ ఇంకా రాలేదు.

**522.** సయ్యార్ బిన్ సలామా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: నేను మరియు నా తండ్రిగారు ఉభయులమూ కలిసి అబూ బర్జా అస్‌లమీ (రజిఅన్) వద్దకు వెళ్లాము. నా తండ్రి ఆయన (ర) గారిని ఇలా అడిగారు; "దైవప్రవక్త (స)గారు ఫర్జ్ నమాజులను ఏ ఏ వేళల్లో చేసేవారో చెప్పండి." దానికి సమాధానంగా అబూబర్జా (ర) ఇలా అన్నారు; "మీరు ప్రథమ నమాజు అని అనే జుహ్ర్ నమాజును ఆయన (స) ప్రొద్దువాలిన తరువాత చేసేవారు. అస్ర్ నమాజును ఎప్పుడు చేసేవారంటే, దాని తరువాత మాలో ఎవరైనా ఒకరు మదీనాపురం చివర్లో ఉన్నటువంటి తన ఇంటికి

**వెళ్ళినప్పుడు, సూర్యుడు ఇంకా తీక్షణంగానే ప్రకాశిస్తూ ఉంటాడు. మగ్రిబ్ నమాజు విషయంలో అబూ బర్‌జా (ర) ఏమి చెప్పారో నాకు జ్ఞాపకం లేదు అని సయ్యార్ (ర) అన్నారు." అబూ బర్‌జా ఇంకా ఇలా అన్నారు; దైవప్రవక్త (స), మీరు 'అతమా' అని అనే ఇషా నమాజును ఆలస్యంగా చెయ్యటాన్ని ఇష్టపడేవారు. దానికి ముందు పడుకోవటాన్ని అయిష్టపడేవారు. ఇదే విధంగా ఇషా నమాజు తరువాత మాట్లాడు కోవటాన్ని కూడా ఆయన ఇష్టపడేవారు కాదు[1]. దైవప్రవక్త (స) ఫజ్ర్ నమాజును ఎప్పుడు చేసేవారంటే దాని తరువాత ఒక మనిషి తనకు దగ్గర్లో ఉన్నటువంటి మరొక మనిషిని తేలికగా గుర్తిస్తాడు (అంటే అంత వెలుతురు ఉంటుందన్న మాట). ఇంకా ఈ నమాజులో ఆయన (స) గారు అరవై నుంచి నూరు దాకా ఖురాను వాక్యాలను పారాయణం చేసేవారు.**

**523. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: మేము దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారితో కలిసి అస్ర్ నమాజు చేసే వారము. తరువాత ఎవరైనా ఒక మనిషి బనీ అమ్ర్ బిన్ ఔఫ్ తెగవారి వీధికి వెళితే (ఖుబా అనే ఆ వాడ మదీనా పురానికి కోసెడు దూరంలో ఉంది) అక్కడి ప్రజలు అస్ర్ నమాజును చేస్తూ ఉండటాన్ని గమనిస్తాడు.[1]**

**524. అబూ ఉమామ (సాద్ బిన్ సహ్ల్) ఇలా చెబుతూ ఉండగా తాను విన్నానని అబూబకర్ బిన్ ఉస్మాన్ బిన్ సహ్‌ల్ బిన్ హునైఫ్‌గారు ఉల్లేఖించారు; మేము ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (ఖలీఫా) గారితో కలిసి జుహ్ర్ నమాజును చేశాము. తరువాత మేము అక్కణ్ణుంచి బయలుదేరి అనస్ బిన్ మాలిక్ (ర) వద్దకు వెళ్లాము.**

---

522–1. అంటే ప్రపంచానికి సంబంధించిన మాటలు; వ్యర్థమైన, నిరర్థకమైన సంభాషణలు. ఎందుకంటే, ఇషా నమాజు చేసి నిద్రపోవటం అనేది ఒక మనిషి యొక్క మేల్కోవటం ఆరాధనపై అంతమవుతుంది. ఎలాగంటే, ఫజర్ నమాజుతో మేల్కోవటం ఆరాధనతో ప్రారంభమవుతుంది. ఇషా నమాజు తరువాత అనవసరమైన మాటల్లో పడి మేల్కోవటం వల్ల తహజ్జుద్ నమాజు కోసం కళ్లు తెరుచుకోవు. ఇంకా ఫజ్ర్ నమాజు విషయంలో ఆలస్యమవుతుంది.

523–1. అక్కడ ఉండే ప్రజలు అస్ర్ నమాజును కొంచెం ఆలస్యంగా చేసేవారు; తమ వ్యాపార లావాదేవీలను తీర్చుకున్న తరువాత, తమ వ్యవసాయ పనులను తీర్చుకున్న తరువాత. దైవప్రవక్త (స) పెందలకాడ అంటే నమాజు వేళ ప్రారంభ దశలో నమాజు చేసేవారు.

చూస్తే తెలిసిందేమిటంటే, ఆయన అస్ర్ నమాజు చేస్తూ ఉన్నారు. నేను ఆయన్ని (ర) అడిగాను; "ఓ బాబాయి గారూ! ఇప్పుడు మీరు చేసిన నమాజు ఏ నమాజు?" "ఇప్పుడు నేను చేసిన నమాజు అస్ర్ నమాజు. ఈ నమాజునే మేము ఆయన(స)తో పాటే చేసే వారము" అని అనస్ (ర) జవాబు పలికారు.

**525.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఉల్లేఖించారు: దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసం) అసర్ నమాజును ఎప్పుడు చేసేవారంటే, అప్పుడు సూర్యుడు ఆకాశంలో ఎత్తయిన స్థలంలో ఉంటాడు, ఇంకా సూర్యుని తాపం అప్పుడు తీవ్రంగా ఉంటుంది. తరువాత ప్రయాణం చేసే వ్యక్తి ఎవరైనా అవాలీ (మదీనా పురానికి చెందిన ఒక ప్రదేశం) వరకు వెళ్లినప్పుడు సూర్యుడు ఇంకా ఎత్తుగానే ఉంటాడు. జుహ్రి ఇలా సెలవిచ్చారు; అవాలీకి చెందిన కొన్ని స్థలాలు మదీనా పట్టణానికి నాలుగు మైళ్ల దూరంలోనో లేదా కొంచెం అటోఇటో ఉంటాయి.

**526.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఉల్లేఖించారు: ఆయన (ర) ఏమన్నారంటే; మేము అసర్ నమాజును చేసిన తరువాత మాలోని ఒక వ్యక్తి ఎవరైనా ప్రయాణంచేసి మదీనాకు ఒక కోసెడు దూరంలో ఉన్నటువంటి 'కుబా'కు వెళ్లినప్పుడు సూర్యుడు ఆకాశంలో ఇంకా ఎత్తుగానే ఉంటాడు.

## 14వ అధ్యాయం

### అసర్ నమాజును ఖజా చేసినదాని పాపం

**527.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఉల్లేఖించారు: ఏ వ్యక్తి అయితే తన అసర్ నమాజును ఖజా చేసుకుంటాడో ఆ వ్యక్తి తన భార్యాపిల్లల్నీ, తన ఆస్తి పాస్తుల్నీ అన్నింటినీ పోగొట్టుకుంటాడు.

## 15వ అధ్యాయం

### ఏ వ్యక్తి అయితే తన అసర్ నమాజును బుద్ధిపూర్వకంగా విడిచిపెడతాడో దాని పాపం

**528.** హజ్రత్ బురైదా (రజిఅన్) ఉల్లేఖనం: ఆకాశం మేఘావృతమై ఉన్న ఒక రోజున యుద్ధ మైదానంలో ఉన్నప్పుడు ఆయన (ర) ఇలా అన్నారు; "అసర్ నమాజును త్వరగా చేసుకోండి. ఎందుకంటే దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) ఇలా సెలవిచ్చారు; ఏ మనిషైతే తన అసర్ నమాజును విడిచిపెడతాడో నిశ్చయంగా ఆ మనిషి చేసిన సత్కార్యాలన్నీ వృధా అయిపోతాయి."

## 16వ అధ్యాయం
## అస్ర్ నమాజు ఘనత

**529.** హజ్రత్ జరీర్ బిన్ అబ్దుల్లా (రజిఅన్) ఉల్లేఖించారు: ఆయన (ర) ఇలా అన్నారు; మేము దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం)గారి వద్ద సమావేశమై ఉన్నాము. ఆయన (స) గారు ఒక రాత్రి చంద్రుని వైపు చూసి ఇలా సెలవిచ్చారు; నిశ్చయంగా మీరు మీ ప్రభువును ఈ చంద్రుణ్ణి ఇప్పుడు ఎలా చూస్తూ ఉన్నారో అలా చూస్తారు. మీ ప్రభువును చూసే విషయంలో మీకు ఎలాంటి ఇబ్బందీ ఉండదు. కనుక మీరు గనుక సూర్యోదయానికీ, సూర్యాస్తమయానికీ ముందు ఉన్నటువంటి నమాజుల (ఫజ్ర్, అస్ర్)ను పోగొట్టుకోకుండా, నియమం తప్పకుండా చెయ్యండి. మీరు గనుక షైతాను ప్రాబల్యానికి లొంగకుండా అలా చేసినట్లయితే అది మీకు ఎంతో మేలైనది. తరువాత ఆయన (స) ఖురానులోని ఈ వాక్యాన్ని చదివారు; "సూర్యుడు ఉదయించక ముందూ, అస్తమించక ముందూ నీవు నీ ప్రభువు స్తోత్రంతోపాటు ఆయన పవిత్రనామాన్ని కొనియాడు." *(దివ్య ఖుర్ఆన్–**50:39**)*

**530.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారని అబూ హురైరా (ర) ఉల్లేఖించారు: "కొందరు దైవదూతలు రాత్రి సమయంలోనూ, మరికొందరు పగటి సమయంలోనూ ఒకరి తరువాత ఒకరు వరుసగా మీ వద్దకు వస్తూ ఉంటారు. ఈ దైవదూతలందరూ ఫజరు, అసరు నమాజులలో సమావేశమవుతూ ఉంటారు. తరువాత ఏ దైవదూతలైతే రాత్రి సమయంలో మీ వద్దకు వస్తారో, వారు ఆకాశం మీదకు వెళ్లినప్పుడు, వారి ప్రభువు వారిని ఇలా అడుగుతాడు; – వాస్తవానికి ఆయన స్వయంగా తన దాసులను గురించి బాగా ఎరుగును – మీరు నా దాసులు ఏ స్థితిలో ఉండగా వారిని చూసి వచ్చారు? దానికి సమాధానంగా వారు ఇలా అంటారు; "మేము వారిని నమాజు చేస్తూ ఉన్న స్థితిలో వదిలి వచ్చాము. ఇంకా మేము వారి వద్దకు వెళ్లినప్పుడు కూడా వారు నమాజు చేస్తూనే ఉన్నారు."

## 17వ అధ్యాయం
## ఏ వ్యక్తి అయితే సూర్యాస్తమయానికి ముందు అసర్ నమాజుకు చెందిన కేవలం ఒక రకాతును మాత్రమే చెయ్యగలిగాడో, దానిని గురించి

**531.** దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు: మీలో ఎవరైనా సూర్యాస్తమయానికి

ముందు కేవలం ఒకే ఒక రకాతు అసర్ నమాజును పొందినట్లయితే, అప్పుడు అతను తన అసర్ నమాజును పూర్తిగా చేసుకోవాలి. ఇంకా అదే విధంగా ఎవరైనా సూర్యోదయానికి ముందు ఫజర్ నమాజుకు చెందిన కేవలం ఒకే ఒక రకాతును పొందినట్లయితే అప్పుడు అతను కూడా తన నమాజును పూర్తి చేసుకోవాలి.

**532.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిస్తూ ఉండగా తాను విన్నానని హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఉల్లేఖించారు: మీకు పూర్వం గతించిన జాతుల(యూదులు, క్రైస్తవుల)తో పోలిస్తే మీ జీవిత కాలం అసర్ నుంచి సూర్యాస్తమయం వరకు ఎంతకాలం అయితే ఉంటుందో కేవలం అంతే కాలం. తౌరాత్ ప్రజలకు తౌరాత్ గ్రంథం ఇవ్వబడింది. వారు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు (అంటే సగం దినం) దాని ప్రకారం తమ జీవితాన్ని గడిపారు. తరువాత వారు అలసిపోయారు. పనిని పూర్తి చేయలేకపోయారు. వారికి వారి ఆచరణ ప్రకారం ఒక్కొక్క ఖీరాత్ చొప్పున ప్రతిఫలం ఇవ్వబడింది. ఆ తరువాత ఇంజీల్ వారికి ఇంజీల్ గ్రంథం ఇవ్వబడింది. వారు (సగం రోజు నుంచి) అసర్ వరకు దాని ప్రకారం ఆచరించారు. చివరకు వారు కూడా అలసిపోయారు. వారికి కూడా వారి ఆచరణలకు ఒక్కొక్క ఖిరాత్ చొప్పున ప్రతిఫలం ఇవ్వబడింది. ఆ తరువాత సూర్యాస్తమయం అయ్యేవరకు మనకు ఖుర్ఆన్ గ్రంథం లభించింది. మనం సూర్యుడు అస్తమించే వరకు దానిని ఆచరించాము (పని పూర్తి చేశాము). మనకు రెండేసి ఖిరాత్‌ల చొప్పున పుణ్యఫలం లభించింది. దానిపై ఆ గ్రంథ ప్రజలు ఉభయులూ ఇలా అన్నారు; ఓ మా ప్రభూ! వారికైతే నీవు రెండేసి ఖిరాత్‌లను ఇచ్చావు. మాకేమో ఒక్కొక్క ఖిరాత్ మాత్రమే ఇచ్చావు. వాస్తవానికి మేము వారి కంటే ఎక్కువ పని చేశాము. దానికి అల్లాహ్ "నేను మీకేమైనా అన్యాయం చేశానా?" అని అడిగాడు. 'లేదు' అని వారు విన్నవించుకున్నారు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు; అయితే ఈ ఎక్కువ ఇవ్వటం అనేది నా అనుగ్రహఫలమే. నేను కోరిన వారికి దానిని ప్రసాదిస్తాను.

**533.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అబూ మూసా అష్అరీ (రజిఅన్) ఉల్లేఖించారు: ముస్లిమ్‌ల, యూదుల, క్రైస్తవుల ఉపమానం ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేసే షరతు మీద కూలీలను కుదుర్చు

**కున్న ఒక మనిషి మాదిరిగా ఉన్నది. ఆ కూలీలు మధ్యాహ్నం వరకు పని చేసి ఆ మనిషితో ఇలా అన్నారు; "నీవు ఇచ్చే కూలీ డబ్బులు మాకు అవసరంలేదు." తరువాత అతను మరికొందరు ఇతర కూలీలకు ఆ పనిని అప్పజెప్పి వారితో ఇలా అన్నాడు; "దినం పూర్తి అయ్యే వరకు పని చెయ్యండి. మొదట పని చేసిన కూలీలకు ఎంత కూలీ నిర్ణయమయిందో ఆ కూలీనే మీరు తీసుకోండి. 'ఆ విధంగా వారు అస్ర్ నమాజు వరకు పనిచేసి అతనితో, "మేము చేసిన పనికి కూలీ తీసుకోము. దానిని మేము ఉచితంగానే చేశాము" అని అన్నారు. ఆ మనిషి మరి కొందరిని పని కోసం కుదుర్చుకున్నాడు. ఆ దినం పూర్తి అయ్యేవరకు వారు పని చేశారు (సూర్యాస్తమయం అయ్యే వరకు వారు పని చేశారు) వారికి పూర్వం పని చేసిన కూలీల డబ్బులు కూడా వారే తీసుకున్నారు.[1]**

---

533–1. వారు కేవలం అసర్ నుంచి మగ్రిబ్ వరకు మాత్రమే పని చేశారు. కాని వారికి ఒక పూర్తి దినం కూలీ లభించింది. ఎందుకంటే వారు షరతును పూర్తి చేశారు, ఉల్లంఘించలేదు. సాయంత్రం వరకు పని చేశారు, పనిని పూర్తి చేశారు. మొదట పని చేసిన ఇరువర్గాల కూలీలు తమకు తామే నష్టం చేకూర్చుకున్నారు; పనిని అర్ధాంతరంగా వదిలిపెట్టి వెళ్ళిపోయారు. కనుక వారు చేసిన శ్రమ వృథా అయిపోయింది. ఈ ఉపమానాలు యూదులకూ, క్రైస్తవులకూ, ముస్లిములకూ చెందుతాయి; యూదులు దైవప్రవక్త మూసా(అ)ను విశ్వసించారు, తౌరాత్ గ్రంథం ప్రకారం నడిచారు. కాని ఆ తరువాత అవతరించిన పరిశుద్ధ ఇంజీల్ గ్రంథాన్నీ, ఖుర్ఆన్ షరీఫ్‌నూ తిరస్కరించారు; హజ్రత్ ఈసా(అ) ప్రవక్తనూ, చివరి దైవప్రవక్త ముహమ్మద్ (స)నూ వారు విశ్వసించలేదు. ఇంకా క్రైస్తవులు ఇంజీలు గ్రంథాన్నీ, దైవ ప్రవక్త హజ్రత్ ఈసా(అ)నూ విశ్వసించారు. కాని పవిత్ర ఖుర్ఆన్ గ్రంథాన్నీ, చివరి దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స)నూ తిరస్కరించారు. ఈ విధంగా ఈ రెండు వర్గాల వారి శ్రమ కూడా వృథా అయిపోయింది; పరలోకంలో లభించే ప్రతిఫలానికి వారు దూరమై పోయారు. చివరి యుగంలో ముస్లిములు వచ్చారు, వారు కొంతకాలం మటుకే పని చేశారు. కాని ఆ పనిని పూర్తి చేశారు. అల్లాహ్ అవతరింపజేసిన అన్ని గ్రంథాలను, పంపినటువంటి ప్రవక్తలనందరినీ విశ్వసించారు. కనుక ప్రతిఫలమంతా వారికే లభించింది. "జాలిక ఫజ్‌లుల్లాహి యూతీహి మంయ్యషాఉ వల్లాహు జుల్‌ఫజ్‌లిల్ అజీమ్".

## 18వ అధ్యాయం
## మగ్రిబ్ నమాజు వేళను గురించి.

**అతా బిన్ అబీ రిబాహ్ ఇలా సెలవిచ్చారు; వ్యాధి గ్రస్తుడైన మనిషి మగ్రిబ్, ఇషా నమాజులు రెండింటినీ కలిపి చేసుకోవచ్చు.**[1]

**534.** హజ్రత్ రాఫె బిన్ ఖదీజ్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: మేము దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) గారితో కలిసి మగ్రిబ్ నమాజును చేసేవారము. నమాజు ముగిసిన తరువాత మాలో ఎవరైనా తిరిగి వెళ్లినప్పుడు ఒక బాణం ప్రయోగిస్తే అతను ఆ బాణం పడిన స్థలాన్ని స్పష్టంగా చూడగలిగేవాడు (అంటే ఇంకా అంత వెలుగు ఉండేదన్న మాట).

**535.** హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం)గారు జుహ్ర్ నమాజును సరిగ్గా మధ్యాహ్న సమయంలో చేసేవారు; అస్ర్ నమాజును సూర్యుడు స్పష్టంగా ప్రకాశమానంగా ఉన్నప్పుడు చేసేవారు. మగ్రిబ్ నమాజును సూర్యుడు అస్తమించినప్పుడు చేసేవారు. ఇషా నమాజును భిన్న సమయాలలో చేసేవారు. ప్రజలు ఎక్కువమంది వచ్చినట్లయితే ఆయన (స) ఇషా నమాజును రాత్రి పెందలకాడే చేసేవారు; ఒకవేళ ప్రజలు ఆలస్యంగా వస్తే ఆలస్యంగానే ఇషా నమాజును చేసేవారు. ఆయన (స)గానీ లేదా ఆయన (స)గారి సహచరులుగానీ ఫజ్ర్ నమాజును ఇంకా చీకటిగా ఉన్నప్పుడే చేసేవారు.

**536.** సలమా బిన్ అక్వయి ఇలా ఉల్లేఖించారు: మేము దైవప్రవక్త మహా శయులు ముహమ్మద్ (సఅసం)గారితో కలిసి మగ్రిబ్ నమాజును సూర్యుడు పూర్తిగా అంతర్ధానమై పోయినప్పుడు చేసేవారము.

**537.** హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) మగ్రిబ్, ఇషా నమాజులకు చెందిన ఏడు రకాతులనూ, జుహ్ర్, అస్ర్ నమాజులకు చెందిన ఎనిమిది రకాతులనూ కలిపి చదివేవారు.

---

18–1 ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్(రహ్మలై), ఇస్హాఖ్ బిన్ రాహ్వాయ ఏమన్నారంటే, వ్యాధిగ్రస్తుడు, ప్రయాణీకుడు ఉభయులకు జుహ్ర్, అస్ర్ నమాజులను, మగ్రిబ్, ఇషా నమాజులను కలిపిచేయటం పూర్తిగా ధర్మసమ్మతమైన విషయమే.

## 19వ అధ్యాయం

### మగ్రిబ్ నమాజును ఇషా నమాజు అని అనటం ధర్మశాస్త్రం ప్రకారం అవాంఛ నీయం.[1]

**538.** దైవప్రవక్త ముహమ్మద్(సఅసం) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబ్దుల్లా ముగఫ్ఫిల్ ముజన్నీ (రజిఅన్) ఉల్లేఖించారు: పల్లెటూరి మనుషులు మీ మగ్రిబ్ నమాజు పేరును మార్చివేసి మరొక పేరు దానికి పెడతారేమో! అలా కాకుండా చూడండి. అబ్దుల్లా ముజన్నీ(ర) ఇలా అన్నారు; పల్లెటూరి మనుషులు మగ్రిబ్ నమాజును ఇషా నమాజు అని పిలిచేవారు.

## 20వ అధ్యాయం

### 'ఇషా' 'అతమా' - ఈ రెండు పేర్లనూ ఒకే నమాజుగా తీసుకోవడం గురించి.

దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూహురైరా (రజిఅన్) ఉల్లేఖించారు: "ఇషా నమాజు, ఫజ్ర్ నమాజు – ఈ రెండు నమాజులు వంచకులకు అతి కష్టమైనవి, అత్యంత కఠినమైనవి." ఆయన (స) ఇంకా ఇలా అన్నారు: "ఇషా (అతమా) నమాజుకు, ఫజ్ర్ నమాజుకూ అల్లాహ్ వద్ద లభించే బహుమానం, ప్రతిఫలం ఏమిటో వారికి తెలిసి ఉంటే వారు ఈ నమాజులు చెయ్యటా నికి నేలమీద ప్రాకుకుంటూ వచ్చేవారు."

**539.** అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: "ఒకనాటి రాత్రి దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) మాకు ఇషా నమాజును చేయించారు: (ఇషా నమాజుకు నాయకత్వం వహించారు). ప్రజలు ఇషా నమాజును అప్పుడు 'అతమా నమాజు' అని అనేవారు. నమాజు చేసిన తరువాత ఆయన (స) మా వైపునకు తన ముఖాన్ని పెట్టి ఇలా సెలవిచ్చారు: "ఈ రాత్రికి ఉన్నటువంటి ప్రాముఖ్యం ఏమిటో మీకు తెలుసా? ఈ భూమండలం మీద ఈ రాత్రి నుండి ఎంత మంది మానవులైతే

---

19–1. పల్లెటూరి మనుషులు మగ్రిబ్ నమాజును ఇషా నమాజు అని అనేవారు. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం), "మీరు కూడా వారి మాదిరిగానే మగ్రిబ్ నమాజును ఇషా నమాజు అని అనకండి" అని తాకీదు చేశారు. హాఫిజ్ ఇబ్నె హజర్ ఇలా అన్నారు; ఈ వారింపును దైవప్రవక్త(స) గారు ఈ అభిప్రాయంతో విధించారు: ఇషా అనే పదానికి నిఘంటువులో చీకటి అనే అర్థం ఉంది. ఇది సాయంత్రపు అరుణకాంతి దిఙ్మండలంలో అలుముకున్న తరువాత ప్రత్యక్షమౌతుంది. కనుక మగ్రిబ్ పేరు ఇషాగా పడిపోయినట్లయితే రాబోయే కాలంలో ప్రజలు మగ్రిబ్‌వేళ సాయంత్రపు ఎర్రదనం అస్తమించిన తరువాత ప్రారంభమవుతుంది అని అనుకునే అనుమానం ఉంది.

జీవించి ఉన్నారో, వారందరూ ఇప్పటి నుంచి నూరు సంవత్సరాల తరువాత మరణిస్తారు. ఒక్క మనిషి కూడా జీవించి ఉండదు."

## 21వ అధ్యాయం

**ఇషా నమాజు వేళ ప్రజలు గనక వచ్చి ఉన్నట్లయితే, తొందరగా, పెందలకాడనే ఇషా నమాజు జమాఅత్‌తో చెయ్యటం. ప్రజలు గనక ఆలస్యంగా వస్తే ఇషా నమాజును కూడా ఆలస్యంగానే చెయ్యటం.**

**540.** ముహమ్మద్ బిన్ అమ్ర్ ఇలా ఉల్లేఖించారు: మేము జాబిర్ బిన్ అబ్దుల్లా అన్సారీ (రజిఅన్) గారిని దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం)గారి నమాజుల వేళలను గురించి అడిగాము. దానికి సమాధానంగా హజ్రత్ జాబిర్ (ర)ఇలా చెప్పారు: దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) జుహ్రా నమాజును మధ్యాహ్న సమ యంలో చేసేవారు; అస్ర్ నమాజును సూర్యుడు ఇంకా వేడిగా ఉన్నప్పుడే చేసేవారు; మగ్రిబ్ నమాజును సూర్యాస్తమయం తరువాత చేసేవారు. ప్రజలు గనక ఎక్కువ సంఖ్యలో సమావేశమై ఉన్నట్లయితే ఇషా నమాజును తొందరగానే అంటే పెందల కాడనే చేసేవారు. ప్రజలు గనక తక్కువ సంఖ్యలో ఉన్నట్లయితే ఇషా నమాజును ఆలస్యంగా చేసేవారు. ఫజ్ర్ నమాజును చీకటిగా ఉన్నప్పుడే చేసేవారు.

## 22వ అధ్యాయం

**ఇషా నమాజు ఘనత.**

**541.** హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశ యులు ముహమ్మద్ (సఅసం) ఒకసారి ఒకనాటి రాత్రి ఇషా నమాజు చేసే విషయంలో ఆలస్యం చేశారు. ఈ సంఘటన ఇస్లామ్ ధర్మం ఇతర దేశాలకు ఇంకా వ్యాపించక ముందే జరిగింది. ఆయన (స) ఇంట్లో నుంచి ఇంకా బయటికే రాలేదు. అప్పుడు హజ్రత్ ఉమర్ (ర) వచ్చి ఇలా విన్నవించుకున్నారు; మహిళలూ, పిల్లలూ అందరూ నిద్రపోతున్నారు. ఆ సమయంలో దైవప్రవక్త మహనీయులు (సఅసం) ఇంట్లో నుంచి బయటికి వచ్చి ఇలా సెలవిచ్చారు; భూలోక వాసులందరిలో మీరు తప్ప మరెవరూ ఈ నమాజు కోసం నిరీక్షించటం లేదు.

**542.** హజ్రత్ అబూ మూసా అష్అరీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఆయన ఏమన్నారంటే; నేను, పడవలోని నా తోటి ప్రయాణీకులు 'బుత్‌హాన్' అనే స్థలంలో దిగాము. అప్పుడు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) మదీనా పురంలో బసచేసి ఉన్నారు. మాలోని ఎవరో ఒకరు వంతుల వారీగా ప్రతి రాత్రి ఇషా నమాజు

సమయంలో దైవప్రవక్త (స)గారి వద్దకు వెళ్లేవారము. దైవికంగా ఏమి జరిగిందంటే, ఒకసారి మేమందరం అంటే నేను, నా సహవాసులు, దైవప్రవక్త (స) గారి వద్దకు వెళ్లాము. మహాప్రవక్త (స)గారు ఏదో పనిలో నిమగ్నులై ఉన్న కారణంగా ఆ రోజున ఇషా నమాజుకు ఆలస్యంగా వచ్చారు. చివరకు అర్ధ రాత్రి దాటిపోయింది. ఆ తరువాత దైవప్రవక్త (స) బయటికి విచ్చేశారు, ప్రజలకు నమాజు చేయించారు. నమాజు ముగిసిన తరువాత అక్కడ హాజరైన ప్రజలను ఉద్దేశించి ఇలా అన్నారు; సహనంతో కూర్చొని ఉండండి, వెళ్ళిపోబాకండి, ఆనందించండి. ఎందుకంటే అల్లాహ్ మీకు మహోపకారం చేశాడు. మొత్తం ప్రపంచంలో మీరు తప్ప మరొక మనిషి ఎవ్వడూ ఈ సమయంలో నమాజు చెయ్యడు. లేదా ఆయన (స) ఇలా సెలవిచ్చారు; మీరు తప్ప ఈ సమయంలో మరెవ్వరూ నమాజు చెయ్యలేదు. ఈ రెండు వాక్యాల్లో ఏ వాక్యాన్ని ఆయన (స) సెలవిచ్చారో తెలియదు. హజ్రత్ అబూ మూసా (రజిఅన్) ఇలా సెలవిచ్చారు; దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఈ విషయాన్ని చెప్పగా విని మేము సంతోషంతో పొంగిపోతూ తిరిగివచ్చాము.

## 23వ అధ్యాయం

### ఇషా నమాజుకు ముందు నిద్రపోవటం అభిలషణీయం కాదు.[1]

**543.** అబూ బర్జా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) ఇషా నమాజుకు ముందు నిద్రపోవటాన్ని ఇష్టపడేవారు కాదు, దానిని ఏవగించుకునేవారు. అదేవిధంగా ఆయన (స) ఇషా నమాజు తరువాత మాట్లాడుకోవటాన్ని ఇష్టపడేవారు కాదు.

## 24వ అధ్యాయం

### ఒకవేళ నిదుర ఎక్కువగా వస్తూ ఉన్నట్లయితే ఇషా నమాజుకు ముందు నిదుర పోవచ్చు.

**544.** హజ్రత్ ఆయెషా (రజిఅన్హా)గారు ఇదివరకు ఒక హదీసులో ఉల్లేఖించిన దాని ప్రకారం – ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) ఇషా నమాజుకు రావటంలో ఎంతో ఆలస్యం అయింది. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజిఅన్) ఆయన (స)గారి వద్దకు వెళ్లి ఇలా విన్నవించుకున్నారు; స్త్రీలు, పిల్లలు

---

23–1. కొందరు ఏమన్నారంటే, రమజాను మాసంలో దీనికి మినహాయింపు ఇవ్వబడింది. కాని నిద్రపోయేవాణ్ణి మేల్కొలిపే వారు ఎవరో ఒకరు ఉండాలి. లేదా నిద్ర నుండి మేల్కొనే విషయంలో తన మీద తనకు నమ్మకం ఉండాలి.

నిద్రపోతున్నారు. ఇప్పుడు ఈ ఉల్లేఖనంలో అదనంగా ఇలా ఉంది: హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా సెలవిచ్చారు: దైవప్రవక్త (స)గారి సహచరులు (సహాబా) సాయంత్రపు ఎర్రదనం అదృశ్యమైపోయిన తరువాత ఒక వంతు రాత్రి గడచిపోయే వరకు (ఎప్పుడైనాసరే) ఈ నమాజును చేసుకునేవారు. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్)గారి ఒక ఉల్లేఖనంలో ఇలా ఉంది; తరువాత దైవప్రవక్త మహాశయులు (స) బయటకు వచ్చారు. ఆ సమయంలో నేను ఆయన (స)గారి వైపు చూశాను. ఆయన (స)గారి శిరస్సు నుంచి నీటి బిందువులు రాలుతున్నాయి. అప్పుడు ఆయన (స) గారు తన చేతిని శిరస్సు మీద పెట్టుకుని ఉన్నారు. ఆయన (స) ఇలా సెలవిచ్చారు; నా ఉమ్మత్‌కు భారం అవుతుందనే భావన నాకు గనక రాకుండా ఉన్నట్లయితే నేను ఇషా నమాజును ఈ సమయంలోనే చెయ్యమని వారికి ఆజ్ఞాపించి ఉండేవాణ్ణి.

**545.** నాఫె మరియు అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) తనకు ఇలా చెప్పారని అబ్దుల్ మలిక్ బిన్ జురైజ్ ఉల్లేఖించారు: "ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) పనిలో నిమగ్నమై ఉన్నారు. అప్పుడు ఇషా నమాజు వేళ అయింది. ఆయన (స)గారు రాకపోవడం వల్ల ఇషా నమాజు చెయ్యటం ఆలస్యమై పోయింది. ఈ కారణం వల్ల మేము నిద్రపోయాము. తరువాత మేల్కొన్నాము. మేము మళ్లీ నిదురపోయాము, మళ్లీ లేచాము. అప్పుడు మహాప్రవక్త (సఅసం) మా వద్దకు వచ్చి ఇలా అన్నారు; "భూలోక వాసుల్లో మీరు తప్ప మరెవ్వరూ నమాజు కోసం ఇప్పుడు నిరీక్షించటం లేదు." ఇషా నమాజును పెందలకాడ చెయ్యటం వల్లగాని, ఆలస్యంగా చెయ్యటం వల్లగానీ ఎలాంటి దోషమూ కలుగదు అని ఇబ్నెఉమర్ (ర) అభిప్రాయపడ్డారు. కాని నిద్ర ప్రబలమై నమాజు తప్పిపోతుందేమో అని కూడా ఆయన (ర) భయపడేవారు. ఇబ్నె ఉమర్ (ర) ఒక్కొక్కసారి ఇషా నమాజుకు ముందు నిద్రపోయేవారు. ఇబ్నె జురైజ్ ఇలా అన్నారు; ఇబ్నె అబ్బాస్ (ర) ఇలా అంటూ ఉండగా నేను విన్నాను అని నేను అతాకు చెప్పాను; ఒకసారి దైవప్రవక్త మహాశయులు (స) ఇషా నమాజుకు చాలా ఆలస్యంగా వచ్చారు; ఎంత ఆలస్యంగా వచ్చారంటే, ప్రజలు నిద్రపోయారు. తరువాత మేల్కొన్నారు. వారు మళ్లీ నిద్రపోయారు, మళ్లీ మేల్కొన్నారు. అప్పుడు ఉమర్ బిన్ అల్‌ఖత్తాబ్ (రజిఅన్) నిలబడి మహాప్రవక్త (స)కు నమాజును గురించి జ్ఞాపకం చేశారు. ఇబ్నె అబ్బాస్ (ర) ఇలా అన్నారని అతా చెప్పారు; తరువాత దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) బయటకు వచ్చారు. ఆ సమయంలో నేను ఆయన (స) గారి వైపు చూశాను. ఆయన (స)గారి శిరస్సు నుంచి నీటి బిందువులు రాలుతున్నాయి. అప్పుడు ఆయన (స)గారు

తన చేతిని శిరస్సు మీద పెట్టుకుని ఉన్నారు. ఆయన (స) ఇలా సెలవిచ్చారు; నా ఉమ్మత్‌కు భారం అవుతుందనే భావన నాకు గనక రాకుండా ఉన్నట్లయితే నేను ఇషా నమాజును ఈ సమయంలోనే చెయ్యమని వారిని ఆజ్ఞాపించి ఉండేవాడను. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్)ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) తన చేతిని శిరస్సు మీద పెట్టుకున్నారు. ఇంకా తన చేతి వ్రేళ్లను వెడల్పుగా చేసి వాటి చివర్లను తన శిరస్సు యొక్క ఒక భాగం మీద పెట్టారు. తరువాత వాటిని కలిపి తల మీద త్రిప్పసాగారు. అప్పుడు ఆయన (స)గారి బొటన వ్రేలు కణత గడ్డం అంచుకలసి ఉన్న చెవి భాగాన్ని తాకుతోంది. ఇలా చేస్తున్నప్పుడు ఆయన (స) త్వరగానూ చెయ్యలేదు; ఆలస్యంగానూ చెయ్యలేదు. నింపాదిగా చేశారు.

**546.** హజ్రత్ అనస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) ఒకసారి ఇషా నమాజును అర్ధరాత్రి వరకు ఆలస్యం చేశారు. తరువాత ఆయన (స) ఇషా నమాజు చేసి ఇలా సెలవిచ్చారు; "ప్రజలైతే ఈ నమాజును చేశారు. ఇంకా వారు నిద్రపోతున్నారు. కాని మీరు నమాజు కోసం నిరీక్షిస్తూ ఉన్నంతకాలం నమాజులో ఉన్నట్లే."

హజ్రత్ అనస్ (రజిఅన్) ఇలా అన్నారు; నేను ఆ రాత్రి దైవప్రవక్త (స)గారి ఉంగరం యొక్క మెరుపును చూశాను.

## 25వ అధ్యాయం

### ఫజ్ర్ నమాజు ఘనత.

**547.** హజ్రత్ జరీర్ బిన్ అబ్దుల్లాహ్ బజలీ (రజిఅన్) ఉల్లేఖించారు: ఆయన (ర) ఇలా అన్నారు; మేము దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) గారి వద్ద సమావేశమై ఉన్నాము. ఆయన (స) గారు ఒక రాత్రి చంద్రుని వైపు చూసి ఇలా సెలవిచ్చారు; నిశ్చయంగా మీరు మీ ప్రభువును ఈ చంద్రుణ్ణి ఇప్పుడు ఎలా చూస్తూ ఉన్నారో అలా చూస్తారు. మీ ప్రభువును చూసే విషయంలో మీకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. కనుక మీరు గనక సూర్యోదయానికీ, సూర్యాస్తమయానికీ ముందు ఉన్నటువంటి నమాజులను పోగొట్టుకోకుండా, నియమం తప్పకుండా చెయ్యగలిగితే తప్పకుండా అలా చెయ్యండి. మీరు గనక షైతాను ప్రాబల్యానికి లొంగకుండా అలా చేసినట్లయితే అది మీకు ఎంతో మేలైనది. తరువాత ఆయన (స) ఖుర్ఆన్‌లోని ఈ వాక్యాన్ని చదివారు; "సూర్యుడు ఉదయించక ముందూ, అస్తమించక ముందూ నీవు నీ ప్రభువు స్తోత్రంతోపాటు ఆయన పవిత్ర నామాన్ని కొనియాడు."

*(దివ్య ఖుర్ఆన్ **50 : 39**)*

**548.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) ఇలా సెలవిచ్చారని, హజ్రత్ అబూ మూసా (రజిఅన్) ఉల్లేఖించారు: ఏ వ్యక్తి అయితే రెండు చల్లని నమాజులను సకాలంలో చేస్తాడో అతను స్వర్గంలో ప్రవేశిస్తాడు *(అంటే ఫజ్ర్, అస్ర్ నమాజులు).*

## 26వ అధ్యాయం
## ఫజ్ర్ నమాజు వేళ

**549.** హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజిఅన్) తనకు ఒక హదీసును వినిపించారని హజ్రత్ అనస్ (రజిఅన్) ఉల్లేఖించారు: "దైవప్రవక్త (స) గారి సహచరులు కొందరు, ఒకసారి ఆయన (స) గారితో కలసి సహ్రీ తిన్నారు. తరువాత నమాజు కోసం నిలబడ్డారు." నేను అతన్ని అడిగాను; సహ్రీకీ, నమాజుకూ మధ్య ఎంత వ్యవధి ఉన్నది? దానికి ఆయన (ర) "యాభై లేక అరవై వాక్యాలు పారాయణం చేసినంత వ్యవధి ఉన్నది" అని అన్నారు.[1]

**550.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా అన్నారని ఖతాదా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) గారూ, మరియు జైద్ బిన్ సాబిత్ (ర) గారూ ఉభయులూ కలిసి సహ్రీ భోజనం చేశారు. సహ్రీ భోజనం ముగించిన తరువాత దైవప్రవక్త (సఅసం) గారు ఫజ్ర్ నమాజు కోసం నిలబడ్డారు మరియు నమాజు చేశారు. ఖతాదా ఇలా అన్నారు; మేము అనస్ (ర)ను, సహ్రీ భోజనం ముగియటానికీ, ఫజర్ నమాజు ప్రారంభం కావటానికీ మధ్య ఎంత వ్యవధి ఉంటుంది? అని అడిగాము. దానికి సమాధానంగా ఆయన (ర) ఇలా అన్నారు; "ఒక మనిషి యాభై ఖురాను వాక్యాలు పఠించటానికి ఎంత వ్యవధి పడుతుందో అంత వ్యవధి సహ్రీ భోజనం, ఫజర్ నమాజుల మధ్య ఉంటుంది".

**551.** హజ్రత్ సహ్ల్ బిన్ సాద్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: నేను, నా కుటుంబ సభ్యులతో కలిసి సహ్రీ భోజనం చేసేవాణ్ణి. తరువాత దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) గారి వెనుక ఫజ్ర్ నమాజును చెయ్యటానికి త్వరత్వరగా వెళ్ళేవాణ్ణి.

---

549-1. యాభై ఖుర్ఆన్ వాక్యాలను ఐదు లేక పది నిమిషాలలో పఠించవచ్చు. ఈ హదీసు ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే; సహ్రీ భోజనం ఫజర్ నమాజు వేళకు సమీపంలో చెయ్యటం మస్నూన్ పద్ధతి; కాబట్టి ఎక్కువ రాత్రి ఉన్నప్పుడు సహ్రీ భుజించకూడదు.. అజ్ఞానులు మాత్రమే అలా చేస్తారు.

**552.** **హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: ముస్లిమ్ మహిళలు తమ దుప్పట్లు కప్పుకుని మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) గారి వెనుక నమాజు చెయ్యటానికి వచ్చేవారు. నమాజు చేసిన తరువాత తమ తమ గృహాలకు తిరిగి వెళ్ళి పోయేవారు. చీకటి వల్ల వారిని ఎవరూ గుర్తించటం సాధ్యపడేది కాదు.**[1]

## 27వ అధ్యాయం

**ఎవరైనా సూర్యోదయానికి ముందు ఫజ్ర్ నమాజులోని ఒక రకాత్‌ను పొంది నట్లయితే, అప్పుడు అతని నమాజు పూర్తి అయిపోయింది, ఖజా కాదు.**

**553.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) ఇలా సెలవిచ్చారని **హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు; ఎవరైనా సూర్యుడు ఉదయించే ముందు ఫజ్ర్ నమాజుకు చెందిన ఒక రకాతును పొందినట్లయితే అతనికి ఫజర్ నమాజు పూర్తిగా లభించినట్లే. ఎవరైనా సూర్యుడు అస్తమించటానికి ముందు అసర్ నమాజుకు చెందిన ఒక రకాతును పొందినట్లయితే అతను పూర్తి అసర్ నమాజును పొందినట్లే.**

## 28వ అధ్యాయం

**ఎవరైనా ఏదైనా నమాజుకు చెందిన కేవలం ఒక రకాతును పొందినప్పటికీ అతను ఆ నమాజును పూర్తిగా పొందినట్లే.**[1]

**554.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) ఇలా సెలవిచ్చారని **హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు; ఎవరైతే ఒక నమాజుకు చెందిన**

---

552-1. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) ఫజ్ర్ నమాజును ఎక్కువ చీకటి ఉన్న సమయంలోనే చేసేవారని ఈ హదీసు ద్వారా కూడా తెలిసిపోయింది. హజ్రత్ ఉమర్ (రజిఅన్) తన క్రింద పని చేసే అధికారులకు ఒక లేఖలో, చీకటిలో నక్షత్రాలు స్పష్టంగా కనిపించే సమయంలో ఫజర్ నమాజును చెయ్యమని వ్రాశారు. అబూ దావూద్ గారి ఉల్లేఖనంలో ఇలా ఉంది; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) కేవలం ఒకే ఒకసారి ఫజ్ర్ నమాజును వెలుగులో చేశారు. తరువాత పరమపదించే వరకు ఎల్లప్పుడూ చీకటి ఉన్నప్పుడే ఫజ్ర్ నమాజ్‌ను చేస్తూ వచ్చారు. అహ్లె హదీస్‌వారు, ఇమామ్ షాఫయి రహ్మాలై, ఇమామ్ అహ్మద్ రహ్మాలై గార్లు ఇదే అభిప్రాయాన్ని కలిగి ఉన్నారు. వారు ఏమన్నారంటే, ఫజ్ర్ నమాజును పెందలకాడ, చీకట్లో చెయ్యటం ముస్తహబ్.

28-1. కనుక ఇంతకు ముందటి అధ్యాయం కేవలం ఫజర్, అసర్ నమాజుకు సంబంధిం

కేవలం ఒక రకాతును మాత్రమే పొందుతాడో, అతను ఆ నమాజును పూర్తిగా పొంది నట్లే.

## 29వ అధ్యాయం

**ఫజ్ర్ నమాజు తరువాత సూర్యోదయం వరకు గల వ్యవధిలో చేసే నమాజులను గురించి.**

**555.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; నా సమక్షంలో మంచివారు, నమ్మదగినవారు అయిన మనుషులు కొందరు సాక్ష్యమిచ్చారు. వారిలో అందరి కంటే మంచివారు, ఎక్కువగా నమ్మదగినవారు హజ్రత్ ఉమర్ (రజిఅన్). దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) ఫజర్ నమాజు తరువాత సూర్యోదయం అయ్యే వరకు మరియు అసర్ నమాజు తరువాత సూర్యాస్తమయం అయ్యే వరకు నమాజు చెయ్యాటాన్ని వారించారు.

**556.** ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: కొందరు పై హదీసులో వచ్చిన విషయాలనే నాకు కూడా తెలియజేశారు.

**557.** దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసం) ఇలా సెలవిచ్చారని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజిఅన్) గారే ఉల్లేఖించారు: సూర్యుడిపై అంచు దిఙ్మండలం మీద కనిపించినప్పుడు నమాజును చెయ్యకండి. సూర్యుడుపైకి వచ్చే వరకు నమాజు చెయ్యకండి. ఇంకా సూర్యుడిపై అంచు మునుగుతూ ఉన్నప్పుడు నమాజును చెయ్యకండి. సూర్యుడు పూర్తిగా అస్తమించే వరకు నమాజు చెయ్యకండి.

---

చినది. కాని ఈ అధ్యాయం అన్ని నమాజులకు వర్తిస్తుంది. భావం ఏమిటంటే; ఏదైనా నమాజుకు చెందిన ఒక్క రకాతు కూడా సమయం దాటిపోవటానికి ముందు లభించినట్లయితే అప్పుడు మొత్తం నమాజు పూర్తిగా లభించినట్లే, అతని నమాజు నెరవేరినట్లే, ఖజా అయినట్లు కాదు. ఈ హదీసు ద్వారానే మరొక విషయం కూడా స్పష్టమైపోతుంది. అదేమిటంటే; ఒకవేళ ఏదైనా నమాజుకు చెందిన సమయం అంటే ఒక రకాతు చెయ్యటానికే సరిపోయే సమయం మిగిలి ఉన్నట్లయితే, ఆ సమయంలో ఎవరైనా ఒక అవిశ్వాసి ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి ముస్లిమ్ అయిపోతే లేదా ఒక బాలుడు యుక్త వయస్సుకు చేరితే లేదా ఒక పిచ్చివాడు మంచివాడుగా మారిపోతే లేదా బహిష్టు అయిన స్త్రీ పరిశుద్ధురాలు అయితే ఆ నమాజును చెయ్యటం అతనికీ లేక ఆమెకూ వాజిబ్ (తప్పనిసరి) అవుతుంది.

**558.** ఇది హజ్రత్ అబూహురైరా (రజిఅన్) ఉల్లేఖించిన హదీసు; దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) రెండు రకాల అమ్మకాలను, రెండు రకాల డ్రెస్సులనూ (వస్త్రధారణలను) రెండు నమాజులను నిషేధించారు. ఈ హదీసు ఇది వరకు వచ్చింది. కాని ఈ ఉల్లేఖనంలో ఆయన (ర) అదనంగా మరొక విషయం కూడా చెప్పారు. అదేమిటంటే; దైవప్రవక్త (సఅసం) రెండు నమాజులను కూడా చెయ్యవద్దని నిషేధించారు. ఫజర్ నమాజు తరువాత సూర్యుడు బాగా బయటికి రానంత వరకూ ఎలాంటి నమాజును చెయ్యకూడదు. ఇంకా అదే విధంగా అసర్ నమాజు తరువాత కూడా సూర్యుడు పూర్తిగా అస్తమించనంతవరకూ ఎటువంటి నమాజును చెయ్య కూడదు.

## 30 వ అధ్యాయం

**అసర్ నమాజు తరువాత సూర్యాస్తమయానికి ముందు నమాజు చేసే సంకల్పం చేసుకోకూడదు.**

**559.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) ఇలా సెలవిచ్చారని ఇబ్నె ఉమర్ (రజిఅన్)ఉల్లేఖించారు: మీలో ఎవరైనాసరే సూర్యోదయం అవుతున్నప్పుడుగానీ లేదా సూర్యాస్తమయం అయ్యేటప్పుడుగానీ నమాజు చెయ్యకూడదు.

**560.** దైవప్రవక్త మహాశయులు ఇలా సెలవిస్తూ ఉండగా తాను విన్నానని అబూసయీద్ అల్‌ఖుద్రీ (రజిఅన్) ఉల్లేఖించారు. సూర్యుడు ఉదయించే వరకు ఫజ్ర్ నమాజు తరువాత ఎలాంటి నమాజు కూడా చెయ్యకూడదు. ఇంకా అదే విధంగా సూర్యుడు అస్తమించే వరకు అసర్ నమాజు తరువాత ఎలాంటి నమాజూ చెయ్య కూడదు.

**561.** హజ్రత్ ముఆవియా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: మేము దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారితో ఉన్నప్పుడు ఆయన (స) గారు చేస్తూ ఉండగా మేము చూడనటువంటి నమాజును మీరు చేస్తున్నారు. పైగా మీరు చేస్తూ ఉన్నటువంటి నమాజును చెయ్యవద్దని ఆయన (స) తాకీదు చేశారు. అంటే, అస్ర్ నమాజు తరువాత రెండు రకాతుల (నఫిల్) నమాజు చెయ్యటం.

**562.** హజ్రత్ అబూహురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) రెండు నమాజులను నిషేధించారు. ఒకటి,

ఫజర్ నమాజు తరువాత సూర్యుడు ఉదయించేవరకు ఎలాంటి నమాజు చెయ్య కూడదు. ఇంకా అసర్ నమాజు తరువాత సూర్యుడు అస్తమించే వరకు ఎలాంటి నమాజూ చెయ్యకూడదు.

## 31వ అధ్యాయం

**కేవలం అస్ర్, ఫజ్ర్ నమాజుల తరువాత నమాజు చెయ్యటాన్ని మక్రూహ్[1]గా అంటే అయిష్టకరమైనదిగా భావించే వ్యక్తి యొక్క ప్రమాణం గురించి- ఈ విషయాన్ని హజ్రత్ ఉమర్ (ర), ఇబ్నె ఉమర్(ర), అబూ సయీద్ (ర) అబూ హురైరాలు ఉల్లేఖిం చారు.**

**563.** అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: నేనయితే నా సహచరులైన సహాబీలు నమాజు చేసిన విధంగానే నమాజు చేస్తాను. వారు అలా నమాజు చేస్తూ ఉండగా నేను చూశాను. నేను ఎవరినీ పగలుగానీ, రాత్రిగానీ ఎప్పు డైనా సరే నమాజు చెయ్యవద్దని నిషేధించను, ఒక్క సూర్యాస్తమయం, సూర్యోదయా లలో తప్ప.

## 32వ అధ్యాయం

**అసర్ నమాజు తరువాత ఖజా నమాజులు లేదా అలాంటివే ఇతర నమాజులు. ఉదాహరణకు జనాజా నమాజు మొదలైనటువంటివి చెయ్యటం గురించి.**

**ఉమ్మె సలమా (ర) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) అస్ర్ నమాజు తరువాత రెండు రకాతుల నమాజు మళ్లీ చేశారు; తరువాత ఇలా సెలవిచ్చారు: "అబ్దుల్ ఖైస్ తెగకు చెందిన వారు కొందరు నన్ను వేరే వ్యాపకంలో నిమ్నగమై పోయేలా చేశారు. ఈ కారణంగా నేను జుహ్రా నమాజు తరువాత చెయ్యవలసిన రెండు రకాతుల సున్నత్ నమాజును చెయ్యలేకపోయాను. అందుకని ఆ సున్నత్ నమాజును ఇప్పుడు చేశాను."**

**564.** హజ్రత్ ఆయెషా (ర) ఇలా ఉల్లేఖించారు: ఆమె గారు ఏమని సెలవిచ్చారంటే; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స)ను ఈ లోకం నుంచి పై లోకానికి తీసుకుపోయిన అల్లాహ్ మీద ప్రమాణం చేసి చెబుతున్నాను: ఆయన(స) గారు అస్ర్ నమాజు తరువాత రెండు రకాతుల నమాజును చెయ్యటాన్ని ఎన్నడూ విడిచిపెట్టలేదు. చివరకు ఆయన (స) ఈ స్థితిలోనే తన ప్రభువైన అల్లాహ్‌ను

**కలుసుకున్నారు. ఇంకా ఆయన (స) గారికి తన మరణానికి పూర్వం నిలబడి నమాజు చెయ్యటం కష్టతరంగా ఉండేది. అప్పుడు ఆయన (స) ఎక్కువగా కూర్చొనే నమాజు చేసేవారు. ఉదాహరణకు, ఆయనగారు అస్ర్ నమాజు తరువాత రెండు రకాతుల నమాజును ఎల్లప్పుడూ కూర్చొనే చేసేవారు; కాని మసీదులో మాత్రం ఆ రెండు రకాతుల నమాజును చేసేవారు కాదు, తన ఇంట్లో చేసేవారు. తన సంఘానికి ఇబ్బంది కలగకూడదని ఆయన (స) కోరేవారు. ఎందుకంటే, తన సంఘానికి సులభంగా ఉండేదాన్నే ఆయన (స) ఎక్కువగా ఇష్టపడేవారు.**

**565. హిష్షామ్ తండ్రిగారు ఇలా ఉల్లేఖించారు: నన్ను ఉద్దేశించి హజ్రత్ ఆయెషా (రజిఅన్) ఇలా అన్నారు: ఓ మేనల్లుడా! దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) నా ఇంట్లో ఉన్నప్పుడు అస్ర్ నమాజు తరువాత నాగా లేకుండా రెండు రకాతుల నమాజును చేసేవారు. ఈ నమాజును ఆయన (స) ఎన్నడూ వదలిపెట్టలేదు.**

**566. హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) రెండు రకాతుల నమాజును ఫజ్ర్ నమాజుకు ముందూ, రెండు రకాతుల నమాజును అస్ర్ నమాజుకు తరువాత బహిరంగంగానూ, రహస్యంగానూ చేసేవారు. ఆయన (స) ఈ రెండు రకాతుల నమాజును ఎన్నడూ విడిచిపెట్టలేదు.**

**567. హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు; "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) అస్ర్ నమాజు తరువాత నా ఇంటికి వచ్చినప్పుడల్లా రెండు రకాతుల సున్నత్ నమాజును తప్పకుండా చేసేవారు." హజ్రత్ ఆయెషా (ర) గారి ఈ ఉల్లేఖనాన్ని అస్వద్ బిన్ యజీద్, మస్రూఖ్ బిన్ అజ్దఉభయులూ బలపరిచారు.**[1]

---

567–1. 'తస్హీలుల్ ఖారీ'లో ఈ విషయం గురించి సుదీర్ఘమైన చర్చ జరిగింది. చివరకు ఈ విషయానికి సంబంధించిన అన్ని హదీసులను దృష్టిలో ఉంచుకుని ఇలా వ్రాయబడింది; సూర్యోదయ సమయంలోగానీ, సూర్యాస్తమయమప్పుడుగానీ నమాజు చెయ్యటం పూర్తిగా నిషిద్ధం. అయితే ఫజర్ సమయంలో లేదా అసర్ సమయంలో సూర్యోదయానికి ముందుగానీ, సూర్యాస్తమయానికి ముందుగానీ ఒకవేళ నమాజు చెయ్యటం ప్రారంభించి ఉంటే అప్పుడు దాన్ని పూర్తి చేసుకోవచ్చు.

## 33వ అధ్యాయం

**ఆకాశం మేఘావృతమై ఉన్న రోజున నమాజును తొందరగా చెయ్యటం. అంటే పెందలకడ చెయ్యటం.**

**568.** ఇబ్నె అబూ మలీహ్ ఇలా ఉల్లేఖించారు; ఆకాశం మేఘావృతమై ఉన్న ఒక రోజున మేము బురైదా బిన్ హసీబ్ (రజిఅన్) గారితో ఉన్నాము. ఆయన (రజి) మాతో ఇలా అన్నారు; నమాజు ఈ రోజు పెందలకడనే చేసుకోండి. ఎందుకంటే దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) తన ఒక సూక్తిలో ఇలా సెలవిచ్చారు; "ఎవరయితే అస్ర్ నమాజును విడిచిపెడతారో, వారు చేసిన సత్కార్యాలన్నీ నిరర్థక మైపోతాయి."

## 34వ అధ్యాయం

**సమయం మించిపోయిన తరువాత నమాజు చేసేటప్పుడు అజాన్ ఇవ్వటం.**

**569.** హజ్రత్ అబూ ఖతాదా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకనాటి రాత్రి మేము దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారితో ప్రయాణం చేస్తూ ఉన్నాము. కొందరు ఇలా అన్నారు; "ఓ దైవప్రవక్తా! మా అందరితోపాటు రాత్రి చివరి ఘడియల్లో మీరు కూడా విశ్రాంతి తీసుకుంటే బాగుంటుంది కదా!" దానికి సమాధానంగా ఆయన (స) ఇలా సెలవిచ్చారు; "నమాజు వేళ అయిన తరువాత కూడా మీరు నిద్రపోతూ ఉంటారేమో అని నేను భయపడుతున్నాను." అప్పుడు హజ్రత్ బిలాల్ (ర), "నేను అందరినీ లేపుతాను" అని అన్నారు. ఈ విధంగా అక్కడి వారందరూ నిద్రపోయారు. హజ్రత్ బిలాల్ (ర) తన వీపును తన ఒంటెకు ఆనించి కూర్చుండిపోయారు. కాని నిద్ర ప్రాబల్యం వల్ల ఆయన (ర) గారి కళ్ళు మూసుకు పోయాయి. అంతే ఆయన (ర) కూడా నిద్రలోకి జారుకున్నారు. తరువాత దైవప్రవక్త మహనీయులు (స) నిద్ర నుంచి మేల్కొన్నారు. అప్పుడు ఉదయభానుడి అంచు బయట పడింది. దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు; "ఓ బిలాల్! నీవు చెప్పిన మాట ఏమయి పోయింది?" ఆయన (ర) సమాధానంగా ఇలా అన్నారు; "ఈనాడు పట్టిన నిద్ర ఇదివరకెన్నడూ నాకు రాలేదు." దీనిపై దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు; "అల్లాహ్ తాను కోరినప్పుడు మీ ఆత్మలను వశపరచుకుంటాడు. మళ్ళీ తాను కోరినప్పుడు వాటిని తిరిగి పంపుతాడు. ఓ బిలాల్ (ర)! లే, నమాజు కోసం అజాన్ ఇచ్చి జనాన్ని లేపు." ఆ తరువాత ఆయన (స)గారు వుజూ చేసుకున్నారు. సూర్యుడు పైకి లేచి ప్రకాశించినప్పుడు ఆయన (స) నిలబడ్డారు. తరువాత నమాజు చేయించారు.

## 35వ అధ్యాయం

**సమయం మించిపోయిన తరువాత ఖజా నమాజును సామూహికంగా (అంటే జమాఅత్‌తో) చెయ్యటం.**

**570.** హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఒకసారి హజ్రత్ ఉమర్ (రజిఅన్) కందక యుద్ధంనాడు దైవప్రవక్త (స)గారు విడిది చేసిన శిబిరానికి వచ్చారు. అప్పుడు సూర్యుడు పూర్తిగా అస్తమించాడు. ఆయన (ర) ఖురైషు అవిశ్వాసులకు శాపనార్థాలు పెడుతున్నారు. ఇలా అన్నారు; "ఓ దైవప్రవక్తా (స)! సూర్యుడు అస్తమిస్తూ ఉండగా గాని అస్ర్ నమాజు చెయ్యటం నాకు సాధ్యపడలేదు." అప్పుడు దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు; "అయ్యో! నేనైతే అసర్ నమాజునే చెయ్యలేకపోయాను". తరువాత మేమందరము కలసి బుత్‌హాన్ లోయ వైపునకు వెళ్ళి పోయాము. అక్కడ దైవప్రవక్త (స) నమాజు కోసం వుజూ చేసుకున్నారు. మేమందరం కూడా వుజూ చేసుకున్నాము. ఆయన (స) సూర్యుడు అస్తమించిన పిదప అసర్ నమాజు చేశారు. ఆ తరువాత మగ్రిబ్ నమాజు చేయించారు.[1]

## 36వ అధ్యాయం

**ఏ వ్యక్తి అయినా ఏదైనా నమాజును చెయ్యటాన్ని మరచిపోతే జ్ఞాపకం రాగానే చేసెయ్యాలి. కేవలం ఆ నమాజును మాత్రమే చెయ్యాలి.**

**571.** హజ్రత్ అనస్ (రజిఅన్) గారి కథనం ప్రకారం, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) ఇలా సెలవిచ్చారు: "ఏ వ్యక్తి అయినా ఏదైనా ఒక నమాజును చెయ్యటం మరచిపోయినట్లయితే, అది జ్ఞాపకం వచ్చినప్పుడు వెంటనే దానిని చేసేయాలి. ఇదే దానికి పరిహారం. అంతకు మించి మరేమీ చెయ్యవలసిన అవసరం లేదు. ఖుర్‌ఆన్ గ్రంథంలో తాహా సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు; "జ్ఞాపకం రాగానే నమాజు చెయ్యి" (నా జ్ఞాపకం కోసం నమాజు చెయ్యి) (దివ్య ఖుర్‌ఆన్ : **20–14**). ఆయన (ర) ఈ వాక్యాన్ని పఠించారు.

---

570–1. ఈ ఉల్లేఖనంలో మహాప్రవక్త (స) గారు సామూహికంగా అంటే జమాఅత్‌తో నమాజు చేశారా లేదా అనే వివరణ లేదు. కాని ఆయన (స) గారి సంప్రదాయం ఏమిటంటే, ప్రజల్లో ఉన్నప్పుడు సామూహికంగానే అంటే జమాఅత్‌తోనే నమాజు చేస్తారు. అదే విధంగా ఈ నమాజును కూడా జమాత్‌తోనే చేసి ఉంటారు. ఇస్మాయిల్ గారి అభిప్రాయం ప్రకారం, దైవప్రవక్త(స) గారు సహచరులతో కలసి జమాఅత్‌తో సామూహికంగా నమాజు చేశారు.

## 37వ అధ్యాయం

**ఒకవేళ చాలా నమాజులు ఖజా అయిపోయినట్లయితే, వాటిని తరువాత వరుసగా చదవటం.[1]**

**572.** హ(జత్ జాబిర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: "కందక యుద్ధం జరిగిన రోజున హ(జత్ ఉమర్ (రజిఅన్) ఖురైషు అవిశ్వాసులను ఉద్దేశించి శాపనార్థాలు పెడుతూ వచ్చారు. ఆయన (ర) ఇలా అన్నారు; సూర్యుడు అస్తమించే వరకు నేను అసర్ నమాజును చెయ్యలేకపోయాను. హ(జత్ జాబిర్ (రజిఅన్) ఇలా అన్నారు; "ఆ తరువాత మేము బుత్‌హాన్ లోయలోకి దిగాము. దైవప్రవక్త మహాశయులు (స) సూర్యుడు అస్తమించిన తరువాత అసర్ నమాజు చేశారు. ఆ తరువాత మగ్రిబ్ నమాజు చేశారు."[1]

## 38వ అధ్యాయం

**ఇషా నమాజు తరువాత 'సమర్' అంటే ప్రపంచానికి సంబంధించిన విషయాలు మాట్లాడుకోవడం అవాంఛనీయం. ఖుర్‌ఆన్ గ్రంథంలో వచ్చిన 'సామిర్' అనే పదం 'సమర్' అనే అరబ్బీ పదంలో నుంచే పుట్టింది. దానికి 'సుమ్మార్' అనే పదం బహువచనం.**

**573.** అబూ మిన్‌హాల్ ఇలా ఉల్లేఖించారు: నేనూ, నా తండ్రిగారు (సలామ) ఉభయులమూ కలసి అబూబర్జా అస్‌లమీ గారి వద్దకు వెళ్ళాము. నా తండ్రిగారు ఆయనగారితో ఇలా అన్నారు: "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) విధిగా చెయ్యవలసిన నమాజులను ఏయే వేళల్లో చేసేవారో మాకు చెప్పండి. ఆయన ఇలా చెప్పారు; "మీరు మొదటి నమాజు అని చెప్పే జొహర్ నమాజును దైవప్రవక్త (స) గారు ప్రొద్దువాలిన మధ్యాహ్న సమయంలో చేసేవారు; ఆయన (స) గారు అసర్ నమాజును ఎప్పుడు చేసేవారంటే, మాలోని ఏ వ్యక్తి అయినా దైవప్రవక్త (స) గారితో

---

37–1. ఉదాహరణకు మొదట జుహ్ర్ నమాజు చెయ్యటం, తరువాత అస్ర్ నమాజు, ఆ తరువాత మగ్రిబ్ నమాజు, ఆ పైన ఇషా నమాజు చెయ్యటం. హాఫిజ్ (ఇబ్నె హజర్) గారు ఏమన్నారంటే; ఈ అధ్యాయానికి సంబంధించిన హదీసులో వరుసగా, క్రమం తప్పకుండా ఖజా నమాజులు చెయ్యాలనే విషయం విశదంగా లేదు.

572–1. అధ్యాయంలోని ముఖ్యాంశం ఇక్కణ్ణే విశదమవుతుంది. మొదట దైవప్రవక్త (స) అస్ర్ నమాజు చేశారు. తరువాత మగ్రిబ్ నమాజు చేశారు. అంటే ఆయన (స) గారు వరుస క్రమాన్ని పాటించారు.

నమాజు చేసి మదీనా పట్టణానికి చివరి భాగంలో ఉన్నటువంటి తన ఇంటికి వెళ తాడు. అప్పటికీ సూర్యుని వేడిమి తీవ్రంగానే ఉంటుంది. "అబూ మిన్‌హాల్ ఇలా అన్నారు; మగ్రిబ్ నమాజును గురించి అబూబర్‌జా ఏమన్నారో నేను మరచిపోయాను. "అబూ బర్‌జా (ర) ఇంకా ఇలా చెప్పారు; దైవప్రవక్త (స) గారు ఇషా నమాజు విషయంలో ఆలస్యంగా చెయ్యటాన్ని ఇష్టపడేవారు. ఇషా నమాజుకు ముందు నిద్ర పోవటాన్ని చెడ్డ విషయంగా భావించేవారు. ఇదే విధంగా ఇషా నమాజు తరువాత పరస్పరం మాట్లాడుకోవటాన్ని కూడా యిష్టపడేవారు కారు. ఇంకా ఆయన (స) మనిషి తనకు దగ్గర్లో కూర్చున్నటువంటి మరొక మనిషిని గుర్తించే సమయంలో ఫజ్ర్ నమాజును చేసేవారు. ఆయన (స) గారు ఈ నమాజులో **60** నుంచి **100** వరకు ఖుర్‌ఆన్ వాక్యాలను పారాయణం చేసేవారు.

## 39వ అధ్యాయం

## ధార్మిక సమస్యలకూ, తీర్పులకూ సంబంధించిన విషయాలు మరియు మంచి విషయాలు ఇషా నమాజు తరువాత మాట్లాడుకోవటం ధర్మసమ్మతమైనదే.

**574.** ఖుర్రా బిన్ ఖాలిద్ ఇలా ఉల్లేఖించారు: మేము ఇమామ్ హసన్ బస్రీ (రహ్మాలై) గారు ఇంట్లో నుంచి బయటికి వస్తారని ఆశిస్తూ నిరీక్షించాము. కాని ఆయన బయటికి రాలేదు. చివరికి ఆయనగారు ఎంత ఆలస్యంగా వచ్చారంటే, ఆయన ఉపన్యాసం ముగింపుకు చేరే గడువు వచ్చేసింది.[1] తరువాత ఆయన గారు వచ్చి ఇలా అన్నారు; "మమ్మల్ని మా పొరుగువారు పిలిచారు. మేము అక్కడకు వెళ్లాము" అని ఇలా అనసాగారు; అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఏమని ఉల్లేఖించారంటే; "ఒకనాటి రాత్రి మేము దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) వస్తారని ఎదురు చూస్తూ ఉన్నాము. అర్ధరాత్రి అయినాక గాని ఆయన రాలేదు. తరువాత ఆయన (స) నమాజును చేయించారు. ఆ తరువాత ఆయన మాకు హితబోధ చేశారు. ఆ హితబోధలో ఆయన (స) ఇలా సెలవిచ్చారు; "వినండి!

574-1. ఇమామ్ హసన్ బస్రీ (రహ్మా) గారి సంప్రదాయం ఏమిటంటే, రాత్రి పూట ఆయన గారు బయటికి వెళ్లి ప్రజలకు హితబోధ చేసేవారు. ధర్మజ్ఞానాన్ని బోధించేవారు. ఒకసారి ఏమి జరిగిందంటే ఆయన గారు చాలా ఆలస్యంగా వచ్చారు. ఆయన ప్రతిరోజు తన ఉపన్యాసాన్ని ముగించే వేళకు వచ్చారు. అంటే తన హితబోధను ముగించి ఇంటికి తిరిగిపోయే సమయం వచ్చేసింది. అప్పుడు ఆయన వచ్చారన్న మాట.

**ప్రజలయితే నమాజు చేశారు, పడుకుని నిద్రపోతున్నారు. మీరయితే నమాజు కోసం నిరీక్షిస్తూ గడిపారు. అంటే మీరు నమాజు చేస్తూనే ఉన్నారన్న మాట. మీకు నమాజు పుణ్యం లభించింది".[2] ఇమామ్ హసన్ బస్రీ (రహ్మ) ఇలా అన్నారు; "ప్రజలు ఏదైనా పుణ్యకార్యం కోసం నిరీక్షిస్తూ ఉన్నంత వరకు వారు ఆ పుణ్య కార్యంలో నిమగ్నులై ఉన్నట్లే." ఖుర్రా బిన్ ఖాలిద్ ఇలా అన్నారు; హసన్ బస్రీ గారు చెప్పిన ఈ విషయం కూడా అనస్ (ర) గారి హదీసులోని భాగమే.**

**575. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) తన జీవితం యొక్క చివరి కాలంలో ఇషా నమాజును చేశారు. సలామ్ చేసిన తరువాత లేచి నిలబడి ఇలా సెలవిచ్చారు; "మీరందరూ ఈ రాత్రిని చూశారు కదా! దీనిని జ్ఞాపకం పెట్టుకోండి. ఇప్పటి నుంచి నూరు సంవత్సరాలు గడచిపోయిన తరువాత, ఎంత మంది ప్రజలయితే ఇప్పుడు ప్రస్తుతం భూమిపై ఉన్నారో, వారిలో ఒక్క మనిషి కూడా మిగిలి ఉండదు".[1] ప్రజలు దైవప్రవక్త (స) గారు చెప్పిన ఈ విషయాన్ని తప్పుగా అర్థం చేసుకున్నారు. నూరు సంవత్సరాల గడువును మరొక విధంగా అర్థం చేసుకున్నారు. అబూ మసూద్ నూరు సంవత్సరాలలో ప్రళయం వస్తుందని భావించారు. వాస్తవానికి దైవప్రవక్త (స) గారు ఏమని సెలవిచ్చారంటే, ఈనాడు భూమిపై ఎంత మంది**

---

574-2. ఇక్కణ్ణుంచే అధ్యాయంలో పేర్కొనబడిన విషయం వస్తుంది. ఎందుకంటే, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇషా నమాజు తరువాత హితోప దేశం చేశారు, వారికి ధర్మజ్ఞానానికి సంబంధించిన విషయాలను బోధించారు.

575-1. కొంతమంది విద్వాంసులు ఏమన్నారంటే; భూమిపై ఉన్నవారు అంటే దైవప్రవక్త (స) గారి భావం ఏమిటంటే, మనం చూసే ప్రజలు, మనం గుర్తించే ప్రజలు. కనుక హజ్రత్ ఖిజర్ (అస్సలామ్) ఈ ప్రజల్లోని వారు కారు. ఇంకా ఆయన జిన్నులలోని వారు కారు, దైవదూతల జాతికి చెందిన వారు కూడా కారు. చాలామంది మహానుభావులు జిన్నుల నుంచి హదీసులు కూడా విన్నారు. వారు దైవప్రవక్త (సఅసమ్) చెప్పగా విన్నారని కూడా ధృవీకరించారు. ఇంకా అవ్లియా అల్లాహ్ మరియు దేవుణ్ణి బాగా ఎరిగిన వారు హజ్రత్ ఖిజర్ (అస్సలాము)ను కలిశారు కూడా. ఇంకా హజ్రత్ ఈసా (అస్సలామ్) అప్పుడు ఆకాశం మీద ఉన్నారు. అందుకని ఆయన గారిని భూమిపై ఉన్న వారిలోని వ్యక్తిగా పరిగణించటానికి వీలులేదు.

ప్రజలయితే ఉన్నారో వారిలో ఒక్కరు కూడా నూరు సంవత్సరాల కాలం తరువాత మిగిలి ఉండరు. ఆయన (స) గారి భావం ఏమిటంటే, నూరు సంవత్సరాల వ్యవధిలో (కాలంలో) ఈ తరం గతించిపోతుంది.[2]

## 40వ అధ్యాయం

**ఒక మనిషి తన భార్యతోగానీ లేదా తన అతిథులతోగానీ రాత్రి పూట ఇషా నమాజు అయిపోయిన తరువాత మాట్లాడటం గురించి.**

**576.** అబ్దుర్రహ్మాన్ బిన్ అబూబకర్ (రజిఅన్) ఇలా అన్నారని అబూ ఉస్మాన్ ఉల్లేఖించారు: మసీదు చూరు క్రింద నిస్సహాయులూ, నిరుపేదలు అయినవారు ఉంటారు. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) ఇలా సెలవిచ్చారు; "ఎవరి వద్దనైతే ఇద్దరు మనుషులకు సరిపోయే భోజనం ఉందో వారు మసీదు చూరు క్రింద నివసించే వారిలోని (అంటే సుఫ్ఫా సహచరుల్లోని) ఒక మనిషిని మూడో వ్యక్తిగా తమ ఇంటికి తీసుకొనిపోవాలి, ఇంకా ఎవరి వద్దనైతే నలుగురు మనుషులకు సరిపోయే అన్నం ఉందో వారు సుఫ్ఫా సహచరుల్లోని ఒకర్నిగానీ లేదా ఇద్దర్ని[1]గానీ తమ వెంట తీసుకుపోవాలి." అప్పుడు అబూబకర్ (రజిఅన్)గారు వారిలోని ముగ్గురు మనుషుల్ని తనతో తీసుకువెళ్ళారు. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) వారిలోని పది మంది మనుషుల్ని తనతోపాటు తీసుకుపోయారు. అబ్దుర్రహ్మాన్ (ర) గారు ఇలా అన్నారు; అప్పుడు ఇంట్లో నేను ఉన్నాను, నా తల్లిదండ్రులు ఉన్నారు– అబూ ఉస్మాన్‌గారు ఏమన్నారంటే; అబ్దుర్రహ్మాన్ (ర)గారు తన భార్యను[2] గురించీ, తన ఇంట్లోనూ, అబూ బకర్ (ర) గారి ఇంట్లోనూ పనిచేసే సేవకుణ్ణి గురించీ ప్రస్తావించారో లేదో నాకైతే జ్ఞాపకం లేదు. తరువాత అబూబకర్ (ర) మహా ప్రవక్త (స) గారితో సాయంత్రపు భోజనం చేశారు. మరియు ఇషా నమాజు చేసే అంత

---

575–2. అంటే రెండో తరం లేదా యుగం వస్తుంది. అది తాబయీన్‌ల యుగం అవుతుంది. దైవప్రవక్త (స) గారు చెప్పిన విధంగానే జరిగింది. నూరు సంవత్సరాల కాలంలో ఒక్క సహాబీ కూడా మిగిలిలేరు. చిట్టచివరి సహాబి పేరు దైవప్రవక్త (స) (ప్రత్యక్ష అనుచరుడు) అబుల్ తుఫేల్ ఆమిర్ బిన్ వాసిలా. ఆయన హిజ్రీ శకం నూటపదిలో మరణించారు. ఇది ఆయన తన మరణానికి ముందు చెప్పిన చివరి విషయం. కనుక ఈ రాత్రి నుంచి నూరు సంవత్సరాలలో ఆయన (ర) గారు కూడా మరణించారు.

**వరకు అక్కడే ఉండిపోయారు. ఆ తరువాత దైవప్రవక్త (స) గారి వద్దకు తిరిగి వెళ్ళిపోయారు. దైవప్రవక్త (స)గారు రాత్రి భోజనం చేసే వరకు ఆయన (ర) అక్కణ్ణే ఉండిపోయారు. తరువాత అబూబకర్(ర) తన ఇంటికి తిరిగి వచ్చేశారు. అప్పటికి రాత్రి సమయం చాలా గడచిపోయింది. అబూబకర్ (ర)గారి భార్య (ఉమ్మె రూమాన్) ఆయన (ర)తో ఇలా అన్నారు; "మీరు మీ అతిథుల్ని (అతిథిని) విడిచిపెట్టి ఎక్కడ ఇరుక్కుపోయారు?" దానికి సమాధానంగా అబూబకర్(ర), "అయితే నీవు వారికి రాత్రి భోజనం ఇంకా వడ్డించలేదా?" అప్పుడు ఉమ్మె రూమాన్ ఇలా అన్నారు; "నేనేం చెయ్యను? నేనైతే వారి ముందు భోజనాన్ని పెట్టేశాను. కాని వారే, అబూబకర్ (ర) వచ్చేవరకు మేము భోజనం చెయ్యము" అని అన్నారు. అబ్దుర్రహ్మాన్ (ర)గారు ఇలా అన్నారు; 'నేను (భయపడి) దాక్కున్నాను;' అప్పుడు అబూబకర్ (ర) అబ్దుర్రహ్మాన్(ర)ను ఉద్దేశించి; 'ఓ ఘున్సర్!' (ఒక పరుష పదం) అని అన్నారు. ఇంకా దూషించారు, దుర్భాషలాడారు. ఆ తరువాత అతిథుల్ని ఉద్దేశించి కూడా ఆయన (ర) కఠినంగా ఇప్పుడయినా ఎంగిలిపడండి. బలవంతంగానయినా మ్రింగండి. ఇంకా ఇలా అన్నారు; "దేవుని మీద ప్రమాణం చేసి చెబుతున్నాను! నేనైతే ఈ భోజనాన్ని ఎంతమాత్రం ముట్టుకోను!" అబ్దుర్రహ్మాన్ గారు ఇలా అన్నారు; (భోజన విషయం ఇలా పరిణమించింది) మేము ఆ అన్నంలో నుంచి ఒక ముద్దను తీసుకున్నప్పుడు కింద నుంచి అన్నం మరింత ఎక్కువయ్యేది. చివరకు అతిథులందరూ కడుపు నిండా తృప్తిగా భోజనం చేశారు. అయితే అన్నం మొదట ఎంతయితే ఉన్నదో అంతకంటే ఎక్కువే అయిపోయింది. అబూబకర్ (ర) అన్నాన్ని చూశారు, అది మొదట ఎంత ఉన్నదో, ఇప్పుడు కూడా అంతే ఉన్నది. అంతేకాదు, అది పెరిగింది,**

---

576-1. దీనికి రెండు అర్థాలున్నాయి. ఒకటి ఏమిటంటే; ఒకవేళ నలుగురు మనుషులకు సరిపోయే భోజనం ఉన్నట్లయితే అప్పుడు ఒకరినో లేక ఇద్దరినో అధికంగా తీసుకుపోవాలి. రెండో అర్థం ఏమిటంటే, ఒకవేళ నలుగురు మనుషులకు సరిపడే అన్నం ఉన్నట్లయితే అప్పుడు మొత్తం అయిదుగురు మనుషుల్ని తీసుకుపోవాలి. ఒకవేళ అయిదుగురికి సరిపోయే అన్నం ఉంటే అప్పుడు మొత్తం ఆరుగురు మనుషుల్ని తీసుకుపోవాలి.

576-2. అబ్దుర్రహ్మాన్ (ర)గారి భార్య పేరు ఉమయ్యా బిన్తె అదీ బిన్ ఖైస్.

ఎక్కువ అయిపోయింది. అప్పుడు ఆయన (ర), తన భార్య ఉమ్మె రూమాన్‌ను ఉద్దేశించి ఇలా అన్నారు; "ఓ బనీ ఫిరాస్ వంశానికి చెందిన మహిళా! ఏమిటిది? ఆశ్చర్యంగా ఉన్నదే" ఆమె ఇలా అన్నారు: "నా ప్రియప్రవక్త (స) మీద ప్రమాణం చేసి నేను సత్యమే పలుకుతున్నాను. ఈ అన్నమైతే మొదట ఎలాగుందో అలాగే చెక్కు చెదరకుండా ఉంది. అంతేకాదు మొదట ఉన్నదానికంటే మూడింతలు పెరిగింది." అప్పుడు అబూబకర్ (ర) కూడా ఆ అన్నాన్నే తిన్నారు. ఇంకా ఇలా అన్నారు; నేను అన్న విషయం అంటే చేసిన ప్రమాణం షైతాను యొక్క దుష్ప్రేరణ మాత్రమే. ఆయన (ర) ఆ అన్నంలో నుంచి మళ్లీ ఒక ముద్ద తిని తరువాత ఆ మొత్తం అన్నాన్ని దైవప్రవక్త (స) గారి వద్దకు తీసుకుపోయారు. ఆ అన్నం ఉదయం అయ్యేవరకు దైవప్రవక్త (స) గారి వద్దనే ఉంచబడింది. అబ్దుర్రహ్మాన్ (ర)గారు ఇలా అన్నారు; మాకూ, అవిశ్వాసుల ఒక వర్గానికీ మధ్య ఒక ఒప్పందం ఉండినది. ఆ ఒప్పందం గడువు పూర్తి అయిపోయింది (వారు మదీనా పురంలోకి వచ్చేశారు). మేము వారిలో నుంచి పన్నెండు మంది వ్యక్తుల్ని ఎన్నుకున్నాము. ఒక్కొక్క వ్యక్తి వెంట ఎంత మంది మనుషులు ఉన్నారో అల్లాహ్‌కు మాత్రమే తెలుసు. వారందరూ ఆ అన్నంలో నుంచే భోజనం చేశారు.

అనంత కరుణామయుడు పరమ కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో...

# అజాన్ ప్రకరణం

## 1వ అధ్యాయం

### అజాన్ ఎలా ప్రారంభమయింది అనే విషయం గురించి

**"కరుణామయుడైన అల్లాహ్ ఖుర్ఆన్ గ్రంథంలో అల్ మాయిదా సూరాలో ఇలా సెలవిచ్చాడు; "మీరు నమాజు కోసం పిలుపునిచ్చినప్పుడు వారు దానిని ఎగతాళి చేస్తారు. వినోదంగా తీసుకుంటారు. దీనికి కారణం వారికి బుద్ధి లేకపోవటమే" (5:58). ఇంకా అల్లాహ్ జుముఅహ్ సూరాలో కూడా ఇలా సెలవిచ్చాడు; "విశ్వాసులారా! శుక్రవారం నాడు నమాజుకై పిలిచినప్పుడు...[1]" (62:9)**

**577.** **హజ్రత్ అనస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ప్రజలు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) గారి ముందు అగ్నిని గురించీ, గంటను గురించీ ప్రస్తావించారు. ఇంకా యూదుల స్థితిని గురించి, క్రైస్తవుల స్థితిని గురించి కూడా వారు ప్రస్తావించారు.[1] ఆ తరువాత హజ్రత్ బిలాల్ (రజిఅన్)కు రెండేసిసార్లు అజాన్ లోని పదాలను పలకమనీ మరియు తక్బీర్‌ను ఒక్కొక్కసారి పలకమనీ ఆజ్ఞాపించటం జరిగింది.**

---

1-1. ఈ రెండు ఖుర్ఆన్ వాక్యాలను ఈ అధ్యాయంలోకి తీసుకువచ్చి ఇమామ్ బుఖారీ (రహ్మాలై)గారు నిరూపించిన విషయం ఏమిటంటే, అజాన్ వాస్తవికతను, దాని ప్రామాణికతను స్వయంగా ఖుర్ఆనే ధ్రువీకరిస్తోంది. ఇంకా అజాన్ సంప్రదాయం మదీనా పట్టణంలో ప్రారంభమయింది. ఎందుకంటే మాయిదా సూరా, జుముఅహ్ సూరా ఈ రెండు సూరాలు మదీనా పురంలోనే అవతరించాయి. యదార్థం ఏమిటంటే, అజాన్ సంప్రదాయం హిజ్రత్ మొదటి సంవత్సరంలోనో లేదా రెండో సంవత్సరంలోనో ప్రారంభమయింది.

577-1. ఈ హదీసుకు సంబంధించిన సకల విషయాలు ముందు రాబోతున్నాయి. యూదులను గురించీ, క్రైస్తవులను గురించీ ప్రస్తావించటం జరిగింది, అంటే అర్థం యూదులు ప్రజల్ని నమాజు కోసం పిలవటానికి ఒక ప్రత్యేక స్థలంలో నిప్పు ముట్టించే

**578.** హ్రజత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ప్రారంభంలో ముస్లిములు మదీనాపురానికి వచ్చినప్పుడు, నమాజు కోసం ఒక సమయాన్ని నిర్ణయించుకుని, ఆ సమయాన్ని ఊహించుకుని అంచనా వేసి నమాజు కోసం సమావేశమయ్యేవారు. నమాజు కోసం అజాన్ ఇచ్చే సంప్రదాయం అప్పుడు లేదు. ఒక రోజున వారందరూ కలిసి ఈ విషయం గురించి చర్చలు జరిపారు. కొందరు క్రైస్తవుల మాదిరిగా ఒక గంటను తయారు చేయించుకోమని సలహా ఇచ్చారు. మరికొందరు యూదుల మాదిరిగా ఒక శంఖాన్ని తయారు చేసుకోమని సలహా ఇచ్చారు. అప్పుడు హ్రజత్ ఉమర్ (రజిఅన్) ఇలా అన్నారు; ఇలా ఎందుకు చెయ్యరు? ఒక వ్యక్తిని నియమించుకోండి. అతను నమాజు కోసం ప్రజల్ని పిలుస్తూ ఉంటాడు. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసం) గారికి హ్రజత్ ఉమర్ (ర) గారి ఈ అభిప్రాయం నచ్చింది. ఆయన (స) హ్రజత్ బిలాల్ (ర)ను ఉద్దేశించి ఓ బిలాల్! లే నమాజు కోసం అజాన్ ఇవ్వు.[1] అని అన్నారు.

## 2వ అధ్యాయం

### అజాన్‌లోని పదాలను రెండేసిసార్లు పలకటం.

**579.** హ్రజత్ అనస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; అజాన్‌లోని పదాలను రెండేసి సార్లు పలకమనీ, మరియు తక్బీర్‌ను ఒక్కొక్కసారి మాత్రమే పలకమనీ, ఇంకా 'ఖద్ ఖామతిస్సలాత్'ను రెండేసి సార్లు పలకమనీ హ్రజత్ బిలాల్ (రజిఅన్) గారిని ఆజ్ఞాపించటం జరిగింది.

**580.** హ్రజత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ముస్లిమ్ ప్రజల సంఖ్య బాగా పెరిగిపోయినప్పుడు నమాజు వేళను సూచించే సంకేతాన్ని దేన్నయినా నిర్ణయించుకోవాలి. ఇంకా ముస్లిమ్ ప్రజలు దాన్ని గ్రహించి నమాజు కోసం సమావేశం కావాలి అనే విషయం గురించి వారు పరస్పరం చర్చించుకున్నారు.

---

వారు. ప్రజలు ఆ వెలుగును చూసి నమాజు కోసం సమావేశమయ్యేవారు. క్రైస్తవులు గంటను మోగించే వారు. ప్రజలు ఈ గంట ధ్వనిని విని నమాజు కోసం సమావేశమయ్యేవారు.

578-1. ఈ హదీసు ద్వారా స్పష్టంగా తెలిసిన విషయం ఏమిటంటే, అజాన్‌ను లేచి నిలబడి ఇవ్వాలి. చాలామంది మత విద్వాంసుల దృష్టిలో, అహ్లెహదీస్ విద్వాంసుల దృష్టిలో కూడా కూర్చోని అజాన్ ఇవ్వటం ధర్మసమ్మతం కాదు.

అగ్నిని రాజేస్తే బాగుంటుందని ఒకరు ప్రతిపాదిస్తే, గంటను మోగిస్తే ఇంకా బాగుంటుందని మరొకరు సలహా ఇచ్చారు. చివరకు అజాన్ (నమాజుకు రమ్మని పిలుపు) లోని పదాలను రెండేసిసార్లు పలకమనీ, తక్బీర్‌ను మాత్రం ఒక్కొక్కసారి పలకమనీ హ(జ్రత్ బిలాల్ (రజిఅన్)ను ఆజ్ఞాపించటం జరిగింది.

## 3వ అధ్యాయం

## 'ఖద్‌ఖామతిస్సలాత్' తప్ప తక్బీర్‌లోని పదాలను ఒక్కొక్కసారి పలకాలి

**581.** అబూ ఖిలాబ ఇలా ఉల్లేఖించారని హ(జ్రత్ అనస్ (రజిఅన్) చెప్పారు, అజాన్‌లోని పదాలను రెండేసి సార్లు, తక్బీర్‌లోని పదాలను ఒక్కొక్కసారి పలకమని హ(జ్రత్ బిలాల్ (రజిఅన్) ఆజ్ఞాపించబడ్డారు. ఇస్మాయిల్ గారు ఏమన్నారంటే, నేను ఈ హదీసును గురించి అయ్యూబ్ సఖ్తియాని గారి దగ్గర ప్రస్తావించగా ఆయన 'ఖద్‌ఖామతిస్సలాత్' తప్ప అనే పదాలను అదనంగా చేర్చారు. (అంటే ఖద్‌ఖామతి స్సలాత్ అనే పదాలను రెండుసార్లు పలకాలి.)

## 4వ అధ్యాయం

## అజాన్ ఇచ్చేదాని ఔన్నత్యం.

**582.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అబూహురైరా (రజిఅన్) ఉల్లేఖించారు; నమాజు కోసం అజాన్ ఇస్తూ ఉన్నప్పుడు షైతాను అపానవాయువు విడుస్తూ వెనుతిరిగి పారిపోతాడు. ఎందుకంటే, వాడు అజాన్ వినటాన్ని ఇష్టపడడు[1] (అజాన్‌ను అసహ్యించుకుంటాడు). అజాన్ ఇవ్వడం అయిపోయిన తరువాత వాడు మళ్ళీ తిరిగి వస్తాడు. నమాజు కోసం తక్బీర్ (ఇఖామత్) అవుతూ ఉన్నప్పుడు మళ్ళీ వెనక్కి తిరిగి పారిపోతాడు. తక్బీర్ అయిపోయిన తరువాత మళ్ళీ తిరిగి వస్తాడు. నమాజు చేసే వ్యక్తి హృదయంలో రకరకాల ఆలోచనలను రేకెత్తిస్తాడు; ఫలానా విషయాన్ని జ్ఞాపకం తెచ్చుకో, ఫలానా విషయాన్ని గుర్తుకు తెచ్చుకో అంటూ, మరచిపోయిన విషయాలను జ్ఞాపకం చేస్తాడు. ఆ విధంగా వాడు నమాజు చేసే వ్యక్తి ఎన్ని రకాతుల నమాజు చేశాడో జ్ఞాపకం లేకుండా, మరచిపోయేలా చేస్తాడు.

---

582-1. పోలీసును చూసి దొంగ ఎలా పారిపోతాడో షైతాను కూడా అజాన్ ఇస్తూ ఉన్నప్పుడు అలా పారిపోతాడు. కొందరు విద్వాంసులు ఏమన్నారంటే, అజాన్ ఇవ్వటంలో నమాజు కోసం పిలుపు ఉంది కాబట్టి, నమాజులో సజ్దా చెయ్యటం అనేది ఉంది

## 5వ అధ్యాయం
## అజాన్ ఇచ్చేటప్పుడు కంఠస్వరాన్ని పెంచటం.

**ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్(ఖలీఫా) గారు, అజాన్ ఇచ్చే ఒక ముఅజ్జిన్‌తో ఇలా అన్నారు: నీవు గనక అజాన్ ఇస్తే స్పష్టంగా, తిన్నగా ఇవ్వు లేదా ముఅజ్జిన్ పదవి నుంచి తొలగిపో.[1]**

**583. హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) తన తండ్రిగారికి ఇలా చెప్పారని అబ్దుర్రహ్మాన్ బిన్ అబీసాసా ఉల్లేఖించారు; అడవిలో ఉండటం, గొర్రెల్ని మేపటం – ఈ రెండూ నీకు చాలా ఇష్టమైన విషయాలని నేను గమనిస్తూ ఉన్నాను. కనుక నీవు నీ గొర్రెల్ని మేపుతూ ఉన్నప్పుడుగానీ లేదా అడవిలో ఉన్నప్పుడుగానీ, నమాజు కోసం అజాన్ ఇచ్చే అవసరం కలిగితే అప్పుడు నీవు నీ కంఠాన్ని పెంచి, పెద్దదిగా చేసి అజాన్ ఇవ్వు[1]. ఎందుకంటే, ఎంతవరకైతే ముఅజ్జిన్ పిలుపు చేరుతుందో అంతవరకుగల ప్రదేశంలో ఉన్నటువంటి జిన్నులూ, మానవులూ, ఇతరులెవరైనాసరే ఈ పిలుపు విన్న వారందరూ తీర్పుదినం నాడు దేవుని ముందు సాక్ష్యమిస్తారు.**

---

కాబట్టి షైతానుకు తన పూర్వపు గాథ జ్ఞాపకం వస్తుంది. వాడు ఆదిమానవుడైన హజ్రత్ ఆదం(అస్సలామ్)కు సజ్దా చెయ్యకుండా అల్లాహ్ ఆజ్ఞను ఉల్లంఘించాడు. ఈ కారణంగా అల్లాహ్ వాణ్ణి తన దర్బారులో నుంచి బహిష్కరించాడు. కనుక షైతాను అజాన్ వినటాన్ని ఇష్టపడడు, అసహ్యించుకుంటాడు. మరికొందరు విద్వాంసులు ఏమన్నారంటే, పరలోకంలో అజాన్‌కు సంబంధించిన సాక్ష్యాన్ని అల్లాహ్ సమక్షంలో ఇవ్వవలసి వస్తుందనే భయం వల్ల కూడా షైతాను అజాన్ పిలుపును వినటాన్ని ఇష్టపడడు. అజాన్ పిలుపు ఎంతవరకైతే పోతుందో అంతవరకు గల ప్రదేశంలో ఉన్నటువంటి ప్రజలు అజాన్‌కు సాక్షులైపోతారు. తత్ఫలితంగా పరలోకంలో సాక్ష్యం ఇస్తారు. ఈ విషయం ఇతర హదీసుల్లో వస్తుంది.

5–1. ఈ విషయాన్ని ఇబ్నె అబీషైబా గారు ఆవిష్కరించారు. ఒకసారి ఒక ముఅజ్జిన్ లయబద్ధంగా, ఒక గాయకుని మాదిరిగా, పాటలు పాడే విధంగా శ్రావ్యంగా అజాన్ ఇచ్చాడు. అప్పుడు ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ గారు అతన్ని ఇలా మందలించారు. ఆ ముఅజ్జిన్ పేరేమిటో తెలియదు. కనుక ఈ అసర్(హదీసు) ప్రకారం రాగయుక్తంగా, గానం చేస్తూ అజాన్ ఇవ్వకూడదు. సాదా పద్ధతిలో కంఠాన్ని పెంచి అజాన్ ఇవ్వటం అభిలషణీయం.

**అబూ సయీద్ (ర) ఇంకా, నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఈ విషయాన్ని బోధిస్తూ ఉండగా విన్నాను అని అన్నారు.**

## 6వ అధ్యాయం

## అజాన్ పిలుపు వినగానే యుద్ధాన్ని కొంచెం సేపటి వరకు ఆపటం.

**584.** **హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా అన్నారని హుమైద్ ఉల్లేఖించారు; దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఏదైనా జాతికి వ్యతిరేకంగా జిహాద్ (యుద్ధం) చెయ్యటానికి మాతో బయలుదేరినప్పుడల్లా, ఆయన (స) గారు ఉదయం అయ్యే వరకు దానిపై దాడిచేసే అనుమతిని మాకు ఇచ్చేవారు కాదు, ఉదయం అయ్యే వరకు వేచి చూచేవారు. ఒకవేళ ఆయన (స) అజాన్ పిలుపును విన్నట్లయితే దాడిని వాయిదా వేసేవారు.[1] ఒకవేళ అజాన్ పిలుపును వినకపోతే ఆ జాతి వారిపై దాడి చేసే వారు. హజ్రత్ అనస్ (ర) ఇలా అన్నారు; మేము జిహాద్ కోసం (యుద్ధం కోసం) ఖైబర్ వైపునకు బయలుదేరాము. అక్కడకు చేరేటప్పటికి రాత్రి అయింది. ఉదయం వేళ అయిన తరువాత దైవప్రవక్త (స) గారు అజాన్ పిలుపును వినలేదు. అప్పుడు ఆయన (స) గారు దాడి చెయ్యటానికి బయలు దేరారు. నేను కూడా ఒక గుర్రం మీద అబూ తల్హా (ర) గారి వెనుక కూర్చున్నాను. నా కాలు (ప్రయాణంలో) దైవ ప్రవక్త (స) గారి పవిత్ర పాదాలను తాకుతూ ఉండేది. హజ్రత్ అనస్ (ర) ఇంకా ఇలా అన్నారు; ఖైబర్ వాసులైన యూదులు తమ తమ గంపల్నీ, పారల్నీ తీసుకుని బయటికి వచ్చేశారు. వారు దైవప్రవక్త (సఅసమ్)గారిని చూసి, "ముహమ్మద్ (స)! దైవసాక్షిగా ముహమ్మద్ మరియు ఆయన సైన్యం వచ్చేశారు!" అని కేకలేశారు.**

---

583-1. అంటే ఇది అడవి ప్రదేశం కాబట్టి ఇక్కడకు నమాజు కోసం ఎవరూ రారు. కనుక మెల్లగా అజాన్ ఇస్తే సరిపోతుంది అని అనుకోరాదు.

584-1. ఇక్కణ్ణుంచే అధ్యాయంలోని ప్రధాన విషయం చర్చకు వస్తుంది. ఎందుకంటే, అజాన్ పిలుపు అక్కడి ప్రజల ధన మాన ప్రాణాల రక్షణకు కారణమవుతుంది. విద్వాంసులు ఖతాబి ఇలా అన్నారు; అజాన్ ఇస్లామ్ యొక్క మహత్తరమైన చిహ్నం. దానిని విడిచి పెట్టటం ధర్మసమ్మతం కానేకాదు. ఏదైనా పట్టణం ప్రజలు అజాన్ ఇవ్వటాన్ని త్రోసిరాజంటే వారికి వ్యతిరేకంగా జిహాద్ చెయ్యటం ధర్మసమ్మతమే.

దైవప్రవక్త (స) వారిని చూసి "అల్లాహు అక్బర్! అల్లాహు అక్బర్! ఖైబర్ నాశనమై పోయింది. యుద్ధం చేసే ఉద్దేశ్యంతో మేము ఏదైనా శత్రు జాతిని సమీపించినప్పుడు, హెచ్చరిక చేయబడిన జాతి ప్రజల ఉదయం బహుచెడ్డ ఉదయంగా పరిణమిస్తుంది." అని అన్నారు.

## 7వ అధ్యాయం

### అజాన్ పిలుపు వినే సమయంలో ఏమని పలకాలి.

**585.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) ఉల్లేఖించారు; మీరు అజాన్ పిలుపు విన్నప్పుడు, ముఅజ్జిన్ ఏమయితే పలుకుతాడో మీరు కూడా అదే పలకండి.[1]

**586.** ఈసా బిన్ తల్హా ఇలా ఉల్లేఖించారు; "నేను హజ్రత్ ముఆవియ బిన్ అబీ సుఫ్యాన్‌ను, మౌజన్ పలుకుతున్నట్లుగా 'అష్హదు అన్న ముహమ్మదర్ రసూలుల్లాహ్' వరకు పలుకుతూ ఉండగా విన్నాను.

**587.** పై హదీసు (586వ హదీసు)లో మాదిరిగానే యహ్యా ఉల్లేఖించారు: ఇంకా అదనంగా ఆయన ఈ విషయాన్ని కూడా చేర్చారు; నాతో నా సోదరు డొకాయన[1] ఇలా చెప్పారు; ముఅజ్జిన్ "హయ్య అలస్సలాహ్" అని పలికినప్పుడు హజ్రత్ ముఆవియా 'లాహవ్ల వ లాఖువ్వత ఇల్లా బిల్లాహ్' అని పలికేవారు. ఇంకా ఆయన ఇలా అనేవారు; నేను మీ ప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలాగే అంటూ ఉండగా విన్నాను.[2]

## 8వ అధ్యాయం

### అజాన్ ఇవ్వటం అయిపోయిన తరువాత ఏమని దుఆ చెయ్యాలి?

**588.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని

---

585–ఈ విషయంలో అభిప్రాయ భేదం ఉంది: ముఅజ్జిన్ 'హయ్యా అలస్సలాహ్', 'హయ్యా అలల్‌ఫలాహ్' అని పలికినప్పుడు వినేవారు ఏమని పలకాలి. ఈ హదీసు ద్వారా తెలిసే విషయం ఏమిటంటే, వినేవారు కూడా ఇలానే పలకాలి. కాని చాలామంది విద్వాంసుల అభిప్రాయం ప్రకారం వినేవారు అప్పుడు, 'లా హవ్ల వలా ఖువ్వత ఇల్లాబిల్లాహ్' అని పలకాలి. ఈ విషయాన్ని చెప్పటానికే ఇమామ్ బుఖారీ (రహ్మలై) గారు రాబోయే హదీసులలో హజ్రత్ ముఆవియా(ర) గారి హదీసును తీసుకువచ్చారు.

587–1. హాఫిజ్ (ఇబ్నెహజర్) గారు ఇలా అన్నారు: ఆ వ్యక్తి పేరు అల్‌ఖమా బిన్ వఖాస్

హ్రజత్ జాబిర్ బిన్ అబ్దుల్లా అన్సారీ (రజిఅన్) ఉల్లేఖించారు; ఏ వ్యక్తి అయితే అజాన్ విని ఆ తరువాత “అల్లాహుమ్మ రబ్బ హాజిహిద్ దావతిత్తామతి వస్సలాతిల్ ఖాయిమతి ఆతి ముహమ్మదనిల్ వసీలత వల్ ఫజీలత వబ్అస్హు మఖామమ్ మహ్మూద నిల్లజీ వఅద్త్తహు” ప్రార్థిస్తాడో,

(ఓ అల్లాహ్! ఈ సంపూర్ణ పిలుపుకూ, శాశ్వతంగా స్థాపించబడే నమాజుకూ ప్రభూ! మహాప్రవక్త ముహమ్మద్ (స)కు (ప్రళయదినం నాడు) సిఫారసు చేసే హక్కును ఔన్నత్యాన్నీ ప్రసాదించు. ఇంకా ఆయన (స)కు ప్రశంసనీయమైన ఉన్నత స్థానంలో ప్రతిష్టింపజెయ్యి. నీవు దానిని ఇస్తానని ఆయన (స)కు వాగ్దానం చేసే ఉన్నావు). ప్రళయ దినం నాడు అతని విషయంలో సిఫారసు చేసే అనుమతిని అల్లాహ్ నాకు ప్రసాదిస్తాడు.

## 9వ అధ్యాయం

**అజాన్ ఇచ్చే విషయంలో డ్రా తీసే పద్ధతి (చీటీలు వేయుట). అజాన్ ఇచ్చే విషయం లో కొందరి మధ్య అభిప్రాయ భేదం తలెత్తింది. అజాన్ నేనిస్తాను అంటే నేనిస్తాను అని తగాదా పడసాగారు. ఈ విషయం సాద్ బిన్ అబీ వఖాస్ (ర) దగ్గరకు వెళ్లింది. అప్పుడు ఆయన చీటీలు వేసి డ్రా తీశారు.**

**589.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హ్రజత్ అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు; అజాన్ ఇవ్వటంలోనూ, సామూహిక నమాజులో మొదటి పంక్తిలో నిలబడటంలోనూ ఎంత పుణ్యం ఉందో ప్రజలు గనక తెలుసుకుంటే, అప్పుడు చీటీలు వేసి డ్రా తియ్యటం తప్ప మరొక మార్గమేదీ ఉండదు. అప్పుడు చీటీలు వేసి డ్రా తియ్యవచ్చు. జొహర్ నమాజు కోసం తొందరగా వస్తే ఎంత పుణ్యం లభిస్తుందో ప్రజలకు గనక తెలిస్తే అప్పుడు వారు ఒకరితో ఒకరు పోటీ

---

లేదా అబ్దుల్లా బిన్ అల్ఖమా లేదా అమ్ర్ బిన్ అల్ఖమా. ఆ వ్యక్తి అవ్జాయి అని కిర్మానీ గారు అన్నారు. వల్లాహు ఆలమ్.

587-2. ఇబ్నె ఖుజైమా గారి ఉల్లేఖనంలో ఈ విషయం అదనంగా ఉంది; ‘హయ్యా అలల్ ఫలాహ్’ అని ముఅజ్జిన్ అన్నప్పుడు కూడా హ్రజత్ ముఆవియ ‘లాహౌల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహ్’ అనే పదాలనే పలికారు. ఆ తరువాత ముఅజ్జిన్ పలికిన పదాలనే ఆయన కూడా పలికారు.

**పడతారు. ఇషా మరియు ఫజర్ నమాజులను సామూహికంగా అంటే జమాఅత్‌తో చేస్తే ఎంత పుణ్యం లభిస్తుందో ప్రజలకు గనక తెలిసిపోతే అప్పుడు వారు ఆ నమాజులలో తప్పకుండా పాల్గొంటారు. నేలపై ప్రాకుతూ రావలసి వచ్చినా వారు తప్పని సరిగా ప్రాకుతూ మసీదుకు వస్తారు.**

## 10వ అధ్యాయం

## అజాన్ ఇచ్చేటప్పుడు మాట్లాడటం ధర్మసమ్మతమా? కాదా?[1]

**సులైమాన్ బిన్ సురద్ (రజిఅన్) అజాన్ ఇచ్చేటప్పుడు మాట్లాడారు.[2] ఇంకా ఇమామ్ హసన్ బస్రి (రహ్మాలై) గారు ఏమన్నారంటే; అజాన్ ఇచ్చేటప్పుడూ, ఇఖామత్ చెప్పేటప్పుడూ నవ్వటం అనేది అంత చెడ్డ విషయమేమీ కాదు.**

**590.** **అబ్దుల్లాహ్ బిన్ హారిస్ బస్రీ ఇలా ఉల్లేఖించారు: ఒక రోజున ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) మమ్మల్ని ఉద్దేశించి జుమా ప్రసంగం చేశారు. ఆ రోజున వర్షం కురుస్తోంది. వీధులన్నీ బురదమయమైపోయాయి. ముఅజ్జిన్ అజాను ఇస్తూ 'హయ్యా అలస్సలాహ్' అని అనబోయేటప్పుడు, ఆయన (ర), "నమాజును మీ గృహాలలోనే చేసుకోండి"[1] అని పలకమని ఆజ్ఞాపించారు. ఈ స్థితిని చూసి ప్రజలు ఆశ్చర్యచకితులై ఒకరి ముఖాన్ని ఒకరు చూసుకోసాగారు. అప్పుడు హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (ర) ఇలా అన్నారు; "నాకంటే శ్రేష్ఠులైన వారు ఇలానే చేశారు.[2] జుమా నమాజు వాజిబ్ అనే విషయంలో ఎలాంటి సందేహమూ లేదు".[3]**

---

10–1. ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మాలై) గారి అభిప్రాయం ప్రకారం, అజాన్ ఇచ్చేటప్పుడు మాట్లాడటం ధర్మసమ్మతమైన విషయమే. ఇంకా ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారి అభిప్రాయం కూడా దాదాపు ఇదే. కొందరు విద్వాంసులు అజాన్ ఇచ్చేటప్పుడు మాట్లాడటం మక్రూహ్ అంటే అయిష్టకరమైనది అని అభిప్రాయపడ్డారు. మరికొందరు అంత మంచిది కాదు, ఉత్తమమైనది కాదు అని భావించారు. ఇమామ్ అబూ హనీఫా (రహ్మాలై) గారి అభిప్రాయం కూడా ఇదే.

10–2. ఈ విషయాన్ని అబూ నుఅయిమ్ గారు కితాబుస్సలాత్‌లో ప్రస్తావించారు.

590–1. అధ్యాయంలోని ప్రధానాంశం ఇక్కణ్ణే ప్రస్తావించబడింది. ఎందుకంటే, ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ముఅజ్జిన్ అజాన్ ఇచ్చేటప్పుడే ఇలా పలకమని ఆదేశించారు; తెలిసిన విషయం ఏమిటంటే, అత్యవసర పరిస్థితి ఉత్పన్నమైనప్పుడు అజాన్ ఇచ్చేటప్పుడు మాట్లాడటం ధర్మసమ్మతమైన విషయమే. అంటే, అజాన్ మధ్యలో మాట్లాడవచ్చు అన్న మాట.

## 11వ అధ్యాయం

**సమయాన్ని తెలియజేసే వ్యక్తి ఎవరైనా ఉంటే అప్పుడు ఒక అంధుడు కూడా అజాన్ ఇవ్వవచ్చు.**[1]

**591.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని, నా తండ్రి గారు చెప్పారు అని సాలిమ్ బిన్ అబ్దుల్లా బిన్ ఉమర్ ఉల్లేఖించారు; బిలాల్ (రజిఅన్) అయితే ఇంకా రాత్రి ఉండగానే అజాన్ ఇస్తాడు. మీరు (సహ్‌రీ) తినండి, త్రాగండి, ఉమ్మె మక్తూమ్ కుమారుడు అజాన్ ఇచ్చే వరకు. సాలిమ్ ఇంకా ఇలా అన్నారు; ఉమ్మె మక్తూమ్ కుమారుడు (అబ్దుల్లాహ్) గ్రుడ్డివాడు. కనుక ఉదయం అయిపోయిందని ఎవరో ఒకరు చెప్పే వరకు ఆయన అజాన్ ఇచ్చేవారు కాదు.

## 12వ అధ్యాయం

**ఉదయం వేళ అయిపోయిన తరువాత అజాన్ ఇవ్వటం.**

**592.** హజ్రత్ హఫ్సా (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు: ఉదయపు నమాజు కోసం ముఅజ్జిన్ అజాన్ ఇచ్చి కూర్చున్నప్పుడు ఇంకా ఉదయం వేళ స్పష్టంగా

---

590–2. అంటే, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) అని అర్థం.

590–3. దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్ స్పష్టంగా ఇలా ఆజ్ఞాపించాడు: "యా అయ్యుహల్లజీన ఆమనూ ఇజా నూదియ లిస్సలాతి మిన్‌యవ్‌మిల్ జుముఅతి ఫస్‌అవ్ ఇలా జిక్‌రిల్లాహి" (విశ్వాసులారా! శుక్రవారం నాడు నమాజుకై పిలిచినప్పుడు, అల్లాహ్ సంస్మరణ వైపునకు పరుగెత్తండి). కనుక ఒకవేళ నేను ముఅజ్జిన్ చేత 'హయ్యా అలస్సలాహ్' అని పలికిస్తే అప్పుడు ప్రజలందరూ జుమా నమాజు కోసం రావటం విధి అయ్యేది. అంటే, తప్పనిసరిగా రావలసి వచ్చేది. వర్షం కురవటం వల్ల జలమయమైన వీధులలోని బురద నీరు కారణంగా వారికి కష్టం కలిగి ఉండేది. కనుక నేను ముఅజ్జిన్ చేత ఇలా పలికించాను; "అస్సలాతు ఫిర్రహాలి' (మీ మీ నివాసాలలోనే నమాజు చేసుకోండి). ఈ హదీసు ద్వారా తెలిసినటువంటి మరొక విషయమేమి టంటే, జుమా నమాజు ఇంట్లో చేసుకోవటం కూడా ధర్మసమ్మతమైన విషయమే.

11–1. హనఫి మస్లక్ ప్రకారం, అంధుడైన వ్యక్తి ఇచ్చే అజాన్ అయిష్టకరమైనది, అంటే మక్రూహ్. ఇమామ్ బుఖారీ (రహ్మలై) గారు ప్రతిపాదించిన ఒక సహీహ్ హదీసు ప్రకారం, దీనికి అనుమతి లభిస్తుంది. అయితే సమయాన్ని తెలియజేసే వ్యక్తి ఎవరూ లేకపోతే బహుశా అప్పుడు అంధుని అజాన్ మక్రూహ్ అయిపోతుంది.

కనిపిస్తూ ఉన్నప్పుడు, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇఖామత్‌కు ముందు రెండు రకాతుల తేలికపాటి నమాజును (ఉదయపు సున్నత్ నమాజును) చేసేవారు.

**593.** హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఉదయపు అజాన్‌కూ, ఇఖామత్‌కూ మధ్య ఉన్న కాలంలో రెండు రకాతుల తేలికపాటి నమాజును అంటే సున్నత్ నమాజును చేసే వారు.

**594.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఉల్లేఖించారు: బిలాల్ (రజిఅన్) రాత్రి ఉండగానే అజాన్ ఇస్తారు. కనుక ఇబ్నె ఉమ్మె మక్తూమ్ (రజిఅన్) అజాన్ ఇచ్చే వరకు మీరు (సహరీ) తింటూ, త్రాగుతూ ఉండండి.

## 13వ అధ్యాయం

## ఫజర్ వేళకు ముందు అజాన్ ఇవ్వటం.

**595.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజిఅన్) ఉల్లేఖించారు; బిలాల్ (ర) ఇచ్చే అజాన్‌ను విని మీరు సహరీ తినటాన్ని ముగించబాకండి. ఎందుకంటే ఆయన ఇంకా రాత్రి ఉండగానే అజాన్ ఇస్తారు; తహజ్జుద్ నమాజు చేసే వ్యక్తి త్వరగా తన నమాజును ముగించాలని, నిదురపోయే ప్రజలు మేలుకోవాలని దాని అర్థం, వేకువ అయిందని గాని లేదా ఫజర్ వేళ ప్రారంభమయిందని గానీ కాదు. అప్పుడు దైవప్రవక్త (స) తన చేతి వ్రేళ్లతో సంజ్ఞ చేస్తూ వాటిని ఆకాశం వైపునకు ఎత్తి మళ్లీ వాటిని కిందకు వంచి ఉషోదయ స్థితిని వ్యక్తం చేశారు. అబ్దుల్లా బిన్ మసూద్ (ర) గారు దైవ ప్రవక్త(స) గారి అభినయాన్ని అనుకరించి చూపారు. అల్ జుహ్‌రీ ఆ స్థితిని ఇలా సంజ్ఞ చేసి చూపించారు; చూపుడు వ్రేళ్లను ఒకదాని మీద ఒకటి పెట్టి వాటిని కుడి వైపునకూ, ఎడమ వైపునకూ సాగదీశారు.

**596.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) ఉల్లేఖించారు; బిలాల్ (ర) ఇంకా రాత్రి ఉండగానే అజాన్ ఇస్తారు. కనుక మీరు సహరీ తినండి. మంచి నీళ్లు త్రాగండి. ఇబ్నె ఉమ్మె మక్తూమ్ అజాన్ ఇచ్చే అంత వరకు ఇలా చేస్తూనే ఉండండి.

## 14వ అధ్యాయం

**అజాన్‌కూ, ఇఖామత్‌కూ మధ్య ఎంత వ్యవధి ఉండాలి? అనే విషయం గురించి. ఇంకా ఇఖామత్ కోసం నిరీక్షించే వ్యక్తి గురించి.**

**597.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని, అబ్దుల్లా బిన్ ముగఫ్ఫల్ (రజిఅన్) ఉల్లేఖించారు; ప్రతి అజాన్, ఇఖామత్‌ల మధ్య ఎవరైనా తాము ఇష్టపడితే రెండు రకాతుల నఫిల్ నమాజు చేసుకోవచ్చు. ఈ విషయాన్ని దైవప్రవక్త (స) మూడు సార్లు అన్నారు.[1]

**598.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ముఅజ్జిన్ అజాన్ ఇచ్చినప్పుడు (మహాప్రవక్త (స) గారి కాలంలో) దైవప్రవక్త (స) గారి సహచరులు (సహాబా) మసీదులోని స్తంభాల వైపునకు వెళ్లేవారు. ఆయన (స) గారు వచ్చే వరకు సున్నత్ నమాజులు చేసుకుంటూ అక్కణ్ణే గడిపేవారు. మగ్రిబ్ నమాజుకు ముందు కూడా వారు రెండు రకాతుల సున్నత్ నమాజు చేసేవారు. ఇంకా అజాన్‌కూ, ఇఖామత్‌కూ మధ్య అంత ఎక్కువ వ్యవధి ఉండేది కాదు. షూబా ఇలా అన్నారు; అజాన్‌కూ, ఇఖామత్‌కూ మధ్య కొంచెం సమయం మాత్రమే ఉండేది.

## 15వ అధ్యాయం

**అజాన్ పిలుపు విని ఇఖామత్ కోసం ఇంట్లో నిరీక్షిస్తూ ఉండటం.**

**599.** హజ్రత్ ఆయెషా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఉదయపు ఫర్జ్ నమాజుకు ముందు, ముఅజ్జిన్ అజాన్ ఇవ్వటం పూర్తి చేసిన తరువాత, రెండు రకాతుల తేలికపాటి (సున్నత్) నమాజును చేసేవారు. ఆ తరువాత ఆయన (సఅసమ్) తన కుడి వైపునకు తిరిగి పడుకునేవారు. ముఅజ్జిన్ ఇఖామత్ ఇచ్చే వరకు ఆయన ఆ స్థితిలోనే ఉండేవారు.

## 16వ అధ్యాయం

**రెండు పిలుపుల మధ్య అంటే అజాన్‌కూ, ఇఖామత్‌కూ మధ్య కోరిన వారు రెండు రకాతుల (నఫిల్) నమాజు చేసుకోవచ్చు.**

**600.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అబ్దుల్లా బిన్ ముగఫ్ఫల్ (రజిఅన్) ఉల్లేఖించారు; "రెండు అజానుల మధ్య (అజాన్ మరియు ఇఖామత్) ఒక నమాజు ఉన్నది. రెండు అజానులకు మధ్య (అజాన్,

---

597-1. ఇమామ్ అహ్మద్ గారి హదీసులో అదనంగా ఇలా ఉంది; ఇఖామత్ అయిన తరువాత ఫర్జ్ నమాజు తప్ప మరొక నమాజు ఏదీ లేదు.

**ఇఖామత్‌లకు మధ్య) ఒక నమాజు ఉన్నది. మూడోసారి కూడా ఆయన (స) అలానే అంటూ అదనంగా ఇలా అన్నారు; నమాజు చెయ్యటానికి ఇష్టపడే వ్యక్తి కోసం."**

## 17వ అధ్యాయం

### నివాసంలో ఉన్నప్పుడు మాదిరిగానే ప్రయాణంలో ఒకే ఒక మనిషి అజాన్ ఇవ్వాలి.[1]

**601. మాలిక్ బిన్ హువైరిస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; "ఒకసారి నేను నా తెగకు చెందిన (బనీ లైస్ తెగ) కొంతమంది మనుషుల్ని తీసుకుని దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్)గారి వద్దకు వెళ్లాను. ఆయన (స) గారి దగ్గర ఇరవై రాత్రులు గడిపాము. ఆయన (స) దయార్ద్ర హృదయులు, కలుపుగోలుతనం గల మనిషి. ఇక మేము మా ఇళ్లకు వెళ్లిపోవాలని కోరుకుంటున్నామనే విషయాన్ని గ్రహించిన ఆయన(స) మాతో ఇలా అన్నారు; "ఇక మీరు మీ గృహాలకు వెళ్లిపోవచ్చు. మీ తెగ ప్రజల మధ్య ఉంటూ వారికి ధార్మిక విషయాలను నేర్పుతూ ఉండండి. (ప్రయాణంలో ఉన్నప్పుడు) నమాజు చేస్తూ ఉండండి. నమాజు వేళ అయినప్పుడు మీలోని ఒక మనిషి అజాన్ ఇవ్వాలి. ఇంకా మీలో ఎవరైతే పెద్దవారో ఆయన నమాజుకు నేతృత్వం వహించాలి.[1]**

## 18వ అధ్యాయం

### ప్రయాణీకుల సంఖ్య పెద్దదిగా ఉన్నట్లయితే అప్పుడు నమాజు కోసం అజాన్ ఇవ్వాలి, ఇఖామత్ కూడా చెప్పాలి. అరఫాత్ మైదానంలోనూ, ముజ్‌దలిఫాలో

---

17-1. చాలా మంది ముఅజ్జిన్‌లు ఒకేసారి అజాన్ ఇవ్వటం అనే పద్ధతి బనీ ఉమయ్యా ప్రవేశపెట్టిన బిద్అత్ (ధర్మంలో లేని కొత్త విషయం, నూతన సంప్రదాయం). ఒకవేళ పట్టణం పెద్దది అయినట్లయితే అప్పుడు వంతుల వారీగా చాలా మంది ముఅజ్జిన్‌లు అజాన్ ఇవ్వవచ్చు అది దోషం కాదు. హాఫిజ్ (ఇబ్నెహజర్) గారు ఇలా అన్నారు; మసీదు గనక పెద్దది అయినట్లయితే, అప్పుడు మసీదు యొక్క ప్రతి మూల నుంచి ఒక్కొక్క ముఅజ్జిన్, ఒకే సమయంలో అజాన్ ఇవ్వవచ్చు. కొందరేమన్నారంటే, ఈ అధ్యాయాన్ని ఇక్కడ పెట్టటంలో ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారి ఉద్దేశ్యం ఏమిటంటే; ప్రయాణంలో ఉన్నప్పుడు ఉదయం నమాజులో కూడా ఒకే అజాన్ ఇవ్వాలి అని చెప్పటం. అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ప్రయాణంలో ఉన్నప్పుడు కూడా ఉదయం నమాజు కోసం రెండు అజాన్‌లు ఇచ్చేవారు. ఈ విషయాన్ని అబ్దుర్రజాక్ ఉల్లేఖించారు.

601-1. అంటే మీలో వయస్సులో ఎవరైతే పెద్దవారో వారు అన్నమాట. ఎందుకంటే, వారందరూ ధర్మజ్ఞానం విషయంలో సమానులే. వారందరూ దైవప్రవక్త (స) గారి

**కూడా ఇదే విధంగా అజానూ ఇవ్వాలి, ఇఖామతూ చెప్పాలి.[1] చలి ఎక్కువగా ఉన్న రాత్రిగానీ లేదా వర్షం ఎక్కువగా కురుస్తున్న రాత్రి గానీ, ముఅజ్జిన్ 'మీ మీ నివాసాలలోనే నమాజులు చేసుకోండి' అని పలకాలి.**

**602.** అబూజర్ గిఫ్ఫారీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి మేము దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసం) గారితో ప్రయాణం చేస్తూ ఉన్నాము. ముఅజ్జిన్ జుహ్ర్ నమాజుకు వేళ అయిందని అజాన్ ఇవ్వబోయాడు. కాని మహాప్రవక్త (స) అతన్ని వారించి కొంచెం చల్లబడనివ్వు అని చెప్పారు. కొంచెం సేపటి తరువాత ముఅజ్జిన్ మళ్ళీ అజాన్ ఇవ్వటానికి ఉద్యుక్తుడయ్యాడు. దైవప్రవక్త (స) గారు అతన్ని మళ్ళీ వారిస్తూ పై విధంగానే ఆజ్ఞాపించారు. కాసేపటి తరువాత అతను అజాన్ ఇవ్వటానికి లేచి నిలబడ్డాడు. మళ్ళీ దైవప్రవక్త (స) అతన్ని వారించి పై విధంగానే సెలవిచ్చారు. చివరకు చిన్న చిన్న గుట్టల నీడలు వాటి ఎత్తులకు సరిసమానమై పోయాయి. ఆ తరువాత దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు; (చూడండి!) నరకజ్వాలల సెగ వల్లనే ఉష్ణోగ్రత పెరుగుతుంది.

**603.** మాలిక్ బిన్ హువైరిస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఇద్దరు వ్యక్తులు (స్వయంగా మాలిక్ (ర) మరియు అతని మిత్రుడు ఒకాయన) దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) వద్దకు వెళ్లారు. వారు ఉభయులూ ఒక ప్రయాణం చెయ్యదలిచారు. ఈ విషయాన్ని గురించే వారు మహాప్రవక్త (సఅసమ్)కు తెలియజేశారు. అప్పుడు ఆయన (స) గారు వారికి ఇలా ఉపదేశించారు; "మీరు ప్రయాణంలో ఉన్నప్పుడు మార్గమధ్యంలో నమాజు కోసం అజాన్ ఇవ్వండి.[1] తరువాత ఇఖామత్ చెప్పండి. మీలో ఎవరైతే వయస్సులో పెద్దవారో ఆయన నమాజుకు నాయకత్వం వహించాలి."

**604.** మాలిక్ బిన్ హువైరిస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; మేము మా దేశం నుంచి మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) వద్దకు వెళ్ళాము. మేమందరమూ

---

వద్ద ఇరవై రోజులు ఉన్నవారే. ఇంకా మీరు ఇక్కణ్ణుంచి బయలుదేరిన తరువాత ప్రయాణంలో ఉన్నప్పుడు అజాన్ ఇవ్వండి.

18-1. అంటే, హజ్ యాత్రలో ఉన్నప్పుడు కూడా అరఫాత్‌లోనూ, ముజ్దలిఫాలోనూ అజానూ ఇవ్వాలి, ఇఖామతూ చెప్పాలి.

603-1. శబ్దానువాదం ఇలా ఉంది; మీరు ఉభయులూ అజాన్ ఇవ్వండి. మీరు ఉభయులూ ఇఖామత్ చెప్పండి. కాని భావం ఏమిటంటే, మీ ఉభయుల్లో ఎవరో ఒకరు అజాన్ ఇవ్వాలి. ఎవరో ఒకరు నమాజుకు నాయకత్వం వహించాలి.

**యువకులమే. దాదాపు ఒకే వయస్సుకు చెందినవారము. ఆయన (స) గారితో మేము ఇరవై దినాల వరకు ఉన్నాము. ఆయన (స)గారు అత్యంత దయామయులు, ఎంతో కలుపుగోలుతనం ఉన్న వ్యక్తి. మేము మా ఇళ్లకు తిరిగి వెళ్లాలని కోరుకుంటున్నామనే విషయాన్ని ఆయన (స) గారు పసిగట్టారు. అప్పుడు ఆయన (స) మమ్మల్ని ఇంటి దగ్గర ఎవరెవరిని విడిచివచ్చారని అడిగారు. మేము ఆయన (స) గారికి ఆ విషయాలను గురించి వివరించాము. అప్పుడు ఆయన (స) గారు ఇలా సెలవిచ్చారు; "మంచిది, ఇక మీరు మీ గృహాలకు వెళ్లండి. మీవారి మధ్యనే ఉండండి. వారికి ధార్మిక విషయాలను నేర్పండి. ఇంకా మంచి పనులు చెయ్యమని వారికి ఆజ్ఞాపించండి". దైవప్రవక్త (స) ఇతర విషయాలు కూడా చెప్పారు. కాని నేను వాటిని మరచి పోయాను. దైవప్రవక్త (స) ఇంకా ఇలా బోధించారు; నేను ఎలా నమాజ్ చేస్తూ ఉండగా మీరు చూశారో అలానే మీరు కూడా నమాజు చేస్తూ ఉండండి. ఇంకా నమాజుకు వేళ అయినప్పుడు మీలోని ఒకరు అజాన్ ఇవ్వండి. మీలోని పెద్దవారు నమాజుకు నాయకత్వం వహించండి.**

**605. నాఫె ఇలా ఉల్లేఖించారు; ఒకసారి ఒక చల్లని రాత్రి అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) జజ్నాన్[1]లో అజాన్ ఇచ్చారు. తరువాత ఆయన ఇలా అన్నారు; "మీ మీ నివాసాలలోనే నమాజు చేసుకోండి." ఆయన (ర) మాతో ఇంకా ఇలా అన్నారు; దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) అజాను ఇవ్వమని ముఅజ్జిన్‌కు ఆజ్ఞాపించే వారు. చివర్లో ఇలా పలకమని కూడా ఆజ్ఞాపించేవారు; "ప్రజలారా! మీ మీ నివాసాలలోనే నమాజులు చేసుకోండి." దైవప్రవక్త (స) చలి విపరీతంగా ఉన్న రాత్రుల్లోనూ, వర్షం కురిసే రాత్రుల్లోనూ, ప్రయాణంలో ఉన్నప్పుడు ఇలా చేసేవారు.[2]**

**606. తన తండ్రిగారైన అబూ జుహైఫా ఇలా చెప్పారని ఔన్ బిన్ అబూ జుహైఫా ఉల్లేఖించారు; నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారిని 'అబ్తహ్' అనే స్థలం వద్ద చూశాను. బిలాల్ (రజిఅన్) వచ్చి మహాప్రవక్త (స) గారికి నమాజును గురించి చెప్పారు. ఆ తరువాత బిలాల్ (ర) తనతోపాటు**

---

605-1. జజ్నాన్ ఒక పర్వతం పేరు. అది మక్కా పట్టణానికి ఇరవై ఐదు మైళ్ల దూరంలో ఉంది.

605-2. ఈ హదీసు ద్వారా తెలిసే విషయం ఏమిటంటే, వర్షంగానీ, చలిగానీ ఎక్కువగా ఉన్నప్పుడు లేదా తుఫాను పరిస్థితి నెలకొన్నప్పుడు, జమాఅత్‌తో సామూహికంగా నమాజు చెయ్యలేకపోవటం క్షమార్హమైన విషయమే.

ఒక కర్ర తీసుకువచ్చి దానిని దైవప్రవక్త (స) గారి ముందు (ఆయన (స) గారు నమాజు చెయ్యదలచుకున్న స్థలం) అబ్తహ్[1]లో పాతిపెట్టారు. ఆ తరువాత నమాజు కోసం ఇఖామత్ చెప్పారు.

## 19వ అధ్యాయం

**అజాన్ ఇచ్చేటప్పుడు ముఅజ్జిన్ తన ముఖాన్ని అటూ ఇటూ (కుడి, ఎడమ ప్రక్కలకు) త్రిప్పే అవసరం ఉందా? ఇంకా అజాన్ ఇచ్చేటప్పుడు ముఅజ్జిన్ అటూ ఇటూ చూడవచ్చునా?**

**హజ్రత్ బిలాల్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఆయన (ర) అజాన్ ఇచ్చే సమయంలో తన రెండు వ్రేళ్ళను రెండు చెవుల్లో పెట్టుకునేవారు. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) గారు మాత్రం అజాన్ ఇచ్చే సమయంలో వ్రేళ్ళను తన చెవుల్లో పెట్టుకునేవారు కాదు. ఇబ్రాహీమ్ నఖ్యీ గారు ఇలా అన్నారు; "వుజూ లేకుండా అజాన్ ఇవ్వటం దోషం కాదు. అతాగారు ఇలా అన్నారు; అజాన్ ఇచ్చే టప్పుడు వుజూ చేసిన స్థితిలో ఉండటం చాలా అవసరం మరియు అది దైవప్రవక్త (సఅసమ్) గారి సంప్రదాయం కూడా. హజ్రత్ ఆయెషా (రజిఅన్) ఇలా అన్నారు; "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) అన్ని సమయాలలో అల్లాహ్ పవిత్ర నామాన్ని స్మరించేవారు."[1]**

**607.** తన తండ్రి గారైన అబూ జుహైఫా ఇలా చెప్పారని ఔన్ బిన్ జుహైఫా ఉల్లేఖించారు; నమాజు కోసం అజాన్ ఇస్తూ హజ్రత్ బిలాల్ (రజిఅన్) తన ముఖాన్ని ఒక ప్రక్క నుంచి మరొక ప్రక్కకు త్రిప్పటాన్ని నేను చూశాను.[1]

---

606–1. అబ్తహ్, మక్కా పట్టణం వెలుపల ఉన్నటువంటి ఒక ప్రఖ్యాతిగాంచిన ప్రదేశం.

19–1. ఈ హదీసు ద్వారా ఇమామ్ బుఖారీ (రహ్మలై) గారు నిరూపించిన విషయం ఏమిటంటే– వుజూ లేని స్థితిలో అజాన్ ఇవ్వవచ్చు. ఎందుకంటే అది కేవలం ఒక స్మరణ మాత్రమే. కనుక అందులో వుజూ అవసరమూ లేదు. ఖిబ్లా వైపునకు ముఖం త్రిప్పే అవసరమూ లేదు.

607–1. హయ్అలతైన్ (హయ్యా అలస్సలాహ్, హయ్యా అలల్ఫలాహ్) పలికే సమయంలో ముఅజ్జిన్ కేవలం తన ముఖాన్ని మాత్రమే కుడి, ఎడమల దిక్కులకు త్రిప్పాలి. తన రొమ్మును త్రిప్పకూడదు. కుడి వైపునకు తన ముఖాన్ని పెట్టి హయ్యా

## 20వ అధ్యాయం

**ఒక వ్యక్తి ఇలా అనటం గురించి; మేము మా నమాజును పోగొట్టుకున్నాము ఇబ్నె సీరీన్ ఇలా అనటాన్ని మక్రూహ్‌గా అంటే అసహ్యకరమైనదిగా భావించారు. ఆయన ఇలా అనాలి అని సెలవిచ్చారు; "మేము నమాజును పొందలేకపోయాము. కాని దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) సూక్తి సరైనది, సత్యమైనది.[1]**

**608.** తన తండ్రిగారైన అబూ ఖతాద హారిస్ బిన్ రబయి (ఒక సహాబి) ఇలా అన్నారని అబ్దుల్లా బిన్ అబీ ఖతాదా (రజిఅన్) ఉల్లేఖించారు; ఒకసారి మేము దైవ ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారితో కలిసి నమాజు చేస్తూ ఉన్నాము. ఇంతలో ఆయన (స) గారు కొంతమంది ప్రజలు పరుగెత్తుకుంటూ వస్తూ ఉన్న ధ్వనిని విన్నారు. నమాజు పూర్తి అయిన తరువాత ఆయన (స) గారు, "ఈ ధ్వని ఎక్కణ్ణుంచి వచ్చింది?" అని అడిగారు. అప్పుడు మేము, "కొందరు ప్రజలు నమాజు కోసం పరుగెత్తుకుంటూ వచ్చారు" అని సమాధానం చెప్పాము. ఆయన(స) ఇలా సెలవిచ్చారు; "ఇక ముందు అలా చెయ్యకండి. మీరు నమాజు కోసం వచ్చేటప్పుడు ప్రశాంతంగా, నిశ్శబ్దంగా రండి. ఎంత నమాజు దొరికతే అంత నమాజు ఇమామ్ గారితో కలిసి చెయ్యండి. ఇంకా ఎంత నమాజైతే పోతుందో[1] అంత నమాజును ఇమామ్ గారు సలామ్ చేసిన తరువాత పూర్తి చేసుకోండి."

---

అలస్సలాహ్ అని ఒకసారి పలకటం, ఎడమ వైపునకు ముఖాన్ని పెట్టి అదే విధంగా ఒకసారి హయ్యా అలల్‌ఫలాహ్ అని పలకటం ఉత్తమమైనది. కొంత మంది ఏమన్నారంటే, కుడి వైపునకు ముఖాన్ని త్రిప్పి హయ్యా అలస్సలాహ్ అని రెండుసార్లు పలకాలి. తరువాత ఎడమ వైపునకు ముఖాన్ని త్రిప్పి రెండు సార్లు హయ్యా అలల్‌ఫలాహ్ అని పలకాలి. ఎలా పలికినా ధర్మసమ్మతమే.

20-1. ఇబ్నె సీరీన్ గారి 'అసర్'ను అంటే హదీసును ఇబ్నె అబీ షైబాగారు 'వసల్' (కలపటం) చేశారు. కాగా; ఇమామ్ బుఖారీ (రహ్మలై) గారు ఇబ్నె సీరీన్ గారి అభిప్రాయాన్ని ఖండించారు. హదీసులో 'మేము నమాజును పోగొట్టుకున్నాము' అనే విషయం ఉన్నప్పుడు ఇబ్నె సీరీన్ గారు దానిని మక్రూహ్ (అయిష్టమైనది) అని అనటం సరైన విషయం కాబోదు. ఇబ్నె సీరీన్ గారు తాబయీన్‌లోని వారు కావచ్చు గాక! అయితే దైవప్రవక్త (స) గారి సూక్తి అన్నిటికంటే ముఖ్యమైనది, సత్యమైనది. తాబయీ కాని సహాబీ కాని ఎవరి సూక్తి అయినా సరే హదీసు కంటే గొప్పది కాజాలదు.

608-1. అధ్యాయంలోని ప్రధానాంశం ఇక్కణ్ణే లభిస్తుంది. ఎందుకంటే, దైవప్రవక్త

## 21వ అధ్యాయం

**ఎంత నమాజైతే దొరుకుతుందో అంత నమాజును చేసుకోండి. ఎంత నమాజైతే దొరకకుండా పోతుందో అంత నమాజును తరువాత పూర్తి చేసుకోండి. దైవ ప్రవక్త మహాశయులు (ముహమ్మద్ (సఅసమ్) ఈ విషయాన్ని సెలవిచ్చారని అబూ ఖతాదా (రజి) ఉల్లేఖించారు.[1]**

**609.** దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని, హజ్రత్ అబూహురైరా[1] (రజిఅన్) ఉల్లేఖించారు; "మీరు ఇఖామత్ విన్నప్పుడు, నమాజు కోసం మామూలుగా నడిచే నడకను నడుస్తూ రండి. మెల్లగా, ప్రశాంతంగా నడుస్తూ రండి. ఇలా రావటాన్ని మీపై విధిగా చేసుకోండి. పరుగెత్తుకుంటూ రాకండి. ఎంత నమాజు దొరికితే అంత నమాజు చేసుకోండి. ఎంత నమాజైతే దొరక్కుండా పోతుందో అంత నమాజును తరువాత పూర్తి చేసుకోండి."

## 22వ అధ్యాయం

**ఇఖామత్ అయ్యేటప్పుడు ప్రజలు ఇమామ్‌ను చూసినట్లయితే, వారు నమాజు కోసం ఎప్పుడు లేచి నిలబడాలి?**

**610.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని, తన తండ్రి గారైన అబూ ఖతాదా (రజిఅన్) చెప్పారని అబ్దుల్లా బిన్ అబీ ఖతాద ఉల్లేఖించారు; నమాజు కోసం ఇఖామత్ చెప్పబడినప్పుడు మీరు (మీ ముందు) నన్ను చూడనంత వరకు నమాజు కోసం నిలబడబాకండి.[1]

---

(సఅసమ్) ఎంత నమాజు పోతుందో అనే పదాలు సెలవిచ్చారు. అలా అనటం మక్రూహ్ (అసహ్యాకరమైనది) అయితే ఆయన (స) గారు అలా ఎన్నటికీ అనరు.

21-1. ఈజిప్టులోని ఒక హదీసు గ్రంథంలో ఈ అధ్యాయం తరువాత అదనంగా ఈ విషయం వ్రాయబడి ఉన్నది; "లాయస్‌అ ఇలస్సలాతి వల్‌యఅతి బిస్సకీనతి వల్ వఖారి వఖాల" అంటే "నమాజు కోసం పరుగెత్తబాకండి. మెల్లగా, హుందాగా రండి" అని దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారు సెలవిచ్చారు.

609-1. జుహ్రీ గారు ఈ హదీసును ఇద్దరు వ్యక్తుల నుంచి విన్నారు. ఒకరేమో సయీద్ బిన్ ముసైబ్ అయితే, రెండో వ్యక్తి అబూ సలమా. వారు ఉభయులూ హదీసును అబూ హురైరా (రజిఅన్) చెప్పగా విన్నారు.

610-1. ఈ సమస్య విషయంలో ఎన్నో అభిప్రాయాలు ఉన్నాయి. షాఫయీ (రహ్మాలై) గారు ఏమంటారంటే; ఇఖామత్ చెప్పటం పూర్తి అయిన తరువాతనే ముఖ్తదీలు

## 23వ అధ్యాయం

**నమాజు కోసం తొందర తొందరగా లేచి నిలబడకూడదు. ప్రశాంతంగా, హుందాగా లేచి నిలబడాలి.**

**611.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని, తన తండ్రిగారైన అబూ ఖతాదా హారిస్ బిన్ రబీ చెప్పారని అబ్దుల్లా బిన్ అబీ ఖతాదా (రజిఅన్) ఉల్లేఖించారు; నమాజు కోసం ఇఖామత్ చెప్పినప్పుడు మీరు నన్ను చూడ నంత వరకు లేచి నిలబడబాకండి. ఇంకా నెమ్మదిగా నిలబడటాన్ని విధిగా చేసు కోండి.

## 24వ అధ్యాయం

**అవసరమైనప్పుడు ఒక వ్యక్తి అజాన్ తరువాత గానీ లేదా ఇఖామత్ తరువాత గానీ మసీదులో నుంచి బయటికి వెళ్లవచ్చు.**

**612.** హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) తమ హుజ్రా (కుటీరం)లో నుంచి నమాజు చేయించటానికి బయటికి వచ్చారు. నమాజుకు సంబంధించిన ఇఖామత్ అయి పోయింది, పంక్తులు సరిచేయబడ్డాయి. అప్పుడు దైవప్రవక్త (స) తన నమాజు స్థలంలో నిలబడి ఉన్నారు. ఇక ఆయన (స) తక్బీర్ పలుకుతారేమో అని మేము ఎదురు చూస్తున్నాము. కాని ఆయన (స) వెనుతిరిగి తన గదిలోకి వెళ్ళిపోయారు. మరియు ఇలా సెలవిచ్చారు; "మీరు ఇలాగే ఆగి ఉండండి." అదే స్థితిలో మేము నిలబడి ఉన్నాము. చివరకు ఆయన (స) తిరిగి వచ్చారు. ఆయన (స) గారి పవిత్ర

---

నమాజు కోసం నిలబడాలి. ఇమామ్ మాలిక్ (రహ్మాలై) గారి అభిప్రాయం ఏమిటంటే; నమాజు కోసం ఇఖామత్ చెప్పటం ప్రారంభం కాగానే ముఖ్తదీలు నిలబడాలి. ఇమామ్ అబూ హనీఫా (రహ్మాలై) గారు ఇలా అన్నారు; ముఅజ్జిన్ 'హయ్యా అలస్ సలాహ్' అని పలికినప్పుడు ముఖ్తదీలు లేచి నిలబడాలి. ఇంకా ముఅజ్జిన్ 'ఖద్ఖామతి స్సలాహ్' అని పలికినప్పుడు, ఇమామ్ 'అల్లాహు అక్బర్' అని నమాజును ప్రారంభిం చాలి. ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రెహ్మాలై) గారు ఇలా సెలవిచ్చారు; ముఅజ్జన్ హయ్యా అలస్సలాహ్ అని పలికినప్పుడు ముఖ్తదీలు లేచి నిలబడాలి. ఇమామ్ బుఖారి (రెహ్మాలై) గారు ఈ హదీసును ఇక్కడ ఉదాహరించి ఒక విషయాన్ని సూచిం చారు. ఇమామ్ మసీదులో లేనప్పుడు, ఇమామ్‌ను చూడనంత వరకు ముఖ్తదీలు నమాజు కోసం నిలబడరాదు.

మైన శిరస్సులో నుంచి నీటి బిందువులు రాలుతున్నాయి. ఆయన (స) గుసుల్ చేసు కొని వచ్చారు.[1]

## 25వ అధ్యాయం

**ఒకవేళ ఇమామ్ ముఖ్తదీలతో, నేను తిరిగి వచ్చే వరకు మీరు ఇక్కణ్ణే ఆగి ఉండండి అని చెప్పినట్లయితే అప్పుడు ముఖ్తదీలు ఆయన కోసం నిరీక్షించవలసి ఉంటుంది.**

**613.** హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; నమాజుకు చెందిన ఇఖామత్ అయిపోయింది. ప్రజలు పంక్తులను సరిచేసుకున్నారు. దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) తమ హుజ్రా (కుటీరం)లో నుంచి బయటికి వచ్చారు. ఇమామత్ చెయ్యటానికి ఆయన (స) ముందుకు వెళ్లారు. కాని ఆయన (స) గుసుల్ చేసుకోవలసిన అవసరం ఉంది గాని అది ఆయన గారికి జ్ఞాపకం లేదు. తరువాత జ్ఞాపకం వచ్చింది. అప్పుడు ఆయన (స) ఇలా సెలవిచ్చారు; "మీరు ఇలాగే ఆగి ఉండండి." తరువాత ఆయన (స) తిరిగి వెళ్లిపోయారు. గుసుల్ చేసుకున్న తరువాత మళ్లీ బయటకు వచ్చారు. ఆయన (స) గారి శిరస్సులో నుంచి నీటి బిందువులు రాలుతున్నాయి. అప్పుడు ఆయన (స) ప్రజలకు నమాజు చేయించారు.

## 26వ అధ్యాయం

**ఎవరైనా ఒక మనిషి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారితో, మేము నమాజు చెయ్యలేదు అని అంటే, అందులో ఎలాంటి దోషమూ లేదు.[1]**

**614.** జాబిర్ బిన్ అబ్దుల్లా అన్సారీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు : కందకం రోజున (కందక యుద్ధం నాడు) హజ్రత్ ఉమర్ (రజిఅన్) దైవప్రవక్త మహాశయులు

---

612-1. విషయం ఏమిటంటే, దైవప్రవక్త (సఅసమ్) గారికి జనాబత్ అయి గుసుల్ చేసుకునే అవసరం కలిగింది. కాని ఆ విషయం ఆయన (స) గారికి జ్ఞాపకం లేదు. ఈ కారణంగా ఆయన (స) గుసుల్ చేసుకోకుండానే నమాజు కోసం మసీదులోకి వచ్చారు. నమాజు ప్రారంభించబోయే కీలక సమయంలో ఈ విషయం జ్ఞాపకం వచ్చింది. ఈ హదీసు ద్వారా ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారు ఆవిష్కరించిన విషయం ఏమిటంటే, అజాన్ గానీ, ఇఖామత్ గానీ అయిపోయిన తరువాత కూడా ఒక మనిషి ఏదైనా అవసరం వచ్చినప్పుడు నమాజు చెయ్యకుండానే మసీదులో నుంచి బయటికి వెళ్లవచ్చు.

26-1. ఈ అధ్యాయాన్ని ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారు ఇక్కడ ఆవిష్కరించి ఇబ్రాహీమ్ నఖయీ గారి అభిప్రాయాన్ని ఖండించారు. 'మేము నమాజు చెయ్యలేదు' అని చెప్ప

**ముహమ్మద్ (సఅసమ్) గారి వద్దకు వచ్చి ఇలా విన్నవించుకున్నారు; "ఓ దైవప్రవక్తా (స)! అల్లాహ్ సాక్షిగా చెబుతున్నాను; నేను సూర్యాస్తమయ సమయం సమీపించే వరకు అస్ర్ నమాజును చెయ్యలేకపోయాను." హజ్రత్ ఉమర్ (రజిఅన్) గారు ఈ విషయాన్ని ఉపవాస విరమణ సమయం (ఇఫ్తార్ సమయం) ఆసన్నమైనప్పుడు దైవప్రవక్త (స)కు తెలియజేశారు. అప్పుడు దైవప్రవక్త (సఅసమ్) ఇలా సెలవిచ్చారు; (నీవైతే చివరి సమయంలోనైనా నమాజు చేశావు) దైవసాక్షిగా చెబుతున్నాను! నేనైతే ఇంతవరకు అసర్ నమాజును చెయ్యనేలేదు. దీని తరువాత ఆయన (స) గారు 'బుత్హాన్'[1]కు వెళ్ళి అక్కడ దిగిపోయారు. నేను కూడా ఆయన (స) గారితోనే ఉన్నాను. తరువాత ఆయన (స) గారు వుజూ చేసుకుని అసర్ నమాజును చేశారు. అప్పుడు సూర్యుడు అస్తమించాడు. ఆ తరువాత ఆయన (స) గారు మగ్రిబ్ నమాజు చేశారు.**

## 27వ అధ్యాయం

### ఇఖామత్ చెప్పిన తరువాత ఒకవేళ నమాజు చేయించే ఇమామ్ గారికి దేని గురించి అయినా అవసరం కలిగితే.

**615.** అనస్ బిన్ మాలిక్ (రజిఅన్ ) ఇలా ఉల్లేఖించారు; ఇషా నమాజుకు సంబంధించిన ఇఖామత్ చెప్పటం అయిపోయింది. దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) మసీదులోని ఒక  మూలలో నిలబడి ఎవరితోనో ఏదో విషయం గురించి మెల్లగా, రహస్యంగా మాట్లాడుతూ ఉన్నారు. ఆయన (స) నమాజును ఇంకా ప్రారంభించనేలేదు. చివరకు కొందరు నిదురపోయారు.[1]

## 28వ అధ్యాయం

### ఇఖామత్ చెప్పే సమయంలో ఎవరితోనైనా మాట్లాడటం గురించి.

**616. హుమైద్ తవీల్ ఇలా ఉల్లేఖించారు; నేను ఒకసారి సాబిత్ బునానీని ఇలా అడిగాను; ఇఖామత్ చెప్పటం పూర్తి అయిన తరువాత ఎవరైనా, ఎవరితోనైనా**

---

టాన్ని ఇబ్రాహీమ్ నఖయీ గారు మక్రూహ్ (అయిష్టమైనది)గా భావించారు. హాఫిజ్ గారు ఏమన్నారంటే; ఇబ్రాహీమ్ గారి ఈ సూక్తి నమాజు కోసం ఇంకా నిరీక్షిస్తూ ఉన్నటువంటి వ్యక్తికే వర్తిస్తుంది. ఎందుకంటే అతను నమాజులో ఉన్నట్లే లెఖ్ఖ.

614-1. మదీనా పట్టణంలోని ఒక లోయ పేరు 'బుత్హాన్'.

615-1. నిదురపోవటం అంటే ఇక్కడ కునికిపాట్లు పడటం అని భావం. ఇబ్నె హిబ్బాన్

**మాట్లాడటం ధర్మసమ్మతమేనా? అప్పుడు ఆయన అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) గారి హదీసును నాకు వినిపించారు; ఒకసారి దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారి కాలంలో, నమాజు కోసం ఇఖామత్ చెప్పటం పూర్తి అయింది. అప్పుడు దైవప్రవక్త(స) ముందుకు ఒక వ్యక్తి వచ్చి నిలబడ్డాడు. ఇఖామత్ చెప్పటం పూర్తి అయిన తరువాత ఆ వ్యక్తి దైవప్రవక్త (స) గారితో మాట్లాడుతూ కొంచెం సేపటి వరకు ఆయన్ని (స) నిలువరించాడు.**

## 29వ అధ్యాయం

**జమాఅత్‌తో కలిసి సామూహికంగా నమాజు చెయ్యటం విధి (అంటే తప్పనిసరి). ఇమామ్ హసన్ బస్రీ (రహ్మాలై) ఇలా అన్నారు; ఒకవేళ కన్నతల్లి ప్రేమతో, అనురాగంతో తన కుమారుణ్ణి ఇషా నమాజుకు పోకుండా ఆపినట్లయితే అప్పుడు కుమారుడు ఆమె మాటల్ని వినకూడదు.[1]**

**617.** దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని, హ్జ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు: ఏ దేవుని చేతుల్లోనైతే నా ప్రాణం ఉందో ఆ దేవునిపై ప్రమాణం చేసి చెబుతున్నాను: నేను ఇలా చెయ్యాలని అను కున్నాను, కట్టెలు పోగు చెయ్యమని ఆజ్ఞాపించి, తరువాత నమాజు కోసం రమ్మని ఆజ్ఞాపించదలిచాను. ఆ తరువాత దాని కోసం అజాన్ ఇవ్వమనీ, సామూహిక నమాజుకు నాయకత్వం వహించమని ఒక వ్యక్తికి చెప్పి, వారందరినీ అక్కడ వదిలి పెట్టి ఈ నమాజులో హాజరు కానటువంటి ప్రజల వద్దకు వెళ్లి ఇండ్లకు నిప్పుపెట్టి[1] దహనం చేద్దామని సంకల్పించాను. ఇంకా ఏ దేవుని చేతుల్లోనైతే నా ప్రాణం ఉన్నదో; ఆ దేవుని సాక్షిగా చెబుతున్నాను. జమాఅత్‌తో కలిసి నమాజు చెయ్యటానికి రాని

---

గారు మరియు ఇస్‌హాఖ్ బిన్ రాహ్వాయ గారు తమ ఉల్లేఖనాలలో కొందరు ప్రజలు కునుకులు తీయసాగారు అని ఉల్లేఖించారు.

29-1. ఎందుకంటే జమాఅత్‌తో కలిసి సామూహికంగా నమాజు చెయ్యటం విధి, తప్పకుండా నిర్వహించవలసిన కర్తవ్యం. విధిని కాదని తల్లికి విధేయత చూపటం ధర్మశాస్త్ర సమ్మతం కాదు. ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్, అబూ సూర్ ఇబ్నె ఖుజైమా గార్ల అభిప్రాయం ప్రకారం, అహ్లె హదీస్ జమాఅత్ వారి అభిప్రాయం ప్రకారం జమాఅత్‌తో కలిసి నమాజు చెయ్యటం ఫర్జె ఐన్ అంటే తప్పనిసరిగా, విధిగా చెయ్య వలసిన పని. కొందరు ఏమన్నారంటే, జమాఅత్‌తో కలిసి నమాజు చెయ్యటం అనేది నమాజు యొక్క అత్యవసరమైన షరతు, అనుల్లంఘనీయమైన నిబంధన.

ప్రజలలో ఎవరికైనా, మాంసంతో కలిగి ఉన్న ఒక లావుపాటి ఎముక లేక రెండు కాలిగిట్టలు (మంచివి) దొరుకుతాయి అనే విషయం తెలిస్తే, వారు తప్పకుండా ఇషా నమాజులో పాల్గొంటారు.

## 30వ అధ్యాయం

### జమాఅత్‌తో కలిసి సామూహికంగా నమాజు చేసే దాని ఔన్నత్యం.

**ఒకసారి అస్వద్ బిన్ యజీద్ నఖయీ గారికి ఒక మసీదులో జమాఅత్ దొరక్కపోతే ఆయన మరొక మసీదుకు వెళ్ళారు.[1] ఇంకా ఒకసారి అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఒక మసీదుకు వెళ్ళారు. కాని అక్కడ సామూహిక నమాజు అయిపోయింది. ఆయనకు జమాఅత్ దొరకలేదు. అప్పుడు ఆయన అజాన్ ఇచ్చారు, ఇఖామత్ చెప్పారు. జమాఅత్‌తో నమాజు చేశారు.[2]**

**618.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని, హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఉల్లేఖించారు; జమాఅత్‌తో కలిసి నమాజు చెయ్యటం, ఒక వ్యక్తి ఒంటరిగా చేసే నమాజు కంటే ఇరవై ఏడు రెట్లు ఎక్కువ శ్రేష్ఠ మైనది.

**619.** దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిస్తూ ఉండగా తాను విన్నానని, అబూ సయీద్ ఖుద్రి (రజిఅన్) ఉల్లేఖించారు; జమాఅత్

---

617-1. ఈ హదీసు ద్వారా స్పష్టంగా తెలిసిన విషయం ఏమిటంటే, జమాఅత్‌తో కలసి సామూహికంగా నమాజు చెయ్యటం విధి. అంటే తప్పనిసరి. ఒకవేళ జమాఅత్‌తో కలసి నమాజు చెయ్యటం విధి కాకపోతే జమాఅత్‌లో పాల్గొనని ప్రజల గృహాలకు నిప్పుపెట్టి వాటిని కాల్చివేయాలనిపిస్తోందని దైవప్రవక్త ఎందుకు అనేవారు! ఈ హదీసు ద్వారా తెలిసిన మరొక విషయం ఏమిటంటే, జమాఅత్‌తో కలసి నమాజు చెయ్యని నేరస్తుడికి నగదు జరిమానా వెయ్యటం కూడా ధర్మసమ్మతమైన విషయమే. ఇమామ్ మాలిక్ గారి అభిప్రాయం కూడా ఇదే. కాని హనఫియ మస్లక్ వారు నగదు జరిమానా విధించటాన్ని అంగీకరించరు, దానిని ధర్మసమ్మతమైన విషయంగా భావించరు.

30-1. ఆయనగారు అక్కడికి వెళ్ళి జమాఅత్‌తో కలిసి నమాజు చేశారు. ఈ హదీసును ఇబ్నె అబీ షైబా గారు తన గ్రంథం ముసన్నఫ్‌లో వసల్ చేశారు.

30-2. దీనిని అబుల్ అయ్‌లా గారు తన మస్నద్‌లో వసల్ చేశారు. బైహఖీ గారి ఉల్లేఖనంలో, అప్పుడు హజ్రత్ అనస్ (రజిఅన్) గారి వెంట దాదాపు ఇరవై మంది యువకులు ఉన్నారు.

**తో కలిసి నమాజు చెయ్యటం ఒక మనిషి ఒంటరిగా చేసే నమాజు కంటే ఇరవై ఐదు రెట్లు ఎక్కువ శ్రేష్ఠమైనది.**

**620.** దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు; **జమాఅత్‌తో కలిసి ఒక మనిషి నమాజు చేస్తే, అది అతను ఇంట్లోగాని లేక బజారులో గాని నమాజు చెయ్యటం కంటే ఇరవై ఐదు రెట్లు ఎక్కువ పుణ్యం కలిగి ఉంటుంది. దీనికి కారణం ఏమిటంటే, ఒక మనిషి చక్కగా వుజూ చేసుకుని మసీదుకు వెళ్ళటానికి బయలుదేరినప్పుడు, ఇంకా కేవలం నమాజు చేసే సంకల్పంతోనే బయలుదేరినప్పుడు అతను వేసే ప్రతి అడుగుకూ అతని అంతస్తు ఒకటి పెరుగుతుంది. ఇంకా అతను చేసిన ఒక పాపం క్షమించబడుతుంది. తరువాత అతను మసీదులో ప్రవేశించి నమాజు చేసినప్పుడు, అతను తాను నమాజు చేసిన స్థలంలో ఉన్నంత వరకు దైవదూతలు అతని కోసం ఇలా ప్రార్థిస్తూ ఉంటారు; "ఓ అల్లాహ్! ఈ వ్యక్తిపై నీ కారుణ్యాన్ని అవతరింపజెయ్యి, ఇతనిని కనికరించు." మీలో ఎవరైనా నమాజు కోసం నిరీక్షిస్తూ ఉన్నంత వరకు నమాజులో ఉన్నట్లే.**

## 31వ అధ్యాయం

### ఫజ్ర్ నమాజును జమాఅత్‌తో కలిసి చేసే దాని ఔన్నత్యం

**621.** దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిస్తూ ఉండగా నేను విన్నాను అని అబూహురైరా ఉల్లేఖించారు; **జమాఅత్‌తో చేసే నమాజు, మీలో ఎవరైనా ఒంటరిగా చేసే నమాజు కంటె ఇరవై ఐదు రెట్లు ఎక్కువ పుణ్యం కలిగి వుంటుంది. ఇంకా ఫజ్ర్ నమాజు సమయంలో (పహారా కాసే) రాత్రి దైవదూతలు మరియు పగటి దైవదూతలు సమావేశమవుతారు. తరువాత అబూ హురైరా (రజిఅన్) ఇలా అన్నారు; మీరు కోరితే (బనీ ఇస్రాయీల్ సూరాలోని) ఈ ఆయత్‌ని పఠించండి; "ఫజర్ సమయంలో ఖుర్ఆన్ పఠనం జరిగేటప్పుడు దైవ దూతలు హాజరు అవుతారు."[1] (17: 78)**

**అబ్దుల్లా బిన్ ఉమర్(రజిఅన్)ఇలా అన్నారు; జమాఅత్‌తో కలిసిచేసే నమాజు ఒక వ్యక్తి ఒంటరిగా చేసే నమాజు కంటే ఇరవై ఏడు రెట్లు ఔన్నత్యం కలిగి ఉంటుంది.**

---

621–1. దీని ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే, ఫజర్ నమాజును జమాఅత్‌తో కలిసి చేసే విషయం పట్ల ఎక్కువ శ్రద్ధ వహించాలి. దానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. ఎందుకంటే ఆ సమయంలో దైవదూతలు ఒక చోట సమావేశమవుతారు. ఇంకా ఫజర్ సమయంలోని జమాఅత్ ఇతర సమయాలలోని జమాఅత్ కంటే ఎక్కువ ఘనమైనది, అధ్యాయం యొక్క ఉద్దేశ్యం కూడా ఇదే.

**622.** ఉమ్మె దర్దా (ర.అన్హా) ఇలా చెబుతూ ఉండగా తాను విన్నానని సాలిమ్ ఉల్లేఖించారు; "ఒకసారి అబూ దర్దా (రజిఅన్) నా వద్దకు వచ్చారు, అప్పుడు ఆయన (ర) ఆగ్రహోదగ్రులై ఉన్నారు. నేను, 'ఏమిటి విషయం? మీరు చాలా కోపంగా ఉన్నారు' అని అడిగాను. ఆయన (ర) ఇలా సమాధానం పలికారు; "దేవుని సాక్షిగా చెబుతున్నాను; మహాప్రవక్త (సఅసమ్) గారి కాలంలో జరిగిన పనుల్లో ఒక్క పని కూడా ఇప్పుడు మిగిలి ఉన్నట్లు నాకు కనిపించటం లేదు. కాకపోతే ప్రజలు కలిసి సామూహికంగా నమాజు చేస్తున్నారు. అంతే."

**623.** దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అబూ మూసా అష్అరీ(రజిఅన్) ఉల్లేఖించారు; చాలా దూరం నుంచి నడుచుకుంటూ మసీదుకు వచ్చి నమాజు చేసే వ్యక్తికి ఎక్కువ పుణ్యం లభిస్తుంది. ఆ వ్యక్తి తరువాత దూరం నుంచి నడుస్తూ మసీదుకు వచ్చి నమాజు చేసే వ్యక్తికి అందరికంటే ఎక్కువ పుణ్యం లభిస్తుంది (ఈ విధంగా వంతుల వారీగా మసీదుకు వచ్చే వ్యక్తుల స్థానాలు పెరుగుతాయి), ఇంకా ఇమామ్తో కలిసి నమాజు చేసే ఉద్దేశ్యంతో మసీదులో నిరీక్షించే వ్యక్తికి, అలా నిరీక్షించకుండా నమాజు చేసుకుని నిదురకు ఉపక్రమించే వ్యక్తికంటే ఎక్కువ పుణ్యం లభిస్తుంది.

## 32వ అధ్యాయం

## జుహ్రా నమాజును పెందలకడనే చేసే దాని ఔన్నత్యం

**624.** దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు; ఒకసారి ఏమి జరిగిందంటే; ఒక వ్యక్తి ప్రయాణం చేస్తూ ముందుకు సాగిపోతున్నాడు. మార్గంలో అతనికి ఒక ముళ్ల కొమ్మ కనిపించింది. అప్పుడు అతను దానిని దారిలో నుంచి తొలగించాడు. అతను చేసిన ఈ పని అల్లాహ్కు నచ్చింది. అల్లాహ్ అతన్ని క్షమించాడు. తరువాత దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారు; ఐదుగురు వ్యక్తులు అమరగతిని పొందినవారుగా పరిగణించబడతారు. 1) ప్లేగు వ్యాధి వచ్చి మరణించిన వాడు 2) ఉదర సంబంధమైన వ్యాధి వల్ల మరణించినవాడు 3) నీటిలో మునిగి మరణించినవాడు 4) ఇల్లు కూలి దాని కిందపడి మరణించినవాడు 5) అల్లాహ్ మార్గంలో చంపబడినవాడు. ఇంకా మహాప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు; అజాన్ ఇవ్వటం వల్ల లభించే పుణ్యం గురించీ, నమాజులోని మొదటి వరుసలో నిలబడితే లభించే పుణ్యం గురించీ ప్రజలకు తెలిస్తే,లాటరీ వెయ్యకుండా ప్రజలు వాటిని పొందలేరు. కనుక వాటి కోసం లాటరీ వేస్తారు. జుహ్రా నమాజును పెందలకడనే

చేయటంలోని పుణ్యఫలం గురించి వారికి తెలిస్తే ఒకరింకొకరిని మించిపోయేందుకు పోటీ పడతారు. అలాగే ఫజ్ర్, ఇషా నమాజులు సామూహికంగా సలపటంలోని పుణ్యం ఎటువంటిదో వారికి తెలిస్తే మోకాళ్ళ మీద ప్రాకుతూ వస్తారు.

## 33వ అధ్యాయం

### సత్కార్యం వైపునకు వేసే ప్రతి అడుగుకూ పుణ్యం ప్రాప్తించటం.

**625.** దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని, హజ్రత్ అనస్ (రజిఅన్) చెప్పగా హుమైద్ ఉల్లేఖించారు; బనీ సలమాకు చెందిన ఓ ప్రజలారా! మీరు వేసే ప్రతి అడుగుకూ (నమాజు కోసం మసీదు వైపునకు వేసే ప్రతి అడుగుకూ) ప్రాప్తించే పుణ్యాన్ని మీరు కాంక్షించరా!? (ఖుర్ఆన్ గ్రంథంలోని ఈ అల్లాహ్ వాక్యం; "వారు తమ వెనుక విడిచి వెళ్ళిన చిహ్నాలను కూడా మేము నమోదు చేస్తూ ఉన్నాము." (దివ్యఖుర్ఆన్ – యాసీన్ సూరా–12) దీనిని గురించి ముజాహిద్ ఇలా అన్నారు; "వారు తమ వెనుక విడిచి వెళ్ళిన చిహ్నాలు అంటే వారు వేసిన అడుగులు అని భావం." ఇంకా హజ్రత్ అనస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; సలమా తెగవారు తమ నివాసాన్ని మహాప్రవక్త (సఅసమ్) గారికి దగ్గర్లో ఉన్నటువంటి ఏదైనా ఒక స్థలానికి మార్చుకుందామని కోరుకున్నారు. కాని దైవప్రవక్త (స) వారి ఈ అభిప్రాయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు; వారు తమ గృహాలను విడిచిపెట్టి ఈ విధంగా (దగ్గరకు) రావటాన్ని ఆయన (స) ఇష్టపడలేదు. వారితో ఆయన (స) ఇలా సెలవిచ్చారు; "మీ అడుగుజాడలకు పుణ్యం లభిస్తుందనే విషయం మీకు తెలియదా?" ముజాహిద్ ఇలా అన్నారు; "వారి అడుగుజాడలు అంటే, వారు వేసే అడుగులు మరియు వారి పాదాల చిహ్నాలు అని భావం."

## 34వ అధ్యాయం

### ఇషా నమాజును జమాఅత్‌తో కలిసి సామూహికంగా చేసే దాని ఔన్నత్యం.

**626.** దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు; కపటులకు (మునాఫిక్‌లు) ఫజర్, ఇషా నమాజుల కన్నా మరొక నమాజు ఏదీ భారంగా అనిపించదు. ఈ నమాజులకు (అంటే ఫజర్, ఇషా నమాజులు) ఎంత గొప్ప పుణ్యం లభిస్తుందో ప్రజలు గనక తెలుసుకుంటే, అప్పుడు వారు (నడవలేకపోతే) మోకాళ్ల మీద ప్రాకుకుంటూ ఈ నమాజులు చెయ్యటానికి వస్తారు. ఇంకా నేను (స) ఇలా సంకల్పించుకున్నాను; "ఇఖామత్ చెప్పమని ముఅజ్జిన్‌కు ఆజ్ఞాపించాలనీ, ఒక వ్యక్తిని ఎవరినైనా నమాజుకు నాయకత్వం వహించమని ఆదేశించాలనీ తరువాత నమాజుకు రాని వారి ఇళ్లకు పోయి వారి ఇళ్లకు నిప్పు పెట్టాలని అనుకున్నాను."

## 35వ అధ్యాయం

**ఇద్దరు లేదా ఇద్దరికంటే ఎక్కువ మంది ఉంటే జమాఅత్‌తో కలిసి సామూహికంగా నమాజు చెయ్యవచ్చు.**

**627.** దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని మాలిక్ బిన్ హువైరిస్ ఉల్లేఖించారు: "(ఇద్దరు వ్యక్తులను ఉద్దేశించి) నమాజుకు వేళ అయినప్పుడు మీరు ఉభయులూ అజాన్ ఇవ్వండి, ఇఖామత్ చెప్పండి. ఇంకా మీ ఉభయుల్లో వయస్సులో ఎవరైతే పెద్దవారో వారు నమాజుకు ఇమామ్‌గా వ్యవహరించాలి."

## 36వ అధ్యాయం

**నమాజు కోసం నిరీక్షిస్తూ మసీదులో కూర్చుండి పోయే వ్యక్తికి లభించే పుణ్యం మరియు మసీదుల ఔన్నత్యం గురించి.**

**628.** దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు; మీలో ఒక వ్యక్తి ఎవరైనా తాను నమాజు చేసే స్థలంలో కూర్చొని ఉన్నంత వరకు దైవదూతలు అతని కోసం దుఆ చేస్తూ ఉంటారు, అతని వుజూ విరిగిపోనంత వరకు. వారు ఇలా ప్రార్థిస్తూనే ఉంటారు; "ఓ అల్లాహ్! ఈ వ్యక్తిని క్షమించు. ఓ అల్లాహ్! ఇతనిపై దయచూపు." మీలో ఎవరైనా నమాజు కోసం నిరీక్షిస్తూ ఆగి ఉన్నంత వరకూ వారు నమాజులో ఉన్నట్లే; అతను తన ఇంటికి పోవటాన్ని నమాజు తప్ప మరొక విషయం ఏదీ ఆపి ఉంచరాదు.

**629.** దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు; ప్రళయదినంనాడు అల్లాహ్ ఏడుగురు వ్యక్తులకు తన నీడలో [1] స్థానాన్ని కల్పిస్తాడు. ఆనాడు అల్లాహ్ నీడ తప్ప మరొక నీడ ఏదీ ఎక్కడా ఉండదు. వారిలో ఒక వ్యక్తి ఎవరంటే, న్యాయంగా పాలించే పాలకుడు. రెండో వ్యక్తి ఎవరంటే, తన యౌవన దశ నుంచీ దైవారాధనలో నిమగ్నమైపోయిన వాడు. మూడో వ్యక్తి ఎవరంటే, అతని హృదయం ఎల్లప్పుడూ మసీదుకే అంటుకుని ఉంటుంది.[2] నాలుగు; అల్లాహ్ కోసమే స్నేహితులు అయి, జీవితాంతం స్నేహితులు

---

629-1. అంటే తన అధికార పీఠం యొక్క నీడలో స్థానాన్ని కల్పిస్తాడు.

629-2. ఒక నమాజు చేసిన తరువాత మసీదు నుంచి ఇంటికి మరలి వస్తాడు. అప్పుడు మరొక నమాజు చెయ్యటానికి మసీదుకు పోయే ఆలోచన అతన్ని వెంటాడుతూ ఉంటుంది. అధ్యాయంలోని భావం కూడా ఇదే.

గానే ఉండి, ఇంకా స్నేహితులుగానే మరణించిన ఇద్దరు వ్యక్తులు. ఐదో వ్యక్తి ఎవరంటే; ఆస్తీ అంతస్తూ గల ఒక అందమైన స్త్రీ (చెడు కార్యం కోసం) ఆహ్వానించినప్పుడు, "నేను అల్లాహ్‌కు భయపడతాను" అని సమాధానం చెప్పిన అతను, ఆరవ వ్యక్తి ఎవరంటే, కుడి చేత్తో చేసిన దానం ఎంతో అతని ఎడమ చేతిక్కూడా తెలియదు. ఏడో వ్యక్తి ఎవరంటే, ఒంటరిగా ఉన్నప్పుడు అల్లాహ్‌ను జ్ఞాపకం చేసుకోగా, అతని కళ్లలో నీళ్లు తిరుగుతాయి (అతను విలపిస్తాడు).

**630.** అనస్ బిన్ మాలిక్ (రజిఅన్)ను ప్రజలు, "దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఉంగరాన్ని ధరించేవారా?" అని అడిగారని హుమైద్ తవీల్ ఉల్లేఖించారు; దానికి సమాధానంగా ఆయన 'అవును' అని అన్నారు. ఇంకా అనస్ (ర) ఇలా అన్నారు; "ఒకసారి మహాప్రవక్త ముహమ్మద్ (స) గారు ఇషా నమాజును అర్ధరాత్రి వరకు ఆలస్యం చేశారు. ఆ తరువాత ఆయన (స) గారు నమాజు చేసి మసీదు నుంచి బయటకు వచ్చి మా వైపునకు తిరిగి ఇలా సెలవిచ్చారు; ప్రజలైతే నమాజు చేసుకున్నారు, నిదురపోతున్నారు కూడా. మీరైతే నమాజు కోసం నిరీక్షిస్తూ ఉన్న సమయం నుంచి ఇప్పటి వరకు నమాజులోనే ఉన్నారు." అనస్ (ర) ఇలా అన్నారు; అప్పుడు నేను, దైవప్రవక్త (స) గారి చేతికి ఉన్న ఉంగరం మెరుస్తూ ఉండటాన్ని గమనించాను.

## 37వ అధ్యాయం

### ఉదయం, సాయంత్రం నమాజు కోసం మసీదుకు పోయే దాని ఘనత.

**631.** దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు; ఎవరైతే ఉదయం, సాయంత్రం నమాజు కోసం మసీదుకు పోతారో అతను ఉదయం లేదా సాయంత్రం మసీదుకు పోయినందుకుగాను అల్లాహ్ స్వర్గలోకంలో అతని కోసం ఆతిథ్యపు ఏర్పాట్లు చేస్తాడు.

## 38వ అధ్యాయం

### ఇఖామత్ చెప్పిన తరువాత ఫజ్ర్ నమాజు తప్ప మరొక నమాజు ఏదీ చెయ్యకూడదు.

**632.** మాలిక్ ఇబ్నె బుహైనా (రజిఅన్) కథనం : ఒకసారి దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఒక మనిషిని చూశారు; ఇఖామత్ చెప్పటం అయిపోయిన తరువాత కూడా అతను రెండు రకాతుల నమాజును చేశాడు. దైవప్రవక్త (సఅసమ్) గారు నమాజును చేయించిన తరువాత, ప్రజలు ఆయన చుట్టూ గుమిగూడారు. లేదా రెండు రకాతుల నమాజు చేసిన ఆ వ్యక్తి చుట్టూ గుమిగూడారు.

మహాప్రవక్త (స) ఆ వ్యక్తిని ఉద్దేశించి ఇలా అన్నారు; "ఫజర్ నమాజులో నాలుగు రకాతులున్నాయా? ఫజర్ నమాజులో నాలుగు రకాతులున్నాయా?"

## 39వ అధ్యాయం

## వ్యాధిగ్రస్తుడైన వ్యక్తి ఎప్పుడు, ఏ స్థితిలో జమాఅత్‌తో కలిసి సామూహికంగా నమాజు చేసేందుకు మసీదుకు వెళ్ళాలి అనే విషయం గురించి.[1]

**633.** అస్వద్ బిన్ యజీద్ నఖయీ ఇలా ఉల్లేఖించారు; ఒకసారి మేము హజ్రత్ ఆయెషా (రజిఅన్) వద్ద కూర్చొని ఉన్నాము. అప్పుడు మేము నియమం తప్ప కుండా క్రమబద్ధంగా నమాజు చేసే విషయం గురించీ, ఇంకా నమాజు ఒక మహత్తర మైన ఆరాధన అనే విషయం గురించీ చర్చించుకుంటూ ఉన్నాము. హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) ఇలా అన్నారు; "అప్పుడు దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) వ్యాధిగ్రస్తులై ఉన్నారు. తరువాత ఆయన (స) ఆ వ్యాధిలో ఉన్నప్పుడే అసువులు బాశారు. ఆయన(స) వ్యాధిగ్రస్తులై ఉన్నప్పుడు నమాజుకు సమయం అయిపోయింది. అజాన్ కూడా ఇవ్వబడింది. దైవప్రవక్త (సఅసమ్), ప్రజలకు నమాజు చేయించమని నా ఆజ్ఞగా అబూబకర్ (ర)కు చెప్పండి అని సెలవిచ్చారు. ఆయన (స) గారితో ఇలా విన్నవించుకోవటం జరిగింది; (హజ్రత్ ఆయెషా (ర) ఇలా విన్నవించుకున్నారు) "అబూబకర్ సున్నితమైన హృదయం కలవారు. ఆయన (ర) మీ స్థానంలో నిలబడినప్పుడు (దుఃఖాన్ని ఆపుకోలేక విలపిస్తారు) ప్రజలచేత నమాజు చేయించ లేరు. దైవప్రవక్త (స) మళ్లీ పై విధంగానే ఆజ్ఞాపించారు. కాని పై విధంగానే సమాధానం చెప్పటం జరిగింది. తరువాత మూడోసారి కూడా దైవప్రవక్త (స) పై విధంగానే ఆదేశించారు. ఆయన (స) తన భార్యలను ఉద్దేశించి ఇలా సెలవిచ్చారు; "మీరైతే దైవప్రవక్త హజ్రత్ యూసుఫ్ కాలంనాటి మహిళల[1] మాదిరిగా కనిపిస్తున్నారు. నమాజుకు నాయకత్వం వహించమని అబూ బకర్ (ర)కు చెప్పండి". చివరకు హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (ర) నమాజు చేయించటానికి లేచారు. ఆ తరువాత దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్)కు కొంచెం స్వస్థత

---

39-1. అంటే వ్యాధి యొక్క ఏ స్థితిలో జమాఅత్‌తో కలిసి నమాజు చెయ్యటానికి మసీదుకు రాకపోవటం క్షమార్హమైన విషయం అవుతుంది. ఇంకా వ్యాధి యొక్క ఏ స్థితిలో మసీదుకు రావటం శ్రేష్ఠమైన విషయం అవుతుంది. దైవప్రవక్త (స) తీవ్రమైన వ్యాధిలో ఉండి కూడా ఇద్దరు వ్యక్తుల సహాయంతో జమాఅత్‌తో నమాజు చెయ్యటా నికి మసీదుకు వచ్చారు.

**చేకూరింది. ఆ కారణంగా ఆయన (స) ఇద్దరు వ్యక్తుల ఆధారంతో బయటికి వచ్చారు. హజ్రత్ ఆయెషా (ర) ఇలా అన్నారు; నేను దైవప్రవక్త (స) గారి పవిత్ర పాదాలను చూస్తూ ఉన్నాను. వ్యాధి కారణంగా ఆయన (స) వాటిని భూమిపై ఈడ్చుకుంటూ పోతున్నారు. హజ్రత్ అబూ బకర్ (ర) దైవప్రవక్త (స) గారిని చూసి తన స్థానంలో నుంచి వెనక్కి తొలగిపోదలిచారు. దైవప్రవక్త (స) గారు సైగ చేస్తూ తన స్థానంలోనే ఉండమని ఆయనకు సూచించారు. తరువాత ప్రజలు దైవప్రవక్త (స) గారిని తీసుకు వచ్చారు. ఆయన(స)గారు అబూబకర్(ర) గారి ప్రక్కనే కూర్చుండి పోయారు." అమష్ ఈ హదీసును ఉల్లేఖించినప్పుడు ప్రజలు ఆయన్ని ఇలా అడిగారు; "అప్పుడు దైవప్రవక్త (స) నమాజు చేయిస్తున్నారా? అబూబకర్ (ర) ఆయన (స) గారిని అనుసరిస్తున్నారా? ఇంకా ప్రజలు అబూ బకర్ (ర) ను అనుసరిస్తున్నారా? అమష్ 'అవును' అని తల ఊపి తెలియజేశారు. అబూ మానియా ఈ ఉల్లేఖనంలో ఈ విషయాన్ని అదనంగా చేర్చారు; "దైవప్రవక్త ముహమ్మద్ (స) అబూ బకర్ (ర) గారి ఎడమ ప్రక్కన కూర్చున్నారు. అబూబకర్ (ర) నిలబడి నమాజు చేశారు."**

**634. హజ్రత్ ఆయెషా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) వ్యాధిగ్రస్తులయ్యారు. ఆ వ్యాధి బాగా ముదిరి పోయింది. అప్పుడు ఆయన (స) గారు ఈ స్థితిలో తాను నా ఇంట్లో ఉంటాననీ, దానికి అనుమతించమనీ ఆయన (స) తన ఇతర భార్యలను కోరారు. అప్పుడు వారందరూ ఆయన (స)కు అనుమతి ఇచ్చారు. ఆయన (స) ఇద్దరు వ్యక్తుల ఆధారంతో బయటికి వచ్చారు. అప్పుడు ఆయన (స) గారు తన పాదాలను భూమిపై ఈడ్చుకుంటూ వస్తున్నారు. ఆయన(స) ఇబ్నె అబ్బాస్‌కి- మరో వ్యక్తికి మధ్యన ఉన్నారు.**

---

633-1. అంటే మీరు కూడా జులైఖా లాంటి వారే. మనస్సులో ఉన్నది ఒకటి. బయటికి మాత్రం మరొక విషయాన్ని సాకుగా చూపిస్తున్నారు. జులైఖా నగర స్త్రీలను విందుకు రమ్మని ఒక సాకుగా మాత్రమే ఆహ్వానించింది. ఆమె మనో సంకల్పం ఏమిటంటే, నగర స్త్రీలు హజ్రత్ యూసుఫ్ (అ) గారి అందచందాలను చూడాలి. ఇంకా ఆయన ప్రేమలో పడ్డందుకు ఆమెను క్షమించాలని. ఇక్కడ కూడా హజ్రత్ ఆయెషా (ర) గారు బయటికైతే "అబూబకర్ (ర) మృదువైన హృదయం కలవారు. ఆయన (ర) నమాజుకు నాయకత్వం వహించలేరు అని అన్నారు. కాని ఆమె అంతరంగంలోని ఉద్దేశం వేరు. ఒకవేళ దైవప్రవక్త (స) ఈ వ్యాధి కారణంగా మరణించినట్లయితే, ప్రజలు అబూబకర్ (ర) గారి అడుగులను అశుభకరమైనవిగా భావిస్తారని ఆమె ఊహించారు."

ఉల్లేఖకులైన ఉబేదుల్లా ఇలా అన్నారు; హజ్రత్ ఆయెషా (ర) గారు చెప్పింది చెప్పినట్లుగా నేను ఇబ్నె అబ్బాస్‌కు చెప్పాను. ఆయన నన్ను ఇలా అడిగారు; "ఆయెషా (ర) గారు ప్రస్తావించని వ్యక్తి ఎవరో మీకు తెలుసా?" "నాకు తెలియదు" అని నేను సమాధానం చెప్పాను. అప్పుడు ఇబ్నె అబ్బాస్(ర) ఇలా అన్నారు; "ఆ రెండో వ్యక్తి అలీ ఇబ్నె అబీ తాలిబ్."

## 40వ అధ్యాయం

**వర్షం వల్ల గానీ లేదా ఏదైనా మరొక కారణం వల్ల గానీ, ఇంట్లోనే నమాజు చేసుకునేందుకు అనుమతి గురించి.**

**635.** ఇబ్నె ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి ఆయన (ర) చలి ఎక్కువగా ఉన్న ఒక తుఫాను రాత్రి నమాజు కోసం అజాన్ ఇచ్చారు.[1] తరువాత కేక వేస్తూ ఇలా అన్నారు; "జనులారా! మీరు మీ గృహాలలోనే నమాజులు చేసుకోండి." ఆ తరువాత ఆయన ఇంకా ఇలా అన్నారు; దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) చలి ఎక్కువగా ఉన్న రాత్రిలో, వర్షం కురిసే రాత్రిలో ముఅజ్జిన్‌ను ఇలా ఆజ్ఞాపించేవారు; "జనులారా! మీ మీ నివాస స్థలాలలోనే నమాజులు చేసుకోండి అని (కేక వేసి పలకమని)."[2]

**636.** మహమూద్ బిన్ రబీ అన్సారీ ఇలా ఉల్లేఖించారు: "ఉత్‌బాన్ బిన్ మాలిక్ అన్సారీ తన తెగకు చెందిన ప్రజలకు నమాజులో నాయకత్వం వహించేవారు. ఆయన (ర) అంధులు. ఒకసారి ఆయన (ర) దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) కు ఇలా విన్నవించుకున్నారు; "ఓ దైవప్రవక్తా (స)! ఒక్కోసారి చీకటి పడుతుంది, (వీధుల్లో) నీళ్ళు ప్రవహిస్తూ ఉంటాయి. నేనైతే అంధుడను.[1] మసీదుకు

---

635-1. విశదమైన విషయం ఏమిటంటే; ఎక్కువ చలిగా ఉన్నప్పుడూ, తుఫాను వచ్చిన సమయంలోనూ ఇంకా వర్షం కురిసేటప్పుడూ మసీదుకు వచ్చి జమాఅత్‌తో కలిసి నమాజు చెయ్యకపోవటం దోషం కాదు, క్షమార్హమైన విషయమే. ప్రతి వ్యక్తీ తన ఇంట్లోనే ఒంటరిగాగానీ లేదా జమాఅత్‌తోగానీ నమాజు చేసుకోవచ్చు.

635-2. తెలిసిన విషయం ఏమిటంటే, చలి ఎక్కువగా ఉన్నప్పుడు, వర్షం కురిసే రోజున లేదా తుఫాను వచ్చిన రోజున ముఅజ్జిన్ అజాన్ ఇచ్చిన తరువాత ఇలా ఎలుగెత్తి చెప్పవచ్చు, "అలా సల్లూ ఫిర్ రిహాల్". కాని అలాంటి రోజుల్లో జమాఅత్‌తో కలిసి నమాజు చెయ్యకపోవటం కేవలం ఒక అనుమతి మాత్రమే. మసీదుకు పోయి జమాఅత్‌తో కలిసి నమాజు చెయ్యటం అనేది అత్యంత శ్రేష్ఠమైన విషయం.

వెళ్లి జమాఅత్‌తో నమాజు చెయ్యలేను. కనుక ఓ దైవప్రవక్తా! మీరు నా గృహంలో ఎక్కడైనా, ఏ స్థలంలోనైనా నమాజు చెయ్యండి. నేను ఆ స్థలాన్ని నమాజు స్థలంగా చేసుకుంటాను." తరువాత దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) అతని ఇంటికి వెళ్లి, "నేను ఎక్కడ నమాజు చెయ్యాలి?" అని అడిగారు. అప్పుడు ఆ అంధ వ్యక్తి తన ఇంట్లో ఒక స్థలాన్ని చూపించాడు. మహాప్రవక్త (స) ఆ స్థలంలో నమాజు చేశారు.

## 41వ అధ్యాయం

## వర్షంలోగానీ లేదా ఏదైనా విపత్తు వచ్చిపడినప్పుడుగానీ ఎవరైనా మసీదుకు వచ్చినట్లయితే అప్పుడు ఇమామ్ వారితో కలిసి నమాజు చేయవచ్చా? ఇంకా వర్షం కురుస్తూ ఉన్నప్పుడు, ఆ రోజు శుక్రవారం అయితే ఖుత్బా పఠించవచ్చునా? లేదా?

**637.** అబ్దుల్లా బిన్ హారిస్ (ర) ఇలా ఉల్లేఖించారు; అబ్దుల్లా ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) బురద బాగా ఉన్నటువంటి వర్షం కురిసే ఒక రోజున మమ్మల్ని ఉద్దేశించి ఖుత్బా వినిపించారు; ముఅజ్జిన్ 'హయ్యా అలస్సలాహ్' అని అనబోయేటప్పుడు అతన్ని, "ప్రజలారా! మీరు మీ మీ గృహాలలోనే నమాజులు చేసుకోండి" అని పలకమని ఆజ్ఞాపించారు. ఇది విన్న ప్రజలు ఒకరి ముఖాన్ని ఒకరు ఆశ్చర్యంగా చూసుకోసాగారు, ఈ విషయం ధర్మసమ్మతమైనది కాదనే భావనను స్ఫురింపజేస్తూ. అప్పుడు ఇబ్నె అబ్బాస్ (రజి) ఇలా అన్నారు; "బహుశా నేను చెప్పిన ఈ విషయం మీకు చెడ్డదిగా అనిపించవచ్చు. కాని నాకంటే ఉత్తములూ, చాలా పెద్దవారు అయిన మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) గారు కూడా ఇలానే చేశారు. నిస్సందేహంగా జుమా (అంటే శుక్రవారం) నమాజు వాజిబ్. కాని 'హయ్యాఅలస్ సలాహ్' (నమాజు వైపునకు రండి) అని కేకవేసి పిలిపించి మిమ్మల్ని కష్టపెట్టటం నాకు ఇష్టంలేదు." ఇబ్నె అబ్బాస్ (ర) ఈ విషయాన్నే చెప్పారు. కాని కొద్దిపాటి భేదం మాత్రమే ఉంది. ఆయన ఇలా అన్నారు; నేను మిమ్మల్ని పాపాత్ములుగా చెయ్యటాన్ని ఇష్టపడలేదు. మరియు చెడ్డదిగా భావించాను. ఇంకా మోకాళ్ల లోతు బురదలో మీరు మసీదుకు రావటం కూడా నాకు ఇష్టంలేదు.

---

636-1. ఉత్‌బాన్ మూడు కారణాలను గురించి చెప్పారు. ఒకటి, చీకటి రాత్రి. రెండు, నీళ్ల ప్రవాహం. మూడు, అంధత్వం. ఈ మూడింటిలో ఏ ఒక్క కారణమైనా జమాఅత్‌ను వదిలి పెట్టడానికి సరిపోతుంది.

**638.** అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి ఆకాశంలోని కొంతభాగం మేఘావృతమయింది. తరువాత వర్షం కురిసింది. చివరకు మసీదు కప్పులో నుంచి నీళ్లు ధారాపాతంగా కారసాగాయి. ఆ కప్పును ఖర్జూరపు కొమ్మలతో తయారు చేశారు. ఆ తరువాత నమాజు కోసం ఇఖామత్ చెప్పబడింది. అప్పుడు నేను చూశాను, దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) బురద నీటిలో సజ్దా చేస్తున్నారు. ఆయన(స) గారి పవిత్రమైన నుదుటి మీద బురద గుర్తుల్ని నేను స్పష్టంగా చూశాను.

**639.** అనస్ బిన్ సీరీన్ ఇలా ఉల్లేఖించారు; అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా అంటూ ఉండగా నేను విన్నాను. ఒక అన్సారీ పురుషుడు దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) గారికి ఇలా విన్నవించుకున్నాడు; "ఓ దైవ ప్రవక్తా(స)! నేను మీతో కలిసి నమాజు చెయ్యలేను." అతను ఒక లావుపాటి మనిషి (చాలా బరువుగా ఉంటాడు). అతను తన ఇంట్లో దైవప్రవక్త (స) గారి కోసం భోజనం ఏర్పాట్లు చేశాడు. తన ఇంటికి భోజనం కోసం రమ్మని ఆయన (స) గారిని అతను ఆహ్వానించాడు. ఒక చాపను తన ఇంట్లో నేల మీద ఆయన (స) గారి కోసం పరిచాడు. ఆ చాప యొక్క ఒక చివరి భాగాన్ని నీళ్లతో పరిశుభ్రంగా కడిగాడు. దైవప్రవక్త (స) ఆ చాప మీదనే రెండు రకాతులు నమాజు చేశారు. జారూద్ సంతానంలోని ఒకడైన ఒక వ్యక్తి (అబ్దుల్ హమీద్) అనస్ గారిని ఇలా అడిగాడు; "దైవప్రవక్త (స) పొద్దెక్కిన తరువాత చాష్త్ నమాజు చేస్తూ ఉండేవారా?" దానికి సమాధానంగా ఆయన ఇలా అన్నారు; "ఆ రోజున తప్ప మరెప్పుడూ ఆయన (స) ఈ నమాజు చేస్తూ ఉండగా నేను చూడలేదు."

## 42వ అధ్యాయం

**అన్నం ముందు కూర్చున్నప్పుడు నమాజు కోసం ఇఖామత్ చెప్పబడితే అప్పుడు ఏమి చెయ్యాలి? అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) అటువంటి పరిస్థితిలో ముందు సాయంత్రం పూట భోజనం చేసేవారు. అబూ దర్దా (ఒక సహాబి) ఏమన్నారంటే; మనిషి ముందు అన్నం తినాలి. ఇది వివేకవంతుని లక్షణం. నమాజులో నిలబడినప్పుడు అతని మనస్సు ప్రశాంతంగా, నిర్మలంగా ఉండాలి. (ఏ ఆలోచనా రాకూడదు).**

**640.** దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఉల్లేఖించారు; సాయంకాలపు భోజనం వడ్డించబడి

**నప్పుడు, అప్పుడే నమాజు కోసం ఇఖామత్ కూడా చెప్పిబడినప్పుడు, మనిషి ముందు అన్నం తినాలి.[1]**

**641.** **దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఉల్లేఖించారు; "సాయంకాలపు భోజనం మీ ముందుకు వచ్చినప్పుడు, మొదట భోజనం చెయ్యండి. ఆ తరువాత మగ్రిబ్ నమాజు చెయ్యండి. మీ భోజనాన్ని వదలిపెట్టి నమాజు కోసం త్వరపడకండి.[1]**

**642.** **దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) చెప్పారని నాఫె ఉల్లేఖించారు; "మీలో ఎవరికైనా సాయంకాలపు భోజనం వడ్డించబడినప్పుడు, ఇంకా అప్పుడు నమాజు కోసం ఇఖామత్ చెప్పబడినప్పుడు, ముందు భోజనం చెయ్యండి, నమాజు కోసం తొందరపడకండి". అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) గారి ముందు భోజనం పెట్టబడినప్పుడు, ఇంకా అప్పుడే నమాజు కోసం ఇఖామత్ కూడా చెప్పబడినప్పుడు ఆయన (ర) గారు భోజనం పూర్తిగా చేసే అంత వరకు నమాజు కోసం వచ్చేవారు కాదు. ఇంకా ఆయన (ర), (ఆ సమయంలో) ఇమామ్ గారు చేసే ఖుర్ఆన్ పారాయణాన్ని సయితం వింటూ ఉండేవారు. దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారని ఇబ్నె ఉమర్ (ర) ఉల్లేఖించారు; మీలో ఎవరైనా భోజనం చెయ్యటానికి కూర్చున్నప్పుడు తొందర పడకండి, చక్కగానూ, సంతృప్తికరంగానూ మీ కోరికను పూర్తిగా చేసుకోండి, నమాజు కోసం ఇఖామత్ చెప్పటం పూర్తి అయినాసరే.**

## 43వ అధ్యాయం

### ఇమామ్ (నమాజుకు నాయకత్వం వహించే వ్యక్తి)ను నమాజు కోసం పిలిచినప్పుడు, ఒకవేళ ఆయన చేతిలో తినే వస్తువు ఏదైనా ఉంటే ఆయన ఏమి చెయ్యాలి? అనే విషయం గురించి.[1]

640–1. అంటే, దీని తరువాత మగ్రిబ్ నమాజు చెయ్యండి. మరొక ఉల్లేఖనంలో కూడా ఇలాంటి వివరణే వచ్చింది. ఇతర నమాజులకు కూడా ఇదే ఆజ్ఞ వర్తిస్తుంది.

641–1. ఒక మనిషి అన్నాన్ని వదలిపెట్టి మొదట నమాజు చేస్తే అప్పుడు అతను తప్పకుండా నమాజును త్వరత్వరగా చేస్తాడు. చాలా మంది ప్రజలు ఈ హదీసుకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తారు. ఇఫ్తార్ చేసిన తరువాత నమాజును త్వరత్వరగా చేస్తారు. అన్నం తినేటప్పుడు కంటే, నమాజు చేసేటప్పుడు చాలా నెమ్మదిగా, ఎక్కువ ప్రశాంతంగా ఉండాలి అనే విషయం ప్రజలు తెలుసుకోవాలి.

**643.** తన తండ్రిగారైన అమ్ర్ బిన్ ఉమయ్యా గారు ఇలా చెప్పారని జాఫర్ బిన్ అమ్ర్ బిన్ ఉమయ్యా ఉల్లేఖించారు; ఒకసారి నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారిని చూశాను; అప్పుడు ఆయన గారు (ఒక మేక) ముంగాలి మాంసపు ముక్కను కోసి తింటున్నారు. ఇంతలోనే ఆయన (స)గారిని నమాజు కోసం పిలవటం జరిగింది. అప్పుడు ఆయన(స)గారు లేచి నిలబడ్డారు, కత్తిని క్రింద పెట్టేశారు. తరువాత నమాజు చేయించారు. కాని ఆయన(స)గారు వుజూ చేసుకో లేదు.[1]

## 44వ అధ్యాయం

### ఎవరైనా గృహ సంబంధమైన పనుల్లో నిమగ్నమై ఉన్నప్పుడు, ఒకవేళ ఇఖామత్ అయినట్లయితే అతను నమాజు కోసం మసీదుకు వెళ్ళిపోవాలి.[1]

**644.** అస్వద్ బిన్ యజీద్ ఇలా ఉల్లేఖించారు; "ఒకసారి నేను హజ్రత్ ఆయెషా(ర) గారిని, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇంట్లో ఉన్నప్పుడు ఏమేమి చేసేవారు?' అని అడిగాను. నా ప్రశ్నకు సమాధానంగా ఆమె గారు ఇలా అన్నారు; "ఇంట్లో ఉన్నప్పుడు ఆయన(స) ఇంటి పనులను చక్కబెట్టేవారు. అంటే ఇంటివారికి సహాయపడుతూ ఉండేవారు. నమాజుకు వేళ అయినప్పుడు ఆయన(స) ఇంటి పనుల్ని వదిలేసి నమాజు కోసం వెళ్ళిపోయేవారు."

---

43-1. ఈ అధ్యాయం ద్వారా ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారు నిరూపించదలచిన విషయం ఏమిటంటే, ఇంతకుముందు ఇవ్వబడిన ఆజ్ఞ 'ఇలా చెయ్యటం మంచిది, అభిలషణీయమైనది' అనే ఉద్దేశ్యంతో ఇవ్వబడిందే కాని 'తప్పనిసరిగా చెయ్యాలి' అనే ఉద్దేశ్యంతో ఇవ్వబడలేదు. కొందరు ఏమన్నారంటే; ఇమామ్‌కు సంబంధించిన ఆజ్ఞ వేరుగా ఉంది, అదేమిటంటే, ఆయన తాను తినే అన్నాన్ని వదిలేసి నమాజు కోసం మసీదుకు వెళ్ళిపోవాలి. ఎందుకంటే ఆయన అలా వెళ్ళకపోతే చాలామంది ప్రజలు ఆయన కోసం, నమాజు కోసం నిరీక్షించవలసి ఉంటుంది. అది వారికి ఇబ్బందికరమ వుతుంది.

643-1. అంటే మాంసం తిన్న కారణంగా ఆయన(స)గారు వుజూ చేసుకోలేదు.

44-1. ఈ అధ్యాయం ద్వారా ఇమామ్ బుఖారీ (రహ్మాలై)గారు చెప్పదలుచుకున్న విషయం ఏమిటంటే, ఈ ఆజ్ఞ కేవలం అన్నం తినే విషయానికి మాత్రమే వర్తిస్తుంది. అంటే అన్నం తినటం పూర్తి చేసుకోవాలి, నమాజు కోసం తొందరపడకూడదు. కాని ప్రపంచానికి సంబంధించిన ఇతర పనులన్నింటినీ నమాజు కోసం వదలిపెట్టాలి.

## 45వ అధ్యాయం

**దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) నమాజు ఎలా చేసేవారో, ఆయన(స) నమాజు చేసే పద్ధతి, విధానం ఎలాంటిదో తెలియజేసే సంకల్పంతో ఎవరయినా ప్రజల ముందు నమాజు చెయ్యటం.**

**645.** అబూ ఖిలాబా ఇలా చెప్పారని, అయ్యూబ్ సఖ్తియాని ఉల్లేఖించారు; ఒకసారి మాలిక్ బిన్ హువైరిస్ (రజిఅన్) మా మసీదుకు వచ్చి ఇలా అన్నారు; 'నేను ఇప్పుడు మీ సమక్షంలో నమాజు చేస్తాను. నా ఉద్దేశ్యం నమాజుకు నాయకత్వం వహించటం కాదు. దైవప్రవక్త మహాశయులు(స) ఎలా నమాజు చేసేవారో అలా నమాజు చేసి మీకు చూపించటమే నా ఉద్దేశ్యం. అప్పుడు అయ్యూబ్ ఇలా అన్నారు; "మాలిక్ బిన్ హువైరిస్ ఎలా నమాజు చేశారు?" అని నేను అబూ ఖిలాబాను అడిగాను. ఆయన సమాధానంగా ఇలా అన్నారు, మన షేక్ అయిన అమ్ర్ బిన్ సలమా ఎలా నమాజు చేస్తారో అలా నమాజు చేసేవారు. ఇంకా అమ్ర్ బిన్ సలమా మొదటి రకాతు చేసిన తరువాత రెండో సజ్దా నుంచి తన శిరస్సును ఎత్తి కొంచెంసేపు కూర్చున్న పిదప మళ్ళీ లేచి నిలబడతారు.

## 46వ అధ్యాయం

**ఇమామత్ చేసే హక్కు అందరికంటే ఎక్కువగా ధర్మజ్ఞానం గల పెద్దలకే ఉన్నది.**

**646.** అబూ మూసా అష్అరీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) వ్యాధిగ్రస్తులయ్యారు. ఆయన(స)గారి వ్యాధి తీవ్రతరమైపోయింది. అప్పుడు ఆయన(స) ఇలా సెలవిచ్చారు; 'ప్రజల చేత నమాజు చేయించమని, నమాజుకు నాయకత్వం వహించమని అబూబకర్(ర)కు చెప్పండి.' హజ్రత్ ఆయెషా(ర) దానికి సమాధానంగా దైవప్రవక్త(స)తో ఇలా విన్నవించుకున్నారు. అబూబకర్(ర) మృదు మనస్కులు. ఆయన(ర) మీ స్థానంలో నిలబడినప్పుడు నమాజు చేయించటం ఆయనకు కష్టతరమైపోతుంది.[1] దైవప్రవక్త(స) మళ్ళీ ఇలా సెలవిచ్చారు. "ప్రజలకు నమాజు చేయించమని అబూబకర్(ర)కు చెప్పండి. మీరైతే దైవప్రవక్త హజ్రత్ యూసుఫ్(అ)తో ఉండే స్త్రీలు మాదిరిగా కనిపిస్తున్నారు." చివరకు దైవప్రవక్త(స)గారి సందేశాన్ని తెచ్చిన వ్యక్తి అబూబకర్(ర)వద్దకు వెళ్ళాడు. ఆయన(ర) అప్పటి నుంచి దైవప్రవక్త(స) జీవించి ఉన్నంత వరకు ప్రజలకు నమాజు చేయిస్తూ ఉండేవారు.

---

646-1. అంటే అబూబకర్(ర) దైవప్రవక్త(స)గారిని జ్ఞాపకం చేసుకుని ఏడుస్తారు. ఈ కారణంగా ఆయన(ర) ఖుర్ఆన్ వాక్యాలను పఠించలేరు. సుబ్హానల్లాహ్! (అల్లాహ్

**647.** విశ్వాసుల తల్లి అయిన హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) వ్యాధిగ్రస్తులై ఉన్నప్పుడు ఇలా సెలవిచ్చారు; 'ప్రజలకు నమాజు చేయించమని అబూబకర్(ర)కు చెప్పు.' అప్పుడు నేను ఆయన(స)తో ఇలా విన్నవించుకున్నాను అని హజ్రత్ ఆయెషా(ర) చెప్పారు, 'అబూబకర్ (ర) మీ స్థానంలో నిలబడి నమాజు చేయించేటప్పుడు ఏడుస్తూ ఖుర్ఆన్ పఠనాన్ని ప్రజలకు వినిపించలేరు. (ఆయన గొంతు పెగలదు). ప్రజలకు నమాజు చేయించమని, నమాజుకు నాయకత్వం వహించమని హజ్రత్ ఉమర్(ర)ను ఆదేశించండి'. హజ్రత్ ఆయెషా(ర) ఇంకా ఇలా అన్నారు; 'విశ్వాసుల మాతృమూర్తి అయిన హఫ్సా(ర)తో నేను ఇలా అన్నాను, నీవు కూడా దైవప్రవక్త(స)కు ఇలా చెప్పు; అబూబకర్(ర) నమాజు చేయించటానికి మీ స్థానంలో నిలబడినప్పుడు విలపిస్తూ ప్రజలకు ఖుర్ఆన్ పఠనాన్ని వినిపించలేరు. కనుక ప్రజలకు నమాజు చేయించమని మీరు హజ్రత్ ఉమర్(ర)ను ఆజ్ఞాపించండి.' హజ్రత్ హఫ్సా(ర) ఈ విధంగానే దైవప్రవక్త(స)కు విన్నవించుకున్నారు. అప్పుడు ఆయన(స)గారు 'చాల్లే, ఊరుకో' అని కసురుకున్నారు. ఆయన(స)ఇంకా ఇలా అన్నారు. 'మీరు యూసుఫ్(అ) కాలం నాటి స్త్రీలవంటివారు. ప్రజలకు నమాజు చేయించమని అబూ బకర్(ర)కు చెప్పు.' 'అప్పుడు హజ్రత్ హఫ్సా(ర), హజ్రత్ ఆయెషా(ర)తో ఇలా అన్నారు, 'అయ్యో! నీవల్ల నాకు ఎప్పుడైనా మేలు జరుగుతుందా?.'[1]

**648.** అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) తనకు ఇలా చెప్పారని అజ్ జుహ్రి ఉల్లేఖించారు; అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఒక అన్సారీ సహాబి, ఆయన దైవప్రవక్త

---

పరిశుద్ధుడు) అబూబకర్(ర)కు మహాప్రవక్త(స) అంటే ఎంత ప్రేమ! ఎంత అనురాగం! నిజమైన ముస్లిమ్ ఎవరైనా దైవప్రవక్త ముహమ్మద్(స)ను ఇలానే ప్రేమిస్తాడు.

647-1. అంటే నీవు ఎంత ఆత్మశుద్ధి కలదానివైనా సవతివే కదా! నీవు నాకు ఎంత మంచి సలహా ఇచ్చావు? దానివల్ల దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) నా మీద ఆగ్రహోదగ్రులయ్యారు. ఈ హదీసు ద్వారా మేధావులైన ప్రజలు ఒక విషయాన్ని గ్రహించగలరు. అదేమిటంటే, అబూబకర్(ర) తప్ప మరొకరెవ్వరూ నమాజుకు నాయకత్వం సుతరామూ వహించకూడదన్నది ఆయన(స) అభిప్రాయం. మహాప్రవక్త(స) ఎక్కువగా ఇష్టపడే తన ప్రియతమ సతీమణి హజ్రత్ ఆయెషా(ర) మూడుసార్లు ఈ విషయంలో జోక్యం చేసుకుని విన్నవించుకున్నప్పటికీ ఆయన(స) ఒప్పుకోలేదు; ఆమె సలహాను తిరస్కరించారు.

**మహాశయులు ముహమ్మద్(స)గారికి కడు విధేయులు, దైవప్రవక్త(స)గారి సేవలో సతతం నిమగ్నులై ఉండేవారు; దైవప్రవక్త(స)గారి మరణానికి కారణమైన వ్యాధిలో ఆయన(స) ఉన్నప్పుడు, హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్(రజి) నమాజులో ప్రజలకు నాయకత్వం వహించేవారు. సోమవారం రోజు వచ్చినప్పుడు ప్రజలు నమాజు కోసమని బారులు తీరి నిలబడ్డారు. అప్పుడు దైవప్రవక్త(స) తాను నివాసం ఉంటున్న గది ద్వారానికున్న పరదాను తొలగించి నిలబడి మమ్మల్ని చూడసాగారు. శుభప్రద మైన ఆయన(స) గారి ముఖం పవిత్ర గ్రంథమైన దివ్యఖుర్‌ఆన్‌లోని ఒక పేజీ మాదిరిగా మెరిసిపోతోంది. ఆయన(స)గారి ముఖం అందాలు జాలువారుతూ అంత నిర్మలంగా, అంత పరిశుద్ధంగా ఉందన్నమాట. తరువాత ఆయన(స) చిరు మంద హాసం చేసి, సంతోషంగా నవ్వేశారు.[1] దైవప్రవక్త(స) ముఖారవిందాన్ని చూసిన మాకు కలిగిన ఆనందం వర్ణనాతీతం. ఆ ఆనంద పారవశ్యంలో మేము నమాజును భంగపరిచే వారమే. అబూబకర్(ర) తన పాదాలను వెనక్కి తిప్పి నమాజు పంక్తిలో చేరబోయారు. దైవప్రవక్త(స) నమాజుకు నాయకత్వం వహించటానికి వస్తారని భావించి ఆయన(ర) వెనక్కి తగ్గారు. కాని మహాప్రవక్త(స) మాకు సైగ ద్వారా 'మీ నమాజును కానివ్వండి' అని చెబుతూ ద్వారాన్ని పరదాను లాగి మూసివేశారు. తరువాత అదే రోజున మహాప్రవక్త(స) పరమపదించారు. సల్లల్లాహు అలైహి వ సల్లమ్.**

**649.** **అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; మహాప్రవక్త(స) అనారోగ్య స్థితిలో ఉన్నప్పుడు మూడు రోజుల వరకు ఇంట్లో నుంచి బయటికి రాలేదు. (ఆ రోజుల్లో ఒకసారి) నమాజు కోసం ఇఖామత్ చెప్పబడింది. అప్పుడు అబూబకర్ సిద్దీఖ్(రజిఅన్) నమాజుకు నేతృత్వం వహించటానికి ముందుకు పోబోయారు. ఇంతలోనే మహాప్రవక్త(స) తమ ఇంటి ద్వారానికున్న పరదాను పట్టుకుని పైకి లేపారు. అప్పుడు అత్యంత శుభప్రదమైన ఆయన(స) గారి ముఖారవిందం మాకు**

---

648-1. ఆయన(స) సంతోషపడ్డారు. ఎందుకంటే ఇస్లామ్ ధర్మసౌధానికి చెందిన అతిపెద్దది, అత్యంత ముఖ్యమైనది అయినటువంటి స్తంభం 'నమాజు' విషయంలో ముస్లింలు ఎంతో స్థిరంగానూ, ఎంతో చురుకుగానూ ఉండటాన్ని గమనించారు. మరొక హదీసులో ఏమని ఉందంటే, 'సోమవారం నాడు నా ఉమ్మత్‌లు (నా సంఘ సభ్యులు) చేసిన కర్మలు నాకు సమర్పించబడతాయి.' కనుక ముస్లిములందరూ మంచి పనులు, సత్కార్యాలు చెయ్యటానికి ప్రయత్నం చెయ్యాలి, దైవప్రవక్త(స) వాటిని చూసి సంతోషించాలి.

కనిపించింది. ఆయన(స)గారి ముఖం అత్యంత శోభాయమానంగా ఉంది. ఆయన(స)గారి ముఖం కంటే ఎక్కువ అందమైనదీ, ఎక్కువ మంచిదీ అయిన వస్తువు ఏదీ అంతవరకు మొత్తం ప్రపంచంలో మేము చూడనే లేదు. తరువాత దైవప్రవక్త(స) తన పవిత్ర హస్తంతో హజ్రత్ అబూబకర్(ర)ను ముందుకు పోయి ఇమామత్ చెయ్యమని సైగ చేశారు. అప్పుడు తన ఇంటి ముఖద్వారానికి ఉన్న తెరను ఆయన(స) కిందికి దించేశారు. ఆ తరువాత మరణించే వరకు ఆయన(స)గారిని మేము చూడలేకపోయాము.[1]

**650.** తన తండ్రిగారైన అబ్దుల్లా బిన్ ఉమర్(రజిఅన్) ఇలా చెప్పారని హమ్జా బిన్ అబ్దుల్లా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారు గురిఅయినటువంటి వ్యాధి తీవ్రస్థాయికి చేరుకున్నప్పుడు, ప్రజలు నమాజును చేయించే విషయం గురించి మీ ఆజ్ఞ ఏమిటి? అని ఆయన్ని(స) వినయపూర్వకంగా అడిగారు. దానికి సమాధానంగా ఆయన(స) గారు 'నమాజుకు నాయకత్వం వహించ మని అబూబకర్(ర)కు చెప్పండి' అని సెలవిచ్చారు. అప్పుడు హజ్రత్ ఆయెషా(ర) ఇలా విన్నవించుకున్నారు, 'హజ్రత్ అబూబకర్(ర) మృదు మనస్కులు. ఖుర్ఆన్ పఠించేటప్పుడు ఆయన(ర) గారు ఎక్కువగా విలపిస్తారు.' ఆయన(స) గారు మళ్ళీ ఇలా సెలవిచ్చారు. 'ఆయనే నమాజు చేయించాలని నాపరంగా ఆయన(ర)కే చెప్పండి.' హజ్రత్ ఆయెషా(ర), మళ్ళీ పై విధంగానే విన్నవించుకున్నారు. దైవ ప్రవక్త(స) మళ్ళీ ఇలా సెలవిచ్చారు. 'నమాజు చేయించమని ఆయన(ర)కే చెప్పండి. మీరైతే దైవప్రవక్త యూసుఫ్ గారికి చెందిన స్త్రీలలోని వారు మాదిరిగా కనిపిస్తున్నారు.'

## 47వ అధ్యాయం

### ఏ వ్యక్తి అయినా ప్రబలమైన కారణం వల్ల నమాజు పంక్తిని వదిలేసి ఇమామ్ ప్రక్కన నిలబడితే అది ధర్మసమ్మతమేనా?

**651.** హజ్రత్ ఆయెషా(ర) ఇలా అన్నారని, ఉర్వా గారి తండ్రి ఉల్లేఖించారు, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) అస్వస్థులుగా ఉన్నప్పుడు, ప్రజలకు

649-1. ఈ హదీసు ద్వారా స్పష్టంగా తెలిసే విషయం ఏమిటంటే; దైవప్రవక్త ముహమ్మద్ (స)గారు మరణించే వరకు హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్(ర) నమాజ్ చేయించటానికి దైవప్రవక్త(స) గారి ఖలీఫాగా (ప్రతినిధిగా)ఉన్నారు. కాని స్వయంగా మహాప్రవక్త (స)యే వచ్చి హజ్రత్ అబూబకర్(ర) గారిని ఇమామత్ పదవి నుంచి తొలగించారు అనే షియా పెద్దల అభిప్రాయం, అనుమానం అసత్యమైనది.

నమాజు చేయించాలనీ, నమాజుకు నాయకత్వం వహించాలనీ ఆయన (స) హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్(ర) గారిని ఆజ్ఞాపించారు. అప్పటినుంచి అబూ బకర్(ర) జనులకు నమాజు చేయిస్తూ ఉండేవారు. ఉర్వా గారు ఇలా ఉల్లేఖించారు; ఒకసారి ఏమి జరిగిందంటే, దైవప్రవక్త ముహమ్మద్(స) గారికి వ్యాధి నుండి కొంచెం ఉపశమనం కలిగింది. అప్పుడు ఆయన(స) బయటికి వచ్చేశారు. ఆ సమయంలో హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్(ర) సామూహిక నమాజుకు సారథ్యం వహిస్తూ ఉన్నారు (ఇమామత్ చేస్తున్నారు). అబూబకర్(ర) గారు దైవప్రవక్త(స)గారిని చూడగానే ముసల్లా నుంచి వైదొలిగారు. అప్పుడు దైవప్రవక్త(స)గారు, 'వద్దు, ఓ అబూబకర్(ర) మీరు మీ స్థానంలోనే ఉండండి' అని సైగ చేస్తూ సెలవిచ్చారు. ఆ తరువాత దైవప్రవక్త(స) హజ్రత్ అబూబకర్ (ర) పక్కన నమాజులో కూర్చుండిపోయారు– ఆయన(ర)తో సమానంగా. అప్పుడు హజ్రత్ అబూబకర్(ర), దైవప్రవక్త(స)గారి నమాజును అనుసరిస్తూ నమాజు చేస్తున్నారు. ప్రజలేమో అబూబకర్(ర) నమాజును అనుసరించసాగారు.

## 48వ అధ్యాయం

**ఒక వ్యక్తి ప్రజలకు నమాజు చేయిస్తున్నాడు. అంటే నమాజుకు నేతృత్వం వహిస్తు న్నాడు, ఇమామత్ చేస్తున్నాడు. అంతలో అసలు ఇమామ్ వచ్చేశాడు. ఈ కారణంగా నమాజు చేయిస్తున్న వ్యక్తి వెనక్కి జరిగిపోయాడు. అంటే ముఖ్తదీలలో కలిసి పోయాడు. లేదా అతను వెనక్కి జరిగిపోలేదు. ఏ స్థితిలోనైనా సరే అతని నమాజు ధర్మసమ్మతమైనదే అవుతుంది. ఈ విషయాన్ని ఈ అధ్యాయంలో హజ్రత్ ఆయెషా (ర), దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) సెలవీయగా విని ఉల్లేఖించారు.**[1]

**652.** సహల్ బిన్ సాద్ సాయిదీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) బనీ అమ్ర్ బిన్ ఔఫ్ తెగకు చెందిన ప్రజల వద్దకు వెళ్ళారు. (ఆ తెగవారు ఖుబాలో ఉండేవారు). వారి మధ్య సంధిని కుదిర్చి శాంతి

48–1. ఈ అధ్యాయంలో వచ్చిన రెండు విషయాలు పై హదీసుల్లో కూడా వచ్చాయి. ఇంకా ఈ హదీసులో కూడా వచ్చాయి. ఉర్వా గారి ఉల్లేఖనంలో హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్(ర) గారు వెనక్కి జరిగారు అని చెప్పటం జరిగింది. అబ్దుల్లా గారి ఉల్లేఖనంలో హజ్రత్ అబూబకర్(ర) గారు వెనక్కి జరగాలని సంకల్పించుకున్నారు అని మాత్రమే వచ్చింది.

సౌభ్రాతృత్వాలను పునరుద్ధరించటానికి ఆయన(స) అక్కడకు వెళ్ళారు. (అక్కడ ఆయన(స)కు ఆలస్యమైపోయింది). ఇంతలోనే నమాజుకు వేళ అయిపోయింది. ముఅజ్జిన్ అయిన హ॥రత్ బిలాల్ (ర) అబూబకర్ సిద్దీఖ్(ర) వద్దకు వెళ్ళి ఇలా అన్నారు. 'నేను ఇఖామత్ చెబుతాను, మీరు నమాజు చేయిస్తారా?' ఆయన(ర) 'మంచిది' అని చెప్పి నమాజును ప్రారంభించారు. అంతలోనే దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) అక్కడకు విచ్చేశారు. ప్రజలు నమాజు చేస్తున్నారు. ఆయన(స) నమాజు పంక్తుల్ని చీల్చుకుంటూ లోపలకు చొచ్చుకొనిపోయారు. మొదటి పంక్తిలోకి ప్రవేశించి నిలబడ్డారు. అప్పుడు ప్రజలు చప్పట్లు కొట్టడం ప్రారంభించారు. కాని హ॥రత్ అబూబకర్(ర) నమాజులో నిమగ్నమై ఉన్నప్పుడు తనకు ఇరువైపులా జరిగే విషయాలను పట్టించుకోరు. ప్రజలు చప్పట్లు కొట్టటాన్ని ఉధృతం చేశారు. అప్పుడు ఆయన(ర) తిరిగి చూస్తే మహాప్రవక్త ముహమ్మద్(స) అక్కడ నిలబడి ఉన్నారు. దైవప్రవక్త(స) హ॥రత్ అబూబకర్(ర)కు సైగ చేసి తన స్థానంలోనే ఉండి నమాజు చేయించమని చెప్పారు. కాని ఆయన(ర) తన రెండు చేతులను ఎత్తి అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు; దైవప్రవక్త(స) ఇమామత్ చెయ్యమని ఆయన్ని(ర) ఆజ్ఞాపించినందుకుగాను, ఆయన్ని ఈ పదవికి యోగ్యుడుగా భావించి నందుకుగాను. తరువాత ఆయన(ర) వెనక్కి జరిగి వచ్చారు. మొదటి పంక్తిలో కలిసిపోయారు. ఆ తరువాత దైవప్రవక్త ముహమ్మద్(స) ముందుకు పోయి ఇమామ్ స్థానంలో నిలబడి నమాజు చేయించారు. నమాజును పూర్తిచేసిన తరువాత ఇలా సెలవిచ్చారు; "ఓ అబూబకర్! మీరు మీ స్థానంలో ఎందుకు నిలబడలేదు? అలా చెయ్యమని నేను మిమ్మల్ని ఆజ్ఞాపించాను గదా!" అప్పుడు అబూబకర్(ర) ఇలా విన్నవించుకున్నారు; "బాగుంది! చాలా బాగుంది! అబూ ఖహాఫ కుమారుణ్ణి చూడండి. నమాజులో అతన్ని అల్లాహ్ ప్రవక్తకు ముందు నిలబడి ఉండటాన్ని చూడండి. ఇది ఎక్కడన్నా జరిగే విషయమేనా? (సంభవ సాధ్యమైన విషయమేనా?)" అప్పుడు దైవప్రవక్త ముహమ్మద్(స) ప్రజల్ని ఉద్దేశించి ఇలా బోధించారు; మీరు ఇన్నిసార్లు నమాజులో చప్పట్లు ఎందుకు కొట్టారు? చూడండి! ఇకముందు నమాజులో ఎవరికైనా ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు అతను 'సుబ్‌హానల్లాహ్' (అల్లాహ్ పరిశుద్ధుడు) అని పలకాలి. అతను ఇలా అన్నప్పుడు మాత్రమే అతని పట్ల శ్రద్ధ వహించటం జరుగుతుంది. చప్పట్లు కొట్టడం మహిళలు చెయ్యవలసిన పని.

## 49వ అధ్యాయం

**ఖుర్ఆన్‌ను పారాయణం చెయ్యటంలో సమానమైన ప్రావీణ్యతగల వ్యక్తులు ఎక్కువ మంది ఉన్నప్పుడు వారిలో వయస్సులో పెద్దవాడైన వ్యక్తి నమాజుకు నాయకత్వం వహించాలి.**

**653.** మాలిక్ బిన్ హువైరిస్(రజిఅన్) (ఒక సహాబి) ఇలా ఉల్లేఖించారు; మేము చాలా మందిమి నవ యువకులం కలిసి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి సన్నిధికి వెళ్ళాం. ఇరవై రాత్రుల వరకు మేము ఆయన(స)గారి సహచర్యంలో ఉన్నాం. ఆయన(స)గారి శుభప్రదమైన స్వభావంలో కారుణ్యగుణం చాలా ఎక్కువగా ఉండేది. ఆయన(స) మా యొక్క నిరుపేద స్థితిని గమనించి ఇలా సెలవిచ్చారు;

"మీరు మీ దేశానికి తిరిగి వెళ్ళండి. అక్కడి ప్రజలకు ధార్మిక విషయాలను బోధించండి (మీరు అలా చేస్తే అది ఎంతో మేలైన విషయం). ఫలానా నమాజు, ఫలానా సమయంలో చెయ్యమని ఇంకా ఫలానా నమాజు, ఫలానా వేళలో చెయ్యమని వారికి చెప్పండి. ఇంకా నమాజుకు వేళ అయినప్పుడు, మీలోని ఒక వ్యక్తి అజాన్ ఇవ్వాలి. ఇంకా మీలోని వయస్సులో పెద్దవాడైన వ్యక్తి నమాజుకు నాయకత్వం వహించాలి.[1]

## 50వ అధ్యాయం

**ఒకవేళ ఇమామ్ (నమాజుకు నాయకత్వం వహించే వ్యక్తి) ఎవరినైనా కలుసుకోవటానికి ఎక్కడికైనా వెళ్ళినట్లయితే, ఆ ఇమామ్ అక్కడి ప్రజలకు ఇమామ్ కాగలడు. అంటే అక్కడి ప్రజలకు నమాజు చేయించగలడు. వారికి నమాజులో నేతృత్వం వహించగలడు.**

**654.** ఇత్బాన్ బిన్ మాలిక్ అన్సారీ ఇలా ఉల్లేఖించారు; ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మా ఇంటికి వచ్చారు, ఇంట్లోకి ప్రవేశించటానికి అనుమతిని అడిగారు. నేను వెంటనే ఆయన(స)గారికి అనుమతి ఇచ్చాను. తరువాత

---

653–1. ఎందుకంటే వారందరూ ధర్మజ్ఞానంలో, ఖుర్ఆన్ పారాయణం చెయ్యటంలో సమానమైన ప్రావీణ్యం కలవారు. ఎందుకంటే, వారిలోని ప్రతి ఒక్కడు ఇరవై రాత్రుల వరకు మహాప్రవక్త(స)గారి సహచర్యంలో ఉన్నాడు. కనుక ఎక్కువ వయస్సు ఉన్న వ్యక్తికి ప్రాధాన్యం ఇవ్వబడింది.

ఆయన(స) నాతో ఇలా అన్నారు; "నేను మీ ఇంట్లో ఎక్కడ నమాజు చేసుకోవచ్చు?" అప్పుడు నేను నాకు ఇష్టమైన ఒక స్థలాన్ని ఆయన(స)గారికి చూపించాను. దైవ ప్రవక్త(స) నేను చూపించిన స్థలంలోనే నమాజు చెయ్యటానికి నిలబడిపోయారు. మేము ఆయన(స)గారి వెనుక పంక్తులు కట్టి నమాజు కోసం నిలబడ్డాం. ఆ తరువాత ఆయన(స)గారు సలామ్ చేశారు. మేము కూడా ఆయన(స)గారిని అనుసరిస్తూ సలామ్ చేశాం.

## 51వ అధ్యాయం

**ఇమామ్ నియామకం జరిగేది ప్రజలు ఆయన్ని అనుసరించాలనే. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) తన మరణానికి కారణమైన వ్యాధిలో ఉన్నప్పుడు ఒకసారి ప్రజలకు కూర్చుని నమాజు చేయించారు (అంటే కూర్చుని నమాజుకు నాయకత్వం వహించారు), ప్రజలు నిలబడి నమాజు చేశారు. అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఇమామ్‌కు వెనుక నిలబడి నమాజు చేసే ప్రజల్లోని వారెవరైనా, ఇమామ్‌కు ముందు తమ శిరస్సును ఎత్తనట్లయితే (రుకూలోగానీ లేదా సజ్దాలోగానీ) అప్పుడు వారు మళ్ళీ రుకూలోకి గానీ సజ్దాలోకి గానీ వెళ్ళిపోవాలి. ఇంకా వారు ఎంతసేపైతే ఇమామ్‌కు ముందు తల ఎత్తి ఉంచారో అంతసేపు రుకూలోను, సజ్దాలోను ఆగివుండాలి. ఆ తరువాత వారు మళ్ళీ ఇమామ్‌ను అనుసరించాలి. ఇమామ్ హసన్ బస్రీ(రహ్మలై)గారు ఇలా సెలవిచ్చారు; ఏ వ్యక్తి అయినా ఇమామ్‌తోపాటు రెండు రకాతుల నమాజు చేస్తే, కాని సజ్దా చెయ్యకపోతే, అప్పుడు అతను చివరి రకాతు కోసం రెండు సజ్దాలు చెయ్యాలి. ఆ తరువాత మొదటి రకాతును సజ్దాతోపాటు మళ్ళీ చెయ్యాలి. ఇంకా ఎవరైనా సజ్దా చెయ్యటం మరిచిపోయి నిలబడినట్లయితే అప్పుడు అతను సజ్దాలోకి వెళ్ళిపోవాలి.**

**655.** ఉబేదుల్లా బిన్ అబ్దుల్లా బిన్ ఉత్బా బిన్ మసూద్ ఇలా ఉల్లేఖించారు; నేను ఒకసారి హజ్రత్ ఆయెషా(రజిఅన్‌హా) వద్దకు వెళ్ళాను. "ఓ ఆయెషా(ర)! దైవ ప్రవక్త ముహమ్మద్(స)గారి వ్యాధి యొక్క స్థితిని గురించి వివరించండి" అని అడిగాను. అప్పుడు ఆమె(ర)గారు ఇలా సెలవిచ్చారు; దైవప్రవక్త(స) వ్యాధిగ్రస్తులై ఉన్నప్పుడు, 'ప్రజలు నమాజు చేసుకున్నారా?'అని అడిగారు. మేము, 'ఓ దైవప్రవక్తా! లేదు. ప్రజలు ఇంకా నమాజు చెయ్యలేదు. మీ రాక కోసం నిరీక్షిస్తున్నారు' అని విన్నవించుకున్నాం. ఆయన(స)గారు ఇలా సెలవిచ్చారు; 'సరే, స్నానం చెయ్యటానికి

నా కోసం నీళ్ళు తోడండి' హజ్రత్ ఆయెషా(ర), 'మేము మీ కోసం నీళ్ళు తోడి పెట్టాం' అని అన్నారు. దైవప్రవక్త(స) తలంటి స్నానం (గుసుల్) తరువాత లేవటానికి ప్రయత్నించారు. కాని సొమ్మసిల్లి పడిపోయారు. స్పృహలోకి రాగానే ఆయన(స), 'ప్రజలు నమాజు చేశారా?' అని అడిగారు. 'మహాప్రవక్తా! ప్రజలు ఇంకా నమాజు చెయ్యలేదు. వారందరూ మీ రాక కోసం నిరీక్షిస్తున్నారు.' అని మేము విన్నవించుకున్నాం. అప్పుడు ఆయన(స) ఇలా సెలవిచ్చారు, 'మంచిది, నా స్నానం కోసం గంగాళంలో నీళ్ళు తోడండి'. మేము నీళ్ళు తోడిపెట్టాము. ఆయన(స)గారు గుసుల్ చేసుకున్నారు. తరువాత లేవటానికి ప్రయత్నించారు. కాని సొమ్మసిల్లి పడిపోయారు. తరువాత స్పృహలోకి వచ్చినప్పుడు ఆయన(స) ఇలా అడిగారు; "ప్రజలు నమాజు చేశారా?" మేము మళ్ళీ ఇలా విన్నవించుకున్నాం: లేదు! ఓ దైవప్రవక్తా! వారు మీ కోసం ఎదురు చూస్తున్నారు. ఆయన(స)గారు మళ్లీ ఇలా సెలవిచ్చారు; "నేను స్నానం చెయ్యదలుచుకున్నాను, నా కోసం నీళ్ళు తోడండి". ఆ తరువాత ఆయన(స) కూర్చుని గుసుల్ చేశారు. లేవటానికి ప్రయత్నం చేశారు. కాని సొమ్మసిల్లి పడిపోయారు. తరువాత ఆయన(స) లేచి కూర్చున్నారు. గుసుల్ చేసుకున్నారు. లేవటానికి ప్రయత్నం చేశారు. కాని స్పృహ తప్పిపడిపోయారు. మళ్ళీ స్పృహలోకి వచ్చి, 'ప్రజలు నమాజు చేసుకున్నారా?' అని అడిగారు. మేము 'లేదు మహాప్రవక్తా! వారు ఇంకా నమాజు చేసుకోలేదు. మీ రాక కోసం ఎదురు చూస్తున్నారు.' అని విన్నవించుకున్నాం. ప్రజల స్థితి కూడా ఇలాగే ఉంది; వారు ఇషా నమాజు కోసం మసీదులో సమావేశమై దైవప్రవక్త(స)గారి రాకకోసం నిరీక్షిస్తున్నారు. అప్పుడు మహాప్రవక్త(స), ప్రజలకు నమాజు చేయించమనీ, నమాజుకు నాయకత్వం వహించమనీ అబూబకర్ సిద్దీఖ్(ర) గారికి సందేశం పంపించారు. ఆయన(స)గారి సందేశాన్ని చేరవేసే వ్యక్తి అబూబకర్(ర) వద్దకు వెళ్లి ఇలా అన్నాడు; 'మీరు ప్రజలకు నమాజు చేయించాలని దైవప్రవక్త(స) ఆజ్ఞాపించారు. ఈ విషయాన్ని మీకు చెప్పమని నన్ను పంపించారు.' అబూబకర్ సిద్దీఖ్(ర) సున్నితమైన హృదయం కలవారు. కనుక ఆయన(ర) హజ్రత్ ఉమర్(ర)ను ఉద్దేశించి 'ఓ ఉమర్! ప్రజలకు నమాజు చేయించు.' అని అన్నారు. దానికి సమాధానంగా హజ్రత్ ఉమర్(ర) ఇలా అన్నారు; 'ప్రజలకు నమాజు చేయించటానికి (ఇమామత్‌కు) మీరు ఎక్కువ సమర్థులు, ఎక్కువ యోగ్యత కలవారు'. మొత్తానికి ఆ దినాలలో అబూబకర్(ర)గారే నమాజు చేయిస్తూ ఉండేవారు. తరువాత దైవప్రవక్త(స)గారికి కొంచెం స్వస్థత చేకూరగానే ఆయన(స) ఇద్దరు

పురుషుల సహాయంతో జుహ్ర్ నమాజు కోసం మసీదుకు వచ్చారు. ఆ ఉభయుల్లో ఒకరు హజ్రత్ అబ్బాస్(ర). అప్పుడు అబూబకర్(ర) నమాజు చేయిస్తున్నారు. అబూబకర్(ర) దైవప్రవక్త(స) గారి రాకను గమనించి వెనక్కి జరగబోయారు. కాని ఆయన(స) సైగ ద్వారా ఇలా సూచించారు; 'అక్కడే నిలబడి ఉండండి. వెనక్కి పోకండి.' ఆ తరువాత ఆ ఇద్దరు పురుషులను ఉద్దేశించి, 'నన్ను అబూబకర్(ర) వద్దకు తీసుకుపోయి ఆయన పక్కన కూర్చోబెట్టండి' అని సెలవిచ్చారు. ఆయన(స) ఆజ్ఞానుసారం వారు ఆయన్ని(స) అక్కడ కూర్చోబెట్టారు. అబూబకర్(ర) గారైతే నమాజులో మహాప్రవక్త(స)ను అనుసరిస్తున్నారు. ప్రజలు మాత్రం అబూబకర్(ర) గారి నమాజును అనుసరిస్తున్నారు. ఇంకా దైవప్రవక్త(స)గారు కూర్చొని నమాజు చేస్తూ ఉన్నారు. ఉబేదుల్లా బిన్ అబ్దుల్లా ఇలా అన్నారు; నేను ఈ హదీసును హజ్రత్ ఆయెషా(ర) చెప్పగా విని అబ్దుల్లా బిన్ అబ్బాస్(ర) వద్దకు వెళ్ళి ఆయన గారితో ఇలా అన్నాను; దైవప్రవక్త(స)గారి వ్యాధి యొక్క స్థితిని వివరిస్తూ హజ్రత్ ఆయెషా(ర) ఉల్లేఖించిన హదీసును నేను మీకు వివరించేదా? ఆయన(ర) 'సరే వివరించండి' అని అన్నారు. అప్పుడు నేను హజ్రత్ ఆయెషా(ర)గారి ఈ హదీసునే అబ్దుల్లా బిన్ అబ్బాస్(ర)గారికి వివరించాను. ఆయన (ర) ఈ హదీసులోని ఏ విషయాన్నీ తిరస్కరించలేదు. కేవలం ఒక్క విషయం గురించి ఆయన(ర) ఇలా అన్నాను; 'హదీసులో ప్రస్తావించబడిన రెండో వ్యక్తి ఎవరో ఆయన పేరు ఏమిటో హజ్రత్ ఆయెషా(ర) మీకు చెప్పారా?' దానికి సమాధానంగా నేను 'లేదు' అని అన్నాను. హజ్రత్ అబ్బాస్(ర), ఆ రెండో వ్యక్తి హజ్రత్ అలీ(ఇబ్నె అబీతాలిబ్ –(ర) అని వెల్లడించారు.

**656.** విశ్వాసుల తల్లి అయిన హజ్రత్ ఆయెషా(ర) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) వ్యాధిగ్రస్త స్థితిలో తన స్వగృహంలో కూర్చుని నమాజు చేశారు. ఇంకా ఆయన(స)గారి వెనుక కొందరు ప్రజలు నిలబడి నమాజ్ చేశారు. దైవప్రవక్త(స) వారిని కూర్చుని నమాజు చెయ్యమని సైగ ద్వారా తెలియజేశారు. నమాజు చెయ్యటం పూర్తయిన తరువాత ఆయన(స) వారిని ఉద్దేశించి ఇలా సెలవిచ్చారు; ప్రజలు ఇమామ్‌ను అనుసరించాలని ఆయన నియా మకం జరుగుతుంది; ఇమామ్ రుకూ చేసినప్పుడు మీరు కూడా రుకూ చెయ్యండి. ఆయన తన శిరస్సును ఎత్తినప్పుడు మీరు కూడా మీ శిరస్సులు ఎత్తండి. ఇంకా

ఆయన 'సమి అల్లాహులిమన్ హమిదహ్' అని అన్నప్పుడు మీరు 'రబ్బనా వలకల్ హమ్ద్'[1] అని అనండి. ఇంకా ఆయన కూర్చొని నమాజు చేసినప్పుడు మీరందరూ కూర్చొని నమాజు చెయ్యండి.

**657.** అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్(స) ఒక గుర్రం మీద స్వారీ చేస్తూ ఉండగా క్రిందపడి పోయారు. ఆయన(స)గారి శరీరంలోని కుడి భాగానికి దెబ్బలు తగిలి గాయాలయ్యాయి. అప్పుడు ఆ స్థితిలో ఆయన(స)గారు ఒక నమాజును కూర్చొని చేశారు. మేము కూడా ఆయన(స) గారి వెనుక ఆయన్ని అనుసరిస్తూ కూర్చునే నమాజు చేశాం. నమాజును పూర్తి చేసిన తరువాత దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; 'ఇమామ్ నియామకం ఎందుకు జరుగుతుందంటే, ముఖ్తదీలు ఆయన్ని అనుసరించాలని. ఆయన గనుక నిలబడి నమాజు చేస్తే, మీరు కూడా నిలబడే నమాజు చెయ్యండి; ఆయన రుకూ చేస్తే మీరు కూడా రుకూ చెయ్యండి. ఇంకా ఆయన రుకూలో నుంచి తన శిరస్సును ఎత్తితే మీరు కూడా మీ శిరస్సును ఎత్తండి. ఇంకా ఆయన 'సమి అల్లాహులిమన్ హమిదహ్' అని అంటే మీరు 'రబ్బనా వలకల్ హమ్ద్' అనండి. ఇంకా ఆయన కూర్చొని నమాజ్ చేసినప్పుడు మీరు కూడా అందరూ కూర్చునే నమాజు చెయ్యండి.' ఇమామ్ అబూ అబ్దుల్లా బుఖారీ ఇలా అన్నారు; ఇంకా హుమైదీ ఇలా అన్నారు; దైవప్రవక్త(స) గారు సెలవిచ్చిన విషయం, అంటే 'ఇమామ్ కూర్చుని గనుక నమాజు చేస్తే మీరందరు కూడా కూర్చునే నమాజు చెయ్యండి' ఇది పూర్వం ఆయన(స) వ్యాధిలో ఉన్నప్పుడు అన్న పాత విషయం. తరువాత ఆయన(స)గారి మరణానికి కారణమైన చివరి వ్యాధిలో ఉన్నప్పుడు ఆయన(స) కూర్చుని నమాజు చేశారు. ప్రజలు ఆయన(స)గారి వెనుక నిలబడి నమాజు చేశారు. ఆయన(స) ప్రజలను కూర్చోమని ఆజ్ఞాపించలేదు. కనుక దైవప్రవక్త(స) తన జీవితంలోని చివరి భాగంలో చేసిన చివరి పనుల్నే మనం అనుసరించాలి.

---

656-1. ఇమామ్ కేవలం 'సమిఅల్లాహులిమన్ హమిదహ్' అని మాత్రమే అనాలి; ముఖ్తదీలు 'రబ్బనాలకల్ హమ్ద్' లేదా 'రబ్బనావలకల్ హమ్ద్' లేదా 'అల్లాహుమ్మ రబ్బనా లకల్ హమ్ద్' అని అనాలి. ఈ విషయానికి ఆధారంగా ఇమామ్ అబూ హనీఫా(రహ్మాలై) గారు ఈ హదీసునే తీసుకున్నారు అని ఖస్తలాని గారు వ్యాఖ్యానించారు. ఇమామ్ షాఫయీగారు, ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ గారు ఏమన్నారంటే; ఇమామ్ పై రెండు కలిమాలను పఠించాలి. అదే విధంగా ముఖ్తదీలు కూడా పై రెండు కలిమాలను పఠించాలి.

## 52వ అధ్యాయం

**ఇమామ్ వెనుక నిలబడి నమాజ్ చేసే ముఖ్తదీలు సజ్దా ఎప్పుడు చెయ్యాలి? అనస్ (రజిఅన్) దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని ఉల్లేఖించారు; 'ఇమామ్ సజ్దా చేసినప్పుడు మీరు కూడా సజ్దా చెయ్యండి.'**

**658.** బరా బిన్ ఆజిబ్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; (ఆయన అబద్ధం చెప్పే మనిషి కాదు). దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) 'సమిఅల్లాహులిమన్ హమిదహ్' అని పలికినప్పుడు మాలో ఎవరూ తమ వీపును సజ్దా చెయ్యటం కోసం వంచేవారం కాదు. చివరకు మహాప్రవక్త(స) సజ్దాలోకి వెళ్ళేవారు. అప్పుడు మాత్రమే- ఆయన(స)గారి తరువాతనే- మేము సజ్దాలోకి వెళ్ళేవారం.

**659.** అబూ ఇస్హాఖ్ ఇలా ఉల్లేఖించారు; పై హదీసులోని విషయాలే ఈ హదీసులో కూడా ఉల్లేఖించబడ్డాయి.

## 53వ అధ్యాయం

**ఎవడైతే ఇమామ్‌కంటే ముందే రుకూలో గానీ, సజ్దాలోగాని తన శిరస్సును ఎత్తుతాడో దాని పాపం.**

**660.** అబూ హురైరా(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు; మీలో ఎవడైతే ఇమామ్‌కంటే ముందే తన శిరస్సును ఎత్తుతాడో, అతను అల్లాహ్ తన తలను గాడిద తలగా మారుస్తాడనీ లేదా తన ముఖాన్ని గాడిద ముఖంగా మారుస్తాడనీ.[1] **భయపడడా?**

## 54వ అధ్యాయం

**ఒక బానిస నమాజుకు నాయకత్వం వహించటం (ఇమామత్ చెయ్యటం). ఇంకా విమోచనం పొందిన (విడుదల చేయబడిన) బానిస ఇమామత్ చెయ్యటం అనే విషయాలను గురించి. హజ్రత్ ఆయెషా(ర) గారి బానిస జక్వాన్ ఖుర్ఆన్ చూసి చదువుతూ ఇమామత్ చేసేవారు. ఆమె(ర) ఆయన వెనుక నిలబడి నమాజు**

---

660-1. ఇమామ్ అహ్మద్(రహ్మాలై) ఏమన్నారంటే, ఇమామ్‌కంటే ముందే తన శిరస్సును ఎత్తే ముఖ్తదీకి ఈ శిక్ష పడుతుంది అని హెచ్చరిక చేసినప్పుడు, ఇక అతను చేసే నమాజు ధర్మసమ్మతమే కాదు. ఈ హెచ్చరిక భావం గురించి అభిప్రాయ భేదం ఉంది; కొందరు ఏమన్నారంటే, దీని అర్థం గాడిద మాదిరిగా ఆ ముఖ్తదీని అజ్ఞానిగా, అవివేకిగా చేయటం జరుగుతుంది.

**చేసేవారు. అక్రమ సంతానం, నిరక్షరాస్యుడు, అజ్ఞాని, యవ్వనదశకు చేరని బాలుడు ఇమామత్ చెయ్యటానికి యోగ్యులేనా? అనే విషయం గురించి. మహాప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; ఇమామత్ చేసే వ్యక్తి ఖుర్ఆన్ గ్రంథాన్ని అందరి కంటే ఎక్కువగా తెలిసినవాడై ఉండాలి.**

**661.** అబ్దుల్లా బిన్ ఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; మొట్టమొదట ముహాజిర్లు మక్కా నుంచి బయలుదేరి ఖుబాలోని ఉస్బా అనే ప్రదేశానికి చేరినప్పుడు, ఇంకా అప్పుడు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) అక్కడకు రాలేదు. అప్పుడు అబూ హుజైఫా గారి బానిస అయినటువంటి సాలిమ్ ప్రజలకు నమాజు చేయించే వారు (ఇమామత్ చేసేవారు). ఆయనకు అందరికంటే ఎక్కువగా ఖుర్ఆన్ వాక్యాలు జ్ఞాపకం ఉండేవి.[1]

**662.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఉల్లేఖించారు; మీ నాయకుడు చెప్పింది వినండి. ఇంకా అతను చెప్పినట్లు చెయ్యండి. ఎండిన ద్రాక్ష పండంత తలకాయ కలిగి వున్న ఇథియోపియాకు చెందిన ఒక నల్లని బానిస మీకు నాయకుడుగా చెయ్యబడినా సరే.

## 55వ అధ్యాయం

**ఒకవేళ నమాజు చేయించే ఇమామ్ తన నమాజును పూర్తి చెయ్యలేకపోతే, ఇంకా ముఖ్తదీలు గనుక తమ నమాజును పూర్తిగా చేసుకుంటే...?[1]**

**663.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు; ఈ ఇమామ్‌లు మీ చేత నమాజు చేయిస్తారు. వారు గనుక తప్పులు లేకుండా సరియైన పద్ధతిలో నమాజు చేస్తే అప్పుడు మీకు పుణ్యం లభిస్తుంది. ఒకవేళ తప్పు చేస్తే అప్పుడు కూడా మీరు చేసిన నమాజుకు మీకు పుణ్యం లభిస్తుంది. తప్పులు చేసిన దానికి శిక్ష ఇమామ్‌కు పడుతుంది.

---

661-1. వాస్తవానికి అప్పటివరకు సాలిమ్ బానిసగానే ఉన్నారు. ఇంకా స్వతంత్రులు కూడా కాలేదు. దీనిద్వారా తెలిసిన విషయం ఏమిటంటే, ఒక బానిస కూడా నమాజుకు నాయకత్వం వహించగలడు. అతని ఇమామత్ ధర్మసమ్మతమైన విషయమే. ఇంకా అలా వచ్చిన ముహాజిర్లలో హజ్రత్ ఉమర్(ర), జైద్ బిన్ హారిసా(ర), ఆమిర్ బిన్ రబియ(ర) లాంటి ఉద్ధండులు కూడా ఉన్నారు. కాని సాలిమ్ వెనుక నిలబడి నమాజు చేసేవారు.

## 56వ అధ్యాయం

**తిరుగుబాటు చేసిన వ్యక్తి, 'బిదతి' (ధర్మంలో కొత్త పద్ధతులు ప్రవేశపెట్టిన వ్యక్తి)- ఈ ఇద్దరు వ్యక్తులు ఇమామత్ చేస్తే వారి వెనుక నమాజు చేయవచ్చునా లేదా?అనే విషయం గురించి. ఈ విషయం గురించి ఇమామ్ హసన్ బస్రీ (రహ్మాలై) ఏమన్నారంటే, 'నీవు అతని వెనుక నమాజు చెయ్యి అతని పాపం అతనిదే.' ఉబైదుల్లా బిన్ అదీ బిన్ ఖియార్ ఇలా ఉల్లేఖించారు; ఒకసారి నేను ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్(ర) దగ్గరకు వెళ్ళాను. అప్పుడు ఆయన కష్టాల కడలిలో చిక్కుకుని ఉన్నారు. ఆయన(ర)గారితో నేను ఇలా అన్నాను; 'మీరు ముస్లిములందరికీ నాయకులు. మీకు ఎలాంటి ఆపదలు సంభవించాయో మీరు చూస్తూనే ఉన్నారు. కల్లోల జనకుల నాయకుడు ప్రస్తుతం మాకు ఇమామత్ చేస్తున్నాడు. ఆయన ఇమామత్‌లో నమాజ్ చేస్తే, ఆయన్ని అనుసరిస్తే పాపాత్ములమై పోతామేమోనని మేము భయపడుతున్నాం.' అప్పుడు ఉస్మాన్(ర) ఇలా అన్నారు. "అన్ని కార్యాల్లోకెల్లా నమాజ్ ఉత్తమమైన కార్యం. మేలైన కార్యం. ప్రజలు మంచి పనులు చేస్తే వారితోపాటు మీరు కూడా ఆ మంచి పనులు చెయ్యండి. ప్రజలు గనుక చెడ్డ పనులు చేస్తే వారికి దూరంగా తొలగిపోండి." అజ్‌జుహ్‌రీ ఇలా అన్నారు, 'గత్యంతరం లేకపోతే తప్ప ఒక ముస్లిమ్ ఒక నపుంసకుడి వెనుక నమాజు చెయ్యరాదు, ఇది మా అభిప్రాయం.'**

**664.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) అబూజర్ (అనే సహాబీ)ని ఉద్దేశించి ఇలా సెలవిచ్చారని అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఉల్లేఖించారు; "శ్రద్ధగా

---

55-1. ఇమామ్ యొక్క నమాజులో ఏదైనా లోపం ఉండిపోతే, ఈ కారణం వల్ల ముఖ్తదీల నమాజు భంగం కాదు, వారు గనుక అన్ని షరతులను, నియమాలను పాటిస్తూ తమ నమాజును పూర్తి చేస్తే. ఉదాహరణకు, ఏ ఇమామ్ అయినా వుజూ లేకుండా, అపరిశుద్ధావస్థలో ఉండి నమాజు చేయించినట్లయితే, ముఖ్తదీలకు ఈ విషయం తెలియకపోయినట్లయితే అప్పుడు వారి నమాజు ధర్మసమ్మతం అవుతుంది. షాఫయీలు, మాలికీలు, ఇంకా ఇమామ్ అహ్మద్ గార్ల అభిప్రాయం కూడా ఇదే. హనఫీలు ఏమంటారంటే, ముఖ్తదీల నమాజు ఇమామ్ చేసే నమాజు మీద ఆధారపడి ఉంటుంది. ఇమామ్ చేసే నమాజు ధర్మసమ్మతమైతే ముఖ్తదీల నమాజు కూడా ధర్మసమ్మతమవుతుంది. ఇమామ్ చేసే నమాజు చెడిపోతే ముఖ్తదీల నమాజు కూడా చెడిపోతుంది.

**మాట విను, (అతను) చెప్పింది చెయ్యి; ఎండిన ద్రాక్షపండంత తలకాయ కలిగి ఉన్న ఇథియోపియాకు చెందిన ఒక నల్లని బానిస మీకు నాయకుడుగా చెయ్యబడినా సరే."**

## 57వ అధ్యాయం

### ఒకవేళ నమాజు చేసేవారు ఇద్దరు మాత్రమే ఉంటే అప్పుడు ముఖ్తదీ ఇమామ్‌కు కుడి వైపున అతనితో సమానంగా నిలబడాలి.[1]

**665.** అబ్దుల్లా బిన్ అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి నేను నా పినతల్లి అయిన ఉమ్ముల్ మోమినీన్(విశ్వాసుల తల్లి) హ్రజత్ మైమూన(రజిఅన్)గారి ఇంట్లో ఒక రాత్రి అంతా ఉండిపోయాను. మహాప్రవక్త ముహమ్మద్(స) ఇషా నమాజు చేసిన తరువాత మసీదు నుంచి ఇంటికి వచ్చారు. ఆయన(స)గారు ఇంట్లో నాలుగు రకాతులు నమాజు చేశారు. ఆ తరువాత నిద్రపోయారు. తరువాత ఆయన(స) నిద్ర నుంచి మేల్కొన్నారు; వుజూ చేసుకుని నమాజు చెయ్యసాగారు. నేను కూడా లేచి ఆయన(స)గారి ఎడమ వైపున నిలబడ్డాను. దైవప్రవక్త(స) నన్ను తన కుడి వైపునకు లాక్కున్నారు. ఆయన ఐదు రకాతులు నమాజు చేశారు. తరువాత రెండు రకాతులు నమాజు చేశారు. తరువాత నిద్రపోయారు. నేను ఆయన(స)గారి గురకల శబ్దాన్ని కూడా విన్నాను. ఆ తరువాత ఆయన(స) గారు లేచి ఫజర్ నమాజు కోసం మసీదుకు వచ్చారు.[1]

## 58వ అధ్యాయం

### ఒకవేళ ఎవరైనా ఒక మనిషి ఇమామ్‌కు ఎడమ వైపున నిలబడితే తరువాత ఇమామ్ అతన్ని లాగి తన కుడి వైపున నిలబడేలా చేస్తే, అప్పుడు ఆ ఉభయుల్లో ఎవరి నమాజూ భంగం కాదు.

**666.** హ్రజత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్(రజిఅన్) ఇలా వివరించారు; నేను ఒకనాటి రాత్రి ఉమ్ముల్ మోమినీన్ (విశ్వాసుల తల్లి) మైమూన (రజిఅన్‌హా) గారి ఇంట్లో పడుకున్నాను. దైవప్రవక్త ముహమ్మద్(స) ఆ రాత్రి ఆమె (ర)గారి ఇంట్లోనే

---

57-1. కొందరు ఏమన్నారంటే, ముఖ్తదీ కొంచెం వెనక్కు జరిగి నిలబడాలి.

665-1. ఈ హదీసు ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే, ఇమామ్‌తోపాటు కేవలం ఒకే మనిషి ఉన్నట్లయితే అప్పుడు అతను ఇమామ్‌కు కుడి వైపున నిలబడాలి. యువకుడైనా సరే లేదా యుక్తవయస్సుకు చేరని బాలుడైనా సరే. ఒకవేళ రెండో వ్యక్తి ఎవరైనా వచ్చినట్లయితే అప్పుడు అతను ఇమామ్‌కు ఎడమ వైపున నిలబడి 'తక్బీరె తహ్‌రీమా' పలకాలి. తరువాత ఇమామ్ ముందుకు జరగాలి. లేదా ఇద్దరు ముఖ్తదీలు వెనక్కి తొలగిపోవాలి.

ఉన్నారు (ఆ రోజు ఆమెగారి వంతు). ఆయన(స) వుజూ చేసుకున్నారు. తరువాత నిలబడి నమాజు చెయ్యసాగారు. నేను ఆయన (స)గారికి ఎడమ వైపున నిలబడ్డాను. ఆయన (స) నన్ను పట్టుకుని లాగి తన కుడి వైపున నిలబడేలా చేశారు. ఇంకా పద మూడు రకాతులు (వితర్ నమాజుతోసహా) నమాజు చేశారు. ఆ తరువాత నిద్ర పోయారు. గాఢనిద్రలో ఆయన (స) గురకలు పెట్టారు. ఆయన(స) నిద్రపోయే టప్పుడు గురకలు పెడతారు. ఆ తరువాత ముఅజ్జిన్ (నమాజు కోసం పిలవటానికి) ఆయన(స)గారి వద్దకు వచ్చాడు. ఆయన(స) బయలుదేరి మసీదుకుపోయి అక్కడ నమాజు చేశారు. కాని వుజూ చేసుకోలేదు. అమ్ర్ ఇలా అన్నారు; నేను ఈ హదీసును బుకైర్ బిన్ అబ్దుల్లాకు చెప్పాను. కురైబ్ కూడా తనకు ఈ హదీసునే వినిపించారు అని ఆయన చెప్పారు.

## 59వ అధ్యాయం

**నమాజును ప్రారంభించేటప్పుడు ఇమామత్ చేసే ఉద్దేశ్యం, సంకల్పం లేకపోతే తరువాత కొందరు వచ్చి చేరిపోతే అప్పుడు ఇమామత్ చేస్తే అంటే జమాఅత్‌కు నాయకత్వం వహిస్తే... అనే విషయం గురించి.**

**667.** అబ్దుల్లా బిన్ అబ్బాస్(ర) ఇలా ఉల్లేఖించారు; నేను నాకు పినతల్లి అయిన ఉమ్ముల్ మోమినీన్ మైమూన (రజిఅన్‌హా)గారి ఇంట్లో ఒక రాత్రి పండు కున్నాను. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఆ రాత్రి లేచి తహజ్జుద్ నమాజు చెయ్యటం ప్రారంభించారు. నేను కూడా ఆయన(స) గారితో పాటు నమాజులో చేరి పోయాను. ఆయన (స)గారు నా తలకాయ పట్టుకుని నన్ను తన కుడి ప్రక్కకు లాగి నిలబెట్టారు.

## 60వ అధ్యాయం

**ఒకవేళ నమాజు చేయించే ఇమామ్ నమాజులో పొడుగాటి ఖుర్ఆన్ సూరాను ప్రారంభించినట్లయితే, ఇంకా ముఖ్తదీలలో ఎవరికైనా అత్యవసరమైన పని ఏదైనా ఉన్నట్లయితే అప్పుడు అతను జమాఅత్‌లో నుంచి వైదొలిగి ఒంటరిగా నమాజు చేసుకుని వెళ్ళిపోతే, అది ధర్మసమ్మతమేనా?[1]**

---

60-1. ఈ అధ్యాయం ఉద్దేశ్యం ఏమిటంటే, ఇమామ్ వెనుక నిలబడి జమాఅత్‌తో నమాజు చేసే ఒక ముఖ్తదీ ఎవరైనా అనుసరణా (పైరవీ) సంకల్పాన్ని భంగపరుచు కోగలడు. అంటే ఇమామ్ వెనుక చేసే నమాజును భంగపరిచి ఒక ముఖ్తదీ ఒంటరిగా నమాజు అక్కణ్ణే చేసుకోవచ్చు. లేదా తన ఇంటికిపోయి అక్కడ కూడా నమాజు చేసుకోవచ్చు.

**668.** జాబిర్ బిన్ అబ్దుల్లా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ముఆజ్ బిన్ జబల్ (రజిఅన్) దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)తో కలిసి ఫజ్ర్ నమాజు చేసేవారు. తరువాత అక్కడ నుంచి వెళ్ళిపోయి తన తెగవారికి ఇమామ్‌గా అదే నమాజును చేయించేవారు.

**669.** అమ్ర్ బిన్ దీనార్ ఇలా ఉల్లేఖించారు; జాబిర్ బిన్ అబ్దుల్లా అన్సారీ (రజిఅన్) ఇలా అన్నారు; ముఆజ్ బిన్ జబల్(రజిఅన్) దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్(స) గారితో కలిసి నమాజు చేస్తూ ఉండేవారు; తరువాత ఆయన(ర) వెళ్ళిపోయి తన తెగ ప్రజలకు నమాజు చేయించేవారు. ఒకసారి ఆయన(ర) తన తెగవారికి ఇషా నమాజులో ఇమామత్ వహిస్తూ ఖుర్ఆన్‌లోని బఖరా సూరాను పఠించటం ప్రారంభించారు. అప్పుడు ముఖ్తదీలలో నుంచి ఒక వ్యక్తి తన నమాజును భంగపరిచి జమాఅత్‌లో నుంచి బయటికి వెళ్ళిపోయాడు. ముఆజ్ బిన్ జబల్(ర) అతను ఇలా చెయ్యటాన్ని ఖండించారు. ఈ వార్తను మహాప్రవక్త(స)గారి వద్దకు ఎవరో మోసుకుపోయారు. అప్పుడు దైవప్రవక్త(స) ముఆజ్ బిన్ జబల్(ర)ను ఉద్దేశించి ఇలా సెలవిచ్చారు; 'నీవు ప్రజల్ని పరీక్షకు గురిచేస్తున్నావు'. ఇలా ఆయన (స) మూడుసార్లు అన్నారు. ఆ తరువాత ఆయన(స) ముఫస్సల్ ఖుర్ఆన్‌లోని రెండు మధ్యస్థ సూరాలను పఠించమని అతనికి ఆజ్ఞాపించారు. అమ్ర్ బిన్ దీనార్ తాను ఆ సూరాల పేర్లను మరచిపోయానని చెప్పారు.

## 61వ అధ్యాయం

**ఇమామ్ ఖియామ్(నిలబడుట)ను సులభతరం చెయ్యాలి. (చిన్న సూరాలను పఠించాలి). ఇంకా రుకూ సజ్దాలను పూర్తిగా చెయ్యాలి.[1]**

**670.** అబూ మసూద్ అన్సారీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి ఒక వ్యక్తి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి వద్దకు వచ్చి ఇలా విన్నవించు కున్నాడు, "ఓ దైవప్రవక్తా! అల్లాహ్ మీద ప్రమాణం చేసి చెబుతున్నాను. నేను ఫజ్ర్ నమాజును జమాఅత్‌తో కలిసి చెయ్యలేకపోతున్నాను. ఎందుకంటే ఫలానా వ్యక్తి నమాజును పొడుగుగా, సుదీర్ఘంగా చేస్తారు." అబూ మస్ఊద్(ర) ఏమన్నారంటే,

61-1. హదీసులోనైతే పూర్తిగా సులభతరం చెయ్యాలి అనే విషయం ప్రస్తావించబడింది. నమాజులో నిలబడి ఉండటమే ప్రజలకు భారంగా తోస్తుంది. రుకూ, సజ్దాలు భారం అనిపించవు. కనుక సులభతరం చెయ్యటం అంటే నిలబడి నమాజు చెయ్యటం అనే ప్రక్రియను సులభతరం చెయ్యటం అని భావం.

"దైవప్రవక్త(స)ను హితోపదేశం చేస్తూ, ధార్మిక ఉపన్యాసం చేస్తూ ఆ రోజు ఉన్నంత కోపంగా, ఆగ్రహంగా నేను ఏ రోజూ, ఎన్నడూ ఆయన్ని(స) చూడలేదు." ఆయన(స) ఇలా సెలవిచ్చారు; "మీలో కొందరు దైవారాధన పట్ల, దైవధర్మం పట్ల ప్రజల్లో విరక్తినీ, అసహ్యతనూ కలిగించాలని కోరుతున్నారు. చూడండి! మీలో ప్రజలకు ఎవరు నమాజు చేయించినా వారు తేలికైన, సులభతరమైన నమాజును చేయించాలి. ఎందుకంటే, నమాజు చేసే ప్రజల్లో కొందరు బలహీనులుగా ఉంటే, మరికొందరు వృద్ధులుగా ఉంటారు. ఇంకా కొందరు పనులకు వెళ్ళేవారు ఉంటారు".

## 62వ అధ్యాయం

**మనిషి ఒంటరిగా నమాజు చేస్తూ ఉన్నప్పుడు తన ఇష్టప్రకారం ఆ నమాజును పొడిగించుకోవచ్చు.**

**671.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలాసెలవిచ్చారని హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు; మీలో ఎవరైనా ప్రజలకు నమాజు చేయించటం జరిగితే, అప్పుడు తేలికపాటి నమాజు చెయ్యండి. ఎందుకంటే నమాజు చేసే ప్రజలలో ఎవరైనా బలహీనులు ఉండవచ్చు. ఎవరైనా వ్యాధిగ్రస్తులు ఉండవచ్చు. ఎవరైనా వృద్ధులు ఉండవచ్చు. అయితే మీలో ఎవరైనా ఒంటరిగా తన కోసం నమాజు చేస్తే అప్పుడు తన కోరిక ప్రకారం నమాజును పొడిగించుకోవచ్చు.

## 63వ అధ్యాయం

**నమాజు చేయించే ఇమామ్ నమాజును పొడిగిస్తే అతనికి వ్యతిరేకంగా ఫిర్యాదు చెయ్యటం. అబూ వుసైద్(ర) తన కుమారుడైన మన్జర్‌తో ఇలా అన్నారు; కుమారా! నీవు మాకు పొడుగైన నమాజునే చేయించావు.**

**672.** అబూ మసూద్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒక వ్యక్తి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) వద్దకు వచ్చి ఆయన(స) గారికి ఇలా విన్నవించుకున్నాడు; "ఓ దైవప్రవక్తా! నేను ఫజ్ర్ నమాజును మసీదుకు వెళ్ళి జమాఅత్‌తో చెయ్యటం మానేశాను. నేను ఫలానా వ్యక్తి వల్ల (ఉబై బిన్ కాబ్) మసీదుకు వెళ్ళటం లేదు. ఎందుకంటే ఆయన సుదీర్ఘమైన నమాజు చేస్తారు." ఇది విని మహాప్రవక్త(స) ఆగ్రహోదగ్రులయ్యారు. ఆ రోజు ఆయన(స) గారికి కలిగిన ఆగ్రహం ఇంతకు ముందు ఎన్నడూ ఉపన్యాసం చేస్తూ, హితోపదేశం చేస్తూ కలిగి ఉండటాన్ని నేను చూడలేదు. తరువాత ఆయన(స)గారు ఇలా సెలవిచ్చారు. "ప్రజలారా! చూడండి. మీలో కొందరు నమాజు పట్ల ప్రజల్లో విరక్తి కలిగేలా చేస్తున్నారు. మీలో ఎవరైనా

నమాజుకు నాయకత్వం వహించినప్పుడు తేలికపాటి నమాజు చెయ్యండి. ఎందు కంటే, మీ వెనుక నిలబడి చేసే వారిలో బలహీనులు ఉంటారు, వృద్ధులు ఉంటారు, పనులు చేసుకునేవారు ఉంటారు".

**673.** జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ అన్సారీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి ఏమి జరిగిందంటే, ఒక వ్యక్తి నీళ్లు మోసే రెండు ఒంటెలను తీసుకుని వచ్చాడు. రాత్రి సమయం బాగా చీకటిపడింది. అతను హజ్రత్ ముఆజ్ (రజిఅన్)ను చూశాడు. ఆయన(ర)గారు ఇషా నమాజును చేయటాన్ని ఆ వ్యక్తి గమనించాడు. అప్పుడు అతను తన ఒంటెలను కూర్చోబెట్టి హజ్రత్ ముఆజ్(ర) వద్దకు నమాజు చేసే ఉద్దేశ్యంతో వచ్చాడు. హజ్రత్ ముఆజ్(ర) నమాజును ప్రారంభించి బఖరా సూరానో లేక నిసా సూరానో పారాయణం చెయ్యసాగారు. అప్పుడు ఆ వ్యక్తి నమాజును వదిలిపెట్టి అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు. తరువాత తనను హజ్రత్ ముఆజ్ విమర్శిం చారని అతనికి ఎవరో చెప్పగా అతను దైవప్రవక్త(స)గారి సన్నిధికి వెళ్ళాడు. ముఆజ్‌ను గురించి ముహమ్మద్(స)కు ఫిర్యాదు చేశాడు. ఆయన(స) ముఆజ్‌తో ఇలా అన్నారు. "ఓ ముఆజ్! నీవు ప్రజల్ని ఆపదలకు గురిచేసే ఉపద్రవకారివి." దైవప్రవక్త(స)గారు మూడుసార్లు ఈ మాటలనే పలికారు. అవునూ, నీవు 'సబ్బిహిస్మ రబ్బికల్ ఆలా' అనే సూరాను గానీ లేదా 'వష్షమ్సి వజుహాహా' సూరానుగానీ లేదా 'వల్ లయ్‌లి ఇజా యగ్‌షా' సూరాను గానీ ఎందుకు పఠించలేదు? నీ వెనుక నిలబడి నమాజు చేసేవారిలో వృద్ధులూ, బలహీనులూ, పనులకు వెళ్ళ వలసినవారూ ఉన్నారనే విషయం నీకు తెలియదా?" ఇషా నమాజులో హజ్రత్ ముఆజ్ (రజిఅన్) బఖరా సూరాను పఠించారని జాబిర్ ఉల్లేఖించారు.

**674.** హజ్రత్ అనస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) నమాజును సంక్షిప్తంగా చేసేవారు. కాని చక్కగానూ, పరిపూర్ణం గానూ చేసేవారు.[1]

## 64వ అధ్యాయం

### పిల్లవాడి ఏడ్పు ధ్వనిని విని నమాజును సంక్షిప్తం చెయ్యటం.

674-1. అంటే ఫర్జ్ నమాజు చేసేటప్పుడు ఆయన(స)గారు ముఖ్తదీలను దృష్టిలో పెట్టుకుని చిన్న చిన్న సూరాలను పఠించేవారు. కాని సజ్దాను, రుకూను, రెండు సజ్దాల మధ్య ఉన్న ఖాయెదాను, అదేవిధంగా రుకూ తరువాత ఖియామ్‌ను వీటన్నింటినీ చక్కగా నింపాదిగా చేసేవారు.

**675.** అబ్దుల్లాహ్ బిన్ అబీ ఖతాదా ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని, నా తండ్రిగారైన అబూ ఖతాదా మరియు హారిస్ బిన్ అన్సారీ తెలియజేశారు. "నేను నమాజులో నిలబడినప్పుడు, పొడుగైన నమాజునే చెయ్యాలని అనుకుంటాను. కాని పిల్లవాడి ఏడ్పు శబ్దాన్ని విన్నప్పుడు నమాజును సంక్షిప్తం చేస్తాను. పిల్లవాడి తల్లిని కష్టానికి గురిచెయ్యటాన్ని నేను తప్పుగా భావిస్తాను.[1] వలీద్ బిన్ ముస్లిమ్‌తోపాటు ఈ హదీసును బషర్ బిన్ బకర్, బఖయా బిన్ వలీద్, అబ్దుల్లా బిన్ ముబారక్‌లు కూడా ఔజాయి ద్వారా ఉల్లేఖించారు.

**676.** అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; నేను ఎన్నడూ, ఏ ఇమామ్ వెనుకనైనా, మహాప్రవక్త ముహమ్మద్(స)గారు చేయించిన నమాజు లాంటి ఎక్కువ తేలికపాటి, చక్కని, పరిపూర్ణమైన నమాజును చెయ్యలేదు. ఆయన గారి పరిస్థితి ఎలా ఉండేదంటే, నమాజులో ఉన్నప్పుడు పిల్లవాడి ఏడ్పు ధ్వనిని విన్నప్పుడు ఆయన నమాజును తేలికపాటిదిగా చేసేవారు; పిల్లవాడి తల్లికి బాధ కలగకూడదని.

**677.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఉల్లేఖించారు: నేను నమాజును ప్రారంభిస్తాను, దానిని పొడిగిద్దామనే అనుకుంటాను. తరువాత నేను పిల్లవాడు ఏడ్వటాన్ని విన్నప్పుడు, నా నమాజును తగ్గిస్తాను, సంక్షిప్తం చేస్తాను. ఎందుకంటే, పిల్లవాడు ఏడ్వటం వల్ల మాతృ హృదయం ఎంత క్షోభకు గురవుతుందో నాకు తెలుసు.

**678.** దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఉల్లేఖించారు; నేను నమాజును ప్రారంభిస్తాను. నా సంకల్ప మైతే పొడుగాటి నమాజు చెయ్యాలనేదే. కాని పిల్లవాడి ఏడ్పును విని, నమాజు

---

675–1. మహాప్రవక్త ముహమ్మద్(స)గారికి తన ఉమ్మత్ అంటే ఎంత ప్రగాఢమైన ప్రేమ ఉందో మనకు ఈ హదీసు ద్వారా తెలుస్తోంది. మరొక విషయం కూడా ఈ హదీసు ద్వారా తెలుస్తోంది; అదేమిటంటే, ఆ కాలంలో స్త్రీలు కూడా మసీదుకు వెళ్ళి జమాఅత్‌తో కలిసి నమాజు చేసేవారు. కాని ప్రస్తుతం నమాజు కోసం స్త్రీలకు మసీదుల్లో ప్రవేశం లభించటంలేదు. ఇబ్నె షైబా గారు మరొక విషయాన్ని ఇలా విశ్లేషించారు: దైవప్రవక్త(స) మొదటి రకాతులో అరవై వాక్యాలు గల సూరాను పఠించారు. కాని పిల్లవాడి ఏడ్పు ధ్వనిని విని రెండో రకాతులో ఆయన(స)గారు కేవలం మూడు ఖుర్ఆన్ వాక్యాలను మాత్రమే పఠించారు.

సంక్షిప్తం చేస్తాను. పిల్లవాడు ఏడ్వటం వల్ల తల్లి హృదయం ఎంతగా తల్లడిల్లుతుందో నాకు తెలుసు.

## 65వ అధ్యాయం

**ఒక వ్యక్తి నమాజు చేశాడు. కాని తరువాత ఆ వ్యక్తి అదే నమాజును ఇమామ్‌గా ఇతరులకు చేయిస్తే, అది ధర్మసమ్మతమేనా అనే విషయం గురించి.**

**679.** జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ముఆజ్ బిన్ జబల్ దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్(స) గారితో కలిసి నమాజు చేసేవారు. తరువాత ఆయన తన తెగకు చెందిన ప్రజల వద్దకు వెళ్ళి అదే నమాజును వారికి ఇమామ్‌గా వ్యవహరించి చేయించేవారు.

## 66వ అధ్యాయం

**ఇమామ్ పలికే తక్బీర్ (అంటే అల్లాహు అక్బర్)ను ముఖ్తదీలకు వినిపించడం.[1]**

**680.** హజ్రత్ ఆయెషా(ర) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారు తన మరణానికి కారణమైన వ్యాధితో ఉన్నప్పుడు, హజ్రత్ బిలాల్(ర) నమాజ్‌కు సమయం అయిందని చెప్పటానికి ఆయన(స)గారి వద్దకు వచ్చారు. అప్పుడు ఆయన(స)గారు ఇలా సెలవిచ్చారు; "ఓ బిలాల్! నమాజుకు నాయకత్వం వహించమని అబూబకర్(ర)కు నేను చెప్పినట్లుగా చెప్పు". అప్పుడు నేను ఇలా విన్నవించుకున్నాను, "దైవప్రవక్తా(స)! అబూబకర్(ర) మృదువైన హృదయం కలవారు. ఆయన మీ స్థానంలో నిలబడినప్పుడు ఏడ్చేస్తారు. ఖుర్ఆన్ గ్రంథాన్ని పారాయణం చెయ్యలేరు". దైవప్రవక్త (స) మళ్లీ ఇలా సెలవిచ్చారు, "ఓ బిలాల్! ప్రజలకు నమాజు చేయించమని అబూబకర్ (ర)కు నేను చెప్పినట్లుగా చెప్పు". అప్పుడు, నేను పైన చెప్పినట్లుగానే మళ్లీ విన్నవించుకున్నాను. చివరకు మూడోసారియో లేక నాలుగోసారియో దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు; "మీరైతే దైవప్రవక్త హజ్రత్ యూసుఫ్ (అ)కు తారసపడిన మహిళల్లాంటి వారు. నమాజు చేయిం చమని అబూబకర్ (ర)కు చెప్పండి." తరువాత అబూబకర్ (ర) నమాజు చేయిం చటం ప్రారంభించారు. దైవప్రవక్త (స)గారి ఆరోగ్యస్థితి కొంచెం మెరుగుపడిన కారణంగా ఆయన (స) ఇద్దరు వ్యక్తుల సహాయంతో ఇంట్లో నుంచి బయలుదేరారు.

---

66-1. ముఖ్తదీలు చాలామంది ఉన్నప్పుడు, అల్లాహు అక్బర్ అని ఇమామ్ చెప్పే తక్బీర్ వారికి వినిపించదు అనే సందేహం కలిగినప్పుడు మరొక వ్యక్తి ఎవరైనా ఆ తక్బీర్‌ను బిగ్గరగా పలకాలి. ఇలా చేస్తే తక్బీర్ ముఖ్తదీలందరికీ వినిపిస్తుంది.

అప్పుడు నేను దైవప్రవక్త (స)ను చూశాను. ఆయన (స) తన పాదాలను నేలమీద ఈడ్చుకుంటూ వస్తున్నారు. అబూబకర్ (ర) ఆయన (స) గారిని చూసి వెనక్కి జరగాలని అనుకున్నారు. కాని దైవప్రవక్త (స) సైగ చేస్తూ నమాజు చేయించమని సెలవిచ్చారు. అబూబకర్ (ర) కొంచెం వెనక్కి జరిగారు. దైవప్రవక్త (స) అబూ బకర్(ర) పక్కన ఆయన (ర)తో సరిసమానంగా క్రింద కూర్చున్నారు. అబూబకర్(ర) దైవప్రవక్త (స) గారి తక్బీర్‌ను ముఖ్తదీలకు వినిపించేవారు.

## 67వ అధ్యాయం

**ఒక వ్యక్తి ఇమామ్‌ను అనుసరించగా అతని వెనుక ఉన్నవారు అతన్ని అనుసరిస్తే; అప్పుడు అది ధర్మసమ్మతమేనా? "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారు; ఆయన (స) మొదటి పంక్తి వారితో ఇలా అన్నారు; "మీరు నన్ను అనుసరించండి, మీ వెనుక ఉన్నవారు మిమ్మల్ని అనుసరిస్తారు".**

**681.** హజ్రత్ ఆయెషా (రజి) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) అస్వస్థులైనప్పుడు (ఈ అస్వస్థతయే తరువాత ఆయన (స)గారి మరణానికి దారి తీసింది); హజ్రత్ బిలాల్ (రజి) నమాజుకు సమయం అయిందని పిలవటానికి ఆయన (స) వద్దకు వచ్చారు. అప్పుడు ఆయన (స) ఇలా సెలవిచ్చారు; "బిలాల్! ప్రజలకు నమాజు చేయించమని అబూబకర్ (ర)కు చెప్పు". అప్పుడు నేను, ఇలా విన్నవించుకున్నాను. "ఓ దైవప్రవక్తా (స)! అబూబకర్ (ర) మృదు మనస్కులు. ఆయన (ర) మీ స్థానంలో నిలబడినప్పుడు ఏడుస్తారు. ఆ కారణంగా ఆయన (ర) గొంతు పెగలదు. ఆయన (ర) చదివేది ప్రజలకు వినిపించదు. కనుక నమాజుకు నాయకత్వం వహించమని మీరు హజ్రత్ ఉమర్ (ర)కు ఆజ్ఞాపించండి. ఇది బాగుంటుంది." అప్పుడు ఆయన (స) ఇలా సెలవిచ్చారు; "నమాజు చేయించమని నేను చెప్పినట్లు అబూబకర్‌కు చెప్పండి". అప్పుడు హజ్రత్ హఫ్సా (ర)తో నేను, ఇలా అన్నాను; "ఓ హఫ్సా (ర)! నీవు దైవప్రవక్త (స) గారికి కాస్త చెప్పు; అబూబకర్! మెత్తని హృదయం కలవారు. ఆయన (ర) మీ స్థానంలో నిలబడినప్పుడు ఆయన (ర) గొంతు పెగలదు, గాద్గీకంగా ఉంటుంది. ఆయన (ర) ఏడుస్తారు. మీరు గనక నమాజు చేయించమని హజ్రత్ ఉమర్ (ర)కు చెబితే ఎంతో బాగుంటుంది." దానికి సమాధానంగా ఆయన (స) ఇలా సెలవిచ్చారు. "మీరైతే దైవప్రవక్త యూసుఫ్ (ర)కు తారసపడిన స్త్రీల వంటివారు. ప్రజలకు నమాజు చేయించమని అబూబకర్ (ర)కు నేను చెప్పినట్లుగా చెప్పండి. ''అబూబకర్ (ర) నమాజు చేయించటం

ప్రారంభించినప్పుడు, దైవప్రవక్త (స) గారి ఆరోగ్యం కొంచె మెరుగు పడిన కారణంగా ఆయన (స) ఇద్దరు వ్యక్తుల సహాయంతో నేలమీద తన పాదాలను ఈడ్చుకుంటూ నడుస్తూ మసీదుకు వచ్చారు. అబూబకర్(ర) ఆయన (స) గారి ఆగమనాన్ని గమనించి వెనక్కి జరిగిపోసాగారు. కాని దైవప్రవక్త(స) సైగచేసి వెనక్కి జరగ వద్దన్నారు. తరువాత ఆయన (స) వచ్చి అబూబకర్ (ర)కు ఎడమ పక్కన క్రింద కూర్చున్నారు. అబూబకర్ (ర) నిలబడి నమాజు చేస్తున్నారు. ప్రవక్త (స) కూర్చొని నమాజు చేస్తున్నారు. అబూబకర్ (ర) దైవప్రవక్త (స) గారి నమాజును అనుసరిస్తున్నారు. ముఖ్తదీలు అబూబకర్ (రజి)ను అనుకరిస్తున్నారు.

## 68వ అధ్యాయం

## నమాజు చేయించేటప్పుడు ఇమామ్‌కు ఏదైనా విషయం గురించి సందేహం కలిగినప్పుడు, ముఖ్తదీలు చెప్పినట్లు చెయ్యవచ్చునా? అనే విషయం గురించి.

**682.** అబూహురైరా (రజి) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి దైవప్రవక్త మహా శయులు ముహమ్మద్ (స) జుహ్ర్ నమాజు చేయిస్తూ రెండు రకాతులు చేసి (సలామ్ చేసి) లేచి నిలబడ్డారు. అప్పుడు జుల్‌యదైన్ అనే వ్యక్తి ఇలా విన్నవించుకున్నాడు; "ఓ దైవప్రవక్తా (స)! నమాజు తగ్గిపోయిందా? (దేవుడు నాలుగు రకాతులను రెండు రకాతులకు తగ్గించాడా?) లేక మీరు మరచిపోయారా? "దైవప్రవక్త (స) ఇతర ముఖ్తదీల వైపు తన దృష్టిని సారించి ఇలా సెలవిచ్చారు; "జుల్‌యదైన్ నిజమే పలుకుతున్నాడా?" అప్పుడు ముఖ్తదీలు, "అవును దైవప్రవక్తా (స)! అతను నిజమే చెప్పాడు. మీరు రెండు రకాతులే చేశారు." అప్పుడు ఆయన (స) లేచి నిలబడి మరచి పోయిన రెండు రకాతుల నమాజును చేశారు. తరువాత సలామ్ చేసి మళ్ళీ అల్లాహు అక్బర్ అని పలికి మామూలుగా చేసే సజ్దాలు రెండు చేశారు. లేదా వాటికంటే కొంచెం పొడుగైన సజ్‌దాలు చేశారు.

**683.** అబూహురైరా (రజి) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (స) ఒకసారి జుహ్ర్ నమాజులో రెండు రకాతుల నమాజే చేయించారు. అప్పుడు ముఖ్తదీలు, 'మీరు రెండు రకాతులే చేయించారు' అని ఆయన (స) గారికి విన్నవించుకున్నారు. అప్పుడు దైవప్రవక్త (స) మరొక రెండు రకాతుల నమాజు చేయించారు. తరువాత సలామ్ చేసి సహూ(మరుపు)కు సంబంధించిన రెండు సజ్దాలు చేయించారు.

## 69వ అధ్యాయం

**ఒకవేళ నమాజు చేయిస్తున్నప్పుడు ఇమామ్ ఏడ్చినట్లయితే, దాని కారణంగా నమాజు భంగమవుతుందా? అనే విషయం గురించి.[1]**

**అబ్దుల్లాహ్ బిన్ షద్దాద్ (ఒక తాబయి) ఇలా అన్నారు, నేను నమాజులో హజ్రత్ ఉమర్ (రజి) గారి ఏడ్పును విన్నాను. అప్పుడు నేను చివరి పంక్తిలో ఉన్నాను. హజ్రత్ ఉమర్ (ర) యూసుఫ్ సూరాలోని ఈ ఖురాను వాక్యాన్ని పఠిస్తున్నారు; "నేను నా దుఃఖాన్ని గురించీ, నా శోకాన్ని గురించీ అల్లాహ్‌కే ఫిర్యాదు చేస్తున్నాను".**

**684.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) తన మరణానికి కారణ మైన వ్యాధిలో ఉన్నప్పుడు ఇలా సెలవిచ్చారని విశ్వాసుల తల్లి అయిన హజ్రత్ ఆయెషా (రజిఅన్) ఉల్లేఖించారు; "ప్రజలకు నమాజు చేయించమని అబూ బకర్ (ర)కు చెప్పండి."అప్పుడు హజ్రత్ ఆయెషా (ర) మహాప్రవక్త (స) గారికి ఇలా విన్న వించుకున్నారు; "ఓ దైవప్రవక్తా! అబూ బకర్ (ర) మీ స్థానంలో నిలబడినప్పుడు ఏడుస్తూ తన కంఠధ్వనిని కూడా ప్రజలకు వినిపించలేరు. కాబట్టి నమాజు చేయించమని హజ్రత్ ఉమర్ (ర) కు చెప్పండి." దానికి సమాధానంగా ఆయన (స) ఇలా సెలవిచ్చారు; "లేదు. నమాజు చేయించమని అబూబకర్‌కు చెప్పండి." హజ్రత్ ఆయెషా (ర) హజ్రత్ హఫ్సా (ర) తో ఇలా అన్నారు; "నీవు కూడా దైవప్రవక్త (స) గారికి ఇలా విన్నవించుకో; అబూ బకర్ (ర) మీ స్థానంలో నిలబడినప్పుడు మిమ్మల్ని జ్ఞాపకం చేసుకుని (విలపిస్తారు) ప్రజలకు ఖుర్ఆన్‌ను వినిపించలేరు. అందుకే జనులకు నమాజు చేయించమని హజ్రత్ ఉమర్ (ర)కు ఆజ్ఞాపించండి." ఈ విధంగా హజ్రత్ హఫ్సా (ర) దైవప్రవక్త (స)కు విన్నవించుకున్నారు. అప్పుడు ఆయన (స) ఇలా సెలవిచ్చారు; "చాలు! ఇక చాలు! ఊరుకోండి. మీరైతే దైవప్రవక్త యూసుఫ్

---

69-1. ఇమామ్ బుఖారీ (రహ్మాలై) గారు ఈ అధ్యాయంలో ఉటంకించిన అసర్ ద్వారా, హదీసు ద్వారా తెలిసే విషయం ఏమిటంటే; నమాజులో ఏడ్వటం తప్పుకాదు. దాని వల్ల నమాజు చెడిపోదు. షోబి, నఖయీ మరియు సౌరిగార్లు నమాజులో ఏడ్వటం, ఏడుస్తున్నట్లు శబ్దం రావటం ఈ రెండింటి వల్ల నమాజు చెడిపోతుంది అని వివరించి నట్లు ఆధారాలు ఉన్నాయి. కాని మాలికీయ హనఫీయ అభిప్రాయాలు ఎలా ఉన్నాయంటే; నమాజులో ఒకవేళ దైవశిక్షకు భయపడి ఏడిస్తే, ఇంకా అల్లాహ్‌కు భయపడి ఏడిస్తే దాని వల్ల నమాజు చెడిపోదు. కాని ఈ కారణాలు లేకుండా ఎవరైనా ఏడిస్తే అప్పుడు నమాజు భంగమవుతుంది. ఏడ్వటం వల్ల నమాజు చెడిపోదు అనే విషయం తస్‌హీల్‌లో స్పష్టంగా ఉంది.

(అ)కు ఎదురైన స్త్రీలు మాదిరిగా ఉన్నారు. ప్రజలచేత నమాజు చేయించమని అబూ బకర్ (ర)కు చెప్పండి.” తరువాత హజ్రత్ హఫ్సా(ర), హజ్రత్ ఆయెషా (ర)తో ఇలా అన్నారు; “నీ వల్ల నాకెప్పుడైనా మేలు జరిగిందా?”[1]

## 70వ అధ్యాయం

**తక్బీర్ చెప్పేటప్పుడు మరియు తక్బీర్ చెప్పిన తరువాత పంక్తులను వంకర లేకుండా తిన్నగా ఉండేటట్లు చెయ్యటం.**

**685.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని, నూమాన్ బిన్ బషీర్ ఉల్లేఖించారు; “నమాజులో మీరు మీ పంక్తులను తిన్నగా, సమానంగా ఉండేటట్లు చూసుకోండి. లేకపోతే దేవుడు మీ ముఖాలను తలక్రిందులుగా చేసేస్తాడు.”

**686.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అనస్ (రజిఅన్) ఉల్లేఖించారు; ‘నమాజులో మీ పంక్తులను సరిగ్గా, తిన్నగా ఉంచుకోండి. నేను మిమ్మల్ని నా వీపు వెనుక నుంచి గమనిస్తున్నాను.’[1]

## 71వ అధ్యాయం

**పంక్తులను సరిదిద్దేటప్పుడు ముఖ్తదీల వైపు తన ముఖాన్ని త్రిప్పటం.**

**687.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి నమాజుకు సంబంధించిన తక్బీర్ చెప్పటం అయిపోయింది. తరువాత దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) మా వైపునకు తన ముఖాన్ని త్రిప్పి ఇలా సెలవిచ్చారు; చూడండి! పంక్తులను తిన్నగా, సమానంగా ఉంచుకోండి. అందరూ కలిసి నిలబడండి. నేను మిమ్మల్ని నా వీపు వెనుక నుంచి చూస్తున్నాను.

## 72వ అధ్యాయం

**నమాజులోని మొదటి పంక్తిని (దానికి లభించే పుణ్యం) గురించి.**

**688.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు; నీటిలో మునిగి మరణించిన వ్యక్తి

---

684–1. ఈ హదీసు పైన చాలాసార్లు వచ్చింది. ఇమామ్ బుఖారీ (రహ్మాలై) ఈ హదీసు ద్వారా అధ్యాయం ఉద్దేశ్యాన్ని ఇలా స్పష్టంచేశారు; అబూ బకర్ (ర)నే నమాజు చేయించమని దైవప్రవక్త(స) మరీ మరీ ఆజ్ఞాపించారు. దీనివల్ల, ఏడ్వటం వల్ల నమాజు చెడిపోదనే విషయం తెలిసింది.

**కూడా అమరగతిని పొందుతాడు. ఉదర సంబంధమైన వ్యాధి వల్ల మరణించిన వ్యక్తి కూడా అమరగతుడే. ఇంకా ప్లేగు వ్యాధి వల్ల మరణించిన వ్యక్తి కూడా అమరగతిని పొందుతాడు. ఇల్లు కూలి దాని కిందపడి మరణించే వ్యక్తి కూడా అమరగతుడే. దైవ ప్రవక్త (సఅసమ్) ఇంకా ఇలా సెలవిచ్చారు; నమాజు కోసం తొందరగా రావటం వల్ల లభించే పుణ్యం గురించి ప్రజలకు గనక తెలిస్తే, అప్పుడు వారు ఒకరికంటే ఒకరు ముందు పోవటానికి పోటీపడతారు. ఇషా నమాజుకూ, ఉదయం నమాజుకూ తొంద రగా పోవటం వల్ల లభించే పుణ్యం గురించి వారికి తెలిస్తే అప్పుడు వారు మోకాళ్ల మీద ప్రాకుతూ నమాజు కోసం మసీదుకు వెళతారు. ఇంకా మొదటి పంక్తిలో పాల్గొని నమాజు చేయటం వల్ల లభించే పుణ్యం గురించి వారికి తెలిస్తే అప్పుడు వారు దాని కోసం లాటరీ వేసుకుంటారు.**

## 73వ అధ్యాయం

### నమాజులో పంక్తుల్ని తీర్చిదిద్దటం నమాజుకు పూర్ణత్వాన్ని కలిగించటమే.[1]

**689.** **దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు; ఇమామ్ నియామకం జరుగుతుంది ముఖ్తదీలు ఆయన్ని అనుసరించాలని. కనుక ఆయనతో విభేదించకండి. ఆయన రుకూ చేస్తే మీరు కూడా రుకూ చెయ్యండి. ఇంకా ఆయన 'సమిఅల్లాహులిమన్ హమిద' అని పలికినప్పుడు మీరు 'రబ్బనాలకల్ హమ్‌ద్' అని పలకండి. ఇంకా ఆయన సజ్‌దా చేస్తే మీరు కూడా సజ్‌దా చెయ్యండి; ఆయన కూర్చోని నమాజు చేస్తే మీరు కూడా కూర్చోని నమాజు చెయ్యండి. ఇంకా నమాజులో పంక్తిని సరిగ్గానూ, సమానంగానూ ఉంచండి. ఎందుకంటే పంక్తిని సమానంగా ఉంచటం నమాజు సౌందర్యానికి ప్రతీక.**

---

686-1. ఇది దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారి ప్రత్యేకత. ఆయన (స) గారికి వెనుకా ముందు భాగాలు రెండూ కనిపించేవి.

73-1. తెలిసిన విషయం ఏమిటంటే; నమాజులో పంక్తిని సరిదిద్దే ఉద్దేశ్యంతో ఒక మనిషి ఎవరైనా ముందుకుగానీ, వెనక్కుగానీ జరిగితే లేదా పంక్తిని కలిపే ఉద్దేశ్యంతో ఒక వైపునకు తొలగితే లేదా ఎవరినైనా లాగితే, అప్పుడు దాని కారణంగా నమాజుకు విఘ్నం కలగదు. పైపెచ్చు ఆ మనిషికి పుణ్యం లభిస్తుంది. ఎందుకంటే నమాజులో పంక్తిని సరిచెయ్యటం, సరిదిద్దటం అనేది నమాజుకు సంబంధించిన ఒక పెద్ద మర్యాద.

**690.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఉల్లేఖించారు; నమాజులో మీ పంక్తులు సమానంగా ఉండే టట్లు చూసుకోండి. ఎందుకంటే, పంక్తులను సమానంగా చెయ్యటం అనే విషయం నమాజును స్థాపించటంలో చేరి ఉంది.

## 74వ అధ్యాయం

**నమాజులో పంక్తిని పూర్తి చెయ్యకపోవటం మరియు దాని పాపం.**

**691.** అనస్ బిన్ మాలిక్(రజిఅన్) కథనం : బస్రా నుంచి మదీనా పురానికి వచ్చిన ప్రజలు నన్ను ఇలా అడిగారు; "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి కాలం తరువాత మీరు ఏవైనా మార్పులను మాలో గమనించారా?" దానికి సమాధానంగా ఆయన ఇలా చెప్పారు; "అప్పటికీ ఇప్పటికీ నాకు ఏ మార్పులూ కనిపించలేదు. కాని ఒక విషయాన్ని మాత్రం నేను గమనించాను. అదేమిటంటే; నమాజులో మీరు పంక్తులను సరిగ్గా ఉండేటట్లు చూసుకోరు."

## 75వ అధ్యాయం

**పంక్తిలో భుజానికి భుజం ఆనించి, పాదాన్ని పాదంతో కలిపి నమాజులో నిల బడటం. నోమాన్ బిన్ బషీర్ (ఒక సహాబి) ఇలా సెలవిచ్చారు; పంక్తిలో నేను ఒక విషయాన్ని గమనించాను; మాలోని ఒక మనిషి తన మడిమను తోటి మనిషి యొక్క మడిమతో కలిపి నిలబడి నమాజు చేస్తాడు.**

**692.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఉల్లేఖించారు; నమాజులో మీ పంక్తులను సమానంగానూ, తిన్నగానూ ఉండేటట్లు చూసుకోండి. నేను మిమ్మల్ని నా వీపు వెనుక నుంచి గమని స్తాను. అనస్(ర) ఇలా అన్నారు; మాలోని ప్రతి వ్యక్తి నమాజులో పంక్తిలో నిలబడి నప్పుడు ఇలా చేస్తాడు; తన భుజాన్ని తనతో పాటు నిలబడిన తోటి మిత్రుని భుజంతోనూ, తన పాదాన్ని అతని పాదంతోనూ కలుపుతాడు.

## 76వ అధ్యాయం

**నమాజులో ఒక వ్యక్తి ఎవరైనా ఇమామ్‌కు ఎడమ వైపున నిలబడితే, అప్పుడు ఇమామ్ గనక అతన్ని తన వెనుక నుంచి త్రిప్పుకుంటూ కుడి వైపునకు తీసుకువచ్చి నిలబెడితే, ఆ ఉభయుల నమాజుకు ఎలాంటి భంగం వాటిల్లదు.**

**693.** ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; నేను ఒకసారి, ఒక రాత్రి దైవప్రవక్త ముహమ్మద్(స) గారితో కలిసి తహజ్జుద్ నమాజు చేశాను. నేను ఆయన

(స) గారి ఎడమ ప్రక్కన నిలబడ్డాను. అప్పుడు ఆయన(స)గారు వెనుకనుంచి నా తలను పట్టుకుని దానిని త్రిప్పుతూ తన కుడివైపునకు తీసుకువచ్చారు. తరువాత నమాజు చేసి ఆయన(స) గారు పండుకున్నారు. ఆ తరువాత ముఅజ్జిన్ వచ్చాడు. దైవప్రవక్త(స) లేచి నిలబడ్డారు. ఉదయం నమాజును చేయించారు. కాని వుజూ చేసుకోలేదు.

## 77వ అధ్యాయం

**ఒకే ఒక స్త్రీ, తోటి స్త్రీలెవరూ ఆమెతో లేనప్పుడు ఒక పంక్తిగా నిలబడి ఆమె నమాజు చేయవచ్చు.**

**694.** అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒక రాత్రి ఒక అనాథ బాలుడూ, నేనూ కలిసి దైవప్రవక్త ముహమ్మద్(స)గారి వెనుక నిలబడి మా ఇంట్లో నమాజు చేశాము. నా తల్లి ఉమ్మె సులైమ్(ర) మా వెనుక ఒక్కరే నిలబడి ఒక పంక్తిగా నమాజు చేశారు.

**695.** ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒక రాత్రి నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి ఎడమ ప్రక్కన నమాజు చెయ్యటం కోసం నిలబడ్డాను. కాని ఆయన(స)గారు నా చెయ్యినో లేక నా భుజాన్నో పట్టుకుని తన కుడి ప్రక్కన నిలబడేలా చేశారు. ఆయన(స) తన చేత్తో సైగ చేస్తూ వెనుక నుంచి తిరిగి రమ్మని చెప్పారు.

## 78వ అధ్యాయం

**ఒకవేళ ఇమామ్‌కూ, ముఖ్తదీలకూ మధ్య ఒక గోడగానీ లేదా ఒక తెరగానీ అడ్డంగా ఉంటే అది తప్పు కాదు, అందులో దోషం లేదు. ఇమామ్ హసన్ బస్రీ (రహ్మాలై) ఇలా అన్నారు; నీకూ మరియు ఇమామ్‌కూ మధ్య ఒక కాలువ ఉండి ఒకవేళ నీవు ఆ ఇమామ్ వెనుక నిలబడి నమాజ్ చేస్తే, అది ఎంతమాత్రం దోషం కాదు. అబూ మిజ్‌లజ్ (ఒక తాబయి) ఇలా అన్నారు; ఒక ఇమామ్‌కు మరియు ముఖ్తదీకి మధ్య ఒక దారికాని లేదా ఒక గోడకాని అడ్డంగా ఉంటే అప్పడు అతను ఇమామ్ వెనుక నిలబడి నమాజ్ చెయ్యవచ్చు. కాని ఇమామ్ చెప్పే తక్బీర్‌ను ముఖ్తదీ వినగలగాలి.**

**696.** హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) రాత్రి సమయంలో తన గదిలో తహజ్జుద్ నమాజు చేసేవారు. ఆయన (స) గారి గది గోడ పొట్టిగా ఉండేది. బయటి నుంచి ప్రజలు

దైవప్రవక్త (స) గారి శుభప్రదమైన శరీరాన్ని చూశారు. కొంతమంది ఆయన (స) గారి వెనుక నిలబడి నమాజు చేస్తూ ఉన్నారు. తెల్లవారిన తరువాత ఈ విషయం గురించి చర్చ జరిగింది. రెండో రాత్రి కూడా దైవప్రవక్త (స) నమాజు కోసం నిలబడ్డారు. అప్పుడు కూడా కొందరు ముస్లిమ్‌లు ఆయన (స) గారి వెనుక నిలబడి నమాజు చేస్తున్నారు. రెండు లేక మూడు రాత్రుల వరకు ఇది కొనసాగింది. ఆ తరువాత దైవప్రవక్త (స) కూర్చుండిపోయారు. నమాజు చేసే స్థలానికి రానేలేదు. తెల్లవారిన తరువాత దీన్ని గురించి ప్రజలు ఆయన (స) ముందు ప్రస్తావించారు. దానికి సమాధానంగా ఆయన (స) ఇలా సెలవిచ్చారు; రాత్రి (తహజ్జుద్) నమాజు మీకు విధిగా చెయ్యబడుతుందేమో అని నేను భయపడ్డాను. (అందుకని నమాజు చెయ్యలేదు.)

## 79వ అధ్యాయం

### రాత్రి నమాజును గురించి.

**697.** హజ్రత్ ఆయెషా (రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (స) వద్ద ఒక చాప ఉండేది. ఆయన (స) గారు దానిని పగటి పూట నేల మీద పరచేవారు. రాత్రి వేళ దానిని ఒక తెరగా కట్టుకునేవారు. అందువల్ల రాత్రి పూట కొంత మంది ప్రజలు సమావేశమై దైవప్రవక్త (స) గారి వెనుక నిలబడి నమాజు చేసేవారు.

**698.** జైద్ బిన్ సాబిత్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) రమజాను మాసంలో ఒక గదిని నిర్మించుకున్నారు. లేదా ఒక తెరను అడ్డంగా కట్టుకున్నారు. (బసర్ బిన్ సయీద్ ఇలా అన్నారు. అది ఒక చాపతో కట్టబడిందని నేను అనుకుంటున్నాను) ఎన్నో రాత్రులు దైవప్రవక్త (స) అందులో నమాజు చేస్తూ వచ్చారు. ఆయన (స)తోపాటు ఆయన (స) సహచరులు కూడా చాలా మంది నమాజు చేశారు. దైవప్రవక్త (స)కు వారి సంగతి తెలిసినప్పుడు ఆయన (స) నమాజు చెయ్యకుండా కూర్చుండిపోయారు. తరువాత ప్రజల ముందుకు వచ్చి ఆయన (స) ఇలా సెలవిచ్చారు; మీరు చేసింది నాకు తెలిసి పోయింది. కాని ప్రజలారా! మీరు మీ ఇళ్లల్లో నమాజులు చేస్తూ ఉండండి. ఎందుకంటే ఒక మనిషి చేసే నమాజుల్లో ఉత్తమమైన నమాజు అతను తన ఇంట్లో చేసేదే. కాని ఫర్జ్ నమాజును మాత్రం మస్జిదులో చెయ్యాలి (అది శ్రేష్టమైనది, ఉత్తమమైనది).

## 80వ అధ్యాయం

**(అల్లాహు అక్బర్ అనే) తక్బీరు (అంటే తక్బీరె తహ్రీమా) పలకటం వాజిబ్. ఆ తరువాతనే నమాజును ప్రారంభించాలి.[1]**

**699.** అనస్ బిన్ మాలిక్ అన్సారీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఒకసారి ఒక గుఱ్రంమీద స్వారీ చేస్తూ దానిపై నుంచి క్రింద పడిపోయారు. అప్పుడు ఆయన (స) గారి శరీరం కుడి భాగానికి దెబ్బలు తగిలి గాయాలయ్యాయి. ఆయన (స) ఆ రోజున ఫర్జ్ నమాజుల్లోని ఒక ఫర్జ్ నమాజును కూర్చోని చేయించారు. మేము కూడా ఆయన (స) గారి వెనుక కూర్చోని ఆ నమాజును చేశాము. తరువాత ఆయన (స) సలాము చేసి ఇలా సెలవిచ్చారు; "ఇమామ్ నియామకం జరిగేది ముఖ్తదీలు అతణ్ణి అనుసరించాలనే ఉద్దేశ్యంతోనే. అతను గనక నిలబడి నమాజు చేస్తే, మీరు కూడా నిలబడే నమాజు చెయ్యండి; అతను గనక రుకూ చేస్తే, మీరు కూడా రుకూ చెయ్యండి. ఇంకా అతను గనక తన శిరస్సును లేపితే, మీరు కూడా మీ శిరస్సును ఎత్తండి. ఇంకా అతను గనక సజ్దా చేస్తే, మీరు కూడా సజ్దా చెయ్యండి; అతను గనక 'సమిఅల్లాహు లిమన్ హమిదహ్' అంటే మీరు అప్పుడు 'రబ్బనా లకల్ హమ్ద్' అని పలకండి.

**700.** అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఒక అశ్వం మీద స్వారీ చేస్తూ దానిపై నుంచి క్రింద పడిపోయారు. అప్పుడు ఆయన (స) గారి శరీరానికి దెబ్బలు తగిలి గాయాలయ్యాయి. అప్పుడు ఆయన (స) గారు మాకు కూర్చోని నమాజు చేయించారు. మేము కూడా ఆయన (స) గారితోపాటు కూర్చోని నమాజు చేశాము. నమాజు చెయ్యటం ముగిసిన తరువాత ఆయన (స) ఇలా సెలవిచ్చారు; ఇమామ్ నియామకం జరిగేది (ప్రజలు) అతన్ని అనుసరించటానికే. అతను తక్బీర్ పలికినప్పుడు మీరు కూడా తక్బీర్ పలకండి; అతను రుకూ చేసినప్పుడు, మీరు కూడా రుకూ చెయ్యండి. ఇంకా అతను రుకూలో నుంచి తన శిరస్సును ఎత్తినప్పుడు, మీరు కూడా

---

80-1. ఇమామ్ బుఖారీ (రహ్మలై) గారు జమాఅత్, ఇమామత్ లకు సంబంధించిన హదీసు లను ప్రస్తావించిన తరువాత ఆయన నమాజు లక్షణాలకు సంబంధించిన హదీసులను గురించి వివరిస్తున్నారు.

మీ శిరస్సును ఎత్తండి. ఇంకా అతను 'సమిఅల్లాహు లిమన్ హమిదహ్' అని పలికి నప్పుడు మీరు 'రబ్బనా లకల్ హమ్‌ద్' అని పలకండి. ఇంకా అతను సజ్‌దా చేసినప్పుడు మీరు కూడా సజ్‌దా చెయ్యండి.

**701.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూహురైరా (రజిఅన్) ఉల్లేఖించారు; ఇమామ్‌ను ప్రజలు అనుసరించాలనే ఉద్దేశ్యంతోనే అతని నియామకం జరుగుతుంది. అతను తక్బీర్ చెప్పినప్పుడు మీరు కూడా తక్బీర్ పలకండి; అతను రుకూ చేసినప్పుడు మీరు కూడా రుకూ చెయ్యండి. ఇంకా అతను 'సమిఅల్లాహు లిమన్ హమిదహ్' అని పలికినప్పుడు మీరు 'రబ్బనా లకల్ హమ్‌ద్' అని పలకండి. అతను సజ్‌దా చేస్తే మీరు కూడా సజ్‌దా చెయ్యండి; అతను గనక కూర్చోని నమాజు చేస్తే మీరందరూ కూర్చోని నమాజు చేయండి.

## 81వ అధ్యాయం

## నమాజు ప్రారంభంలోనే తక్బీరె తహ్‌రీమా పలకగానే అదే సమయంలో రెండు చేతులూ ఎత్తటం. [1]

**702.** తన తండ్రిగారైన అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా సెలవిచ్చారని సాలిమ్ ఇబ్నె అబ్దుల్లాహ్ ఉల్లేఖించారు; దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్(స) నమాజును ప్రారంభించినప్పుడు తన రెండు భుజాల వరకు చేతులను ఎత్తేవారు. ఇంకా రుకూకు సంబంధించిన తక్బీర్ చెప్పినప్పుడు మరియు రుకూలో నుంచి తన శిరస్సును ఎత్తినప్పుడు కూడా ఇదేవిధంగా తన రెండు చేతులను ఎత్తేవారు. [1] ఇంకా 'సమిఅల్లాహులిమన్ హమిదహ్', 'రబ్బనా లకల్ హమ్‌ద్'[2] అని అనేవారు. ఇంకా సజ్‌దాలకు మధ్య చేతులు ఎత్తేవారు కాదు.

---

81–1. అంటే అల్లాహు అక్బర్ అనే తక్బీర్ మరియు చేతులు ఎత్తటం రెండు పనులూ ఒకేసారి ఏకకాలంలో జరగాలి. ఇదే ధర్మసమ్మతమైనదని నవవీ (రహ్మాలై) అన్నారు. ఇమామ్ మాలిక్ (రహ్మాలై) గారి దృష్టిలో కూడా ఇదే ఉత్తమమైనది. తక్బీర్‌తో పాటు రెండు చేతులూ ఎత్తాలి అని అబూదావూద్ వాయెల్ బిన్ హజర్‌ను ఉటంకిస్తూ ఉల్లేఖించారు. హనఫీ విద్వాంసులు అయిన 'హిదాయా' రచయిత మొదట చేతులు ఎత్తాలి ఆ తరువాత అల్లాహు అక్బర్ అని పలకాలి, ఇదే ధర్మ సమ్మతమైనది అని అన్నారు.

## 82వ అధ్యాయం

## 'తక్బీరె తహ్రీమా' పలికేటప్పుడు, రుకూలోకి పోయేటప్పుడు ఇంకా రుకూలో నుంచి శిరస్సును ఎత్తే సమయంలోనూ రెండు చేతులు ఎత్తటం.[1]

**703. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; నేను దైవ ప్రవక్త మహాశయులు(స)గారిని చూశాను; ఆయన(స) నమాజు కోసం నిలబడి నప్పుడు (అంటే తక్బీరె తహ్రీమా పలికేటప్పుడు) తన రెండు చేతులను తన రెండు భుజాలకు సరిసమానంగా ఎత్తేవారు. ఇంకా రుకూ కోసం తక్బీర్(అల్లాహు అక్బర్) పలికినప్పుడు కూడా ఆయన(స) ఇదే విధంగా తన రెండు చేతులను భుజాల వరకు ఎత్తేవారు. ఇంకా రుకూలో నుంచి తన శిరస్సును ఎత్తే సమయంలో కూడా ఆయన (స) తన రెండు చేతులను పై విధంగానే తన భుజాల వరకు ఎత్తేవారు. ఇంకా "సమి**

---

702-1. చేతులు ఎత్తటం అనేది ప్రపంచాన్ని త్యజించటానికి సంకేతం. ఇమామ్ షాఫియి (రహ్మాలై) ఇలా సెలవిచ్చారు; "చేతులు ఎత్తటం వల్ల అల్లాహ్‌ను గౌరవించినట్లు అవుతుంది. ఇంకా దైవప్రవక్త ముహమ్మద్(స)గారి సంప్రదాయాన్ని పాటించినట్లు అవుతుంది." ఇబ్నె ఉమర్(ర)ను ఉటంకిస్తూ ఇబ్నె అబ్దుల్ బర్ ఇలా అన్నారు; "చేతులు ఎత్తటం నమాజ్ యొక్క అందం." ఉఖబా బిన్ ఆమిర్ ఇలా అన్నారు; ప్రతిసారి చేతులు ఎత్తటానికి బదులుగా పది పుణ్యాలు లభిస్తాయి. చేతిలోని ప్రతి వ్రేలుకు ఒక పుణ్యం చొప్పున లభిస్తుంది.

702-2. ఈ హదీసు ద్వారా ఒక విషయం రుజువు అయింది. అదేమిటంటే, ఇమామ్ కూడా 'రబ్బనా లకల్ హమ్ద్' అని పలకటం. అహ్లెహదీస్ మస్లక్ వారు ఈ అభిప్రాయంతో ఏకీభవిస్తారు. కాని హనఫీ మస్లక్‌వారి అభిప్రాయం ప్రకారం, ఇమామ్ కేవలం 'సమిఅల్లాహులిమన్ హమిదహ్' అని మాత్రమే పలకాలి. మరియు ముక్తదీలు 'రబ్బనాలకల్ హమ్‌ద్' అని పలకాలి.

82-1. అహ్లెహదీస్ మస్లక్‌కు చెందినవారూ, ఇమామ్ షాఫియి (రహ్మాలై), ఇమామ్ అహ్మద్ (రహ్మాలై) మరియు చాలామంది విద్వాంసుల అభిప్రాయం ఏమిటంటే; రుకూ చేసేటప్పుడు, రుకూలో నుంచి శిరస్సును ఎత్తేటప్పుడు రఫెదైన్ చెయ్యాలి. అంటే రెండు చేతులను ఎత్తాలి. ఇంకా దైవప్రవక్త (స)గారి ఈ సంప్రదాయాన్ని ఆయన(స) గారి ప్రత్యక్ష అనుచరులు డెబ్బై మంది మరియు 'అష్‌రయె ముబష్షిరా'ల ఉల్లేఖనాలు సమర్థిస్తున్నాయి. ఇంకా ఇమామ్ బుఖారీ (రహ్మా.లై) 'రఫెదైన్' గురించి ప్రత్యేకంగా ఒక పుస్తకాన్ని కూడా రాశారు.

**అల్లాహులిమన్ హమిదహ్' అని అనేవారు. కాని సజ్దాల మధ్య సమయంలో మాత్రం ఆయన (స) తన చేతులను ఎత్తేవారు కాదు.**

**704. అబూ ఖిలాబా ఇలా ఉల్లేఖించారు; నేను మాలిక్ బిన్ హువైరిస్ (రజి అన్)ను చూశాను; ఆయన(ర) నమాజు చెయ్యటాన్ని ప్రారంభించినప్పుడు అల్లాహు అక్బర్ అంటూ తన రెండు చేతులను ఎత్తుతారు. ఇంకా రుకూ చేసేటప్పుడు కూడా ఆయన రెండు చేతులను ఎత్తుతారు. ఇంకా రుకూలో నుంచి తన శిరస్సును ఎత్తే టప్పుడు కూడా ఆయన తన రెండు చేతులను ఎత్తుతారు. ఆయన(ర) దైవప్రవక్త(స) ఇలా చేస్తూ ఉండగా తాను చూశానని ఉల్లేఖించారు.**

## 83వ అధ్యాయం

## చేతుల్ని ఎంతవరకు ఎత్తాలి?[1]

**అబూ హుమైద్ సాయిది (ఒక సహాబి) గారు తన సహచరుల ముందు ఇలా అన్నారు; దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) తన రెండు చేతుల్ని భుజాల వరకు ఎత్తేవారు.**

**705. అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా నమాజు చేస్తూ ఉండగా నేను చూశాను; ఆయన (స) గారు అల్లాహు అక్బర్ అని పలికి నమాజును ప్రారంభించారు. ఇంకా అల్లాహు అక్బర్ అని పలికే సమయంలో ఆయన (స) తన రెండు చేతుల్ని తన భుజా లకు సమానంగా ఉండేటట్లు ఎత్తారు. ఇంకా రుకూకు సంబంధించిన తక్బీర్ పలికే టప్పుడు కూడా ఆయన (స) అలానే చేశారు. 'సమి అల్లాహు లిమన్ హమిదహ్' అని పలికినప్పుడు కూడా ఆయన (స) అలానే చేశారు. మరియు "రబ్బనా లకల్ హమ్ద్' అని పలికారు. కాని సజ్దాలో ఆయన (స) అలా చెయ్యలేదు (అంటే చేతులు ఎత్తలేదు). ఇంకా సజ్దాలో నుంచి శిరస్సును ఎత్తేటప్పుడు కూడా ఆయన (స) తన చేతులు ఎత్తలేదు.**

---

83-1. ఈ విషయం గురించి అభిప్రాయభేదం ఉంది. అహ్లె హదీస్, ఇమామ్ షాఫియి (రహ్మాలై) మరియు ఇమామ్ అహ్మద్ (రహ్మాలై) గార్ల ప్రకారం చేతుల్ని భుజాల వరకు ఎత్తాలి. బహుశా ఇమామ్ బుఖారి (రహ్మాలై) గారి దృష్టిలో కూడా ఈ అభిప్రాయమే బలమైనది. కనుకనే ఆయన గారు దీనినే ప్రమాణంగా తీసుకున్నారు. హనఫి మస్లక్ ప్రకారం చేతుల్ని చెవుల వరకు ఎత్తాలి.

## 84వ అధ్యాయం

**(నాలుగు రకాతుల నమాజులోను లేదా మూడు రకాతుల నమాజులోను) రెండు రకాతులు పూర్తి చేసిన తరువాత లేచినప్పుడు రెండు చేతులను ఎత్తాలి.**

**706.** నాఫె ఇలా ఉల్లేఖించారు; అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజిఅన్) నమాజులోకి ప్రవేశించినప్పుడు తక్బీర్ పలికేవారు మరియు తన రెండు చేతుల్ని ఎత్తేవారు. ఇంకా రుకూ చేసినప్పుడు కూడా ఆయన (ర) తన రెండు చేతుల్ని ఎత్తేవారు. ఇంకా 'సమి అల్లాహులిమన్ హమిదహ్' అని పలికినప్పుడు కూడా ఆయన (ర) తన రెండు చేతుల్ని ఎత్తేవారు. ఇంకా రెండు రకాతులను పూర్తి చేసి లేచినప్పుడు కూడా ఆయన (ర) తన రెండు చేతుల్ని ఎత్తేవారు. అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (ర) ఇలా అన్నారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలానే చేసేవారు.

## 85వ అధ్యాయం

**నమాజు చేసే సమయంలో కుడి చేతిని ఎడమ చేతిపై పెట్టటం.**

**707.** సహల్ బిన్ సాద్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ప్రజల్ని ఇలా ఆజ్ఞాపించటం జరిగేది; నమాజు చేసే సమయంలో ప్రతి మనిషీ తన కుడి చేతిని తన ఎడమ చేతిపై పెట్టుకోవాలి. అబూ హాజిమ్ ఇలా అన్నారు; ఈ ఆదేశం దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) నుంచి వచ్చిందనే విషయం నాకు తెలుసు.

## 86వ అధ్యాయం

**నమాజులో అణకువ.[1]**

**708.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని, అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు; నా ముఖం ఖిబ్లా వైపునకు ఉన్నదని మీరు అనుకుంటున్నారా? అల్లాహ్‌పై ప్రమాణం చేసి చెబుతున్నాను. మీరు చేసే రుకూ,

---

86-1. అణకువ అంటే మర్యాద, భయం, వినమ్రత అని భావం. మహారాజుగారి దర్బారులో ఆయన ముందు ఎవరైనా నిలబడినప్పుడు ఎంత వినయంగా, ఎంత మర్యాదగా ఉంటారు? చలనం అనేది ఉండదు. అనవసరమైన కదలిక ఏదీ ఉండదు. హృదయంపై రాజుగారి భయం ఆవరించి ఉంటుంది. ఇదేవిధంగా నమాజు చేసే వ్యక్తి కూడా భూమ్యాకాశాల సామ్రాజ్యానికి అధిపతి అయిన అల్లాహ్ ముందు నిలబడినప్పుడు ఆయనకు భయపడుతూ నిలబడాలి. మనస్సులో, హృదయంలో అణకువ ఉన్నప్పుడు శరీరంలోని అన్ని అవయవాలపై దాని ప్రభావం పడుతుంది.

మీలోని అణకువ నాకు తెలియకుండా, గుప్తంగా లేవు. నేను మిమ్మల్ని నా వీపు వెనుక నుంచే చూస్తూ ఉంటాను.

**709.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఉల్లేఖించారు; రుకూను, సజ్దాను సక్రమమైన రీతిలో చెయ్యండి. ఎందుకంటే, అల్లాహ్ సాక్షిగా చెబుతున్నాను! మీరు రుకూ, సజ్దాలను చేస్తున్నప్పుడు నేను మిమ్మల్ని నా వెనుక నుంచి లేదా నా వీపు వెనుక నుంచి చూస్తాను.

## 87వ అధ్యాయం

### తక్బీరె తహ్రీమా తరువాత ఏమి పలకాలి? (లేదా ఏమని పఠించాలి?)

**710.** అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారు, అబూబకర్ సిద్దీఖ్(రజిఅన్)గారు మరియు ఉమర్ (రజిఅన్) గారు నమాజ్‌ను, 'అల్‌హమ్‌దులిల్లాహి రబ్బిల్ ఆలమీన్ (ప్రశంస లన్నీ అల్లాహ్‌కు మాత్రమే చెందుతాయి. ఆయన సకల లోకాలకు ప్రభువు)'తో ప్రారం భించేవారు.

**711.** అబూ హురైరా(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) తక్బీరె తహ్రీమా మరియు ఖుర్ఆన్ పారాయణానికి మధ్య కాసేపు మౌనంగా ఉండేవారు. నేను దైవప్రవక్త(స)గారితో ఇలా విన్నవించుకున్నాను; ఓ దైవప్రవక్తా(స)! నా తల్లిదండ్రుల్ని మీకు అర్పింతు! తక్బీరె తహ్రీమాకు ఖుర్ఆన్ పారాయణానికి మధ్య మీరు కొంచెంసేపు మౌనం పాటిస్తారు. అప్పుడు మీరు ఏమి పఠిస్తారు? దానికి సమాధానంగా ఆయన(స) ఇలా సెలవిచ్చారు; నేను ఇలా పలుకుతాను, "అల్లాహుమ్మ బాఇద్ బయ్‌నీ వ బైన ఖతాయాయ కమా బాఅద్‌త బయ్‌నల్ మష్‌రిఖి వల్ మగ్‌రిబి, అల్లాహుమ్మ నఖ్ఖినీ మినల్ ఖతాయా కమా యునఖ్ఖస్సవ్‌బుల్ అబ్‌యజు మినద్దనసి, అల్లాహుమ్మగ్‌సిల్ ఖతాయాయ బిల్‌మాఇ వస్సల్‌జి వల్ బరద్." (ఓ అల్లాహ్! తూర్పుకూ పడమరకూ ఎంత దూరమైతే ఉందో నన్ను నా పాపాల నుంచి అంత దూరంగా ఉంచు (అంత విడిగా పెట్టు). తెల్లటి వస్త్రం ఎలాంటి మరకలు, మాలిన్యం లేకుండా తెల్లగా ఉతక బడుతుందో అలా నన్ను పాపాల నుంచి ప్రక్షాళనం చెయ్యి. ఓ అల్లాహ్! నా పాపాలను నీళ్ళతోను, మంచుతోను, వడగళ్ళతోనూ కడిగెయ్యి).

**712.** అస్మా బిన్తె అబీబకర్ (ర.అన్హా) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహా శయులు ముహమ్మద్(స) ఒకసారి సూర్యగ్రహణానికి సంబంధించిన నమాజు చేశారు. ఆయన(స) చాలాసేపు నిలబడ్డారు. తరువాత రుకూ చేశారు. రుకూలో చాలాసేపు ఉన్నారు. ఆ తరువాత నిలబడ్డారు. చాలాసేపు నిలబడ్డారు. మళ్ళీ రుకూ చేశారు. రుకూలో చాలాసేపు ఉన్నారు. ఆ తరువాత తన శిరస్సును ఎత్తారు. తరువాత సజ్దా చేశారు, చాలాసేపటి వరకు సజ్దాలో ఉన్నారు. తరువాత మళ్ళీ సజ్దా చేశారు. సజ్దాలో చాలాసేపు ఉన్నారు. ఆ తరువాత నిలబడ్డారు. చాలాసేపటివరకు నిలబడి ఉన్నారు. తరువాత రుకూ చేశారు. చాలా సేపు రుకూలో ఉన్నారు. తరువాత తన శిరస్సును ఎత్తారు. చాలాసేపటి వరకు నిలబడే ఉన్నారు. మళ్ళీ రుకూలోకి వెళ్ళారు. చాలాసేపటి వరకు రుకూలోనే ఉన్నారు. తరువాత తన శిరస్సును ఎత్తారు. మరియు సజ్దా చేశారు. చాలా సేపటి వరకు సజ్దాలోనే ఉండిపోయారు. ఆ తరవాత తన శిరస్సును ఎత్తారు. తరువాత మళ్ళీ సజ్దా చేశారు. చాలాసేపు సజ్దాలోనే ఉన్నారు. తరువాత నమాజు ముగించి ఇలా సెలవిచ్చారు; స్వర్గం నా దగ్గరకు వచ్చేసింది. ఎంత దగ్గరకు వచ్చిందంటే ఒకవేళ నేను ధైర్యం చేసినట్లయితే అందులోని పండ్ల గుత్తులలో నుంచి ఒక పండ్లగుత్తిని తీసుకువచ్చి మీకు ఇచ్చేవాడిని. నరకం కూడా నాకు ఎంత దగ్గరగా వచ్చిందంటే, నేను అరుస్తూ "ఓ నా ప్రభూ! ఏమిటి, నేను కూడా ఆ నరక వాసుల్లో ఉన్నానా?" అన్నాను. తరువాత నేను ఏమి చూశానంటే, ఒక పిల్లి ఒక స్త్రీని తన గోళ్ళతో రక్కుతూ గాయపరుస్తోంది. నేను ఇలా అడిగాను; "ఈ స్త్రీకి ఏమయింది? పిల్లి ఆమెను అలా రక్కుతోంది?" వారు ఇలా అన్నారు; "ఆ స్త్రీ ఇహలోకంలో ఆ పిల్లిని కట్టిపడేసింది. దానికి ఆమె అన్నమూ పెట్టేది కాదు. ఏదయినా తినడానికి వదిలిపెట్టేదీ కాదు. చివరకు అది చనిపోయింది."

## 88వ అధ్యాయం

## నమాజులో ఇమామ్ వైపు చూడటం

**హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) సూర్యగ్రహణానికి సంబంధించిన నమాజును గురించి వివరిస్తూ ఇలా సెలవిచ్చారు; నేను నరకాన్ని చూశాను. అది తనను తానే ధ్వంసం చేసుకుంటోంది (తింటోంది). మీరు నన్ను చూసినప్పుడు (నమాజులో) నేను వెనక్కు జరిగిపోయాను.**

**713.** అబూ మఅమర్ ఇలా ఉల్లేఖించారు; "మేము ఖబ్బాబ్ (రజిఅన్)ను,

**దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) జొహర్, అసర్ నమాజుల్లో ఫాతిహా సూరాతోపాటు ఇతర ఖుర్‌ఆన్ వాక్యాలను కూడా పఠించేవారా? అని అడిగాము. దానికి సమాధానంగా ఆయన గారు 'అవును, పఠించేవారు' అని సమాధానం చెప్పారు. అప్పుడు మేము 'మీకు ఈ విషయం ఎలా తెలుసు?' అని అడిగాము. ఆయన, ఇలా అన్నారు; "దైవప్రవక్త (స) గారి పవిత్రమైన గడ్డం కదులుతూ ఉండేది. దాని ద్వారా నేను గ్రహించాను.[1]**

**714. బరా బిన్ ఆజిబ్ ఇలా తెలిపారు: ఆయన అబద్ధాలు చెప్పే మనిషి కాదు; సహాబా (ర) (ప్రవక్త (స) గారి ప్రత్యక్ష అనుచరులు) దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) గారితో కలిసి నమాజు చేసేటప్పుడు ఆయన (స) గారు రుకూలో నుంచి తన శిరస్సును ఎత్తినప్పుడు వారు ఆయన (స) గారిని చూస్తూ నిలబడి ఉంటారు. చివరకు ఆయన (స) గారు సజ్దాలోకి వెళ్లిపోతారు. అప్పుడు వారు కూడా సజ్‌దాలోకి వెళ్ళిపోతారు.**

**715. అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) గారి కాలంలో ఒకసారి సూర్యగ్రహణం పట్టింది. అప్పుడు ఆయన (స) గారు గ్రహణానికి సంబంధించిన నమాజును చేయించారు. తరువాత ప్రజలు ఆయన (స) గారికి ఇలా విన్నవించుకున్నారు: ఓ దైవప్రవక్తా (స)! మీరు నమాజు చేయించేటప్పుడు (నమాజులోనే) మీ స్థలములో ఉండి ఏదో ఒక వస్తువును తీసుకోవటానికి ముందుకుపోయారు. దీన్ని మేము చూశాము. ఆ తరువాత మీరు వెనక్కి జరిగారు. దీన్ని కూడా మేము చూశాము'. (ఇలా ఎందుకు చేశారు?) సమాధానంగా ఆయన (స) గారు ఇలా సెలవిచ్చారు; మొదట నేను స్వర్గలోకాన్ని చూశాను. అందులో నుంచి ఒక పండ్ల గుత్తిని తీసుకోదలిచాను. ఒకవేళ నేను ఆ పండ్ల గుత్తిని తీసుకుని ఉన్నట్లయితే ఇహలోకం ఉన్నంతకాలం మీరు అందులో నుంచి పండ్లు తింటూ ఉండేవారు.[1]**

---

713-1. అధ్యాయంలోని ముఖ్య విషయం ఇక్కడే ఉంది; ఎందుకంటే గడ్డం యొక్క కదలికలు ఆయన గారికి ఇమామ్ వైపు చూడకుండా ఎలా తెలుస్తాయి. మాలికి మస్లక్ వారు ఈ హదీసునే ప్రమాణంగా తీసుకుని ఇలా అన్నారు; ముఖ్తదీలు నమాజులో తమ ఇమామ్‌ను మాత్రమే చూడాలి; సజ్‌దా చేసే స్థలాన్ని చూడటం తప్పనిసరి ఏమీ కాదు. షాఫయి మస్లక్ వారు ఏమన్నారంటే, సజ్‌దా చేసే స్థలం వైపు మాత్రమే చూస్తూ ఉండటం మస్నూన్.

**716.** అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) మాకు నమాజు చేయించారు. తరువాత ఆయన (స) గారు మెంబరు పైకి ఎక్కారు. ఆయన (స) తన రెండు చేతులతో మసీదు యొక్క ఖిబ్లా వైపు సైగ చేస్తూ ఇలా సెలవిచ్చారు; "నేను ఇప్పుడిప్పుడే మీకు నమాజు చేయించాను. అప్పుడు నేను స్వర్గలోకాన్ని నరకలోకాన్ని చూశాను. వాటి ఛాయాచిత్రాలు ఖిబ్లా వైపు ఉన్న ఈ గోడపై ప్రదర్శించబడ్డాయి. నేను ఈ రోజు చూసిన విధంగా ఇంతవరకు మంచినీ చూడలేదు. చెడునూ చూడలేదు. ఆయన (స) ఇలా మూడుసార్లు అన్నారు.

## 89వ అధ్యాయం

### నమాజు చేసేటప్పుడు ఆకాశం వైపునకు చూడటం

**717.** అనస్ బిన్ మాలిక్ అన్సారీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారు; ప్రజలకు ఏమైందని వారు నమాజు చేసేటప్పుడు తమ దృష్టిని ఆకాశం వైపునకు సారిస్తున్నారు? ఆయన (స) ఈ విషయమై ఎంతో కఠినంగా సెలవిచ్చారు. చివరకు ఆయన (స) ఇలా అన్నారు; "వారు ఇలా చెయ్యటం మానుకోవాలి. లేకపోతే వారి చూపులు ఎగరేసుకు పోబడతాయి."

## 90వ అధ్యాయం

### నమాజ్ చేసే సమయంలో అటూ ఇటూ చూడటం ధర్మసమ్మతమేనా?[1]

**718.** హజ్రత్ ఆయెషా (ర.అ) ఇలా తెలిపారు; ఒకసారి నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)ను, నమాజ్ చేసే సమయంలో అటూ ఇటూ చూడటం

---

715-1. అది ఎన్నటికీ నశించదు. ఎందుకంటే, స్వర్గంలోని కానుకలు అన్నీ నశించేవి కావు.

90-1. దీనిని 'ఇల్తిఫాత్' అని అంటారు. అంటే మెడను లేదా ఛాతీని త్రిప్పకుండా కళ్ళ చివర్లతో అటూ ఇటూ చూడటం. అనేకమంది విద్వాంసులు నమాజులో ఇలా చెయ్యటాన్ని మక్రూహ్ (అవాంఛనీయమైనదిగా) అభివర్ణించారు. కొందరు దీనిని హరామ్ (నిషిద్ధం) అని కూడా పేర్కొన్నారు. జాహిరియా వర్గం వారి అభిప్రాయం కూడా ఇదే. ఇబ్నె అబీషైబా గారు ఇబ్నె సీరీన్ నుంచి ఈ విషయాన్ని తీసుకుని ఇలా వివరించారు. సహాబా (దైవప్రవక్త(స)గారి ప్రత్యక్ష అనుచరులు) మొదట నమాజులో ఇల్తిఫాత్ చేస్తూ ఉండేవారు. ఖుర్ఆన్ గ్రంథంలోని ఈ వాక్యం అవతరించిన తరువాత 'ఖద్

**గురించి అడిగాను. దానికి సమాధానంగా ఆయన(స) ఇలా సెలవిచ్చారు; అది షైతాన్ పొంచి చేసే దొంగతనం. వాడు మనిషి చేసే నమాజులో నుంచి ఒక భాగాన్ని ఎగరేసుకుపోతాడు.[1]**

**719. హజ్రత్ ఆయెషా(రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) డిజైన్ ఉన్నటువంటి ఒక నల్లని దుప్పటి వేసుకుని నమాజు చేశారు. తరువాత (నమాజు అయిపోయిన పిదప) ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు; దీనిమీద ఉన్న డిజైన్ నా ధ్యానాన్ని మరల్చింది, నన్ను అశ్రద్ధకు గురి చేసింది. దీన్ని అబూజహమ్ వద్దకు వాపసు తీసుకువెళ్ళండి. నా కోసం డిజైన్ లేని ఒక సాదా దుప్పటిని తీసుకురండి.**

## 91వ అధ్యాయం

**ఒకవేళ ఏదైనా ప్రమాదం[1] జరిగితే నమాజు చేసే వ్యక్తిపై ఏదైనా పెద్ద వస్తువు పడితే లేదా నమాజు చేసే మనిషి ఏదైనా పెద్ద వస్తువును చూస్తే లేదా ఖిబ్లా వైపు ఉన్నటు వంటి గోడపై ఉమ్మిని చూస్తే అప్పుడు 'ఇల్తిఫాత్' చేస్తే అది దోషం కాదు. సహల్ బిన్ సాద్ ఇలా అన్నారు; అబూబకర్(రజిఅన్) ఇల్తిఫాత్ చేశారు. అప్పుడు ఆయన దైవప్రవక్త(స)గారిని చూశారు.**

**720. అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మస్జిద్‌లో ఖిబ్లా దిక్కులో ఉన్న గోడ మీద కళ్ళెను చూశారు. అప్పుడు ఆయన(స) ప్రజలకు ముందు నిలబడి నమాజు చేయిస్తున్నారు. ఆయన(స)గారు నమాజులో ఉన్న స్థితిలోనే దానిని గీకి పారేశారు.[1] నమాజు పూర్తి**

---

అఫ్లహల్ మూమినూన్. అల్లజీన హుమ్ ఫీ సలాతిహిమ్ ఖాషివూన్' (నిశ్చయంగా సాఫల్యం పొందే విశ్వాసులు తమ నమాజులలో వినమ్రతను పాటిస్తారు) (దివ్య ఖుర్ఆన్ 23-1,2) నమాజులో సజ్దా చేసే స్థలం మీద దృష్టిని పెట్టటం ప్రారంభించారు.

718-1. అంటే, నమాజు ద్వారా లభించే పుణ్యాన్ని కోల్పోవచ్చు. లేదా అది తగ్గి పోవచ్చు. ఒక హదీసులో ఇలా వచ్చింది; నమాజులో ఉన్నప్పుడు మనిషిగనక మూడోసారి అటూ ఇటూ చూసినట్లయితే అల్లాహ్ తన ముఖాన్ని ఆ మనిషి వైపు నుంచి త్రిప్పుకుంటాడు.

91-1. ఇల్లు పడిపోవటం లేదా పాముగానీ, తేలుగానీ రావటం లేదా మరొక ఆపద ఏదైనా రావటం వంటి ప్రమాదాలు.

అయిన తరువాత ఆయన(స) ఇలా సెలవిచ్చారు; మీలో ఎవరైనా నమాజు చేస్తూ ఉన్నప్పుడు, అల్లాహ్ అతని ముఖం ముందు ఉంటాడు. కనుక అతను నమాజులో తన ముఖం ముందు ఉన్న స్థలంలో కాండ్రించి (కళ్ళెను) ఉమ్మి వేయకూడదు.

**721.** అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి ముస్లిములు ఉదయం నమాజు చేస్తూ ఉన్నారు. అప్పుడు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) హజ్రత్ ఆయిషా(రజిఅన్) నివసించే గది పరదాను తొలగించి వరుసగా పంక్తులలో నిలబడి ఉన్న ముస్లిములను చూశారు. ముస్లిములు దైవప్రవక్త(స)ను హఠాత్తుగా చూసిన కారణంగా భయపడిపోయారు. దైవప్రవక్త(స) తృప్తిగా, సంతోషంగా నవ్వసాగారు. అబూబకర్(ర) వెనక్కి తిరిగిపోసాగారు. ఆయన(స) వెనుక ఉన్న పంక్తిలో కలిసి పోదామనే ఉద్దేశంతో అలా చేశారు. ఇంకా దైవప్రవక్త(స) నమాజు కోసం గదిలో నుంచి బయటకు వస్తారని ఆయన(ర) అనుకున్నారు. ముస్లిములు ఆనందంతో పొంగిపోతూ నమాజునే వదిలిపెట్టే సంకల్పం చేసుకున్నారు. అప్పుడు దైవ ప్రవక్త(స) సైగల ద్వారా నమాజు పూర్తి చెయ్యమని సూచించారు. ఆయన(స) ఇంకా పరదాను కిందికి వదిలేశారు. అదే రోజు సాయంత్రం పూట దైవప్రవక్త(స) పరమపదించారు.

## 92వ అధ్యాయం

**ఖుర్ఆన్ పఠించటం అందరిపై వాజిబ్[1] ఇమామ్ అయినా లేదా ముఖ్తదీ అయినా- ప్రతి నమాజులోను. బసలో ఉన్నా, బయట ప్రయాణంలో ఉన్నా- జహ్రీ నమాజు (బిగ్గరగా చేసే నమాజు)అయినా సరే, సిర్రీ నమాజు (నిశ్శబ్దంగా చేసే నమాజు) అయినా సరే.**

**722.** జాబిర్ బిన్ సమురా (రజి) ఇలా ఉల్లేఖించారు; కూఫా పౌరులు సాద్ బిన్ అబీ వఖాస్ (రజిఅన్)కు వ్యతిరేకంగా హజ్రత్ ఉమర్(ర) గారికి ఫిర్యాదు చేశారు. హజ్రత్ ఉమర్(ర) ఆయన గారిని బర్తరఫ్ చేశారు. మరియు అమ్మార్

---

720–1. ఇది చాలా చిన్న విషయం, చాలా చిన్నపని కాబట్టి నమాజు చెడిపోదు.

92–1. మెజారిటీ విద్వాంసులు మరియు అహ్లెహదీస్‌వారు ఈ అభిప్రాయాన్నే సమర్థిస్తారు. ఇంకా వారు ముఖ్తదీ కూడా ఫాతిహా సూరా తప్పనిసరిగా పఠించాలని అంటారు. ఇందులో అభిప్రాయభేదం లేదు. కాని హనఫి మస్లక్‌వారు మాత్రమే ముఖ్తదీపై ఖుర్ఆన్ పఠనం వాజిబ్‌కాదు; ఇమామ్ చేసే ఖుర్ఆన్ పఠనం సరిపోతుంది అని అంటారు.

బిన్ యాసిర్ (ర)ను కూఫా ప్రజలకు గవర్నర్‌గా నియమించారు. కూఫా ప్రజలు సాద్‌కు వ్యతిరేకంగా ఎన్నో ఫిర్యాదులు చేశారు. ఆఖరికి వారు; ఆయన నమాజు కూడా సక్రమంగా చేయించలేరు అని చెప్పారు. తరువాత హజ్రత్ ఉమర్(ర) సాద్‌ను తన వద్దకు పిలిపించి ఆయనతో ఇలా అన్నారు; ఓ అబూ ఇస్‌హాఖ్! (ఓ ఇస్‌హాఖ్ తండ్రీ!) కూఫా నుంచి వచ్చిన ఈ ప్రజలు, నీవు సక్రమంగా నమాజు కూడా చేయించలేవని అంటున్నారు. (దీనికి నువ్వేమంటావ్?) దానికి సమాధానంగా ఆయన(ర)ఇలా అన్నారు; 'అల్లాహ్ సాక్షిగా చెబుతున్నాను, దైవప్రవక్త(స) ఏ విధంగా నమాజు చేయించేవారో ఆ విధంగానే నేను కూడా వారికి నమాజు చేయించేవాణ్ణి. నేను ఈ విషయంలో కొంచెమైనా లోపం చెయ్యలేదు. ఇషా నమాజు చేయించినప్పుడు మొదటి రెండు రకాతులను నేను పొడుగైనవిగా చేయించే వాణ్ణి. తరువాతి రెండు రకాతులను తేలికైనవిగా చేయించేవాణ్ణి'. అప్పుడు హజ్రత్ ఉమర్(ర) ఇలా సెలవిచ్చారు: "ఓ అబూ ఇస్‌హాఖ్! నేను నిన్ను గురించి ఇలాంటి అభిప్రాయాన్నే కలిగి ఉన్నాను". తరువాత హజ్రత్ ఉమర్(ర)సాద్(ర)కు తోడుగా ఒక మనిషినో లేక కొంతమందినో ఇచ్చి కూఫా వైపునకు పంపారు; కూఫా వారు సాద్(ర)కు వ్యతిరేకంగా చేసిన ఫిర్యాదులను గురించి పరిశోధించటానికి వారిని పంపారు, వారు కూఫాలోని ప్రతి మస్జిద్ వద్దకు వెళ్ళి సాద్(ర)ను గురించి ప్రశ్నించారు. ఆ మస్జిద్‌లలో ప్రజలందరూ సాద్(ర)ను మంచి వ్యక్తిగా పొగిడారు. ఆ తరువాత వారు బనీ అబస్ తెగకు చెందిన మస్జిద్‌లోకి వెళ్ళారు. అక్కడి ప్రజల్లోని ఉసామా బిన్ ఖతాద అనే పేరుగల వ్యక్తి ఒకడు నిలబడి ఇలా అన్నాడు; "మీరు మాకు ప్రమాణం చేయించారు గనక నేను తప్పకుండా కొన్ని విషయాలు చెబుతాను; నిజం ఏమిటంటే సాద్ యుద్ధం చెయ్యటానికి సైన్యంతో ఎన్నడూ వెళ్ళలేదు. ఆయన విజయధనాన్ని అందరికీ సమానంగా ఎన్నడూ పంచిపెట్టలేదు. ఇంకా వ్యాజ్యాలలో ఆయన చేసే తీర్పులలో న్యాయం చేసేవారు కాదు". సాద్(ర) ఈ విషయాలను విని ఇలా అన్నారు; "అల్లాహ్‌పై ప్రమాణం చేసి చెబుతున్నాను! నేను మీకు మూడు శాపాలు పెడుతు న్నాను. (మూడు బద్ దుఆలు చేస్తున్నాను)." "ఓ అల్లాహ్! నీ దాసుడైన ఇతను అబద్ధీకుడైతే కేవలం ప్రదర్శనకోసం, అబద్ధాన్ని వ్యాపింపజెయ్యటం కోసం నిలబడి నట్లయితే, నీవు అతని జీవిత కాలాన్ని పొడిగించు, అతన్ని దారిద్ర్యానికి గురిచెయ్యి. ఇంకా అతన్ని ఆపదలలో చిక్కుకునేలా చెయ్యి." తరువాత ఆ వ్యక్తి ఈ శాపాల

ప్రభావానికి గురి అయ్యాడు. అతని పరిస్థితి దీనాతిదీనంగా మారిపోయింది. ఎవరైనా అతన్ని తన పరిస్థితిని గురించి అడిగితే ఇలా అనేవాడు, “నేను ముసలివాడినైపోయాను, ఆపదలలో చిక్కుకున్నాను. సాద్ చేసిన బద్దుఆలు నాకు తగిలాయి.” అబ్దుల్ మలిక్ ఇలా అన్నారు; “నేను కూడా అతన్ని చూశాను. అతను కడువృద్ధుడైపోయాడు. అతని కనుబొమ్మలు అతని కళ్లపై వ్రేలాడుతున్నాయి. మార్గంలో నిలబడి ఆడపిల్లల్ని వేధిస్తూ వారి తిట్లు తింటూ ఉంటాడు.”

**723.** ఉబాదా బిన్ సామిత్ (రజిఅన్) దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని ఉల్లేఖించారు; ఏ వ్యక్తి అయితే తన నమాజులో ఫాతిహా సూరా పఠించడో ఆ వ్యక్తి చేసే నమాజు చెల్లదు.

**724.** హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి దైవ ప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) మసీదులోకి ప్రవేశించారు. ఇంతలో ఒక వ్యక్తి ఆయన (స) గారిని అనుసరిస్తూ మసీదులోకి వెళ్లాడు. అతను నమాజు చేశాడు. తరువాత మహాప్రవక్త (స) గారికి సలామ్ చేశాడు. ఆయన (స) గారు అతని సలామ్‌కు జవాబు పలికి ఇలా సెలవిచ్చారు; ‘వెళ్లు’ మళ్లీ నమాజు చెయ్యి. నీవు నమాజు చెయ్యలేదు. అతను వెళ్లి మళ్లీ నమాజు చేశాడు. మొదట ఎలా నమాజు చేశాడో రెండోసారి కూడా అతను అలానే నమాజు చేశాడు. నమాజు పూర్తి చేసిన తరువాత అతను దైవప్రవక్త (స) గారి వద్దకు మళ్లీ వచ్చి సలామ్ చేశాడు. అప్పుడు దైవప్రవక్త (స) మళ్లీ ఇలా సెలవిచ్చారు; “వెళ్లు, మళ్లీ నమాజు చెయ్యి. నీవు నమాజు చెయ్యనేలేదు.” మూడుసార్లు ఇలానే జరిగింది. చివరకు అతను ఇలా విన్న వించుకున్నాడు; “మిమ్మల్ని దైవప్రవక్తగా చేసి పంపిన అల్లాహ్ సాక్షిగా చెబుతున్నాను! ఇంతకంటే బాగా నమాజును నేను చెయ్యలేను. దయచేసి నాకు నేర్పండి.” అప్పుడు ఆయన (స) ఇలా సెలవిచ్చారు; “నీవు నమాజు కోసం నిలబడినపుడు ‘అల్లాహు అక్బర్’ అని పలుకు. తరువాత నీకు జ్ఞాపకం ఉన్న ఖురానును, సులభంగా పఠించగలదానిని, పఠించు. ఆ తరువాత నెమ్మదిగా, ప్రశాంతంగా రుకూ చెయ్యి, ఆ తరువాత శిరస్సును పైకి ఎత్తు, నిటారుగా నిలబడు. తరువాత నెమ్మదిగా సజ్దా చెయ్యి. ఆ తరువాత సజ్దా నుంచి శిరస్సును ఎత్తి ప్రశాంతంగా కూర్చుండిపో. (అదే విధంగా రెండో సజ్దా కూడా చెయ్యి). ఈ విధంగా మొత్తం నమాజు చెయ్యి”.

## 93వ అధ్యాయం

## జుహ్రా నమాజులో ఖుర్‌ఆన్ పఠనం.

**725.** జాబిర్ బిన్ సమురా ఇలా ఉల్లేఖించారు; సాద్ బిన్ అబీ వఖాస్ (రజిఅన్) హ్రజత్ ఉమర్ (రజిఅన్) గారితో ఇలా అన్నారు: (కూఫా ప్రజలు ఆయన(స)కు వ్యతిరేకంగా ఫిర్యాదు చేసినప్పుడు) "నేనైతే వారికి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) గారు చేసిన నమాజు మాదిరిగానే జుహ్రా, అస్ర్ నమాజులను చేయిస్తూ ఉండేవాణ్ణి. ఎలాంటి లోపమూ చేసేవాణ్ణి కాదు. మొదటి రెండు రకాతులను పొడుగైనవిగా చేయించేవాణ్ణి. తరువాతి రెండు రకాతులను క్లుప్తంగా చేయించేవాణ్ణి". హ్రజత్ ఉమర్ (రజిఅన్) ఆయనతో 'మిమ్మల్ని గురించి నా అభిప్రాయం కూడా ఇదే' అన్నారు.

**726.** తన తండ్రిగారైన అబూ ఖతాద హారిస్ బిన్ రబి ఇలా చెప్పారని అబ్దుల్లా బిన్ అబీ ఖతాదా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) జుహ్రా నమాజులోని మొదటి రెండు రకాతులలో ఫాతిహా సూరాతోపాటు మరొక రెండు సూరాలను (ప్రతి రకాతులో ఒక సూరా) పఠించేవారు. మొదటి రకాతును పొడుగైనదిగానూ, రెండో రకాతును చిన్నదిగానూ చేసేవారు. అప్పుడప్పుడు ఒకటీ అర వాక్యం మాకు వినిపించేది. ఇంకా అస్ర్ నమాజులో కూడా ఫాతిహా సూరాతో పాటు మరొక రెండు సూరాలను (ప్రతి రకాతులో ఒక సూరా చొప్పున) పఠించేవారు. మొదటి రకాతు రెండో రకాతు కంటే సుదీర్ఘమైనదిగా ఉండేది. ఇంకా ఫజ్ర్ నమాజులో కూడా మొదటి రకాతు సుదీర్ఘమైనదిగాను, రెండో రకాతు దానికంటే చిన్నదిగాను ఉండేది.

**727.** అబూ మామర్ అబ్దుల్లా బిన్ సన్‌జర ఇలా ఉల్లేఖించారు; మేము ఖబ్బాబ్ బిన్ అరత్ (రజిఅన్)ను, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) జుహ్రా, అస్ర్ నమాజులలో ఖుర్‌ఆన్ పఠించేవారేనా? అని అడిగాము. దానికి సమాధానంగా ఆయన(ర), 'అవును, పఠించేవారు' అని అన్నారు. అప్పుడు మేము, ఆ విషయం మీకు ఎలా తెలుసు అని అడిగాము. ఆయన (ర) ఇలా అన్నారు; దైవప్రవక్త(స)గారి గడ్డం కదిలకల వల్ల ఆ విషయం నాకు తెలిసింది.[1]

---

727–1. గడ్డం అయితే ఏదైనా దుఆ చేసేటప్పుడు కూడా కదిలే అవకాశం ఉంది. కాని అది దుఆ చేసే సమయం కాదు. కనుక తెలిసిన విషయం ఏమిటంటే, ఆయన(స) ఖురానె షరీఫ్‌ను చదివేవారు. పైన వచ్చిన అబూ ఖతాదా (ర)గారి హదీసు కూడా ఈ విషయాన్ని ధ్రువీకరిస్తుంది.

## 94వ అధ్యాయం
## అస్ర్ నమాజులో ఖుర్‌ఆన్ పఠనం గురించి.

**728.** అబూ మామర్ ఇలా ఉల్లేఖించారు; నేను ఖబ్బాబ్ బిన్ అరత్‌ను, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) జుహ్ర్, అస్ర్ నమాజులలో ఖురాన్ షరీఫ్‌ను పఠించేవారా? అని అడిగాను. దానికి సమాధానంగా ఆయన 'అవును, పఠించేవారు' అని అన్నారు. అప్పుడు మేము ఆయన(స)గారు ఖురాన్ షరీఫ్‌ను పఠించేవారని మీకు ఎలా తెలుసు? అని ప్రశ్నించాము. ఆయన ఇలా అన్నారు; దైవప్రవక్త(స)గారి శుభప్రదమైన గడ్డం కదలికల ద్వారా నేను తెలుసుకున్నాను'.

**729.** తన తండ్రిగారు ఇలా అన్నారని అబ్దుల్లాహ్ బిన్ అబీ ఖతాద ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) జుహ్ర్, అస్ర్ నమాజులలో మొదటి రెండు రకాతులలోను ఫాతిహా సూరాతోపాటు మరొక సూరాను కూడా పఠించేవారు. అప్పుడప్పుడు ఒక ఆయత్ మాకు వినబడేలా కూడా పఠించేవారు.

## 95వ అధ్యాయం
## మగ్రిబ్ నమాజులో ఖుర్‌ఆన్ పఠనం గురించి

**730.** అబ్దుల్లాహ్ ఇబ్నె అబ్బాస్(ర) ఇలా ఉల్లేఖించారు; నా తల్లిగారైన ఉమ్ము ఫజల్, నేను 'వల్‌ముర్ సలాతి ఉర్ఫన్' (దివ్యఖుర్‌ఆన్– 77) అనే సూరాను పఠిస్తూ ఉండగా విని ఇలా అన్నారు; ఓ నా కుమారా! నీవు ఈ సూరాను పఠించి నాకు ఒక విషయాన్ని జ్ఞాపకం చేశావు. అదేమిటంటే ఇది దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) పఠిస్తూ ఉండగా నేను విన్నటువంటి చివరి సూరా. ఆయన(స) ఈ సూరాను మగ్‌రిబ్ నమాజు చేస్తూ పఠించారు.

**731.** జైద్ బిన్ సాబిత్ (ర) తనతో ఇలా అన్నారని మర్వాన్ బిన్ హకమ్ తెలిపారు: "నీకేమైంది, నీవు మగ్రిబ్ నమాజులో చిన్న చిన్న సూరాలు పఠిస్తున్నావు? నేనైతే దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారిని చూశాను, ఆయన(స) పొడుగైన రెండు సూరాలలోనుంచి ఎక్కువ పొడుగైన సూరాను పఠించేవారు."

## 96వ అధ్యాయం
## మగ్రిబ్ నమాజులో బిగ్గరగా పఠించడం

**732.** తన తండ్రిగారు ఇలా అన్నారని ముహమ్మద్ బిన్ జుబైర్ బిన్ ముత్‌యిమ్ ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) మగ్‌రిబ్

నమాజులో 'అత్తూర్' (దివ్యఖుర్ఆన్– 52) సూరాను పఠిస్తూ ఉండగా నేను విన్నాను.

## 97వ అధ్యాయం

### ఇషా నమాజులో బిగ్గరగా పఠించడం గురించి

**733.** అబూ రాఫె ఇలా ఉల్లేఖించారు; ఒకసారి నేను అబూ హురైరా(ర)తో కలిసి ఇషా నమాజు చేశాను. ఆయన(ర), 'ఇజస్సమావున్ షఖ్ఖత్' (దివ్యఖుర్ఆన్: 84) అనే సూరాను పఠించారు. తరువాత సజ్దె తిలావత్ చేశారు. అప్పుడు నేను, ఈ సజ్దె తిలావత్‌ను ఎందుకు చేశారు? అని ఆయన్ని అడిగాను. సమాధానంగా ఆయన (ర) ఇలా అన్నారు; "నేను దైవప్రవక్త ముహమ్మద్(స)గారి వెనుక నిలబడి నమాజు చేశాను. అప్పుడు ఆయన(స) ఈ సూరాను పఠించారు. మరియు సజ్దె తిలావత్ చేశారు. నేను తప్పనిసరిగా ఈ సూరా చదివినప్పుడు సజ్దా చేస్తూ ఉంటాను; ఈ విధంగా నేను మరణించేవరకు, దైవప్రవక్త(స)గారిని కలిసేవరకు చేస్తూనే ఉంటాను."

**734.** బరా బిన్ ఆజిబ్ (రజిఅన్) ఇలా చెబుతూ ఉండగా నేను విన్నాను అని అదీ బిన్ సాబిత్ ఉల్లేఖించారు; ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ప్రయాణంలో ఉన్నారు. అప్పుడు ఆయన(స) గారు ఇషా నమాజులోని ఒక రకాత్‌లో 'వత్తీని వజ్జయ్ తూని'(దివ్యఖుర్ఆన్– 95)అనే సూరాను పఠించారు.

## 98వ అధ్యాయం

### ఇషా నమాజులో సజ్దా ఉన్న సూరాను పారాయణం చేయటం

**735.** అబూ రాఫె ఇలా ఉల్లేఖించారు; ఒకసారి నేను అబూ హురైరా (రజిఅన్)తో కలిసి ఇషా నమాజు చేశాను. అప్పుడు ఆయన(ర) 'ఇజస్సమావున్ షఖ్ఖత్' (దివ్యఖుర్ఆన్– 84) అనే సూరాను పారాయణం చేశారు. ఇంకా సజ్దా కూడా చేశారు. నేను ఆయన్ని ఈ సజ్దా ఎందుకు చేశారు? అని అడిగాను. సమాధానంగా ఆయన(ర) ఇలా అన్నారు; నేను ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి వెనుక నిలబడి నమాజు చేశాను. అప్పుడు ఆయన(స) ఈ సూరాను పారాయణం చేశారు. మరియు సజ్దా చేశారు. నేను తప్పనిసరిగా ఈ సూరా చదివినప్పుడు సజ్దా చేస్తాను. నేను మరణించి దైవప్రవక్త(స)ను కలిసేవరకు ఇలా చేస్తూనే ఉంటాను.

## 99వ అధ్యాయం

### ఇషా నమాజులో ఖుర్‌ఆన్ పారాయణం గురించి.

**736.** బరా బిన్ ఆజిబ్(రజిఅన్) కథనం; నేను ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ను ఖుర్‌ఆన్ పారాయణం చేస్తూ ఉండగా విన్నాను. అప్పుడు ఆయన(స) ఇషా నమాజులో 'వత్తీని వజ్‌జయ్‌తూన్' (దివ్యఖుర్‌ఆన్– 95) అనే సూరాను పఠిస్తున్నారు. నేను దైవప్రవక్త ముహమ్మద్(స) గారి కంటే ఎక్కువ మధురంగానూ మరియు ఉత్తమమైన రీతిలోనూ ఖుర్‌ఆన్ పారాయణం చేసే వ్యక్తిని ఎవరినీ చూడలేదు.[1]

## 100వ అధ్యాయం

### ఇషా నమాజులోని మొదటి రెండు రకాతుల్లో ఖుర్‌ఆన్ పారాయణాన్ని సుదీర్ఘమైనదిగా చెయ్యటం. తరువాతి రెండు రకాతుల్లో ఖుర్‌ఆన్ పారాయణాన్ని తగ్గించి చెయ్యటం అనే విషయం గురించి.

**737.** జాబిర్ బిన్ సమురా ఇలా ఉల్లేఖించారు; హజ్రత్ ఉమర్ (రజిఅన్) సాద్ బిన్ అబీ వఖాస్‌ను ఉద్దేశించి ఇలా అన్నారు; "కూఫాకు చెందిన ప్రజలు మిమ్మల్ని గురించి ప్రతి విషయంలోను ఫిర్యాదు చేశారు. చివరకు నమాజు విషయంలో కూడా వారు మిమ్మల్ని గురించి తప్పుపట్టారు." దానికి సమాధానంగా సాద్ ఇలా అన్నారు; 'నేను ఇషా నమాజులో మొదటి రెండు రకాతులను సుదీర్ఘమైనవిగా చేసేవాణ్ణి. తరువాతి రెండు రకాతులను సంక్షిప్తంగా చేసేవాణ్ణి. ఇంకా దైవప్రవక్త(స) గారి నమాజును అనుసరించే విషయంలో నేను ఎలాంటి కొరతా చెయ్యలేదు." అప్పుడు హజ్రత్ ఉమర్(ర) ఇలా అన్నారు. "మీరు సత్యమే పలుకుతున్నారు. మిమ్మల్ని గురించి నేను ఇలానే అనుకుంటున్నాను."

## 101వ అధ్యాయం

### ఉదయం నమాజులో ఖుర్‌ఆన్ పారాయణం గురించి. విశ్వాసుల తల్లి అయిన హజ్రత్ ఉమ్మె సలమా (రజిఅన్‌హా) ఇలా అన్నారు; దైవప్రవక్త(స) 'తూర్ సూరా' (ఖుర్‌ఆన్- 52) పఠించారు.

---

736–1. సుబ్‌హానల్లాహ్! అల్లాహ్ అత్యంత పవిత్రుడు. ఆయన దైవప్రవక్త(స)గారికి మధురమైన కంఠాన్ని ప్రసాదించాడు, ఖుర్‌ఆన్ పఠించే రీతిని ప్రసాదించాడు. ఆయన(స) గారి కంటే మధురంగా, ఉత్తమంగా ఖుర్‌ఆన్‌ను పారాయణం చేసేవారు ఎవ్వరూ లేరు.

**738.** సయ్యార్ బిన్ సలామ ఇలా ఉల్లేఖించారు; నేను మరియు నా తండ్రి గారు ఉభయులము కలిసి ఒకసారి అబూబర్‌జా అస్లమీ (రజి) వద్దకు వెళ్ళాము. ఆయన్ని మేము నమాజుల వేళలను గురించి అడిగాము. ఆయన ఇలా చెప్పారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) జుహ్ర్ నమాజును సూర్యుడు వాలినప్పుడు చేసేవారు. ఇంకా అసర్ నమాజు చేసిన తరువాత ఒక మనిషి ఎవరైనా పట్టణం చివరకు చేరిన తరువాత చూస్తే సూర్యుడు తీవ్రంగానే ఉంటాడు. సయ్యార్ ఇంకా ఇలా అన్నారు; 'అబూ బర్‌జాగారు మగ్రిబ్ వేళను గురించి చెప్పిన విషయాన్ని నేను మరిచిపోయాను' అబూబర్‌జా ఇలా అన్నారు; దైవప్రవక్త(స) ఇషా నమాజు విషయంలో మూడవ వంతు రాత్రి గడచిపోయే వరకు ఆలస్యమైనా లక్ష్యపెట్టేవారు కాదు. ఇషా నమాజుకు ముందు నిద్రపోవటాన్ని, ఇషా నమాజు తరువాత మాటల్లో నిమగ్నమైపోవటాన్ని ఇష్టపడేవారు కాదు. ఇంకా ఉదయం నమాజు ఎప్పుడు చేసేవారంటే, నమాజు పూర్తి చేసిన తరువాత ఒక మనిషి తన వద్ద కూర్చున్న మరొక మనిషిని గుర్తించగలిగేవాడు. ఇంకా ఉదయం నమాజు రెండు రకాతులలో లేదా ఒకే ఒక రకాతులో అరవై నుంచి నూరు ఖుర్ఆన్ వాక్యాల వరకు పఠించేవారు.

**739.** హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ప్రతి నమాజులోను ఖురాను వాక్యాలను తప్పనిసరిగా పారాయణం చెయ్యాలి. ఏ నమాజు లలోనయితే దైవప్రవక్త ముహమ్మద్ (స) ఖురాను వాక్యాలను బిగ్గరగా పారాయణం చేశారో, ఆ నమాజులలో మేము కూడా ఖురాను వాక్యాలను మీ కోసం బిగ్గరగా పఠించి వినిపిస్తున్నాము; ఇంకా ఏ నమాజులలోనయితే దైవప్రవక్త (స) మెల్లగా, నెమ్మదిగా ఖురాను వాక్యాలను పఠించారో ఆ నమాజులలో మేము కూడా మీ కోసం ఖురాను వాక్యాలను నెమ్మదిగా, మెల్లగా పఠించి వినిపించాము. ఒకవేళ మీరు కేవలం ఫాతిహా సూరా చదివినప్పటికీ అది కూడా సరిపోతుంది. కాని ఒకవేళ దానికంటే ఎక్కువగా ఖురాన్‌ను పఠిస్తే అది మంచిది.[1]

---

739-1. తెలిసిన విషయం ఏమిటంటే, ఫాతిహా సూరాలేని నమాజు ధర్మసమ్మతం కాదు. తెలిసిన మరొక విషయం ఏమిటంటే, ఫాతిహా సూరాతోపాటు మరొక సూరాను కలిపి పఠించటం 'ముస్తహబ్'. కాని 'వాజిబ్' మటుకు కాదు. మెజారిటీ విద్వాంసుల అభిప్రాయం కూడా ఇదే. కాని హనఫి మస్లక్ వారు ఈ రెండు విషయాలతోను విభేదించారు.

## 102వ అధ్యాయం

### ఉదయం నమాజులో బిగ్గరగా ఖురాను పఠించటం గురించి.

విశ్వాసుల తల్లి అయిన ఉమ్మెసలమా (ర.అ) ఇలా అన్నారు: నేను ప్రజలకు దూరంగా వారి వెనుక కాబా ప్రదక్షిణం చేస్తూ ఉన్నాను. అప్పుడు దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ప్రజల చేత నమాజు చేయిస్తున్నారు. ఆయన (స) అప్పుడు ఖురాన్‌లోని అత్‌తూర్ సూరాను పారాయణం చేస్తూ ఉన్నారు.

**740.** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) తన సహచరులు కొందరితో కలిసి ఉకాజ్ మార్కెట్టుకు వెళ్లే ఉద్దేశ్యంతో బయలుదేరారు. ఆ రోజుల్లోనే షైతానులు ఆకాశ వార్తలను పొందకుండా నిరోధించబడ్డారు. ఇంకా నిప్పుకణాలు వారి పైకి విసరబడ్డాయి. అప్పుడు ఆ షైతానులు తమ వర్గం వైపునకు మరలి వచ్చారు. వారు తిరిగి వచ్చిన షైతానులను, 'మీకేమయింది? ఎందుకు తిరిగి వచ్చారు?' అని అడిగారు. అప్పుడు వారు ఇలా సమాధానం చెప్పారు; "ఏం చెప్పమంటారు, ఆకాశ వార్తలు మాకు అందకుండా ఆపబడ్డాయి. మాపైకి నిప్పు కణాలు రువ్వబడ్డాయి." షైతానులతో వారు ఇలా అన్నారు; "ఆకాశ వార్తలు మీకు అందకుండా ఆపబడటానికి కారణం ఏదైనా, అది మాత్రం కొత్త విషయమే. కనుక భూమిలోని పశ్చిమ దిశకు, తూర్పు దిశకు వెళ్లి తిరిగి చూడండి. కొత్త విషయం ఏదైనా సంభవించిందేమో కనుక్కోండి. దాని కారణంగా ఆకాశ వార్తలు మీకు అంద లేదేమో", ఇది విని వారు భూమికి నలువైపులా వెళ్లి తిరిగి చూడసాగారు. వారితో తిహామా వైపునకు వెళ్లిన జిన్నాతులు దైవప్రవక్త ముహమ్మద్ (స)ను చూశారు. అప్పుడు ఆయన (స) గారు నఖల అనే స్థలం వద్ద ఉన్నారు. ఉకాజ్ మార్కెట్టుకు వెళ్లే సంకల్పంతో ఆయన (స) అక్కడకు వచ్చారు. అప్పుడు ఆయన (స) తన సహ చరులకు ఉదయం నమాజు చేయిస్తున్నారు. నమాజులోని ఖురాన్ పారాయణాన్ని విన్నటువంటి జిన్నాతులు అటు వైపు వెళ్ళి వినసాగారు. వారు ఇలా అనసాగారు; "అల్లాహ్ సాక్షిగా! దీని మూలంగానే ఆకాశవార్తలు మాకు అందకుండా నిరోధించ బడ్డాయి." అదే సమయంలో ఆ జిన్నాతులు తమ జిన్నాతు వర్గం వద్దకు తిరిగి వెళ్ళి వారితో ఇలా అనసాగారు; "ఓ మా జాతివారలారా! మేము ఈ రోజు ఒక విచిత్ర మైన, అసాధారణమైన ఖురాను వాక్యాలను విని వస్తున్నాము. ఆ గ్రంథం రుజు మార్గాన్ని చూపుతోంది. మేము దానిని విశ్వసించాము. ఇంకా మేము మా ప్రభువుకు

భాగస్వాములుగా ఎవరినీ చెయ్యము." అప్పుడు అల్లాహ్ తన ప్రవక్త ముహమ్మద్ (స) పై "ఖుల్ ఊహియ ఇలయ్య" (జిన్ సూరా-72) సూరాను అవతరింపజేశాడు. జిన్నాతులు ఏ విషయాన్నయితే తమ జాతి వారికి చెప్పారో ఆ విషయాన్నే దైవప్రవక్త (స)కు వహీ ద్వారా తెలియజెయ్యటం జరిగింది.

**741.** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) ఇలా ఉల్లేఖించారు; ఏ నమాజులోనయితే ఖురాను వాక్యాలను బిగ్గరగా చదవమని దైవప్రవక్త (స) గారిని ఆజ్ఞాపించటం జరిగిందో, ఆ నమాజులో ఆయన (స) గారు బిగ్గరగా పారాయణం చేశారు. ఇంకా ఏ నమాజులోనయితే ఆయన (స) గారిని నెమ్మదిగా, మెల్లగా పారాయణం చెయ్యమని ఆజ్ఞాపించటం జరిగిందో ఆ నమాజులో ఆయన (స) గారు మెల్లగా, నెమ్మదిగా పారాయణం చేశారు. "నీ ప్రభువు (అంటే అల్లాహ్) మరచి పోయేవాడు కాదు. మీరు అల్లాహ్ ప్రవక్తను అనుసరించాలి. ఆయన్ని అనుసరించటమే ఉత్తమమైనది."

## 103వ అధ్యాయం

**ఒకే రకాతులో రెండు సూరాలను పఠించటం మరియు ఒక సూరాలోని చివరి వాక్యాలను పఠించటం; క్రమబద్ధతకు భిన్నంగా సూరాలను పఠించటం. ఒక సూరాలోని మొదటి వాక్యాలను మాత్రమే పఠించటం. ఇదంతా ధర్మసమ్మతమే.**

అబ్దుల్లాహ్ ఇబ్నె సాయిబ్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఉదయం నమాజులో మోమినూన్ సూరా పఠనం ప్రారంభించారు. మూసా(అ), హారూన్(అ)ల గాథ వద్దకు వచ్చినప్పుడు లేదా ఈసా(అ) గాథ వద్దకు వచ్చినప్పుడు ఆయన(స)కు దగ్గు వచ్చింది. అప్పుడు ఆయన(స)గారు రుకూ చేశారు. హజ్రత్ ఉమర్(ర) ఉదయం నమాజులో మొదటి రకాత్‌లో బఖరా సూరాలోని నూట ఇరవై వాక్యాలను పఠించారు. ఇంకా రెండవ రకాతులో మసానీకి చెందిన ఒక సూరాను పఠించారు. అహ్నఫ్ ఇబ్నె ఖైస్ ఉదయం నమాజులోని మొదటి రకాతులో అల్ కహఫ్ సూరానూ, రెండవ రకాతులో యూసుఫ్ సూరాను లేదా యూనుస్ సూరాను పఠించారు. ఆయన ఇలా అన్నారు; నేను ఒకసారి హజ్రత్ ఉమర్(ర)గారితో కలిసి ఉదయం నమాజు చేశాను. ఆయన (ర) ఈ సూరాలనే పఠించారు. అబ్దుల్లాహ్ బిన్ మసూద్(ర) మొదటి రకాతులో అన్‌ఫాల్ సూరాలోని 40 ఆయత్‌లను, రెండవ రకాత్‌లో ముఫస్సల్ సూరాలలోని ఒక సూరాను పఠించారు. ఖతాదా ఇలా అన్నారు; ఒకవేళ ఒక మనిషి ఎవరైనా ఒకే సూరాను రెండు

రకాతులలోనూ పఠించినట్లయితే (ఒక్కొక్క రకాతులో సగం సూరా చొప్పున) లేదా ఒకే సూరాను రెండు రకాతులలోనూ పఠించినట్లయితే అది దోషం కాదు. అన్నీ అల్లాహ్ గ్రంథంలోనివే. హ(జత్ అనస్(ర) ఇలా అన్నారు; ఒక అన్సారీ పురుషుడు ఖుబా మస్జిద్‌లో ప్రజలకు నమాజు చేయించేవాడు. అతని అలవాటు ఏమిటంటే, నమాజులో అల్‌ఫాతిహా సూరా పఠించిన తరువాత 'ఖుల్ హువల్లాహు అహద్' అనే సూరా పఠిస్తాడు. ఆ సూరాను పఠించిన తరువాత మరొక సూరాను కూడా పఠిస్తాడు. ప్రతి రకాతులోను ఈ పద్ధతినే అవలంబించేవాడు. అతనితో పాటు నమాజు చేసే అతని సహచరులు దీనిపట్ల అభ్యంతరం తెలియజేశారు. వారు అతనితో ఇలా అన్నారు; "నీవు 'ఖుల్ హువల్లాహు అహద్' అనే సూరాను పఠిస్తావు. తరువాత ఈ సూరా పఠనం సరిపోదని తలంచి మరొక సూరాను దానితోపాటు కలిపి పఠిస్తు న్నావా? ఇకముందు కేవలం 'ఖుల్‌హువల్లాహు అహద్' అనే సూరాను మాత్రమే పఠించు లేదా దానిని విడిచి పెట్టి మరొక సూరాను దేన్నయినా పఠించు.' దానికి సమాధానంగా అతను ఇలా అన్నాడు; "నేనైతే 'ఖుల్‌హువల్లాహు అహద్' అనే సూరాను పఠించటం విడిచిపెట్టే ప్రసక్తే లేదు. దానిని నేను ఎంత మాత్రం విడిచిపెట్టను. మీకు ఇష్టమైతేనే నేను నమాజులో మీకు నాయకత్వం వహిస్తాను. మీకు ఇష్టం లేకపోతే నేను నాయకత్వపు బాధ్యతలను వదులుకుంటాను." అందరిలోనూ అతను ఉత్తముడనే విషయం ప్రజలకు తెలుసు. మరొకడు నాయకత్వం వహించటం వారికి ఇష్టంలేదు. ఆ సమయంలో దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఖుబా ప్రజల వద్దకు విచ్చేశారు. వారందరూ ఈ విషయాన్ని ఆయన (స) గారికి విన్నవిం చుకున్నారు. దైవప్రవక్త(స) అతనిని ఇలా ప్రశ్నించారు; "ఓ దైవభక్తుడా! నీవు నీ సహచరులు చెప్పినట్లు ఎందుకు చెయ్యవు? నీవు ప్రతి రకాతులోను "ఖుల్‌హువల్లాహు అహద్" అనే సూరా పఠనాన్ని విధిగా చేసుకోవటానికి కారణం ఏమిటి?" అతను ఇలా సమాధానం చెప్పాడు: "ఓ దైవప్రవక్తా! నేను ఈ సూరాను అమితంగా ప్రేమి స్తాను." అప్పుడు దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; "ఈ సూరా పట్ల నీకున్న ప్రేమ నిన్ను స్వర్గలోకంలో ప్రవేశింపజేస్తుంది."

**742.** అబూ వాయిల్ ఇలా ఉల్లేఖించారు; ఒకసారి ఒక వ్యక్తి అబ్దుల్లాహ్ బిన్ మసూద్(ర) వద్దకు వచ్చి ఇలా అన్నాడు; "నేను పోయిన రాత్రి ముఫస్సల్ సూరా లన్నింటినీ ఒకే రకాతులో చదివేశాను." అబ్దుల్లాహ్ బిన్ మసూద్(ర) ఇలా అన్నారు. కవిత్వం చదివినట్లుగానే త్వరత్వరగా చదివేశావు.[1] "దైవప్రవక్త(స) గారు ఒక్కొక్క

**రకాతులో కలిపి చదివే జంట సూరాలను నేను ఎరుగుదును.” తరువాత అబ్దుల్లాహ్ బిన్ మసూద్(ర) ఇరవై ముఫస్సల్ సూరాలను గురించి వివరించారు– ఒక్కొక్క రకాతులో రెండేసి సూరాలు చొప్పున పఠించబడేవి.**

## 104వ అధ్యాయం

**నాలుగు రకాతుల నమాజులోని చివరి రెండు రకాతులలో కేవలం ఫాతిహా సూరాను మాత్రమే చదవటం.**

**743.** తన తండ్రిగారైన అబూ ఖతాదా ఇలా చెప్పారని అబ్దుల్లాహ్ ఇబ్నె అబీ ఖతాదా ఉల్లేఖించారు, “దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) జొహర్ నమాజులోని మొదటి రెండు రకాతులలో ఫాతిహా సూరా మరియు దానితో పాటు మరొక రెండు సూరాలు (ప్రతి రకాతులో ఒక సూరా) పఠించేవారు. కాని చివరి రెండు రకాతులలో కేవలం ఫాతిహా సూరాను మాత్రమే పఠించేవారు. అప్పుడప్పుడు ఒకటీ అరా ఖుర్ఆన్ వాక్యం మాకు వినిపించేది. మొదటి రకాతును రెండవ రకాతు కంటే పొడిగించి చదివేవారు. అసర్ నమాజులోను మరియు ఫజర్ నమాజులోను ఇలాగే చేసేవారు.”[1]

## 105వ అధ్యాయం

**జుహ్రా మరియు అస్ర నమాజులలో ఖురాను వాక్యాలను నెమ్మదిగా, మెల్లగా పఠించటం.**

**744.** అబూ మఅమర్ ఇలా ఉల్లేఖించారు; మేము ఖబ్బాబ్ బిన్ అరత్ (ర) గారిని ఇలా అడిగాము; “జుహ్రా, అస్ర్ నమాజులలో దైవప్రవక్త (స) ఖుర్ఆన్ పారాయణం చేసేవారా?” సమాధానంగా ఆయన, ‘అవును చేసేవారు’ అని అన్నారు. అప్పుడు మేము ‘ఈ విషయం మీకు ఎలా తెలుసు?’ అని అడిగాము. ఆయన ఇలా అన్నారు; “దైవప్రవక్త (స) గారి శుభప్రదమైన గడ్డం కదులుతూ ఉండేది.”

---

742–1. అంటే ఒకే ఒక్క రకాతులో నాలుగు పారాల ఖుర్ఆన్‌ను పఠించటం అంత మంచి విషయమేమీ కాదు. ఖుర్ఆన్ గ్రంథాన్ని ఆలోచిస్తూ ఆగి ఆగి నెమ్మదిగా పఠించాలి. త్వరత్వరగా పఠించటం వల్ల పుణ్యానికి బదులుగా శిక్షపడే భయం ఉంది.

743–1. అంటే అసర్ నమాజులోని మొదటి రెండు రకాతులలో ఫాతిహా సూరాతో పాటు మరొక సూరా ఏదైనా పఠించేవారు. చివరి రెండు రకాతులలో కేవలం ఫాతిహా సూరాను మాత్రమే పఠించేవారు. ఇంకా మొదటి రకాతును రెండవ రకాతుకంటే పొడిగించేవారు. ఇంకా ఉదయం నమాజులో కూడా మొదటి రకాతును రెండో రకాతుకంటే సుదీర్ఘంగా చదివేవారు.

## 106వ అధ్యాయం

**ఒకవేళ ఇమామ్ సిర్రీ నమాజులో (మౌనంగా చేసే నమాజులో) ఏదైనా ఖుర్ఆన్ వాక్యాన్ని బిగ్గరగా చదివితే మరియు దానిని ముఖ్తదీలు వింటే అందులో దోషమేమీ లేదు.**

**745.** తన తండ్రి గారైన అబూ ఖతాదా (ఒక సహాబి) (రజిఅన్) ఇలా చెప్పారని అబ్దుల్లాహ్ బిన్ అబీ ఖతాదా ఉల్లేఖించారు; దైవప్రవక్త ముహమ్మద్ (స) జుహ్ర్ నమాజులోని మొదటి రెండు రకాతులలో ఫాతిహా సూరాతోపాటు మరొక సూరాను ఒక్కొక్కటి చొప్పున పఠించేవారు. ఇదేవిధంగా అస్ర్ నమాజులో కూడా పఠించేవారు. అప్పుడప్పుడు ఒకటీ అరా ఆయత్ మాకు వినిపించేది. ఇంకా మొదటి రకాతును రెండో రకాతుకంటే పొడిగించి చేసేవారు.

## 107వ అధ్యాయం

**మొదటి రకాతును పొడిగించి (నమాజు) చెయ్యటం గురించి.**

**746.** తన తండ్రిగారైన అబూ ఖతాద (రజిఅన్) ఇలా చెప్పారని అబ్దుల్లాహ్ బిన్ అబీ ఖతాద (ర) ఉల్లేఖించారు; దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) జుహ్ర్ నమాజు లోని మొదటి రకాతును పొడిగించి చేసేవారు. మరియు రెండవ రకాతును చిన్నదిగా చేసి చేసేవారు; ఇంకా ఉదయం నమాజులో కూడా ఆయన (స) ఇలానే చేసేవారు.

## 108వ అధ్యాయం

**ఇమామ్ గనక (బిగ్గరగా చేసే నమాజులో) 'ఆమీన్' అని బిగ్గరగా అంటే, అది ధర్మసమ్మతమేనా?;**

అతా బిన్ అబాహ్ ఇలా అన్నారు; 'ఆమీన్' 'ఒక దుఆ.' అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ మరియు ఆయన వెనుక నమాజు చేసే ముఖ్తదీలు ఎంతో బిగ్గరగా 'ఆమీన్' అని అన్నారు; దానికి మసీదు ప్రతిధ్వనించింది. అబూ హురైరా (రజిఅన్) ఇమామ్‌తో ఇలా అన్నారు; "నేను చెప్పే ఆమీన్ మీరు చెప్పే ఆమీన్‌లో లీనమైపోయే అంత బిగ్గరగా మీరు ఆమీన్ చెప్పకూడదు." నాఫె ఇలా అన్నారు; "అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) 'ఆమీన్'ను విడిచిపెట్టేవారు కాదు. ఆమీన్ చెప్పమని ప్రజలను ప్రోత్సహించే వారు. నేను ఈ విషయంలో ఆయన గారు ఒక హదీసును ఉల్లేఖించగా విన్నాను.

**747.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారని, హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు; "ఇమామ్ గనక 'ఆమీన్' అని అంటే, మీరు కూడా 'ఆమీన్' అని అనండి. ఎందుకంటే ఎవరి ఆమీన్ అయితే దైవదూతలు చెప్పే

ఆమీన్‌తో ఏకీభూతమవుతుందో వారు పూర్వం చేసిన పాపాలన్నీ క్షమింపబడతాయి." ఇబ్నె షిహాబ్ ఇలా అన్నారు; దైవప్రవక్త ముహమ్మద్ (స) కూడా ఆమీన్ అని పలికేవారు.

## 109వ అధ్యాయం

### 'ఆమీన్' అని పలికే దాని యొక్క ఔన్నత్యం.

**748.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు; మీలో ఎవరైనా 'ఆమీన్' అని పలికితే మరియు ఆకాశంలోని దైవదూతలు కూడా 'ఆమీన్' అని పలికితే, ఈ రెండు 'ఆమీన్'లు ఏకకాలంలో సంభవిస్తే అప్పుడు 'ఆమీన్' అని పలికిన వ్యక్తి పూర్వం చేసిన పాపాలన్నీ క్షమించబడతాయి.[1]

## 110వ అధ్యాయం

### ముఖ్తదీలు బిగ్గరగా 'ఆమీన్' అని పలకటం గురించి.

**749.** దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు; నమాజు చేయించేటప్పుడు ఇమామ్, 'గైరిల్ మగ్‌జూబి అలయ్‌హిమ్ వలజ్‌జాల్లీన్' అని అన్నప్పుడు మీరు 'ఆమీన్' అని పలకండి. ఎందుకంటే, ఎవరైనా 'ఆమీన్' అని పలికినప్పుడు అది గనక దైవదూతలు పలికే 'ఆమీన్'తో ఏకీభూతమైనప్పుడు అతను పూర్వం చేసిన పాపాలన్నీ క్షమించ బడతాయి.

## 111వ అధ్యాయం

### నమాజు పంక్తిలో కలవక మునుపే రుకూ చెయ్యటం ధర్మసమ్మతమేనా?[1]

**750.** అబూబకర్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) మసీదులో ఉన్నప్పుడు నేను ఆయన (స) గారి వద్దకు వెళ్లాను. అప్పుడు ఆయన (స) గారు రుకూలో ఉన్నారు. నమాజు పంక్తిలో కలవక మునుపే నేను రుకూ చేశాను.[1] తరువాత ఈ విషయాన్ని నేను మహాప్రవక్త (స) గారికి చెప్పి

---

748–1. ఎందుకంటే దైవదూతలు చేసిన దుఆను అల్లాహ్ అంగీకరిస్తాడు.

111–1. ఇలా చెయ్యటం ధర్మసమ్మతమైన విషయమే. కాని మక్రూహ్ (అవాంఛనీయ మైనది). ఎందుకంటే మహాప్రవక్త ముహమ్మద్(స), మళ్లీ అలా చెయ్యవద్దని వారించారు.

750–1. తిబ్రానీ గారి ఉల్లేఖనంలో ఇలా ఉంది; అబూబకర్ (ర) నమాజుకు

నప్పుడు ఆయన (స) ఇలా సెలవిచ్చారు; "అల్లాహ్ ఇంతకంటే ఎక్కువగా మంచి పనులు చేసే ప్రేమను, భాగ్యాన్ని నీకు కలుగజేయుగాక! కాని మళ్లీ నీవు ఇలా చెయ్యబాకు."

## 112వ అధ్యాయం

**రుకూ చేసేటప్పుడు కూడా తక్బీర్ చెప్పటం. ఈ విషయాన్ని ఇబ్నె అబ్బాస్ (ర) దైవప్రవక్త (స) గారి నుంచి ఉల్లేఖించారు. మాలిక్ బిన్ హువైరిస్ కూడా ఈ విషయంలో ఒక ఉల్లేఖకులే.**

**751.** ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; నేను ఒకసారి బస్రాలో హజ్రత్ అలీ (రజిఅన్) గారితో కలిసి నమాజు చేశాను. ఆయన (ర), మేము దైవప్రవక్త (సఅసమ్) గారితో కలిసి చేస్తూ ఉండిన నమాజును మాకు జ్ఞాపకం చేశారు. హజ్రత్ అలీ (ర) తన శిరస్సును ఎత్తేటప్పుడూ మరియు తన శిరస్సును వంచేటప్పుడు తక్బీర్ (అల్లాహు అక్బర్) పలికేవారు.

**752.** అబూ సలమా ఇబ్నె అబ్దుర్రహ్మాన్ ఇలా ఉల్లేఖించారు; హజ్రత్ అబూ హురైరా (ర) ప్రజలకు నమాజు చేయించినప్పుడు వంగే సమయంలోనూ మరియు శిరస్సు ఎత్తే సమయంలోనూ తక్బీర్ పలికేవారు. నమాజు పూర్తి చేసిన తరువాత ఆయన ఇలా అనేవారు; నేను చేసే నమాజు మీరు చేసే నమాజు కంటే ఎక్కువగా దైవప్రవక్త (స) గారు చేసే నమాజును పోలి ఉంటుంది.

## 113వ అధ్యాయం

**సజ్దా చేసేటప్పుడు కూడా తక్బీర్ చెప్పటం.**

**753.** ముతర్రిఫ్ బిన్ అబ్దుల్లాహ్ ఇలా ఉల్లేఖించారు; నేను మరియు ఇమ్రాన్ బిన్ హుసైన్ ఉభయులమూ కలిసి హజ్రత్ అలీ బిన్ అబీ తాలిబ్ గారి వెనుక నమాజు చేశాము. ఆయన సజ్దాలోకి వెళ్లేటప్పుడు అల్లాహు అక్బర్ అని పలికేవారు. సజ్దాలో నుంచి తన శిరస్సును ఎత్తినప్పుడు అల్లాహు అక్బర్ అని అనేవారు. రెండు

---

సంబంధించిన తక్బీర్ అయిపోయిన తరువాత మసీదులోకి ప్రవేశించారు. మరియు పరుగెత్తుకుంటూ ప్రవేశించారు. తహావీ గారి ఉల్లేఖనంలో ఇలా ఉంది; ఆయన ఎంత వేగంగా పరుగెత్తారంటే రొప్పటం ప్రారంభించారు. తొందరలో పంక్తిలో కలవక మునుపే రుకూ చేసేశారు. నమాజు పూర్తి అయిన తరువాత దైవప్రవక్తే (స) ఇలా అడిగారు; 'రుకూ చేసుకుంటూ నమాజు పంక్తిలో కలిసిన ఆ వ్యక్తి ఎవరు?' అప్పుడు అబూబకర్ (ర), "ఓ దైవప్రవక్తా! ఆ వ్యక్తిని నేనే" అని అన్నారు.

రకాతులు చేసి (ఖాయెదా చేసి) లేచినప్పుడు తక్బీర్ చెప్పేవారు. నమాజు పూర్తి చేసిన తరువాత ఇమ్రాన్ బిన్ హుసైన్ నా చేతిని పట్టుకుని ఇలా అన్నారు; ఈనాడు ఈ వ్యక్తి (అంటే హజ్రత్ అలీ) హజ్రత్ ముహమ్మద్ (స) గారు చేసిన నమాజును నాకు జ్ఞాపకం చేశాడు. లేదా ఇలా అన్నారు; ఈ వ్యక్తి దైవప్రవక్త (స) గారు నమాజు చేసినట్లుగా నమాజు చేయించారు.

**754.** ఇక్రిమా ఇలా ఉల్లేఖించారు; "నేను ఒక వ్యక్తిని ముఖామె ఇబ్రాహీమ్ (ఇబ్రాహీమ్ స్థలం) వద్ద నమాజు చేస్తూ ఉండగా చూశాను; అతను వంగినప్పుడు, లేచినప్పుడు నిలబడినప్పుడు, సజ్దాలోకి పోయినప్పుడు తక్బీర్ చెబుతాడు (అల్లాహు అక్బర్ అని అంటాడు). నేను ఆశ్చర్యంతోనూ, తిరస్కార వైఖరితోనూ ఈ విషయం గురించి ఇబ్నె అబ్బాస్(రజిఅన్)గారికి వివరించాను. ఆయన(ర) గారు నన్ను మందలిస్తూ ఇలా అన్నారు; "నీ తల్లి బంగారంగాను! అతను చేసిన ఈ నమాజు దైవప్రవక్త (స)గారు చేసిన నమాజులాంటిది కాదా!"

## 114వ అధ్యాయం

### సజ్దా చేసి నిలబడినప్పుడు తక్బీర్ (అల్లాహు అక్బర్) అని పలకటం.

**755.** ఇక్రిమా ఇలా ఉల్లేఖించారు; ఒకసారి నేను మక్కాలో ఒక వృద్ధుని వెనుక నిలబడి నమాజు చేశాను. అతను మొత్తం నమాజులో ఇరవై రెండుసార్లు తక్బీర్ (అల్లాహు అక్బర్) పలికాడు. నేను ఈ విషయాన్ని అబ్బాస్ (ర)గారికి తెలియజేశాను. ఇంకా ఆ పెద్దాయన మూర్ఖుడు అని కూడా ఆయనతో అన్నాను. అప్పుడు ఇబ్నె అబ్బాస్(ర) నన్ను మందలిస్తూ "ఇది అబుల్ ఖాసిం(స) గారి సంప్రదాయం." అన్నారు;

అబూహురైరా(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; "దైవప్రవక్త (స)గారు నమాజు కోసం నిలబడినప్పుడు, అల్లాహు అక్బర్ (తక్బీరె తహెరీమా) అని పలుకుతారు. తరువాత రుకూ చేసినప్పుడు తక్బీర్ పలుకుతారు. రుకూలో నుంచి తమ వీపును లేపినప్పుడు 'సమిఅల్లాహులిమన్ హమిదహ్' అని అంటారు. నిటారుగా నిలబడి 'రబ్బనా లకల్‌హమ్‌ద్' అని పలుకుతారు. ఆ తరువాత 'అల్లాహు అక్బర్' అని అంటూ సజ్దా కోసం వంగుతారు. ఆపైన సజ్దాలో నుంచి తమ శిరస్సును ఎత్తుతూ అల్లాహు అక్బర్ అని అంటారు. తరువాత రెండోసారి సజ్దా చేసేటప్పుడు 'అల్లాహ్ అక్బర్' అంటారు. ఇదేవిధంగా మొత్తం నమాజులో చేస్తారు (ప్రతి రకాతులో అయిదేసిసార్లు తక్బీర్ అంటారు) నమాజు పూర్తి అయ్యేవరకు. ఇంకా రెండు రకాతులు చేసిన తరువాత కూర్చొని లేచినప్పుడు కూడా అల్లాహు అక్బర్ అని అంటారు."

## 115వ అధ్యాయం

**రుకూ చేసినప్పుడు చేతుల్ని మోకాళ్ళపై పెట్టటం. అబూ హుమైద్ తన సహచరుల ముందు ఇలా అన్నారు; దైవప్రవక్త(స) రుకూలో తమ రెండు చేతుల్ని మోకాళ్ళ మీద ఆనించేవారు.**

**756.** ముస్అబ్ బిన్ సాద్ ఇలా ఉల్లేఖించారు; "నేను ఒకసారి నా తండ్రిగారైన సాద్ బిన్ అబీ వఖ్ఖాస్(ర)గారి ప్రక్కన నిలబడి నమాజు చేశాను. నేను రుకూలోకి వెళ్ళినప్పుడు అరచేతుల్ని కలిపి రెండు తొడల మధ్య పెట్టాను. నా తండ్రిగారు అలా చెయ్యవద్దని నన్ను వారించారు. మొదట్లో మేము ఇలాగే చేసేవాళ్ళం. దైవప్రవక్త(స) అలా చెయ్యవద్దని నిషేధించారు. ఇంకా చేతుల్ని మోకాళ్ళమీద పెట్టమని ఆయన ఆజ్ఞాపించారు అని తెలిపారు.

## 116వ అధ్యాయం

**ఒకవేళ రుకూను సరియైన రీతిలో, సంతృప్తికరంగా చెయ్యక పోయినట్లయితే- (అప్పుడు నమాజు చెడిపోతుంది)**

**757.** జైద్ బిన్ వహ్బ్ ఇలా ఉల్లేఖించారు; హుజైఫా బిన్ యమాన్ (రజిఅన్) ఒకసారి ఒక వ్యక్తిని నమాజు చేస్తూ ఉండగా చూశారు. అతను రుకూగానీ, సజ్దాగానీ పూర్తిగా చెయ్యటం లేదు. హుజైఫాగారు అతనితో ఇలా అన్నారు; 'నీవు అసలు నమాజే చెయ్యలేదు. నీవు మరణించినప్పుడు ముహమ్మద్(స)ను అల్లాహ్ ఏ పద్ధతి మీదనైతే పుట్టించాడో ఆ పద్ధతి మీద మరణించవు.'

## 117వ అధ్యాయం

**రుకూ చేసినప్పుడు వీపును తిన్నగా, వంపు లేకుండా ఉంచాలి (శిరస్సును ఎత్తుగా పెట్టకూడదు).**

అబూ హుమైద్ తన సహచరుల సమక్షంలో ఉన్నప్పుడు వారితో ఇలా అన్నారు: దైవప్రవక్త (స) రుకూ చేసినప్పుడు తమ వీపును వంచేశారు (శిరస్సుతో సమానంగా ఉంచారు).

**758.** బరా బిన్ ఆజిబ్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) గారి రుకూ, సజ్దా మరియు రెండు సజ్దాల మధ్య కూర్చోవటం ఇంకా రుకూ తరువాత నిలబడటం ఇవన్నీ వ్యవధి విషయంలో దాదాపు సమానమైనవే. ఖియామ్ మరియు తషహ్హుద్‌లో కూర్చోవటం తప్ప.[1]

---

758–1. ఖియామ్ అంటే ఖిరాత్‌కు సంబంధించిన ఖియామ్ అని భావం. అంటే ఖిరాత్‌కు సంబంధించిన ఖియామ్ (నిలబడటం) మరియు తషహ్హుద్ సమయంలో

## 118వ అధ్యాయం

**రుకూను పూర్తిగా చేయనటువంటి వ్యక్తిని మళ్లీ నమాజు చెయ్యమని దైవప్రవక్త (స) ఆజ్ఞాపించటం.**

**759.** హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) మసీదులోకి ప్రవేశించారు. ఇంతలోనే ఒక వ్యక్తి (ఖలాద్ బిన్ రాఫె) మసీదులోకి వచ్చాడు. అతను నమాజు చేసిన తరువాత దైవప్రవక్త (స) గారి వద్దకు వచ్చి సలామ్ చేశాడు. ఆయన (స) అతని సలాముకు జవాబు పలికారు. మరియు అతన్ని ఉద్దేశించి ఇలా సెలవిచ్చారు: 'వెళ్ళు, మళ్లీ నమాజు చెయ్యి. నీవు అసలు నమాజే చెయ్యలేదు'. అతను వెళ్లి మళ్లీ నమాజు చేశాడు. ఆ తరువాత దైవప్రవక్త (స) గారి వద్దకు వచ్చి ఆయన (స) గారికి సలామ్ చేశాడు. అప్పుడు ఆయన (స) ఇలా సెలవిచ్చారు: 'పో, మళ్లీ నమాజు చెయ్యి. నీవు అసలు నమాజే చెయ్యలేదు.' మూడుసార్లు ఇలాగే జరిగింది. చివరకు అతను ఇలా అన్నాడు: 'మిమ్మల్ని నిజంగానే పంపిన ఆ దేవునిపై ప్రమాణం చేసి చెబుతున్నాను! నేను ఇంతకంటే మంచి నమాజును చెయ్యలేను. దయచేసి నాకు నేర్పండి.' అప్పుడు ఆయన(స) గారు ఇలా సెలవిచ్చారు: నీవు నమాజు కోసం నిలబడినప్పుడు తక్బీర్ (అల్లాహు అక్బర్ అని) పలుకు. తరువాత నీకు జ్ఞాపకం ఉన్నదాన్ని, నీవు సులభంగా పఠించగలిగినదాన్ని పఠించు. ఆ తరువాత నింపాదిగా ప్రశాంతంగా ఆగి రుకూ చెయ్యి. తరువాత తిన్నగా నిటారుగా నిలబడే వరకు నీ శిరస్సును పైకి ఎత్తు. ఆ తరువాత నెమ్మదిగా సజ్దా చెయ్యి. ఆ తరువాత నెమ్మదిగా కూర్చో. ఆ పిదప రెండోసారి ప్రశాంతంగా సజ్దా చెయ్యి. తరువాత ఇదే విధంగా మొత్తం నమాజును చెయ్యి.

## 119వ అధ్యాయం

**రుకూలో ఏ దుఆ చెయ్యాలి?**

**760.** హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) రుకూలోనూ, సజ్దాలోనూ ఇలా దుఆ చేసేవారు: "సుబ్ హానక అల్లాహుమ్మ రబ్బనా వబిహమ్దిక అల్లాహుమ్మగ్ ఫిర్లీ.'[1]

---

కూర్చున్నప్పుడు – ఈ రెండూ అయితే చాలా సేపటి వరకు జరుగుతాయి. కాని మిగతా నాలుగు విషయాలు అంటే రుకూ, సజ్దా మరియు రెండు సజ్దాల మధ్య కూర్చోవటం, రుకూ తరువాత నిలబడటం – ఇవన్నీ దాదాపు సమానమైన గడువు కలిగి ఉన్నటువంటివే.

## 120వ అధ్యాయం

### ఇమామ్ మరియు ముఖ్తదీలు రుకూలో నుంచి శిరస్సు ఎత్తి ఏమి అనాలి?

**761.** హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (స), 'సమిఅల్లా హులిమన్ హమిదహ్' (అల్లాహ్ తనను స్తుతించిన వారి స్తోత్రాన్ని విన్నాడు) అని పలికిన తరువాత ఇలా అనేవారు; "అల్లా హుమ్మ రబ్బనా వ లకల్ హమ్ద్" (ఓ అల్లాహ్! మా ప్రభూ! స్తోత్రాలన్నీ నీకే చెల్లు తాయి). ఇంకా దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) రుకూ చేసినప్పుడూ మరియు సజ్దాలో నుంచి శిరస్సు ఎత్తినప్పుడు, 'అల్లాహు అక్బర్' అని అనేవారు. ఇంకా రెండు సజ్దాలు చేసి నిలబడినప్పుడు కూడా అల్లాహు అక్బర్ అని అనేవారు.

## 121వ అధ్యాయం

### 'రబ్బనా వ లకల్ హమ్ద్' అని పఠించే దాని యొక్క ఔన్నత్యం.

**762** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు; ఇమామ్ 'సమిఅల్లాహులిమన్ హమిదహ్' (అల్లాహ్ తనను స్తుతించిన వారి దుఆను విన్నాడు) అని అన్నప్పుడు మీరు "అల్లాహుమ్మ రబ్బనా వ లకల్ హమ్ద్" (ఓ అల్లాహ్! మా ప్రభూ! స్తోత్రాలన్నీ నీకే చెల్లుతాయి) అని పలకండి. ఎందుకంటే, ఎవరైనా ఇలా అన్నప్పుడు అది దైవదూతలు ఇలా అనేదానితో ఏకీభూతమైనప్పుడు అతను పూర్వం చేసిన పాపాలన్నీ క్షమాభిక్షకు నోచుకుంటాయి.

## 122వ అధ్యాయం

### హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఇలా అన్నారని అబూసలమా ఉల్లేఖించారు; నేను

---

760–1. అంటే; నీవు పరిశుద్ధుడవు; ఎలాంటి లోపమూ, ఎలాంటి దోషమూ లేని వాడవు. ఓ నా అల్లాహ్! మా ప్రభూ! స్తోత్రాలన్నీ నీకే చెల్లుతాయి. ఓ నా అల్లాహ్! నన్ను క్షమించు. హుజైఫా గారి ప్రామాణిక ఉల్లేఖనంలో ఇలా ఉంది; దైవప్రవక్త (స) రుకూలో "సుబ్హాన రబ్బియల్ అజీమ్" అని అనేవారు, మరియు సజ్దాలో "సుబ్హాన రబ్బియల్ ఆలా" అని అనేవారు. మరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది; దైవప్రవక్త (స) రుకూలోనూ, సజ్దాలోనూ ఇలా అనేవారు; "సుబ్బూ హున్ ఖుద్దూ సున్ రబ్బుల్ మలాయికతి వర్రూహ్." ఇంకొక ఉల్లేఖనంలో ఇలా ఉంది; దైవప్రవక్త (స) రుకూలోనూ, సజ్దాలోనూ ఇలా అనేవారు; "సుబ్హానక అల్లాహుమ్మ రబ్బనా వబిహమ్దిక అల్లాహుమ్మగ్ ఫిర్లీ."

**మీ నమాజును దైవప్రవక్త ముహమ్మద్ (స) గారి నమాజుకు సన్నిహితమైనదిగా చేస్తాను;[1] అబూ హురైరా (రజిఅన్) జుహ్ర్ నమాజులోని చివరి రకాతులలోనూ, ఇషా నమాజులోని చివరి రకాతులోనూ మరియు ఉదయం నమాజులోని చివరి రకాతులోను 'సమిఅల్లాహులిమన్ హమిదహ్' అని పలికిన తరువాత ముస్లిముల కోసం దుఆ చేసేవారు. మరియు అవిశ్వాసులను శపించేవారు.[2]**

**763.** హజ్రత్ అనస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; 'దుఆయె ఖునూత్' ఫజ్ర్, మగ్రిబ్ నమాజులలో పఠించబడుతూ ఉండేది.[1]

**764. రిఫాఅ బిన్ రాఫె అజ్జురఖీ ఇలా ఉల్లేఖించారు; ఒకసారి మేము దైవ ప్రవక్త ముహమ్మద్ (స) గారి వెనుక నిలబడి నమాజు చేస్తూ ఉన్నాము. ఆయన (స) గారు రుకూలో నుంచి తన శిరస్సును ఎత్తినప్పుడు 'సమిఅల్లాహు లిమన్ హమిదహ్' అని పఠించారు. అప్పుడు ఒక వ్యక్తి (స్వయంగా రాఫెగారే) ఆయన (స) గారి వెనుక నిలబడి ఉన్న వ్యక్తి ఇలా అన్నాడు; 'రబ్బనా వ లకల్ హమ్ద్. హమ్దన్ కసీరన్ తయ్యిబన్ ముబారకన్ ఫీహ్.' దైవప్రవక్త (స) గారు నమాజు పూర్తి చేసిన తరువాత, "ఈ మాటలు పలికిన వ్యక్తి ఎవరు?"[1] అని అడిగారు. ఆ వ్యక్తి, "నేనే దైవప్రవక్తా!" అని అన్నాడు. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు; 'నేను ముప్పై మందికి పైగా దైవదూతలను చూశాను. ఈ వ్యక్తి పలికిన మాటల్ని వ్రాసుకోవటానికి వారు పరస్పరం పోటీపడుతున్నారు".[2]**

---

122-1. అంటే నేను మీకు చక్కగా వివరిస్తాను. మీరు అర్థం చేసుకునేలా చెబుతాను. దాదాపు దైవప్రవక్త (స) గారు నమాజు చేసిన విధంగానే మీరు నమాజు చెయ్యగలుగుతారు.

122-2. అంటే, దుఆయె ఖునూత్ పఠించేవారు.

763-1. ఖస్తలానీగారు ఇలా అన్నారు; దైవప్రవక్త ముహమ్మద్ (స) గారి కాలంలో ప్రారంభ దశలో ఇది పఠించబడేది. తరువాత ఫజర్ నమాజులో తప్ప ఇతర అన్ని నమాజులలో రద్దు చెయ్యబడింది.

764-1. మరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది; దైవప్రవక్త (స) మూడుసార్లు ఇలా ప్రశ్నించారు. భయం వల్ల ఎవరూ ముందుకు వచ్చి జవాబు చెప్పలేదు. చివరకు రిఫాఅ బిన్ రాఫెయే మూడోసారి; నేనే దైవప్రవక్తా! 'నేను చిత్తశుద్ధితోనే అలా అన్నాను. నా సంకల్పం మంచిదే' అని అన్నారు.

764-2. ఒక హదీసులో ఇలా ఉంది; దైవదూతలు కొందరు సృష్టిలో సంచారం చేస్తూ

## 123వ అధ్యాయం

**రుకూలో నుంచి శిరస్సును పైకి ఎత్తిన తరువాత నెమ్మదిగా, ప్రశాంతంగా, నిటారుగా నిలబడటం;**

**అబూ హుమైద్ (రజిఅన్) ఇలా అన్నారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) రుకూలోనుంచి శిరస్సును పైకి ఎత్తారు. మరియు నిటారుగా నిలబడి పోయారు. చివరకు ఆయన(స)గారి వీపుకు చెందిన ప్రతి కీలూ తన స్థానానికి తిరిగి వచ్చేసింది.**

**765. సాబిత్ బనాని ఇలా ఉల్లేఖించారు: అనస్(రజిఅన్) దైవప్రవక్త ముహమ్మద్(స) గారి నమాజును మా ముందు చేసి మాకు చూపించేవారు. ఆయన (ర) నమాజులో నిలబడేవారు. రుకూలో నుంచి తన శిరస్సును పైకి ఎత్తినప్పుడు, ఎంతసేపు నిలబడే వారంటే, మేము ఆయన(ర) (నమాజు చెయ్యటాన్నే) మరచి పోయారు అని అనేవారము.[1]**

**766. బరా బిన్ ఆజిబ్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి రుకూ మరియు సజ్దా ఇంకా రుకూలో నుంచి శిరస్సును పైకెత్తి నిలబడి ఉండటం మరియు రెండు సజ్దాల మధ్య కూర్చోవటం- వీటన్నింటి వ్యవధి దాదాపు సమానంగా ఉంటుంది.[1]**

---

ఉంటారు. వారు అల్లాహ్‌ను స్మరించే వారిని అన్వేషిస్తూ ఉంటారు. ఆ వ్యక్తి పలికిన మాటల్లో 34 అక్షరాలు ఉన్నాయి. ప్రతి అక్షరం కోసం అల్లాహ్ ఒక దూతను అవత రింపజేశాడు. తెలిసిన విషయం ఏమిటంటే, ఈ మాటలు ఎంతో ఔన్నత్యం గలవి. పుణ్యంతో కూడుకున్నవి. ప్రతి ముస్లిం సమిఅల్లాహులిమన్ హమిద తరువాత ఈ మాటల్ని పుణ్యం కోసం పలకాలి.

765-1. ఖస్తలానీగారు ఇలా అన్నారు; దీనిద్వారా స్పష్టంగా తెలిసే విషయం ఏమిటంటే, నమాజులో సమతుల్యత చాలా అవసరం. అంటే రుకూ తరువాత నిటారుగా నిలబడటం నమాజులోని ఒక పొడుగైన భాగమే. ఎవరైతే దీన్ని తిరస్కరిస్తారో వారి ఈ అభిప్రాయం తప్పుడు అభిప్రాయం. ఎందుకంటే, నస్ (స్పష్టమైన మూలానికి)కి వ్యతిరేకంగా ఊహాగానాలు చేయటం సరియైన విషయం కాదు.

766-1. కొందరు ఇలా అన్నారు, దైవప్రవక్త(స)గారి 'రుకూ' 'ఖియామ్'తో సమానంగా ఉంటుందనీ మరియు అదే విధంగా సజ్దాలు మరియు సమతుల్యత కూడా అని దీని అర్థం కాదు. దాని అర్థం ఏమిటంటే, ఆయన(స)గారు చేసే నమాజు సమతుల్య

**767. అబూ ఖిలాబా ఇలా చెప్పారని అయ్యూబ్ సఖ్తియానీ ఉల్లేఖించారు; 'మాలిక్ బిన్ హువైరిస్(రజి) మాకు దైవప్రవక్త ముహమ్మద్ (స)గారు చేసిన నమాజును మా ముందు చేసి చూపించేవారు. ఇది నమాజు సమయంలో కాదు. కనుక మాలిక్ బిన్ హువైరిస్(ర) (చాలాసేపు) నిలబడ్డారు; తరువాత చక్కగా రుకూ చేశారు. ఆ తరువాత రుకూలో నుంచి తన శిరస్సును పైకి ఎత్తారు, కొంచెంసేపు నిటారుగా నిలబడ్డారు. అబూ ఖిలాబా ఇలా అన్నారు; మాలిక్ బిన్ హువైరిస్(ర) మా షేఖ్ అయినటువంటి అబూ యజీద్ మాదిరిగా నమాజు చేశారు. అబూ యజీద్ రెండో సజ్దాలో నుంచి తన శిరస్సును ఎత్తినప్పుడు (వెంటనే నిలబడరు) నేరుగా కూర్చుండి పోతారు. ఆ తరువాత నిలబడతారు.**

## 124వ అధ్యాయం

### సజ్దా కోసం 'అల్లాహు అక్బర్' అంటూ వంగాలి;

**నాఫె ఇలా అన్నారు; అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజిఅన్) సజ్దాలోకి పోయేటప్పుడు మొదట తన చేతుల్ని నేల మీద పెట్టేవారు. ఆ తరువాత తన మెకాళ్ళను నేలపై పెట్టేవారు.[1]**

---

తతో నిండి ఉంటుంది. ఒకవేళ ఖిరాత్‌ను సుదీర్ఘమైనదిగా చేస్తే అప్పుడు దానికి తగినట్లుగానే నమాజులోని ఇతర భాగాలను కూడా సుదీర్ఘమైనవిగా చేస్తారు. ఒకవేళ ఖిరాత్‌ను తక్కువగా చేస్తే అప్పుడు నమాజులోని ఇతర భాగాలను కూడా అదే విధంగా తగ్గించేవారు. ఎందుకంటే మరొక హదీసు ద్వారా ఈ విషయం తెలుస్తోంది; దైవప్రవక్త(స)గారు ఉదయం నమాజులో సాఫ్ఫాత్ సూరాను పఠించారు. మరియు ఆయన(స)గారు చేసిన సజ్దా పది తస్బీలకు సమానంగా ఉంటుందని అంచనా వేయబడింది. కనుక తెలిసిన విషయం ఏమిటంటే, ఒకవేళ ఆయన(స) సాఫ్ఫాత్ సూరాను కాక మరొక సూరాను పఠిస్తే అప్పుడు పదికంటే తక్కువ తస్బీహ్‌లు చదివి ఉండేవారు.

124-1. ఇమామ్ మాలిక్ (రహ్మలై)గారి అభిప్రాయం కూడా ఇదే. కాని మిగతా ముగ్గురు ఇమాములు ఏమన్నారంటే, మొదట మోకాళ్ళను నేలమీద పెట్టాలి. ఆ తరువాతనే చేతుల్ని భూమిపై పెట్టాలి. నవవీ గారు ఇలా సెలవిచ్చారు; ఆధారాల రీత్యా రెండు అభిప్రాయాలూ నిజమైనవే. ఇమామ్ అహ్మద్(రహ్మలై) ఇలా అన్నారు; నమాజు చేసే వ్యక్తి ఇష్టం; తాను కోరితే మొదట తన మోకాళ్ళను నేలపై ఆనించవచ్చు. లేదా మొదట తన చేతుల్నయినా భూమి మీద పెట్టవచ్చు. ఇమామ్ ఇబ్నె ఖయ్యిమ్ (రహ్మ) వాయల్ బిన్ హజర్ గారి హదీసుకు ప్రాముఖ్యం ఇచ్చారు. వాయల్ బిన్ హజర్ హదీసులో ఇలా ఉంది; దైవప్రవక్త(స) సజ్దా చేసే ముందు మొదట తన మోకాళ్ళను నేలమీద పెట్టేవారు. ఆ తరువాత తన చేతుల్ని పెట్టేవారు.

**768.** అబూబకర్ బిన్ అబ్దుర్రహ్మాన్ బిన్ హారిస్ బిన్ హిషామ్‌గారు మరియు అబూ సలమా బిన్ అబ్దుర్రహ్మాన్ గారు ఇలా ఉల్లేఖించారు; హజ్రత్ అబూహురైరా (రజిఅన్) ప్రతి ఫజ్ర్ నమాజులోనూ, ప్రతి నఫిల్ నమాజ్‌లోనూ, రమజాన్ మాసంలోగానీ మరొక మాసంలోగానీ, నమాజ్ కోసం నిలబడినప్పుడు 'అల్లాహు అక్బర్' (అల్లాహ్ మాత్రమే గొప్పవాడు) అని పలుకుతారు. తరువాత రుకూ చేసే టప్పుడు కూడా 'అల్లాహు అక్బర్' అని అంటారు; రుకూలో నుంచి తన శిరస్సును ఎత్తి 'సమిఅల్లాహులిమన్ హమిదహ్' అని పలికి తరువాత సజ్దా చేసేముందు 'రబ్బనా వలకల్ హమ్‌ద్' అని పలుకుతారు; తరువాత సజ్‌దా కోసం వంగినప్పుడు 'అల్లాహు అక్బర్' అని పలుకుతారు. ఆ తరువాత సజ్‌దాలో నుంచి తన శిరస్సును ఎత్తినప్పుడు 'అల్లాహు అక్బర్' అని పఠిస్తారు. ఆపైన రెండో సజ్‌దా చేసినప్పుడు 'అల్లాహు అక్బర్' అని అంటారు. తరువాత సజ్‌దాలో నుంచి తన శిరస్సును ఎత్తేటప్పుడు మళ్ళీ 'అల్లాహు అక్బర్' అని అంటారు. ఆ తరువాత రెండు రకాతులు చేసి 'ఖాయెద' చేసి నిలబడేటప్పుడు 'అల్లాహు అక్బర్' అని పలుకుతారు. ప్రతి రకాతులోనూ అలాగే చేస్తారు, నమాజు పూర్తి అయ్యేవరకు. ఆ తరువాత నమాజు ముగించుకున్న పిదప ఇలా అంటారు: "ఆ దేవుని సాక్షిగా చెబుతున్నాను! ఏ దేవుని చేతుల్లోనైతే నా ప్రాణాలు ఉన్నాయో! మీ అందరి నమాజులకంటే నేను చేసే నమాజు దైవప్రవక్త ముహమ్మద్(స) గారు చేసే నమాజును ఎక్కువగా పోలి ఉన్నది." అబూహురైరా(ర)గారు ఈ లోకాన్ని విడిచి వెళ్ళే వరకు ఈ విధంగానే నమాజు చేస్తూ ఉండేవారు. అబూ బకర్(ర) మరియు అబూ సలమా (ర) ఉభయులూ ఇలా అన్నారు; అబూహురైరా (ర) ఇలా కూడా అన్నారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) రుకూలో నుంచి తన శిరస్సును పైకి ఎత్తినప్పుడు, "సమిఅల్లాహులిమన్ హమిదహ్" 'రబ్బనా వ లకల్ హమ్‌ద్' అని పలికి కొందరు వ్యక్తుల కోసం వారి పేర్లను ఉచ్చరిస్తూ దుఆ చేసే వారు. ఆయన(స) ఇలా ప్రార్థించేవారు; ఓ అల్లాహ్! వలీద్ బిన్ వలీద్‌నూ, సలమా బిన్ హిషామ్‌నూ మరియు అయాష్ బిన్ అబీ రబిఅనూ మరియు నిరుపేదలూ బలహీనులూ అయిన ముస్లింలనూ (వారు అవిశ్వాసుల చేతుల్లో ఖైదీలుగా చిక్కుకుని ఉన్నారు) విడిపించు. ఓ అల్లాహ్! ముజర్‌కు చెందిన అవిశ్వాసుల పట్ల కఠినంగా వ్యవహరించు. ప్రవక్త హజ్రత్ యూసుఫ్ (అ) కాలంలో వచ్చినటువంటి కరవుకాట

కాలను వారిపైకి పంపు. (అబూహురైరా(ర) ఇలా అన్నారు; ఆ కాలంలో తూర్పు ప్రాంతానికి చెందిన ముజర్ తెగకు చెందిన ప్రజలు దైవప్రవక్త ముహమ్మద్(స) గారికి శత్రువులుగా ఉండే వారు).[1]

**769.** అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గుర్రం మీద నుంచి కిందపడిపోయారు. అప్పుడు ఆయన(స)గారి శరీరంలోని కుడి భాగానికి గాయాలయ్యాయని సుఫ్యాన్ తెలిపారు. ఈ విషయం మాకు తెలిసి మేము పరామర్శించడానికి ఆయన(స) గారి వద్దకు వెళ్ళాము. ఇంతలోనే నమాజుకు వేళ అయింది. దైవప్రవక్త(స) కూర్చొనే నమాజుకు నాయకత్వం వహించారు. మేము కూడా కూర్చొని నమాజు చేశాము. నమాజు ముగిసిన తరువాత ఆయన(స) ఇలా ఉపదేశించారు; 'ఇమామ్ నియామకం జరిగేది, ప్రజలు ఆయన్ని అనుసరించటానికే. ఇమామ్, 'అల్లాహు అక్బర్' అని పలికినప్పుడు మీరు కూడా 'అల్లాహు అక్బర్' అని పలకండి. అతను రుకూ చేసినప్పుడు మీరు కూడా రుకూ చెయ్యండి. అతను తన శిరస్సును ఎత్తినప్పుడు మీరు కూడా మీ శిరస్సును ఎత్తండి; అతను 'సమిఅల్లాహులిమన్ హమిదహ్' అని పలికినప్పుడు, మీరు 'రబ్బనా వలకల్ హమ్ద్' అని పలకండి; అతను సజ్దా చేసినప్పుడు మీరు కూడా సజ్దా చెయ్యండి. మామర్‌ను ఉటంకిస్తూ సుఫియాన్ కూడా ఇదే విషయాన్ని ఉల్లేఖించారు; ఇబ్నె జురైజ్ ఏమన్నారంటే, దైవప్రవక్త(స)గారి కుడి పిక్కకు గాయాలయ్యాయి.

## 125వ అధ్యాయం

### సజ్దా యొక్క ఘనత

**770.** హజ్రత్ అబూహురైరా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ప్రజలు ఇలా విన్నవించుకున్నారు; "ఓ దైవప్రవక్తా (స)! ప్రళయ దినంనాడు మేము మా ప్రభువును చూడగలమా?" సమాధానంగా ఆయన (స) ఇలా సెలవిచ్చారు; "పున్నమి చంద్రుణ్ణి చూసే విషయంలో మీకేమైనా అనుమానం ఉంటుందా; అతని మీద ఎలాంటి మబ్బులూ లేనప్పుడు? (ఆకాశం నిర్మలంగా ఉన్నప్పుడు)" వారు, 'అనుమానం ఎంత మాత్రం ఉండదు ఓ దైవప్రవక్తా (స)!' అని జవాబు పలికారు. ఆయన (స)గారు ఇంకా ఇలా సెలవిచ్చారు; 'మేఘాలు లేని ఆకాశం మీద ఉన్నటువంటి సూర్యుణ్ణి

768-1. నమాజులో వ్యక్తులపేర్లను తీసుకుని దుఆ కాని బద్ దుఆ కాని చేస్తే నమాజు చెడిపోదు అనే విషయం ఈ హదీసు ద్వారా తెలిసింది.

చూసే విషయంలో మీకేమైనా సందేహం ఉంటుందా?' ప్రజలు ఇలా అన్నారు; 'లేదు, పూర్తిగాలేదు (సందేహానికి ఎలాంటి అవకాశమూ లేదు. స్పష్టంగా చూడగలుగు తాము).' దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు; "కనుక ఇదే విధంగా (నిస్సందేహంగా) మీరు మీ ప్రభువును కూడా చూడగలుగుతారు. ప్రళయదినం నాడు ప్రజలు సమీక రించబడతారు. తరువాత విశ్వ ప్రభువు ఇలా సెలవిస్తాడు; ప్రజలు తాము పూజిస్తూ వచ్చిన వారితో కలిసిపోవాలి. అప్పుడు కొందరు సూర్యుణ్ణి అనుసరిస్తారు. మరి కొందరు చంద్రుణ్ణి అనుసరిస్తారు. ఇంకా కొందరు షైతానులను అనుసరిస్తారు. ఇంకా కొందరు విగ్రహాలను అనుసరిస్తే మరికొందరు సమాజంలోని ప్రముఖులను అనుసరిస్తారు. తరువాత ఈ ఉమ్మత్‌కు (సంఘానికి) చెందిన ప్రజలు (ముస్లిములు) మిగిలిపోతారు. వారితో కపటులూ మొదలైనవారు కూడా కలిసి ఉంటారు. ఆ తరువాత మహా మహిమాన్వితుడైన అల్లాహ్ (ఒక వినూత్న రూపంలో) వారి ముందు ప్రత్యక్షమై "నేనే మీ దేవుడను" అని సెలవిస్తాడు. అప్పుడు ప్రజలు ఇలా అంటారు; 'మా ప్రభువు వచ్చే అంతవరకు మేము ఇక్కణ్ణే ఉండిపోతాము. మా ప్రభువు మా ముందుకు వచ్చినప్పుడు మేము ఆయన్ని తప్పకుండా గుర్తిస్తాము.' తరువాత అల్లాహ్ తన అసలు రూపంలో వారి ముందు ప్రత్యక్షమై ఇలా అంటాడు; 'నేనే మీ దేవుడను'. అప్పుడు ప్రజలు 'నిస్సందేహంగా నీవే మా దైవానివి' అని అంటారు; తరువాత వారి దైవం వారిని తన వద్దకు పిలుచుకుంటాడు. అప్పుడు, పుల్‌సిరాత్ అనే వంతెన నరకం వీపుపై పెట్టబడుతుంది. దైవప్రవక్త ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారు; ప్రవక్తలందరి కంటే ముందు నేనే నా ఉమ్మత్‌ను తీసుకుని పుల్ సిరాత్‌ను దాటిపోతాను. ఆ రోజున దైవప్రవక్తలు తప్ప మరెవ్వరూ మాట్లాడలేరు. దైవప్రవక్తలు ఈ విషయాన్నే పలుకు తారు. ఈ దుఆనే చేస్తారు. "ఓ అల్లాహ్! మమ్మల్ని రక్షించు, మమ్మల్ని కాపాడు." చూడండి, నరకంలో సాదాన్ ముళ్ళలాంటి కొక్కెములు ఉంటాయి. సాదాన్ ముళ్లు ఎలా ఉంటాయో మీరు చూశారా? ప్రజలు, 'అవును, మేము చూశాము' అని అన్నారు. అప్పుడు ఆయన(స), కనుక ఆ కొక్కాలు ఈ సాదాన్ ముళ్ళ ఆకారాన్ని పోలి ఉంటాయి. కాని అవి చాలా పెద్దవి; అవి ఎంత పెద్దవో ఒక్క అల్లాహ్‌కు మాత్రమే తెలుసు. ఆ కొక్కాలు ప్రజల్ని పట్టుకుని వారు చేసిన దుర్మార్గపు పనుల ప్రకారం ఈడ్చుకుపోతాయి. మెలికలు పెట్టి ఈడ్చుకుంటూ పోతాయి. కొందరయితే తమ దుష్కర్మల కారణంగా పూర్తిగా నాశనమైపోతారు. మరికొందరు ముక్కలు ముక్కలై మళ్లీ బ్రతుకుతారు. అప్పుడు కరుణామయుడైన అల్లాహ్ కొందరు

నరకవాసులపై దయ చూపదలుస్తాడు. మరియు దైవదూతలను ఇలా ఆజ్ఞాపిస్తాడు, "చూడండి! నరకం వైపునకు వెళ్ళండి. ఎవరయితే అల్లాహ్‌ను పూజిస్తూ ఉండేవారో వారిని బయటికి తీసుకురండి." దైవదూతలు అల్లాహ్‌ను ఏకైక దైవంగా భావించి పూజించేవారిని బయటికి తీసుకువస్తారు. మరియు వారి నుదుటి పై ఉన్నటువంటి సజ్‌దా గుర్తుల ద్వారా నరకవాసులలో కలిసి ఉన్నటువంటి వారిని గుర్తిస్తారు. అల్లాహ్ నరకంపై నిషేధాన్ని విధించాడు. కనుక అది సజ్‌దా గుర్తులు ఉన్న నుదుటి భాగాన్ని కాల్చలేదు. కనుక వారిని నరకంలో నుంచి బయటికి తీసుకురావటం జరుగుతుంది. మనిషి యొక్క మొత్తం శరీరాన్ని నరకాగ్ని తినేస్తుంది, కాల్చేస్తుంది. కాని మనిషి శరీరంలోని సజ్‌దా గుర్తులు మాత్రం యధాతథంగా ఉండిపోతాయి. ఈ ప్రజలు బొగ్గు మాదిరిగా నల్లగా కాలిపోయిన స్థితిలో నరకం నుంచి బయటికి వస్తారు. తరువాత వారిపై 'ఆబె హయాత్' (జీవజలం) చల్లబడుతుంది. అప్పుడు వారు కాలువ ప్రక్కన ఉన్న చెత్తాచెదారంలో నుంచి పైకి ఉబికివచ్చే విత్తనం మాదిరిగా ఉద్భవిస్తారు. తరువాత అల్లాహ్ (లెక్కలు చూడటం ప్రారంభిస్తాడు). తన దాసులను గురించి తీర్పు చేస్తాడు, (నిర్ణయాలు తీసుకుంటాడు). కాని ఒక వ్యక్తి మటుకు స్వర్గ నరక లోకాల మధ్యన ఉండిపోతాడు. అతను నరకశిక్ష పడిన ప్రజలందరూ నరకంలోకి పోయిన తరువాత స్వర్గం లోనికి పోతాడు. అతని ముఖం నరకం వైపునకు తిరిగి ఉంటుంది. అతను ఇలా విన్నవించుకుంటాడు; ఓ నా ప్రభూ! నరకం వైపు నుంచి వచ్చే దుర్వాసన నన్ను చంపేస్తుంది. దాని మెరుపులు నన్ను కాల్చేస్తున్నాయి. కాబట్టి నా ముఖాన్ని నరకం వైపు నుంచి త్రిప్పు.

అప్పుడు అల్లాహ్ ఇలా సెలవిస్తాడు; సరే మంచిది, ఒకవేళ నేను నీవు అడిగినట్లుగా చేస్తే తరువాత నీవు మరొకసారి మరొక విషయం గురించి విన్నపం చెయ్యవు కదా! అతను ఇలా విన్నవించుకున్నాడు; లేదు ప్రభూ! ఎంతమాత్రం అడగను. నీ పెద్దరికం సాక్షిగా చెబుతున్నాను. అల్లాహ్ ఎలా కోరుతాడో, ఏమని కోరుతాడో అలానే అతను వాగ్దానం చేస్తూ పోతాడు! మాట ఇస్తూ పోతాడు. చివరకు అల్లాహ్ అతని ముఖాన్ని నరకం వైపు నుంచి త్రిప్పివేస్తాడు. అతను స్వర్గం వైపునకు తన ముఖాన్ని త్రిప్పినప్పుడు అక్కడి పచ్చదనాన్ని, తాజాదనాన్ని, సుందర దృశ్యాలను చూసి అల్లాహ్ కోరినంత సేపు మౌనంగా ఆనందిస్తూ ఉండిపోతాడు. ఆ తరువాత అతను మరొక విన్నపం చేసుకుంటాడు; ఓ నా ప్రభూ! నన్ను స్వర్గలోకం యొక్క ముఖద్వారం వద్దకు చేర్చు. నేను అక్కణ్ణే పడి ఉంటాను. అల్లాహ్ ఇలా సెలవిస్తాడు;

"నేను ఇకపై ఎలాంటి విన్నపాలూ చెయ్యనని నీవు ఎన్నిసార్లు మాట ఇచ్చావు? ఎన్ని వాగ్దానాలు చేశావు?" దాసుడు ఇలా విన్నవించుకుంటాడు; ఓ నా ప్రభూ! నిస్సందేహంగా నేను అలానే అన్నాను. కాని నీ సృష్టి మొత్తంలో నన్ను ఒక్కణ్ణే దురదృష్ట వంతుడిగా ఉండిపొమ్మంటావా? అల్లాహ్ ఇలా సెలవిస్తాడు; సరే మంచిది. నీ యొక్క ఈ దరఖాస్తును కూడా నేను మంజూరు చేస్తే తరువాత ఇక నీవు ఏమీ అడగవు కదా! అతను ఇలా విన్నవించుకుంటాడు; ఇక ఎంతమాత్రం అడగను. నీ ఘనత సాక్షిగా చెబుతున్నాను! ఇక నిన్ను ఏమీ అడగను. అల్లాహ్ కోరిన విధంగానే అతను మాట ఇస్తాడు. వాగ్దానం చేస్తాడు. చివరకు కరుణామయుడైన అల్లాహ్ అతన్ని స్వర్గ ద్వారం వద్దకు చేరుస్తాడు. స్వర్గ ద్వారం వద్దకు చేరినప్పుడు, అక్కడి వెలుగునూ, వైభవాన్నీ, తాజా దనాన్నీ, సంతోషాన్నీ చూసి అల్లాహ్‌కు ఇష్టమైనంతసేపు అతను మౌనంగా ఉండిపోతాడు. తరువాత మూడోసారి ఇలా విన్నపం చేసుకుంటాడు; ఓ ప్రభూ! నన్ను స్వర్గంలోకి ప్రవేశింపజెయ్యి. అప్పుడు అల్లాహ్ ఇలా సెలవిస్తాడు; ఓ ఆదమ్ కుమారుడా! అయ్యో, నీ దౌర్భాగ్యం! నీవు ఎందుకు ఇంత మోసగాడవై పోయావు? నేను ఇకపై ఎలాంటి దరఖాస్తులూ పెట్టుకోను అని నీవు ఎన్నిసార్లు వాగ్దానం చెయ్యలేదు! అప్పుడు అతను ఇలా విన్నవించుకుంటాడు; అవును ప్రభూ! నిస్సందేహంగా నేను ఎన్నో వాగ్దానాలు చేశాను. కాని నా ప్రభూ! నీ మొత్తం సృష్టిలో నన్ను ఒక్కణ్ణే దురదృష్టవంతుడిగా చెయ్యకు. ఇది విని అల్లాహ్ నవ్వుతాడు మరియు అతన్ని స్వర్గంలోకి ప్రవేశించే అనుమతిని ప్రసాదిస్తాడు మరియు ఇలా సెలవిస్తాడు; నీకేమి కావాలో కోరుకో. అతని కోరికలన్నీ తీరిన తరువాత ఇలా సెలవీయబడు తుంది. "నీవు ఈ వస్తువును కూడా కోరుకో; ఇది కూడా ఇమ్మని అర్థించు. స్వయంగా ప్రభువే ఇలా అని అతనికి జ్ఞాపకం చేస్తాడు. అతను తన కోరికలన్నీ తీర్చమని ప్రభు వును అడిగిన తరువాత ఆయన ఇలా సెలవిస్తాడు; నీవు కోరినవన్నీ నీకు ఇచ్చాను. ఇంకా ఇలాంటివే నీకు ఇస్తాను. అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్), అబూ హురైరా (రజిఅన్)తో ఇలా అన్నారు; దైవప్రవక్త(స) (ఈ హదీసులో) ఇలా సెలవిచ్చారు, అల్లాహ్ ఇలా సెలవిస్తాడు; "ఇవన్నీ నీకు ఇచ్చాను. ఇంకా ఇలాంటివే పదిరెట్లు నీకు ఇస్తాను". అప్పుడు అబూ హురైరా (రజిఅన్) ఇలా అన్నారు; దైవప్రవక్త (స) అలా అన్నట్లు నాకయితే జ్ఞాపకంలేదు. ఆయన ఈ విషయం మాత్రమే సెలవిచ్చారు; ఇవన్నీ నీకు ఇచ్చాను. ఇంకా ఇలాంటివే నీకు ఇస్తాను. అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) ఇలా అన్నారు; నేను దైవప్రవక్త చెబుతూ ఉండగా విన్నాను. ఆయన (స) ఇలా సెల విచ్చారు; "ఇవన్నీ నేను నీకు ఇచ్చాను. ఇలాంటివే ఇంకా పది రెట్లు నీకు ఇస్తాను."

## 126వ అధ్యాయం

**సజ్దాలో ఉన్నప్పుడు రెండు బాహువులను విడిగా, దూరంగా ఉంచాలి. ఇంకా కడుపును తొడలకు తగలకుండా వేరుగా ఉంచాలి.**

**771.** అబ్దుల్లాహ్ బిన్ మాలిక్ ఇబ్నె బుహైనా ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(సఅసమ్) నమాజు చేస్తూ ఉన్నప్పుడు (సజ్దాలో ఉన్న ప్పుడు) తన రెండు బాహువులను తన శరీరం నుంచి విడిగానూ, దూరంగాను ఉంచే వారు. చివరకు ఆయన (స) గారి చంకల్లోని తెల్లదనం సైతం స్పష్టంగా కనిపించేది.

## 127వ అధ్యాయం

**సజ్దా చేసేటప్పుడు కాలి వ్రేళ్లను ఖిబ్లా వైపునకు పెట్టి ఉంచాలి. ఈ విషయాన్ని అబూ హుమైద్ అస్సాయిదీ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) నుంచి ఉల్లేఖించారు.**

## 128వ అధ్యాయం

**సజ్దాను పూర్తిగా, చక్కగా చెయ్యకపోవటం ఎంత పెద్ద పాపం!?**

**772.** హుజైఫా (రజిఅన్) ఇలా అన్నారని అబూ వాయిల్ ఉల్లేఖించారు: "నేను ఒక వ్యక్తిని చూశాను. అతను రుకూగానీ, సజ్దాగానీ సక్రమంగా, పూర్తిగా చేసేవాడు కాదు. అతను తన నమాజును పూర్తి చేసుకున్న తరువాత నేను అతనితో, 'నీవు అసలు నమాజే చెయ్యలేదు' అని అన్నాను. అబూ వాయిల్ ఇలా అన్నారు: "హుజైఫా (ర) ఇలా అన్నారని నేను అనుకుంటున్నాను: నీవు గనక మరణిస్తే దైవప్రవక్త ముహమ్మద్ (స) గారి సంప్రదాయంపై మరణించవు."

## 129వ అధ్యాయం

**ఏడు ఎముకలపై సజ్దా చెయ్యటం.**

**773.** ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; శరీరంలోని ఏడు భాగా లను నేలపై ఆనించి వాటిపై సజ్దా చెయ్యమనీ ఇంకా తల వెంట్రుకలను సర్దుకో వటంగానీ, శరీరం మీద ఉన్న బట్టలను సర్దుకోవటంగానీ (నమాజులో) చెయ్య కూడదనీ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్)కు అల్లాహ్ ఆజ్ఞాపించాడు. శరీరంలోని ఆ ఏడు భాగాలు ఇవి; నుదురు, రెండు చేతులు, రెండు మోకాళ్లు, రెండు కాళ్లు.

**774.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారని అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజిఅన్) ఉల్లేఖించారు: శరీరంలోని ఏడు ఎముకలపై సజ్దా చెయ్యా మనీ, తల వెంట్రుకలను సవరించుకోవటంగానీ, బట్టల్ని సర్దుకోవటంగానీ నమాజులో చెయ్యకూడదనీ, మమ్మల్ని ఆజ్ఞాపించటం జరిగింది.

**775.** బరా బిన్ ఆజిబ్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: ఆయన అబద్ధాలు చెప్పే మనిషి కారు. మేము దైవప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) గారి వెనుక నిలబడి నమాజు చేసేవారము. ఆయన (స)గారు 'సమిఅల్లాహులిమన్ హమిదహ్' అన్నప్పుడు మాలోని ఎవ్వడూ (సజ్దా చెయ్యటానికి) తన వీపును వంచేవాడు కాదు; ఆయన (స) గారు తన నుదుటిని నేలపై ఆనించే వరకు.

## 130వ అధ్యాయం

### సజ్దాలో ముక్కును కూడా నేలపై ఆనించటం.[1]

**776.** దైవప్రవక్త మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని, అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజిఅన్) ఉల్లేఖించారు; శరీరంలోని ఏడు ఎముకలపై సజ్దా చెయ్యాలని నన్ను దేవుడు ఆజ్ఞాపించాడు. నుదుటిపైనా; ఆయన (స), నుదుటిపై నుంచి ముక్కు వరకు తన చేతిని త్రిప్పారు. మరియు రెండు చేతులపైనా మరియు రెండు మోకాళ్ల పైనా మరియు రెండు కాలి వ్రేళ్ళపైనా. మరియు మేము బట్టలను గానీ, తల వెంట్రుకలను గానీ సర్దుకోవటం చెయ్యకూడదని కూడా ఆజ్ఞాపించటం జరిగింది.

## 131వ అధ్యాయం

### బురదలో కూడా ముక్కును నేలపై ఆనించటం.

**777.** అబూ సలమా బిన్ అబ్దుర్రహ్మాన్ ఇలా ఉల్లేఖించారు: ఒకసారి నేను అబూ సయీద్ ఖుద్రీ వద్దకు వెళ్లాను. నేను ఆయనతో ఇలా అన్నాను; "పదండి, ఖర్జూరపు తోటలకు వాహ్యాళి కోసం వెళదాము; మాతో రండి, అక్కడకు వెళ్లి మాట్లాడు కుందాము". నా మాట మన్నించి అతను మాతో బయలుదేరారు. మార్గమధ్యంలో నేను ఆయన్ని ఇలా అడిగాను: షబేఖదర్ (విలువైన రాత్రి)ని గురించి దైవప్రవక్త (స) ఏమి చెప్పారో, నీవు ఏమి విన్నావో దానిని మాకు వివరంగా చెప్పు. సమాధానంగా అబూ సయీద్ ఇలా అన్నారు: రమజాను మాసం మొదటి పది రోజుల్లో దైవప్రవక్త (స) 'ఏతికాఫ్' కూర్చున్నారు. మేము కూడా ఆయన (స) గారితోపాటు ఏతికాఫ్

---

130–1. అంటే ముక్కు కూడా నుదుటిలోని భాగమే, కాని నుదుటిని భూమిపై ఆనించటం తప్పనిసరి. కేవలం ముక్కును నేలపై ఆనించి సజ్దా చెయ్యటం సరిపోదు. ఇమామ్ అహ్మద్ (రహ్మాలై) గారి దృష్టిలో ముక్కు మరియు నుదురు ఈ రెండు భాగాలనూ నేలపై ఆనించటం వాజిబ్. ఇమామ్ అబూ హనీఫా (రెహ్మాలై) గారి దృష్టిలో కేవలం ముక్కు నేలపై పెట్టి సజ్దా చేసినా సరిపోతుంది.

కూర్చున్నాము. తరువాత హజ్రత్ జిబ్రీల్ (అ) ఆయన (స) గారి వద్దకు వచ్చి ఇలా అన్నారు: మీరు ఏ రాత్రినైతే కోరుకుంటున్నారో, ఆ రాత్రి మున్ముందు రాబోతోంది.

కనుక ఆయన(స), మాసం మధ్యలోని పది దినాలలో 'ఏతికాఫ్' పాటించారు. మేము కూడా ఆయన(స)గారితో పాటు ఏతికాఫ్ కూర్చున్నాము. ఆ తరువాత హజ్రత్ జిబ్రీల్ (అ), ఆయన(స)గారి వద్దకు వచ్చి ఇలా అనసాగారు; "మీరు కోరుకునే రాత్రి ఇంకా ముందు ఉన్నది". ఈ విషయాన్ని విని ఆయన(స) నిలబడిపోయారు. రమజాన్ మాసం 20వ తేదీ నాడు ఆయన(స) ఇలా బోధించారు; "ఎవరైతే నాతో పాటు ఏతికాఫ్‌ను పాటించారో వారు మళ్ళీ నా వద్దకు రావాలి. (ఏతికాఫ్ కూర్చోవాలి). ఎందుకంటే, షబే ఖదర్ నాకు చూపించబడింది. కాని నేను దానిని మరిచిపోయాను. ఈ రాత్రి రమజాను మాసంలోని చివరి పది రోజులలో వస్తుంది. బేసిసంఖ్యల రాత్రులలో వస్తుంది. నేను ఆ రాత్రి నీళ్ళల్లోనూ, బురదలోనూ సజ్దా చేస్తూ ఉన్నట్లుగా కూడా చూశాను. అబూ సయీద్(ర) ఇలా అన్నారు; మస్జిద్ కప్పు ఖర్జూరపు కొమ్మలతో వేయబడింది. ఆకాశం మీద మబ్బులు ఉన్నట్లు అనిపించలేదు. ఇంతలోనే ఒక పల్చని మేఘం ఆకాశం మీద ప్రత్యక్షమయింది; వర్షం కూడా కురిసింది. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) నమాజ్ చేయించారు. అప్పుడు నేను బురద నీటి గుర్తులు ఆయన(స)గారి నుదుటిపైనా మరియు ముక్కుకొన మీదా చూశాను. ఆయన(స) గారి కల నిజమైపోయింది.

## 132వ అధ్యాయం

**నమాజులో ఉన్నప్పుడు బట్టల్ని ముడివేసుకోవడం; సర్దుకోవటం, కప్పుకోవటం అనే విషయాలను గురించి. ఇంకా ఒకవేళ ఎవరైనా సతర్ తొలగిపోతుందనే భయంతో అలా చేస్తే (అంటే బట్టను చుట్టుకుంటే) అప్పుడు దానికి సంబంధించిన ఆజ్ఞ ఏమిటి?**

**778.** సహల్ బిన్ సాద్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ప్రజలు తమ తమ ఇజార్‌లను (లుంగీలను) తమ తమ మెడల చుట్టూ కట్టుకుని దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)తో కలిసి నమాజ్ చేసేవారు; ఎందుకంటే వారు ధరించే లుంగీల సైజు చిన్నదిగా ఉండేది. ఇంకా పురుషులు తమ తమ స్థానాలలో నిటారుగా కూర్చునే వరకు మహిళలు తమ తమ శిరస్సులను సజ్దాలో నుంచి పైకి ఎత్తకూడదని కూడా ఆజ్ఞాపించడం జరిగింది.

## 133వ అధ్యాయం

### సజ్దాలో ఉన్నప్పుడు వెంట్రుకలను సరిచేసుకోకూడదు.

**779.** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)కు శరీరంలోని ఏడు ఎముకలపై సజ్దా చెయ్యమనీ, ఇంకా సజ్దాలో ఉన్నప్పుడు వెంట్రుకలను, బట్టలను సరిచేసుకోకూడదని ఆజ్ఞాపించడం జరిగింది.[1]

## 134వ అధ్యాయం

### నమాజ్‌లో ఉన్నప్పుడు బట్టలు సర్దుకోకూడదు.

**780.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఉల్లేఖించారు; "ఏడు ఎముకలపై సజ్దా చెయ్యాలని, వెంట్రు కలను, బట్టలను సరిచేసుకోకూడదని నన్ను అల్లాహ్ ఆజ్ఞాపించాడు."

## 135వ అధ్యాయం

### సజ్దాలో ఉన్నప్పుడు అల్లాహ్‌ను స్తుతించటం మరియు దుఆ చెయ్యటం- అనే విషయాలను గురించి.

**781.** హజ్రత్ ఆయెషా(ర.అ) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) తరచూ రుకూలోనూ, సజ్దాలోనూ ఇలా పఠిస్తూ ఉండేవారు; "సుబ్‌హానకల్లా హుమ్మ రబ్బనా వబి హమ్‌దిక అల్లాహుమ్మగ్ ఫిర్‌లీ." (ఓ అల్లాహ్! మా ప్రభూ! నీవు అత్యంత పవిత్రుడవు. మేము నిన్ను స్తుతిస్తున్నాము. ఓ అల్లాహ్! మమ్ము క్షమించు) దివ్య ఖుర్‌ఆన్‌లో అవతరించిన ఆజ్ఞ ప్రకారం దైవప్రవక్త(స) ఆచరించేవారు.[1]

## 136వ అధ్యాయం

### రెండు సజ్దాల మధ్య కొంచెం సేపు కూర్చోవటం.

**782.** అబూ ఖిలాబ అబ్దుల్లాహ్ బిన్ జైద్ ఇలా ఉల్లేఖించారు; ఒకసారి

---

779-1. ఎందుకంటే వెంట్రుకలు కూడా సజ్దా చేస్తాయి. ఈ విషయం ఒక హదీసులో ఉన్నది. మరొక హదీసులో కొప్పు (వెంట్రుకల ముడి) మీద షైతాన్ కూర్చుంటాడు.

781-1. అన్ నస్ర్ సూరాలో ఇది అవతరించింది; "ఫసబ్బిహ్ బిహమ్‌ది రబ్బిక వస్‌తగ్‌ఫిర్‌హు" కనుక ఆయన(స)గారు 'తస్బీహ్' మరియు 'ఇస్‌తగ్‌ఫార్'లను రుకూ, సజ్దాలలో పఠించేవారు. ఈ హదీసు ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే రుకూ, సజ్దాలలో దుఆ చెయ్యటం ధర్మసమ్మతమైన విషయమే.

మాలిక్ బిన్ హువైరిస్ (రజిఅన్) తన మిత్రులతో ఇలా అన్నారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) తన నమాజుల్ని ఎలా చేసే వారో నేను మీకు తెలియజేసేదా? అబూ ఖిలాబా ఇలా అన్నారు; అప్పుడు ఏ ఫజ్ర్ నమాజు సమయమూ ఇంకా కాలేదు. ఆయన లేచి నిలబడ్డారు. తరువాత రుకూ చేశారు. మరియు తక్బీర్ చెప్పారు. ఆ తరువాత రుకూలో నుంచి తన శిరస్సును పైకి ఎత్తారు మరియు కొంచెం సేపు నిలబడ్డారు; తరువాత సజ్దా చేశారు. ఆ తరువాత తన శిరస్సును పైకి ఎత్తారు, కొంచెం సేపు ఆగారు. ఆ తరువాత సజ్దా చేశారు; తరువాత తన శిరస్సును ఎత్తారు. చివరకు ఆయన మా షేఖ్ అమ్ర్ బిన్ సలమా మాదిరిగా నమాజు చేశారు. అయ్యూబ్ సిఖ్తియాని ఇలా అన్నారు; అమ్ర్ బిన్ సలమా నమాజులో ఒక పని చేసేవారు, దానిని ఇతరులు చేస్తూ ఉండగా నేను చూడలేదు. మూడో రకాతు తరువాతనో లేదా నాలుగో రకాతు ప్రారంభంలోనో ఆయన కూర్చుండేవారు. మాలిక్ బిన్ హువైరిస్ ఇలా అన్నారు; మేము మా తెగవారి తరఫున దైవప్రవక్త (స) గారి వద్దకు వెళ్లాము. మరియు అక్కడ ఆగాము. దైవప్రవక్త (స) గారు ఇలా సెలవిచ్చారు; "ప్రజలారా! మీ ప్రజల వద్దకు తిరిగి వెళ్లండి. అది మీకు చాలా మేలైన విషయం. చూడండి! ఈ నమాజును ఫలానా సమయంలో చెయ్యండి. మరొక నమాజును ఫలానా సమయంలో చెయ్యండి. నమాజుకు వేళ అయినప్పుడు మీలో ఎవరో ఒకరు అజాన్ ఇవ్వండి. మీలో ఎవరైతే పెద్దవారో ఆయన నమాజులో ఇమామత్ చెయ్యాలి."

**783.** బరా బిన్ ఆజిబ్ (రజిఅన్) (ఒక సహాబి) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) సజ్దా చెయ్యటం కోసం, రుకూ చెయ్యటం కోసం మరియు రెండు సజ్దాల మధ్య కూర్చోవటం కోసం తీసుకున్న టైము (కాలం) ఒక్కటే (సమానమే).

**784.** హజ్రత్ అనస్ (రజిఅన్) ఇలా అన్నారని సాబిత్ ఉల్లేఖించారు; నేను నమాజు చేయించే విషయంలో ఎలాంటి కొరతా చెయ్యను. దైవప్రవక్త (స) ఏ విధంగా నమాజు చేయిస్తూ ఉండగా నేను చూశానో అదేవిధంగా నేను కూడా మీకు నమాజు చేయిస్తాను. సాబిత్ ఇలా అన్నారు; హజ్రత్ అనస్ (ర), నమాజులో ఒక విషయాన్ని చేస్తూ ఉండేవారు. ఆ విషయాన్ని నమాజులో మీరు కూడా చేస్తూ ఉన్నట్లు నేను చూడటం లేదు. ఆ విషయం ఏమిటంటే, హజ్రత్ అనస్(ర) రుకూ చేసి తన శిరస్సును ఎత్తినప్పుడు, ఎంతసేపు నిలబడతారంటే, ఎవరైనా చూస్తే ఆయన(ర)

సజ్దా చెయ్యటాన్ని మరిచిపోయారేమోనని అంటాడు. ఇదే విధంగా రెండు సజ్దాల మధ్య కాలంలో ఎంతసేపు కూర్చుంటారంటే, ఎవరైనా చూస్తే ఆయన (ర) రెండోసారి సజ్దా చెయ్యటాన్ని మరచిపోయారేమో అంటాడు.

## 137వ అధ్యాయం

**సజ్దాలో ఉన్నప్పుడు మీ రెండు మోచేతులను (పశువుల మాదిరిగా) నేలపై పరచకూడదు.**

అబూ హుమైద్ ఇలా అన్నారు; దైవప్రవక్త (స) సజ్దా చేశారు మరియు తన చేతులను నేలపై పెట్టారు. ఇంకా తన మోచేతులను భూమికి దూరంగాను, తన శరీరానికి దూరంగానూ పెట్టారు.

**785.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఉల్లేఖించారు; సజ్దాను సక్రమంగా, చక్కగా చెయ్యండి. మీలోని వారెవరూ ఒక కుక్క మాదిరిగా తన మోచేతులను భూమిపై పరచరాదు.[1]

## 138వ అధ్యాయం

**బేసి రకాతుల తరువాత తిన్నగా కూర్చోవటం మరియు లేవటం గురించి.**

**786.** మాలిక్ బిన్ హువైరిస్(ర) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)ను నమాజు చేస్తూ ఉండగా ఆయన(ర) చూశారు. ఆయన(స)గారు బేసి రకాతు లేక బేసి రకాతులు పూర్తి చేసిన తరువాత కొంచెంసేపు తిన్నగా కూర్చోనంతవరకు లేచి నిలబడేవారు కాదు.

## 139వ అధ్యాయం

**ఒక రకాతు పూర్తిచేసిన తరువాత లేచి నిలబడదలచినపుడు నేలపై ఎలా ఆనుకోవాలి? (నేలను ఎలా ఆధారంగా తీసుకోవాలి)**

**787.** అబూ ఖిలాబా ఇలా అన్నారని అయ్యూబ్ సఖ్తియాని ఉల్లేఖించారు; మాలిక్ బిన్ హువైరిస్ (రజిఅన్) ఒకసారి మా వద్దకు వచ్చి ఈ మస్జిద్‌లో నమాజు చేయించారు. ఆయన ఇలా అన్నారు; 'నేను మీచేత నమాజు చేయిస్తున్నాను. కాని

---

785–1. ఎందుకంటే ఈ విధంగా చేతులను నేలపై పరచటం బద్ధకాన్నీ, సోమరితనాన్ని సూచిస్తుంది. ఖస్తలాని ఏమన్నారంటే, ఒకవేళ ఎవరైనా అలా చేస్తే అంటే తన మోచేతుల్ని భూమిపై పరిస్తే అతని నమాజు అయితే ధర్మసమ్మతమై పోతుంది. కాని అది 'మక్రూహె తన్‌జీహి' అవుతుంది.

నా ఉద్దేశ్యం (కేవలం) నేను నమాజు చెయ్యటం మాత్రమే కాదు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఎలా నమాజు చేసేవారో నేను ప్రత్యక్షంగా చూశాను. దానిని మీకు నేను తెలియజెయ్యదలచుకున్నాను.' అయ్యూబ్ సఖ్తియానీ ఇలా అన్నారు; మాలిక్ ఎలా నమాజు చేశారు? అని నేను అబూ ఖిలాబాను అడిగాను. దానికి సమాధానంగా ఆయన ఇలా అన్నారు; మన షేక్ అయినటువంటి అమ్ర్ బిన్ సలమా ఎలా నమాజు చేశారో ఆయన అలా చేశారు. అయ్యూబ్ ఇలా అన్నారు; అమ్ర్ బిన్ సలమా అన్ని తక్బీర్‌లు పలుకుతారు (22 తక్బీర్‌లు). రెండో సారి సజ్దా చేసి (మొదటి మరియు మూడవ రకాత్‌లో) తన శిరస్సును ఎత్తినప్పుడు కూర్చుంటారు. మరియు నేలపై ఆనుకుని తరువాత లేచి నిలబడతారు. (నేలను ఆధారంగా చేసుకుని లేచి నిలబడతారు)

## 140వ అధ్యాయం

**రెండు రకాతులు చేసిన తరువాత లేచి నిలబడినప్పుడు తక్బీర్ (అల్లాహు అక్బర్) పలకాలి. అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ (రజిఅన్) మూడో రకాతు కోసం నిలబడేటప్పుడు తక్బీర్ పలికేవారు.**

**788.** సయీద్ బిన్ హారిస్ ఇలా ఉల్లేఖించారు; ఒకసారి అబూ సయీద్ ఖుద్రీ (రజిఅన్) మాకు నమాజు చేయించారు. ఆయన(ర) సజ్దాలో నుంచి తన శిరస్సును ఎత్తినప్పుడు బిగ్గరగా తక్బీర్ (అల్లాహు అక్బర్) పలికారు. తరువాత మళ్ళీ సజ్దా చేసినప్పుడు ఇలానే చేశారు. ఇదేవిధంగా రెండు రకాతులు చేసిన తరువాత లేచి నిలబడ్డారు. మరియు ఇలా అన్నారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)ను ఇలాగే నమాజు చేస్తూ ఉండగా నేను చూశాను.

**789.** ముతర్రిఫ్ బిన్ అబ్దుల్లాహ్ ఇబ్నె షఖీర్ ఇలా ఉల్లేఖించారు; ఒకసారి నేను మరియు ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజిఅన్) (ఒక సహాబి) హజ్రత్ అలి ముర్తుజా (రజి అన్) గారి వెనుక నిలబడి నమాజు చేశాము (బస్రాలో). ఆయన(ర)గారు సజ్దా చేసినప్పుడు తక్బీర్ పలికేవారు. మరియు తన శిరస్సును ఎత్తినప్పుడు తక్బీర్ పలికేవారు. ఇంకా రెండు రకాతులు చేసిన తరువాత లేచి నిలబడినప్పుడు తక్బీర్ పలికేవారు. ఆయన(ర)గారు సలామ్ చేసిన తరువాత ఇమ్రాన్ నా చేతిని పట్టుకుని ఇలా అన్నారు; ఆయన(ర) (అంటే హజ్రత్ అలీ(ర)) దైవప్రవక్త(స)గారు మా చేత ఎలాంటి నమాజ్ చేయించేవారో అలాంటి నమాజునే చేయించారు. లేదా ఇలా అన్నారు; ఆయన(ర)నాకు దైవప్రవక్త(స)గారు చేయించిన నమాజును జ్ఞాపకం చేశారు.

## 141వ అధ్యాయం

**అత్తహియ్యాత్ కోసం ఎలా కూర్చోవటం సున్నత్ (దైవప్రవక్త(స)గారి సంప్రదాయం). ఉమ్మె దర్దా నమాజులో పురుషుల మాదిరిగా కూర్చునే వారు. (అంటే రెండు తొడలపై కూర్చునేవారు) ఉమ్మెదర్దా తాబయీల లోనివారు మరియు ఆమెకు 'ఫిఖా'శాస్త్రం బాగా తెలుసు.**

**790.** అబ్దుల్లాహ్ బిన్ అబ్దుల్లాహ్ ఇలా ఉల్లేఖించారు; ఆయన తన తండ్రిగారైన అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజిఅన్) గారిని నమాజులో తన రెండు తొడల ఆధారంగా కూర్చొని ఉండటాన్ని (బాసిపట్టు వేసుకుని) చూశారు. ఆయన కూడా అదేవిధంగా కూర్చొని నమాజు చేశారు. అప్పుడు ఆయన చిన్నవారు. అబ్దుల్లా బిన్ ఉమర్(ర) నమాజులో అలా కూర్చోవద్దని తన కుమారుణ్ణి వారించారు. ఇంకా ఇలా అన్నారు; నమాజులో ఇలా కూర్చోవాలి. అది సున్నత్; కుడి పాదాన్ని నిలబెట్టి, ఎడమ పాదాన్ని మడిచి దానిపై కూర్చోవాలి. అప్పుడు అబ్దుల్లాహ్ తన తండ్రిని ఇలా అడిగారు; నాన్న గారు! మీరైతే నాలుగు భాగాల మీద కూర్చున్నారు కదా! దానికి సమాధానంగా, హజ్రత్ ఉమర్(ర) ఇలా అన్నారు; నా కాళ్ళు నా శరీర భారాన్ని మోయలేవు.

**791.** ముహమ్మద్ బిన్ అమ్ర్ బిన్ అతా ఇలా ఉల్లేఖించారు: ఒకసారి నేను దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి అనుచరులు కొందరితో కలిసి కూర్చొని ఉన్నాను. మా మధ్య దైవప్రవక్త(స)గారు చేసే నమాజు విధానానికి సంబంధించిన ప్రస్తావన వచ్చింది. అప్పుడు అబూ హుమైద్ సాయిదీ (రజిఅన్) ఇలా అన్నారు; దైవప్రవక్త(స)గారి నమాజును గురించి మీ అందరికంటే బాగానూ, ఎక్కువగా జ్ఞాపకం ఉన్నవాణ్ణి నేనే. నేను చూశాను; ఆయన(స)గారు తక్బీరె తహ్రీమా అన్నప్పుడు తన రెండు చేతుల్ని, తన రెండు భుజాలకు సమానంగా ఎత్తేవారు. మరియు రుకూ చేసినప్పుడు ఆయన(స)గారు తన రెండు చేతుల్ని తన రెండు మోకాళ్ళపై పెట్టేవారు. తరువాత తన వీపును వంచి దానిని తన శిరస్సుకూ మెడకూ సరిసమానంగా చేస్తారు. ఆ తరువాత తన శిరస్సును ఎత్తి నిటారుగా నిలబడతారు. అప్పుడు ఆయన(స)గారి వీపు మీద ఉన్న ప్రతి ప్రక్కటెముక తన స్థానంలోకి వచ్చేస్తుంది. ఇంకా సజ్దా చేసినప్పుడు తన రెండు చేతుల్ని నేలమీద పెడతారు; తన బాహువుల్ని పరచరు. వాటిని ముడిచి ప్రక్కలకూ ఆనించరు. మరియు కాలివ్రేళ్ళ మొనలను ఖిబ్లా వైపునకు ఉంచుతారు. రెండు రకాతులు పూర్తి చేసిన తరువాత ఎడమ

కాలును భూమిపై పరచి దానిపై కూర్చుంటారు. ఇంకా కుడికాలును నిలబెడతారు. చివరి రకాతు పూర్తి చేసిన తరువాత ఎడమ కాలును ముందుకు చాస్తారు. మరియు కుడికాలును నిలబెడతారు. రెండు పిరుదుల ఆధారంగా కూర్చుంటారు.

## 142వ అధ్యాయం

**మొదటి తషహ్హుద్ తప్పనిసరి అని కొందరు భావించరు. ఎందుకంటే దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) రెండో రకాతు చేసిన తరువాత తషహ్హుద్ కోసం కూర్చోకుండానే నిలబడ్డారు.**

**792.** అబ్దుల్లా బిన్ బుహైన(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఆయన వుజ్ద్ షనూఅ తెగకు చెందినవారు మరియు అబ్దె మునాఫ్ తెగకు మిత్రుడు (మరియు దైవప్రవక్త(స) గారి అనుచరులలోనివారు). ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారు మాకు జుహర్ నమాజు చేయించారు. మొదటి రెండు రకాతులు చేసిన తరువాత నిలబడ్డారు; కూర్చోలేదు. ప్రజలు కూడా (ముఖ్తదీలు) ఆయన(స) గారితో పాటు నిలబడ్డారు. నమాజు పూర్తి అయిన తరువాత ఆయన(స) గారు ఇక సలామ్ చేస్తారని నిరీక్షిస్తున్నారు. కాని ఆయన(స) గారు కూర్చొని ఉండే అల్లాహు అక్బర్ అని పలికారు. తరువాత సలామ్‌కు ముందు రెండు సజ్దాలు చేశారు. ఆ తరువాత సలామ్ చేశారు.

## 143వ అధ్యాయం

**మొదటి ఖాయిదాలో తషహ్హుద్ పఠించడం.**

**793.** అబ్దుల్లాహ్ బిన్ మాలిక్ ఇబ్నె బుహైనా(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) జుహ్ర్ నమాజ్‌కు నాయకత్వం వహించి మాకు నమాజు చేయించారు. రెండు రకాతుల తరువాత ఆయన(స) గారు తషహ్హుద్ పఠించటానికి కూర్చోవలసింది, కాని నిలబడ్డారు. నమాజ్ పూర్తి అయిన తరువాత ఆయన(స) కూర్చునే సహూకు సంబంధించిన రెండు సజ్దాలు చేశారు.

## 144వ అధ్యాయం

**రెండో ఖాయిదాలో తషహ్హుద్ పఠించటం.**

**794.** అబ్దుల్లాహ్ బిన్ మసూద్ ఇలా అన్నారని షఖీఖ్ బిన్ సలమా ఉల్లేఖించారు; మొట్టమొదట మేము దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి వెనుక నిలబడి నమాజు చేసేటప్పుడు (సలామ్ చేసే సమయంలో) ఇలా అనేవారము; జిబ్రయీల్‌పై సలామ్, మేకాయిల్‌పై సలామ్, ఫలానావారిపై సలామ్, ఫలానా వారిపై

సలామ్ (అల్లాహ్‌పై సలామ్). తరువాత ఒకరోజున ఏమయిందంటే, దైవప్రవక్త(స) మా వైపునకు తన ముఖాన్ని త్రిప్పి ఇలా సెలవిచ్చారు; మీరు అల్లాహ్‌పైకి సలామ్‌ను ఏమని పంపగలరు? స్వయంగా అల్లాహ్ పేరే సలామ్. మీలో ఎవరైనా నమాజు చేసినప్పుడు ఇలా అనాలి; "అత్తహియ్యాతు లిల్లాహి వస్సలవాతు వత్తయ్యిబాతు అస్సలాము అలైక అయ్యు హన్నబియ్యు వ రహ్‌మతుల్లాహి వ బరకాతుహు, అస్సలాము అలయ్‌నా వ అలా ఇబాదిల్లాహిస్ సాలిహీన్" మీరు ఇలా అన్నప్పుడు, మీరు పంపే సలామ్ ఆకాశాలలోగానీ, భూమిలో గానీ, ఎక్కడైనా సరే సజ్జనుడైన అల్లాహ్ దాసుడు ఎవరైనా ఉన్నట్లయితే అతనికి చేరుతుంది. అష్‌హదు అన్‌ల్లా ఇలాహ ఇల్లల్లాహు వ అష్‌హదు అన్న ముహమ్మదన్ అబ్‌దుహూ వ రసూలుహు".

## 145వ అధ్యాయం

### (తషహ్హుద్ తరువాత) సలామ్‌కు ముందు ఏ దుఆను పఠించాలి?

**795.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి సతీమణి అయినటువంటి హజ్రత్ ఆయెషా(ర.అ) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త ముహమ్మద్(స) నమాజ్‌లో తషహ్హుద్ తరువాత ఈ దుఆను పఠించేవారు; "అల్లాహుమ్మ ఇన్నీ అఊజుబిక మిన్ అజాబిల్ ఖబ్‌రి, వ అఊజుబిక మిన్ ఫిత్‌నతిల్ మసీహిద్దజ్జాలి, వ అఊజుబిక మిన్ ఫిత్‌నతిల్ మహ్‌యా వ ఫిత్‌నతిల్ మమాతి, అల్లాహుమ్మ ఇన్నీ అఊజు బిక మినల్ మాసమి వల్ మగ్‌రమి." (ఓ అల్లాహ్! సమాధిలో పడే శిక్ష నుంచి నేను నీ శరణు వేడుకుంటున్నాను. ఇంకా కానె దజ్జాల్ ఉపద్రవం నుంచి కూడా నేను నీ ఆశ్రయాన్ని కోరుకుంటున్నాను. మరియు జీవన్మరణాల ఆపదల నుంచి[1] కూడా నేను నీ రక్షణ కోరుకుంటున్నాను. ఓ అల్లాహ్! పాప కార్యాల నుంచి మరియు అప్పుల బాధ నుంచి నేను నీ శరణు వేడుకుంటున్నాను). ఒక వ్యక్తి (హజ్రత్ ఆయెషా(ర)) దైవప్రవక్త(స) గారికి ఇలా విన్నవించుకున్నారు; ఓ ప్రవక్తా(స)! కారణం ఏమిటి? మీరు చాలా ఎక్కువగా అప్పుల బాధ నుంచి శరణు వేడుకుంటారు? దానికి ఆయన(స)గారు ఇలా సెలవిచ్చారు: మనిషి రుణగ్రస్తుడైనప్పుడు అబద్ధం చెబుతాడు. ఆడిన మాట తప్పుతాడు. ఉర్‌వా బిన్ జుబైర్ నాతో ఇలా అన్నారు అని

---

795-1. జీవితానికి సంబంధించిన ఆపదలు ఏమిటంటే, దేవుణ్ణి మరచిపోయేలా చేసే అన్ని విషయాలు, అన్ని వస్తువులు, సంపద, సంతానం మొదలైనవి. మరణానికి సంబంధించిన ఆపద, ఉపద్రవం ఏమిటంటే, మరణ సమయంలో ముగింపు చెడ్డది కావటం. షైతాన్ ఉపద్రవానికి లోను కావటం.

జుహ్రీ అన్నారు; దైవప్రవక్త(స) నమాజ్‌లో దజ్జాల్ ఉపద్రవం నుంచి కాపాడమని అల్లాహ్‌ను శరణు వేడుకునేవారు. ఈ విషయాన్ని ఆయనే(స) స్వయంగా నాకు చెప్పారు అని హజ్రత్ ఆయెషా(ర)అన్నారు.[2]

**796.** హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; నేను మహాప్రవక్త ముహమ్మద్(స)ను ఇలా అడిగాను; ఓ దైవప్రవక్తా(స)! నమాజ్‌లో చేసుకోవటానికి నాకు మీరు ఏదైనా ఒక మంచి దుఆను నేర్పండి. ఆయన (స)గారు ఇలా సెలవిచ్చారు; ఇలా అను, "అల్లాహుమ్మ ఇన్నీ జలమ్‌తు నఫ్సీ జుల్‌మన్ కసీరవ్‌వలా యగ్‌ఫిరుజ్‌జునూబ ఇల్లా అన్‌త ఫగ్‌ఫిర్‌లి మగ్‌ఫిరతమ్ మిన్ ఇన్‌దిక వర్‌హమ్‌నీ ఇన్నక అన్‌తల్ గఫూరుర్ రహీమ్." (ఓ అల్లాహ్! నేను పాపకార్యాలు చేసి నా ప్రాణాన్ని పెద్ద ఆపదకే గురి చేశాను; నీవు తప్ప పాపాలను క్షమించేవాడు మరెవ్వడూ లేడు. కనుక నీవు నన్ను క్షమించు, నన్ను కరుణించు. నిస్సందేహంగా నీవు అధికంగా క్షమించేవాడవు. అమితంగా కరుణించే వాడవూను)

## 146వ అధ్యాయం

**తషహ్హుద్ తరువాత చేసే దుఆను గురించి ఈ దుఆను పఠించటం తప్పనిసరి (వాజిబ్) కాదు.**

**797.** అబ్దుల్లాహ్ బిన్ మసూద్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: మొట్టమొదట మేము దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారితో కలిసి నమాజ్ చేసేటప్పుడు ఇలా అనే వారము; అల్లాహ్ దాసుల తరపు నుంచి అల్లాహ్‌పై సలామ్, ఫలానావారిపై సలామ్, ఫలానా వారిపై సలామ్. తరువాత దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: మీరు అల్లాహ్ పైకి సలామ్ అని అనకండి. స్వయంగా అల్లాహ్‌యే సలామ్. ఇలా అనండి: "అత్తహియ్యాతు లిల్లాహి వస్సల వాతు వత్తయ్యిబాతు అస్సలాము అలైక అయ్యుహన్న బియ్యు వ రహ్‌మతుల్లాహి వ బరకాతుహు, అస్సలాము అలయ్‌నా వ అలా ఇబాది ల్లాహిస్ సాలిహీన్". మీరు ఇలా అన్నప్పుడు, మీరు పంపే సలామ్ ఆకాశాలలోగానీ, భూమిలోగాని, ఎక్కడైనా సరే సజ్జనుడైన అల్లాహ్ దాసుడు ఎవరైనా ఉన్నట్లయితే అతనికి చేరుతుంది. "అష్‌హదు అన్‌ల్లా ఇలాహ ఇల్లల్లాహు వ అష్‌హదు అన్న

795-2. వాస్తవానికి ఆయన(స)గారి పాపాలన్నింటినీ అల్లాహ్ క్షమించివేశాడు. దజ్జాల్ కూడా ఆయన(స)గారికి ఎలాంటి హానినీ చెయ్యలేదు. కాని ముస్లిమ్ సమాజానికి ఈ విషయం గురించి నేర్పటానికి లేదా దేవుని దర్బారులో నిస్సహాయతను ప్రకటిం చుకోవటానికి ఆయన(స) ఈ దుఆ చేశారు.

ముహమ్మదన్ అబ్‌దుహూ వ రసూలుహు” పఠించిన తరువాత దుఆలలో మీకు ఇష్టమైన దుఆను చెయ్యండి.

## 147వ అధ్యాయం

**ఒకవేళ నమాజులో ఉన్నప్పుడు నుదుటికిగానీ లేదా ముక్కుకుగానీ మట్టి తగిలితే, నమాజు పూర్తి చేయనంతవరకు దానిని తుడుచుకోరాదు. ఇమామ్ బుఖారీ (రహ్మాలై) ఇలా అన్నారు; “నేను అబ్దుల్లా బిన్ జుబైర్ హుమైదీ గారిని చూశాను; నమాజులో ఉన్నప్పుడు తన నుదుటిని తుడుచుకోరాదు అనే విషయానికి ప్రమాణంగా ఈ హదీసునే తీసుకునేవారు.**

**798.** అబూ సయీద్ ఖుద్రీ(రజిఅన్)గారు ఇలా ఉల్లేఖించారు; నేను (షబే ఖదర్ నాటి) ఒక రాత్రి సమయంలో చూశాను; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) అప్పుడు నీటిలోనూ, బురదలోనూ సజ్దా చేస్తూ ఉన్నారు. చివరకు ఆయన(స) గారి నుదుటిపై బురద గుర్తుల్ని కూడా నేను చూశాను.

## 148వ అధ్యాయం

**‘తస్లీమ్’ అంటే ముఖాన్ని కుడివైపునకూ ఆ తరువాత ఎడమ వైపునకూ త్రిప్పుతూ ‘అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహ్’ అని అనటం, నమాజు చివరి భాగంలో ఇలా అనాలి.**

**799.** విశ్వాసుల తల్లి అయిన హజ్రత్ ఉమ్మె సలమా (రజిఅన్) ఇలా సెలవిచ్చారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ‘తస్లీమ్’ చెప్పి తన నమాజును ముగించినప్పుడు స్త్రీలు కూడా ‘తస్లీమ్’ చెప్పి నిలబడి వెళ్ళిపోతారు. దైవప్రవక్త(స) కొంచెంసేపు అక్కణ్ణే కూర్చొని ఉంటారు. ఇబ్నె షిహాబ్ ఇలా అన్నారు; దైవప్రవక్త(స) గారు, స్త్రీలు వెళ్ళిపోవాలని అలా ఆగిపోతారు, ఇంకా పురుషులు తమ నమాజులను పూర్తి చేసిన తరువాత స్త్రీలు వారికి కనిపించకుండా వెళ్ళిపోవాలని అలా ఆగిపోతారు అని నేను అనుకుంటాను. దీనికి సంబంధించిన సంపూర్ణ జ్ఞానం మాత్రం అల్లాహ్‌కు మాత్రమే ఉంది.

## 149వ అధ్యాయం

**ఇమామ్ ‘తస్లీమ్’ (సలామ్) చెప్పగానే ముఖ్తదీలు కూడా ‘తస్లీమ్’ చెప్పాలి. అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజిఅన్) ఇలా సెలవిచ్చారు; ఇమామ్ ‘తస్లీమ్’ (సలామ్) చెప్పగానే అతని వెనుక నిలబడి నమాజు చేసే ప్రజలు కూడా సలామ్ చెప్పాలి;**

**ఇది అభిలష ణీయమైనది. అంటే ముస్తహబ్ అన్నమాట.**

**800.** ఇత్‌బాన్ బిన్ మాలిక్ అన్సారీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి మేము దైవప్రవక్త(స) మహాశయులు ముహమ్మద్(స)గారితో కలిసి నమాజు చేశాము. ఆయన(స) గారు సలామ్ చెప్పగానే (తస్లీమ్ చెప్పగానే) మేము కూడా సలామ్ చెప్పేవారము.

## 150వ అధ్యాయం

**ఇమామ్‌కు సలామ్ చేసే అవసరం లేదు. కేవలం నమాజుకు సంబంధించిన రెండు సలాములే సరిపోతాయి.**

**801.** మహ్‌మూద్ బిన్ రబీ(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఆయన ఇలా అనేవారు; దైవప్రవక్త ముహమ్మద్(స) నాకు చాలా స్పష్టంగా, పూర్తిగా జ్ఞాపకం ఉన్నారు. ఇంకా ఆయన(స)గారు మా ఇంట్లో ఉన్న ఒక బకెట్టులో నుంచి నీళ్ళు తీసుకుని తన నోట్లో పోసుకుని పుక్కిలించి నా ముఖం మీద ఊసిన ఆ పుక్కిలింత కూడా నాకు జ్ఞాపకం ఉన్నది. నేను ఇత్‌బాన్ బిన్ మాలిక్ అన్సారీ చెబుతూ ఉండగా విన్నాను. ఆయన బనీ సాలిమ్ తెగకు చెందిన ఒక వ్యక్తి. ఆయన ఏమన్నారంటే, నేను మా జాతివారైన బనీ సాలిమ్ ప్రజలకు నమాజులో ఇమామత్ చేస్తూ ఉండేవాణ్ణి. ఒకసారి నేను దైవప్రవక్త ముహమ్మద్(స)గారి వద్దకు వెళ్ళాను. ఆయన గారితో నేను ఇలా విన్నవించుకున్నాను; ఓ దైవప్రవక్తా(స)! నా దృష్టి బలహీనపడిపోయింది. (నాకు కళ్ళు కనిపించడం లేదు) ఒక్కొక్కసారి నీటి కాలువలు నాకూ, నా జాతివారికి మధ్య ప్రవహిస్తూ ఉంటాయి. కనుక మీరు దయచేసి నా ఇంటికి ఒకసారి విచ్చే యండి. మరియు నా ఇంట్లోని ఏ స్థలంలోనైనా నమాజు చెయ్యండి. అప్పుడు నేను ఆ స్థలాన్ని మస్జిద్‌గా ప్రత్యేకించుకుంటాను. దైవప్రవక్త(స) 'ఇన్షాఅల్లాహ్' అని సమాధానం చెప్పారు. తరువాత రెండో రోజు ఉదయం దైవప్రవక్త(స) అబూ బకర్ (ర)ను తన వెంట తీసుకుని వెళ్ళారు. అప్పుడు బాగా పొద్దెక్కింది. దైవప్రవక్త(స) ఇంట్లోకి ప్రవేశించే అనుమతిని అడిగారు. నేను ఆయన(స) గారికి అనుమతి ఇచ్చాను; ఆయన(స) మా ఇంట్లో కూర్చోనైనాలేదు. ఇలా సెలవిచ్చారు; మీ ఇంట్లోని ఏ స్థలంలో మీరు నన్ను నమాజు చెయ్యమంటారు? ఇత్‌బాన్ తన ఇంట్లోని ఒక స్థలాన్ని ఎన్నుకుని దైవప్రవక్త(స) గారికి దానిని చూపించారు. దైవ ప్రవక్త(స) ఆ స్థలంలో నమాజు కోసం నిలబడ్డారు. మేము ఆయన(స)గారి వెనుక నిలబడి బారులు తీరాము. అప్పుడు ఆయన(స)గారు కుడి ఎడమలకు తిరిగి సలాము చేశారు (అంటే

తస్లీమ్ చెప్పారు). మేము కూడా కుడిఎడమలకు తిరిగి సలామ్ చేశాము.

## 151వ అధ్యాయం

### నమాజు పూర్తి అయిన తరువాత అల్లాహ్ పవిత్ర నామాన్ని స్మరించడం.

**802.** ఇబ్నె అబ్బాస్(రజిఅన్) గారి బానిస అయిన అబూ మఅబద్ ఇలా ఉల్లేఖించారు; "అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ నాతో ఇలా అన్నారు; ఫజ్ర్ నమాజును పూర్తిగా చేసిన తరువాత అల్లాహ్ పవిత్ర నామాన్ని స్మరించటం అనేది దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి కాలంనుంచే ఆచరణలో ఉన్న సంప్రదాయం." ఇంకా ఇబ్నె అబ్బాస్ (ర) ఇలా అన్నారు; "నాకైతే ప్రజలు చేసే నమాజు ముగిసిందనే విషయం దైవనామ సంస్మరణకు సంబంధించిన ఈ శబ్దం విన్న తరువాతనే తెలిసేది"

**803.** ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి నమాజు సమాప్తమైందనే విషయాన్ని తక్బీర్ (అల్లాహు అక్బర్) శబ్దాన్ని విన్న తరువాతనే గ్రహించేవాణ్ణి.

**804.** అబూ హురైరా(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి అగత్యపరులు, నిరుపేదలూ అయిన ప్రజలు కొందరు దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి వద్దకు వచ్చి ఇలా అనసాగారు; "ధనవంతులూ, సంపన్నులూ అయిన వారు ఉన్నతమైన అన్ని స్థానాలను సంపాదించుకున్నారు. ఇంకా వారు శాశ్వతమైన ఆనందాలను దోచుకున్నారు. మా మాదిరిగానే వారు కూడా నమాజులు చేస్తున్నారు; మా మాదిరిగానే వారు కూడా ఉపవాసాలను పాటిస్తున్నారు; ఇంకా వారి వద్ద మాకంటే ఎక్కువ ధనం ఉన్నది. ఆ ధనంతో వారు హజ్ యాత్ర చేస్తున్నారు. మరియు ఉమ్రా చేస్తున్నారు. మరియు జిహాద్ చేస్తున్నారు. ఇంకా దానధర్మాలు కూడా చేస్తున్నారు. పేదరికం వల్ల మేము ఈ ధర్మకార్యాలను చెయ్యలేకపోతున్నాము." దైవప్రవక్త(స) దానికి సమాధానంగా ఇలా సెలవిచ్చారు; నేను ఒక విషయాన్ని మీకు తెలుపమంటారా? ఒకవేళ మీరు గనక ఆ విషయాన్ని ఆచరిస్తే మీకు ముందు వెళ్ళేవారిని మీరు అందుకుంటారు. వారితో సమానులైపోతారు. అప్పుడు మీ వెనుక ఉన్నవారెవరూ మిమ్మల్ని అందుకోలేరు (అధిగమించలేరు). మీరు మీ కాలంలో ఉన్నటువంటి ప్రజలందరికంటే మంచివారుగా, మెరుగైనవారుగా ఉంటారు. కాని ఎవరైతే అదే విషయాన్ని ఆచరిస్తారో వారు మీకు సమానులవుతారు. కనుక మీరు నమాజు తరువాత ముప్పై మూడుసార్లు 'సుబ్‌హానల్లాహ్, అల్‌హమ్దులిల్లాహ్,

అల్లాహుఅక్బర్' అని జపిస్తూ ఉండండి. సమీ ఇలా అన్నారు; తరువాత ప్రజలు ఈ హదీసు గురించి అభిప్రాయభేదాలు వ్యక్తం చేశారు. కొందరేమన్నారంటే, సుబ్‌హానల్లాహ్, అల్‌హమ్దులిల్లాహ్ అని ముప్పైమూడు సార్లు, ఇంకా అల్లాహు అక్బర్ ముప్పైనాల్గు సార్లు జపించాలి. చివరకు నేను అబూ సాలెహ్ వద్దకు వెళ్ళాను; ఆయనగారు ఇలా అన్నారు; "అలా కాదు, సుబ్‌హానల్లాహ్, అల్‌హమ్దులిల్లాహ్, అల్లాహు అక్బర్ అని అన్నీ ముప్పైమూడు సార్లు పలకండి.

**805.** అల్ ముగీరా బిన్ షూబ(ర)గారి గుమాస్తా అయినటువంటి వర్రాద్ ఇలా ఉల్లేఖించారు; ఒకసారి అల్ ముగీరా (రజిఅన్) నాచేత ఒక ఉత్తరాన్ని వ్రాయించారు. ఆ ఉత్తరం హజ్రత్ ముఆవియ (రజిఅన్)కు వ్రాయబడింది. అందులో ఆయన నాచేత ఇలా వ్రాయించారు; "దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ప్రతి ఫజ్ర్ నమాజు తరువాత ఇలా పఠించేవారు: 'లా ఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహు లా షరీక లహు, లహుల్ ముల్‌కు, వలహుల్ హమ్‌దు, వహువ అలాకుల్లి షయ్‌ఇన్ ఖదీర్. అల్లాహుమ్మ లా మానిఅ లిమా ఆతయ్‌త, వలా మూతియ లిమా మనఅత, వలా యన్‌ఫఉ జల్‌జద్ది మిన్‌కల్ జద్దు." (అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్యుడు ఎవడూ లేడు. ఆయన ఒక్కడే. ఆయనకు సహవర్తులు లేరు. అధికారం ఆయనదే. స్తోత్రం ఆయనకే. ఆయన ప్రతి వస్తువుపై ఆధిపత్యం కలవాడు. ఓ అల్లాహ్! నీవు ఎవరికైనా ఏదైనా ఇవ్వదలచుకుంటే దాన్ని ఆపేవాడెవడూలేడు, ఎవరికైనా ఏదైనా ఇవ్వకుండా ఆపదలచుకుంటే దాన్ని ఇప్పించేవాడెవడూ లేడు. ఇంకా ఎవరైనా తనకు తాను గర్వపడితే దానికి నీ నుండి ఎలాంటి ప్రయోజనం ఉండజాలదు. (బుఖారీ **255/1**, ముస్లిం **414/1**) ఇమామ్ హసన్ బస్రీ(రహ్మాలై) ఇలా సెలవిచ్చారు; అల్ జద్ద్ అంటే సంపద మరియు ఐశ్వర్యం అని భావం.

## 152వ అధ్యాయం

**తస్లీమ్ చేసి నమాజ్‌ను ముగించిన తరువాత, ఇమామ్ తన ముఖాన్ని ముఖ్తదీల వైపునకు తిప్పాలి.**

**806.** సముర బిన్ జున్‌దుబ్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఫజ్ర్ నమాజును చేయించటం పూర్తి చేసిన తరువాత తన ముఖాన్ని మా వైపునకే తిప్పుకునేవారు.

**807.** జైద్ బిన్ ఖాలిద్ అల్ జుహన్నీ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒకసారి హుదైబియాలో మాచేత ఫజర్ నమాజును చేయించారు. ఆ రాత్రి బాగా వర్షం కురిసింది. నమాజు చేయించటం పూర్తి చేసిన తరువాత ఆయన తన ముఖాన్ని ప్రజల వైపునకు త్రిప్పారు. మరియు ఇలా సెలవిచ్చారు; "మీ ప్రభువు ఏమని సెలవిచ్చాడో మీకు తెలుసా?" ప్రజలు ఇలా విన్నవించుకున్నారు; ఈ విషయం గురించి అల్లాహ్కూ, ఆయన ప్రవక్తకు మాత్రమే బాగా తెలుసు. అప్పుడు ఆయన(స) ఇలా సెలవిచ్చారు; "అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: ఈనాడు ఉదయం పూట నా దాసులు కొందరు నా విశ్వాసులైపోయారు. మరికొందరు అవిశ్వాసులు అయిపోయారు. ఎవడైతే అల్లాహ్ అనుగ్రహం వల్ల, ఆయన కారుణ్యం వల్ల వర్షం కురిసింది అని అన్నాడో అతనైతే నా విశ్వాసి మరియు నక్షత్రాలను తిరస్కరించేవాడు. ఇంకా ఎవడైతే ఫలానా నక్షత్రం ఫలానా చోటుకు వచ్చినందువల్ల వర్షం కురిసింది అని అన్నాడో, అతను నన్ను తిరస్కరించాడు మరియు నక్షత్రాలను విశ్వసించాడు.

**808.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇషా నమాజును రాత్రి నడిఝాము వరకు ఆలస్యం చేశారు. తరువాత తన హుజ్రా(గది)లోనుంచి బయటికి వచ్చేశారు. ఇషా నమాజును పూర్తి చేసిన తరువాత ఆయన(స) మావైపునకు తన ముఖాన్ని త్రిప్పుకున్నారు. మరియు ఇలా సెలవిచ్చారు; ఇతరులైతే తమ తమ నమాజులను పూర్తి చేసుకున్నారు. ఇంకా నిదురపోతున్నారు కూడా. మీరైతే నమాజు కోసం ఎంతసేపైతే నిరీక్షిస్తూ ఉన్నారో అంతసేపు నమాజులో ఉన్నట్లే

## 153వ అధ్యాయం

## సలామ్ చేసిన తరువాత ఇమామ్ అదే స్థలంలో ఆగి నఫిల్ మొదలైన నమాజులను చెయ్యవచ్చు.

నాఫే ఇలా ఉల్లేఖించారు; హజ్రత్ ఇబ్నె ఉమర్(రజిఅన్) ఏ స్థలంలోనైతే నిలబడి ఫర్జ్ నమాజు చేసేవారో ఆ స్థలంలోనే ఆయన(ర) నఫిల్ నమాజులు కూడా చేసేవారు. అల్ ఖాసిమ్ బిన్ ముహమ్మద్ బిన్ అబీబకర్ కూడా ఇలానే చేసేవారు. ఏ స్థలంలోనైతే నిలబడి ఇమామ్ ఫర్జ్ నమాజు చేశాడో ఆ స్థలంలోనే అతను నఫిల్

నమాజులు చెయ్యకూడదని దైవప్రవక్త(స) నిషేధించారు అనే అబూ హురైరా(ర)గారి ఉల్లేఖనం సరిఅయినది కాదు.

**809.** ఉమ్మె సలమా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) సలామ్ చేసి నమాజును పూర్తి చేసిన తరువాత అదే స్థలంలో కొంచెంసేపు కూర్చొని ఉండేవారు.

ఇబ్నె షిహాబ్ ఇలా అన్నారు; దైవప్రవక్త(స) అలా నమాజు చేసిన చోటే నమాజు కోసం వచ్చిన మహిళలు మసీదులో నుంచి బయటికి వెళ్ళిపోయే వరకు కూర్చోని ఉండేవారు అని నేను అనుకుంటున్నాను. కాని ఈ విషయం గురించి అల్లాహ్‌కు మాత్రమే బాగా తెలుసు.

ఇబ్నె షిహాబ్ ఇలా వ్రాశారు; నేను ఈ విషయాన్ని హింద్ బిన్తె అల్‌హారిస్ అల్ ఫిరాసియ నుంచి విన్నాను. ఆమె ఈ విషయాన్ని దైవప్రవక్త(స)గారి భార్య అయినటువంటి ఉమ్మె సలమా (ర) నుంచి విన్నారు. హింద్ బిన్తె అల్ హారిస్ ఉమ్మె సలమా (ర) గారి సహచరులలోనివారు. ఆమె ఇలా అన్నారు; "దైవప్రవక్త(స) తస్లీమ్ చేసి నమాజును ముగించినప్పుడు మహిళలు మసీదులో నుంచి వెళ్ళిపోయేవారు. దైవ ప్రవక్త(స) బయటికి రాకముందే వారు తమ తమ ఇళ్ళల్లోకి ప్రవేశించేవారు.

## 154వ అధ్యాయం

**ఇమామ్ ప్రజలకు నమాజు చేయించిన తరువాత, అప్పుడు ఒకవేళ అతనికి ఏదైనా ముఖ్యమైన పని జ్ఞాపకం వచ్చి, ఆ పనిని చేసుకునేందుకు నమాజు చేసిన స్థలంలో ఆగకుండా ముఖ్తదీలను తోసుకుంటూ పోవటం అనే విషయం గురించి.**

**810.** ఉఖ్‌బా బిన్ హారిస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి నేను మదీనా పురంలో అసర్ నమాజును దైవప్రవక్త ముహమ్మద్(స)గారి వెనుక నిలబడి చేశాను. ఆయన(స)గారు తస్లీమ్ చెప్పి నమాజును పూర్తి చేసిన వెంటనే లేచి నిల బడ్డారు. ముఖ్తదీల మెడల మీదుగా దాటిపోయి తన ఒక భార్య గదిలోకి వెళ్ళారు. ప్రజలు ఆయన(స)గారు పోయిన వేగాన్ని చూసి భయపడిపోయారు. తరువాత ఆయన(స) ఆ గదిలో నుంచి బయటికి వచ్చి చూస్తే ప్రజలు ఆయన (స) గారు వెళ్ళిన వేగాన్ని, తొందరపాటును చూసి ఆశ్చర్యపోయినట్లు కనిపించారు. దైవ ప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; మా ఇంట్లో ఒక బంగారు నాణెం ఉండిపోయింది.

నా మనస్సు దానిలో నిమగ్నమైపోవటం నాకు చెడ్డగా అనిపించింది. నేను దానిని పంచిపెట్టమని మా ఇంటివారిని ఆజ్ఞాపించి వచ్చాను.

## 155వ అధ్యాయం

**నమాజు చేసిన తరువాత కుడి వైపునకుగానీ లేదా ఎడమ వైపునకుగానీ తిరిగి కూర్చోవటం. లేదా రెండు వైపుల నుంచి వెళ్ళిపోవటం ధర్మసమ్మతమైన విషయమే. హజ్రత్ అనస్(ర) రెండు వైపులకూ తిరిగి కూర్చుండేవారు. కేవలం కుడి వైపునకే తిరిగి బుద్ధిపూర్వకంగా కూర్చుండిపోయే వ్యక్తి పట్ల అభ్యంతరం తెలిపేవారు.**

**811.** అబ్దుల్లాహ్ బిన్ మసూద్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; మీలో ఎవరైనాసరే నమాజు చేసిన తరువాత అనవసరంగా కుడి వైపు నుంచే వెళ్ళిపోవాలని భావించి మీ నమాజులోని కొంతభాగాన్ని షైతాన్‌కు కేటాయించకండి, దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) చాలాసార్లు ఎడమ వైపు నుంచి వెళ్ళిపోవటాన్ని నేను చూశాను.

## 155వ అధ్యాయం

**వెల్లుల్లి, ఉల్లిపాయల గురించి దైవప్రవక్త(స)గారి ప్రవచనం ఏమిటంటే, ఆకలివల్ల గానీ లేదా మరొక కారణంవల్ల గానీ వెల్లుల్లి లేదా ఉల్లిపాయలు తిన్న వ్యక్తి ఎవరైనా మా మస్జిదు వద్దకు రాకూడదు.**

**812.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఖైబర్ యుద్ధం జరిగే సమయంలో ఇలా సెలవిచ్చారు అని అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజిఅన్) ఉల్లేఖించారు; ఎవరైతే ఈ చెట్టుకు కాసే వెల్లుల్లిపాయలను తింటారో వారు మా మస్జిదులోకి ప్రవేశించకూడదు.

**813.** నేను జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజిఅన్) చెబుతూ ఉండగా విన్నానని అతా ఇబ్నె అబీ రిబా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు; ఎవరైతే ఈ చెట్టుకు పండిన వెల్లుల్లిపాయలను తింటారో వారు మా మసీదులోకి రాకూడదు. అతా ఇలా అన్నారు; నేను జాబిర్(ర)ను అడిగాను; "అది పచ్చి వెల్లుల్లిపాయా లేక ఉడికిన వెల్లుల్లి పాయా?" దానికి సమాధానంగా ఆయన(ర) ఇలా అన్నారు; 'అది పచ్చి వెల్లుల్లిపాయ అని నేను అనుకుంటాను.'

**814.** దైవప్రవక్త ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ అన్సారీ (రజిఅన్) ఉల్లేఖించారు; ఎవరైతే వెల్లుల్లిపాయగానీ లేదా ఉల్లిపాయలుగానీ తింటారో వారు మాకూ మరియు మా మస్జిదుకూ దూరంగా ఉండాలి. తమ ఇంట్లోనే

కూర్చోవాలి (అక్కణ్ణే నమాజు చేసుకోవాలి) తరువాత దైవప్రవక్త(స)గారి వద్దకు ఒక పెద్ద కుండ తీసుకురాబడింది. అందులో రకరకాల పచ్చని కూరగాయలు ఉన్నాయి. (ఉల్లిపాయలు కూడా ఉన్నాయి) దైవప్రవక్త(స) గారికి దాని వాసన తెలిసిపోయింది. ఆయన(స) అడిగినప్పుడు అక్కడ ఉన్నవారు ఆ కుండలోని కూర గాయల పేర్లను తెలియజేశారు. దైవ ప్రవక్త(స), ఆ కుండను తనతోఉన్న ఫలానా సహాబీకు ఇవ్వండి అని ఆజ్ఞాపించారు. ఆ కుండలోని పదార్థాలను చూసిన ఆయన కూడా అయిష్టతను వ్యక్తంచేశారు (ఎందుకంటే దైవప్రవక్త (స)గారు కూడా వాటిని తినలేదు) దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; నీవు తినెయ్యి. నీవు ఎవరితోనైతే మాట్లా డవో నేను వారితో మాట్లాడతాను. సంభాషిస్తూ ఉంటాను. (అంటే దైవదూతలతో మాట్లాడతాను)

**815.** అబ్దుల్ అజీజ్ ఇలా ఉల్లేఖించారు; ఒక మనిషి హజ్రత్ అనస్(ర)ను ఇలా అడిగాడు; దైవప్రవక్త(స) వెల్లుల్లిని గురించి మీకు ఏమని చెప్పారు? ఆయన(ర) ఇలా అన్నారు; దైవ ప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; ఎవరైతే ఈ చెట్టుకు కాసిన వెల్లుల్లి పాయలను తింటారో వారు మా దగ్గరకు రాకూడదు. మాతో కలిసి నమాజ్ చెయ్య కూడదు.

## 156వ అధ్యాయం

**బాలురు వుజూ చేసుకోవటం; గుసుల్ చేసుకోవటం మరియు పరిశుభ్రతను పాటించటం వారి విషయంలో ఎప్పుడు వాజిబ్ అవుతాయి? ఇంకా జమాఅత్‌తో కలిసి చేసే నమాజులలోనూ, పండుగల నమాజులలోనూ, జనాజా నమాజు లలోనూ వారు పాల్గొని పంక్తులలో నిలబడే విషయం గురించి.**

**816.** సులైమాన్ షైబానీ ఇలా ఉల్లేఖించారు; ఒకసారి దైవప్రవక్త మహా శయులు ముహమ్మద్(స) ఒక సమాధి మీదుగా పోవటం జరిగింది. ఆ సమాధి శ్మశానంలోని ఇతర సమాధులకు దూరంగానూ, వాటి నుంచి వేరుగానూ ఉన్నది. ఆయన(స)గారు అక్కడ నమాజు చేయించారు. ప్రజలు ఆయన(స)గారి వెనుక పంక్తులు కట్టి నిలబడ్డారు. నేను ఇలా అడిగాను; (ఓ షాబి!) ఈ విషయం గురించి మీకు ఎవరు చెప్పారు? అప్పుడు ఆయన, ఇబ్నె అబ్బాస్(ర)నాకు ఈ విషయం గురించి చెప్పారు అని అన్నారు.

**817.** అబూ సయీద్ ఖుద్రీ(ర) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు; యుక్త వయస్సుకు చేరినవారందరూ శుక్రవారం నాడు తప్పనిసరిగా, గుసుల్ చేసుకోవాలి.

**818.** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి ఒక రాత్రి నేను నాకు పిన్నీ, విశ్వాసులకు తల్లీ అయినటువంటి మైమూనా (రజిఅన్హా) గారి ఇంట్లో ఉండిపోయాను. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) కూడా అక్కడే ఉన్నారు. రాత్రి ప్రారంభదశలో ఆయన(స) నిద్రపోయారు. రాత్రిలోని ఒక భాగం గడిచిపోయిన తరువాత చివరి ఘడియల్లో దైవప్రవక్త(స) నిద్రలో నుంచి మేల్కొన్నారు. ఇంట్లో వేలాడగట్టిన ఒక పాత తోలు సంచిలో నుంచి నీళ్ళు తీసుకుని తేలికపాటి వుజూ చేసుకున్నారు. అమ్ర్ బిన్ దీనార్; అది చాలా తేలికపాటి వుజూ అని అన్నారు. తరువాత ఆయన (స) లేచి నిలబడి నమాజు చెయ్యసాగారు. నేను కూడా ఆయన (స)గారు చేసుకున్న వుజూలాంటి వుజూనే చేసుకున్నాను. ఆ తరువాత ఆయన(స) గారి ఎడమ ప్రక్కన నమాజు కోసం నిలబడ్డాను. కాని ఆయన(స) నన్ను త్రిప్పి తన కుడి వైపునకు లాక్కున్నారు. తరువాత అల్లాహ్ కోరినంత (సేపు) నమాజును చేశారు. ఆ తరువాత పండుకొని నిద్రపోయారు. నిద్రలో ఆయన(స) గురకలు పెట్ట సాగారు. దీని తరువాత ముఅజ్జిన్ నమాజుకు సమయం అయిందని చెప్పటానికి వచ్చారు. ఆయన(స) అతనితోపాటు వెళ్ళి నమాజు కోసం నిలబడ్డారు; ప్రజలకు నమాజు చేయించారు. కాని వుజూ చేసుకోలేదు. సుఫ్యాన్ ఇలా అన్నారు; మేము అమ్ర్ బిన్ దీనార్‌ను ఇలా అడిగాము; దైవప్రవక్త(స)గారి కళ్ళు మాత్రమే నిదుర పోతాయి. ఆయన(స) హృదయం నిదురపోదు అని ప్రజలు అంటారు. అమ్ర్ ఇలా అన్నారు; నేను ఉబేద్ బిన్ ఉమైర్ ఇలా చెప్పగా విన్నాను; దైవప్రవక్తలకు వచ్చే కలలు వహీ (దైవవాణి) అయి ఉంటాయి. తరువాత ఆయన ఖుర్ఆన్‌లోని ఈ వాక్యాన్ని చదివారు; 'ఇన్నీ అరా ఫిల్‌మనామి అన్నీ అజ్‌బహుక' ఇబ్రాహీమ్ అతనితో ఇలా అన్నాడు; "కుమారా! నేను నిన్ను జిబహ్ చేస్తున్నట్లుగా కలలో చూశాను."

**819.** హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; (ఆయనగారి తల్లి) ఇస్‌హాఖ్‌గారి నాయనమ్మ అయినటువంటి ములైకా దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)ను ఒకసారి విందు భోజనానికి ఆహ్వానించారు. ఆమె ఆయనగారి కోసం ప్రత్యేకమైన భోజన పదార్థాలు తయారు చేశారు. ఆయన(స) వాటిలోని కొన్నింటిని తిన్నారు. తరువాత లేవండి; 'నేను మీకు నమాజు చేయిస్తాను' అని

అన్నారు. నేను ఒక చాపను తీసుకువచ్చాను. ఎక్కువగా ఉపయోగించటం వల్ల ఆ చాప రంగు నల్లగా మారిపోయింది. నేను దానిమీద నీళ్ళు చల్లి శుభ్రపరిచాను. దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) దానిపై నిలబడి రెండు రకాతులు నమాజు చేశారు. మాతోపాటు ఒక అనాథ బాలుడు కూడా మొదటి పంక్తిలో నిలబడి నమాజు చేశాడు. ముసలి స్త్రీ అయిన ములైకా మా వెనుక నిలబడి నమాజు చేశారు.[1]

**820.** హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; ఒకసారి నేను ఒక ఆడ గాడిద మీద ఎక్కి స్వారీ చేస్తూ వచ్చాను. అప్పటికి నేను ఇంకా యుక్త వయస్సుకు దగ్గర్లో ఉన్నాను. (ఇంకా యువకుణ్ణి కాలేదు). ఆ సమయంలో దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) మినాలో ప్రజలకు నమాజు చేయిస్తూ ఉన్నారు. దైవప్రవక్త (స) గారి ముందు గోడ వగైరా లాంటిది అడ్డంగా లేదు. నేను నమాజు చేసే ప్రజల పంక్తి ముందునుంచి వెళ్లిపోయాను. తరువాత గాడిదపై నుండి క్రిందికి దిగాను, మేత మెయ్యటానికి దానిని వదిలిపెట్టాను. మరియు నమాజీల పంక్తిలో కలిసిపోయాను. నా పట్ల ఎవరూ అభ్యంతరాన్ని లేవనెత్తలేదు.

**821.** హజ్రత్ ఆయెషా (రజిఅన్హా) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహా శయులు ముహమ్మద్ (సఅసమ్) ఒకసారి (ఒకనాటి) రాత్రి ఇషా నమాజు విషయంలో ఆలస్యం చేశారు. చివరకు హజ్రత్ ఉమర్ (రజిఅన్) స్త్రీలూ, పిల్లలూ నిదురపోయారని దైవప్రవక్త (స) గారికి తెలియజేశారు. అప్పుడు దైవప్రవక్త (స) బయటికి వచ్చి ఇలా సెలవిచ్చారు; "చూడండి! మొత్తం భూలోకంలో మీరు తప్ప ఈ నమాజును చేసేవారు ఈ సమయంలో మరెవ్వరూ లేరు". ఆ కాలంలో అప్పుడు పరిస్థితి ఇలాగే ఉండేది; ఒక్క మదీనా పట్టణంలో తప్ప మరెక్కడా ప్రజలు నమాజు చేసేవారు కారు.

**822.** అబ్దుర్రహ్మాన్ బిన్ ఆబిస్ ఇలా ఉల్లేఖించారు; నేను ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) గారు ఇలా చెప్పగా విన్నాను; ఆయన గారిని ఒక వ్యక్తి ఇలా అడిగాడు; పండుగ రోజున (స్త్రీలు) వెళ్లటాన్ని దైవప్రవక్త (స) గారితో మీరు చూశారా?

---

819-1. అధ్యాయంలోని ముఖ్యాంశం ఇక్కణ్ణే ఉంది. అదేమిటంటే, నాతోపాటు ఒక అనాథ బాలుడు కూడా ఉన్నాడు. అతను పంక్తిలో నిలబడి అందరితో కలిసి నమాజు చేశాడు. ఈ హదీసు ద్వారా మరొక విషయం కూడా స్పష్టమవుతుంది. అదేమిటంటే, పగటి సమయంలో నఫిల్ నమాజులను జమాఅత్‌తో కలిసి చెయ్యటం ధర్మసమ్మత మైన విషయమే.

ఆయన(ర) ఇలా అన్నారు; అవును, నేను చూశాను. నేను గనక దైవప్రవక్త (స) గారికి దగ్గరి బంధువును కాకపోయినట్లయితే, ఎన్నటికీ చూసేవాణ్ణి కాను. (అంటే నేను చిన్న వాణ్ణి కావటం వల్ల మరియు దగ్గరి బంధుత్వం వల్ల దైవప్రవక్త (స)గారు నన్ను తనతోపాటు ఉంచుకునేవారు. దైవప్రవక్త (స)గారు మొదట కసీర్ బిన్ సలత్ ఇంటి దగ్గర ఉన్నటువంటి చిహ్నం వద్దకు వచ్చారు. ఆయన (స) అక్కడ హితబోధ చేశారు. తరువాత స్త్రీల వద్దకు విచ్చేశారు. వారిని ఉద్దేశించి ప్రసంగం చేశారు, హితవులు గరిపారు. దానధర్మాలు చెయ్యమని ఆజ్ఞాపించారు. ఒక మహిళ అయితే తన చేతిని చాపి కాలి మెట్టెలనూ, ఉంగరాలను హజ్రత్ బిలాల్ పట్టుకున్న వస్త్రంలో వెయ్య సాగింది. తరువాత దైవప్రవక్త (స) గారు హజ్రత్ బిలాల్ (ర)తో కలిసి ఇంటికి వెళ్ళిపోయారు.

## 157వ అధ్యాయం

### రాత్రి సమయంలోనూ, చీకటిలోనూ స్త్రీలు మస్జిదులకు పోవటం.

**823.** హజ్రత్ ఆయెషా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఒకనాటి రాత్రి ఇషా నమాజు విషయంలో ఆలస్యం చేశారు. చివరకు హజ్రత్ ఉమర్ (రజిఅన్) ఆయన (స) గారి వద్దకు వెళ్లి మహిళలూ, పిల్లలూ అందరూ నిదురపోయారని తెలియజేశారు. అప్పుడు దైవప్రవక్త (స) తన గదిలో నుంచి బయటకు వచ్చి ఇలా సెలవిచ్చారు; "చూడండి! మొత్తం భూమిలో (ఈ సమయంలో) మీరు తప్ప మరెవ్వడూ ఈ నమాజు కోసం నిరీక్షించటం లేదు". ఆ రోజుల్లో ఒక్క మదీనాపురంలో తప్ప మరెక్కడా నమాజు చేయబడేదే కాదు. ఇంకా ప్రజలు ఇషా నమాజును సంధ్య వేళ ముగిసినప్పటి నుంచి రాత్రిలోని మొదటి మూడో భాగం గడిచిపోయే వరకు చేస్తూ ఉండేవారు.

**824.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజిఅన్) ఉల్లేఖించారు; ఒకవేళ మీ స్త్రీలు రాత్రి సమయంలో మసీదులోకి పోదలచి అనుమతి అడిగితే, అప్పుడు మీరు వారికి అనుమతి ఇవ్వండి. ఉబేదుల్లాతో పాటు ఈ హదీసును షూబా గారు కూడా ఆమిష్ నుంచి ఉల్లేఖించారు. ఆయన గారు ముజాహిద్ నుంచి, ఆయన ఇబ్నె ఉమర్ గారి నుంచి, ఆయన దైవప్రవక్త (స) నుంచి ఉల్లేఖించారు.

## 158వ అధ్యాయం

### ప్రజలు విద్వాంసుడైన ఇమామ్ నిలబడే వరకు నిరీక్షించటం.

**825.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స)గారి భార్య అయినటువంటి ఉమ్మె సలమా(ర.అ) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త(స)గారి జీవితకాలంలో మహిళలు (జమాఅత్‌తో కలిసి నమాజు చేసేవారు) ఫజ్ర్ నమాజు చేసి సలాము చేసిన తరువాత, వెంటనే నిలబడి వెళ్ళిపోయేవారు. దైవప్రవక్త(స)గారు మరియు ఆయన(స) గారి వెనుక నమాజులో ఉన్న పురుషులు ఆగి ఉండేవారు, అల్లాహ్ కోరినంత వరకు. తరువాత దైవప్రవక్త(స) లేచి నిలబడినప్పుడు వారు కూడా లేచి నిలబడేవారు.

**826.** హజ్రత్ ఆయెషా(రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఉదయం నమాజు చెయ్యటం పూర్తిచేసినప్పుడు, మహిళలు దుప్పట్లు కప్పుకుని తమ తమ గృహాలకు తిరిగి వెళ్ళేవారు. చీకటి వల్ల స్త్రీలను గుర్తించటం సాధ్యపడేదికాదు.

**827.** దైవప్రవక్త ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చినట్లు తన తండ్రిగారు చెప్పారని అబ్దుల్లాహ్ బిన్ అబీ ఖతాద అల్ అన్సారీ (ర) ఉల్లేఖించారు; నేను నమాజు చెయ్యటానికి నిలబడతాను. సుదీర్ఘమైన నమాజు చెయ్యాలనే సంకల్పించుకుంటాను. కాని నేను పిల్లవాడి ఏడ్పును విన్నప్పుడు నమాజును తగ్గిస్తాను. ఆ పిల్లవాడి తల్లిని కష్టపెట్టటం నాకు ఇష్టంలేదు.

**828.** హజ్రత్ ఆయెషా(రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గనక మహిళలు తరువాత చేస్తూ ఉన్న చేష్టలను గనుక చూసి ఉన్నట్లయితే, అప్పుడు ఆయన(స) వారిని మస్జిద్‌కు వెళ్ళకుండా వారించేవారు; ఇస్రాయీల్ సంతతికి చెందిన మహిళలు వారించబడిన విధంగా. యహ్యా బిన్ సాద్ ఇలా అన్నారు; నేను అమ్రాను, ఇస్రాయీల్ సంతతికి చెందిన మహిళలు మస్జిద్‌లకు పోకుండా నిజంగానే వారించబడ్డారా అని అడిగాను. 'అవును' అని ఆమె సమాధానం చెప్పారు.

## 159వ అధ్యాయం

### మహిళలు పురుషుల వెనుక నిలబడి నమాజు చెయ్యటం.

**829.** విశ్వాసుల తల్లి ఉమ్మె సలమా (రజి) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త

మహాశయులు ముహమ్మద్(స) నమాజు పూర్తి చేసి సలాము చెప్పిన తరువాత వెంటనే, స్త్రీలు బయటకు వెళ్ళిపోవటానికి లేచి నిలబడతారు. దైవప్రవక్త(స) కొంచెంసేపు ఆగిపోతారు, లేచి నిలబడరు. ఇబ్నె షిహాబ్ ఇలా అన్నారు; మేము ఇలా అనుకుంటున్నాము- ఆయన (స) ఇలా ఎందుకు చేసేవారంటే, స్త్రీలు పురుషులు తమను చూడకముందే బయటికి వెళ్ళిపోవాలని. కాని నిజం అల్లాహ్‌కు బాగా తెలుసు.

**830.** హజ్రత్ అనస్(రజిఅన్) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఒకసారి ఉమ్మె సులైమ్ (నా తల్లిగారు) ఇంట్లో నమాజు చేశారు. నేను ఒక అనాథ బాలునితో కలిసి ఆయన(స)గారి వెనుక నిలబడి నమాజు చేశాను. ఉమ్మె సులైమ్ మా వెనుక నిలబడి నమాజు చేశారు.

## 160వ అధ్యాయం

**ఉదయం నమాజు చేసిన తరువాత మహిళలు వెంటనే వెళ్ళిపోవాలి మరియు మస్జిద్‌లో కొంచెంసేపు మాత్రమే ఆగాలి.**

**831.** హజ్రత్ ఆయెషా(రజిఅన్‌హా) ఇలా ఉల్లేఖించారు; దైవప్రవక్త మహా శయులు ముహమ్మద్(స) ఫజ్ర్ నమాజును చీకట్లోనే చేసేవారు. తరువాత ముస్లిమ్ మహిళలు తమ తమ ఇళ్ళకు వెళ్ళిపోయేవారు. చీకట్లో వారిని గుర్తించటం సాధ్యపడేది కాదు లేదా వారు ఒకరినొకరు గుర్తించేవారు కూడా కాదు.

## 161వ అధ్యాయం

**మస్జిద్‌కు వెళ్ళే విషయంలో ఒక స్త్రీ తన భర్త అనుమతిని తప్పనిసరిగా తీసుకోవాలి.**

**832.** దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారని తన తండ్రిగారు చెప్పారని సాలిమ్ బిన్ అబ్దుల్లా ఉల్లేఖించారు; మీలోని ఎవరి భార్య అయినా మస్జిద్‌కు పోవటానికి లేదా ఏదైనా మరొక కార్యం కోసం బయటికి వెళ్ళటానికి అనుమతి అడిగితే ఆమెను ఆపకండి (అనుమతి ఇవ్వండి).